భగవల్లీలావిలాసవిలసనమయ మైన విశ్వచరిత్రమం దొక యేఁడుగడచినది. గతము ప్రపంచచరిత్రమందు ధర్మసంస్థాపనార్థము వినియోగపడిన దని విమర్శకులకు గ్రాహ్యంబగుచుండును. అయినను గతసంవత్సరవృత్తాంతము సామాన్య ప్రపంచచరిత్రమునం దసామాన్యముగ నున్నది. గతసంవత్సరవృత్తాంతమునందు నూతనయుగారంభాంకురములు గల వని ప్రాజ్ఞులు విశ్వసించుచున్నారు. లోకమును పరితపింపఁజేసిన సంగ్రామదావానల ముపశమించుచున్నది. సంగ్రామదావానల ముపశమించినను సాంఘికవిప్లవము విజృంభించుచున్నది. రుష్యాయందు సాంఘికపరివర్తనము విజృంభించినది. బాల్షివ్రుధర్మము యూరపు ఖండమునందు క్రమక్రమముగ వ్యాపించుచున్నది. సైన్యశిక్షణప్రవృత్తికి నిలయ మైన జర్మని యందు సయితము బాల్షివ్రుధర్మము వ్యాపించినది. మిత్రమండలి రాజ్యములందు బాల్షివ్రుధర్మము విశేష మైన వ్యాప్తి గాంచకపోయినను కార్మికపరివర్తనము వ్యాపించుచున్నది. యూరపునందు వ్యాపించుచున్న సాంఘికపరివర్తన మితరఖండములకును వ్యాపించు ననుటకు సూచనలు గలవు. ఆఫ్గనిస్థానపు ప్రభు వైన హబీబుల్లాఖాను నొక హంతకుఁడు వధించెను. రుష్యాయందుఁ గల బోల్షివిక్కులు తమ ధర్మమును ఆసియాఖండమునందు వ్యాపింపఁజేయుటకు ప్రతిజ్ఞ చేసియుండిరి. పాశ్చాత్యసభ్యతానిర్మాణమున కాధారభూతము లైన పునాదులే లోపభూయిష్ఠములని పర్యాప్తం బగుచున్న సాంఘికపరివర్తనము సహస్రముఖముల విశదముచేయుచున్నది. లోపభూయిష్ఠ మైన పాశ్చాత్యసభ్యతాధారమున పాశ్చాత్యరాజ్యనియుక్తాధికారులు ప్రాచ్యప్రజోద్ధరణమునకు పూనుకొనుట ధర్మవిపర్యాసముగ నున్నది. పాశ్చాత్యరాజ్యములు నిర్మించిన శ్వేతరాజ్యసమితి స్వార్థరహిత మైన ప్రాచ్యరాజ్యభారమును వహించుట కేవలము భ్రమ. బుద్ధదేవునిఁబోలిన మహావ్యక్తులు లోకము నుద్ధరించిన యితిహాసములు లోకచరిత్రయందు గోచరములు గాని పాలకజాతులు పాలితజాతుల నుద్ధరించిన యితిహాసము లపరూపములు. ప్రపంచము సకలవిషయములందును నూతనయుగారంభమునకు నూతనధర్మస్థాపనము నభిలషించుచున్నది. నూతనయుగము నందు శ్రీమంతుల ధనము బలవంతుల బలము ధీమంతుల జ్ఞానము స్వోపభోగమునకును పరపీడనమునకును గాక ఆత్మయజ్ఞమునకును పరార్థహితమునకు నుపయోగపడవలయును. ఏతన్మహాధర్మసంస్థాపనము మహాభావపరివర్తనమూలముననే సాధ్యము కాఁగలదు. ఇట్లాశాంత మైన వర్షసప్తకము ననిష్టదాయక మనుజ్యోతిషసిద్ధాంతమున కనురూపముగ కాళయుక్తినామసంవత్సరము ముగిసినది. ఈ సప్తకమునందు రెండవది సిద్ధార్థిసంవత్సర మారంభ మైనది. సృష్ట్యాదినుండి ౧౯౫౫౮౮౫౦౨౦ వత్సరములు గతించినవి.

సిద్ధార్థిసంవత్సరమునకు కుజుఁడు రాజు; ఫలము యుద్ధము, అగ్నిభయము. రవి మంత్రి; ఫలము రాజవైరము, అనావృష్టి. రవి సేనాధిపతి; ఫలము యుద్ధము, రక్తధాన్యము, స్వల్పవృష్టి. బుధుఁడు సస్యాధిపతి; ఫలము ప్రజాత్రాసము, మధ్యవృష్టి. బుధుఁడు నీరసాధిపతి; ఫలము రత్నధాన్యాదివృద్ధి. ... పురోహితుఁడు; ఫలము ప్రజాసుఖము, ... బుధుఁడు పరీక్షకుఁడు; ఫలము ప్రజల కన్యోన్యానురాగము, రాజుల నయతత్పరత్వము. శని అర్ఘాధిపతి; తత్ఫలము చోరాగ్నిభయము. శని మేఘాధిపతి; ఫలము మందసస్యవృష్టులు. శని దైవజ్ఞాధిపతి; ఫలము దైవజ్ఞులకు మందబుద్ధి, కృష్ణధాన్యాభివృద్ధి. శుక్రుఁడు రసాధిపతి; ఫలము సుగంధద్రవ్యాధికమూల్యము, ఫలపుష్పవికాసము. గురువు గణకుఁడు; ఫలము ప్రజాసౌఖ్యము, గణకులకు సౌమ్యబుద్ధి. చంద్రుఁడు ధాన్యాధిపతి; తత్ఫలము పాఁడిపంటలు, సుభిక్షము, అతివృష్టి. చంద్రుఁడు గ్రామపాలకుఁడు; ఫలము ప్రజాపీడ, మధ్యవృష్టి.

సంవత్సరసామాన్యఫలము

శ్లో॥ సిద్ధార్థివత్సరే భూపా శ్శాంతవైరా స్సదా ప్రజా।
సకలా వసుధా భాతి బహుసస్యార్ఘవృష్టిభిః॥

జ్యోతిషసిద్ధాంతఫలము సామాన్యముగ నను కూలముగ నున్నను దేశము దుర్భిక్షమయముగ నున్నది. భరతఖండమునం దంతటను ధరలు మితి మీఱి పెరిగినవి. ప్రజలకు జీవయాత్ర దుర్భరముగ నున్నది. ఇతర ప్రాంతములందుఁ గల దుర్భిక్ష మాంధ్రదేశమునందును వ్యాప్తి గాంచి సంక్షోభమును కలుగఁజేయుచున్నది. ఈ సంక్షోభ ముపశమించి ప్రజలు సుఖసంపదలను బడయుటకు సర్వేశ్వరుఁ డనుగ్రహించుఁగాత!

సంవత్సరాదిసంచికయందు రాజకీయ సాంఘికార్థిక వాఙ్మయ విషయములకు సంబంధించిన వ్యాసములు గలవు. గతవత్సరము రాజకీయాందోళనభరితమైనను ప్రజల చిత్తముల నితరవిషయములు నాకర్షించినవి. కీర్తిశేషు లైన రావు బహద్దరు వీరేశలింగము పంతులు గారు వ్యాధిగ్రస్తు లయ్యును ఓరుగల్లు ఒంటిమిట్ట వాదమును గుఱించి వ్రాసిన వ్యాసమునకు వారు పరమ వంద్యులు. ఆ మహాపురుషుని వ్యవసాయపరాయణత్వము మన కాదర్శముగ నుండఁదగియున్నది. వారి మరణము సద్య మైనను మహావిచారమును కలిగించుచున్నది. సంచికయందు సంధిమహాసభకు నియమితు లైన ప్రతినిధుల పటములు సభల పటములు సమావేశముల పటములు మహాజనుల పటములు ప్రచురింపఁబడినవి. భావగర్భితము లైన పద్యములును గలవు. అనివార్యము లగు నిబ్బందులవలన ప్రచురణమున విలంబము కలిగినందులకు మహాజనులు మన్నింతురుఁగాత!

ముఖపటమున శాంతికాముఁడును ధ్యానమూర్తియు నగు బుద్ధ[illegible]ముద్రింపఁబడినది. బుద్ధదేవుఁడు సత్యాగ్రహమూర్తి. అహింసయే మానవులకు తరణోపాయ మని బోధించిన యవతారపురుషుఁడు. ఆ మహనీయుని యీ దేశమును పాలించి లోకము స్థిరశాంతిని గలిగి సుఖించుఁగాత!

భగవదనుగ్రహమువలన దారుణసంగ్రామ మంతమొందినది. సిద్ధార్థిసంవత్సరమున లోకమునందు స్థిరశాంతిస్థాపనమునకై ప్రయత్నములు జరుగుచున్నవి. స్థిర మగు శాంతిస్థాపనమునకై ప్రతిపాదితము లైన జాతిసమితినిర్ణయములు ఫలప్రదము లగుటకు సర్వేశ్వరుఁ డనుగ్రహించునుగాత! సమస్తలోకములకు సుఖము కలుగుఁగాత!

మహాపరివర్తనము

జగన్నాటకసూత్రధారుని రచన చాతుర్యము ఘటన సామర్థ్యము నటన వైభవము రస పోషణము అనిర్వచనీయము అవాఙ్మానసగోచరము అనంతము అఖండము. అనంతరంగములు అనంతపాత్రములు అనంతభావములు అనంతరసములు జగన్నాయకుని మహామహిమకు నిదర్శనములు. ఒక రంగమునందు రౌద్రము. వేఱొక రంగమునందు శృంగారము. మఱొక రంగమునందు కారుణ్యము. ఒక రంగము భూలోకము. వేఱొక రంగము నరకలోకము. మఱొక రంగము స్వర్గలోకము. ఇంకొక రంగము తపోలోకము. మఱియొక రంగము సత్యలోకము. ఒక పాత్ర పరమాణువు. ఒక పాత్ర మహామేరువు. మఱొక పాత్ర వానరుఁడు. ఇంకొక పాత్ర రాక్షసుఁడు. వేఱొక పాత్ర నరుఁడు. మఱియొక పాత్ర నారాయణుఁడు. అనంతభావములు అనంతరసములు అనంతరంగములు అనంతపాత్రలు గల నాటకరంగప్రభావము విచిత్రము సమ్మోహజనకము విజ్ఞానమయము. జగన్నాటకప్రయోజనము సంసృతి, సమ్మేళనము, సంయోగము, సామరస్యము, ఆధ్యాత్మికము, అద్వైతము. దృశ్యప్రపంచమునందు అపస్మృతి విమేళనము వియోగము విరసము భౌతికము ద్వైతము గోచరములు. దృశ్యాదృశ్యములకు సత్యాసత్యములకు నిత్యానిత్యములకుఁ గల విపరీతపరిజ్ఞానము ప్రపంచసంరంభమునకు మూలబీజము. లోకరంగమునందు తృష్ణాసంజాతమైన సంరంభము దినదినాభివృద్ధిఁ గాంచుచున్న విధమును ప్రపంచచరిత్ర వ్యక్తము చేయుచున్నది. మహాసంరంభఫలము ఐరోపా మహాసంగ్రామమునందు ప్రత్యక్షమైనది. ప్రపంచవ్యాప్త మగు సంగ్రామమహారంగములందు కలిగిన ప్రజాక్షయమును ద్రవ్యనాశనమును గమనించినపుడు పరమవిషాదము గలుగును. మహాసంగ్రామమునందు జర్మనులకు శృంగభంగము గలిగినది. జర్మనుల శృంగభంగము ధర్మబలవిజయమునకు పశుబలపరాజయమునకు నిదర్శనము. కాని, ధర్మమూర్తిప్రతిష్ఠాపనమాత్రము సంకుచితముగ నున్నది. లోకావృతం బైన పాశ్చాత్యరాజ్యముల బలప్రవాహ మవ్యవహితముగ ప్రవహించుటకు ప్రయత్నములు జరగుచున్నవి. ఏకజాతిబలవ్యాపనమును కతిపయజాతిసమ్మేళనబలవ్యాపనమును భీకరసంగ్రామ

ముగ పరిణమించినవి. అనేకజాతిసమ్మేళనబలమునకు వర్తమానస్థితియందు ఫలమును నిర్ణయించుట యసాధ్యము. శ్వేతజాతులు జపానుదేశము గలసి ప్రపంచ ధర్మస్థితిని శాంతస్థితిని పరిపాలనస్థితిని ఆర్థికస్థితిని నిర్ణయింప సమకట్టినవి. ఆసియా ఆఫ్రికా ఖండవాసు లైన శ్వేతేతరజాతుల భావిభాగ్యోదయము లోకధర్మస్థితి ఈ జాతులపై నాధారపడియున్నవి. భూమండలమునందు శ్వేతజాతీయప్రజలు 50 కోట్లు కలరు. శ్వేతముఖులు భూభాగమునందు విశేషభాగము నాక్రమించుకొని పాలించుచున్నారు. భూతలమునందు నాలుగు కోట్ల చదరపుమైళ్ల ప్రదేశము శ్వేతజాతుల యధీనమునందు కలదు. భూమండలమునందు శ్వేతేతరజాతుల ప్రజలు 110 కోట్లు కలరు. భూతలమునందు శ్వేతేతరజాతుల యధీనమునందు 2 కోట్ల చదరపు మైళ్ల ప్రదేశము గలదు. ప్రపంచ స్థితిని నిష్పక్షపాతబుద్ధితో నవలోకించినపుడు భూమండలమునందు శ్వేతజాతుల యధీనస్థితియందు లేని రాజ్యము జపానురాజ్యము మాత్రమే యని తెలియుచున్నది. ఇతర రాజ్యములును దేశములును కొంతకు కొంత ఏదో రూపమున శ్వేతజాతుల యధీనస్థితియందు కలవు. శ్వేతజాతుల బాహుబలము ధనబలము వాణిజ్యబలము మతబలము భావబలము సకలరాజ్యములను వశపఱచుకొనినవి. స్వతంత్రస్థితి గల జపానురాజ్యమునకును దృఢమైన శ్వేతముఖపాశబంధము గలదు. జపానురాజ్యము శ్వేతముఖులకు ధనపాశబద్ధము. జపానురాజ్యము శ్వేతముఖులకు ఋణపాశబద్ధము. జపానుదేశము శ్వేతజాతీయదృఢభావపాశబద్ధము. జపానురాజ్యము శ్వేతజాతీయ భౌతికసామ్రాజ్యపాశబద్ధము. శ్వేతజాతు లింతవఱకును ప్రత్యేకముగ జాతీయావశ్యకతల కనురూపముగ శ్వేతేతరజాతులను పరిపాలించి శాసించుచున్నవి. గత మైన యూరపు మహాసంగ్రామ మీ పరిస్థితులకు భంగము కలిగించినది. ఇపుడు శ్వేతజాతులు కలిసి లోకమును శాసింప సమకట్టినవి. స్థిరశాంతిస్థాపనమునకు సకలజాతులకును స్వతంత్రస్థితి యవశ్య మని యంగీకృత మైనది. సకలజాతులకు స్వయంనియంతృత్వస్వత్వము గల దని విల్సనుమహాశయుఁడు బోధించిన బోధను యూరపురాజ్యతంత్రజ్ఞు లంగీకరించిరి. ఘోరసంగ్రామ మంతము నొందినది. జాతిసమితి స్థాపిత మైనది. సకలదేశములను జాతిసమితిపాశబద్ధములను చేయుటకు ప్రయత్నములు జరగుచున్నవి. శ్వేతజాతి ప్రాతినిధ్య మధికముగఁ గల జాతిసమితి నిర్ణయములు శ్వేతజాత్యధీనమునందుఁ గల యితరజాతులకు తరణోపాయములా ప్రయోజనకరములా యను సమస్య గలుగుచున్నది. ఈ సమస్యను నిర్ణయించినపుడు జాతిసమితి ప్రయోజనమును నిర్ణయించుట సాధ్యము.

శ్వేతజాతిసమితి శాసింప సమకట్టిన శ్వేతేతర ప్రజలు 22 కోట్ల మహమ్మదీయులు 21 కోట్ల హిందువులు 40 కోట్ల బౌద్ధాదులు ఇంకను తదితరులు 16 కోట్లు గలరు. ఇట్లు పెక్కు కోట్ల ప్రజలకు తారకులు శ్వేతజాతులు. తారకుల మతము సంప్రదాయాచారములు భావములు వేషభాషలు జీవనవిధానములు భిన్నములు. తరింపవలసినవారి మతము సంప్రదాయాచారములు భావములు వేషభాషలు జీవనవిధానములు భిన్నములు. క్రైస్తవహిందూబౌద్ధమహమ్మదీయ మతములు జీవేశ్వరుల సంబంధమును భిన్నరీతుల బోధించుచున్నవి. సంఘశుభస్థితికి సాధనము లైన సంప్రదాయాచారములు వేఱుగ నున్నవి. ఇంతవఱకును లోకమునందు ధర్మసంస్థాపనమున కాసియాఖండము విశేషముగ తోడ్పడినది. పాశ్చాత్యుల భౌతికధర్మమునకును ప్రాచ్యుల యాధ్యాత్మికధర్మమునకును ప్రచండసంరంభము సంప్రాప్తము కానున్నది. ఈ విషమదశయం దాధ్యాత్మికధర్మపరాయణు లైన భారతీయుల నుద్ధరించుటలోఁ గల బాధకములను పాశ్చాత్యధీమంతులు గమనింపవలయును.

రాజ్యధర్మప్రచారము

లోకమునం దైరోపా మహాసంగ్రామమువలన మహాపరివర్తనము సంప్రాప్త మైనది. పరివర్తనఫలమును నిర్ణయించుటకు సంగ్రామకారణంబులను అరయుట యవశ్యము.

ఆసియా వ్యాపారములు

ఆదికాలమునుండియు యూరపురాజ్యముల శుభస్థితికి ఆసియావ్యాపారము ముఖ్యసాధనముగ నుండెను. ఆసియాఖండవ్యాపారాధిపత్యమును వహించిన యూరపురాజ్యము యూరపురాజ్యములందు గణనీయముగ నుండెను. ఆదికాలమునందు గ్రీసురాజ్యము లాసియా వ్యాపారాధిపత్యమును వహించి యూరపురాజ్యములందు నాయకత్వమును గాంచినవి. యవనులు తమ నౌకాబలాధారమున సంపన్నులై యూరపుఖండమునందు నాగరకతాబీజములను ప్రతిష్ఠించిరి. యవనుల సంపన్నత కాసియాఖండ

వ్యాపారమే మూలమని ఆసియామైనరునందు భూస్థాపితములైన పట్టణములు చెప్పక చెప్పుచున్నవి. అస్సీరియా బాబిలోనియా సామ్రాజ్యముల విజ్ఞానము యవనులకు సంక్రమించినది. యవనుల దండయాత్రలు ప్రాచీనకాలమునం దాసియా ఖండమునకును యూరపుఖండమునకును గల వ్యాపారవ్యాప్తికి నిదర్శనములు. వ్యాపారసంపన్నులైన యవనులు యూరపునందు స్థాపించిన నాగరకతాంకురములు నేటికిని వ్యాపారలక్షణములు గలిగియున్నవి. యవనుల సాహిత్యము వేదాంతము రాజ్యాంగము యూరపు రాజ్యముల సభ్యతకు మూలాధారములు. రోమకసామ్రాజ్యము వెనీసువర్తకసంఘములు ఆసియాఖండవ్యాపారమువలన సంపన్నములై యూరపుఖండమునందు విజ్ఞానమును వ్యాపింపఁజేసినవి. పదునాఱవ శతాబ్దిలో యూరపుఖండమునం దాసియావ్యాపారాధిపత్యమునకై మహాసంకులము కలిగినది. వ్యాపారలాభమునకై ఇంగ్లాండు ఫ్రాన్సు హాలండు స్పెయిను పోర్చుగలు దేశములకు ఘోరములైన యుద్ధములు సంభవించినవి. వ్యాపారసామ్రాజ్యమునకై ఇంగ్లాండు ఫ్రాన్సు దేశములకు మూఁడు శతాబ్దులు ఘోరయుద్ధములు జరిగినవి. ఆ యుద్ధములందు విజయము పదునెనిమిదవ శతాబ్ది యంత్యభాగమున ఇంగ్లాండునకుఁ గలిగినది. ఆసియావ్యాపారవిజయముతో బ్రిటీషుసామ్రాజ్యవికాస మారంభమై కాలక్రమమున వృద్ధి పొందినది. దేశచరిత్రలను విమర్శించినపుడు భాగ్యములకును విజ్ఞానవ్యాపనకును గల సంబంధము వ్యక్తమగుచున్నది. గర్భదరిద్రులకు కాలమంతయు జీవయాత్రను గడపుటయందు వినియోగపడుచుండును. భాగ్యవంతులకు కాలావకాశములను విజ్ఞానసాధనమునకై వినియోగించుటకు మార్గములు గలుగుచున్నవి. ఆంగ్లేయుల వ్యాపారసామ్రాజ్యము వారిని మహాసంపన్నులఁ జేసి బ్రిటీషుసామ్రాజ్యమున కపూర్వమైన ప్రతిభను కలుగఁజేసినది. ఆంగ్లేయుల ప్రతిభకు భంగము కలుగఁజేయుటకై రుష్యనులు జర్మనులు చిరకాలము నుండియు నుపాయముల నన్వేషించుచుండిరి.

బ్రిటీషుసామ్రాజ్యాంతర్భాగములందు భరతఖండము సామ్రాజ్యమునకు మకుటమువలె నున్నది.

భరతఖండ వ్యాపారము

సహజసంపదలకు నిలయమై యూరపురాజ్యముల పోషణమునకు సాధనమైన భరతఖండముమీఁద రుష్యనుల దృక్పథము జర్మనుల దృక్పథము ప్రసరించినవి. రుష్యనులు ఆఫ్ఘనస్థానపు సీమాంతప్రదేశములందు యుద్ధసన్నాహములను చేయుచుండిరి. జర్మను లేబదేండ్లలో యూరపుఖండమునందు మహాబలమును గడించిరి. జర్మనుల బలము యూరపురాజ్యములందు భయకంపములను కలిగించినది. జర్మనులు నిరంతరమును ముష్టియుద్ధమునకు సిద్ధముగ నుండిరి. వ్యాపారసామ్రాజ్యాధిపత్యమునకై ఇంగ్లాండుతో ప్రతిఘటించిరి. ఆసియా ఆఫ్రికా ఖండములందు వలస రాజ్యములను స్థాపించిరి. లోకమునందంతటను వ్యాపారాలయములను పణ్యశాలలను స్థాపించిరి.

జర్మనుల విపరీతాశాఫలము

జర్మనుల విపరీతాశాఫలము వ్యాపారసామ్రాజ్యాధిపత్యమును నిర్వహించుటకై మహత్తరమైన నౌకాబలమును నిర్మించినది. జర్మనుల సైన్యబలము వ్యాపారతంత్రము శాస్త్రాన్వేషణము యూరపురాజ్యములకు గర్వనిర్భేదకముగ నుండెను. జర్మనుల యాశయు వారి ప్రతిభతో పాటు ఆద్యంతములు లేక పెరిగినది. అద్వితీయమైన వ్యాపారసామ్రాజ్యాధిపత్యమును యూరపుఖండనాయకత్వమును బడయుటకు జర్మనులు పూనుకొనిరి. జర్మనులగర్వమునకు జర్మనుచక్రవర్తిభావములు నిదర్శనములు. జర్మనునాయకులందు జాతీయదురహంకారము విపరీతాకారమును దాల్చినది. తత్త్వజ్ఞులు జాతీయాహంకారమును సంస్తుతించిరి. మహారథులు బాహుబలమును అభినందించిరి. శాస్త్రజ్ఞులు మారణయంత్రములను నిర్మించిరి. గాయకులు రణోత్సాహమును సంబోధించిరి. మతబోధకులు మాతృదేశాభిమానము నుపదేశించిరి. దేవాలయములు విద్యాలయములు నాటకాలయములు శాస్త్రాన్వేషణాలయములు యంత్రాలయములు పణ్యశాలలు నౌకాశ్రయములు సైనికశిబిరములు సభామందిరములు రాజప్రాసాదములు జర్మనుజాతీయదురహంకారపూరితములై విరాజిల్లుచుండెను. జాతీయదురహంకారము కెయిజరునందు మూర్తీభవించినది. కెయిజరు విద్వాంసుఁడు గాయకుఁడు కవీశ్వరుఁడు మతోపదేశకుఁడు మహారథి పురుషోత్తముఁడు. చక్రవర్తికిఁ గల లోకాతీతమైన యుత్తమాభిమానము జర్మనుల పతనమునకు మూలబీజము. దురభిమానమసంప్రేక్ష్యకారిత్వమునకు బీజము. జర్మనుల దురభిమానము వారిని బాహుబలసమ్మోహితులను చేసి

నది. జర్మనులు శాంతిమార్గముల నవలంబించినచో, వారు కాలక్రమమున వాణిజ్యసామ్రాజ్యమునకు పట్టభద్రులై యుందురు. వారి యసహనము వారి పతనమునకు తోడ్పడినది. జర్మనులు వాణిజ్యసామ్రాజ్యము నధిష్ఠించుట కాసియాసామ్రాజ్య మవశ్యము. తురుష్కులతో చేరి తురుష్క దేశమునందు బర్లినునుండి బాగ్దాదునకు రైలును నిర్మించుటకు నడుకట్టిరి. ఆ రైలుమార్గమును పారసీకసముద్రతీరమునందు స్థాపించుటకు జర్మనులు విశ్వప్రయత్నములను చేసిరి. ఆంగ్లేయులకును జర్మనులకును గల కలహకారణములలో జర్మనులకు భరతఖండము పట్లఁ గల లోభదృష్టి ముఖ్యకారణముగ నున్నది. యూరపురాజ్యముల శుభస్థితి కాసియాఖండ వ్యాపారము ముఖ్యాధారముగ నున్నది. జర్మనుల యుద్ధఫలములు లోకమునకు తెలిసియేయున్నవి.

"గ్రేటు బ్రిటనును లొంగఁదీసి నౌకాదళమును స్వాధీనము చేసికొనవలయును. అనంతర మమెరికా పట్టుప పట్టెదము. మనకు శత్రువుల యధినివేశములు కావలయును. ఆ దేశముల సహజపదార్థములు కావలయును. మనకు రాజకీయస్వాతంత్ర్యము ఆర్థికస్వాతంత్ర్యము పారిశ్రామికస్వాతంత్ర్యము కలుగుటకు రాజ్యవ్యాపనమును వ్యాపారసౌకర్యములును కలిగియుండవలయును. ఇంగ్లీషు ఖానలునందు రేవులను కలిగియుండవలయును."

ఈ భావములు జర్మనుల స్వార్థపరత్వమును విజయాభిమానమును లోకమునకు స్పష్టముగ తెలుపుచున్నవి.

జర్మనుల సంధులు మంత్రాంగములు నౌకలు బలములు వారి సంకల్పప్రాప్తికై సిద్ధము చేయఁబడినవి. యూరపుఖండమునందు జర్మనుల సంకల్పము లప్రతిహతములుగ సాగుటకై జర్మనులు ఆస్ట్రియనులు ఇటలీ దేశస్థులు రక్షకదండనసంధులను చేసికొనిరి. ఈ త్రిరాజ్యసంధియే లోకమునందు మహోత్పాతమును కలిగించినది. యుద్ధమునకై జర్మనులు కృత్రిమకారణములను కల్పించి ఆస్ట్రియనులను యుద్ధమునకు పురికొలిపిరి. వివేకశూన్యులైన యాస్ట్రియనులు జర్మనుల మాయోపాయములకు లోఁబడి సంగ్రామానలమును పుట్టించిరి.

సర్వియనుపౌరుఁడు ఆస్ట్రియా యువరాజును చంపెను. ఆస్ట్రియా 1914 జులై 28-వ తేదిని సర్వియామీఁద యుద్ధమును ప్రకటించెను. ఆగస్టు 1-వ తేదీని జర్మని రుష్యాదేశములు పరస్పరనాశకరమైన యుద్ధమును ప్రకటించినవి. మూఁడవ తేదీని జర్మని ఫ్రాన్సు బెల్జియములమీఁద యుద్ధమును ప్రకటించినది. నాల్గవ తేదిని బ్రిటీషుసామ్రాజ్యము జర్మనులమీఁద యుద్ధమును ప్రకటించెను. అనంతరము కాలక్రమమున మోంటినీగ్రో జపాను ఇటలీ పోర్చుగలు రుమేనియా అమెరికా సంయుక్తరాష్ట్రములు క్యూబా పనామా గ్రీసు సయాము లైబీరియా చీనా బ్రెజీలు గాటిముల హైటి హాండూరాసు జర్మనులమీఁద యుద్ధమును ప్రకటించినవి. బోలీవియ నికారాగ్యుయ పెరు ఉరుగ్వే ఈక్వడారు సాంటోడొమింగోలు జర్మనులతోడి మిత్రత్వమును పరిత్యజించినవి. తురుష్కసామ్రాజ్యము బల్గేరియా జర్మనులతో చేరినవి. బ్రిటీషుసామ్రాజ్యాంతర్గతములైన సకలభాగములు యుద్ధమునందు పరమోత్సాహముతో చేరినవి. యుద్ధమునందు 21 రాజ్యము లొక పక్షమునను 4 రాజ్యము లొక పక్షమునను చేరినవి. లోకవ్యాప్తమైన మహాసంగ్రామము లోకమునకు దారుణమును కలిగించిన విధము గతించిన $51\frac{1}{2}$ మాసములందు పర్యాప్తంబైన భీకరసంగ్రామప్రస్థానములు వెల్లడిచేయుచున్నవి. బల్గేరియనులు 1918-వ సంవత్సరము సెప్టెంబరు నంతమునందు సంధిని చేసికొనుట కంగీకరించిరి. తురుష్కులు సెప్టెంబరునందు సంధిని చేసికొనుట కొప్పుకొనిరి. ఆస్ట్రియనులు సంధి చేసికొన నంగీకరించిరి. జర్మనులు నవంబరుమాసమునందు సంధి చేసికొనుట కొడంబడిరి.

సంగ్రామారంభము

యుద్ధప్రయోజనములు

మిత్రమండలిరాజ్యములు యుద్ధారంభమునుండియు 1 బలధర్మ సిద్ధాంత సంహారము 2 ధర్మబలసిద్ధాంతస్థాపనము 3 స్వల్పరాజ్యస్వాతంత్ర్యసంరక్షణము 4 స్వయంనిర్ణయధర్మావలంబనము 5 నిరంకుశాధికారభంజనము 6 ప్రజాస్వామ్యసంస్థాపనము 7 సంగ్రామనివారణ విరామములు యుద్ధప్రయోజనము లని ప్రకటించినవి. యుద్ధాదర్శములను విల్సనుమహాశయుఁడు నిరాఘాటముగఁ దెలిపెను. విల్సనుమహాశయుని భావశుద్ధిమీఁద స్థిరశాంతిస్థాపన మాధారపడియున్నది. విల్సనుమహాశయుని పదునాలుగు మూలప్రయోజనములను మిత్రమండలి రాజ్యతంత్రజ్ఞు లందఱును శత్రుపక్షమువారును అంగీకరించిరి.

విల్సను మూలసిద్ధాంతములు

1. సంధులు బహిరంగముగ నుండవలయును. రహస్యముగ నుండఁ జనదు.

2. సంగ్రామసమయమునందు దంతర్జాతీయనిర్ణయమువలన ప్రతిషిద్ధము లైన ప్రదేశములందుఁ గాక, ఇతరప్రదేశములందు సముద్రమునందు వ్యాపారస్వాతంత్ర్యము సకలజాతుల కుండవలయును.

3. అన్ని జాతులకు నవసరముఁ గల యార్థికప్రతిబంధకములు తొలఁగవలయును.

4. సకలజాతులకు సైనికపరిమితివిషయమై తగిన యేర్పాటులు జరుగవలయును.

5. అధినివేశస్థలముల విషయమై నిష్పక్షపాతమైన సర్దుబాటు జరుగవలయును. పాలకజాతుల హక్కులవలె పాలితజాతుల హక్కులును పరిగణింపఁబడవలయును.

6. రుష్యాయందలి యాక్రమణప్రదేశములను జర్మనులు విడువవలయును. స్వయంపరిపాలనస్థాపనమునకు రుష్యాకు సంపూర్ణావకాశముల నొసంగవలయును. ఏతత్ఫలప్రాప్తి కితరరాజ్యములు రుష్యాకు సహాయము చేయవలయును.

7. సంపూర్ణరాజ్యాధికారము గల బెల్జియము రాజ్యమును తిరిగి స్థాపింపవలయును.

8. పరాక్రాంతమైన ఫ్రాన్సుదేశము స్వాధీనము కావలయును. ప్రష్యారాజ్యము 1871-వ సం. ఆల్సేసులొరేను విషయమై చేసిన యక్రమమును తొలఁగింపవలయును.

9. ఇటలీజాతీయపరిస్థితుల కనుకూలముగ దాని సరిహద్దులను నిర్ణయింపవలయును.

10. ఆస్ట్రోహంగరీప్రజలు జాతీయసాంప్రదాయముల కనురూపముగ వికసించుట కవకాశముల నొసంగవలయును.

11. రుమేనియా సర్వియా మోంటినీగ్రోలకు శత్రువిమోచనము కలుగవలయును. సర్వియాకు సముద్రతీరమున మార్గ మేర్పడవలయును. బాల్కనురాజ్యములు పూర్వచారిత్రమునకును జాతీయసాంప్రదాయములకును అనుకూలములుగ నిర్మింపఁబడవలయును.

12. తురుష్కసామ్రాజ్యాంతర్గతము లైన తురుష్కేతరజాతులకు స్వయంవికాసమున కవకాశములను కల్పింపవలయును. డార్డనల్సునందు సకలజాతుల నౌకలు ప్రవేశించుట కాటంకము లుండఁజనదు.

13. స్వతంత్ర మైన పోలిషురాజ్యము స్థాపితము గావలయును.

14. సకలరాజ్యముల రాజ్యరాజకీయస్వాతంత్ర్యమును రక్షించుటకు జాతిసమితి స్థాపితము గావలయును.

ఆయన 1918-వ సం. ఫిబ్రవరిమాసమున కాంగ్రెసునకు పంపిన సందేశమునందీ భావములు గలవు: 1 సంధులు సద్ధర్మావలంబనములుగ నుండవలయును. 2 ప్రబలరాజ్యభంజనసిద్ధాంతమును సమర్థించుటకై ప్రజలను రాష్ట్రములను సామానులవలె క్రయవిక్రయానుకూలముగ నుంచఁజనదు. 3 రాష్ట్ర పునర్నిర్మాణములు రాష్ట్రవాసుల యోగక్షేమములకై చేయఁబడవలయును కాని ప్రత్యర్థిరాజ్యముల లాభార్థమై చేయఁబడఁజనదు. 4 సులక్షిత మైన జాతీయాశయప్రాప్తి కనుకూలపరిస్థితు లేర్పడవలయును.

ఏప్రిలుమాసమునందు పంపిన సందేశమునందు "ధర్మాధిరూఢ మైన విజయబలము ధర్మమును లోకశాసనముగ చేయఁగలదు. స్వార్థప్రయోజనములను మట్టిని కలుపఁగలదు." అని యతఁడు తెలిపెను.

విల్సనుమహాశయుఁడు వాషింగ్టను సమాధిసమక్షమున నుపన్యసించుచు మిత్రమండలి యుద్ధప్రయోజనముల నిట్లు వివరించెను:

"బార్నుసు గారివలె వాషింగ్టను గారు రన్నిమేడులో మానవప్రపంచ సంతతికొఱకును గూడ పలికి పనిచేసిరి కాన ప్రస్తుతమున్న విశ్వవినాశనమును గూర్చి అమెరికావారు తమ భావములను మఱల ప్రకటించుటకు వాషింగ్టను గారి సమాధియే యుత్తమస్థానము. ఒకవంక వివిధదేశములవా రుండిరి. వారికి ప్రతికూలములుగా కేవల స్వార్థపరత్వము గల కొన్ని ప్రభుత్వములు మాత్రమే నిలిచి గురాశాపూరితములై ప్రబలసైన్యముల నడుపుచు చిత్తము వచ్చినట్లు ప్రజల జీవితములను హరించుచున్నవి. ఆ ప్రభుత్వములు విజాతీయములు ద్వేషపూరితములు నాటవికలక్షణసమన్వితములు గాన నిట్టి పోరునందు సగము సగము పనివలన ప్రయోజన మేమియు నుండదు. రాజీ పడఁగూడదు. అమెరికావారి భావముల నొక వాక్యమున నిముడ్పవచ్చును: ప్రజల యానుకూల్యముపైని సక్రమప్రజాభిప్రాయముపైని ఆధారపడిన ధర్మశాస్త్రము ననుసరించి పరిపాలనము జరుగవలెను. జర్మనీ పరిపాలకులు మదాంధులై కినియఁజేసిన మహాశక్తుల ప్రతాపమును వారు గ్రహింపఁజాలరు. ఆ శక్తులలో నిమిడియున్న సంకల్పము వినాశనరహితము విజయభరితము. కావున వాని నడంప వీలు లేదు."

ఈ పరమప్రయోజనముల సాధించుటకై మిత్రమండలిపక్షమున చేరిన సకలరాజ్యములు యథాశక్తి యుద్ధభారమును నిర్వహించి విజయము పడసినవి.

యుద్ధము – భరతఖండము

గతసంవత్సరమునందు ప్రధానమంత్రి లాయిడు

జార్జి గా రంపిన సందేశమునందలి వాక్యములు ప్రజల నుత్సాహపూరితులను చేసినవి: "భారతీయుల శక్తియందు నాకు సంపూర్ణవిశ్వాసము గలదు. వారింతవఱకు గడించిన గౌరవమును వృద్ధి చేయుటకును శత్రువుల యరాజకవ్యాపనము నాపి యాసియాఖండసంరక్షణము నకు దుర్గముగ నుండుటకును భారతీయు లధికముగ సన్నద్ధు లగుదు రని విశ్వసించుచున్నాను." రాజప్రతినిధి యీ సందేశమున కంపిన ప్రత్యుత్తరము భారతీయుల యుదారస్వభావమును తెలుపుచున్నది.

ఏప్రిలుమాసాంతమునందు ఢిల్లీనగరములో గూడిన యుద్ధసభయందు రాజప్రతినిధి చేసిన హిందూదేశబలవర్ణనము భారతీయుల రణోత్సాహమునకు నిదర్శనము.

రాజప్రతినిధి యాదేశము ననుసరించి చేయఁబడిన తీర్మానములను సఫలము చేయుట కధకారులు నసధికారులు కలిసి యుద్ధనిర్వాహణమునకై చేసిన ప్రయత్నములు సఫలములై మిత్రమండలికి విజయము కలిగించినవి.

బ్రిటీషు సామ్రాజ్యవిపదదశయందు భారతీయులు చూపిన యవ్యాజమైన స్వామిభక్తి శత్రువులకు విషాదమును మిత్రుల కానందమును కలుగఁజేసినది. యుద్ధారంభమునందు సామదానోపాయజ్ఞుండైన హార్డింజిప్రభువు రాజప్రతినిధిగ నుండుటవలన సామ్రాజ్య క్షేమమునకు మహోపకారము కలిగినది. రాజప్రతినిధి విశ్వాసము ప్రజలయందు విశ్వాసమును కలిగించినది. దేశము సైన్యరహితమైనను ప్రశాంతస్థితికి భంగము కలుగలేదు. యుద్ధము పర్యాప్తంబైన 51 మాసము లందును భారతయోధులు ఫ్రాన్సు చీనా అరాబియా గాలిపోలి మెసపొటేమియ పలస్టను పశ్చిమాఫ్రికా తూర్పాఫ్రికా మొదలగు రంగములందు ప్రాణములను సమర్పించి మిత్రమండలి విజయములకు తోడ్పడిరి. మార్నీ యుద్ధమునందు భారతీయులు యూరపుసభ్యత్వమును సంరక్షించి రని కర్జనుప్రభువు ప్రశంసించెను. ఒక్క సంవత్సరము ఫ్రాన్సురణరంగములందు భారత యోధులలో 34,000 మరణములు సంభవించినవి. స్మట్సుసేనాధ్యక్షుఁడు భారతయోధుల ధైర్యసాహసములను కొనియాడెను. "మెసపొటేమియా పలస్టీనులందు శత్రుపరాజయమునకు భారతసైన్యములు విశేషముగ తోడ్పడినవి," యని ఆలెంబిసేనాధ్యక్షుఁడు ప్రశంసించెను.

యుద్ధమునకు పూర్వము భరతఖండమునందు 77,000 బ్రిటీషుసైనికులును 1,94,000 హైందవసైనికులును గలరు. సంవత్సరమునకు క్రొత్త సైన్యబలము సైనికులు 15,000 చొప్పున చేరుచుండిరి. క్రొత్త సైనికుల సంఖ్య 1916నందు 1,21,000 మందిగను 1917నందు 3,00,000 మందిగను 1918 లో 500,000 మందిగను పెరిగినది. యుద్ధకాలమునందు భరతఖండమునుండి 7,57,447 సైనికులు 4,04,042 అనుచరులు మొత్తము 11,61,489 ప్రజలు చేరిరి. హిందూదేశమునుండి 1,74,831 గుఱ్ఱములు మొదలగు జంతువులు పంపఁబడినవి. యుద్ధనిర్వాహణమునకై 1874 మైళ్ల రైలుపట్టాలు 5999 రైలుబండ్లు 237 రైలు ఎంజనులు 13073 అడుగుల రైలుగర్డరులు పంపఁబడినవి. యుద్ధసైన్యమునకై గతించిన నాలుగేండ్లలోను 2,40,70,000 సవరనులు అధికముగ వ్యయము చేయఁబడినవి. మఱియు, ప్రజలు సంస్థానాధిపులు 50,00,000 రూప్యములను దానధర్మములుగ సమర్పించిరి. 100,000,000 సవరనులు యుద్ధమునకై హిందూదేశప్రభుత్వము బ్రిటీషుప్రభుత్వమునకొసఁగినది. యుద్ధనిర్వాహణమునకవశ్యమైన మందుగుండుసామానులు దుస్తులు ఆహారపదార్థములు చర్మములు మొదలగు పదార్థములను హిందూదేశము సమకూర్చినది. మిత్రమండలి విజయమునకు హిందూదేశము విశేషముగ తోడ్పడిన దని యుద్ధనిర్వాహకు లొప్పుకొనుచున్నారు. హిందూదేశము వికాసస్థితియందుండిన నింతకంటె నధికతరముగ యుద్ధనిర్వాహణమునకు తోడ్పడియుండును. ఆలోప మధికారనిర్వాహకులమీఁదఁ గలదు కాని ప్రజలయందు లేదు. యుద్ధనిర్వాహణమున కింతటి సహాయము చేసిన భరతఖండపుస్థితి భావికాలమునం దెటు లుండవలయు నను ప్రశ్న రాజ్యాంగవేత్తలకు భారతదేశభక్తులకు కలుగుచున్నది. మిత్రమండలి రాజ్యాంగవేత్తల యభిప్రాయములను ముఖ్యముగ విల్సనుమహాశయుని భావములను పరిశీలించినపుడు భరతఖండమునందు స్వరాజ్య ప్రతిష్ఠాపనలను స్థాపించుట యుద్ధప్రయోజనములను సాధించుటకు సాధన మని విశద మగుచున్నది. విజయ ప్రాప్తికై ప్రాణధనములను సమర్పించిన భరతఖండము వికసించి శుభస్థితిని పడయుటకు తగిన సాధనముల నవలంబించుటయే పరిపాలనమునకు ఫలము. రాజ్యాంగ

నిర్మాణ మేరూపమును తాల్చినను నిర్మాణముల పరమప్రయోజనము దేశవికాసము ప్రజావికాసము. అధికారప్రతిష్ఠ అధికారగౌరవము అధికారలాభము రాజ్యాంగనిర్మాణమునకు ప్రయోజనములు గావు. భరతఖండస్థితి చేష్టారహితముగ నున్నది. ఈ స్థితినే మోంటేగు గారు పురాణకాలయోగ్య మనియు చైతన్యరహిత మనియు దారుతుల్య మనియు ప్రవర్ధమానం బగు ప్రజాసభ్యతకనుపయోగ మనియు వర్ణించెను.

స్థితిప్రయోజనము

వికాసము విశ్వస్థితికి పరమప్రయోజనము. విశ్వపతి ప్రజావికాసమునకై యజ్ఞమయమైన విశ్వమును నిర్మించి విశ్వాధారమున ప్రజావికాసమును శాసించెను. ప్రజావికాసమున కనంతదేశములు భాషలు జాతులు సంస్థాపనలు పదార్థములు సంపదలు భావములు పరికల్పితములు. లోకమునందు దేశమును బోలిన దేశము లేదు. జాతిని బోలిన జాతి లేదు. భాషను బోలిన భాష లేదు. సంస్థాపనను బోలిన సంస్థాపన లేదు. పదార్థమును బోలిన పదార్థము లేదు. నగరమును బోలిన నగరము లేదు. నదిని బోలిన నది లేదు. తటాకమును బోలిన తటాకము లేదు. వృక్షమును బోలిన వృక్షము లేదు. వ్యక్తిని బోలిన వ్యక్తి లేదు. అనంతరూపములు అనంతభావములు చైతన్యవికాసమునకు నిదర్శనములు. కాని, జడత్వమునకు నిదర్శనములు కావు. అన్ని రూపములను భావములను ఏకత్వమునందు సమన్వయము చేయుట ఈశ్వరలీల గాని విలయము చేయుట ఈశ్వరోద్దేశము కాదు.

జాతీయభావములు

భూతలమునందుఁ గల సుక్షేత్రములు ఊషరక్షేత్రములు సుజలప్రదేశములు నిర్జలప్రదేశములు మహాటవులు గిరిప్రదేశములు ఎడారులు సముద్రప్రాంతములు ఉష్ణప్రదేశములు హిమావృతస్థలములు భిన్నవిధముల ప్రజాపోషణమును చేయుచున్నవి. ఎండలు వానలు గాడ్పులు అంబరకాంతులు భిన్నదేశవాసుల గుణశీలములను నిర్ణయించుటకు సాధనంబులుగ నున్నవి. ఉష్ణదేశవాసులకును శీతలప్రాంతవాసులకును సుక్షేత్రవాసులకును ఊషరక్షేత్రవాసులకును గిరిప్రదేశవాసులకును సముద్రతీరవాసులకును అటవీసంచారులకును గ్రామవాసులకును ప్రకృతిపరిస్థితులు భోజనవిధానమునందును వేషధారణమునందును భాషావిన్యాసమునందును వర్ణవిధానమునందును దేహాంగధారణమునందును సంప్రదాయాచారములందును స్వభావములందును శీలములందును విభేదములను కల్పించుచున్నవి. ప్రకృతిపరిస్థితులు కల్పించిన విభేదములు నిరంతరసంరంభమునకు మూలబీజములు. సుఖజీవనము గల ప్రజల స్వభావమునకును కష్టజీవనము గల ప్రజల స్వభావమునకును వ్యత్యాసము గలదు. ఉష్ణదేశవాసుల స్వభావమునకును శీతలదేశవాసుల స్వభావమునకును భేదము గలదు. మాంసాశనుల స్వభావమునకును శాకాహారుల స్వభావమునకును భేదము గలదు. వాణిజ్యదేశస్థుల స్వభావమునకును వ్యవసాయదేశస్థుల ప్రకృతికిని భేదము గలదు. లోకస్థితి కవశ్యములై యనంతములైన దేశకాలపాత్రభేదములు వర్తమానయుగమునందు విజృంభమాణంబైన జాతీయతకు మూలబీజములు. యూరపురాజ్యములందు పందొమ్మిదవ శతాబ్దిలో విజృంభించిన జాతీయత స్వజాతీయవికాసమునకే కాక యన్యజాతీయవిలయమునకును తోడ్పడినది. యూరపురాజ్యముల నిరంతరసంరంభమే స్వార్థపరమైన జాతీయతవలన కలుగఁగల మహోపద్రవమును వ్యక్తము చేయుచున్నది. ఈ భేదము లహంకారమమకారములను పెంచి జాతీయాహంకారమును గతశతాబ్దియందు వికసింపఁజేసినవి. పాశ్చాత్యదేశములలో వికసించిన జాతీయాహంకారము బాహుబలమునందును వాణిజ్యబలమునందును ధనబలమునందును సందర్శనీయము. పాశ్చాత్యదేశములందు జాతీయశుభస్థితికి వాణిజ్యము పరిశ్రమలు ధనరాసులు విద్యాలయములు యంత్రాలయములు సైన్యనివహములు ఫిరంగులు విమానములు రాజ్యవిస్తీర్ణము ప్రమాణములుగ నున్నవి. ఏ యుపాయమున నైనను స్వజాతీయప్రతిభను సంరక్షించుట యుత్కృష్టధర్మముగ పరిగణింపఁబడుచున్నది. ఏ కుమార్గమున నైనను స్వజాతీయసౌభాగ్యమును వృద్ధిచేయుట దేశభక్తిగ పరిగణింపఁబడుచున్నది. ఏ విధమున నైనను స్వజాతీయప్రయోజనమును సంరక్షించుట దేశసేవగ నెంచఁబడుచున్నది. స్వదేశములందును పరదేశములందును స్వజాతీయాశయములను వక్రగతినైనను సాధించిన రాజ్యసేవకులు మహాపురుషులుగ పరిగణింపఁబడుచున్నారు.

యూరపురాజ్యముల రహస్య రాజ్యాంగ చరిత్రము జాతీయారాధకుల చరిత్రములకు మహాపురాణముగ నున్నది. యూరపురాజ్యముల ప్రతినిధులు మాతృదేశప్రయోజనములను పరదేశములందు సాధిం

చిన విధము వారి ప్రతిభకు ధర్మశీలమునకు ప్రతికూలము. జర్మనులు రాజ్యనీతిబలమున చీనాదేశమునందు పడసిన లాభములు వారి వక్రమార్గమునకు నిదర్శనములు. రాజ్యనీతిధురంధరుఁడు బిస్మార్కు మహాపురుషుఁడు. ఆస్ట్రియా యువరాజును చంపిన హంతకుఁడు దేశభక్తుఁడు. ధయర్నును చంపిన పరాసుఁడు దేశభక్తుఁడు. రుష్యాచక్రవర్తులను చంపిన హంతకులు దేశభక్తులు. నిరంకుశాధికారులను హింసించిన మూఢులు దేశభక్తులు. ఇట్టి దుష్కార్యములు దురాలోచనలు జాతీయతకు మహాకళంకము నాపాదించినవి. జాతీయతయందు స్వార్థప్రయోజనము విజృంభించి మానవప్రయోజనము సంకుచిత మైనది. భిన్నజాతులకు స్వార్థప్రయోజనార్థము నిరంతర సంరంభ మేర్పడినది. యూరపు రాజ్యముల సంరంభ ఫలమును ఐరోపా మహాసంగ్రామము లోకమునకు బాగుగ రుచిచూపినది. స్వజాతీయ ప్రయోజనార్థమై జర్మనులు ప్రారంభించిన యుద్ధమునందు వారు చేసిన హత్యలు పాడుచేసిన యంత్రాలయములు గనులు ముంచిన స్టీమరులు అపహరించిన భాగ్యములు చెరపెట్టిన ప్రజలు లోకమునకు మహాసంక్షోభఫలమును తెలిపెను. జర్మనులకు దుర్గతి కలిగినది. విజయమును పొందిన జాతులకు సంతృప్తి కలుగలేదు.

రాజ్యముల యసంతృప్తి

ఇటలీ రాజ్యలాభమును ఫ్రాన్సు ధనరక్షణ లాభములను ఇంగ్లాండు ధనలాభమును అమెరికా వ్యాపార లాభమును ఇతర రాజ్యము లితరలాభములను కోరుచున్నవి. ఏ యుగమందును నీ జాతుల మనోరథము సఫలము కాఁజాలదు. పరరాజ్యాక్రమణము పరవ్యాపారాక్రమణము పరద్రవ్యాక్రమణము పరమావధిగఁ గల మనోరథము సంపూర్ణముగ నేజాతికిని సఫలముకానేరదు. మహాసామ్రాజ్యాధిపత్యమును వహించుచున్న జాతులు కోరఁదగిన రాజ్యములు ధనరాసులు వ్యాపారలాభములు నిరంతరము గోచరము లగుచుండును. బాహుబలసాధనమున పరరాజ్యాపహరణమునకు పరద్రవ్యాపహరణమునకు పూనుకొనుట యధర్మ మని వర్తమానసంగ్రామము స్థాపించినది. జాతీయశుభస్థితి కాత్మవికాసము మూలము గాని పరాక్రమణము మూలము గాదను మహోపదేశమును మహాసంగ్రామము చేసినది. జాతీయాత్మపరిజ్ఞానము లేని జాతికి లోకసామ్రాజ్యాధిపత్యము శుభస్థితిని కలుగఁజేయదు. ఆత్మపరిజ్ఞానము గల జాతులకు శుభస్థితి సులభముగ కలుగుచున్నది. జాతులకు శుభస్థితి నాత్మపరిజ్ఞానమువలె సంపదలు సైన్యములు భాగ్యభోగ్యములు రాజ్యములు కలుగఁజేయవు. సకలజాతులకును సంతరణము స్వయంసహాయమున కలుగఁగలదు. పరుల సహాయమున కలుగనేరదు. గురువు శిష్యునకు చేసిన మంత్రోపదేశము శిష్యుఁడు మంత్రోపాసన చేయనపుడు వ్యర్థ మగును. సకలజాతులకును విశ్వకర్త ప్రసాదించిన సంతరణసాధనంబులను స్వజాతీయకల్యాణమునకై వినియోగించుట కభిలాష సహజముగ నుండును. జాతీయోద్ధరణమునందు స్వజాతికిఁ గల యభినివేశము అభిమానము అవకాశములు విజాతీయుల కుండుట యసంభవము. విశ్వపతి ప్రత్యేకముగ నాయా జాతులకు ప్రసాదించిన యవకాశములను సంపూర్ణముగ స్వజాతీయాభ్యుదయమునకు వినియోగించుట నూతనయుగరాజ్యాంగధర్మము. నూతనయుగరాజ్యాంగధర్మమును ప్రతిష్ఠించుటకు మిత్రమండలి రాజ్యములు జాతిసమితిని స్థాపించి జాతీయతకు పరార్థహిత మైన సకలజాతీయకల్యాణమును సాధించుటకు సమకట్టినవి. లోకోత్తరం బైన పరమప్రయోజనమును లోకమున కొడగూర్చుట కవకాశములు సామర్థ్యము బ్రిటీషు ప్రభుత్వమునకుఁ గలవు. ఈ సంచికయందు వేఱొక పుటలో ప్రచురించిన సామ్రాజ్యవివరములను పరిశీలించినపుడు బ్రిటీషుసామ్రాజ్యమాహాత్మ్యము గ్రాహ్య మగును. లోకావృతం బైన బ్రిటిషుసామ్రాజ్యమునందు 21 కోట్ల హిందువులు 7 కోట్ల క్రైస్తవులు 10 కోట్ల మహమ్మదీయులు 120 లక్షల బౌద్ధులు మొదలగు మతస్థులు గలరు. వివిధజాతులు గలవు. అందు 6 కోట్ల శ్వేతముఖులు గలరు. స్వపరిపాలనము గల వలస రాజ్యములును గలవు. రాజ్యాధిష్ఠాతాయత్త మైన వలస రాజ్యములు గలవు. నిరంకుశాధికారాధీనము లైన రాజ్యములు గలవు. నలువది కోట్ల ప్రజల యభ్యుదయమునకు స్వీయవిద్యావివేకసంపదలను వినియోగింపఁగల బ్రిటీషుప్రభుత్వము నూతనరాజ్యాంగధర్మమును స్థాపించి యీశ్వర ప్రసాదమును పడయఁగలదు.

జాతీయత

జాతిసమితినిర్ణయంబుల కనుకూలముగ నూతన రాజ్యాంగధర్మమును ప్రతిష్ఠాపించుటకు జాతీయతాభావమునందు సంపూర్ణపరివర్తనము కలుగవలయును. విశ్వవికాసమునకు దాంపత్యముతో నారంభ మైన సంసారధర్మము వర్తమానయు

గమున జాతీయతయందు పరిణమించుచున్నది. గృహస్థధర్మముతో నారంభ మైన సంఘసేవ రాజ్యధర్మమునందు వికాసము పొందుచున్నది. గృహపాలనము కుటుంబమునకును కుటుంబము వంశమునకును వంశపాలనము గోత్రమునకును గోత్రపాలనము కులమునకును కులపాలనము జాతీయపాలనమునకును వ్యాప్తి చెందినవి. జీవనసంరంభమున సకలవ్యవస్థలయందును సంయోగము విజయమునకును వియోగము విలయమునకును హేతుభూతము లగుచున్నవి. జీవమహాస్రవంతియందు జీవవికాసమునకు సాధనభూతంబు లైన సకలవ్యవస్థలకు సమ్మేళనము కలుగుచున్నది. ఈ సమ్మేళనము జాతీయతకు ప్రయోజనము. సంసారమునందు వ్యక్తిస్వాతంత్ర్యము రాజ్యమునందు ప్రజాస్వామ్యము వర్తమానయుగధర్మములు. జాతీయబలము పరాక్రమణమునకుఁ గాక స్వయంవికాసమునకును లోకోద్ధరణమునకును వినియోగించుట వర్తమానయుగధర్మ మని విల్సను మహాశయుఁడు లోకమునకు నూతనధర్మము నుపదేశించెను. సకలజాతులు నీశ్వరనిర్దిష్ట మైన సందేశమును లోకమున కుపదేశించి విశ్వవికాసమునకు యథాశక్తిని తోడ్పడుట ప్రవృత్తి ప్రయోజనము. ఏతత్ప్రయోజనప్రాప్తికి చిన్న పెద్ద జాతుల భేదము తెల్ల నల్ల జాతుల భేదము నిరుపయోగము. శ్వేతజాతీయసంభవ మైన జర్మనుజాతీయత లోకమునకు కలిగించిన మహాసంక్షోభము జాతీయాభిమానులకు నేత్రోన్మీలనము చేసినది. గతశతాబ్దియందు ప్రవర్థితం బైన జాతీయత మానవధర్మప్రకాశమునకు ప్రతిబంధక మై మహాసంగ్రామముగ పరిణమించినది. యూరపురాజ్యములందు బలము గల జాతులు జాతీయవ్యాజమున స్వార్థప్రయోజనపరులై పరరాజ్యాపహరణమునకు పూని సంగ్రామాంకురములను నాటినవి. జర్మనులు పోలాండు సైలీషియ షెల్సివిగు ఆల్సేసు లోరేనులను అనాయాసముగ జాతీయవ్యాజమున సంగ్రహించిరి. ప్రజలను వారి ప్రయోజనములకును సంప్రదాయాచారములకును ప్రతికూలముగ నన్యరాజ్యములందు చేర్చిరి. రాజ్యములు ప్రజాక్షేమమున కేర్పడినవను ధర్మమును రూపుమాపి ప్రజలు రాజ్యాధిష్ఠాతల లోభప్రాప్తి కేర్పడి రను ధర్మమును స్థాపించిరి. రాజ్యధర్మము సంపూర్ణముగ వికసించుటకు రాజులు అధికారులు ప్రజాసేవకు లను ధర్మము అన్ని రాజ్యములందును పాలింపఁబడవలయును. వర్తమానయుద్ధము లోకమునందు నిరంకుశాధికారమును నిర్మూలము చేసినది. రుష్యాచక్రవర్తి జర్మను చక్రవర్తి ఆస్ట్రియా చక్రవర్తి రాజ్యభ్రష్టు లైరి. చక్రవర్తులను ప్రజలు పరాభవించిరి. నిరంకుశరాజ్యాధికారదుర్బలము ప్రజాధికారబలము లోకమునకు సువ్యక్త మైనవి. ప్రజాస్వామ్యమును సుస్థిరముగ స్థాపించుటకై జాతిసమితి సమకట్టినది. జాతీయత వికసించుటకు ప్రజాపోషణయోగ్య మైన రాజ్యస్థాపన మవశ్యము. జాతిసమితి ప్రజాపోషణయోగ్యము లైన పోలాండు జాకొస్లావు సైబీరియ మొదలగు నూతనరాజ్యములను నిర్మించినది. ఏకరాజ్యవాసము సామాన్యలాభములు సామాన్యప్రయోజనములు సామాన్యభావాదర్శములు జాతీయతకు లక్షణములుగ పరిగణింపఁబడుచున్నవి. పరార్థపర మైన జాతీయవికాసము లోకకల్యాణమునకు సాధనము. సకలజాతులు తమ యంతశ్శక్తులను వికసింపఁజేసి భక్తిపూర్వకముగ తమ విజ్ఞానసంపదలను మానవకల్యాణమునకు వినియోగించుట జాతీయతకు ప్రయోజనము. అన్ని జాతులకు స్వభావానురూపముగ వికసించుట కవకాశములను కల్పించుటవలన లోకవికాసము సులభసాధ్యము కాఁగలదు. అన్ని జాతులు నీ శుభస్థితిని స్థాపించుటకై తమ విజ్ఞానసామర్థ్యములను వినియోగించి గమ్యస్థానమును చేరుట భగవత్సంకల్పము.

నూతన రాజ్యధర్మము

వర్తమానయుగమునందు ప్రజాక్షేమమున కవశ్యము లైన సకలధర్మములు రాజ్యధర్మమునందు కేంద్రీకృతములు. ప్రజాక్షేమమున కవశ్యము లైన సకలవ్యవస్థలకు రాజ్యము మూలాధారము. పనులు పరిశ్రమలు రాజ్యాధీనములు. రాజ్యము దాత. రాజ్యము ప్రతిగ్రహీత. రాజ్యము ప్రభువు. రాజ్యము సేవకుఁడు. రాజ్యము ప్రజలు. ప్రజలు రాజ్యము. రాజ్యస్వత్వములకు సకలజను లర్హులు. రాజ్యస్వత్వములకు పండితులు పామరులు ధనవంతులు ధనహీనులు యజమానులు పనివాండ్రు స్త్రీలు పురుషులు బ్రాహ్మణులు పంచములు తెల్లజాతులు నల్ల జాతులు సమభాగులు. ఈ భావములు బాగుగ సకలజాతుల పట్లను సమన్వయము పొందినపుడు లోకకల్యాణమును మానవసోదరత్వమును సుసాధ్యములు. భరతఖండమునందు రాజ్యధర్మము బాగుగ వికసించుటకు స్వరాజ్యస్థాపన మవశ్యం బగుచున్నది.

లోకమునందు స్థిరశాంతిని స్థాపించుటకును పరరాజ్యాపహారులను దండించుటకును యుద్ధోపద్రవము నాపుటకును సకలజాతిసమితి స్థాపింపఁబడినది. ఆ సమితియందు గ్రేటుబ్రిటను అమెరికా ఫ్రాన్సు జపాను ఇటలీ ముఖ్యరాజ్యములు. సర్వియా రుమేనియా చీనా బెల్జియము ఇండియ మొదలగునవి అంగరాజ్యములు. ఈ రాజ్యములు శత్రుపక్షమును శాసించుటకు నిర్మించిన నియమములు పరమోపయోగములు, శాంతిస్థాపనకు కాకపోయినను తాత్కాలికపరిస్థితుల కనుకూలములు.

జాతీయసమితి నిర్ణయములు

సంధినియమములు

ఈ నియమముల యుద్దేశములను ఫలింపఁజేయుటకై చేసిన యేర్పాటు లన్ని రాజ్యములకును సంతృప్తిని కలుగఁజేయవు. మహాసంగ్రామము జాతీయధర్మమునకును రాజ్యధర్మమునకును నూతనరూపమునొసంగినది. జాతుల పోషణమునకు రాజ్యము మూలాధారమనియు రాజ్యధర్మసంరక్షణమునకు ప్రజాస్వామ్యము సాధన మనియు నిర్ణయింపఁబడినది. సంగ్రామనిర్వాహణమునకు 5 కోట్ల సైనికులు 5 కోట్ల యనుచరులు రణరంగములందు పాల్గొనియుందురు. రణరంగములందు మహాజనులకు ప్రజలకు కలిగిన సాహచర్యము సామాన్యులందు ప్రత్యభిజ్ఞానమును కలుగఁజేసినది. సామాన్యులు మహారథు లైరి. దండనాయకత్వమను మహాద్భారమును వహించిరి. సామాన్యులలో స్త్రీపురుషులకు రాజ్యనిర్వాహణమునందుఁ గల బలము సువ్యక్త మైనది. రణరంగములందును యుద్ధోపకరణనిర్మాణమునందును లక్షలమంది పని చేసిరి. పరాజితరాజ్యములందు నిరంకుశాధికారనిర్గమనముతో సంఘవిప్లవ మారంభ మైనది. రణరంగములనుండి యాయుధపాణులై స్వస్థలములను చేరిన సైన్యపు నివహములు విచ్చలవిడిగ నాయుధోపజీవనమును చేయుట కవకాశములు కలిగినవి. దేశమునందు సామాన్యజనులకు జీవయాత్ర దుర్లభ మైనది. రణరంగమునందు సైనికులకు జీవయాత్ర సులభమై యుండెను. సైనికులను యుద్ధోన్ముఖులను చేయుటకు సకలసౌకర్యములు కల్పింపఁబడినవి. రణరంగములందు సకాలమునకు తేయాకు రొట్టె ఫలాహారములు భోజనములు సమకూర్పఁబడినవి. స్వస్థలములం దీ స్థితి యంతయు తాఱుమా రైనది. పంటపొలములు బీళ్లయినవి. పంటకాపు లాయుధపాణులైరి. యంత్రాలయములు యుద్ధయంత్రాలయము లైనవి. మారణసామగ్రీనిర్మాణము ముఖ్యపరిశ్రమ మైనది. దేశమునందు సామాన్యులకు తినుట కన్నము లేదు. కట్టుటకు బట్ట లేదు. జీవయాత్ర చేయుటకు వృత్తులు లేవు. ఆయుధపాణులను శాసించుట కధికారబలము లేదు. నిరంకుశాధికారవర్గము నశించినను ధనాధికారము కులీనాధికారము నశింపలేదు. ధర్మాధికారము ప్రతిష్ఠితముగా లేదు. యూరపు రాజ్యములందు సాంఘికసిద్ధాంతములు సంపూర్ణముగ వ్యాపించినవి. సాంఘికసిద్ధాంతములకు మూలాధారము భౌతికభాగ్యభోగముల యనుభోగము. అరాజకమయమై ధర్మరహితమై అధికారాభావ మైన రుష్యా మొదలగు రాజ్యములందు బాల్షివిజము వ్యాపించుటయందు వింత లేదు. బాల్షివిజమునందు దారిద్ర్యమునకు భాగ్యమునకు సామాన్యులకు కులీనులకు కర్మకరులకు యంత్రాధిపతులకు పూర్వవ్యవస్థలకు నూతనాదర్శములకు క్రోధజనిత మైన సంరంభము కలుగుచున్నది. ఈ సంరంభము సహజ మైనను ధర్మబాహ్యము. పాశ్చాత్యరాజ్యధర్మములందే ఈ విప్లవబీజములు గలవు. మహాసంగ్రామము పరాజయము ప్రవర్ధమానం బైన విప్లవబీజములను పల్లవింపఁజేసినవి. విప్లవపల్లవంబులు రుష్యా జర్మనీ హంగరి ఆస్ట్రియ బాల్కను రాష్ట్రములందు వికసించి పుష్పించుచున్నవి. లోకము నీ యుపద్రవమునుండి కాపాడుటకై ధర్మపరులు ప్రయత్నములను చేయుచున్నారు. దైవఘటన యెటు లున్నదియు కాలము నిర్ణయింపఁగలదు.

సంఘవిప్లవము

విజయము పొందిన రాజ్యములం దీ యుపద్రవము విశేషముగ వ్యాపించుట కవకాశములు లేవు. దేశమునందు ప్రజాస్వామ్యము గలదు. సైనికనివహములకు తగిన వృత్తులు కల్పింపఁబడుచున్నవి. వృత్తి లేని విముక్తసైనికులు పోషణభృతిని పొంది జీవయాత్రను సుఖముగఁ గడపుచున్నారు. రాజ్యాంగములం దుదారము లైన మార్పులు జరుగుచున్నవి. వ్యాపారపరిశ్రమాభివృద్ధికి ప్రయత్నములు జరగుచున్నవి. శత్రువులనుండి రాజ్యసంక్రమణము ధనసంక్రమణము గలుగు ననునాశాపాశము ప్రజల కుత్సాహమును కలిగించుచున్నది. అయినను ప్రజాసామాన్యమునం దుద్వేగము కలుగుచున్న దని గతించిన మాసములందు సంభవించిన సమ్మెకట్టులు కలవరములు విశదీకరించుచున్నవి. ఈ యుద్వే

గము రాజ్యధర్మమున సంపూర్ణప్రజాస్వామ్యమును కాలక్రమమున సకలరాజ్యములందు స్థాపించుటకుఁ దోడ్పడు నని యూహించుటకు సూచనలు గలవు. విజయమును పొందిన రాజ్యములందు సామాన్యజనులకు రాజ్యాధికారమును నిర్ణయించుటకు వలయు బలము గలదు. కాని, బలమును తమ యాదర్శాభ్యుదయమునకై వినియోగించుటకు తగిన యంగనిర్మాణము లేదు. సామాన్యజనుల కంగనిర్మాణము లేర్పడినపుడు వారి బల మనివార్యమై లోకమునందు మహాపరివర్తనము కలుగఁగలదు. ఆ మహాపరివర్తనము లోకకల్యాణమున కే విధమున తోడ్పడునదియు ద్వైవాధీనమునందుఁ గలదు. సాంఘికవాదులు ప్రజాస్వామ్యవాదులు బాహుబలమునకును ధనబలమునకును కులీనబలమునకును గల మహాబలమును ఛిద్రము చేసి సర్వబలములను ప్రజాక్షేమమునకై వినియోగించి సత్యయుగమును స్థాపింప సమకట్టుచున్నారు. జనీవాలో కూడిన కార్మికమహాసభయందు జర్మనుల దండనావశ్యకత యంగీకృతమైనను జాతీయసౌభ్రాత్రము మానవసౌభ్రాతృత్వము జాతిసమితికి పరమప్రయోజనము లని యంగీకరింపఁబడినది. స్థిరశాంతిస్థాపనప్రయత్నములందును కార్మికవర్గమునకును అధికారాభిమానవర్గమునకును గల భేదము భావికాలమునందు మహాక్షోభమునకు మూలబీజము కాఁగలదు.

పాలితజాతులందు సంగ్రామము నూతనాశాంకురములను హత్తించినది. యుద్ధనిర్వహణోత్సాహమును కలిగించుటకై రాజ్యతంత్రజ్ఞులు యథేచ్ఛముగ నిరంకుశాధికారనిర్మూలనము ప్రజాస్వామ్యత్వస్థాపనము స్వయంనియంతృత్వము ధర్మసంస్థాపనము మొదలగు భావములను లోకమునకు బోధించిరి. లోకావృతంబైన యాందోళనశక్తి పాలితరాజ్యములకు వ్యాపించినది. ఆందోళన మశాంతిగ పరిణమించినది. అశాంతికి ఆర్థికములు రాజకీయములు సాంఘికములు ధార్మికములు మతవిషయములు కారణములు. ప్రజలకు జీవయాత్ర దుర్భరముగ నున్నది. పాలితజాతులకు నూతన రాజ్యధర్మము లన్వయింపవు. యోధజీవనము నూతన సంఘసమస్యలను కలిగించినది. ధర్మవిజయభావము సందిగ్ధమైనది. మహమ్మదీయులకు మతాధిపత్యరక్షణమునం దావేశము కలిగినది. ఈజిప్టు హిందూదేశములందు సంప్రాప్తము లైన యల్లరుల కీ కారణము లన్నియు తోడ్పడినవి. కూలివాండ్రు సామాన్యముగ "నెత్తిమీఁద మొత్తుము. పొట్టమీఁద మొత్తకుము" అని వేడుచుండురు. ప్రజలకు సుఖజీవన మున్నపుడే విధమైన యశాంతియు కలుగదు. అన్నాతురుల కావేశము సులభముగ కలుగును. వర్తమానకాలమందు కలవరమునకు మూలకారణము కాటకపు ధర లని కార్యకారణవిమర్శనము విశదము చేయుచున్నది.

భరతఖండసమస్యలు వర్తమానయుగమునందు పాలకులకు పాలితులకు మహాసందిగ్ధములుగ నున్నవి.

భారతవర్ష సమస్యలు

బ్రిటీషు రాజ్యాధికారులు భరతఖండమును బాహుబలాధారమున పాలించుచున్నట్టు ప్రకటించుట యాచారము. హెమ్సు ఫర్డుప్రభు వీ సిద్ధాంతము ననుసరించియే రౌలటు శాసనమును సమర్థించినట్టు రాజప్రతినిధికిని గంధి మహాత్మునకును జరిగిన ప్రసంగసారాంశము వ్యక్తము చేయుచున్నది. బ్రిటీషు రాజ్యాధికారులు ధర్మాధారమున భరతఖండమును పాలించెద రని రాజ్యాధిష్ఠాతల ప్రకటనలు స్పష్టము చేయుచున్నవి. విక్టోరియా మహారాజ్ఞి శాసనపత్రమం దిట్లు ప్రకటింపఁబడినది :

"మాకు ఇతరప్రజల పట్లఁ గల బాధ్యత భారతీయులయెడలను గలదు. మే మీ బాధ్యతలను దైవసహాయమున న్యాయముగను విశ్వాసపూర్వకముగను నిర్వహించెదము. విద్యవలనను శీలమువలనను సామర్థ్యమువలనను నుద్యోగనిర్వహణమునకు తగిన ప్రజలు పక్షపాతము లేక ధారాళముగ వారే మతస్థులైనను ఉద్యోగపదవులను పడయఁగలరు."

ఆంగ్లవిద్యావిధానమును భరతఖండమునం దుపక్రమింపఁజేసిన మెకాలే ప్రభువు 1833 నందు బ్రిటీషు పరిపాలనపరిణామము నిట్లు తెలిపెను :

"భారతీయులు బ్రిటీషురాజ్యాధికారులకు దాసానుదాసులై గ్రేటుబ్రిటనున కరియప్పములు కట్టుచుండుటకంటె స్వాతంత్ర్యము గలిగి స్వపరిపాలననిరతు లగుట శ్రేయస్కరము."

దీనబాంధవుఁ డని ప్రసిద్ధి గాంచిన జాన్ బ్రైటు 60 ఏండ్లకు పూర్వము పార్లమెంటు సభయందు చేసిన భారతరాజ్యాంగవర్ణనము వర్తమానకాలమునకును నన్వయించుచున్నది.

"హిందూదేశప్రజలు దుర్భరదారిద్ర్యమునందు మునిఁగియున్నారు. ఆ దేశమునందువలె దుర్భరములును దుస్సహములును నైన పన్నులు లోకమునం దే యితరరాజ్యమునందును లేవు. పోలీసు ఏర్పాటులు న్యాయవిమర్శనము విద్యావిధానము ఆర్థికస్థితి సంతృప్తికరములు గావు."

అరువదేండ్ల బ్రిటీషుపరిపాలనానంతర మీ సమ

స్యలు క్లిష్టము లైనవి. ప్రజల యార్థికదశ క్షీణించుచున్నది. ఏతాదృశము లైన ధర్మప్రతిజ్ఞలను రాజ్యాధిష్ఠాతలు రాజ్యాధికారులు చేసియుండిరి. ప్రతిజ్ఞలు పత్రస్థములై యుండెను. కార్యరూపమును వహింపలేదు. ఈ యరువదేండ్లలోను దేశమునందు ప్రజాపోషణమునకును ప్రజావికాసమునకును నవశ్యంబైన మార్పులు విశేషము జరగలేదను ప్రజాభిప్రాయముతో నధికారులును కొంతవఱ కేకీభవించుచున్నారు. కారణంబు లెవ్వి యైనను వర్తమానకాలమున ప్రజల స్థితి దుర్భరముగ నున్నది. భూమి సిస్తు మితిమీఱి పెరిగినది. ప్రజాదాయము కొంత హెచ్చినను వ్యయాంశమునకు తగిన రీతి నాదాయము పెరుగలేదు. సుఖజీవయాత్రకు విషయలంపటత్వము సాధన మైనది. చేతిపనులు నశించినవి. పరిశ్రమలు వృద్ధి పొందలేదు. విద్య వ్యాపింపలేదు. రక్షకభటుల వాసన హెచ్చినది. ఈ విషమపరిస్థితులందు మహాసంగ్రామము సంప్రాప్త మైనది.

సంగ్రామ ధృక్పథము

ఐరోపా మహాసంగ్రామము సకల వ్యవస్థలను తాఱుమాఱు చేసినది. నల్లజాతుల భారమును మోయుచున్నా మని గర్వించిన పాశ్చాత్యరాజ్యములకు ఆత్మసంరక్షణమున నల్లజాతుల సహాయ మవశ్యం బైనది. భరతవర్ష భారమును వహించుచున్నా మని యుప్పొంగిన బ్రిటీషు ద్వీపములకు భారతీయుల సహాయ మవశ్యంబైనది. భారతీయయోధులు మార్నె యుద్ధమునందు జర్మనులను పరాజితులను చేసి వారి యవక్రపరాక్రమమును యూరపుఖండవాసులకు వెల్లడిచేసిరి. యుద్ధకాలము విలంబమైన కొలఁది సైన్యబలము ధనబలము సామగ్రిబలము మిత్రమండలి కవశ్యం బైనవి. ముప్పదికోట్ల ప్రజలును అపార మైన సహజసంపదలును కలిగియున్న భరతఖండపు నిశ్చేష్టత్వ మాంగ్లరాజనీతిజ్ఞులకు హృద్గతం బైనది. భారతీయుల నిశ్చేష్టతకు కారణము బ్రిటీషురాజ్యాధికారుల రాజ్యనీతి యని రాజ్యనీతిజ్ఞులు గ్రహించిరి. యుద్ధనిర్వాహణమునకు భారతీయులను ప్రోత్సాహ పఱచుటకై రాజ్యనీతి మార్చుట యవశ్య మని రాజ్యనీతిజ్ఞులు గ్రహించిరి. రాజ్యాంగ సంస్కరణములు భరతఖండాభ్యుదయమునకే కాక బ్రిటీషు సామ్రాజ్యరక్షణమునకును ననుకూలము లను భావము రాజనీతిజ్ఞులకు స్ఫురించినది. హిందూదేశమంత్రి **1917-వ సంవత్సరము ఆగస్టు 20-వ తేదిని** ప్రకటించిన ప్రకటన కిదియే ప్రయోజనము.

ఆ ప్రయోజనముల ననుసరించి గతసంవత్సరమునందు మోంటేగు షమ్సుఫర్డు గార్లు తమ సంస్కరణ విధానమును ప్రకటించిరి. వారి సంస్కరణవిధానమే పక్షమువారికిని తృప్తిని కలుగఁజేయలే దని గతసంవత్సరమునందు వర్ధిల్లిన యాందోళనము వ్యక్తము చేయుచున్నది. ఆంగ్లోహైందవులు రాజ్యాంగసంస్కరణములు విప్లవమునకు కారణంబు లగు నని ఘోషించుట కుపక్రమించిరి. జాతీయవాదులు బాధ్యతాయుతపాలనాంకురములు లే వని యాందోళనము చేసిరి. రాష్ట్రప్రభుత్వములు ససేమిరా యని సంస్కరణములకు విముఖత్వము చూపినవి. రాజ్యాంగసంస్కరణముల యుపయోగానుపయోగములను నిర్ణయము చేయుటకు సంస్కరణముల సద్యఃఫలమును గ్రహించుట యవశ్యము.

సంఘజీవనము

రాజకీయార్థికసాంఘికవ్యవస్థలకు ప్రయోజనము సంఘజీవనవికాసము. సుఖజీవనము గల ప్రజల కే యాందోళనమును సరిపడదు. కలిగిన దాని ననుభవించుచు వారు సుఖముగ కాలము గడపుదురు. సకలసమస్యలును తుద కార్థిక సమస్యయందు విరామము నొందుచున్నవి. పరరాజ్యాక్రమణమునకు వ్యాపారవ్యాపనమునకు నిమిత్తము ధనార్జనము. ఐరోపాసంగ్రామమునకు మూలబీజ మార్థిక మని గ్రాహ్య మగుచున్నది. యూరపు రాజ్యములందు భోగాభిలాష హెచ్చినది. భోగ్యపదార్థలాభమునకై వివిధరాజ్యములందు పోటీ యేర్పడినది. సంగ్రామము సంభవించినది. సంగ్రామ ముపశమించినను మూలకారణ ముపశమింపనంతవఱకు సంగ్రామాంకురములు నశింపవు. పాశ్చాత్యరాజ్యములందు వ్యాప్తం బగుచున్న సంఘవిప్లవము కలహమునకు మూలకారణ మార్థిక మని రుజువు చేయుచున్నది. రుష్యాదేశమందు ప్రజలకు తినుటకన్న మున్న విప్లవకారులకు తమ భావవ్యాపనమున కవకాశము లుండియుండవు. భరతఖండమునందును ప్రజల దుర్దశకు మొదటి కారణ మార్థిక మని కన్నులు తెఱచి చూచువారు గ్రహింపఁగలరు. నిమ్నజాతుల దుర్దశకు కారణము వారి గర్భదారిద్ర్యము, పరమాజ్ఞానము. విద్యావివేకవంతులు పంచము లైనను సన్మానమును పడయుచున్నారు. సన్మానమునకు పాత్రుఁడు కాకపోయినను సుఖజీవనము గల పంచముఁ డితరుల ప్రమేయము లేకుండ సుఖముగ జీవయాత్ర గడపఁగలఁడు. దేశము

నందు గర్భదరిద్రులు నిమ్నజాతులందును నితరకులములందును గలరు. వర్తమానవాణిజ్యయుగమునందు ధనగౌరవము సకలగౌరవములను జయించి విజయధ్వానమును పూరించుచున్నది. కులము విద్య ధర్మము మతము ధనమున కరియప్పములు కట్టుచున్నవి. నిర్ధనులు మృతప్రాయులు. నిర్ధనులకు సుఖము లేదు, గౌరవము లేదు. మహాకవి భర్తృహరి వర్ణించిన ధనప్రభావము వర్తమానవ్యాపారయుగమునందు వేయిరెట్లు వెలుంగుచున్నది. తలకు 200 రూప్యములను గడించెడి బ్రిటీషు ప్రజలయం దార్థికపరిస్థితులు దుర్భరములుగ నున్నపుడు తలకు ముప్పది రూప్యముల నార్జించెడి భారతీయుల పరిస్థితులు వర్ణించుట యనావశ్యము. శ్రీదేవివలె వాగ్దేవియు భారతీయులను చిన్నిచిన్ని చూపులతో చూచుచున్నది. ప్రజలయందు విద్యాసంపదలను వ్యాపింపఁజేసి వారి సుఖమును సంరక్షించుట రాజ్యాంగసంస్కరణములకు ప్రయోజనము. ఇంతవఱకీ ప్రయోజన మధికారివర్గము సాధింపలేదని అధికారుల చేష్టలు చెప్పక చెప్పుచున్నవి.

ప్రజల సుఖజీవనమునకు పరిశ్రమలు ముఖ్యసాధనములుగ నున్నవి. పరిశ్రమల నిర్మాణమునకు వలయు సాధనంబులు గల దేశమందు పరిశ్రమలు పాడుపడినవి. దేశము జనాకీర్ణము. ప్రజలు వంశానుగతములైన వృత్తులందు ప్రవీణులు. దేశము విద్యుచ్ఛక్తినిర్మాణమున కవశ్యంబైన జలాధారంబులతో నిండియున్నది. ఇంతవఱకును ప్రభుత్వము పరిశ్రమల విషయమై ప్రమేయము కల్పించుకొనలేదని పారిశ్రామికపంచాయతీ * నివేదికము తెలుపుచున్నది.

సభ్యులు యోచించిన విషయములు

1. ద్రవ్యమును లాభకరముగ వ్యాపారములందును పరిశ్రమలందును వినియోగించుట కవకాశములు గలవా? 2. అవకాశము లున్నయెడల పరిశ్రమాభ్యుదయమునకు ప్రభుత్వ మేరీతిని తోడ్పడవలయును? క. సాంకేతికవిజ్ఞానమును సమకూర్చియా? చ. ఆదర్శకపరిశ్రమాలయములను స్థాపించియా? ట. పరిశ్రమలకు ప్రత్యక్షముగఁగాని పరోక్షముగఁగాని ధనసహాయమును చేయవలయునా? త. ప్రస్తుతము గల యార్థికనీతికి విరుద్ధము గాని యే యితరమార్గమునైన నవలంబించుట కవకాశము గలదా?

ప్రభుత్వ మవలంబించుచున్న యార్థికనీతియు సాంకేతికపారిశ్రామికవిద్యావిధానమును విచారణాంశములు గావు. పంచాయతీసభ విషయవిచారణ చేసి గతించిన యక్టోబరు మాసమునందు నివేదికను ప్రకటించినది.

“భరతఖండమునందు సహజపదార్థములు గలవు. పరిశ్రమల కనుకూలములైన పరిస్థితులు గలవు. కాని, కార్యసిద్ధి కవశ్యములైన సాధనములు లేవు. ద్రవ్యోపపత్తి లేదు. కర్మకౌశలము లేదు. విద్వాంసులకు కర్మవృత్తులయం దభిరుచి లేదు. సకలనిర్మాణవస్తువులకు దేశము శాంతికాలమునందు పరదేశములమీఁద నాధారపడి యున్నది. యుద్ధసమయమునం దీ పరాధీనస్థితి మహోపద్రవమునకు కారణం బగుచున్నది. ఈ యుపద్రవమునుండి దేశమును కాపాడుటకై ప్రభుత్వము పారిశ్రామికశాఖను స్థాపింపవలయును. ఆ శాఖ యంగోపాంగములు గలిగి పరిశ్రమలను స్థాపించి పోషించుటకై గట్టిప్రయత్నములను చేయవలయును. ఈ కార్యమును సాధించుటకై యారంభమందు 151 లక్షలు వ్యయము చేయవలయును. ప్రతి యేటను 86 లక్షలు ఏడేండ్లవఱకును వ్యయము చేయవలయును.”

ఇవి పంచాయతీ సభ చేసిన నిర్ణయములకు సారాంశము. పండిత మదనమోహన మాలవ్యా గారు ప్రత్యేకనివేదనమును ప్రకటించిరి. అందు పారిశ్రామిక శాఖానిర్మాణమును పూర్తిగ ఖండించిరి. పరిశ్రమపండితులను నియమించి కార్యమును సాధించుట ప్రయోజనకర మనియు శాఖానిర్మాణ మనర్థదాయక మనియు మాలవ్యగారు నిరాఘాటముగ తెలిపిరి.

యుద్ధము పరిసమాప్తి నొందిన తరువాత నీ విషయమునందు యుద్ధసమయమునఁ గల పట్టుదల యుండునని తోఁచదు. పరిశ్రమసమస్యయందు ద్రవ్యార్జనసమస్యయే కాక యారోగ్యనైతికసమస్యలు చేరియున్నవి. యూరపుఖండమునందువలె పరిశ్రమలకు నిలయములైన పట్టణంబులను నిర్మించుటవలన మద్యపానము వ్యభిచారము రోగములు వ్యాపించి మరణములు హెచ్చి ధర్మము చెడునని రాధాకమల ముకర్జీ గారు చేసిన హితోపదేశములను పరిశ్రమాభ్యుదయమును గోరువారు గమనింపవలసియుందురు. ద్రవ్యోపార్జనమునకై మనుజు లాత్మప్రత్యయము లేక కీలుబొమ్మలవలె పని చేయుట మానవవికాసమునకు ప్రతి

* పారిశ్రామిక పంచాయతీసభకు అధ్యక్షుడు సర్ థామసు హాలెండు. చాటర్టను గారు, సర్ ఫజుల్ భాయి కరీంభాయి ఇబ్రాహిమ్, ఇ. హాప్కిన్సను గారు, సి. ఐ. ఇ., పండిత మదనమోహన మాలవ్య గారు, సర్ ముకర్జి, సర్ హారిసు ప్లంకెటు, ఎఫ్. ఎచ్. స్టుఅర్టు గారు, సర్ దోరాబ్జితాతా. ప్లంకెటు గారు హాప్కిన్సను గారు ననారోగ్యమువలన పనిని చూడలేదు.

కూలము. యంత్రసంవిధానమునందు బుద్ధిమాంద్యము దేహజాడ్యము ఇంద్రియనిర్లేపత్వము సంభవములు. పరిశ్రమాభ్యుదయమునకై యున్న దేశవాసులీ నరకకూపమున పడకుండ చూడవలయును. ప్రజలు దారిద్ర్యము నుండి తరించుటకు గృహపరిశ్రమలు సాధనములు గాని పెద్ద పరిశ్రమలు సాధనములు గావు. బీద దేశములందు గృహపరిశ్రమలు చేతిపనులు సంసారధర్మమును కాపాడుచు జీవయాత్రను గడపుటకును నాత్మవికాసమును చేయుటకును సాధనంబులుగ నుండఁగలవు. గృహపరిశ్రమలు జనసమ్మర్దము గల యంత్రాలయములకును పట్టణంబులకును సాధనంబులు గావు. గృహపరిశ్రమలందు ప్రజలకు సౌజన్యము ప్రేమ ప్రియబంధుసాహచర్యము గలిగి ప్రజల శీలము వికసించును. పరిశ్రమాలయముల వలన కలుగఁగల యనర్థములను కోలారుపట్టణము బొంబయినగరము బోధించుచున్నవి. ఆత్మవినాశనమునకు లోనగుచు లోకసామ్రాజ్యమును గడించుట నిరర్థకము. సిరిసంపదలు గుణశీలములు వృద్ధి పొందునట్లు పరిశ్రమలను వృద్ధి చేసి ప్రజాశీలమును సంరక్షించుటకై పాలకులు ప్రజలు పాటుపడి దేశమును సన్నిహితోపద్రవమునుండి కాపాడుట శ్రేయస్కరము.

సర్ శంకరంనాయరు గారు వ్రాసిన ప్రత్యేకనివేదికమునందు పరిశ్రమశాఖను ప్రజాయత్తవిషయమును చేయవలయు నని నిర్ణయించుచు తెలిపిన కారణంబులు పరిశీలనార్హములు.

“ఇతరవృత్తులు నశించినందున నందఱకు వ్యవసాయము ముఖ్యవృత్తి యైనది. సంరంభమునందు జీవనపోషణము దుర్ఘటంబైనది. దేశమునందు ప్రబలిన యశాంతికిని నసంతృప్తికిని పాలకుల తాటస్థ్యము మూలము. మే మాంగ్లేయులు పరిశ్రమలను నిర్వహింపవలయు నని కోరుదుము. కాని, స్వదేశపరిశ్రమల వినాశమును మేము కోరము. స్వదేశపరిశ్రమలు భారతీయమంత్రిసంరక్షణము లేక వృద్ధి పొందవు. ఆంగ్లేయులు పెద్ద పరిశ్రమల నారంభించినపుడు భారతీయులకు పరిశ్రమలను నిర్వహించుట కవకాశము ఉండవు.”

శంకరంనాయరు గారి వాదమునందలి సత్యమును మన దేశపరిశ్రమల విలయము వ్యక్తము చేయుచున్నది. లోకమునం దంతటను వన్నెకెక్కిన పరిశ్రమలు పాశ్చాత్యుల పోటీకి నిలువలేక నశించినవి. బ్రిటీషుసామ్రాజ్యము వ్యాపారమునందు సంరక్షకనీతి నవలంబించుటకు పూనుకొనినది. సంరక్షణపద్ధతియందు భరతఖండమునకు స్వాతంత్ర్యము లేనియెడల ప్రజాస్థితి దుర్భరమగును. ప్రజల సుఖస్థితికి పరిశ్రమల వికాసము, ముఖ్యముగ చేతిపనుల యభివృద్ధి, యవశ్యము.

రాజ్యాంగసంస్కరణములు

వర్తమానయుగమునందు ప్రజాపోషణమునకును ప్రజావికాసమునకును రాజ్యధర్మావలంబనము మూలాధార మను సిద్ధాంతమును రాజ్యనీతిజ్ఞులు నమ్ముచున్నారు. లోకావృతంబైన రాజ్యధర్మావలంబనము భారతీయులకును స్వయంపోషణమున కవశ్యంబైనది. భారతీయుల రాజ్యాంగాందోళనమునకు వారి తరణమే ప్రయోజనము. ఈ ప్రయోజనమును బడయుటకు భారతీయనాయకులు జాతీయమహాసభను స్థాపించి ముప్పదిమూఁడేండ్లనుండి తత్ఫలప్రాప్తికై పాటుపడుచున్నారు. ఐరోపా మహాసంగ్రామము సకలజాతులకు నుద్బోధమును గలిగించినది. రాజనీతిజ్ఞులీ యుద్బోధనమున కవలంబనము నొసంగి ఆశాంకురంబులను పల్లవింపఁజేసిరి. జాతీయమహాసభ ప్రారంభమునుండియు “ప్రజల యోగక్షేమములకు ప్రాతినిధ్యపరిపాలన మవశ్యము” అని ఘోషించినది. ఇరువదిరెండవ మహాసభలో వలసరాజ్యములందుఁ గల స్వపరిపాలనవిధానమును భరతఖండమునందును స్థాపింపవలయును” అని తీర్మానింపఁబడినది. గతించిన ముప్పదిరెండేండ్లయందును జాతీయమహాసభ ప్రజల నీ గమ్యస్థానమును చేర్చుటకై పాలకవర్గమున కనేకమార్గములను సూచించినది. భూమిసిస్తు నిర్బంధోచితవిద్య ఉప్పు పన్ను అధికారవిభజనము పంచాయతులు ఆయుధశాసనము మొదలగు విషయములకు సంబంధించిన తీర్మానములు జాతీయమహాసభయందు గతించిన ముప్పదియేండ్లలోను విరామము లేక చర్చింపఁబడినవి. కాని, జాతీయమహాసభాచారిత్రమును పరిశీలించినపుడు కలిగిన ప్రయోజనమత్యల్ప మని విశద మగుచున్నది. జాతీయమహాసభకుఁ గలిగిన బల మధికారప్రతిఘటనమును వృద్ధి చేసినది. అధికారుల ప్రతిఘటనసామర్థ్యము నాపుటకు భారతీయులకు బాధ్యతాయుతపాలనము నొసంగుట యవశ్యమగుచున్నది. ఐరోపామహాసంగ్రామము బ్రిటీషు రాజనీతిజ్ఞుల దృక్పథంబును మార్చినది. భారతీయులం దుద్వేగమును గలిగించినది. హిందూదేశమంత్రి మాంటేగూ గారు 1917-వ సంవత్సరము ఆగస్టునందు చేసిన ప్రసంగము భారతీయులకు సంతృప్తిని కలుగఁజేసినది. ఆ ప్రసంగమునందు 1. బాధ్యతాయుత పాలనమును

క్రమముగ స్థాపించుట బ్రిటీషురాజ్యనీతి యనియు 2. వెంటనె బాధ్యతాయుతపరిపాలన సాంశమును ఒసఁగవలయు ననియు 3. గమ్యస్థానమును క్రమముగ చేరవలయు ననియు తెలుపఁబడినది. ఈ యుద్దేశములను సఫలము చేయుటకై గతసంవత్సరమునందు మాంటేగు చెమ్సుఫర్డు సంస్కరణవిధానము ప్రచురింపఁబడినది. ఆ రాజ్యాంగవిధానమునకు ద్వంద్వాధికారము కీలకము. భారతీయులకు రాజ్యమునందు పెత్తనము నిచ్చుట కాంగ్లాధికారివర్గ మంగీకరించుట యసంభవము. కాని, ఆగస్టు ప్రకటనము ననుసరించి వెంటనే కొంత పెత్తనము నిచ్చుట యవశ్యము. మాంటేగూ గారి మాట చెల్లవలయును. అధికారివర్గమున కాగ్రహము కలిగింపఁజనదు. ప్రజలకు సంతృప్తిని కలుగఁజేయవలయును. అందఱకును తృప్తిని కలుగఁజేయుటకై యేర్పడిన మోంటుఫర్డు విధాన మెవరికిని సంతృప్తిని కలుగఁజేయలేదు. విధానము తీవ్రమైన ఖండనములకు పాలై దేశమునందాందోళనమును కలిగించినది.

మాంటుఫర్డు విధానము

సంస్కరణవిధానమునందు ప్రస్తుతవిధానమును సంస్కరణావశ్యకతయు నిట్లు వర్ణింపఁబడినవి:

"ఇపుడు గల పాలనవిధానమునందు పూర్వము గల సద్విధానము గాని వలయు నూతనవిధానము గాని లేదు. ఆంగ్లేయ అమెరికను రాజ్యతంత్రజ్ఞుల స్వయంనిర్ధారణసిద్ధాంతము భారతరాజ్యాంగాభిప్రాయముల కుద్వేగమును కలిగించి స్వరాజ్యాకాంక్షకు బలచైతన్యముల నొసఁగినది."

రాజ్యాంగసంస్కరణావశ్యకతను విధానము విస్పష్టముగ నంగీకరించుచున్నది. కాని, క్లిష్టమైన రాజ్యాంగనిర్మాణమును సంస్కరించుట దుర్లభముగ నున్నది. హిందూదేశరాజ్యాంగములను సంస్కరించుటకు నాలుగంతరములు గలవు. మొదటి యంతరము బ్రిటీషు పార్లమెంటు. పార్లమెంటునకు రాజ్యాంగములను సంస్కరించుటకు సంపూర్ణాధికారము గలదు. పార్లమెంటునందు భారతీయులకు ప్రవేశము లేదు. పార్లమెంటు మన దేశపరిపాలనమునందు విశేషమైన ప్రమేయమును కల్పించుకొనుట లేదు. ఈ విషయమై మోంటుఫర్డు విధానము గాని హిందూదేశప్రభుత్వసందేశము గాని యేమియు సూచించుట లేదు. విచారణాంశము కాకపోవుటయు నధికారము లేకపోవుటయు ముఖ్యకారణములు. సామ్రాజ్యరాజ్యాంగ నిర్మాణము విమర్శింపఁబడునపుడు భరతఖండమునకును పార్లమెంటునందు యథార్థమైన ప్రాతినిధ్యము కలుగవలసియున్నది. రాజ్యాంగసంస్కరణముల పరిమితి నీ క్రింది వాక్యములు తెలుపుచున్నవి:

" హిందూదేశప్రభుత్వమునందును రాష్ట్రప్రభుత్వములందును స్థానికసంస్థాపనలందును సూచితములైన మార్పులు కార్యరూపమును దాల్చిన కొలఁది ఆ పరిపాలనములమీఁద భారతరాజ్యాంగమంత్రియు పార్లమెంటును తమ నియంత్రణాధికారమును శిథిలము చేయవలయును. "

మంత్రిసభయందు హిందూదేశాధికార మంతయు కేంద్రీకృతమై యున్నది. మంత్రికి పరిపాలనాధికారమును నిర్ణయించుటయందు విశేషాధికారము గలదు. మంత్రి పార్లమెంటునకును బ్రిటీషు ప్రజలకును బాధ్యుఁడు గాని హిందూదేశప్రభుత్వమునకును ప్రజలకును బాధ్యుఁడు గాఁడు. మంత్రి సామాన్యముగ సర్వాధికారము కలిగియున్నాఁడు. ఈ యధికారమును నియమించుటకు మంత్రి వేతనమును బ్రిటీషురాజ్యాదాయము భరింపవలయు నని కాంగ్రెసు-లీగు చేసిన తీర్మానమును మోంటుఫర్డువిధాన మంగీకరించుచున్నది. మంత్రిసభను సంస్కరించుట యవశ్య మని యందఱు నంగీకరించుచున్నారు. ఈ విషయమును నిర్ణయించుట కేర్పడిన యుపసంఘ మింకను నివేదికను సిద్ధము చేయలేదు. మంత్రిసభయందు భారతీయసభ్యులు సగముమంది యైన నుండుటయు వారు ప్రజాప్రతినిధులుగ నుండుటయు సభోపయోగమును విస్తరింపఁజేయుట కవశ్యము.

భారతప్రభుత్వము

" సత్పరిపాలనమునకును శాంతికిని రక్షణమునకును సమాహితార్థికపాలనమునకును బాధ్యత వహించు టావశ్యక మని ఇండియా ప్రభుత్వము నిర్ణయించిన సకలవిషయములందును ఆ ప్రభుత్వమునకు నిర్వివాదాధికార ముండితీరవలయును. "

ఇండియాప్రభుత్వమున కింతకు పూర్వము గల నిరంకుశశీలమునే సంస్కరణప్రణాళికయు తిరిగి

ఇండియాప్రభుత్వము

స్థాపించుచున్నది. నిరంకుశాధికార దుర్గసంరక్షణమునకై సంస్కరణవిధానమునందు బహువిధములైన యావరణంబులు కల్పింపఁబడినవి. ఆ యావరణంబులను భేదించుటకును బాధ్యతాయుతపాలనస్థానమును చేరుటకును సాధనంబు లేవియు లేవు. సామ్రాజ్యప్రభుత్వమునం

దే విధ మైన పెత్తనమును కల్పించుటకు వీలు లే దని మాంటుఫోర్డు విధానము నిర్ణయించినది.

"అధికారదశాసంరక్షణము స్థిరీకరణము ఆవశ్యకము. ఇండియా ప్రభుత్వము కోరిన శాసనములనుసకలసందర్భములందును నిర్మించుటకుఁగాను హిందూదేశరాజ్యాంగమునకు పరిపాటి యైన యధికారసభ్యబలసంరక్షణపద్ధతి నవలంబించుట యవశ్య మని మన స్ఫూర్తిగ నిశ్చయించితిమి."

అని ధారాళముగ నిండియా ప్రభుత్వమునందు బాధ్యత యనుచిత మని మాంటుఫర్డు ప్రణాళిక నిర్ణయించినది. ఇండియా ప్రభుత్వాధికారసంరక్షణమునకై రాజ్యసభానిర్మాణము సూచింపఁబడినది. రాజ్యసభ ప్రధానశాసనసభగ పరిగణింపఁబడుచున్నది. మహాశాసనసభ నిరాకరించిన శాసనములను రాజ్యసభ నిర్మింపఁగలదు. మఱియు, గవర్నరు జనరలు పూర్వము వలెనె ఆర్డినెన్సులను రెగ్యులేషనులను చేసెడి యధికారము కలిగియున్నాఁడు. కార్యనిర్వాహకసభయందు హైందవసభ్యుల సంఖ్యను హెచ్చు చేసినను భారతీయుల కార్థికశాసనవిషయములందు పెత్తనము కలుగదు. మహాసభయందు ప్రజాప్రతినిధుల సంఖ్యను హెచ్చించినను శాసననిర్మాణాధికారము లేని మహాసభ చర్చలకు వితండవాదములకు పూర్వమువలెనే నిలయ మగును. కాని, ప్రజలు బాధ్యతను వహించుటకు సాధనము గాదు. సామ్రాజ్యప్రభుత్వమునం దధికారబలసంరక్షణ మవశ్యం బైనను రాష్ట్రములందైనను స్వపరిపాలనవిధానమును మాంటుఫర్డువిధానము సూచించుట లేదు. గత సంవత్సరమునందు దేశములో రాజకీయాందోళన మీ విషయమున కేంద్రీకృతమై స్పర్ధలకు నిందలకు విభేదములకు కారణంబుగ నున్నది.

రాష్ట్రపాలనము

బాధ్యతాయుతపరిపాలనము క్రమవికాసపరిణామము పొందుటకు ప్రథమప్రయత్నములను చేయుటకు రాష్ట్రములు క్షేత్రములు. రాష్ట్రములందు వెంటనే కొంత బాధ్యతను కలుగఁజేయవలయును. స్థితిగతులు అనుకూల మైనతోడనే సంపూర్ణబాధ్యతను కలుగఁజేయుట మా లక్ష్యము. ఇందువలన ఇండియా ప్రభుత్వము నుండి ఆ ప్రభుత్వము స్వకీయబాధ్యతల నిర్వహణమున కనువగు విధమున ఆర్థికపాలనము నందును శాసనవిషయము లందును విశేష మైన స్వాతంత్ర్యమును వెంటనే రాష్ట్రములకు కలుగజేయుట యవసర మగుచున్నది.

మాంటుఫర్డువిధానము ఆగస్టు ప్రకటనను సమన్వయము చేయుటకై రాష్ట్రములందు బాధ్యతాయుత

రాష్ట్రీయస్వపరిపాలనము

పాలనాంశమును కల్పించుటకు సమకట్టినది. హిందూదేశమంత్రియు ఇండియాప్రభుత్వమును తమ యధికారమునుండి కొంత భాగమును రాష్ట్రముల వశము చేయుదురు. ఆ యధికారమునందు కొంత భాగము మంత్రుల వశము చేయఁబడును. ఈ పెత్తనమే మనకు వెంటనే కలుగఁగల బాధ్యతాయుతపాలనాంశము, రాజ్యాంగవిధానరూపమున నిర్ణయింపఁబడినది. ద్వైరాజ్యాంగవిధానమువలన కేంద్రీకృతాధికారము క్రమముగ నిలువుగ పంచఁబడును. హిందూదేశమంత్రియందును ఇండియా ప్రభుత్వమునందును కేంద్రీకృత మైన యధికారము క్రమముగ రాష్ట్రప్రభుత్వాధీనము చేయఁబడి రాష్ట్రప్రభుత్వాధికారమును మంత్రుల ద్వారా ప్రజాధీనము చేయవలయు నని నిర్ణయింపఁబడినది. ఇంతవఱకు రాష్ట్రములకుఁ గల యధికారమును విస్తృతము చేసి ఆ యధికారమునందు కొంత భాగము మంత్రుల వశము చేయుట మాంటుఫర్డు విధానమునకు ఫలము. మంత్రుల వశ మే విషయములను చేయవలయు నను విషయమును గుఱించి వాదప్రతివాదములు ప్రబలినవి. జాతీయవాదులు భారతప్రభుత్వమునందు "శాంతికిని సంరక్షణమునకును న్యాయమునకును" సంబంధించిన విషయములు గాక శేషించిన విషయము లన్నియు ప్రజాయత్తములుగ నుండవలయు ననియు రాష్ట్రప్రభుత్వములందు సకలవిషయములు ప్రజాయత్తములుగ నుండవలయు ననియు ప్రతిపాదించిరి. మితవాదులు రాష్ట్రములందు "శాంతికిని సంరక్షణమునకును న్యాయమునకును" సంబంధించిన విషయములు గాక శేషించిన విషయము లన్నియు ప్రజాయత్తములుగ నుండవలయు నని నిర్ణయించిరి. బొంబయియందు హసను ఇమాము గారధ్యక్షుఁడుగా జరిగిన ప్రత్యేక జాతీయమహాసభాసమావేశమునందు పండిత మదనమోహన మాలవ్యగా రుపపాదించిన యీ క్రింది తీర్మానమును సభ్యు లేకగ్రీవముగ నామోదించిరి.

భారతప్రభుత్వము

రాష్ట్రీయ దొరతనమునందువలె ఇండియా దొరతనమునందు గూడ ప్రజాపాలితశాఖలును ప్రత్యేకశాఖలు నుండవలెను. ప్రత్యేకితశాఖలలో విదేశ (అధినివేశములు తప్ప) సేన-నౌకాదళ-ఇండియా సంస్థానములు, ఇదివరకు వివరింపబడిన మినహాయింపులకు లోబడి శాంతి నెమ్మది దేశరక్షణములకు ప్రత్యక్షముగ సంబంధించిన విష

యములుమాత్ర మ్ముండవలెను. తక్కినవన్నియును ప్రజాపాలితశాఖలుగా నుండవలెను. ప్రత్యేకితవిషయములకు కావలసినసొమ్మును ముఖ్యముగా ముందు సమకూర్చవలెను. ఆర్థికపత్రమునకు రాష్ట్రీయ విధానమే వర్తింపవలెను.

శాసనములన్నియు బిల్లులమూలముగా నామోదితములు కావలెను. శాసనసభవారు నామోదింపనిచో దొరతనమువారి కవసరమని తోచినచో రిస్యూలేషనులద్వారా గవర్నరు జనరలుగా రొకవత్సరము వఱకును పని సాగింపవచ్చును. పిమ్మట శాసనసభకు వచ్చినవారిలో 100-కి 40 కంటె అనుకూలించినగాని మరల ననుసరింపగూడదు. స్టేటు కౌన్సి లుండగూడదు. ఉండితీరవలెనందురేని ఆసభలో సగము మందికి లెక్కవకాకుండ నియోజితు లుండవలెను. సర్టిఫికెట్లపద్ధతి ప్రత్యేకితశాఖలకు మాత్రమె వర్తింపవలెను. ప్రత్యేకితశాఖలకు సంబంధించిన కార్యనిర్వాహకసభ్యు లొకరికంటె హెచ్చుగానుండిన సగముమంది భారతీయులుగా నుండవలెను. సామ్రాజ్యశాసనసభలో 150 మంది సభ్యు లుండవలెను. వారిలో 120 మంది నియోజితు లుండవలెను (అనగా 4/5 వంతు). అధ్యక్షుని ఉపాధ్యక్షుని సభవారే నియోజించుకొనవలెను. సభానిబంధనలను చేయుటకును సవరించుటకును సభవారికే అధికార ముండవలెను. గవర్నరు జనరలు అనుమతి అవసరములేదు. నిర్ణీతకాలములందు గాని, కొంతమంది సభ్యులు కోరినపుడు గాని శాసనసభలను జరుపుట కేర్పాటు జరుగవలెను. 15 సంవత్సరములలోపున ఇండియాదేశమునం దంతటను సంపూర్ణ బాధ్యతాయుతపరిపాలనము నేర్పరుచుటకు ఖరారు జరుగవలెను.

రాష్ట్రీయకార్యనిర్వాహకసభలు

ప్రత్యేకితశాఖలు లేనిసభ్యులు కార్యనిర్వాహకసభలలో నుండగూడదు. సంస్కరణానుసారముగ క్రొత్తసభ లేర్పడినది మొదలు మంత్రులు శాసనసభలకు బాధ్యులగుట ప్రారంభము కావలెను. ప్రత్యేకితశాఖల సభ్యులకు గల గౌరవమును జీతమును మంత్రులకు గూడ నుండవలెను. ప్రత్యేకితశాఖలకు చేరిన కార్యనిర్వాహకసభ్యు లొకరికంటె హెచ్చుగా నున్నచో వారిలో కనీసము సగముమంది భారతీయులుగా నుండవలెను. ఆర్థికపత్రము శాసనసభలచే నామోదింపబడవలెను. ఇండియాదొరతనమువారికి కొంతసొమ్మియ్యబడవలెను. మొదటిసంఘముల నియోజనకాలము ముగియువరకును ప్రత్యేకితశాఖలకు కొంతసొమ్మియ్యబడవలెను. క్రొత్తపన్నులు వేయబడవలసివచ్చినచో ప్రత్యేకితప్రజాపాలితశాఖల కన్నిటికిని కలిపి రాష్ట్రీయప్రభుత్వమువారిచే వేయబడవలెను.

రాష్ట్రీయశాసనసభలు

సంపూర్ణ రాష్ట్రీయ స్వపరిపాలనమునకు దేశీయులు సమర్థులుగ నున్నారని నిర్ధారణచేయుచు అనవసరమగు చర్చను తొలగించుటకును ఆలస్యమును రద్దుపఱచుటకును 6 సంవత్సరములవఱకు శాసననిర్మాణ న్యాయవిచారణ (చెఱసాలలు తప్ప) పోలీసుశాఖలను కార్యనిర్వాహకసంఘములకు వదలుట కీ కాంగ్రెసువారు నిశ్చయించిరి. కార్యనిర్వాహకన్యాయవిచారణాధికారములను వెంటనే వేఱుచేయవలెను. అధ్యక్షుడును ఉపాధ్యక్షుడును నియోజితులుగా నుండవలెను. గ్రాండుకమిటీల నేర్పఱుపగూడదు. రాష్ట్రీయప్రభుత్వమునకు సంబంధించిన యన్నివిషయములను గూర్చియు రాష్ట్రీయశాసనసభవారు శాసనములను చేయు నధికారమును కలిగియుండవలెను. శాసనరచన పోలీసు న్యాయవిచారణలనుగూర్చి కూడ వారి కధికార ముండవలెను. శాసనసభవారి పరిష్కారము గవర్నమెంటువారికి తృప్తికరము కానిచో వారు ఇండియా గవర్నమెంటువారికి వ్రాయవలెను. వారు ఇండియాశాసనసభలో నుపపాదించి మామూలుచర్చ ననుసరింపవలెను. గ్రాండుకమిటీ నేర్పఱచుచో ఆ సంఘమునందలి సభ్యులలో సగము మందిని శాసనసభవారు నియోజింపవలెను. శాసనసభలో నియోజిత సభ్యులు 4/5 వంతుగా నుండెను. సామ్రాజ్యరాష్ట్రీయశాసన స్టేటు సభలను విరమించునపుడు గవర్నరు జనరలును గవర్నరును మరల మూడు నెలలలోపున సమావేశములు జరుగున ట్లేర్పాటుచేయవలెను. నియోజకులకు విజ్ఞాపనమూలముగా శాసనసభలను విరమింపగూడదు. లిఖితములుగా మంత్రుల సంతకములతోగూడ ప్రకటింపబడవలెను.

పార్లమెంటు: ఇండియాకార్యాలయము

ఇండియామంత్రిసంఘమును తీసివేయవలెను. ఇద్దరు సహాయ కార్యదర్శులను స్థిరముగా నేర్పఱుపవలెను. వారిలో నొకరు భారతీయుడుగా నుండవలెను. ఆ కార్యాలయపు సిబ్బందివిషయములు ఆంగ్లదేశ ప్రభుత్వమువారిచేతనే పరిష్కరింపబడవలెను. నియోజితవర్గములకు రాష్ట్రీయప్రభుత్వముల ప్రత్యేకితశాఖలవారు బాధ్యులగువఱకును వారి కెట్టి ఆర్థికపరిపాలనాధికారములను గూడ నీయగూడదు. ఇండియా మంత్రిసంఘమును గూర్చి ఆలోచించుట కేర్పఱుపబడిన సంఘమునందు తగినంతమంది భారతీయు లుండవలెను.

సాంఘిక ప్రాతినిధ్యము

అన్ని శాసనసభలలోను మహమ్మదీయ ప్రాతినిధ్యము కాంగ్రెసు-లీగు నివేదికను ననుసరించియుండవలెను.

ఇతరవిషయములు

ఆర్థికవిషయములందు సంపూర్ణాధికార ముండవలెను. రాష్ట్రీయ దొరతనములు ఇండియాదొరతనమువారి కియ్యవలసిన ధనమును గూర్చి ఢిల్లీకాంగ్రెసు జరుగులోపల రాష్ట్రీయ కాంగ్రెసులవారు తెలుపుటకు కోరబడవలెను.

గుంటూరు పురమునందు కాశీనాథుని నాగేశ్వరరావు గారి యాధిపత్యమున జరగిన ప్రత్యేకాంధ్రరాష్ట్రీయసభాసమావేశమునందు మా. బయ్యా నరసింహేశ్వరశర్మ గారుపపాదించిన యీ క్రింది సంస్కరణపు తీర్మాన మధికసంఖ్యాకులచే నామోదింపఁబడినది.

భారతదేశ ప్రభుత్వము

1. అంతర్దేశీయ విషయములందు హైందవ శాసననిర్మాణసభలకు సంపూర్ణాధికారము కలుగజేయుచు కాంగ్రెసులీగువారు జేసిన విధానమును యీసభవారు తిరుగ ధ్రువపఱచుచున్నారు.

2. హైందవభూమికిని బ్రిటిషుసామ్రాజ్యమునకును, క్షేమ లాభములు కలుగుటకు భారతీయజనుల సామర్థ్యము, బుద్ధికుశలత, రాజభక్తి వీనియందు దొరతనమువారికి పూర్ణమైనవిశ్వాస ముండు టయే యుక్తమగు రాజ్యపద్ధతియని యీసభవారు అభిప్రాయము తెలుపుచు, బ్రిటిషుసామ్రాజ్యముయొక్క పునర్నిర్మాణమునకు ముందే భారతీయులకు అంతర్దేశీయ వ్యవహారములలో పూర్ణమైన స్వపరిపాల నాధికార మియ్యతగుననియు నియ్యవలయు ననియు, పదిసంవత్సర ముల లోపలనే సామ్రాజ్యములో పూర్ణమైన బాధ్యతాయుత స్వపరి పాలన మిచ్చులాగున శాసనమూలకముగ నిష్కర్ష చేయవలయు నని యును కోరుచున్నారు.

3. ఈదేశములో ఏర్పడగల నియోజకవర్గములకు తగిన సామ ర్థ్యమును, అనుభవమును లేవని యెంచి వానికిని జాతిమతముల ననుస రించిన భేదములకును మాంటాగ్యు-షెమ్సుఫర్డు నివేదికయందు, అనవ సరమును అనుచితము నగు ప్రాముఖ్యము నిచ్చినందుకును మఱియు నీ దేశీయులయొక్క అనాదిసిద్ధమగు నాగరికతయు, సూక్ష్మబుద్ధియు, మేధాశక్తియు, స్వపరిపాలనార్హతయు, మూలప్రయోజనములం దైక్యతయు, తత్పరిజ్ఞానమును నివేదికకర్తలు, క్రమముగ గ్రహించ నందునకు యీసభవారు వగచుచున్నారు.

4. హిందూదేశప్రభుత్వమునందు కొంత యధికారమును బ్రిటి షు పార్లమెంటువారు కొంతకాలము తమయందే యుంచుకొన నిశ్చ యించునెడల యీ మధ్యదశను పురస్కరించుకొని నిర్దేశింపబడిన మాంటేగ్యూ-షెమ్సుఫర్డు ప్రణాళిక యీ క్రిందచూపిన మార్పులు లేనిది సంతృప్తికరముగ గాని గ్రాహ్యముగ గాని యుండజాలదని యీసభవారు అభిప్రాయపడుచున్నారు:

(ఎ) సేన, నావికాదళము మొదలగు మిలిటరీ వ్యవహార ములయందును, పరరాష్ట్రీయ స్వదేశసంస్థాన సంబంధములయందును, అఖండమగు శాసనాధికారము ఇండియా ప్రభుత్వమున కుండవలెను.

(బి) సేనానావికాదళము మొదలగు మిలిటరీవిషయమునకును, స్వదేశ సంస్థానములకును పరరాష్ట్రములకును చెందిన వ్యవహారము తో సంబంధించిన విషయములలో ఇండియా ప్రభుత్వమువారికిని సామ్రాజ్య శాసననిర్మాణ సభవారికిని, అభిప్రాయభేదము కలిగి నప్పుడుమాత్రమే, ప్రణాళికయందు వివరింపబడిన సర్టిఫికెట్టు విధాన మును అమలులో పెట్టదగును. సంపూర్ణ స్వపరిపాలనాధికారము సమకూడుటకులోపల పరివర్తన కాలములోమాత్రమే యీ సర్టిఫికెట్టు విధానము అమలులో నుండవలయును. మఱి యే యితరసంబంధము లందును స్టేటు కౌన్సిలు వారికి ప్రత్యేకశాసననిర్మాణాధికారము ఉండగూడదు.

(సి) సేన, నౌకాసేన, అన్యదేశ వ్యవహారములు వీని కావశ్యక మైన ద్రవ్యమును సిద్ధపరచవలసిన బాధ్యతకులోబడి ఇండియా గవర్న మెంటుయొక్క అన్ని ఆర్థికవిషయములయందును ఇండియా శాసన సభలకు సంపూర్ణమైన స్వాతంత్ర్యము కలిగియుండవలెను.

(డి) పైకార్యములకు ఆవశ్యకమైన ద్రవ్యమును ఏవిధముగా చేర్చవలె నను పద్ధతులుమాత్రము ఇండియా శాసనసభలవారి యధీన మందుమాత్రమే యుండవలసినది.

ఇండియాదొరతనమువారి కార్యనిర్వాహక సభ్యులలో సగము మందికి తక్కువ కాకుండ ఇండియను లుండవలెను.

(ఇ) పార్లమెంటు అండరు సెక్రిటరీలకు పోలిన యుద్యోగస్థు లను ఏర్పఱచుటయందు శాసనసభ్యులలో ప్రజలవలన ఎన్నుకొన బడినవారినుండి నియమించవలసి యున్నది.

(ఎఫ్) ఇండియా ఆఫీసును త్రోసివేయవలసినది. అప్రకారము గాక ఆ ఆఫీసును యింకను నిలిపెడయెడల ఆ సభాసభ్యులలో సగము కన్న యెక్కువమంది ఇండియా శాసనసభలవలన నెన్నుకొనబడిన వారుగ నుండవలెను.

(జి) పార్లమెంటు అండరు సెక్రిటరీలలో ఒకరు ఇండియను గా నుండవలెను.

(హెచ్) పార్లమెంటులో ఇండియాదేశపు విషయములను తెలుపుటకై ఇండియాదేశమునకు తగిన ప్రాతినిధ్యము ఉండుటకై తగుమైన ఏర్పాట్లు చేయవలెను.

(ఐ) ప్రాథమిక విద్యావ్యాపన మత్యంతావశ్యకము గాన మన దేశపు ఆదాయమునుండి దేశరక్షణము తోపాటు ప్రాథమిక విద్యా వ్యాపనమునకు గావలసిన ద్రవ్యము పయిలేను మొదట తీసియుంచ వలెను.

(జె) దేహస్వాతంత్ర్యము వాక్స్వాతంత్ర్యము వార్తాపత్రి కల స్వాతంత్ర్యము, ఆయుధములు ధరించుట, ఏ అపరాధమునకైన న్యాయసభలలో బహిరంగముగ విచారణ జరిపించుమని గోరు హక్కు, అట్టివిచారణ జరిగి, నేరస్థుడని స్థాపింపకయే యెవరైన నిర్బంధింపబడినపుడు, అట్టివారిని నిర్బంధవిముక్తిని జేయుమని న్యాయ సభలను గోరుట, పైన విచారించిన యీ మొదలైన నాగరికప్రజల కుండవలసిన ప్రాథమిక స్వతంత్రముల సంరక్షించుటకై తగిన ఏర్పాట్లు చట్టములో పొందుపఱచవలెను.

(కె) కమిషను యుద్యోగములుసహా అన్ని శాఖల సైనికోద్యో గములయందును యేలాటి తారతమ్యములు పాటించక ఇండియనులను బహుసంఖ్యాకులుగ చేర్చికొనవలెను.

(ఎల్) పౌరసేవోద్యోగులకు జీతములు బత్తెములు యెక్కువ చేయవలయు నను కలహాకు అసమ్మతిని తెలుపుచున్నది. ఇప్పటికే వారి జీతములు, బత్తెములు, పెన్షనులు, ప్రపంచమునం దెచ్చటను లేనంత హెచ్చుగా నున్నవి. హిందూదేశమువంటి బీదదేశమునకు భరింపరానివిగా నున్నవి.

(ఎమ్) మన దేశములోని అన్ని శాఖలయందలి ఉత్తమోద్యోగ ములయందు అధమపక్షము సగభాగము భారతీయు లుండవలెను.

(ఎన్) కార్యనిర్వాహక సభలో సగమునకు కొఱతబడని సభ్యు లు భారతీయులై శాసనసభయందలి యెన్నిక సభ్యులనుండి యెన్ను కొనబడినవారుగ నుండవలయును.

(ఒ) స్టేటు కౌన్సిలులో సగమునకు కొఱతబడని సభ్యులు

ఎన్నుకొనబడిన అనధికారసభ్యులై యుండవలయును.

రాష్ట్రీయప్రభుత్వము

(ఏ) శాసన, న్యాయ, పోలీసు విషయములతో గూడిన రాష్ట్రీయ ప్రభుత్వాధీనమగు విషయములను గూర్చి రాష్ట్రీయశాసనసభవారే శాసింపవలయును. శాసన న్యాయ పోలీసు విషయముల గూర్చిన రాష్ట్రీయ శాసనసభాతీర్మానముతో గవర్నరుగారేకీభవించినప్పుడు ఆయా విషయములగూర్చి గవర్నరుగారిండియా ప్రభుత్వమువారికి మనవిజేయ నర్హులు. ఇండియా గవర్నమెంటువారీవిషయమును గూర్చి సామ్రాజ్యశాసనసభకు నివేదింపవచ్చును. అట్లు నివేదించిన పిమ్మట సామాన్యపద్ధతుల ననుసరించియే వ్యవహారము చక్కపెట్టబడును. రాజప్రతినిధిగారికి సామ్రాజ్యసభాతీర్మానము అసంతృప్తికరముగ నున్నచో, ఆ విషయమును గూర్చి పార్లమెంటులోని అట్టి విషయదర్శకై నియోగింపబడిన యొక యుపసంఘమునకు యీ విషయమును నివేదింపవచ్చును. పార్లమెంటు సభవారి యెదుటనుంచు పద్ధతికి లోబడి ఆ యుపసంఘమువారి తీర్మానము ననుసరించి నిర్ధారణము చేయవలయును. ఇంతలో రాజప్రతినిధిగారు ఆర్డినెన్సులను జేయు హక్కును యుపయోగించుట కర్హులై యున్నారు.

(బి) చెన్నపురి రాష్ట్రీయసభలో 10 లక్షలకు 5 గురు చొప్పున 250 మంది సభ్యు లుండవలయును. అందులో 5 యింట నాలుగుపాళ్లు యెన్నికవలన జరుగునదై యుండవలయును. ఈ ఎన్నికలలో స్త్రీలుగూడ ప్రాతినిధ్యమును ఎన్ని కార్హత్వమును పొంది యున్నారు.

(సి) రాష్ట్రములు భాషల ననుసరించి విభజింపబడవలెను.

(డి) శాసనసభకు యెన్నుకొనబడిన అధ్యక్షు లుండవలయును. శాంగ్యనిబంధనలను నిర్మాణముజేయగల హక్కు శాసనసభదై యున్నది. అట్టి నిర్మాణములను గవర్నరుగారు వీటోజేయుటకు వీలులేదు. గ్రాండుకమిటీ రద్దు చేయబడవలయును.

(ఇ) ప్రణాళికలో నియమింపబడిన గ్రాండుకమిటి పద్ధతిని రద్దుపరుపవలెను.

(ఎఫ్) 1917, 1918 సంవత్సరములలో శాసన, న్యాయ సంరక్షణ పోలీసుశాఖలకు గాను వ్యయపెట్టబడిన సొమ్మునకు సరియగు మొత్తము ఆ శాఖలనిమిత్తము ప్రత్యేకముగ విడదీసిపెట్టు షరతునకు లోబడి రాష్ట్రీయ శాసనసభవారికి ఆయవ్యయముల పట్టికతో సహా ఆయవ్యయ వ్యవహారములలో సంపూర్ణమగు అధికార ముండవలయును.

(జి) రాష్ట్రీయ కార్యనిర్వాహక ప్రభుత్వమునందు గవర్నరు నలుగురు సభ్యు లుండవలెను. అధికారమును బాధ్యతయు లేని సభ్యు లుండరాదు. శాసన, న్యాయ, పోలీసుసభ్యులు గాక మిగిలినవారిని శాసనసభలో ప్రజానియమిత సభ్యులనుండి గవర్నరు నియమింపవలెను. ఈ సభ్యులు శాసననిర్మాణసభకు బద్ధులై యుండవలెను. వారివేతనములు ఆదాయవ్యయ విమర్శలోనికి రావలెను.

న్యాయ, పోలీసుసభ్యుని గవర్నరు కాలనిర్ణయముతో నియమించవలెను.

(ఎచ్) మాంటాగ్యూ-షమ్సుఫర్డు రిపోర్టు నందు సామ్రాజ్యాదాయముల అంచనా మిక్కిలి తక్కువగా వేయబడిన దనియు 1917-18-వ సంవత్సరపు ఆదాయవ్యయముల పట్టిక ననుసరించుట లోపభూయిష్ఠ మనియు, ఆ సంవత్సరపు పునర్విమర్శిత పట్టిక ప్రకారము కోటి యిరువదిలక్షల పౌనులు ఆదాయము ఎక్కువగా వచ్చుచున్న దనియు, రాష్ట్రముల కట్టుపడి ద్రవ్యమును కట్టవలసిన పని లేదనియు ఎట్లయినను ఉపక్రమింపబడిన కట్టుబడిన ద్రవ్యమును మితిమీరియున్న దనియు,

(ఐ) (క) కట్టుబడి ద్రవ్యవిషయమున రాష్ట్రములకు పరస్పరసంబంధములు న్యాయములుగా లేదనియు, ఆయా రాష్ట్రీయ ప్రజాసంఖ్యను మొత్తము ఆదాయమును బట్టి యీ కట్టుబడి ద్రవ్యము ఏర్పడవలసిన దనియు, పరివర్తన దశయందు ఈ దామాషాకు పైబడి తీసికొను ద్రవ్యము అప్పుగా నాలోచింపవలసిన దనియు,

(జె) మద్రాసు రాజధాని తన కుచితమగు కట్టుబడి ద్రవ్యమునకు మించి యిప్పటికే 80 కోట్లరూపాయలు ఎక్కువగ నిచ్చిన దనియు, అందువలన బీదవడిన దనియు, ఈ కష్టమును యింకను సాగనిచ్చుట యన్యాయ మనియు, ఈ సభవారు తీర్మానించుచున్నారు.

(కె) హైందవ శాసననిర్మాణసభలలో రాష్ట్రములకు ప్రాతినిధ్యము వానివాని జనసంఖ్యకు దగినరీతి నుండవలెను. కౌన్సిలు ఆఫ్ స్టేటులో సామ్రాజ్యకోశమునకు చెల్లించు మొత్తము ననుసరించి యుండవలెను.

ఢిల్లీ నగరమునందు పండిత మదనమోహన మాలవ్య గారి యధ్యక్షతను గూడిన 33-వ జాతీయ మహాసభయందు రాష్ట్రములందు సంపూర్ణస్వపరిపాలనము వెంటనే స్థాపింపవలయు నను తీర్మాన మధికసంఖ్యాకులచే నామోదిత మైనది. ఢిల్లీ నగరమునందు జాతీయమహాసభలో ప్రతినిధులు ప్రేక్షకులు చూపిన యుత్సాహోద్వేగము లనుపమానములు. మహాసభకు ప్రతినిధులు 6,000 ప్రేక్షకులు 10,000 వచ్చి యుందురు. సభ్యుల యుత్సాహము దేశము నావరించిన యుత్సాహమునకు నిదర్శనము.

భిన్నాభిప్రాయములు

సంస్కరణవిధానము ప్రబల మైన యాందోళనమునకు కారణం బైనది. ఇంతవఱకును మౌనముద్ర వహించుచుండినవా రిందఱు రాజ్యాంగ విధానము పట్ల నభిప్రాయములను వ్యక్తము చేయుట కుపక్రమించిరి. అధికారి శాసనవర్గము ఆంగ్లోహైందవవర్గము సంస్కరణమునకు ప్రతి

ఘటనభావమును ప్రకటించిరి. వారు భారతీయులు స్వపరిపాలనమున కనర్హు లనియు ప్రజల యోగక్షేమముల కాంగ్లేయులు బాధ్యు లనియు మామూలు పాటలను పాడిరి. భారతీయులందు జాతీయవాదులు స్వరాజ్యవాదులు మితవాదులు స్తిమితవాదులు మొదలగు పక్షము లేర్పడినవి. ఒక పక్షమువా రిచ్చినదానితో తృప్తి నొందుదురు. ఒక పక్షమువా రింకను నధికముగ కోరుదురు. ఒక పక్షమువారు రాష్ట్రీయస్వపరిపాలనమును కోరుదురు. ఒక పక్షమువారు శాంతికి రక్షణమునకు న్యాయమునకు నవశ్యమైన విషయములందుఁ గాక శేషించిన విషయములందు రాష్ట్రములకు సంపూర్ణాధికారమును కోరుదురు. ఈ భేదాభిప్రాయములు వితండవాదములకు కారణంబులై ప్రజాభిప్రాయములకు దుర్బలత్వము కలిగించినవి. భారతప్రభుత్వము ప్రజాభిప్రాయములను చెవిఁబెట్టక నిర్ణీతమార్గము నవలంబించి సంక్షోభమున కవకాశములను కలుగఁజేసినది.

రౌలటు చట్టములు

ఒక చేత నిగ్రహము వేఱొక చేత ననుగ్రహము చూపుట యాంగ్లరాజనీతి. మోర్లీమింటో సమయము నందువలె నిపుడును మోంటేగుఛమ్స్ఫర్డు కాలమునందును నిగ్రహానుగ్రహనీతి యవలంబింపఁబడుచున్నది. భారతీయ ప్రభుత్వము సంస్కరణప్రణాళికతోఁ బాటు రౌలటు చట్టమును సిద్ధము చేసినది. ప్రజలయందు పాలకవర్గమునకుఁ గల విశ్వాసాభావమే రౌలటు బిల్లులకు కీలకము. దేశమునందు రాజద్రోహు లున్నను ప్రజల జన్మస్వాత్వములను మూలచ్ఛేదము చేయఁగల శాసనము శాంతి సంరక్షణమునకు ప్రయోజనకరము గాదు. రౌలటు బిల్లులు రాజద్రోహులను శిక్షించుట కేర్పడిన వని యందఱు నెఱుఁగుదురు. ముప్పదిమూఁడుకోట్ల ప్రజలయందు 1,000 మంది రాజద్రోహు లుండవచ్చును. వేయిమందికొఱకు 33 కోట్ల ప్రజలకు బంధకములను కల్పించుట రాజనీతి కాదు. రౌలటుబిల్లును బోలిన బంధకశాసనములు నాగరకత గల యే యితరదేశమందును లేవు. రాజద్రోహపు దోషస్థులను శిక్షించుటకు సామాన్యశాసనములు చాలకపోయినపుడు గవర్నరు జనరలునకు రెగ్యులేషనులను ఆర్డినెన్సులను చేయుట కధికారము గలదు. రౌలటుబిల్లును తలదాఁటిన ప్రచండాస్త్రములు పాలకుల శాసనాగారమునందుఁ గలవు. పంజాబునందు పాలకులు ప్రయోగించిన శాసనపరంపరలీ యర్థమును ప్రతిపాదించుచున్నవి. రౌలటుబిల్లులు వాడుకయం దున్న న్యాయవిమర్శనపద్ధతిని తాఱుమాఱు చేయుచున్నవి. దోషస్థాపనము చేసెడి భారము దోషారోపకులమీఁదఁ గలదు కాని దోషారోపితులమీఁద నుండదు. రౌలటుచట్టపు ప్రకరణము రుజువు భారమును దోషారోపితులయం దుంచుచున్నది. అనుమానము గలవారిని వారంటు లేకయే బంధింపవచ్చును. రాజద్రోహమునకు నిర్వచనము చేయలేదు. అధికారులకు భయభ్రాంతి కలిగినపుడు సామాన్యకృత్యములు సయితము ద్రోహముగ పరిగణింపఁబడు నని పంజాబునందలి ఓడ్వయరు గారి చర్యలు రుజువు చేయుచున్నవి. శాసన మే ప్రదేశమునందైనను వాడుకకు వచ్చుటకు గవర్నరు జనరలు సమ్మతి యవశ్యంబైనను నట్టి సమ్మతి సులభమని ఇటీవల జరిగిన మార్షలు లా ప్రచారము వ్యక్తము చేయుచున్నది. శాసనము తాత్కాలికమైనను సులభముగ స్థిరత్వమును గాంచఁగలదు. భారతీయు లందఱు నేకగ్రీవముగ ఖండించినను సామ్రాజ్యశాసన సభ్యులు ప్రతిఘటించినను అధికారులు నిర్లక్ష్యముగ రౌలటు చట్టమును శాసించి ప్రజలయందు ప్రబలమైన యశాంతిని కలుగఁజేసిరి. ప్రజల జన్మస్వాత్వములను మూలచ్ఛేదము చేయఁగల రౌలటు చట్టము నే భారతీయుఁడును ఆమోదింపఁ డని పాలకులు గ్రహించుట ధర్మము. కాని, సామతంత్రమును పాలకులు వర్తమానోద్దీపితదశయం దవలంబించుట యసంభవము. ఈ తంత్రావలంబనము ప్రతిభ సిద్ధాంతమునకు విరుద్ధము గదా! అధికారివర్గము భారతీయాభిప్రాయముల నెంత చులుకగ చూచునదియు రౌలటు చట్టపు చరిత్రము బోధించుచున్నది. అధికారులకును రౌలటు చట్టపు చరిత్రము గుణపాఠమును నేర్పినది. నోరు లేని భారతీయులును ప్రతిఘటనభావమును వ్యక్తము చేసి అధికారుల సర్వజ్ఞత్వవ్యామోహమును బాపఁగలిగిరి.

సంస్కరణ ఖండనము

అన్ని పక్షములవారు సంస్కరణవిధానమును ఖండించిరి. బొంబయియందు కూడిన మితవాదినాయకుల సభయు సంస్కరణవిధానమును తీవ్రముగ ఖండించినది. భారతప్రభుత్వమునం దే మాత్రము బాధ్యతను కల్పింపని సంస్కరణ ప్రణాళిక ఆగస్టు ప్రకటనమును విఫలము చేయుచున్నది. ద్విరాజ్యాంగపద్ధతి ప్రయోగసాధ్యము కాదు. మంత్రుల స్థితి దుర్భరముగ నుండును.

మహోపసంఘములు విచ్ఛేదాధికారము ధ్రువపత్రాధికారము సమర్థాధికారము గవర్నరుల నిరంకుశాధికారమును సంపూర్ణముగ సంరక్షించుచున్నవి. మండల సభలు రాష్ట్రసభలు జాతీయమహాసభ మహమ్మదీయ సభ మోంటుఫర్డు సంస్కరణ విధానమును ఖండించుచు నవశ్యంబైన మార్పులను సూచించినవి.

ఆంగ్లో హైందవులు సంస్కరణప్రణాలిక బ్రిటీషు సామ్రాజ్యవిచ్ఛేదమునకు సాధనం బని ఘోషించుట కుపక్రమించిరి. యూరపియనుల సంఘము లింగ్లాండునందును ఇండియాయందును దండయాత్రకు పూనుకొనినవి. భారతీయులు స్వపరిపాలనాంశమునకైనను నసర్హులని ఆంగ్లోహైందవపత్రికలు చాటినవి. మోంటేగు యూధుఁ డని నిందించినవి. భారతీయులకు రాజద్రోహమును బోల్షివిజమును ఆరోపించినవి. మితవాదులను బుజ్జగించి హెచ్చరించినవి. అధికారివర్గమునకు దౌర్జన్యదండయాత్రను బోధించినవి. సైడెన్హాము వెల్బివర్గ మవలంబించిన కుతంత్ర మాంగ్లేయులకును అసహ్యము కలిగించినది. నాయరువర్గము వెల్బివర్గమునకు ప్రక్కతాళము వేసినది. పౌరసేవోద్యోగులు ప్రతిఘటనము ప్రకటించిరి. ఈ విషమపరిస్థితులందు సంస్కరణము లుదారములుగ నుండుట దుర్లభము. సింహాప్రభువు మోంటేగు గారు సంస్కరణప్రణాలికను సమర్థింపఁబూనుకొనుట కీ విషమపరిస్థితియే కారణంబుగ నున్నది.

ఆంగ్లో హైందవులు

రాష్ట్రాధికారులు సామాన్యముగ మోంటుఫర్డు విధానమునకు విముఖత్వమును చూపిరి. బీహారు వంగ రాష్ట్రాధికారులు సవరణలతో ద్విరాజ్యాంగసిద్ధాంతము నామోదించిరి. బొంబయి రాష్ట్రాధికారులు నూతన విధానమును సూచించిరి. ఇతరరాష్ట్రాధికారులు ముఖ్యముగ పంజాబురాష్ట్రాధికారులు భారతీయులు బాధ్యతాయుతపాలనమున కనర్హు లని తెలియఁజేసిరి. భారతీయుల వేదాంతము వారిని ప్రజాస్వామ్యస్వపరిపాలనమున కనర్హులను చేయుచున్న దనియు బ్రాహ్మణులు సర్వాధికారము నపహరించెద రనియు నిమ్నజాతులను బ్రాహ్మణులు బ్రాహ్మణేతరద్విజులు పీడించెద రనియు సర్ అలెగ్జాండరు కార్ద్యూ గారు తెలిపిరి. కొంచమను గారు చెన్నరాష్ట్రమునకు ద్విరాజ్యాంగపద్ధతి యనుకూల మనియు ప్రజాయత్తవిషయము లేవియు నుండఁజన దనియు తెలిపిరి. పెంట్లండు ప్రభువు గారును సంస్కరణముల పట్ల విముఖత్వమును తెలిపిరి. చెన్నరాష్ట్రప్రభుత్వము బ్రాహ్మణబలవిచ్ఛేదమును సాంఘికప్రాతినిధ్యమును శాసనసభావిస్తరణమును కోరుచున్నది. మోంటుఫర్డువిధానమునకే స్వాగతము కలుగనపుడు చెన్నరాష్ట్రాధికారుల విధానమును విమర్శించుట యనావశ్యకము. చెన్నరాష్ట్రాధికారులు బ్రాహ్మణభయవ్యాజమున నాంగ్లేయులకు సహజమైన యుదారప్రకృతిని పరిత్యజించుట సంతాపకరము.

రాష్ట్రాధికారుల మతము

మోంటుఫర్డువిధానము భారతప్రభుత్వముతో సంప్రతించి సిద్ధము చేయఁబడినను భారతప్రభుత్వము వేఱొకసంకుచితవిధానమునుసిద్ధము చేయుట విచిత్రముగ నున్నది. భారతప్రభుత్వము వారిసిఫారసులను రాష్ట్రాధీశుల సిఫారసులనుచేర్చి ఇండియాప్రభుత్వమువారు పెద్దగ్రంధమును ప్రకటించిరి. దానిననుసరించి భారతప్రభుత్వమునందే విధమైన పెత్తనమునుకలుగఁజేయఁబడను. రాజ్యాంగ మంతయు నధికారాయత్తమైయుండవలయును. ముఖ్యరాష్ట్రపాలకులు ముగ్గురు మాత్రమే హిందూదేశమంత్రితో ప్రత్యక్షముగ వ్యవహారములను నడుపుకొనవచ్చును. బర్మాకు గవర్నరు ఉండఁజనదు. ఇతరరాష్ట్రముల గవర్నరులుగ పౌరసేవోద్యోగు లుండ నర్హులు. రాష్ట్రములందు గవర్నరులకు సంపూర్ణముగ నిరంకుశాధికారము నిలిచియుండును. మంత్రులను నియమించుటకును తీసివేయుటకును గవర్నరున కధికారముండవలయును. మంత్రుల జీతము సంఖ్య గవర్నరు సంప్రతించి నిర్ణయించును. మంత్రుల జీతము ప్రజాయత్తశాఖ భరింపవలయును. ప్రజావిశ్వాసము లేని మంత్రి రాజీనామా నీయవలయును. రాజీనామా నీయనపుడు గవర్నరు మంత్రులను తీసివేయవచ్చును. ఇతరులు మంత్రులుగనుండుట కంగీకరించనపుడు శాసనసభావిచ్ఛేదముచేయఁబడును. అపుడును మంత్రులు కుదురనపుడు గవర్నరు ప్రజాయత్తశాఖలను పాలించి ఆ శాఖలను స్వాయత్తశాఖలనుగా చేయవచ్చును. కార్యనిర్వాహకసభయం దిరువురు యూరపియను లుండవలయును. వారికి జీతము హెచ్చుగ నుండవలయును. మంత్రులకు ప్రత్యేకబాధ్యత యుండవలయును గాని సంయుక్తబాధ్యత యుండఁజనదు. అర్థనిర్ణయములం దీ విధానము మఱింత విచిత్రముగ నున్నది. రెండు శాఖలకు కోశ

ఇండియా ప్రభుత్వమతము

మొకటిగ నుండవలయును. కార్యదర్శి మంత్రికి విరుద్ధముగ గవర్నరుతో సంప్రతింపవచ్చును. ఉభయశాఖల యాయవ్యయములను పరిశీలించి వాని యాఁయవ్యయములను నిర్ధారణ చేయవలయును. శాసనసభకు ఒక శాఖయొక్క వ్యయమును తగ్గించి రెండవ శాఖ వ్యయమును హెచ్చింపుట కధికారము లేదు. పౌరసేవోద్యోగులు మూఁడు తరగతులుగ విభజింపఁబడిరి. వారి స్వత్వ రక్షణమున కేర్పాటులు చేయఁబడినవి.

మాంటుఫర్డువిధానము ద్విరాజ్యాంగపద్ధతియందైనను నేకరాజ్యాంగవిధానము నవలంబింపవలయునని నిర్ణయించినది. భారతప్రభుత్వము రాజ్యాంగమును భేదించి ఉన్నతశాఖను ప్రభుత్వాధీనమునందును అధమశాఖను ప్రజాధీనమునందును ఉంచుటకు నిశ్చయించినది. మంత్రుల కారంభమునందే తమ మంత్రిత్వము నిస్సారముగ నుండఁగలదు. మంత్రుల కధికారముండదు. గౌరవ ముండదు. సాధనసంపత్తి కలుగదు. ఉన్నతోద్యోగస్థులు మంత్రులను లక్ష్యము చేయరు. ప్రజలు నిందించెదరు. అధికారులు ధిక్కరించెదరు. మోంటుఫర్డు విధానమును ఖండించిన భారతీయులు భారతప్రభుత్వవిధానమును ఆమోదింపఁజాలరు. ప్రజలను చీలఁదీసి పాలించుట యాంగ్లాధికారుల రాజనీతియని ఈ విధానము విస్పష్టము చేయుచున్నది. ఇండియా ప్రభుత్వము సూచించిన విధానమునందు ఆగస్టు ప్రకటన కనుకూల మగు బాధ్యతాయుతపాలనాంశ మెంత గలదో వారే తెలుపుటకు సమర్థులు. విషయవిభజనవిధానముతో సమన్వయము చేసినపుడు మొదట కనఁబడిన మెఱుఁగు పోయి బాధ్యతాయుతపాలనాంశము నిజమైన రంగులతో గోచరము కాఁగలదు.

సౌతుబరో యుపసంఘమువారి నివేదికమునందాంగ్ల ప్రజలకుఁ గల సహజమైన యుదారస్వభావము

సౌతుబరో నివేదికము

ప్రతిబింబించుచున్నది. నియోజకవర్గము విశాలము చేయఁబడినది. చెన్నరాష్ట్రమునందు 5,42,000 నియోజకు లుండఁగలరు. నియోజకులకు భూమిసిస్తు వృత్తిపన్ను ఇంటిపన్ను ఆదాయపుపన్ను యోగ్యతలుగ నిర్ణయింపఁబడినవి. నియోజకులు ప్రత్యక్షపద్ధతి ననుసరించి ప్రతినిధుల నెన్నుకొనియెదరు. చెన్నరాష్ట్రశాసనసభయందు 120 సభ్యులు సూచింపఁబడిరి. అందు ప్రజాప్రతినిధులు 93 గురు నిమ్నజాతిప్రభృతుల ప్రతినిధులు 6గురు అధికారులు అధికారనిర్వాచితులు 19గురు నిర్ణయింపఁబడిరి. సామ్రాజ్యశాసనసభానిర్మాణమునందును ఉపసంఘముదారస్వభావమును వ్యక్తము చేసినది.

విషయవిభజనమునందుపసంఘపు నిర్ణయములు భారతీయుల యాకాంక్షల కనురూపములు గాకపోయినను ఉదారములని చెప్పవచ్చును. ప్రజాయత్తవిషయములందు స్థానికస్వపరిపాలనము వైద్యము వైద్యవిద్య పారిశుద్ధ్యము విద్యావిధానము రాష్ట్రీయమందిరములు పరపతిసంఘములు మద్యములు వ్యవసాయము సైనికేతరములైన రాజమార్గములు బ్రాన్చి రైలు మార్గములు ట్రాములు పశువైద్యము మత్స్యపాలనము మొదలగునవి చేర్పఁబడినవి. పరిశ్రమలను భూమిసిస్తును రాష్ట్రీయవిషయములుగ నుపసంఘము నిర్ణయించినది. భారతప్రభుత్వ మీవిషయములు భారతవిషయములుగనే యుండవలయునని చేసిన నిర్ణయము సంకుచిత మని విశదము కాఁగలదు.

భారతప్రభుత్వవిధానమునందుఁ గల కుతంత్రమును ఖండించుచు సర్ శంకరంనాయరు వ్రాసిన నివేది

శంకరంనాయరు ఖండనము

కముజాతీయాశయములకు వ్యాఖ్యానముగ నున్నది. శంకరంనాయరుగా రధికారసభ్యత్వమును వహించుచున్నను ప్రజాశయంబులను నిర్భయంబుగ తెలిపి లోకమునకు నూతనభారతజాతీయతత్త్వమును వెల్లడి చేసిరి. ఉద్యోగములకై జాతీయాశయంబులకు తిలోదకంబుల నొసంగుట యాచారముగ నుండెను. ఉద్యోగముల నిచ్చి నాయకులను చీలఁదీసి వశపఱచుకొనుట యధికారతంత్రము. శంకరంనాయరు గారీ చతురోపాయమునకు లోఁబడక తమ వ్యక్తిత్వము రక్షించుకొనుట ప్రశంసార్హము. భారతీయులకు ప్రజాస్వామ్యత్వము నూతనము గాదని చరిత్రాంశములు ధ్రువపఱచుచున్నవి. ప్రాచీనకాలమునందు ప్రజాసంఘములు రాజ్యాధికారమును వహించినట్టు చరిత్రయందు నిదర్శనములు గలవు. గ్రామసంఘములు కులకట్టులు ప్రజాధికారనిర్వహణమునకు నిదర్శనములు. ప్రజలకు పరిజ్ఞానము లేకపోయినను నూరేండ్ల బ్రిటీషు పరిపాలనము పరిజ్ఞానమును కలుగఁజేసినది. ద్విరాజ్యాంగపద్ధతియందే కాధికారమును మంత్రులు కార్యనిర్వాహకసభ్యులు గవర్నరు కలిసి నిర్ణయింపవలయునని నాయరు గారు సమర్థించిరి. ప్రత్యేకవిభజనమువలన కీర్తి కార్య

నిర్వాహకసభ్యులకును అపకీర్తి మంత్రులకును సంక్రమించును. మంత్రులు కార్యనిర్వాహకసభ్యులు సంప్రతించి చేసిన మేలుకీడుల కుభయులును బాధ్యులుగ నుందురు. గవర్నరునకు మంత్రులమీఁదఁగలయధికారము సంస్కరణవిధానమును వికలత్వము చేయుచున్న దని భారతప్రభుత్వవిధానము స్పష్టము చేయుచున్నది. ఆదాయమునకు ముఖ్యసాధనం బైన భూమిసిస్తు కార్యనిర్వాహకశాఖయందును వ్యయాంశము లైన విద్య స్థానిక స్వపరిపాలనము పారిశుద్ధ్యము మంత్రులయధీనమందును నుంచుటవలన మంత్రుల గతి దుర్గతిగ పరిణమించును. భారతప్రభుత్వమునందును ద్విరాజ్యాంగపద్ధతి నవలంబింపవలయు నని ప్రజాశయంబుల కనురూపముగ శంకరంనాయరు గారు తమ భావములను స్పష్టముచేసిరి. శాసననిర్మాణమునందును కార్యనిర్వాహణమునందును ఆర్థికసమస్యలందును అధికతర మైన పెత్తనము భారతీయుల కుండవలయుననియు కార్యనిర్వాహకశాఖ శాసననిర్మాణశాఖకు కొంతకు కొంత లోఁబడియుండుట ప్రజాక్షేమమున కవశ్య మనియు శంకరం నాయరు గారు ప్రతిపాదించిరి. శంకరంనాయరుగారి ప్రత్యేకనివేదికము బ్రిటీషు రాజ్యతంత్రజ్ఞుల దృష్టి నాకర్షించునట్లు మన రాయబారులు పనిపూనవలసియుందురు. సర్ శంకరం నాయరు గారు తమ పదవికి రాజీనామా నిచ్చి లోకమునకు భారతజాతీయదృక్పథమును వెల్లడిచేసి మన కృజ్ఞతకు పాత్రు లైరి.

అంతఃకలహములు

రాజ్యాంగసంస్కరణవిధానము మహదాందోళనంబునకు కారణం బైనది. నాయకు లన్యోన్యము నిందారోపణము చేయుట కుపక్రమించిరి. మితవాదులు భీరువులుగ పరిగణింపఁబడిరి. జాతీయవాదులు విప్లవకరులుగ పరిగణింపఁబడిరి. స్వరాజ్యవాదులలో విభేద మేర్పడినది. బెజంటు గారు జాతీయస్వరాజ్యసమితిని స్థాపించినది. అసహనము ఆగ్రహము స్వప్రయోజనము స్వాభిమానము రాజ్యాంగరంగమునందు మూర్తీభవించినవి. వార్తాపత్రికలు సభావేదికలు సంభాషణలు పరస్పరనిందలతో నిండినవి. "తల్లీ! నీపుత్రులయం దే యుగమునకును ఐకమత్యము కలుగదా!" యని యొక దేశభక్తుఁడు విలపించెను. రాజకీయవ్యవహారములందు భేదాభిప్రాయము గలవారిపై ద్రోహారోపణమును చేయుట యవివేకము. ఎవరి భావములకు తగినట్లు వారు మాతృసేవను చేయుచున్నారు. ఉత్తమరీతిని సేవించెడివారు ధన్యతములు. సామాన్యసేవను చేసెడివారు ధన్యులు. భారతీయుల సంయోగబలము ప్రతిపక్షులను సులభముగ ప్రతిఘటింపఁగలదు. దేశారాధకులు స్వాభిమానమును పరిత్యజించి దేశహితార్థము పాటుపడి స్వధర్మనిర్వహణమునకు పూనుకొనుట సంతరణమునకు సాధనము. భారతదేశారాధకులు బ్రిటీషుద్వీపములందు స్వదేశమునందలి భేదకారణంబులను మఱచి కలిసి దేశసేవను చేసి ధన్యవాదములను పడయుదురుగాత!


ఆంధ్రోద్యమము

భరతఖండమును నావరించిన రాజ్యాంగాందోళన మాంధ్రదేశమును సయిత మావరించినది. రాజ్యాంగపరిస్థితులు మండలసభలయందును నాంధ్రమహాసభలయందును చర్చింపఁబడినవి. కడపపట్టణంబునం దాఱవ యాంధ్రమహాసభయు ప్రథమాంధ్ర రాష్ట్రీయసభయు జయప్రదముగ జరిగినవి. ఆంధ్రమహాసభ కధ్యక్షులు నెమలి పట్టాభిరామరావు గారు. వీరు ప్రథమాంధ్రమహాసభయం దాంధ్రరాష్ట్రప్రతిపాదనమును ప్రతిఘటించిరి. ఆ యేండ్లలో వారిభావము మాఱినది. పరిపాలనసౌకర్యమునకు భాషాప్రయుక్తరాష్ట్రనిర్మాణ మవశ్య మని పట్టాభిరామారావు గారు తెలియఁజేసిరి. ఆహ్వానసంఘాధ్యక్షులు నూకల వేంకటసుబ్బయ్య గారాంధ్రరాష్ట్రోపయోగమును వ్యక్తము చేసిరి. ప్రథమాంధ్రరాష్ట్రీయసభకు టి. ఎమ్. నరసింహాచార్యులు గారాహ్వానసంఘాధ్యక్షులు. భూపతిరాజు వేంకటపతిరాజు గా రధ్యక్షులు. ఉభయులును ప్రత్యేకాంధ్రరాష్ట్రప్రయోజనమును గంభీరముగ తెలియఁజేసిరి. ఆంధ్రరాష్ట్రనిర్మాణము విషయమై యీ క్రింది తీర్మానమేకగ్రీవముగ నామోదింపఁబడినది:


"ఆంధ్రమండలముల నన్నింటిని చేర్చి ప్రత్యేకరాష్ట్రముగ నేర్పఱచుట యుక్తమును అత్యావశ్యకమును కాన యుద్ధానంతరము సాధ్య మైనంత త్వరలో నట్టి యేర్పాటు చేయింపుఁ డని ప్రభుత్వము వారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు."

భాషాప్రయుక్తరాష్ట్రములను నిర్మించుటవలన కలుగఁగల మహాప్రయోజనమును నాయకులు క్రమక్రమముగ గ్రహించుచున్నారు. యథాప్రకారము ఆంధ్రగ్రంథాలయసభ ఆంధ్రసాహిత్యపరిషత్సభ ఆంధ్రపరిశోధకసభ మొదలగు మహాసభలు మండలసభలు తాలూకాసంఘములు గూడి ప్రతిపాదనములను చేసినవి.


अमृतांजन
AMRUTANJAN
OR
INDIAN PAIN BALM



1. గులాబిరంగు - ఆంధ్రదేశము.
2. ఆకుపచ్చ - ద్రవిడదేశము.
3. పసపు - కర్ణాటకదేశము.
4. గోదుమరంగు - మలయాళదేశము.
5. బూడిదరంగు - తులువుదేశము.



1. గులాబిరంగు – ఆంధ్ర దేశము. 2. ఆకుపచ్చ – ద్రవిడదేశము. 3. పసుపు – కర్ణాటక దేశము.

4. గోదుమరంగు – మలయాళ దేశము. 5. బూడిదరంగు – తులువుదేశము.


AMRUTANJAN DEPOT
BOMBAY

గుంటూరునందు కూడిన యవసరాంధ్ర రాష్ట్రీయ సభకు ఏకా లక్ష్మీనరసింహము పంతులు గారు ఆహ్వాన సంఘాధ్యక్షులు. కాశీనాథుని నాగేశ్వరరావు గారధ్యక్షులు. సభయందామోదితమైన స్వపరిపాలన ప్రతిపాదనము వేఱొక చోట ప్రచురింపఁబడినది. వివిధ ప్రాంతములందు కూడిన సభావ్యవహారము లాంధ్రుల యుత్సాహశీలమునకు నిదర్శనములు కాని, ఆంధ్రులకు తమ యుత్సాహమునకు తగిన కార్యశూరత్వము లేదని వారి చరిత్రము చాటుచున్నది. ఆంధ్రోద్యమాదర్శములను వ్యాపింపఁజేయుటకై ధనము లేదు. సేవకులు లేరు. నాయకులు లేరు. ప్రయత్నములు లేవు. సంస్కరణపోషణమున కింగ్లాండునకు రాయబారులను పంపుటకైనను నాంధ్రులకు శక్తి లేకున్నది. మితవాదుల పక్షమున మోచెర్ల రామచంద్రరావు పంతులుగారు బ్రాహ్మణేతరుల పక్షమున కూర్మా వెంకటరెడ్డి నాయఁడు గారును నింగ్లాండునకు వెడలుట శుభకరము. వారైనను ఆంధ్రోద్యమతత్త్వము నుపసంఘసమక్షమున సందర్భానుసారముగ పరిస్ఫుటముఁజేసి ఆంధ్రజాతీయాశయంబులను సఫలము చేయవలసియుందురు. సంస్కరణశాసనమునందు నూతనరాష్ట్రనిర్మాణమున కవకాశము లొసంగబడునని 12-వ నిబంధన తెలుపుచున్నది.

(1) రాజప్రతినిధి సభవారు చక్రవర్తి అంగీకారమును ప్రభుత్వ కార్యదర్శి ద్వారా పొంది క్రొత్త రాష్ట్రము నేర్పఱుపవచ్చును. లేక గవర్నరు రాష్ట్రము నేర్పఱుపవచ్చును. లేక గవర్నరు రాష్ట్రములోని భాగమును డిప్యూటీ గవర్నరు పరిపాలనము క్రిందనుంచవచ్చును. అట్టి రాష్ట్రమునకు గాని రాష్ట్రభాగమునకు గాని ప్రధానశాసనములను రాష్ట్రసూత్రములను అవసరములగు మార్పులతో వర్తింపజేయవచ్చును. (2) నూతనరాష్ట్రములను ప్రజా వాంఛితముల ననుసరించి చేయవలయును గాని ప్రభుత్వాభిప్రాయము ననుసరించి చేయఁజనదు.

ఏతత్ఫలమును సాధించుటకు ప్రజల ప్రబోధమే సాధనం బని నిబంధన నిరూపించుచున్నది. ఆంధ్రులందఱును రాఁగల సంవత్సరమునందాంధ్రోద్యమ ప్రాప్తికై పాటుపడి మాతృపూజను జేసి ధన్యవాదములను పడయుదురు గాత! ఆంధ్రరాష్ట్రనిర్మాణమున కాంధ్రమండలములందుఁ గల యాంధ్రప్రజలకు సన్నిహితసాహాచర్య మవశ్యము. ఇతరరాజ్యాంగనిర్మాణములపట్లఁ గల యపోహయె ఆంధ్రోద్యమముపట్లను కొందఱకుఁ గలదు. ఆంధ్రోద్యమము బ్రాహ్మణోద్యమ మనియు ఉత్తర సర్కారులవారి స్వార్థసిద్ధికై యేర్పడిన యుద్యమమనియు విభజనోద్యమ మనియు ఆక్షేపించెడి ప్రబుద్ధులు గలరు. లోకమునందు నిందావచనముల పాలు గాని యుద్యమము లసంభవములు. భిన్నాభిప్రాయులగువారు సకలసముద్యమములను ఖండించుచుందురు. ఖండనమునకు స్వకీయాభిప్రాయాభిమానము కారణము కాని ఫలపరిమాణము గారణము గాదు. స్వీయాభిప్రాయప్రతిబింబమే సకలోద్యమభావములందును వారికి గోచరంబగుచుండును. సకలప్రయత్నములందును స్వార్థపరులకు స్వప్రయోజనమును పరార్థపరాయణులకు పరహితమును ప్రతిఫలించును. ఆంధ్రోద్యమమాంధ్రదేశోద్ధరణమునకును నాంధ్రప్రజాక్షేమమునకును నాంధ్రభాషావికాసమునకును నవతరించిన మహోద్యమ మని విశాలచేతస్కులకు విశదము కాఁగలదు. ఆంధ్రోద్యమమహాఫలము సకలాంధ్రావనీవికాసమునందును భాషాభ్యుదయమునందును ప్రజావికాసమునందును సందర్శనీయము. ప్రత్యేకప్రాంతవాసుల లాభములు ప్రత్యేకకులముల ప్రయోజనములు ఆంధ్రోద్యమాదర్శములు కావని ప్రతిపక్షులు గ్రహించుట సమంజసము. ఆంధ్రపుత్రులు వారే జాతివారైనను ఏ కులమువారైనను ఏ మతమువారైనను మాతృపూజ కర్హులు. మాతృసంరక్షణమునకు యోగ్యులు. మాతృప్రసాదమునకు పాత్రులు. ఆంధ్రలోక మీ పవిత్రాదర్శములు గలిగి ఆంధ్రోద్యమప్రాప్తికి తమ శక్తిసామర్థ్యములను వినియోగించిన నచిరకాలమున నాంధ్రరాష్ట్రము సంప్రాప్తమై ఆంధ్రుల సంకల్పసిద్ధికిఁ దోడ్పడఁగలదు.

విభజనము వర్తమానయుగ రాజ్యధర్మ మని రాజ్యాంగసంస్థాపన లేకముఖమున బోధించుచున్నవి. అనేకజాతులను అనేకదేశములను

విభజనోద్యమము

జాతిమతభాషాభేదములను పరిగణింపక యేకరాజ్యవాసులను చేయుట గతయుగరాజ్యాంగ ధర్మము. ఏతద్రాజ్యాంగ ధర్మము సంగ్రామవిప్లవముగఁ బరిణమించిన విధమును ఐరోపా మహాసంగ్రామము విశదముచేయుచున్నది. ఆస్ట్రియా జర్మనీ రుష్యాసామ్రాజ్యముల వినాశనమునకు మూలకారణ మా సామ్రాజ్యములందు విజాతీయపరరాజ్యముల నిర్బంధప్రతిష్ఠాపన మని వ్యక్త మగుచున్నది. వ్యక్తిత్వవికాసరహితములైన దేశములు జాతులుఁ స్వయంపోషణమునకు సామ్రాజ్యశుభస్థితికి మానవకల్యాణము

నకు నుపయోగకరములు కావు. విచ్ఛిన్నము లైన సామ్రాజ్యములందు దేశభాషాజాతిస్వరూపముల కనురూపముగ నవీనరాజ్యములను జాతిసమితి నిర్మింప సమకట్టినది. పోలండు ఫిన్లాండు హంగరి ఉక్రేనియ స్లవోనియ మొదలగు రాజ్యముల నిర్మాణమునకు స్వయంవ్యక్తిత్వము మూలకారణము. వ్యక్తిస్వాతంత్ర్యమునకును రాజ్యసౌభాగ్యమునకును గల సన్నిహితసంబంధమును సామ్రాజ్యాంతర్భాగములకు సమకూర్చుట వర్తమానయుగరాజ్యధర్మమునకు ప్రయోజనము. అమెరికా సంయుక్తరాష్ట్రములం దీ రాజ్యధర్మ మవలంబింపఁబడినది. ఆస్ట్రేలియా కనడా దక్షిణాఫ్రికారాజ్యములం దీరాజ్యధర్మ మవలంబింపఁబడినది. దిగంతవిశ్రాంతం బైన బ్రిటిషు సామ్రాజ్యమునం దీ నవయుగరాజ్యధర్మ మవలంబింపఁబడుననుటకు సూచనలు గలవు. ఏకమతభావభాషాబద్ధము లైనను స్కాట్లాండు వేల్సు ఐర్లాండు ప్రాంతస్వపరిపాలనమును కోరుచున్నవి. దేహసౌష్ఠవమునకు సకలాంగసౌష్ఠవమువలెనే సామ్రాజ్యసౌష్ఠవమునకు సకలాంగరాజ్యసౌష్ఠవము మిగుల నావశ్యకము. అంగవైకల్యమువలె నంగరాజ్యవైకల్యమును వికలత్వమునకు మూలము. సంయోగవిభజనములకుఁ గల సంబంధమును స్థూలదృష్టితోఁ గాక సూక్ష్మదృష్టితో నిర్ణయించినపుడె నవయుగరాజ్యధర్మము బోధ్య మగును. వర్తమానయుగము రాజ్యధర్మయుగముగఁ బరిణమించుచున్నది. మతధర్మములు సంఘధర్మములు ప్రజాధర్మములు ఆర్థికవ్యవస్థలు రాజ్యధర్మాచ్ఛాదితము లగుచున్నవి. రాజ్యధర్మయుగమునందు రాజ్యభారనిర్వహణమునకు రాజ్యవిభజనమే శరణ్యము. కేంద్రాధికారమునందు సంయోగమును, రాష్ట్రాధికారమునందు విభజనమును రాజ్యధర్మనిర్వహణమునకు సాధనము లని రాజ్యాంగచరిత్రము చాటుచున్నది. ప్రత్యేకలక్షణలక్షితము లైన దేశములు భాషలు జాతులు గల విశాలమైన భరతఖండముయొక్క యభ్యుదయమునకు నవయుగరాజ్యధర్మప్రయోగ మవశ్య మని విచారజ్ఞులకు విశద మగుచున్నది. రాష్ట్రములందు స్వపరిపాలనమును సామ్రాజ్యప్రభుత్వమునందు కేంద్రాధికారమును గలిగి యుండుట మోంటుఫర్డు విధానమునందు సూచిత మైన రాజ్యాంగధర్మము. రాజ్యాంగధర్మనిర్వహణము భాషాప్రయుక్తరాష్ట్రమూలముననే సాధ్యము గావలసి యున్నది. పదునొకండు మండలములు 170 లక్షల ప్రజలు మూఁడుకోట్ల ఆదాయము సుక్షేత్రములు సుజలపూరితంబు లైన నదీనదంబులు సుస్వరశోభిత మైన భాష గల యాంధ్రదేశము ప్రత్యేకరాష్ట్రమునకు సకలవిధములఁ దగియున్న దని సిద్ధాంతము చేయుట యనావశ్యకము. ఆంధ్రులు భేదవాదుల పలుకులను పాటింపక ఆంధ్రోద్యమప్రాప్తికై పాటుపడి పరమేశ్వరానుగ్రహమునకుఁ బాత్రు లగుదురు గాత!

ఆంధ్రుల నిద్రావస్థ

లోకమంతయు నతివేగమున ముందంజ వేయుచున్న సమయమునం దాంధ్రులు నిద్రావస్థయం దుండుట సంతాపకరము. ఆంధ్రుల నిద్రావస్థకు దేశకాలపరిస్థితులు కారణము లైనను వారి తరణోపాయము వారి హస్తములందే కల దని ఆంధ్రులు గ్రహించినఁ గాని ప్రబోధము గలుగదు. ఆంధ్రదేశప్రతిష్ఠాపనములు బాగుగ నభివృద్ధిని పొందుట లే దని దేశచరిత్రము విశదము చేయుచున్నది. జాతీయమహాసభ ప్రసాదించిన ప్రత్యేకాంధ్రరాష్ట్రోపసంఘవ్యవహారము లభివృద్ధిని పొందలేదు. ఆంగ్లదైనికపత్రికను ప్రచురించుటకు చేసిన ప్రయత్నములు సఫలములు గాలేదు. ఆంధ్రోద్యమవ్యాపనకై విశేషమైన ప్రయత్నములు జరుగలేదు. ఆంధ్రవాఙ్మయాభివృద్ధికై విశాలమైన ప్రయత్నములు జరుగలేదు. గతసంవత్సరమునం దాంధ్రవాఙ్మయమునందు ప్రచురింపఁబడిన 420 గ్రంథములందును 270 గ్రంథములు పునర్ముద్రితములు. 150 గ్రంథములు నవీనములు. నూతనగ్రంథములందును నూతనభావములను బోధించెడి గ్రంథములు స్వల్పముగ నున్నవి. శ్రీపీఠికాపురాధీశు లాంధ్రసూత్రభాష్యమును బ్రచురించియు సూర్యరాయాంధ్రనిఘంటునిర్మాణమును సాగించియు జేయుచున్న భాషాసేవకు వందన్యులు. నూతనపద్ధతి నవలంబించి అబ్బూరి రామకృష్ణరావు గారు రచియించిన ఊహాగానము దుప్పూరు రామిరెడ్డి గారు రచియించిన కృషీవలుఁడు నాంధ్రవాఙ్మయమునందు నూతనభావోదయమును విశదము చేయుచున్నవి. నూతనముగ ముద్రింపఁబడినవానిలో పెక్కులు చిల్లరపుస్తకములే యైనను, చిత్రలేఖనము వాణిజ్యము మున్నగునవి పారిశ్రామికగ్రంథములలోను, బుద్ధుఁడు తిక్కనసోమయాజి మున్నగువారి చరిత్రములు జీవితగ్రంథములలోను, తత్త్వగ్రంథములలో భగవద్గీతారహస్యము అను కర్మయోగశాస్త్రమును (లోకమాన్యతిలకుగారిది) కపిస్థలము కృష్ణమాచార్యులు

గారి జ్యోతిశ్శాస్త్రసారమును, విమర్శనగ్రంథములలో పెద్దాపురసంస్థానచరిత్రవిమర్శనమును, భక్తివిషయక గ్రంథములలో మహాభక్తవిజయమును చరిత్రగ్రంథములలో ఆంధ్రరాజులకథలు రెడ్లచరిత్రయు, వైద్యగ్రంథములలో వైద్యపదనిఘంటువు ఆయుర్వేదసారసంగ్రహము మున్నగు నవియు, ప్రబంధరత్నావళి యను నుదాహరణపద్యగ్రంథమును, శ్రీకృష్ణభారతము ఆంధ్ర శ్రీభాష్యము మున్నగు గ్రంథములును ముఖ్యము లైనవి. ఆంధ్రభాషయందు వాఙ్మయాభివృద్ధిని చేయుటకై గ్రంథప్రచారకమహామండలిని స్థాపించుట యత్యంతావశ్యకముగ నున్నది. గ్రంథకర్తలకు గ్రంథప్రచారమునకు వలయు సహాయము చేయుటవలనను గ్రంథరచనకు శక్తి కలుగఁగలదు. ప్రత్యేకముగా గ్రంథకర్తలకుసాధ్యముగాని కార్య మాంధ్రుల సంయోగబలమున సాధ్యమై వాఙ్మయాభివృద్ధికి మంచి యవకాశములు కలుగఁగలవు. ఆంధ్రసాహిత్యపరిషత్తు ఆంధ్రపరిశోధకసంఘము గ్రంధప్రచురణభారమును నిర్వహించుటకుఁ దగిన సంస్థాపనలు. కాని, ఈ సంస్థాపనల నిర్వాహకుల వ్యవసాయములు సంకుచితములుగ నుండుట సంతాపకరము. ఈ సందర్భమునందు పాఠశాలలలో పఠనీయగ్రంథములను నిర్ణయించుట కేర్పడిన యుపసంఘనియోగములు విమర్శనయోగ్యము లగుచున్నవి. గ్రంథనిర్ణయమునందు సభ్యులు గమనింపవలసిన ముఖ్యవిషయము విద్యార్థుల ప్రబోధము. భావోద్దీపనకరము లై సుపదసులక్షణపూరితము లైన మహాకవుల గ్రంథములు విద్యార్థుల ప్రబోధమునకు యోగ్యములైన గ్రంథములు. పఠనీయగ్రంథముల పట్టికను విమర్శించినపుడు భాషాభిమానులకు విషాదము కలుగుచున్నది. భాష భావములు లక్షణములు పఠనీయగ్రంథములం దపరూపమును దాల్చియుండును. ఆశ్రితుల గ్రంథములు లాక్షణికగ్రంథము లై పఠనీయగ్రంథము లగుచున్నవి. ఆధునికగ్రంథకర్తల గ్రంథములను పఠనీయగ్రంథములుగ నిర్ణయించి గ్రంథకర్తలకు ప్రోత్సాహమును కలుగఁజేయుట ప్రశంసనీయ మైనను సభ్యులు తమ లక్ష్యము నం దుంచుకొనవలసిన ముఖ్యవిషయము పాఠకుల లాభము గాని గ్రంథప్రచారకుల లాభము గ్రంథకర్తల లాభము కాదు. పఠనీయగ్రంథనిర్ణయాధికారు లీ పరమ ప్రయోజనమును సంభావించుచు నాంధ్రుల విద్యాప్రవృత్తి ప్రయోజనకరము లైన గ్రంథములను పఠనీయ గ్రంథములనుగ నిర్ణయించి స్వధర్మమును ధర్మపరాయణులై నిర్వహించుట శ్రేయస్కరము. గతసంవత్సరమునందు ఓరుగల్లు ఒంటిమిట్ట వాదము పండితుల రెండ ములను కలవరపఱచి ప్రచండవాదములకును నిందారోపణములకును ఆస్పదమైనది. బమ్మెర పోతరాజు భక్తాగ్రేసరుఁడు కవిపుంగవుఁడు మహానుభావుఁడు. పోతరాజు పూజ్యతకుఁ గారణ మా మహాపురుషుని ప్రతిభావిశేషము గాని వాసస్థలవిశేషము గాదు. పోతరాజు ఏయూరివాఁ డైనను నాంధ్రులకు పూజ్యుఁడు. ఆ పూజ్యుని జన్మస్థలమును నిర్ణయించుటయందు పండితులు స్థలాభిమానమును వదలి విషయాభిమానమును వహించుట ధర్మము. ఈ సంచికయందు కీర్తిశేషులైన వీరేశలింగముపంతులుగారీ విషయనిర్ణయమును చేయుచు వ్రాసిన వ్యాసమును నిష్పాక్షికబుద్ధితోఁ బండితులు పరిశీలించి స్థలనిర్ణయమును చేయుట సమంజసము. హేతువాదమును బూని జన్మస్థలమును నిర్ణయించునపుడు, ప్రస్తుతపు నిదర్శనములు ఓరుగల్లువాదమును సమర్థించు నని తోఁచుచున్నది. వీరేశలింగము గారు కవులచరిత్ర మందు పోతరాజు నివాసస్థలము ఒంటిమిట్ట యని వ్రాసియును నూతనపరిశోధనాధారమున నివాసస్థలము ఓరుగల్లు అని తెలిసినపుడు తమ పూర్వాభిప్రాయములను మార్చుకొని సత్యప్రియత్వమును ప్రకటించి పరిశోధకుల కృతజ్ఞతకుఁ బాత్రులైరి. చరిత్రపరిశోధకు లైన పండితులు పంతులవారి మార్గము నవలంబించుట శ్రేయస్కరము. ఉన్నవ లక్ష్మీనారాయణ గారు నన్నయభట్టారకుఁడు నియోగి యని నిర్ణయించుచు వ్రాసిన వ్యాస మీ సంచికయందుఁ గలదు. ముద్గలగోత్రులు ఆపస్తంబసూత్రులు నియోగులు గుంటూరుమండలమునందు కలరు. ఈ గోత్రసూత్రోద్భవ కవి యైన గోపాలునివంశపు కవి తాము నన్నయభట్టారకవంశజుల మని గ్రంథమునందు వ్రాసికొనిన పద్యములను లక్ష్మీనారాయణగా రుదాహరించిరి. నన్నయ కాలము నాఁటికి నియోగవైదికభేదము గలదో లేదో నిర్ణయింపవలసి యున్నది. గ్రంథకర్త కేవలము గౌరవము కొఱకు నన్నయభట్టారకుని వంశము ననుసంధానము చేసెనో నన్నయభట్టారకుని వంశజుఁడో పండితులు గ్రంథకాలమునుబట్టి విమర్శించి నిర్ణయించుట సమంజసము. ఈ విమర్శను పండితులు శాఖాభిమానమును పరిత్యజించి సదభిమానభరితు లై చేసినచోఁ బరిశోధ

నను సరళమార్గము నవలంబించి కవులచరిత్ర కుపకృతిఁ జేయగలదు. ఆంధ్రులు సకలరంగములందును జేయవలసిన కార్యములు పెక్కులు గలవు. ఆంధ్రులు తమ నిద్రావస్థను పరిత్యజించి వ్యవసాయపరాయణు లైనపుడే వారిసంకల్పము లీడేరు నని గ్రహించుట భావ్యము.

లోకమునందు పురుషుల మహత్త్వమునకు వారి జీవితములు నిదర్శనములు. మహాపురుషులు విఘ్నపరంపరలనుదాఁటి ప్రతికూలపరిస్థితుల ననుకూలపరిస్థితులుగ మార్చి జీవితఫలమును సాధించెదరు.

వీరేశలింగము పంతులు

శ్రీమంతులకు దానధర్మములను జేయుట సులభము. పండితులకు గ్రంథరచన సుకరము. బలవంతులకు సాహసము సాధ్యము. కానిజీవితలక్ష్యమును సాధించుటమాత్రము సామాన్యముగ సాధ్యము కాదు. పంతులు గారు సకలవిధముల తమ జీవితమును దేశసేవకై వినియోగించి జీవితలక్ష్యమును సాధించి జన్మసాఫల్యమును గాంచిరి. వర్తమానయుగమునం దాంధ్రుల ప్రబోధమునకు పంతులు గారు మూలపురుషులు. ఏఁబదేండ్లు వర్ణనాతీతమైన సేవ చేసి వీరేశలింగము గారు కృతార్థు లైరి. పంతులు గారు పలువిధములైన గ్రంథములను రచియించి వాఙ్మయవికాసమునకుఁ దోడ్పడిరి. దురాచారఖండనముఁ జేసి సంఘశుభస్థితికిఁ దోడ్పడిరి. పునరుద్వాహములను జేసి వితంతువుల దౌర్భాగ్యస్థితిని బాప సమకట్టిరి. పరిశుద్ధాస్తికమతము నవలంబించి విశుద్ధమైన భక్తిమార్గమును స్థాపింపఁ బ్రయత్నించిరి. పాఠశాలస్థాపించి విద్యాదానముఁ జేసిరి. పురమందిరమును నిర్మించి ప్రజాప్రబోధమునకు తోడ్పడిరి. కాని, పంతులు గారి మహత్త్వము వారి సత్కార్యానుష్ఠానములను మించి వారి శీలమునందును త్యాగమునందును నాత్మగౌరవమునందును తేజోవంతమై విరాజిల్లుచుండును. సామాన్యకుటుంబమునందుఁ బుట్టి సామాన్యవిద్య నుపార్జించి మహత్త్వమును గడించిన ఆంధ్రప్రముఖులందు పంతులుగా రగ్రగణ్యులు. త్రికరణశుద్ధిగ జీవితలక్ష్యమును సాధించుటకై వీరేశలింగముగారు పడిన కష్టములు వారికి పరమశత్రువులుగ నున్నవారికి సయితము విచారమును కలిగించినవి. పంతులు గారి సత్యశీలము వారిశత్రువులకు సయితము గౌరవభాజనంబైనది. ఆంధ్రులయొక్క యుదారప్రకృతిని సరళస్వభావమును సంస్కరణప్రియత్వమును మాతృభాషాభిమానమును వికసింపఁజేయుటకు పంతులు గారు కారణు లని నిరాఘాటముగఁ జెప్పవచ్చును. పంతులు గారు నాటిన విజ్ఞానబీజములు ప్రవర్ధమానములై కాలక్రమమున నాంధ్రవ్యక్తిత్వమునకు ద్యోతకము లై యాంధ్రోద్యమస్వరూపమును దాల్చినవి. దేశమునకు మహత్తరమైన సేవను జేసిన వీరేశలింగము పంతులు గారు మనకు పూజ్యులును సంస్మరణీయులును. మృతజీవులైన పంతులు గారికి వారి గ్రంథములు ప్రతిష్ఠాపనలు సత్యశీలము శాశ్వతమైన స్మరణచిహ్నములుగ నుండఁగలవు. స్మరణచిహ్నములు పంతులు గారి ప్రతిభను పోషించుట కనావశ్యకములైనను నాంధ్రులు తమ యాత్మగౌరవమును గాపాడుకొనుటకుఁ గాను దేశోద్ధారకులం దగ్రగణ్యు లైన వీరేశలింగము పంతులు గారికి వారి సేవకుఁ దగిన స్మరణచిహ్నమును స్థాపించి స్వధర్మమును నిర్వహించి భగవదనుగ్రహమునకు పాత్రు లగుదురు గాత!

భారతరాజ్యాంగ సమస్య

భారతరాజ్యాంగసమస్యను నిర్ణయించుట మిగులఁ గష్టము. అనేకములగు మతములు భాషలు జాతులు రాష్ట్రములు ప్రయోజనములు గల రాజ్యమునందు రాజ్యసమస్యను నిర్ణయించుటకు మూలాధారము లపరూపములుగ నున్నవి. పూర్వాచారవ్యవహారప్రియు లైన యాంగ్లాధికారులకు భారతరాజ్యాంగసమస్య యగమ్యముగఁ దోఁచుట సహజము. ఆంగ్లాధికారులు స్వానుభవాతీత మైన సమస్యను నిర్ణయింపనోపరు. విభేదములు గల భారతీయు లొకజాతివారు కారు. విభేదము లున్నను వా రాంగ్లేయులకు స్వజాతీయులు కారు. ఈ భేదభావ ముభయపక్షములందును అపోహను కలిగించుచున్నది. భారతీయుల విజ్ఞానము మధ్యయుగమునందు మాటుపడియున్నను శాంతిప్రదమైన బ్రిటిషు ప్రభుత్వమువలనఁ బునరుద్ధృత మైనది. పాశ్చాత్యవిద్యలు పాశ్చాత్యకళలు పాశ్చాత్యవాణిజ్యము పాశ్చాత్యరాజ్యాంగము ప్రజలయందు ప్రబోధమును కలిగించినవి. భారతీయులందు దేశసేవాపరాయణులు బయలుదేఱి దేశోద్ధరణమునకు పూనుకొనిరి. దాదాభాయి నౌరోజి బాలగంగాధరతిలకు గోపాలకృష్ణగోఖలే కరుణచందగాంధి మొదలగు దేశభక్తులు దేశారాధనమే జీవితమునకుఁ బరమావధి యని గ్రహించి తమ జీవితములను దేశసేవకై వినియోగించి ప్రజాసన్మానమునకుఁ బాత్రులైరి. దేశారాధకులు భారతజాతీయాభిమానమును ప్రజలయందు ప్రజ్వలింపఁజేసిరి. రామేశ్వరవాసులకును

కాశీవాసులకును క్వెట్టావాసులకును రంగూనువాసులకును మాతృదేశారాధనమునందు సమానలక్ష్య మేర్పడినది. జాతీయారాధనమునందు వివిధములైన జాతులకు మతములకు భాషలకు ప్రాంతములకు మేళగింపు గలిగినది. ఏకదేశవాసము ఏకఫలప్రాపణము ఏకాశయసాధనము భారతీయుల నేకజాతీయపాశబద్ధులను చేసినది. భరతఖండమును పరదేశీయులు పాలించినను పరదేశీయుల విజ్ఞానము భారతీయవిజ్ఞానముతో మిళితమై జాతీయవిజ్ఞానప్రవాహమును విస్తృతము చేసినది. మహమ్మదీయులు దేశమును నాలుగు శతాబ్దములు పాలించినను భారతజాతీయవిజ్ఞానము విచ్ఛిన్నము గాలేదు. హిందూమహమ్మదీయవిజ్ఞానములకు మేళగింపు గలిగినది. ఆధ్యాత్మికము లైన హిందూమహమ్మదీయవిజ్ఞానములకు సమ్మేళనము సులభసాధ్యము. భారతజాతీయప్రబోధము హిందూమహమ్మదీయసమస్యను సాధించినది. రాజ్యాంగసమస్యలం దుభయసంఘములకు సమదృష్టి కుదిరినది. హిందూ మహమ్మదీయ సమస్యను తలదన్ని యూరపియను సమస్య విజృంభించినది.

పాశ్చాత్యసంసర్గము భరతఖండమునందు నూతనవికాసమును బుట్టించినది. యూరపియనులు పాలకులు బలవంతులు ధనవంతులు. భారతీయులు పాలితులు బలహీనులు ధనహీనులు. సంసర్గమునందు యూరపియనులకు విజయము భారతీయులకు పరాజయము సహజము. ప్రాచీప్రతీచీసంసర్గము ఆధిభౌతికాధ్యాత్మిక సంరంభముగఁ బరిణమించినది. పాశ్చాత్యపరిశ్రమలు ప్రాచ్యపరిశ్రమలను నిర్మూలము నొందించినవి. పాశ్చాత్యభావములు ప్రాచ్యభావములను శిథిలము చేసినవి. పాశ్చాత్యసంపదలు ప్రాచ్యులకు సమ్మోహమును గలిగించినవి. విషమపరిస్థితులందు మహాసంగ్రామము సంప్రాప్త మైనది. సంగ్రామము భావప్రపంచమునందు నూతనసిద్ధాంతములను స్థాపించినది. పాశ్చాత్యభావసమ్మోహము సడలినది. భారతీయుల కాధ్యాత్మికబలమునందు విశ్వాసము గలుగ నారంభమైనది. ఆధ్యాత్మికబలమునకును ఆధిభౌతికబలమునకును ప్రవర్ధమానం బైన సంరంభమునందు జయాపజయములను కాలము నిర్ణయింపఁగలదు. సర్ సయ్యాదు అహమదు ఖాను భారతమాతకు హిందువులు మహమ్మదీయులు రెండు నేత్రము లనియు వారి వికాసము దేశాభ్యుదయమునకు సాధనం బనియు బోధించెను. యూరపియను సమస్య ఈ భావమును సంపూర్ణముగ మార్చుచున్నది. భారతమాతకు మూఁడు నేత్రము లేర్పడినవి. యూరపియనులు మహమ్మదీయులు భౌతికనేత్రములు. హిందువులు జ్ఞాననేత్రము. నేత్రత్రయమునకు స్వరూపమునందుఁ గాకపోయినను స్వభావమునం దైనను సమదృష్టి సాధ్య మైనపుడే భారతరాజ్యాంగసమస్యానిర్ణయము సాధ్యము గాఁగలదు.

బ్రిటీషు సామ్రాజ్యము

వర్తమానకాలమునందు. బ్రిటీషుసామ్రాజ్యమునకుఁ గల బలము గౌరవము ప్రతిష్ఠ పలుకుబడి వేఱొక సామ్రాజ్యమునకు లేదు. బ్రిటీషు రాజ్యాధికారులు తమ రాజ్యాంగ విజ్ఞానమును పరాధీనజాతుల విమోచనమునకై వినియోగించినపుడు మానవకల్యాణము సులభసాధ్యము గాఁగలదు. భూవలయవ్యాప్తం బైన సామ్రాజ్యసంరక్షణమునకును సౌభాగ్యమునకును బ్రిటీషు ప్రజలు అప్రయత్నముగ సామ్రాజ్యాంతర్భాగములందు స్వపరిపాలనమును స్థాపించుట యవశ్యం బని గ్రహింపఁగలరు. కాని, ఈ శుభముహూర్త మెపుడు వచ్చునో యూహించుట దుర్లభము. భారతీయుల ప్రత్యభిజ్ఞానము భారతీయయూరపియనుసంఘర్షణమును వృద్ధిచేయుట సహజము. ఆంగ్లేయులకు పాలకాభిమానము భారతీయులకు పాలితదైన్యము. లోకమునం దభిమానదైన్యములకు పొందు కుదురుట దుర్లభము. కాని, భరతవర్షక్షేమమును బ్రిటీషు సామ్రాజ్యక్షేమమును గోరెడివారు భారతీయాంగ్లేయసమస్యను నిర్ణయించుట యవశ్యము. ముప్పదిమూఁడుకోట్ల భారతీయుల బలమనివార్యము. లోకవ్యాప్తం బైన బ్రిటీషుసామ్రాజ్యమహాబల మనివార్యము. మహాబలముల సంఘర్షణము విప్లవమునందుఁ బరిణమించును. పంజాబుకలవరము లీయర్థమును బోధించుచున్నవి బాహుబలపరాజయమునకు బాహుబలము సాధన మను సిద్ధాంత మంతరించెడి కాల మాసన్న మగుచున్నది. బాహుబలసంపన్నులైన జర్మనులు పరాజయమును బొంది విలయముపాలైరి. సంగ్రామతప్తములైన జాతులకు ధర్మప్రబోధము గలుగుచున్నది. భారతీయుల ధర్మప్రవృత్తిని పాశ్చాత్యసంసర్గము లుప్తము చేసినది. లోకావృతంబైన బాహుబలవ్యామోహము ధనబలవ్యామోహము విద్యాబలవ్యామోహము భారతీయుల నావహించినవి. లోకమునకు సంతరణసాధనము శుభప్రదమైన ధర్మప్రబోధము గాని

వినాశకరమైన వ్యామోహాభ్యుదయము గాదని ఆర్యమహర్షులు బోధించిరి. వ్యామోహనిద్రా వశులైనభారతీయులు బలవ్యామోహమును బరిత్యజించి ధర్మప్రబోధారూఢు లగుట శ్రేయఃప్రాప్తికి సాధనము. వ్యామోహసాగరం బపారం బని ఐరోపామహాసంగ్రామము గుణపాఠము నేర్పినది. బాహుబలధర్మబలముల సంరంభమునందు ధర్మబలము విజయధ్వజమును స్థాపించు నని ప్రపంచచరిత్ర యుగయుగంబునందును బోధించిన బోధను వర్తమానయుగమునందు మహాసంగ్రామము తిరిగి బోధించుచున్నది. సత్త్వసంపన్నులైన భారతీయులు చిరకాలాగతం బైన ధర్మము నవలంబించి ధర్మపరాయణులై స్వజాతీయాభ్యుదయమునకును మానవకల్యాణమునకును స్వకీయవిజ్ఞానమును వినియోగించి ఈశ్వరానుగ్రహమునకుఁ బాత్రు లగుదురుగాత! బ్రిటీషుప్రజలు భారతసామ్రాజ్యాధీశులై దేశమును పరిపాలించుట దైవనిర్ణయము. బ్రిటీషుప్రజల ధర్మానురక్తి భారతీయులను స్వామిభక్తిపరాయణులను జేసినది. బ్రిటీషుప్రజలు తమ ధర్మబలావలంబనమునను దేశమును బాలించుచు భారతీయులకు ప్రత్యభిజ్ఞానమును గలిగించి మానవకల్యాణమునకు ధర్మమార్గమును నిర్మించుచున్నారు. భరతఖండము బ్రిటీషుసామ్రాజ్యమునందు ప్రత్యభిజ్ఞానము గల యుచితపదము నధిష్ఠించుటయే బ్రిటీషుపరిపాలనమునకు ఫలము. ఉభయజాతులకు బలవ్యామోహము పోయి ధర్మప్రబోధ ముదయించి పరస్పరము విశ్వాసగౌరవములు బలపడినపు డీ పండు పండి రసవంతమై కల్యాణప్రదమై భారతరాజ్యాంగసమస్యకు ఉజ్జీవమై వెలయుగాత!

సత్యాగ్రహము

ప్రాచీప్రతీచీసంసర్గము ఆధ్యాత్మికాధిభౌతికసంసర్గముగ పరిణమించినది. పాశ్చాత్యసంసర్గము భారతీయులను వ్యామోహపరవశులను జేసినది. బలగర్వము ధనలోభము భోగచాపల్యము భారతీయుల యాధ్యాత్మిక ప్రవృత్తికి వికలత్వమును గలిగించినవి. ఆత్మవిలయము శరీరసౌఖ్యము జన్మఫలముగఁ బరిణమించినవి. ధనకనకవస్తువాహనాంబరములు సన్మానపాత్రంబు లైనవి. ఆంతరంగికబాహ్యప్రవృత్తులకు సంరంభము సంప్రాప్తం బయినది. వ్యాసుఁడు శుకుఁడు జనకుఁడు బుద్ధుఁడు శంకరుఁడు చేసిన ధర్మోపదేశంబులు ప్రక్షీణములై పాశ్చాత్యరాజ్యధర్మావృతంబు లైనవి. భారతీయుల బలము సంపదలు విజ్ఞానము నిర్వీర్యములై జాతీయాత్మసంరక్షణమునకు నిరుపయోగము లైనవి. మతధర్మములు దూష్యము లైనవి. సదాచారములు దురాచారము లైనవి. సంఘవ్యవస్థలు నిస్సారము లైనవి. పాశ్చాత్యరాజ్యధర్మము మతధర్మము సంఘధర్మము భారతీయుల నావహించినవి. భారతీయులు రాజ్యాంగాందోళనమునందు పాశ్చాత్యమార్గముల నవలంబించియుండిరి. కొందఱు నిందలను విప్లవమును హత్యలను ఆయుధములుగ పరిగ్రహించిరి. భారతజాతీ యాత్మవినాశమును బొందుటకు కారణంబులు పరిస్ఫుటము లైనవి. ధర్మావలంబనము లైన యహింస సత్యము త్యాగము మాటువడినవి. భారతీయుల యాధ్యాత్మికస్థితికే హాని గలిగినపుడు సత్యాగ్రహరూపమున భారతీయ ప్రత్యభిజ్ఞాన ప్రకర్షణ మవశ్యమైనది. సత్యాగ్రహమున కాత్మత్యాగము మూలము గాని పరదండనము పరపీడనము ప్రయోజనములు గావు. ఆత్మత్యాగు లైన బుద్ధదేవుఁడు సాక్రటీసు ఏసుక్రీస్తు ప్రహ్లాదుఁడు శాశ్వతబ్రహ్మపథము నధిష్ఠించిరి. సత్యాగ్రహవ్యాజ్యమున హింసకుఁ బూనుకొనుట యవివేకము. జీవహింసను మానుటకై మాంసాశనమును బరిత్యజించిన భారతజాతికి హింసారూపమైన రాజ్యాంగాందోళనము తరణోపాయము గాదు. భారతీయులు త్రికరణశుద్ధిగ త్యాగవ్రతము ననుష్ఠించినపుడు సత్యాగ్రహవ్రతము సఫలమై సకలసిద్ధులు సమకూడఁగలవు. సత్యాగ్రహ ముత్కృష్టమైన యాత్మనిగ్రహము. ద్వేషరోషావేశపరవశమైన యాగ్రహమునకు సత్యాగ్రహమున స్థానము లేదు. సత్యాగ్రహము భారతజాతీయాత్మకు నిర్మలమైన ప్రతిబింబము. భారతీయుల సంపూర్ణ ప్రత్యభిజ్ఞానమునందు నిష్కళంకం బైన జాతీయాత్మసందర్శనము సాధ్యము. చిరకాలసముపార్జితం బైన ధర్మపరిజ్ఞానమును రాజ్యలాభమున కైనను విలము చేయుట యవివేకము. అహింసారూపమును త్యాగశీలమును గలిగి సత్యాధిష్ఠితం బైన ధర్మారాధనమును జేయుచు నాధ్యాత్మికసామ్రాజ్యమహత్వమును భారతీయులు లోకమునకు వెల్లడిచేసి స్వజాతీయ ప్రత్యభిజ్ఞానమును సుస్థిరముగఁ గాపాడుకొనుట తమ శుభస్థితికి మూలము.

మోంటుఫర్డువిధానాధారమున నిర్మిత మైన సంస్కరణశాసనము జానుమాసారంభమున పార్లమెంటు

సంస్కరణ శాసనము

నందు ప్రవేశము గాంచినది. శాసనము పునర్వ్యవస్థనమునకై యుపసంఘాధీనము చేయఁబడినది. సంస్కరణశాసనము మోంటుఫోర్డు విధానసారాంశము సౌత్తుబరో ఉపసంఘపు నివేదికము భారత ప్రభుత్వనివేదికము సర్ శంకరంనాయరు నివేదికము సంచికయం దనుబంధములుగఁ బ్రచురితములు. గతసంవత్సర రాజ్యాంగాందోళన చరిత్రము నెఱిఁగిన వారికి శాసనమునందలి లోటుపాటులు సువ్యక్తములు. సంస్కరణశాసనోద్దేశము భారతరాజ్యాంగమునందు బాధ్యతాయుతపాలన బీజంబులను నాటి కాలక్రమమున స్వపరిపాలనమును స్థాపించుట యని ఆగస్టు 20-వ తేదిని జేసిన ప్రతిపాదనమే శాసనోపోద్ఘాతమునందు సూచితము. రాష్ట్రములందు ద్విరాజ్యాంగమును మంత్రులను స్థాపించుట బాధ్యతాయుతపాలనమునకుముఖ్యాంశము. అధికారము సామ్రాజ్య ప్రభుత్వాధికారముగను రాష్ట్ర ప్రభుత్వాధికారముగను విభజింపఁబడును. సామ్రాజ్య ప్రభుత్వాధికారము ఇప్పటివలెనె అధికారాధీనమై నిర్భేదముగనుండును. సామ్రాజ్యశాసనసభయం దుండు 120 మంది సభ్యులలోను 80మంది ప్రజాప్రతినిధు లుండురు. శిష్టసభయం దుండు 56సభ్యులలో 24గురు ప్రజాప్రతినిధులుందురు. శాసనసభ నిరాకరించినవిషయములను శిష్టసభ సమర్థించుట కధికారమును కలిగియుండును. రాజప్రతినిధికి సభలను విచ్ఛిన్నము చేయుట కధికార ముండును. శాసనము నిర్ణయించెడి బాధ్యతాయుతపాలన మంతయు రాష్ట్రములందు కలుగఁగలదు. రాష్ట్రాయత్తవిషయములందు ప్రభుత్వాయత్తవిషయములు ప్రజాయత్తవిషయము లను విభాగ మేర్పడును. ప్రజాయత్తవిషయములను మంత్రి పరిపాలించును. మంత్రులను తీసివేయుటకు నియమించుటకు గవర్నరునకు సంపూర్ణాధికారము కలుగును. గవర్నరునకు స్వాయముగను మహాపసంఘాధారమునను సమర్థాధికారము గలదు. శాంతికిని అధికారాయత్తవిషయములకును సంబంధించిన విషయమును గవర్నరు నిర్ణయింపఁగలఁడు. మంత్రుల జీతములకును కార్యనిర్వాహకసభ్యుల జీతములకును వ్యత్యాస ముండును. మంత్రులు సామాన్యముగ గవర్నరు అనుగ్రహమునకు పాత్రులై ప్రవర్తింపవలసియుందురు. గవర్నరు కార్యనిర్వాహకసభామంత్రులు గలిసి రాష్ట్రప్రభుత్వముగఁ బరిగణింపఁబడుదురు. రాష్ట్రసభలయందు 100-కి 80 వంతున ప్రజాప్రతినిధులుందురు. శాసనసభకు మంత్రులను కార్యనిర్వాహకసభ్యులను తొలఁగించుటకు నియమించుట కధికారము కలుగదు. హిందూదేశమంత్రి వేతనమును ఉపమంత్రుల వేతనమును బ్రిటీషు రాజ్యాదాయము భరించును. మంత్రిసభకు పార్లమెంటు ననుమతిని పొంది యితరాధికారుల యధికారమును తగ్గించుట కవకాశములు కల్పింపఁబడును. పౌరసేవోద్యోగుల స్వత్వరక్షణమునకు పరిహారములుకల్పింపఁబడినవి. పది సంవత్సరములకు పిమ్మట నొక విచారణ సంఘము రాజ్యాంగములం దవశ్యములైన మార్పులను నిర్ణయించును.

సంస్కరణశాసనము మోంటుఫర్డు విధానమునకు వెనుకఁబడినది. భారత ప్రభుత్వవిధానము నవలంబించినది. సర్ శంకరంనాయరు భారతప్రభుత్వవిధానమును ఖండించుచుఁ బ్రచురించిన నివేదికము భారతీయుల దృక్పథమును విశదము చేయుచున్నది. రాష్ట్ర ప్రభుత్వములం దవలంబితమైన ద్విరాజ్యాంగవిధానమును భారత ప్రభుత్వమునందు సయిత మవలంబించుటయు ప్రజాయత్తవిషయములను విశాలము చేయుటయు మంత్రుల స్థితిని భద్రముచేయుటయు సంస్కరణశాసనోపయోగమును విశాలముచేయుటకు సాధనము. భారతీయరాయబారులు తమ సంయోగబలమును సంస్కరణశాసనమును విశాలము చేయను వినియోగించి మాతృదేశారాధనమును జేయుదురు గాత! సంస్కరణశాసనము వర్తమానరాజ్యాంగపద్ధతిని మార్చుటకు బీజములను గలిగియున్నను లోకావృతంబైన స్వాయంనియంతృత్వాదిస్వాతంత్ర్యసిద్ధాంతముల నవలోకించినపుడు సంపూర్ణమైన యాశాభంగము భారతీయులకుఁ గలుగుచున్నది. బ్రిటిషు రాజనీతిజ్ఞులు విశాలదృష్టితో భారతజాతీయావశ్యకతల కనురూపమైన సంస్కరణశాసనమును నిర్మించి దేశాభ్యుదయమునకు తోడ్పడి ప్రజల ధన్యవాదములకు పాత్రు లగుదురుగాత! మోంటేగు గారు తమ రాజనీతిని విశాలశాసననిర్మాణమునకు వినియోగించి బ్రిటీషు రాజ్యనీతిజ్ఞులందు స్థిరకీర్తిని గాంచుదురుగాత!

సంగ్రామోపసంహారమును జేయుటకు రాజనీతిజ్ఞులు జాతిసమితిని ప్రతిష్ఠించిరి. జాతిసమితి స్థాపన

జాతిసమితి

ప్రతిష్ఠ విల్సనుమహాశయునకు దక్కినది. జాతిసమితినిర్మాణము లోపభూయిష్ఠం

బైనను ప్రపంచశాంతికి స్థాపిత మైన మహాప్రతిష్ఠాపన యని కాలము సమర్థింపఁగలదు. పరాజితజాతులకును పరాధీనజాతులకును ప్రస్తుతము సమితియందు స్థానము కలుగలేదు. వర్తమానలోకస్థితియం దీవ్యవహార మని వార్యము. జాతిసమితి ధర్మవిజయధర్మమును ప్రతిపాదింప సమకట్టినను యూరపురాజ్యముల నావహించిన బలధర్మవ్యామోహ మింకను ప్రబలముగ నున్నది. జాతిసమితి శాంతిస్థాపనమునకు బలసాధనమును నమ్ముచున్నది గాని ధర్మసాధనమును నమ్ముటలేదు. జాతిసమితియందు చేరిన జాతులు ప్రత్యేకప్రయోజనములకై పెనఁగులాడుట సహజము. ఫ్రాన్సు శుభస్థితి జర్మనుల బాహుబలవిధ్వంసము గోరుచున్నది. ఇటలీ దేశలాభము నపేక్షించుచున్నది. గ్రేటుబ్రిటను సామ్రాజ్యసంరక్షణము నభిలషించుచున్నది. అమెరికా జపాను రాజ్యములు వ్యాపారలాభము నాకాంక్షించుచున్నవి. ప్రత్యేకరాజ్యముల ప్రయోజనములు బలాధారముననే సాధింపఁదగియున్నవి. మిత్రమండలికి విజయము బలమూలముననే కలిగినది. లోకావృతంబైన బలధర్మము క్షీణించుటకు కాల మవశ్యము. శ్వేతజాతులు బలధర్మాధారమున మహాసామ్రాజ్యములను స్థాపించినవి. బలధర్మాధారమున స్థాపితము లైన సామ్రాజ్యములందు ధర్మస్వాతంత్ర్యసిద్ధాంతములను స్థాపించుట మానవస్వభావమునకు విరుద్ధము. సమితియందు పాలకజాతులు పాలితజాతుల ప్రయోజనములను గమనింపవలయు నను నియమము గలదు. స్వప్రయోజనపరాయణు లైన పాలకులు పాలితుల ప్రయోజనముల నేవిధమున సంరక్షించెదరో భావికాలము దెలుపఁగలదు. జాతిసమితియందు సకలజాతులకును విభేదము లేక సమానపదము సంప్రాప్త మైనపుడె సమితిప్రయోజనము వర్ధిల్లి స్థిర మగు శాంతిస్థాపనము సాధ్యము కాఁగలదు. భరతవర్షమునకు పరోక్షముగ వలస రాజ్యములకుఁ గల ప్రతిపత్తియె సమితియందు కల్పింపఁబడుట శుభసూచకము. కాని, భారతీయులకు స్వదేశమునందు నయితము వలస రాజ్యములకుఁ గల ప్రతిపత్తి కలిగినఁ గాని సమితిప్రవేశము ప్రయోజనకరము గాదు. జాతిసమితియందు శ్వేత శ్వేతేతరజాతివిభేదమును పరిత్యజింపవలయు నని జపాను ప్రతిపాదించిన తీర్మానమును సమితి నిరాకరించుట సంతాపకరము. అశోకచక్రవర్తికి ఉత్కళరాజ్యవిజయానంతరము గలిగిన ధర్మవైరాగ్యస్వభావములనువిల్సనుమహాశయుఁడు జాతిసమితియందు ప్రతిష్ఠింప సమకట్టెను. అశోకచక్రవర్తి శిలాశాసనమునందు లిఖించిన శాంతిధర్మసందేశములు నేఁటికిని చిరస్థాయులై లోకోద్బోధమునకు పరమసాధనంబులుగ నున్నవి. అశోకుని పదుమూడవ శిలాశాసనమునందు

"ఏ మానవుడు గాని తన కన్యాయివలన బాధ కలిగినను సాధ్యమగునంతవఱకు నా బాధను సహింపవలసిన దని ప్రభు వభిప్రాయపడుచున్నాఁడు."

అని శాసించెను. ఇరువదిరెండు శతాబ్దులకు పూర్వ మశోకుఁడు బలవ్యామోహమును నిరసించి ధర్మారాధనమును జేసిన యితిహాసము జాతిసమితికి గుణపాఠముగ నుండఁగలదు. జాతిసమితి తెల్లనల్లజాతుల చిన్నపెద్దజాతుల విభేదమును విడిచి లోకసంగ్రహమును బూని మానవకల్యాణమున కాయత్త మగునట్లు భగవంతుఁ డనుగ్రహించుఁగాత!

ఉపసంహారము

సకలభూతహిత మైన విశ్వభోక్తృత్వము తాపసులకు త్యాగులకు సాధ్యము. విశ్వవ్యాప్తం బైన విషయోపభోగము దుస్తరము, దుర్భరము, దుస్సహము. విశ్వవ్యాప్తం బైన మధురపదార్థానుభవ మసాధ్యము. విశ్వాధిష్ఠితం బైన భావానుభవము సాధ్యము, సహ్యము, సంభావ్యము. విశ్వవ్యాప్తం బైన మధురరసానుభవము సాధ్యము. విషయారాధనము దుఃఖభాజనము, కలహకారణము, మృత్యుమయము. భావారాధనము సుఖదాయకము, శాంతిసంధాయకము, అమరప్రదము. తాపసులు త్యాగులు విషయనిరసనమును భావారాధనమును జేసి శాశ్వతబ్రహ్మపదము నధిష్ఠించిరి. మహానుభావులు రాజ్యత్యాగమును ప్రాణత్యాగమును సర్వత్యాగమును జేసి భావారాధనపరాయణులై విశ్వభోక్తృత్వమున కర్హు లైరి. పురుషప్రకృతిపరిణయము విశ్వరూపము. అనంతరూపములు రసములు నాదములు భావములు మహాకల్యాణవైభవమును బోధించుచున్నవి. రాధాకృష్ణుల లీలావిహారములు లక్ష్మీనారాయణుల వైభవవిలాసములు వాణీహిరణ్యగర్భుల వేదవాక్యములు గౌరీశంకరుల తపఃప్రభావములు పరిణయరహస్యమును దెలుపుచున్నవి. విశ్వకల్యాణమునందు వరుఁడు యువకుఁడు, వధువు ప్రౌఢ-వృద్ధ. వధూవరుల సాంగత్యఫలము భావక్రియానుభవసంధానమునందు సువ్యక్తముగ నుండును. భావసామ్రాజ్యమునకును కర్మసామ్రాజ్యమునకును సం

యోగసమన్వయము శాంతిని, వియోగప్రతిఘటనము విషాదమును కలిగించును. కర్మసామ్రాజ్యానురక్తులైన పాశ్చాత్యులు భావసామ్రాజ్యాభిషేకము నభిలషించుచున్నారు. భావసామ్రాజ్యానురక్తులైన ప్రాచ్యులు కర్మసామ్రాజ్యాభిషేకము నభిలషించుచున్నారు. యుగయుగములం దీగహనసమస్యను సాధించుటకు త్యాగులు తమ జీవితములను సమర్పించిరి. మహాసంగ్రామములు సంప్రాప్తములైనవి. పరివర్తనములు జరిగినవి. ప్రళయములు సంభవించినవి. సంక్షోభము గలిగినది.

వర్తమానయుగమునం దీ గహనసమస్యానిర్ణయమునకు విశ్వప్రయత్నములు జరుగుచున్నవి. గతయుగములందు మహావ్యక్తులు గహనసమస్యను నిర్ణయించుటకు వహించిన భారమును వర్తమానయుగమునందు ప్రజాసామాన్యము నిర్వహింపఁబూనుకొనుట విశేషము. రాజ్యధర్మాధారమున వర్తమానయుగమునందు వ్యక్తుల యోగక్షేమములను జాతుల యోగక్షేమములను సంరక్షించుటకు మానవహృదయములందు సంకల్ప మంకురించినది. స్వల్పరాజ్యసంరక్షణము జాతీయస్వాతంత్ర్యసంరక్షణము సత్యాగ్రహము ప్రజాస్వామ్యత్వము జాతిసమితి రాజ్యధర్మాధారమున దేహధర్మమును నాత్మధర్మమును సమభావముఁ బాలించుటకు సమకట్టుచున్నవి. సకలజనులకు జాతులకు తమ ప్రత్యగాత్మసంరక్షణమునకు వికాసమునకు సాధనంబు లేర్పడినపుడె లోకోద్ధారకమైన గహనసమస్యానిర్ణయము సాధ్యము కాఁగలదు. భారతరాజ్యాంగసమస్యకును నాంధ్రోద్యమసమస్యకును లోకవ్యాప్తంబైన గహనసమస్యానిర్ణయమే పరమప్రయోజనము. ప్రజలకు దేహపోషణమునకు నాత్మవికాసమునకు భావకర్మారాధనానుకూలంబైన శుభస్థితి యవశ్యము. వర్తమానయుగమునం దొకప్రదేశమునఁ బుట్టినభావము లతివేగమున లోకవ్యాప్తి గాంచుచు ప్రజాప్రబోధమును కలిగించుచున్నవి. విల్సను మహాశయుని సద్భావములు మానవుల హృదయములందు మహదాశాంకురములను పల్లవింపఁజేసినవి. లోకావృతంబైన యాశాలతలు భారతీయుల హృదయములందును పల్లవించినవి. పల్లవించిన యా యాశాలతల ఫలింపఁజేయు భారము భారతీయులమీఁదను బ్రిటీషు రాజ్యనీతిజ్ఞులమీఁదను గలదు. భారతీయులను వ్యవసాయపరాయణులను జేసియు పాలకవర్గము నుద్బోధించియు భారతమాతను గమ్యస్థానము చేర్చుటకు భగవదనుగ్రహము శరణ్యము. లోకావృతంబైన స్వపరిపాలనాభిలాష సిద్ధార్థిసంవత్సరమునందు వర్ధిల్లి లోకమునకును బ్రిటీషు సామ్రాజ్యమునకును భరతఖండమునకును నాంధ్రదేశమునకును కామితార్థముల నొనఁగూర్చునట్లు సిద్ధార్థుఁడు సిద్ధార్థములను బ్రసాదించి సకలజనులను రక్షించుఁగాత!

స్వాతంత్ర్యము

కవిమండల వేంకటరావు గారు, బి. ఏ., బి. ఎల్.

సంద్రంపుఁ దరఁగపైని జాల్వెల్లి నురగపైని
స్వాతంత్ర్య మూఁగుచుండె
నుయ్యాల లూఁగుచుండె
ఆకసపుఁజుక్కలోన నవనిపై మొక్కలా
స్వాతంత్ర్య మెసఁగుచుండె
మిసమిసలు కొసరుచుండె
పైరగా లీలలందు బగలురేవేళలందు
స్వాతంత్ర్య మాడుచుండె
భావమునఁ బాడుచుండె

దేశములు గూడుచుండె
భాస లూక టాడుచుండె
సంతతపు శాంతిపథినే
వింత నది వెలయుచుండె
ఆశయం బదియ సుమ్మా!
భాసమానంబు కనుమా!
ఆ సూర్య వేఁగులెమ్మా
స్వాతంత్ర్య మెందునెందు
చూతు మటఁ బుట్టుఁ గందు

ఉగాది

మంగిపూడి వేంకటశాస్త్రి గారు

ఒ[illegible] [illegible] [illegible] స్వానాసశోభ[illegible]
వెలియుచు కోమలత్వమును వీడి యసారతఁ జెంది మ్రానువై
వెలయు లతాప్రసూనములు నవీనవసంతవిలాసరక్తి నె
క్కొలిపి [illegible] దయ[illegible] వైభవో
జ్జ్వలితము [illegible] ప్రతిభారతిభారతి[illegible] విశాలమున్

ఉ. యూరపుఖండమందున మహోగ్రగతిన్ జ[illegible]చి [illegible]యొక్కటై
ధాత్రిని నాక్రమించి బహుదారుణమారణయంత్రనైపుణిన్
[illegible] తృప్తి [illegible] కీర్తికిన్
భారతభూ[illegible] పాత్రములై నుత గాంధి [illegible]తన్.

చ. మధురవసంతకాలమున మామిడిలేతచిగుళ్లు మేసి యా
సుధ నొలికించు గీతములఁ జొక్కఁగఁజేయు పికాళిపోలె రా
జ్యధనబలప్ర[illegible]భకలహోగ్ర[illegible] ప్రపంచమున్
బ్రతి[illegible]తభవ్యబుద్ధు[illegible]
బుధు లిట ధర్మదాత లయి ప్రోతురు [illegible]శాంతిశోభలన్.

సీ. హింసాలోకంబున హెచ్చిన యలనాఁడు సిద్ధార్థుఁ డను పేర సిద్ధచరితుఁ
డగు బుద్ధుఁ డుదయించి యా యుపద్రవ మాపె బోధించి జనులకు భూతదయను
సిద్ధార్థి యిది గాన సిద్ధింపఁగాఁజేయఁ జాలును చిత్తోపశాంతి మనకు
ధర్మసంస్థాపనార్థము భగవంతుండు గాంధి రూపంబునఁ గలిగినాఁడు
కలిపినన్నాఁడు చిత్తనిగ్రహ మతండు, దీని కాణాచులే భారతీయు లగుట
మీ తపశ్శక్తి నిఁక విజృంభింపఁ జేసి, లోకముల బ్రోవరయ్య! సుశ్లోకులార!

చ. ఎలమిని నాంగ్లదేశమున కేఁగెడు భారతరాయబారముల్
[illegible] శోభనముఁ గూర్చెడుఁగాక్షుత మార్యభూమికిన్
వెలయుచు నవ్యభారతము విశ్రుతలీలను దన్ను నాంగ్లభూ
తలమును నెల్లలోకము నుదారత రక్షఁ జేయఁజాలు కౌ
శలమహిమంబు నీశ్వరుఁ డొసంగి దయారతిఁ బ్రోవుఁగాక్షుతన్.

నన్నయ్యభట్టు వంశపు కవి — గోపాలుని రామకవి

బారిష్టరు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారు

నేను గుంటూరు కాలేజిలో చదువుకొనుచుండఁగా ఫిరంగిపుర వాస్తవ్యు లగు లేటు చిలకా కృష్ణయ్య పంతులు గారు నన్నయ్యభట్టు మహారాష్ట్రుఁ డని గురుజాడ శ్రీరామమూర్తి పంతులు గారు వ్రాసి రనియు అది సరి కా దనియు నన్నయ్యభట్టు వంశమువారు గుంటూరి జిల్లా వినుకొండ తాలూకాలో నున్నా రనియు చెప్పియుండెను. ఈ కృష్ణయ్య గారి కింగ్లీషు రాకున్నను సంస్కృతాంధ్రములలోఁ దగుపాటి సాహిత్యమును ఆంధ్రదేశపు పూర్వచరిత్రలోఁ జక్కని యభినివేశమును తన రకపు పండితులకంటె నెక్కువ విశాలదృష్టియుఁ గలిగియుండెను. దీని విషయమై విచారణ చేయవలయు నని కృష్ణయ్య గారి కభిలాష యుండెను గాని వారి కకస్మాత్తుగా మరణము సంభవించుటచే ఆ విచారణ యంతట నిలిచిపోయెను. కృష్ణయ్య గారి మేనల్లుఁడు ప్రస్తుతము నరసారావుపేటలో ప్లీడరుగ నున్న నడింపల్లి జగన్నాధరావు పంతులు గారు ఈ విషయమై కొంత విచారించి గోపాలుని రామకవిచే రచింపఁబడిన గ్రంథము నొక ప్రతిని సంపాదించియుంచినారు. గోపాలుని వంశమున నితర కవులుఁ గల రనియుఁ దెలియవచ్చినది. జగన్నాధరావు గారు ఈ విషయమున నింకను కృషి చేసి ఈ తాలూకాలో తమకుఁ గల పరపతి నుపయోగింతు రని తలంచెదను. ప్రస్తుతము రామకవిని గూర్చి తెలియవచ్చినంతవఱకు వ్రాయుచున్నాను.

ఇప్పుడు దొరకిన ప్రతి కొండవీటి కాగితములపై వ్రాయఁబడి మిక్కిలి శిథిలమై యున్నది. వినుకొండ తాలూకా ముప్పాళ గ్రామములో గోపాలునివారి గృహమునందు మఱియొక తాళపత్ర ప్రతి గల దఁట. అది దీనికంటె పూర్వపు దని వింటిని. ఈ కాగితపు ప్రతిలో మూఁడు గ్రంథములు వ్రాయఁబడియున్నవి. ప్రతి విలేఖకుఁడు 'గోపాలుని కృష్ణయ్య. దీని మూలగ్రంథము ఇప్పటికిని గల దని వింటిని.

పారిజాతాపహరణము

ఈ ప్రతిలోని మొదటి గ్రంథము పారిజాతాపహరణ మను యక్షగానము. ఇది వీథినాటకముల ఫక్కి నుండును. కృతికర్త కృతిభర్తల పేర్లు లేవు. దీని మొదటి పుటలు పోయినవి.

II ద్రౌపదీస్వయంవరము

రెండవ గ్రంథము ద్రౌపదీస్వయంవరము. ఇది మూఁ డాశ్వాసముల ద్విపదప్రబంధము. దీనిలోని

"మదనాదిపురవాసు మూర్తివిలాసు
సదమలగుణశాలి సత్యసంశీలి
పుట్టినామాత్యసత్పుత్రుండు నీతి
బట్టినఁ దగ వీరభద్రసత్కవిని"

అను దానివలన కవి పేరు వీరభద్రుఁ డని తెలుచున్నది. మఱియు,

వసుధలోపల సూర్యవంశంబునందు
పొసఁగ జన్మించిన పుణ్యపురుషుండు
కరుణాపయోనిధి గాంభీర్యమూర్తి
ధరలోన నెన్నఁగఁ దగినట్టి ఘనుఁడు
రమణతో శ్రీకనకరాజు చెన్నప్ప
క్రమముతోడుత నన్నుఁ గర మర్థిఁ బిలిచి.

అనియు,

మేరుధీరుఁడు బుద్ధి మించినవాఁడు
సకలపురాణముల్ సకలశాస్త్రములు
సకలవిద్యలు నెఱుఁగు జాణశేఖరుఁడు
గండరగండాంకగండభేరుండ
దండిబిరుదాంకుఁడై తనరారువాఁడు
పరఁగ సరస్వతీభండారమునకు
ఇరవొంద నెఱిఁగిన యినకులోత్తముఁడు

అనియు కవి కృతిభర్తను గూర్చి వ్రాసియున్నాఁడు. కవిని గూర్చియు కృతిభర్తను గూర్చియు ఇంతకంటె నిప్పుడు తెలియదు.

III చిత్రాంగదాపరిణయము

ఇది యొక పద్యకావ్యము. కవి గోపాలుని రామకవి. కావ్యము అహోబలనరసింహస్వామి కంకితము. ఇది కొంచెము ప్రౌఢముగా నున్నది. ఇప్పుడు దొరకిన ప్రతిలో రెండవ యాశ్వాసము కొంతవఱకే వ్రాయఁబడియున్నది. చివర పద్యము పూర్తిగ నయినను

వ్రాయఁబడి యుండలేదు. కాలము నిర్ణయించుటకు సరియయిన యాధారములు కనఁబడవు. గ్రంథములోని విషయములను బట్టి కవి మిక్కిలి ప్రాచీనుఁడు కానట్లు తోఁచుచున్నది.

కవి యాదియందు త్రిమూర్తులను వారి భార్యలను విఘ్నేశ్వరుని హనుమంతుని తార్క్ష్యుని కుమారస్వామిని కౌమోదకీఖడ్గశార్ఙ్గములను పూర్వఋషులను స్తుతించియున్నాఁడు. షష్ఠ్యంతములు గలవు.

గురుఁడీ విధముగా స్తుతింపఁబడి యున్నాఁడు:

క. పొంగుచు తారకయోగవి
ధిం గల లక్ష్మ్యుభవము దెలుపుచు మహారా
జాంగవిభుని మధ్యమ పర్వ
పింగని శివరాఘవుని సేవింతు మదిన్.

ఈ గురుఁ డెవ్వరో మన కింకను తెలియవలసియున్నది.

కవిస్తుతి:

సీ. రామాయణార్థపూర్ణవివేక వాల్మీకి
విశ్రుతానుకవిప్రవీణు బాణు
విమలసాలంకారవిఖ్యాతి భవభూతి
మానితశబ్దసమాజు భోజు
మూర్ఖాంధ్యోత్సన్నలిమూరవి భారవి
కవితావనోల్లాసుఁ గాళిదాసు
సహజోపమానని స్తంద్రుఁ జోరకవీంద్రుఁ
సుశ్రేష్ఠ్యకవితామయూఖు మాఘు
నా మనంబునఁ దలపోసి నన్నపార్యు
సోము భాస్కరభీమాదిసుకవిజనులఁ
బ్రణుతి గావించి శ్రీనాథు రంగనాథుఁ
బోతనార్యుల స్మరియించి పూజఁ జేతు.

పై పద్యమున శ్రీనాథుఁడును పోతనార్యుఁడును స్తుతింపఁబడి యుండుటచే కవి 15-వ శతాబ్దికి తరువాతివాఁ డనుట నిశ్చయము. ఏ కాలమువాఁడో నిశ్చయముగఁ జెప్ప వీలు లేదు.

చ. అటఁ జని కాంచె సాంద్రమసృణ దభ్రనటీవరతానమానవి
స్ఫుటకలషడ్జగానభవభూరిభయార్తిపలీనగూఢపా
త్పటలజుష్కుకీచకలభస్పణహేతుతరంగరంగదా
ర్భటపటునిర్ఝరీవిశదదిక్ప్రవిశాలను శ్రీశైలమున్.

ఈ పై పద్యమును అల్లసాని పెద్దనయొక్క "అటఁ జని కాంచె భూమిసురుఁడు..." అను పద్యముతోఁ బోల్చినయెడల వీరిలో నొకరు రెండవవారి ననుసరించియుందు రని చెప్పవచ్చును.

మన కవి పెద్దన ననుకరించినయెడల పెద్దనకు తరువాతివాఁడు అనఁగా 16-వ శతాబ్దిలోనివాఁడో తరువాతివాఁడో అయిన దెలియవలసియున్నది. ప్రస్తుతము కవికాలవిమర్శనము నింతటితో విరమింతము.

కవివంశము

కవి ఆశ్వాసాంతమున నిట్లు వ్రాసియున్నాఁడు:

గద్య. ఇది శ్రీమదహోబళలక్ష్మీనరసింహకరుణాకటాక్షవీక్షణవిచక్షణాక్షీణమహిమాకలితలలితకవితావిలాస మృదుమధురవచనరచనావిలాస గోపాలయాన్వయాంభోనిధిసంపూర్ణశోహిణీకళత్ర మౌద్గల్యసగోత్రపవిత్ర ఆపస్తంబసూత్ర యోగానందయామాత్యపుత్ర సరససన్మాన రామాభిధాన ప్రణీతం బైన చిత్రాంగదాపరిణయం బను శృంగారకావ్యంబునందు ప్రథమాశ్వాసము సంపూర్ణము.

దేవతాదిస్తుతు లయిన తరువాత నీ విధముగా నున్నది:

వ. మద్వంశక్రమం బభివర్ణించెద.

మ. వివిధామ్నాయపురాణశాస్త్రపటిమావిష్పన్నుఁ డధ్యాత్మమా
ర్గవిశేషప్రతిపాదమానసుఁడు సాంఖ్యస్థైర్యనిష్ఠానుయో
గవినోదానుభవప్రమోదుఁడు తపోగ్రజ్వాలి మౌద్గల్యమా
నివరేణ్యుండు ప్రకాశ మందె ధరణిన్ విజ్ఞానపారీణుఁడై.

క. ఆ మౌద్గల్యసగోత్రుల
లాముఁ డనఁ బొగడ్తగని యిలన్ శబ్దపటి
ష్ఠామేయదక్షశిక్షా
కాముఁడు నన్నయ జనించె గణనాగణుఁడై.

సీ. తగ నంధ్రశబ్దచింతామణి పంచప
రిచ్ఛేదనియతి నిర్మించె మొదల
గణవర్ణకూటలక్షణశుభాశుభఫల
శిక్షాప్రబంధముల్ చేసె నాడి
కవిజనాళికిఁ జమత్కారకల్పనలను
మించి జాడల నేర్పరించెఁ దొలుత
సంస్కృతం బంధ్రభాషాయుక్తి సాధించి
నిర్దుష్టనామముల్ నిలిపె రూఢి
భారతామ్నాయపాథోధిపటిమఁ దెలిపి
వేడ్క నీడ నపేక్షించి విబుధు లెల్ల
నౌర! నన్నయభట్టు విద్యలకు రట్టు
సుకవి వాకట్టు సత్కవి కోటగట్టు.

క. ఆ నన్నపార్య వంశాం
భోనిధిసంపూర్ణచంద్రు పోలికను దయా
సూనగుణాలంకారుఁడు
ధీనిధి గోపాలుఁ డమితతేజుఁడు పుట్టెన్.

సీ. పిన్న యీడున జను లెన్న వ్యాకరణాది
శాస్త్రపరిజ్ఞానచణతఁ గాంచె
సకలవేదపురాణసంహితా-చిత్వార్థ
వాచక ప్రజ్ఞాప్తి పన్నె కెక్కె
తత్త్వజ్ఞుఁడై సాంఖ్యతారక ప్రఖ్యాత
రాజవిద్యాప్రచారములఁ బ్రబలె
లయ మొప్పఁగా మంత్రలయహఠాదులను యో
గాభ్యాసరూఢి దేహంబు మఱచె
దీక్ష లొప్ప నహోబలతీర్థమందు
నృహరినిం గూర్చి పెక్కు నాళ్లహరహంబు
తపముఁ గావించి మెప్పించి తగిన వరము
లందె గోపాలుఁ డార్యమహాత్ముఁ డగుచు.

క. ఆ వంశమున ననేకులు
ప్రావిర్భవ మంది శెలమి పారంపరయా
ధీవర్యులు గుణధుర్యులు
ప్రావీణ్యులు రాజకార్యపరతాగణ్యుల్.

ఉ. లాలితపాకశుద్ధి శుభలక్షణలక్ష్యసమృద్ధి నవ్యవా
గ్జాలవిధంబులైన రసకల్పితమాధురి శబ్దధోరణీ
లాలనయుక్తి సాధకవిలాసము లౌ భళి మెచ్చవచ్చు గో
పాలునివారి యిల్లునికిపట్టు గదా కవితామతల్లికిన్.

సీ. సకలరాజస్థానజనమనోరంజన
ప్రచురశేఖరులు గోపాల్నివారు
ప్రత్యక్షబాహాటపాంచాలనటసాధ్య
పాఠకచణులు గోపాల్నివారు
హితజనపాలనోచిత కార్యకృతకృపా
పారీణమతులు గోపాల్నివారు
... ...
ప్రకటయోగానుభవులు గోపాల్నివారు
అట్టి గోపాల్నివారిలో నలఘువిభవ
డిక్రవిభుస్థానపాలి సందీప్తహేళి
రమ్యగుణహేళి నూరపరాజమౌళి.

శా. నానార్థయుక్తిబలప్రవీణతల విన్నాణంబుగా రాజసం
స్థానామాత్యవిధుల్ రచించి బుధసామ్యస్థాప్యసంపాదనా
హీనస్థాపన న్సేవితించి వికటించేవారి నుగ్గాడె యో
గానందుండు నియోగినై పుణత లాహా చెప్ప నాశ్చర్యముల్.

... ...

వ. (యోగానందునివలన) ఆమెకు రామన వెంకన యన నాత్మజులు సంభవం బంది రందులో రామకవివర్యుఁడ సదా హరిసత్కృపా కటాక్షప్రలబ్ధపాఠకచణుండ.

పై పద్యములవలన కవి తాను నన్నయభట్టార కుని వంశమున జనించినట్టు స్పష్టముగఁ జెప్పియున్నాఁడు.

వినుకొండ తాలూకాలోని ముప్పాళ్ళ మొదలగు గ్రామములయందును దరిశి తాలూకాలోని కొన్ని గ్రామములయందును మౌద్గల్యసగోత్రులును ఆపస్తంబ సూత్రులు నగు గోపాలునివారు అనేకు లున్నారు.

నన్నపార్యుఁడు ఆదిపర్వములో తన్నుఁ గూర్చి

సీ. తన కులబ్రాహ్మణు ... ...
... ...
లోకజ్ఞు నుభయ ... ...

అని చెప్పుకొనియున్నాఁడు. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు నన్నపార్యుఁడు "తన కులబ్రాహ్మణు" అని వ్రాసికొనియుండుటచేతను భట్టబిరుదాంకితుఁడగుట వలనను వైదికశాఖవాఁడనియు, గురుజాడ శ్రీరామ మూర్తి గారు పైపద్యమున నన్నయ్య "లోకజ్ఞ" అను విశేషణము నుపయోగించుకొని యుండుటచే వైదిక లౌకికములు రెండునుఁ గలిగియున్నాఁడనియు, అందు వలన నతఁడు చాళుక్యులతో నేతెంచిన మహారాష్ట్ర బ్రాహ్మణుఁడై యుండనోపు ననియు వాదించియుండిరి. కాని, అవి నట్టి యూహలు. శ్రీనాథునకును భట్టు అనియు ఆచార్యుఁడనియు బిరుదములు గ్రంథముల వలనను శాసనములవలనను స్పష్టముగ నున్నవి. గోపాలునివారు ఇప్పటికిని నన్నయసంతతివార మని చెప్పు కొందురు. రామకవియు నట్లే పైఁ జెప్పినట్లు వ్రాసి యున్నాఁడు. ఈ గోపాలునివారు ఆర్వేలనియోగులు. వీరు పాకనాటిశాఖకు చెందియుందురు.

(పై పద్యములలో లేఖకప్రమాదములను సవరింపలేదు.)

పురుషకారము

ఏనమండ్ర నారాయణమూర్తి గారు, బి. ఏ.,

ఊర్జితమతిం గలిగి యొప్పరిక ముదుగు జయా, మొందు సుఖముల్ పడతు వేగన్
విన్ము బ్రతుకారం గని, విన్న పరమార్థము న, విస్తరముఁ జేతు నొక మాటన్.
విత్తనము సస్య మగు యత్నము శుభంబు లగు వ్రేయని కృపాణ మెటు నఱకున్?
వేఁడకు మనాథవలె వేఁడి విధి దూఱక వి, వేకమున శ్రేయముల కెడమై;
స్వప్నమున నైన మది నల్ప కెపుడో యెటులో చట్టున జయం బగురు నంచున్ —
నమ్ము పురుషార్థములు సౌ స్మ్యవని కెల్లపుడు నవ్య మయి పౌరుష మెలర్చున్!
నైజ మగు తేజము కళంక మగు మానుషము, నాకమ్ముగా నెచటఁ గునుకున్,
జవ్వనము శక్తియును జన్న తఱి స్రుక్కుదువు జన్మ వెడపుచ్చితి నటంచున్,
కొలఁది యని లేదు నరు శక్తి నిరవగ్రహ మ, కుంఠితము వాఁడితివ యేనిన్,
పౌరుషుని జగదుద్ధరణ కోవిదులఁ జూచుచును, బోలు నె నిరర్థకుఁడ వౌటల్!
ఎవ్వరికి వారె — ప్రియు లైన రిపు లైన భ్రమ లేల భవలీల యిది సుమ్మా,
నమ్ము నరదైవముల నమ్ము శ్రుతు లైన విను నమ్ముకొను మాత్మబల మొకటే.
దేహబల మొసఁగి పయి, ధీబల మొసంగి నిను దేవుఁ డెపు డరసికొని యున్నే?
సాయపడఁ డెన్నఁటి కసాధ్యమయి నీకొలఁది చాల దని క్రొత్రుపడ నేటికున్,
విద్దెములు నేర్పుటకు వెడలునొకొ తల్లి రణవీరుఁడగు సుతుం డసికి నడుపన్?
ఒప్పిదము లెఱుంగు కర మోరిమిని గల్గు మొగ మోటపడ కాత్మహితరచనన్,—
అరయు బలాబలము లారయు హితాహితుల నారయు ప్రపంచవిధ మెల్లన్
శత్రువుల నెన్నఁటికి, నైచ్యకము వెత్తనము జరుపుకొను లోక మెదిరైనన్.
బ్రతుకు కనఁగ బందిము గా సాయము సమర్థతయుఁ బంతము గలాఁడె ఋహి మీఱున్,
బ్రతుకనకు స్వార్థజగదర్థపరమార్థములు, ప్రాపు లెది పనైన నుడివోవున్!

కష్టసుఖములు

దుఃఖమా! ఔదరింపు లేఁటికి దొరవఁ జే నినుఁ దలఁచి వెఱవఁగ?
చక్కఁగాఁ బరికించి చూచితిఁ, జాలఁ దెలిసితి నీస్వభావము!!
దద్దఱింతువు మంటిపులివలె, దవ్వుదవ్వుల నుండు వఱకే
ఒద్ది కరిగితో మచ్చికైతివి, గొడిసి కైకొని స్వారి చేతునో
కాని యెప్పటి కప్పుడే నిను, గండ్ర వని మది బ్రమయు మందును
మెట్టుమెట్టున కడలు చుందును, మీఁది కెగయుచు నవ్వుకొందును
జ్ఞానమును ధైర్యమును గలిగినఁ, గాని నీపైఁ జొరదు మంత్రము
నిన్ను గత్తము వెట్టినప్పుడె, నేర్చు ధైర్యము చిగురు దొడుగఁగ
ఎఱిఁగి నిన్ను జయింపఁగలిగితి, నేని బానిసవై మెలంగుదు
వెఱుఁగ కోడితి నా చలంబున, నిహపరంబులఁ బొల్లసేతువు
నీదు కొలిమిని గరఁగినప్పుడు, నీటు నిగారుదు మేలిమైతిన
కాక నీరసజాతి నైతిన, కగ్గుదును పై మెఱుఁగుఁ బాయుచు
శీలమును శమము న్దమంబును, జేడియులు నీ తోడు నీడలు
నిన్ను గెల్చినవానిఁ జేర్తువు, నెనరు గూర్చుదు వీర్యానితో
మచ్చరంబు భయంబు క్రోధము, మానసవ్యధ నీదు జోదులు
వాని కిత్తువు నీవు గెల్చిన, వాని ధర్మవిరక్తిఁ జేయుచు
నీదు భామ ముడి కోడి తడఁబడు, నేరమియుఁ బరవశత కన్నడ
వానతఱిఁ గోయిలలవలెఁ దా, వలసు మార్తురు కేళిసచివులు
కవలు సఖులు సుఖంబు నీవును, గాని యా నగలాడి - చెప్పను
వలపునవ్వుల వెక్కిరింతల, వన్నెలం బడి లోక మెఱుఁగదు!
ఒరుల కష్టసుఖంబు లగునన? యుపకృతులఁ గై సెక్కు మెచ్చన!
పగలు రాతిరి యాటపాటలఁ, బంగరుగులఁ జెవు డెత్తియుండును
తనకుఁ దోఁపదు పరకు నేర్పదు, తండ్రి నైనను కావు చెప్పన
నెగిరి విసవిస మంటఁ దాఁకెను, నీఁగి పోలిక పీఁగి చేర్పును!
ఏమి కావర మేమి కుత్సిత, మేమి ప్రల్లద మేమి ప్రజ్ఞలు!
నిలువ నెక్కడ దాని ధాటికి, నీదు రాయికిఁ గాక పోయిన?
ఎగిరి దుముకుదు పిడుగు వడ్డను, నెదట నుండదొ దాని యురమున
నదరి వడవడ బెదరి యంతట, నరసు నొరఁగొను నుంచి చదలు
పవలు రేలు సుఖంబు నీవును, భవశిలాంగర ఘాంగరయుగ్మము!
క్షితి విహంగము కడపు రెక్కలు, జీవయాత్రయుఁ గాక కావడి;
బ్రతుకు పడవకుఁ జాప సౌఖ్యము, బరువు లంగరు గోలు దుఃఖము
సుఖము మద్యము నీవు మాత్రవు, సుఖము స్వైరిణి నీవు సాధ్వివి
విరుల రాశి సుఖంబు నీవో, వీరపత్నివి నీవు మాతవు
కాని — మఱవను — యెంటి గెల్చినఁ, గాని దొరకదు దేవు సన్నిధి.

కం. కందుకూరి వీరేశలింగము పంతులు గారు

I వడ్డాది సుబ్బారాయుడు గారు

ప్రత్యేకవిత్రయమున మెరయు రాజమహేంద్రవరంబునందు నె
న్నిక గలవారిలోపలఁ గనిష్ఠిక నెక్కిన జ్యేష్ఠునాంధ్రగ
ద్యకవనముఖ్యవిశ్రుతుని ధైర్యనిరాకరులఁ గందుకూరివం
శ్రీకులజు మిరియాలశీలచరిత్ర ముగింపఁగఁ జన్నెఁ జెన్నపోల్.
జననం బొందెను తన్మహేంద్రపురిఁ; జిన్యత్వంబునం దచ్చటి
ఘనవిద్యాలయమందె విద్యఁ గఱచెన్; గాలేజి సర్వీసునే
తెనుఁగొజ్జయ్యె; దిగంతగప్రథను నందె కాంచె సంస్కర్త నాఁ;
గొనియోయెన్ దుది లింగమూర్తి విధి దగ్ధుం జేయఁగాఁ జెన్నపోల్.

ఆ. రత్నలింగకవులు రాజమహేంద్ర చె
న్నపుర పండితులుగ నారు మూఁడ్;
రట్లె మాకుఁ దచ్చిత్రాలోకనసదంబు
లదిగ! దైవఘటన లతినివృతలు.

తే. క్రైస్తశకంబు విధిసోపరన్నిభువుల
జరుగు సిద్ధార్థి వైశాఖ చరమపక్ష
పుంద్రయోదశిఁ గుజవారమునను జనియెఁ
గందుకూరి వీరేశలింగకవి దివికి.

క. జబ్బుగ నుండియె మనియెను
డెబ్బదియొండేండ్లు, ధీపటిష్ఠత నెన్నెఁ
గబ్బములు వ్రాసి ప్రజ మన
సుబ్బించెను, లింగకవి నిరుపమానుఁ డనన్.

క. సుకృతము దుష్కృతమును బ్రా
యికముగ నరు జీవితమున దృష్టంబు లగున్
సుకృతమె కని యీశుఁడు లిం
గకవీశ్వరు నాత్మ కొసఁగుఁ గైవల్యంబున్.

II జె. సుబ్బారాయుడు గారు

చ. జలజలమంచు నశ్రుకణజాలము రాల మొగంబు వంచి చెం
గట వదనంబుఁ జేర్చికొని "కట్ట! కుమార! కుమార" యంచు పే
రెలుఁగున వెక్కివెక్కి యిటు లేడ్చెద వేటికి? నాంధ్రమాత! దుః
ఖిలఁదగ దూఱడిల్లు మిది కేవల ప్రాకృతికార్గ మమ్మరో!

గీ. దేశమాత ఋణంబును దీర్చకుండ
మృతిని జెందినవారి దుర్గతికి దుఃఖ
పడినఁ దగుఁగాని సార్థకభవుల సద్గ
తులకు మది దుఃఖపడనౌనె? వలదు! చెప్పుడు!

సీ. ఆంధ్రభాషకు నవ్యఁ మగు జీవనముఁ బోసి
ప్రబలఁజేసిన శతగ్రంథకర్త
దేశమునకు నాశీస్సిద్ధికం
కితుఁడైన సంఘసంస్కారకర్త
ప్రబలకష్టపరంపర లెదిర్చినను స్వమా
ర్గము వీడనట్టి దీక్షాపరుండు
వేనవేల్ రూప్యముల్ విద్యాలయాదుల
కర్పించి ధన్యుఁడైనట్టి దాత
దశదిశావ్యాప్తసత్కీర్తితనుఁడు ఘనుఁడు
దైవభక్తుండు వృద్ధుండు ధన్యజీవి
కందుకూరి వీరేశలింగకవి యతని
సాటి ఘను డెవ్వఁడమ్మ యీ జగతియందు?

గీ. మానవుం డెంత దనుక ధర్మంబు నిర్వ
హింపఁగలఁ డంతియును నిర్వహించి చనియె
నతనికై చింత నొందంగ నగునె నీకు
బ్రహ్మకల్పాంత మెవ్వండు బ్రతుకునమ్మ?

సీ. అతని సదుద్యమం బభివృద్ధి నొందంగ
నాశీర్వదింపు మో యాంధ్రమాత!
యతని జీవితము మా కాదర్శ మగునట్లు
లాశీర్వదింపు మో యాంధ్రమాత!
యతని సాటి మహాత్ము లాంధ్రభూమిని నిండ
నాశీర్వదింపు మో యాంధ్రమాత!
యతని పాపము లున్న వారియింపఁబడునట్లు
లాశీర్వదింపు మో యాంధ్రమాత!
యతని సత్కీర్తి కలకాల మలరుఁగాత
మనుచు నాశీర్వదింపు మో యాంధ్రమాత!
యతఁడు పరమాత్మతో నైక్య మందుఁ గాత
మనుచు నాశీర్వదింపు మో యాంధ్రమాత!

III బులుసు భైరవమూర్తి గారు

ఉ. భారతి! యాంధ్రదేశమున భవ్యులు నీకు సుపుత్రు లెంతయున్
గారవముం బొనర్పఁగ నఖండయశమ్మునఁ దేజరిల్లు నీ
కారయఁ బుత్రశోక మకటా గలిగింపఁగఁ జేసె దాన నం
భోరుహసూతి సంతసము పొందుచునుండఁగఁ బోలు నెమ్మదిన్.

చ. సకలకలావిశారదుఁడు శాంతుఁడు దాంతుఁడు సత్యవాది సాం
ఘికమతదోషలేశముల కీలకము ల్వరికించి తీర్చు సా
ధకుఁ డకలంక రాయబహదర్బిరుదాంకితుఁ డైన నీదు పు
త్రకుఁ డకటా! విషజ్వరవిధానమునం జనెనమ్మ భారతీ.

చ. చదువున రాజకీయమున సాంఘికధర్మములందు హీనతన్
బొదలిన యాంధ్రమండలినిఁ బూని మహామహనీయదక్షుఁడై

కొదవలఁదీర్చి యున్నతికి గొబ్బునఁదెచ్చిన నీ కుమారుఁ డా
త్రిదివము సంస్కరించెడు మతిం జనబోలును సుమ్ము భారతీ!

సీ. రూపకమ్ములు గద్యరూపప్రబంధమ్ము
లాంధ్రమ్మునను గూర్చినట్టి మేటి
మతదురాచారము ల్మాన్పి సంఘంబు సం
స్కారగ మ్మొనర్చు నిస్తంద్రచకుఁడు
స్వార్థంబు ప్రాణమ్ము లాంధ్రదేశమునకు
నర్పించినట్టి త్యాగాధికుండు
ఆంధ్రమండలి వెన్క నంటియుండఁగ మాత్మ
మార్గము ల్వెట్టిన సుహితమూర్తి
నీ కుమారుల నందఱ నిపుణుఁ డయిన
కందుకూరి వీరేశలింగ ప్రభుండు
వాలగలఁ గాంచె నంచు సుఖపడఁ దమ్మ
మ్మహలు గారవమ్మ భారతీ యుద్ధసాశులు.

చ. దినకరుఁ డస్తమించు తఱి తేజము నగ్నినిఁ జేర్చునట్టు లీ
యనఘుఁడు నాత్మతేజ మిట నాంధ్రసహోదరపాళిఁ జేర్చె త
ద్ఘను లిఁక నాంధ్రదేశహితతత్పరులై చరియించువార లో
జనని విచారము న్విడిచి శాంతముఁ బొందఁగదమ్మ భారతీ!

గీ. ఆంధ్రదేశమాతనౌ మాత యంచుఁ దలఁచి
యాంధ్రజనములె సోదరు లంచు నెంచి
ప్రాణ సర్వంబు మాకె యర్పణముఁ జేసి
చనిన యా ఘను నాత్మకు శాంతి యొదవు.

IV పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారు


సీ. దేశ మంతయు దాస్యదేవతారాధనల్
సల్పునప్డు నిరాశ గొల్పునప్డు
సంఘ మెల్లెడ దురాచారసంబద్ధమై
సాధుసంబాధల జరుపునప్డు
విజ్ఞానవృష్టి వివేకంబుతోఁ బాటు
నణఁగుట నంధత్వ మబ్బునప్డు
కులమతద్వేషముల్ గూండ్లు కట్టుకొనుచు
ఘోరకృత్యంబులఁ గూర్చునప్డు
కీలకాబ్దమం దాంధ్రత్వకీలకంబ
వగుచు రాణ్మహేంద్రవరాన నవతరించి
అభ్యుదయ మొందఁజేసి తీ వస్తమింతె?
కందుకూరి వీరేశలింగ కవివర్య!

సీ. ఆబాల్య మాంధ్రదేశాభివృద్ధికి నీదు
జీవితం బలవడఁజేసినావు
అయ్యో మాకిఁక నేమి యాఖరుగతి యను
నబలల కష్టంబు లణఁచినావు
ఆబాలగోపాల మాంధ్రంబుఁ జదువఁగాఁ
దియ్యని శయ్యలఁ దీర్చినావు
ఆంధ్రపండితుఁడయ్యు నాంగ్లులచే రావు
బహదూరు బిరుదంబుఁ బడసినావు
ఆత్మసర్వస్వ మాంధ్రవిద్యాభివృద్ధి
కొఱకు హితకారిణీశాలఁ గూర్చినావు
పుత్త్రుఁ డనవాంధ్రమాతకుఁ బొసఁగు దీవె
కందుకూరి వీరేశలింగ కవివర్య!

సీ. గాయ మింతయు మేనఁ గనుపట్టదే గాని
కత్తిపోటులు నీదు కలముపోట్లు
పొట్ట లుబ్బఁగ నవ్వుఁ బుట్టించునే గాని
చుఱుకలు గదె! నీదు సూక్తులెల్ల
కట్టుకథల్వలెఁ గనిపించునే గాని
గాలముల్ గదవె నీ కట్టుబొట్లు
కారంపుసుడులుగాఁ గానవచ్చునె గాని
కమ్మ నీరములు నీ కావ్యవాకు
లని యరాతులు సైత మెప్పభినుతింప
సల్పితివి యాంధ్రదేశాన సంస్కరణము
లట్టి నినుఁ గోలుపోయె నిప్డాంధ్రమాత
కందుకూరి వీరేశలింగ కవివర్య!


సీ. బాల్యంబునందె నీవు పటుధారణాశక్తి
నుచితరీతుల వృద్ధిఁ బొందినావు
గార్హస్థ్యమున దేశకాలానుసారులై
యర్థంబుల గడించి యలరినావు
ఆర్జితార్థంబుల నాత్మీయకోశ సౌ
గంబుకై వెచ్చింపఁగల్గినావు
ఆంధ్రదేశమున కనంతమైన యశంబుఁ
దెచ్చి సంతోషాబ్ధిఁ దేల్చినావు
డెబ్బదేండ్లు నిరర్గళదీప్తి నాంధ్ర
కోటిఁ దనియించి యిఁక నేమి కోరఁగలదు?
శాశ్వతానందరూపుని చక్కఁ గనుము
కందుకూరి వీరేశలింగ కవివర్య!

సీ. నీ కార్యదీక్ష మా కే కార్యమునకైన
మార్గదర్శకమయి మలయునట్లు
నీ యశశ్చంద్రుండు మా యాంతరతమంబు
బోఁ జేసి యలరింపఁ బూరయునట్లు
నీ సత్యవర్తనం బీ సకలంబున
కను కార్యమై యెప్డు వలరునట్లు
నీ ప్రతిష్ఠాపనల్ నెమ్మి నాచంద్రార్క
మలరఁగా మే మెప్డు నడరునట్లు
చేసి తేజోమయుండవై చిత్స్వరూప
మొంది యాంధ్రాళి యభివృద్ధి నొందు రీతి
సతత మాశీర్వదింపు మో సాధుశీల
కందుకూరి వీరేశలింగ కవివర్య!



Pandit Madan Mohan Malavya

Sreemathi. Sarojini Devi.



వెదురుమూడి శేషగిరిరావు గారు

వర కురుక్షేత్రమున దశవాసరములు
ఆపగాసూనుఁ డరివధ మాచరించి
అంపశయ్యను మైఁ జేర్చినట్టి తఱిని
అమలగంగాభవాని మహార్తి బ్రుంగి
అశ్రుజలపూరితాక్షియై యలమటించె
కురుకులాంబుధిసోముఁడు గ్రుంకె ననుచు
ఘనజితేంద్రియుఁ డంజనీతనయుమాడ్కి
అతఁడు చిఱుతయొ తరుణుఁడో ఆజితేజి
నట్టి వీరాగ్రగణ్యుఁడు నమలయశుఁడు
మృత్యువును లోఁగొనినయట్టి మేటిమగఁడు
కురుపితామహుఁ డసమానకోవిదుండు
పరమభక్తాగ్రగణ్యుఁడు వాసుదేవ
పాదసాన్నిధ్యమున శౌరి బ్రస్తుతించి
వరదుకరుణకు పాత్రుఁడై తొలఁగెఁదనువు.
అతనిమనుగడ సార్థకమయ్యెనైన
తల్లిసంతాప మేరీతిఁ దగ్గఁగలదు
హరిపదాబ్జాతసంజాత యైన నేమి
అమరధునియైన నేమి హా హా కుమార
అనుచు నడలదె జాహ్నవి యగ్గలముగ
కొడుకు వేయేండ్లు మనినను గూర్మితల్లి
కాంక్ష తీరునె? వైరాగ్య మబ్బ గలదె?
అప్రయోజకుఁ డలసుఁడు నధికధూర్తుఁ
డైననున్గూడ ప్రేమించునంబ సుతుని
అట్టిచోఁ గీర్తిధనుఁడైన యాత్మజాతుఁ
డరుగఁ బరలోకమునకు నెట్లగును ధైర్య
మూన? నో యాంధ్రమాత! నీముద్దుబిడ్డఁ
డెచటికో పోయె నిను బాసి ఎట్టు లోర్వఁ
గలవు మాతల్లి నీయశ్రుకణము లెవరు
తుడిచి యోదార్చి నీదుఃఖ మడఁపఁగలరు
తల్లి సంతాపమును బాప దానవారి
శమనుపురి కేగి యన్నల సరగఁ దెచ్చి
దేవకికిఁ జూపె నాతఁడు దేవదేవుఁ
డంతటి సమర్థులేరు నీయనఁగుబిడ్డ
బందు లేరమ్మ తల్లిరో అడలకమ్మ
అమ్మ "జాతస్య మరణం ధ్రువ"మ్మనంగ
వింటివి గదమ్మ విద్యావివేకధనవు
నీ వెఱుంగని ధర్మము లేవు తల్లి
అవని వీరేశలింగాఖ్యమైనజీవ
మమల బ్రహ్మంబునను లయమయ్యె మఱల
ధరను పుట్టుట చచ్చుట దైవమాయ
కపటనాటక మంతియె గాదె తల్లి!
మఱవుమా పుత్రరత్నమ న్మమత వీడు
మతఁడు జనియించుచోటె కల్ల యని తలంపు
మెటులు మఱతు నటందువా? ఏమనందు
బాల్యమాదిగ నసమానభక్తిధనుఁడు
విశ్వమయునకు విశ్వంబు వీడటంచు
నఖిలరూపుల నఖిలేశు నాలయంబు
లంచు దలఁచెడు సుజ్ఞాని యాత్మవేది
సర్వసమదర్శి సంతతసాధుహితుఁడు
త్యాగశీలుఁడు సౌమ్యుఁడు ధార్మికుండు
ఆంధ్రభాషావధూటి కత్యధికభక్తి
మృదులమంజుళ పరిమళ మిళితచారు
కుసుమదామశతంబును గూర్చినాఁడు
కఠినతమశైలియుత పేటికల నడంగు
నీతిరత్నసహస్రంబు ప్రీతి వెలికిఁ
దెచ్చి ఆంధ్రుల కెల్లనుఁ దెలియునట్లు
మృదుమధురశైలి గ్రంథము ల్వెదలఁజేసి
ఆంగ్లగీర్వాణభాషల నలరు గ్రంథ
రాజముల నాటకంబుల రమ్యశైలి
నాతఁ డాంధ్రీకరించె నౌ నౌననంగ
మృదుమధురవచనంబున ముద్దు లొలుకు
కథల నవలల రచియించె సుధలు చిలుక
అతఁడు భాషకు సల్పిన యలఘుసేవ
తనవిదీర నుతింపంగఁ దరమె జనని!
అతనిమానస మెంత దయార్ద్రమగునొ
చూచి సైరింపనోపఁడు సుదతులకును
సంఘము ఘటించు దుస్థ్సితి, సదయుఁ డగుట
ఆత్మవత్సర్వభూతాని యనెడు ధర్మ
మతఁ డనుష్ఠించె పత్ని త న్ననుసరింప
ధర్మమును సత్యమని మదిఁ దలఁచినట్టి
కార్యముల తా నొనర్చియె కఱపె నతఁడు.
సంఘము బహిష్కరించు నని జంకు గదిరి
హితులు మిత్రులు వీడిన నించుకైన
సంచలింపక సత్యమే జయ మటంచు
నిలిచె సర్వేశ్వరుని నమ్మి నిశ్చలముగ
సంఘమున నున్న కీడుల సమయఁజేయ
పత్రికను నిర్వహించెను ప్రతిభ తనర
నమరెను వివేకవర్థని యనెడు పేర
నతని వరపత్రికారత్న మాంధ్రు లలర
ఆంగ్లమున సంస్కృతంబున నాంధ్రమునను
బడసె పాండిత్య మార్యులు భళి యనంగ
స్వార్థవిరహితవృత్తికి సత్యరతికి
సంఘసేవకు ధార్మికసరణి కలరి
దొరతనమువారు గౌరవసరణి నీయ
రావుబహాదరు బిరుదంబు రహిని బడసె
సంఘమునఁ గల్గులోపము ల్సకలజనుల
కెఱుకపడురీతి వ్రాసెను. ఎన్నియేని
ప్రహసనంబుల బుధులు శెబాసనంగ.
పట్టిపసికూన లగునట్టి బాలికలను
వృద్ధపురుషుల పెండ్లిండ్లు వెడఁగుపను ల
టంచు ఖండించి యడగించె నధికదీక్ష
పసితనంబున భర్తలఁ బాసినట్టి
బాలికలకు హితంబువివాహములను
చేయ సమకట్టి ఫలసిద్ధిఁ జెందె నతఁడు

అలపితంతువులను శిరజాలయంబు
నాఁక్మహేంద్రవరంబున రహిని గూర్చి
కష్టసుఖముల సమభంగి కరముప్రేమ
ననుసరించినయర్ధాంగి తనువు దొఱఁగ
ముదిమిని సతీవియోగంబు గదుర ధైర్య
ము దొఱంగక వైరాగ్యమును వహించె
ఆత్మవిశ్వాసమును నేర్పె నాంధ్రులకును
కార్యదీక్షను కలిగించె ఘనతరముగ
సంఘసేవావిధానంబు సంఘటించె
ఆచరణశూన్యముగ నీతి నన్యులకును
బోధచేయఁగరాదని బుద్ధిచెప్పె
దర్పశయ్యను జేరదు దనుకఁగూడ
చేసె భాషావధూటికి సేవ నతఁడు
జీవులెల్లరు సోదరుల్దేవదేవు
డఖిలభువనైకజనకుఁ డంచాత్మనమ్మి
సర్వసమభావమును చాట సత్యనిరతి
బ్రహ్మసామాజికుండయి భక్తితోడ
నాచరణపూర్వకంబుగ ననవరతము
దేవదేవుని సేవించె భావమునను
గరిమ సర్వస్వమును హితకారిణీ స
మాజమున వశంబు గావించె మాన్యుఁ డతడు
అభినవాంధ్రాపగానూనుఁ డనెడి ఖ్యాతిఁ
బడసి వైరాగ్య మూని కృపాళుఁ డగుచు
ఈశ్వరునియాజ్ఞ తనవిధి నెలమిఁ దీర్చి
భౌతికశరీరమును బాసి పరమమైన
కీర్తికాయంబు ధరియించి కేశవాంఘ్రి
యుగళసందర్శనాసక్తి నొయ్యఁ జనియె
నతఁడు కృతకృత్యుఁ డగుట నో యంబ నీవు
వగలఁ బొగలక ధైర్యంబు వడిగఁబూని
నీ సుతుని కీర్తికాయంబు నెమ్మిఁ గాంచి
సంతసింపుము. ఆతని సదమలాత్మ
భౌతికశరీరశృంఖలాబంధములను
త్రెంచి స్వేచ్ఛావిహారంబు గాంచి యాంధ్ర
దేశమంతయు వ్యాపించి దివ్యశక్తి
గలుగఁజేసెడు. వగ పేల? కరముప్రేమ
నతని యాత్మకు విమల మౌనట్టిశాంతి
నొసఁగ వేఁడుము సర్వేశు సువిదమిన్న
అట్టి మహనీయు సుగుణంబు లాంధ్రులకును
నగుత నాదర్శకంబు లీయాంధ్రభూమి
నట్టి సత్పుత్రరత్నంబు లతిశయముగ
కలిగెదరు గాత శ్రీహరి కరుణ ననుచు
వినతి యొనరించి వినుతింతు జననిభక్తి
మునులు ఓం శాంతి శాంతి యంచనెద రదిగొ
సకలభువనాళి ఓం శాంతి శాంతి యనుచు
నిర్మలంబగు వాక్యంబు నిశ్చలముగ
పలుకుచుండె చరాచరప్రతతి యెల్ల.
ఓం శాంతి శ్శాంతిః.

VI యడ్లపాటి వేంకట సుబ్బారావు గారు

ఆంధ్రపుత్త్రుఁడు పోయె నేఁడు
ఆంధ్రలోకము విడిచి దివికి
ఆంధ్రులను దుర్దశను ముంచి
ఆంధ్రభాషకుఁ గొఱఁత గల్గ
అమ్మ! పుత్త్రుఁడు పోయె నేఁడు!
పోయెనే పో పోయెనే!

ఆంధ్రభాషకు వన్నెచిన్నెలు
పొందుగా నొడగూర్చినట్టి
కందుకూరి వీరేశలింగము
అందె స్వర్గము లోనివారికి
అమ్మ! పుత్త్రుఁడు పోయె నేఁడు!
పోయెనే పో పోయెనే!

మనదు సంఘమునందు నిండిన
ఘనపిశాచము లెల్లయుఁజ
తనివి నొసఁగఁగఁ జూపి పాపి
మనకు మార్గముఁ జూపినట్టి
అమ్మ! పుత్త్రుఁడు పోయె నేఁడు!
పోయెనే పో పోయెనే!

దిక్కులేకయె దీనుఁడౌచు
నెక్కడో పడియున్నయట్టి
అక్కటా! విధవావనితల
మక్కువను తాఁ బ్రోచినట్టి
అమ్మ! పుత్త్రుఁడు పోయె నేఁడు!
పోయెనే పో పోయెనే!

ఎవరు దిక్కిఁక వారి కీధర?
నెవరు ప్రోచెద రింక వారిని
నవిరళంబుగఁ జూచు మూర్తియె
దివికి నేఁగఁగ వారి వీడి
అమ్మ! పుత్త్రుఁడు పోయె నేఁడు!
పోయెనే పో పోయెనే!

నిండుయౌవన మెల్లఁ గడచెను
దండిగా నతకీర్తు లందెను
పండుపండెను రాలిపోయెను
ఉండఁగావల దింక దుఃఖము
అమ్మ! పుత్త్రుఁడు పోయె నేఁడు!
పోయెనే పో పోయెనే!

ఆమహాత్ముని యాత్మశాంతిని
నామహిత లోకంబునందున
నేమఱక గాంచుడంచును
వేమఱుఁగఁ బ్రార్థించుచుందుము
అమ్మ! పుత్త్రుఁడు పోయె నేఁడు!
పోయెనే పో పోయెనే!

సర్ ఆర్థర్ కాటన్ గారు

కట్టా వేంకటరావు గారు ఎమ్. ఏ., ఎల్. టి.

ఈశ్వరసృష్టి కడు విచిత్రము. అనంతకోటిపదార్థము లందుఁ గలవు. అం దొక్కొటియు వ్యర్థము గాక అన్యోన్య సంపోషణకారణమై వృద్ధిని పొందుచుండు. ఈ శక్తి సృష్టిస్వభావములోనే నిర్మింపఁబడియున్నది. జంతువులు వృక్షములు మొదలయినవి తమతమ వృద్ధికి ఆవశ్యక మైన వస్తుప్రపంచమును సహజశక్తిచేతనే గుర్తెఱిఁగి ఆకర్షించి ఉపయోగపఱచుచుండును. వాని చర్య సహజనిర్మితమే గాక సహజనియమితముగఁ గూడ గన్పట్టును. ఆహారాదివ్యవహారములలో సహజభావము నతిక్రమించి చరించు బుద్ధిని గూడఁ గానము. సమస్తచరాచరములును దేశకాలానుసరణముగ తమతమ విధిని అతిక్రమింపక తమ స్థితిని బలపఱచుకొనుచు సృష్టివైచిత్ర్యమును సూచించుటను చూచుచున్నాము. ఈ సృష్టిలో మనుష్యుఁడు కూడ నొక భాగమే యైనను అసాధారణ మైన విశేషశక్తులు వానియందు నిర్మింపఁబడియున్నవి. అనేకులచే నితఁడు సృష్టిలో ముఖ్యపదార్థముగ నెన్నఁబడుచున్నాఁడు. ఈశ్వరుఁడు తన రూపమును తన బుద్ధిని మనుష్యునందు వెలయింపఁజేసి సృష్టికి అధినాథునిఁగ నేర్పఱచె నని నమ్మఁబడుచున్నది. ఇతరప్రపంచమువలె సహజశక్తి కలదు. స్వభావముచేతఁ దన కేది యావశ్యకమో గ్రహించి దానిని ఉపయోగించు శక్తియే గాక కొంత విశేషశక్తి కూడ కలదు. బుద్ధివిశేషముచేత సృష్టిలోని పదార్థముల నన్నిటిని బాగుగ గమనించి కేవలము తన స్థితికి ఆవశ్యక మైనవే గాక ఐశ్వర్యానందాదిదాయకము లైన యితర వస్తువులను కూడ స్వీకరించి ఉపయోగపఱచుచు ఉత్కృష్ట మైన జీవయాత్రను నడుపు సామర్థ్య మతనియందు కలదు. తన బుద్ధిబలముచే సహజబలము నైనను జయించి సృష్టి యంతకును రాజై యేలుచున్నాఁడు. ఇంతే గాక ఈ బుద్ధిబలముచేత నైన కృత్రిమనిర్మాణములచే సృష్టినిపుణత్వమును అతిక్రమించి ప్రకృతిని నిరాకరించి తన చేయు కార్యములు మనుష్యబుద్ధిబలమునకు స్వాధీనము కాని దేదియు లే దని యతని శక్తిని వేనోళ్ల పొగడుచున్నవి. దైవనిర్మాణమునే అత్యద్భుతముగా మార్చు శక్తి గల యీ నిర్మాణము గురువును మించిన శిష్యుని రీతి ప్రకాశించుచున్నది. ప్రస్తుతప్రపంచములో నిట్టి మానుషామానుషకార్యము లనేకములు గలవు. సృష్టిధర్మములను గ్రహించి జ్ఞానవృద్ధిఁ జేయుచున్న కొలఁదిని వాని సంఖ్య హెచ్చుచున్నది. కాని, వానియన్నిఁటితో బ్రస్తుతమునకుఁ బ్రసక్తి లేదు. ప్రస్తుతము ఆంధ్రదేశమునకు కొంత కాలము క్రిందట ఒక మహానుభావుఁడు తన బుద్ధిబలమును వినియోగించి చేసిన మహోపకారమును గూర్చియు నా యుదారస్వభావునిఁ గూర్చియుఁ గొంత తెలియుట ఆంధ్రప్రపంచమునకు అనేకవిధముల మంచిది. ఈ పట్టున రెండు మహాపదార్థములు మిళితములై యున్నవి. సృష్టి యంతటిలో నత్యద్భుతమై సృష్టికిని సృష్టికర్తకును అమూల్యాలంకార మైన గోదావరి మహానది యొకటి. 'ఈ సృష్టియందు లోప మున్నది. కొంత దిద్దినఁ గాని సరిపడదు.' అని యాలోచించి దైవనిర్మాణమును నిరాకరించి తన బుద్ధివిశేషమును ప్రకటించిన సర్ ఆర్థర్ కాటన్—కాటన్ మహర్షి యను నామాంతరము గల యుదారస్వభావుఁ డొకఁడు. వీరన్యోన్యప్రకాశితులు. అందుచేత కాటన్ గారి జీవితమును గోదావరికి వారు చేసిన మహోపకారమునుఁ దెలియఁదగినవి.

ఇందు గోదావరీమహానది ముఖ్యము. దక్షిణ హిందూస్థానములో సుమారు రెండు ప్రక్కలను మోసి దేశమునకు అడ్డముగా 900 మైళ్లు పొడవున పారుచు, 115,000 చదరపు మైళ్ల ప్రదేశములో పడు నీటిని తనలోనికి ఆకర్షించుచున్న యీ నదియే గంగాసింధునదుల తరువాత మన దేశములో పెద్దనది. బొంబాయికి 70 మైళ్ల దూరములోను పశ్చిమసముద్రతీరమునకు 15 మైళ్ల దూరములోను ఉన్న త్ర్యంబక మను గ్రామమునొద్ద ఉత్పత్తి నొందుచున్నది. గ్రామమునకు వెనుకప్రక్క చిన్న కొండపై నున్న సరస్సు ఈ నదికి ఉత్పత్తిస్థాన మని అనుశ్రుతముగాఁ దెలియవచ్చుచున్నది. దానిని చేరుటకు 690 రాతి మెట్లు కలవఁట. ఒక రాతిమంటపములో నున్న విగ్రహము నోటినుండి ఒక్కొక్క బిందువు చొప్పున ఈ సరస్సులోనికి జాఱును. అక్కడనుండి ఆగ్నేయమూలగా నదిరూపమున సుమారు 650 మైళ్లవఱకు పాఱి వరద ఇంద్రావతి మొదలయిన యుపనదులను గ్రహించి, భద్రాచలము దాఁటి తూర్పు కనుమలను సమీపించును. క్రమముగా నదియొక్క విరివి హెచ్చుచు సాధారణముగా మైలును, కొన్నిచోట్లు 2½ మైళ్లును, వెడల్పు కలిగియున్నది. కనుమల నడుమ వెడల్పు చాల తక్కువై తుదకు పాపికొండల నడుమ నున్న సన్నని పర్వతద్వారముగుండ కనుమ ప్రదేశము వెలువడి తిరిగి వెడల్పు హెచ్చయి మహానందీశ్వరము పట్టిసము మొదలయిన క్షేత్రములను చుట్టి ప్రవహించుచు తుదకు రాజమహేంద్రవరమునొద్ద సుమారు రెండు మైళ్ల వెడల్పు కలిగియున్నది. కొంచెము క్రింద సుమారు 4 మైళ్ల వెడల్పు కూడ కలదు. ఇంత విరివి హెచ్చుగుటచే ఒక్కటే నదిగా పాఱుటకు సాధ్యము గాక ఆ పైప్రవాహము కొన్ని పాయలై విభజింపఁబడి గౌతమి వసిష్ఠ మొదలైన ఋషినామములతో ప్రసిద్ధి గాంచి నడుమ నున్న లంక ప్రదేశములకు అనేకవిధముల నాధారభూత మగుచు వివిధస్థానములలో సముద్రమును ప్రవేశించుచున్నది. ఇట్టి మహాజలప్రవాహము సృష్టియం

దెన్నఁదగిన యుత్కృష్టపదార్థములలో నొకటి యనుట కేమి సందేహము? సృష్టిలోని ప్రతి చిన్న పదార్థమును దైవస్వరూపముగా భావించి గౌరవించు మన దేశస్థులు దీనిని ఒక మహాదేవతగా భావించి మహాపవిత్రతను ఆరోపించి పూజఁ జేయుచు గౌరవించుచుండుట యేమి యబ్బురము? మహాప్రవాహము నిరంతరముగ యథేచ్ఛముగ బ్రవహించుచు ఇరు ప్రక్కల నున్న ప్రదేశమునకు కలుగఁజేయు లాభనష్టములను తమ పాపపుణ్యఫలసూచకము లైన యాగ్రహాను గ్రహములుగాఁ గైకొని దేవీస్వరూపమును ఆరాధించుచుండిరే గాని తమ బుద్ధిబలముచే దానివలన కలుగు కీడును పరిహరించి మేలును వృద్ధి చేయు ప్రయత్నము నాలోచింపరైరి. దైవనిర్మితమై ఋషిపూనీత మైన యీ మహాశక్తిని శాసించుటకు మనుష్యుఁ డెంతవాఁ డని యూహ చేసెఁ గాఁబోలును. కొండను తల క్రింద పెట్టుకొని రాళ్లకై వెదకికొనిన జేల పగిది మహాజలనిధితీరస్థు లైనను అనేక మైన క్షామములకు లోనై పడరాని పాట్లు పడి మహారత్నముయొక్క విలువ తెలియక విసర్జించు వెఱ్ఱి రీతిని ఐశ్వర్యఖని యగు దేశమును విడిచి అన్యప్రాంతములకు పోవలసిన దురవస్థకు పాలైరి.

ఆ యవస్థను కొంచెము సూచింతము. సాధారణముగా నదీతీరమున నుండు జనులకు వ్యవసాయము వృత్తిగా నుండును. అట్లు గానిచో నదీతీరవాసము వ్యర్థము. కొంత కాలము క్రిందట గోదావరి చుట్టు ప్రక్కల ప్రదేశములలోఁ గూడ వ్యవసాయమునకు వర్షమే ఆధారముగ నుండెడిది. అంతేకాని ఈ మహానదిలో పాఱు నీటిని దాఁచుకొని వర్షాభావమందు వాడుకొనుట నెఱుగరు. వర్షము మన కనుకూలముగా నుండుట యరుదు. అతివృష్టియో అనావృష్టియో సంభవించుచుండును గాని సకాలములో సమ మైన వర్షము కురియదు. ఏ కారణముచేత నైన నేమి సస్యనాశనము సిద్ధము. బొల్లి మేఘములను నమ్మియుండు వ్యవసాయదారుని దుర్దశ యింతింత నిచెప్పరా దనుటకు ఇప్పుడు మన దేశములో నదులు లేని కొన్ని జిల్లాలు సాక్షి. గోదావరివంటి మహానది ప్రక్క నున్నచో లాభము సందేహాస్పదము కాని నష్ట మేమో నిశ్చయము. వర్షవ్యత్యాసముచే పాడు కాఁగా మిగిలినవి వరద ముంపులచే పాడగును. ఈ పాట్లు పడలేకయే అప్పటి గోదావరీతీరస్థులు సహజవృత్తి యైన వ్యవసాయమును మాని ఒక విధ మైన బట్టలను నేసికొని జీవనముఁ జేయుచుండిరి. కాని, ఇంగ్లాండులో యంత్రసాధనములచే దయారు చేయఁబడి ఇచ్చటికి పంపఁబడు బట్టలు చవుకగుటచే ఆ పోటీ కోర్వలేక ఆ వృత్తిని కూడ మానుకొనవలసివచ్చెను. ఇంకొక వృత్తి లేక ప్రజలు చాల బాధపడుచుండిరి. క్షీణత హెచ్చుచుండెను. ఏమి చేయుటకును తోఁపక వ్యవసాయము మొదలుపెట్టిరి. కాని, కలవునకు వ్యవసాయదార్లయిన పంటలు పండునా? వర్షములు సరిగా లేక పంటలు పండక 1833-వ సంవత్సరమునందు ఈ దుస్థితి యంతయు పెద్ద క్షామము క్రిందఁ బరిణమించెను. అంతకు పూర్వము రెండు సంవత్సరములలో అతివృష్టి తుపాను మొదలయినవానిచే సస్యములు నశించి ఆహారపదార్థము లరుదై 1833-వ సంవత్సరమున మహాక్షామమునకు కారణ మయ్యెను. అప్పటి దురవస్థకు మేరలేదు. అది వర్ణనాతీతము. ఉత్తరపు జిల్లాలలోని ప్రజలు మిగుల బాధపడుచుండిరి. ప్రజానాశనమునకు లెక్క లేదు. అన్నము లేమివలని బాధ అతి దుస్తరము. క్రమముగఁ జాల రోజులు బాధపడినఁ గాని కష్టము గట్టెక్కదు. ఈ బాధ పడలేక ప్రజలు స్వదేశమునుండి అన్ని దిక్కులకు పలాయమాను లైరి. క్షామపీడితు లైన తలిదండ్రులు తమ యాఁడుబిల్లలను హైదరాబాదు మొదలైన దేశములవారి కమ్మివేసిరి. మార్గమున ననేకులు చచ్చిరి. పని చేయకున్న ధర్మ మీయఁగూడ దను న్యాయమున చెఱువులను త్రవ్వుట మొదలయిన పనుల నేర్పఱచి నప్పుడు ఉత్కృష్టజాతులలోని వారు ఆ న్యూనతకన్న మరణమే మే లని చచ్చిరి. అతిసుకుమారదేహము గల స్త్రీలును ఉన్నతదశ ననుభవించిన పురుషులును గడ్డపాఱలతోఁ బని చేయుచుండుటను చూచుట అశక్యము. ప్రజలు మానాభిమానవిహీనులు కావలసివచ్చెను. జలాహారములు లేక పిల్లలు పెద్దలు పశువులు బాధపడుచుండిరి. ఇట్టి క్షామవర్షపరంపరకు తెంపులేక దారిద్ర్యదుస్థితి హెచ్చుచుండెను. గోదావరి మహానది దేశమధ్యమున గంభీరముగా పాఱుచున్నను అప్పటి మన దేశస్థితి యిట్లుండెను. ఇది దేశమునకు మహోపద్రవమువంటిది. పెన్నిధిని ప్రక్క నుంచుకొని దాని ననుభవింపనేరని పేదల చందంబున మహానదీతీరముననుండియు నన్నపానములకుదూరులైన ప్రజలదుస్థితి కన్న ఉపద్రవ మేమి కలదు? ఇట్టి సమయములలోనే ప్రజలను కష్టములనుండి తరింపఁజేయు మహానుభావు లుదయింతురు. సమయమున నుదయించి లోకదుస్థితిని మాన్పవచ్చినవారిని అవతారపురుషు లన్నను తప్పు లేదు. వారి చరిత్రము సదా స్మరణీయము. మన దేశమునకు అట్టి మహానుభావుఁడు సర్ ఆర్థర్ కాటన్. దైవర్షినిర్మాణ మైన నది సరిగా లే దని దిద్దుపాటు చేయవచ్చిన ఘనుఁడు. నిరంకుశ మైన స్వభావవ్యక్తిని శాసించి కట్టుబాట్లకు లోఁబడఁజేసి ప్రజల కనుకూలముగ చేసిన మహనీయుఁడు. మహానదిని పెక్కు పాయలుగాఁ జేసి దేశ మంతటిని పవిత్రముగను ఫలవంతముగను చేయుటచేతనే కాఁబోలు ఒక్కటే పాయను కలుగఁజేయఁగలిగిన ఋషులకన్న పెక్కువాఁడై కష్టసుఖముల నెఱిఁగి దేశస్థితి తారతమ్యమును గమనించిన పెద్దలచే మహర్షి యని చెప్పఁబడి దినతర్పణపాత్రుఁ డైనను ఆశ్చర్యము లేదు. అట్టి మహనీయుని చరిత్రము కొంత తెలియఁదగినది.

ఇతఁడు 1803-వ సం॥ మే 15-వ తేదిని జనన మొందెను. తాత గారి సంతానములో ఈయన తండ్రి 10-వ కుమారుఁడు. అటులే మన కాటన్ గారును తండ్రి గారి సంతానములో పదియవ కుమారుఁడు. వీరిది మహాపురాతనకుటుంబము. వీరి కుటుంబము ఇంగ్లాండు దేశములోనే డెనిమిది వందల సంవత్సరముల క్రిందటనే ప్రసిద్ధి గాంచినట్లు నిదర్శన మున్నది. ఈ వంశస్థులు వంశపరంపరగ రాజదేశసేవాధురంధరులు. అనేక మైన యున్నతోద్యోగములలో నియోగింపఁబడి కీర్తిఁ గాంచినారు. మన హిందూదేశసేవలో ఘనత గాంచినవారు ఈ వంశమున చాలమంది కలరు. ఈయన పూర్వు

లలో నొకఁడైన సర్ స్టాపెల్టన్ కాటన్ అను నతఁడు ఇండియా ముఖ్యసేనాధిపతిగా నుండి భరతపూరు మొదలైన స్థలములలో ప్రసిద్ధిఁ గాంచిన వీరుఁడు ఇంతియకాక ఇతని సోదరులలో నాల్గురు మానవసేవఁ జేసి కీర్తిఁ గాంచినారు. ఒక సోదరుఁడు ఇండియా సేనలో ఉన్నతోద్యోగస్థుఁడు. ఇంకనొకఁడు ఇండియా సివిల్ సర్వీస్‌లో నుండి యుపకారవేతనము పొందెను. ఇంక నొక సోదరుఁడు తనతోఁ పాటు నీటి కట్టడపు పనులలో సహాయముఁ జేయుచు తుదకు కర్నూలు ఆనకట్టపై నధికారిగా నుండెను. ఇప్పటికిని బ్రతికియున్న తన కనిష్ఠసోదరుఁడు తాను చేయు పనులలో సహకారిగా నుండెను. వీ రందఱు మానవసేవలో ఘనతఁ గాంచిన మహనీయ సోదరసమూహము. వీ రందఱు హిందూదేశాభిమానులే. ఈ యుదార పురుషు లెప్పుడెప్పుడు ఇంటియొద్దఁ గలియుచుండెడి వారఁట. స్ఫురద్రూపము దివ్యముఖవర్చస్సు సఫలప్రయోజకత్వము నిష్కళంక జన్మము అజాతశత్రుత్వము మొదలగు సుగుణసంపదలు కలిగిన యీ యుదారపురుషసమావేశ మెవరి కానందము గొల్పదు?

ఆర్థర్ కాటన్ గారు నీటి కట్టడపు పనులలో సుప్రసిద్ధులు. సహజబుద్ధి బాగుగా వికసింపకముందే అనఁగా బాల్యమునందే దాని సూచనలు కనఁబడుచుండును. ఒకసారి తల్లి మొదలయిన వారితో వీథినిఁ బోవుచున్నప్పుడు ప్రక్క కాలువలో రంగు నీరు కానవచ్చెను. అందఱును కారణ మేమో తెలియక యాశ్చర్యముఁ బొంది వెడలిరి. చిన్న యార్థర్ మాత్రము అంతటితో సంతుష్టి చెందక కారణము నరయు కుతూహలముతో గాలువ ననుసరించి పోయి రంగులు వేయువాని యింటి నుండి వచ్చుటచే నట్లయ్యె నని కనిపట్టి యింటి కేఁగెను. రొట్టెను గట్లుగా చేసి పాల నందు పారించి భోజనమునొద్ద కాలువలను చేయును. వర్షపు దినమున ఆడుటకుఁ బోయి కఱ్ఱతో చిన్న కాలువలను చేసి వర్షపు నీటి నీ చిన్న కాలువల ద్వారా ప్రవహింపఁ జేయును. ఇట్లు భావిని సూచించు కార్యములను చేయుచు విద్య నభ్యసించి 15-వ సంవత్సరమున నిండియా సైనికోద్యోగమునకు నియోగింపఁబడి దాని సంబంధమైన యింజనీరు పనులలో శిక్షింపఁబడుటకై సైనికపాఠశాలలో బ్రవేశించెను. అతిబాల్యములో ఈ విద్య నభ్యసించుచున్నను అతఁ డసాధారణమైన చుఱుకుఁదనము జాగ్రత్త మంచి నడవడి కలిగి 18 మాసము లందుండి $16\frac{1}{2}$ సం॥ల వయస్సున నేపరీక్షయందును కృతార్థుఁడు కానక్కఱ లేకుండగనే అతని తెలివితేటలను గ్రహించిన యధికారులచే రాయల్ ఇంజనీరుగా నియోగింపఁబడెను. ఆర్థర్‌ను గౌరవించుటకై పరీక్ష చేయకయే ఉద్యోగ మిచ్చిరి. ఇంతవఱ కిట్లు ఉద్యోగ మీయఁబడినవాఁ డీతఁ డొకఁడే. ఇంకొక 18 మాసములు ఆ దేశములోనే యనుకూలమైన యుద్యోగములను నెఱవేర్చుచు కష్టసుఖముల యనుభవము సంపాదించుచు 18-వ సంవత్సరమును పూర్తి చేసెను.

1821-వ సం. మే నెలలో ఇండియా యుద్యోగమునకు నియోజింపఁబడి చెన్నపట్టణమునకు బయలుదేఱి అక్కడికి సెప్టెంబరు నెలలో చేరెను. తాను ముందు చేయఁబోవు పనుల స్వభావమును గ్రహించుటకై చెన్నపట్టణము చీఫ్ ఇంజనీరు కచేరిలో ఒక సంవత్సర ముండెను. పిమ్మట దక్షిణభాగములో నున్న చెఱువులను మరమ్మతు చేయు చీఫ్ ఇంజనీరునకు సహాయము చేయుటకై యేర్పఱుపఁబడి దక్షిణమండలములలో నున్న చెఱువులను మరమ్మతు చేయించుచు తాను ముందు చేయఁబోవు ఘనకార్యములయందు అనఁగా నీటిని సకాలములో నిలువచేసి తరువాత వినియోగించుట మొదలయిన పనులయందు జ్ఞానమును అనుభవమును సంపాదించెను. తరువాత 1824-వ సం. వఱకు చెన్నపట్టణములోనే యుండి సెంటుథామసు మౌంటులో సైనికులకై కట్టడములను కట్టించెను. మొదటి బర్మా యుద్ధమునకు పో నిచ్చగించినవాఁడై 20 సం. ల ప్రాయముననే అనేకవిధముల కోటలను పట్టుట కొట్టుట మొదలయిన సాహసకృత్యములలో నాయకత్వమును వహించి వన్నెకెక్కెను. ఈకాలమునం దొకసారి చీట్లాడి తనయొద్ద నున్న ధనము నంతటిని గోల్పోయి గొప్ప పాఠమును నేర్చుకొని జీవితకాలములో మఱి యెన్నఁడును చీట్లాడఁగూడ దని శపథముఁ బట్టెను. బర్మానుండి వచ్చుచు ఓడ పైభాగమున నొక సాయంత్రము కూర్చుండి సముద్రమును నక్షత్రములతో నిండియున్న యాకాశమును గాంచి ఈ మహాద్భుతసృష్టి యే మహానుభావునిదో అట్టి దేవుని ధ్యానింపవలె నని దైవభక్తి గలవాఁ డాయెను. అప్పటినుండి చచ్చిపోవువఱకు దైవభక్తిని విడువలేదు. ఇట్టివి గదా మహాపురుషలక్షణములు!

చెన్నపట్టణము వచ్చిన తరువాత చెఱువుల మరమ్మతునకు చీఫ్ ఇంజనీరుగ కాటన్ గారిని నియమించిరి. ఇట్టి చిల్లర పనులు కొంత కాల మయిన తరువాత కావేరి నీటికట్టడపు పనులను సాగించుటకు అధికారిగా నియమించిరి. తంజావూరు జిల్లా కేది యావశ్యకమో కావేరీనది యెట్లుపయోగకరమో మొదలయిన సంగతు లన్నియు బాగుగ గమనించి నదీప్రవాహమును దేశక్షేమమున కత్యంతముపయోగకరముగఁ జేసి క్షామబాధకు సతతము లోనైయుండిన తంజావూరు జిల్లాను దేశములో నున్న యన్ని జిల్లాలలోను మొదటిదానిగా జేయ నతఁడు సమకట్టెను. ఇంతలో దేహారోగ్యము చెడినందున రెండేండ్లన్నర సెలవు తీసికొని స్వదేశమునకుఁ బోయెను. అక్కడ నితరులవలె వేట చీట్లాట యాట పాట మొదలయిన వినోదములతో కాలమును పుచ్చక యాలోచనపరుఁడై యేకాంతమున కూర్చుండి తన జీవితకాలమును దైవప్రీతిగను మానవలాభకరముగను నుండునట్లు వినియోగింపఁదగు నని విమర్శించుచుండెను. తిరిగి ఇండియాకు రావేగమే తాను అంతకు ముందేర్పఱచిన కావేరి పనిలో ప్రవేశించి దానిని సంపూర్తి చేసి ఆ జిల్లాను బాగుచేసెను. ఈ ప్రయాసముచే దేహారోగ్యము చెడినందున అన్యదేశములకు వెళ్లవలసిన దని యుపదేశింపఁబడెను. దాని ననుసరించి టాస్మానియాకు పోయి అచ్చట హోబర్టుపట్టణములో ధర్మపత్నిని స్వీకరించెను. ఆమెయు తనవలెనే స్వార్థపరిత్యాగము గలిగి బీదసాదల క్షేమము నరయుచు దైవభక్తియే ప్రధానముగా పుట్టినింటి కలంకారమై యుండెను.

అనంతర మీ దంపతులు అన్యోన్యప్రేమాస్పదు లైన సహచరులై జీవయాత్రను గడపిరి.

ఇండియాకు వచ్చుటలో సముద్రయానముఁ యక జేయనేక దేశముల గుండ ప్రయాణము చేయఁ గుతూహలుఁడై ఐరోపా ఖండములోని దేశములను చూచి అందందలి విచిత్రములను కనుపెట్టి చిన్నాసియా పర్షియా మొదలయిన దేశముల ద్వారా ప్రయాణము చేసి గణింపరాని ప్రయాణానుభవముచే కలిగిన జ్ఞానమును సంపాదించెను. ఇట్టి దేశయాత్రల సందర్భముననే ఆస్ట్రేలియాకు మూఁడు సారులు వెళ్లి తన కభిమాన మైన నీటి కట్టడపు పనులకు గావలసిన జ్ఞానమును సంపాదించెను. జలాధారముల విషయమై ఆస్ట్రేలియాకును మన దేశమునకును కొంత సాదృశ్య మున్నది. అతివృష్టి యనావృష్టి బాధలు రెండు దేశములకును సమానమే. సమయాసమయములు లేక విస్తారము వాన కురియుట కలదు. ఆ పైని చాలదినములు వాన లేకుండుటయుఁ దటస్థించును. వ్యవసాయమే ముఖ్యవృత్తిగఁ గలిగిన దేశముల కిది పెద్ద యుపద్రవమే. దీనికిఁ దగిన ప్రతిక్రియ వర్ష మెక్కువగా కురిసినప్పటి నీటిని నిలువ చేసికొని వర్షము లేనప్పుడు అవశ్య మైనదానిని వాడుకొనుచుండుటయే. ఇండియాలో తా నిదివఱకే ఇటువంటి పనిని కొంత సాగించెను. ఆస్ట్రేలియాలో గూడ నిదియే యుచిత మని వారి కుపదేశించెను.

టాస్మానియాలోని హోబర్టు పట్టణమునం దున్నప్పుడు తా నొక యావిరియంత్రమును చేసెను. అది తిరుగుచు పని చేయుచున్నప్పుడు దాని సంబంధ మైన నీళ్లు కాచెడి బానవంటిది పగిలిపోయి యతని దేహమున కపాయముఁ గలుగఁజేసెను. రెండు కాళ్లకును దెబ్బ తగిలెను. చాల నెలలవఱకు నడువఁజాలక జీవితకాల మంతయు నేదో దాని సంబంధ మైన బాధ ననుభవించుచునే యుండెను. అయినను తాను చేసిన పనికి ఆనందించెను గాని బాధకు విచారింప లేదు. ఈ కారణముచేతనే ఆయన తిరిగి చెన్నపట్టణమునకు వచ్చినప్పుడు బరు వైన పనిని చేయుటకు తగిన స్థితి లేకపోవుటచే చులుకని పని కనుక విశాఖపట్టణములో క్రైస్తవాలయము కట్టించుటకును సముద్రము తటిమి పట్టణముపైకి రాకుండునట్లు అడ్డు కట్టించుటకును నియమించిరి. ఈ కాలములో కొంత దేహస్థితి బాగుపడి తాను ముందు చేయఁబోవు ఘనకార్యముల కవకాశ మిచ్చెను. ఇంతే కాక యిప్పుడు దొరతనమువారు కట్టుట కాలోచించు చున్న విశాఖపట్టణపు నౌకాశ్రయమును కట్టుటకు తగిన యవకాశము ఆధారము ఆనుకూల్యము ఉపయోగము పూసగ్రుచ్చిన రీతిని కాటన్ గారే సూచించిరి.

ఈతని యావజ్జీవమును బాధించుచుండినది ఒక్కటే విచారము. అది హిందూదేశదురవస్థయే. అతివృష్టి యనావృష్టులచే కలుగుచున్న క్షామాదిబాధలను వీ లయినంతవఱకు నివారించుట తనకు దైవనియమితకార్య మనియు నా భారము తనపైఁ గొంత యున్న దనియు గ్రహించి దానిని నెఱవేర్చుటకై ప్రయత్నించుచుండును. ఈ దైవనియమితకార్యమును నిర్వహించుటకై ఆయన చేసినవి రెండు ఘనకార్యములు :

ఇందులో మొదటిది తంజావూరు జిల్లాను వృద్ధి చేయుట. కావేరీజలప్రవాహము వృథాగా సముద్రమునకు పోకుండఁజేయుట కేర్పాటు చేసెను. కావేరి దక్షిణదేశపు నదులలోఁ బెద్దది. పడమటి కనుమలలో పుట్టి దేశముగుండ పాఱును. ఆ పర్వతపంక్తిప్రదేశమున వర్ష మెక్కు వగుటచే వర్షకాలమున నది విశేషముగా పొర్లి పాఱుచుండును. ఈ నది వందల కొలఁది మైళ్లు కొండ ప్రదేశములో పాటి సమతలప్రదేశమున కొల్లడ మను పాయగా విడివడి పాఱుచున్నది. ఈ నది నీటి ననుకూలముగా నుపయోగింపఁ బ్రయత్నించుట కిది మొదటిసారి కాదు. బ్రిటిషువారు మన దేశమునకు రాక పూర్వమే మన స్వదేశరాజులు గూడ నదీప్రవాహమును పంటల కుపయోగించుకొను నేర్పాటులు చేయుట కలదు. పూర్వకాలపు హిందూరాజులు దేశమునకు లాభకర మైన పనులను చేయుటయందు అన్యోన్యమాత్సర్యము గలవారై ఒకరికన్న నొక రెక్కువ చేయఁ బ్రయత్నించుట కలదు. కాని, అప్పటి కాలమునకుఁ దగినట్లు పనిచేయుచుండిరి కాని ఇప్పటివలె పనిలో ప్రాశస్త్యము తక్కువ. తంజావూరు తిరుచునాపల్లులలో నీటిపనులు బాగుగనే యుండెడివి. అయినను, కావేరి విషయమై వర్షకాలములో నదీప్రవాహ మెక్కువగా నున్నపుడు ఆ నీటిని వాడుకొనఁగలిగిరి గాని దానిని నిలువచేసి యెండ కాలములో వాడుకొను ప్రయత్నమును చేయలేదు. కాటన్ గారు అట్టి ప్రయత్నమును చేసి కార్యమును సాధించిరి. ఈ పనిని చేయుటకు తక్కిన ఎంజినీర్లు సాహసింపలేరైరి. నిరుపయోగ మని తలంచి గవర్నమెంటువారు ద్రవ్యము నీయ సాహసింపరైరి. అట్టియెడల కాటన్ గారు తమ బుద్ధిబలము నుపయోగించి పూర్వపు కట్టడములో నున్న తప్పులను సవరించి లోపములను బూర్తి చేసి నీటిని నిలువ చేసి యవశ్య మైనప్పుడు దాని నుపయోగించుటకు వీ లగునట్లు చేసిరి. ఈ పని ముగించిన తరువాత పై యధికారు లందఱు ననేకవిధముల నతని బుద్ధికుశలత సామర్థ్యము పట్టుదల సాహసము ఉదారభావము మొదలయిన గుణములను శ్లాఘించిరి. దీనివలన లాభము పొందిన ప్రజల యానందమునకు మేరయే లేదు. వారు పొందిన లాభ మింతంత యని చెప్ప వీలు లేదు. సర్వకాలములలోను అందఱకును జలసమృద్ధి, పెక్కు రెట్లు పంట వృద్ధి, దొరతనమువారి కోశమునకెక్కువ రాబడి, భూమి విలువలో హెచ్చు, ఎక్కువ రాబడిచే కలుగు నిశ్చింత మగు భూమి, భూసారములో వృద్ధి మొదలయిన లాభసముదాయము కలిగెను. వే యేల భూమియే దేశమునకు ధనకోశ మయ్యెను. తరువాత దక్షిణదేశములోనే పాలేరు నదికిఁ గూడ ఇట్టి సదుపాయమును చేసెను.

ఇతఁడు తన బుద్ధిబలముచేత దేశోద్ధరణమునకు తగిన చిల్లర కట్టడపు పనులను పెక్కింటిని చేసెను గాని గ్రంథవిస్తరభీతిచే అవి చదువరుల యూహకు విడిచిపెట్టి ఒక్క ఘనకార్యమును గూర్చి మాత్రము ప్రసంగించుట యుక్తము. ఇది యతని కార్యము లన్నిటిలోను గొప్పది. అతని కీర్తి మాలకు మణిపూసవంటిది. ఈ కార్యము

చేతనే అతఁడు మానుషాతీతుఁ డని చెప్పవచ్చును. గోదావరివంటి మహానదిని అన్ని విధముల బంధించి శాసించుట యన్న సామాన్యమా! ఇట్టి మహాత్కార్యమును చేయుటకు ఆయన సమకట్టెను. దీనిని గూర్చి యిదివఱకే కొంత సూచించితిని. దీనికి ముందు దేశములో నిండుకొనియున్న దుస్థితిని సూచించితిమి. అట్టి దుస్థితియే తరువాత సుస్థితికి కారణ మయ్యెను. మనకు చెడ్డయు అప్పుడప్పుడు మంచికే వచ్చును గదా! గోదావరి జిల్లాలోని దుస్థితిని గూర్చి విచారణ చేసి దానిని నివారించుట కుపాయము నాలోచింప తంజావూరు కలక్టరుగా నున్న సర్ హెన్రీ మంగోమరీ గారిని పంపిరి. కావేరీనదిని సరిగా నుపయోగించుటవలన కలిగిన యమితలాభమును ఆయన స్వయముగఁ జూచినవాఁడై "రాజమండ్రి" జిల్లాకు గూడ గోదావరి నుపయోగించు పద్ధతిని పరీక్షించిన బాగుండు నని తెలియఁజేసెను. అప్పటికే క్రైస్తవాలయముఁ గట్టింప నియమింపఁబడిన కాటన్ వృథా కాలయాపనముఁ జేయక ప్రజల దుస్థితిని నివారించు తరణోపాయము నాలోచించుచు ఉత్తరపు జిల్లాలలోని చెఱకు పంటను వృద్ధి చేయు నుపాయమును కనుపెట్టుచుండిరి. బట్టల నేత పాడగుటచే వృత్తి భంగ మైన ప్రజలకు ఇంకొక వృత్తిని కల్పింపవలెను. ఇందునకు చెఱకు వ్యవసాయము తగిన దనియు దానివలన అనేకలాభము లున్న వనియు చూపుచు దానికి తగిన నీటియాధారమును కల్పింపవలసియుండు నని దొరతనమువారికి తెలియఁజేసెను. దానికి దొరతనమువా రంగీకరించి అందునకు తగిన యేర్పాటు లేమి కావలయునో తెలియఁజేయు మన కాటన్ గారు తాము చేయవలసియున్న పనిని సూచించిరి. నదికి రెండు ప్రక్కలను వఱదచే పంటలకు నష్టము రాకుండ గట్లను కట్టుట, నదికి అడ్డముగా కట్ట కట్టి భూమి మట్టముతో సమముగా నీటిమట్టము నెత్తు చేయుట, ఆ నీటిని తగిన కాలువల ద్వారా భూములకు పాఱించుట, పండిన పంటను ఒక చోటినుండి మఱియొకచోటికి కొనిపోవుటకొఱకు ఎత్తయిన రోడ్లు వంతెనలు మొదలయినవి కట్టుట ముఖ్యావశ్యకము లని తెలిపిరి. ఈ పై చెప్పిన యేర్పాటులు చేసినయెడల 10 లక్షల యెకరముల భూమి వరి చెరకు మొదలగునవి పండించుటకు తగియుండు నని చూపిరి. ఇంత ఫల మధిక మగు పని కెట్టి పిఱికివాఁడైనను సాహసింపక పోఁడు. నీటి ప్రవాహమును శాసించి మనుష్యస్వాధీనము చేసి మనుష్యుని కనేకవిధముల నుపయోగముగా నుండఁజేయుట అయన ముఖ్యోద్దేశము. ఇందులకై సున్నము రాయితో 12 అడుగుల యెత్తున నదికి అడ్డముగా నెన్నిరో మైళ్ల పొడవున ఆనకట్టు కట్ట నిశ్చయించిరి.

మొదట రాజమహేంద్రవరమునకు పైఁగా నానకట్టఁ గట్టుట కేర్పఱచి తరువాత ధవళేశ్వరమునకు దిగువ కట్టుట బాగుండు నని యోచించిరి. ఇక్కడ నది వెడల్పు హెచ్చయినను మధ్యమధ్యమున లంక లుండుటచేతను ఆనకట్ట కుపయోగించెడి రాళ్లు మొదలయినవి దగ్గఱగా నుండుటచేతను ఈ స్థలమే బాగున్న దని యోచించిరి. కట్టుటకు సుమారు 12 లక్షల రూపాయ లగు నని మదింపు చేసికొనిరి. కాని, పని యంత మగువఱకు చాల నెక్కువ సొమ్మాయెను ఇక్కడ నది వెడల్పు 3½ మైళ్లు. కాని, ఇందులో మూఁడవభాగము లంకలచే నాక్రమింపఁబడి యున్నది. ఈ లంకలచేతనే నది యిక్కడ నాలుగు పాయలుగా విభజింపఁబడుచున్నది. ధవళేశ్వరమున కొక మైలు దూరమున నున్నది పిచికలంక. ఇది సుమారు అఱమైలు వెడల్పు కలది. దీని తరువాత ర్యాలి గోదావరి పాయ. ఆ పైని కొబ్బరిలంక సుమారు 470 గజముల వెడల్పున నున్నది. ఆ పైని మద్దూరు పాయ. మద్దూరులంక సుమారు 630 గజముల వెడల్పున నున్నది. ఆ పైని విజ్జేశ్వరపాయ కలదు. అనఁగా ఒక లంక మఱియొకదానితో కలుపుచు పాయల కడ్డుగ ఆనకట్టఁ గట్టఁబడియున్నది. నాలుగు పాయల కడ్డముగ నాలుగు భాగములు గలవు వాని పొడవు సుమారు 4,000 గజము లుండును. ఒక మహానది కడ్డముగ ఇట్టి కట్ట కట్టుట యన్న బహుకష్టము. కట్టుటలో కష్టసుఖముల ననుసరించి యనేకవిధముల నేర్పాట్లు మార్పవలసివచ్చెను.

1847-వ సం॥లో పనిఁ బ్రారంభింప నుత్తరు వీయఁబడెను. ఏప్రిలు నెలలోఁ బని నారంభించిరి. జూలైకి ముందు 10200 కూలివాళ్లు 500 వడ్రంగులు 500 కమ్మరపుపనివాండ్రు పని చేయుచుండిరి. పడవలు రైలుబండ్లు మొదలయినవి కూడ పనిచేయుచుండెను. 1848-వ సం॥ ఆనకట్ట కట్ట నారంభించిరి. ధవళేశ్వరము మద్దూరు భాగములు 9 అడుగులు కట్టిరి. కాటన్ గారు దేహస్థితి చెడినందున సెలవుపై రెండు సంవత్సరములు దేశము విడిచినను ఆయన చేసిన యేర్పాట్లు కొనసాగి 1849-వ సం॥లో విజ్జేశ్వరముపాయఁ గూడ 9 అడుగుల యెత్తు కట్టిరి. ఈ నడుమనడుమ వరదలచే కొట్టుకొనిపోయిన భాగములను తిరిగి కట్టుచు అనేకవ్యయప్రయాసలు పడి 1850-వ సం॥ వఱకు మూడు పాయలను కట్టిరి. ర్యాలిపాయ మాత్రమే మిగిలెను. వర్షాధిక్యముచే ఇది కట్టుట యతికష్ట మయ్యెను. ఎట్టకేలకు 1852-వ సం॥ మార్చి 31-వ తేదిని ఆనకట్ట కట్టడము ముగించిన దనుకొనవచ్చును. ఆ పైని చేసిన మార్పులు అనేకములు కలవు. కట్టడముతోఁబాటు కాలువలు త్రవ్వుటఁ గూడ ప్రారంభించి పని చేసిరి 1852-వ సం॥ గన్నవరము దగ్గఱ గోదావరిపైని అక్విడక్టును కట్టి నగరము తాలూకాకు నీటి సదుపాయమును చేసిరి. ఇంత కొలఁది కాలములో ఇంతటి ఘనకార్యమును చేసిన మహానుభావుఁడు మనుష్యమాత్రుఁ డని యెవ్వ రనుకొనఁగలరు? 1858-వ సం॥లో పని యొక్క ఫలితము కనఁబడఁజొచ్చెను. అందఱును సంతోషించిరి. పై యధికారులును క్రింది ప్రజలును ఆనందించి అనేకవిధముల కాటన్ గారి యౌదార్యాదిగుణములను కీర్తించిరి. అనుకొనిన దానికన్న నధికముగఁ బెట్టుబడి (మొత్తము రు 1,36,93,000) అయినను, తదనుగుణఫలము రాకపోలేదు. కర్చులు పోఁగా నూటికి 20 వంతున పెట్టుబడిపైని లాభము కనఁబడఁజొచ్చెను. ప్రజలకు కలిగిన ఐశ్వర్యమునకును ఆనందమునకును మేరయే లేదు. దేశములో దుస్థితి యన్న మాట వినఁబడదు. ప్రస్తుతము క్షామపీడిత మైన యితరదేశభాగములకు ఇక్కడి పంటయే కాటన్ గారి జీవితకార్య ఫలితమే.

దిక్కగుచున్నది. ఇది ఆయన చేసిన ఘనకార్యములలో నెల్ల నగ్రగణ్యమైనది. ఇంత పని తలపెట్టి కొనసాగించి కృతార్థుఁడ నైతిని గదా యని యూరకుండక ఇండియా దేశములో ననేకనదులను ఉపయోగించు మార్గముల నాలోచించి రైళ్లకన్న కాలువలే దేశమునకు అనేకవిధముల ముఖ్యమైనవని పాటుపడుచు దేహశక్తిని బుద్ధిబలమును మన దేశమునకే ధారపోసి ఆసేతుహిమాచలము ఒక యంగుళమైన నీరు లేని స్థలము లేకుండ చేయు సహాయముల నెన్నిఁటినో సూచించెను. తనకు తగిన దేహదార్ఢ్యము జీవితకాలము ఈశ్వరుఁ డొసంగినచో ఇండియాకు ఈ మహోపకారమును చేయఁగల ననియే ఆయన మనోనిశ్చయము. ఇట్టిది నెఱవేర్చుట కనేకవిఘ్నముల పాటుపడెను. ఈశ్వరుఁడును ఈయన కనుకూలుఁడై వీలయినంతవఱకు నాయురారోగ్యముల నిచ్చెను. 96 ఏండ్లు వయస్సు వచ్చినను దేహములో జబ్బు లేదు. కన్ను చెదరలేదు. దేహశక్తి యుడుగలేదు. అయినను మానవుఁ డమర్త్యుఁడు కాఁడు గదా! ఎట్టి మహానుభావుఁడును నిర్యాణముఁ జెందవలసినదే. ఇతఁడు మహాపురుషులవలె నిశ్చింతముగను ఈశ్వరధ్యానతత్పరతతోను దైవగ్రంథములను జదువుచు దైవమునే ధ్యానించుచు 1899-వ సం॥ జూలై 14 తేదిని పరమశాంతిని బొందెను. ఇట్టి యుదారచరితము చెప్పిన రీతిని దైవనిర్మితప్రకృతిని మార్చి మానవోపయోగమునకు తెచ్చిన మహాపురుషుఁడు దైవాంశనిర్మితావతారపురుషుఁడు. అట్టి వారిని గుఱించి కొంత తెలియఁదగినది. ఇది చాలదు. చదువరులు ఈపైని జ్ఞానమును సంపాదింప కర్తలు.

గ్రీష్మర్తువర్ణనము

శ్రీమతి కంచనపల్లి కనకమ్మగారు

దినముల్ దీర్ఘములై ప్రసూనలతలున్ దేజోవిహీనంబులై
ఘనకాంతారము లగ్ని కాహుతులునై, గాలిన్ బరాగంబులున్
మినుముట్టన్ బ్రబలంబులై, హ్రదములన్ మేల్ నీరు శూన్యంబునై
పెనుతాపం బొనఁగూర్చుచున్ జనులకున్ భీష్మంబు గా గ్రీష్మమా
పఱగెన్ సూర్యుఁ డుదీచికిన్ హితవుగన్ పందిళ్లకున్ పాంథులున్
సరసోద్యానములన్ జరించె సరసుల్, సర్పంబులున్ జేరె చ
ప్పరముల్, పశ్చిమగాడ్పులున్ విసరఁ గాఁ బర్వెన్ ప్రమాదంబు, దు
ర్భరమై తోఁచెడు ప్రాణయాత్ర తలఁపన్ పాపంపుగ్రీష్మంబునన్.

చంద్రోదయము

నీరధి మీఱఁ దా నిలువనేరక నీఁకటి గొంది దూర సం
చారము మాని చోరతతి జార, చకోరము దప్పి దీర, నీ
హారము నిగ్గుదేర, ధర నంతట వెన్నెలతీగ బార, దో
షారిమహాంసమై రుచిరసాంద్రుఁడు చంద్రుఁడు దోఁచెఁ దూర్పునన్.

సత్కవి

ఆరయ మంచిభావముల నందము చందముఁ గల్గుశైలి నో
రూరఁ బదంబులన్ రసము లుప్పతిలం గవిరాజసూరి స
త్కారముఁ గైకొనం దగెడు కావ్యములన్ రచనం బొనర్చి వి
స్తారవివేకధీగరిమఁ దాల్పడె సత్కవి కీర్తిసంపదన్.

బమ్మెర పోతరాజు

రావు బహదూర్ కందుకూరి వీరేశలింగము పంతులు గారు



శ్రీమద్భాగవతము నాంధ్రీకరించిన బమ్మెర పోతరాజు ఒంటిమిట్టవాఁడని కొందఱును ఓరుగంటివాఁడని కొందఱును కొంతకాలమునుండి పరస్పరవిజయార్థులై పట్టుదలతో పోరాడుచున్నారు. నే నాంధ్రకవుల చరిత్రమును వ్రాసినప్పుడు తెలుఁగు భాగవతమును ముద్రించినవారు తమ పీఠికలో వ్రాసిన దానిని నమ్మి పోతన యొంటిమిట్టవాఁడనియే చెప్పితిని గాని యిటీవల బైలువెడలిన వాదానువాదములను బట్టి నా తొంటి యభిప్రాయమును మార్చుకొని యోరుగంటివాఁడని నే నీనడుమ సంస్కరించి ప్రకటించిన కూర్పులోఁ బ్రమరింపవలసినవాఁడ నైతిని. అట్లు చేసినందునకయి బ్రహ్మశ్రీ వావిలికొలను సుబ్బారావు గారు నన్ను బహువిధముల దూషించి హంవత్పత్రికలో నొక వ్యాసమును వ్రాసి ప్రకటించిరి. దూషణము లెప్పుడును వాదదౌర్బల్యమునకు సూచనలగుట విచారించి వారి దూషణవచనముల నాశీర్వచనములనుగా స్వీకరించి సత్యగ్రహణపరాయణు లగువారి యుపయోగార్థముగా నా పూర్వాభిప్రాయమును మార్చుకొనుటకుఁ గల యాధారములను సంక్షేపించి వ్రాయుచున్నాను. సత్యగ్రహణసమాదరచిత్తులు దీనిని గూడ చిత్తగించి తరువాతఁ దోఁచిన సిద్ధాంతమును చేసికొందురు గాక !

పోతనామాత్యుని భాగవతములో నొంటిమిట్ట యని గాని యోరుగల్లని కాని లేదు; దానిలో "ఒక్క రాకానిశాకాలంబున సోమోపరాగంబు రాఁ గని సజ్జనానుమతంబున నభ్రంకషశుభ్రసముత్తుంగభంగ యగు గంగకుం జని క్రుంకులిడి వెడలి ... ... మరలి కొన్ని దినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి" అని యేకశిలానగర మని మాత్రము చెప్పఁబడినది. దీనిని బట్టి యిందుఁ జెప్పఁబడిన యేకశిలానగర మేది యని నిర్ణయింపవలసియున్నది. శిలాతామ్రశాసనములయందును పూర్వగ్రంథములయందును ఓరుగంటికే యేకశిలానగరనామము వ్యవహరింపఁబడియుండుట నిర్వివాదాంశము. ఏకశిలానగరనామ మొంటిమిట్టకే శాసనమునందును గ్రంథమునందును వాడఁబడలేదు. నూఱు సంవత్సరముల క్రిందట మెకాంజీ గారు గ్రామస్థులవలన కయిఫీయతులు మొదలైనవానిని సంగ్రహించి కూర్చి చేర్చిన స్థానికచరిత్రముల (Local Records) లోని యొంటిమిట్ట కైఫీయతులలోను శాసనములలోను ఒంటిమిట్ట కొంటిమిట్ట యన్న పేరే కాని యేకశిలానగర మన్న పే రెక్కడను గానఁబడదు; అంతే కాక యొంటిమిట్ట యను పేరా గ్రామమున కొంటఁడు మిట్టఁడు నను బోయలవలన వచ్చిన దని కూడ చెప్పఁబడినది. ఓరుగంటి ప్రతాపరుద్రుని కాలములో ననఁగా మన పోతన్నకు నూఱు సంవత్సరములు ముం దోరుగంటియందే వాసము చేయుచుండిన విద్యానాథకవి తన ప్రతాపరుద్రీయములో "రాజన్యేకశిలానగరీతి" యని యనేకస్థలములలో నోరుగంటి నేకశిలానగర మని వాడియున్నాఁడు. ఒంటిమిట్టలో నున్న కవులలో నొక్కఁడును ఒంటిమిట్ట నేకశిలానగర మని చెప్పలేదు. ఒంటిమిట్ట కవులలో మొదటివాఁడగు తిప్పనామాత్యుఁడు తన శతకములో నొంటిమిట్ట రఘువీరుఁడనియే చెప్పెను గాని యేకశిలానగరనామ ముచ్చరింపలేదు. ఒంటిమిట్ట రఘువీర శతకములోని రెండు పద్యముల నిం దుదాహరించుచున్నాను:

శా. కారుణ్యోదయు రొంటిమిట్టపురినాథా నీకు నేఁ బద్యముల్
నూఱుం జెప్పిన నారుఁ బేరు వెలయున్ నాత్మంబుగా నంగనా
నోటం బావన నామ నీ కరుణఁ గాంచన్ భక్తి నన్నుండఁగన్
రార మ్మందురు గారవించి రఘువీరా జానకీనాయకా.

మ. అతులప్రౌఢిమ మీఱు రాజుకవి యయ్యలరాజు సత్పుత్రుఁ డం
చితభక్తిం ద్రిపురాంతకుం డ* రచియించెన్ దెన్గు పద్యంబులన్
శతకం బొక్కటి దీని నీవు విని యాచంద్రార్కమై నిల్వ ప
ద్యాశకన్యామున యొంటిమిట్ట రఘువీరా జానకీనాయకా.

ఈ కవి కాలములో నొంటిమిట్టయం దున్న దేవుఁడు కోదండరామస్వామియే యయి యుండినయెడల శతకమకుటమునందు

"గుణధామా మహదొంటిమిట్టనగరీకోదండరామా ప్రభూ"

అని వేసియుండును.

రెండవ కవి యైన యయ్యలరాజు రామభద్రకవి తన రామాభ్యుదయాశ్వాసాంతగద్యమునందు సంస్కృతసమాసమున సహితము "శ్రీమ దొంటిమిట్టరఘువీరశతక నిర్మాణకర్మఠ జగదేకఖ్యాతిధుర్య యయ్యలరాజతిప్పయమనీషిపౌత్ర" యనియే చెప్పెను గాని యేకశిలానగర మని చెప్పలేదు.

ఏకశిలానగర శబ్దార్థమును బట్టి విచారించినను, ఒక్కరాయి యని యర్థ మిచ్చు నోరుగంటికి చెల్లును గాని యొక్క కొండ యను నర్థ మిచ్చెడి యొంటిమెట్టకుఁ జెల్లదు. శిల యనఁగా శైలమనియు శైల మనఁగా శిల యనియు నర్థము చెప్పెడు బుద్ధిమంతుల యర్థ మెంత యుక్తియుక్త మైనదో మతిమంతులు ఊహించి తెలిసికొనఁగలరు. అట్టివారి మతమును బట్టి శ్రీశైలమునకు శ్రీపర్వతము శ్రీనగము గాక శ్రీశిల యని చెప్పవచ్చును కాఁబోలును! అట్లైన వచ్చినచోఁ దన్మతానుసారిగా ఱబ్బరాతిని ఱబ్బకొండ యనియు ఱబ్బశైల మనియుఁ గూడ చెప్పవచ్చును. ఒంటిమిట్ట కేకశిలానగరనామము సమర్థించుటకై గ్రామదేవాలయసమీపమున నొక మెట్ట యుండుటచేత నా పేరు వచ్చిన దని యొకచోటను దేవాలయములోని సీతారామలక్ష్మణవిగ్రహములు మూఁడును నొక్కరాతితోఁ జేయఁబడియుండుటచే నా పేరు కలిగిన దని వేఱొక

* తిప్పన్న

చోటను చెప్పుచున్నారు. దేవాలయములలోని విగ్రహముల వంటి యితరములు లేక యేకశిలతో చేయఁబడుటచేఁ గాని గ్రామము లన్నియు నేకశిలానగరములే కావచ్చును. ఇది యిట్లుండఁగా స్థలచరిత్ర మా పేరింటిఁడు పుట్టిఁడు నను జోగుల పేరును బట్టి కలిగిన దని చెప్పుచుండుటచేత నీ రెండు వ్యుత్పత్తులును గూడ పొసఁగక పోవుటయే కాక యేకశిలానగరనామ మొంటిమెట్టకు సరియే పనికిరాని దగును.

పేరులకై పెనఁగులాడెడి యీ శుష్కవివాదము నింతటితో విడిచిపెట్టి యిఁక బమ్మెర పోతరాజ కృత గ్రంథములవలన నీ విషయమై యే మైన తేలు నేమో చూతము. పోతన చేసిన గ్రంథములు నాలుగు — వీరభద్రవిజయము, భోగినీదండకము, నారాయణశతకము, భాగవతము. ఈ నాలిగింటిలో ముందుగా నేకశిలానగర నామమును జెప్పిన భాగవతమును గూర్చి విచారింతము. ఓరుగ ల్లేకశిలానగర మగుట భాగవతరచనకు పూర్వమే సుప్రసిద్ధము కావున భాగవతమునందుఁ జెప్పఁబడిన యేకశిలానగర మోరుగల్లే యని విశేషవిచార మక్కఱ లేకయే స్థూలబుద్ధికి సహితము గోచర మగును. అది యట్లుండఁగా భాగవతమును బట్టి యేకశిలానగరము గంగకు కొన్ని దినముల ప్రయాణములో నున్నట్టు తనఁబడుచున్నది. గంగ యను పేరు గౌతమికిని భాగీరథికిని గూడ నాంధ్రదేశమున సామాన్యముగా వ్యవహారమునం దున్నది. రాజమహేంద్రవరప్రాంతమున గౌతమీనది సాధారణముగా గోదావరి యను నామముతో వ్యవహరింపఁబడుచున్నను, ఓరుగల్లు ప్రాంతమున సామాన్యముగా గంగ యను పేరితోనే వ్యవహరింపఁబడు చున్నది. అందుచేత నేకశిలానగరమే యోరుగల్లయ్యెడు పక్షమున నక్కడకుఁ గొన్ని దినముల ప్రయాణములో నున్న గంగ భాగీరథి గాక గౌతమియే యగును. ఈ గంగకు కొన్ని దినముల ప్రయాణములో నున్న దగుటచే నేకశిలానగరనామ మోరుగల్లునకే చెల్లును గాని యొంటిమెట్టకుఁ గాని తన్నామమును ధరించిన యే యితరపురమునకుఁ గాని చెల్లదు. ఒంటిమెట్టకు సమీపమునఁ గొన్ని దినములలోఁ జేరఁదగిన నది యేదియు లేదు. వ్యవహారములో లేకపోయినను నేదో స్థలమాహాత్మ్యములో గంగ యనఁబడిన పినాకినీ నది యొంటిమిట్టకు సమీపములో నున్నను, ఆ పెన్న యొంటిమెట్టకు భాగవతములోఁ జెప్పఁబడినట్లు కొన్ని దినముల ప్రయాణములో లేక కొన్ని గంటల ప్రయాణములోనే యున్నందున నందుఁ జెప్పఁబడిన గంగ పెన్న గా దనుట నిశ్చయము. సామాన్యముగా జలసామాన్యమును గంగ యని జనులు వ్యవహరింతురు గాన నందు వ్యవహరింపఁబడిన గంగ కొన్ని దినముల ప్రయాణములో నున్న యే చెఱువు నీరో యే యేటి నీరో యను విద్వాంసులకు సమాధానము చెప్పుట నావంటి మితజ్ఞునకు సాధ్యము కాదు. కొన్ని దినము లనఁగా కొన్ని మాసము లైనను కావచ్చు నను పండితులను సమాధానపఱచుటయు నసాధ్యమే. పినాకిని యన్న పేరు రెండు నదుల కున్నప్పుడు ఉత్తరపినాకిని దక్షిణపినాకిని యని పిలుచునట్లుగానే గంగ యను పేరు రెంట నదులకు సామాన్యమగుచు నుండుటచేత నుత్తరమున నున్న భాగీరథి నుత్తరగంగ యనియు దక్షిణమున నున్న గోదావరిని దక్షిణగంగ యనియు పిలుచుట వాడుకయై యున్నది. అయినను, గోదావరిని దక్షిణశబ్ద ప్రయోగము లేక కేవల గంగ యని పిలుచుటయు వాడుకలోఁ గలదు. పోతనకు దాపు కాలికుఁ డైన శ్రీనాథమహాకవి రాజమహేంద్రవరమును వర్ణించుచు,

"ప్రవహించు నే వీటి పశ్చిమప్రాకార
మొరసి గంగమ్మ సాగరము గోమ్మ"

అను సీసపాదమున గోదావరిని గంగ యని చెప్పియున్నాఁడు. గోదావరీనామముతో గౌతమిని సాధారణముగా వ్యవహరించు రాజమహేంద్రవరములో నున్న శ్రీనాథుఁడే దక్షిణశబ్ద విరహితముగా వాడినప్పుడు, గంగ యనెడి యేకనామములోనే వ్యవహరించు దేశమునం దుండిన పోతనామాత్యుఁడు దక్షిణగంగ కనక "యభ్రంలిహ శుభ్ర సముత్తుంగ భంగ యగు గంగ" కని ప్రయోగించుటలో వింత యే మున్నది? దక్షిణపదపూర్వకముగా ప్రయోగించినను ప్రయోగింపవచ్చును; దక్షిణపదమును విడచి ప్రయోగించినను ప్రయోగింపవచ్చును. "దక్షిణగంగ నాఁ దద్దయు నొప్పిన గోదావరియు" నని నన్నయభట్టారకుఁడు దక్షిణశబ్దపూర్వకముగా ప్రయోగించెను. భాగవతభాగములను రచించిన బమ్మెర పోతన్న యొక్కయు వెలిగందల నారాయణకవియొక్కయు ఏర్చూరి సింగనయొక్కయు గృహనామములు గల యూళ్లోరుగంటికి సమీపములో నుండుటచే నీ భాగవతములో జెప్పఁబడిన యేకశిలానగర మోరుగల్లే యని సిద్ధాంత మగుచున్నది. ఓరుగల్లు గాదని యొంటిమిట్టనే సిద్ధాంతము చేయఁ దలఁపులో నీ నామములకు ప్రతిగా ఏర్చూరున కేల్చూరును వెలిగందలకు వెలిగండ్లయును నామముల పోలిక గల రెండు గ్రామముల నొంటిమిట్టకు చేరువ నుండువాని నొంటిమిట్టవారు కష్టపడి కనిపెట్టఁగలిగిరి గాని ప్రధానగ్రామ మైన బమ్మెరతోడి సమానాక్షర సంబంధము గల గ్రామకల్పమును దేనిని తత్సమీపమునఁ గనిపెట్టఁజాలక బొమ్మవరమును బమ్మెర యందు మనిరి. బొమ్మెర బమ్మెర కాదని వాదించెడి యీ ఘనులకు తక్కువ యక్షరముల మాట యటుంచి నను బొమ్మెరలో మొదట నున్న బొకారముతో నారంభ మయ్యెడు బొమ్మవరము నెట్లు చెప్ప సాహసము గలిగెనో! ఈ పేరింటిమెట్టవాదులకే సరిపడక దాని గప్పిపుచ్చుటకయి బమ్మెర యూరిపేరే కా దనియు పోతన పూర్వు లూరూరు తిరుగువా రగుటచే భ్రమణశబ్దభవ మైన బమ్మెర వారి యింటిపే రయ్యె ననియు అపూర్వపాండిత్యప్రభావు లయిన యొంటిమెట్టవాదులు తమ పాండిత్యవిశేషముచేతి విశేషార్థకల్పనము చేసిరి. బమ్మెర గ్రామ మగునో కాదో పూర్వకవి యైన పట్టమట్టి సరస్వతీ సోమయాజి కృత మయిన పృథుచరిత్రములోని యీ క్రింది పద్యమును జదివి వారు గ్రహింతురుగాక!

చ. పయుల కసాధ్యమై పరఁగు భాగవతంబు రహస్య మంతయున్
  హరి కృపచే నెఱింగి మృదులాంధ్రవచోరచనావచిత్రిమా

కారణమహాప్రబంధమును గా రచియించిన భానుతేజు బ
మ్మెరపురపోతరాజు నసమకృతభోజు నుతింతు నెంతయున్.

గ్రామనామము బొమ్మెర యని వాడుకలో నుండుటచే నది బమ్మెర కాదని వాదించుచున్నారు గదా! ఓరుగంటిపై పువారు బమ్మెర పోతరాజు నిప్పటికిని బొమ్మెర పోతరాజనియే చెప్పుచున్నారు. తొంబది సంవత్సరముల క్రిందట ననఁగా ౧౮౨౯-వ సంవత్సరమునం దింగ్లీషున దక్షిణహిందూస్థానకవుల చరిత్రమును ప్రకటించిన కావలి వేంకటరామస్వామి గారు పోతరాజు గృహనామము బొమ్మెనవా రని వ్రాసియుండుట మీరు చూచియుండలేదా? ఇంతకును మీ యేకశిలానగర మనెడిని వంటిమిట్టా? ఒంటిమిట్టా? "వంటిమిట్టలోను వసతిగాను" అని స్థలపురాణములో వకారాదిగా నున్నప్పుడు బమ్మెర బొమ్మెర కాదని వాదించెదరు మీరు వంటిమిట్టనే యొంటిమిట్ట యని యెట్లు చెప్పుదురు? గ్రామము వంటిమిట్టయే యయిన పక్షమున దాని యేకశిలార్థమే పోక మీ వాదము నిర్మూలమగును గదా?

భాగవతములో కవి వ్రాసిన రెండు ముక్కలను బట్టి యేకశిలానగర మోరుగల్లనుటయే సంభావ్యముగా నున్నది. ద్వాదశస్కంధములలో దేనిలోను కృతిపతి యగు రాముని సంబోధించుటలో నొక్కచోటైనను నొంటిమిట్ట కోదండరామా యని కాని తుదకు కోదండరామా యని కాని లేకపోవుటచేతనే పోతనార్యుని యిష్టదైవతము సాక్షాద్రామమూర్తియే కాని యొంటిమిట్టలోఁ గాని మఱియే గ్రామములోఁ గాని యుండిన యర్చావిగ్రహము కా దని స్పష్టపడుచున్నది. పోతరాజు తనకు ప్రత్యక్ష మయినట్లు చెప్పిన రాజముఖ్యుని వర్ణనను బట్టియైనను మూడవ చరణములోని

"వల్లీయుతతమాలవసుమతీజము భంగి
బలువిల్లు మూఁపునఁ బరఁగువాఁడు."

అను దానిని బట్టి కోదండరాముఁ డని యూహించుటకంటెఁ ప్రథమచరణములోని

"మెఱుఁగు చెంగట నున్న మేఘంబు కైవడి
నువిద చెంగట నుండ నొప్పువాని"

అను దానిని బట్టి సీతారాముఁ డని యూహించుట యధిక విశ్వాసయోగ్యము కాదా? పోతన విరచిత నారాయణశతకములోని యీ క్రింది పద్యమువలనఁ గూడ

మ. అపరాధంబులు నిన్ను నమ్మి విను మే నాజన్మపర్యంతమున్
విపరీతంబుగఁ జేసినాఁడ నిఁక నీవే దిక్కు నాలోనికిన్
గపటం బింతయు లేక దండధరుకుం గట్టీక రక్షింపుమీ
కృపకుం బాత్రుఁడనయ్య ధర్మపురిలక్ష్మీనాథ నారాయణా.

భాగవతమునఁ జేర్కొనఁబడిన యేకశిలానగర మోరుగల్లే యని యూహింపఁబడఁ దగియుండలేదా? ఈ ధర్మపురి నైజాము రాజ్యములో మంథెన సమీపమున గోదావరీతీరమునం దున్నది. పోతన భాగవతమునఁ జెప్పఁబడినట్టు చంద్రగ్రహణపుణ్యకాలమున గంగాస్నానార్థము పోయిన దీ పట్టణమునకే యయియుండును. మహేశ్వరధ్యానంబు చేసి కించిదున్మీలితలోచనుండై యుండినప్పుడు రామభద్రుండు ప్రవేశించి కన్నుఁగవ కెదుటఁ గానఁబడుట యిచ్చటనే యయియుండును. అందుచేత నాఁటికి శివభక్తుఁడయి యుండిన పోతనార్యుఁ డాకస్మికముగా విష్ణుభక్తుఁడుగా మాఱి యా యూరి నారాయణునిపై నక్కడనే నారాయణశతకమును జెప్పియుండును. అక్కడనుండి మరలి కొన్ని దినములలో నేకశిలానగరమునకు వచ్చి శ్రీకృష్ణస్తుతితో భాగవతపురాణాంధ్రీకరణ మారంభించియుండును. ధర్మపురి వ్యయనఁ జేర్కొనుటచే బమ్మెర పోతరాజు స్నానమునకుఁ బోయినది యా పురమునకడ నున్న గౌతమీగంగకే యనియు గోదావరినుండి కొన్ని దినములలో వచ్చిన యేకశిలానగర మోరుగల్లే యనియు సులభముగాఁ దెలిసికోవచ్చును. ఈ పుస్తకద్వయమునకు ముందుగా రచియింపఁబడిన భోగినీదండకములోఁ జేర్కొనఁబడిన సింగమనాయఁడు గోలకొండరాజ్యములోని రాచకొండ మెతుకు సంస్థానాధీశ్వరుఁ డగుట కూడ బమ్మెర పోతరాజు వొంటిమిట్ట నివాసి కాఁడనియు నోరుగల్లునఁ బరఁగిన యేకశిలానగరవాసియే యనియు ఘోషించుచున్నది. పోతనార్యుఁడు ప్రప్రథమమున రచియించిన శైవగ్రంథ మగు వీరభద్రవిజయము కూడ కొంతవఱకు తాఁ డోరుగల్లుపురవాసి యని స్థాపించుచున్నది. ఈ గ్రంథము కవి మిక్కిలి చిన్నవాఁడయి శైవమతపక్షపాతి మధికముగాఁ గలిగియుండిన కాలములో చేయఁబడినది. మతగురు వైన యివ్వటూరి సోమనారాధ్యుఁడు కవి నుద్దేశించి చెప్పిన ట్లున్న వీరభద్రవిజయములోని యీ క్రింది పద్యములు గ్రంథరచనారంభకాలమునాఁటికి పోతనార్యుఁడు పిన్నవాఁ డని స్పష్టపఱచుచున్నవి.

సీ. సమయంబు లాఱును జర్చించి చర్చించి
చదువులు నాల్గును జదివి చదివి
బహుపురాణంబులు భాషించి భాషించి
యితిహాసముల నెల్ల నెఱిఁగి యెఱిఁగి
కావ్యంబు లెన్నేని గుర్తించి గుర్తించి
యఖిలవిద్యల సారమరసి యరసి
గుణులతో సద్గోష్ఠి గావించి కావించి
సకలకృత్యంబులు జరపి జరపి
యున్న వైనను మా కెల్ల నూహలోన
వింత పండువు బోలెను వీరభద్ర
విజయ మెల్లను వినఁ గడు వేడ్క యయ్యె
నది తెలుంగున రచియింపు మభిమతముగ.

ఆ. పిన్నవాఁడ ననియుఁ బెక్కు సత్కృతులను
విననివాఁడ ననియు వెఱపు మాను
మత్ప్రసాదదివ్యమహిమచే నెంతైనఁ
గవిత చెప్ప లావు గలుగు నీకు.

పోతన కులగురు వైన సోమనారాధ్యుని యింటిపేరు ఇవ్వటూరివారు. ఇది గ్రామనామ మగుటకు సందేహము లేదు. ఇవ్వటూ రోరుగల్లు పట్టణమునకు ముప్పది మైళ్ల దూరములో నున్నది. అందుచేత

మనకవ పైగ్రామాధికారిగా వచ్చినప్పటినుండి ఏకశిలాపురమని వ్రాసినవి. ఇట్టి కథలన్నియు నిజమని నమ్మదగినవా? గోదావరీమండలములోని కోనసీమవారు రఘుకుల మల్లిభట్టయాత్రమును తెలిపెడి గ్రామపదిని గ్రహించిన స్థలము తమ కోనసీమలోనే యున్నదని వ్రాయుచున్నారు. ఇట్టి జనప్రవాదములకును నిదర్శనములకును మేరయుండదు. మెకంజీ దొరగారు నూఱు సంవత్సరముల క్రిందట వ్రాయించిన యొంటిమెట్ట కైఫీయతులలోను పూర్వమునందున్న శిలాశాసనములలోను విద్వాంసులైన కవులు చేసిన గ్రంథములలోను ఒంటిమెట్టకు ఏకశిలానగరనామము లేకపోవుటచేత దానికా పేరు భాగవతపీఠిక నాఁటినుండియే వచ్చిన దనియు అంతకు పూర్వము దానికా పేరు లే దనియు భావింపవలసియున్నది. నిరాధారమయిన జనప్రతీతిని బట్టి వ్రాయఁబడిన దగుటచేత హయగ్రీవశాస్త్రులవారి యభిప్రాయము ప్రమాణము కాదు. ఒంటిమెట్ట కైఫీయతులలో ఒంటిమెట్ట యను పేరా గ్రామమునకు ఒంటఁడు మిట్టఁడు నను బోయల పేర కట్టఁబడుటచే వచ్చిన దని స్పష్టముగా వ్రాయఁబడియున్నది.

ఒంటిమెట్టవారి రెండవ గ్రంథనిదర్శనము దొరతనమువారి పరిపాలన వివరణ సంగ్రహము (Administration Report). ఈ గ్రంథముయొక్క మూఁడవసంపుటము 991-వ పుటలో నిట్లున్నది:

" Vontimittah (ఒంటిమిట్ట - Vontimitta, * Tel.) From (onti, tel. single + mitta, tel. mound) [or]. Sanscrit name (ekashilanagara), meaning single + rock + city [warangal]. Village, Railway station; Cuddapah dist., Sidhout tal.; ... ... Large pagoda [q.v.] dedicated to Codanda Ramaswamy, built or restored by a Vijianuggur rajah in 14-th Century. Car festival [ratotsavam] in April. Ancient mantapam [q.v.] close to a tank west of the village. North of this are two caves in the hill. Finely sculptured old temple of Gopaulasawmy."

ఈ పరిపాలనవివరణసంగ్రహము 1893-వ సంవత్సరమునందనఁగా శ్రీ హయగ్రీవశాస్త్రులవారి భాగవతపీఠిక ప్రకటింపఁబడి యొంటిమిట్ట యేకశిలానగర మనుకొన నారంభించిన నలువదియైదు సంవత్సరముల తరువాతఁ బ్రకటింపఁబడినది. ఇది వ్రాయఁబడుచుండిన కాలమునందు హయగ్రీవశాస్త్రులవారి పీఠికను చదివి భ్రమపడిన క్రింది యుద్యోగస్థు లెవ్వరో తెలుఁగు వారు పయి యధికారుల కొంటిమిట్ట యనఁగా సంస్కృతమున నేకశిలానగర మని తెలుపుటచేత నట్లు వ్రాయఁబడియుండవచ్చును. ఈ పుస్తకమును ప్రకటించిన గ్రంథకర్త యేకశిలానగరము ఓరుగల్లని వ్రాసియున్నారు. భాగవతపీఠిక కాఱువదిరెండు సంవత్సరములకు ప్రకటింపఁబడిన యీ గ్రంథ మీ విషయమున ప్రమాణము కానేరదు. పదునాల్గవ శతాబ్దమునం దొక విజయనగరరాజుచేత కోదండరామస్వామి దేవాలయము కట్టఁబడిన దని పై వ్రాఁతలో నుండుటచేత మన బమ్మెర పోతరాజునాఁటికి దేవాలయము కట్టఁబడెనో లేదో! ఒక వేళ కట్టఁబడినను దాని కప్పటికి కప్పటి ప్రసిద్ధి వచ్చియుండునా యని సందేహింపవలసియున్నది. అప్పటికి గ్రామ మనియే చెప్పవచ్చును. ఆ గ్రామములో గోపాలస్వామిది పురాతనవిష్ణ్వాలయ మొకటి యున్న దని పయి వ్రాఁతలో నున్నది గదా! ఒంటిమిట్ట శివ యని నిర్వివాదముగా నంగీకరింపఁబడిన పోతనకు నూఱు నూటయేఁబది సంవత్సరముల తరువాత నుండిన యయ్యలరాజు రామభద్రకవి తన ప్రథమగ్రంథమైన సకలకథాసారసంగ్రహమును గోపాలస్వామి కంకితము చేయుటయే మన యూహను సిద్ధాంతము చేయుచున్నది. పాఠకుల యుపయోగార్థముగా సకలకథాసారసంగ్రహములోని యీక్రింది పద్యము నిం దుదాహరించుచున్నాను:

శా. శ్రీలీలావతి యైన రుక్మిణియు రాధనాస్య యైనట్టి స
త్యాలోలాక్షియు నిచ్చ రెప్పదలి నేలాసక్తి నిర్యాంగలన్
హేళి న్నిల్వఁ దటిద్ద్వయీలలితనీలాభ్రాకృతిం బొల్చు గో
పాలస్వామి కడున్ దయారసము నాపైఁ జిల్కఁ జెల్లప్పుడున్.
(అ.రా.)

కడపమండల చరిత్రసంగ్రహమునందు (Cuddapa District Manual, page 49) ఒంటిమెట్టను గూర్చి యే మున్నదో చూడుఁడు—

" Ontimetta (the solitary hill) is one of the most important towns. It has a large and very holy pagoda and a tank of some importance. The pagoda is dedicated to Kodanda Ramaswami and is said to have been built by one of Chitwail Rajahs about 300 years ago, though, if the inscription at Gandikota (see Appendix) is to be believed, it must have been built by a member of the Vizianagar dynasty in the 14th Century."

పైదాని కిది తెలుఁగు—" ఒంటిమెట్ట (ఒంటిగా నున్న దిబ్బ) మిక్కిలి ముఖ్యము లైన పట్టణములలో నొకటి. అది పెద్ద దై మిక్కిలి పవిత్రమైన యొక్క దేవాలయమును కొంచెము ముఖ్యమైన యొక చెఱువును గలిగియున్నది. దేవాలయము కోదండరామస్వామి కర్పింపఁబడినది. గండికోట (అనుబంధము చూడుఁడు) వద్ద నున్న శాసనమును నమ్మవలసియుండిన పక్షమున విజయనగరరాజకుటుంబములో నొకరిచేత పదునాల్గవ శతాబ్దమునందు కట్టఁబడవలసి యున్నను, అది సుమారు మున్నూఱు సంవత్సరముల క్రిందట చిట్టివేలు రాజులలో నొకరిచే కట్టింపఁబడినట్లు చెప్పఁబడుచున్నది."

చిట్టివేలు రాజులు మట్ల అనంతభూపాలుని తాతలు. పైని చెప్పఁబడినట్లు కోదండరామస్వామి దేవాలయము కట్టఁబడి మున్నూఱు సంవత్సరము లే యయిన పక్షమున, అది మన పోతనామాత్యుని యనంతరమున నూఱు సంవత్సరములకు పైని గాని కట్టఁబడియే యుండదు. సందేహగ్రస్తమైన శాసనమును నమ్మి దేవాలయము పదునాల్గవ శతాబ్దమునందే కట్టఁబడె ననుకొన్నను, అది భాగవతరచనకాలమునందో తదనంతరమునందో కట్టఁబడి యుండవలెను. అందుచేత పోతరాజునకు ప్రత్యక్షమైన రాముఁ డొంటిమెట్ట కోదండరామస్వామి కాఁ డనియు, పోతన యేకశిలానగర మొంటిమెట్ట కాక యోరుగల్లే యనియు నూహింపవలసియున్నది.

ఇఁక నొంటిమెట్టవాదుల మూఁడవ గ్రంథప్రమాణమునకు వత్తము. దానినే వారు పరమప్రమాణమైన పురాణ మనుచున్నారు. వారు పరమాధారముగా నెన్నుకొనుచున్న యీ కడపటి మహాగ్రంథ మొంటిమెట్టకు దాపున నున్న యొంటిమిట్ట గ్రామనివాసి యయిన రామదాసాఖ్యమహానుభావుఁడు తన శిష్యులతో సంస్కృతస్కాందపురాణమునుండి తెనిఁగించి తెచ్చి యిచ్చిన తెనుఁగు వచ

నము నమునటించి చేసిపట్టిగా "ఏకశిలానగరమాహాత్మ్యము" అను పేర 1915 వ సంవత్సరాంతమున సృజించిన మూడాశ్వాసముల యుత్కృష్టత పద్యకావ్యము. ఈ మాహాత్మ్యకావ్యమునందు ప్రతిపద్య కావ్యములోని కడపటి గద్య మిట్లున్నది:

"ఇది శ్రీమద్రామభద్రకరుణాపాత్ర రామయామాత్యపుత్ర ఆంధ్రభాషాపురాణనిర్మాణకవితాప్రవీణ అష్టవిద్యానిధాన రామదాసప్రధానప్రణీతం బైన యేకశిలానగరమాహాత్మ్యంబను సద్యకావ్యమునందు ద్వితీయాశ్వాసము." ॥

కవి తా నాంధ్రభాషాపురాణనిర్మాణకవితాప్రవీణుడ నని గొప్ప చెప్పుకొన్నను భాషావిషయమును బట్టి విచారింపఁగా నీ పురాణము వట్టి తప్పుల కుప్పగా నున్నది. కవిత్వమునం గాఁతే తేటిన తరువాత రచింపఁబడిన యీ యేకశిలానగరమాహాత్మ్యగ్రంథమే దోషభూయిష్ఠ మయి యుండఁగా ప్రథమనిర్మాణ మయిన మాను పురాణమహిమ యెంత శ్లాఘాపాత్రముగా నుండునో! ఒక్క భాషావిషయమున మాత్రమే కాక చరిత్రాంశవిషయమునను నిది తప్పుల కుప్పగానే కానఁబడుచున్నది. కవి తా నీ గ్రంథము నే పురాణమునుండి గైకొంటి ననియెనో యా స్కాందపురాణభాగము నైనఁ జూచిన పాపమునఁ బోయినవాఁడు కాఁడు. అసలట్టి పురాణ ముండినఁ గదా చూడ నవకాశము కలుగును? లేని పురాణము నెవ్వఁ డెట్లు చూడఁగలుగును? హరికథాకాలక్షేపవారి భాగవతసీతికలు జదివి వానిలోని కథలను స్థానికేతిహాసములలోని కట్టుకథలను గైకొని స్థలాభిమానముచేత నొంటిమెట్టకు ప్రాశస్త్యము తీసికొనిరావలె నన్న చింతతో కావ్యమునకు గౌరవము కలుగుటకయి స్కాందపురాణాంతర్గత మని చెప్పి కవియే యీ యేకశిలానగరమాహాత్మ్యము నీనడుమ సృజించియుండును. దీని సత్యమీ క్రింది భాగములను జదివెడు నిష్పాక్షికబుద్ధులకు బోధపడక మానదు. ఒంటఁడు మిట్టఁడు అను బోయవాండ్రిద్దఱు కోదండరామ విగ్రహమును బూజించుచు నొక యడవిలో వాసము చేయుచుండి రనియు ఆ యరణ్యమున కొక రాజు మృగయావినోదార్థముగా వచ్చి వేటాడి యలసి పిపాసాపీడితుఁ డయి జలాశయమును జూపుఁ డని వేఁడఁగా,

గీ. అనుచు రాజు నుడువ నా వంటమిట్టలు
గమ్మటంచుఁ బోయి రామతీర్థ
సరసుఁ జూప నదియు జలములు చాల లే
వెక్క గజము గ్రోల నిక్కువముగ."

బోయ లాతనిని గొనిపోయి రామతీర్థ మనఁబడెడి యొక మంచినీళ్ల గుంటను తాము మూఁత వేసియుంచిన రాతిని బైకెత్తి దీసి చూపఁగా రాజందు జలపానము చేసి సంతృప్తుఁడయి సంతోషించి వరము కోరుఁ డని యడిగె ననియు,

క. మే మార్జించిన ద్రవ్యము
రాముల కర్పించినాము రాతిని గుడిగా
తా మేర్పరించి యందున
స్వామిని నిల్పియును నవలఁ జ (జె) లు వుంచవలెన్.

క. ఇది గాకను మా పేరను
సదయుఁడవై పట్టణంబుఁ జ (జె) య్యఁగవలె మా
మదిలోన నుండు టిదియే
సుదినంబును గూడినట్టి శుభలగ్నమునన్.

క. ఆచంద్రార్కస్థాయిగ
మా ప్రభువు సంతానములుఁ బోకొండఁగా
జాత్రకు గైంకర్యము
చే వేయిం గాంగ భూమి యీవలె రాజా.

గీ. న (నె) లవు క్రింద భూమి బాలినంతయు స్వామి
కిచ్చి వలెను భూము లిచ్చువారి
కట్టు వాకిలియును నేర్పరింపఁగవలె
నంటిమిట్టలోను వసతిగాను.

నాఁడు రామస్వామికి దేవాలయమును దేవాలయసమీపమునఁ దమ పేర నొక యూరును గట్టింపు మని కోరఁగా రాజు వారి కోరికను దీర్చి యొంటిమెట్టి గట్టించె ననియు గ్రామమున కొంటిమిట్ట నామము వచ్చుటకుఁ గారణ మందు వివరింపఁబడియున్నది. ఈ గ్రంథమును బట్టి యొకటి బోయవాని పే రొంటఁడో వంటఁడో గాతని పేరఁ గట్టఁబడిన గ్రామ మొంటిమెట్టయో వంటిమిట్టయో స్పష్టముగాఁ దెలియరాకున్నది. మఱి పద్యములు బట్టి వంటిమిట్ట యయినట్టే కనఁబడినను పురవర్ణనములోని యీ క్రింది పద్యమును బట్టి చూడఁగా నొంటిమిట్ట యగుచున్నది.

సీ. పురవిశేషంబు గోపురవిశేషంబులు
కొనరఁగా నొప్పును నొంటిమిట్ట
స్థలవిశేషం బుపస్థలవిశేషంబులు
కొనరఁగా నొప్పును నొంటిమిట్ట
జలవిశేషంబు లంజలవిశేషంబులు
కొనరఁగా నొప్పును నొంటిమిట్ట
కొలనివిశేషంబు గోపులవిశేషంబులు
కొనరఁగా నొప్పును నొంటిమిట్ట
నరవిశేషంబు నయ్యు వానరవిశేష
మనుష్యరథగజతురగవాహనము లయ్యు
చుట్టు నుద్యానవనములై చోద్యముగను
మాడఁ జూడంగ నొప్పును సురుచిరముగ.

ఏకశిలానగరమును దెనుఁగులో నొంటిమిట్ట యందు రని యీ స్కాందపురాణములోనే చెప్పఁబడెనఁట!

క. ఏకశిలానగరం బన
శ్రీకరముగఁ బట్టణంబు చెలఁగుచునుండున్
లోకులు తెలుఁగున [illegible]నెప్పుడు
నేకంబుగ నంటిమిట్ట యిది యను పేరన్. —అ. ౧.

మనవారికిఁ గావలసిన దంతయు నిందులోనే యుండఁగా మఱి యేది కావలెను? బమ్మెర పోతరా జొంటిమెట్టవాఁ డనియు నీ యపూర్వపురాణములోనే యున్నది చిత్తగింపుఁడు—

గీ. శాలివాహనశకగణ మోలి నడుచు
వేయి మున్నూఱు వత్సరా ల్వెలయుచుండ
బమ్మెరకులాబ్ధిచంద్రుండు భగవదంశు
కేసనామాత్యపుత్రుండు కేశవునకు.

క. భక్తుఁ డయినట్టి పోతన
యుక్తవయసు రాక మును పె యురుగోత్రము లా
సక్తతి గోవుల మేపుచు
రక్తిగ నేకశిలనగరరాజమునందున్.

క. కాపురము చేయుచుండియుఁ
గాపులతోఁ గూడి పసులఁ గసవు స్థలములన్
మేపుచునుండఁగఁ గొండల

శాశ్వత చిదానందయోగి దృశ్యుఁ డయ్యెన్.

సీ. దర్శనంబు మాని స్పర్శయుఁ గలిగినఁ
భావమంతయు నయ్యెఁ బాలుఁ డేఁడు
నడిరేయిఁ జూచి రామనామంబు నుపదేశ
మొసఁగఁ జేసె దాని మూలమునను.

గీ. ఆ చిదానందయోగికి నపుడు భక్తి
వినయములు చేసి శ్రీవత్సకభవ మసరఁ
దారకంబును దొరకెను ధన్యుఁ డైతి
ననుచు మ్రొక్కిడి పోతి నానంద మొందె.

వ. అంతఁ జిదానందయోగి యదృశ్యుం డై చనినఁ దదనంతరంబున.

సీ. భాగవతముఁ జేయ భావించి రాముల
కృపకుఁ బాత్రుఁ డైన కొడుకుఁ జూచి
తల్లిదండ్రు లపుడు తిగు నని చెప్పిరి
పోతనాఖ్యుఁ డపుడు పొసఁగఁ జేసె. —ఆ. 3.

ఉ. బమ్మెర పోతనాఖ్యుఁడను భాసిలు కాశీపురంబుఁ జేరి భీ
మమ్మను వేఁడికొంచుఁ గలుషమ్ములఁ బాపు మటంచు విష్ణుపా
దమ్మునఁ బుట్టినమ్మ యని దబ్బున గంగను దోఁగి లేచి చి
త్తమ్మున రాముఁ జేర్చుకొని తారకమున్ జపియించుచున్నెడన్. —ఆ. 3.

క. పట్టాభిరామదేవుఁడు
పుట్టుఁగ నదుఁగవఁడుఁ జాలఁ బ్రత్యక్షుండై
దిట్టముగ భాగవత మి
ప్పుట్టునఁ దెనిఁగించు మోక్షభాగ్యము లొందవున్. —ఆ. 3.

బమ్మెర పోతరాజు ఒంటిమిట్టవాఁ డని చాటుటయే కాక బమ్మెర పోతరాజు స్నానము చేసినది గోదావరి గాక కాశీలోని భీమమ్మనమ్మ (భీమునియమ్మ) యని స్పష్టపఱిచి యీ మహాపురాణ మొంటిమిట్టవారుల పాలిటి కల్పతరు వైనది. కవికి రాముఁడు సాక్షాత్కరించినదియు కాశీనగరములోనే యని యీ పుస్తకము తెలుపుచున్నది. రాముఁడు ప్రత్యక్షుఁడయి భాగవతమును రచింపు మని యాదేశింపఁగానే పోతరాజు ఒంటిమిట్టకు పరుగెత్తుకొనివచ్చెనఁట!

క. ఏకశిలానగరమునకుఁ
బ్రాకటముగఁ బోతరాజు పరుగిడి యచటన్
శ్రీకాంతుఁ డగు రాముల
సాకారముగఁ జేసికొంచు నయ మగు నారన్. —ఆ. 3.

ఈ యపూర్వస్కాందపురాణములోఁ జేర్పఁబడినవాఁ డొక్క పోతరాజు మాత్రమే కాఁడు, తరువాత బహుకాలమున నుండిన యొంటిమిట్టకవి యయ్యలరాజు రామభద్రుఁడు సహితమిందుఁ జేర్పఁబడెను. అతని కథను జూడుఁడు—

క. శివశైవరాయ ఘనప్రభు
సవినయత న్విజయనగరసామ్రాజ్యుండై
నవఖండంబుల నేలుచు
నవిరళముగ రామదేవు నర్చన చేసెన్. —ఆ. 3.

వ. అట్టి కాలంబున శాలివాహనశకవర్షంబులు వేయి న్నన్నూట డెబ్బది మొదలు యెనుబది, రెండువఱకుఁ దన రాజ్యంబునకు లోఁబడిన సిద్ధవటపురంబున కిరుదెసల వంటిమిట్ట శ్రీరాముల వారికి సకలభోగంబులు జరుగునటులఁ గొన్ని పురంబుల ధరణం బిచ్చె నా సమయంబునందు.

ఉ. అయ్యలరాజువంశజుఁడు నాలును బంధులు మిత్రు లాదిగాఁ
బయ్యనఁ బుత్రుఁ నెత్తుకొని స్వామికి నర్చన చేయ వేళఁ ద
ల్లయ్యెడఁ బుత్రు నుంచి బహుళమ్ముగ వేఁడుచునుండి రాత్రియై
పోయిరి బిడ్డ యుంచనక పొల్పుగ రాముల మాయ చిత్రమో

గీ. ఉదయమున లేచి బిడ్డను వెదకుకొనఁగ
నల్లెడలఁ గాన నాత్మలోఁ దల్లడిల్లి
పనియును నొక్క నెలయు బాగుగాఁ జెంచిరి
నిచ్చినటని కియ్య నేమి కొదవ.

క. అనుచును మూఁడు దినంబులు
తన యాత్మం బుత్రుఁ దలఁచి తారకనామం
బును జపియించుచునుండిన
ననఁగనకుం దోఁచె సుతుఁడు కావున్న క్రియన్.

క. నాలవనాఁడును పూజా
మూలంబుగ నంబి యురుగ మురహారివలెఁ దా
కాలుని గెలిచిన పువ్వరు
వాలెం గుడినుండి వెడలె వసుధకు నంతన్.

గీ. తల్లి దండ్రి మొదలు దగ వారినారలు
హర్ష మొదవ గాన నవార్నిశయులు
దలఁచుకొంచుఁ బేరు దగు రామభద్రయ్య
యనుచుఁ బిలిచికొనుచు నరిగి రపుడు.

క. సీతారాములు పెంచిరొ
యేతీరున బ్రతికి వచ్చె నీ సుతుఁడు శ్రీ
మాత యయి సీత స్తన్యం
బీతఁ కిని నిచ్చె నరిరి పృథివిని దీనినిన్.

క. ఆ రామభద్రనామాఖ్యుఁడు
శ్రీరాముల దయను బొంది చెలఁగుచుఁ గవియై
యా రాయప్రభువద్దను
పాలుఁడు ప్రబలకవి యయ్యెఁ బరఁగుచునుండెన్. —ఆ. 3.

ఈ గ్రంథమునందుఁ జేర్పఁబడినవారు రామభక్తు లగు భారతీయులు మాత్రమే కాదు మహమ్మదీయులు సహితమిందుఁ జేర్పఁబడిరి. కన్నులు తనియంగ నరుఁగు—

చ. అదియునుగాక మ్లేచ్ఛకులుఁడైన యిమాం బెకుఁ డొక్కనాఁడు తాఁ
బదుగురు గుఱ్ఱ మెక్కుఁగులు పత్నియుతంబుగ వచ్చి దేవళం
బొడిపిన నర్చకాదులను బొమ్మనఁ బోక పగుండ నచ్చటన్
వదలకయుండ స్వామి విని వాఁడగు పచ్చల బద్ద పట్టుకన్. —ఆ. 3.

సర్వజ్ఞులకు గోచరము గాని దేముండును? ఇన్ని దెలిపిన సర్వజ్ఞుఁ డైన యీ స్కాందపురాణకర్త యిటీవలఁ బుస్తకములఁ గోదండరామస్వామి కంకిత మొసర్చిన భక్తుల పేరులఁ జేర్పనేల పోయెనో! ఈ పుస్తకకల్పనము 190౮-వ సంవత్సరమునందుఁ గాక 1918-వ సంవత్సరమునందుఁ జేయఁబడినదో నీ నవ్యకవులోత్తముల పేరులు సహితమిం దెక్కియుండును. ఇఁక నీ యేకశిలానగరమాహాత్మ్యమునకు మూలమైన సంస్కృతస్కాందపురాణము గాని యొక్కటి కొంతగా నున్నది. "ఓగుగింటి కాధారముగ లిఖితాధారములు తాళపత్రములు సృష్టింపఁబడుచున్న వని యంటిని" అని యాంధ్ర పత్రికలును ధిక్కారగేసరులు నైన శ్రీ వావిలికొలను సుబ్బారావు గారు పలికినట్లు వారి యిష్టదేవతానుగ్రహంబున నా కొఱఁతయు శీఘ్రకాలము లోనె తీఱు నేమో!

పూర్వయుగమునందలి ప్రజాపాలనము

సోరనంది రామశాస్త్రి గారు

పూర్వయుగములందును ప్రజాపాలనము గలదు. అందునకే రాజులను సర్వేశ్వరుఁడు సృజించినాఁడు.

శ్లో. రాజధర్మా న్ప్రవక్ష్యామి యథావృత్తో భవే న్నృపః
సంభవశ్చ యథా తస్య సిద్ధిశ్చ పరమా యథా. ౧.
బ్రాహ్మ్యం ప్రాప్తేనసంస్కారం క్షత్త్రియేణ యథావిధి
సర్వస్యాస్య యథాన్యాయం కర్తవ్యం పరిరక్షణం. ౨.
అరాజకే హి లోకేఽస్మిన్ సర్వతో విద్రుతే భయాత్
రక్షార్థ మస్య సర్వస్య రాజాన మసృజ త్ప్రభుః. ౩.
మను. అ. ౭.

ఇచ్చట రాజనఁగా క్షత్త్రియజాతిమాత్రుఁడు గాఁడు, క్షత్త్రియవంశ్యుఁడే వేదాధ్యయనాధికారార్థ ముపనయనసంస్కారము నొంది న్యాయముఁ దప్పక ప్రజలను రక్షింపఁగలవాఁడు రాజ్యాధిపతి యగును. సర్వేశ్వరుఁడు లోకమును సృజించి నియామకు నేర్పఱుపక యుండఁగా లోకము ప్రబలు లగు దుష్టులచే భయము నొందుచు వ్యాకులము కాఁగా నట్టి బాధను తొలఁగించుటకుఁగాను రాజును నిర్ణయించినాఁ డని తాత్పర్యము.

శ్లో. బాలోఽపి నావమన్తవ్యో మనుష్య ఇతి భూమిపః
మహతీ దేవతా హ్యేషా నరరూపేణ తిష్ఠతి.

రాజ్యాధిపతి యష్టదిక్పాలకుల యంశములచే సృజింపఁబడినవాఁడు గావున నతఁడు బాలుఁ డనియు మనుష్యమాత్రుఁడే యనియుఁ దలంపరాదు. మనుష్యరూపమున నున్న దేవత యనియే భావింపవలయు.

శ్లో. స రాజా పురుషో దండ స్స నేతా శాసితా చ సః
చతుర్ణా మాశ్రమాణాం చ ధర్మస్య ప్రతిభూ స్స్మృతః.

ఆ రాజే పురుషుఁడు, అతఁడే దండము, నేత. అనఁగా లోకమును తనతమ కార్యముల నొందించువాఁడు, శిక్షకుఁడు, మఱియు నాల్గాశ్రమముల ధర్మములకును జామీనుదారుఁడు — అనఁగా నవి చెల్లునట్లు పూటఁబడినవాఁడు.

శ్లో. స్వే స్వే ధర్మే నివిష్టానాం సర్వేషా మానుపూర్వశః
వర్ణానా మాశ్రమాణాం చ రాజా సృష్టోఽభిరక్షితా. ౩౫.

తా. తమతము ధర్మమును దప్పక వర్తించు నాల్గు వర్ణములవారికిని నాల్గాశ్రమములకును రక్షకుఁడుగా రాజు సృజింపఁబడినవాఁడు. వర్ణాశ్రమధర్మరక్షణ మావశ్యకము.

శ్లో. వృద్ధాంశ్చ నిత్యం సేవేత విప్రా న్వేదవిద శ్శుచీన్
వృద్ధసేవీ హి సతతం రక్షోభిరపి పూజ్యతే. ౩౮.

తా. వేదవేదార్థములను తెలిసినట్టియు బాహ్యాంతరములందు శుద్ధు లగునట్టియు జ్ఞానవయస్సులచేత వృద్ధు లయినట్టియు బ్రాహ్మణులను రాజు నిత్యము సేవించుచుండవలయు. వృద్ధసేవ చేయువాఁడు క్రూరులచే నైనను పూజింపఁబడుచుండును.

శ్లో. వేనో వినష్టో ఽవినయా న్నహుష శ్చైవ పార్థివః
సుదాసో యావన శ్చైవ సుముఖో నిమి రేవ చ. ౪౧.

తా. వేనుఁడు మొదలగు రాజులు అవినయము వలననే నశించినారు.

శ్లో. సామదండౌ ప్రశంసన్తి నిత్యం రాష్ట్రాభివృద్ధయే
యథోద్ధరతి నిర్దాతా కక్షం ధాన్యం చ రక్షతి. ౧౦౯.
తథా రక్షే న్నృపో రాష్ట్రం హన్యాచ్చ పరిపంథినః. ౧౧౦.

తా. రాజ్యాభివృద్ధికై నిత్యము సామము దండము నీ రెండుపాయములు ప్రశస్తము లని పండితులు ప్రశంసించెదరు. పొలములోఁ గలిసి పుట్టియున్న తృణసస్యములలో గడ్డిని కోయువాఁడు సస్యమును తప్పించి కోయునట్లు రాజు తనరాజ్యములోఁ గలిసియున్న దుష్టశిష్టులలో శిష్టులను తప్పించి దుష్టులనే సంహరింపవలయును.

శ్లో. సుసంగృహీతరాష్ట్రో హి పార్థివ స్సుఖ మేధతే
ద్వయో స్త్రయాణాం పంచానాం మధ్యే గుల్మ మధిష్ఠితం. ౧౧౩.
తథా గ్రామశతానాం చ కుర్యా ద్రాష్ట్రస్య సంగ్రహం
గ్రామస్యాధిపతిం కుర్యా ద్దశగ్రామపతిం తథా
వింశతీశం శతేశం చ సహస్రపతి మేవ చ. ౧౧౪.

తా. సుష్ఠుగా గ్రహింపఁబడిన రాజ్యము గల రాజు చెప్పఁబోవు నుపాయముచే సుఖముగా వృద్ధి నొందును. ఆ యుపాయ మెద్ది యనఁగా రెండు గాని

మూఁడు గాని యైదు గాని గ్రామముల కొక గుల్మము సనఁగా రక్షకపురుషుల సమూహమును తన రాష్ట్రమునకు రక్షాస్థానము నేర్పఱుపవలయు. వారిలో నొక్కొక గ్రామాధిపతి రెండు గ్రామముల యధిపతికిని వాఁడు మూడింటి యధిపతికిని నట్లే తమకంటె నధికులతో తమతమ గ్రామములలోని వ్యాపారములను తెలియఁ జేయుచుండును. ఇట్లు చేసినచో రాజు తాను తన రాజ్యమును సుఖముగా వృద్ధి నొందును.

శ్లో॥ కృతం త్రేతాయుగం చైవ ద్వాపరం కలి రేవ చ
రాజ్ఞో వృత్తాని సర్వాణి రాజా హి యుగ ముచ్యతే. అ॥ ౮. ౩౦౨.

కృతాదియుగములు రాజుయొక్క చేష్టితములు. రాజే యుగ మని చెప్పఁబడు ననఁగా రాజుయొక్క మంచి వృత్తము మంచి యుగము చెడు వృత్తము చెడు యుగము అని తా.

శ్లో॥ కలిః ప్రసుప్తో భవతి స జాగ్ర ద్ద్వాపరం యుగం
కర్మ స్వభ్యుద్యత స్త్రేతా విచరం స్తు కృతం యుగం. ౩౦౩.

తా. అజ్ఞానాఽలస్యాదిదోషములచే నిష్ప్రవృత్తుఁడైన రాజే కలియుగము. అనఁగా రాజు అట్లగుట కలి వంటిది. రాజు తెలిసినవాఁ డయ్యును ప్రవర్తింపని వాఁడు ద్వాపరము. తన విహితకర్మలయందు ప్రవర్తించినవాఁడు త్రేతాయుగము. యథాశాస్త్రముగా చేయువాఁడు కృతయుగము.

శ్లో॥ వ్యవహారాన్ దిదృక్షు స్తు బ్రాహ్మణై స్సహ పార్థివః
మంత్రజ్ఞై ర్మంత్రిభి శ్చైవ వినీతః ప్రవిశే త్సభాం. ౧
తత్రాఽసీనః స్థితో వాపి పాణి ముద్యమ్య దక్షిణం
వినీతవేషాభరణః పశ్యే త్కార్యాని కార్యిణాం. ౨
ప్రత్యహం దేశదృష్టైశ్చ శాస్త్రదృష్టైశ్చ హేతుభిః
అష్టాదశసు మార్గేషు నిబద్ధాని పృథక్పృథక్. ౩
తేషా మాద్య మృణాదానం నిక్షేపోఽ స్వామివిక్రయః
సంభూయ చ సముత్థానం దత్తస్యాఽనపకర్మ చ. ౪
వేతనస్యైవ చాఽఽదానం సంవిదశ్చ వ్యతిక్రమః
క్రయవిక్రయాఽనుశయో వివాద స్స్వామిపాలయోః. ౫
సీమావివాదధర్మశ్చ పారుష్యే దండవాచికే. ౬
స్తేయం చ సాహసం చైవ స్త్రీసంగ్రహణ మేవ చ. ౭
స్త్రీపుంధర్మో విభాగ శ్చ ద్యూత మాహ్వాయ ఏవ చ
పదా న్యష్టాదశై తాని వ్యవహారస్థితా విహ. ౮

తా. ప్రజల వ్యవహారములను పరీక్షించువాఁడై రాజు మంత్రజ్ఞు లగు మంత్రులతోను బ్రాహ్మణులతోను సభయం దుండి వినయవంతుఁడయి తన కుడిచేతిని మీఁదికెత్తి ప్రజల కార్యములను పరిశీలింపవలయు. ప్రతిదినము దేశకాలాది వ్యవహారప్రాప్తములు శాస్త్రదృష్టములు నగు సాక్షిద్రవ్యాదిహేతువులచేత చెప్పఁబోవు పదునెనిమిది మార్గములందును చెప్పఁబడిన కార్యములను వేఱువేఱుగ విచారింపవలయును. ఈమార్గములనే తీర్థము లందురు. అవి యెవ్వి యనిన ఋణవిషయము, దాఁచుకొనుట, అస్వామివిక్రయము, కొందఱు కలిసి చేయు వ్యవహారము, ఇచ్చినదానిని మరలఁ దీసికొనుట, సేవకులకు జీత మియ్యకపోవుట, చేసిన ఖరారు తప్పుట, క్రయవిక్రయముల మార్పు, స్వామి పశుపాలురకుఁ గలిగిన వివాదము, గ్రామాంతరముల హద్దులయొక్క వివాదము, వాక్పారుష్యదండపారుష్యములు, దొంగతనము, బలాత్కారము, స్త్రీసంపర్క-వివాదము, స్త్రీపురుషుల ధర్మము, సోదరుల ధనవిభాగము, జూదము—ఇవి పదునెనిమిది తీర్థములు. వీనిలోఁ గలుగు వివాదములను ప్రతిదినము పరీక్షించుచుండవలయును.

ఉదాహరణములు

శ్లో॥ కృతవీర్యా దర్జున స్సప్త ద్వీపాధిపతి ర్బాహుసహస్రో జజ్ఞే యోఽసౌ భగవదంశ మత్రికులప్రసూతం దత్తాత్రేయాఖ్యం ఆరాధ్య బాహుసహస్ర మధర్మసేవానివారణం ధర్మసేవిత్వం రణే పృథివీజయం ధర్మత శ్చాఽనుపాలన మరాతిభ్యోఽపరాజయ మఖిలజగత్ప్రఖ్యాతపురుషాచ్చ మృత్యు మిత్యేతా న్వరా నభిలషితవాన్ లేభే చ. ౧౨. తే నేయ మశేషద్వీపవతీ పృథివీ సమ్య క్పరిపాలితా. ౧౭. అనష్టద్రవ్యతా చ తస్య రాజ్యేఽభవత్. ౧౮. ఏవం చ పంచాశీతివర్ష సహస్రా ణ్యవ్యాహతారోగ్య శ్రీబలపరాక్రమో రాజ్య మకరోత్. వి॥ పు॥ ౪. ౧౧ అ.

తా. కార్తవీర్యార్జునుఁడు దత్తాత్రేయమహర్షి నుపాసించి తనకు వేయి చేతులు, నధర్మనివారణము, ధర్మప్రవృత్తియు, యుద్ధమందు జయము, ధర్మము దప్పక ప్రజాపాలనము, శత్రువులవలనఁ బరాజయము లేకుండుట మున్నగు వరములను పొంది భూమిని న్యాయ్యముగా పాలించెను. అతని రాజ్యమం దెవ్వరికిని ధనాపహరణము మొదలగునవి జరుగలేదు. అట్టి ధార్మికుఁడు గావుననే తానును భంగము లేని యారోగ్యబలపరాక్రమసంపదలు గలవాఁడై యెనుబదియైదు వేల సంవత్సరములు రాజ్య మేలెను. రాజ అధర్మవర్తనుఁడు గారాదు. అయినచో నట్టివానిని రాజ్యమునుండి తొలఁగించుటకు దక్షులు ప్రయత్నించి తొలఁగింపవచ్చును.

మృత్యు వనువాని ప్రథమపుత్రిక సునీథ యను దానియందు అంగుఁ డను రాజునకు వేనుఁడు పుట్టెను. వాఁడు మాతామహుని దోషమువలన దుష్టస్వభావము గలవాఁ డయ్యెను. వాఁడు తనరాజ్యమందు మహర్షులచే నభిషిక్తుఁడయి యాగములను చేయవల దనియు దానములు హోమములు తన్నుఁ గూర్చియే చేయవలయు ననియు తానే యజ్ఞభోక్తయు నధిపతియు ననియు ప్రభువు ననియు చాటించెను. అంతట ఋషు లందఱును మైత్రేయుని ముం దుంచుకొని వచ్చి వేనునితో సామపూర్వకముగా మొదట నిట్లు చెప్పిరి: "ఓ రాజా నీ రాజ్యమునకును నీ దేహమునకును ప్రజలకును హిత మగుదానిని చెప్పెదము. సత్రయాగముచేత యజ్ఞేశ్వరుఁ డగు హరిని మేము పూజించెదము. ఆ పుణ్యములో నీ కాఱవ భాగము వచ్చును. యజ్ఞముచే యజ్ఞపురుషుఁ డగు విష్ణువు ప్రీతుఁడై మా మూలమున నీ కోర్కులన్నియు నిచ్చును. యజ్ఞేశ్వరుఁ డగు విష్ణు వెవ్వని దేశమందు పూజింపఁబడునో యా రాజున కభీష్టముల నిచ్చును." అని ఋషులు చెప్పఁగా, వేనుఁడు "నాకంటె నధికుఁ డెవ్వఁడు? పూజ్యుఁ డెవ్వఁడు? యజ్ఞేశ్వరుఁ డగు హరి యెవ్వఁడు? నిగ్రహానుగ్రహసమర్థు లగు బ్రహ్మాది దేవతలు రాజు శరీరమం దున్నవారే. రాజే సర్వదేవస్వరూపుఁడు. నే నిట్లు తెలిసియే హోమము దానము మున్నగువానిని చేయవల దని యాజ్ఞాపించుచున్నాఁడను. స్త్రీలకు భర్తృసేవయే పరమధర్మ మయినట్లు నా యాజ్ఞాపాలనమే మీకును పరమధర్మము." అని పలికెను. పిమ్మట ఋషులు ప్రియపూర్వకముగా "నోయి మహాభాగుఁడా! మా కనుజ్ఞ యిమ్ము. ధర్మము క్షీణింపరాదు. హవిస్సుల పరిణామమే జగ మై యున్నది." అని మరల మరలఁ బలికిరి. ఎన్నిమార్లు చెప్పినను వేనుఁడు సమ్మతింపలేదు. అప్పుడు ఋషు లందఱును కోప మొంది "ఈ దురాచారుఁడు యజ్ఞేశ్వరుని నిందించుచున్నవాఁడు. వీఁడు భూపతిత్వమునకు తగఁడు" అని పలుకుచు మంత్రపూతము లయిన దర్భలచే వానిని చంపిరి. అట్లు వేనుఁడు మృతినొందఁగా రాజ్య మరాజక మయినందున జనులు చోరు లయి పరద్రవ్యముల నపహరించుచు సంచరింప నారంభించిరి. వారి సంచారసమ్మర్దమును చూచి మహర్షులు మరల రాజును సంపాదించుటకు వేనునితొడ నొకదానిని మథింపఁగా నొక పురుషుఁడు పుట్టి "నే నేమిచేయుదు?" నని వారి నడిగెను. ఋషులు వానిని 'నిషీద' అని పల్కిరి. అందుచే వాఁడు నిషాదుఁ డయ్యె. వానివలన ననేకులు నిషాదులు పుట్టి వింధ్యప్రదేశములం దుండిరి. ఆ నిషాదుఁడు వేనుని పాపాంశములో పుట్టినవాఁడు గావున వానిని విడిచిరి. ఆ నిషాదుల మూలమున వేనుని పాప మాశరీరమునుండి నిర్గత మయ్యె. అప్పుడు మరల మహర్షులు వేనుని కుడిచేతిని మథింపఁగా "పృథుఁ" డుదయించెను. అతఁ డుదయించినతోడనే సర్వభూతములు సంతోషించెను. వేనుఁడు నుత్తమగతిని పొందెను. అట్టివానిని బ్రహ్మ మున్నగు దేవతలు వచ్చి రాజ్యమం దభిషేకించిరి. వాఁడు ప్రజల నందఱిని రంజించుటచేత "రాజ" యని పిలుచుకొని ప్రజాపాలనము చేసినవాఁడు. (విష్ణు పు. ప్రథ. ౧౩ అధ్యా. ౧౧-౩౫ శ్లో.)

ఇంకను వాల్మీకియరామాయణము బాలకాండము ౩౮-వ సర్గము ౨-వ శ్లోకము మొదలు ౧౯-వ శ్లోకమువఱకును సముదితాభిప్రాయము: పూర్వ మయోధ్యాధిపతి సగరుఁ డను రాజు ధార్మికుఁ డుండెను. అతనికి కేశిని సుమతి అని భార్య లిద్దఱు. ఆ యిద్దఱియందు నతనికి సంతానము లేకుండుటచేత వారితోడ నతఁడు హిమాలయమందు భృగుమహర్షి నుపాసించుచు తపము చేసెను. కొంత కాలమునకు భృగుముని వరముచేత కేశినికి వంశకరుఁ డగు పుత్రుఁ డసమంజుఁ డనువాఁ డొక్కరుఁడును సుమతికి నరువదివేల పుత్రులును పుట్టిరి. (౨౦-౨౧-౨౨ శ్లో.) వారిలో పెద్దవాఁ డసమంజుఁడు దురాచారపరుఁడై పట్టణములో నుండు బాలురను సరయూనదిలో పాఱవైచుచుండువాఁడు. ఇట్లు పురజనుల కహితమును చేయుచుండుటచేత వానిని సగరుఁడు పట్టణమునుండి తొలఁగించి తానే రాజ్యమును పాలించుచు ముప్పదివేల సంవత్సరములు జీవించెను. సగరుఁడు మృతి నొందిన పిమ్మట ప్రజ లసమంజుని పుత్రుఁడును ధార్మికుఁడు నగు నంశుమంతుని రాజుగా సమ్మతించి రాజ్యమం దభిషేకించినారు.

అయోధ్యాకాండము ౧-౨ సర్గములలోని యభిప్రాయము: దశరథుఁడు తన పుత్రులు నల్వురకును వివాహములఁ జేసికొనివచ్చి కొంత కాల మయినపిమ్మట తన వార్ధకమున వయస్సుచేతను గుణములచేతను జ్యేష్ఠుఁ డగు రాముని సమర్థునిఁగా తెలిసికొని యువరాజును చేయఁదలఁచి తన మంత్రిపురోహితబ్రాహ్మణ పురజన జానపద సామంతాదులతో చెప్పెను. వా

రందఱును రాముని యువరాజుగా త్వరలోనే చేయు మన్నట్లు చెప్పిరి. అట్లు చెప్పఁగా దశరథుఁడు వారి హృదయమును కనుఁగొనువాఁడై "నేను చెప్పిన వెంటనే మీ రట్లు కోరుటచేత నాయందు ధర్మవిప్లవము గాని విప్రీతి గాని తలంచితిరా?" అని వారి నడిగెను. అప్పుడు వారు చెప్పిన దేమన, "నీయందు దోషము నెంచి కాదు. రామునియం దనేకకళ్యాణగుణములు గలవు. సకలవిద్యలు సకలధర్మములు తెలిసినవాఁడు, సత్యభాషి, తేజస్సంపన్నుఁడు, కీర్తిమంతుఁడు, వినీతుఁడు, శత్రువిజయము గలవాఁడు, ప్రజానురాగము ముఖ్యముగాఁ గలవాఁడు, ప్రజల కుశలమును ప్రతిదిన మరయుచు యుద్ధార్థము గ్రామాంతరములకు పోవలసినప్పుడు మరల గ్రామాంతరములనుండి వచ్చిన వెంటనే గజముమీఁదఁ గాని రథముమీఁదఁ గాని కూర్చుండి పురములోఁ దిరుగుచు ప్రజలను స్వజనమునువలె వారి కుశలము నడుగుచుండువాఁడు, ప్రజాపాలనతత్త్వమును బాగుగ నెఱింగినవాఁడును. కావున నిట్టివానిని యువరాజ్యమం దభిషేకించుటకు నీ విచ్ఛగించినప్పుడు మా సమ్మతిని దెలిపినార" మని వా రందఱు ననేకవిధముగాఁ జెప్పిరి. వా రట్లు చెప్పఁగా దశరథుఁడు మిక్కిలి సంతసించి రాముని యభిషేకార్థము సంసిద్ధుఁడై యుండఁగా దైవవశమున నై కేయి యొక్క నిరోధమువలన రాముని యభిషేకమునకు విఘ్నము నతనికి వనవాసమును సంభవింప, రాముఁడు వనమునకుఁ బోవఁగనే దశరథుఁడును పుత్రవియోగముచే స్వర్గమునకుఁ బోయెను. (అయోధ్యాకాండము ౬౭ సర్గము.) అట్లు దశరథుఁడు రాత్రి మృతి నొందఁగా మఱునాఁటి యుదయముననే మార్కండేయ మౌద్గల్యాదిఋషులును బ్రాహ్మణులును సభఁ గూడి వసిష్ఠమహర్షిని గోరినారు: "దశరథుఁడు స్వర్గస్థుఁడయ్యె. భరతశత్రుఘ్నులు లేరు. రామలక్ష్మణులు వనమునకుఁ బోయిరి. రాజ్య మరాజక మయ్యె. అరాజక మయిన రాజ్యమం దనేకములు దైవమానుషోపద్రవములు గలుగును గావున నిప్పుడే యిక్ష్వాకువంశపువాని నొకని రాజుగా విధింపుము." ఇ ట్లిద్దఱును జెప్పిన వెంటనే వసిష్ఠమహర్షి "మాతామహునింట నున్న భరతునిఁ ద్వరలోఁ దెచ్చుటకు దూతల నంపు" మని మంత్రులతోఁ జెప్పెను. వా రట్లు చేయఁగా భరతుఁడు వచ్చి దశరథుఁడు మృతి నొందుటకును రాముఁడు వనమునకుఁ బోవుటకును దుఃఖించి తండ్రికిఁ జేయవలసిన ప్రేతకర్మను నెఱవేర్చి పిమ్మటఁ దాను రాజ్యము నొల్లక శ్రీరామునే ప్రార్థించి వనమునుండి తెచ్చుటకుఁ బోదు నని చెప్పి తా నభిషేకము నొల్లక యుండఁగా, రాజధర్మమును దెలిసినట్టియు పురోహితుఁడు నగువసిష్ఠమహర్షి యే దశరథుని రాజకార్యసభను ప్రవేశించి పీఠము నధిష్ఠించి మంత్రిసామంతపౌరులను వనప్రయాణమున కాజ్ఞాపించెను. భరతుఁడును సుమంత్రునిఁ జూచి సర్వసన్నాహముఁ జేయింపు మని చెప్పి మఱునాఁ డందఱితోఁ గూడి పురము వెడలి గంగాతీరమున గుహునిఁ గలసి పిమ్మట భరద్వాజాశ్రమమును జేరి యచ్చట నామునిని సందర్శించి యారాత్రి యచ్చట నివసించి మఱునాఁడు చిత్రకూటమున నున్న రామునియొద్దకుఁ బోయి జటావల్కములఁ ధరియించియున్న యతనిని జూచి దుఃఖించుచు నతనికి నమస్కరించియుండఁగా రాముఁడు భరతునిఁ గొన్ని ప్రశ్నములు చేసెను. వానిలో దశరథుని కుశలము భరతుని యరణ్యాగమనకారణమును నడుగుచు "బాలుఁడ వగు నీ రాజ్యము భ్రష్టము కాలేదు గదా? ఇక్ష్వాకుకులగురు వగు వసిష్ఠుఁడు నీచేత యథార్హముగ పూజింపఁబడుచున్న వాఁడా? దేవతలను పితృదేవతలను గురువులను వృద్ధులను వైద్యులను నభిమానించుచున్నావా? నీవు సమానులును నట్టి శూరులు జితేంద్రియులు కులప్రసూతులు నింగితజ్ఞులు నగువారు మంత్రులుగా నున్నారా? నీతిశాస్త్రజ్ఞులతో మంత్రము నతిరహస్యముగాఁ జేయుచున్నావా? నీ మంత్రము నీ రాష్ట్రమందుఁ దెలియఁబడక యున్నదా? ఉత్తమమధ్యమాధమకృత్యములం దట్టివారినే నియోగించుచున్నావా? నీ మంత్రులు నీ రాజ్యమును క్రూరదండముచే వ్యాకులమగున ట్లంగీకరింపరు గదా ? నీ సేనలవారికి యథోచితముగ నిర్ణయింపఁబడిన జీతములు విలంబము సేయక కాలమం దిచ్చుచున్నావా? నీ ప్రజ లందఱును నీయం దనురక్తులై యున్నారా? రాజులకు విహిత మయిన పదునెనిమిది తీర్థములను స్వపక్షమందు పదునైదును నొకరికొకరు తెలియఁబడకుండునట్టి గూఢచారులవలనఁ దెలిసికొనుచున్నావా? లౌకాయతికు లనఁగా నాస్తికులైన బ్రాహ్మణులను సేవింపవుగదా? నీ రాష్ట్రము రచ్చలు గలదియు సుఖనివాసములు గల జనులచే నిండినదియు దేవస్థానములు చలివేంద్రలు చెఱువులుగలదియు సంతుష్టులయిన స్త్రీపురుషులు గలదియు సమాజోత్సవములు గలదియు సుష్ఠుగా దున్నఁబడిన హద్దులు గలదియు పశు

సమృద్ధి గలదియు హింసలు లేకున్నదియు నీటి బట్టెలు గలదియు క్రూరమృగములచేత పీడింపఁబడనిదియు తస్కరాదిభయములు లేనిదియు గనులు గలదియు పాపాత్ములు లేనిదియు నయి సుఖముగా నున్నదా? కృషిగోరక్షులచే జీవించువారు నీకు ప్రియులై యున్నారు గదా? వార్తాహరులకు ననుకూలముగ పోషణము జరుగుచున్నదా? స్త్రీలు బాగుగా రక్షింపఁబడుచున్నారా? వారితో రహస్యమును సంభాషింపవు గదా? నీ దుర్గములన్నియు ధనధాన్యోదకములచేత నాయుధములు యంత్రములు ధనుర్ధరుఁలు శిల్పులు మొదలగువారిచేతను పూర్ణములై యున్నవా? నీ యాదాయ మెక్కువగాను వ్యయము తక్కువగా నున్నదా? వృద్ధులను బాలురను వైద్యులను దానముచేతను మనసుచేతను వాక్కుచేతను సంతోషపెట్టుచున్నావా? ధర్మార్థకామము లొకటిచే నొకటి బాధింపఁబడకుండ రక్షించుచున్నావా? మువ్వురు గాని నల్వురు గాని మంత్రులతో వేఱువేఱుగను కలిసియు కార్యాలోచనము సేయుచున్నావా? మన తండ్రితాత లవలంబించిన యాయుర్యశోధర్మకామార్థసాధక మగు వృత్తి ననుసరించియుంటివా? రాజు ధర్మము దప్పక ప్రజలను పాలించువాఁడు సమస్తభూమిని నిచ్చటనచ్చట ననుభవించి పరమందు స్వర్గము నొందును." అను నీమొదలగు ప్రశ్నములవలన నానాఁటి ప్రజాపాలనాచార మట్లుండె నని తెలియఁబడుచున్నది. ఇంకను యుద్ధకాండము ౧౩౧ సర్గము: "రామమూర్తి పట్టాభిషిక్తుఁడై ధర్మప్రకారము ౧౧౦౦౦ సంవత్సరములు భూమిని పాలించెను. అతని పరిపాలనకాలమందు స్త్రీలు విధవలయి దుఃఖించుట లేదు, అట్లగా సహగమనమునే చేయువారు. సర్పాదిక్రూరజంతువుల వలన భయము లేదు. రోగభయము లేదు. ఆరోగ్యము గలవారలై యుందురు. దొంగలు మొదలగువారివలన లోక మెట్టి యనర్థమును పొందదు. పెద్దవాండ్రు పిన్నవాండ్రకు ప్రేతకర్మలఁ జేయుట లేదు. సర్వలోకము నిత్యము సంతోషము నొందియే యుండును. అందఱును ధర్మపరులే. వేలకొలఁది సంవత్సరములు జీవింతురు. రోగములు దుఃఖములును లేవు. వృక్షములు నిత్యము పుష్పఫలములు గలవై యుండును. కాలము తప్పక వర్షము గురియును. వాయువు లనుకూలముగ వీచును. బ్రాహ్మణాదివర్ణములవారు తమతమ కర్మలందు ప్రవర్తింతురు. న్యాయపరిపాలన మి ట్లుండును.

మహాభారతము సంస్కృతాంధ్రములు సభాపర్వము ౧ అధ్యాయాశ్వాసములు: నారదమహర్షి ధర్మరాజు నొద్దకు వచ్చి ప్రశ్నించినపుడు "మీవంశస్థు లగు రాజోత్తముల ధర్మమార్గమందె యున్నావా? ధర్మార్థకామములలో నొకటిచే నొకటి చెడకుండ రక్షించుచున్నావా? నీ రాజకృత్యములందుఁ దగినవారినే నియమించితివి కదా? ధర్మనీతిశాస్త్రములఁ దెలిసినట్టియు నీయం దనురాగము గలట్టియు తండ్రితాతల వరుసను వచ్చునట్టియు మంత్రులను కార్యములపట్ల నిర్ణయించితివా? నీ కార్యాలోచనము జనులకుఁ దెలియకుండఁగ రక్షించుచున్నావా? బహుయుద్ధములలో జయము నొందిన వీర్యవంతులను నమ్మఁదగినవారిని సేనాపతులఁ జేసినావా? నీమంత్రి ధనలోభముచే నితరరాజులలోఁ గలియఁడు గదా? నీ జ్యోతిష్కులు దివ్యభౌమోత్పాతములకు ప్రతిక్రియలు చేయుచున్నారా? ఆయుర్వేదదక్షు లగు వైద్యులు నీయం దనురక్తులు గదా? పెద్దలయొక్కయు సౌషధములయొక్కయు సేవచే నీ మానసశరీరరోగములను బాపికొనుచున్నావా? నీ ధనార్జనమందు నిపుణులు సంప్రదాయశుద్ధులు నీతిమంతులు నగువారిని పరీక్షించి నియోగించితివి గదా? ఉత్తమమధ్యమాధమ కృత్యములం దట్టివారినే తగు జీతము లిచ్చి నియోగించితివా? నీ భృత్యులకు కాలము తప్పక జీతము లిచ్చుచున్నావు గదా? నీ యుద్ధమందు మృతినొందినవారి కుటుంబము నన్నవస్త్రాదులచేత ననుకూలముగ పోషించుచున్నావు గదా? రాజకార్యములయెడల ధనలోభులు దొంగలు నీయెడ ప్రేమలేనివారు శత్రుపక్ష మగువారిని పంపవుగదా? చోరభయము లేకుండ భూమిని పాలించుచున్నావా? నీ దేశమందు చెఱువులు గలిగి యనావృష్టి భయము లేకున్నదా? బీద లగు వ్యవసాయదార్లకు ధాన్యములు విత్తనములు నూటి కొకటివంతున వృద్ధితో ఋణమిచ్చుచున్నావా? వికలాంగు లగు దీనులను పోషించుచున్నావా? నీవారు సేయు మంచి కార్యములను తెలిసికొని వారిని స్తుతియించి సత్కరించుచున్నావా? నీ యాదాయములో నాల్గవ పాలు గాని మూఁడవ పాలు గాని సగము గాని యంతకంటె నెక్కువ ఖర్చు చేయరాదని తెలిసితివా? ఆయుధధనాగారములందును గజతురగాదులందును విశ్వాస్యు లగువారి నుంచితివా? గురువులు వృద్ధులు శిల్పులు వర్తకులు బంధువులు నాశ్రితులు సాధు లయినవారిని దారిద్ర్యము లేకుండ

నట్లు రక్షించుచున్నావా? మంత్రులు బంధువులు రాజపుత్రులు విద్వాంసులు నిండి యుండునట్లు కొలువు గూర్చుందువా? లోనివారివలన గాని పైవారివలనఁ గాని యపాయము లేకుండ నిజరక్షయందు జాగరూకుఁడవై పరరాజుల వ్యాపారములను గూఢచారులవలనఁ దెలిసికొనుచున్నావా? నిత్యమును నిష్పక్షపాతబుద్ధితో విద్వాంసులతోఁ గూడి ధర్మము దప్పక లోకవ్యవహారములను పరిశీలించుచున్నావా? నాస్తిక్యము, అనృతము, ప్రమాదము, అలసత, కార్యజ్ఞత లేనివారితో నాలోచనము, క్రోధము, దీర్ఘాలోచనము, కార్యారంభము లేకయే చిరకాలవిచారణము, జ్ఞానవంతుల నెఱుంగకుండుట, అర్థములందనర్థచింత, నిశ్చితకార్యము సేయకుండుట, మంత్రమును గుప్తముగా రక్షింపకుండుట, శుభములను జేయ కునికి, వ్యసనములందుఁ దగులుట అను నీ పదునాలుగు రాజదోషములు లేక యున్నావా?" అని నారదమహర్షి యడిగెను. దానికి ధర్మరాజు "నా శక్తికొలఁది నన్యాయమార్గము విడిచి గొప్పవారి చరిత్రములను దలఁచి తమ యుపదేశప్రకారము శుభకార్యములనే చేయుచున్నాఁడను" అని చెప్పెను. దీనివలన ద్వాపరయుగమువఱకును మీఁదఁ జెప్పినరీతినే ప్రజాపాలనము జరుగుచున్నట్లు స్పష్టమగుచున్నది. రాజు ధర్మము దప్పినను నసమర్థుఁడైనను వానిని తొలఁగించి యా వంశమునందలి మంచివానిని పెద్దలు నిర్ణయింపవలసినట్లును గానఁబడుచున్నది.

బాలుని తోఁటివిచారము

కోట అనంతశాస్త్రి గారు

ఏడి తల్లీ! నాదు సోదరుఁ?
డాడలే నొంటరిగ, వేసవిఁ
గూడె తుమ్మెద విరుల, నాతనిఁ
దోడితెమ్మిటకున్. 1

మెరసె సీతాకోకచిలుకలు
తరణికిరణములందుఁ జనునెడ:
తరిమి వానిని బట్ట నీక సో
దరునిఁ దెమ్మిటకున్. 2

మేము పెంచిన పూలమొక్కలు
గోము చెడి పాడాయె, ద్రాక్షలు
భూమిఁ బడె ఫలభారమున, నిటు
ప్రేమఁ బిలు మతనిన్. 3

నీదు మాటలు వినఁడు తండ్రీ!
నీవు చెంతను జేరలేఁ డీక
మోద మలరెను వాని మోమిటు
మీఁదఁ గన విలను. 4

వాని జీవన మల్పమై సుఖ
మైన దాయె గులాబివలెనే;
కాన నొంటిగ నాడుకో, స్వ
ర్గానఁ గలఁ డతఁడు. 5

పూలఁ బులుఁగుల విడిచి చనెనా?
బాలుఁ బిలుచుట వ్యర్థమేనా?
చాల నిడివి గలట్టి వేసవి
కాలమున రాఁడా? 6

అడవులను సెలయేటి చెంతను
గడచెనా సంచార మయయో!
కడుఁ బ్రియంబును జూపలే దా
తఁ డిటఁ గలయపుడే. 7

రాఁబోవు ప్రజాధర్మములు

వల్లూరి సూర్యనారాయణరావు పంతులు గారు, బి.ఏ., బి.ఎల్., ఎల్.టి.

రాజు విష్ణుసంభూతుఁ డనియు ప్రజ లాయన బిడ్డ లనియు రాజునకు ప్రజ శరీరము కాఁబట్టి యాయన నడుపు నున్న త్రోవను ప్రజలు శాంతిసమయముల లోను యుద్ధసమయములలోను నడుచుకొనవలసిన దనియు ఈ మొదలగు రాజకీయధర్మము లనేక దేశములలో నింతవఱ కమలులో నుండెను. మొత్తముమీఁద రాజుల పరిపాలనమున ప్రజలు పందెపు కోళ్లవలె యుద్ధములలో నాహుతి చేయఁబడుచునే యుండిరి. ఇప్పుడు ప్రజాస్వామిక ప్రభుత్వ మున్ని దేశములలోను నెలకొల్పఁబడఁబోవుచున్నది. కొన్ని దేశములలో పేరున కొక రాజున్నను, ప్రజలే తమ ప్రతినిధిసంఘముల మూలమున తమ దేశపరిపాలనమును జరిగించుకొనఁదలఁచుకొన్నారు. ఒక్క సామ్రాజ్యములో ననేక రాష్ట్రము లున్నపుడు, ఆయా రాష్ట్రములలోని జనులు తమ కిష్ట మైన రాజ్యాంగతంత్రము నేర్పఱచుకొనుటకు సంపూర్ణాధికారము కలిగి యుందు రని ప్రెసిడెంటు విల్సను గారి యభిప్రాయము. దీనినే స్వయంనిర్ణయసూత్ర మని చెప్పెదరు. దీనిని మన మిత్రమండలివారును ఇతరదేశస్థులును అంగీకరించిరి. పరిపూర్ణస్వాతంత్ర్యము గల దేశములలోని జనులు తమ కిష్టము వచ్చిన రాజ్యాంగవిధానము నేర్పఱచుకొనుటకు ప్రయత్నించునపుడు ఇతరరాజ్యములవారు జోక్యము కలుగఁజేసికొనఁగూడ దని యన్యోన్యరాజ్యతంత్రజ్ఞు లనేకసంవత్సరముల క్రిందటనే వ్రాసియున్నారు. చిన్న రాష్ట్రములను బలహీనరాష్ట్రములను అనాగరికరాష్ట్రములను గొప్పగొప్ప రాజ్యములు మ్రింగకుండుటకును, ఇదివఱకు మ్రింగఁబడిన రాష్ట్రములలో వాని ప్రజల కిష్ట మైన రాజ్యాంగతంత్రము నేర్పఱచుకొనుటకును ఈ స్వయంనిర్ణయసూత్రమును మన మిత్రమండలివా రాచరణములో పెట్టఁ దలఁచుకొన్నారు. ఈ సూత్రమును బట్టియే ఢిల్లీ కాంగ్రెసులో మన నిశ్చితాభిప్రాయములను వెల్లడించితిమి. బ్రిటిషు పరిపాలనము క్రింద మన మింక ముం దుండఁదలఁచుకొనలే దనియు మనము వేఱుగ నొక స్వతంత్రరాజ్యము స్థాపించుకొనెద మనియు మన మెన్నఁడు చెప్పలేదు. కాని, బ్రిటిషుసామ్రాజ్యములో నున్న వలసరాజ్యములతోఁబాటు మనకును స్వాతంత్ర్యముల నీయవలసిన దని మాత్రమే మనమిప్పుడు కోరుచున్నాము. ఈ స్వయంనిర్ణయసూత్రమును బట్టి మన మట్లు కోరుటకును మన కోరికలు నెఱవేఱునంతవఱకు మనము నిబంధనానుకూలముగ రాజకీయాందోళనము చేయుటకును మనకు హక్కు కలదు.

మనలోని మితవాదులును ఆంగ్లోయిండియనులును ఈ విధముగా కోరుట హాస్యాస్పద మని యనుచున్నారు. మనము స్వపరిపాలనమున కర్హులమా? యనర్హులమా? అర్హుల మైనయెడల దానిని కోరుట తప్పు కాదుగదా! అనర్హుల మనుకొందము. పెక్కువేల సంవత్సరములు మన పూర్వులు రాజ్యము చేసిరి. అట్టివారి సంతతివార మగు మనము నూటయేఁబది సంవత్సరములనుండి యాంగ్లేయులచేత పరిపాలింపఁబడినను స్వపరిపాలనమున కనర్హుల మైనయెడల, వీరి పరిపాలనముయొక్క ప్రయోజన మేమి? మనలను వీరు వదలివేసి వెళ్లుట యైనను, లేక స్వపరిపాలనమునకు మనలను సమర్థులను చేయఁగల మరియొక నాగరికరాష్ట్రమువారి చేతులలో పెట్టుట యైనను జరుగవలసియుండును గదా!

కాఁబట్టి మనము నిజముగా ఆంగ్లేయప్రభువుల సహాయముతో నైనను స్వపరిపాలనమునకు తగియున్నా మని నమ్మినవారు దానిని బహిరంగముగ కోరుట యుక్తము గాని అడిగినంతనే యిచ్చెదరో లేదో యని సంకోచించుచు బేరములు చేయుట రాజనీతి కాదు. ఇట్టి విషయములో అడుగుట యేమి? ఇచ్చుట యేమి? మనకు సహజ మైన స్వాతంత్ర్యాధికారములు కల వనియు వాని కడ్డు కలిగింపఁగూడ దనియు స్వయంనిర్ణయసూత్రము ఘోషించుచుండఁగా మన పాలకు లెంతవఱకు సమ్మతింతురో యను విషయము మన కేల? రాజీనామాలు రాజకీయవ్యవహారములను నడపుటలో శాసననిర్మాణసభలలోని వివిధకక్షులవారికి నుండితీర

వలసినవి గాని, కాంగ్రెసువారు ప్రజాభిప్రాయమును వెల్లడించుట స్వయంనిర్ణయసూత్రము ప్రకారము వారి విధ్యాయుక్తమై యున్నది. ఈ సంవత్సరపు కాంగ్రెసులో అయిదు వేల ప్రతినిధులు వెలిపుచ్చిన యభిప్రాయములు జనసామాన్యమునకు చెందవని మన యాంగ్లోయిండియను లెట్లు చెప్పఁగలరు?

స్వయంనిర్ణయసూత్రమును బట్టి మన కాంగ్రెసులో చేసికొన్న తీర్మానములకు మన బ్రిటిషు ప్రభుత్వమువారు చెవి నొగ్గక తమకు తోఁచిన రాజకీయ సంస్కరణములను వారు ప్రవేశపెట్టినయెడల మనము చేయున దేమి యని కొందఱడుగవచ్చును. మనము ప్రస్తుతము కోరిన సంస్కరణములు పూర్తిగా వచ్చువఱకు మన యసంతృప్తిని వెల్లడించుచుండుటయే మనకు కర్తవ్యము. నిబంధనానుకూలరాజకీయాందోళనమును మాత్రము మన మెన్నఁడును విడువఁగూడదు. ఆర్థిక స్వాతంత్ర్యము రాష్ట్రీయస్వపరిపాలనము సమావేశస్వాతంత్ర్యము వాక్స్వాతంత్ర్యము ముద్రణస్వాతంత్ర్యము ఆయుధధారణస్వాతంత్ర్యము మొదలగునవి మన కిప్పుడు మిక్కిలి యావశ్యకములు. ఈ యరణ్యరోదనము వినువా రెవ్వ రని కొందఱడుగవచ్చును. ఇప్పుడు స్థాపింపఁబడఁబోవు నంతర్జాతీయ సంఘమే వినవలయును. ఈ సంఘముయొక్క స్థాపనము వట్టి కల్ల గా దని వార్తాపత్రికలను జాగ్రత్తగా చదువుచున్నవారి కందఱకును విశదమే. ఈ సంఘము స్థాపింపఁబడిన తరువాత రాజులయొక్కయు మంత్రులయొక్కయు రహస్యాలోచనలును రహస్యసంధులును స్వలాభమునకై జరుగుచుండిన పోరాటములును నశించి ప్రపంచములో నిరంకుశప్రభుత్వములకు బదులు ప్రజాపరిపాలనము యుద్ధములకు బదులు అంతర్జాతీయసంఘనిర్బంధమధ్యవర్తిత్వము ప్రస్తుతసామ్రాజ్యాధికారమునకు బదులు వివిధరాష్ట్రస్వాతంత్ర్యము—ఇవి యన్నియు నెలకొల్పఁబడుట కెంత మాత్రము సందేహము లేదు. ఈ సంఘస్థాపనమే నానాదేశములకు రాఁబోవు రాజకీయమోక్షము. ప్రపంచముయొక్క పటము మాఱు సమయము వచ్చినది. వివిధజాతులు తమ కనుగుణమైన వికాసము నొందుట కవకాశములు కలుగఁబోవుచున్నవి.

ఇపుడు సంధిసభలోఁ గాని యింగ్లాండులోఁ గాని మన మాట తలపెట్టువారు లే రని మనము నిస్పృహ చెంద నక్కఱ లేదు. అంతర్జాతీయసంఘము (అనఁగా నానారాష్ట్రసభ) స్థాపింపఁబడినను మన హక్కులకు పోరాడువారు మనవంటి యస్వతంత్రులకు దానిలో చోటు లే నందున అక్కడ నెవ రుండు రని సందేహింపఁ బని లేదు. మన బ్రిటిషు ప్రభువులు మనము కోరిన స్వాతంత్ర్యముల నిచ్చుట కాలస్యము చేసినను నానాదేశసభలోని ప్రతినిధు లందఱు తూష్ణీంభావమును కనఁబఱుపరు. మనము ప్రపంచములో నుండు నన్ని దేశములకు పోయి మన రాజకీయవిషయములను గుఱించి యచ్చటి వార్తాపత్రికలలో వెల్లడించుచున్నపుడు ఆ సభలో ముఖ్య విషయమైన తీర్మానముల ననేకదేశప్రతినిధులు చర్చకు తీసికొనివచ్చుచుందురు. ఆవశ్యకత కలిగినపుడు ఆ సభవా రంతర్జాతీయవిచారణసంఘము నొక దానిని మన దేశపరిస్థితులను విచారింపు నిమిత్తము పంపవచ్చును. మాంటేగు గారు మన దేశమునకు వచ్చుటయు ఈ కొలఁది సంస్కరణముల నైనను ప్రతిపాదించుటయు విల్సను గారి మూలముననే యని నమ్మెదము. ప్రెసిడెంటు విల్సను గారు సెల విచ్చినట్లు హక్కున్యాయము అనువాని నాధారము చేసికొని ప్రవర్తించినయెడల మనకు మోసబలము నుపయోగించుకొన నక్కఱ యుండదు.

ఇంతవఱకు జరుగుచుండిన ఘోరసంగ్రామము ముగిసిన తరువాత విల్సను గారి యుత్కృష్టాదర్శములకు విముఖు లగుచు మన యాంగ్లేయులు తమ క్రింద నున్న స్వల్పజాతులయొక్కయు బలహీనమైన జాతులయొక్కయు విషయమై తమ దృక్పథము నెట్లు మార్చుకొనుచున్నారో విల్సను గారికి తాము మొదట చేసిన వాగ్దానముల కెట్టి వ్యాఖ్యానములు చేయుటకు మొదలిడినారో గ్రహించినయెడల, ఒక యింగ్లాండులోనే గాక విదేశములలో కూడ మనము సదా మొఱపెట్టుచున్నఁ గాని మనము స్వాతంత్ర్యములు పడయఁజాలమనియు, ఒక కవి వ్రాసిన యీ వాక్యములు సత్యములనియు మనము గ్రహింపవలెను.

"ఎందఱు గుండెకుండ మఱి యెందఱు బందెలఁ గందకుండ నిం
కెందఱు దేశముల్ విడిచి యీడిగిలంబడకుండ నెవ్వ రే
చందమునన్ శ్రమంపడక చప్పునఁ జొప్పడు నే స్వరాజ్య? మో
హిందువులార! చింతిలకుఁడీ కృషి సల్పుఁడభీష్టసిద్ధికై."

సంధిమహాసభా ప్రతినిధులు.

Major General Bliss.



మేజరు జనరలు బ్లిసు
(మిలిటరి ప్రతినిధి)

President Wilson.




ప్రెసిడెంటు విల్సను

H. White.



హెచ్. వైటు గారు
(పారిసు రాయబారి)

Colonel House



కల్నలు హౌసు
(విల్సనుగారి స్నేహితులు)

General Smutts.



జనరలు స్మట్సు
(దక్షిణాఫ్రికా)

General Botha.



జనరలు బోథా
(దక్షిణాఫ్రికా ప్రధానమంత్రి)

Sir Lloyd.



సర్ లాయిడు గారు
(న్యూఫౌండులాండు ప్రధానమంత్రి)

Makino.



మాకినో గారు

Viscount Chinda.




చిండాప్రభువు (జపాను)

Matsui




మాట్సూయి గారు

Mr. Jules Cambon.



జూల్సుకాంబను (ఫ్రాన్సు)

Mr. Tadyu.



టార్డ్యూగారు (ఫ్రాన్సు)

Mr. Lanning.



లాన్సింగ్ గారు (అమెరికా)

Mr. Bonar Law.




బోనరులాగారు
(ఆంగ్లయుద్ధమంత్రి)

Mr. Liyod George.



లాయడుజార్జిగారు
(ఆంగ్లప్రధానమంత్రి)

Mr. Balfour



బెల్ఫరుగారు
(ఆంగ్లవిదేశాంగమంత్రి)

Mr. Barnes.



బార్న్సుగారు
(ఆంగ్లయుద్ధమంత్రి)

Mr. Pichon.



పిచను గారు

Mr. Clotza.



క్లోట్జుగారు

Mr. Clemenceau.



క్లెమెంకో గారు
(ఫ్రాన్సు ప్రధానమంత్రి)

Mr. Britionca.



బ్రేటియానో (రొమేనియా)

Mr D[illegible]



ఎమ్. డ్మాంస్కి (పోలాండు)

Mr. M. Pi[illegible]




ఎమ్. పిట్జి (పోలాండు)

Mr, Montague.



మాంటేగుగారు (ఇండియా)

Maharajah of Bikanir.



బికనీరు మహారాజు

Lord Sinha.



సింహా ప్రభువు

Mr. Hughes.



హ్యూజెసు గారు
(ఆస్ట్రేలియా
ప్రధానమంత్రి)

Sir J. Dhar.




సర్ జె. దారు
(న్యూజిలాండు ఆర్థికమంత్రి)

Mr, Massi.




మాసీగారు
(న్యూజిలాండు
ప్రధానమంత్రి)

[illegible]



[illegible] (ఇంగ్లాండు [illegible] మంత్రి)

Baron Sonnino.



సొన్నినో ప్రభువు
(ఇటలీ యుద్ధమంత్రి)

Sir Salandra.



సర్ సలాండ్ర
(పూర్వపు ఇటలీ
ప్రధానమంత్రి)

Mr K[illegible]m[illegible].



క్రామార్జుగారు
(బొహిమియా)

Mr Pashibi.




పాషిచిగారు
(సర్వియా)

Mr P[illegible]




పెనెషుగారు
(బొహిమియా)

Sir D[illegible]hartt



దోహర్త్రిగారు (కనడా)

Sir G F ster



సర్ జి. ఫోస్టరు

Sir R Bo d n



సర్ ఆర్. బోర్డెను

దేశాభ్యుదయ రహస్యము

కొండిపర్తి వీరభద్రాచార్యులు

మహావృక్ష మొకటి తనశాఖలను దీర్ఘముగఁ జాఁచి నలుదెసల వ్యాపింపఁగ దాని నాశ్రయించి యసంఖ్యాకము లగు విహంగములు వర్ధిల్లఁగలవు. కాని యావృక్షమూలము చుట్టు నున్న చిన్న చెట్లు ముప్పు నొందును. వానికి వలయు సూర్యరశ్మియు వర్షమును కొఱవడును. అట్టిభూజముపైని చరించు శకుంతముల కెట్టి నష్టము నుండదు. అయినను దానికొమ్మలచే గప్పఁబడిన మొక్కలకు నష్టమే చేకుఱును. ఈమొక్కలను గూడ నా మహామహీరుహమున కొంకెత దూరమున నాటి యొకింత స్వాతంత్ర్యజీవనమున కవకాశము నొసంగినయెడల నివి యా వృక్షరాజమువలని లాభములను పడయఁగల్గును. పెనుగాడ్పులు వీచునప్పుడును తుపానులు తటస్థించునప్పుడును పెద్దచెట్లు తమ చాపున నుంచుటచేతను అది వాని తీవ్రతల నడంచుటచేతను చిన్న మొక్కలకు లాభము చేకుఱును.

దినకరుఁ డస్తమింపని బ్రిటిషు సామ్రాజ్య మహామహీరుహము నాశ్రయించి యధినివేశము లనేకములు వర్ధిల్లు చున్నవి. కనడా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మున్నగునవి ఆమహీరుహమున కొకింతదూరమున స్వాతంత్ర్యజీవనముఁ గలిగి యున్నతి నందుచున్నవి. వీనికి ఇంగ్లాండు దేశీయుల యవరోధములు గల్గినప్పు డవి యొకింత దూరమునకు జఱిగి జీవింప నారంభించినవి. ఇంగ్లాండు రాజనీతి, వర్తకమార్గము, శాస్త్రాభ్యుదయము, విద్యాపద్ధతి, ఆర్థిక సమృద్ధి అధికారవ్యాప్తి మున్నగునవి కాలనీలకు తోడ్పడునవియై విజ్ఞానబలసత్త్వముల నొసంగుచున్నవి.

ఈభారతదేశము మిగులసమీపవర్తియై బ్రిటీషుమహారాజ్య మహీరుహచ్ఛాయలచే గప్పఁబడి మెలఁగుచున్నది. మొదట మొదటఁ దఱుచుగ సంభవించుచువచ్చిన యన్యదేశీయుల దాడులను, స్వదేశీయుల యంతఃకలహములను నింక నిట్టిప్రళయానిలముల ననేకము నరికట్టి దేశము నుద్ధరించిన సామ్రాజ్యశాఖలే రానురాను దాని కవసర మగు విద్య యను దినకరతేజమును, ఆర్థికసంపద యను వర్షమును, స్వేచ్ఛానిలమును దరికి రాకుండ నాతంకములు గల్గునంతగా దేశము నలముకొనినవి. దేశోన్నతి కవసర మగు రాజనీతి బ్రిటిషు వారిచేతనేఁ బూర్ణముగఁ బాలింపఁబడు చున్నది. దేశీయుల కాయనుభవము పూజ్య మగుచున్నది. దేశసంపద కావశ్యకము లగు పరిశ్రమలు బ్రిటిషువారి స్వాధీనమం దుంచుకొనఁబడినవి. దేశీయులు తమ కావశ్యకము లగువానిని బ్రిటిషువారిద్వారమున కొనవలసిన వారైరి. స్వరక్షణశూన్యులై, దేశీయులు పాలకులపైఁ బూర్ణముగ నాధారపడి బ్రతుకవలసినవారైరి. ఇట్లుండ దేశము హీనదశ నొందుట యబ్బురమా ? దేశీయులు పేరులేకుండ నడఁగిపోవు దుర్గతి వాటిల్లునను భీతి గల్గినది.

హిందూదేశపుపంటలు సమృద్ధిగ దేశీయులకు వలయుపదార్థముల నెల్ల సమకూర్చుటయే గాక బహుదూరదేశములకు నెగుమతి చేయఁబడుచు వచ్చిన కాలము గలదు. హిందూదేశపుపరిశ్రమలు లోకమునఁ బేరెన్నికఁ గాంచి ప్రపంచధనవాహినుల కెల్ల దేశీయ వాణిజ్యస్థానములు మహాసముద్రములుగ నొనర్చిన కాలమును కలదు. హిందూదేశపు సరకులను ఇటలీకి రాకుండ నడ్డు పెట్టనిచో నిటలీ సువర్ణ మెల్ల హిందూదేశముఁ జేర నున్న దని యచ్చటి యర్థశాస్త్ర ప్రవీణులు మొఱలిడిన కాలమునుఁ గలదు. ఇప్పటికిని లోకమునందలి శాస్త్రజ్ఞుల కెల్ల నాశ్చర్యమును గొలుపుచు యంత్రనిర్మాతల యూహల కందరాక నిలిచియున్న ఢిల్లీ యినుపస్తంభము పోతపోయఁబడిన కాలము; హిందూదేశమునఁ దయారైన ఉక్కులోహమునకై ప్రష్యాదేశీయు లారాటముఁ జెందుచుండిన కాలమును భారతదేశమున నిర్మింపబడిన సహస్రఘ్నులు నిరుపమానములై నిలిచినకాలమును ఇంగ్లాండు పరిశ్రమలందు బీదయై యుండి హిందూదేశపులోహమును విరివిగఁ గొనుచుండిన కాలమును, ఈజిప్టుదేశపు మమ్మీలు ఢక్కామజిలినులచే నలంకరింపఁబడుచుండినకాలమును, ఇక్కడిసన్నని వస్త్రములు కాలితో నేయఁబడు చుండు నని పాశ్చాత్యులు వింత వాక్యములఁ జెప్పుకొనుచుండిన కాలమును, భారతీయులు సకల విద్యలచేతను కళలచేతను ననూనవిభూతితోడను దేజరిల్లుచుండిన కాలమును, వేదాంతతత్త్వమును తురీయాశ్రమస్థులకు మాత్రము విడువక జనసామాన్యము గార్హస్థ్యమునఁ బూర్ణముగ దాని నాచరణమం దుంచిన కాలమును; గ్రీకురోమకతత్త్వవిశారదులు భారతీయులను గురుభావమునఁ బూజించినకాలమును గడచిపోయి పెక్కుశతాబ్దు లయినవి.

అన్యదేశీయపు వర్తకసంఘము లనేకము వ్యాపారము నిమిత్తము హిందూదేశమునకు రాసాగినవి. ఇచ్చటి మజిలినులును, లోహసామగ్రులును, చీనిచీనాంబరములును, ధాన్యరాసులును, లలిత కళలును దూరదేశవాసుల నాకర్షించినవి. పోర్చుగీసువారు, డచ్చివారు, దేనులు, ఫ్రెంచివారు, తుదకు ఇంగ్లీషువారును సంఘోపసంఘములుగ నేర్పడి భారతభూమి కేతెంచి వాణిజ్యమును సాగించిరి. కాలచక్రము మాఱినది పాశ్చాత్త్యులు నాగరకాభివృద్ధిఁ గాంచుచుండిరి. తమ విద్యాపద్ధతులను, పారిశ్రామికసరణులను మాఱ్చుకొనిరి. భారతదేశపురాజులు పరదేశపువర్తకుల నెక్కుడుగ నాదరించి వారి కెక్కుడుగ నధికారస్వాతంత్ర్యముల నొసఁగిరి. వీరు పరదేశవర్తకమును దేశీయవణిజుల హస్తములనుండి తొలఁగించి వారిని తమకు ప్రతినిధులుగ మాఱ్చిరి. దేశీయవణిజులు హ్రస్వదృష్టి గలవారై, దూరదేశముల కేగు శ్రమ తప్పి యిండ్లకడనే ధ

లభించుచుండె నని మురియుచు వ్యాపారము నంతయు నన్యదేశీయుల కరములం దర్పించిరి. తాము వారికి ప్రతినిధులై పలయు పదార్థముల నెల్ల సంగ్రహించి యిచ్చుచు వచ్చిరి. స్వదేశపరిశ్రమలు తలయెత్తిన కొలఁదిని వారి వర్తకులు ఇచ్చుటఁ దయారైన వస్తువులఁ గొనుట మాని పరిశ్రమలకు వలయు ముడిపదార్థములను మాత్రము గొనుట మొదలిడిరి. కత్తులు కటారులు ఫిరంగులు మాని ఇనుమును, వస్త్రములకు మాఱుగఁ బ్రత్తిని ఉన్నిని పట్టును కొన మొదలిడిరి. కర్షకులు సంతసింప సాగిరి. పారిశ్రామికజను లీ పద్ధతిని నిరోధింపఁ జూచినను పలుకుబడిని నెలకొల్పుకొనిన యన్యదేశపువర్తకులు వీరిని వంచన చేసిరి. అంతట పారిశ్రామికప్రవీణులు జీవనమునకు లోటుపడి వ్యవసాయము నవలంబింపవలసినవా రైరి. భారతీయుల కెల్లరకును నన్యదేశపు వర్తకుల కొలువో, లేక వ్యవసాయమో తప్ప ఇతరజీవనోపాధి లేనివా రైరి. దేశీయపరిశ్రమలకు గణ్యత పూజ్యమైనది. వాణిజ్యము నీరసమునఁ బడినది. సర్వజనులును అన్నాతురులై శ్రేష్ఠతరమార్గముల నేర్చుకొనుటకు విశ్రాంతి లేక యప్పటికప్పుడు సద్యస్కాలఫలితములను మాత్రమే చూచుకొనుచు సాగించిన సేద్యవృత్తి సారహీనమై పోయినది. కళలు నశించినవి. వృత్తు లదృశ్యము లైనవి. విద్య లడుగంటినవి. పొట్టకూటికై యెప్పటికప్పుడు పాటుపడుట పాటియైనది.

క్రమక్రమాభివృద్ధిఁ గాంచుచున్న ఆంగ్లేయపరిశ్రమలను పాలకులు మిగులఁ బ్రోత్సాహముఁ జేయుచుండిరి. పారిశ్రామికవిద్యలకై దూరదేశములకు విద్యార్థులను పంపుచుండిరి. నానాదేశముల నుండి కళానిపుణులను రావించి ఇంగ్లాండునందు పారిశ్రామిక జనులకు విద్యఁ గఱపుచుండిరి. ఏయేవృత్తులందు మెలఁగువారి సంతతి కాయావృత్తులను నేర్పింప సాగిరి. విద్యాధికులు పారిశ్రామికసమస్యలను విమర్శించుచు దొరతనమువారికి తగు సలహాల నొసంగుచుండిరి. అప్పటికి ఆంగ్లేయులు వర్తకులుగ మాత్రము హిందూదేశమునఁ జరించుచుండిరి. భారతదేశ మింకను బ్రిటిషు ప్రభుత్వముక్రిందికి తీసికొనఁబడలేదు. హిందూదేశమునకు వస్త్రములు లోహసామగ్రులు నితర పారిశ్రామికపదార్థములును ఇంగ్లాండునుండి విరివిగ దిగుమతి యగుచున్నవి. అచ్చటఁ దయారైన వస్తువులను హిందూదేశమునుండి దిగుమతిచేసిన వానికంటె సరసముగ నమ్ముట వారికి సాధ్యము కాదయ్యెను. దూరదేశమునుండి సరకులఁ దెచ్చిన కర్చులను, ఆంగ్లదీవులయందు విధింపఁబడు మితిమీఱిన దిగుమతిపన్నులను లెక్కచూచియుఁ గూడ హైందవవర్తకులు తమ సరకులను ఆ దేశమున నచ్చటివానికంటె సరసముగ నమ్మఁ గలిగిరి. ఆంగ్లేయ వర్తకుల కలవరము నాంగ్లేయపారిశ్రామికజనుల యలజడియును తీవ్ర మైనది. దొరతనమువారు స్వదేశపరిశ్రమలను రక్షించుటకు దిగుమతి పన్నుల నెంతగా హెచ్చించినను బ్రయోజనముఁ గానక హిందూదేశమునుండి దూదిబట్టలుగాని, ఉన్నిగుడ్డలు గాని, పట్టుగుడ్డలు గాని, అద్దకపుబట్టలు గాని యేవియు రాఁ గూడదనియు, నట్టివానిని ఆంగ్లదేశమున దుస్తులకుఁ గాని మఱియేపనికిఁ గాని యుపయోగింపరా దని శాసనము గావించిరి. హిందూదేశపుటోడలు నాదేశమునకు రాఁ దగవనిరి.

హిందూదేశము నాంగ్లప్రభుత్వము క్రిందికి తీసికొనిన యనంతరమును హిందూదేశపరిశ్రమల కవరోధములు తగ్గలేదు. ఆంగ్లేయులు ముఖ్యముగ వర్తకజాతివా రని చెప్పవచ్చును. స్వార్థపరత స్వజనపక్షపాతమును వర్తకజాతికి లక్షణములు. అట్టి ప్రజలచే నిర్మితము లైన శాసనములు అన్యదేశీయులయెడ నాదరముఁ జూపి స్వదేశీయపక్షపాతమును వీడి సర్వజనసామరస్యమును కలిగియుండఁ జాలవు. పూర్వమునుండియు భారతభూమి యను కామధేను వని జగద్విదితమై యున్నది. కొలంబసు హిందూదేశమును గనుఁగొనఁగోరియే గదా అష్టకష్టముల బడి యమెరికాఁ గనుఁగొని కృతార్థుఁ డయ్యెను. వాని ననుసరించి పోర్చుగీసు నావికులు తుపానులకు వెఱువక ప్రాణాపాయములకు జంకక సముద్రయానములఁ జేసి హిందూదేశమునకు మార్గము గనుఁగొనిరి. క్రమముగ నితర యూరోపియను జాతులవారు తండోపతండములుగ హిందూదేశమునకు రాఁ గడఁగిరి. తుదకు ఫ్రెంచివారును ఆంగ్లేయులును వచ్చిరి దేశీయప్రభువుల యనుగ్రహమున వ్యాపారము విజృంభించినది. దేశీయపరిశ్రమలును దేశీయుల హస్తములం దున్న విదేశవర్తకమును నీరసమునఁ బడినవి. వ్యవసాయకపదార్థముల విక్రయముచే దేశీయులు జీవింపసాగిరి. ఈ పదార్థముల వర్తకమునకై పోటీలుపడి ఫ్రెంచివారు నాంగ్లేయులును హిందూదేశముననే ఘోరయుద్ధములఁ జేసిరి. తుదకు దేశీయప్రభువులు వీరియుద్ధములలో పాల్గొన నయ్యెను. ఒండొరులతోఁ బోరవలసినవా రైరి. కాని యనేకులు ఆంగ్లేయులపక్షము వహించిరి. నీతియందు జాతీయలక్షణముగఁ గాన్పించు న్యాయశీలమును గుర్తించి భారతీయులు వీరికిఁ దోడ్పడిరి. ఎట్టకేలకు నాంగ్లేయులే విజయముఁ గాంచిరి. దేశీయప్రభువులు దుర్బలు లైరి. దేశపాలనము బ్రిటిషువారి చేతులఁ బడినది. కాని భారతభూమియొక్క పారిశ్రామికార్థికస్థితులు చక్కఁబడవయ్యెను. దేశము నానాఁటికి దారిద్ర్యమునఁ జిక్కుచున్నది. ప్రజలకు వృత్తులు లేవు. వ్యవసాయ మొక్కటే బహుళసంఖ్యాకులకు శరణ మైనది. ఈ యుద్యోగమువలనఁ గూడ జీవనోపాధులు సమకూరుట దుస్తర మయ్యెను. ధాన్యపుపంట తగ్గినది. పరదేశపరిశ్రమల కనువగు ప్రత్తి నీలి జనుము కాఫీ తేయాకు మొదలగు పంటలు మిక్కుటము లైనవి. ఈపంటలఁ బండించువారికి ధారాళముగ నప్పులిచ్చు పరదేశవర్తకులు వ్యవసాయదారులను వశముఁ జేసికొనిరి. పరిశ్రమలు క్షీణింపఁగఁ బారిశ్రామికజాతులవారు గౌరవహీను లైరి. హిందూదేశము పరిశ్రమల కెన్నఁడును బ్రఖ్యాతిఁ గాంచియుండలేదనియు, హైందవులకు పారిశ్రామికనిపుణత లే దనియుఁ బూర్వమొకింత చేతిపనులందుమాత్రము గణ్యతఁ గాంచిన నాగరికయాంత్రికసాధనలఁ జేపట్టుసమర్థత వీరి కలవడ దనియు, సమష్టివాణిజ్యవిధానము వీరి తత్త్వముల కనుగుణము కా దనియుఁ బ్రకటించు బూటకపువ్రాఁతలు చరిత్రలలో నిండినవి. వానినే భారతీయులును మన పరదేశపుభ్రాతలును వేదవాక్కులుగఁ బాటింపసాగిరి. మన విద్యాధికు లెల్లరు నీ పాటనే పాడుచుండిరి.

ఇప్పుడిప్పుడు విద్యాధికులు కొందఱు పరదేశసంచారములఁ జేయుచు లోకమందలి యర్థశాస్త్రప్రవీణులవలన జాతీయమర్మములఁ దెలిసికొనుచు, స్వదేశనాశనము సమీపమున నున్న దని గ్రహించి స్వదేశీయోద్యమమును నెలకొల్పిరి. అజ్ఞానాంధకారమునఁబడియుండి ఆత్మవిశ్వాసమును నురకాలము క్రిందటనే కోల్పోయి నూటికి గుడ్డకు గతిఁగానక దీనులై యున్న భారతీయపారిశ్రామికప్రజలును కర్షకులు నీ స్వదేశీయోద్యమమహిమను గ్రహింపఁజాల కుండిరి. నూతనమార్గములఁ ద్రొక్కుటకు సాహసింప కుండిరి. దేశసామాన్యజనులును దారిద్ర్యమునే దూరదృష్టి లేనివారై సరసముగ లభించు పరదేశపు పదార్థములనే కైకొందురు గాని చాల కాలము మన్న నని యీ దృఢతరము లనియుఁ దమ సోదరప్రజలచే దయారు చేయఁబడినవనియు, వీనిని కొనినచోఁ దమ స్వదేశదీనజనులఁ బోషించు పుణ్యమును స్వదేశోద్ధరణమును జేసిన పురుషార్థమును తమకు లభించు ననియు నెంచఁజాలకుండిరి. ఇఁక ధనవంతులును పాశ్చాత్యవిద్యాధురంధరులును బరదేశాచారవేషభాషల నవలంబించినవారై స్వదేశవస్తువుల నాదరించు స్థితియందు లేరైరి. కొందఱు మాత్రము దేశోద్ధరణకార్యవాదుల వాక్కులను జెవి నొగ్గి తాత్కాలికపుటుద్రేకమును వహించిరి. ఈ యదనును కనిపెట్టి సర్వకళాశాలలం దభినవసరస్వతిచేఁ దిరస్కృతు లైన కొందఱు యువకులు స్వదేశవ్యాపారముల నారంభించి ఘనులును ధనికులును గా నెంచిరి. మానవజీవితమునఁ బ్రత్యంశమునకును గ్రమశిక్ష యవసరము. చిరతరప్రయత్నములు లేక యేపురుషార్థమును లభింపదు. ఘనతరపరిశ్రమలును వాణిజ్యమును నొక్కక్షణములో నలవడునవి కావు. మన పాఠశాలలందుఁ గఱపఁబడువిద్య లందు కనుగుణము లైనవియుఁ గావు. కావున మన యువకుల పూనికలు పూర్ణముగ ఫలప్రదములు గా వయ్యెను. అభ్యాసలోపముచేతను అనుకూలస్థితులు లేమినిఁ గొన్నియెడల నత్యాశవలనఁ గలుగు నక్రమపద్ధతులచేతను ఇట్టి విషయము లందు చిరకాలాభ్యాసము గల దేశీయవర్తకులును కళానిపుణులును లాభనష్టముల నతిజాగరూకతతో గణితముఁ జేయుచు స్వదేశోద్యమము వంకఁ బోక పోవుటచేతను నద్దానిని పూనుకొనినవారి ధైర్యోత్సాహములు నీరైనవి. ప్రతిష్ఠాపనలు నష్టపడినవి. ఈసమయమునఁ గాపాడఁగల దొక్కటియే! అది దొరతనమువారి యాదరణపూర్వకమగు వ్యాపారరక్షణపద్ధతి కానిది లభ్యము గాఁ జాల దయ్యెను.

లోపములనే గణనకుఁ దెచ్చి దేశీయుల నిరసించుచుండు నన్యదేశీయులు హైందవుల యపజయములను గోరంతలు కొండంతలుగఁ జేసి వారి యాత్మవిశ్వాసమును మొదలంటఁ ద్రుంచివేయసాగిరి. ఈ లోపములు వారి యసమర్థతకు సూచనలుగఁ బ్రకటించిరి. ఆర్థికాభివృద్ధికి మార్గము లే దనిరి. ప్రారంభదశయందు లోపములును నపజయములును హైందవులకు వాటిలిన దురదృష్టమే కా దని గుర్తింపఁజాల రైరి. ఐహికసంపదలచేఁ దులఁదూఁగుచు నవీననాగరకాగ్రగణ్యులగు పాశ్చాత్యులకు నిట్టి దశలు మొదట మొదట వాటిల్లియే యున్నవి. ఆక్షేపకులు తమ బాల్యదశను మఱచి చిన్నలను నిరసించుచు నవహసించు వృద్ధులలీల నుండిరి. లోకమున నిప్పుడు మిగులఁ బ్రఖ్యాతిని వహించియున్న ఆంగ్లదేశమునుఁ గూర్చి విచారింపుడు: 1791-1818 సంవత్సరముల మధ్య ఇంగ్లండులో వేయిబ్యాంకీలు నిర్వ్యాపారమునఁ బడినవి. 1839 సంవత్సరమున 28 బ్యాంకీలు రూపుమాసినవి. వానిలో 17 బ్యాంకీలు పూర్ణముగ దివాలాతీసినవి. 1862-వ సంవత్సరమున 300 కంపెనీ లేర్పడ వానిలో 270 కంపెనీలు కొలఁదికాలముననే వ్యర్థపడినవి. ఇంక నిట్టియుదాహరణముల ననేకముఁ జూపవచ్చును. హిందూదేశమున 1881-వ సంవత్సరమునఁ బ్రారంభమై యిప్పటికి 476 బ్యాంకీలు నిర్మితము లైనవి. వానిలో సుమారు 25 మాత్రము దివాలా దీసినవి. ఇదియు మిగుల శోచనీయమే. కాని మనకిది ప్రారంభదశ యని మఱవి పోఁదగదు.

పారిశ్రామికాభివృద్ధికి మన కవకాశ మున్నదా యనుటకు ఇంగ్లాండుదేశపుపరిశ్రమచరిత్రయే దారిఁ జూపఁగలదు. 1770 సంవత్సరమునకుఁ బూర్వము ఇంగ్లండులో పరిశ్రమలే లే వని చెప్పవచ్చును. అప్పటినుండి దొరతనమువారు ఆంగ్లపరిశ్రమాభివృద్ధికై యనేకవసతులను కల్పింపసాగిరి. పారిశ్రామికప్రజలకొఱకై సాంకేతికవిద్యఁ గఱపుపాఠశాలల నిర్మించినారు. అట్టివానియందు దభిరుచి గల విద్యార్థులను బ్రవేశపెట్టినారు. పారిశ్రామికజనుల బిడ్డల నట్టిపాఠశాలలకుఁ బోవునటుల నయమునను భయమునను దట్టపఱచి వంశక్రమాగతముగ వచ్చు నైశిద్యమును దేశసేవకై సముపార్చినారు. పరిశ్రమాభివృద్ధికిఁ దోడ్పడు కాలువలను రైళ్లను యంత్రాలయములను ప్రదర్శనాలయములను నిర్మించినారు. విద్యాధికులను దేశదేశములకుఁ బంపి యచ్చటి పారిశ్రామికవిధానములఁ దెలిసికొని వచ్చునటులఁ జేసినారు. అన్యదేశవస్తువులు దిగుమతి గా కుండ నూటికి 80 వఱకు దిగుమతిపన్నులను విధించినారు. బలాత్కారముగ దిగుమతుల నాఁపినారు. పరదేశపుటోడలను తమ రేవులకు రాకుండఁ జేసినారు "హిందూదేశమున నిర్మింపబడినవియు లండనునకు సరకులఁ దీసికొని పోవుట కుద్దేశింపఁబడినవియు నగు 10,000 టన్నుల బరువును మోయు పడవలు కలకత్తా రేవునఁ గలవు" అని గవర్నరు జనరలు వెలస్లీప్రభువు 1800 సంవత్సరమున వ్రాసినాఁడు "హిందూదేశపు సరకులు హిందూదేశమున నిర్మితము లైన నౌకలలో లండను నగరమున దిగుమతియగుటచే దేమ్సునదిలో శత్రునౌకాసైన్యము దిగినయెడలఁ గలుగునంతటికంటె హెచ్చుగ నలజడిని అచ్చటి యనన్యవ్యాపారస్వామ్యకలితులు చూపిరి. ఈ భయసూచనల యలజడి లండను రేవులోని నౌకానిర్మాణకు లారంభించిరి. తమవృత్తి నిర్మూలము కానున్న దనిరి. ఇంగ్లాండులోఁ బడవలఁ జేయువారి కుటుంబములు తిండి లేక చావవలసిన కాల మాసన్న మగుచున్న దని మొఱలిడసాగిరి" అని టేలరుగారు వ్రాసిరి. ఇట్లు ఇంగ్లాండువారు ఒకే సామ్రాజ్యములోని తోడిప్రజల యభ్యుదయమును గూర్చి మొఱలిడిరి.

వీనినన్నింటిని విమర్శించి చూచిన హిందూదేశార్థికపారిశ్రామికస్థితిని బాగుపఱచుటకు స్వదేశీయోద్యమ మొక్కటే తరణోపాయమని గ్రహింపనగును. విద్యాధికులు తమ ధీశక్తిని దేశోద్ధరణకై

వినియోగింపవలయును. ధనికులు దేశీయవాణిజ్యమును పరిశ్రమలను పోషింపవలయును. ఇందు స్వార్థమును వీడవలసివచ్చినను వెనుదీయరాదు. దేశమును జాతీయవిద్యాలయములలో నింపవలయును. హిందువులు విద్యాభ్యసనమున కిచ్చగింప'రను బూటకపుమాటలఁ గట్టిపెట్టవలయును. కూటికి గుడ్డకు గతిలేని బీదలబిడ్డలను జీవనోపాధికిఁ బనికిరానిచదువులను చదువు మనిన వారు సమ్మతింపకుంట సహజమే. కేవలము రాజకీయాలయములసేవకై మితిమీఱి ధనవ్యయకారణము లగువిద్యలఁ జదివి, నూటి కెనుబదిమంది విద్యార్థులు వ్యర్థ లగుచుండఁగ నులారఁ జూచుచు, విద్యాలయము లన్న భీతి నొందు పేదల నిందించిన లాభము లేదు. చిన్న బడులలో నేర్పు చదువులు వ్యవసాయశాస్త్రము వృక్షశాస్త్రము పారిశుద్ధ్యశాస్త్రము సామాన్యపుచేతిపనులు నేర్పునవిగ నుండవలయును. మిగుల వ్యయకారణములుగ నుండరాదు. ఏకులమువారి కా కులపువిద్యల నేర్పువసతు లుండవలయును. అనుకూల్యము లేని వృత్తులందు బాలురను బలవంతముగఁ బ్రవేశపెట్టు విద్యాపద్ధతు లుండరాదు. కులానుగతవృత్తులఁ గాపాడుచు, నట్టివానియం దభిరుచి లేనివారికి మాత్రము ఇతరసదుపాయములు లభించునటులు విద్యాపద్ధతు లుండవలయును. నాలుగక్షరము లున్నవి గదా యని ప్రతిబాలుని ననాలోచితముగ ధనాకర్షణయే గమ్యార్థముగ నెంచి యేసాంకేతికవిద్యయం దైనను సరే యని ప్రవేశపెట్టరాదు. హిందూదేశమునఁ బ్రతివృత్తికిని నియమితు లైన కులములవా రుండిరి. వారి కావృత్తులందు ప్రవేశములఁ గల్పింపవలయును. దేశకాలపాత్రముల ననుసరించి వంశక్రమానుగతవృత్తుల మార్చుకొనుటకు వసతు లుండవలయును. దేశీయపాఠశాలలు దేశీయుల పాలనమున దేశీయబాలురయభివృద్ధికై దేశీయసేవయే పరమావధిగ గలవై పరగవలయును. ఇట్టులే మధ్యమతరగతి విద్యాలయములును ఉన్నతవిద్యాలయములు నుండవలయును. వాణిజ్యసగణులను నేర్పుటకును, పారిశ్రామికనిపుణతను బలపఱచు సాంకేతికవిద్యలం దున్నతపరిశీలనలఁ బ్రోత్సహించుటకును, సకలకళలను పోషించుటకును తగినప్రతిష్ఠాపనలు దేశమున నిండవలయును. దేశీయులలోనే బాలుఁ డైనను సరియే స్వార్థమును సాధించుకొనుచు దేశసేవకర్తృతను సంపాదించుకొనువసతి లేదే యని విచారపడరాదు. ఎవఁడు నిరర్థకుఁ డైనను దేశీయవిద్యావిధానమునందలి లోపమో వానిపోషకవర్గమునందలి ధర్మభంగమో తప్ప వేఱు కారణ ముండ దని గ్రహింపవలయును. ప్రతివాని విద్యయు ధనమును సమర్థతయుఁ బ్రాణమును దేశారాధనకై అర్పితములు కావలయును. దొరతనమువారిట్టివసతుల నెల్లెడలఁ బ్రోత్సహించుచుందురు గాక. దేశీయప్రముఖులు దేశారాధనదీక్షాపరులై మెలంగుదురు గాక. ప్రతిభారతీయుఁడును దేశసేవానిరతుఁడై మెలంగుఁ గాక. సకలవృత్తులకును సమానగౌరవ మలవడుఁ గాక.

ధైర్యవంతుఁ డగు నావికబాలుఁడు

అఫీరౌడుల సూర్యనారాయణరావు గారు బి. ఏ., బి. ఎల్.

దండీ కాంతులు మెండుకొనఁగా
మండు నావను నిల్చె బాలుఁడు,
అండఁ గూలిన మృతులపైఁ బడె
నరుణకిరణములు! 1

పడవ విడిచి జనంబు లరిగిరి;
యెడఁద నుంతయు వెఱఁగుఁ జెందక
కడు మనోహరమూర్తి యై యొక
న్పడియె బాలకుఁడు! 2

జ్వాల లెగసెను; గుబులుకొనె పొగ;
కాలు కదపక తండ్రి యానతి
గోరి నిలిచెను, తండ్రి మరణ
ద్వారమున నుండెన్. 3

ముగిసెనే నా విధులు తండ్రీ?
ముగిసెనేనియు నానతిమ్మా!—
ముగిసె జనకుని జీవిత మ్మని
యెఱుఁగ దర్భకుఁడు! 4

పలుకుమయ్యా! పడవ విడువఁగ
వలనుపడునే? పలుకు తండ్రీ!—
పల్కె మాఱు ఫిరంగిరవములె,
ప్రజ్వరిలె మంటల్! 5

నీలి కురులను మేలి మోమున
జ్వాలికావళి నాల్కసాఁచెను;
బాలుఁ డచ్చట ధైర్య మూని ని
రాశతో నుండెన్. 6

తిరిగి బాలుం డఱచె: "తండ్రీ!
అరుగ కింకను నాఁగవలెనే?"—
బాలుమీఁదుగ పడవమీఁదుగ
పఱచె నగ్నిశిఖల్. 7

కాల్చి రగిలి మహోగ్రవైభవ
లీల నౌకను ముంచె జ్వాలలు,
బాలకునిపై నెగయు మను జం
డాల పోలికను! 8

పిక్కటిల్లె నొక యుఱుము శబ్దము—
అక్కటా! యెట నుండె బాలుఁడు?
ముక్కలుగ నావను విదల్చిన
గాలులే యెఱుఁగున్. 9

చటులపవనప్రేరితము లై
యిటునటులు చనెఁ బడవ తునుకలు;
అట నశించిన యన్నిటను బసి
యాత్మయే ఘనము! 10

భారతవర్షము — మహాసామ్రాజ్యము

అప్పికట్ల సూర్యనారాయణమూర్తి గారు

ప్రస్తుతమునందు ప్రపంచమునం దెల్లెడలను నూతనజాతీయాశయము లుద్భవించి నూతన స్వేచ్ఛావాయువులు వీచుటకు కారణము లగుచున్నవి. అంతర్జాతీయ జీవనమును పవిత్రతఁగావింపఁ జేయుటకును ప్రతిదేశమునకు స్వయంనిర్ధారణసూత్రము ననుసరించి రాజకీయార్హత నొసంగుటకును మిత్రమండలివారు పనిఁబూనియున్నారు. సంయుక్తరాష్ట్రముల మహాధ్యక్షుఁడగు విల్సను మహోదారుఁడు ప్రతిదేశమునకు సాధ్యమగునంతవఱకు తద్వాంఛానుసారముగఁ బ్రత్యేకవ్యక్తిత్వము బ్రసాదింపఁజేయుటకు కంకణముఁగట్టుకొని యున్నాఁడు. యూరపుదేశమునఁ గొలదికాలమున దేశముల భావిస్థితి నిర్ణయించు రాయబారులసభ గావింపబడ నున్నది. ఆ సభకు మన భారతసమువారపక్షమున నీదేశప్రతినిధిగ సత్యేంద్రసిన్హాగారు నియోజింపఁబడి యూరపుఖండమున కేగియున్నారు. రానున్న సభలయందు మన దేశపు హక్కులఁగూర్చియు నఖిలసామ్రాజ్యమునందు దాని కీయవలయు నర్హస్థానమును గూర్చియు తప్పక విచారింపఁబడును కావున నావిషయముఁగూర్చి మన మాలోచించుట కర్తవ్యమును సమంజసమును అయియున్నది.

మన దేశమందు రాజకీయస్థితిఁ దెలిసికొని గమ్యస్థానముఁగూర్చినజ్ఞాన ముదయించిననాటనుండి మన దేశనాయకు లందఱును మన గమ్యస్థానము సామ్రాజ్యాంతర్భూత మైన స్వరాజ్యమే యని నొక్కి వక్కాణించుచున్నారు. స్వలాభాపేక్షితు లగు అనధికారాంగ్లవర్గమును అధికారవర్గప్రేరితు లగు సంకుచితమనస్కులును మఱి కొందఱును తప్ప తక్కినవా రందఱు మనకు స్వరాజ్యము నీయవలె నని పాలకులకు మొఱ్ఱపెట్టుచున్నారు. ప్రతిదేశమునకు దానికి సంబంధించు రాజకార్యములందు ప్రత్యేకస్వాతంత్ర్యము నొసంగుటచే సామ్రాజ్యపటుత్వమున కెంత లాభకరముగ నుండునో ఆంగ్లరాజనీతిజ్ఞులు గమనించి యుండక పోలేదు. 1879-వ సంవత్సరమునఁ బ్రజాప్రతినిధిసంఘమున గ్లాడ్‌స్టన్ మహారాజతంత్రవేత్తచే నైర్లండు విషయమై చెప్పఁబడిన వాక్యము లన్నియు సామ్రాజ్యపుభాగము లన్నిఁటికిని వర్తించును. కావుననే గడచిన ఆగస్టునెల 20-వ తేదిని మనకు స్వరాజ్యసంస్థాపనల నిచ్చెద మను ప్రజాప్రతినిధిసంఘపమక్షమున నాంగ్లమంత్రివర్గపక్షమున హైందవదేశసంస్థానకార్యదర్శి వాగ్దానముఁ గావించియుండెను. సామ్రాజ్యభీష్ముం డనఁదగు మోర్లే ప్రభువు గారిచే సూచింపఁబడినట్లు ఈ స్వరాజ్యసమస్య ద్విగుణముగ నున్నది. ఈ దేశమునఁ బ్రజాభిప్రాయములకు సంపూర్ణప్రాముఖ్యత నొసంగుచు బాధ్యతాయుతపాలనమునకు వలయు సంస్థాపనల నన్నిఁటిని నెలకొల్పుటకు చేయనగు రాజకీయసంస్కరణములను చేయుటయు నీ దేశమునకు నఖిలసామ్రాజ్యమునందు నధినివేశరాజ్యములతో సరిసమాన మగు రాజ్యముగ నిర్ణయించి వాటితోఁబాటు సమాంశము నేర్పరుచుటయు నీసమస్యకు ప్రధాన విషయములు. మొదటిదానిఁ గూర్చి ప్రస్తుతమునఁ గొంతవఱకుఁ బ్రయత్నములు గావింపబడుచున్నవి. ఇఁక రెండవ విషయముఁగూర్చి మన మాలోచింపవలయును.

ప్రస్తుత మంత మందిన మహాసంగ్రామ మారంభింపకముందే సామ్రాజ్య మంతయును సాంఘాతికముగా నేర్పరుపవలయు నని పెక్కురు తలంచుచుండిరి. ప్రపంచమం దిది ఒకవంతుగ నుండి కోటిమైళ్లకు పైఁబడు వైశాల్యముఁ గలిగి నలువదికోట్ల ప్రజలచే నివసింపఁబడు నీసామ్రాజ్య మంతయుఁ గొలదిమంది యుద్యోగస్థులచేఁ గార్యనిర్వహణ మొనర్పఁబడుచున్నది. అదిశేషుఁడు మోయు భూభారముకంటె నెక్కుడగు నీ భారము కొలదిమందిచే భరించుటకు సాధ్యము కాదు. ఇఁకముందు అంతర్జాతీయసమస్య లెక్కుడగుటచేతను మాతృదేశమందు సాంఘికపురోభివృద్ధికి వలయు సంస్కరణము లెక్కుడుగ విచారింపఁబడవలసి యుండుటచేతను సామ్రాజ్యపు విషయములు ఆంగ్లమంత్రివర్గముచేఁ గ్రమముగ నెఱవేర్పబడఁజాలవు. కావున, సామ్రాజ్యపు భాగము లన్నియు వేరువేరుగఁ బ్రత్యేకవ్యక్తిస్వరూపములతో నిర్ధారించి వాటి నన్నిఁటిని మాతృదేశ పోషణార్థమై సాంఘాతికముగ చేర్పవలయు నని ఆంగ్లరాజవిశారదులు వెల్లడించుచున్నారు.

1872-వ సంవత్సరముననే ప్రఖ్యాతిఁగన్న డిస్‌రాలి యను ప్రధానమంత్రి యీ విషయమై సూచనలఁ గావించియుండెను. రాజనీతిశాస్త్రనిపుణుఁడగు సిడ్నిలో గారు తాము ప్రచురించిన ఆంగ్లపాలన విధాన (Governares of Ingland) గ్రంథమందు సామ్రాజ్యఘనభారమును చులకనఁ జేయుటకు దాని వేర్వేరుభాగము లన్నిఁటికిని సర్వస్వత్వములఁ బ్రాప్తింప జేయుటయే ముఖ్యవిషయ మని వ్యక్తీకరించియున్నారు.

ఈ సమస్యలను విచారించుటకును ఈ విషయపు సంస్కరణములఁ బ్రవేశపెట్టించుటకును 1884-వ సంవత్సరమున సామ్రాజ్య సాంఘాతికసమితి (Imperial Federation League) యను సంఘము స్థాపింపఁబడెను. వలసరాజ్యములలోఁ గొన్నిటియందు సంపూర్ణముగను మఱికొన్నిటియందు కొంతవఱకును స్వరాజ్యము సాగుచున్నది. ఆస్ట్రేలియా కనడా దక్షిణాఫ్రికా మున్నగు దేశములు మాతృదేశముపై నభిమానముఁ గలిగి దానియందు గురుభావమును చూపుచున్నవి ఆ కారణమున యుద్ధపు సంధివిషయములయందు వాటి నాలోచింపకుండుట యుక్తము కానేరదు. న్యూజీలండు దేశమునకుఁ బ్రధానమంత్రి యగు సర్ జోసఫ్ వార్డు గారు ఈ విషయమై గట్టిగ చెప్పియున్నారు. మాతృదేశమందుండు కార్యనిర్వాహకమంత్రివర్గము సామ్రాజ్యము అంతయును సంగ్రామమునందు దింపునప్పుడు, సంగ్రామవిజయమునకు వలయు సైనికపరికరముల సమకూర్చుటయందు వలసరాజ్యములు తమ యిచ్ఛానుసారముగ నడుచుకొనుటకు వీలున్నది. కావున నట్టి విషయములందు అన్యోన్యము సమాధానము లుండుటయే మంచిది. కావున ఈ విషయముఁ గమనించి నాలుగు సంవత్సరముల కొకపర్యాయము లండను నగరమున స్వరాజ్యము ననుభవించుచున్న అధినివేశరాజ్యపు ప్రతినిధులును ఆంగ్లమంత్రివర్గపుప్రతినిధులును సభగాఁ గూడి సామ్రాజ్యవిషయము లాలోచించుచుండిరి. ఈ సభలకు సంపూర్ణముగ స్వరా

జ్యము గలిగిన కెనడా ఆస్ట్రేలియా మొదలగు దేశములు మాత్రమే ప్రతినిధులఁ బంపుట కర్హత గలిగియుండెను. సామ్రాజ్యమునకు మణిప్రాయమై మెఱయు భారతవర్షమునకు మాత్రము ప్రాతినిధ్య మొసంగఁబడియుండలేదు. సామ్రాజ్యాభివృద్ధికి మన మెంతతోడ్పడినను, మనల కొటిగాండల బాహ్యాంతర ప్రదేశములయందే యుంచియుండిరి. వలసరాజ్యము లన్నిహక్కులను గలిగి మాతృదేశముతో సమానముగనున్నప్పుడు మనల నొకపాలికాపుగా నుంచియుండిరి. ఈ కారణముచే దక్షిణాఫ్రికాయందు మనదేశీయులు పడిన యిక్కట్లును, గంధి మహాత్ములు పడిన కష్టములును ఇంకను మన మనంబులకు మఱపురా దయ్యెను. ఆస్ట్రేలియాదేశమునకు మన దేశస్థు లెవ్వరును పోఁగూడ దని శాసించియున్నారు. కెనడా దేశమునకు పోవుటకుఁ గూడ ననేకములు నిర్బంధము లున్నవి. ఇవి యన్నియు నిట్లుండ మన దేశమునకు ఆ దేశస్థు లందఱును యథేచ్ఛగా రావచ్చును. వారు మనలఁ బాలించు నుద్యోగులుగా నుండవచ్చును. వీరు మన దేశపు భూమ్యాదాయముల నన్నిటిని యనుభవింపవచ్చును. ఈ యన్యాయమునుఁ గూర్చి పలుమారు మన నాయకు లందఱు పాలకులకు నివేదించియున్నారు. 1915-వ సం॥మున మన సామ్రాజ్యశాసనసభయందు అఖిలసామ్రాజ్యప్రతినిధులసభలోపనకు ప్రాతినిధ్య ముండవలయు నని మనవారు కోరియుండిరి. అప్పటి రాజప్రతినిధి యగు హార్డింజి ప్రభువు మన కోర్కెలను సఫలము చేయనెంచెను కాని ఈ ప్రాతినిధ్యము హైందవప్రజాపక్షమున నొసంగబడియుండలేదు. ప్రప్రథమమున మన దేశీయులను రానిచ్చిన 1917-వ సం॥పు సభయందు వీరు ప్రతినిధులుగఁ బోయి యుండలేదు. అధికారవర్గముచే నియమింపఁబడి మన దేశపు సంస్థాన కార్యదర్శికి సహాయులుగ వీ రంపఁబడియుండిరి.

కనుక యుద్ధానంతర సంస్కారణములందు మనము గట్టిగ పాలకులకు నివేదింపవలసిన విషయములందు హైందవదేశమునకు సంపూర్ణముగ స్వరాజ్యము ననుభవించుచున్న అధినివేశరాజ్యములతో సమానమగు నున్నతస్థానమును సామ్రాజ్యమును ఈయవలసి యుండు ననుట ప్రధానమై యున్నది. ఈ సామ్రాజ్యప్రతినిధుల సభయందు ఈ దేశమునకుఁ బ్రాతినిధ్య మొసంగి, మన సంస్థాన కార్యదర్శికి సహాయులుగా గాక, ప్రత్యేక వ్యక్తిత్వముతో వీరు సంచరించుటకు వీలుండవలెను. వీరు ప్రజలపక్షమున నెన్నికల మూలమునఁ బంపఁబడవలెను. లేకున్న మన యభిప్రాయములు సభలందు తెలియఁబడ నేరవు. ఇందుకు నిదర్శనముగ నొక లుదాహరణము చాలును. ఇదివఱకు అనేక సం॥ముల నుండియు మన పరిశ్రామికాభివృద్ధికి స్వయంరక్షణానుసారము (Protection) వర్తక ముండవలె నని మనము కోరుచున్నాము. కాని మన రాజకీయవ్యాపారములను జరుపు అధికార్లందఱు నాంగ్లప్రజల యనుమతికి లోఁబడియుండ టచే వారికి హితవగు స్వేచ్ఛానువర్తకమే (Free Trade) యుండవలె నని అనుచున్నారు. కనుక, అధికార్లచే నియమింపఁబడిన ప్రతినిధులీ విషయమునందు తమ యభిప్రాయములను చెప్పుటకు వీ లుండదు. అధినివేశరాజ్యముల పక్షమున నాయాదేశముల మంత్రులే పోవుచున్నారు. గాన, మన దేశమునకుఁ గూడ అధికార్లే ప్రతినిధులుగ నుండవలె నని మనకు సమాధాన మిచ్చుచున్నారు. కాని ఆ దేశము లందు సంపూర్ణ మగు బాధ్యతాయుత పరిపాలన ముండుటచే, మంత్రులు అధికార్లైనను నిజముగ ప్రజల సమ్మతికి లోఁబడి, వారి యిచ్ఛానుసారముగ నెన్నుకొనఁబడినారు. ఈ విషయమును గమనించి మన శాసనసభ్యు లీ ప్రాతినిధ్యమును కోరునపుడు ఎన్నికల మూలమున జరుగవలె నని కోరియున్నారు.

మన యాశయములు సంతృప్తి నొందగల వనుటకు కారణములు కాన్పించుచున్నవి. సంగ్రామమందు సామ్రాజ్యపు టితర సైనికులకు తీసిపోని పౌరుషముతో మన దేశస్థులు పోరాడియున్నారు. ఆబాలగోపాలము భారతీయులు తమ శక్తిసామర్థ్యములను తమ ధనసత్వములను విజయార్థమై యర్పించి, తమ గౌరవనామమును నిలవబెట్టుకొని యున్నారు. ఈ విషయము మన పరిపాలకులచేఁ గనిపెట్టబడి యున్నది. మాతృభూమియందే కాక, అధినివేశరాజ్యములందు గూడ దృక్పథము మారుచున్నది. మనము సామ్రాజ్యమునకు నిష్కామమున గావించియున్న మహోపకారమునకు ప్రత్యుపకారముఁ జేయుటకు వీరి మనంబుల నూహ జనించుచున్నది. ఇందుకు నిదర్శనముగ కెనడా దేశమునకుఁ బ్రధానమంత్రి యగు సర్ రాబర్టు బోర్డన్ గారు వారి దేశపు ప్రజాప్రతినిధిసంఘమున గావించిన ప్రసంగమే తార్కాణము. సామ్రాజ్యప్రతినిధిసభలయందు మన దేశస్థులు చూపిన శక్తిసామర్థ్యములను గూర్చి పొగడుచు అధినివేశరాజ్యములం దుండు ప్రజలకు మనపై నుండఁదగు నభిమానముఁ గూర్చి యిట్లు ముచ్చటించిరి.

"India has been splendidly loyal in this war and has contributed her manhood and her treasure for the purpose of enabling us to win it. We must take that all into account. Her civilisation is different from that of ours. It is more ancient in some respects, and may be said to be on a higher plane. There is more of idealism in this civlisation, more perhaps of materialism in ours. I am not disposed to discuss whether one or the other is superior, but I do say that the Indian civilisation is entitled to our respect and that we must do our part in making the inhabitants of that great dependency of the Empire feel that they are not treated with contumely or injustice by the people of any of the Dominions".

ఈ నూతనాభిమానము ననుసరించి, మన దేశమునకు నధినివేశరాజ్యములకును ఉండఁదగు నన్యోన్య సమాధానముఁ గూర్చి మన ప్రతినిధి యగు సత్యేంద్రసిన్హా గారిచే నివేదింపఁబడిన విషయములఁ గూర్చి ప్రస్తుతమునఁ జట్టనిర్మాణము కావింపబడుచున్న దని తెలియుచున్నది. ఇది యెంతయు శుభసూచకము.

పాశ్చాత్త్య సంఘ విప్లవము

బారిష్టర్ ఎన్. వి. ఎల్. నరసింహారావు పంతులు గారు ఎమ్. ఏ. ఎల్.ఎల్.బి., (ఆనర్సు)

పంధొమ్మిది వందల పదునాఱవ సంవత్సరపు సంచికలో ఈ విషయమును కొంతవఱకు చర్చించితిని. 19-వ శతాబ్ది నాఁతగొని యుద్ధమునకు పూర్వము వఱకు సంఘమునందు జరిగిన మార్పులను సంగ్రహముగ వివరించితిని. పాశ్చాత్త్యసంఘము నాస్తికమై ధనాశా పిశాచావిష్టమై దయాశూన్యమై నాగరకత జాతీయత సార్వభౌమత యను మాయికనామములతో విజృంభించి ప్రపంచమును దాఁటఁగొన సాహసించెను. ఈ ప్రపంచదండయాత్ర అలెగ్జాండరుతో నంకురించి రోమకసామ్రాజ్యరూపమున వృద్ధిఁగాంచి నెపోలియను మూలమునఁ బుష్పించి బ్రిటిషు సామ్రాజ్యరూపముగ ఫలించినది.

పాశ్చాత్త్యనాగరకతకు ముద్దుకూఁతురు జాతీయత. పాశ్చాత్త్య నాగరకతకు పర్యాయపదము మాన్చెష్టరువారి మతమున స్వబలాధారము. మానవునకు జీవయాత్ర గడపునపుడు భగవంతుఁడు దక్క వేఱు సహాయము లేదనియుఁ దన కర్మఫలములకు దానే కర్త యనియు దీని కర్థము కాదు కాని, మానవుని తన శక్తిసామర్థ్యములకు వదలినయెడల, వాఁడు వీలు కలిగినంత సౌఖ్యమును పడయఁగలఁడు బెన్థముగారి యుపదేశమును ఇదియే! వీరు ప్రపంచమునందు మానవునికి మనోరథములను తత్పూరణలమానుపట్టి సౌఖ్యావధిని నిర్ణయించుచున్నారే కాని కోరికలు నశించుటచేత శాశ్వతసౌఖ్యమును పడయవచ్చు ననుటను వారెఱుఁగరు. ఈ సిద్ధాంత మైహికాముష్మిక విచక్షణశూన్యము ఇది ప్రపంచమునందు మనోరథపూరణజనిత మగు సుఖక్షణమునకును తద్విసర్జనజనిత మగు బ్రహ్మానందమునకును ముడివెట్టుచున్నది. మనోరథము వృద్ధి యగు కొలఁదిని సుఖాభివృద్ధి యగు ననియు మనోరథసాధనకై యెట్టి విపత్తుల నైనను దాఁటవలె ననియు నిందలి రహస్యము. ఇద్దాన సాత్త్వికముశూన్యమై రజోగుణము వేయిరెట్లుగ వృద్ధియై అహంకారరూపమును దాల్చెను. ఇట్లగుటచేతఁ గొన్ని యుపయోగములు ప్రపంచమునకుఁ గలిగె ననుట నిక్కము. సృష్టికర్త లనఁదగు మహాత్ములు అనేకులు బయలుదేరి జలవాయు బంధనకరము లగు కల్పనల ననేకములఁ గావించిరి.

మానవుఁడు స్వసామర్థ్యములను పూర్ణముగఁ గనఁగొనలేక పోయినను ఇతరము లగు నుపయోగములను చాలవఱకుఁ గనుఁగొనెను. కాని, స్వతేజోవిజృంభణకై జాతీయత యను పేరుతో నహంకారమును ఒకొరి దేశములపై నొకరు పురియించిరి. పాశ్చాత్త్యదేశీయుల నాగరకత దేశభేదమును పట్టి భిన్న మగుచుండును. పైని చెప్పిన యహంకారమే అలెగ్జాండరును తూర్పు దిక్కునకును జూలియసు సీజరును రోమకరాజ్యస్థాపనకును బ్రోత్సహించినది. ఇంత యేల? మొన్నటి యింగ్లాండు జర్మనుల యుద్ధమునకుఁ గూడ నిదియే కారణము.

స్వశక్తిప్రదర్శనోత్సాహము స్వజనవాత్సల్యాశాకమై ధనికులకు మఱింత ధనాశయు, బీదలకు పేదఱికమును వృద్ధి చేసినది. దేశములయందు సైనికదళములు హెచ్చినవి. మనుజులు సంఘము దేశము పరస్పర మాత్మఘాతము నొనరించుకొనుచున్నవి. మానవుని జన్మమునకుఁ గల నిక్కము లగు ఫలములను మఱచి ధనార్జన దేశసంపాదనములే ముఖ్యఫలము లని తలఁచుచున్నారు. దేశస్వాతంత్ర్యముకొఱకు మానవస్వాతంత్ర్య మడుగంటింపఁబడినది. పశ్చిమ మందెల్లెడలను ధనవంతుఁడు బలవంతుఁ డయ్యెను. మానవుఁ డైహికేచ్ఛలచేత నాముష్మికములను మఱచెను. ఇట్టి మానవజీవితమునకు ఈ గాసిదులనుండి ఎట్లు ముక్తి చేకుఱు నని మేధాశీలురు ప్రశ్నింప సాగిరి.

అలెగ్జాండరు అకాలమృత్యువు వాతఁ బడెను. రోమసామ్రాజ్యము నశించెను. నెపోలియను కాలయమునిఁబోలె రణరంగమున ననేకుల నిహతులఁ గావించి చివఱకు స్వజాతివంచితుఁ డయ్యెను. ఈ విధమున సామ్రాజ్యములను నెలకొల్పినలాభ మేమి యని జనులు ప్రశ్నింపసాగిరి.

సమానస్వత్వములు గల మానవులలో ఒకొరికింకొకరు సేవక ధర్మముల సేల చేయవలయు నని నియట్స్సె మున్నగువారు విమర్శింప సాగిరి. సర్వసమత్వమును వహింపవలయు నని రూసో ప్రభృతులు చాటిరి. మానవసమత్వము దయవలన నుద్ధరింపఁబడవలయు నని టాల్స్టాయి బోధించెను. ఈ పై బోధనల నాధారముగఁ గైకొని పశ్చిమ దేశజులు స్వబలాధారులు సంఘాధారులని రెండు విధములుగ నున్నారు. ప్రకృతపు సామ్రాజ్యాశయులు, లేక కైజరిస్టులు, తొలివారు. రెండవ వారు ముత్తెఱఁగులు: (1) స్టేటు సోషలిస్టులు అనఁగా ప్రభుత్వముఁ జేయువారే వస్తుసామగ్రిని సమముగ నీయవలె నని కోరెడివారు. (2) కమ్యూనిస్టులు: అనఁగా పంచాయతీల మూలమున సమత్వ మేర్పడవలె నని కోరువారు. (3) ఎనార్కిస్టులు: అనఁగా యథేచ్ఛాసంచారులు. ఇందు చివఱి యిద్దఱును, జాతిభేదమును పాటింపక మానవుల కందఱకు సమత్వము వలయు నని కోరెడివారు.

సంఘాధారుల బలము హెచ్చు కొలఁది స్వబలాధారులు జంకి వారితో సమాధానముఁ జేసికొనుటకై పన్నిన పన్నుగడయే కోఆపరేటివు సంఘము. అయినను, మాఱ్పాటు నొందక తప్పినది కాదు. జర్మని క్రమక్రమముగ సంఘాధారులచేతఁ బడి కైజరు మూలముగ రణరంగమున నవతరించెను. ఉభయకక్షులును తీవ్రముగఁ బోరినవి. రష్యా నాశన మయ్యెను. ఫ్రెంచి వీరు లనేకులు నిహతులైరి. అమెరికనులు ఫ్రెంచివారికిని మన నాయకులకును ప్రాణదానము నొసఁగిరి. రక్తపాత మమితముగ నయ్యెను. దీనఁ బ్రపం

చము పావన మయ్యెనా? యని వారిలో వారు ప్రశ్నించికొనిరి. జనులు చివఱ కిది యంతయు స్వబలాధారుల పన్నుగడ యని యెఱింగిరి. టాల్‌స్టాయి బోధనలను జనులు మఱల స్మరించిరి. కాని, పరస్పరముఁ బ్రేమ యెట్లు కలుగును? ప్రస్తుతము సంఘమునకుఁ గల వేలుపురుగుల నేరి తీసివేయుటకు బదులుగ సంఘమునే నిర్మూలింప మొదలిడిరి. ఇట్టివారే బోల్షివిక్కులు. వీరికి లేనిన్ అనునతఁడు నాయకుఁడు.

ఇది యిట్లుండ, అమెరికాదేశనాయకుఁడగు విల్సన్ ప్రపంచమునందు శాంతిసంస్థాపనార్థమై ఫ్రాన్సులో గొప్ప సభ చేయుచున్నాఁడు. విల్సను మహోత్కృష్టము లగు నాశయములు గలవాఁడును మన్రో డాక్ట్రిను పక్షపాతియునై యున్నాఁడు. అనఁగా విదేశీయుఁడు అమెరికాదేశభాగముల నధినివేశనములుగఁ జేసికొనఁగూడ దనెడివాఁడు. అట్లు చేయనంతవఱకు నితర రాజ్యాంగవేత్తలతని యాశయముల నెట్లొప్పుకొందురు? కాన, అతని ప్రయత్నము లుపేక్షార్హము లయ్యెను. ఈతని స్వయంనిర్ణయసూత్రము అధికారపత్రముగఁ బరిణమించెను ఈ సభాపర్యవసానమును మెత్తని మాటలతో మర్మచ్ఛేదక కార్యముల నొనర్చుట యని గాని ఉంగరపు వ్రేళ్ళ మొట్టు అని గాని యనవచ్చును.

ఇఁక స్వయంనిర్ణయసూత్రము అమలునకు వచ్చుట దుస్సాధ్యము. స్వతంత్రజీవనాపేక్ష లేనివారు బానిసలు. అమెరికాలోని నీగ్రోలు బానిసతనమును విడిపింపవద్దనిరి కదా! మన దేశమువారు పూర్ణముగ స్వరాజ్యమును కోరలేకపోయిరి. కనుక, స్వయంనిర్ణయసూత్రముకంటె రూసో గారి స్వాతంత్ర్యము శ్రేష్ఠతరము.

ఏది యెట్లున్నను ప్రపంచమునందు సంక్షోభము మాత్రము పెచ్చు పెరిగినది. ప్రస్తుతస్థితి యెవ్వరికిని గిట్టదు. ధనమును సమముగఁ బంచుకొనవలయు ననుతృష్ణ యున్నంతవఱకు సంఘాధారులకు జయము శూన్యము. తాత్కాలికమగు జయమును పొందినను అది శాశ్వతము కాఁజాలదు. మానవుఁడు వాంఛాత్యాగముచేత శాశ్వతసుఖమును బడయవలయునే కాని వాంఛాభివర్ధనముచేత పొందఁజాలఁడు.

మానవుని ఘాతఁ జేసి రాజ్య మేలుటకంటె ప్రేమించి మోక్షము నొందుట సుకరము. బోల్షివిక్కులు దీని నెఱుఁగునంతవఱకు జయముఁ గాంచలేరు. మన దేశమునందును సంక్షోభము చలించుచున్నది. గాంధి యిచ్చట దీనిని నడపుచున్నాఁడు. ఈయనకుఁ గల యాయుధము ప్రేమ. ప్రేమ దుర్జనులను సైతము దూషింపఁజాలదు. దూషణభూషణలను సమముగాఁ జేకొనకుండుట ప్రేమసాంద్రునకు కాని పని. ఇట్లనినందులకై బుద్ధిమంతులు నన్ను క్షమించెదరు గాక. సత్యాగ్రహసాధనముతో మన గాంధి పాశ్చాత్త్యులపై దాడి వెడలినాఁడు. ప్రాచ్యపాశ్చాత్త్యులలో నెవ్వరికి జయము గలుగునో చెప్పఁజాలము. సత్యాగ్రహమే తీరున విజయముఁ గాంచునదియు భావికాలమునఁ గాని నిర్ణయింప వలనుపడదు. గాంధి మహాశయుఁడు ప్రేమ యను మహాయుధముతో దిగ్విజయముఁ జేసి ధనపిశాచావిష్టమైన పాశ్చాత్త్యదేశమునకు ప్రకృతిసిద్ధమగు వైరాగ్యమును గఱపి పవిత్రత కలుగున ట్లొనర్చుఁ గావుత!

ఆత్మస్వాతంత్ర్యము

కొమరాజు హనుమంతరావు గారు

మానవుఁడు కేవలము అసహాయస్థితిలో జనించును. తన పోషణమునకయి ఏకార్యమును చేసికొనుటకును శైశవమునఁ బూర్తిగ నసమర్థుఁడు. తల్లి లేవనెత్తి వానికి పాల నీయవలయును నీళ్లఁబోయవలెను తండ్రి వాని కావశ్యకములగు సమస్తవస్తువులను సమకూర్పవలెను. తల్లిదండ్రులు ఎన్నియో శ్రమల కోర్చి యెన్నివిధములనో యుపచారములను చేసినఁ గాని శిశువు పెరుఁగఁజాలఁడు. తల్లిదండ్రులు గృహమునందు కట్టుబాటులను చేసియుండుటచేత కాలము గడచినకొలఁది బిడ్డ వివిధమార్గములఁ బెంపొందును. అట్లు పెరిగిన తరువాత బిడ్డ పాఠశాలకుఁ బోయి విద్య నభ్యసించుటయు, సంఘమునందు తోడిమానవులతో సంబంధము కలిగి వ్యవహరించుటయుఁ దటస్థించును. అటుపిమ్మట వాఁడు రాజ్యాంగమునఁ బాల్గొనుచు దేశమునకై పాటుపడును. గృహమునందువలె సంఘమునందును, రాజ్యాంగమునందును చేరి జీవించుటవలన మానవుఁడు క్రమాభివృద్ధిఁ గాంచుచున్నాఁడు. సాంఘికాచారనియమములను రాజకీయశాసననిబంధనములను పాటింపనియెడల, వానికి సంఘమునందును రాజ్యాంగమునందును స్థానము దొరకదు; వాని కెట్టి యభివృద్ధియుఁ గలుగదు. గృహమునకు సంఘమునకు రాజ్యాంగమునకు వశుఁడై విధేయతతో నియమములను అనుసరించి క్రమవికాసముఁ గాంచుట మనుష్యునికి సహజమగు జీవనవ్యాపారము. అందువలననే మనుష్యుఁడు సంఘజీవి యని పిలువఁబడును. సంఘమునం దున్నంతవఱకే వానికి జీవనము నభివృద్ధియును. సంఘమును విడిచినతోడనే వాఁడు కృశించి నశించును. శాఖ వృక్షముతో జేరియున్నప్పుడు, చిగుర్చును పుష్పించును ఫలించును. కాని అది వృక్షమునుండి విడివడునేని వాడి మోడై వినాశముఁ జెందును. అట్లే మనుష్యుఁడు సంఘము ననుసరించిన వర్ధిల్లును; సంఘమును వీడనాడిన మృతిఁ జెందును.

ఇఁక మానవునికి ఆత్మస్వాతంత్ర్య మెక్కడ? గృహమునకు సంఘమునకు రాజ్యాంగమునకు లోఁబడ వుండినచో వానికి జీవనమే లేనప్పుడు, వాఁడు స్వాతంత్ర్యమును జూపుట కవకాశ మేది? ఏహద్దు ఏపద్ధతి లేకుండ విచ్చలవిడిగ చరించుట స్వాతంత్ర్య మని తలపోయువారలకు గృహము సంఘము రాజ్యాంగము కారాగృహములవలెఁ దోఁచును. స్వాతంత్ర్యమునుఁ గూర్చి వారి కున్నయభిప్రాయము సరియైనది కాదు. సృష్టిలోని సమస్తపదార్థములు సకలపశుపక్ష్యాదులుఁ గొన్నినియమములకు లోఁబడియే యున్నవి. అవి ఆ నియమముల నంధప్రాయముగ ననుసరించును. ఆనియమముల ప్రయోజనముఁ దెలిసికొని అవి వానిని అనుసరించుట లేదు. పరిశీలనాశక్తి లేని జడపదార్థములకు, పశుపక్ష్యాదులకు నియమములు బాహ్యములు. మానవుని విషయమున నట్లు గాదు. యుక్తాయుక్తములను విచారించు సామర్థ్యము వానికిఁ గలదు. తనయొక్కయుఁ దన చుట్టునున్న సృష్టియొక్కయు స్వభావమును తెలిసికొనుశక్తి వానికిఁ గలదు. తనలోని జీవనమే బాహ్యమునను ఉన్నట్లు గాంచి గృహముతో సంఘముతో రాజ్యాంగముతో నైక్యము గాఁగలఁడు. యోజనాశక్తిఁ గల యాత్మ మానవునియందు నిద్రించుచున్నంతకాలము, గృహము సంఘము రాజ్యాంగము తనకు వెలుపల నున్న వనియు, వాని నియమములు తనకు కేవలము బాహ్యము లనియు వాఁడు తలంచును. అవి యన్నియు మహాబంధనములుగఁ దోఁచి వాని నతిక్రమించుటయందే తనస్వాతంత్ర్యము గల దని వాఁడు భ్రమించును. మానవాత్మ మేల్కొని వికాసము నొంద మొదలుపెట్టిన దాదిగ క్రమక్రమముగ బాహ్యాంతరములు రెండును ఏకమై మానవుఁడు గృహముతోడను సంఘముతోడను రాజ్యాంగముతోడను ఐక్యతను బడయును. గృహసంఘరాజ్యాంగనియమములు తన నియమము లనియు వానిని అనుసరించుట తనను తాను అనుసరించుటయే యనియు, వాఁడెప్పుడు ఎఱింగి బాహ్యబంధనము నెచ్చటను గాంచక సంపూర్ణస్వాతంత్ర్యము ననుభవించును. బాహ్యశాసనములుగఁ గాన్పించినవి అంతశ్శాసనములుగ మాఱిన తోడనే స్వాతంత్ర్యము లభించును. ఏశాసనములకును లోఁబడక స్వచ్ఛందవృత్తిని మెలఁగుట స్వాతంత్ర్యము గాదు. పశుపక్ష్యాదులవలెఁ గాక నియమములయుపయోగము నెఱిఁగి అవి తనవి యని తెలిసికొని వాని కనుగుణముగ వర్తించుట మానవుని ధర్మము. "Deliverance is not for me in renunciation. I feel the embrace of freedom in a thousand bonds of Delight."—విసర్జనమునందు నాకు ముక్తి లేదు. ఆనందకరము లగు సహస్రబంధనములందు స్వాతంత్ర్యముయొక్క యాలింగనమును నేను బడయుదును. అని కవిశేఖరుఁ డగు రవీంద్రుఁడు గానముచేసిన మహాసత్యము ప్రతిమానవుని జీవితమునందు ననుభవసిద్ధము గావలయును.

సంఘమునందు జీవించువాఁడు గనుకనే మానవునకు న్యాయ్యము, నీతి యేర్పడుచున్నవి. 'దొంగలించుట కూడదు' అనుట తోడనే 'అన్యులసొత్తును' అను భావము, 'మోసముఁ జేయఁ గూడదు' అనుట తోడనే 'పరులను' అను భావము మన మనస్సునకు తట్టుచున్నవి. తోడిజనులకు, అనఁగా సంఘమునకుఁ జెందని న్యాయము లేదు. నీతి లేదు. కేవలము వ్యక్తిగతముగ నున్న దని చెప్పఁబడు న్యాయము నీతి అర్థములేని మాటలు. సంఘమును విడిచి న్యాయమును నీతిని

స్థిరించుట గాని సాధించుట గాని మానవునకు అసంభవము. తన శరీరాత్మాభివృద్ధులకు మానవుఁడు గృహమును సంఘమును రాజ్యాంగమును ఆశ్రయస్థానములుగఁ జేసికొనవలయును; వానితోఁ బూర్ణముగ నైక్యము గావలయును. ఈ సందర్భమునఁ గొన్ని ప్రశ్నలు బయలుదేఱును. సంఘమే దైవమా? సంఘశాసనముల పాటించుటయే మానవుని విధియా? సంఘమునందు ఎన్నియో లోపములు గలవు; ఎన్నియో దురాచారములు గలవు. వాని నెల్ల ననుసరించుట మానవునకు విధాయకమా? మానవసంఘము నెప్పుడును వాస్తవముగ దోషరహితమును పరిపూర్ణమును కాదు. కాని యెంతటి యనాగరకస్థితియం దున్నను సత్యము నేమాత్రమును కాన్పింపక యుండఁ జాలదు. ప్రతిసంఘమునందును సత్యము యొక్క ఆవిర్భావ మెంతవఱకు కలదో అది యంతవఱకు ననుసరింపఁ దగినదే. ఆ కారణముచే వ్యక్తి సంఘము ననుసరించి జీవించుచు అందు సత్యము ఎంతకలదో అంతయుఁ బొందుచు నభివృద్ధి నొందుట ముఖ్యము. సంఘమునందలి దోషముల గ్రహించినవ్యక్తి ఆ దోషముల నెన్నటికిని అనుసరింపఁడు. తాను అనుసరింపక పోవుటయే గాక యా దోషములను సంఘమునుండి నిర్మూలించుటకుఁ గూడ యత్నించును. విచక్షణజ్ఞానసాహాయ్యమున తాను అనుసరింప వలసిన మంచిని గ్రహించిన విధముననే త్యజింప వలసిన చెడుగును గూడ గ్రహించును. మంచిని అవలంబించుట యెంతటి విధాయకమో చెడుగును విడచుటయు నంతటి విధాయకము. సంఘముతో నైక్యమైన వ్యక్తి సంఘములోని దోషములను తన దోషములుగ నెంచి వానిని సంఘమునుండి తొలఁగించుట తనవిధి యని తలపోయును. వ్యక్తి సంఘమునుండి జీవముఁ బొందును; సంఘమునకు తిరిగి జీవముఁ బోయును. సంఘము పరంపరాగత జ్ఞానమును సిద్ధపఱచును. వ్యక్తి తన యాత్మజ్యోతిచే నా జ్ఞానమును వృద్ధిపఱచును. "Tradition and conscience are two wings given to the human soul to reach to truth"— పరంపరాగతజ్ఞానము, అంతరాత్మ సత్యమును జేరుటకు మానవున కొసంగఁబడిన రెండు ఱెక్కలు. అని మహాత్మా మాజిని చెప్పెను. సంఘము వ్యక్తి పరస్పరసాహాయ్యముతో మిత్రభావమునఁ బాటుపడుచు సత్యమునందు నెంపొందవలెను.

కాని వ్యక్తి సంఘము ఒకప్పుడు పరస్పర విరుద్ధముగ నిలచును. సంఘము సజీవమై నూతన జ్ఞానమును స్వీకరించుటకు తగిన స్థితిలో నుండిన వ్యక్తికిని సంఘమునకును పోరాటము కలుగనేరదు. వ్యక్తినుండి వెలువడిన క్రొత్తకాంతిని సంఘము వెంటనే తనలో నిముడ్చుకొనును. అట్లుగాక సంఘ మొకప్పుడు నిర్జీవమై సత్యమును స్వీకరింపఁజాలని స్థితియం దుండును. నిరంకుశపాలనము ప్రబలుటచే సంఘము మొత్తముమీఁద నా స్థితికి వచ్చును. సంఘమునకు అది గొప్ప జాడ్యము. అప్పుడు నిరంకుశశాసనములు, మూఢాచారములు, అంధవిశ్వాసములు సంఘమును కట్టియుంచవచ్చును. కాని సంఘమునందు జ్ఞానప్రసారము గాన్పింపదు. శరీరమునందు రక్తమువలె సంఘమునందు జ్ఞానము నిరంతరము ప్రవహింపవలెను. జ్ఞానశూన్యమైన సంఘము ప్రాణము లేని శరీరము వంటిది. అట్టి సంఘము వ్యక్తియొక్క వికాసమునకు అడ్డుపడును. వ్యక్తి తానుగూడ దానితో వ్యాప్తిఁ జెంద కుండుటకు యత్నించును; జాడ్యమునకు మూలకారణమైన నిరంకుశత్వమును అతిక్రమించి జీవించును. అప్పుడు వ్యక్తియందలి జ్ఞానము స్వచ్ఛముగ వెలుఁగుచు నజ్ఞానమున మునిఁగియున్న మానవులను క్రమక్రమముగ జ్ఞానమార్గమునకు తీసికొని వచ్చును. సజీవమగు నూతనసంఘము స్థాపిత మగును. నిరంకుశత్వమువలన స్వాభిమానము స్వయంకృషి అంతరించి గృహముగాని సంఘముగాని రాజ్యాంగముగాని నిర్జీవ మగును. నిరంకుశత్వమును మానవాత్మ సహింపదు. నిరంకుశత్వము నణఁచి తన స్వాతంత్ర్యముఁ గాపాడుకొనువఱకు మానవాత్మ సంతృప్తిఁ జెందదు. నిరంకుశత్వమే సంఘమునకు వ్యక్తికి కలుగు సంఘర్షణమునకుఁ గారణము

ఆత్మస్వాతంత్ర్యమునకు నిరంకుశత్వముతో నెడతెగని పోరాటము. నిరంకుశత్వము గృహసంబంధమునదో సంఘసంబంధమయినదిగనో, లేక రాజ్యాంగసంబంధమయినదిగనో యుండవచ్చును. తల్లిదండ్రులు బిడ్డలను తమ్ముల్పురుషులకు లోఁబఱచి నిరంకుశశిక్షణమున బెంచవచ్చును. మతగురువులు సంఘమును అంధవిశ్వాసములతోను మూఢాచారములతోను నింపి జనులపై నిరంకుశాధికారమును స్థాపింపవచ్చును. పాలకులు రాజ్యాంగమును చండశాసనములతో నడపుచు ప్రజలను నిరంకుశపాలనమునకు పాలుసేయ వచ్చును. ఈ నిరంకుశత్వము లన్నిటిని ఆత్మస్వాతంత్ర్యము సమానముగ ప్రతిఘటించును; అణచుటకు సంసిద్ధమగును. యథార్థమగు ఆత్మస్వాతంత్ర్యము ఒకవిధమగు నిరంకుశత్వమును నిరోధించి మఱియొకవిధమగు నిరంకుశత్వమునకు దాస్యము సలుపుట యసంభవము. కాంతమువలె స్వాతంత్ర్యము ఆత్మయొక్క యొకలక్షణము. కాంతముండిన అది యన్ని కార్యములందుఁ గాన్పించును. అటులనే స్వాతంత్ర్యము కలదేని, అదియు యావజ్జీవము నందు తప్పక కనఁబడును. ప్రాచీనకాలమున గృహసంఘరాజ్యాంగములు నిరంకుశపాలనమున నుండెడివి. మానవులందు జ్ఞాన మభివృద్ధి యయినకొలఁది నిరంకుశత్వమున కిచటను చోటు లేకపోవుచున్నది. ఈ యుగమునందు గృహసంఘరాజ్యాంగసంస్థ లన్నియు ఆత్మస్వాతంత్ర్యముపైఁ బ్రతిష్ఠించుటకు యత్నములు జరుగుచున్నవి. విద్యావివాహాదివిషయములందు తల్లిదండ్రులు బిడ్డలకు స్వాతంత్ర్య మొసంగుచున్నారు. మతసాంఘికాచారములందు గురువులయధికారము తొలఁగుచు ప్రజాభిప్రాయము ప్రబలుచున్నది. రాజకీయపరిపాలనమునందు నిరంకుశత్వము తగ్గుచుఁ బ్రజాధికారము హెచ్చుచున్నది. గృహసంఘరాజ్యాంగములు నిరంకుశత్వమునకు దూరములై జ్ఞానవినిమయమునకు నిలయములయ్యేనేని వ్యక్తికి సంఘమునకు సంఘర్షణ ముండదు; సంఘమంతయు జ్ఞానమునందు, ధర్మమునందు, ప్రేమయందు క్రమవికాసము నొందును. కాన "Liberty alone makes men fit for liberty"—స్వాతంత్ర్యమే మానవులను స్వాతంత్ర్యమున కర్హులఁ జేయును — అని గ్లాడ్‌స్టన్ మహానీయుఁడు చెప్పిన సూత్రము ననుస

రించి గృహసంఘరాజ్యాంగపాలనములు నేఁడు సంస్కరింపఁబడు మన్నవి. అంధవిధేయత మానవుల నెన్నటికి స్వతంత్రులఁ జేయఁ జాలదు. జ్ఞానపూర్వక మగు స్వేచ్ఛావిధేయతయే వారిని స్వతంత్ర జీవనమునందు పెంపొందించును. చిన్నతనమునుండి బిడ్డలకు అంధవిధేయత గాక స్వేచ్ఛావిధేయత అలవడవలెను. విద్యావిధానాది సకల సంస్థలు స్వేచ్ఛావిధేయతకు తోడ్పడునవిగఁ జేయుట యావశ్యకము.

శ్రీ రాజా రామమోహనరాయలు ఆత్మస్వాతంత్ర్యముతో జీవించిన మహాధీరుఁడు. అతఁడు ఆత్మస్వాతంత్ర్యపు మహిమను మన భరతవర్షమునందు తన యుపదేశములచే జీవితముచేఁ బ్రకటించెను. మతసంఘరాజకీయవిషయము లన్నిటియందు నాత్మస్వాతంత్ర్యముఁ జూపి భారతీయులకు ఆదర్శపురుషుఁ డాయెను. అతని నాఁటినుండియు వారియందు స్వాతంత్ర్యేచ్ఛ యధికము కాఁ జొచ్చెను. తల్లిదండ్రులు, గురువులు, పాలకులు మున్నగువారి అధికారము నంధముగ నంగీకరించు దినములు గడచినవి. వా రెల్లరు ఇప్పుడు తమ యనుచరుల స్వాతంత్ర్యమును మన్నించుటకు సిద్ధపడుచున్నారు. ఆత్మస్వాతంత్ర్యమును సంపూర్ణముగఁ జూపు భారతీయు లిప్పటికిని చాల కొలఁదియుండియే కలరు. అట్టివారిసంఖ్య వృద్ధియైనఁ గాని దేశమున కభ్యున్నతి లేదు. దేశములో విద్యాధికులు బహుస్వల్పసంఖ్యాకులు. వారిలోఁ గొందఱు మతసాంఘికవిషయము లందే కొందఱు రాజకీయవిషయములందే ఆత్మస్వాతంత్ర్యముఁ జూపుచున్నారు. ఈ విధముగఁ బలువురు తమ జీవితములో కొంత భాగమునందు మాత్రము స్వేచ్ఛతో వర్తించువారుగ నున్నారు. కొంతవఱకు స్వతంత్రముగ జీవించి ఏదో స్థానము చిక్కినతోడనే విశ్రాంతి నొందుట తగదు. స్వాతంత్ర్యము ఒకవిషయమునఁ గనఁబడి మఱియొకవిషయమునఁ గనఁబడ కుండుట యస్వాభావికము. స్వప్రయోజనములకై కొన్ని విషయములందుమాత్రము స్వాతంత్ర్యముతో వర్తించుటకు కొందఱు పూనెదరు. వారు కేవల స్వార్థపరులు. కపటులు. స్వాభివృద్ధియే వారి లక్ష్యము. సంఘము వారి దృష్టియం దుండదు. సంఘాభివృద్ధికి తాము చేయఁగలిగినది. వారికి తోఁపదు. వారు సంఘముతో నైక్యమగుటయే లేదు. స్వాతంత్ర్యప్రేరితులమై పాటుపడుచున్నార మని వా రెన్నిమాటలు చెప్పినను, వారి జీవితమునందు స్వార్థపరత్వమునే సంఘము గాంచును. సంఘము వారిని విశ్వసింపఁ జాలదు. వారివలన దేశమునకు మేలు కలుగదు. భారతమాత నేఁడు విద్యాధికులను స్వార్థపరత్వమును పూర్తిగ విడువుఁ డని కోరుచున్నది. 'మీరు నా యగ్రపుత్రులు. జ్ఞానమునందు మీ రధికులుగ నున్నారు. నా చిన్నబిడ్డ లందఱు మీ వైపునకు ముఖముఁ ద్రిప్పి సాహాయ్యమునకై చేతు లెత్తుచున్నారు. వారి దీనాలాపములు మీరు వినుటలేదా? నా కడుపుమంటను మీరు గాంచుట లేదా? మీ రేల ఇంకను స్వార్థపరులై చరించెదరు? మీలో మీరు బ్రాహ్మణుల మని బ్రాహ్మణేతరుల మని, హిందువుల మని మహమ్మదీయుల మని, అల్పబుద్ధితో ఏల తగవులాడెదరు? ప్రథమమున మీ రెల్లరు భేదముల విడిచి యేక మగుఁడు. తరువాత నా బిడ్డ లందఱినిఁ జేఁబట్టి వృద్ధిలోనికి తెండు. ప్రపంచమున నా గౌరవము నిలుపుఁడు.' అని భారతమాత విద్వాంసులను బ్రతిమాలుచున్నది. కాన స్వార్థపరత్వమును సంపూర్ణముగ విడిచి యథార్థ మగు నాత్మస్వాతంత్ర్యముతో మీ రెల్లరు భారతమాతృసేవను సలిపి ధన్యు లగుదురు గాక!

కీర్తిశేషులైన అల్లూరి రామరాజు గారు

హనుమంత వఝ్ఝల జగన్నాథశర్మ గారు

ఆంధ్రమాతకు సేవ ననిశంబుఁ జేసెడి పిన్నవాఁడు యశంబుఁ గన్నవాఁడు
ఆంధ్రోద్యమపుపక్ష మందు నిశ్చలుఁ డైన వృద్ధిశాలి విశేషబుద్ధిశాలి
సత్యపాలనమందు సత్యహరిశ్చంద్ర చక్రవర్తియు బుధచక్రవర్తి
ఐహికాపేక్ష యావంతయైనను లేని నృపమూర్తి రాజితవిపులకీర్తి
రాజకులచంద్రుఁ డల్లూరు రామరాజు
ముప్పదేడుల ప్రాయాన, ముప్పు నెంది
ఆంధ్రసోదరులను విచారాబ్ధి ముంచి
అవని విడనాడి దివిఁ జేరె నక్కటకట!

మాతృభక్తి

మండపాక పార్వతీశ్వరశాస్త్రి గారు, బి. ఏ.

శ్రీ దాక్షిణ్యరసాలవాల మఖిలార్థివ్రాత సంసేవ్య మా
మోదప్రతిబుద్ధాళికంబు, సుమనఃఖగాహ్లాదరం బైన నీ
పాదాంభోజము నాశ్రయంబునను తొల్వంజాలితిం గానఁ ద
ల్లీ! దారిద్ర్యము నాకు లే దిఁక, యశోలీలారతీ! భారతీ! 1

సీ. పట్టెఁ డన్నంబునుఁ బెట్టు మమ్మా! యని
యన్యగేహంబుల నడుగఁబోము;
కట్టుకో లే దొక్కబట్ట నిమ్మా యని
వేఱొక్కయింటికిఁ జేరఁబోము;
తమ్ముని రెం డక్కరమ్ము లిమ్మా యని
మఱియొక్కగీమున కరుగఁబోము;
దేవుఁడో, దయ్యమో తెలుపు మమ్మా యని
యింకొక్కయండకు నేగఁబోము;
భుక్తియును ముక్తియు నొసంగఁ బోదు ననుచు
నభయ మిచ్చితి వమ్మ, నీయాత్మజులకు;
నీవు కలుగంగ, మాకేల నియతిఁ దప్పు,
నీగృహమునందె యెప్పుడు నిలుతుమమ్మ. ౨

సీ. కరుణతో నిత్యంబు గాంచుచుండును నమ్మ
గంజియే చాలును కన్నతల్లి!
నీకటాక్షంబున నింపుగ మాపైని
గాకంచవే చాలుఁ గన్నతల్లి!
అనుకంపతో నమ్మ నరయుమా యేవేళఁ
గానిదే చాలును గన్నతల్లి;
ప్రేమతో మ మ్మెందు వీక్షించుచుండుమా,
చిన్నక్కరాల్ జాలుఁ గన్నతల్లి;
నిన్ను నొకనాఁడు గానకయున్న మాకు
బ్రహ్మహత్యాదిపాపముల్ వచ్చునమ్మ;
ఆదరంబున నీవు ముద్దాడుచున్న,
నమ్మ, మాయమ్మ, ఆనంద మగును జుమ్మ.

సీ. అగ్రజన్ముఁడు చేసె నవమాన మని చెప్పి,
తల్లిని విడనాడి తరలువారు,
పట్టెఁడుకూ డొక్కపూరియు లే దని
యమ్మను విడనాడి యరుగువారు,
విశ్రమింపఁగఁ జోటు విరివిగ లే దని
జననిని విడనాడి చనెడువారు,
పొరుగింటివా రిచ్చు పుల్లగూరను గోరి
మాతను విడనాడి మఱుఁగువారు,
మాతృభక్తుల మని యసామాన్య మైన
ఖ్యాతి పొందుట యాశ్చర్యకరము గాదె!
అన్నవస్త్రంబులకు లోప మైన నేమి?
తల్లిఁ జూచినఁ గనుపులోఁ జల్లఁగాదె?

సీ. నందికూ డియ్యదు మాయమ్మ యని చెప్పి
యరిగె దవ్వుగ నొక్కయమ్మకొడుకు;
ఆట లాడుకొనంగఁ జోటు లే దని చెప్పి
యరిగె దవ్వుగ నొక్కయమ్మకొడుకు;
తనయాలి కమ్మసై దయ తప్పె నని చెప్పి
యరిగె దవ్వుగ నొక్కయమ్మకొడుకు;
పెండిబంగారముల్ మెండుగ లే వని
యరిగె దవ్వుగ నొక్కయమ్మకొడుకు;
మాతృభక్తులు వీ రఁట! మాటిమాటి
కితరులను దెప్పుచుండ్రు వీ రిచట నఁట!
కూడుగుడ్డలు లే వంచు గొణగఁబోము
నిన్ను విడనాడఁబోము మాకన్నతల్లి.

సీ. మతభక్తి యను నొక్కమంచిపేరును బెట్టి,
సాధులౌ తమ్ములఁ జంపువారు,
దైవభక్తి యటన్న తప్పుపేరును బెట్టి
జ్ఞానులౌ తమ్ములఁ జంపువారు,
దేశభక్తి యటన్న దిట్టపేరును బెట్టి
చదివినతమ్ములఁ జంపువారు,
ప్రభుభక్తి యను నొక్క పట్టిపేరును బెట్టి
చక్కనితమ్ములఁ జంపువారు,
మాతృభక్తుల మనుచు నేమాత్ర మైన
సిగ్గుపొందక యం దందుఁ జెప్పుకొంద్రు;
అతులపథమునఁ జనుచున్న యనుజజనుల
భక్తి యను పేరఁ జంపింపఁ బాడి యగునె?

సీ. అమృతంబుఁ బోని క్షీరము నిచ్చి పోషించు
గోవులఁ జంపెడు క్రూరబుద్ధి,
కాలికిఁ జెప్పుగఁ గాపాడు నెద్దుల
కుత్తుకల్ గోసెడు క్రూరబుద్ధి,
కంటికి ఱెప్పయై వెంటాడి తిరిగెడు
గుఱ్ఱాల భక్షించు క్రూరబుద్ధి,
కూడుగుడ్డలు రెండుఁ గూడ సమర్పించు
గొఱ్ఱెలఁ దినివేయు క్రూరబుద్ధి,
నీదుపుత్రుల కెన్నండు లేదు గాని,
నీకటాక్షంబునను వారు నిలిచినారు,
ఎంతరాజైశ్వర్య ముండిన నేమి ఫలము
హింస రాక్షసకృత్యమం చెఱుఁగకున్న?

హైందవచిత్రలేఖనము

పోడూరి రామచంద్రరావు గారు

హైందవవిద్యాధికులు ప్రాచీన హైందవ చిత్రలేఖనమును గూర్చి యత్యల్పజ్ఞానమును గల్గియున్నారు. వారి లలితకళాతత్త్వజ్ఞానము ఉత్తమాధమములవిభేద మెఱింగించి పూర్వకళానైపుణ్యమునుండి ప్రస్తుతకళాభాసమును గుర్తింపఁగల సామర్థ్యమును గల్గినది గాకున్నది. అట్టివారికి చారిత్రకమై విమర్శనాత్మకమైన వర్ణనతోఁ గూడిన యీవ్యాసము బుద్ధివికాస కారణమగు నని నమ్ముచున్నాను. మొన్న మొన్నటివఱకు హిందూదేశమునఁ జిత్రలేఖన మను కళ యున్న దను మాటయే పశ్చిమఖండవాసులు నమ్మకుండిరి. అట్టితఱి అజంతాలోని సుధాఫలకములమీఁది చిత్తరువులు ప్రాచీనహైందవకళౌన్నత్యప్రకటనమునకు హేతువులయ్యెను. అకృతిమతులకు సామ్యమును మఱుఁగుపఱచి భేదమునే సూచించునట్టియు, వీనికిఁ గల సంబంధమును స్థిరపఱుపఁగలదియు నగు నొక సూక్ష్మవిషయము గనఁబడుటయే గాక దానియందు బద్ధాదరులుగూడ నగుట తటస్థించినది. బౌద్ధధర్మము భారతీయకళావస్తునిర్మాణమునకు నూత్నతేజ మొసంగిన దని చెప్పవలసియున్నది.

ఆ ధర్మము చరిత్రాత్మకమైనది. దాని యాదిమచరిత్ర మంతయు కవులకన్న శిల్పులకే వర్ణనార్హమై యుండెను. గాని సాంప్రదాయము లన్నియు చాలవఱకు సచిత్రములు. ఏకాశయములు గల భిన్నదేశీయులకు సర్వసామాన్యము లగు వ్యవహారసాధనము లలవడనప్పుడు కళావాక్కే సహజమైన సాధనము. క్రీ. శ. ౬౭-వ సంవత్సరప్రాంతమున కశ్యపమతుంగుఁ డను భారతీయమతగురువు మింగ్టి చక్రవర్తి కోరికపై నసంఖ్యచిత్రకళావస్తువులతోఁ గూడ పయనమై పోయెను. ఆ కాలమునుండియు హిందూదేశమునుండి చైనా జపాను దేశములకు శిల్పులు పరంపరగఁ బోవుచుండిరి. వారిలోఁ గొంద ఱచటనే నివాసముల నేర్పఱచుకొని శిల్పవృత్తియందే కాలముఁ గడపుచుండినట్లు ప్రమాణములు గలవు. ౮-వ శతాబ్దారంభమున నిర్మింపఁబడిన దనుకొను జపానులోని హోరింజి దేవళమునందలి సుప్రసిద్ధచిత్రపటమును గూర్చి చెప్పుచు బినియన్ అను నతఁడు ఇది పూర్తిగ భారతీయలక్షణసమన్వితమనియుఁ బాత్రౌచిత్యమునందును, జీవస్ఫురణమందును విపులమై సునిబద్ధమైన యాకారవిశేషములయందును అజంతాగుహాలలోని చిత్రములను స్మరణకుఁ దెచ్చుచున్న దనియు, వాక్రుచ్చియున్నాఁడు. ఏడవ శతాబ్దమందలి నారయుగమునందలి చిత్రములను గూర్చి డిల్లన్ అను నతఁ డీయభిప్రాయమునే ఇచ్చియున్నాఁడు. రిక్కొట్సు అను నతఁడును ౧౫ వ శతాబ్దమున నుండిన తిబ్బెటు సంబంధపు శిల్పమునందు గూడ నీసూచనలనే స్పష్టముగ వక్కాణించుచున్నాఁడు.

అజంతాలోని చిత్రములు ౧౦౦-౬౫౦-వ సంవత్సరముల నాఁటివని చెప్పవచ్చును. ఇందలి కడపటిపటము, ౬౨౬-౬౨౮-వ సం॥ల మధ్య దని పారసీకరాజైన ఖుస్రుపర్వేజు నొద్దనుండి వచ్చిన రాయబారులను భారతీయనృపాలుఁడగు ౨-వ పులకేశిని గౌరవించుటయే దృష్టముగ దెలుపుచున్నది. ఈ చారిత్రకకథను విడిచిపెట్టినను, ఈ మందిరములందేమి, ఇతర మందిరములం దేమి పారసీకదేశముయొక్కయు భారతదేశముయొక్కయు చిత్రకళలకుఁ గలసాదృశ్యమును సూచించు లక్షణము లనేకములు గల వని ప్రాను చెప్పుచున్నాఁడు. ౭-వ శతాబ్దమున భరతవర్షమున బౌద్ధధర్మము నశించినప్పుడే యీకళగూడ అంతరించినట్లు కనఁబడుచున్నది. తరువాత వేయిసంవత్సరములవఱకు గూడ భారతీయచిత్రము లెచ్చటను నిదర్శనమునకైనఁ గానరాకున్నవి. కాని భారతీయకళను గుఱించి సాక్ష్యమిచ్చు నాధారము లేవియు లేకుండినను భారతపరిసరదేశములందలి కళాపరిశీలనము కొంతవఱకు సాహాయ్యకారి గావచ్చును. క్రీస్తు ననంతరము తొలిశతాబ్దములలో యవన, భారత, పారసీక, చీనానాగరకతలకు కూటస్థానమగు తూర్పుటర్కీ కోటారులో సామ్యవిశేషముచేత అజంతాశిల్పులలో నొకనిచేతిపనియై యుండు ననఁదగిన పటము లెన్నియో స్టీను గారి కాగూల పరిశ్రమచే వెల్లడి అయినవి.

ఈ విధముగ ౧౦ వ శతాబ్దిపర్యంతము నామమాత్రావశిష్టమై యీకళ భారతఖండమున ౧౬ వ శతాబ్దపు ద్వితీయభాగమున నక్బరుచక్రవర్తికాలములో తిరిగి తలయెత్తెను. అతనికుమారుఁడును విలాసపురుషుఁడును నగు జహాంగీరు కాలములో నున్నతదశను బొందెను. ఈ మొగలాయిప్రభువు లందఱు రసికాగ్రేసరు లగుటచే వారిరాజ్యకాలములో నన్నివిధముల శిల్పములును వృద్ధిపొందుచు వచ్చెను. అబ్దుల్ ఫజల్ అనునతఁడు ఈ కాలపు చిత్రకళావ్యవస్థను గుఱించి యొకింత ప్రౌఢముగ నుపన్యసించుచు సందర్భవశమున నక్బరుచక్రవర్తికి ఈశిల్పులయందును వారి శిల్పకళాదక్షతయందును గల యాత్మాభినివేశమును దెల్పియున్నాఁడు. ఈచక్రవర్తియొక్క ఆదరభావమే కల్మాల్, షిరాజ్ టాబ్రిజ్, సమర్ఖండ్ ప్రాంతములనుండి అనేకుల నీదేశమున కాకర్షించెను. రానురాను ఈకళ, మొగలాయీలు కాలక్రమమున నీదేశీయులలో కలసిపోయినట్లే, భారతీయకళతో నేకీభావము నొందెను. విదేశీయశిల్పులతోఁబాటు హైందవచిత్రకారులును గలసి పనిచేయుచుండిరి రసికాగ్రేసరుఁడైన చక్రవర్తియు వారలసహజనైపుణ్యమును గ్రహించి తగుసట్టివకాశములు గల్పించుచు వచ్చెను. ఉదారుఁడును సుజ్ఞానుఁడు నగు నీతని నికటమున వీరలు కలసిమెలసి పనిచేయుచుండుటచే నిరుతెగలవారును

బీజాపూరుల యాస్థానము నాశనమైపోవుటకు సంసిద్ధమై యుండుటచేతను పరస్పరానుకూలమైన యీ స్థితిగతులలో, నీరెండు మార్గముల సమ్మేళనము కళాభివృద్ధికి కారణమైన దనుటయు ఈ యారంభమునుండియే మొగలాయి శిల్పకళాసాంప్రదాయము ఉద్భవించిన దనియును పాఠకులకు విస్పష్టము కాఁగలదు.

పెర్సీబ్రౌను తనపుస్తకములో 'రాజపుత్రయుగము' అను శీర్షిక క్రింద వ్రాసిన రాజపుత్రకళాసాంప్రదాయము ఈ మొగలాయి సాంప్రదాయమునకు సమకాలికమై దానిని చాలవఱకు పోలియుండెను. కాని, బ్రౌనుగారు రాజపుత్రుల కళాప్రయోగవిషయమున విశుద్ధభారతీయ మగుటచేత, అజంతానాఁటి పురాణవస్తుసమాగతమే యని వాదించుచున్నారు. వీనియందు రాజపుత్రుల వ్యక్తిత్వము నాగరికతయును ముద్రితములై యున్నట్లు నేఁటివఱకు తెలియ నగు ననియు నీ సంధి కాలమున రాజపుత్రస్థానములోని హిందూచిత్రకళాసాంప్రదాయములను చెక్కుచెదరకుండఁ గాపాడిన దిదియే యనియుఁ జెప్పుచున్నాఁడు. రాజపుత్రులకును మొగలాయిలకును గల సంసర్గము ఒక నాగరికత మఱియొకరి నెట్లు ప్రేరేపించినదియుఁ జూచినపుడు రాజపుత్రుల చిత్రకళ, శాద్ధుల పురాణశైలికన్న సమకాలికమైన మొగలాయి శైలినే యనుకరించినట్లు తోఁచుచున్నది. బ్రౌనుదొరగారు ఈ దేశీయవిద్య మొగలాయి ప్రభుత్వమునందే తిరిగి తలచూపుచున్న దనియు, నంతకు పూర్వము దాని స్వరూప మెట్టిదో మనకు తెలియరా దనియుఁ జెప్పుచున్నారు.

పిమ్మట రాజపుత్రకళకు జయపూరుసంస్థాన మాటపట్టాయెను. అచటనుండియు, రాజపుత్రస్థానములోని ఇతరపట్టణముల నుండియుఁ గ్రమక్రమముగ నీవిద్య మొగలాయి ఆస్థానమును జేరి ౧౭-వ శతాబ్దమున నొక్కొక్కసమయమున డెల్లీ, అగ్రా, లాహూరు మొదలగు నొక్కొక్కపట్టణమునఁ దత్తద్దేశభేదముల నందుచు, మొత్తముమీఁద రాజపుత్రకళాలక్షణములతోడనే వెలయుచుండెను. మొగలాయిప్రభుత్వము క్షీణించుటతోడనే భారతదేశమున నీవిద్యయు క్షీణింపఁజొచ్చెను. మఱియు ౧౭౬౦ సం॥లో నీ ప్రభుత్వము ముగిసినపు డీవిద్య చాలక్షీణదశయందుండెను. డెల్లీ లక్నో పట్టణములలో కొందఱు శిల్పు లింకను నీవృత్తి నాధారముఁ జేసికొనియుండిరి. కాని వారికల్పనలు జీర్ణించినకళయొక్క యనుకరణములు మాత్రమే యని చెప్పవలయును. ఈ సమయమునఁ గులవిద్యయం దభిమానము గల కొందఱు శిల్పులు పాటలీపుత్రమునకు వచ్చి క్రొత్తమార్గములం ద్రొక్క మొదలిడిరి. కాని వారిపనియం దించుక గుణ ముండినను భావరహితమై యుండెను.

దక్షిణదేశములో నీకళ ఉత్తరదేశమునకన్న భిన్నమార్గములలో నెంపొందెను. ౧౭ వ శతాబ్దప్రారంభముననే దక్షిణమునఁ బారసీకశైలి యొకటి యనుసృత మైనది. అప్పటికి అప్పుడప్పుడు హిందూస్థానమునుండి శిల్పులకుటుంబములు వచ్చి చేరుచుండెను. వారిసంతతివారు నేఁటికిని హైదరాబాదు, గోల్కొండలలోఁ గానవచ్చుచున్నారు. ఇంకను దక్షిణమునకు పోయినకొలఁది ఈచిహ్నములనేకములు గానవగును. వీనిని బట్టి చూడఁగా నివి ప్రత్యేకముగ పుట్టి పెరిగినట్లే తోఁచుచున్నది. కాని ఉత్తరదేశపువిద్యతో సన్నిహితసంబంధము కలదనియే సాంప్రదాయకులు చెప్పుచున్నారు. ఇటీవల నీ యీవిద్యలు రెండువిధములై తంజావూరునందును మైసూరునందును వెలసెను.

తంజావూరులోని శిల్పులు ౧౭ వ శతాబ్ద్యంతమునఁ దొలుదొల్త హిందూస్థానమునుండి వచ్చినవారే! వారిసంఖ్య క్రమక్రమముగ వృద్ధినొందినది. తంజావూరిరాజులలోఁ గడపటివాఁడైన శివాజీ కాలమున (౧౮౩౩-౧౮౫౫)నంత, దాపుల రెంటియందును సుప్రసిద్ధమైన పనిని జేయు ౧౮ కుటుంబములవారై యుండిరి. శివాజీ మరణానంతరము ఈకుల మంతయు చెదరిపోయెను. కాని నేఁటికిని తనకులవిద్యను ఆశ్రయించియున్న కొలఁది కుటుంబములవారు మాత్రము "బజారుపటు" ములను వ్రాయుచున్నారు.

మైసూరులోని శిల్పసంఘము ౧౯ వ శతాబ్దాంతమున రాజా కృష్ణరాజ ఉడయార్ వారి ప్రభుత్వములో ఉన్నతదశను బొందె. ౧౮౬౮ వ సం॥లో నాయన మరణించినప్పుడంతటితో నస్తమించెను. ఇట్టిచిత్రకళ అంతకంటె కన్నగతిఁ జెందుచు పూర్తిగ నశించగు నట్లుండెను. కాని పెర్సీబ్రౌన్ ఇట్టి కృపణదశ కళయొక్క పునరుద్ధారణకు ప్రతికూలము కా దనియు నూత్నశక్తి యేదియేని ఉద్భవించినచోఁ గళాజీవనమును మఱల వికసింప జేయ నగు ననియు నుడువుచున్నాఁడు. వంగదేశమున నిటీవలఁ గొడసూపినది ఈ నూత్నశక్తియే కదా!

ఈ నూతనోద్యమమునకు అవనీంద్రనాధఠాకూరు నాయకుఁడు. ఈయన ఇతర విద్యారంగములలో ప్రసిద్ధిఁ గాంచిన యొక విద్వత్కుటుంబమున జనియించెను. సునిశితమైన సహజకళాపాండిత్యము గలవాఁడు. మోహనవిగ్రహుఁడు. ఈయన కొందఱు శిల్పయువకులను తనచుట్టుఁ జేర్చుకొని పనిని ప్రారంభించెను. కొలఁది కాలములోనే వీరలకృషి యెంతో సాఫల్యము నొందినది. ఈ యభినవమండలివారు చేయుపని ఏదోయొక గ్రుడ్డియనుకరణము గాని అథవా అనేకశైలులపై నాధారపడిన యొక కృత్రిమసృష్టి గాని గాదు. అట్లుగాక వారలచిత్రములు మొత్తముమీఁద నభిమానసంకల్పముల కనువైన వ్యక్తియొక్క ఆత్మాశయముల దృఢముగఁ దెలుపగల స్వాతంత్ర్యమును గల్గియున్నవి. ఈ సంఘమువారు చేయుపని యంతయు సాంప్రదాయమార్గములనే సమున్నతమనోభావములను చిత్రించుటయందు శిల్పునికిఁ గల యవ్యాజమైన కుతూహలమునే తెల్పుచున్నది. ఈ సంఘమును స్థాపించుటలో హిందూదేశముకళావ్యాప్తికాలమున నేమార్గము ననుసరించెనో ఆ మార్గమే కొంతవఱకు అవలంబింపబడినది.

ఈనూతనోద్యమ మిప్పు డభినందింపఁబడుచున్నను జను లింకను గుణగ్రాహణపారీణులైనఁ గాని నిజమగులాభము నొందఁజాలరు. బ్రౌను, భారతీయుల గుణగ్రాహణశక్తి యీ విషయమున పరిపక్వము నొంద లే దనియు, ఈజ్ఞానము పరిణతనొందిననే యీ కళగూడ నేమాత్రమైన పరిణామము నొందఁగల దనియు నభిప్రాయపడుచున్నాఁడు. ఈరెండుశక్తులును ఎప్పుడు కలసి పనిఁ జేయుట కారంభించునో అప్పుడే భారతీయకళాపునరుద్ధారణ మాసన్నమైన దని తలంపవచ్చును.

భారతవర్షభావిపరిస్థితి

ఆనరబిల్ భూపతిరాజు వేంకటపతిరాజు గారు, బి. ఏ., బి. ఎల్.

సత్యగ్రాహి మహర్షి గంధి మహాశయుని త్యాగశీలము ప్రశంసనీయము. సర్వకర్మఫలత్యాగి యన, ఆయన కొక్కనికే చెల్లును. దేశములో “జానామి ధర్మం నచమే ప్రవృత్తిః, జానా మ్యధర్మం నచమే నివృత్తిః.” అను వాక్యము ననుసరించి ప్రవర్తించు వారలే కాని “యజ్ఞదానతపఃకర్మాణి నత్యాజ్యాని, ఏతా నపితు కర్మాణి సంగం త్యక్త్వా ఫలానిచ కర్తవ్యాని” అని తెలిసికొనువారు మిక్కిలి తక్కువ. ఇట్టి స్థితిలో సత్యగ్రహణ మన నేమియో తెలిసికొనవలెను. సత్యాగ్రహ మనియు భాషాంతరీకరణమున (Righteous Indignation) అనఁగా అహంకారభావమును స్ఫురింపఁ జేయుచు శాంతమూర్తి గంధి గారి శాంతినియమమును తలపెట్టరైరి. ఆగ్రహశబ్దమునకు సంస్కృత భాషలో నభినివేశ మను నర్థ మున్నను తెనుఁగున రూక్షభావమునందే వాడఁబడుచున్నది. గంధి గారి భావన సత్యగ్రహ మని కాని సత్యాగ్రహము కాదని నా తలంపు. సత్యగ్రహణ మనిన “ననిత్యమును విడిచి నిత్యములు గ్రహించుట యని కదా. వేదములో “ఏకం సత్ తద్విప్రా బహుధా వదంతి” యని యున్నది. కావున, వివిధభావము లుండవచ్చును. సాత్త్వికమతమున నియతకర్మము సంగఫలాపేక్షారహితముగాఁ జేయవలయును. వారెట్టివారైయుండవలె నన్న “నద్వేష్ట్య కుశలం కర్మ కుశలీ నానుషజ్యతే, త్యాగీ సత్వసమావిష్టో మేధావీ భిన్నసంశయః.” కష్టములందు ద్వేషమును సుఖములం దాసక్తియు లేక కేవలము సత్వగుణము నవలంబించి నిస్సంశయముగాఁ బని చేయువారే సత్యగ్రాహులు. ద్వేషభావపూరితులై ఫలాపేక్ష కలిగి తమోగుణముతోఁ బాటుపడువారు సత్యగ్రాహులన్నను విద్వేషు లన్నను కార్య మేమి? సత్కార్యసంసిద్ధికి “సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై.” అను నుపనిషద్వాక్యము చొప్పున విరోధిభావమును విడిచి యిరు కక్షులవారును ఐకమత్యముతోఁ గార్యశూరత్వమును జూపవలెను. గృహస్థాశ్రమములో నున్నవారు సన్న్యాసాశ్రమ మవలంబించుట యెంత కష్టమో గమనించి యథోచితధర్మమును నడుపుట శ్రేయస్కరము.

పుణ్యపురుషులకు సత్యగ్రాహివ్రతమును విడిచి కాలమానస్థితులను బట్టి యుచితరీతిని కార్యక్రమముఁ జరుపు మని చెప్పు సాధారణపురుషులలో నే నొకఁడను. అట్లు గాక మహాపురుషులు సన్న్యాసవ్రతము పూని దారేషణ ధనేషణ పుత్త్రేషణలను విడిచి కారాగృహప్రాప్తికి సంసిద్ధులై కాయక్లేశముల కోర్చుచు దేశాభివృద్ధికొఱకై పని చేయువారిని శ్లాఘించువాఁడనే కాని వేఱు గాదు. కాని మహావ్రతులు స్వల్పసంఖ్యాకు లగుటను పామరజనులకు సాధకబాధకములు పూర్తిగాఁ దెలియక చెప్పువారలే కాని చేయువారలు నాయకులలో తఱుచు కనఁబడకుండుటచేత మన స్థితి కనుగుణముగాఁ బ్రవర్తించు తలంపుతో భిన్నాభిప్రాయము గలవాఁడనైతిని.

ఆంగ్లేయపరిపాలనము నాఁటిది నేఁటిది కాదు. ఇన్నూరు వత్సరములనుండి దినదినప్రవర్ధమానమై హైందవుల శ్రేయమే ముఖ్యావధి యని చెప్పుచున్నను స్వలాభమును పోనాడి వర్తించు విధానము లేదు. ఆంగ్లేయాధికారులు లోకమునకు వెఱచియో యోగ్యపురుషుల ప్రేరేపణవలననో బ్రిటిషుప్రభువుల వాఙ్నియమముచేతనో మన దేశమునకు తప్పక మేలు చేసెదమని చెప్పుచున్నారు. గంధి గారు తమ సందేశమున “ఆంగ్లేయులు మహావీరు లయ్యును తమ్ముఁ జేరిన యశక్తుల దుస్థితి మాన్పరైరి” యను భావమును వెలిపుచ్చిరి. అందువలన మన మున్నతదశలోనికి వచ్చుటకు సంఘబలమే సాధనము కాని వేఱొండు కాదు. దేశహితైకపరాయణ యగు బిసెంటు గారు సెలవిచ్చినటులైకమత్యమే కార్యసాధనము. పరిపాలనవిధానమును మార్చుటలో దేశాభ్యుదయమును గోరుచు ప్రజానురంజకముగాఁ బరిపాలించు మార్గము గమనింపవలెను. ఆస్క్విత్తు మహాశయులు చెప్పిన తీఱున దేశపరిపాలనము స్వల్పసంఖ్యాకుల లాభముకొఱకు గాక బహుపురుషక్షేమముకొఱకై యుండవలెను. మొన్ననే కదా ఫిలిప్పైను దీవులకుఁ బూర్తిగా స్వాతంత్ర్య మీయవలె

నని విల్సను గారు వాక్రుచ్చిరి. కోశాధికారము గల్గినఁ గాని దేశోపకారి యగు నూతనవిధానము సమకూరదు. దేశదారిద్ర్యము గమనింపక చేయు నమితధనవ్యయ మార్గములలో మార్పులు కలుగవలయును.

సద్విద్యావ్యాప్తికై విద్యావిధానము హైందవుల చేతులలో నుండవలయును. ఆజ్ఞానుబద్ధాందోళన మెన్నఁటికిని విడువఁదగదు. ద్వేషాసూయభావములతో స్వలాభప్రాప్తికై హైందవుల శ్రేయస్సును గోరక సిడన్హాము ప్రభృతులు పెక్కురు బహువిధములఁ బాటుపడుచున్నారు. ఇట్టి తరుణమున హైందవులలోని ప్రముఖులు స్వల్పభేదములు పోనాడి యేకముఖముగా దేశాభ్యుదయమునకై పాటుపడు నిమిత్తము ఇంగ్లండునకు త్వరగాఁ బోవలెను.

రౌలటు శాసనమువలన హైందవులయందుఁ బ్రభువులకుఁ గల యవిశ్వాసము స్పష్టమగుచున్నది. గంధిమహాశయుని కారాగృహప్రాప్తియే పై స్థితిని దృఢపఱచుచున్నది. అట్టి శాసనము లేకున్న పరిపాలన సౌష్ఠవమునకు లోప మేమియు లేదు. ఆ శాసనము రద్దు కానిచో దేశక్షోభము కలుగును.

ఆయుధశాసనము జాతిమతభేదము లెంచకున్నను ప్రజలకుఁ బ్రయోజనకరముగా లేదు. యుక్తముగా సవరణ చేయక తీరదు. ఆయుధపాణులైనఁ గాని శౌర్యధైర్యములు కుదురవు.

దేశారిష్టములు గనుక అరాజకపుమార్గములు దేశమున లేకుండఁ జేయవలెను. క్షామబాధచేఁ బీడితులయ్యును శ్రమల కోర్చి ప్రజలు శాంతభావము వహించుటకుఁ గారణము గంధి గారి మహోపదేశమే. బహుప్రజావినాశముచేతను అమితధనవ్యయముచేతను ప్రతి దేశమునను బూర్వపు కట్టుబాట్లు నిలువవు. ఉచితరీతిని మార్పులు కలుగును. ఇట్టి తరుణమున స్వలాభాపేక్షచే మన దేశస్థితిని నిర్వ్యాజముగా బ్రిటిషు ప్రజలు గమనింపకపోవచ్చును. కడు జాగరూకతతో మనము పాటుపడనియెడల దేశభాగ్యస్థితిలో ననర్థములు కలుగవచ్చును. మన దేశస్థితి బాగుపడవలయు నన్న మనము లోలోపలఁ గల వైషమ్యములు విడిచి దూరదృష్టితో వ్యవహారదీక్షాపరతంత్రులమై సమయానుకూలముగాఁ బనిఁ జేయవలెను. వాగాడంబరముతోఁ గార్యసిద్ధి కానేరదు. కార్యశూరులు వెనుదీయుటకు సమయముకాదు. ప్రజానుకూలముగా ముందంజ వేయుఁడు. వీలుకొలఁది సహకారమును ఆవశ్యకత కొలఁది నిరంకుశాధిక్షేపణమును జేయవలెను. స్వలాభప్రాప్తికై పని చేసినచో దేశారిష్టము కలుగును. నడుము గట్టుఁడు. ముందంజ వేయుఁడు. వెఱవఁ బని లేదు. ధైర్యలక్ష్మిని విడువకుఁడు. ఎంతటివారు ధిక్కరించినను పట్టిన పట్టు వదలని దృఢప్రతిజ్ఞ గలవారలై యుండుఁడు. సాధకబాధకవిచక్షణ లేమి కార్యహాని. కర్మయోగావలంబకులు కండు. "కర్మజం బుద్ధియుక్తోహి ఫలం త్యక్త్వా..........తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర" అని తెలిసికొనుఁడు. మన రాష్ట్రములోఁ గల యీతిబాధలను తొలఁగింపుఁడు. మన రాష్ట్రప్రజలు తక్కిన రాష్ట్రములవారికంటె నెక్కువ పన్ను చెల్లించుచుండుటయు పరిహారముల క్రింద మన రాష్ట్రములో నమితధనము వసూలు చేయుచుండుటయు మన ధన మమితముగా నిండియా పరిపాలనమునకై వెచ్చించుటయు, మన రాష్ట్రములో నుద్యోగియులకే హెచ్చు ధనము వ్యయపఱచుచుండుటయు పూర్తిగా సరిచేసి నివారణమార్గము లాలోచింపవలెను. మెంటెగ్యు ప్రభువు వారి పరిపాలనసౌష్ఠవము మిథ్య. విల్లింగ్డను ప్రభువు పాలనము దేశమునకు మేలు కల్గించుఁగాక! వ్యవసాయాభివృద్ధికిఁ బెక్కు జలాధారములను గల్గించుటకును ప్రజల కారోగ్యస్థితిని సమకూర్చుటకును దేశమున పారిశ్రామికాభివృద్ధికిని, పరపతిసంఘవ్యాప్తికిని వ్యవసాయదారుల ఋణవిమోచనమునకును ప్రభుత్వమువారు విశేషధనము వెచ్చింపఁ బ్రయత్నింతురుగాక! వాణిజ్యవ్యాపారాభివృద్ధిని కాంక్షించి దేశభాగ్యము నిలుప యత్నింపుఁడు. మహాశ్రేయస్సును కాంక్షించుచు మహోపద్రవములకు సంసిద్ధుల రగుఁడు. ఆంధ్రోద్యమమునకై నిరంతర ప్రయత్నపరులు కండు. ఆంధ్రవిశ్వవిద్యాలయము వచ్చువఱకు నేమఱియుండకుఁడు. ఆంధ్రరాష్ట్రవిభజనకై పాటుపడుఁడు. దేశాభ్యుదయమును గోరి సంతతదీక్షాపరతంత్రులు కండు. మేలు సమకూఱును. జగన్నాథుఁడు మన పాల నున్నవాఁడు. ఆంధ్రులును ఆంధ్రేతరులును బ్రాహ్మణబ్రాహ్మణేతరులును పరస్పరవైషమ్యములు విడిచి శాంతిపరులై యుదారమనస్కులై దేశక్షేమమునకై యైకమత్యమునఁ దదేకదృష్టితోఁ బ్రయత్నింతురేని భరతఖండ మచిరకాలములోనే యత్యున్నతస్థితికి రాఁగలుగును. పరాత్పరుఁ డందులకుఁ దోడ్పడుఁగాక!

ఆరోగ్య ప్రార్థనము

వడ్డాది సుబ్బరాయుడు పంతులు గారు

ప్రకృతిన్ సూక్ష్మపిపీలికల్ మొదలుగా బల్ బ్రహ్మ పర్యంతమున్
సకలాంతర్బహిరంగశక్తులకు బీజం బౌచుఁ, బుట్టాది ర
క్షకభావంబునఁ బ్రాణికిన్ జఠరకోశంబందు భాసిల్లు దీ
ప్తకృశానున్ సుఖ మొందఁ జేయు మెలుతు; దేవా! భక్తచింతామణీ!

మ. రసనన్ దృప్తను దుల్లఁజేయు రసవద్రాజాన్నపానంపు బా
నస, మానంగకళారహస్యఖనికన్యారత్న మున్నట్టి కే
లిసుధామం బెటు మందుఁ, డట్లు గనఁగల్గెన్ మార్పు నాలోనెటో;
పసిగా నీ మఱ నీవె దిద్దవలె; స్రష్టా! భక్తచింతామణీ! 2

శా. ఆహారంబును నిద్రయుం గలసి, యన్యోన్యంబు మైత్రిన్ మనన్
దేహస్వాస్థ్యము హాయి దంచుఁ, దొలుదానిన్ దవ్వొనర్పం దనూ
ద్రోహివ్యాధి; ద్వితీయ యోగిరము తెర్వుం బట్టకుండంగఁ, ద
త్సాహిత్యంబు ఘటింపు మెండి; పరమాత్మా! భక్తచింతామణీ! 3

మ. దొర నేరంబును మోపి బందిగమునందుం ద్రోయు నేదోషినిన్,
దిరుగన్ వీడఁడు గాక శృంఖలుఁగఁ, దిండిన్ మాన్చి యొండించునే?
పరిశోధించి విధించి తీవ్ర రుజ, యే పాపానకో శిక్షగా;
వరుగుం జేయుదె నోరు గట్టి నను? దేవా! భక్తచింతామణీ! 4

శా. కారుంగోరపుఁ జీకువాలు నిసియేగా, కందుపై సాంద్రనీ
హారంపుం బెను వృష్టిపాతమును నా నబ్జాకరం బట్టి యా
కారః బొందితి సంసృతిన్ రుజను; వేగం ద్వత్కటాక్షాభ నా
చో రానిమ్ము; రహింతు; లోకహితచక్షూ! భక్తచింతామణీ!

శా. ప్రస్ఫుక్కుల్ దక్కొనఁ బె, క్కొనర్చి వదులుంజొక్కాయగా గుత్తపుం
ద్వా, కక్షస్థిచ్ఛట రాణివాసమునకున్ భంగంబు గల్గించి, లో
నెక్కో నుక్కిస కిమ్ము చేసి, జరకున్ వ్రేఁగౌ పనుల్ బల్మి నా
చక్కిన్ సల్పిన యీ రుజం దొలఁపు మోజన్; భక్తచింతామణీ!

మ. భవనం బున్నది సొంతమో యెరవొ, శుభ్రంబున్ బొనర్పన్ వలెన్;
జెవిసోఁకున్ "నిలఁ జెట్టు క్రింద నచటుం జేయన్ వలెన్ బాగు" నాఁ;
దవునే యీశ్వర! నీవు లో విడిసి, రోఁతం జేయ మేన్? నీ కిటం
దెవులా సాయము? వెల్పు; సల్పు తనుశుద్ధిన్; భక్తచింతామణీ! 7

మ. ఎడఁ బొల్పో, దఱికంబొ పైత్యమొ కతం బేదో; యొక ప్డేదియోఁ
గుడువం గజ్జము, క్రొంగొడుం గఫము; దగ్గుం దో వగ ర్పందునం
బొడమున్; హృద్జ్వర మెచ్చు; నివ్వికృతులం బోకార్పలేఁడయ్యె వే;
జ్ఞోడయంబా! ననుఁ జేయు మీ వగదకాయున్; భక్తచింతామణీ!

మ. మకరంబున్ రవి చొచ్చు పర్వదినపున్ మాసంబు నిచ్చేసె వెం
డి; కనుంగొంటిని నోటి కట్టునసె తండ్రీ! యేఁటి పబ్బంబు ల;
న్నిఁక న్నే, నద్దెలఁ గోగిరంబుఁ బచనం బీ వన్నటుల్ సేయు, పా
వక! వాయుద్వయయుక్తి, పై పసిగ; దేవా! భక్తచింతామణీ!

శా. లేచన్ భారము దోఁచు నీరసత గల్పించెన్, బసాదంబునం
దావం తేనియు నిష్టతం బోరయ నీ కష్టంబునుండిం దెవుల్;
దేవా! యీ విషమామయంబు కడ నిస్తేజంబు లే మందులున్;
నీవే దీనిఁ బొకార్చి కావవలె నన్ వే; భక్తచింతామణీ! 10

శా. మందుం బోలెను నీవు నా చెనఁటి శ్లేష్మవ్యాధి నిర్మూలన
మ్మందుం జాలవె? జాలనుం జలుపు; దే మందుం? బురాకర్మమం
దుండుం బాల్మఁ; గృతాంతు నోర్చితి; తపీయుం బంటు గొంటంగ శే
షుండే? యీశ్వర! సర్వశక్తుఁడవు గావో? భక్తచింతామణీ! 11

మ. కడవం బెట్టితి పెక్కు ఘట్టములు చుక్కన్ మత్తనూయాత్రయుం
దడుగన్; దాని స్మరించి తెల్లెడప నిన్ బ్రార్థింతు నార్తుండనై;
పొడమున్ బెట్టెడుచోట నాసయు, భయంబుం గొట్టుచోఁ గాదె? నా
యడియాసన్ సఫలం బొనర్పు; పరమేశా! భక్తచింతామణీ! 12

మ. గతజన్మంబుల వర్తమానజని నా గావించుకొన్నట్టి దు
ష్కృతులం బట్టి కనంగ, నేఁ బతితుఁడన్ శిక్షార్హుఁడన్ నిక్కమే;
పతితుం బావనుఁ జేయు నీ వ్రతముఁ, ద్వత్పాదాబ్జసేవామహా
త్మతయుం బొంకులె? నా రుజం దొలపు మింతన్; భక్తచింతామణీ!

మ. కరుణాసాగరుఁ డన్న మేటి బిరు దొక్కం డుండుఁ గా నీ; క దె
వ్వరు గల్గించిరి? దేవ! మాదృశమహాపాపాత్మకుల్ గారె? త
చ్చిరసంబంధము నెంచి యైన, నను గాసిం బెట్టు రుగ్వ్యాఘ్రభీ
కరదంష్ట్రల్ పెకలించి కాచికొను టెంతన్; భక్తచింతామణీ!

శా. కైలాసంబునకో, శిలాఘటితదాక్షారామగోదావరీ
కూలస్థోన్నతగోపురావళికొ, యేగున్ వేగ, వ్యాయామచ
ర్యాలక్ష్యం బయి, యందుఁ ద్వత్ప్రియవిహారక్షేత్రబుద్ధిన్ మనం;
బేలా వ్యాధి నశింప దింక? భవహారీ! భక్తచింతామణీ! 15

మ. అతితిక్తం బగు నౌషధంబు, మధురం బౌ నీదు నామంబు, నేఁ
బ్రతివారంబును శ్రద్ధ భక్తి నియతిం బాటించి సేవించెదన్;
మతి నానాఁటికి రోసె నాద్యమునకున్; భద్రాత్మ! యన్యం బొకం
డె, తెవుల్ మాన్ప నొసంగు మాజ్ఞ దయఁ; దండ్రీ! భక్తచింతామణీ

శా. క స్నం తేమటియున్న; దానిఁ గదుజాగ్రత్తన్ గనున్ జెప్పు; నీ
వు స్న స్నట్టులు గాతు వెల్లపుడు; మద్బుద్ధిన్ సదా సంస్మరిం
తు న్నీ చేసెడు తాదృశోపకృతులన్; భూతాత్మ! నా యత్నమె
ల్లి న్నిర్వీర్య మొనర్చు తె వ్వుసుప వేలా? భక్తచింతామణీ! 17

మ. "సెలవుల్ దెచ్చుచుఁ గాతు నన్నెపుడు నే సేవాఽసమర్థుండనై
యలసత్వంబున నుండు, నప్పు" డని కొండం తాస, "మై పిప్పిగా
నలఁతం బెట్టు తెవుల్ దొలంప" వని నైరాశ్యంబు, యుష్మత్కటా
క్షలవంబందు జనించుఁ, ద్రుంపవు దృఢాశన్; భక్తచింతామణీ!

మ. విసువున్ వేసట రోఁత నిస్పృహత యుద్వేగం బధైర్యం బడల్
వ్యసనం బోర్వమి తెంపు లోఁగఁ జెడు భావంబుల్ సుడింబెట్టు మా
నస; మీ వ్యాధిఘనోధి నీదను బిడానం బట్టి నీ పాద మిం
త సుఖించున్; దరిఁ జేర్పు నింక మద మొందన్; భక్తచింతామణీ!

శా. స్వాంతంబందును దుర్వితర్కము నవిశ్వాసంబు నాస్తిక్య మా
వంతేనిం దఁజూపకున్నఁ, బరమాత్మా! తావకాంఘ్రిద్వయీ
చింతానందకళాంశమేని, నిఖిలక్ష్మాధిపత్యంబు నా
కెం, తా స్వర్గపతిత్వమైనఁ గలదా యీ? భక్తచింతామణీ! 20

మ. జడిగా నా కనుదోయి రేదొరఁగు బాష్పశ్రేణి, యీ సీతునం
బడి పాదంబుల వెచ్చవెచ్చగ, భవద్భావంబు రంజించెనో,
యడలుం జూడఁగలేని నీ కనికరం బవ్వారి గావించెనో,
యుడుకా కెన్; సదుదర్కసూచి యది నా; కో భక్తచింతామణీ!

శా. కారుంజీఁకటి గ్రమ్ము రేగడచి, యర్కజ్యోతి తోఁతెంచుచోఁ,
దారున్ నిద్దుర; దుఃఖధామ రుజ యంతం బొంది, నాపై భవ
త్కారుణ్యం బుదయించునజ్జుగుట, మేల్కాంటిన్ నినున్ వేఁడ; నా
కారోగ్యంపు దినంబుఁ గాన్పిక ధ్రువం బౌ; భక్తచింతామణీ! 22

మ. అడుగుల్ చుట్టిన వేఁడియశ్రువులు నే నట్టుల్ దొరంగించి పొ
క్కెడు రేగా, భవదంతరంగము గరంగెన్! దానికిం దేవ! య
ప్పుడె తార్కాణగ నాకు లోనుడుకు; చెయ్యుల్ భక్తసుల్లంబు నె
క్కుడు శోధింపక తేర తీరుపవు కోర్కుల్; భక్తచింతామణీ!

మ. గదముం, దెబ్బనుగొట్టి ధామ్మనఁగ దంకామీఁద, నేఁడూల్తుఁ, ద్వ
త్పదపద్మద్వయచింతనామృతరసాస్వాదైకదీక్షున్; బదిం
బదిగా నిన్ భవరోగవైద్యుఁ డని యామ్నాయంబు చాటించుఁ; బ
ల్కఁడె మిన్నున్ మను నిట్టిదైన కృప యేనా? భక్తచింతామణీ!

మ. "గురుమూర్తుల్ గురుశిష్యులిర్వురును నాకుం గూర్చు చందిం త్రిగో
చరతన్ గోచరతన్ బదంబులును భైషజ్యంబుఁ; దత్సేవ మే
ల్బారయం జేయదె?" యన్ ధృతిం బలికితిన్ "మ్రోఁగించిడం కాఁగడిం
దిరుజం దూలుతు" నంచు; నిల్పు శపథోక్తిన్; భక్తచింతామణీ!

మ. అడుసుం ద్రొక్కి తొలంప దాని, జలమున్ యాచించుకం టెన్ వరం
బెడగా దానికి నోసరిల్లుట; దెవుల్లిక్కట్లు దూలింపు మం
చడుగన్, వేసరి, రోసెదన్ భవహరం బౌ మార్గ మే నార్తి; నీ
యడుగుం జాడలఁ ద్రిప్పు న; న్నమృతధామా! భక్తచింతామణీ!

శా. ఆకాశం బనిలంబుఁ దేజమును దోయం బుర్వి లేనట్టిచోఁ,
నేకాంతంబు వచించువాఁడు గలఁడే నీ దయ్యెదన్ వానికిన్,
నీ కంటం బడకుండఁ గార్య మెకటిన్ నేఁ జేయఁగాఁజాలినన్;
నా కృచ్ఛ్రంబు లడంపు; సర్వదురితఘ్నా! భక్తచింతామణీ! 27

మ. దురితవ్యాధిభవంబు లంచు దరి పొద్దున్ లే సె డారిన్ మహా
మరుభూమిన్ మకరాలయంబు స్మరియింపం జేయు; నన్ గర్మమం
దురలం ద్రోయఁ దరింప నా కెరవు గన్పించెన్; నినుం గంటి; నా
కరుసంబుం గలిగింపు మర్మ గతిఁ బ్రాపై; భక్తచింతామణీ! 28

మ. భవరాహిత్యము నాకు సల్పిన భవద్బ్రహ్మాండసంసర్జన
వ్యవహారంబున కేమి లోప మగునా? త్వల్లోకమం దుండనా?
భువి సర్గం బయి కాకపోనొ దివి? నన్ ముక్తాత్ము లైనట్టి నీ
వివిధాస్థానకవీశులం గలుపు భావిన్; భక్తచింతామణీ! 29

మ. ప్రతివారం బొక దివ్యసిద్ధఫలముం బ్రత్యూషకాలంబునన్
క్షితిపై రాల్చు రసాల మున్న యెడ, నిన్ జింతామణీయానుబం
ధత మోఘేదకపద్యరత్నములటుల్ నా బుద్ధిఁ దోఁపించు భ
వ్యతరుం బోలుతు దానితోఁ; నమృతనామా! భక్తచింతామణీ! 30

ఏకలిపి

కోమాండూరి శఠగోపాచార్యులు గారు, బి. ఏ. (ఆనర్సు)

మన భరతఖండమున కనేకులు సంగ్రహప్రపంచ మని పేరిడిరి. ఇందుఁ గల నైసర్గికస్వరూపవైచిత్రియే కాక జనుల జాతిమతభాషాదులయందలి వివిధభేదములును మరియే యితర దేశమునందును కానరా వని చెప్పవచ్చును. ఇట్టి భేదము లన్నియు నేకదేశమునందు కూడియుండుట తారతమ్యచర్చ చేయఁ బూనుకొను కొందఱు విద్వాంసులకు మిక్కిలి యుపయోగకారి యగుట యథార్థము. కాని, వానిలోని కొన్ని వైషమ్యములు మన జాత్యైక్యమునకు భంగకరములంగా పరిణమించుచున్నవి. ఇతరదేశములలో కూడ నక్కడక్కడ కొన్ని విషయములందు భేదవైషమ్యము లున్నవి కాని, అన్ని విషయములందును విచిత్రత యొకఁన దేశమున మాత్రమే సమకూడి జాత్యైక్యమునకు హానికరము లగుటకు పరస్పరము సహాయము గావించుచున్నవి. వానిలోని కొన్ని సమస్యలు పరస్పరసంబంధము కల వగుటవలన వానిని పరిష్కరించుట దుస్సాధ్యముగా నున్నది. కాని, యొకొక్కటి పరిష్కృత మైన కొలఁది ఇతరసమస్యలను పరిష్కరించుట సులభతర మగును.

కొంత కాలమునుండి యేకభాషను వ్యాపింపఁజేయుటకు మన దేశమున ప్రయత్నములు జరుగుచున్నవి. నాగరప్రచారిణీసభ మొదలగు కొన్ని సంస్థలు హిందీభాషను సాధ్య మైనంతవఱకు సర్వవ్యావహారికభాషగా చేయుటకు ప్రయత్నించుచున్నవి. ఈ కార్యమునందలి కష్టముల ననేకు లెఱిఁగియే యున్నారు. ఈ విషయమున మన దేశము యూరపుఖండముతో పోల్పఁబడుచున్నది. కాని, యూరపుఖండమునం దంతటను(ఒకటి రెండు దేశములందు తప్ప)జనులందఱు నొక్క లిపినే వాడుచున్నందున వా రొకరి భాష నింకొకరు నేర్చుకొనుట సులభము. అది గాక, యూరపుఖండము ఏకదేశము కాక అనేకదేశములు కూడియున్నందున అచ్చట కొన్ని యంతర్దేశీయవ్యవహారములకు మాత్రమే యేకభాష కావలసియున్నది. అంతవఱకే కావలయు నన్నచో ప్రస్తుతము మన దేశమున నింగ్లీషు భాష యీ కార్యమును నిర్వర్తించుచునే యున్నది. భరతఖండ మేకదేశ మైనందున మన రాజకీయ సాంఘిక మత సారస్వత వృద్ధికై మన కేకభాష కావలసియున్నది. మొదట దేశమున నేకలిపి యేర్పడినఁ గాని యేకభాషావ్యాపనసౌకర్యము కలుగదు. ఏకలిపియే యున్నచో, అన్ని ప్రాంతములవారును సామాన్యభాషను గాని తమ ప్రాంతములందలి మరియొక భాషను గాని నేర్చుకొనుట సులభసాధ్య మగును.

మన దేశమున ప్రస్తుతము ముప్పాతిక మువ్వీసము జనులకే లిపిజ్ఞానమును లేదు. జనసామాన్యమునకు తప్పక చదువను వ్రాయను నేర్పుట కిప్పుడే ప్రయత్నము లారంభింపఁబడుచున్నవి. ఇట్టి తరుణముననే యేకలిపిని నిర్ధారణ చేసి వ్యాపింపఁజేయుటకు తగిన ప్రయత్నములు సలుపవలయును.

ప్రస్తుతము హిందూదేశమున సుమారు 10 ముఖ్యలిపు లుపయోగములో నున్నవి. అందు ఇంగ్లీషుభాషకై యుపయోగింపఁబడు రోమనులిపి యూరపుఖండపుది. అరబ్బీ మొదలగు తురుష్కభాషల లిపియే ఉర్దుభాషకును లిపిగా నేర్పడినది. తక్కినవానిలో ముఖ్యమైనది దేవనాగరి. బంగాళి గుజరాతి తెలుఁగు మొదలగున వన్నియు దీనిని పోలినవే.

ఇందు దేవనాగరి నేకలిపిగా చేయుటకు కొంత కాలము నుండి ప్రయత్నము చేయఁబడుచున్నది. కీర్తిశేషు లగు శారదాచరణమిత్ర గారి యధ్యక్షత క్రింద నీ యుద్దేశముతో కలకత్తాలో నేకలిపివిస్తారపరిషత్తు స్థాపింపఁబడి, అనేకఘనుల ప్రోత్సాహముతో 'దేవనాగర్' అను బహుభాషిమాసపత్రికను ప్రకటించుచుండెను. కాశి కలకత్తా మొదలగు నగరములందు స్థాపింపఁబడి హిందీభాషావ్యాప్తికై కృషి చేయుచున్న సభలకు దేవనాగరి నేకలిపిగా చేయుట కూడ ముఖ్యోద్దేశ మైనందున వానికి నాగరప్రచారిణీ సభ లని పేరు వచ్చెను. దేవనాగరి యిప్పుడు మన దేశమునం దన్నిటికన్న నెక్కువ విరివిగా వ్యాపించియున్న దగుటచే అదియే యేకలిపి యగుటకు వీలుపడునా యను విషయమును మన మిప్పుడు నిష్పక్షపాతబుద్ధితో విమర్శింపవలసియున్నది. దేవనాగరి హిందీ మహారాష్ట్రభాషల లిపి. ఈ జనులు సుమారు పది కోట్లుందురు. (కాని, వీరిలో మిక్కిలి స్వల్పసంఖ్యాకులు మాత్రమే లిపిజ్ఞానము కలవారని మనము జ్ఞప్తియం దుంచుకొనవలయును.) అది గాక, సంస్కృతమునందలి యనేక ప్రాచీనగ్రంథములు నాగరిలిపిలోనే యచ్చుపడియుండుటవలనను నాగరి సంస్కృతపు స్వకీయలిపిగా నెంచఁబడుటవలనను అది పవిత్రముగా నెంచఁబడి సంస్కృతభాషాజ్ఞులనేకులచే నేర్చుకొనఁబడుచున్నది. అందలి యక్షరముల యేర్పాటును వాని వరుసయు శబ్దశాస్త్రవిహితముగా నున్నవి. కాని, దేవనాగరి జాతి లిపులలో, అందు ముఖ్యముగ నాగరిలో, అనేకలోపములు కూడ కలవు. ఈ లిపిని వ్రాయుట కష్టసాధ్యము. శీఘ్రముగ వ్రాయుటకు వీలుపడదు. ఈ లిపిలోని ప్రత్యక్షరము నొక కట్టడమువలె నుండును. దీనికన్న గుజరాతి బంగాళి తెలుఁగు మొదలగు లిపుల నెక్కుడు సులభముగ వ్రాయవచ్చును. ఈ యన్ని లిపులలోను సంయుక్తాక్షరములను కలిపి వ్రాయు పద్ధతి యుండుటవలన వాని గుణితమును నేర్చుకొనుట కష్టము. అది ముఖ్యముగా కోమలమనస్కులగు బాలురకు శ్రమను కలిగించును. వాని యచ్చుల సిద్ధము చేసి

కూర్చి ముద్రించుటయు వ్యయప్రయాసకరము. ఇందువలననే దేశభాషలందు టైపు రైటింగు యంత్రములు వ్యాపించుట దుస్తరమయ్యెను. ప్రస్తుతకాలమునందు వివిధవ్యాపారాలయములందును కచేరీలయందును టైపుయంత్రములు ప్రాముఖ్యము వహించుచున్న విషయ మందఱకును తెలిసియే యున్నది. సౌలభ్యమును మాత్రము విచారించినచో నాగరియు నితరము లగు దేశీయలిపులు నేకలిపి యగుట కనర్హము లని తోఁచక మానదు. ఉర్దులిపియు మిక్కిలి క్లిష్ట మను సంగతి యందఱకును విదితమే. ఇఁక పాశ్చాత్యలిపి యగు రోమనక్షరముల విషయము విమర్శింపవలసియున్నది. లిపివంటి విషయమును విమర్శించునప్పుడు జనసౌకర్యమునే ముఖ్యముగా నెంచుకొని, ఆత్మీయతాభిమానమును విడువవలయును. ఎంత క్లిష్ట మైనను సౌకర్యరహిత మైనను మన దేశీయలిపియే మన కుండవలయు నని తలంచుట తప్పు. లిపి యనునది మానవుల యభిప్రాయరూప మైన భాషను పరస్పరము పరోక్షమునఁ గూడ తెలియఁబఱచుకొనుట కేర్పడిన ముఖ్యోపకరణము. ఇందు పవిత్రతాజాతీయతాసమస్యలు లేవు. ఉపకరణములకు అందము గాని పూజ్యత గాని ముఖ్యము గాదు. సౌకర్యమే ప్రధానము. ప్రస్తుతకాలస్థితిని బట్టి యుపయోగము తగ్గిన ప్రాఁత యుపకరణమును విడిచి సుగమమును సుకరమును నగు నూతనోపకరణమును గ్రహించుట పురోభివృద్ధి కోరువారి కెల్లరకు కర్తవ్యము. రోమనులిపి యిప్పుడు ప్రపంచమునం దన్ని ఖండములలోను విశేషముగా వ్యాపించియున్నది. నాగరికత గల యితర దేశములందు సంచారము చేయుటకును ఉత్తరప్రత్యుత్తరములు జరుపుటకును రోమనులిపి యత్యుపయోగకారి యగుటయే కాక మిక్కిలి యవశ్యముగ కూడ నున్నది. యూరపుఖండమునం దొకటి రెండు దేశములలో తప్ప తక్కిన యన్ని దేశములలోను రోమనులిపియే స్వల్పభేదములతో వ్యవహరింపఁబడుచున్నది. అందు ముఖ్యముగ ఆధునిక నాగరికతకును విజ్ఞానమునకును ఆలవాలము లని ప్రసిద్ధి చెందిన యింగ్లండు ఫ్రాంసు జర్మనీ దేశీయు లీ లిపినే వాడుదురు. వారి వాఙ్మయ మంతయు నిందే లిపిబద్ధ మైనది. నవీనప్రపంచ మనఁబడు నమెరికాఖండ మంతట నీ లిపియే వ్యాపించియున్నది. ఆఫ్రికాఖండమందలి ప్రధాన భాగములలో రోమనులిపి యితరలిపులను తరిమివేయుచున్నది. ఆస్ట్రేలియా మొదలగు పెద్దపెద్ద ద్వీపములు కూడ పాశ్చాత్యుల వలసరాజ్యములుగా నున్నందున అచ్చటను రోమనులిపియే యుపయోగములో నున్నది. నవీనసులభోపకరణములను గ్రహించి త్యాజ్యములను విడిచెడి స్వదేశాభివృద్ధితత్పరు లగు జపానీయులు క్లిష్ట మగు తమ దేశీయలిపిని విడిచి రోమను లిపిని గ్రహింప నిశ్చయించి రనియు తమ పాఠశాలలం దంతటను వారీ లిపినే బాలురకు నేర్పుచున్నా రనియు తెలియుచున్నది. జపాను చీనా దేశముల లిపి యొక్కటియే యగుటవలనను చీనాలో కూడ పాశ్చాత్యసంపర్కము వ్యాపించుచుండుటవలనను అచ్చట కూడ రోమనులిపి వేగముగా వ్యాపించుచున్నది. అందుచే అచిరకాలముననే చీనావారును రోమనులిపినే గ్రహింతు రని తలఁపవలసి యున్నది. మన దేశమున కూడ రోమనులిపినే ముఖ్యలిపిగా గ్రహింపవలసియుండుటకు కారణములు కలవు. దేవనాగరి మొదలగు దేశీయలిపులు చీనాజపానుల లిపియంత క్లిష్టము కాకపోయినను సులభతర మగు రోమను లిపి మనకు నుపాదేయ మగుటకు కారణాంతరములు కలవు. తమ యేఁబది కోట్ల ప్రజల కొక్కటియే లిపి యున్నను తాము స్వతంత్రదేశము లైనను చీనాజపానులకు రోమనులిపిగ్రహణము యుక్తతర మగునప్పుడు, మన దేశమున కూడ కాలక్రమమున రోమను లిపియే వ్యాపకలిపి యగుటకు సందేహ ముండదు. 31 కోటి భారతీయులును భిన్నప్రదేశములం దాయా లిపుల నుపయోగించుచున్నారు. ప్రస్తుత మెక్కువ వ్యాపకము గల దేవనాగరి తదితరము లగు గుజరాతి బంగాళి మొదలగు సులభతరలిపుల స్థానము నాక్రమింపఁజాలదు. మహమ్మదీయులు దేవనాగరిని గ్రహించుటకు కొంచెమైన నిష్టపడరు. ఇఁక మన మదరాసు రాష్ట్రమున ముఖ్యద్రావిడభాష లగు తెలుఁగు అఱవము కన్నడము మళయాళము వేర్వేఱు లిపులు కల్గియున్నవి. దక్షిణకన్నడమున మహారాష్ట్రమును (నాగరియు) గంజాము ప్రాంతమున ఓఢ్రమును కొంతమంది తురకలచే ఉర్దును వ్యవహరింపఁబడుచున్నవి. ఇట్టి స్థితిగతులను కలుగు క్లేశ మనుభవైకవేద్యము. రాజకీయస్థితి కూడ విచారణీయము. ప్రస్తుతము మన దేశములోని ముఖ్యభాగ మంతయు ఆంగ్లేయుల సంపూర్ణాధికారములో నున్నది. మన రాజ్యాంగవేత్తలు తమకు ప్రస్తుతము గోచరించినంతవఱకు ఇంగ్లండుతో మనకు కొంతవఱకు శాశ్వతసంబంధ ముండక తీర దని నిర్ణయించియున్నారు. అందువలన నాంగ్లుల వ్రాఁత యగు రోమనులిపి మన దేశమున వ్యాపింపక తప్పదు. ఇదివఱకే నగరములందలి విద్యార్థులు మాత్రమే కాక అక్షరజ్ఞానము కల జానపదులలో చాలమంది రోమనులిపిజ్ఞానము కలిగియున్నారు. ఇరువదియాఱు అక్షరములు మాత్రమే యగుటవలన ఒక్క దినములో నెవరైనను నేర్చుకొనవచ్చును. అందువలన ముందుముందు ఈ లిపి యింకను వేగముగ వ్యాపించుటకు సందేహము లేదు.

రోమనులిపిలోని కొన్ని గుణదోషములను మన మిప్పుడు గమనింతము. రోమను అక్షరములను సంయుక్తములనుగా (గుణింతముతో) వ్రాయు పద్ధతి లేనందున మన దేశీయలిపులలోని ముఖ్యదోష మందు లేదు. అచ్చులు గాని హల్లులు గాని విడివిడిగానే వ్రాయఁబడును. అందువలన అచ్చు కూర్పు టైపు యంత్రము సులభము లగును. ఇట్టి సదుపాయము లనేకములు కల్గును. మన దేశీయభాషలన్నిటికిని రోమనులిపి వ్యవహారము సౌఖ్యావహమై యేకలిపిసిద్ధిని కల్గించును. మఱియు, దేశీయులు సులభముగ నాంగ్లాదిపాశ్చాత్యభాషలను నేర్చుటకును అట్లే పాశ్చాత్యులు మన దేశభాషలను నేర్చుటకును సులభమార్గ మేర్పడును. ఈ లిపిని గ్రహించుటవలన మనకు అపవిత్రత గాని ఆంగ్లభూతు లగుట కాని సంభవించు నని తలఁచుట కేవలము పొరపాటు. అన్యభాషను స్వభాషగా నుపయోగించుటవలన జాతీయతకు కల్గు హాని యన్యలిపిగ్రహణమాత్రమున కలుగదు. అందువలన లేనిపోని మనస్సంకోచము నుంచుకొనక మన

దేశీయు లీ యుద్యమమునకు వెంటనే కడంగుట దేశహితకరము.

దేశీయభాషలకు రోమనులిపి నుపయోగించుట కప్పుడప్పుడు స్వల్పప్రయత్నములు చేయఁబడుచువచ్చెను. అనేకసంస్కృతగ్రంథము లిప్పుడు పాశ్చాత్యులు సులభముగా చదువుకొనుటకై రోమను లిపిలో ముద్రింపఁబడియున్నవి. భాషాసంబంధమగు గవర్నమెంటు జనాభాలెక్కలు రాయల్ ఏషియాటిక్ సొసైటీవారి ప్రచురణములు మొదలగువానియందు దేశీయభాషావాక్యములకు రోమనులిపి వాడఁబడుచున్నది. ఇప్పటికిని లిపిబద్ధములు కాని కొన్ని మన దేశభాషల సంబంధమగు పుస్తకములు రోమనులిపియందే ప్రకటింపఁబడుచున్నవి. హిందూస్థానీభాషను నేర్చుకొనుట కుపయోగించు కొన్ని పుస్తకములు కూడ ఈ లిపిలో కలవు. కాని, యీ యత్నములు కొన్ని తాత్కాలికస్వల్పసౌకర్యములకొఱకు ముఖ్యముగా నైరోపియనులచే నవలంబింపఁబడిన ప్రక్రియయే గాని యేకలిపి వ్యవహారార్థము కాదు. స్థిరముగా మనము రోమనులిపిని గ్రహించుచో అందు వలసిన కొన్ని మార్పులను చేసికొని జనానుమోదకముగ నుండునట్లు వానిని ప్రకటింపవలయును. అట్టి యుద్యమము మన దేశీయులచేతనే స్థాపింపఁబడి వ్యాపింపఁజేయఁబడవలయును. దీనికి పాశ్చాత్యులు కూడ మనకు తోడైనయెడల వారి సహాయమును మనము గైకొనవచ్చును. కాని, వారి యంగీకారమును పడయుటకై వారి లిపిలో నిప్పు డుండు లోపములను కూడ మనము కొనితెచ్చిపెట్టుకొనఁగూడదు. ప్రస్తుత మాంగ్లాదిభాషల రోమనులిపియందలి యనేక లోపములు పాశ్చాత్యులకు తెలిసియే యున్నవి. వీనిని తొలఁగించుటకు వారిలోని విద్వాంసులు కొందఱు తమ యావచ్ఛక్తిని వినియోగించుచున్నారు. కాని, యీ విషయమున వారికి పరస్పరమైకమత్యము లేకపోవుటవలన శతాబ్దములనుండి యానుపూర్వికముగ వచ్చుచున్న యీ లోపములను సవరించుట ఇంకను జయప్రదము కాకున్నది. ప్రస్తుతము మహారణసంబంధమగు సమస్యలందు మగ్నులై యున్న పాశ్చాత్యు లీ విషయము చర్చించి సవరించుకొనుట తటస్థింపదు. ఇప్పుడు పూర్తిగా వారి సహాయము నపేక్షించుటకును వీలు లేదు. అందలి దోషములను మనమే సవరించుకొని మన దేశీయములగు గుణముల నందుఁ జొనిపి స్వీకరించుట కర్తవ్యము. ఇప్పుడు ప్రతిసంవత్సరము కూడుచున్న సామాన్యభాషాసమావేశమునఁ గాని ప్రత్యేకసర్వహిందూదేశసభయందుఁ గాని యీ సమస్య చర్చింపఁబడిన బాగుగ నుండును. కాని, యెంత యుపయోగకరము లగు మార్పులైనను మన దేశమున సర్వజనామోదమును బడయ వను సంగతి మన కనుభవసిద్ధము. కనుక, ఈ యుద్యమము ప్రత్యేకవ్యక్తుల యుత్సాహకార్యములవలననే నెఱవేఱవలసియున్నది. వార్తాపత్రికానిర్వాహకులును గ్రంథముద్రాపకులును దేశీయభాషలకు ప్రస్తుత మెంత స్వల్పభాగమున నైనను ఈ లిపి నుపయోగించి పరీక్షించిన జయప్రదము కావచ్చును. ఇంగ్లీషులోని యక్షరవిన్యాసము (స్పెల్లింగు)ను గూర్చిన కష్టములును ఉచ్చారణయందు కల్గు వైషమ్యములును మనకు సంబంధించినవి కావు. ఈ క్రింద సూచించిన కొన్ని నియమము లాలోచింపఁదగినవి:

పెద్దవి చిన్నవి యను రెండు భేదము లీ యక్షరములందు కారణాంతరములవలన కలిగి, వ్యాకరణానుసార మింగ్లీషు భాషయం దుపయోగింపఁబడుచున్నవి. మన కిట్టి యావశ్యకత యేమియు లేనందున వానిలో నొకదానిని మనము విడువవచ్చును. అందు చిన్న యక్షరము లెక్కువ సులభములై విరివిగ వ్యాపించియున్నవి. అందువలన చిన్న యక్షరములనే మన ముపయోగించుకోవలసియుండును.

రోమనులిపియందు అచ్చుఅక్షరములు వేఱు, వ్రాఁతయక్షరములు వేఱు. మన దేశీయాక్షరములం దట్టి భేదము లేదు. వ్రాయునప్పుడు సౌకర్యముకొఱకు కొన్ని స్వల్పము లగు మార్పులను ఎవరికి వారు చేసికొనినను అవి నియమబద్ధములు కావు. ఈ భేదమును మనము తెచ్చి పెట్టుకొనుట యనావశ్యకము. అచ్చక్షరములను వ్రాయుట కష్టమైనందున పాశ్చాత్యులు వ్రాఁత యక్షరములను వేఱుగ నిర్మించుకొనవలసివచ్చినది. రోమనులిపియందు ఈ రెంటికిని మధ్యస్థముగా నుండు 'ఇటాలిక్' అక్షరములను ఈరెండింటి స్థానమునను గ్రహించుట మంచిది. మన దేశమునందు అక్షరములను కోలగా వంచి వ్రాయుట గాని అట్టి యక్షరములను ముద్రించుట గాని యాచారమునందు లేదు. కనుక, ఈ యిటాలిక్ అక్షరముల నొరిగియున్నట్లు కాక నిట్టనిలువుగా వ్రాఁతయందును అచ్చులను వ్యవహరింపవచ్చును. ఇందువలన ఆంగ్లేయులవలెనే ప్రతియక్షరమును నాల్గు విధములుగా పెట్టుకొను కష్టము తొలఁగును.

ప్రస్తుతము రోమను అక్షరముల వరుస నియమరహితముగ నున్నది. అచ్చులును హల్లులును శ్రీభూతము లగుటయే గాక ఉచ్చారణ స్వభావమును బట్టి దేశీయాక్షరములవలె వరుసగా నేర్పఱుపఁబడకయున్నవి. ఈ యక్షరములను మనము దేశీయాక్షరములవలె క్రమమైన వరుసనే యుంచుకొనవచ్చును.

రోమనక్షరముల పేర్లు కూడ సరిగ లేవు. చాల హల్లులు ఇకారముతో చేర్చి యుచ్చరింపఁబడుచున్నవి. మన దేశమున సాధారణముగ నకారముతో కలిపి యుచ్చరింపఁబడును. సరిగా చూచిన హల్లుల యుచ్చారణకు అచ్చులను కలుప నక్కఱ లేదు. అవి సులభముగా నుచ్చరించుటకు కలుపఁబడును. ఇది గాక, ఎకారోచ్చారణ గల యక్షరమును 'ఇ' యని చెప్పుటయు గకారమునకు 'జి' యనుటయు కలదు. మన మిట్లు పెట్టుకొనక మన పద్ధతినే యుచ్చారణకు తగినట్లు పేరు పెట్టుకొనుట మంచిది.

ఒకే యుచ్చారణకు రెండక్షరము లుండుట వ్యర్థము. అట్టి వానిలో నొకదానిని విడిచియో మరియొక సంజ్ఞ నిచ్చియో సవరించుకొనవలయును. k వలన కకారమును, s వలన సకారమును ద్యోతితమగుచున్నందున c కి చకారోచ్చారణ కల్పించుట చాల యుక్తము. ఈ పద్ధతిని రాయల్ ఏషియాటిక్ సొసైటీవా రవలంబించిరి. ch వలన ఛకారోచ్చారణము కల్గును. ch వలన చకారమును సూచించుట శబ్దశాస్త్రదుష్టము.

ఇట్లే కొన్ని యక్షరములు రెండు మూడు సంజ్ఞలకు వాడఁ

బడుచున్నవి. అందువలన సందిగ్ధత కల్గును. g ని గకారమునకే యుపయోగించి jను మాత్రమే జకారమునకు వినియోగపఱచుట యుక్తము. f వలన హిందుస్థానిలోని ఫకీరునందలి ఫకారమును ఇట్లే z వలన జమీనందలి జకారమును తెలుపవచ్చును. a, e, i, u ఇట్టి యచ్చుల కొక్కొక సంజ్ఞను మాత్రమే ఈయవలయును. ai వలన 'ఐ' యును ou వలన 'ఔ' ను తెలుపవచ్చును. kh తో 'ఖ' ను, gh తో 'ఘ' ను తెలుపుట సరియైన పద్ధతి. ణ్ ఞ్ మొదలగువానిని n మొదలగు వానికి పైనో క్రిందనో చుక్క మొదలగువానిని చేర్చి తెలుపు నాచారము గలదు. ఇట్లె శ్, ష్‌లను sకు గుర్తులను చేర్చి సూచింపవచ్చును. అనుస్వారమునకై mnలకు చుక్క చేర్చి వ్రాయవచ్చును. hకి గుర్తు చేర్చిన విసర్గము ద్యోతిత మగును. ఉచ్చారణసామీప్యము కలవానికి భిన్నభిన్నాక్షరములను పెట్టుటకన్న ఒక యక్షరమునకే భిన్నసంజ్ఞలు చేర్చి తెల్పుటవలన ఆ యక్షరముల సంబంధము కూడ తెలియుచుండును. తెలుఁగునఁ గొన్ని యొత్తక్షరములకు మన మట్లు చేయుచున్నాము. క్ష్, జ్ఞ్ మొదలగునవి సంయుక్తాక్షరము లగుటచే వానికి ప్రత్యేకాక్షరము లక్కఱయే లేదు.

అంకెల విషయమున కూడ వివిధభాషలవారు మన దేశమున వేఱువేఱు గుర్తులనే యుపయోగించుచున్నారు. ఇంగ్లీషు అంకెలు సులభమైనవే యగుటవలన వానినే పెట్టుకొనవచ్చును. తెలుఁగున కీవఱకే యీ యంకెలు చాలవఱకు వ్యాపించియున్నవి. (అరబ్బీ యంకె లని పిలువఁబడు నివి మొట్టమొదట హిందూదేశమునకే సంబంధించినవి.)

కావలయు మార్పులను చేసికొని రోమను అక్షరములను దేశభాషల కుపయోగించుట మిక్కిలి లాభకారి గనుక ఇది తప్పక పరీక్షింపవలసిన విషయము. వార్తాపత్రికానిర్వాహకులు తమ పత్రికలయందు ఎంత స్వల్పభాగమునైన ఇందులకై వినియోగించియు గ్రంథప్రచారకులు చిన్న చిన్న సర్వోపయోగిపుస్తకముల నీ లిపియందు ముద్రించియు సహాయము చేసిన నిది శీఘ్రముగ వ్యాపింపఁగలదు. ఈ లిపిసమస్య పరిష్కృతమైన, భాషాసంబంధ మగు కొన్ని యితరసమస్యలు కూడ సులభముగా పరిష్కరింప వీలు కలుగును. ఇందువలన హిందీ ఉర్దు, బంగాళి మొదలగు మిశ్రితసమీపభాషలకు అన్యోన్యసంబంధము హెచ్చుటయు దేశభాషలందు ఒకేవిధమగు సాంకేతిక పారిభాషికపదముల నుపయోగించుటయు సులభముగా నుండును.

తిక్కన ప్రశంస

తల్లాప్రగడ సూర్యనారాయణరావు గారు

తెలుఁగు కవిత్వపుఁ రచనఁ దెల్గునకున్ సహజంబులైన మే
ల్పలుకులఁ దేనెలుట్టిపడఁ బల్కుట ధర్మము గాని సంస్కృతో
క్తుల నగుచోటఁ గానియెడఁ గూడ నమర్చుట కూడ దంచు నే
ర్పలవడఁ దల్లిబాసఁ గృతి నల్లిన తిక్కన యజ్వ నెన్నెదన్. 1


చ. సలలితబ్రహ్మతేజ మొక చక్కిని క్షాత్త్రపుఁ దేజ మొక్కచోఁ
గలుష ము లేని వైదికపుఁ గర్మము లొక్కెడ మేటి లౌక్యపున్
విలసన మొక్కచోఁ గలిగి విశ్రుతకీర్తి దిగంతరంబులన్
మెలఁగఁగ నన్ని భంగులను మేల్మి గడించిన ప్రౌఢ నెన్నెదన్. 2

ఉ. పంచమవేదమై పరఁగు భారతమున్ రచియించినట్టి యో
గాంచితమూర్తి వ్యాసముని యాతని వ్రాఁతల నచ్చువేసిన
ట్లించుకయున్ రసస్ఫురణ యిట్టటు జాఱకయుండఁ దెల్గుగా
వించుట శక్య మన్యునకు నెవ్వరికయ్యెడు నీకుఁ దక్కఁగన్. ౩

చ. చెవులకు నింపుగాఁ గృతి రచించుట యొక్కటి; పల్కుపల్కునన్
బ్రవిమలభావమున్ జిలుకఁ బల్కుట యొక్కటి, రెండు నేకమై
శ్రవణము మానసంబు నలరన్ గను టొక్కటి; మేల్ రసంబు లు
ద్భవ మగు టొక్కటిన్నియును దార్కొనె నీకడ నేమి భాగ్యమో.

ఉ. వీరరసంపుఁ బల్కులె కవిత్వము నిండను నీకు నైన శృం
గార మొకింతయున్ జెడదు గానఁగ రా రది సంకరంబుగన్
గూరుపవచ్చు నీ కవితకున్ జెలికారము సత్యభామతోఁ
జేరదె వీర మా చెలువ చెంత మృదుత్వపటుత్వసిద్ధికై. ౫

Southborough Commission



సౌతుబరో విచారణ సంఘము.

Justice Sir Abdur Rahim.



న్యాయమూర్తి సర్ అబ్దురు రహీముగారు.

Sir John Wallis.




ముఖ్యన్యాయమూర్తులగు సర్ జాను వాలెసుగారు.

Mr Carol Henrikz Marks.




కారలు హెన్రిక్సు మార్క్సుగారు.

Sir William Crooks



సర్ విలియం క్రూక్సుగారు.

Prof. R. I. D. Jones.



ఆర్. ఐ. డి. జోన్సు పండితులు.

Late Bishop of Calcutta



కీర్తిశేషులైన కలకత్తా బిషప్పుగారు.

Dr. William Skinner.



డాక్టరు విలియం స్కిన్నరుగారు.

Sir John Stone.



షర్ జాను స్టోనుగారు.

Nawab of Banaganapalli.



బనగానపల్లి నవాబుగారు.

Mr. Doorly.



డూర్లిగారు.

ఆంధ్రవాఙ్మయాభివృద్ధి

వల్లూరి కృష్ణమోహనరావు గారు, ఎమ్. ఏ., బి. ఎల్.

ఆంధ్రవాఙ్మయాభివృద్ధి విషయమై వ్రాయవలె నన్నచో, తచ్చరిత్రవిభాగములను అట్టి చరిత్రోదాహరణభూతు లైన మహాకవులను వారు రచియించిన గ్రంథరాజములను మనము మనంబున విశదంబుగ నుంచుకొనుట యత్యంతావశ్యకము. ఆంధ్రసారస్వతమును కాలానుసారముగ మూఁడు భాగములుగ విభజింపవచ్చును. నన్నయభట్టు మొదలు కృష్ణదేవరాయలవఱకు మొదటి కాలవిభాగము. కృష్ణదేవరాయలు మొదలు ఇప్పటివఱకు రెండవ విభాగము. ప్రస్తుతకాలము మూఁడవ విభాగము. మొదటి కాలవిభాగమం దుండెడి కవుల నాదికవు లని కాని పూర్వకవు లని కాని, రెండవ కాలవిభాగమం దుండెడి కవులను మధ్యకవు లని, మూఁడవ కాలవిభాగమం దున్న కవుల నాధునికకవు లని చెప్పవచ్చును మొదటిది కాలవిభాగము, రెండవది కవుల విభాగము నై యున్నది. ముందుగ నీ చరిత్రవిభాగముల లక్షణములను సూచించి పిమ్మట తదుదాహరణభూతు లైన కవీశ్వరులను వారి గ్రంథములను చర్చించెదను. మొదటి యుగమందుఁ గేవలము సంస్కృతమున నున్న పురాణేతిహాసముల నాంధ్రీకరించుటయు రెండవ యుగమందు నూతనముగఁ బ్రబంధములఁ దెలుఁగున రచియించుటయు మూఁడవ యుగమం దంతవఱకు లేని దృశ్యకావ్యములను వచనకావ్యములను రచియించుటయు లక్షణములు. ఇందుచేతనే మొదటి యుగము పురాణయుగము లేక భాషాంతరీకరణయుగ మనియు, రెండవ యుగము ప్రబంధయుగ మనియు, మూఁడవ యుగము దృశ్యవచనకావ్యయుగ మనియు వర్ణింపఁబడుచున్నవి. ప్రథమయుగమందు విలసిల్లిన కవీశ్వరులఁ జెప్పక పూర్వమే సంస్కృతాంధ్రసారస్వతాభివృద్ధులకుఁగల సమానాంశములఁ దెలిసికొనఁదగును. ఉభయభాషలలో మొదట నర్థగౌరవప్రధానము లగు కావ్యములు బయలుదేఱెను. పిమ్మట శబ్దార్థముల రెంటికిఁ బ్రముఖత నిచ్చిన గ్రంథములు వ్రాయఁబడినవి. ఆటుతరువాతఁ గేవలశబ్దప్రధానములైన గ్రంథములు రచింపఁబడినవి. ఈ విషయముఁ గ్రమముగా నుదాహరించెదను. కాని, సంస్కృతసారస్వతమునకు నాంధ్రసారస్వతమునకుఁ గల భేద మేమి యన, సంస్కృతమునం దాదినుండియు దృశ్యప్రబంధములును వచనకావ్యములును రచియింపఁబడుచు వచ్చెను. అట్టి దృశ్యప్రబంధములు కాని వచనకావ్యములు కాని ఇక్కాలపుఁ గవులు తక్కఁ బూర్వు లెవ్వరును వ్రాయలేదు. ఆంధ్రసారస్వతమున నర్థగౌరవమునకు ప్రాధాన్యము నిచ్చిన కవులు నన్నయభట్టు మొదలు శ్రీనాథునివఱకును, శబ్దార్థగౌరవములఁ గాపాడిన కవులు పోతనామాత్యుఁడు మొదలు తెనాలి రామకృష్ణకవి పర్యంతమును గలరు. కేవలశబ్దగౌరవమునకొఱకై పాటుపడిన కవులప్పకవి మొదలు పందొమ్మిదవ శతాబ్ది యారంభమం దున్న కవులవఱకును గలరు. ఇఁక నీ విషయముల కుదాహరణభూతు లైన కవీశ్వరుల గ్రంథరాజములను లక్షణములుగఁ దీసికొని సవిస్తరముగ వివరించెదను. అట్టి కవీశ్వరులలో నాదికవి యని చెప్పఁబడు నన్నయభట్టు విషయమై మొదట విచారించెదను. ఇతని కాలమందుఁ గేవలము సంస్కృతగ్రంథములనుండి భాషాంతరీకరణముఁ జేయుటయే కవిత్వలక్షణ మని పైని చెప్పియుంటిని. అట్టి భాషాంతరీకరణమునం దగ్రేసరులై యాంధ్రకవిత్వమునకు జీవమునిచ్చి ప్రథమయుగారంభకు లైన కవిత్రయముఁ గూర్చి యించుక సవిస్తరముగ వ్రాయుట సమంజసము. కవిత్రయములో మొదటివాఁ డైన నన్నయభట్టు సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యము గలిగి యుభయభాషలందుఁ గవిత్వముఁ జెప్ప సమర్థుఁడై యుండెను. అందుచేత నీయన కవనమం దించుమించు రెండు వంతులు సంస్కృతపదములు నొకవంతు తెలుఁగు పదములు నుండును.

నన్నయభట్టు సంస్కృతపదముల నెక్కువగ నుపయోగించినను శబ్దార్థములు రెండును స్ఫుటముగ నుండునట్లు వ్రాసియున్నాఁడు. ఈ విషయమున కతఁడు రచియించిన భారతభాగమే యుదాహరణ మై యున్నది. ఇటీవల వ్రాయఁబడు ప్రతిగ్రంథమం దించుమించుగాఁ గనఁబడు షష్ఠ్యంతములును స్వప్నకథలును నన్నయభట్టు వ్రాసిన గ్రంథమునం దెచ్చటఁ గానరావు. తక్కిన కవులవలెఁ గాక యితఁ డాంధ్రభారతాదులయందు దేవతాస్తుతిని సంస్కృతశ్లోకముతోఁ జేసియున్నాఁడు. నన్నయతోఁ బ్రారంభమైన యుగము పురాణయుగ మని పైని చెప్పితిని. అది యెట్లన్న నీతని కాలమందు కేవలము సంస్కృతమం దుండెడి పురాణేతిహాసములఁ దెనిఁగించుటయే ముఖ్యమై యున్నది. కాని, నన్నయ మొదలగువారు చేసిన యాంధ్రీకరణములు నేటి కాలమునఁ జేయఁబడు నిర్జీవ మైన మాటకు మాట తెలుఁగు కాక మిగుల రసవంతములై కొన్ని విషయములందు మూలగ్రంథములఁ గూడ మించి కేవల సంధానకావ్యములు (Adaptations) గా స్ఫురించుచున్నవి. ఈ యంశమునకు భారతమే నిదర్శనము. "నన్నయ యొకఁడే కాక సంస్కృతగ్రంథములఁ దెనిఁగించిన కవు లందఱుఁ గూడఁ దమ యిష్టానుసారముగఁ గొన్ని చోట్ల మూలగ్రంథములలోని కథలను సంగ్రహపఱచియుఁ గొన్ని చోట్ల పెంచియుఁ గొన్ని చోట్ల కథలను మార్చి వేఱు కథలఁ జేర్చియుఁ గొన్ని చోట్ల నూతనకథలఁ గల్పించియు మఱికొన్ని చోట్ల మును పున్న వానిని బొత్తిగాఁ దీసివేసియు యథేచ్ఛముగ వర్ణనలఁ బెట్టి ప్రధానకథాంశమును మాత్రము వదలక అన్ని విధముల మూలగ్రంథములకంటెఁ దమ గ్రంథములు భిన్నములుగా నుండునట్లు చేసిరి." అని వీరేశలింగము పంతులు గారి యాంధ్రకవుల చరిత్రమందు వ్రాయఁబడియున్నది.

అర్థగౌరవమే ప్రధానోద్దేశ మగుటచే నన్నయ కవనమందు శబ్దాలంకారము లెచ్చటఁ గానరావయ్యె. పాకము కూడ ద్రాక్షాపాకమై యర్థగౌరవమునకుఁ దోడ్పడి యా యర్థగౌరవమునకుఁ బ్రముఖతఁ దెచ్చుచున్నది. కవిత్వము మృదువై సులభశైలిని వ్రాయఁబడి మిగుల రసవంతముగ నున్నది. ఇఁకఁ గవిత్రయములో రెండవ

వాఁడైన తిక్కన సోమయాజి విషయమై విచారించెదము. నన్నయ వలెనే యీ కవియుఁ దన గ్రంథమును మూలమునకు సరిగాఁ దెనిఁగింపలేదు.

కవిత్వమందు నిరంతరోన్మేషణమును సద్యోత్పాదకమై సందర్భమున కుచితమైన పదప్రయోగమును తిక్కనకుఁ దక్క నింకెవ్వరికిని రానేరదు. నన్నయ చేసిన యాంధ్రీకరణమునకుఁ దిక్కన చేసిన యాంధ్రీకరణమునకు నీ క్రింది ముఖ్యభేదములు స్పష్టముగ నగపడుచున్నవి. తిక్కన కవిత్వమందు నన్నయ కవనమందువలెఁ గాక రెండు వంతులు తెలుఁగు పదములు నొక వంతు సంస్కృతపదములు నుండును. తిక్కన కవనమందు రాజిల్లు సందర్భశుద్ధి రచనాచమత్కృతి కల్పనాకౌశలము భావనాశక్తి వాక్యసౌష్ఠవము పాత్రోచితగుణపోషణము యుక్తిబాహుళ్యము విశేషవర్ణనాకౌశలము అర్థగౌరవము నొక్క నన్నయ కవిత్వమందే కాక నేఁటివఱకు వివిధ గ్రంథముల రచియించిన యే కవుల కవిత్వమందుఁ గూడ దుర్లభములై యున్నవి. ఇతని కవిత్వపాకము కూడ నన్నయ కవనపాకమువలె ద్రాక్షాపాకమున నున్నది. కవన మతిరసవంతముగ నున్నది. ఏ పదము నెప్పు డుపయోగించిన రసస్ఫూర్తి గలుగునో యీ కవికిఁ దెలిసినట్లు మఱెవరికిఁ దెలియదు. ఈయన కవిత్వ మంతయు లోకోక్తులతోఁ గూడి మిగుల జాతీయముగా నుండుటచేతఁ దరువాతి కవులైన మారన ఎఱ్ఱాప్రెగడ శ్రీనాథుఁడు మొదలగువా రందఱుఁ దిక్కన కవిత్వమునే యనుకరించి వ్రాయవలయు నని మిగులఁ గష్టపడి తిక్కన చేసిన వర్ణనములవంటి వర్ణనములఁ జేయఁ బ్రయత్నించిరి. అట్టి కవులలో ముఖ్యుఁడైన మారన తిక్కన శిష్యుఁడై తాను రచించిన మార్కండేయపురాణమున నీ క్రింది విధముగఁ దిక్కన ననుకరించినాఁడు:

మ. ధరణీచక్రము దిర్దిరం దిరిగె మార్తాండుండు ఘూర్ణితమ

త్కిరణుం డయ్యె దిశావితానము వడం కెన్మిన్ను మ్రోసె న్మహీ-

ధరసంతానము లోలి గ్రక్కదలె నుద్భ్రాంతంబులై యంబుధుల్

పొరలెన్ గట్టులమీఁదఁ బిట్టపిడుగుల్ మ్రోసెన్ నితాంతధ్వనిన్.

ద్రో. ౫ ఆ.

మ. ధరణీచక్రము దిర్దిరం దిరిగెఁ బాతాళంబు ఘూర్ణిల్లె భూ

ధరవర్గంబు చలించెఁ దెల్లుబ్బె దిశాదంతావళిశ్రేణి మ్రొ

గ్గె గవీందుద్యుతి తారకావితతి మ్రగ్గెన్ మ్రోసె బ్రహ్మాండమున్

శరధిన్ బిండలివండుగాఁ గలఁగె నాశ్చర్యం బుదగ్రంబుగన్.

మా. ౬ ఆ.

షష్ఠ్యంతములను స్వప్నకథలను మొదట నుపయోగించిన కవి తిక్కనయే. ఆయనఁ జూచియే యీ దినమువఱకుఁ దరువాతి కవులందఱు తాము రచియించిన గ్రంథములలోఁ దప్పక షష్ఠ్యంతములను స్వప్నగతమైన యిష్టదేవతాసాక్షాత్కారమును వెట్టిగా వేసికొనుచున్నా రని వీరేశలింగము గారు స్పష్టముగఁ దమ కవులచరిత్రమందు వ్రాసియున్నారు. తిక్కన కాలమందు వచనకావ్యములు లేకపోవుటయే కాక కావ్యములను నిర్వచనములుగ వ్రాయవలె నను దీక్ష కూడ నున్నట్లు గన్పట్టుచున్నది. ఇందులకు దృష్టాంతము తిక్కన రచియించిన నిర్వచనోత్తరరామాయణమే. తెలుఁగు కవిత్వము నన్నయతోఁ బ్రారంభమైనను దిక్కన నాఁటికే జాతీయముగఁ గుదిరినది. ఆంధ్రభారతి కూడ సర్వావయవపూర్ణసౌందర్యయై తిక్కన కాలమందే మహోన్నతదశ ననుభవించె నని చెప్పవచ్చును. ఇఁకఁ గవిత్రయములోఁ గడపటివాఁడైన యెఱ్ఱాప్రెగడ విషయ మించుక విచారింతము. ఇతఁడు తిక్కన సోమయాజి కవిత్వమునం దత్యంతగౌరవము కలవాఁడయి యతనివలెఁ గవిత్వముఁ జెప్పఁ బ్రయత్నించినవాఁ డగుటచేత నతనివలెనే తన గ్రంథములందుఁ గూడ షష్ఠ్యంతములను స్వప్నంపు టిష్టదేవతాసాక్షాత్కారము నుపయోగించినాఁడు. నన్నయతిక్కనలవలెఁ గాక యితఁడు సంస్కృతపదములఁ దెలుఁగు పదములు సమానముగ నుపయోగించినాఁడు. పాకము నన్నయతిక్కనల ద్రాక్షాపాకమువలె కాక కొంచెము కష్టమైనను మొత్తముమీఁద మాత్రము మధురమై తిక్కన కవిత్వముఁ బోలియుండును. ఇతని భాషాంతరీకరణము గూడఁ దిక్కననన్నయలు చేసిన భాషాంతరీకరణమువలెనే మూలగ్రంథానుసారముగ నుండదు.

ఇట్లు చెప్పుటచేత నన్నయభట్టారకునికి నెఱ్ఱాప్రెగడకును మధ్యకాలమునందుఁ దెలుఁగు కవు లెవ్వరును లే రని భ్రమింపఁ గూడదు. అథర్వణాచార్యుఁడు భీమకవి రంగనాథుఁడు భాస్కరుఁడు కేతన మారన పెద్దన మొదలయినవారీ మధ్యకాలమునం దనేకు లున్నారు. వారిని గుఱించి కూడ సంగ్రహముగా నిఁకమీఁద వ్రాయుచున్నాను. ఆంధ్రమహాభారతమును రచియించిన యీ ముగ్గురు కవులును బ్రాహ్మణాగ్రణులు. సర్వవిధముల వీరి కవిత్వము శ్లాఘ్యమైనది. వీరి కాలముననే కవిత్వము సర్వాంగసంపూర్ణమై విలసిల్లె. ఈ కవిత్రయము సంస్కృతమునందువలె దీర్ఘసమాసములఁ బ్రయోగింపక మిగుల నింపుగ వ్రాయుట కసాధారణశక్తి గలవారు. లేనిచో నాంధ్రమహాభారతమువంటి శాశ్వతగ్రంథముఁ జేయుట దుస్సాధ్యము. కావుననే, వీరు స్వకృతములైన గ్రంథముల వ్రాయక కేవలసంస్కృతపురాణేతిహాసముల నాంధ్రీకరించినను సర్వజనాదరణకుఁ బాత్రులైరి. ఈ భారతకవులు మొదలు శ్రీనాథపోతనామాత్యులవఱకు నుండిన కవు లంద ఱించుమించుగ నీ కవిత్రయము ననుకరించి పురాణేతిహాసములఁ దెలిఁగింపఁ జొచ్చిరి. అట్టి కవులలో ముఖ్యులైన మారన అథర్వణాచార్యుఁడు నాచనసోముఁడు మొదలగు కవులు తిక్కన శైలి ననుకరించి యతనివలెఁ గవిత్వము చెప్పఁ బ్రయత్నించిరి. కాని, వారి కవిత్వ మే యంశమునఁ గూడఁ దిక్కన కవిత్వమునకుఁ బోల్పఁ దగదు. నాచన సోముఁ డప్పటి కెవ్వరు నుపయోగింపని శబ్దాలంకారములఁ గూడ నుపయోగించె. అట్లు పురాణేతిహాసములఁ దెలిఁగింపక నూతనమార్గములఁ ద్రొక్కిన కవు లెవ రనఁగా: గణితశాస్త్రమును విరచించిన మల్లన్న, కావ్యాలంకారచూడామణి యను లక్షణగ్రంథమును రచించిన విన్నకోట పెద్దన్న, త్రిపురాంతకోదాహరణ మను నుదాహరణ గ్రంథమును రచియించిన తిప్పన్న, వేదాంతగ్రంథమును రచియించిన ఘటిభట్టు, వైద్యగ్రంథమును రచియించిన [illegible]భట్టు, లక్షణగ్రంథమును రచియించిన కవిభల్లటుఁడు, ఆంధ్రసారస్వతమందు మొదటి నాటకగ్రంథకర్తయైన వల్లభరాయఁడును గనఁబడుచున్నారు. వల్లభరాయఁడు రచియించిన వీథినాటకము పేరు క్రీడాభిరామము. ఇందలి కథ నూతనము కాక సంస్కృతమున దశరూపకమునుండి గ్రహింపఁబడినది. ఇఁక శ్రీనాథపోతనల విషయము. శ్రీనాథుఁడు కవిత్రయము తరువాత మిక్కిలి ప్రసిద్ధుఁడైన కవి. ప్రౌఢకవులలో నగ్రగణ్యుఁ డగుటంజేసి యీతనికిఁ గవిసార్వభౌమబిరుద మీయఁబడినది. సంస్కృతప్రాకృతాంధ్రములయందు మంచి పండితుఁడు కావున నీతని కవిత్వమందు సంస్కృతపదము లపరిమితములుగ నగపడుచున్నవి. వీథినాటకము హరవిలాసముఁ దప్ప నీతఁడు రచియించిన గ్రంథము లన్నియు సంస్కృతప్రాకృతములకుఁ దెలుఁగులే. ఆంధ్రసారస్వతమందు వల్లభరాయని తరువాత వీథినాటక మను దృశ్య

కావ్యమును రచియించిన కవి యీతఁడే. ఈయనకుఁ గూడ పద్యాంత ప్రాసాగౌరవము కలదు. ఈ కవి తెలిఁగించిన గ్రంథములం దెల్ల శృంగారనైషధమే యగ్రగణ్యమైనది. నైషధాంధ్రీకరణమందు శ్రీనాథుఁడు సంస్కృతము నత్యధికముగ నుపయోగించి బహుస్థలములను సాంస్కృతికదీర్ఘసమాసములతో నింపియున్నాఁడు.

శ్లో. "సువర్ణదండైకసితాతపత్రిత
జ్వలత్ప్రతాపావళికీర్తిమండలః" (నై. ౧ స. ౨ శ్లో.)

అను భాగమును

సీ. "తపనీయదండైకధవళాతపత్రితో
ద్దండ తేజఃకీర్తిమండలుండు"

అని తెలిఁగించినాఁడు. మఱియు, నూఱవ పద్యమందలి

శ్లో. "సరసీః పరిశీలితుం మయా
గమికర్మీకృతనైకనీవృతా (సర్గ 2. శ్లో. 40)

అనుదానిలో 'గమికర్మీకృతనైకనీవృ' తేత్యాదిభాగమును 'గమికర్మీకృతనైకనీవృతుఁడనై' కంటిన్ విదర్భంబునన్ అని మార్పేమియుఁ జేయక తుదను విభక్తిప్రత్యయమైన 'డు' వర్ణకమును మాత్రము చేర్చి తెనుఁగనిపించెను. ఈ సందర్భమున నిట్టి కఠినదీర్ఘసమాసప్రయోగమునకు మార్గదర్శి శ్రీనాథుఁడని స్పష్టముగఁ దెలిసికొనవలెను. ఈతనికిఁ బూర్వులైన కవిత్రయమువారు తమ కావ్యములను చిన్న సమాసములతో నాంధ్రపదభూయిష్ఠములుగ వ్రాసిరి. శ్రీనాథుఁ డిట్లు వ్రాయసందున నతఁడు వ్రాసిన నైషధము మొదలగు కావ్యము లన్నియుఁ బండితజనైకాదరణీయములై సామాన్యజనులకు దుర్గ్రాహ్యములుగ నున్నవి. శ్రీనాథుని కాలమందే శబ్దశక్తి యధికమై యర్థశక్తి తగ్గ నారంభించె. నైషధ మింత కఠినపాకమున వ్రాయఁబడినను ఆంధ్రపంచకావ్యములలో నగ్రగణ్యముగ భావింపఁబడుచున్నది. నైషధమువలననే శ్రీనాథున కాంధ్రకవులలో నత్యంతప్రసిద్ధి కలిగినది. మొత్తముమీఁద నీతని కవనము రసవంత మైనది. శైలి మాత్రము పూర్వకవుల శైలివలె సులభ మైనది కాదు. ఇఁకఁ బోతనామాత్యుని విషయము. ఈతఁడు కూడ భారతము వంటి శాశ్వతగ్రంథ మగు భాగవతముగ రచియించెను. కాని, ఇతఁడు భారతకవులవలెఁ గాక తన భాగవతమును మూలగ్రంథమునకంటెఁ బెంచి వ్రాసెను. మూల మైన సంస్కృతభాగవతగ్రంథసంఖ్య యిరువది వేలు. ఇతఁడు రచియించిన తెలుఁగు భాగవతము ముప్పది వేల గ్రంథము. ఈతని కవిత్వము కేవలభక్తిరసప్రధాన మైనది.

ఇతఁడు స్వాతంత్ర్యజీవనమందుఁ దనకుఁ గల గౌరవము నీ క్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు:

ఉ. బాలరసాలసాలనవపల్లవకోమల కావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికు లైన నేమి? గహనాంతరసీమలఁ గందమూలకౌ
ద్దాలికు లైన నేమి? నిజదారసుతోదరపోషణార్థమై.

పోతన కవనము యమకాదిశబ్దాలంకారభూయిష్ఠమయి లలితమై శ్రావ్యముగ నుండును. శబ్దార్థములకు రెంటికి సమాన గౌరవము నిచ్చినవాఁడు పోతనామాత్యుఁడే. అందుచేతఁ దనకుఁ బూర్వమం దుండిన కవు లెవ్వరు నుపయోగింపని శబ్దాలంకారము లీయన కవనమం దగపడుచున్నవి. ఈ సందర్భమున శబ్దప్రధానము లగు నలంకారములకు మార్గదర్శి పోతన యని గమనింపవలెను. శ్రీనాథుఁడు దీర్ఘసమాసప్రయోగమునకు మార్గదర్శి యని పైని వ్రాసి యుంటిని. వీ రిద్దఱు నూతనముగఁ ద్రొక్కిన త్రోవలు వారి కాలమం దంత హానికరములుగ నుండకపోయినను దరువాతి యాంధ్రసారస్వతచరిత్రముఁ బట్టి విమర్శింపఁగఁ దెలియుచుండఁగ నాంధ్రవాఙ్మయాభివృద్ధికిఁ బ్రతిబంధకములుగఁ బరిణమించె. ఎట్లనఁగా, వీరి తరువాతి కవు లందఱు వీరివలె సమర్థులు కాక వీరి ననుకరించి కవిత్వముఁ జెప్పవలయు నను నుద్దేశముతో వారు చూపిన త్రోవలు మాత్రము త్రొక్కి వారివలె నా త్రోవలను సద్వినియోగముఁ జేయలేక దుర్వినియోగముఁ జేయఁ బ్రారంభించిరి. ఇట్లే కదా సదుద్దేశములతోఁ బ్రారంభింపఁబడు కార్యములు కాలాంతరమున వికటించుట. పోతనఁ జూచి తర్వాతి కవులు కొందఱు కేవల శబ్దాలంకారప్రధానము లైన గ్రంథములనే వ్రాయుచుండఁగిరి. వారిలోఁ బ్రౌఢకవి మల్లన ముఖ్యుఁడు. మఱికొందఱు గుణగ్రాహులు పోతన శబ్దాలంకారములపై గౌరవ ముంపలేము కాని యతని నూతనమార్గ మవలంబించిరి. వారు పినవీరభద్రుఁడు బడబానల భట్టు సనతామాత్యుఁడు. అనంతుఁడు భోజరాజీయ మను నూతన గ్రంథమును రచించి ప్రసిద్ధి కెక్కెను. ఇంతటితోఁ బూర్వకవుల ప్రశంస ముగియుచున్నది. కావునఁ గవిత్రయకాలమందు మహోన్నతస్థితియం దున్న యాంధ్రభారతిని గాలక్రమమున క్షీణింపఁజేయుచున్న నూతనగుణము లధివసించె ననవచ్చును.

ఇఁక మధ్యకవుల విషయము. మధ్యకవులకాలమందుఁ బూర్వకవుల కాలమందువలె సంస్కృతమునుండి కేవలభాషాంతరీకరణములు కాక ప్రబంధరచన లారంభ మయ్యె. కృష్ణదేవరాయలతో నాంధ్రసారస్వతమం దొక నూతనశక మారంభమయిన దని వక్కాణింపవచ్చును. విష్ణుచిత్తీయ మను పేరఁ బఱఁగు నాముక్తమాల్యద కృష్ణదేవరాయలచే రచియింపఁబడినది. కృష్ణరాయ లీ గ్రంథరాజమువలన నాంధ్రవాఙ్మయమునకుఁ జేసిన మహోపకారమును మనుచరిత్రమునకు నాముక్తమాల్యదకుఁ గల తారతమ్యమును విచారించునపుడు వాక్రుచ్చెదను. కృష్ణదేవరాయలు తా నుభయభాషలందుఁ బండితుఁడగుటయే కాక కవిపండితుల నాదరించి వారికిఁ బ్రబంధరచనయం దుత్సాహము కలుగునట్లు చేసి యాంధ్రజనకృతజ్ఞతాపూర్వకవందనములకుఁ బాత్రుఁడయ్యె. అటు లుత్సాహముఁ బొంది ప్రబంధరచనకుఁ బూనుకొనిన కవీశ్వరులలో నగ్రగణ్యుఁడు మనుచరిత్రను రచియించిన యల్లసాని పెద్దన. ఈతఁ డాంధ్రకవితాపితామహుఁ డని బిరుదము నొందెను. శృంగారప్రబంధరచన యతని మనుచరిత్రముతోఁ బ్రారంభమైనది. కథ మాత్రము స్వకపోలకల్పితము కాక మార్కండేయపురాణమునుండి గ్రహింపఁబడినది. కాని, యా కథను పెద్దన మనుచరిత్రమందు వ్రాసిన విధముగ మఱియొక కవి వ్రాయలేఁ డనుట యతిశయోక్తి కానేరదు. పెద్దన సంస్కృతలక్షణగ్రంథములనుండి మహాకావ్యలక్షణములను గ్రహించి యా లక్షణములఁ దన మనుచరిత్రమందుఁ బ్రయోగింపఁ బ్రయత్నించినాఁడు.

శ్లో. నగరార్ణవశైలర్తుచంద్రార్కోదయవర్ణనం
ఉద్యానసలిలక్రీడామధుపానరతోత్సవాః
విప్రలంభో వివాహశ్చ కుమారోదయవర్ణనం
మంత్రద్యూతప్రయాణాజినాయకాభ్యుదయా అపి
ఏతాని యత్ర వర్ణ్యంతే తన్మహాకావ్య ముచ్యతే. (ప్ర. రు.)

ఇట్టి మహాకావ్యలక్షణముల ననుసరించి గ్రంథము రచియించుటలో పెద్దన యగ్రేసరుఁడు. ఈతనిఁ జూచి తరువాతి కవు లందఱు

నింతటి కవితానిపుణత లేనివారు గనుకనే బాలరసాభాసముగ ననుక రింప సాగిరి. కాని ఇందులకుఁ బెద్దన నవపలసిన పని లేదు. అతఁడు చూపిన త్రోవ యుక్తము మైనదనుట కేమాత్రము సందియము లేదు. ఈ మార్గమును తదేకధ్యానముగ నవలంబించి వ్రాసిన తరువాతి కవుల గ్రంథములు వెలువడిన పిమ్మట దీనివలని నష్టములు విశదముగ నగపడెను. ఇట్టి స్థితిలో నాంధ్రసారస్వత ముండఁగా, నూతనమార్గ మవలంబించి యాముక్తమాల్యద యాంధ్రభారతి నుద్ధరింపవలె నను దృఢసంకల్పముతోఁబోలె కృష్ణదేవరాయలనుండి సమయానుకూల ముగ వెలువడె. ఆ నూతనమార్గ మేది యన స్వాభావికవర్ణనమే. అందు చేతనే కృష్ణదేవరాయల నామ మాంధ్రవాఙ్మయచరిత్రమం దొక యుల్లగఁ బేర్కొనఁబడుచున్నది. పైఁ జెప్పిన స్వాభావికవర్ణనపు సౌందర్యము నీ క్రింది పద్యమున నుదాహరించుచున్నాఁడను:

మ. తలఁ బక్షచ్ఛట గ్రుచ్చి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకులు మత్స్యాన్నప్రయాతద్విజా
వలిపిండీకృతశాటులం చవి తదాహారంబుఁ జేర్పంగ రే
వుల డిగ్గన్ వెసఁ బాఱ బారిఁ గని నవ్వున్ శాలిగోప్యోఘముల్.

స్వాభావికవర్ణనము లెక్కుడుగఁ జేసినందున నాముక్తమాల్యద యందు మహాకావ్యలక్షణములు లేవని కాని తద్గ్రంథరాజము లక్షణ గ్రంథముల ననుసరించి వ్రాయఁబడినది కాదని కాని భావింపఁ గూడదు. సరిగఁ జూచినచోఁ బైని వ్రాసిన శ్లోకమందుఁ జెప్పఁబడిన మహాకావ్యలక్షణములు మనుచరిత్రమందుఁ గంటె నాముక్తమాల్యద యం దెక్కుడుగ నగపడుచున్నవి. కృష్ణదేవరాయలు స్వాభావిక వర్ణన మను నూతనాంశము నాంధ్రవాఙ్మయమునకుఁ దెచ్చి యాంధ్రసారస్వతమునకు మహోపకార మొనర్చెను. శ్రీనాథుఁడు మొదలు తెనాలి రామకృష్ణునివఱకు శబ్దార్థగౌరవప్రధానము లైన గ్రంథములు వ్రాయఁబడె నని యిదివఱకే చెప్పియుంటిని. అట్టి గ్రంథములను రచించిన కవులు నృసింహకవి ధూర్జటికవి శంకరకవి పీరశరభకవి మొదలగు కవులు. వీ రందఱు స్వశక్తి నుపయోగింపక తమకంటె సమర్థు లైన శ్రీనాథుఁడు పోతన మున్నగు మహాకవీశ్వ రుల మార్గ మవలంబింపఁ దొడఁగిరి. అందుచే దీర్ఘ సమాసములు వానిలో ననుపయోగము లైన పెక్కు శబ్దములు శబ్దాలంకారములు వారి గ్రంథములందు స్పష్టముగఁ గనఁబడుచున్నవి. శ్రీనాథుఁడును బోతనయుఁ జల్లిన విత్తులు మహావృక్షము లయ్యె. తెలుఁగుబాస యిట్టి కలవరమున నుండఁ దెలుఁగునందుఁ గవన మెటుండవలెనో వేంకట నాథకవి యీ క్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు:

చ. ఘనసరఘూర్జరీకబరయుక్క్రియ గూఢము గాక ద్రావిడీ
స్తనగతిఁ దేట గాక యటు చాటగు నాంధ్రవధూటి చొక్కపుం
జనుఁగవఁ బోలి తేటయును జాటుఁదనంబును గాకయుండఁ జె
ప్పిన నదెపో కవిత్వ మనిపించు, నగిం చటుగాక యుండినన్.

అటు పిమ్మట నయ్యలరాజు రామభద్రకవి రామాభ్యుదయ మను గ్రంథమును రచియించెను. అందుఁ గవిత్రయసాదృశ్య మీ విధ ముగ నంగీకరింపఁబడినది:

ఉ. నన్నయతిక్కనాదికవినాథులు చెప్పినయట్లు చెప్పలే
కున్నఁ దదుత్తరాంధ్రకవు లూరకయుండిరె తోఁచినట్లు ని
త్యోన్నతబుద్ధిఁ గబ్బముల నోజ రచింపక? యందు జ్ఞానసం
పన్నుల కావ్యముల్ హరిసమర్పణమై చెలు వొందు నెందునున్.

ఈ పద్యమందుఁ గవిత్వముఁ జెప్పినఁ గవిత్రయమువలెఁ జెప్ప వలె నను వాక్య కూడ స్పష్ట మగుచున్నది. ఇంతియ కాక పైని జెప్పిన శబ్దాలంకారప్రాధాన్యము గూడ రామాభ్యుదయమం దగ పడుచున్నది. ఈ క్రింది పద్య మీ యంశమును వెల్లడి చేయుచున్నది:

సీ. కానక కన్న సంతానంబు గావునఁ
గానక కన్న సంతాన మయ్యె
నరయ గోత్రనిధాన మైతోఁచుఁ గావున
నరయ గోత్రనిధాన మయ్యె నేఁడు
ద్విజకులాదరణవర్ధిష్ణుండు గావున
ద్విజకులాదరణవర్ధిష్ణుఁ డయ్యె
వివిధాగమాంతసంవేద్యుండు గావున
వివిధాగమాంతసంవేద్యుఁ డయ్యెఁ
గటకటా! దాశరథి సముత్కటకరీంద్ర
కటకలితదానధారార్ద్రకటకమార్గ
గామి యెట్లు చరించు నుత్కటకరీంద్ర
కటకలితదానధారార్ద్రకటకతటుల?

ఈ శబ్దప్రాధాన్య మంత ప్రౌఢకవిత్వముఁ జెప్పఁగలిగిన కుమ్మర మొల్ల రామాయణమందుఁ గూడ నగపడుచున్నది. ఉదా హరణముగ నీ క్రింది పద్యము నిచ్చుచున్నాను:

ఉ. రాజులు కాంతియందు రతిరాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు మృగరాజులు విక్రమకేళియందు గో
రాజులు భోగమందు దినరాజులు సంతతతేజమందు రా
రాజులు మానమందు నగరంబున రాజకుమారు లెందఱున్.

ఈ ద్వ్యర్థికవిత్వస్థితికి శబ్దాలంకారములవలెనే తెలుఁగు సుకవుల పాటు చాల దుష్టమ్ము శ్లేష నొసంగెను. పింగళి సూరనార్యుఁ డాంధ్ర సారస్వతచరిత్రమందుఁ బ్రవేశ పెట్టెను. ఇతఁడు రచియించిన గ్రంథ రత్నములు మూఁడు: రాఘవపాండవీయము, ప్రభావతీప్రద్యుమ్నము, కళాపూర్ణోదయము. ఆంధ్రసారస్వతమం దీ మూఁడు గ్రంథములును మూఁడు నూతనాంశముల స్థాపించినవి. రాఘవపాండవీయ మాంధ్ర భాషలోఁ జక్కని శ్లేష కవిత్వమునకు మార్గముఁ జూపెను; శ్లేషగ్రంథమయినను మృదుమధురసులభపదములతో రామాయణ భారతార్థములు వచ్చునట్లు రచియింపఁబడినది. ఈ విషయము రాఘవపాండవీయమును వసుచరిత్రమును జదివినవారికి విశద మగు చున్నది. ప్రభావతీప్రద్యుమ్నము చక్కని స్వభావోక్తులు గలిగి లలిత పదఘటితమై కర్ణరసాయనమై కథాచమత్కృతి గలిగి మిగుల మనో హరముగా నుండు ప్రౌఢకావ్యము. కళాపూర్ణోదయ మాంధ్రసార స్వతమునకు వన్నె దెచ్చిన గ్రంథరత్నములలో నొకటి. ఆ గ్రంథము ఆంధ్రసారస్వతచరిత్రమందు స్వకపోలకల్పితగ్రంథములం దాది గ్రంథమై విచిత్రమయిన కథగలదై తెలుఁగు గ్రంథములలో నిరుప మానముగ నున్నది. సంస్కృతనాటకములలో మాత్ర మిటువంటి కథా చమత్కారము కానఁబడుచున్నది గాని తెలుఁగులో నెక్కడ నింత వింత యైన కల్పితకథ మఱియొకటి కానరాదు. ఈ గ్రంథము నాతి కఠినమై మృదుమధురశైలి గలిగియున్నది. తిక్కనసోమయాజికిఁ దరు వాత నింత ప్రౌఢముగాఁ గవిత్వముఁ జెప్పిన తెలుఁగు కవి మఱియొకఁడు లేఁడు. సూరన కావ్యరచనయందు సర్వతోముఖచాతుర్యము నత్య ద్భుతకల్పనాశక్తియుఁ గలవాఁడు. తన కాలమం దుండిన కవులవలె నేదో యొక పరిణయకథ నెత్తుకొని యందుఁ బురవర్ణనాదు లైన

మహాకావ్యలక్షణముల నన్నిటి నెటులో ప్రవేశపెట్టి స్వబుద్ధి నాకల్పఁ ద్రోయక చక్కఁగ సర్వజనాదరణీయముగ జాతీయకవిత్వముఁ జెప్పి శ్లాఘాపాత్రుఁ డయ్యె. కాని, శ్రీనాథపోతనామాత్యుల త్రోవల వలె నీతని త్రోవ కూడఁ గాలక్రమమున నాంధ్రసారస్వతాభివృద్ధికిఁ బ్రతిబంధకముగ నేర్పడెను. ఎందుచేత ననఁగా, నీతని తరువాతి కవులు స్వసామర్థ్యము లేక సూరన ననుకరించి తాము కూడ నతఁడు రచియించిన గ్రంథములవంటి గ్రంథముల రచియింపవలె నను నాశతో నతఁడు చూపిన శ్లేషమార్గము నమితముగ నవలంబించిరి. సూరన తరువాతఁ బొన్నకంటి తెలగన్న శుద్ధాంధ్రప్రబంధరచనకు మార్గదర్శి. ఈ కవికిఁ బూర్వ మెవరు నచ్చతెలుఁగులోఁ బ్రబంధములు చేయుటకుఁ బ్రయత్నించినవా రైనను లేరు. ఇఁక రామరాజభూషణుని విషయమై విచారించెదను. శ్లేషకావ్యములకు దారిఁ జూపినవాఁడు సూరన యని పైని జెప్పియుంటిని. శ్లేష నమితముగ నుపయోగించి శ్లేషకావ్యములలో నగ్రగణ్య మయి యాంధ్రసారస్వతమునఁ బంచకావ్యములలో నొకటిగ నెంచఁబడ మిగులఁ బ్రముఖతఁ గాంచిన వసుచరిత్ర మను శృంగారప్రబంధమును రచియించిన కవిపుంగవుఁ డీ రామరాజభూషణుఁడే. వసుచరిత్రముతో సరిరాఁదగు శ్లేషకావ్యము తెలుఁగున మఱియొకటి లేదు. సంస్కృతలక్షణగ్రంథములందుఁ జెప్పఁబడు మహాకావ్యలక్షణము లన్నియు విపులముగ నీ గ్రంథరత్నమం దగపడుచున్నవి. ఈ విషయమున నిది సంస్కృతసారస్వతమందలి కుమారసంభవము శిశుపాలవధము కిరాతార్జునీయము మున్నగు మహాప్రబంధములతోఁ బోల్పఁదగి యున్నది. ఇందలి వర్ణనములు మిక్కిలి మనోహరములు, పదముల కూర్పు మిక్కిలి సుందరము, శబ్దార్థాలంకారము లాహ్లాదజనకంబులు. రసభావాదులు యథాయోగ్యములుగ నున్నవి. ఈ యంశము లన్నిఁటిచేతను వసుచరిత్రము శ్రేష్ఠప్రబంధమై తదనంతరపు ప్రబంధరచనకుఁ బూనుకొనిన కవు లెల్లరకుఁ బ్రతిరూప మగుచున్నది. వసుచరిత్రమే కాక హరిశ్చంద్రనలోపాఖ్యానమును నరసభూపాలీయము నీతని గ్రంథములుగ నాంధ్రకవుల చరిత్రమం దుదాహరింపఁబడినవి. అందు హరిశ్చంద్రనలోపాఖ్యానము శ్లేషకావ్య మయినను రాఘవపాండవీయపు ప్రసిద్ధిఁ బొందలేక పోయెను. సూరన రచియించిన రాఘవపాండవీయమును రామరాజభూషణుఁడు రచియించిన వసుచరిత్రము మున్నగు గ్రంథములును శ్లేషకావ్యములయ్యు ముఖ్యమైనభేద మొండు కలదు. సూరన శ్లేష నాతికఠినమై సులభముగ బోధపడుచున్నది. రామరాజభూషణుని శ్లేష కష్టతరమై కేవలపండితజనాదరణయోగ్యమై యున్నది. తరువాతి కవు లీ వసుచరిత్రము ననుకరింపఁబోయి శృంగారప్రబంధము లను పేరిట శృంగారరసమునకే భంగముఁ దెచ్చునట్టియు కేవలము మహాకావ్యలక్షణములకును శ్లేషకును నుదాహరణములుగ నుండుటకొఱకే పుట్టఁబడినట్టియు ప్రబంధములను రచియింపసాగిరి. ఇట్టి దురభ్యాసములవలనఁ దెలుఁగు కవిత్వము మిక్కిలి రసాభాసము కలిగి శృంగారరసరూపమున బూతు కవిత్వమునకు దిగనారంభించె. శ్రీనాథాదుల కవిత్వపద్ధతులు తరువాతి కవుల నట్టి కవిత్వముఁ జెప్పుటకుఁ బురికొల్పినవై యాంధ్రసారస్వతాభివృద్ధికిఁ బ్రతిబంధకము లాయె నంటిని. కొందఱు మాత్రము అపారసామర్థ్యము గలవారు కావున నాంధ్రకవిత్వమునందుఁ గ్రొత్త దినుసులఁ దెచ్చిపెట్టి యతిరమణీయముగను మనోహరముగను గవిత్వముఁ జెప్పి యాంధ్రసారస్వతమునకు మహోపకార మొనర్చి సర్వాంధ్రజనసమ్మోదముఁ బొందిరి. తదితరులు ఆంధ్రసారస్వతాభివృద్ధికిఁ బ్రతిబంధకు లయి రనుట కొంత మాత్రము సందియము లేదు. శ్రీనాథుఁడు మున్నగు మహాకవీంద్రు లొసఁగిన మహోపకారమునకు మన మెల్లరము బద్ధాంజలుల మై కృతజ్ఞతాపూర్వకవందనము లర్పించుచుండుటకు మాఱుగా వారిచే నీ సారస్వతమునకుఁ బిమ్మటఁ గలిగిన దుస్థితికిఁ గారకులఁ జేయుట తత్త్వాతత్త్వవివేచనజ్ఞానశూన్యతఁ దెలుపఁజేయుచున్నది. శ్రీనాథుఁడు మొదలగు కవీంద్రుల సత్పథము సరిగ నవలంబింపలేక దురుపయోగము చేయుటవలనఁ గలిగిన నష్టము లిక్కడఁ జెప్పఁదగును. పూర్వకవుల కాలమందుండిన యర్థగౌరవము పోయి శబ్దగౌరవమునకుఁ బ్రముఖత కలిగెను. ఈ విషయము తెనాలి రామకృష్ణుని తరువాత వ్రాయఁబడిన గ్రంథముల గుఱించి చెప్పినపుడు విశదమగును. కవులు వస్తుసారమును భావములను వెదకుటకు మాఱుగాఁ బదములను వెదుక నారంభించిరి. దీర్ఘసమాసములు శబ్దాలంకారములు శ్లేషలు నియమములు ఉత్ప్రేక్షలు అతిశయోక్తులు పురవర్ణనాదులు కథాసందర్భముకంటెఁ గల్పనాకౌశలముకంటె రసపోషణముకంటె నెక్కువగ గౌరవింపఁబడెను. ఇట్టి సందర్భమున నధికగుణగ్రహణపారీణుఁ డైన తెనాలి రామకృష్ణుని పాండురంగమాహాత్మ్య మను కావ్యరత్నము వెలువడెను. రామకృష్ణుఁడు గుణగ్రాహి కావున నపు డున్న దుస్స్థితికిఁ బాలు కాకుండునట్లు తన గ్రంథమును రచియించెను. అతని గ్రంథ మనేకవిధముల ముఖ్యమైనది. స్వకపోలకల్పనలు గల కావ్యములలో నిది యొకటి. నాఁటి గ్రంథములవలె నీతిబాహ్యము కాక మంచి నీతులఁ గఱపుచున్నది. చక్కని శయ్యయుఁ బదసందర్భముఁ గలదై యక్కడక్కడ మృదువైన యచ్చతెలుఁగు పదములచే నలరారుచున్నది. ఇట్టి నీత్యుపదేశక మగు గ్రంథమును రచియించి తత్సదృశగ్రంథములను రచియింపుటకుఁ ద్రోవఁ జూపి రామకృష్ణుఁ డాంధ్రసారస్వతాభివృద్ధికొక సహకారి యయ్యె. ఇతని తరువాతి కవి యైన కంసాలి రుద్రయ్య రామకృష్ణుని నీత్యుపదేశక గ్రంథమును మెచ్చి యందలి కథాసారాంశమును దన నిరంకుశోపాఖ్యానమునందుఁ జొప్పించి యున్నాఁడు. ఇఁకఁ దెనాలి రామకృష్ణుని కాలము మొదలత్యంతముగఁ బ్రబలిన శబ్దప్రాధాన్యమును శబ్దగౌరవమును నుదాహరించెదను. శ్లేషయందు గౌరవము హెచ్చి కేవలము శ్లేషప్రధానము లైన కావ్యములు వెఱ్ఱిగ రచియింపఁబడుచువచ్చెను. ఎలకూచి బాలసరస్వతి యిట్టి కావ్యరచనఁ బ్రారంభించె. ఈతఁడు ద్వ్యర్థికావ్యములు చాలనట్లు త్ర్యర్థికావ్యమును రచియించె. ఆ కావ్యము పేరు రాఘవయాదవపాండవీయము. ఇటులే పోయిన కొలఁది నాంధ్రసారస్వతమీ శ్లేషపక్షపాతముచేఁ గీడొందెను. శ్లేషకావ్యములు రచియించిన యితరకవులు:— యాదవరాఘవపాండవీయమును రచియించిన నెల్లూరి వీరరాఘవకవి, రాఘవయాదవపాండవీయమును రచించిన అయ్యగారి వీరభద్రకవి, శివరామాభ్యుదయమును రచియించిన పోడూరి పెదరామామాత్యుఁడు, రామకృష్ణార్జునరూపనారాయణీయము రచియించిన ఓరుగంటి సోమశేఖరకవి, లంకావిజయమును విరచించిన పిండిప్రోలు లక్ష్మణకవి, కృష్ణార్జునచరిత్రమును వ్రాసిన మంత్రిప్రెగడ సూర్యప్రకాశకవి. ఈ యుగము ప్రబంధయుగమైనను పురాణేతిహాసములనుండి యాంధ్రీకరణము లచ్చటచ్చటఁ గానఁబడుచున్నవి. అందు గోపీనాథము వేంకటకవి వాల్మీకిరామాయణము, కృష్ణదాసకవి, రాధాకృష్ణవిలాసము, కటికనేని రామయకవి కువలయానందప్రకాశము, గోపాలుని సింగయ్య కిరాతార్జునీయము, హరిభట్టు మత్స్యపురాణము, వరాహపురాణము, ఒడ్డె

ప్రాడి పెద్దయ్య వాయుపురాణము, రాజలింగకవి కూర్మపురాణము ముఖ్యములై యున్నవి. కూర్మపురాణమందుఁ గూడ శబ్దాలంకారము లగపడుచున్నవి. ఉదాహరణముగ నీ క్రిందిపద్యము నిచ్చుచున్నాను:

ఉ. ఘంబు గదే నిశాపతి నఖంబు గదే నగము న్మృగద్విరే
ఫంబు గదే కచంబు గిరిభంబు గదే నడ తీరు సోమకుం
భంబు గదే కుచంబు కరభంబు గదే తొడ పూర్ణచంద్రికా
చంబు గదే స్మితంబు ఝషభంబు గదే వదనంబు బోటికిన్.

ఈ కాలమందుఁ గవులు నానావిషయములపై గ్రంథములు వ్రాయుచుండెడివారు. అప్పకవి యాంధ్రశబ్దచింతామణి మొదలు లక్షణగ్రంథము లనేకములు వ్రాయఁబడినవి. వెలుతుర్ల పద్మకవి శృంగారరసాలవాలము, కస్తూరి రంగకవి లక్షణచూడామణి, కటికనేని రామయకవి కువలయానందప్రకాశము ముఖ్యములు. ఇంతియ కాక వేదధర్మములు వైద్యశాస్త్రము రత్నశాస్త్రము పురాణకథలు రాజుల చరిత్రములు—పె యేల సూక్ష్మజంతు చరిత్రములు మొదలు భగవత్కథలవఱకు గ్రంథరచన వ్యాపించి యుండెను. సాధారణముగ నీ కాలమునం దున్న కవుల గ్రంథములం దెక్కువగ వ్యాకరణదోషము లగపడుచున్నవి ఇదియుఁ గాక కవుల కవితాసామర్థ్యము గూడఁ గ్రమముగ క్షీణింపఁ బ్రారంభించెను. కవిత్రయము తరువాత భారతమువంటి రసవంత మైన గ్రంథము నప్పుడే కాక యిప్పటికిఁ గూడ నే కవియు రచియింప సమర్థుఁడు కాలేదు. శృంగారరసమునకు బదులుగ నీతిబాహ్య మగు పచ్చి శృంగారము వర్ణింపఁబడుచు వచ్చెను. అట్టి గ్రంథములలో శేషము వేంకటపతి తారాశశాంకవిజయము, కూచిమంచి తిమ్మకవి రసికజనమనోభిరామము, పేరయలింగము ఒడయనంబిచరిత్రము, ముద్దుపళని రాధికాసాంత్వనము, వెంగళాచార్యుని బిల్హణీయము, అయ్యలరాజు నారాయణకవి హంసవింశతికథలు, ప్రయాగ రామేశ్వరకవి గోపాలలీలాసుధాలహరి ముఖ్యములైన గ్రంథములు. చిత్రకవిత్వము గూడఁ బ్రబలినది. ఇట్టి కవిత్వము గల గ్రంథములలో కూచిమంచి జగ్గకవి చేసిన చంద్రరేఖావిలాపము, అబ్బయామాత్యుఁడు రచించిన కవిరాజమనోరంజనము ముఖ్యములు. మొదట నిట్టి కవిత్వమునకు దారి చూపినవారు వేములవాడ భీమకవి తురగా రామకవి. ఈ సందర్భమున నిరోష్ఠ్యాదినియమములను గూర్చియు నచ్చతెలుఁగు కవనమును గుఱించియు వివరించెదను. ఈ రెండును కూడ నీ మధ్య కవుల కాలమందె వన్నెకెక్కె. ఆంధ్ర సారస్వతమున కప్పటి కున్న దుస్థితి చాల దన్నట్టు లీ మధ్యకవులు నిరోష్ఠ్యాదినియమములను దెచ్చిపెట్టిరి. నిరోష్ఠ్యనియమము బంధకవిత్వము కేవలముఁ దమ పాండిత్యముఁ జూపుటకై పండితులచే నుపయోగింపఁబడుచున్నవి. నిరోష్ఠ్యనియమమునకు మార్గదర్శి గుడారు వేంకటదాసకవి. ఈ నిరోష్ఠ్యనియమ మిక్కాలపుఁ గవుల యంగీకారముఁ గూడఁ బడసినది. ఇందులకు కందుకూరి వీరేశలింగము పంతులు గారు రచియించిన 'ఆంధ్రనిరోష్ఠ్యనిర్వచననైషధము' ముఖ్యోదాహరణమై యున్నది. చిత్రబంధకవిత్వమునకు దారిఁ జూపిన కవి గణపవరపు వేంకటకవి. గుడారు వేంకటదాసకవి తన ప్రబంధశిరోభూషణ ప్రకృష్టబలరామచరిత్రమం దుపయోగించిన బంధములకంటె నెక్కువగ గణపవరపు వేంకటకవి తన ప్రబంధరాజవేంకటేశ్వరవిలాసమున నుపయోగించెను. ఒక పద్యములోనె బహుబంధగర్భవృత్తములు ఏకాక్షరములతోఁ జిత్రకవిత్వము మొదలగు శిల్పివ్యాపారకౌశల మెక్కువగ వేంకటకవి గ్రంథము దగపడుచున్నది. కవిత్రయ కాలము దనుభవించిన స్థితి పోయి తుదకు వేంకటకవి బంధకవిత్వకాలము దాంధ్రభారతి యనుభవించిన స్థితిని జెప్పుచు నీ క్రింది విధముగ వీరేశలింగము పంతులు గారు కాలక్రమమునఁ గలిగిన క్షీణదశను వర్ణించియున్నారు: "సంస్కృతములో నున్న జ్ఞానధనమును జనులకు వెదజల్లవలె నన్న పరమార్థచింతతో మొట్టమొదట నన్నయభట్టారకాదు లగు మహాకవులు పదునొకండవ శతాబ్దియందే సులభశైలిని సంస్కృతగ్రంథములఁ దెనిఁగింపఁదొడఁగిరి. ఈభాషాంతరీకరణకార్యము పదునేనవ శతాబ్దియంతమువఱకు నవిచ్ఛిన్నముగా జరుగుచు వచ్చెను గాని యిట్లు భాషాంతరీకరణమునకుఁ బూనుకొన్నవారిలోఁ గడపటివారగు శ్రీనాథాదులు తమ పూర్వులకన్నఁ దాము ఘను లనిపించుకొనవలె నన్న చింతచేతనో మఱి యే హేతువుచేతనో సంస్కృతపదభూయిష్ఠము లైన దీర్ఘసమాసములతో నింపి రసమును జెఱుపకపోయినను తమ గ్రంథములు బహుజనులకు దుర్గ్రాహ్యమైన కఠినశైలిగ జేసిరి. ఇట్లా కాలములో భారతభాగవతరామాయణాదిముఖ్యగ్రంథము లన్నియుఁ దెలిఁగింపఁబడఁగా నటుతరువాతఁ బదునాఱవ శతాబ్దారంభమునం దల్లసాని పెద్దనాదు లొక క్రొత్త త్రోవం ద్రొక్కి కేవలభాషాంతరములు కాకుండఁ బురాణములలోని కథలను గైకొని స్వకపోలకల్పితములైన వర్ణనలను జేర్చి పెంచి శ్రీనాథాదుల శైలి ననుసరించి రసవంతముగాఁ బ్రబంధములను జేయ నారంభించిరి. ఈ పని సూఱు నూట యేఁబది సంవత్సరములవఱకును జరుగుచు రాఁగా ౧౭౦౦-వ సంవత్సరముతోడ బహుమార్గముల నూతనప్రబంధము లనేకములు తెలుఁగున చేయఁబడినవి. అంతటితో నూతనసృష్టి బహులేశముగా నంతరించినను వసుచరిత్రమును మాత్రముగాఁ గాని దానికి పూర్వాంతరములలో నున్నట్లు ప్రాచీనగ్రంథములలోని పేరులు మార్చి ప్రయోగించుచు నిట్టి ప్రబంధముల ననుకరించి తమ ప్రబంధముల నల్లఁజొచ్చిరి. చేసినదానినే పేరులు మార్చి మరలఁ జేయుచుండుటచేత నూతనార్థకల్పనలను జేయుట యరుదుగ నయినందున నిటీవలివారిలోఁ గొందఱు మహాపురుషు లా యర్థలోపమును పదాటోపములోఁ బూరింపఁ బ్రయత్నించిరి. పూర్వప్రబంధకవు లెక్కుడ సముచితముగా శబ్దాలంకారములను జొప్పించుచు వచ్చినను భాషాఘటికిఁ బ్రాణమైన యర్థసారస్యమును జెడఁగొట్టకుండిరి. ఇటీవలివా రర్థసారస్యము నంతఁగాఁ బాటింపక నిఘంటువుల వెదకి పదము లేరి కూర్చి బంధించి తమ సరస్వతిని వ్యావహారాకర్షకముగాఁ గాకపోయినను కర్ణరంజకముగానైనను జేయఁ బాటుపడిరి. ఇట్టివారిలో నెన్నికగన్న కొందఱు బంధాదుల నతిమాత్రముగాఁ జేర్చి యర్థసారస్యమును బూర్ణముగాఁ జెఱిచి యవయవములు విఱిచి తమ భాషావధూటిని విరూపినిఁ జేసిరి. మన యీ వేంకటేశ్వరవిలాసకృతికర్తయు బలరామచరిత్రకృతికర్త యైన గుడారు వేంకటదాసకవియుఁ గొంత వఱకీ కడపటి తెగలోఁ జేరినవారు. ఒకఁడు తన పుస్తకమునకుఁ బ్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాస మని పేరు పెట్టుకొనఁగా నింకొకఁడు తన పుస్తకమునకుఁ బ్రబంధరాజశిరోభూషణప్రకృష్టబలరామచరిత్ర మని పేరు పెట్టుకొనెను." (ఆంధ్రకవుల చరిత్రమందు 514 పేజీ)

ఇఁక నచ్చతెలుఁగు కవనమునకుఁ బోయెదను. ఆదికవులు విశేషించి తెలుఁగు పదము లుపయోగించిరి. అటుపిమ్మట శ్రీనాథునివఱ కుండిన కవు లందఱుఁ దెలుఁగు భాషను మఱచి సంస్కృత

పదములతో నింపిరి. శ్రీనాథుని తరువాతి కవు లసహ్యము లగు నన్యదేశ్యపదములతోఁ గాలముఁ గడపిరి. తెలుఁగు గ్రంథములలోఁ దురక మాటలు లోనగు నన్యభాషాపదములను స్వేచ్ఛగాఁ బ్రయోగింప నారంభించిన కవి పెద్దనయే. అన్యదేశ్యపదముల నెక్కువగ నుపయోగించినవాఁడు గణపవరపు వేంకటకవి. కాని, యాతఁడు తెలుఁగున బాగుగఁ గవిత్వముఁ జెప్పిన కవులలో నొకఁడై యీ కాలమునందు విలసిల్లె ననుట నిస్సందేహము. తెనాలి రామకృష్ణుని తరువాత చేమకూర వేంకటకవియుఁ గూచిమంచి తిమ్మకవియును నచ్చతెలుఁగున భాగవతము రచియించిన అల్లమరాజు రామకృష్ణకవియు నచ్చతెలుఁగునఁ జక్కని కవిత్వముఁ జెప్పిరి. అచ్చతెలుఁగు పదములఁ బొందికగాఁ గూర్చి కవనము చెప్పు నేర్పు వేంకటకవికిఁ గుదిరినట్లు మఱి యొక కవికిఁ గుదిరిన దని చెప్ప వలనుపడదు. ప్రభావతీప్రద్యుమ్నము తరువాత నితఁడు రచియించిన విజయవిలాసమే సర్వవిధములను శ్లాఘ్యకావ్యముగా నున్నది. కూచిమంచి తిమ్మకవి కూడఁ జక్కని తెలుఁగు కవిత్వముఁ జెప్పినాఁడు. ఇతఁ డనర్గళ మయిన కవితాధారగలవాఁ డగుటచే ననేక గ్రంథములను సలక్షణ మయిన మృదుమధురపాకమున రచియింప శక్తిఁ గలిగి యుండెను. ఇతని కవిత్వము నచ్చతెలుఁగు పదము లెక్కువగ నుండుటయే కాక ఇతఁ డచ్చతెలుఁగు రామాయణ మొకదానిని రచియించెను. ఈతని కాలపు పచ్చిశృంగార మితని రసికజనమనోభిరామమునందు స్పష్టముగ నగపడుచున్నది. ఇంతియ కాక యితని కల మెక్కువగ నిప్పట్టునఁ బూర్వకవుల ననుకరింపవలె నను నాశ కూడ నీ రసికజనమనోభిరామమందే కనఁబడుచున్నది. ఎట్లనఁగా వసుచరిత్రము ననుకరించి తిమ్మకవి తన గ్రంథమును వ్రాసెను. అయినను వసుచరిత్రమునందుఁ గల ప్రౌఢిమలోను సారస్యములోను శతాంశ మైనను రసికజనమనోభిరామమునకు రాలేదు. ఈ విషయము రెండు గ్రంథములఁ జదివినవారికిఁ దేటతెల్లం బగును. చేమకూర వేంకటకవియుఁ దిమ్మకవియు నీ కాలపు కవిత్వమునకు లక్షణభూతు లగుటచేఁ గొంత వివరించి చెప్పుటకుఁ గారణ మయ్యెను. ఈ కాలపు కవులలోఁ బ్రసిద్ధి చెందిన కంకంటి పాపరాజు తాను వ్రాసిన గ్రంథపు శైలియు మాధుర్యమును జూడ వెనుకటి కవులలోఁ జేర్పఁ దగినవాఁడై యున్నాఁడు. కావున నతని విషయమై కొంత యీ సందర్భమునఁ జెప్పుట యసమంజసము కానేరదు. ఈతఁ డుత్తరరామాయణమును రచియించి ప్రసిద్ధి చెందినాఁడు. కవిత్వము మిగుల రసవంత మైనది. తిక్కనవలెఁ బురాణశైలిని మాని తన యుత్తరరామాయణముఁ బ్రబంధపాకమునఁ జెప్పినవాఁడు. కవిత్రయముయొక్క ప్రభావమును గౌరవించుచుఁ దిక్కన చేసిన యుత్తరరామాయణమును మఱల వ్రాయుటకుఁ గారణ మతని ననుకరింపవలె నను నాశ కా దనియు రామకథయే కారణ మనియు నీ క్రింది పద్యమునఁ జెప్పియున్నాఁడు:

మ. వరుసం దిక్కనయజ్వ నిర్వచనకావ్యంబై తగం జేసె ను
　త్తరరామాయణ మందున న్మఱి ప్రబంధం బూని నిర్మించు టే
　సరసత్వం బని ప్రాజ్ఞులార నిరసించం బోకుఁడీ రాఘవే
　శ్వరు చారిత్రము నెంద ఱెన్నిగతుల న్వర్ణించినం గ్రాలదే!

ఈ పద్యమందుఁ బాపరాజు తన చేష్ట నే విధముగ సమాధానపఱుపఁ బ్రయత్నించినను ఆ కాలపు కవిత్వలక్షణ మైన పూర్వకవుల ననుకరింపవలె నను నాశ స్పష్ట మగుచున్నది. మధ్యకవుల విషయ మింతటితో ముగియుచున్నది. కానఁ బూర్వకవుల కాలమందలి యాంధ్రసారస్వతస్థితిని మధ్యకవుల కాలమందలి సారస్వతస్థితిని పోల్చి చూతము. పూర్వకవుల గ్రంథముల నెక్కువగ స్వీకరించు సంస్కృతపద్ధతి మధ్యకవుల గ్రంథములం దెచ్చట నగపడదు. సంస్కృతపద్ధతికి నిధి యనఁ జెప్పఁదగిన తిక్కన భారతముతో మధ్యకవుల గ్రంథములఁ బోల్చి చూచిన నీ విషయమునం దపార తారతమ్యము కనపడుచున్నది. పూర్వకవు లన్ని విధము లైన వర్ణనలఁ జేయుటయందుఁ బ్రసిద్ధులు. మధ్యకవు లందఱుంచు మించుగఁ గేవలము శృంగారవర్ణనములకై పాటుపడిరి. ఆ మధ్యకవులందుఁ గూడ పెద్దన రామరాజభూషణుఁడు ముక్కు తిమ్మన మున్నగు కవిపుంగవులు కొందఱు తప్పఁ దక్కిన కవు లా శృంగారరసమును మిగుల రసాభాసముగ వర్ణించిరి. మానుషస్వభావవర్ణనమందుఁ బూర్వులే శక్తిమంతులు. స్వాభావికవర్ణనమందు మాత్రము కృష్ణదేవరాయలును అతని ననుకరించి వ్రాసిన మధ్యకవులును శక్తిమంతు లని చెప్పవలసియున్నది. రసపోషణమందుఁ బాత్రగుణపోషణమునందు మధ్యకవులు పూర్వకవులకుఁ జాలరను మాట నిర్వివాదాంశ మయి యున్నది.

ఈ వ్యాసప్రారంభమునఁ జెప్పఁబడిన మూఁడు యుగములలోఁ గడపటి దయిన యాధునికయుగముఁ గూర్చి యిఁకఁ జర్చించెదను. ఈ యుగము దృశ్యశ్రవ్యకావ్యయుగ మని మొదటనే వర్ణించి యుంటిని. ఈ దృశ్యశ్రవ్యకావ్యముల విషయమై చెప్పకమున్నె యీ నడుమ కొలఁది సంవత్సరముల క్రిందటఁ బ్రారంభింపఁబడిన గ్రామ్యభాషావాదనఁ గూర్చి యించుక చెప్పితీరవలె. గ్రామ్యభాషయందు గ్రంథములు రచియింపవలె నను బుద్ధి మొదటఁ గల్గినవారు గురుజాడ అప్పారావు పంతులు గారు గిడుగు రామమూర్తి పంతులు గారు. ఈ వాదము ప్రారంభదశలోఁ బ్రబలినంతగా నిపుడు ప్రబలుట లేదను సంగతి యెల్లరకు విశదము. దీనికిఁ గారణము లిక్కడ విచారించుట యనవసర మగుటచే నింతతో గ్రామ్య వాదము వదలి ముఖ్యము లైన యితరాంశములకుఁ బోయెదను. దృశ్యకావ్యములఁ దెలుఁగున మొదట రచియించినవాఁడు వినుకొండ వల్లభరాయఁడు. అతఁడు క్రీడాభిరామ మను వీథినాటకమును దెలుఁగున రచియించెను. అతని తరువాతివాఁ డైన శ్రీనాథుఁ డాతనిమార్గము నవలంబించి తా నొక వీథినాటకమును వ్రాసెను. మధ్యకవు లెవ్వరును నాటకమును రచియింపఁ బ్రయత్నింపలేదు. ఆధునికయుగమందుఁ బెక్కురు కవులు నాటకములను వ్రాసియున్నారు. ఈ నాటకములు రెండు విధములు. కేవలము సంస్కృతనాటకముల కాంధ్రీకరణములు మొదటి తరగతి నాటకములు. రెండవ తరగతి నాటకము లేవి యనఁగా, సంస్కృతనాటకములనుండి కథలను గ్రహించి యా కథలను బ్రస్తుతదేశకాలపాత్రస్థితుల కనుగుణము లగునట్లు మార్చియు నాంగ్లేయము మొదలగు నన్యదేశభాషలందు రచియింపఁబడిన నాటకముల కల్పనల నిమిడ్చియు నూతనశైలిని వ్రాయఁబడు సంధాన (Adaptations) నాటకములు. ఇంతియ కాక సంఘసంస్కరణవిషయక మైన నాటకములు గూడ నచ్చటచ్చట వెలువడుచున్నవి. సంఘసంస్కరణమువలె భాషాసంస్కరణము కూడ నుండవలె నను నుద్దేశముతోఁ గీర్తిశేషు లైన గురుజాడ అప్పారావు పంతులు గారు కన్యాశుల్క మను పేర నిట్టి సంఘసంస్కరణవిషయక మైన నాటకమును గ్రామ్యభాషయందు రచించియున్నారు. అప్పారావు గారు రచియించిన కన్యాశుల్క నాటకము నామోదించి యా రీతినే వరశుల్క మను నాటకమును కీర్తిశేషు లైన రెంటాల వేంకటసుబ్బారావు పంతులు గారు గ్రామ్య

భాషయందు రచియించి యాంధ్రజనానురాగమును బడసిరి. ఈ గ్రామ్యభాషయందలి గ్రంథములం దనేకశాస్త్రవిషయముల వ్రాయుట కెంత యుపయోగించిన నాంధ్రసారస్వతాభివృద్ధి కే మాత్రము నేర్పడక యాంగ్ల సారస్వతమునకు వచ్చిన యాపత్తుల వంటివే ఘోషించు చున్నవి. పైని జెప్పిన రెండు విధము లైన నాటకములలో మొదటి తరగతి నాటకములకు మార్గదర్శి వీరేశలింగము పంతులు గారు. వీరు మిగులఁ గష్టపడి వివిధము లైన విషయములఁ గూర్చి చాల గ్రంథములను రచియించి యాంధ్రభాష కుపకారము నొనర్చినారనుట నిస్సందేహవిషయము. శకుంతల మున్నగు నాటకములను సంస్కృతమునుండి తెలిఁగించినారు. వీరి తరువాత వడ్డాది సుబ్బారాయఁడు గారు చిలకమర్తి లక్ష్మీనృసింహము గారు తిరుపతి వేంకటేశ్వరకవులు మొదలగు ప్రముఖు లనేకము లైన నాటకములఁ దెలుఁగున రచియించియున్నారు. కాని, వారిలో నెవ్వరును రెండవ తరగతి నాటకములను వ్రాయలేదు. అట్టి నాటకములకుఁ బితామహుఁ డని చెప్పఁదగిన కీర్తిశేషు లైన ధర్మవరము కృష్ణమాచార్యులు గారు తెలుఁగున నట్టినాటకముల ననేకముల రచియించి యట్టి నాటకరచనకు మార్గముఁ జూపుటవలన నాంధ్రసారస్వతమునకు మహోపకార మొనర్చి యాంధ్రజనకృతజ్ఞతాపూర్వకవందనముల కెంతయుఁ బాత్రు లైరి. విషాదనాటకములను (Tragedies) మొదట నాంధ్రభాషయందు రచియించిన ఘనుఁ డీ కృష్ణమాచార్యుఁడే. ఈతనికిఁ బూర్వ మే కవియుఁ దెలుగున విషాదనాటకమును వ్రాయలేదు. సంస్కృతమందుఁ గూడ నే కవియు రచియింపలేదు. సంస్కృతకవులను వారల ననుసరించి వ్రాసిన తెలుఁగుకవులు నందఱు నట్టి విషాదనాటకము లమాంగల్యము లను కారణముచేత వ్రాయ నాలోచింపనైన లేదు. విషాదనాటకరచనయందు నిధి యని పేరొందిన 'షేక్స్పియర్' అను నాంగ్లేయమహాకవీంద్రుని నాటకరాజములఁ జదివి యాంధ్రనాటకాభివృద్ధికై మిగులఁ బాటుపడి మన తెలుఁగుభాషయం దట్టి విషాదనాటకములను నూతనముగఁ బ్రవేశపెట్టుట యను దుష్కరకార్యము సాధించె ననుఘనత కృష్ణమాచార్యులకే తప్ప మఱియొకరికిఁ జెందనేరదు. తెలుఁగున విషాదనాటకరచనయందు కృష్ణమాచార్యులతో సమానముగఁ బేరొందిన కోలాచలము శ్రీనివాసరావు గారు 'విజయనగరసామ్రాజ్యప్రధ్వంస' మను విషాదనాటకమును రచియించి యాంధ్రలోకమునఁ బ్రసిద్ధి చెంది యాంధ్రసాహిత్యమునకు వన్నెఁ దెచ్చిరి. శ్రీనివాసరావుగారీ విషాదనాటకమునే కాక మఱికొన్ని చక్కని నాటకములను కూడ రచియించి మెప్పొంది యున్నారు. ఇఁక వచనకావ్యముల విషయము విచారించెదను. ఇవి కూడ నాటకములవలెనే రెండువిధములుగ విభజింపవచ్చును. మొదటి తరగతివి కేవలవచనకావ్యములు. రెండవతరగతివి నవల లని చెప్పఁబడుచున్నవి. పురాణేతిహాసాదుల కథలు పిట్టకథలు లోకసమాచారములు ప్రహసనములు మొదలగు విషయము లీ మొదటి తరగతి వచనకావ్యములందు వర్ణింపఁబడుచున్నవి. ఆంధ్రసారస్వతమునందు మొదట వచనము నుపయోగించినవారు భారతకవులు. వచనకావ్యములుగ వేఱుగ వ్రాయకపోయినను భారతమందలి వచనము మిక్కిలి ప్రౌఢమై శ్లాఘాపాత్రముగ నున్నది. కవిత్రయమునందుఁ గూడఁ దిక్కన తన యుత్తరరామాయణమున వచన ముపయోగింపక దానిని కేవలపద్య గ్రంథముగ వ్రాసెను. దీనిఁ బట్టి చూడఁ గవిత్రయపు కాలమందే వచనము నెడ గౌరవ ముంపక గ్రంథములను నిర్వచనములుగ వ్రాయుట కష్టతర మనియుఁ గావుననే మిక్కిలి శ్లాఘనీయ మనియు నభిప్రాయము ప్రబలియుండినట్లు విశద మగుచున్నది. కేవలముఁ గవిత్రయము ననుకరించి వ్రాసిన మధ్యకవుల ప్రబంధములఁ గానవచ్చు వచనములు కవిత్రయవచనములవలెఁ బ్రౌఢములు కాక పదగాంభీర్యము గలిగి నిఘంటువులఁ బారలించినఁ గాని బోధ్యములు కాక యున్నవి. ముద్దరాజు రామన్నయుఁ జిత్రకవి యనంతకవియు వ్యాఖ్యానరూపమున వచనమును వ్రాసినను కేవలవచనకావ్యము లెవ్వరు నిదివఱకు రచియింపలేదు. ఇట్టి కేవలవచనకావ్యమున కాధునికులలో మార్గదర్శులు చిన్నయసూరి గారు వీరేశలింగము పంతులు గారు నై యున్నారు. పంతులుగారు రచియించిన రాజశేఖరచరిత్ర సత్యవతీవిలాసము మంజువాణీవిజయము మొదలగు గ్రంథములు ప్రహసనములు కూడ నీ వచనకావ్యములందుఁ జేర్పఁబడుచున్నవి. తెలుఁగు భాషలోఁ బ్రహసనములను మొదట రచియించినవారు వీరేశలింగము పంతులు గారే. వారి తరువాతఁ జక్కని ప్రహసనములను చిలకమర్తి లక్ష్మీనృసింహము గారు తెలుఁగున రచియించి యాంధ్రజనామోదమును బడసియున్నారు. వీరిద్దఱి ననుకరించి యిపుడు కొందఱు ప్రహసనములను వ్రాయఁ బ్రయత్నించుచున్నారు. ఇఁక రెండవ తరగతి వచనకావ్యము లైన నవలల విషయమై విచారించెదను. ఈ నవలలు కేవల మాంగ్లేయాద్యన్యదేశ్యసారస్వతోత్పాదితము లై యున్నవి. వీనిని నూతనముగ నాంధ్రభాషయందు సంధానకావ్యములుగ రచియించి యాంధ్రసారస్వతమునకు మహోపకార మొనర్చి సర్వాంధ్రజనశ్లాఘాపాత్రు లైనవారు కందుకూరి వీరేశలింగము పంతులు గారు. ఈ విషయమున వీరు విషాదనాటకకర్త యైన కృష్ణమాచార్యులవారికిఁ బోల్పఁదగినవారై యున్నారు. నృసింహము పంతులు గారు వ్రాసిన నవలలు కొన్ని యైనను రత్నములై యాంధ్రసారస్వతమునకు వన్నెఁ దెచ్చుచున్నవి. ఇపుడు వెలువడు నవల లన్నియు నృసింహము గారి నవలలవలె సందర్భానుసారవర్ణనలచే రసోత్పాదకములు కాక కేవలభాషాంతరీకరణము లగుటచే రాణించుట లేదు. ఈ విధము లైన వచనకావ్యములే కాక శాస్త్రవిషయకగ్రంథము (Scientific Works) లెక్కువగ నీ కాలమున వ్రాయఁబడుచున్నవి. ఇట్టి గ్రంథరచనయే యీ కాలపు సారస్వతలక్షణమై యున్నది. కేవలదృశ్యవచనకావ్యములే కాక పూర్వప్రబంధరీతిన్యము కూడ నీయుగమం దక్కడక్కడ నగపడుచున్నది. పూర్వప్రబంధములవలె ప్రబంధములు తెలుఁగున నీ కాలమందు వ్రాసిన కవులలోఁ దిరుపతి వేంకటేశ్వరకవులు ముఖ్యులు. వీరిద్దఱు చక్కని మృదుమధురశైలిని ద్రాక్షాపాకమున మధ్యకవులవలెఁ జాల ప్రబంధములను నాటకములను శృంగారప్రధానకావ్యములను దెలుఁగున రచియించి మిగులఁ బ్రసిద్ధిఁ గాంచియున్నారు. ఈ కాలపు భాషాస్థితిని సూక్ష్మముగఁ జెప్పెదను. దృశ్యవచనకావ్యము లభివృద్ధి యగుచున్నవి. కాని, యున్న స్థితి యంకను చాలదు. పద్యకావ్యము లన్నియు నించుమించుగ క్షీణించిపోయినవి. ఉన్నను, పద్యకావ్యములు పూర్వకవుల కావ్యములనుండి చౌర్యములయి వానిఁ జూచి వ్రాయఁబడి తన్ముద్రితములై యున్నవి. తెలుఁగు నింక నభివృద్ధి చేయు మని యీశ్వరుఁ బ్రార్థించుచు నింతటితో విరమించు చున్నాఁడను.

నేఁటి తెనుఁగు కవిత్వము

చింతా శంకరదీక్షితులు

నేఁటి తెనుఁగు కవిత్వమునకును తాతలనాఁటి తెనుఁగు కవిత్వమునకును వ్యత్యాసము మెండుగాఁ గలదు. ఇంగిలీషు భాష నేర్చుకొని ఆ భాషలో వ్రాసిన గొప్ప కవుల గ్రంథములు చదువుటచే నేఁడు కవిత్వము చెప్పు తెనుఁగువారు ఆ భాషలోని క్రొత్త యందములను మన భాషలో ప్రవేశపెట్టఁగలుగుచున్నారు. బెంగాలీభాష తరువాత కవిత్వ విషయమున వన్నెగన్న దేశభాష తెలుఁగే యని పెద్దలు తలఁచుటకు కారణము ఈ క్రొత్త మెఱుఁగులే. ఒక కవివరుఁడు చెప్పినట్లు కవిత్వము ఈరీతి నుండవలయును గదా!

క. చెప్పవలెఁ గప్పురంబును
గుప్పలుగాఁ బోసినట్లు కుంకుమ పైపై
గుప్పిన క్రియ విరిపొట్లము
విప్పిన గతి ఘుమ్మనన్ గవిత్వము సభలన్.

మరియు మెల్ల యే మనుచున్నదో చూడుఁడు:

ఆ. తేనె సోఁక నోరు తీయన యగు రీతి
తోడ నర్థ మెల్లఁ దోఁచకుండ
గూఢశబ్దములను గూర్చిన కావ్యము
మూఁగచెవిటివారి ముచ్చటగును.

క. కందువ మాటలు సామెత
లందముగాఁ గూర్చి చెప్ప నవి తెనుఁగునకుం
బొందై రుచిరమై వీనుల
విందై మరి కానిపించు విబుధుల మదికిన్.

ఈ రీతిని కవిత్వతత్త్వ మెఱింగినవారు పలుకుచుండఁగా, ఏమి పాపమో గాని కొందఱు విద్వత్కవుల మని పేరుపెట్టుకొని చదువరుల కెంతో శ్రమ గలిగించుచున్నారు. రాళ్లు నమలినట్లు వారి కవిత్వ ముండు నని చెప్పఁజాలము గాని జనసామాన్యమునకు మాత్రము వారి కవిత్వము అగమ్యగోచర మని చెప్పఁగలుగుదుము. సంగీతమును కవిత్వమును వాగర్థములవంటి వని పెద్దలు పలుకుట విందుము. ఈ సంగీత మట్టివారి కవిత్వమున గోచరము గాకున్నది. కవిత్వము చూచిన నొడలు ఝల్లు మనవలదా? ఈ 'ఝల్లు' మన పూర్వకవుల కవిత్వమం దెంత గలదు? మహానుభావు లగు శ్రీనాథుఁడు పోతన మొదలగువారి కవిత్వమం దీ 'ఝల్లు' కలదు గాని వారి భావ మాత్రము జనసామాన్యమునకు బాగుగా తెలియుట లేదు. ఇట్లంటి మని మాకు పూర్వకవులయెడల గౌరవభావము లే దని తలఁపకుందురుగాక! కవిత్వము మరియు ప్రకృతిని ప్రతిబింబించుచుండవలదా? కల్లలు పలుకుట సులభము గాని ఒక్క నిజము చెప్పుట కష్ట మన్నట్లు వర్ణన లెన్నియేని చేయవచ్చును గాని ఉన్న దున్నట్లు తూచాలు తప్పకుండ వర్ణించుట మాత్రము కష్టము.

పూర్వకవిత్వమున నీనాఁటివారికి నచ్చని కొన్ని విషయములఁ జెప్పి నేఁటి కవిత్వమున నున మా లోటుల నెట్లు సద్దుకొనుచున్నామో విచారింతము:

I పదములు

తెనుఁగు భాషకు వేరుదుంప యనఁదగు సంస్కృతమును మన పూర్వులు పెక్కురు చదివి కావ్యనాటకలక్షణముల గ్రహించి కావ్యములఁ జేయ మొదలుపెట్టినవారు. అందు కొందఱు మాత్రమే సంస్కృతమందలి మాధుర్యమును గ్రహించి దానిని తమ తెనుఁగు కావ్యములఁ జొప్పింపఁగలిగినారు. మరికొందఱికా సంస్కృతపాండిత్యము నిజకవిత్వమాధుర్యమును పెంపొందింప సాహాయ్య మొనరింపదాయె సరి కదా, దానిని పాషాణప్రాయముగఁ జేయ సాయపడినది. అట్టివారు కావ్యములకు రసమే ప్రాణ మను సంగతి నెఱిఁగినవా రయ్యు, ఆ రసమును కఠినపదములలో దాఁచుటచే నది జనులు సులభముగ ననుభవించుటకు వీలుపడకుండెను. కఠినపదప్రయోగమును అతిదీర్ఘసమాసముల నుపయోగించుటయు నిఘంటువులందే దాఁగియుండఁదగిన పదముల బయటికి లాగి వానిని కావ్యములలో వాడుటయు నిట్టి కవిత్వమునకు లోపములు. కవిత్వ మెంత కఠినముగ నున్న నంత గొప్ప యని వారి యాలోచన. ఈ లోపము ముఖ్యముగా మధ్యయుగములోని కవులకును ప్రాఁత కవిత్వము నాదర్శప్రాయముగ నుంచుకొని రచింపఁబూను నేఁటి పండితకవులకును ఆరోపింపవచ్చును. ఇందుల కుదాహరణముగ నీ క్రింది పద్యములఁ జూడుఁడు:

శా. మాణిక్యక్రియమాణసౌధసుషమామాయాసరిత్తస్కా
మేణాక్షీసహాభీతిసంభ్రమభరవ్యాలోకమానాభ్రగా
క్షీణానర్గళహాసభావిదళితస్ఫీతాంధకారత్రియా
మాణూఘాతనితాన్యపక్షతతికం బా పట్టణం బల్పమే?

క. వాలరేఖలు లక్ష్మీకర
విలసనములు బహుళభద్రవిభ్రమగతులుం
గలిగి హరిచరణసదృశత
నలరుదు రలఘుబల మొప్ప నప్పురి శూద్రుల్.

తే. పంచబాణవిభిన్నుఁ డౌ పంచముఖుని
నిందుముఖి యేకవాణియుఁ బొందదయ్యెఁ
బంచవక్త్రాహిదష్టుఁ డౌ పంచజనుని
ఫణిహతవిషార్తి యావధి మనుపఁగలదె?

కమ్మని కవిత్వ మల్లఁగలిగినవా రా కాలమందుఁ గూడఁ గలరు — లలితపదప్రయోగము నాతిదీర్ఘసమాసములు ఎక్కడెక్కడ నుట్టిపడు రసము వీరి కవిత్వమునకు వన్నె దెచ్చినవి చూడుఁడు:

ఉ. ఇంతలు కన్ను లుండఁ దెరు వెవ్వరి వేఁడెదు భూసురేంద్ర! యే
కాంతమునందు నున్న జవరాండ్ర నెపం బిడి పల్కరించు లా
గింతియ గాక నీ వెఱుఁగవే మును వచ్చిన త్రోవ చొప్పు? నీ
కింత భయంబు లేకడుగ నెల్లిద మైతిమి! మాట లేటికిన్?

ఉ. పాటలగంధి చిత్తమునఁ బాటిలు కోపభరంబు దీర్ప నె
వ్వాటును బాటు గామి మృదుపల్లవకోమలతత్పదద్వయీ
పాటలకాంతి మౌళిమణిపంక్తికి వన్నియవెట్ట నా జగ
న్నాటకసూత్రధారి యదునందనుఁ డర్మిలి మ్రొక్కె మ్రొక్కినన్.

మొల్ల చెప్పినట్లు గూఢశబ్దములఁ గూర్చి చేర్చిన కావ్యము కవిపాండిత్యమును వెల్లడింపఁగలుగునే గాని కవిత్వధర్మమును వెల్లడింపఁ జాలదు. కవిత్వ మన్న పండితులు మాత్రమే యానందింపఁదగినది గాక జనసామాన్యమునకుఁ గూడ సంతోషము నొసగూర్పఁదగినదిగా నుండవలయును గదా!

ఇంగిలీషు భాషలో పాండిత్యము గ్రహించి తెలుఁగున కవిత్వమును జెప్పఁబూను నేటివా రీ లోపమును సవరింపఁబూనుచున్నారు. నిర్జీవభాష వారికి నచ్చకుండుట న్యాయ్యమే. నలుగురి నోళ్లలోను తిరుగు పదములఁ గూర్చి జాతీయపదములఁ జేర్చి వ్యాకరణయుక్తముగ తియ్యని కవిత్వమును వా రల్లఁగలుగుచున్నారు. తొలుదొల్త నిట్టి కవిత్వమును జెప్పఁ బ్రయత్నించినవారు వీరేశలింగము గారు. మరియు, తిరుపతివేంకటకవులు గూడ తమ కావ్యములఁ గొన్నింటి నీ ఫక్కినే రచించిరి. జయంతి భావనారాయణకవి గారు — చచ్చి స్వర్గమున నున్నారు — ఆ మహానుభావుఁడు తేటతెనుఁగు పదములతో తేనె లూరునట్లు చక్కని కవిత్వమును జెప్పియున్నాఁడు, చూడుఁడు:

ఉ. ఉండను గొంప సున్న, పడియుండను మంచము లేదు, పొట్టకున్
దిండియు సర్వమంగళము, తీవ్రదరిద్రముచేత సర్వదా
కొండలఁ దుప్పలం గడుపుఁగూటికినై చరియించు నీచునిన్
దెండిలియాడి యే మనుభవించితొ చెప్పుము సుందరీమణీ!

మహానుభావుఁడు గురుజాడ అప్పరాయకవి యెంతటి మృదువైన కవిత్వముఁ జెప్పెనో చూడుఁడు:

దించు లంగరు దీర్ఘయుద్ధము
ధర్మపక్షము ముల్లు చూపెను
నరుల పీనుఁగు పెంటపోఁకల
నాటి వెలయును శాంతివృక్షము.

మరియు నీనాఁటి కవు లనేకులు కందువ మాటలతో నెంతో మధురమగు కవిత్వమును చెప్పఁగలుగుచున్నారు. ఈ కవిత్వమునకు మాధుర్యము నిజముగా వ్యావహారికపదములను జాతీయములను సామెతలను కవిత్వమునఁ గూర్చి సజీవమగు భాష నుపయోగించుటచేతనే కలుగుచున్నది.

II భావములు

కవిత్రయమువారి ననుసరింపఁబూనియు ఆదికావ్యముల ఫక్కిని రచింపఁబూనియు తొల్లిటి కవులు కొందఱు దొరఁకొని కొన్ని కావ్యముల రచించిరి. ఇట్లు రచించినవారి కావ్యములందలి భావములు పూర్వకవుల భావముల ప్రతిబింబములే. నూతనభావములు సున్న. కాంత ముఖమును బోలఁ గమలములు పూర్వకావ్యములఁ దపస్సు చేసిన, ఈ కావ్యములఁ గూడ వీరు కమలములఁ దపస్సు చేయించిరి. విరహవేదనచే నాయిక చంద్రాదులను పూర్వకావ్యములందు దూషించిన, ఈ కావ్యములందుఁ గూడ దూషింపవలసినదే. పూర్వకావ్యములందు చద లంటు సౌధరాజము లుండిన ఈ కావ్యములందుఁ గూడ గుడిసెలు చద లంటుచున్నవి. పూర్వకావ్యములందు బ్రాహ్మణులు బ్రహ్మను ధిక్కరించిన, ఇప్పుడు కూడ ధిక్కరించుచున్నారు. సవబు సందర్భము లేకుండ నిట్లు కవులు కొందఱు — కవు లనరాదు వారిని పండితు లనవలయును — ఔచిత్యానౌచిత్యముల గ్రహింపకుండ 'వేలమువెఱ్ఱి'గా తమ కావ్యములందు వర్ణనలఁ జేసియున్నారు. నూతనభావములు తక్కువ.

నేఁడు కవిత్వముఁ జెప్పు కొందఱు కవులు నూతనభావముల సృజింపఁగలుగుచున్నారు ఇట్లు నూతనభావముల సృజింపఁగలిగినవారు పూర్వకవులందును కొందఱు చుక్కలలోని చంద్రునివలె ప్రకాశించుచున్నారు. కాని, వారి సంఖ్య యత్యల్పము. శ్రీనాథుఁడు పెద్దన కదిరీపతి మొదలగువా రిట్లు ముచ్చటగా కవిత్వము చెప్పినారు. రసమే ప్రధానముగాఁ జేసికొని వీరు రచించుటచే వీరి భావములు నీరసములు గాకుండెను.

వీరి ననుకరింపఁబూనినవారు లక్షణగ్రంథములకు లక్ష్యములుగ కావ్యముల రచించిరే గాని రసమునకుఁ గానట్లు తోఁచుచున్నది. సందర్భ మె ట్లున్నను కావ్యలక్షణములకు లక్ష్యములఁ జూపుటే వీరి యాశయ మని తోఁచుచున్నది. ఇట్టి వీరి కావ్యములందు కావ్యగుణము లరుదుగా నుండును. నేఁటి కవిత్వమున నూతనభావములు చెన్నారుచున్న వనుటకు వడ్డాది సుబ్బరాయఁడు గారి కొన్ని గ్రంథములు రాయప్రోలు సుబ్బారావు గారి కావ్యములు వేంకటపార్వతీశ్వరకవుల పద్యమాలికలు ఇంకను నితరుల పద్యములు సాక్షులుగా నున్నవి. ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచికలను కృష్ణాపత్రికను చదువుచుండువారి కీ యంశము విశదమే.

ఇంగిలీషువారి భావములను తెలుఁగు కవిత్వములోనికిఁ జొనుపునప్పుడు తెనుఁగు భాష మార్దవమును మాత్రము చెఱుపకుండ ఇంగిలీషు వాక్యరచనాపద్ధతిని తెనుఁగులోనికిఁ జొప్పింపకుండ నేఁటి కవులు కాచుకొనవలయును.

III కావ్యనిర్మాణపద్ధతి

తెనుఁగున పినవీరన వ్రాసిన శృంగారశాకుంతలము శ్రీనాథుని నైషధము పెద్దన మనుచరిత్రము ఆదికావ్యము లని చెప్పవచ్చును.

వీరి ఫక్కి ననుసరించి కొందఱు పూర్వకవులు కావ్యముల రచించిరి. కాని, వీరి కావ్యములందు కావ్యగుణములు పట్టకుండెను. వీరి కావ్య రచనాపద్ధతి ఆదికావ్యముల పద్ధతిని బోలియున్నది. ఈ పద్ధతి మాత్రము రానురాను చదువరుల కానంద మిచ్చుటకు బదులు విసుగు పుట్టించుచున్నది. సంస్కృతమునందును కావ్యములు గలవు. ఎంత మనోహరముగ నున్నవి! వానికిని తెనుఁగు కావ్యములకును విశేష భేదము గలదు. చూడుఁడు, తెనుఁగు కావ్యములందలి పద్ధతి: కృతి పతి వంశవర్ణన, షష్ఠ్యంతములు, పురవర్ణన, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణన, వేశ్యల యభిసారికల పుష్పలావికల వర్ణన, నాయికానాయకుల విరహము,మన్మథావస్థలు మొదలైనవి క్రమము దప్పకుండ నొకరిని మించి యొకరు తమ కావ్యములందు కవులు చేసి యున్నారు. కారణ మేమి? ఆదికావ్యములం దట్లున్నది గనుక. ఇట్లు చేసిన కవుల కేమైన ఘనత గలదా? క్రొత్త లుండిననే గాని కావ్య ము మనోహరముగ నుండఁజాలదు. నేఁడు కొందఱు కవు లీ పద్ధతిని విడనాడి నూతనమార్గములందు కవిత్వమును నడపింపఁ బూనుకొను చున్నారు. వీరి ప్రయత్నములు ప్రశంసాపాత్రములు.

నూతనపద్ధతిని వ్రాయు నీనాఁటి కవుల కవిత్వమందు నూతన భావములు చొచ్చుటకుఁ గల కారణములలో పశ్చిమదేశవాఙ్మయ పఠన మొకటి.

IV ఛందస్సు

పూర్వకావ్యములందు కవులు ముఖ్యముగా నాలుగు వృత్తము లను కందమును గీతసీసములను వాడియున్నారు. అందందు ఇతరవృత్త ములు రగడలు మొదలైనవి గలవు గాని యవి యరుదుగా వాఁడఁబడి యున్నవి. శ్రీనాథాదులు సీసపద్యమును మిక్కిలి సొగసుగా వ్రాసిరి.

ఈ సందర్భమున నొక విషయమును గూర్చి చెప్పవలసి యున్నది. మన వృత్తములకు నియమములు మెండు. సంస్కృత మందుఁ గాని కొన్ని దేశభాషలందుఁ గాని కవిత్వముఁ జెప్పు కవులకన్న ఆంధ్రమునఁ గవిత్వముఁ జెప్పు కవులకు కష్ట మెక్కువ. కారణము నియమబాహుళ్యమే! వృత్తముల కిన్ని నియమములఁ బెట్టి తెనుఁగు లాక్షణికులు తెనుఁగువారి నోళ్లు కట్టివేసిరి. కావ్య మును వ్రాయఁబూనువారి కేమాత్రమును స్వాతంత్ర్యము లేదు. కట్టు బాట్లు మెండైనవి. కవుల సహజచాతుర్యము సృష్టికౌశలము ఈ కార ణమున కొంతవఱ కడుగంటినవి. ప్రబంధములు ప్రబంధము లే యైనవి. ఇదియుఁ గాక వీరి వృత్తముల సంగీతము లేదు.

ఈ కష్టమును గమనించియే నేఁటి కవులలో కొందఱు నియ మములు తక్కువగ నున్న గీతము మంజరి సీసము మొదలగువానితో మనోహరముగ కవిత్వమును జెప్పి రసమును పోషించుచున్నారు. ఈ కాలమున గీతమున కందము దెచ్చినవారు వేంకటపార్వతీశ్వరులు మొదలగువారు. కొంత వాగాడంబరము తగ్గిన గీతము లింకను ప్రకా శించును. చూడుఁడు:

తే. కొక్కొరో యని తొలికోడి కూసినపుడు
తొలివెస ప్రభాతకాంతులు దోఁచినపుడు
కులుకు వెల్గున పక్షులు పలికినపుడు
కూసి కోకిల కన్నెఱ్ఱఁ జేసినపుడు
దేవ! యొక్కప్పుడా? దినదినమునందు
నవరసాశ్రయ మగు నీ యనంతకావ్య
గరులఱ సూచుచు నానందగరిమ గాంచి
చదువుకొనుచుందు నొక వింత చవులు దేర!

మరియు గురుజాడ అప్పరాయకవి క్రొత్త మార్గముల కవిత్వ మును నడిపించి మించినారు. కవితాకన్యక క్రొత్త నడక లిప్పుడు నడచుచు హాయి నిచ్చుచున్నది. చూడుఁడు:

మేలిమి బంగరు మెలతల్లారా
కలువల కన్నుల కన్నెల్లారా
పిల్లల గన్నా తల్లుల్లారా
విన్నారమ్మా యీ కథను

... ...

ఆమని రాఁగా దుర్గ కొలనిలో
కలకల నవ్వెను తామరలు
ఆమని రాఁగా దుర్గ వనములో
కిలకిల పలికెను కీరములు.

మరియు వీరింకొక మాదిరిగ పద్యముల వ్రాసి మన హృదయముల నాకర్షించుచున్నారు. మచ్చు చూతము:

విరిగి పెరిగితి పెరిగి విరిగితి
కష్టసుఖముల పార మెఱిఁగితి
పండు నన్నవి యాస లెన్నో
యెండి రాలఁగఁ బొగిలితిన్. 1
అందఁజాలని పళ్లకోసము
అఱ్ఱు చాపితి; నేల ప్రాఁకిన
చెట్ల పళ్లను విలువ తెలియఁగక
పాదరక్షల మెట్టితిన్. 2

... ...

యనమండ్ర నారాయణమూర్తి గారు కూడ నీ రీతినే క్రొత్త క్రొత్త పద్యముల రచించి మించిరి:

ఎవరు బంగారుకోట?
యెవరు రత్నాలమూట?
యెవరి మాట యెల్లవా రెపుడు పాడఁదగిన పాట?
గొప్పయింటఁ బుట్టి ధనము కోరినంత గలిగియుండి
విఱుగఁబడక బీదసాద వేవిధాలఁ జూచువారు.

... ...

వారు బంగారుకోట.
వారు రత్నాలమూట.
వారి మాట యెప్పు డెల్లవారు పాడఁదగిన పాట.

మఱియు, తెనుఁగువారి సొత్తగు ద్విపద మొన్న మొన్నటి వఱకు నడుగంటియుండి నేఁడు తలయెత్తుచున్నది. సౌరులు నింపుచున్నది. తీపుల చూపుచున్నది. హాయి నిచ్చుచున్నది. చూడుఁడు:

ద్వి. వింటిరే పల్నాటి వీరుని గాథ
బాలచంద్రుఁడు మంచి ప్రభ గాంచినాఁడు
ఐతాంబ పూర్వపుణ్యఫలంబు వీఁడు
రణనీతికుశలుండు ప్రకటవిక్రముఁడు
వైరు లెందరొ నిల్చి వానిని దాఁక
చిందరవందర చేసినాఁ డరుల
వెన్నిచ్చి యెఱుఁగఁ డేవేళను దాను.

మఱియు, పెక్కురు కవులు పెక్కు గతుల కవిత్వమును నడిపి దానికి వన్నె యిడుచున్నారు. భావ నుద్ధరించుచున్నారు. లక్ష్యములఁ జూపుట కిందు తావు లేదు గాన విడుచుచున్నాము.

పూర్వాచారపరాయణుల కీ వ్రాఁత లేవగింపు పుట్టించు ననుటకు సందేహము లేదు గాని — ఎవ రాఁపఁగలరు? పొంగి పొరలి వచ్చు నీ క్రొత్త మార్పుల నెవరు వల దని వారింపఁగలరు? ఈ నూత్న కల్లోలిని నెవరు పట్టఁగలరు?

V చిన్నచిన్న పద్యములు

పూర్వకవులు శతకముల వ్రాసి ఆంధ్రవాఙ్మయమునకు వన్నె పెట్టియున్నారు. అందందు చాటుపద్యములు గూడ కలవు. కాని, వేర్వేఱు విషయములపై ఆంగ్లేయకవులవలె వారు చిన్నచిన్న పద్యముల రచింప రైరి.

ఈ కాలపుఁ గవు లీ కొఱంత కొంతవఱకు తీర్పఁబూనుకొనుచున్నారు. రమణీయ మైన పద్యముల పెక్కురు ఆధునికకవులు వ్రాయుచున్నారు. వాఙ్మయాభివృద్ధికిఁ దోడ్పడుచున్నారు. అందు భావగాంభీర్యము గలదు. ఇట్టి పద్యము లింకను వెలసినఁ గాని భావ యభివృద్ధి నంద నేరదు. ఇంకను కొన్ని కట్టుబాట్లు తగ్గినఁ గాని నిజమగు కవులు బయలుపడఁజాలరు. పాండిత్యమే కవిత్వము చెప్పుటకు ముఖ్య మని చెప్పలేము. కవిత్వమున కావేశ ముండవలయును. ఆవేశము లేని కవిత్వ మెంత పాండిత్యమును వెళ్లఁబోయుచున్నను అది కవిత్వ మనిపించుకొనదు. గంటకు వందల కొలఁది పద్యము లెంద ఱాశువుగఁ జెప్పుచుండలేదు? అ దంతయు కవిత్వ మనవచ్చునా? పద్య మల్లఁగలిగినంత మాత్రమున కవి యగునా? నిలుకడతో నావేశము గల్గి చెప్పిన — పద్య మన నేల గద్య మైనను కవిత్వ మనిపించుకొనును. ఇట్టి గద్యకవిత్వమును మనము బెంగాలీ భాషలోను ఆంగ్లేయభాషయందును గాంచుచుండలేదా? రవీంద్రనాథుని కవిత్వము గద్యరూపకముగానే కదా ఆంగ్లేయభాష నలరారుచున్నది? మనవా రింకను ప్రయత్నములు సల్పి గద్యకవిత్వమును చెప్పవలయును. కాలము మాఱుచున్న కొలఁది కవిత్వమందును భావములందును — ఇవి యవి యన నేల — అన్నిటియందును మార్పులు గలుగుచుండును. కొంద ఱవి మెత్తురు. కొందఱి కవి రుచింపవు. ఎవ రేమి చేయఁగలరు? కొండబాటల మర్మరధ్వనులను జేయుచు మందగతిని బాఱు ప్రవాహ మున్నతాచలమునుండి హోరుమని క్రిందకు జాఱును. ఎవరు పట్టఁగలరు? కవిత్వ మట్లే కొంత కాలము నెమ్మదిగ కొండవాగులవలె నడచును. వారిపాతమువలె నదియు నొక కాలమున విజృంభించును. మరల సైకతస్థలుల నీ కవిత్వప్రవాహము పాఱును. వల దన్న మానునా?

పూర్వకవుల కావ్యములు తెలుఁగువారి యాస్తి యను మాట మఱవలేదు మేము. అంత దిట్టముగ వారు పునాది వేయుటచే ఆంధ్రకవిత్వము నేఁడు క్రొత్త క్రొత్త వన్నెలఁ జూపుచు నతిశయిల్లుచున్నది. నేఁటి కవు లా పునాదిమీఁదనే దివ్యసౌధముల లేవనెత్తఁ బ్రయత్నించుచున్నారు.

ఇందు పూర్వకవుల దూషించితి మని భాషాతత్త్వవేత్తలు దలఁపకుందురుగాక! నేఁటి తెలుఁగు కవిత్వమును గూర్చి చెప్పఁబోవునప్పుడు పూర్వకవుల వరుస కూడ కొంత చెప్పవలసియుండి చెప్పితిమి.

ఇంతవఱకు మేము చెప్పిన విషయము లే మన: నేఁటి తెనుఁగు కవిత్వమున శైలి మనోహరముగ నున్న దనియు భావము లధునాతనము లనియు కావ్యరచనాపద్ధతి హృదయంగమ మనియు పద్యముల పోకడలు క్రొత్త వనియు.

నేఁటి తెనుఁగు కవిత్వము కొంత కావ్యములందే గాక నేఁటి దృశ్యప్రబంధములందుఁ గూడ ప్రకాశించుచున్నది. సంస్కృతాంగ్లేయనాటకకర్తల నాదర్శప్రాయముగ నుంచుకొని మన మింకను చక్కని నాటకముల వ్రాయవలసియున్నది. ఆంధ్రదేశమున కొలఁది కాలములో ఒక కాళిదాసు గాని ఒక షేక్స్‌ఫియర్ గాని అవతరింపవచ్చును. నాఁటిదనుక మన నేఁటి కవిత్వము దినదినాభివృద్ధి నందుచుండవలయును!

రామరాజభూషణకవిచరిత్రము

వైయాకరణము గోపాలజయదేవరాజు గారు

రామరాజభూషణకవి జన్మస్థానము గుంటూరుజిల్లా పల్నాడు తాలూకా భట్టురాజులపురము. వీరి యింటిపేరు ప్రబంధాంకమువారు. ప్రబంధమ్ములను రచించుటచేతను చదువుటచేతను ప్రబంధాంకమువా రను నింటిపే రొందిరి. భట్టురాజులపురమునం దిప్పటికి ననేకులు ప్రబంధాంకమువారు విద్యాధరణివారు ధేనువుకొండవారు సరస్వతివారు మున్నగు పౌరుషగృహనామధేయమ్ములచేఁ బరఁగుచున్నారు. భట్టురాజులలో రెండు నాఁడులు కలవు: తెలుఁగునాఁ డనియు వెలనాఁ డనియు.

రామరాజభూషణకవి, భట్టుమూర్తి, అంధ్రనాయకశతకము హంసలదీవి గోపాలశతకము మానసబోధశతకము మున్నగు ననేక గ్రంథములను రచించి ప్రసిద్ధి కెక్కిన కాసుల పురుషోత్తమరాజకవి, మలరాజుగుండారాయణోపాఖ్యానము గువ్వలచెన్నశతకము వజ్రపంజరశతకము మరున్నందనశతకము శమంతకోపాఖ్యానము కవిసర్పగారుడము కవిమూషికమార్జాలము మొదలగు ననేక గ్రంథముల రచించి ప్రసిద్ధి కెక్కిన పట్టాభిరామకవి, లాక్షణికాగ్రేసరుఁ డగు నప్పకవిచేఁ గొనియాడఁబడిన సీవని పెద్దిరాజు రామరా జను సోదరకవులు, రఘువంశము కుమారసంభవము మాఘకావ్యము భారతచంపువు మున్నగు సంస్కృతగ్రంథమ్ముల నాంధ్రముగా రచించి యుభయభాషాభూషణబిరుదంబును వెలుగోటి మహారాజుగారి యాస్థానంబున నొంది ఖ్యాతి కెక్కిన బిరుదరాజు మున్నగు కవిపుంగవులు తెలుఁగునాఁడున నుండిరి.

కస్తూరిరంగశతకము జలక్రీడానాటకము కృష్ణలీలలు మున్నగు గ్రంథముల రచించి ప్రఖ్యాతి వహించిన రాయభట్టు వీరరాఘవరాజకవి, మంత్రుల చరిత్రము రచించి మహీశూరమహారాజు గారి యాస్థానంబునఁ గలికితురాయి మొదలగు బహుమానమ్ములఁ బడసిన యమ్మిరాజకవి, మంత్రశాస్త్రమునం దగ్రేసరుఁ డగు మొగతాడు మూర్తిరాజకవి, గద్వాలసంస్థానమునందు నవరత్నస్థగిత మగు కంకణంబు గ్రహించి జగత్ప్రసిద్ధి వహించిన వేంకటభట్టు మున్నగు విద్వాంసులు వెలనాఁడున నుండిరి.

రామరాజభూషణకవిని భట్టుమూర్తిని భిన్నకవులుగాఁ జెప్పుటకుఁ బ్రబలాధారములు గలవు:

హరిశ్చంద్రనలోపాఖ్యానమున

తే. శ్రీకరమహాప్రబంధాంకసింగరాజ
తిమ్మరాజప్రియతనూజధీరసూర
పాత్మజుఁడ రామభూషాఖ్యఁ బరఁగు సుకవి
నంకిత మొనర్తు నీ కావ్య మనఘభక్తి.

నను పద్యము చూపట్టుటంజేసియు, వసుచరిత్రమునందును హరిశ్చంద్రనలోపాఖ్యానమునందును గద్యము భేదంబు లేకుండుటంజేసియు, నరసభూపాలీయములోఁ బ్రథమాశ్వాసమునందు

తే. అమితయమకాశుధీప్రబంధాంకసింగ
రాజసుతతిమ్మరాజపుత్త్రప్రసిద్ధ
సరసవేంకటరాయభూషణసుపుత్త్రు
నను బుధవిధేయు శుభమూర్తినామధేయు.

ననియు, గద్యమునందు


"శ్రీహనుమత్ప్రసాదలబ్ధకవితాసారసారస్వతాలంకారనిరంకుశప్రతిభాబంధురప్రబంధపఠనరచనాధురంధరప్రబంధాంకవేంకటరాయసుపుత్త్ర తిమ్మరాజపౌత్త్ర సకలభాషావిశేష నిరుపమావధానశారదామూర్తి మూర్తి ప్రణీతం"

బని యుండుటంజేసియు, వసుచరిత్రము గద్యమునను తదితరస్థలములను

"శ్రీమద్రామచరణారవిందవందనపవననందనప్రసాదసమాసాదితచతుర్విధకవితానిర్వాహకసాహిత్యరసపోషణ రామరాజభూషణ"

అని పెక్కు చోట్లఁ బ్రయోగించుటంజేసియు, రామరాజభూషణకవీంద్రుఁడును భట్టుమూర్తియు భిన్నులుగాఁ జెప్పుట కించుకంతయు సంశయము లేదు.

వంశవృక్షము:—



సూరపరాజు కుమారుఁడు వసుచరిత్రకర్త రామరాజభూషణకవి. వేంకటరాయభూషణుని కుమారుఁడు కావ్యాలంకారసంగ్రహకర్త యగు భట్టుమూర్తి. భట్టుమూర్తియు రామరాజభూషణకవియు కాశ్యపసగోత్రులు. ప్రమాణం బే మనఁగా, భట్టురాజులపురమునందు ప్రబంధాంకమువా రను పేరఁ బ్రసిద్ధి కెక్కిన రామరాజభూషణకవియొక్కయు భట్టుమూర్తియొక్కయు వంశస్థులను జూచినాఁడను. పది దివసంబు లచట నివాసము చేసి వారితో మాటలాడితిని. ప్రబంధాకమువారిలో ననేకులు సాహిత్యమునందును కొందఱు వ్యాకరణమునందును మఱికొందఱు తర్కశాస్త్రమునందును ప్రవీణులుగా నున్నారు.

బళ్లారి జిల్లా పులివెందల తాలూకాలో భట్టుపల్లె గనుపట్టదు. కనిపించినను అచట ప్రబంధాంకమువారు లేరు.

గురజాడ శ్రీరామమూర్తి పంతులు గారు గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా చుండూరు గ్రామంబునకు సమీపమందున్న మోదుకూరు భట్టురాజులు కాకినాడలోఁ దమ కగపడి తాము వారిని 'మీ దే గ్రామ' మని యడుగఁగా, వారు 'భట్టుమూర్తి జన్మస్థాన మగు మోదుకూ రను గ్రామం' బని చెప్పి రని తమ కవిజీవితమునందు 'రామరాజభూషణకవి జన్మస్థానము కృష్ణాజిల్లా మోదుకూ రను గ్రామం' బని సందియముగా వ్రాసిరి. ఆ గ్రామంబును జూచినాఁడను. ఆ పురమ్మున వెలనాఁడు భట్టురాజులు, రాయభట్టువారు మొగతాటివారు పల్లమువారు మొదలగు గృహనామధేయంబులవా రుండిరే కాని ప్రబంధాంకమువారు లేరు.

ఈ కారణములచే భట్టుమూర్తియొక్కయు రామరాజభూషణకవియొక్కయు జన్మస్థానము గుంటూరు జిల్లా పల్నాడు తాలూకా భట్టురాజులపుర మని గ్రహింపఁదగియున్నది.

బమ్మెర పోతనామాత్యుని నారాయణశతకము

వంగూరి సుబ్బారావు గారు

సహజకవి బోతనామాత్యుఁడు భాగవతమును రచియించిన విషయము తెలుఁగువారెఱిఁగినదే కాని, యతఁడు వీరభద్రవిజయమును భోగినీదండకమును వ్రాసినది నిజమా కాదా యని వివాదగ్రస్తముగ నున్నది. ప్రస్తుత మితఁడు రచియించినట్లు కనఁబడుచున్న నారాయణశతకమును రాజమహేంద్రవరమునందలి సర్వజనపుస్తకాలయమునుండి తీసి ముద్రించితిని. అది పోతన్న కృతమే యని నా యభిప్రాయము. సత్యాసత్యములు విమర్శించి తేల్చుట కనువగునట్లు పాఠకుల కందలి వివరములు తెల్పుచున్నాను.

ఈ శతకమునకు (1) తాళపత్ర ప్రతి బహుశః పెద్దాపురమునుండి వచ్చియుండును. (2) కాగితపుఁబ్రతి వేము నర్సయ్యగారిచే లిఖియింపఁబడినది. ఇవి రెండును జాల కాలమునుండి రాజమహేంద్రవరమునఁ గలవు. (3) ఇంకొక ప్రతి పరిషత్తునం దున్న దని వినికి. నే నీ ప్రతిఁ జూడలేదు. గ్రంథముద్రణ మారంభించువఱకు మిత్రుల వాక్యముల ననుసరించి నాకు దీని కర్తృత్వము సందేహాముగనే యుండెను. దీనిని బరిశీలించుటలో నాకు సాహాయ్య మొనరించిన పండితకవు లగు వడ్డాది సుబ్బారాయఁడు గారును నేను నిది పోతన్న బాల్యమునందు వ్రాసియుండు నని తలంచితిమి. ఇంతకుఁ బూర్వము నే నీ గ్రంథమును బరిశీలింపలేదు.

ఈ శతకము నూఱు పద్యములతో నొప్పుచున్నది. గ్రంథాంతమున "ఇది శ్రీపరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర, కేసనమంత్రిపుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతం బైన నారాయణశతకంబున సర్వంబును సంపూర్ణము" అని యున్నది.

కొన్ని పద్యములు :

శా. శ్రీరామామణిపాణిపంకజమృదుశ్రీతజ్ఞపాదాబ్జ! శ్రీం
గారాకారశరీర చారుకరుణాగంభీర సద్భక్తమం
దారాంభోరుహపత్రలోచన కళాధారోరుసంపత్సుధా
పారావారవిహార! నా దురితముల్ భంజింపు నారాయణా!

మ. ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయము లెల్ల వందిగణమై బ్రహ్మాండ మాకారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై
వసుస న్నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా!

మ. లలితాకుంచితవేణియం దడవి మొల్లల్ జాఱ ఫాలస్థలిన్
దిలకం బొ ప్పలరంగఁ గుండలరుచుల్ దీపింప లేఁజెక్కులన్
మొలకన్నవ్వుల చూపు లోరగిల మే న్మువ్వంకలన్ బోవఁగా
నలిఁ గైకొందువు గాదె నీవు మురళీనాట్యంబు నారాయణా!

మ. వరదుగ్ధాబ్ధితరంగడోలికలలో వైకుంఠలోకంబులో
వర వైస్ఫార నయోధ్యలో మథురలో వ్రేపల్లెలో ద్వారకా
పురిలో నాడెడు భంగి నాదు మదిలో భూరిప్రసన్నాననాం
బురుహం బొప్ప నటించు టొప్పును సితాంభోజాక్ష నారాయణా!

మ. సుతదారాప్తజనాదివిత్తములపై శూన్యాభిలాషుండనై
యతనూద్రేకయుతంబులై పొదలు నయ్యింద్రియవ్రాతముల్
వృతిఁ బొందించి దమంబునన్ శమమునన్ మీఱంగ వర్తించు ని
ర్గతసంసారి భవత్కృపం బొరయు నో కంజాక్ష నారాయణా!

పై పద్యములను బట్టి శైలి తెలియఁగలదు. కాని, శతకములో సాధారణముగాఁ బ్రతిపద్యమునందును వ్యాకరణదోషము లున్నవి. సంధిలో సమాసములో శబ్దములో నెల్లెడల దోషములే! దిద్దుటకు వీలులేని దోషములు పెక్కులున్నవి. ఈ గ్రంథము నేను పోతన్నదే యని పట్టుదలతోఁ జెప్పుట లేదు. చెప్పినను సత్యము కాకున్న వినరు. కావునఁ జదువరులే చర్చించి తీర్మానించుకొందురు గాక!

ఇదివఱకు గోదావరీగంగల విషయముగఁ బోతన్న జన్మస్థానచర్చలో విపులవివాదములు పొసఁగియున్నవి. దానికీ క్రింది పద్యమే మైనఁ దోడ్పడునా? ఇందు త్తరదక్షిణహిందూస్థానములయందలి ముఖ్య మైన నదు లన్నియు బేర్కొనినాఁడు. గోదావరి లేదు. కారణమేమో?

మ. భవనాశిన్ గయ తుంగభద్ర యమునన్ భాగీరథిన్ గృష్ణ వే
త్రవతి న్నర్మద పెన్న బాహుద పయోరాశి న్వియద్గంగయుం
దవగాహంబున నైన పుణ్యము లొగి న్నారంగ నేఁ డిచ్చటన్
భవదంఘ్రిస్మరణంబునన్ గలుగు నో పద్మాక్ష నారాయణా!

మొదటి పాదములో యమున కడ భాగీరథిని జెప్పినాఁడు. రెండవ పాదములో వియద్గంగ యనుచున్నాఁడు. గయాక్షేత్రమును పయోరాశిని నదులలోఁ గలిపినాఁడు. గోదావరిని విడిచినాఁడు. కారణములు పెద్దలు చర్చించెదరు గాక!

"కృపకుం బాత్రుఁడనయ్య ధర్మపురి లక్ష్మీనాథ నారాయణా!"

ఇందలి 'ధర్మపురి' యేది? అచ్చట లక్ష్మీనాథ దేవాలయమున్నదా? ఇది వరంగల్లునకుఁ జేరునా? ఒంటిమెట్టకుఁ జేరునా? జమ్మలమడుగు తాలూకాలో నొక ధర్మపురి కలదు. ఇది యొంటిమెట్టకుఁ జేరువ.

పరిశోధకులును చరిత్రప్రియులును చర్చించి దీని కర్తృత్వమును నిర్ణయించి యుపయోగ మున్న ప్రస్తుత జన్మస్థాననిర్ణయచర్చలోనికిఁ దీసికొందురుగాక!

ప్రాచీనాధునిక విద్యాపద్ధతులు

న్యాపతి నారాయణరావు గారు, బి.ఏ., బి.ఎల్.

ప్రపంచచారిత్రము సరిగాఁ జదివినయెడల ప్రతిజాతియాభివృద్ధిక్షీణదశలకును ఆయా జాతీయవిద్యావిధానములు ఉపేక్షింపఁదగని కారణము లనెడు విషయము స్పష్టముగా కనఁబడును. ఇప్పుడు ప్రాచీనవిద్యావిధాన మన నేమో చెప్పవలసియున్నది. "ప్రాచీన" మనఁగా ఆధునికవిధానమునకు పూర్వపు విధాన మని గాదు. మహమ్మదీయదండయాత్రలకు పూర్వము హిందూదేశములో వ్యాపనమున నున్న విధాన మని తెలియనగును. అనఁగా ఆర్యావర్తము, ఏ సంపర్కము లేక నాగరితాభివృద్ధి చెందినప్పటి భరతవర్షము, అధికారాభ్యుదయమందు మిన్నయై పాండిత్యప్రకర్షవలనను గంభీర మైన తత్త్వజ్ఞానపరంపరవలనను ప్రపంచమం దంతటను గౌరవింపఁబడుచు చీనా జపాను దేశముల విద్యార్థుల నాకర్షించి వేలకొలఁది విద్యార్థుల కాకర మైన నలంద మొదలగు విశ్వవిద్యాలయముల విజృంభింపఁజేసిననాఁటి విధాన మని తెలియనగును.

ఆ ప్రాచీనవిధాన మేమి? ఆధునిక కాలమున ఏ విధ మైన విద్యావిధానములు ప్రబలుచున్నవి?

పూర్వము విద్య ధర్మముగఁ గఱపఁబడుచుండెడిది; ఇప్పుడన్ననో సామాన్యస్థితిమంతులు తమ పుత్రుల కున్నతవిద్య గఱపించుటకు వీలు లేనంత వ్యయపూరితమై యున్నది. విద్యావ్యాపనమున మన జాతి స్పష్టముగా వికసింపక, బుద్ధియందు మార్గదర్శిత్వము పొందవలసియున్నను, వెనుకఁబడి మఱుఁగుపడుచున్నది. ప్రతిజాతికిని స్పష్టీకరింపఁదగిన కొన్ని విలక్షణములు గలవు. అవి శీతోష్ణభేదములచేతను దేశనైసర్గికభేదములచేతను మార్పుఁ జెందుచుండును. పై భేదములఁ బట్టి భగవంతుని చిద్విలాసమును మాఱుచుండును. గ్రీకుదేశస్థులు భగవంతుని "అందము"గ గ్రహింపఁగలిగిరి; రోమనులు నా శాస్త్రాభివృద్ధిగ పొందఁగలిగిరి; హిందువులు గొప్ప తత్త్వస్వరూపునిఁగ తెలిసికొనఁగలిగిరి. కావున, అన్ని దేశముల నొకే విధమగు విద్యావిధాన ముండ వీలుపడదు. పరిసరములందు విజృంభించు పదార్థాంశములచేత జాతియొక్క విజ్ఞానము అభివృద్ధి కావలసియుండును. వృక్షశాస్త్రమునందును జంతుశాస్త్రమునందును మన దేశములో పుట్టి పెరిగి మన జాతీయతాభివృద్ధికి సహకారులగు వృక్షజంతువుల విషయమై మన బాలురకుఁ జెప్పినయెడల వారి మనోవికాస మెక్కువ యభివృద్ధి కాఁగలదు. అట్టి విద్యావిధానము లేని లోపముచేతనే హిందూదేశము ఆధునిక కాలమున చాల క్షీణదశయం దున్నది. ఆధునికవిధానమున, అన్యభాష యగు వాంగ్లము మూలముగా విద్య గఱపఁబడుచున్నది. ప్రాచీనకాలమున మాతృభాష ద్వారమున విద్య గఱపఁబడుచుండెడిది. అందువలన, ఇప్పుడన్యభాషయం దుండెడి విషయగ్రహణమందే గాక దాని యార్థము నేర్చుకొనుటయందుఁ గూడ విశేషకాలము మన శక్తిని దుర్వినియోగము చేయవలసివచ్చుచున్నది. మన విద్యార్థులు వివిధవిషయములను కళాశాలయందు ఆంగ్లభాషామూలకముగా ఆఱు సంవత్సరముల కాలము నేర్చుకొనునప్పుడు మాతృభాషామూలకముగ కొలఁది కాలములోనే నేర్చుకొనవచ్చును. పరిభాషను నేర్చుకొనుటయందు మాత్రమే మన యువజనులు తమ బుద్ధిసామర్థ్యములను వినియోగించుటచేత, కళాశాలలో విద్య నభ్యసించిన పిదప స్వతంత్ర మైన పరిశోధనను గాని అసలు పనిని గాని నిర్వహించుటకు మన విశ్వవిద్యాలయపట్టభద్రులలో కొలఁది మందికి మాత్రమే సాధ్య మగుచున్నది. ఈ లోపముచేతనే హిందూదేశమువంటి విశాలఖండమునందు పేర్కొనఁదగిన శాస్త్రవేత్తలు కొలఁది మంది మాత్రమే గలరు. పాశ్చాత్యరాజనీతిజ్ఞులును విద్యాపరిజ్ఞానులును మన దేశభాషల మూలముననే విద్య గఱపుటవల్లఁ గలుగు లాభముల నభినందించియున్నారు. 1835-వ సంవత్సరము మెకాలే గారి విద్యాప్రశంసను విచారించుచు సీలు గారు ఈ విధముగాఁ జెప్పియున్నారు: "హిందూదేశమున సుజ్ఞానాభివృద్ధి కావలె నన్న తత్పరిజ్ఞానమును దేశభాషల మూలముననే ప్రవర్తింపఁజేయవలయును."

ప్రాచీనాధునికవిశ్వవిద్యాలయముల నిర్మాణమునందుఁ గూడ భేదములు గమనింపవలసియున్నది. ఆధునికవిశ్వవిద్యాలయములు కేవలము పరీక్షించునవిగను ప్రాచీనపువి యెప్పుడును బోధకములుగను నున్నవి. ఇదియే యాధునికవిద్యాపద్ధతులయందలి గొప్ప లోపము కాన, విద్యయొక్క నిజ మైన మూలసూత్రములను గ్రహించుటకును అంతర్గర్భిత మైన శక్తులను పూర్తిగా వృద్ధిపఱచుటకును తగని విద్యార్థులఁ దయారు చేయుచున్నవి యిట్టి లోపములే. ప్రాచీనపద్ధతి ప్రకారము ఒక విద్యార్థి 7,8 సంవత్సరముల వయస్సున తన గృహమును వదలి పాఠశాలావసతిగృహమునకు వెళ్లి 25 సంవత్సరములు వచ్చునంతవఱకు అనఁగా బుద్ధి నీతి శరీర సౌష్ఠవములం దెక్కువ యభివృద్ధి పొందువఱకు నక్కడ నుండెడివాఁడు. బోధైకవిశ్వవిద్యాలయములు జనసమ్మత మైన కేంద్రస్థానములందు నిర్మింపఁబడెడివి. ద్రవ్యార్జనతత్పరులు గాక తాము నేర్చుకొన్న పరిజ్ఞానమును ఇతరులకు బోధచేయు ఘన మైన పనియందు తమ యావజ్జీవమును వినియోగించిన గొప్ప శీలము గల గురువులు అం దుండెడివారు. వారు చరిత్రము భూగోళము గణితశాస్త్రము మొదలగు విషయములనే గాక దేశభక్తి నీతి మున్నగు నున్నతోపదేశములను గూడఁ జేయు

చుండెడివారు. వసతిగృహములం దహోరాత్రములు విద్యార్థులయెడ నెక్కువ జాగరూకతతో నుండెడివారు. మనము నివసించు స్థలము మనము భుజించు పదార్థములు మన శీలమునకు గొప్ప సహకారు లను విషయము దుశ్ఛేద్య మైనది. ఈ విషయమును విద్యార్థులును గురువులును గమనించి కళాశాలలను వసతిగృహములను నిర్జనప్రదేశమునందు నిర్మించి మంచి యాహారమును శుభ్ర మైన దుస్తుల నుపయోగించుచుండెడివారు. విద్యార్థులు బ్రహ్మచర్యాశ్రమమున నిమగ్నులై ప్రపంచమునందు ముందుగా మనస్సు నాకర్షించు జీవితవిషయములకు దూరస్థులుగ చేయఁబడుచుండెడివారు. విశ్వవిద్యాలయములు జీవితమునకు ప్రయోజనకరములుగ పరిణమింపఁగలందులకు బోధైకములుగ నుండవలయునని డాక్టర్ న్యూమన్ గారు చెప్పియున్నారు. "నా విశ్వవిద్యాలయము" అను గ్రంథమునందు ఈవిధముగా నుడువఁబడియున్నది: "బోధను విసర్జించి యసంఖ్యాకము లగు విషయములయందు పరీక్షింపఁబడి కృతార్థుఁడైన ప్రతియువకునకు పట్టము నిచ్చు విశ్వవిద్యాలయములలోను బోధకులు పరీక్షులు లేకుండ 4 సంవత్సరముల శిక్షతో యువకుల నందఱిని జేర్చి 60 సంవత్సరములనుండి విజృంభించుచున్న యాక్సఫోర్డు విశ్వవిద్యాలయమునవలె వారిని ప్రపంచమునకు పంపు విశ్వవిద్యాలయములలోను ఏవి యుపయోగకారు లని నన్నెన్నుకొను మన్నప్పుడును, ఈ రెండు పద్ధతులలో నేది మిన్నయగు శిక్ష యని నన్ను ప్రశ్నించినపుడును, జ్ఞానమును తర్బితు చేసి సాకారముతో వికసింపఁజేయుటకే పద్ధతి విజయమును బొందఁగల దని ప్రశ్నించినప్పుడును, ఐహికధర్మముల నిర్వర్తించుటకు తగిన మనుష్యుల నే విధానము తయారు చేయఁగల దన్నప్పుడును, ఏది విద్యార్థులను ప్రాపంచికవ్యవహారములందు నిపుణులను దేశహితైకకార్యదక్షులను జేయు నని నన్నడిగినప్పుడును, విశాలవిశ్వమానవకోటియందుఁగల సమస్తశాస్త్రవిజ్ఞానమును సంపాదించుటకు పురికొల్పు విశ్వవిద్యాలయములకన్న నేమియు చేయకుండు విశ్వవిద్యాలయముల నెన్నుకొని అవి యనేకభంగుల మిన్న లని చెప్పఁగలను." మరి, యీ కాలమున నేమి సంభవించుచున్నది? వెనుక పద్ధతికి కేవలము విరుద్ధము. విద్యార్థులు పాఠశాలావసతిగృహముల నివసించుటకు మాఱుగ నీతిజ్ఞానాభివృద్ధులకు నిరోధకము లగు సుఖోల్లాసమిళితస్వగృహజీవనమే పరిపాటి యైనది. కళాశాలలందు వినియోగించు కాలములో కొన్ని గంటలు తప్ప తక్కిన కాలము యావత్తు తన జ్ఞానాభివృద్ధికి విరసమగు పరిసరములందు విద్యార్థి గడుపుచుండును.

అతఁడు భుజించు నాహారముయొక్క గుణము సంక్షేపింపఁబడలేదు. సంపన్నుఁడు గృహమునందు శరీరారోగ్యమునకు విరోధమును గలిగించు నెక్కువ రుచికరములు ననావశ్యకములు నగు పదార్థముల నారగించును. దరిద్రుఁడైనయెడల మేధస్సునకు ముఖ్యమగు పాలను సయితము కొనుటకు వీలు లేనివాఁడగును. అదియునుంగాక, అశుభ్రప్రదేశమున నివసించుటవల్లఁ గలుగు చెడు ఫలములను మనము గన్నులారఁ గాంచుచున్నారము. ప్రాచీనగురువులవలెఁ గాక ఆధునికబోధకులు విశ్వవిద్యాలయపరీక్షులలో నుత్తీర్ణు లగు విద్యార్థుల సంఖ్యపై తమ చాకచక్య మాధారపడియున్న దని దృఢనిశ్చయులై అందున కనువగునట్లు తరగతులలోఁ జెప్పు పాఠపుస్తకముల మీఁది కొన్ని వ్యాఖ్యానము లప్పఁజెప్పునట్లు చేయుట తమ విద్యాధర్మ మని తలఁతురు. మన విద్యార్థులు పిన్న వయస్సునందే వివాహితు లగుటవలన ఒకే పర్యాయము విద్యార్థి గృహస్థ జీవనములను పొందవలసియుందురు. వారి శక్తిసామర్థ్యములు పాండిత్యప్రకర్షమునందు వినియోగించుటయే గాక యితరమార్గములయందు కూడ నుపయోగింపవలసివచ్చుచున్నది. అందువలన వారు విద్యార్థి జీవనమును పరిసమాప్తి చేసెడి కాలమునకు శరీరమునందును బుద్ధియందును దుర్బలులై జ్ఞాపకశక్తి మనోవికాసము బొత్తుగా చెడి ఆరోగ్యము భిన్నమై తమ యాశయముల మఱచి జీవితావసరములు మిక్కుటమై వెలవెలఁబాఱు ముఖములతో వంగి జీవనమునందు నిరుత్సాహులై యుందురు.

ప్రాచీనహిందూదేశమునందు బోధైకవిశ్వవిద్యాలయములు ఔన్నత్యమును పొందియుండెను. శరీరసౌష్ఠవము గలిగి దేశభక్తిపూరితులై అన్ని శక్తులు విజృంభింప వికసించిన ముఖములు గల యనేక విద్యార్థులు ప్రతిసంవత్సరము విశ్వవిద్యాలయములనుండి వెడలుచుండిరి.

ఆధునికవిశ్వవిద్యాలయములందు ప్రతిసంవత్సరము వేనవేలు పట్టపరీక్షితులు వెడలుచున్నారు. వారు ఆరోగ్యదూరులై స్వజాతీయధర్మములను విసర్జించి స్వమతాభిమానశూన్యులై పాశ్చాత్యసంప్రదాయమునకు లోనై ప్రపంచస్పర్ధకు తాళలేక కష్టపడుచున్నారు. "లీ" గారు మన యిండియా విషయమై వ్రాయుచు "తాము నిర్వహింపలేని పరీక్షులకు మాత్ర ముపయోగింపఁబడు జ్ఞానపూరిత మగు వల్లనలతో నిండిన యొక విశాల మైన విధిని ఆధునికపట్టపరీక్షకులు ఫలిత మని వక్కాణించి" రనిరి. భీమార్జునులు మొదలగు వీరవరులను శంకరుఁ డాదిగాఁ గల మేధావంతులను కనిన హిందూమాత నీతిజ్ఞానశరీరాంశములయందు న్యూనతను జెంది స్వతంత్రత లేక యణఁగఁబడియుండుట మహామహుఁ డగు భగవంతుని చిద్విలాసము గదా! అందులకు కారణము దురూహ్యము. మన విద్యార్థులు సరి యైన జీవితోద్దేశములు లేక విశ్వవిద్యాలయవిజయపత్రికలను పొందుటకు మాత్రము శ్రమపడి చదువుట కడు శోచనీయము.

కనుక మన విద్యాపద్ధతులు మార్చుట మన విధి. ప్రాథమిక ఉన్నత విద్యాశాలలు సంస్కరింపఁబడవలసియున్నవి. బోధనపద్ధతుల వృద్ధిచేసి తగిన పాఠపుస్తకముల నిర్ణయించి గురుశిష్యులకుఁ గల సంబంధమును స్పష్టీకరించి మార్గదర్శకము లగు కొన్ని వసతిగృహములు నిర్మాణము చేసి పాఠశాలాబాహ్యభాగమున నివసించు విద్యార్థుల సంఖ్య తగ్గించుట యవశ్యము. మన వసతిగృహములలో విద్యార్థులను జాగరూకతతో కనిపెట్టుచు వారికి ఐహికవిద్యతోఁ బాటు ఆముష్మికవిద్యను గూడఁ గఱపుటయందు తప్పేమియు లేదు.

పాఠశాలలయందు హిందూదేశచరిత్రను చక్కఁగా బోధింపవలయును. శివాజి మున్నగు మహావీరుల చరిత్రాంశములచేత విద్యార్థుల హృదయపీఠములయందు శౌర్యబీజముల నంకురింపఁజేసి వారిని

స్వతంత్రజీవులుగ చేయవలయును. పూర్వము మన సంఘవిజృంభణమునకు కారణములును అవి క్షీణించుటకు తోడ్పడిన విషయములును బాలురు నేర్చుకొనుట యావశ్యకము. మన పూర్వు లాచరించిన లోపాలోపముల గమనించుట సంఘభవిష్యన్నిర్మాణమున కెక్కువ సహకారిగా నుండును. జాతి యెల్లపుడును పూర్వసంప్రదాయముల ననుసరించిరేని వృద్ధి యగుచుండును. తద్భిన్నముగా సంఘ మెప్పటికిని వృద్ధి పొందనేరదు. పూర్వలోపముల సవరించుకొని సంఘాభివృద్ధికి తోడ్పడుట ధర్మము గాని సంప్రదాయముల విసర్జించి విదేశపు సంప్రదాయముల మన సంఘమునందు నాటవలె నని తలఁచుట జాతి విఘాతమునకే యని యూహింపనగును. పాశ్చాత్యనాగరికత యా దేశపు నైసర్గికగుణములవలన పోషింపఁబడి వృద్ధి పొందుచున్నది. మన సంప్రదాయములు ఆ భూమియందు మొలకలెత్తవు. అందువలననే మన భూమియందు మన సంప్రదాయముల ననుసరించి బీజముల నాటవలయును. అదియే భవిష్యన్నాగరికతకు సోపానము.

పేరునకుఁ దగిన గురువులు మన పాఠశాలలలో నుండుట శ్రేయస్కరము. తమ వృత్తి యున్నత మని పావన మని గ్రహించి మన దేశమాతయొక్క భవిష్యత్సంతతివారి విధుల నిరూపించుటయందుఁ గల తమ జవాబుదారిని గమనించి వర్తించు గురువులు కావలయును. ఇతరశాఖలయం దుద్యోగము దొరకక తాత్కాలికముగ కాలమును గడపుట కనువగునట్లు పనిచేయు బోధకులు గాక, ఇతర లాభము లనుభవించుట కనువగునట్లు నటించు బోధకులు గాక, విద్యార్థులకు తగిన విద్యను నేర్పి దేశమునందలి యజ్ఞానమును బాఱఁదోలుటయందు కృతనిశ్చయు లైన బోధకు లుండవలయును. నిశ్చల మైన మనస్సులతో తమ జీవితములయొక్క దృష్టాంతములచేత బాలుర జీవితములను పావనము చేసి వారిని శమదమాదిగుణపుంజపూరితులఁ జేయు బోధకులు మనకు కావలసియున్నారు.

బోధకవృత్తి హీనస్థితియం దుండుటకు ముఖ్యకారణము తగిన జీతము లేకపోవుటయే. అయినను, బోధకులు కూడ కొంతవఱకు నిందార్హులు. ఉపాధ్యాయులు పవిత్ర మైన తమ విద్వద్ధర్మములను మఱచి జవాబుదారి లేని స్వేచ్ఛాజీవనము సలుపుచున్నారు. అందువలననే జనసామాన్యమునకును ప్రభుత్వమువారికిని ఉపాధ్యాయుల యెడ గౌరవము తగ్గినది. అయినను, పూర్వపు ఔన్నత్యము పొందుటకు తగిన యవకాశము గలదు. వారిమీఁదనే భవిష్యత్సౌఖ్య మాధారపడియున్నది. రేపు పురసభ్యతను పొందవలసిన యువజనుల శీలమును నిరూపించుట కెంత జవాబుదారీ కావలసియున్నదో రాజ్యాభివృద్ధికిని అంత జవాబుదారీ కావలసియున్నది. కాఁబట్టి మన యుపాధ్యాయులు బాలుర మనఃపీఠములందు సుగుణరాసుల నుద్భవింపఁజేసి యుదాహరణపూర్వకముగ దేశభక్తి స్వార్థపరిత్యాగము ధైర్యము నిష్కాపట్యము నమ్రత మొదలగు నున్నతాశయముల బోధ చేయవలయును. విద్యార్థులను పరీక్షకు తగినవారిని చేయుట గాదు. వారికి స్వతంత్రులుగను స్వావలంబులుగను నుండునట్టి బుద్ధి నలవాటు చేయవలయును. తమ విద్యార్థులు శాస్త్రయుక్తముగను విస్పష్టముగను ఆలోచించుటకును మేధస్సునందు ప్రవేశించు ప్రతివిషయము జీర్ణింపఁజేసికొనుటకును తగిన బోధను వారు చేయవలయును. యంత్రములవలె సర్వసాధారణముగా కొన్ని పదములను పదార్థములను ఒప్పగించు దుస్టాచారము మానవలయును. విద్యార్థులయందు జ్ఞానసముపార్జనాభిలాషను అంకురింపఁజేయవలయును.

వారితో కలసి మెలసి శరీరారోగ్యమునకును నీతివిజృంభణమునకును తోడ్పడవలయును. విద్యార్థుల కష్టనిష్ఠురములను గమనించి వానిని నివారించుటకు తగినంత దయ విద్యార్థులయెడ చూపవలయును.

ఐహికవిద్యతోఁ బాటు కర్మవిద్య మన పాఠశాలలందు నేర్పఁబడవలయును. ఆధునికవిశ్వవిద్యాలయములందు అనుభవసిద్ధ మైన విద్యకు మాఱుగ వ్యవహారయోగ్యము కాని విద్య కఱపఁబడుచున్నది. అందువల్ల పాఠశాలలలో నేర్చుకొను విద్య విద్యార్థుల జీవితాభివృద్ధికి తోడ్పడక వట్టి జ్ఞానైకయోగ్యులనుగఁ జేయుచున్నది. విద్య సరి యైన యుపయోగకారి కావలె నన్న నిజజీవనమునకును జాత్యౌన్నత్యమునకును తోడ్పడవలయును. అదియునుం గాక, కేవల మైహిక విద్య జనసామాన్యమును సంపన్నులుగ చేయలేదు. మన పట్టపరీక్షితులు విశ్వవిద్యాలయములు వెడలునది మొదలు చిన్న గుమాస్తా యుద్యోగములయందు ప్రవేశించి యెక్కువ వేతనమును క్రమక్రముగా పొందఁగలిగినను వాణిజ్యకర్మాగారములందు నియుక్తులగుటవల్లఁ గలుగు లాభమును బొందలేకయున్నారు. మన దేశములో విద్య లేనివారు నైనను వాణిజ్యమువలన ఎక్కువ సంపన్నులగుట లేదా? శాస్త్రీకకర్మవిద్యను జనులకు నేర్పినయెడలఁ గలుగు లాభమును వర్ణించుట యనావశ్యకము. హిందూదేశపరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వమువారు సహాయము చేయవలసియున్నది. స్వతంత్రము లగు జర్మని జపాను మొదలగు దేశములందు ప్రభుత్వమువారివలన దేశీయ పరిశ్రమలు కాపాడఁబడి వృద్ధి పొందినవి. మరి మన ప్రభుత్వమువారు భూతకాలమున నుపేక్షాభావమును బొందిరి. అందువలననే దేశీయపరిశ్రమలు క్షీణించి అన్యదేశముల రెండవ రకము వస్తువులతో మన యంగళ్లు నిండిపోయినవి. మన స్వజాతీయవృత్తులు నశించుటచేత దరిద్రదేవత మన దేశమున తాండవమాడుచున్నది. ప్లేగు మొదలగు రోగములకు మన దేశము ఆటపట్టయినది. పూర్వపు వృత్తులు మహోన్నతిలో నుండినయెడల జనులు సంపన్నులై మంచి పదార్థముల భుజియించి నెంతటి వ్యాధినైన నడ్డగించుటకు శక్తి గలిగియుందురు. కనుక, పాఠశాలలయందు పారిశ్రామికవిద్యను నేర్పుట యావశ్యము. అందువలన విద్యార్థులు స్వతంత్రజీవులై తృప్తిగా నుందురు. అదియునుం గాక, మన విద్యార్థులకు తగిన వృత్తులు లేవు. ఇదివఱకు క్రిక్కిరిసియున్న యుద్యోగశాఖలయందు ప్రవేశించుట యనర్థదాయకము. క్రొత్త మార్గములు త్రొక్కవలసియున్నది. దాని కనువగు విద్య మన పాఠశాలలయందు లేదు. ప్రభుత్వమువారి విద్యాశయములు మాఱలేదు. యుద్ధానంతర మైన మాఱు నేమో యని యాశ గలదు. ఇండస్ట్రియల్ కమిషనువారు తయారుచేసిన నివేది

దేశీయ పారిశ్రామికవిద్యావశ్యకతలను నిర్దేశించియున్నారు. వారి సిఫారస్సుల నాచరణలోనికి తెచ్చుటకును ప్రభుత్వమువారు ప్రార్థితులు. సేన మొదలగు రాజ్యాంగశాఖలలో మనవా రెక్కువమంది విద్యార్థులు ప్రవేశించుటకును వీలు లేకున్నది. ఎక్కువమంది విద్యార్థు లందులో ప్రవేశింపఁగలిగినయెడల అసంతృప్తి కొంతవఱకు తగ్గును. క్రొత్త మార్గములను వారికి అసంతృప్తిని తగ్గించుటకు ప్రభుత్వమువారు సహాయపడవలయును.

కనుక, స్నాతకమహాశయులారా! మన విశ్వవిద్యాలయము లందుఁ గల విద్యావిధానము మొదలంట మాఱవలయును. దేశహితైక విద్యను గఱపుటకై కృతనిశ్చయులు గావలయును. మన జాతీయతకు స్వభావసిద్ధము లగు చిహ్నముల గ్రహించి వాని నభివృద్ధి చేయుటకుఁ దగిన విద్యను గఱపవలయును. మన దేశపుఁ బర్వతములు నదులు మొదలగు విశేషాంశములయందు గౌరవము నుత్పాదింపవలయును. మన కవులు వీరులు మన విద్యార్థుల మనముల నాకర్షింపవలయును. అతిరథ మహారథు లని పేరు గాంచిన కర్ణుఁడు అర్జునుఁడు మొదలగు మహావీరుల చరిత్రములు మన పిల్లల కుగ్గుపాలతో నేర్పి శౌర్యబీజము లను మనఃఫలకములయందు నాటవలయును. మన విద్యార్థులు పరీక్ష లన దయ్యములవలె భయపడుచుందురు. ఆ భయమును మాన్పవలెను. అమెరికా మొదలగు నాగరికదేశములయందు పరీక్షనే ముఖ్యోద్దేశముగా పరిగణింపక జ్ఞానసముపార్జనమునందు లక్ష్యముంచుటచే పరీక్ష లన బహుసంతోషముతో నుందురు. ఆ పద్ధతిని మన విశ్వవిద్యాలయాధికారులు గమనింపవలసియున్నది. ప్రభుత్వము వారు సదయహృదయులై ప్రాచీనకాలమున మిక్కిలి వన్నె గాంచి యిప్పుడు వెనుకఁబడియున్న మన దేశమున జాతీయాభివృద్ధి కనువగు విద్యావిధానమును స్థాపించి దేశపరిశ్రమలను వృద్ధిపఱచి దేశౌన్నత్యమునకు పాటుపడుటకు ప్రోత్సాహపఱపఁగలందులకు సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాఁడను.

ఆంధ్రసంగీతము—త్యాగరాయలు

శ్రీమతి గుండు అచ్చమాంబ గారు

శ్రీ రమణీయకోమలవిచిత్రపదామలగానకావ్యము
ల్గూరిచి సద్యశోగరిమఁ గ్రొందళుకు ల్పచరించి మించి పె
న్గారవ మొప్పు నీ కరుణఁ గాంచిన బిడ్డలలోన ముఖ్యు లౌ
వారు త్రిమూర్తులో యనఁగ వాగ్రచనాధికు లాంధ్రభారతీ! 1

క. ధీరోదారచరిత్రులు
నారాయణతీర్థు లనుదినము జను లెన్నన్
శ్రీరంగతరంగములం
గూరిచి రా! ఖ్యాతి కోటిగుణితము కాఁగన్! 2

మ. గణనాతీతము లైన భావలహరుల్ కల్పించె నెవ్వాఁడు స
త్ప్రణుతశ్రీకవితావిలాసము తలిర్పన్ గీతగోవిందమున్
ఫణియై నారదుఁడై పరాశరుఁడునై ప్రహ్లాదుఁడై మీఱు న
గ్గుణగణ్యున్ జయదేవసత్కవిని వేఱొక్కఁ డెక్క డెవ్వారికిన్? 3

క. ఇఁక మిగిలియున్న నీ ము
ద్దు కొమరుఁ డగు త్యాగరాజు తులఁ దూగెఁడు వే
డుక సంగీతము సాహి
త్యకలాపము నెఱిఁగి ప్రాయఁదరమే జగతిన్? 4

చ. నిరుపమరాగవల్లరి వినిర్మలతాళలయానుపత్రము
ల్పురుచిరసుస్వరప్రకటసూనవితానము లా శ్రుతిక్రియా
స్ఫురణవికాసభాసురత శోభిలు భక్తిమరందధార య
స్కరణిని త్యాగరాజకృతగానకవిత్వమహత్త్వ మొప్పెడున్! 5

ఉ. ఏమి మహత్త్వమో తెలియ దీ హరిభక్తివిలాసు సత్కవి
గ్రామణి యంద్రు పండితులు గాయకులో మితి లేని భక్తికిం
బ్రేమకు వన్నె వెట్టు మురిపెంబునఁ బాడుచునుంద్రు లోకపు
ల్రామకథామృతం బనుచు రాణ దలిర్ప నుతింత్రు తత్కృతిన్

ఉ. వేఱొక భాషయందును బ్రవీణతఁ గాంచిన దండి పండితు
ల్వారికిఁ దోఁచు నర్థమును వాకొనుచుండిన నేమి! మాధురిన్
మీఱుచు గాన మొక్కటియె మేటి సుధారస ముప్పతిల్ల బఁ
గారము తావిఁ బూసియును గౌరవ మొందిన రీతి భాసిలున్!

ఉ. ఆంధ్రుఁడు వ్రాసినట్టి కృతు లంచితలీలఁ బఠించి పండితు
ల్సాంద్రవిభూతిఁ గాంచి మది సంతస మొందుట నవ్యరాష్ట్రజు
చంద్రకళావతంసు కృపఁ జక్కని మైత్రిఁ జెలంగుచుంట ని
స్తంద్రయశంబు దేశమునఁ దావలమై తగు సైకమత్యమున్.

సీ. తేనె తీయఁదనంపు గానామృతము వెల్లి
వల నాంధ్రదేశ మెవ్వాఁడు తన్పె
కావ్యధోరణికి నగ్గలికఁ గల్పించు రా
కడల నెవ్వాఁడు ధీగరిమఁ జూపె
వరభక్తిరసము కాల్వలు గా మనోవీథిఁ
బ్రవహింప నెవ్వాఁడు పాదుకొలిపె
నవల రీతిగను విన్నాణమౌ రీతి స
త్కృతిఁ గూర్ప నెవ్వాఁడు కీర్తికెక్కె
దేశభాషకు నెవ్వాఁడు తెలివిఁ దెచ్చె
సులభ మగు శైలి కెవ్వాఁడు సొంపుఁ గూర్చె
నట్టి శ్రీ త్యాగరాజు జిహ్వాగ్రరంగ
మందు నర్తనం బాడితే యాంధ్రవాణి!

నటులు — నాటకాభినయము

ఇవటూరి సిద్ధవీరేశ్వరరావు గారు

ఇప్పుడు ప్రతిపట్టణంబునను నాటకశాలలు వెలసియున్నవి. నాటకప్రదర్శనములు చూడనివా రీ కాలమున సాధారణముగా నుండరు. అవి చాలవఱకు సామాన్యజనులకు ప్రీతికరముగ నున్నవి. ఈ వ్యాసమున మన దేశపు నాటకప్రదర్శనములందు నటుల యభినయమును గూర్చి విచారింప నుద్దేశించితిని. దీనివలన మన దేశమునందు నాటకాభినయ మను కళ యెంతవఱ కభివృద్ధి పొందినదో యెఱుకపడఁజేయుట నా ముఖ్యోద్దేశము.

ఈ సందర్భమున ఆంధ్రనాటకోత్పత్తిని గూర్చియు తద్రచనా పరిణామమును గూర్చియు తత్ప్రదర్శనములఁ గూర్చియు వ్రాయుట యవసరము. ఆంధ్రనాటకము స్వదేశసంభవము గాదు. ఆంగ్లనాటకములను చదువుటవలనఁ గలిగిన యానందమును ధార్వాడ్ పునహా పార్సీ నాటకసంఘములవారు మన ప్రాంతములందు ప్రదర్శించిన ప్రదర్శనములును మన దేశమున నాటకరూపముగా నుదయించినవి. మన దేశమందు పురాతనకాలమునుండి కాళిదాసాదికవులు రచించిన నాటకములు పెక్కు లున్నను సరి యైన నాటక మొక్కటియు నాంధ్రమున పూర్వ ముదయింపలేదు. యక్షగానములు వీథిభాగవతములు తప్ప మరియేమియు మన దేశమునఁ గానరావు. నవీననాటకము సంస్కృతభాషనుండియాంధ్రీకరణముతో వెలువడినది. అయ్యది కొనసాగుటను చూచి మహారాష్ట్రులు మొదలగువారి నాటకములను చూచినవారును ఆంగ్లేయభాషయందలి షేక్స్పియర్ మున్నగువారి నాటకములను చదివినవారును నాటకములను వ్రాసి ప్రదర్శింపింపఁదొడంగిరి. కేవలము స్వతంత్రముగ నాంధ్రభాషయందు నాటకములు రచింపఁబడియుండలేదు.

మన యాంధ్రనాటకములు ప్రదర్శనమునకు ముఖ్యముగ వ్రాసినట్లు గాన్పింపవు. సావధానముగ కూరుచుండి పఠించుటకై వ్రాయఁబడిన ట్లున్నవి. గ్రంథకర్త నాటకమును వ్రాసి యద్దానిని ప్రజ లామోదింతురో యామోదింపరో ప్రదర్శనము చేసినయెడల నది జయప్రద మగునో కాదో యని ప్రదర్శించి చూచి పిదప నచ్చొత్తించుట మన దేశమునం దాచారము గాకపోయినది. ముద్రణము చవుక యగుటవలన గ్రంథము సమాప్త మయిన తత్క్షణమే ముద్రింపించి పత్రికలందు ప్రకటించుటను మనము గనుచున్నారము. అంతియ కాదు. మనయందు నాటకకవులు నటులుగా నుండుట యరుదు. ఆంధ్రనాటకపితామహు లగు కీర్తిశేషులు ధర్మవరము కృష్ణమాచార్యులు గారు మరి యిద్దరు ముగ్గురు తప్ప నితరు లట్టివారు లేరు. ఆ కారణమున పెక్కు నాటకములు రసవంతములుగా లేవు. నాటకకవులు నటు లయిన, నాటకమునందలి భావములు ప్రకృతిప్రతిబింబములుగా నుండును.

నాటక మన నేమి? రంగస్థలమునందే కాని యితరస్థలములందు మనము ఠీవిగా నడువము. అచటనే కాని మన మంత చాతుర్యముగను జాణతనముగను మాటలాడము. అచట చూపునట్టి శృంగారము సంతోషము దుఃఖము క్రోధము మున్నగు రసములు రంగస్థలము దాఁటిన వెనుక చూపము. దీనికి కారణ మేమి? నాటకము చాలవఱకు ఆదర్శపూర్వకముగను రసపోషకముగను నుండి కవి యొక్క చాతుర్యముతో నిండియుండును. అట్లయిన నాటకములు వ్రాయుటలోఁ గాని ప్రదర్శించుటలోఁ గాని కల యర్థ మేమి? వీ లయినంతవఱకు లోకమందలి జనుల నడతను ప్రదర్శించుట, అనఁగా సాధ్య మయినంతవఱకు ప్రకృతిని మానవస్వభావమును చిత్రించుట. నాటకమునందు కొన్ని చమత్కారపు కల్పితము లున్నను అవి ప్రకృతికి సమముగా నున్నట్లు ప్రేక్షకులకు గోచరింపవలెను. నాటకకథ పురాతనకాలపు దైనచో నా కాలపు టాచారములును ప్రస్తుతకాలపు దైనచో ప్రస్తుతపు నడవడికలును పాత్రల రూపమున ప్రదర్శింపఁబడవలెను. అది పాత్రల నైపుణ్యమునందు చాలవఱకుఁ గలదు. కావున, అభినయము గూడ నాటకకథాకాలముల ననుసరించి ప్రకృతిసిద్ధముగ నుండుట యావశ్యకము. అభినయమువలన నీ ప్రపంచము రంగస్థలముగ ప్రదర్శింపఁబడవలెను.

వేషము.—నాటకమునందు పాత్రలకు వేషము ప్రధానము. అది స్వభావసిద్ధముగను పాత్రానుగుణ్యముగను నుండవలెను. నటు లిపుడు తాము ధరించు వేషములం దించుక శ్రద్ధ వహించుచున్నారు. కృష్ణునికిని రామునికిని నీలచ్ఛాయయు లక్ష్మణునికిబంగారు వంటి చాయయు వేషమున స్వభావసిద్ధముగా నుండును. వేషము లెంత స్వభావసిద్ధముగ నున్న నాటకప్రదర్శన మంత రసవంతముగ నుండును. అటు లుండకపోయినచో హాస్యాస్పదముగ నుండును. గయోపాఖ్యానమున వనవాసము చేయుచున్న యర్జునుఁడు యథోచిత మైన దుస్తులను ధరింపక ముఖ్‌మల్ పై జలతారు నగిషీ చెక్కిన దుస్తులను ధరించి తళతళలాడు కిరీటములోను రాజలాంఛన మగు గవునులోను బ్రవేశించి "కడచు నె యెన్నఁడైన" నను పద్యము చదువ నారంభించిన నెట్లుండునో వేఱుగ చెప్ప నక్కఱ లేదు. బాహుక వేషధారి తెల్లని మల్లు పంచ కట్టి కాకిరంగు చొక్కాయ తొడిగికొని పైని గళ్ల యెఱ్ఱ పట్టు రుమాలు కప్పుకొని వచ్చిన నెంత యందముగా నుండును! సాధారణముగా బాహుకవేషధారి నల్ల దుస్తులను ధరించి ప్రవేశించును. కొన్ని నాటకసంఘములం దింకొక చిత్రము గలదు. బాహుకవేషధారి గొప్ప గాయకుఁ డయినందున-

నటనము మాట యటుండె — అందఱి బాహుకులవలె నల్లని నూలు వస్త్రములు ధరియింపనొల్లక నిగనిగలాడు నల్ల యాల్పాకా బురకాను తొడిగి "తుదకు నా యవస్థ యింతకు వచ్చెనా!" యనుచుఁ బ్రవేశించిన, సభికులు వానిని గాంచి "నీ కేమి యవస్థ వచ్చిన" దనియు "రాజ్యచ్యుతుఁడ వైన తరువాత నున్న కాషాయవస్త్రములు నార బట్టలు పోయి వెల గల యాల్పాకా దుస్తులు లభించిన" వనియు "తుదకు సర్పదష్టుఁడ వైనంగులకు వస్త్రముల విషయమున లాభమే వచ్చెన" దనియు పరిహాసపూర్వకముగ నవ్వుకొనరా ? ఇంతియ కాదు. కొందఱు నటులకు రంగమున నొక రక మగు దుస్తులు ధరింపవలె నని కోరిక యుండును. సాధారణవేష మయినను వెల గల చంకీపని చేసిన దుస్తులను ధరించిన గాని రంగస్థలమున తన పాత్రమును ప్రదర్శించుటకై పో నని పట్టు పట్టును. ఆ వేషము బాగుండ దని చెప్పినను వినఁడు. అతఁడు గొప్ప గాయకుఁడు. అతఁడు కోపగించిన నాటకము చెడిపోవును. "పోనీ" యని యతని పంతమును నాటకపు కంపెనీ యధికారి చెల్లించును. వేణీసంహారనాటకమున పాండవవార్తాహారుఁ డగు పాంచాలకుఁడు చంకీ కోటు తొడిగికొనిన నెట్లుండును? రారాధున కుచిత మగు వస్త్రములు ధరించి ప్రవేశించిన నెంత యందముగా నుండును! బాహుకుఁడు రూపు మాఱి నలుఁడైనపుడు తన రాజలాంఛన మగు వేషముతో నుండవలయునా? లేక యడవిలో సర్పదష్టుఁ డగుటకు పూర్వము ధరించిన వస్త్రములతో నుండవలయునా? సాధారణముగ నాటకప్రదర్శనములయందు నలుఁడు శాపవిముక్తుఁడై ప్రవేశించు తఱి రాజలాంఛన మగు వేషముతో ప్రవేశించుట వాడుకగా నున్నది. కాని, యది మిక్కిలి యనుచిత మయిన వేష మని నా యభిప్రాయము. నాటకము చక్కఁగ పరిశీలించినచో నీ రాజవేష మా సమయమునం దుచితము గాదని తోఁపక మానదు. "నీ రూపము గావలసినపుడు నన్నుఁ దలంపుము. ఈ యంబరము నీకు పంపెద, దీని ధరించిన నెప్పటిరూపు గలుగు" నని కర్కోటకుఁడు నలునితో పలుకును. ఇందు "ఎప్పటి రూపు" అన సర్పదష్టుఁ డగుటకు పూర్వమం దున్న రూపు గాని రాజుగా నున్నప్పుడు ధరించిన 'వేషము' గాదు. ఇదియునుం గాక, యింకను పుష్కరునియొద్దనుండి రాజ్యము మరలఁ గైకొనకయే నలుఁడు తా నెట్లు రాజలాంఛనము లగు దుస్తులు కిరీటము ధరింపఁ గలుగును? సాధారణముగా నటులు తాము ప్రదర్శించు పాత్రము యొక్క భాగమును వల్లించుటయే ముఖ్యోద్దేశముగా నుంచుకొని యొక్కసారైనను చక్కఁగ నాటకమును చదువరు. నాటకమును ప్రతివేషధారియు పరిశీలనబుద్ధితో సావకాశముగ పఠించిన పాత్రప్రదర్శన మంతయు స్వభావసిద్ధముగ నుండును. లేకున్న రంగస్థలమున ననేకము లగు ననర్థములు నవాచకములును తటస్థించును. పాత్రధారులు విద్యాగంధము కావలసినంత లేకపోవుటచేతను మీఁదు మిక్కిలి తెలివితక్కువతనము అహంభావము పిచ్చి పట్టుదలలు వారి నావహించియుండుటచేతను తమ వేషములను స్వభావసిద్ధముగ ప్రదర్శింపఁజాలరు.

ఇంకొక విషయము. ఒక యంకమున నుత్తమపాత్రము నటించిన నటుఁడు వేఱొక యంకమునందు నీచపాత్రి గైకొనఁగూడదు. వేణీసంహారమున భీముని పాత్రము ప్రదర్శించిన వెనుక నతఁడే మరల కౌరవవార్తాహారుఁ డగు సుందరకుని పాత్రము గైకొనుటయు చిత్రనళీయమున నలపాత్రధారి వీరనాయకుఁడై వెలయుటయు కేవలము నసహ్యాకరముగ నుండును.

సంగీతము.——సంగీతమును గూర్చిన చర్చ చాల కఠినమైనది. సంగీతమును నాటకమునకు ముఖ్యాంగముగ ప్రజ లెంచుచున్నారు. సాధారణప్రేక్షకుని 'రాత్రి నాటక మెట్లుండె?' నని ప్రశ్నించినచో, అతఁడు మొదట 'నాటకము చాల బాగున్న' దనియు, 'అందు మంచి పద్యము లున్న' వనియు 'ఒక నటుఁ డెట్లు నటించె (అభినయించె)?' నని యడిగినచో, 'అతఁడు చాల బాగుగా పాడు' ననియు ప్రత్యుత్తర మిచ్చుటను మనము సాధారణముగ నెఱుఁగుదుము. నాటకమునకు పద్యములును తత్ప్రదర్శనమునకు సంగీతమును ముఖ్యము లని వాని యభిప్రాయము. నాటకప్రదర్శనమునకు సంగీత మవసరమా యనవసరమా యని ప్రశ్నించి అవసర మగు నెడ నెంతవఱ కవసరమో నిశ్చయించు నెడ నాటకములందు పద్యము లెంతవఱ కవసరమో కూడ విచారింపవలెను. ఈ విషయమున నిశ్చితాభిప్రాయము నిచ్చుట చాల కష్టము. మన మింటియొద్దను ఇతరస్థలములందును భార్యలతోడను స్నేహితులతోడను ముచ్చట లాడునపుడు పద్యములతోఁ గాని కీర్తనలతోఁ గాని మాటలాడము. అట్లయినచో నెనుకటి గురువు గారు శిష్యుని నెల్లపుడును సంగీతము కృషిచేయుచు ప్రతి మాటయు సంగీతము పాడుచునే చెప్పవలె నని చెప్పిన కథవలె జరుగును! ప్రకృతియందు సాధారణముగా జనులు గ్రామ్యభాషలోనే మాటలాడుకొందురు గాని వ్యాకరణయుక్తముగ మాటలాడరు. పాత్రయొక్క గౌరవము ననుసరించి వ్యాకరణయుక్తమై శిష్టమైన భాషయు మఱికొన్ని చోట్ల నీచపాత్రలకు గ్రామ్యభాషయు నుపయోగింపవలసియుండును. ఒక కవి యొక కథను నాటకముగ వ్రాయుచో చాల కాలము పట్టిన విషయములను కొన్ని గంటల కాలములో ప్రదర్శించుటకు వీలుగ నిమిడ్చి వ్రాయును. అన్ని విషయములు నందు క్షిప్తపఱుపఁబడియుండును. నాటకమున చాలవఱకు ప్రకృతిలో జరుగునట్టి విషయములు రసవంతములుగను ఆదర్శప్రాయములుగను చిత్రింపఁబడును. అది య ట్లుండక తప్పదు. కావున, పద్యములను వ్యాకరణయుక్త మగు వచనములను నుపయోగింపవలసివచ్చును.

రసపోషణము పద్యముల కవకాశ మిచ్చును. ఒక తఱి రసోద్రేకము చక్కని పద్యరూపమున నెంతయు ప్రకృతిసిద్ధముగ నుండును. భక్తి శృంగారము విచారము అప్రయత్నముగనే పద్యరచన కవకాశ మొసంగును. భక్తిరసపూరితుఁ డైన నరుఁ డొక్కతఱి తాత్కాలికముగ కవన మెఱుఁగకున్నను పద్యరూపమునను కీర్తనరూపమునను తన భక్తిని వెల్లడిపఱుచుట మన కందఱకు ననుభవవేద్యమే! విచారమునం దనేకులు పద్యములు రచియింపఁగలుగుటయు విషాదసారంగధరనాటకమున రాజనరేంద్రునివలె పిచ్చి చేష్టలు

చేయుటయు సహజము. రసములను చూపవలసినపుడు పద్యము లుత్తమపాత్రలకే యుపయోగింపఁబడవలెను. ఆ రసపోషణమం దయినను పద్యములు భావము ననుసరించి మితముగ నుండవలయును. వచనము మాని యా భావమును పద్యమునం దుంచుటకు కారణ ముండ వలెను. ఆ సందర్భమున పద్య ముపయోగించిన శ్రోత్ర యందము రావలెను. అంతియ కాని, నాటకారంభమున రాజు ప్రవేశించి "అమాత్యశేఖరా!" యని సంబోధించి పద్య మారంభించిన లాభము లేదు. నేను కొంత కాలము క్రిందట సుత్తిక సర్కారులందు ఘనత వహించిన నాటకసంఘములలో నొక సంఘమువారి రుక్మాంగద నాటక ప్రదర్శనము చూచితిని. అందు రాజు ప్రవేశించినతోడనే ద్వారము కడ ప్రజలు మొఱవెట్టుచున్నా రన్న వార్త వినెను. వారిని లోనికి తోడ్కొని రా నాజ్ఞ నిడి వారి విచారకారణ మే మయియుండు నా యని కీర్తన యొకటి పల్లవి యనుపల్లవి సవరించి, 'సరిగమలు' మాత్రము తక్కువగ, తలత్రిప్పుచు చిఱునవ్వు మధ్య మధ్య నవ్వుచు కా లాడించుచు పది నిమిషములు పాడుచుండిన నె ట్లుండును? రా జారంభించిన కీర్తన సంపూర్తి యగువఱకు ప్రజలు రంగములోనికి రారు. రా జెంత సేపటికిని సంగీతము పాడుచు నానం దముగున్నఁ డగుటచే కాఁబోలు కీర్తన ముగింపఁడు. వారి విచార కారణ మేమయియుండనోపునా యని యాతురతతో వారి రాకకై యెదురు సూచుచు పరితాపమును ముఖమున కనఁబఱచిన బాగుండియుండును.

నాటకమున సంగీత మెంతవఱ కవసరము? నాటకప్రదర్శన మునకు భావప్రకటనము ముఖ్యము గాన రాగము దానియందలి కళలు లేక సంగతులు మిక్కుటమైన రసవంతము లగు భావములు వెల్లడి గావు. కావున, పద్యము పాడునపుడు రాగమును భావానుసరణ ముగ సాఁపుచు నంత యెక్కువగను తక్కువగను గాక యెంతవఱ కవసరమో యంతవఱకే పాడవలెను. ఈ సందర్భమున శ్రీపాద కామేశ్వరరావు, ఎమ్.ఏ., ఎల్.టి., గారి యభిప్రాయ మిందుఁ బొందుపఱచెదను:

"సంగీతము వాచకమంత ముఖ్యాంగము గాదు, ... సంగీతజ్ఞాన మభివృద్ధి చేసికొని మిక్కిలి శ్రావ్యమైన సంగతులను మితముగా పద్యమందు కనఁబఱుప వలెను. ... ... పద్యమధ్యమున నాపెడు చోటు లర్థానుగుణ్యములై యుండవలెను. సంగీతమునఁ గూడ విరామము లున్నవి. ఇవి స్వరము ననుసరించి యుండును. ఇట్టి విరామము లర్థానుసారు లగుచుండును. ... ... నిర్దుష్ట మగు వాచకము రసయుక్త మగు నభి నయము వీనికి రెంటికిని స్వవిషయమునఁ గాని పరవిషయమునఁ గాని ప్రతిబంధకము లేకుండ సంగీత ముండవలయును.

పద్యమం దెక్కడ రాగము పాడవలెను—మొదటనా? చివరనా? దీర్ఘము వచ్చినపు డెల్లనా? లేక పద్యములోని పదములు జ్ఞప్తికి రానప్పుడా? రాగ మంతయు చివరఁ గాని మొదటఁ గాని తీసిన నందము చెడుటయే గాక రసభంగము గూడ కలుగును. దీర్ఘము గల చోట్ల నెల్ల పాడిన నర్థము చెడును. మరియొకప్పుడు కేవలము వ్యతిరేకార్థము గూడ స్ఫురించును.

"అర్థకాఠిన్య మున్న చోట అర్థచమత్కృతి యున్న చోట ఆశ్చర్యార్థకమునందు ప్రశ్నార్థకమునందు సంబోధన చేయుచో — ఇట్టి చోటుల నాఁపుట యర్థానుగుణ్యముగ నుండును, కావున, సంగీతవిరామ మర్థవిరామమును నాశ్రయించియుండును. పద్యములో రాగము మొదలుపెట్టి ప్రతిదినమునందును (సాధారణముగ) కళలు మార్చి, పద్యములో రాగము మూలభావమునకు అనవసరముగ సంగతులు చెక్కుచుగ పెంపఁగూడదు."

రసానుగుణ్యముగ రాగము మార్చుట మంచిది. నాటకము మొదలుపెట్టిన నాఁటిగ తుదవఱకు నొకే రాగము పాడి విసుగు పుట్టింపఁగూడదు.

కావున, సంగీతము రసభావోచితముగ నుండవలెను. ప్రతి సమయమునను సంగీతము నభినయములోనికి మార్చవలసియుండును, దీనివలన వాచకమునకు నభినయమునకును వన్నె దేవలెను. వేణీ సంహారనాటకము ద్వితీయాంకమున,

మ. కనుబొమ్మల్ ముడివేయలేదు, కనుల గ్రీష్మంగలే దశ్రువుల్,
కినుకన్ మో మటు సేయలేదు, శపథో క్తిన్ బక్క వారింపలే
దనుఁగుంజన్ను లురమ్ము గాడఁ జెలి గాఢాలింగనం బిచ్చె హా!
యని సౌఖ్యాబ్ధిని దేల నా మనసు వాత్యాచక్రభీతాత్మ యై.

ఇందు "హా" యను చోట మనసు కరఁగించి హాయి యని పించు కళ పాడిన నందము. మఱియు,

క. అడుగులు మెల మెల్లగ నిడు
వడఁకుచు నఘవంగఁబోకు పడెదవు సుమ్మీ
పడఁతీ! భుజలతికలు నా
మెడకుం బెనవేయు మురము మెదుపఁగ (?) జన్నుల్.

ఇందు 'మెలమెల్లగ' ను చోటను 'పడెదవుసుమ్మీ' యను చోటను పాటయం దవరోహణమువల్ల నామె పడిపోవుచున్న దేమో యనునట్లు చూపవలెను.

స్త్రీపాత్రలు నటించువారలు తమ వేషమున కనుగుణ్యమగు రాగములను స్త్రీకంఠమున పాడవలెను. నటులలో కొందఱు స్త్రీ పాత్ర ధరించువారు సంగీతమును పురుషపాత్రధారులవలె స్వేచ్ఛగా పాడుటకు వీ లుండ దని విచారింతురు. కాని, యే పాత్ర యైన నేమి? సంగీతమును భావములతో సంప్రతించి భావప్రకటనమునకు తోడ్పఱుపవలయును.

వాచకము.—ఇది నటునకు చాల ముఖ్యమైనది. వాచ కమునందు స్పష్టత నిర్దుష్టత యాఁతము ధార యుండవలెను. అందు భావానుగుణ్యముగ సాఁపుండవలెను. ఆ యాఁపుట తొందరగా చదువుట యాఁపి యాఁపి చదువుట భావము ననుసరించి రసానుగుణ్య ముగ నుండవలెను. అది రసమును బట్టి మాఱుచుండవలెను. నాట కమునం దే పాత్రధారి కైన సంగీత మెంత వచ్చినను వాచకము సరిగా నుండకపోయిన రాణింపదు. తప్పు వాచకము రసాభాసము కలిగించును. గయోపాఖ్యానమున "పౌతబిడ్డ" యని కలిపియు చిత్రనళీయమున "యువతీ మన్మథుఁ" డని విడఁదీసియు చదువుట యర్థమును ధ్వంసము చేయును. మరియు, చిత్రనళీయమున "పాద గానె, కడలూన, కడుదీన, గతిమీఱ, సెంతబ, ల్వెతలఁ బడితో" పైని గీతలు పెట్టిన చోట్ల నటు లాఁపుచుందురు. పదముల ధ్వని శ్రవణానందకరముగ నున్నది గాని యర్థము శూన్యము. ఇద్దానిని "ప్రాణేశ మన కెట్టి" యను ద్విపద మాదిరిని ఫీలు రాగపు మట్టున

జాతీయవిద్యాలక్షణములు

వెలిదండ చూడికుడుత్తమ్మ గారు

మన దేశముయొక్క ప్రస్తుతపు దుస్థ్సితికి కారణము "జాతీయ విద్య" లేమియే యని దేశీయనాయకు లిప్పుడు బాగుగా గుర్తెఱింగి దేశమున పెక్కు చోట్ల జాతీయవిద్యాప్రతిష్ఠాపనలను నెలకొల్పఁ బ్రయత్నించుచున్నారు. జాతీయవిద్యయొక్క యావశ్య కతను గ్రహింపలేక కొందఱింకను ఈ యుద్యమము నధిక్షేపించు చున్నారు. జాతీయవిద్య యనఁగా నేమో దానికిని ప్రస్తుతపు విద్యా విధానమునకును గల భేద మేమో వివరముగా నెవరును బోధింప కుండుటచేత, జాతీయవిద్యను గూర్చి అనేకుల కనేకవిధము లైన యభిప్రాయములు కలుగుచున్నవి. జాతీయవిద్య యనఁగా ప్రస్తుతము మన పాఠశాలలందు నేర్పఁబడు ఇంగ్లీషువిద్యావిధానమునం దసహ్యులను కలిగి పూర్వమువలె బాలరామాయణము అమరము పెద్ద బాలశిక్ష మొదలగువానిని మాత్రము పఠింపించు పూర్వపు పల్లెటూళ్ల విద్యావిధానమును తిరిగి యనుసరించుటయే యని కొందఱు తలంచుచున్నారు. ఈ తలంపే సరి యైనయెడల, అట్టి జాతీయవిద్య మూలమున మనకు లాభమునకు మాఱుగా నష్టమే కలుగును. అది గ్రహించియే, మన దేశీయుల యభివృద్ధికి భంగము కలిగింప నెంచిన కర్జను ప్రభువు ఉన్నతాంగ్లేయవిద్యను నిరుత్సాహపఱుపసమకట్టెను. ఇప్పటికిని హిందూదేశాభివృద్ధికి విరోధు లగు నాంగ్లేయులు కొందఱు "వీరి కెందుల కున్నతాంగ్లేయవిద్యను నేర్పి కన్నులు తెఱపించి హైందవైకజాతీయతను గ్రహింనునట్లు చేసి స్వరాజ్యమును గోరు నాఁకలి నేల పుట్టించితిమి!" అని చింతిలుచున్నారు. కావున, జాతీయ విద్య యనఁగా పైని జెప్పినది కాదు.

ప్రస్తుతపు టింగ్లీషువిద్యావిధానము హైందవైకజాతీయతను విద్యార్థులు గ్రహించునట్లు చేయఁగలిగిన దనుటకు సందియము లేదు. కాని, ఆ విద్యావిధానము అట్టి హైందవైకజాతీయభావమును దేశీయు లందఱియందును వ్యాపింపఁజేయకుండుటయే గాక విద్యార్థులయం దైనను దానిని బల మైనదిగను ప్రయోజనకర మైనదిగను చేయఁజాలకున్నది. ప్రస్తుతపు పాఠశాలలందు నేర్పఁబడునట్టియు జాతీయాభివృద్ధి కనువగునట్టియు ఉన్నతాదర్శములు కొలఁదిమందికే తెలియఁగల యాంగ్లేయభాషయందే బోధింపఁబడుచుండుటచే జన సామాన్యమునకు తెలియకపోవుటవలన ఆ యాదర్శములు హైందవ జాతీయాభివృద్ధికి తోడ్పడుట లేదు. కావున, అట్టి యాదర్శములను స్వంతభాషామూలకముగ నేర్పినచో వానిని ప్రజ లెల్లరు సులభముగను శీఘ్రముగను గ్రహించి జీర్ణము చేసికొని జాతీయాభివృద్ధికి తోడ్పడఁగలరు. ఇదియే జాతీయవిద్యయొక్క మొదటి లక్షణము.

మఱియు, ప్రస్తుతపు విద్య గవర్నమెంటు ఉద్యోగములకును వ్యక్తుల కేవలవివేకాభివృద్ధికిని మాత్రము ఉపయోగపడుచున్నది గాని హైందవజాతియొక్క యార్థికాభివృద్ధికిఁ గాని నైతికాభివృద్ధికిఁ గాని యాధ్యాత్మికాభివృద్ధికిఁ గాని తోడ్పడుట లేదు. అందువలన విద్యావిధానమునందు దేశాభివృద్ధి కనువగు పారిశ్రామిక సాంకేతికాధ్యాత్మికాదివిద్య లవశ్యములు. ఇట్టి విధానము జాతీయ విద్యయొక్క రెండవ లక్షణము.

ఇంతియ గాక, ప్రస్తుతపు విద్యావిధానములో ముఖ్యముగా మూఁడు విధము లైన లోపములు గలవు. అం దొకటి దేశకాలమాన స్థితులను గమనింపకుండుట; రెండవది గురుశిష్యుల కుండవలసిన సంబంధము సరిగా లేకుండుట; మూఁడవది "డిసిప్లిన్" అను నెపమున అనావశ్యక మైన దుస్తులను ధరింపవలయు నని నిర్బంధపఱచుట. ఈ మూఁడు లోపములను దీర్చుట జాతీయవిద్యయొక్క మూఁడవ లక్షణము. మన దేశముయొక్క కాలమానస్థితిని బట్టి పాఠశాలలను మిడి మిడి యెండ సమయమునఁ గాక చల్లగా నుండు నుదయమునను సాయంకాలమునను పెట్టవలయును. గురువులు శిష్యులను ప్రేమతో సానుభూతితోఁ జూచుచు వారల సర్వవిధము లైన యభివృద్ధికిని పాటుపడవలయును. అట్టిది విదేశీయులకును విదేశీయపద్ధతులపై నడుపఁబడు పాఠశాలలయందును సాధ్యపడదు. అట్టి పాఠశాలలలోని యుపాధ్యాయులు సాధారణముగా కేవలము ధనముకొఱకై చదువు చెప్పువారుగ నుందురు. మఱియు, విద్యార్థులు దేశీయము లగు దుస్తులను ధరించుట కాటంక ముండఁగూడదు.

ఈ పైని జెప్పిన మూఁడు లక్షణములు గాక జాతీయవిద్యకు వేఱొక లక్షణము గూడ కలదు. జాతీయగ్రంథపఠనము జాతీయ వీరపురుషారాధనము జాతీయాదర్శబోధనము మున్నగువానిని కలిగి యుండుట జాతీయవిద్యయొక్క నాల్గవ లక్షణము.


ముఖ్యముగా ఈ నాలుగు లక్షణములు గల విద్యయే జాతీయ విద్య యనఁబడును. ఇట్టి లక్షణములు గల విద్యయే ఇంగ్లాండునందును అమెరికాయందును జర్మనీయందును జపానునందును గఱపఁబడుచున్నది. ఇది సహజము. విజాతీయ రాజుల పాలనములో నున్న మన దేశమునందు జాతీయవిద్యను నెలకొల్పవలె నని అనిబిసెంటు అరండేలు తిలకు గాంధి మున్నగు మహనీయులు ప్రయత్నించు చున్నారు. కాని, దేశమునందు స్వరాజ్యము స్థాపింపఁబడినఁ గాని, ఇట్టి జాతీయవిద్య సుసాధ్య మగు నని తోఁచదు. అయినను, స్వరాజ్యము త్వరలో రానున్నట్టు అనేకసూచనలు గాన్పించుటచే, ఇట్టి జాతీయవిద్యను నెలకొల్పుటకై ఇప్పటినుండియు మనము ప్రయత్నించుట మిగుల సమంజసము.

Head-quarters of the National University, Madras.




జాతీయ విశ్వవిద్యాలయ ప్రధానభవనము, మదరాసు.

National High School Terampet, Madras: Open Air classes.




జాతీయ విద్యాలయము, తేనాంపేట, మదరాసు: పిల్లలు వృక్షచ్ఛాయల విద్యాభ్యాసము చేయుట.

National High School Tenampet: Students' Hostel.



జాతీయ విద్యాలయము తేనాంపేట: విద్యార్థి భవనము.



జాతీయ విద్యాలయము ముఖ్యభవనము, తేనాంపేట.

కృష్ణదేవరాయల రాష్ట్రభాష

గాడిచెర్ల హరిసర్వోత్తమరావు గారు, ఎం. ఏ.

నేఁటిదినము ఆంధ్రోద్యమము మాట యుద్ధములోను మాంటేగ్యూ-షమ్సుఫర్డు ప్రణాళికలోను రౌలట్టు శాసనములలోను చిక్కుకొని అంతగా బయటికి రాఁజాలకున్నను, ఈ తొమ్మిది ప దేండ్లుగా జరిగిన యాంధ్రుల యప్రతిమాన మగు నాందోళనంపు ఫలము ప్రజల మానసమున శాశ్వతముగా స్ఫుటముగా నెలకొనియున్న దనియే నా యభిప్రాయము. ఈ యాందోళనమం దంతటను కృష్ణదేవరాయల పవిత్రనామమే యాంధ్రోద్యమమునకు విజయబీజముగా స్మరింపఁబడినది. ఏ ఫలము నిచ్ఛించి యాంధ్రు లాందోళనమును తీక్ష్ణముగ చేసిరో ఆ ఫలము దేశభాషాప్రయుక్తం బగు రాష్ట్రనిర్మాణము. ఇట్టి రాష్ట్రము కృష్ణదేవరాయల కాలమున నుండిన దను సిద్ధాంతము ఇదివఱకు చేయఁ జూచినవారు మాత్రము కానరారు. 'ఈ సిద్ధాంతమును చేయవలయునా? ఇది స్వయంప్రకాశకము గాదా?' యనువా రుండకపోరు. స్వయంప్రకాశకం బనుట యొక రీతిని నిజమే యగు. మన యీ భరతభూమికి విజాతీయ ప్రభుత్వము క్రొత్త కాదు కాని, విదేశీయప్రభుత్వము మాత్రము ఆంగ్లేయులతోడన యవతరించినది. ఆర్యులు విజాతీయులు. మహమ్మదీయులు విజాతీయులు. మరి, పడమటినుండియు తూర్పునుండియు కనుమల ద్వారమున ప్రవేశించిన యెల్ల జాతులును పరజాతులు. అయినను, ఒక పర్యాయ మీ పవిత్రభూమిని త్రొక్కిన పిదప ఈ జాతులవా రందఱును దీనినే తమ మాతృభూమిని గావించుకొనిరి. కన్నతల్లిని మఱచి పెంపుడు తల్లినే కన్నతల్లిగా భావించుకొనిరి. అందుచేత వీ రందఱును ఇచ్చటి సోదరులు నిజసోదరు లైపోయిరి. వీరి వేషభాషలును వారి వేషభాషలును ఇంచుమించుగా నైక్యము నొంది ఒండొరుల వీడ్వడినవారు కాక పోయిరి. ఈ కారణముచేత పాలకుల భాష యొకటి పాలితుల భాష యొకటి యను విభేదము తీక్ష్ణముగా పొడగట్టుట కవకాశ ముండినది గాదు. ఇది యొక పక్షము. ఈ పక్షమునుండి యాలోచించినచో ప్రాఁత కాలములందు దేశభాషాప్రయుక్తరాష్ట్రములే యుండి యుండు ననుట స్వయంప్రకాశకముగాఁ దోఁచును. సర్వలోకచరిత్రయు ఇందునకు నిదర్శనమై పొడగట్టును. కాని, ఎంతటి స్వయంప్రకాశకవిషయంబునను చారిత్రకదృష్టియందు వైపరీత్యములు కన్పింపకపోవు. మానవప్రపంచమున ఎంతటి సాధారణసూత్రమునకును వెన్వెంటనే విశేషసూత్రం బొకటి యుండకపోదు. మన భారతభూమియందు దేశభాషకు చిన్నఁదనము కల్గిన ఘట్టములు నేఁటికిని కలవు. నైజాము రాష్ట్రమున సగము ప్రజ తెలుగు ప్రజ సగము ప్రజ మహారాష్ట్ర ప్రజ కాని, రాష్ట్రభాష రాజభాష యగు నురుదూ భాష. అదే రీతిని మైసూరు సంస్థానములో తూర్పు జిల్లాల కొంత భాగము సంపూర్ణముగా తెలుఁగుభాగము. కాని, అచ్చటి రాష్ట్రభాష రాజభాష యగు కన్నడము. ఇదే రీతిగ గతకాలమునను అటనట దేశభాషకు న్యూనత కలిగిన దనుటకు నిదర్శనము లున్నవి. ఆంధ్రభూమిలోని కొంత భాగము, ముఖ్యముగా దత్తమండలములు, మహారాష్ట్రుల యేలుబడిలోనికి వచ్చినప్పుడు రాష్ట్రభాష మహారాష్ట్ర మగుట మాత్రమే కాదు సంభవించినది. విద్యాలయములలో కూడ 'ఏకా ఏక ఏక్' అని యెక్కములు మహారాష్ట్రములోనే నేర్పుచు వచ్చినారు. ఆంధ్రులలో ఉపాధ్యాయు లెక్కువగా లేకపోవుటచేత ఇట్టి పరిస్థితి కలిగిన దని యనేక కారణములను బుద్ధిమంతులు చెప్పఁగలరు. అట్టి కారణములతో నాకు సంబంధ మక్కఱలేదు. జరిగిన సంగతి మాత్రము నాకు ప్రస్తుతము. మన భూమిలో గతకాలంబునను దేశభాషలకు ప్రభు లైనవారు ప్రాముఖ్యము కల్పింపని ఘట్టము లున్నవి. కాఁబట్టి, కృష్ణదేవరాయల కాలమున నేమి జరిగెనో యాలోచింతమను నాశయ మవశ్య మామోదనీయము. నా మతంబున కృష్ణదేవరాయల పూర్వీకు లెల్లరును కర్ణాటకులు.

ప్రస్తావ గ్రంథములు సన్నిహితసంబంధములు. ఒకప్పుడేకము లభించి వాదించినారినయెడలను నాకు సానుభూతి కలుగదు. కాబట్టి, కృష్ణరాయల కాలమునాఁటికి కృష్ణరాయల వంశముయొక్క రక్తనాళములలో ఆంధ్రరక్తము కూడ సమ్మిళితమై యుండిన దనియే నే నమ్మినాఁడ. ఆ మాత్రమున కృష్ణదేవరాయ లాంధ్రుఁడని నిర్ధారింపరాదు. అతఁడే తాను కన్నడరాయ లయినట్టు వ్రాసికొనినాఁడు. ఆ ఘట్టమును గూడ తిలకింపనగు. ఆంధ్రవిష్ణువు కృష్ణదేవరాయలకు స్వప్నమునఁ గాన్పించి కృతిసేయు మనుచోట స్పష్టముగా 'నేను తెలుంగు రాయఁడన్, గన్నడరాయ యక్కొనుమ గప్పు' మని సంబోధించుచున్నాఁడు. కృష్ణదేవరాయలకును తనకును గల భాషాతారతమ్యచర్చ ఈయాంధ్రవిష్ణువు పెట్టుకొనక యుండినయెడల కన్నడరాయ యన్నదానిని ఇతరకారణములు చెప్పి బిరుదంబనియో తెలుంగు కన్నడంబు లప్పటి కభేదంబులనియో త్రోసిపుచ్చియుండవచ్చును. కాని, ఈ ఘట్టమున నట్టి యుక్తి లేమియు బొసంగదు. వెన్వెంటనే నుడివిన పద్యంబును నా వాదంబునకు సహకారియే. 'తెలుఁగదేల' యని తరువాతి పద్యము ప్రారంభమగుచున్నది. కృష్ణదేవరాయలే యాంధ్రుఁడైనయెడల ఎమటివాఁ డాంధ్రవిష్ణువైనప్పుడు ఈ ప్రశ్న పొడగట్టుటకే కారణ ముండదు. ఒకవేళ కృష్ణదేవరాయలు తెలుఁగును పొగడఁదలఁచి యీ మిష పన్నెనన్నచో అతఁ డద్దానిని మరియెన్ని రీతులనో నెఱవేర్చికొనియుండవచ్చును. ఈ ప్రశ్నరూపముననే నెఱవేర్పనక్కఱ లేదు. మానసికావస్థల నెఱుంగఁగలవా రెవ్వరును ఈ ప్రశ్నయొక్క తత్త్వమును గ్రహింపఁజాలకపోరు. కృష్ణదేవరాయలు కన్నడమువాఁ డగుట కింకను కారణము లున్నవి. ఇప్పుడు నే చూపిన కారణంబులే ప్రస్తుతమునకు చాలును. అట్టి కన్నడరాయఁడు రాష్ట్రభాష నేమని వర్ణించినాఁడో చూతము:

'తెలుఁగదేల యన్న దేశంబు తెలుఁ గేను
దెలుఁగు వల్లభుండఁ దెలుఁ గొకండ
యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స.'

ఈ పద్యముపై వ్యాఖ్యాన మిదివఱలో చిత్రరీతి ననుగమించినది. వావిళ్ల రామస్వామి శాస్త్రులవారిచే ప్రకటిత మైన వ్యాఖ్యలో టీకాతాత్పర్యము లీ రీతిని గననగును.

టీ. తెలుఁగదేల యన్నన్ = తెనుఁగు కావ్య మేల యంటి వేని, దేశంబు = నే నివసించియున్న దేశము, తెలుఁగు = తెలుఁగుడి, ఏను = నేను, తెలుఁగు వల్లభుండన్ = తెలుఁగు రాయండను, తెలుఁ గొక్కటియే (అనఁగా నది వింత గా దనుట), ఎల్ల నృపులు గొలువన్ = సకలరాజన్యులు సేవింపఁగా, బాసాడి = నీవు సంభాషించి, ఎఱుఁగవే = కాశ్యర్థమువలన సకలదేశభాషల నెఱుఁగుదు వనుట. దేశభాషలందుఁ దెలుఁగు లెస్స.

తా. ఇన్ని సంస్కృతగ్రంథంబుల వ్రాసిన నన్నుఁ దెలుఁగున నేల ప్రబంధము వ్రాయు మని సెలవిచ్చుచున్నా వనవలదు. ఏ మనఁగా, నేను నివసించియున్న దేశము తెలుఁగు దేశము నేను తెలుఁగు వల్లభుఁడను. తెలుఁగు క్రొత్తది కాదు. సకలసామంత రాజులును గొలుచుచుండఁగా నీవు సకలదేశభాషలను మాటలాడు చుండుట లేదా? సమస్త మైన దేశభాషలలోను దెలుఁగే కదా చక్కని భాష.

మామకమిత్రులు కొమర్రాజు వేంకటలక్ష్మణరావు గారు ఇటీవల 'సౌతు ఇండియన్ రిసర్చి' పత్రికకు 'ఆముక్తమాల్యద జన్మదినమును' గుఱించి యొక వ్యాసము వ్రాయుచు అందులో నాంగ్లభాషయం దీ పద్యమున కర్థమును పొందుపఱచిరి. మొదట వారు వ్రాసిన విషయము నాంగ్లముననే వ్రాసి దాని భాషాంతరీకరణమును వెనుక నిమిడ్చెద:

"Why I ask you to write in Telugu is, this is a Telugu country, I am the lord of the Telugus (or a Telugu Lord), Telugu is not an ordinary language. As you had occasion to converse in several languages with various kings present in your Court, do you not know that of all the Vernaculars Telugu is the best."

"నేను నిన్ను తెలుఁగున నేల వ్రాయు మనుచున్నా నందువా? ఇది తెలుఁగు దేశము. నేను తెలుఁగురాయఁడను (తెలుఁగు రాయలలో నొకఁడను అని కూడ కావచ్చును). తెలుఁగు అసమాన భాష. నీ కొలువు కూటమునఁ గల యనేక ప్రభువులతో అనేక భాషలు మాటలాడి దేశభాషలందు తెలుఁగు లెస్స యనునది యెఱింగి యున్నావు గదా!"

వావిళ్లవారి వ్యాఖ్యానమునకును లక్ష్మణరావు గారి వ్యాఖ్యానమునకును కొలఁదిపాటి విభేదము లేక పోలేదు. కాని, రెండు వ్యాఖ్యానముల సరణియు నొక్కటియే యనుట మాత్రము స్పష్టము. వావిళ్లవారు

'తెలుఁగొకండ' యనుదానికి 'తెలుఁగు క్రొత్తది కాదు' అని యర్థము చేసినారు. లక్ష్మణరావు గారు వాఁడొక్కఁడే సరి యను చోట 'ఒక్కఁడు'న కే యర్థము కలదో ఆ యర్థము చేసి తెలుఁగు అసమానభాష యని వ్యాఖ్య వ్రాసినారు. వావిళ్లవారిని కృష్ణరాయల సంస్కృతపాండితి బాధించుచున్నది. 'సంస్కృతమున వ్రాసిన నీవు తెనుఁగున వ్రాయఁజాలవా?' యని యాంధ్రవిష్ణువుచేత సంబోధింపఁజేయుట వారి పని. వారింత కష్టపడియుండ నక్కఱ లేదు. ఆ విషయము రెండు పద్యములకు ముందే యాంధ్రవిష్ణువు తీర్చివేసినాఁడు. 'మధురకావ్యరచన మెప్పించికొంటి గీర్వాణభాష నంధ్రభాష యసాధ్యంబె' యని తెల్లముగా పల్కినాఁడు. ఇదే మరిమరి యనుట పునరుక్తిదోషంబై కృష్ణరాయలకు దైవము నోటినుండి వచ్చినను, కించిజ్జ్ఞతను గలిగించియుండును. ఏది యెట్లున్నను ఏ వ్యాఖ్యానము ననుసరించినను 'తెలుఁగొకండ' నిరాధారంబు నిరవలంబనంబై యున్నది. వావిళ్లవారి యర్థమునకు (ఈ యర్థమునే చిరకాలముగ నాంధ్రదేశ మనుసరించుచున్నది) గతియే కానము. కృష్ణదేవరాయ లన్వయసౌకుమార్యము లేనివాఁడను ప్రతీతి ప్రబలియున్నది గదా. దానిని శరణ్యము చేసికొని లక్ష్మణరావు గారి వ్యాఖ్యానానుసారము 'తెలుఁగొకండ లెస్స'యనియో మరి యే విధముగనో ఒక విశేషణమును కలిపి ఒక క్రియను కలిపి చదువుదమా యనిన 'దేశభాషలందుఁ దెలుఁ'గని మరల నుడువంబడియున్నది. మరి రెండు చిత్రములు గూడ కలవు. 'ఎల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి' యను చోట 'నృపులకు' స్థాన మున్నది కాని నృపుల భాష లనుట కవలంబన మేదియు కానరాదు. కడపట 'బాస' యొకటి దొరకినది గదా దానిని బట్టుకొని పెనఁగుద మనిన అది యేకవచన మైపోయినది. అనేకభాషలకే యిచ్చట ప్రసక్తి యగునేని బాసలని యుండవలయును గాని బాస యనుట పొసఁగదు. మరియు, రూఢిని 'బాసాడి' యనుటకు ఏదో నిర్ణయభాష — విశేషభాష — నుపయోగించుట యని యర్థమే కాని మితిమేరలు లేని బహుభాషాధారకసంభాషణ మని కాదు. పద్యములోని పదముల సమన్వయమును చూడమిచే ఇంత కల్లోలంబును కలిగిన దని నా నమ్మకము. పద్యమును నాకుం దోఁచిన విరామములతో వ్రాసి చూపెద. చదువుఁడు.

తెలుఁగదేల యన్న, దేశంబు తెలుఁగు, ఏను తెలుఁగు వల్లభుండ, తెలుఁగొకండ యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి, దేశభాషలందు దెలుఁగు లెస్స.

అర్థము గమనింపుఁడు. అయ్యా, తెలుఁగేల కోరుచున్నా వందువా? దేశము తెలుఁగు దేశము, నేను తెలుఁగు వల్లభుఁడను, అందఱు నృపులు గొలువఁగా నీవు తెలుఁగొకండె బాసాడి యెఱుఁగుదువు. అంతే కాదు, దేశభాషలలో తెలుఁగే లెస్స. అందుకు కారణము లయినవి. ఇది సహజముగా ఏ కష్టము లేక పొసఁగు నర్థము. ఇంతకంటె వేఱుగ నర్థము చెప్పినచో అది గారడి విద్య గాని సహజవిద్య కాఁజాలదు. కృష్ణరాయ లనేకభాష లాడువాఁ డని పద్యమున చెప్ప వలసిన పనియే లేదు. అతఁడు కన్నడరాయఁడు, సంస్కృతపండితుఁడు, ఎల్ల నృపుల కొలువుకొన్న వాఁడు. ఈ విషయము లతని బహుభాషాభాషిత్వమును చెప్పకయే చెప్పుచున్నవి.

ఇట్లు, కృష్ణదేవరాయలు తన రాష భాష దేశభాష యగు నాంధ్రంబే యనుటను నిరాఘాటముగ చాటినాఁడు. కన్నడరాయఁ డయ్యు దేశభాషాధారక రాష్ట్రమునే పరిపాలించిన యీ మహాత్ముఁడు నేఁటి యాంధ్రులకును నేఁటి ప్రభువులకును మార్గదర్శి యగుచున్నాఁడు. ఈ విషయము నింకను కార్యదృష్టితో తెరిచి పరీక్షించి ఆంధ్రులు ఫలము గాంతురుగాక !

సత్యాగ్రహము

గరిమెళ్ల సత్యగోదావరిశర్మ గారు

ఆర్యమతప్రధానము సమంచితధర్మము సర్వకార్యసా
కార్యసమగ్రసాధన మఖండితపఃపరిపాక మైన సో
దర్యము సత్యయోగమును దాల్చి జగద్గురువై వెలుంగు నా
చార్యు మహాత్ముఁ గొల్తు ననిశంబును నిష్ఫలపంథి గాంధినిన్. 1

సీ. యోగీశ్వరోత్తమప్రాగీప్సితాప్తమౌ
సర్వకార్యవిధానసాధనంబు
గురుసత్యనిరతు లౌ నరపాలశేఖరు
లొక్కఁడు కష్టముల నంది కన్న శక్తి
వాయుపర్ణాంబుజీవనమునివ్రాతంబు
తపియించి కనుఁగొన్న ధర్మపథము
పరమపాతివ్రత్యభవ్యచారిత్రలు
మథియించి తీసిన మంచి వెన్న
సాధనము శక్తి మార్గము స్వాదుతనము
నైన సత్యాగ్రహము మన కనుగతమ్మ
చేతఁ గొని యూఁత గొని మెట్టి స్వీకరించి
యఖిలసిద్ధుల నొందుఁడో యన్నలార! 2

సీ. దుర్మార్గరోగము ల్దూలింపఁగాఁ బర
మౌషధంబయ్యె సత్యాగ్రహంబు
అజ్ఞానజన్యగాఢాంధకారము ద్రుంప
నాదిత్యమయ్యె సత్యాగ్రహంబు
అగ్రహోదగ్రదుష్టారివర్గము నొంప
హరిసత్త్వమయ్యె సత్యాగ్రహంబు
భారతావనిజాతబాధల నెడలింప
హనుమంతమయ్యె సత్యాగ్రహంబు
దాస్యదారిద్ర్యదుఃఖవిదారి యైన
యాకరంబును జూపు సిద్ధాంజనంబు
దేవు లైనను లొంగించు దిటవు గల్గి
యలరు శ్రీ గాంధి నడువు సత్యాగ్రహంబు. 3

సీ. ధ్రువునకు శాశ్వతధ్రువసత్పదం బిచ్చె
ననఘ మౌ సత్యాగ్రహంబు చూపె
ప్రహ్లాదునకు నాత్మబంధువై హరిఁ గూర్చె
నమల మౌ సత్యాగ్రహంబు చూపె
రఘురామునకు సముద్రుని దాసుఁగాఁ జేసె
నధిక మౌ సత్యాగ్రహంబు చూపె
మన హరిశ్చంద్రునకును సత్యయశ మిచ్చె
నార్య మౌ సత్యాగ్రహంబు చూపె
సాధ్వి సావిత్రికిని యమజయము గూర్చె
సీతకును లోకమాత నా ఖ్యాతిఁ దెచ్చె
యాజ్ఞసేనికి సభఁ గోక లంది యిచ్చె
దంబు మీఱిన సత్యాగ్రహంబు చూపె.

సీ. అతిదీక్ష బ్రహ్మర్షి యయ్యె నాఁడు తపోగ్ని
దాని గాధేయుఁ డెద్దానికతన
పృథుశక్తిఁ దన గురు నెదిరించి జయ మొందెఁ
బూనిక భీష్ముఁ డెద్దానికతన
అతిదీను లౌ దక్షిణాఫ్రికావాసుల
దయఁ బ్రోచెఁ గాంధి యెద్దానికతన
త్రైలోక్యఋషివలాకాంక్షితం బొనఁగూర్చె
జ్ఞాని యౌ గాంధి యెద్దానికతన
అదియె సోదరులార! సత్యాగ్రహంబు
మన సనాతనధర్మసమ్మతము నుండి
మఱఁగుపడియుండెఁ గారణాంతరమువలన
నఖిలగురుచేత నిపుడు ప్రత్యక్ష మయ్యె.

సీ. ఒడలియందున బల మొక్కింతుకయు లేక
జగ మెల్ల నరచేతఁ జక్కఁ బట్టె
అధికార మొక్కింత యైన లేకయె హైంద
వాబాలగోపాల మాజ్ఞ నేలె
దండకాషాయకమండలంబులు లేక
ప్రథితజగద్గురుత్వము వహించె
పరకాయములఁ జొచ్చు వరసిద్ధు లెంచక
భారతీయాత్మలఁ బ్రబలి నిండె
ఏ మహాత్ముండు సౌజన్యధాముఁ డతఁడు
శాంతమూర్తి పరంధామసముఁడు గాంధి
యతిసుదర్శనసత్యాగ్రహంబు మహిమఁ
దెలిపెఁ గాని పూని శుభములఁ జెలఁగుఁడయ్య.

తే. ఆర్యసోదరులార! సత్యాగ్రహంబు
పరమపావన మాత్మీయబాంధవంబు
వేదశాస్త్రోక్త మీ వ్రతవిహితు లైన
వారి కెందు నసాధ్య ముర్వరను లేదు.

క. ఆగ్రహశబ్దమునకును దు
రాగ్రహు లగువారి కట్టి యర్థమె యగు, స
త్యాగ్రహులకు నిల్కడయు న
నుగ్రహ మాసక్తి ధర్మనున్నతయు నగున్.

తే. జయము! శ్రీ గాంధిగురునకు జయము జయము!!
జయము! సత్యాగ్రహశ్రీకి జయము జయము!!
జయము! భారతమాతకు జయము జయము!!
జయము! భారతీయుల కెల్ల జయము జయము!!

పారిశ్రామికవిద్య

బులుసు లక్ష్మణమూర్తిగారు

పూర్వము మన హిందూదేశమందు వర్ణాశ్రమధర్మములు సంపూర్ణముగా ప్రబలియుండెడివి. వర్ణాశ్రమధర్మము లనఁగా వేర్వేఱు జాతులవారు వేర్వేఱు వృత్తుల నవలంబించి అందువలననే జీవయాత్ర చేయుచు, ఒక వృత్తివారు వేఱొక వృత్తిని సాధ్యమైనంతవఱకు నవలంబింపక తమ వృత్తివలననే పొట్ట పోషించుకొనుచుండెడి యేర్పాటు. ఈ మార్గము మంచిదా చెడ్డదా యనునది యప్రస్తుతాంశము. కాని, ఆ యేర్పాటు ప్రబలియుండునంతవఱకు "తాతలనాఁటి పోలిక తరతరములవఱకు" నన్నట్లు వంశములోని మూలపురుషుఁ డొక వృత్తి నవలంబించినప్పుడు వాని వంశీకు లందఱును క్రమక్రమముగా దానినే యవలంబించి యందులో పూర్ణమైన పాండిత్యమును గడించియుండెడి రని మనము తెలిసికొనియున్నాము. అందుననే కాఁబోలు "అల విద్య లెన్ని యేనియుఁ గుల విద్యకు సాటిరావు గువ్వలచెన్నా" యని యొక కవిపుంగవుఁడు వాక్రుచ్చియున్నాఁడు.

ఇట్టి కట్టుబాట్లు హిందూరాజుల కాలమం దేమి వారి యనంతరము వచ్చిన మహమ్మదీయుల కాలమం దేమి పూర్ణముగా నాచరణలో నుండెను. మరియు, వారు ఆయా వృత్తులకు తగినంత ప్రోత్సాహ మిచ్చుచు అవి చెడకుండునట్లు చూచుచుండెడివారు. అంతే కాదు, ఒక వృత్తివాఁ డింకొక వృత్తి నవలంబించుట తప్పుగా పరిగణింపఁబడి యొకప్పు డందులకు శిక్షింపఁబడుచుండెడివాఁడు. ఇక్కారణముననే కాఁబోలు రాజధర్మములలో ముఖ్యమైనది వర్ణాశ్రమధర్మములను రక్షించుట యనియు అట్లు చేయని రాజులు నరకప్రాప్తులగుదు రనియు ఋష్యాదులు శ్రుతిస్మృతిపురాణేతిహాసములందు స్పష్టముగా చెప్పియున్నారు. ఈ సంగతి పంచమవేద మనఁదగిన భారతమును జదివిన ప్రతివానికిని హృదయగోచర మగుచునే యున్నది.

ఇట్టి నిబంధనలతో పరిపాలనము జరుగుచుండినప్పుడు, ఒక వ్యక్తి యొక వృత్తి నవలంబించి యదియే తన జీవనాధార మనియు అది తప్ప వేఱొకటి తనకు తరణోపాయము కా దనియు ఎఱింగియుండినంతవఱకు తాను తన వృత్తికి కావలసిన విద్యయందలి సకలరహస్యముల నామూలాగ్రముగ గ్రహించి వాని నాచరణలోనికి తెచ్చుటయం దేమి యాశ్చర్య మున్నది? అక్కాలమం దొక కుఱ్ఱవాఁడు తన వృత్తిని నేర్చుకొనుటకు తన దేశమును తల్లిదండ్రులను విడిచిపెట్టి వేలకొలఁది ద్రవ్యమును కర్చుపెట్టి పలుబాములుపడి యెక్కడనో యొకచోట సర్కారువారు గగనకుసుమముగా నుంచిన విద్యాశాలకు పోవలసిన పని లేక స్వగ్రామమందే తన యింటనే తన తల్లిదండ్రులయొద్దనే యుచితముగా తనతోడి బాలురతో తనకు కావలసిన విద్యను తన విద్యను నేర్చుకొని తన వృత్తి యవలంబించి కాలక్రమమున శ్రేష్ఠ మయిన పనివాఁ డయి తన దేశమున కాభరణమై తన వృత్తికి వన్నె పెట్టుచుండెడివాఁడు. అప్పు డే వృత్తి చేయుచుండెడివాఁ డా వృత్తియే చేయవలెను, వేఱొక వృత్తికి పోఁగూడదు. కనుకనే కమ్మరిపనివాని వంశస్థు లందఱు కమ్మరులే, కుమ్మరిపనివాని వంశస్థు లందఱు కుమ్మరులే, నేఁతపనివాని వంశస్థు లందఱు నేఁతగాండ్రే. ఇప్పుడో యంతయు కలగాపులగము. ఇదియొక కలగూరగంప. బంగారుపనివాని కుమారుఁడు చాపెపనివాఁడు. ఒట్టలపనివాని పుత్త్రుఁడు చెప్పులపనివాఁడు. బ్రహ్మవిద్యాధురంధరుని కుమారుఁడు తాలూకా కచేరీలో అమీనా. చెప్పులపనివాని కుమారుఁ డప్పము లమ్మువాఁడు. తార్కికుని పుత్త్రుఁడు తళిహాకైంకర్యపరుఁడు. ఇట్లు వ్రాయుటలో ఒకపనివాని కుమారుఁడు వేఱొక పని చేయఁగూడ దని నా యభిప్రాయము గాదు. అందఱు అన్ని పనులు చేయవలసినదే. కాని, యిట్లు చేయుటవలన వంశపారంపర్యముగ వచ్చిన లాభము మాత్ర ముండదు.

పూర్వకాలమం దీ వృత్తులను బట్టియే జనులు పిలువఁబడుచు వచ్చిరి. ఆ వృత్తులే క్రమక్రమముగా జాతులుగా మాఱినవి. అందువలననే నేఁతగాం డ్రందఱు దేవాంగులు సాలీలు. స్వర్ణకారు లందఱు కంసాలులు. కుండలు చేయువాం డ్రందఱు కుమ్మరులు. ఇనుపపనివాం డ్రందఱు కమ్మరులు. ఇట్లే అనేకములు గలవు.

వృత్తు లన్నియు నిట్టి నిబంధనలచే నడుపఁబడుచుండినంతకాలము దేశమునందు దారిద్ర్యమునకు తావు లేదు. ధనమునకు లోటు లేదు. తిండికి కఱవు లేదు. కావలసిన వన్నియు చేతిపనములే. అన్నియు స్వదేశమందును స్వగ్రామమందును దొరకునవే. వేఱొకచోటికి పోనక్కఱ లేదు. ప్రతిగృహము చిన్న యంత్రశాలయే. ఇంటివాం డ్రందఱు పిల్లలనుండి పెద్దలవఱకు పనివాండ్రే. ప్రతిగృహము ఒక కళాశాలయే. ఆ కళాశాలయందు ప్రతివాఁడును విద్యార్థియే. విద్యార్థి జీత మిచ్చుకొన నక్కఱలేదు. అంతయు నుచితమే. ప్రతివాఁడును విద్యార్థియే. ప్రతివాఁడును పనివాఁడే— అనఁగా పని చేయుచు విద్య నేర్చుకొనుచుండెడివాఁడే, విద్య నేర్చుకొనుచు పొట్ట పోషించుకొనుచుండెడివాఁడే. ఈ ప్రకారము ప్రతిపనియు నుభయతారకముగ నుండెడిది. ఇట్లుండినప్పుడు దేశమున చతుష్షష్టికళలును పరిపూర్ణముగ వృద్ధి చెంది దేశము సర్వసంపదల

కాలవాలమై పరిణతోన్నతుల నొసగినదనుటలో నేమి వింత యున్నదని?

అట్టి పరిస్థితులు ప్రబలియుండినప్పుడు దేశమునం దెట్టి ధీశాలు లెట్టి స్వతంత్రులైన కర్మకరులు ఉండెడివారో వారి చేతు లెంత యద్భుతమైన పనులు చేయఁబడుచుండెడివో చెప్పుట చర్విత చర్వణము. సకలప్రపంచమున కాశ్చర్యజనకమైనట్టి తాజమహాలు మయూరసింహాసనము కుతుబమైనరు అశోకుని స్తంభము సోమనాథుని కోవెల బౌద్ధస్తూపములు ఎల్లోరా యజంతా గుహలలోని గుడులు కాశ్మీరశాలువలు ఢక్కా మజిలినులు బనారసు బుటాపని మొన్నమొన్నటి యప్పటి పనితనములే. ఇవి లెక్కింపఁబూనుట యిసుక సైకతరను లెక్కించుటయే.

పరిస్థితులు మాఱి యట్టి కట్టుబాట్లు పోయి వృత్తులన్నియు మూలఁబడి నశించి చేతిపనులు కళ తప్పుటకు కారణ మేమియో ఎంత తీండ్రమగు కారణములో దేశచరిత్ర వేనోళ్ళ చాటించుచున్నది. వారు కూడ తాము చేసిన పనికి లోలోన కుందుచునే యున్నారు. ఈ దేశమునకీ యవస్థ తెచ్చిపెట్టినందునకు వారిని నిందింపవలసిన పని లేదు. భగవంతుఁడే న్యాయాన్యాయవిమర్శనము చేయు నను నమ్మకముతో మనకు కలిగిన ప్రస్తుతావస్థను కాలానుగుణ్యముగా మార్పు చేసికొని మన యభివృద్ధి నొందుటకు ప్రయత్నింపవలెను.

సకలచరాచరజగత్తున కాధారభూతుఁడైన భగవంతుని యుద్దేశములలో నొకటి మన కాంగ్లేయప్రభుత్వము సంభవించుట. వీరి ప్రభుత్వములో మనము చాలవఱకు మేలు పొందియున్నాము గాని పరిశ్రమలు వాణిజ్యము మొదలగువానియందు ప్రస్తుతము తోడి దేశములతో మన దేశము తులఁదూఁగలేకయున్నది. ఇందునకు కారణము లనేకము లుండిన నుండవచ్చును గాని ముఖ్యమైనది మన పురోభివృద్ధిని గూర్చి మనము తగినంత శ్రద్ధ వహించకపోవుటయే యని చెప్పుట నిజమునకు విశేషదూరము గాదు. ఇందునకుఁగాను ప్రభుత్వమును నిందించిన లాభము లేదు. అన్నియు వారే యమర్చిపెట్టవలెనని కోరుట కూడ అంత భావ్యమైనది కాదు. అమ్మ యైనను అడుగనిది పెట్టదు కదా? మనమే మనకు కావలసినవి ఫలానా యని ప్రభుత్వమువారికి నివేదించి అది యొనఁగూడునట్లు ప్రయత్నింపవలసియున్నది. భగవంతుఁ డెప్పుడు ప్రయత్నము చేయువారికే తోడ్పడును.

ప్రపంచమున మనుష్యుఁడు జీవయాత్ర గడపుటకు కావలసిన సాధనములలో ముఖ్యమైనది విద్య. అది లేనివాఁడు పశుతుల్యుఁడని చెప్పఁబడుచున్నాఁడు. కావున, తమ యేలుబడియందు ప్రజలయందలి జీవనము సౌఖ్యాస్పదముగ చేయుటకు కావలసిన విద్య నొసఁగుట ప్రభుత్వమువారి ముఖ్యవిధి. అట్టి విధిని నెఱవేర్చుటకుఁగాను మన ప్రభుత్వమువారు మనకు ప్రస్తుతము ఏడెనిమిది విశ్వవిద్యాలయముల నొసంగియున్నారు. కాని, దేవుఁడు వర మిచ్చినను పూజారి యియ్యఁడన్నట్లు ప్రభుత్వమువారు విశ్వవిద్యాలయముల నొసంగినను ప్రభుత్వసేవకుల సంకుచితదృష్టిచేతను మన దురదృష్టముచేతను అవి తమ విధిని పూర్తిగా నెఱవేర్ప లేకున్నవి. ప్రస్తుతపు విశ్వవిద్యాలయములు ఫ్యాక్టరీలవలె నున్నవి. ఇవి యేఁటేఁట నువేల కొలఁది విద్యార్థులను తయారు చేసి దేశమున కొసంగుచున్నవి. కాని, వీరల కొసంగఁబడు శిక్షావిధానము ననుసరించి వీ రెందునకు పనికి రానివారగుచున్నారని చెప్పుటకు సిగ్గగుచున్నది. వీరు పొందిన పట్టములు (డిగ్రీలు) అలంకారార్థము తప్ప నిజమైన దేశసేవ చేయుటకుపయోగింపఁబడకున్నవి. పాఠశాలలో నుండునంత కాలము తామెందుకొఱకు చదువుకొనుచున్నారో (ఉదరపోషణార్థమని తప్ప) విద్యానంతరము తాము చేయవలసిన కార్య మేమియో వీరి కెంతమాత్రము గోచరమగుట లేదు. ప్రతివాఁడును చదువు చాలించిన పిమ్మట హేయమైన సేవకవృత్తియందు ప్రవేశింపవలెననియు అందుమూలమున కుటుంబపోషణము చేయవలెననియు 'అది తప్ప వేఱొక తరణోపాయము లేదనియు తలంచుచుండును. పట్టపరీక్షాబద్ధులైనను మన యువకు లందఱు ఏ యితరస్వతంత్రవృత్తియు నవలంబింపలేక గౌరవహీనమైన నౌకరీ దొరకునా యని కనిపెట్టుకొని తిరుగాడుచుందురు. అదియు దొరకకల్లాడువారు మన దేశమునఁ గానవచ్చుచుండుట లేదా? ఇట్టి పరిస్థితు లుండునంత కాలము దేశము బాగుపడునని యూహింప వీలు లేదు. సేవకవృత్తియే యాదర్శముగా చదువుకొనువాఁడు తాను సేవకవృత్తియందు ప్రవేశించినప్పుడు తాను విశ్వవిద్యాలయమందు శిక్ష పొందిన యున్నతాదర్శములు స్వతంత్రత నిర్భయత్వము మానవసౌభ్రాతృత్వము మున్నగునవి యాచరణలో పెట్టుటకు వీలు లేక పైవారికి చిత్తమని చెప్పుచు వా రిచ్చెడి తీర్థప్రసాదములచే తృప్తి చెందవలసినదే గదా!

అయినను, గ్రుడ్డిలో మెల్ల మే లనునట్లు కొంతమట్టునకు సేవకవృత్తి సేవగించువారికి వకీలువృత్తి కలదు. ఇది యొక స్వతంత్రమైన వృత్తియే. కాని, ప్రస్తుతము దీని విధాన మంతగా బాగు లేదు. మరియు దేశమునం దెక్కడ చూచినను వీరు తండోపతండములుగా నిండియుండి 'లోన లొటారము పైని పటారా' మన్నట్లు వేషము వేయుచు తిండికి లేక మాడుచున్నారని చెప్పుచున్నందునకు నా భ్రాతృవర్గము నన్ను మన్నించును గాక !

ఇదంతయు నిటుండ, దొరతనమువారు మాత్రము తమ దేమియు లోటు లేదని చెప్పుటకో యనునట్లు అక్కడక్కడ నొకటి రెండు కార్మికవృత్తులకు కావలసిన విద్యావిధాన మొసఁగఁదగిన పాఠశాలలు తమ విశ్వవిద్యాలయముల కంగములుగా నుంచియున్న మాట వాస్తవమే గాని, ఇవి గాని వీని యందలి విద్య గాని సామాన్యప్రజల కందుబాటులో లేదు. వీనియందు చదువుటకుఁ గల యితరకష్టము లటుండ విద్యార్థి ముందపరిమితమైన ధనవ్యయము చేయవలసియున్నది. తిండికి లేని నిర్భాగ్యుఁడు ధనము సేకరించు టెట్లు? మరియు, వీరు నేర్చుకొను శాస్త్రజ్ఞానము కూడ నంతగా నుపకరించునది గాదు. దొరతనమువారిచే తయారు చేయఁబడిన యిప్పటి యింజనీర్లు నేత పరిశ్రమల సూపరువైజరులు మొదలగువారు బూటు కోటు వేసికొని బైసికిలు లెక్కి తిరుగుచు దొరతనము

చేయుట కలవాటుపడినవారే గాని, సమయము వచ్చినప్పుడు మన యింజనీరు తాపీపని చేయలేడు, శస్త్రపరిశ్రమాధికారి యొక్క గావంచా యైనను నేసి యియ్యలేడు. ఇట్టి విధానము నిజమైన శాస్త్రజ్ఞానమో బూటకమో పాఠకులే యూహించుకొందురుగాక!

సంగతు లిట్లుండ మూలిగెడి నక్కపై తాటికాయ పడ్డట్లు యుద్ధము సంభవించినది. యుద్ధము మిత్రమండలికి జయప్రదముగా పరిణమించినందులకు యిందులో మనము సంతోషించుచు దైవమునకు కృతజ్ఞులమై యుండవలసినదే గాని, రాఁబోవు సంధిసభలో మాత్రము మనము వెనుకకు త్రోక్కఁబడి మనకు నొరకునది శూన్యమగునేమో యని ప్రస్తుతము మనము నిరాశ చెందుటకు తగిన కారణము లగపడుచున్నవి. తినఁబోవుచు రుచు లెందులకు? ప్రాపంచిక శుభమునకై తనచే ప్రతిపాదింపఁబడిన పదునాలుగు సూత్రములను విల్సను మహాశయుఁడు మనయం దెట్లనువర్తింపఁ జేయునో చూడవలసి యున్నది.

ప్రస్తుతాంశమును గురించి యాలోచించినప్పుడు ఈ యఖిల ప్రపంచనాశనకరమైన యుద్ధము మన మంచికొఱకు వచ్చినదేమో యనునట్లున్నది. నిజముగా మన కిది యొక్క ప్రచ్ఛన్నమైన యాశీస్సువలె నున్నది. కారణ మేమన, ఈ యుద్ధములో మన స్వశక్తి బయలుపడినది. తగిన యవకాశములనొసంగినచో భారతజాతి ప్రపంచమునందలి యే యితరజాతికిని తీసిపోదని సాటి చెప్పుటకు మన కవకాశము కలిగినది. మన ప్రతిపక్షులు కూడ మనలను చూచి సిగ్గు చెందవలసినవారైరి. ఈ యుద్ధము మన శక్తిని మన కార్యదీక్షను మన యాత్మత్యాగమును మన యైకమత్యమును బయలుపెట్టినట్లే మన నిస్సహాయత్వమును మన యలసతను మన దారిద్ర్యమును కూడ బయటఁబెట్టినది. మనము చేయఁదలఁచుకొన్నను మన కవకాశములు లేవని తెలియఁజేసినది మన కొసంగఁబడు విద్య కేవల మసంపూర్తియైన దనియు మనల నెందునకును పనికిరానివారినిగా చేసిన దనియు నొక్కి చెప్పుటకు తగిన యవకాశము మన కొసంగినది.

ఈ యుద్ధమువలన మన దేశములో ధర లపరిమితముగా పెరిఁగినవి. బట్టలు కాగితములు మొదలగువాని ధర నాలుగయిదు రెట్లు పెరిఁగినది. యుద్ధమునకు ముందు కానికి మూడగ్గిపెట్టెలు. యుద్ధము వచ్చిన తరువాత రెండు కాసుల కొకటి. లోహములు మొదలగువాని ధరలను గూర్చి యిఁక చెప్ప నక్కఱయే లేదు. ఈ ప్రకారమే ప్రతివస్తువు ధరయు నాలుగయిదాఱు రెట్లవఱకును కొన్నిటి ధర యింకను నెక్కువగను పెరిఁగిపోయినది. బీదలకును సామాన్యులకును జీవనము జరగక దినము గడచిన దీర్ఘాయు వన్నట్లున్నది. మరియు, ఈ యవస్థ చాలదో యనునట్లు దేశములోనికి ఇన్‌ఫ్లుయెంజాదిరోగములు ప్రవేశించి దేశమునం దపరిమితమైన మరణములు కలుగఁజేయుచున్నవి. ఈ రోగములకు మం దిచ్చు దాత కూడ లేఁడు. సమయమునకు తగినట్లు దేశమున క్షామదేవత ప్రవేశించి తన యిచ్చ వచ్చినట్లు తాండవమాడుచున్నది. కొన్ని చోట్ల అతివృష్టిచేతను కొన్ని చోట్ల అనావృష్టిచేతను పంటలు పూర్తిగా పాడయి పోయినవి. పొట్టి పంట కూడ ఈ సంవత్సరము పండ నున్నటుల వీలు లేదు. పల్లపు పంటలే గాక మెరక పంటలు కూడ పోయినవి. మహానగరమునసే కొన్ని ప్రదేశములందు త్రాగుటకు నీరు లేదని వ్రాయవలసివచ్చినప్పుడు ఇఁక మిగులు దేశమాత్ర యెట్లుండునో చెప్పవలసిన దేమున్నది! ప్రజలు తిండి లేక మలమల మాడిపోవుచున్నారు. మంచి కాలమందే మన దేశములో సగముమందికి ఒక్కపూట భోజనము దొరకుట కూడ దుర్లభ మయినప్పుడు ఇప్పటి గతి వర్ణింప నెవరి తరము? ప్రజ లెట్టి యిక్కట్టులకు లోనగుచుండినను పన్నులను మాత్రము ఎప్పటివలెనే రివిన్యూ అధికారులు వసూలు చేయుచున్నారు. రెమిషనులను గురించి ప్రభుత్వమువారేమియు ఆలోచించునట్లగపడదు. రెమిషను ఇచ్చినను ఇయ్యకపోయినను పన్ను మాత్రము ముందుగా చెల్లింపవలెను. ఇప్పటికే పన్ను లెక్కువైనవని ప్రజలు ఘోషిల్లుచుండ ముందుముందు పన్ను లింకను హెచ్చగు నని భయపడుటకు కారణము లగపడుచున్నవి. దొరతనమువారిప్పుడే నీటిపన్ను జాస్తి చేయుటను గురించి యాలోచించుచున్నారు. ఈ సమయములో వృత్తులు పోయినవి. కూలివానికి పని లేదు. బట్టల నేత మొదలగు పరిశ్రమలు పూర్తిగా నశించి వారు జీవనము జరగక సకలవిధము లైన యిబ్బందులకు లోనగుచున్నారు. మొత్తముమీద దృష్టి యే వైపు త్రిప్పినను, "పెద్దమ్మ నాట్యమాడెను దిద్దిమ్మని వణ్ణవాయ తిమ్మని యింటన్" అన్నట్లు దారిద్ర్యదేవత స్వస్వరూపధారిణియై చిందులు త్రొక్కుచు దేశమునం దొకకొననుండి యింకొకకొనవఱకు తాను విచ్చలవిడిగా సంచరించుటకు ఇన్నాళ్లకు తగిన సమయము తటస్థించెను గదా యని సంతోషముతో చిక్కిన సమయమును పోఁగొట్టుకొనక దేశమును బీభత్సవము చేయుచు నఖండముగ తాండవమాడుచు విజృంభించుచున్నది.

ఈ యదనున మనము మన జీవనము వైపు దృష్టి మరల్చి మన నిత్యకృత్యములకు కావలసిన వస్తువులను గురించి కొంచె మాలోచింతము. మన నిత్యకృత్యములకు కావలసిన కాగితములు కలములు పాళీలు పెన్సిళ్లు సిరా అగ్గిపెట్టెలు బట్టలు అద్దములు పంచదార ఉప్పు వేయేల కావలసిన సమస్తవస్తువులు మన కన్యదేశములనుండి రావలసినవే. పరదేశీయులు భిక్ష పెట్టనిచో మనము పస్తుండవలసినదే. స్వదేశములో ఒక్క వస్తువును, ఏ కారణముననైన నేమి, తయారగుట లేదు. తయారగునది చాలదు, అంత యుత్కృష్టముగా నుండదు. మరియు, ధరలలో పరదేశముల పోటీ కాఁగలేక తహతహలాడుచున్నది. ఈ వాక్యముల సత్యాసత్యవిమర్శనము చదువరులే యూహించుకొనెదరుగాక! అవశ్యమైనచో, యుద్ధపుదినముల నాఁటి మన యవస్థను దలఁచుకొనుఁడు. గుండెలు ఝల్లు మనుచున్నవి. నిజముగా నిట్టి శోచనీయమైన దశ శత్రుదేశములకైనను రాఁగూడదు.

ఇట్టి పరిస్థితులు కలుగుటకు కారణము లేవియో కొంచము విమర్శింపఁబూనుదము. దేశము చిన్నది యేమో యనినయెడల, ఆసేతుశీతనగపర్యంతము వ్యాపించి పెక్కు వేల చదరపు మైళ్ల వైశాల్యము

గలిగి నదులు కొండలు అడవులు మొదలగున వెన్నియో కలిగి ప్రకృతిశోభచే ఇలరారుచు ప్రపంచమునం గల దేశములలో నద్వితీయమై వన్నెకెక్కినది గదా యీ హిందూదేశము. మరియు, ఖనిజములచే నేమి సస్యసంపదలచే నేమి కావలసిన తక్కిన పక్వపదార్థములచే నేమి విలసిల్లుచు సర్వసంపత్కర మైనదిగా ప్రతిమనుజుని దృష్టికిని గోచరించుచున్నది గదా! ఇట్టి దేశములో నున్న మనము యుద్ధపు దినములలో వస్తువులు చిక్కక చిక్కుపడుచున్న మనము మన కున్న యవకాశములను ప్రభుత్వమువారి సాహాయ్యముతో సరిగా నుపయోగించుకొనియుండినయెడల, కావలసిన వస్తుసామగ్రిని మన దేశమున నింపుకొనుటయే గాక యితరదేశములకును పుష్కలముగా పంపఁగలిగి భాగ్యముతో తులఁదూఁగియుందుము. కాని, దొరకిన యవకాశమును సరిగా వినియోగించుకొనలేక మనము గుటకలు వేయుచు మిణుకు మిణుకు మని చూచుచుండఁగా, కొన్ని యితరదేశములు అందులో ముఖ్యముగా జపాను దేశము మన దేశము నాక్రమించి మార్కెట్టులను కొల్లగొనుచున్నది. దేశములో నెక్కడ చూచినను జపాను వస్తువులే. ఏ మూల చూచినను జపాను ప్రతిభయే! ఈ జపాను వస్తువులం దింకొక విశేషము గలదు. ఉపయోగములో పనికిమాలిన వైనను ధరలో మాత్రము ఖరముగా నుండును.

భారతీయు లందఱు మేల్కొని యెవరికి వారు తమకును తమ దేశమునకును కావలసిన సమస్తోపకరములను పరాపేక్ష లేకుండ స్వదేశమందు గూర్పఁ బ్రయత్నించుచున్నారు. దాని కనుగుణముగా పారిశ్రామికవిధానమును ప్రభుత్వమువారు ఇకముందు కార్యాచరణమునఁ బెట్టుదు రని తెలియఁజేయుటకై రాజప్రతినిధి గారును సర్ థామస్ హాలండు గారును కలకత్తా చెన్నపట్టణ విశ్వవిద్యాలయోన్నతపీఠములనుండి ఆయా విశ్వవిద్యాలయముల స్నాతకమహోత్సవ సందర్భమున ఘంటాపథముగా చాటి చెప్పినారు. అది వినిన యువకుల దేహము పులకరించుచున్నది గదా!

కనుక నికముందు దొరతనమువారు తమ శక్తివంచన లేకుండ పరిశ్రమల స్థాపించుటకును అందుల కవసరమైన విద్యావిధాన మేర్పఱచుటకును తగు నేర్పాట్లు వెంటనే గావింతు రని మన మూహింపవచ్చును. ఇఁక దొరకిన సమయమును వ్యర్థపుచ్చక కార్యభారమును మన యువకులు ముఖ్యముగా విద్యార్థులు వహింపవలసియున్నది. ఇది సమకూడు టెట్లని తర్కించుట తరువాతి విషయము. ప్రభుత్వమువా రిప్పటివలె నక్కడక్కడ నొకటి రెండు పారిశ్రామికకళాశాలలను తెఱచుట నిరుపయోగము. అధమపక్షము జిల్లా కొకటి యైన నుండున ట్లేర్పాటు చేయవలెను. మరియు విద్యార్థులను రాఁబట్టుటకై విరివిగా విరాళముల నొసంగవలెను. వారినుండి భస్మాసురవరములను గోరక విద్యార్థులకు తగిన లిరిబీదు నిచ్చి కృతార్థులను చేసి దేశమున కొసంగవలెను. లేనియెడల, ఈ వాగ్దానము కూడ ప్రభుత్వమువారి యితరవాగ్దానములవలె చిలుకపలుకుల రూపము దాల్చి నిర్గంధకుసుమమువలె యథార్థము గాకయుండును.


ఇదంతయు చెప్పుట సుకరమే యైనను చేయుట బహుదుష్కరము. ఈ పని యొక్క ప్రభుత్వమువారిపైనే నెట్టిన సుకరముగా నెఱవేఱఁజాలదు. దేశమునందు పెక్కురు రాజాధిరాజులు కోటీశ్వరులు లక్ష్మీపుత్రులు స్వార్థత్యాగులు గలరు గాని లేకపోలేదు. ధనమూల మిదం జగ త్తన్నట్లు ఏ పనియైనను ధనము లేకుండ కాఁజాలదు. కనుక దేశములోని భాగ్యవంతులు గూడ కార్యభారమును ప్రభుత్వమువారితో సమానముగా వహించి తమ సంపదను తమ ధనమును తమ పలుకుబడిని పరిశ్రమలకు వినియోగపడునట్లు చేయవలెను. వీరు కూడ సాధ్యమగునంతవఱకు పారిశ్రామిక కళాశాలలను విరివిగా స్థాపించుట విద్యార్థివేతనముల నిచ్చుట పారిశ్రామిక ప్రదర్శనములను గావించుట మొదలగున వెన్నియో చేయవలెను. వీని యన్నిటికంటె ముఖ్యమైన దింకొకటి కలదు. అదియేదన, విద్యార్థు లెట్లయిన విద్యావిధాన మలవఱచుకొని పరీక్షలయం దుత్తీర్ణులై యేఁటేఁట బయలువెడలుచుందురు గాని వీరు పారిశ్రామిక యంత్రాగారములను స్థాపింపఁజాలరు. ఇందున కపరిమితమైన ధనము కావలెను. వీరికి మదుపు లేదు. కావున, ధనవంతులు తమ ధనమును మదుపుపెట్టి అనేకమైన యంత్రాగారములను కర్మాలయములను స్థాపించి యీ విద్యార్థులకు పని కలుగఁజేయవలెను. అప్పుడే యీ విద్యయొక్క నిజమైన యుపయోగము కనఁబడును. మరియు, ధనికులు తమ ధనము నిట్లుపయోగించుటచే తాము తరించి యితరులను తరింపఁజేయుదురు. ఇట్టి యేర్పాట్లు పూర్తిగా జరుగునపుడే దేశ ముద్ధరింపఁబడును. కావున, నో దేశాభిమానులారా! స్వార్థత్యాగులారా! మీరు వెంటనే సిద్ధపడి కార్యాచరణమునకుఁ గడంగుఁడు. వెనుకంజ వైవకుఁడు. జంకవలసిన యవసరము లేదు. దైవము మీపాలఁ గలఁడు. కార్యశూరులై దేశసేవ చేసి భారతమాత నుద్ధరించి పుణ్యము గట్టుకొనుఁడు.

Mr. K. Subbarayudu.



కొరళ్ల సుబ్బారాయుడుగారు.

Mr. K. Venkatalingam.



కొరళ్ల వెంకటలింగము గారు.

Mr. D Seshacharlu.



బాలకలానిధి డి. శేషాచార్యులుగారు.

Pandit N. Subramanya Sastrulu.



నోరి సుబ్రహ్మణ్యశాస్త్రులవారు.

M· Hari Lal.



హరిలాలుగారు.

Mr. K. Ramachandra Sastri.



కూరాడ రామచంద్రశాస్త్రులవారు.

Sujana Ranjani Samajam: Potlapudi.



సుజనరంజనిసమాజము: పొట్లపూడి.

The First Nellore Audivelama Sabha.



నెల్లూరు ఆదివెలమ మహాసభ.

Andhra Research Sociaty, Pithapuram.



ఆంధ్రపరిశోధకమండలి మహాసభ, పిఠాపురము.

Andhra Seva Samajım Free School, Benares.



ఆంధ్రసేవాసమాజపు ధర్మపాఠశాల, కాశీక్షేత్రము.

కృష్ణరాయనిర్యాణము

శతావధాని దివాకర్ల తిరుపతిశాస్త్రి గారు

ఏరా కాపాడుదు మా కొడుకుఁడు
మా కాలంబరబు రాజమౌక్తిక మపుడే
నాకాలయమున కరిఁగెన్
మా కృష్ణారాయభూమినాథుం డకటా! ౧

సీ. నాగరాజాదిజన్మస్థాన మైన సె
ద్దాడవంశాబ్ధి నుద్భవము చెంది
శ్రీకామమాంబికా శ్రీకరపాణిపో
షణశాణకషణసంస్కార మంది
కొచ్చెర్లకోటాన్వయోచ్చమౌక్తికహార
మునకుఁ బేరిడు మణిపూస యగుచు
పరుషహూణాంధ్రగీర్వాణభాషాంగనా
కంఠసీమల కలంకార మైన
రామచంద్రవేంకటకృష్ణరాయనామ
క మగు మగరా జయం బధికముగఁ గాంచు
టకును మాఱుగ మసి యయ్యె నకట! కాల
యుక్తివత్సరమునఁ గాలయుక్తిఁ జేసి. ౨

సీ. పదిమంది యైనను బంతిని లేకుండ
భుజియింపనేరని పుణ్యమూర్తి
అపకార మొనరించునతఁ డేఁగుదేనైనఁ
గోపంబుఁ జూపని ప్రాపకుండు
అలవి గాని ప్రచార మడుగువారల నేని
లేదు పొమ్మనలేని సోదరుండు
ఆశ్రయించినవారి యపరాధ మెంతైన
స్మరియింపనొల్లని సజ్జనుండు
చదువుల టీకాణ కరుణ లొచ్చని దుకాణ
మాప్తజనముల ప్రాపు సత్యముల కాపు
నాకమున కేఁగె నఖిలలోకైకనుతుఁడు
తృష్ణలకు వేల్పుటాపు మా కృష్ణరావు. ౩

తే. శనిమహాదశ మంచి యుచ్చదశ యంచు
పలుకు కార్తాంతికుల పల్కుబడు లనృతము
లనఁగ శనిదశలోని శన్యంతరమునఁ
గుజుఁడు పాపాత్ముఁ డఁగుచు మా కొంప దీసె. ౪

సీ. కలకల నవ్వు మీసల మోసల నటింప
రా జనందగు ముఖప్రభలతోడ
సమయానుసారిగా నమృతంబుఁ జిలికించు
వదనగంభీరనిస్వనముతోడ
అష్ట లేతేర రం డంచుఁ గుర్చీ కేలఁ
జూపించు వినయవిశ్రుతులతోడ
కరుణ చిందించు క్రేఁగంటిచూపులు మీఱి
నలువంకఁ గను లోచనములతోడ
సౌధచత్వరమునఁ గొల్వుసాలయందుఁ
బడుక వేత్రాసనంబునఁ బ్రౌఢి మీఱి
యుండు నీ రూపు నీ నగ పూర్జితోక్తు
లెట్లు మఱపింతువయ్య యో కృష్ణరాయ! ౫

చ. వను వగు వాణిముత్తెము లనందగు నక్షరపంక్తి మీఱ వం
చిన వశు మెత్తకుండఁగ మషీజలపూరిత మైన మేటి లే
ఖినిఁ గొని వేయి చేతుల లిఖించినయట్లుగ వ్రాయు కృష్ణరా
డ్జనవిభుఁ బోలు లేకరి నిజంబుగ నింక ధరన్ జనించునే? ౬

సీ. శ్రీమత్త కలిగియుఁ జెన్నపట్టణకళా
శాల బీయే గాకఁ జదివినావు
చదువుటే కాదు భాషాసాగరం బెల్లఁ
గుంభసంభవు రీతిఁ గ్రోలినావు
క్రోలుటే కాదు పెక్కులు గ్రంథములు గొని
గ్రంథాలయంబు నేర్పఱచినావు
శాసనసభలోన సభ్యతాపదవి కొం
చెము తక్కువా పేండ్లు చేసినావు
పొందుకొనినావు సుగుణసంపద సమస్త
హృదయసీమలయందు సహృదయుఁడట్లు
నీకు లో టేమి మే మెల్ల నిన్నుఁ బాయు
పాప మొనరింపఁగాఁ గృష్ణపార్థివేంద్ర! ౭

చ. విలవిల యేడ్చుచుం బ్రజ "వివేకవిహీనుఁడు మంచి చెడ్డ నే
తల నెఱుఁగండు మూర్ఖుఁ డతిదారుణచిత్తుఁ" డటంచు రోయఁగా
నలువది యెన్మి దేండ్లకె వినాశము నీకు ఘటింపఁ జేసి యా
నలువ పడెన్ వృథా జనులు నల్గురనోటను గృష్ణభూవరా! ౮

ఉ. చూచితి వెల్ల దేశములఁ జొచ్చితి వెల్ల సభల్ నరేంద్రులం
జూచితి వెల్లవారలను సూరుల సత్కవులం దయామతిం
జూచితి వింద్రలోక మిఁకఁ జూడని దొక్కటి యంచు నేఁగఁగాఁ
జూచితి వేమొ లేక విధిచోదితమో యిది కృష్ణభూవరా! ౯

సీ. పతిభక్తి నిత్యదైవతపూజ యతిథిస
త్కారంబు వ్రతసంవిధానదీక్ష
మొదలైన సుగుణముల్ పుంజీభవించిన
యద్వితీయ కటా! భవద్ద్వితీయ
యిరువది యారేండ్ల యింతి కెక్కుడ వ్రాసె
వైధవ్యయోగ మా వనజభవుఁడు
అనుమాయితి తప్పదా యేమి కానుండెఁ
గాఁబోలు రెండవ కామయాంబ
నీకు నీ తండ్రి పోలిక నీ పురంధ్రి
కరయ నీ తల్లి పోలిక యన్ని గతుల
నబ్బె దివినుండి దీవింపుమయ్య కృష్ణ
రాయ కలుఁగంగఁ గొదువ సర్వంబు మాకు. ౧౦

తే. నీవు చదివిన గ్రంథముల్ నీవు ప్రోవు
చేసినవి కాఁడ పదుగురు చేరి చదువఁ
దగిన వని యెంచి కాంగ్రోలు ధర్మపుస్త
కాలయము చేసినావు కృష్ణావనీంద్ర! ౧౧
తే. రావుబహదూరు లున్నారు రాజమాన్య
రాజపూజితు లున్నారు పూజనీయు
లైన మా కాకినాడ చంద్రాస్తమయము
నాఁటి రాతిరి యయ్యెఁ గృష్ణక్షితీంద్ర! ౧౨
ఉ. లోపములం చెదో యొకటి లోకములోపల లేనివాఁడు లేఁ
డే పని చేసినం బరుల కెన్నఁడు హానిఁ దలంప వీవు వి
ద్యాపటుసంపదల్ గల మహాత్ముఁడు సర్వజనోపకారచిం
తాపరుఁ డన్న ఖ్యాతి విడిన న్నిను వీడదు కృష్ణభూపతీ! ౧౩
సీ. బహుకుటుంబములను భరియించితివి తత్త
దనుగుణగౌరవోపాధు లొసఁగి
పెక్కుమందిని జదివించితి వన్నవ
స్త్రంబులు పుస్తకాలు జీతంబు లిచ్చి
చాలమందికి మేటి సౌహార్ద మొసఁగితి
వడిగిన సర్వకార్యములు దీర్చి
కాపట్య మెఱుఁగని కరుణఁ జూపించితి
వాశ్రితకోటిపై నాప్తులందు
అరిగితివి చెన్నరాష్ట్రంబునందు ఘనుల
యందుఁ దలమానికంబు ధరాధినేత
పండితుం డన్న ఖ్యాతి తోడ్పడఁగ రామ
చంద్రవేంకటకృష్ణరాయేంద్ర దివికి. ౧౪
ఉ. మంచముమీఁదఁ గాలిడె నమాసనిశీథిని నాఁటినుండి బా
ధించె జ్వరంబు భూతమయి తీక్ష్ణతరంబుగఁ గొన్ని నాళ్లు వే
ధించెను నూపిరి న్విడుచు తిత్తు లబింధనమాత్రవస్తు ల
క్ష్యంచిత మైన కృష్ణనృపు ప్రాణముఁ దీసె ని వెల్ల నేకమై. ౧౫
సీ. హృదయంబు శోధించి పదురు నంచు వచించు
నావల నాశ లే దనుచు నుడువు
పట్టిచ్చె మం దంచు నట్టె సంతోషించు
జ్వరము హెచ్చె నటంచుఁ బరితపించు
నాయుకోశము భగ్న మాయె నంచుఁ గృశించు
వగరుపుఁ గన్గొని భయముఁ జెందు
జీర్ణకోశము కొంత చెడె నంచు దుఃఖించు
జ్వరము లే దని యెంచి సంతసించు
ఇట్టులై దారు దినము లనేకగతులు
మాపు రోగంబు మరలింపనోపఁడయ్యె
పురభిషజ్మణి యట్టి దుస్తరగదంబు
విడచెఁ దృటిలోన కృష్ణపృథ్వీకళత్ర! ౧౬
సీ. శతవధాన మొనర్ప సరసులు కబు రంపఁ
బంపకుండఁగ మానిపింపలేదు
సర్వదేశంబుల సభలకుఁ బోవుచో
వెంట ర మ్మనకుండ విడువలేదు
పీఁటపైఁ గూర్చుండి పిలువ నంపకయుండ
నే దినంబును భుజియింపలేదు
మొదటినుండియుఁ దుట్టతుదదాఁక నొక రీతి
గురుభావమున లోటు జరుపలేదు
ఇట్టి రీతిగ పదునెన్మి దేండ్లు జరిపి
కృష్ణభూపాలకుఁడు దివి కేఁగె నేఁటి
కాయనకు నాకుఁ గల్గు ఋణానుబంధ
మక్కటా దైవదౌర్బల్య మణఁచివైచె. ౧౭
సీ. ఆత్మకూరున్నపాలుఁ డాస్థానకవులు కం
డంచుఁ బెన్భక్తిఁ బ్రార్థించినపుడు
గద్వాలరామభూకాంతుండు మున్నగ్ర
హార మిచ్చెద నండు మన్నయపుడు
ఇతరభూపతు లెంద ఱెందఱో తమయొద్ద
నుంచుకోఁదలఁచి పిల్పించినపుడు
సారశాలలయందుఁ బండితపదవిఁ గై
కొనఁ డంచుఁ బౌరులు కోరినపుడు
కృష్ణభూపాలగుణకలాపకీలితుండ
నగుచుఁ గదలఁగలేనైతి నకట యట్టి
పండితుం డైన బ్రాహ్మణప్రభు వుపాస్య
సుగుణుఁ డింకెవ్వఁ డున్నాఁడు జగతియందు? ౧౮
తే. సకలసద్గుణరాశిని సకలలోక
నుతునిఁ బండితు విప్రభూపతిని గృష్ణుఁ
గంటి వను సద్యశము గంగఁ గలిసిపోవఁ
గాటి కంపితివే పాడు కాకినాడ! ౧౯
సీ. రచియించినాఁడ బుద్ధచరిత్ర కృతి గాఁగ
మేలి నాటకములు మృచ్ఛకటిక
బాలరామాయణపాండవవిజయము
ద్రారాత్మసేద్వర్డు రాజకాళి
పట్టాభిషేకముల్ పావనయుష్మదా
ఖ్యాభూషితంబులుగా నొనర్చి
నీ కీర్తికాంత కీ లోకంబునందు వ
సించు సౌధంబు నిర్మించినాఁడ
పండితుఁడు కవి మిత్రుండు బాంధవుం డ
నంగ మెలఁగితి దానికి నాకు నీవు
చేయు ప్రత్యుపకార మిదేనా మహాత్మ
వదలి దివి కేఁగుటా కృష్ణవసుమతీంద్ర! ౨౦
శా. ఆనందాత్ముఁడవై సుఖింపుము మహాత్మా! సత్యలోకంబునం
దో, నాకంబుననో, వికుంఠనగరీదుర్గంబునందో, శివ
స్థానంబందుననో, సమస్తసురసంస్థానాధిపత్యంబుతో
నానావైభవయుక్తితో నెపుడు కృష్ణారాయభూపాలకా! ౨౧

జయంతి భావనారాయణకవివర్యుని జీవితచరిత్రము

పులవర్తి హేమలింగమూర్తి గారు

ప్రస్తుతకాలమున ఆంధ్రభాషాభివృద్ధికై తమ జీవితములను ధారవోసిన కవిపుంగవులు నెక్కురు గలరు. వారు సర్వజనపూజితులు. అట్టివారిలో జయంతి భావనారాయణ గారొకరు. ఆ మహాత్ముని జీవిత మనేకవిధముల దేశాభ్యుదయ కారణభూతము.

గోదావరీమండలమున కౌశికానదీతటంబున 'మోడేకుఱ్ఱు' నాఁ బిలువఁబడు నొక పల్లె గలదు. అది యమలాపురంబునకుఁ బది మైళ్ళ దూరమునను క్రొత్తపేటకు నాల్గు మైళ్ల దూరమునను గలదు. సుమారు క్రీ. శ. 1790-వ వత్సరమున జయంతివారి కుటుంబ మా గ్రామమును నివాసస్థానముగ నేర్పఱచుకొనెను.

కాకినాడ తాలూకాలో 'దక్షిణకాశి' యని సుప్రసిద్ధి వహించిన ద్రాక్షారామమునకుఁ జూపుమేర దూరమునఁ గల 'అంద్రంగి' యను గ్రామమున జయంతి గణపతి గారు సుమారు 1775-వ వత్సరమున జన్మించిరి. సంగీతశాస్త్రమునఁ బ్రత్యేకమతము నొకదానిని స్థాపించి యా శాస్త్రమునఁ దమకుఁ గల నిరంకుశప్రజ్ఞావిశేషంబుచే 'నంద్రంగి' యను నగ్రహారంబు నార్జించి శాశ్వతయశోవిరాజితులయిన నిట్టల సోమనాథభట్టు గారి కుటుంబమునకును జయంతివారి కుటుంబమునకును దగ్గఱి బాంధవము గలదు. కుటుంబసంబంధములును జన్మస్థానాదిపరిస్థితులును జయంతి గణపతి గారి నతిబాల్యముననే చక్కని పండితునిఁ గావించెను. ప్రయాణసౌకర్యములు లేని యా కాలమున నయిత మాయన కీర్తి గోదావరీమండలమునం దంతటను వ్యాపించెను. ఆయనకుం గల సంగీతవిద్యాపాటవమున కనుగుణంబులగు యశఃకాంతానాట్యరవంబులు 'మోడేకుఱ్ఱు' నివాసి యగు తంగిరాల భావప్ప గారి కర్ణవీథులం బడెను. ఆయనయు వేదవేదాంగాదివిద్యల నభ్యసించిన కోవిదు లౌటచేఁ దమకుఁ గల 'సుబ్బమ్మ' యను పుత్రికను గణపతి గారి కిచ్చి పరిణయం బొనర్చి యాయనను దమ యింటి కిల్లఱికము దీసికొనిపోయిరి. ఆ గణపతి గారే 'మోడేకుఱ్ఱు' గ్రామమున వసించిన జయంతివారిలో మొదటివారు. ఆయనకు 'భావప్ప' 'మల్లప్ప' గార్లను నిరువురు పుత్రు లుదయించిరి. అందగ్రజు లయిన 'భావప్ప' గారికి 'మీనాక్షమ్మ' గారను ధర్మపత్నియందు 'రామయ్య' 'జగ్గయ్య' 'వెంకయ్య' గార్లను సుతులుద్భవించిరి. అగ్రజు లగు 'రామయ్య' గారు వేదవేదాంగాదివిద్యల నభ్యసించి సాలగ్రామాదిక మైన పరిగ్రహింప నొల్లక పవిత్రజీవను లయి విరాజిల్లుచుండెడివారు. మోడేకుఱ్ఱున కనతిదూరమునఁ గల 'యిరుసుమండ' యను గ్రామమునందలి 'ఆకెళ్ల'వారి కన్యకను వెంకమ్మ గారిని రామయ్య గారు వివాహము చేసికొనిరి. వారిరువురకును జయంతివంశపయఃపారావారరాకాసుధాకరుండును కవికులభూషణుండును అక్షయయశోవిరాజితుండును నగు భావనారాయణ గారు 'అక్షయ'నామసంవత్సర జ్యేష్ఠమాసమునకు సరియగు క్రీ. శ. 1867-వ వత్సరము జూను నెలయందు పితృగృహంబున జనించిరి. ఆ భూసురోత్తముఁడు వైదికుఁడు, కౌశికసగోత్రుఁడు అపస్తంబసూత్రుఁడు.

భావనారాయణ గారు పుట్టిననాఁటికి దేశోపద్రవకరంబులగు కాటకములును తుపానులును గతించినవి. దేశమున నూతనోత్సాహనామకభానూదయం బగుటచే మానవమానసాంబుజములు వికసింపఁ దొడంగెను. బహువిధవిపత్పరంపరలచే నల్లకల్లోలము నొంది విద్యావిశేషంబులం దమ తొంటి గౌరవమును గోలుపోయిన తన చిన్ని పుత్రులకు భారతమాత నూతనసందేశము నంప మొదలిడినది. కృషిజీవను లగు మాతాపితలు తమ సూనుల సూరివరేణ్యులం జేయ నుద్యమించిరి. ప్రస్తుతకథానాయకు లగు భావనారాయణ గారు భారతమాతృ యశోగీతికలం బాడ జనించిన ముద్దుబిడ్డలు. శైశవమునందలి గుణవిశేషములం బట్టియు స్వరూపాతిశయంబు ననుసరించియు నై విషయమును గ్రహించి రామయ్య గారు తమ పుత్రుని 'పప్పప్ప' యనవలసిన పొలములకు మాఱు పాఠముల నేర్వవలసిన బడికిఁ బంపిరి. దినదినంబును గురుదత్తయైన యశోలక్ష్మి చేఁ జిక్కుచుండుటచే భావనారాయణ గారు చుక్కకు మిక్కుట మగు కాంతివంతు లయి హస్తంగత యగు సిరి నుచితపోషితం గావించి మించి రనుట కాయన జీవితమే ప్రబలనిదర్శనము. ప్రతిదినమును బడికిఁ దోలుదోలుత పోవుచు గురునిచే 'సిరి' యక్కరంబుల చేత వ్రాయించుకొనిననాఁటి యుత్సాహ మాయన మనంబున సదా తాండవమాడుచుండెడి దనుటకు 'రాజపుత్రద్వయవిలాసము'నందలి

సీ. "సిరి దెబ్బలకుఁ గనుల్ చే నల్పుకొంచును
బాలకుల్ బడులకుఁ బరువులెత్త
... ...
తత్ప్రభాతంబు సంతోషదాయి యయ్యె."

ననెడు ప్రభాతవర్ణనమే బలవత్తమనిదర్శనము. అక్కవివరేణ్యుఁడు పిన్నటనాఁటినుండియు విద్యల నేర్చుటయం దమితోత్సాహము గలిగి యా గ్రామమునందలి బడిలో నేర్వవలసిన దంతయు నక్రమంబున నేర్చుకొనియె. కులక్రమాగతాచారము ననుసరించి యాయనకు గర్భాష్టకమున నుపనయనసంస్కారము గావింపఁబడినది.

కవివరేణ్యుని పినతండ్రి వెంకయ్య గారభినయసంగీత శాస్త్రములయందు సరస మగు పాండిత్యము సంపాదించి తన్మూల

మున నమలాపురమునఁ గుటుంబపోషణము చేసికొనుచుండెడివారు. అప్పటి కాంగ్లప్రభువులు దేశమున నూతనప్రభుత్వపద్ధతులను విరివిగ వ్యాపింపఁజేయఁదొడంగిరి. ప్రజలు ప్రభుత్వోద్యోగపక్షపాతు లయి స్వక్షేత్రంబుల వీడు కాల మారంభ మైనది. గోదావరీమండలము నందలి దక్షిణదిగ్భాగంబున కమలాపురము ముఖ్యపట్టణము గావింపఁబడినది. రాచకీయోద్యోగులు కొందఱా గ్రామమునకుం బంపఁబడిరి. ఆంగ్లభాషాభ్యాసమునందు జనసామాన్యమున కభిరుచి కలిగినది. అత్తఱి మన కథానాయకులు నమలాపురమునఁ గల తమ పినతండ్రి గారి యొద్దకు ఆంగ్లవిద్యాభ్యాసమునకై పంపఁబడిరి. ఆంగ్లము నొక వంకను అభినయము నింకొక వంకను సాహిత్యము నొక వైపునను సంగీతము మఱియొక వైపునను నూత్నతమంబుగ గ్రహించుచుండిన భావనారాయణ గారు కేవల భావనారాయణు లయిరి. తమ తోడి వార లిసుకరాసులఁ గూడఁబెట్టుచుండిన కాలమున ఆయన చూడ్కులు యశోరాసుల వైపునకు మరల్పఁబడెను. సహచరులు పృష్ఠాగ్రచరు లయిన కాలమున కవివరేణ్యులు భావాగ్రచరు లయి తనరారుచుండిరి. ఆ పిన్న వయస్సుననె వా రాంధ్రభారతము నంతటి నామూలాగ్రముగ నొకసారి పఠించితి మనియు నా కాలమునఁ దమకు భారతమునం గలిగిన యభిరుచియే తమచే నద్దాని నెల్ల నిరువది మాఱులు చదివించిన దనియు భావనారాయణ గారు నాతో చెప్పియుండిరి. కాల మెన్నఁడు నొక్క రీతిని గడవఁ బోదు. తమ విద్యాసంచయంబునకు వలయు ధనంబు నొసంగుచు తమతోడిద లోక మనెడు జనకు లక్కవివరేణ్యుని నవమవర్షంబున నవలోకవాసు లయిరి. ఆయన పినతండ్రి గారును మఱి యొకటి యొకటిన్నఱ వత్సరములకు నిజాగ్రజు సన్నిధికిం జనిరి.

మాతృదేవతను పూజించుటయు విద్యామాతను గొల్చుటయు నను ధర్మద్వయనిర్వాహణభారము భావనారాయణ గారిపైఁ బడినది. ముక్కుపచ్చ లారని పసిబాలున కుభయధర్మములలో నెద్ది ముఖ్యతరమో నిర్ణయించుట సుసాధ్యము కాదు. పరస్పరసంఘర్షణము లేకుండ ధర్మద్వయనిర్వాహణ మొనర్చుటయు నట్టి పిన్నవానికి ప్రయాసజనక మని చెప్పక తప్పదు. భావనారాయణకవివరు లా సమయమునఁ దమ బుద్ధిచాతుర్యమును లోకమున కొక సారి చూపిరి. పిత్రార్జితం బగు భూవసతిని తల్లి గారి యుదరపోషణమునకై విడిచి భాషామతల్లిని కొల్చు నుద్దేశముతో స్వయంసహాయముపై జీవితము నాధారపఱచుకొని 1880-వ సంవత్సరమున భావనారాయణ గారు కాకినాడ చేరిరి. సమానవయస్కులు కట్టు లాగుల బందుముళ్లను విప్పఁజాలని కాలమున సాంసారికసమస్యలను విప్పుటయందు చూపఁబడిన నేర్పు కవివరేణ్యుని బుద్ధిచాతుర్యమును చాటుచున్నది. ఈడు వార లస్యగృహంబుల నడుగిడఁజాలని కాలంబున నన్యగ్రామంబున జీవయాత్ర సల్పుచు విద్యాధనసంచయం బొనర్పఁబూనిన యత్నము కవిపుంగవుల ధైర్యసాహసముల వెలిపుచ్చుచున్నది.

ఆ తేజశ్శాలి కాకినాడ కరిగినపుడు ప్రథమమున కీర్తిశేషు లగు దర్భా నరసింహులు గారివలన నాదరింపఁబడిరి. నరసింహులు గారు భావనారాయణ గారికి సూర్యరావుపేటలోని తమ యింటఁ దావొసంగి సుమా రొక వత్సర మాదరించిరి. స్వయంసహాయమునం దెక్కు డభిరుచి గల భావనారాయణ గారు చిరకాలము నరసింహులు గారి యింట నుండుట కిష్టపడక, ఏదేని యొక వృత్తి సంపాదించి స్వతంత్రజీవనము సలుప నిశ్చయించుకొని యందులకై వలయు ప్రయత్నముల కుద్యమించిరి. సుమారు వేయి వత్సరముల క్రిందటఁ గట్టఁబడిన జగన్నాథపురము కాకినాడ భాగములతోఁ జేర్పఁబడి తత్పురపాలకసంఘమువారిచే పాలింపఁబడఁ జొచ్చెను. ఆ కాలమునం దచ్చట నాంగ్లవిద్యను నేర్పు విద్యాలయము లేదు. కాకినాడయం దొకటి రెండు పాఠశాల లుండెడివి గాని జగన్నాథపురవాస్తవ్యులు తమ పిల్లల నచ్చటి కంపుట కిష్టపడకుండిరి. ఆ సడి నెఱింగిన భావనారాయణ గారు జగన్నాథపురమున నాంగ్లపాఠశాలను స్థాపించిరి. ఆంగ్లభాషయందు బాలురకుఁ బ్రాథమికవిద్య నేర్పుటకుఁ దగిన యాంగ్లభాషాజ్ఞానమును భావనారాయణ గా రమలాపురమున నేర్చిరి. ఆంగ్లవిద్యను నేర్పు బడి యూర బయలువెడలినతోడనే గ్రామమునం గలవారు పెక్కురు తమ పిల్లల నా బడికిఁ బంపఁదొడంగిరి. కేవల మాంగ్లమునే గాక యాంధ్రసాహిత్యమును విశేషించి తమ పినతండ్రి గారియొద్ద నేర్చిన సంగీతమును గూడ భావనారాయణ గా రొయులకు నేర్ప మొదలిడిరి. ఆ కాలమున కోగంటి నరసింహాచార్యులు గారికి కూడ ప్రాథమికవిద్యను నేర్పు పాఠశాల యొకటి యుండెడిది. ఒకే గ్రామమున వేర్వేఱు విద్యాలయములు గలవా రిరువురకును పరస్పరస్పర్థ కలుగుట లోకాచారము. కాని, వా రిరువురయందును మాత్ర మీ ధర్మము విరుద్ధభావము వహించినది. పరస్పరగుణగ్రహణపారీణు లగు నా యుపాధ్యాయులు పరమమిత్రు లయి తమ విద్యాలయముల రెండిటి నేకీభవింపఁజేసిరి. వారికిఁ బరస్పరానురాగము దినదినప్రవర్ధమానము కాఁజొచ్చెను. గ్రామమున స్థిర మగు వృత్తి నేర్పఱచుకొనినతోడనే భావనారాయణ గారు నిజాగ్రహారంబునకుం జని తమ తల్లి గారిని వెంటఁబెట్టుకొని వచ్చి జగన్నాథపురమున స్థిరపడిరి.

పదునైదు పదునా ఱేండ్ల ప్రాయము వచ్చునప్పటి కాయనకు జీవయాత్రను గూర్చిన యాందోళనము శమించినది. జీవనోపాధివిషయిక మైన యాందోళనము మానవుని హృత్క్షేత్రమునఁ బెరుగు గచ్చపొద. ధైర్యనామకకుఠారచ్ఛేదితము గాకున్నచో నయ్యది నీరు మేఁత నడుగకయే యల్లిబిల్లిగ నల్లుకొనిపోవును. భీకర జంతుసంతాన, నివాసయోగ్యం బగు నప్పొద మానవమానసక్షేత్రంబును క్షణమాత్రంబున దుర్విపినంబు గా మార్చును. అదృష్టవశంబున నప్పొద ఛేదింపఁబడిన పక్షమున మానవమానసము నేర్పరి యగు కర్షకునిచేతి సుక్షేత్రంబు భాతి సర్వసస్యజనకం బయి తనరారుచుండును. భావనారాయణ గారికి సర్వవిధంబుల మనశ్శాంతి కలిగినతోడనే పిన్ననాటఁ జల్లఁబడి యంతదనుక నణఁగియుండిన సంగీతసాహిత్యాభినయాదిబీజములు మొలక లెత్త మొదలిడినవి. హితవృష్టమగు ప్రోత్సాహామృత మా మొలకలను దినదిన ప్రవర్ధమానముల నొనర్చెను. సంతు

ష్టితస్వాంతు లగు భావనారాయణ గారు కవిత్వమునఁ గృషి నొనర్ప సాగిరి. ఇంతకుఁ బూర్వమే జగన్నాథపురమున ములుకుట్లవారి యావరణములో నాటక ప్రదర్శన మొనర్చుచుండిన యువకుల కా కవివరులు పద్దెములను పాటలను వ్రాసి యిచ్చుచుండెడివారు. అందొకానొకపుడు వేషములను గూడ వేయుచుండెడివారఁట. దీనిం బట్టి చూడ చిన్ననాఁటినుండియు నీయనకు సహజకవిత్వధోరణి కల దనియు నుదరపోషణాదులందుఁ గల హృదయాందోళనమువలన దాని నంతగఁ గృషి సల్ప నవకాశము లేక యంతదనుక నా కవివరులు నివురు గప్పిన నిప్పువలె తమ శక్తులను మఱుగుపఱచియుంచిరనియు స్పష్టపడుచున్నది. దైవానుగ్రహము కతంబున 1884-వ వత్సరమందు స్థిర మగు నుద్యోగమును గోగంటి నరసింహాచార్యులు గారతోడి మైత్రియు లభ్యములై కవివరునకు మనశ్శాంతిఁ గలిగించినవి.

ఆందోళనరహితహృదయు లుత్సాహజనకము లగు కార్యములయందు కాలము వినియోగింతు రనుట ప్రాపంచికధర్మము. మానవుని చూడ్కులు నిజభావముల ననుసరించి మాఱుచుండును. నిజభావములకుఁ బరిస్థితులు కూడ ననుకూలించినయెడ నవ్వవి యచిరకాలముననే వికసించును. భావనారాయణ గారికి సంగీతసాహిత్యాభినయములయం దభిరుచి కల దని యిదివఱలోఁ దెలుపఁబడినది. అవకాశము కలిగినపు డెల్ల వారు గ్రంథములను చదువుచుండెడివారు. వారికి చేఁజిక్కిన గ్రంథములను చదివినఁ గాని నిదుర పట్టెడిది గాదఁట. ఏ గ్రంథము నైన నొక సారి చదివినయెడ నందలి సమస్త విషయములను చక్కఁగ గ్రహించెడి శక్తి వారికి మిక్కుటముగ కలదు. చదివినదానిని వా రెన్నఁడును మఱచియెఱుఁగరు. ఇంత యేల? భారతము నెల్ల నామూలాగ్రముగ నిరువది మారులు చదివిన కవివరేణ్యునకు గ్రంథపఠనమునఁ గల యభిరుచిని వేఱె వ్రాయవలసిన యక్కఱ లేదు. ఆయన యొక యాంధ్రగ్రంథములను చదువుటయే గాక యాంగ్లనాటకములను హిందీగ్రంథములను కూడ చదివించుకొని వినియున్నారు. ఒక సారి వినినంత మాత్రముననే యాయా గ్రంథములందలి సమస్తవిషయములను చక్కఁగ జ్ఞప్తియందుంచుకొనుటయె గాక యా గ్రంథములపై విమర్శనము వ్రాయునంత శక్తి నార్జించియుండిరి. నే నింటరుమీడియేటు పరీక్షకుఁ బోనున్నపు డాయన నాకు 'జ్యూలియస్ సీజ' రను విషాదాంతనాటకముపై విమర్శనము చెప్పియుండిరి. ఆంగ్లమున పండితసింహులనఁదగు దివాన్ బహద్దూరు ఆర్. వేంకటరత్నము నాయఁడు గారు చెప్పిన విమర్శనమునకును భావనారాయణ గారిచే నాంధ్రమునఁ జెప్పఁబడిన విమర్శనమునకును భేద మేమియు నగపడలేదు. కావున భావనారాయణ గా రొనర్చిన గ్రంథపఠన మపార మయిన దనియు తన్మూలమున నక్కవివరుని బుద్ధి పరిపూర్ణవికాసము నొందిన దనియు చెప్పక తప్పదు. సాహిత్యమున నీ విధమునఁ గృషి సల్పుచున్న కవివరునికి సంగీతాభినయములయందలి కృషికి వేఱొండు తావు సమకూరినది. ఆ దినములలో కాకినాడయందు కీర్తిశేషు లగు పింగితపు వేంకటరావు గారి నాటకసమాజము కడుంగడు హెచ్చరికతోఁ బని చేయుచుండెను. ఆ సమాజమున వేషములు వేయువారిలో పెక్కుండ్రు గౌరవకులసంజనితు లగు నుదారహృదయులు గలరు. వారిలో కొంద ఱిపుడు వందల కొలఁది రూప్యములను వేతనముగ స్వీకరించుచుండిన ప్రభుత్వోద్యోగులు గలరు. గుణగ్రహణపారీణు లగు నా సామాజికులు గ్రామమునందు తమ కుపయోగించువారిని సంఘమునకు రావించి యాదరించుచుండెడివారు. వారి చూడ్కులు భావనారాయణ గారి వైపునకు మరల్పఁబడినవి. భావనారాయణ గారికిని చిన్ననాఁటినుండియు నేర్చుకొనుచున్న సంగీతాభినయములందుఁ గల శక్తిని ప్రదర్శించుట కా ప్రదర్శనశాల యుచితరంగముగ నగపడెను. సామాజికులచే నాహ్వానింపఁబడి భావనారాయణ గారు సంఘమునఁ జేరిరి. చేరిననాఁడు చిన్న పాత్రముల నభినయింప నియుక్తు లయినను, సుందరులును విద్యావిశారదులును నగు భావనారాయణ గారు మరుసటి దినముననే నియామకులును ముఖ్యతమ వేషధారులును గావింపఁబడిరి. నిజోత్సాహమునకుం దోడు మిత్రదత్త మగు ప్రోత్సాహము కూడ లభించినతోడనే యాయన యా విషయమున నిరుపమాన కౌశలమును జూప మొదలిడెను. ఆ కళలయం దాయనకుఁ గల సామర్థ్యము నిరుపమాన మను వార్త మండలములం దంతటి వ్యాపించినది. ఆయన వేషము వేయు నని ప్రచురింపఁబడినపుడు సమాజాధికారుల బొక్కసము క్రిక్కిరిసియుండెడిది. నాటకశాలయందు గ్రామమంతయు ప్రదర్శనప్రారంభమునకొకటి రెండు గంటలకుఁ బూర్వమే కానవచ్చుచుండెడిది. వే యేల? ఆయన యీ విషయమున నద్వితీయుఁ డనుట యెల్లరిచేత నంగీకరింపఁబడిన విషయమే. ఆ కాలమున సయితము సాహిత్యమునందును కవిత్వమునందును కవివరులు నిరంతరకృషి చేయుచుండెడివారు. తా నభినయించు పాత్రములకుం దగిన పాటలును పద్యములును వచనమును కూడ నాయనయే కూర్చుకొనుచుండెడివాఁడు. మఱియు ప్రతిసాయంకాలమున తమ మిత్రు లగు నరసింహాచార్యులు గారితో కలసి యాంధ్రగ్రంథముల చదువుచుండెడివారు. వా రిరువురును జగన్నాథపురమున కనతిదూరమునఁ గల 'తూరంగి' దేవాలయమున కెదురుగ నుండిన తటాకతటమునందలి యొక నింబవృక్షచ్ఛాయను సైకతస్థలంబున సుఖాసీనులయి గ్రంథపఠన మొనర్చెడివారఁట. ఆ తరు విప్పటికిని గానవచ్చుచున్నది. బహువిధముల ప్రోత్సాహపూర్వక మగు నుత్సాహము ననుభవించి యుప్పొంగుచుండిన కవివరేణ్యునకు వివాహేచ్ఛ మెండయినది. స్వేచ్ఛావిహారమును మతధర్మవిసర్జనమును ఆ పురుషపుంగవున కెన్నఁడును రుచించినవి గావు. గృహస్థాశ్రమస్వీకరణమునం దాయనకు తొందర కలిగినది. 1887-వ వత్సరమున కడియము వాస్తవ్యులు చల్లా కామయ్య గారి పుత్రిక శేషమ్మ గారిని భావనారాయణ గారు ప్రతిగ్రహించిరి. ధర్మపత్ని యనిన శేషమ్మ గారినే యనఁజనును. భావనారాయణ గారి సుఖజీవనమునకును గ్రంథరచనమునకును నీమె సుశీలత చాలవఱకు సాయ మొనరించినది. ఈ సందర్భమున వ్రాయవలసిన విషయములు పెక్కు లున్నను గ్రంథవిస్తరభీతిచే వాని నిట విడిచితిని. 1890-వ వత్సరమువఱకును కవికుంజరునకు భార్యతోఁ

గూడ యిలు దిద్దుకొను భారము కలుగలేదు. అంతవఱకు స్వపోషణమునకు వలయునంతకంటె నెక్కువ ద్రవ్యము నార్జింపవలసిన యక్కఱయు నాయనకుం గలుగలేదు.

1890-వ వత్సరము ప్రాంతమున వారికిం గలిగిన సాంసారిక కష్టములను దీర్చుకొనుటకు నాటకసమాజాధికారులను ద్రవ్యసహాయము నొకింత యొసఁగ భావనారాయణ గారు కోరిరి. అంతవఱకు వారి యొద్ద సుఖముగనే పని చేయుచుండినను కవివరుని కోర్కె నిరాకరింపఁబడినది. విత్తమునకై మానసికస్వేచ్ఛయు నుచితస్వాతంత్ర్యమును నమ్ముకొను స్వభావము గలవారు కాకపోవుటచే మన కథానాయకులు సామాజికులయొద్ద నెన్నఁడును జీతబత్తెములను పుచ్చుకొనియుండలేదు. అట్టిరీతి కవివరులు విఫలమనోరథు లగుట కచ్చెరువొంది సమాజముతోఁ దమకుఁ గల సంబంధమును వదలుకొనిరి. లోపము లేమి దయినను సామాజికులవలన హితబోధ చేయఁబడినను సమాజాధికారులు తమ కకారణముగ భావనారాయణ గారిపై కలిగిన యాగ్రహమును శమింపఁజేయ యత్నించిరి గారు. ఆగ్రహగ్రహావేశుల హృదయములు జ్ఞానశూన్యములును క్రోధబాధితములును నగుట సామాన్యలక్షణము. సమాజాధికారులు భావనారాయణ గారిపై పగఁ బూని వారి నెటులయిన పరిభవింప నుద్యుక్తులయిరి.

భావనారాయణ గారి వాసస్థలము జగన్నాథపుర మని యిదివఱకే తెలుపఁబడియున్నది. ఆయన యుండు గ్రామముననే యాయనను సాధింపవలయు నని సమాజాధికారులు భావించిరి. అతావుఁ దదుద్యోగానుకూలురు కొందఱు సమాజాధికారులకు లభించిరి. వారుచితముగ నాటకశాలకుం గొంపోఁబడి యుచితముగ గౌరవింపఁబడిరి. వారును సమాజాధికారుల కోర్కెను నెఱవేర్ప బద్ధకంకణులయిరి. గ్రామమునందు చిరకాలమునుండి కాపురము చేయుచు పెక్కురు మిత్రులను కలిగిన జగన్నాథపురవాస్తవ్యులకు ఎక్కడి నుండియో యుదరపోషణమాత్రకై వచ్చి బడిపంతులుఁ పని చేసికొని జీవించుచు నిరాధారుఁడుగ దలఁపఁబడుచుండిన భావనారాయణ గారిని సాధించుట యన నతిసులభసాధ్యముగ నగపడెను. అంతియ కాని యది యొక పాపకార్య మని వారు తలంపరైరి. మఱియు, నిరాధారులం బ్రోచువాఁ డొకఁ డుండితీరు నని యా హ్రస్వదృష్టులెఱుంగరయిరి. ఆయనను సాధింప సమకట్టుట వారి కొక యాటవలె కన్పట్టెను. వా రందఱును గూడి యాయనయందు నిందారోపణ మొనర్చి మతభ్రష్టునిం జేయ సమకట్టిరి. అందు పెక్కండ్రు పలుకుబడి గల గ్రామపురోహితులు. వారి యాటలకుం దగు పాటలం బాడి తాళములు వేయు లౌకికులు గూడ జగన్నాథపురమునఁ గలరు. తమపై నిష్కారణవైరము వహించిన కలహప్రియుల భయంకరారావములకు భావనారాయణ గారు భయపడిరి. నూతనాగతు లగుటచే జగన్నాథపురమునందలి రహస్యముల నంతగా నెఱుంగని భావనారాయణ గారికి తోడ్పడఁగల మిత్రులు కోగంటి నరసింహాచార్యులు గారు తక్క వేఱెవ్వరును లేరయిరి. నరసింహాచార్యులు గారు మిత్రున కొనర్పవలసిన సహాయ మేదేని యుండిన యెడల వెనుకంజ వేయు స్వభావము గలవారు కారు. మిత్రు లిక్కట్టులలో నున్నా రని వినినప్పు డాయన తద్బాధను తాము భరించి మిత్రున కుచితసుఖమును సమకూర్ప యత్నించెడు ధీరభావము గలవాఁడు. కావుననే నరసింహాచార్యులు గారికిని నిజ మగు మిత్రులా గ్రామమునం గలరు. నరసింహాచార్యులు గారు తమ మిత్రుని యిక్కట్టులం దొలఁగింప తమకుఁ గల యితరమిత్రులను గోరిరి.

నరసింహాచార్యుల గారి కోరిక ననుసరించి భావనారాయణ గారికి సాయ మొనర్ప సమకట్టినవారిలో 'పులవర్తి వెంకయ్య' గారు ముఖ్యులు. ఆయన కదివఱలో భావనారాయణ గారితో నెట్టి సంబంధమును లేదు. కాని, యొరులు వచ్చి తమ్ముఁ గోరిన సహాయమును చేయుటయందు వీరి కుత్సాహము మెండు. తత్కార్యనిర్వహణము నందు గ్రామ మంతయు నొక్కటి యయి తమ కడ్డు వచ్చినను నావంత యయినను జంకెడు స్వభావ మాయనకు లేదు. ఎక్కడినుండియో వచ్చి యుచితగౌరవముతో జీవయాత్ర సల్పుచు తమ గ్రామమునకు శిరోరత్నము గాఁదగి విద్యలయందు కృషి చేసికొనుచుండిన బ్రాహ్మణబాలుని గ్రామములోనివా రకారణవైరముం బూని పరిభవింపనైయున్నా రని వినినప్పుడు వెంకయ్య గారు జాలి గొని యా బాలుని పిలువనంపి 'నీ కేమియుం భయము లే'దని నొక్కి వక్కాణించి యభయహస్తము నొసంగిరి. గ్రామములోనివారిపై తుద కభియోగముఁ దెచ్చువఱకును వారచే పెట్టఁబడు బాధలు తగ్గినవి కావు. భావనారాయణ గారిచే తేఁబడిన యభియోగమున వైరులు ప్రభుత్వాధికారులచే నుచితరీతిని శిక్షింపఁబడిరి. భావనారాయణ గారికి గ్రామమునందలి భయము నశించినది. పై విషయమున న్యాయవాదులును కీర్తిశేషులును నగు ముష్టిపూడి వెంకయ్య గారు కూడ భావనారాయణ గారికి సాయ మొనర్చిరి.

భావనారాయణ గారికి కలిగిన కష్టములు నశించినవి. తమ విషయమున ద్రవ్యసహాయ మొనర్చి తమకు సర్వవిధంబుల తోడ్పడిన పులవర్తి వెంకయ్య గారియెడ తమకుం గల గౌరవమును సూచించుటకై వెంకయ్య గారి యిష్టదైవ మగు దక్షపురి భీమేశ్వరునిపై భావనారాయణ గారు 'భీమలింగశతక' మను పేరట నొక శతకమును కూడ రచించియుండిరి. అదియే భావనారాయణ గారిచే రచింపఁబడిన ప్రథమగ్రంథము. కాని, యది యింతవఱకు ముద్రింపఁబడలేదు. దీనిని ముద్రింపించు భారమును భావనారాయణ గారు వేంకయ్య గారిపై విడిచిరి. వేంకయ్య గారు వ్యావహారికకష్టములలోఁ దమ యాస్తి నెల్లఁ గోలుపోయి ధనవిషయమున పెక్కు చిక్కులు పొందుటచే వారీపనిని నిర్వర్తింపఁజాలరైరి. ఈ సందర్భమున నింకొక విషయమును వ్రాయవలసియున్నది. దక్షపురిభీమేశ్వరుఁడే భావనారాయణ గారి కిష్టదైవ మగుటకు వెంకయ్య గారి బోధలే కారణము. భీమేశ్వరునిం గూర్చి వెంకయ్య గారిచే బోధింపఁబడిననాఁటినుండియు భావనారాయణ గారు భీమేశభక్తవరులయి తమచే రచింపఁబడిన గ్రంథములను భీమేశ్వరునకే యంకిత మొనర్చుచు తుదకు కుముద్వతీసారంగధరనాటకమున 'భీమేశభక్త

వరుఁడ' నని స్వవిషయప్రశంసయందు వ్రాసికొనిరి. మఱియు, వారు జీవితాంతమువఱకును వెంకయ్య గారియందు పితృభావము గలిగి కడుంగడు విశ్వాసమును చూపుచుండెడివారు.

భావనారాయణ గారికి కుటుంబపోషణము నిమిత్తము ద్రవ్య సంపాదన మవసర మైనది. జగన్నాథపురమున పురపాలకసంఘము వారి పాఠశాల లేర్పఱుపఁబడినవి. అం దుద్యోగము సంపాదింపవలయు నను నభిప్రాయ మాయనకు కలిగినది. బోధకపాఠశాలకు పోయి చదివి పరీక్షయందు కృతార్థు లయినం గాని వారు సఫలమనో రథులు కాఁజాలరు. బోధకపాఠశాల రాజమహేంద్రవరమునఁ గలదు. 1895-వ వత్సరమున బోధకపాఠశాలయందు చేరి, అంతదనుక స్వయ ముగ కృషి సేయుచున్న యాంధ్రవ్యాకరణాదులను వా రా కాల మున ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రులు గారియొద్ద ముగించిరి. వ్యాసమూర్తిశాస్త్రులు గారినే గురునిగ భావించుకొనిరి. 'వ్యాస శిష్యుండ' ననియు 'ఆకొండి వ్యాసమూర్తులఁ బ్రకటముగ భక్తిఁ గొలుతు' ననియు భావనారాయణ గారు స్వవిషయ ప్రశంసాభాగమున వ్రాసికొనిరి. వారు 1896-వ వత్సరమున కృత కృత్యు లయి జగన్నాథపురమునఁ గల పురపాలకసంఘమువారి లోవరు సెకండరీ పాఠశాలయం దుద్యోగమును సంపాదింప యత్నింప మొదలిడిరి. ఆ పాఠశాలకు జమ్ములమడక వీరరాఘవులు గారు ప్రధానోపాధ్యాయులు. వారిని భావనారాయణ గారుద్యోగ సంపాదనమున సాయ మొనర్పఁగోరియుండిరి. తమచే రచింపఁబడిన 'గాయనగాయనీమనోరంజన' మను కీర్తనల పుస్తకమునందలి 'వీరరాఘవా నా వెతల మాన్పవా?' యను కీర్తనయం దీ విషయ మునే కవిపుంగవులు సూచించిరి. మఱియు నీ గ్రంథమున కవివరే ణ్యుల భావములు పెక్కు కీర్తనలందు సూచింపఁబడినవి. 1898-వ వత్సరము ప్రాంతమున వారి కా పాఠశాలయం దాంధ్రోపాధ్యాయ పదవి లభించినది. వా రా కాలమునఁ దమకును నరసింహాచార్యులు గారికినిఁ గల పాఠశాలయం దుదయమునను పది గంటలు మొదలు పురపాలకసంఘమువారి పాఠశాలయందును రాత్రి ధర్మపాఠశాల యందును పని చేయుచుండెడివారు. ఈ సందర్భమున కవివరులకుం గల ధర్మనిర్వహణోత్సాహమును లోకము గ్రహింపవలసియున్నది. మఱియు నా కాలముననే వారిచే రచింపఁబడిన గ్రంథములు గలవు. ఆ గ్రంథములు మృదుమధురము లగు పద్దెములతో నిండి కవివరుల మేధాశక్తిని లోకమునకు వెలిపుచ్చుచున్నవి.

శాశ్వత మగు నుద్యోగము లభించినతోడనే భావనారాయణ గారు గ్రంథరచన కుద్యమించిరి. ముద్రితగ్రంథములలో సుమిత్ర చరిత్రయు ఋతుసంహారమును మొదటివిగ నెన్నవచ్చును. 'ఋతు సంహారము' కాళిదాసకృత గ్రంథము ననుసరించినది. వారు తమ బాల్యమిత్రు లగు భమిడిపాటి సూర్యనారాయణ గారి కోరికపై రఘుదేవరాజీయ మనెడు ప్రబంధమును రచించియుండిరి. దానిని వారు నాటకముగఁ గూడ వ్రాసిరి గాని యది యింకను ముద్రితము కాలేదు. తరువాతి గ్రంథములలో 'లక్ష్మీశవైశ్చరవిలాస' మను నిర్వచనప్రబంధమును 'కళావతీపరిణయం' బను శుద్ధాంధ్రప్రబంధ మును మిక్కిలి ముఖ్యములయినవి. కళావతీపరిణయము వారికి కవిత్వ మునం గల నిరంకుశప్రజ్ఞను పరిపూర్ణముగ లోకమునకుం జాటిచెప్పు చున్నది. శుద్ధాంధ్రరచనయందు నేఁటివఱకాంధ్రప్రపంచమున భావ నారాయణ గారిని మించిన కవివరుఁడు జన్మింపలేదని వ్రాయు టెంత మాత్రమును సాహసము కానేరదు. ఆయనకన్న మిన్న యగువారినే గాక నష్టహోత్మునితో సరి యగువారిని గూడ శుద్ధాంధ్రకవులలో నేరని గానము. కళావతీపరిణయము 1905-వ వత్సరమున పట్టపరీక్షకు పఠ నీయగ్రంథముగ నేర్పఱుపఁబడినది. అక్కవివరునకు నాటకరచన యందుఁ గూడ మిక్కుటమగు నభిలాష గలదు. ఆయనచే రచింపఁ బడిన నాటకములలో 'సౌందర్యసతీమణి' 'కుముద్వతీసారంగధరము' 'సంగీతసభ' 'ప్రత్యక్షనారసింహము' ఈ నాల్గు నాటకములు ముద్రి తము లయినవి. ఇంకను నొకటి రెండముద్రితనాటకములు గలవు. భావనారాయణకృతనాటకంబులను సర్వాధంబుల నుత్కృష్ట మయిన వని చెప్ప నొప్పును. వారిచే రచింపఁబడిన నాటకములలో నెల్ల 'ప్రత్యక్షనారసింహము' మిక్కిలి ముఖ్య మయినది.

వారు స్వర్గస్థు లగునప్పటికి 'తులసీమాధవ' మను శృంగార రసప్రధాన మగు నాటకమును వ్రాయుచుంటి మని నాతో చెప్పి యుండిరి. కాని, యా గ్రంథ మెచ్చటను కానరాకున్నది. ఆయనచే రచింపఁబడి నేఁటిదనుకఁ గానవచ్చుచున్న గ్రంథము లిరువది గలవు. అందు కొన్ని ముద్రితములు. అముద్రితగ్రంథములయందు 'సంగీతభగ వద్గీతాసార' మనెడు భగవద్గీతాభాషాంతరీకరణ మొండు గాన వచ్చుచున్నది. ఆయనకు పద్యరచనయందే గాక త్యాగయ కృతు లను బోలిన మనోహర మగు కీర్తనల వ్రాయుటయందు కూడ సామ ర్థ్యము గలదని యిదివఱకె సూచించియుంటిని. వారి కీర్తనలు మిగుల మనోహరములు. అవి దేశమున నలువైపుల వ్యాపించినవి. 'సంగీత భగవద్గీతాసారము' 1905-వ వత్సర నంతముననో 1906-వ వత్సర మారంభముననో ప్రారంభింపఁబడినది. భాష్యకర్తలచే నయిత మతి కష్టముపై నిరూపింపఁబడిన మతధర్మములను సంగీతమున పొందుపఱుప యత్నించిన కవివరేణ్యుల యాధ్యాత్మికజ్ఞానము స్పష్టము. ఆయన తత్త్వజ్ఞుఁ డనియు భక్తుఁ డనియు వారి గ్రంథముల మూలమున నతి సులభముగ గ్రహింపవచ్చును. ఆయన గ్రంథములందు పలుతావుల తనకుం గల యాధ్యాత్మికజ్ఞానమును సూచించియుండెను.

భగవద్గీతాభాషాంతరీకరణము కారణాంతరములచే నసంపూ ర్తిగ విడువఁబడినది. అసంపూర్తిగ విడువఁబడినను 'భగవద్గీతా సారము' తత్క్షణమే ముద్రింపింపఁబడవలసినంత మనోహరముగ నున్నది. దాని శైలియు పొందికయు మిగుల మనోహరములై చెన్నొం దుచున్నవి. కవివరుని శైలి మిగుల మనోహరము. పద్యములు మృదు మధురములు. ధార ధారాళము. ఒకసారి వారి పద్యములను చదివిన యెడ వానిని మఱచుట కవకాశము కలుగదు. వారు వచనరచన యందు నయితము మిగుల సమర్థులు.

గాయకుఁడును కవియు భక్తుఁడును నగు భావనారాయణ

గారికి రఘుదేవరాజీయరచనాకాలమునుండియు గ్రామమున పలుకుబడియు ప్రజానురక్తియు దినదినప్రవర్ధమానములు కాఁజొచ్చెను. బ్రాహ్మణులును బ్రాహ్మణేతరులును గూడ నాయనయొద్ద పాఠముల నేర్వఁదొడంగిరి. మనుజుని చూచినతోడనే యాతఁడే విషయమున సమర్థుఁడు కాఁగలఁడో యను రహస్యమును గ్రహింపఁగల శక్తి యాయనకు మిక్కుటముగఁ గలదు. తనయొద్ద విద్యకు వచ్చిన వారిలో కొందఱికి సంగీతమును కొందఱికి సాహిత్యమును మఱికొందఱికి తక్కిన విషయములను వారు నేర్పుచుండెడివారు. మఱియు తమయొద్ద నేర్వఁదగిన విషయములలో నొకదానియందును సమర్థులు కాఁజాలరని తెలుపఁబడినవారి నన్యుల కడ కంపి 'వ్యాయామము' 'చిత్రలేఖనము' మున్నగునవి చెప్పించెడివారు. ఇంకను నొక విశేషము కలదు. ప్రపంచమున నే విద్యను సాధింపఁజాలఁడని యెంచఁబడినవానిని సయితము తన సంభాషణల మూలమున నీతికోవిదునిం జేయుచుండెడువారు. కావుననే యాయనకుం గల శిష్యబృందములో నొక్కఁడును నిష్ప్రయోజకులు లేరు. ఆయన శిష్యులలో పట్టపరీక్షాసిద్ధులును సాహిత్యచక్రవర్తులును కవులును గాయకులును వచనరచనాధురంధరులును విమర్శకులును పత్త్రికాసంపాదకులును పరిశోధకులును గూడ కలరు. వీరిలో కీర్తిశేషు లగు చిక్కాల లక్ష్మణస్వామి గారి పేరు స్మరింపవలసియున్నది. లక్ష్మణస్వామి గారు కడు ధనికులు. భావనారాయణ గారికి ప్రియశిష్యులు. గురుఁడు స్వగృహము లేక యొకించుక శ్రమపడుచుండుటం జూచి యాయన క్రీ. శ. 1916-వ సంవత్సరము ప్రాంతమున నొక గృహమును కొని గురుపరము చేసెను. దానిని పునర్నిర్మాణ మొనర్పవలయు నని కూడ శిష్యుఁ డెంచెను గాని యతఁ డకాలమరణము నొందుటచే నయ్యది నెఱవేఱినది కాదు. భావనారాయణ గారు స్వకార్యనిర్వహణమునకై యొరుల సహాయముఁ గోరు స్వభావము గలవారు కారు. కాకున్నచో నమ్మహాత్ముఁ డనేకసౌధములను నిర్మించియుండును. 'లే దని యెవ్వరి నడుగను, రా దని చింతింప పరులు రప్పించినచో, కా దని యెద్దియు మానను' నను భాగవతపురుషులలో నిక్కవివరేణ్యు లొక్కరు. లక్ష్మణదత్త మయిన గృహమును స్వీకరించినను దానిని పునర్నిర్మాణము నొనర్ప నొరుల నమ్మహాత్ముఁ డెన్నఁడును గోరలేదు. శిష్యుల నీయన పుత్త్రసమానులుగ చూచుచుండెడివాఁడు. ఆయనయెడ శిష్యులకును పితృభావ ముండెడిది. మృదుమధుర మగు కవివరుని సంభాషణమును వినిన కొలఁదిని వినవలయు ననియె యుండెడిది. వారి సంభాషణము మిగుల మనోరంజకమయి ప్రాపంచికజ్ఞానజనకంబయి తనరారుచుండెడిది. ఆయన సంభాషణమున లోకోక్తిప్రయోగము మెండు. ఆయన 'లోకోక్తిప్రకాశిక' యను పేరట పదునెనిమిదివందల సామెతలను గ్రంథస్థ మొనర్చెను. అవి యన్నియు వారి జిహ్వాగ్రమున ప్రత్యక్ష మగుచుండెడివి.

1908-వ వత్సరము జనవరి నెలయందు జగన్నాథపురమందలి పురపాలకసంఘమువారి పాఠశాల కాకినాడయందలి పీఠికాపురాధీశ్వరుల కళాశాలతోఁ గలిపివేయఁబడినది. నాఁటినుండియు వారు కాకినాడ కళాశాలయందును జగన్నాథపురపాఠశాలయందును గూడ పని చేయవలసినవా రయిరి. వారు తమ చిన్నతనమునుండియుఁ బ్రాణసమానముగఁ జూచుకొనుచున్న నరసింహాచార్యులు గారి పాఠశాలతోఁ గూడ సంబంధము వదలుకొని తమ స్థానమున తమ బావమఱఁది లగు చల్లా నరసింహము గారిని ప్రవేశపెట్టిరి. కావున, నవకాశరహిత మగు నీ కాలమున వారు గ్రంథరచన మానిరి. 1910-వ వత్సర మంతమున తిరిగి 'ప్రత్యక్షనారసింహము'ను వ్రాయ నారంభించిరి. దానిని 1918-వ వత్సరమున ముగించిరి. ప్రత్యక్షనారసింహానంతరము 'తులసీమాధవము'ను వెంటనే మొదలిడఁ దలంచిరి గాని భూవిషయమున జ్ఞాతులతో కలిగిన కలహములవలన 1917-వ వత్సరమువఱకును తద్రచన కుద్యమింపఁజాల రయిరి. 1917-వ వత్సరమున 'తులసీమాధవమును' ప్రారంభించితి మని నాతో చెప్పిరి. అందలి పద్యములను గూడ రెండింటిని చదివి వినిపించిరి.

కాని, 1917-వ వత్సరమున చాల కాలము వ్యాధిగ్రస్తు లగుచు పునరారోగ్యమును చెందుచుండెడివారు. 1917-వ వత్సరము డిసెంబరు నెలలో తిరిగి వ్యాధిగ్రస్తు లయి తుదకు డిసెంబరు 10-వ తేదికి సరి యగు పింగళనామవత్సర కార్తికబహుళైకాదశీదినమున మధ్యాహ్నము రెండు గంటలకు రవిమండలాంతర్గతులై తమ యిష్టదైవ మగు భీమనాయకుని సన్నిధానముం జేరి కైలాసవాసు లయిరి. తా మొక యఱగంటకు స్వర్గారోహణ మొనర్పనున్నపుడు తమకు ముఖ్యమిత్త్రులలో నొకరును తాము వ్యాధిగ్రస్తు లయిన నాఁటినుండియు వైద్యులు మున్నగువారిని దీసికొనివచ్చి తమ్ము పునరారోగ్యవంతులుగఁ జేయ మిక్కిలి శ్రమ నొందుచుండినవారును నగు పోతుల సత్తిరాజు గారిని పిలువనంపి తాము స్వర్గారోహణసంసిద్ధుల మయితి మనియు తమ మృతకళేబరమునకు జరుపఁబడవలసిన ధర్మముల విధ్యుక్తముగ జరుపవలయు ననియు చెప్పి నిమీలితనేత్త్రులయి గానునామము స్మరించుచు నేత్త్రద్వయమునుండి ప్రాణవాయువులను విడిచిరి. పోతుల సత్తిరాజు గారును కవివరేణ్యుని యంత్యవాంఛితములను పరిపూర్ణముగ నిర్వర్తించిరి. ఆయన బావమఱఁదులు చల్లా నరసింహము గారు వారికి పుత్త్రసమానులయి యుపచారము చేసిరి. ఆయన పంచత్వము నొందిన దాది మరుసటి దినము మధ్యాహ్నము రెండు గంటలకు మృతకళేబరము రుద్రభూమిని చేరువఱకును ఆయనకుం గల శిష్యులు సుమారు రెండు వేలమంది వారి సన్నిధినే యుండిరి. ఆయన మరణము వలన బ్రాహ్మణబ్రాహ్మణేతరులకుఁ గల పరస్పరానురాగమును విశ్వాసమును లోకవిదిత మయినది. భావనారాయణాలయము నొకదానిని కట్టించుటకు పోతుల సత్తిరాజు గా రొనర్చిన వాగ్దానమును లోకమున కెఱింగించుచున్నవాఁడ. మఱియు, వారి శిష్యులు గురువరేణ్యుని మృతతిథిని సభలను జరిపిరి. ఉత్సవముల నొనర్చిరి.

Mr. M. Ramanna Chetti



మాచర్ల రామన్న శ్రేష్ఠిగారు.

Late P. Ramamoorthy Garu.



కీర్తిశేషులైన పేర్ల రామమూర్తిశ్రేష్ఠిగారు.

Mr P. Hanumanthiah Gupta.



పి. హనుమంతయ్యగుప్తగారు.

Mr A. Bhadraiah.



ఆకారపు భద్రయ్యగారు.

Rajvaidya Seshiah Sarma Garu.



రాజవైద్య నాగలింగం శేషయ్యాశర్మగారు.

Mr. A. Peda Konda Reddi.



ఆవుల పెదకొండారెడ్డిగారు.

Mr. S. Ratnavelu Chetti.




ఎస్. రత్నవేలు శ్రేష్ఠిగారు.

Jamindar of Elagiri.



ఏలగిరి జమీందారుగారు.

Late N Chengaiah Garu.



కీర్తిశేషులైన నూకల చెంగయ్యగారు.

Mr. M. V. Chinnaraju Chetti.



మద్దుల వెంకటచినరాజు శ్రేష్ఠిగారు.

Mr. N. Muthu Nagaraju



నద్దిమండలం ముద్దునాగరాజుగారు.

Mr. R. Venkatasubbaiah.



రాయిపాటి వెంకటసుబ్బయ్యగారు.

వర్ణాశ్రమధర్మములు

వావిలాల వేంకటశివావధాని గారు

శ్లో. నత్వా భగవతేఽజాయ లోకానాం ధర్మసేతవే, వక్ష్యే సనాతనం ధర్మం నారాయణముఖాచ్ఛ్రుతం,
యోఽవతీర్యాత్మనోంఽశేన దాక్షాయణ్యాం తు ధర్మతః, లోకానాం స్వస్తయేఽధ్యాస్తే తపో బదరికాశ్రమే
ధర్మమూలం హి భగవాన్ సర్వవేదమయో హరిః, సత్యం చ తద్విదాం రాజన్ యేన చాత్మా ప్రసీదతి.

—భా. ౭. అ ౧౧. ౫. ౬. ౭. శ్లో.

లోకధర్మవ్యవస్థాపకుండును జన్మరహితుండు నగు నారాయణునకుఁ బ్రణమిల్లి యాత్మాంశమున దక్షునికొమార్తెయగు మూర్తియందు ధర్మునకు నరుతోఁగూడ నవతరించి లోకక్షేమార్థ మిప్పటికిని బదరికాశ్రమమునఁ దపము సేయుచున్న నారాయణుని వలనవినిన సనాతనధర్మమును నారదుఁడు ధర్మరాజునకుఁ జెప్పెను. సర్వవేదమయుండైన హరి ధర్మమునకుఁ బ్రమాణము. వేదవిదులగు మన్వాదులరూప మెత్తి హరియే ధర్మవ్యవస్థను జేసెను. ఆమన్వాదుల స్మృతులు ధర్మనిర్ణయంబునఁ బ్రమాణంబులు. అందువలన నాత్మ ప్రసన్న మగును. ఆమన్వాదులగు స్మృతిపురాణేతిహాసకర్తలు, కరుణాపరులు, సాధువులు, శాంతులు నైన నారాయణపరులు, గాన ధర్మము నితరులకంటె లెస్సఁగ నెఱుఁగుదు రనియుఁ గూడ నారదులు సెలవిచ్చిరి. వారందఱకు నమస్కరించి వర్ణాశ్రమధర్మసంగ్రహముఁ జేసెద. వర్ణాశ్రమధర్మములను నహంకారమమకారములు ఫలాభిసంధి లేక యనుష్ఠించినచో నవి ప్రవృత్తిరూపమునుండి నివృత్తి రూపముగ మారి మోక్షమునకుఁ బరంపరాకారణము లగునని నారదుఁడు ధర్మరాజునకును శ్రీకృష్ణు లుద్ధవకుచేలాదులకును సెలవిచ్చిరి. కాన నాధర్మములకుఁ బ్రవృత్తినివృత్తిరూపములు రెండు. ప్రవృత్తిరూపము లగు ధర్మములను విపులముగను, నివృత్తిరూపధర్మములను సంక్షేపముగను మన్వాదిధర్మశాస్త్రములు నిరూపించును. పురాణాదులలో నివృత్తిధర్మము ప్రాధాన్యముగ వర్ణింపబడును.

౧. ఆర్యదేశాచారములు

హిందూస్థానమగు భారతవర్షమునకు వాయవ్యపుమూల నుత్తరహిందూస్థానమునకుఁ జాలకాలముక్రింద వచ్చి యక్కడ నివసించినవా రార్యులనియు, వారే వర్ణాశ్రమధర్మముల నేర్పఱచిన ట్లిప్పటి చరిత్రకారులు దివ్యజ్ఞానులును దలంచిరి. మన్వాదిప్రాచీన స్మృతులలోఁ గూడ నాయూహ నిరాకరింపఁబడినట్లు తోఁచదు. ఆర్యు లనఁ బూజ్యులు. వారి యాచారములు మంచివి కాన వారి కా పేరు గలిగెను. వారుండెడిదేశ మార్యావర్త మనఁబడు. ఆర్యులను మ్లేచ్ఛు లాక్రమించి బాధపెట్టినను, తిరిగితిరిగి యాదేశమును వదలక పుత్రపౌత్రాది పరంపరగ నార్యులు దానియందే జన్మించిరి గాన దానికి నార్యావర్తమని పేరు గలిగె నని మనువు ననుసరించి మేధాతిథి వ్రాసెను. మనుస్మృతిలో (మను. అ. ౨. ౧౭. ౨౨.) నార్యావర్తములోని భాగములును, సరిహద్దులును నివరింపఁ బడినవి. సరస్వతీదృషద్వతీనదుల మధ్యనున్న దేశము బ్రహ్మావర్తము. ఇది పుణ్యభూములలో నుత్తమము. దీనిలోనుండు బ్రాహ్మణాది చతుర్వర్ణముల వారికిని, సంకరజాతులకును, బరంపరఁగ వచ్చిన యాచార వ్యవహారములు ప్రశస్తములు. దీనికంటెఁ దక్కువపుణ్యముగలది బ్రహ్మర్షి దేశము. కురుక్షేత్రమగు ఢిల్లీ మత్స్య (రాజపుత్రస్థానము) దేశము, కన్యాకుబ్జము (కనౌజ్) శూరసేనకమగు మధురాప్రాంతము నను నాలుగు దేశములకుఁ గలిసి బ్రహ్మర్షిదేశ మని పేరు. ఇది యమునాసరయూనదుల మధ్యదేశము. ఈదేశపు బ్రాహ్మణాదుల యాచార వ్యవహారములుగూడ నితరులకుఁ బ్రమాణములుగ నంగీకరింపనగు. హిమవద్వింధ్యలకును సరస్వతి యను నదికినిఁ బ్రయాగకును నడుమ నుండు దేశము మధ్యదేశము. పూర్వపశ్చిమసముద్రములకును హిమవద్వింధ్యలకును, నడుమనున్న దేశమునకు ఆర్యావర్త మని పేరు. కాన మనుస్మృతిప్రకారము రాజపుత్రస్థానము, పాంచాల (పంజాబులోని తూర్పుభాగము) ఢిల్లి ఆగ్రా మధుర ప్రయాగ కాశీ పాట్నా గయాదులు గల బంగాళాదేశము వఱకు నుండు నుత్తర హిందూస్థాన మంతకు నార్యావర్త మనిపేరు. వశిష్ఠస్మృతి బోధాయనసూత్రముల ప్రకారము, పతంజలి వ్యాకరణమహాభాష్యప్రకారమును, హిమవంతము పారియాత్రము కాలకవనము ఆదర్శము ననుకొండ లార్యావర్తమునకు, వరుసఁగ నుత్తరదక్షిణపూర్వపశ్చిమ హద్దులు. పారియాత్రము వింధ్యలోని పశ్చిమభాగమునకుఁ బేరు. కాలకవనము బర్మాకును తూర్పు బంగాళమునకును, నడుమనుండు కొండలు. ఆదర్శము పంజాబునకును బెలూచిస్థాను ఆఫ్ఘనిస్థానులకును నడుమనుండు సులీమాను కొండల గుంపు. ఆర్యావర్తమన సామాన్యముగ నుత్తరహిందూస్థానమని చెప్పవచ్చును. ఇప్పటి యాదేశాచారవ్యవహారములలో ననేకములు బహుకారణములచే మన్వాది ధర్మశాస్త్రములలోఁ జెప్పఁబడినవానికంటెఁ జాల భిన్నములుగ నున్నవి. కాన నవి మనకుపాదేయములు కావు. వింధ్యకు దక్షిణమున నున్న కిష్కింధ గంధిక శక యవన శౌర్యక్రౌంచాదులగు దేశముల

లోని గ్రామఘోషనగరాగులలోఁగూడ నార్యులు నివసించిరని వ్యాకరణభాష్యాదులలో నున్నది. ఆర్యావర్తమునుండి యీదేశములున్న దక్షిణహిందూస్థానమున కార్యులలో గొందఱు వచ్చి కాపురముఁజేసిరని తెలుసు. దీని కనుకూలముగ, క్రీస్తు పుట్టుటకు ౯,౬ శతాబ్దులకు ముందున్న ౨౫౦౦ ఏండ్లక్రింద నున్న బోధాయనులు, శిష్టులు (ఆర్యులు) ఉత్తరదక్షిణోభయదేశములందు గలరనియు, వారివారి యాచారములు (ధర్మశాస్త్రమునకు విరుద్ధము లయినను) సదాచారములు గాన నాయాదేశములందు నంగీకరింపవలసిన దనియుఁ జెప్పి కొన్ని దృష్టాంతము లిచ్చిరి. అవి యేవియన:—వింధ్య మొదలు కన్యాకుమారివఱకు నుండు పంచద్రావిడ (గూర్జర మహారాష్ట్ర కర్ణాటకాంధ్ర ద్రావిడ) దక్షిణ హిందూదేశములో, ఉపనయనము గాని పిల్లవానితోను భార్యతోను జొత్తులో నన్నమును తినుటయు, చద్దియన్నమును (తరవాణి) దినుటయు, మేనమామ మేనత్తకూతులను బెండ్లియాడుటయు అను నైదాచారము లనాదిగ వచ్చుచున్నవి గాన వానిని మన శిష్టు లంగీకరించిరి. బొమ్మ అమ్మి జీవించుటయు, భంగు త్రాఁగుటయు గుఱ్ఱము కంచరగాడిదె లోనగువానితో వ్యాపారము జేయుటయు బ్రాహ్మణాదులు సిపాయికొలువులోఁ బ్రవేశించి కత్తిపట్టుకొని జీవించుటయు, వారు సముద్రయానముఁ జేయుటయు, నుత్తరదేశశిష్టు లంగీకరించినారు కాన వానిని మనము నిందింపఁ గూడదు. ఇప్పుడు రైలు మొదలగు ప్రయాణాదిసౌకర్యములు మెండుగ నుండుటచేతను మనదేశము పరరాజ్యపరిపాలనములో నుండుటచేతను పరదేశములకు విద్యావాణిజ్యాదుల నిమిత్తము వెళ్లినఁగాని ధనార్జన నాగరకత దేశాభివృద్ధియుఁ గలుగమిని స్వరాజ్య సంపాదనమునకు ముఖ్యముగ నింగ్లాండు లోనగు దేశములకు వెళ్లి యక్కడ నున్న ప్రజలతోను మంత్రులతోను నా విషయమై చర్చించుటకు యవసరము గనుకను, హిందూస్థానమునం దంతటను పైని చెప్పిన పది యాచారములే గాక ఇతరాచారములు గూడ మన మభ్యసింపవలసిన కాలము వచ్చెను. ఈ పదింటిని గౌతముఁ డొప్పకున్నను క్రీస్తు పుట్టిన వెనుక ౧౪-వ శతాబ్దిలో నున్నట్టియు, శ్రుతి స్మృతి వ్యాఖ్యాతయు సర్వజ్ఞుఁడు నగు మాధవాచార్యులు కూడ నంగీకరించిరి. నేటికిని వాని ప్రచారము మెండుగఁ గలదు.

౨. వర్ణోత్పత్తిక్రమము

వర్ణోత్పత్తి వేదగత మగు పురుషసూక్తములో నిట్లున్నది: "బ్రాహ్మణోఽస్య ముఖ మాసీత్ బాహూ రాజన్యః కృతః ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత." దీని కర్థము: భగవంతుఁడు పురుషరూపము నెత్తి సృష్టిచేయుటలో ముఖమున బ్రాహ్మణులను, బాహువులఁ క్షత్త్రియులను, తొడల వైశ్యులను, పాదముల శూద్రులను బుట్టించెను. ప్రాచ్య పాశ్చాత్యులు దీని యర్థము నిట్లు వివరించిరి: విద్యను, దేహబలమును, ఓర్పును సేవను వరుసఁగ మోము బుజములు తొడలు కాళ్లు సూచించును గాన భగవంతుని యవయవముల నుండి నాలుగు వర్ణములవారు గలిగినట్లు చెప్పఁబడిన దని పురుషసూక్తవాక్యమునకుఁ దాత్పర్యము. ఆ నలుగురు తెలుపు, ఎఱుపు, పసుపు, నలుపు, రంగులు గలవారనియుఁ బురాణములలో జెప్పఁబడినది గాన వర్ణ మనఁగ రంగని మొదటి యర్థము. ఈ పురుషసూక్తార్థము బృహదారణ్యోపనిషత్తులో నిట్లు వివరింపఁబడినది:

"బ్రహ్మ వా ఇద మగ్ర ఆసీ దేక మేవ తదేకగ్ం స న్న వ్యభవత్, త చ్ఛ్రేయోరూప మత్యసృజత. క్షత్త్రం యా న్యేతాని దేవత్రా క్షత్త్రాణీంద్రో వరుణ స్సోమో రుద్రః పర్జన్యో యమో మృత్యు రీశాన ఇతి తస్మాత్ క్షత్త్రా త్పరం నాస్తి తస్మాద్బ్రాహ్మణః క్షత్త్రియ మధస్తా దుపాస్తే రాజసూయే క్షత్త్ర ఏవ తద్యశో దధాతి సైషా క్షత్త్రస్య యోని ర్యద్బ్రహ్మ. తస్మా ద్యద్యపి రాజా పరమతాంగచ్ఛతి బ్రహ్మైవాంతత ఉపనిశ్రయతి స్వాం యోనిం య ఉ ఏనగ్ం హినస్తి స్వాగ్ం స యోని మృచ్ఛతి స పాపీయా న్భవతి యథా శ్రేయాగ్ంసగ్ం హిగ్ంసిత్వా. ౧౧. స నైవ వ్యభవ త్స విశ మసృజత యా న్యేతాని దేవజాతాని గణశ ఆఖ్యాయంతే వసవో రుద్రా ఆదిత్యా విశ్వేదేవా మరుత ఇతి ౧౨. స నైవ వ్యభవ త్స శౌద్రం వర్ణ మసృజత పూషణ మియం వై పూషేయగ్ం హీదగ్ం సర్వం పుష్యతి యదిదం కించ. ౧౩. స నైవ వ్యభవ త్తచ్ఛ్రేయోరూప మత్యసృజతధర్మం తదేతత్ క్షత్త్రస్య క్షత్త్రం యద్ధర్మ, స్తస్మా ద్ధర్మాత్పరం. ౧౪. త దేత ద్బ్రహ్మ క్షత్త్రం విట్ శూద్ర స్తదగ్నినైవ దేవేషు బ్రహ్మ భవ ద్బ్రాహ్మణో మనుష్యేషు క్షత్త్రియేణ క్షత్త్రియో వైశ్యేన వైశ్య శ్శూద్రేణ శూద్రః " ౧౫."

సృష్టికాలమున దేవతలలో నగ్నిరూప మెత్తిన బ్రహ్మ మనుష్యులలో బ్రాహ్మణుఁడుగ మారెను. తర్వాత వారి కర్మపరిపాలనము కొఱకు బ్రాహ్మణులవలన క్షత్త్రియులను, ధాన్యాది సంపాదనము కొఱకు బ్రాహ్మణులవలన వైశ్యులను, బ్రాహ్మణకర్మపోషణము కొఱకు వారివలన శూద్రులను బుట్టించి వర్ణవిభాగముఁ జేసెను. కాన నొకటియే వర్ణ మనియు, రాను రాను బ్రాహ్మణులు విస్తరించుకొలది పరులగు మ్లేచ్ఛాదులు వారి నాక్రమింప వారి శ్రౌతాది కర్మములను జెడకుండఁ జేయుటకు రాజులును, భూమినుండి పంటపండించి దేశీయులకు దానిని వ్యాపింపఁజేసి ధనసమృద్ధి చేయుటకు వైశ్యులును, వారి ముగ్గురను సేవించుకొఱకు శూద్రులును, నా బ్రాహ్మణులలోనివారే వారి గుణకర్మముల నాశ్రయించి యుదయించినట్లు పై శ్రుతి చెప్పుచున్నది. దాని యర్థము నే భగవద్గీత యనువదించుచున్నది: (చూ. గీ. ౪ అ. ౧౩ శ్లో.) బృహదారణ్య శ్రుతి ననుసరించి దేవతలలోఁ గూడ బ్రాహ్మణాది వర్ణవిభాగము కలదని రంగరామానుజులు శ్రుతప్రకాశాచార్యులును వ్యాఖ్య జేసిరి. జ్యోతిశ్శాస్త్రములు గూడ గ్రహములలో వర్ణవిభాగముఁ గావించెను. ద్వైతాఽద్వైతాచార్యు లీ శ్రుతులు దేవతావర్గ విభాగము విషయమయి యర్థవాదము లని నుడివి మనుష్యులలోని బ్రాహ్మణాదివర్ణులకు, నగ్ని యింద్రాది దేవత లధిష్ఠాతలు గాన వారి వర్ణములు గూడ నా

దేవతల కుపచారకములుగఁ బ్రయోగింపఁ బడినవి యనిరి. శంకరులు గీతాభాష్యములో (గీ. ౪-౧౨.) మనుష్యలోకములో మాత్రమే వర్ణ విభాగము కలదని వ్రాసిరి. రామానుజులు 'మానుషేలోకే' అను వాక్యము స్వర్గముఁగూడఁ దెలియఁజేయు ననిరి. కాన దేవతలలో విభాగ మున్నను లేకున్నను మనుష్యజాతిలోనున్నట్లు స్పష్టము. భాగవతపంచమస్కంధములో జంబూద్వీపమువంటివలె లక్కిన ద్వీపములలోఁగూడ చాతుర్వర్ణ్యము కలదు అని యున్నది.

౧ జంబూద్వీపములో:—

బ్రాహ్మణుఁడు　క్షత్త్రియుఁడు　వైశ్యుఁడు　శూద్రుఁడు

౨ ప్లక్షద్వీపములో:—

హంసుఁడు　పతంగుఁడు　ఊర్ధ్వాయనుఁడు　సత్యాంగుఁడు

౩ శాల్మలిద్వీపములో:—

శ్రుతిధరుఁడు　వీర్యధరుఁడు　వసుంధరుఁడు　ఇషంధరుఁడు

౪ కుశద్వీపములో:—

కుశలుఁడు　కోవిదుఁడు　అభియుక్తుఁడు　కులకుఁడు

౫ క్రౌంచద్వీపములో:—

గురువు　ఋషభుఁడు　ద్రవిణుఁడు　సేవకుఁడు

౬ శాకద్వీపములో:—

ఋతవ్రతుఁడు　సత్యవ్రతుఁడు　దానవ్రతుఁడు　అనువ్రతుఁడు

పుష్కరద్వీపములోమాత్రము నొకటియే వర్ణము.

కాన బ్రాహ్మణక్షత్త్రియవిట్ఛూద్రులవలె నితరద్వీపములలోఁ గూడ వర్ణవిభాగముండుట సహజము. అట్లు లేనియెడల సంఘము లోని వ్యవహారవ్యవస్థ బాగుగ నుండనేరదు.

పై నుదాహరించిన బృహదారణ్యశ్రుత్యర్థమును మహాభారత పురాణాదులుగూడ ననువదించుచున్నవి:

శ్లో. "న విశేషోఽస్తి వర్ణానాం సర్వం బ్రాహ్మ మిదం జగత్
బ్రహ్మణా పూర్వసృష్టంహి కర్మభి ర్వర్ణతాం గతం.
కామభోగప్రియా స్తీక్ష్ణాః క్రోధనాః ప్రియసాహసాః
త్యక్తస్వధర్మా రక్తాంగా స్తే ద్విజాః క్షత్త్రతాం గతాః.
గోభ్యో వృత్తిం సమాస్థాయ పీతాః కృష్యుపజీవినః
స్వధర్మా న్నానుతిష్ఠంతి తే ద్విజా వైశ్యతాంగతాః.
హింసానృతప్రియా లుబ్ధా స్సర్వకర్మోపజీవినః
కృష్ణా శ్శౌచ పరిభ్రష్టా స్తే ద్విజా శ్శూద్రతాంగతాః.
ఇత్యేతైః కర్మభి ర్వ్యస్తా ద్విజా వర్ణాంతరం గతాః.

మ. భా. శాం. ౧౮౮.

శాంతిలో ౧౮౯ అధ్యాయములో బ్రాహ్మణ క్షత్త్రియ శూద్ర మ్లేచ్ఛ పిశాచ రాక్షసాదుల గుణకర్మములను జెప్పి తుదకు

"శూద్రే చైత ద్భవే ల్లక్ష్యం ద్విజే తచ్చ నవిద్యతే,
నవై శూద్రో భవే చ్ఛూద్రో బ్రాహ్మణో నచ బ్రాహ్మణః"

(౮) అని భృగువు భరద్వాజులతోఁ జెప్పెను. ఇచట 'శూద్రే చేతి ఏత త్సత్యాది సప్తకం ద్విజే త్రైవర్ణికే, ధర్మఏవ వర్ణవిభాగే కారణం నజాతి రితి' అని నీలకంఠవ్యాఖ్య. కాన జాతి తెలియనప్పుడు సత్యశమాదిగుణముల కలనకె వర్ణము నిర్ణయింప నగు. అట్లే సత్యము పలికినందువలన సత్యకాము జాబాలి బ్రాహ్మణుఁ డని నిర్ణయింపఁబడి నట్లు ఛాందోగ్యశ్రుతి చెప్పుచున్నది. పూర్వోదాహృతశాంతిపర్వ గతాధ్యాయార్థమును వాయు పాద్మ గరుడ వామన నృసింహాదిపురాణము లనువదించుటయే గాక యీ యర్థమునే శంకరులు సర్వసిద్ధాంతసంగ్రహములో వ్యాసమత మని ఈ తీరున వివరించిరి:—

"చతుర్వ్యూహాత్మకో విష్ణు శ్చతుర్ధైవాఽకరో జ్జగత్
బ్రహ్మక్షత్త్రియవిట్ఛూద్రాం శ్చాతుర్వర్ణ్యాన్ గుణాత్మకాన్.
విప్ర శ్శుక్లో నృపో రక్తః పీతో వైశ్యోఽంత్యజోఽసితః
విస్తృత్య ధర్మశాస్త్రేహి తేషాం కర్మ సమీరితం.
ఏకస్మిన్నేవ వర్ణేతు చాతుర్వర్ణ్యం గుణాత్మకం
మోక్షధర్మేఽధికారిత్వసిద్ధయే ముని రభ్యధాత్.
స కర్మ దేవతాయోగ జ్ఞానకాండే ష్వనుక్రమాత్
ప్రవర్తయతి తత్కర్మపరిపాకక్రమం విదన్.
ఋజవ శ్శుద్ధవర్ణాభాః క్షమావంతో దయాళవః
స్వధర్మనిరతా యేస్యు స్తే ద్విజేషు ద్విజాతయః.
కామభోగప్రియా స్తీక్ష్ణాః క్రోధనాః ప్రియసాహసాః
త్యక్తస్వధర్మరక్తాంగా స్తే ద్విజాః క్షత్త్రతాం గతాః.
"గోషు వృత్తిం సమాధాయ పీతాః కృష్యుపజీవినః
న స్వకర్మ కరిష్యంతి తే ద్విజా వైశ్యతాం గతాః
హింసా నృత ప్రియాః క్షుద్రా స్సర్వకర్మోపజీవినః
కృష్ణా శ్శౌచ పరిభ్రష్టా స్తే ద్విజా శ్శూద్రతాం గతాః."

—౪౭-౫౬ శ్లోకములు.

వీని తెలుఁగర్థ మిట్లు : నాలుగు వ్యూహము (వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులు) లను రూపములు గల విష్ణువు జగత్తును నాలుగు విధములు (ఉద్భిజ, స్వేదజ, అండజ, జరాయుజములు)గను, బ్రాహ్మణ క్షత్త్రియ వైశ్య శూద్రులను, వారి వారి గుణానుసారముగను, సృజించెను. బ్రాహ్మణుని వర్ణము తెలుపు, క్షత్త్రియునివర్ణ మెఱుపు, వైశ్యునివర్ణము పసుపు, శూద్రునిరంగు నలుపు. వారి వర్ణాశ్రమ ధర్మములు ధర్మశాస్త్రయందు వివరింపఁబడినవి. ప్రతి వర్ణము వారికి మోక్షమును బొందు నధికారము గలదని చెప్పుటకుఁ బ్రతివర్ణములో గుణముల ననుసరించి నాలుగు వర్ణముల స్వభావముగలవా రున్నా రని వేదవ్యాసులు సెలవిచ్చిరి. వారికర్మ పరిపాకక్రమము ననుసరించి, వేదోక్త కర్మకాండయందుఁ గొందఱను, దేవతాకాండయందు గొందఱను, జ్ఞానకాండయందుఁ గొందఱను నభిరుచిఁ గలిగించి వ్యాసులు ప్రవేశఁ బెట్టించెను. బ్రాహ్మణజాతిలోఁ బుట్టినవారిలో, న్యాయ ప్రవర్తనము గలవారు శుద్ధమగు వర్ణకాంతి గలవారు ఓర్పుగలవారు దయాళువులు స్వధర్మనిరతులు మాత్రమే నిజమయిన బ్రాహ్మణులు. తమ కిష్టము లగు విషయముల ననుభవింప నాసపడువారు, తీక్ష్ణులు, కోపము గలవారు, సాహసులు, స్వస్వధర్మములను వదలినవారు, ఎఱుపు రంగు దేహకాంతి గలవా రగు బ్రాహ్మణజాతి వారే, క్షత్త్రియు లైరి. పశువులను పాలించువారు పచ్చని రంగు గల

వారు, వ్యవసాయవృత్తివలన జీవించువారు (కాన) స్వకర్మమును జేయనివారగు బ్రాహ్మణజాతివారే వైశ్యు లయిరి. భూతహింసను గావించువారు, అసత్యము నాడువారు, అల్పులు, తమ పొట్టకొఱకే పని నైనను జేయువారు నల్లనివారు శౌచము లేనివారు నగు బ్రాహ్మణజాతివారే శూద్రు లయిరి.

౮. వర్ణోత్పత్తికాలము

వర్ణోత్పత్తికాలమును గూర్చి భగవానులగు శ్రీకృష్ణు లుద్ధవున కిట్లు సెలవిచ్చిరి: (భా. ౧౧ స్కం. ౧౭ అ. ౮-౧౪ శ్లో)

"ధర్మ్య ఏష తవ ప్రశ్నో నైశ్శ్రేయసకరో నృణాం
వర్ణాశ్రమాచారవతాం త ముద్ధవ నిబోధ మే
ఆదౌ కృతయుగే వర్ణో నృణాం హంసఇతి స్మృతః
కృతకృత్యాః ప్రజా జాతా స్తస్మా త్కృతయుగం విదుః
వేదః ప్రణవఏవాగ్రే ధర్మోఽహం వృషరూపధృత్
ఉపాసతే తపోనిష్ఠా హంసం మాం ముక్తకిల్బిషాః
త్రేతాముఖే మహాభాగ! ప్రాణా న్మే హృదయా త్త్రయీ
విద్యా ప్రాదురభూ త్తస్యా అహామాసం త్రివృన్మఖః
విప్రక్షత్రియవిట్ఛూద్రా ముఖబాహూరుపాదజాః
వైరాజా త్పురుషా జ్జాతా య ఆత్మాచారలక్షణాః
గృహాశ్రమో జఘనతో బ్రహ్మచర్యం హృదో మమ
వక్షస్థలాద్వనే వాసో న్యాస శ్శీర్షణి సంస్థితః
వర్ణానా మాశ్రమాణాంచ జన్మభూమ్యనుసారిణః
ఆస న్కృతయుగే నృణాం నీచైర్నీచో త్తమో త్తమాః."

వీని తెలుఁగర్థమిది: ఉద్ధవా! నీప్రశ్నంబు ధర్మవిరుద్ధంబు వర్ణాశ్రమాచారవంతులైన నరులకు మోక్షదాయకంబు; దానిం జెప్పెద నాకర్ణింపుము. కల్పాదియందలి కృతయుగంబునందు నరుల వర్ణము హంసాఖ్యం బయ్యె. అందు జనులు జన్మమాత్రమునఁ గృతకృత్యు లైరి. కావున నయ్యుగంబు కృతం బనం బఱగె. తొలుతఁ బ్రణవ మొక్కండే వేదంబు. వృషరూపధరుండైన నేను ధర్మంబు. జనులు తపోనిష్ఠులయి ముక్తకిల్బిషులయి హంసరూపధరుండైన న న్నుపాసింతురు. పిదపఁ ద్రేతాయుగంబున నాహృదయమునుండి త్రయీవిద్య యావిర్భవించుటయు హోత్రాధ్వర్యౌద్గాత్రములఁ ద్రిరూపంబైన యజ్ఞంబు నేనైతి. అప్పుడు వైరాజపురుషుని ముఖబాహూరుపాదముల నాత్మాచారలక్షణంబులతో బ్రహ్మక్షత్రియవిట్ఛూద్రులు జనించిరి. మదీయజఘనహృదయవక్షస్థలశీర్షములం గ్రమమున గార్హస్థ్యబ్రహ్మచర్యవనస్థతాసన్యాసాశ్రమంబు లుదయించె. జన్మస్థానములకుఁ దగినట్లు నరులకు వర్ణాశ్రమంబులు నీచోత్తమమధ్యమప్రకృతు లేర్పడియె. కాన వేదయజ్ఞవర్ణాశ్రమధర్మములకుఁ ద్రేతాయుగమునుండి మనదేశములోఁ బ్రచారముగలిగినట్లు దీనివలనఁ దేలును. భూతభవిష్యద్వేదులై యోగసిద్ధులగు అనిబెసంటమ్మ లెడ్బీటరుగార్లు (Man or) 'మానవోత్పత్తివృద్ధి' యను నింగ్లీషుగ్రంథములో (౩౩4-౩౩౭ పుట) జగత్సృష్టి పిదపఁ జాలకాలము క్రింద నీదేశములో నార్యవ్యాప్తి గలిగినట్లు వ్రాసిరి:

ఇప్పటికి సుమారు ౧౧,౫౦౦ ఏండ్ల క్రింద నార్యులు వారి జన్మభూమి నుండి అఫ్ఘనిస్థానమును బెలూచిస్థానమును ప్రవేశించి అక్కడ ౨౦౦౦ ఏండ్లుండి పిదప భరతఖండమునకు గాసాగిరి. అక్కడ చాలమంది 'అట్లాంటియను' (Atlantians) 'అట్లాంటో-లెమోరియన్' (Atlanto-Lemorians) జాతు లుండుటచే వారితో నార్యులు సంబంధము చేయు భీతి నాపహిల్లి వివాహము చేయఁ కూడ దని వైవస్వతమను వాజ్ఞచేసి యిప్పటికి సుమారు ౮౦౦౦ ఏండ్ల క్రింద వర్ణవ్యవస్థ నేర్పాటు చేసిరి. మొదట బ్రాహ్మణ క్షత్రియ వైశ్య లను మూఁడు వర్ణములనే మను వేర్పఱిచెను. బ్రాహ్మణులు శుద్ధార్యులు. క్షత్రియులు ఆర్యులును (Aryans) టాల్టెక్కులు (Taltecs) ను గలిసిన సంతతివారు, వైశ్యు లార్యులు మంగోలియనుల సంతతివారు అక్కడనుండి యీ జాతులకు వర్ణములను రంగు లేర్పడినవి. స్వచ్ఛు లగు నార్యులు (బ్రాహ్మణులు) తెల్లనివారు. ఆర్యులు టాల్టెక్కులు కలిసినమీద బుట్టిన క్షత్రియుల రంగు ఎఱుపు. ఆర్యమంగోలియనుల మిశ్రణమువలనఁ గలిగిన వైశ్యుల రంగు పసుపు. మొదట నీ మూఁడు వర్ణములవారు పరస్పరము పెండ్లియాడ నంగీకరించిరి. తర్వాత నే వర్ణమువారు ఆ వర్ణమువారిలో మాత్రమే పెండ్లిచేసికొను నియమము నంగీకరించిరి. పిదప నార్యులు కాని వారికి అందఱకు శూద్రు లని పేరు గలిగె. ఈ శూద్రదేహములలోఁ గూడ గొంతవఱకు నార్యరక్తము వ్యాపించినది. కొందఱి వారిలో చాలమందిలో నార్యరక్తము కొంత ప్రసరించినది. కొందఱు పూర్తిగ నార్యులే!

౯. వర్ణవిభాగము గుణకర్మానుసృతము

ఈ వర్ణధర్మములకుఁ గారణములు వానిని చేయువారి పూర్వ గుణకర్మము లని భగవంతు లర్జునునకు 'చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః' (గీ. ౪-౧౩. శ్లో.) అని సెలవిచ్చిరి. దానికిఁ బ్రమాణముగ 'బ్రాహ్మణోఽస్య ముఖ మాసీత్' లోనుగాఁ గల శ్రుతుల శంకరాచార్యు లుదాహరించిరి. ఆనందగిరులు వర్ణాశ్రమ ధర్మోత్పత్తియు దానిహేతువులు నీశ్లోకములోఁ జెప్పఁబడిన వనిరి. దీనిలోని 'గుణ' శబ్దమునకు సత్త్వరజస్తమము లని శాంకరభాష్యము.

'బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప,
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవై ర్గుణైః."

గీత. అ. ౧౮. శ్లో. ౪౧.

ఇక్కడ స్వభావశబ్దమునకు మూఁ డర్థములను శంకరులు స్వీకరించిరి. (౧) స్వభావ మనః—ఈశ్వరప్రకృతియుఁ ద్రిగుణాత్మికమును నగు మాయ (౨) బ్రాహ్మణాదిస్వభావమునకు సత్త్వాదిగుణవికారము కారణము, (3) పూర్వజన్మమందుఁ జేసిన కర్మముయొక్క వాసనారూప మగు సంస్కారము. ఆ సంస్కారము ప్రాణు లిప్పటి జన్మమునఁ జేయఁబోవు కార్యములను ప్రకటించును గాన దానిని స్వభావ మందురు. ఆ స్వభావము గుణములకు హేతువు. దీనికి ఆనందగిరి యిట్లు టీకను వ్రాసెను. ప్రాణుల పూర్వజన్మవాసన

ఈ ప్రకృతజన్మములో నభివ్యక్తము లగు ప్రాణుల సత్వాదిగుణము లకు నిమిత్తకారణము. ఆగుణములకు నుపాదానకారణము ప్రకృతి ("ప్రకృతిజై ర్గుణైః") గుణములు కారణము లేనిది పుట్టవు గనుక వాని యుభయకారణములను నానందగిరులు తేటపఱచిరి. సాంఖ్యులు గూడ నాత్మలు గుణకర్మవశముచే బ్రహ్మ మొదలు స్థావరము వఱకు సృష్టిలో నుండు రూపములను ధరించుచున్నా రనిరి. సర్వసిద్ధాంతసంగ్రహములోని 30 వ శ్లోకముం జూపెదము.

"ఆత్మానః ప్రళయే లీనాః ప్రకృతౌ సూక్ష్మదేహినః,
గుణకర్మవశా ద్బ్రహ్మ స్థావరాంత స్వరూపిణః."

ప్రళయములో జీవులు తమ సూక్ష్మదేహములతోఁ బ్రకృతిలో లీనమై వాని గుణకర్మముల ననుసరించి సృష్టిలో బ్రహ్మ మొదలు స్థావరమువఱకు నుండు దేహములను బొందుచున్నవి.

౬. వర్ణపరిణామము, తత్కారణము

సాధారణముగ నొక వర్ణమువారు మఱియొక వర్ణముగ మాఱుట లేదు. ఈ నియమమునకు హేతువు వారి సూక్ష్మశరీరముల లోని భూతసూక్ష్ముల భేదము లని అనిబిసెంటమ్మ గారు The Pidigree of man అను గ్రంథములో వ్రాసిరి. వర్ణాశ్రమధర్మానుష్ఠానము బాగుగ నున్నప్పుడే యీనియమమున కపవాద మరుదుగఁ గలిగినట్లు విశ్వామిత్రఋష్యశృంగులే దృష్టాంతము. కాన నొక జన్మమందే వర్ణము మాఱుట పుణ్యపాపకర్మోత్కటమువలనఁ గలుగు నని మనువుగూడ తన స్మృతిలో నిట్లు సెలవిచ్చిరి :—

తపోబీజప్రభావైస్తు తే గచ్ఛంతి యుగే యుగే,
ఉత్కర్షం చాఽపకర్షం చ మనుష్యే ష్విహ జన్మతః
శనకైస్తు క్రియాలోపా దిమాః క్షత్త్రియజాతయః,
వృషలత్వం గతా లోకే బ్రాహ్మణాదర్శనేన చ.
పౌండ్రకా శ్చౌఢ్ర ద్రవిడాః కాంభోజా యవనా శ్శకాః,
పారదా పహ్లవా శ్చీనాః కిరాతా దరదా శ్శకాః" (౧౦-౪౨-౪౪)

నాలుగుజాతులలోఁ బుట్టినవారును ప్రతిలోమానులోమజాతులం దుదయించిన వారును, (విశ్వామిత్రునివలెఁ) దపోప్రభావముచేతను (ఋశ్యశృంగునివలె) బీజప్రభావముచేతను, అన్ని యుగము లందు నుత్కృష్టతను పొందుచున్నారు. అట్టి ప్రభావము లేనందున నీ జన్మమందే తక్కువ వర్ణమును పొందుచున్నారు. బ్రాహ్మణుని సేవింపక పోవుటచేతను నుపనయనము మొదలగు కర్మముల లోపముచేతను మీఁదఁ జెప్పఁబడిన క్షత్త్రియజాతులు నానాట శూద్రత్వముఁ బొందిరి. పౌండ్రకము, ఓఢ్రము, ద్రవిడము, కాంభోజము, యవనము, పారదము, శకము, అను దేశముల నేలినవా రందఱు మీఁదఁ జెప్పినట్లు శూద్రు లయినారు. పృషధ్రుఁ డను క్షత్త్రియుఁడు గురుశాపముచే శూద్రత్వమును, దిష్టుఁ డను క్షత్త్రియ సుతుండగు నాభాగుఁడు కర్మముచే వైశ్యత్వమును నా జన్మమునందే పొందిరని యున్నది. "(భాగ. ౯. ౨ అ. ౯. ౨౩ శ్లో.) మఱియు క్షత్త్రియుఁ డగు గర్గునకు శిని, అతనికి గార్గ్యుండు బుట్టిన నా వంశము బ్రహ్మకులం బయ్యె. మహావీర్యునకుఁ ద్రయ్యారుణి, కవి, పుష్కరారుణి యను ముగ్గురు కొడుకులు పుట్టి బ్రాహ్మణు లైరి......అజమీఢునకుఁ బ్రియమేధాదు లయిన కొందఱు తనయులు జనించి బ్రాహ్మణు లయిరి." (భా ౯-౨౧-౧౭, ౨౦ శ్లో.) ఇట్టి దృష్టాంతము లన్ని స్కంధములలోఁ గూడఁ బెక్కులు గలవు. విశ్వామిత్రా జామదగ్ని పరశురాదేవాదులు క్షత్త్రియులై యుదయించి తుదకు బ్రహ్మర్షు లయి నట్టు భారత శ్రీమద్భాగవతాదులలో నున్నది. క్షత్త్రియుఁ డగు వీతహవ్యుఁడు భృగ్వనుగ్రహముచే వారి యాశ్రమములో బ్రాహ్మణుఁ డాయెను. ఆపస్తంబులు గూడ నిట్లే సెల విచ్చిరి:—"ధర్మచర్యయా జఘన్యో వర్ణః పూర్వం పూర్వం వర్ణ మాపద్యతే జాతిపరివృత్తౌ" అధర్మచర్యయా పూర్వోవర్ణోఽన్యం వర్ణ మాపద్యతే జాతిపరివృత్తౌ (౯-౧౦-౧౧) "వర్ణోత్కర్ష మవాప్నోతి నరః పుణ్యేన కర్మణా" (శాం. ౨౯౧ అ. ౯ శ్లో) అని వర్ణారోహణమును వక్కాణించుచున్నది.

శ్లో. "జ్ఞానవిజ్ఞానసంపన్న స్సంస్కృతో వేదపారగః
విప్రో భవతి ధర్మాత్మా క్షత్త్రియ స్స్వేన కర్మణా
ఏతైః కర్మఫలై ర్దేవి! న్యూనజాతికులోద్భవః
శూద్రో ప్యాగమసంపన్నో ద్విజో భవతి సంస్కృతః
బ్రాహ్మణో వాఽప్యసద్వృత్త స్సర్వసంకరభోజనః
బ్రాహ్మణ్యంతు సముత్సృజ్య శూద్రో భవతి తాదృశః
కర్మభిః శ్శుచిభి ర్దేవి! శుద్ధాత్మా విజితేంద్రియః
శూద్రోఽపి ద్విజవ త్సేవ్య ఇతి బ్రహ్మానుశాసనం
స్వభావం కర్మచ శుభం యత్ర శూద్రోఽపి తిష్ఠతి
విశిష్ట స్స ద్విజాతే ర్వై విజ్ఞేయ ఇతి మే మతిః."

భా. అను ౧౪౩ అ. శ్లో. ౪౬. ౪౭.

ఈశ్లోకములలో శివుఁడు పార్వతికి వర్ణారోహణావరోహణములు వృత్తమువలనఁ గలుగు నని యిట్లు నిగమించెను.

"న యోని ర్నాఽపి సంస్కారో న శ్రుతం న చ సంతతిః,
కారణాని ద్విజత్వస్య వృత్త మేవ తు కారణం"

(౯౦)=జన్మముగాని సంస్కారముగాని విద్యగాని వంశముగాని ద్విజత్వమునకు హేతువు గాదు వృత్త మొకటియే దానికిఁ గారణము. ధర్మరాజుగూడ నిట్లే నహుషునకు త్తర మిచ్చెను:—సత్యము, దానము, క్షమ, శీలము, అహింస, తపస్సు, దయ, ఎవనియం దున్నవో యతఁడే బ్రాహ్మణుఁ డనియు లేనివాఁడు శూద్రుం డనియు నిర్ణయింపవలయును గాని జాతిచేతనే వర్ణనిశ్చయముఁ జేయఁదగదు. కాన వృత్తమే బ్రాహ్మణాదినిర్ణయమునకు హేతు వనుటకు స్మృతిభారతాదికము ప్రమాణము.

౭. గుణకర్మజాతుల బలాబలములు

కాని "తపస్సు, శాస్త్రపాండిత్యము, జాతి అని బ్రాహ్మణ వర్ణమునకు మూఁడు హేతువులు గాన, తపస్సు శాస్త్రపాండిత్యము లేనిచో జాతికి బ్రాహ్మణుఁడు మాత్ర మగు" నని భగవంతు లగు పతంజలి వ్యాకరణమహాభాష్యములో నిట్లు సెల విచ్చిరి:—

"తపశ్శ్రుతం చ జాతి (యోని) శ్చ త్రయత బ్రాహ్మణకారకం,
తపశ్శ్రుతాభ్యాం యో హీనో జాతిబ్రాహ్మణ ఏవ సః"
ఇట్లే పరాశరులు వ్యాసులు సెలవిచ్చిరి: "బ్రహ్మబీజసముత్పన్నో మంత్ర సంస్కారవర్జితః, జాతిమాత్రోపజీవీ చ స భవేన్నామధారకః." (ప. స్మృతి. అ. 3 ఆ. ౨. చూ. మాధవీయవ్యా.) ఇట్లే సప్తమ భాగవతైకాదశాధ్యాయాంతమందు నారదులు ధర్మరాజునకు వర్ణాశ్రమధర్మముల నుపన్యసించి యిట్లు నిగమించిరి:—"యస్య యల్లక్షణం ప్రోక్తం పుంసో వర్ణాభిసూచకం, య దన్యత్రాపి దృశ్యేత త త్తేనైవ వినిర్దిశేత్ (భా. ౭-౧౧-౩౫) = (ఏవర్ణంబున కేలక్షణంబు సెప్పఁబడియె నయ్యది యితరులలోఁ గన్పట్టు నేని దాన నతనిఁ దద్వర్ణ యోగ్యుం గా నిర్దేశింపఁ దగు). దానికి శ్రీధరాచార్యు లిట్లు టీక వ్రాసిరి:—"శమాదిభి రేవ బ్రాహ్మణాదివ్యవహారో ముఖ్యః న జాతిమాత్రా దిత్యాహ-యస్యేతి-యదితి-అన్యత్ర వర్ణాంతరేపి దృశ్యేత తద్వర్ణాంతరం తే నైవ లక్షణనిమిత్తేనైవ వర్ణేన వినిర్దిశేత్ న తజ్జాతినిమిత్తే నేత్యర్థః" అనఁగ ముఖ్యముగ గుణకర్మములచేతనె వర్ణవ్యవస్థను చేయవలయును గాని జాతిమాత్రముచేత చేయఁదగ దని శ్రీధరాచార్యు లాశ్లోకమున కర్థము వ్రాసిరి. అట్లే శంకరు లపశూద్రాధికరణభాష్యములో విదురధర్మవ్యాధులు సంకరజాతు లైనను సిద్ధులు గాన వారికి వర్ణాశ్రమధర్మనియమములు వర్తింప వని నిర్ణయించిరి. మహారాష్ట్రోత్తరహిందూస్థానములలో నున్న బ్రాహ్మణేతర వర్ణు లగు భక్తులును, దక్షిణదేశమున నుండిన శైవవైష్ణవాదు లగు నికృష్టజాతిభక్తులును, అతివర్ణు లనియు నత్యాశ్రము లనియు నిర్ణయింప నగు.

"అత్యుత్కటై రిహాత్యైస్తు పుణ్యపాపై శ్శరీరభృత్,
ప్రారబ్ధం కర్మ విచ్ఛిద్య భుఙ్క్తే తత్ఫలం బుధాః.
అత్యుత్కటపుణ్యపాపము లొక జన్మములో నొనరించినచోఁ బ్రారబ్ధకర్మఫలమును గూడ నతిక్రమించి యాపుణ్యపాపకర్మములఫల మాజన్మములోనే యనుభవమునకు వచ్చు నని పరాశరులు లఘు యుపపురాణములలో సెలవిచ్చినట్లు మాధవాచార్యులు వ్రాసిరి. స్కాందపురాణమందీశ్వరవరముచే వ్యాఘ్రము గణేశత్వము నొందినట్లును మహాభారతములో నహుషున కింద్రత్వము సర్పత్వము నొక జన్మములోనే కలిగినట్లును గూడఁ జెప్పఁబడినవి. ఈప్రమాణదృష్టాంతము లన్నిటివలనను బ్రాహ్మణాదివర్ణములకు ముఖ్యకారణములు గుణకర్మములు గాని జాతి గా దనియు, నత్యంతాతిశయపుణ్యపాపకర్మాచరణముచే నీచోచ్చవర్ణముల కొక జన్మమందే యారోహావరోహణములు విశ్వామిత్రనాభాగ నహుషాదులవలె నగు ననియుఁ దేలును.

౮. వర్ణాశ్రమధర్మములు

వర్ణాశ్రమధర్మములు రెండు తెఱంగులు:-సాధారణములు నసాధారణములు అని. మన్వాదిస్మృతిపురాణేతిహాసములలో వాని వివరము లున్నవి. ధర్మార్థకామము లగు మూఁడు పురుషార్థములను మాత్రము నుద్దేశించి చేయఁబడినచో లౌకికాలౌకికకర్మములు ప్రవృత్తిరూపము లగుఁ గాని అహంకారమమకారములు లేకయు నాకర్మములఫలమును గోరకయు నాఫలము భగవదర్పణపురస్సరముగ శ్రద్ధాభక్తులతోఁ జేసినచో, అవియే నివృత్తిరూపములై సత్త్వశుద్ధిని గలుగఁజేసి తద్ద్వారా మోక్షదాయకము లగుననియు శాస్త్రకారుల దృఢాశయము. దీనినే పలుమాఱు బహుప్రకారముల భగవంతు లర్జునోద్ధవకుచేలాదులకును భాగవతు లగు నారద ప్రహ్లాదాదులకును నొక్కి యుపదేశించుటచే దీనిని హరియుత మనెదరు. మనము చేయుపనికి 'కర్మ' మని పేరు. శ్రుతిస్మృత్యాదులలో నేవర్ణము వా నేయాశ్రమి ఏ యే కర్మములను జేయ నగు ననియు, సర్వవర్ణములవా రేకర్మమును చేయనగు ననియు నిర్ణయింపఁబడినదానికి 'ధర్మ' మని పేరు. కాన జగత్తులోని ప్రజలను గలిపి రక్షించును గాన 'ధర్మ' మని పేరు గలిగినట్లు మహాభారతములోఁ గలదు—"ధారణా ద్ధర్మ మిత్యాహు ర్ధర్మో ధారయతి ప్రజాః" మ. భా. క. ఉ. శ్లో. ౫౭. కాని 'కర్మ' 'ధర్మ' శబ్దములు శాస్త్రములందుఁ బర్యాయపదములుగ వాడఁబడుచున్నవి. స్వాభిప్రాయకృత మగు కర్మమాత్రము కేవల క్రీడాకర్మము గాని ధర్మ మనిపించుకొన దనియు, నది ప్రయోజనకారి కా దనియు, స్మృతిజ్ఞానముచేఁ జేయఁబడు కర్మమే యనంత ఫలకారి యనియుఁ గూడ వృద్ధు లీ తీరున సెలవిచ్చిరి:—

"స్వాభిప్రాయకృతం కర్మ క్రీడాకర్మైవ కేవలం,
స్మృతిజ్ఞానా దనుష్ఠాన మనంతఫలదం విదుః."

కార్యాకార్యములందు శాస్త్రము ననుసరించి ధర్మమాచరింపవలయు నని గూడ గీతాదిప్రమాణములు చెప్పుచున్నవి.

౯. సాధారణధర్మములు

నరమాత్రు లందఱు హిందువులవలె వర్ణాశ్రమధర్మము లున్నను బౌద్ధులవలె లేకున్నను నాచరింపఁ దగిన ధర్మములను సాధారణ ధర్మము లనియెదరు సత్యము (యథార్థభాషణము గాని సమదర్శనము గాని), దయ (పరులదుఃఖమును పోఁగొట్టవలయు నను కోరిక), తపము (కాయశోషణము), శౌచము (స్నానాదికముచేఁ గలుగు దేహశుద్ధి) తితిక్ష (శీతోష్ణాదిసహనము), యుక్తాయుక్తవివేకము, మనస్సంయమ మను శమము, బాహ్యేంద్రియజయ మను దమము, అహింస (అన్నివిధముల నితరులకుఁ బీడ చేయకుండుట), బ్రహ్మచర్యము (పరస్త్రీవర్జనమును, నిషిద్ధదేశకాలాదులందు స్వస్త్రీవర్జనమును) దానము, స్వాధ్యాయము (యథోచితవిద్యామంత్రజపాదికము), ఆర్జవము (మనస్సులోఁ గౌటిల్యము లేకుండుట), సంతోషము (తనకర్మమువలన లభించినదానితోఁ దృప్తి నొందుట), సర్వులను సమముగఁ జూచు మహాత్ముల సేవ ప్రవృత్తిరూపము లగు నన్ని కర్మములను మెల్లఁగ వదలుట, నరులు సేయు కొన్ని కార్యములవలనఁ బ్రయోజనము పుట్ట కుండుట. అరయుట, మౌనము (వృథాప్రలాపము లేకుండుట), దేహాదివ్యతిరిక్తుఁ డాత్మ యని యనుసంధించుట, అతిథిభృత్యాదిభూతములకుఁ దగిన ట్లన్నవస్త్రాదుల నిచ్చుట, పశ్వాదిసర్వభూతములయెడ విశేషించి మనుష్యులయెడ నాత్మత్వదేవత్వబుద్ధి, మహాత్ములను రక్షించువారి గుణకర్మ

ములను వినుటయుఁ గీర్తించుటయు, హరిస్వరూపగుణవిభూతులను స్మరించుటయుఁ బూజించుటయు, నమస్కరించుటయు దాసుని వలె భగవంతునందు సకలకర్మఫలసమర్పణ మను దాస్యము, హరి యందు విశ్వాసాధిక మగు సఖ్యంబును తన్నుఁ దనవారిని హరిసంబంధు లని భావించి, హరికి వారి నర్పించుట యను నాత్మసమర్పణమును, హరిభక్తిప్రకారంబులు తొమ్మిదియుం గూడ ముప్పదిలక్షణంబులఁ దనరు సర్వాత్మతోషణం బైన యుత్తమధర్మంబు సర్వవర్ణ సాధారణంబు.

౧౦. అసాధారణ (విశిష్ట) ధర్మములు

బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రసంకరవర్ణములలో నాయా వర్ణములకు నాయా యాశ్రమములకుఁ బ్రత్యేకముగ నుండుధర్మము లసాధారణము లనఁబడు. అవి మూఁడు తెఱంగులు:— వర్ణధర్మములు, ఆశ్రమధర్మములు, వర్ణాశ్రమధర్మములు అని. "మంత్రపూర్వకంబుగ గర్భాధానాదిసంస్కారములఁ బడసిన బ్రాహ్మణక్షత్రియవైశ్యులు ద్విజు లనఁబడుదురు. అధ్యయనము (వేదము నర్థముతోఁ జదువుట) యజనము (యజ్ఞాదికర్మలను జేయుట) దానము (ధనాదికముఁ దగినవారి కిచ్చుట) అనునివి, ఆశ్రమోచితకర్మంబులును జన్మకర్మశుద్ధు లైన ద్విజులకు విహితంబులును, "అందు బ్రాహ్మణులకు నధ్యాపనము (వేదము నితరులకుఁ జెప్పుట) యాజనము (యజ్ఞాదికర్మములను జేయించుట) ప్రతిగ్రహము (దానమును దీసికొనుట) లు, జీవనాధారము లగువృత్తులు. రాజులకుఁ బ్రజాపాలనంబు, విప్రేతరులవలనఁ బన్నులు మొదలగువానిఁ గొనుటయు నాపత్సమయంబున యాజనాధ్యాపనంబులును, వృత్తియగుఁ గాని, ప్రతిగ్రహం బెన్నఁడుం దగదు. కృషివాణిజ్య కుసీదగోరక్షణములు వైశ్యులకు వృత్తులు. శూద్రులకు ద్విజసేవ ధర్మమును వృత్తియు. వీనిలోఁ గృష్యాది జీవిక యయాచితధనగ్రహణము నిత్యధాన్యయాచన శిలోంఛవృత్తి (క్రిందఁ బడినగింజల నేఱికొనుట) యను నాలుగు బ్రాహ్మణునకు వృత్తులు. కలిలోఁ గృష్యాదులు బ్రాహ్మణునకు వృత్తులు అని పరాశరు లంగీకరించిరి. వాణిజ్యము, నీచసేవ స్వవృత్తి, అత్యంత నింద్యం బైన నీచసేవ బ్రాహ్మణక్షత్రియులకు నిత్యవర్జనీయంబులు. ఇంద్రియమనోనిగ్రహము, తపము, శౌచము, సంతోషము, పరాపరాధసహనము, ఆర్జవము, జ్ఞానము, దయ, విష్ణుపరత్వము, సత్య మనునివి బ్రాహ్మణలక్షణములు. యుద్ధోత్సాహము, ప్రభావము, ధైర్యము, ప్రాగల్భ్యము, దాన, మాత్మజయము, క్షమ బ్రహ్మణ్యత, ప్రసాదరక్షణ మనునివి క్షత్రియలక్షణంబులు. దేవగుర్వార్య గోభక్తి త్రివర్గపరితోషణమాస్తికత్వము నిత్యోద్యమము నైపుణ్య మనునివి వైశ్యలక్షణంబులు. వినయము శౌచము నిష్కపట మగు స్వామిసేవ, నమస్కారమంత్రమునఁ బంచయజ్ఞాచరణము చౌర్యవర్జనము గోవిప్రరక్షణ మనునివి శూద్రలక్షణంబులు. పతిశుశ్రూష తదనుకూలత్వము తద్బాంధవానువర్తనము తద్వ్రతధారణనిత్యత్వ మనునివి పతివ్రతాలక్షణంబులు. ఇల్లు అలికి ముగ్గువెట్టి ఓరుదీర్చి యలంకరించి గృహోపకరణంబులు నిర్మలములు గావించి తాను నలుఁగువెట్టికొని జలక మాడి కట్టి తోడిగి పూసి కైసేసికొని యలభ్యంబుల కాసింపక లభించినమాత్రమున సంతసిల్లుచు నాలస్యంబును బ్రమాదంబును బరిహరించి ధర్మ మెఱింగి ప్రియసత్యంబుల నుడువుచు శుచియై స్నేహము వినయము శాంతియుం బెంపార నానాకామంబులతోఁ బతితుఁడు గానిపతిని బతివ్రత తజ్ఞతో నుపసర్పించుట ధర్మంబు. శ్రీదేవి హరి నెట్లో అట్లు హరిభావమునఁ బతిని గొలుచుసతి హరితోడి శ్రీవిధమునం బుణ్యలోకమునఁ బతితో సుఖించు. అంత్యజు లైన రజక చర్మకార నట బురుడ కైవర్త భిల్లులకుఁ అంతావసాయు లైన చండాలపుల్కస మాతంగాదులు మున్నగు సంకరజాతులకుఁ జోరత్వము హింసాది పాపవృత్తియుఁ దక్కఁ గులాగతకృత్యంబులు వృత్తి యగు. వేదదర్శనులు ప్రతియుగమున వారివారి స్వభావమున కనుగుణంబుగా విధించినధర్మ మయ్యయివారి కిలోకంబునను నాలోకంబునను సుఖము నాపాదించు. స్వభావముచేఁ దిరిగితిరిగి స్వధర్మంబు నాచరించువాఁడు మెల్లమెల్లన స్వభావజనితకర్మంబును బరిహరించి క్రమమున నైర్గుణ్యంబుఁ గాంచు. ఎల్లప్పుడును బీజములు చల్లుచునే యుండిన గాలక్రమంబున నాక్షేత్రంబు నిర్వీర్యంబై ప్రరోహయోగ్యంబు గాక బీజములకే చేటు గావించువిధమునఁ గర్మములనే మిగులమిక్కిలి యనుష్ఠించుచుం గామములనే సేవించుచుండినం గ్రమంబునఁ గామాసక్తి వీడు. కామములును మొలకవు. మఱియు నాకామములు నశించు. ఘృతము మితముగఁ బోసిన నగ్ని ప్రజ్వరిల్లును గాని యమితముగఁ బోసిన చల్లాఱుఁ గదా. ఏవర్ణంబున కేలక్షణంబు సెప్పఁ బడియె నయ్యది యితరులలోఁ గన్పట్టునేని దాన నతనిఁ దద్వర్ణయోగ్యుం గా నిర్దేశింపఁ దగు:— (ఆంధ్ర వచనభాగవతము సప్తమస్కంధము 206,7 పుటలు). ఈవర్ణధర్మసంగ్రహముచే మన మరయఁ దగిన యంశ మేమనః— ప్రతియుగమున ధర్మములు వేఱనియు, ధర్మాచరణముయొక్క మహాఫలము కామ్యకర్మముల వదలి నిష్కామకర్మ నాచరించి భగవదర్పణమును జేసినఁ గాని సత్త్వశుద్ధి గలుగ దనియుఁ దద్వారా ముక్తి యలవడ దనియుఁ దేలును. ఇందులకుఁ బ్రమాణము:—

> నేహ యత్కించి ద్ధర్మాయ న విరాగాయ కల్పతే,
> న తీర్థపదసేవాయై జీవన్నపి మృతో హి సః.

(భా. 3. ౨3. ౫౬)

స్వభావజనితమైన కర్మమునకు బదులు శాస్త్రవిహిత మగు కర్మము నాచరింపవలయు. శాస్త్రోక్తము లగు కామ్యకర్మములను వదలి నిత్యనైమిత్తికకర్మములను లౌకికకర్మములను నహంకార మమకారఫలాభిసంధులు లేక యనుష్ఠింపవలయు. అట్లయినఁ గాని తీవ్రవైరాగ్య ముదయింపదు. అట్టి విరాగములో సర్వకర్మములు భగవదర్పణము చేయనిది సత్త్వశుద్ధి గలుగ నేరదు. చిత్తమలముపోయి శుద్ధసత్త్వము ప్రకాశించినఁ గాని జ్ఞాన ముదయింపదు. అది ప్రజ్వరిల్లినఁ గాని ముక్తి యలవడదు. ఈన్యాయమే యాశ్రమధర్మములకు ననువర్తించును.

౧౧. ఆశ్రమధర్మములు

బ్రాహ్మణులలో నాలు గాశ్రమములు :—బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థము, సన్న్యాసము. ఉపనయనమైన, పిదప నియమము నవలంబించి గురువునొద్ద వేదమును తదంగములను చదువుచుండుట బ్రహ్మచారిధర్మము. జీవితకాల మంతయు నట్లున్న యెడల వానిని నైష్ఠికబ్రహ్మచారి యందురు. కొంతకాల మట్లుండి తర్వాత గృహస్థాశ్రమమును స్వీకరించువానిని ఉపకుర్వాణుం డందురు. సాంగవేదాధ్యయనమును పూర్తిచేసి పెండ్లిచేసికొని స్వధర్మాచరణమును జేయువాఁడు గృహస్థుఁడు. పుత్రోత్పత్త్యనంతరము వనవాసముఁ జేయుచు ఫలాదులను భక్షించుచు భగవదారాధనముఁ జేయువాఁడు వానప్రస్థుఁడు. భార్యాదిక మగుసర్వసంసారమును త్యజించి తల గొఱిగించుకొని కావిరంగు గల గుడ్డగోచిని బెట్టికొని దండమును కమండలమును ధరించి జనులు లేనిచోటులను తీర్థములందును వసించి, గ్రామములలో భిక్ష మెత్తి భగవదారాధనమును మాత్రముఁ జేయువాఁడు సన్న్యాసి. క్షత్త్రియవైశ్యులకు మొదటి మూఁడాశ్రమములును శూద్రునకు గృహస్థాశ్రమము మాత్రమును, విధింపఁబడినవి. ఈశ్వరారాధనము సర్వవర్ణాశ్రమములకు సాధారణధర్మము. శ్రీశంకరాచార్యులు క్షత్త్రియవైశ్యులకు సన్న్యాసాశ్రమము కొన్నిశ్రుతులలోని లింగప్రమాణము ననుసరించి లే దన్నను వారిశిష్యు లగుశ్రీసురేశ్వరాచార్యులు బృహదారణ్యవార్తికములో న్యాయరహిత మగులింగము ప్రమాణము కా దనియు, నితరశ్రుతులఁ గంఠోక్తిగ క్షత్త్రియవైశ్యులకుసన్న్యాసము కల దని చెప్పుటచేతను, వారికిఁ గూడ సన్న్యాస మున్న దని వ్రాసిరి దానికి శ్రీ ఆనందగిరులు మహాభారతవాక్యమును ప్రమాణముగ నుదాహరించిరి. కొందఱు స్మృతికర్త లట్లే తలంచిరి. భాగవతములోఁ గొందఱు క్షత్త్రియులు సన్న్యాసము స్వీకరించి నట్లున్నది. బుద్ధగయ యం దున్న ఆనందగిరిమఠములోని సన్న్యాసి పూర్వాశ్రమమందు క్షత్త్రియుఁడ నని నాతో 1894-వ యేటఁ జెప్పెను. శూద్రులలో బైరాగులు, పండారులు, అనుసన్న్యాసులు కలరు. వారు శ్రుతిస్మృతుల ననుసరించినవారు కారు. సిక్కుల సాంప్రదాయము శైవదీక్ష లోనగువాని ననుసరించినవారు.

౧౨. ఆశ్రమావాంతరభేదములు

బ్రహ్మచర్యగార్హస్థ్యవానప్రస్థసన్న్యాసాశ్రమములలోఁ బ్రత్యేక మొకటిలో నాలుగు భేదములుగ నుండి మొత్తమున ౧౬ భేదములు గల వని మహాభారతములోను కాత్యాయనస్మృతిలో నున్నది బ్రహ్మచారులు గాయత్ర, బ్రాహ్మ, ప్రాజాపత్య (బృహన్) నైష్ఠికు లని నాలుగు తెఱంగులు:—౧. ఉపనయనానంతరము, క్షారలవణముల వర్జించి మూఁడు రాత్రు లన్నముఁ దిని గాయత్రి నుపాసించినబ్రహ్మచారి గాయత్రుఁడు. వాఁడు ౪౮ ఏండ్లు వేదముఁ జదువుచు బ్రహ్మచర్యము జరుపవలయు. ౨. ప్రతివేదమును ౧౨ లేక ౧౦ ఏండ్లుగాని యర్థముతోఁగూడ వచ్చువఱకుఁ గాని చదువువాఁడు బ్రాహ్మ్యుఁడు. ౩. తనభార్యతో ఋతుకాలమందు మాత్రమే సంగముఁ జేయుచు నితరులభార్యల నెప్పుడును చూడ కుండువాఁడు ప్రాజాపత్యుఁడు. ౪. చనిపోవువఱకు గురువులను వదలక వారియొద్దనే యుండువాఁడు నైష్ఠికుఁడు లేక బృహన్నైష్ఠికుఁడు. గృహస్థులు వార్తాకవృత్తి శాలీనవృత్తి, యాయావర, ఘోరసన్న్యాసికు లని నాలుగు తెఱఁగులు:—(౧) వ్యవసాయము, గోరక్షణము, వర్తకము, భూతములకు హింస లేకుండ నాచరించుచు, నారేండ్లు కర్మములను జేయుచు నాత్మను బ్రార్థించువాఁడు వార్తాకవృత్తుఁడు. (౨) కర్మములను జేయుచు నితరులకుఁ జేయింపకయు వేదముఁ జదువుచును, నితరులకు వేదముఁ జెప్పకయు, నితరులకు దానముఁ జేయుచుఁ దాను దానమును బట్టకయు, నారేండ్లు కర్మములను జేయుచు నాత్మను బ్రార్థించువాఁడు శాలీనవృత్తుఁడు. (౩) కర్మములఁ జేయుచు, వేదముఁ జదువుచును, నితరులకుఁ జెప్పుచు దానమిచ్చుచుఁ బుచ్చికొనుచు నుండి నారేఁడ్లుకర్మములను జేయుచు నాత్మను బ్రార్థించువాఁడు యాయావరుఁడు. (౪) తనకుఁ గావలసిననీళ్లను తానే తోడుకొని నియతకర్మములను నిర్వర్తించుకొనుచుఁ, బ్రతిదినమును తనతావును తానే బాగుచేసికొనుచు ఉంఛవృత్తి నాచరించుచు, నారేండ్లు కర్మములను జేయుచు నాత్మను బ్రార్థించువాఁడు ఘోరసన్న్యాసికుఁడు. వానప్రస్థులు వైఖాన సౌదుంబర, వాలఖిల్య, ఫేనపు లని నాలుగు తెఱఁగులు :—(౧) మనుష్యులచే నాటఁబడని యోషధులవలన బుట్టిన దుంపలను, వృక్షములవలన బుట్టినఫలములను, ఊరిబయలున నుండి పంచమహాయజ్ఞము లను నిత్యకర్మములను చేయుచు, ఆత్మను బ్రార్థించువాఁడు వైఖానసుఁడు. (౨) రేఁగులు, నీవారములు మున్నగుగింజలను వండి పంచమహాయజ్ఞములను జేయుచు, నాత్మను బ్రార్థించువాఁడు ఔదుంబరుఁడు. (౩) జడలను ధరించి నారచీరలను తోళ్లను బెరడులను, కట్టుకొని, కార్తికపూర్ణిమనాఁ డదివఱకు సేకరించినధాన్యమును వదలి, తిరిగి క్రొత్తవాని నార్జించి మిగిలిన యెనిమిదినెలలకు నుంచుకొని, పంచమహాయజ్ఞములను జేయుచు నాత్మను బ్రార్థించువాఁడు వాలఖిల్యుఁడు. (౪) వాడినయాకులను బండ్లను దిని యెక్కడనైన నుండువాఁడు ఫేనపుఁడు. సన్న్యాసులు, కుటీచక, బహూదక, హంస, పరమహంస లని నాలుగు తెఱఁగులు. (౧) తనకొడుకులయిండ్లలో భిక్షమెత్తుచు నాత్మను బ్రార్థించువాఁడు కుటీచకుఁడు. (౨) త్రిదండమును కమండలమును, జలపవిత్రము లగు పాదుకలను, దర్భాసనాదులను, శిఖాయజ్ఞోపవీతములను, కాషాయమును, ధరించి సాధువు లగుబ్రాహ్మణులగృహములందు భిక్షను జేయుచు నాత్మను బ్రార్థించువాఁడు బహూదకుఁడు. (౩) ఒక్కదండమును మాత్రమే పట్టుకొని శిఖాయజ్ఞోపవీతములను ధరించి కమండలువుఁ జేతిలోఁ దీసికొని యొక్కొక్కరాత్రి నొక్కొక్కయూర నివసించుచుఁ బుణ్యక్షేత్రములందు నెనిమిది గాని అయిదు గాని దినము లుండుచు నొకరాత్రి గాని రెండురాత్రులు గాని కృచ్ఛ్రచాంద్రాయణాదిప్రాయశ్చిత్తములను జేయుచు నాత్మను బ్రార్థించువాఁడు హంస (౪) ఒకదండమును బొంతను గోచిని ధరించి

యాశ్రమచిహ్నములను గనఁబఱచుచు, పిచ్చివాఁడు కాకున్నను పిచ్చివానివలె నుండుచు, త్రిదండకమండలములను ఉట్టిని తనకాలినీటిచేఁ బవిత్రము లగుపాదుకలను, దర్భాద్యాసనములను, శిఖాయజ్ఞోపవీతములనువదలి పాడుకొంపలలోను, గుళ్లలోను బసజేయుచు ధర్మాధర్మములనుగాని, సత్యాసత్యములనుగాని, లక్ష్యపెట్టక సర్వవిధముల శీతోష్ణసుఖదుఃఖాదులను సహించుచు మట్టిబెడ్డ, రాయి, బంగారు, లోనగువానియందు సమత్వబుద్ధిని గలిగి లోకములోనున్న బ్రాహ్మణాదినాలుగువర్ణములలో భిక్షఁ జేయుచు నాత్మకు మోక్షసంపాదకముఁ జేయువాఁడు పరమహంస. బ్రహ్మపురాణాదులలో వానప్రస్థసన్న్యాసములను కలియుగంబున వర్జింపఁదగునని చెప్పినను స్మృతికంటె శ్రుతి యెక్కువప్రమాణము గలదని యెంచి శంకర రామానుజ మధ్వాద్యాచార్యులు సన్న్యాసము నంగీకరించిరి. ఇప్పటికినిఁ బరమహంస లగునద్వైతులు ద్వైతులును శిఖాయజ్ఞోపవీతములు గలకుటీచక, బహూదకులును విశిష్టాద్వైతులు నున్నారు. వానప్రస్థులు మాత్ర మరుదు.

౧౩. వర్ణాశ్రమధర్మవిశేషములు

బ్రాహ్మణవర్ణములోఁ బుట్టి గృహస్థాశ్రమమం దున్నవాఁడు మాత్రమే బృహస్పతిసవమను కర్మముఁ జేయనగుఁ గాని క్షత్రియగృహస్థుఁడుగాని, వైశ్యగృహస్థుఁడుగాని చేయఁగూడదు. అట్లే క్షత్రియగృహస్థునకే రాజసూయయాగము విహితము గాని లాతియిరువురకుఁ గాదు. అట్లే వైశ్యస్తోమమనుక్రతువును వైశ్యగృహస్థుఁడుమాత్రమే చేయనగును గాని యితరులు చేయరాదు. ఇట్లే ఉపనయనాదిసంస్కారములలోఁ గూడ (ద్విజత్రయములోఁ గూడ) భిన్నధర్మములు గలవు. వేదశాఖ లనేకము లుండుటచే నాయాశాఖాధ్యేత లగువారికి భిన్నభిన్నధర్మములు గలవు.

౧౪. వర్ణాశ్రమధర్మసూక్ష్మములు

పూర్వయుగములలోఁ గొందఱు పెద్ద లాచరించినధర్మములు మన్వాదిధర్మశాస్త్రముల నతిక్రమించుచున్నవి. క్షత్రియు లగు శ్రీరామచంద్రులు శబర్యాతిథ్యము నంగీకరించుటయు, శ్రీబలరామకృష్ణులు క్షత్రియు లయినను వైశ్యుఁ డగు నందునింట 10,11 ఏండ్లు పెరుగుటయు, విదురాదులయింటఁ గుడుచుటయు, లోనుగాఁగల దృష్టాంతములు స్మృతిపురాణేతిహాసములలో మెండుగ గలవు. పూర్వయుగములలో బ్రాహ్మణులు, క్షత్రియులు కలసితిన్నట్లును, బ్రాహ్మణులు గోఛాగాదిమాంసభక్షకు లయినట్లు నున్నది. ద్వాపరకలిసంధిలో నుదయించిన కృపద్రోణాశ్వత్థామాచార్యులు బ్రాహ్మణవర్ణు లయినను నాయుధీయకమే (అస్త్రశస్త్రవిద్య) వారివృత్తియై నందులకు భారతము ప్రమాణము. అది వారికి నాపద్ధర్మము గాదు. ద్రోణాచార్యులకు ద్రుపదరాజురాజ్య మగుపాంచాలములోని సగము వారి శిష్యోత్తముఁ డగునర్జునుఁడు గురుదక్షిణగ నీయఁగ నాచార్యులు దానిని బాలింపలేదా? అది క్షత్రియధర్మము కాదా? కురుపాండవులకు గురువులు, బ్రాహ్మణులు నగు ద్రోణ కృపాశ్వత్థామాచార్యులు తమ ధర్మముకానిదియుఁ బరధర్మము, నధర్మయుక్తమును నగు యుద్ధముఁ గావింపలేదా? అది ధర్మమా? ధర్మాభాసమా? అశ్వత్థామ రాత్రి నిద్రించుచున్న పాండవసేనను జంపుటయు, నపాండవముఁ గావింప నస్త్రమును బ్రయోగించుటయు ధర్మమా? అధర్మమా? ఇట్టి ధర్మాభాసములు భారతాదులలోఁ జాల పొడగట్టును. ద్వాపరాంతముతో మత్స్యగంధియందుఁ బరాశరర్షులకు శ్రీవేదవ్యాసు లుదయించినను, బీజప్రభావముచే ఋష్యశృంగునివలె విప్రర్షిగనే పరిగణింపఁబడెను. క్షేత్రజు లగు పాండవులు దేవబీజోత్పన్ను లయినను దల్లిది యగు క్షత్రియకులమువారుగ నెన్నఁబడిరి. తపోబలాదులచే విశ్వామిత్రమరుదేవాపి లోనగు క్షత్రియు లొకజన్మయందే రాజర్షులుగను బ్రహ్మర్షులుగను గణనముఁ జేయఁబడిరి. నహుషునకొకజన్మయు లోనే యుత్కృష్టాపకృష్ట జంతుత్వము లభించెను. నాభాగకొడుకులు జన్మమున క్షత్రియులయినను వృత్తిచే వైశ్యు లయినట్లు భాగవతములోనున్నది. కసాయివృత్తి నాచరించు ధర్మవ్యాధుఁడు బ్రాహ్మణునకధ్యాత్మగురు వయినట్లు వనపర్వములో వివరింపఁ బడినది ఇట్టి ధర్మసూక్ష్మము లనేకములు మన ప్రాచీనపుగ్రంథములందుఁ గలవు. మఱియు, శల్యకర్ణసంవాదమువలన మద్రాంగాదిదేశములలో వివాహనియమములు లేవనియు తెలుచుగ నా దేశస్థులు స్త్రీసంగులు పానాసక్తు లనియు మ్లేచ్ఛాచారపరులు ననియు స్పష్టపడఁగలదు. ధనుశ్శాస్త్రపరీక్షలో (ఆదిపర్వము 136,137 అ.) కృపాచార్యుఁడు కర్ణునివర్ణ మడుగ దుర్యోధనుఁడు రాజులకు సత్కులీనము, శూరత్వము, సేనలను నడుపుట యను మూఁడు కారణము లని చెప్పెను. కర్ణుఁడు బదులు చెప్పక తలవంపఁగ దుర్యోధనుఁడు కర్ణున కంగరాజ్యాభిషేకముఁ జేసి రాజును జేసెను. అంత భీమసేనుఁడు కర్ణుఁడు సూతపుత్రుఁ డనియు, యుద్ధముఁ జేయుటకును, రాజ్యము చేయుటకును నతఁడు తగఁ డనియు నతనిధర్మము సారథ్య మనియు నధిక్షేపింపఁ గర్ణుఁడు నిర్విణ్ణుఁడై యూరకుండె. దుర్యోధనుఁ డిట్లు త్తర మిచ్చెను: నదీమూలమువలె రాజులజన్మము గుప్తము. జగత్తును మ్రింగు బడబాగ్ని జలమునఁ బుట్టును. దానవులను జంపువిల్లు మర్త్యుఁ డగు దధీచిరాజుయొక్క వెన్నెముకవలనఁ జేయఁబడినది. సర్వదేవతలశక్తి గలిగిన కుమారస్వామి యుత్పత్తి తెలియదు. కొంద ఱగ్నికిఁ బుట్టెననియు, కొందఱు కృత్తిక కనియుఁ, గొందఱు రుద్రదేవున కనియుఁ, గొందఱు గంగాదేవికి ననియు బల్కుదురు. క్షత్రియకులములోఁ బుట్టినవారు బ్రాహ్మణు లయినట్లు విన్నారము. విశ్వామిత్రు లగు జాతిక్షత్రియులు బ్రహ్మమును బొందిరి. గురువులకు గురు వగు ద్రోణాచార్యులు మానికలోఁ బుట్టిరి. కృపాచార్యులు గడ్డిదుప్పలోఁ బుట్టెను. మీ (పాండవుల) జన్మకారణము నాకుఁ దెలియును. అస్త్రశస్త్రకౌశలముచేఁ గర్ణుఁ డంగదేశమునకే గాదు జగత్తున కంతయు నధిపతిగ నుండనోపు" కావనే నహుషునకు ధర్మరాజు మనుష్యులలో వరసూచకము లగు గుణకర్మములు లోపించిన వనియు, బ్రాహ్మణగుణము లితరవర్ణములయందును లాతివర్ణులలో విప్రగుణములును నగపడుచున్న వనియు, వర్ణసంకరము కనిపించుచున్న దనియు, వృత్తము

లేక ప్రవర్తనము, లేనిచో సర్వులు శూద్రప్రాయు లనియుఁ దెలియ నగు నని చెప్పెను. (వనపర్వము ౧౮౦ అ.)

౧౬. వర్ణాశ్రమాభాసములు

కాన ద్వాపరాంతమునుండి వర్ణాశ్రమధర్మములలో గొన్ని మన్వాదిశాస్త్రానుగుణములుగ నున్న ట్లగపడదు. పిదప రానురాను క్షత్రియప్రభువులుక్షీణించుటచేతను, బ్రాహ్మణాదు లార్యావర్తము వదలి వింధ్యదక్షిణమున వ్యాపించుటచేతను గురువులుగ నుండవలసిన బ్రాహ్మణు లర్థకామపరులై ధర్మము నంతగాఁ బాటింపక పోవుట చేతను, బౌద్ధయవనమ్లేచ్ఛప్రభుత్వములు ద్రావిడసాంగత్యములు వృద్ధికాఁగను, బౌద్ధజైనమ్లేచ్ఛసిక్కు క్రీస్తుమతాదులవ్యాప్తివలనను, దేశకులగృహాచారములు క్రమముగ మారి పూర్వధర్మములలో వ్యత్యయము గలిగించెను. జనులధర్మములు దేశకాలానుగుణముగఁ దప్పక మారును. వానిమార్పు నీరు పల్లమును వెదుకునట్లు స్వభావసిద్ధము. గుణకర్మములవలనఁ బుట్టినవర్ణములకు రానురాను ధర్మచ్యుతి గలిగెను. దేశకాలనిమిత్తములచే స్మృతిసూత్రకారులు ధర్మవ్యవస్థ నప్పు డప్పుడు చేయుటకు వాని మారుదలయే కారణము. "ధర్మజ్ఞసమయః ప్రమాణం వేదాశ్చ" అని ధర్మమును దెలిసినవారి కట్టుబాటు వేదమువలెఁ బ్రమాణ మని సూత్రకారులు సెల విచ్చిరి. కాననే ప్రబలవ్యాప్తి గల యాచారములను శిష్టు లంగీకరించుటచే నవి శాస్త్ర విరుద్ధము లయినను, వానిని ధర్మములుగ స్వీకరింపవలయు నని బోధాయనర్షులు ౨౫౦౦ ఏండ్లక్రింద నుడివెను. అట్లే గౌతమాపస్తంబాశ్వలాయనకాత్యాయనాది ఋషు లితరయాచారములను మన్నించిరి. తర్వాతఁ గూడ ౨౮ గురు ధర్మశాస్త్రజ్ఞులు తైత్తిరీయశిక్షావల్ల్యుపాంతానువాకాదుల ననుసరించి ధర్మసంగ్రహము చేసిరి. పిదప బంగాళోఢ్రదేశములకు జగన్నాథాదులు, గుజరాతీమహారాష్ట్రములకు మయూఖాకారాదులు, నితర హిందూస్థానమునకు విజ్ఞానేశ్వరమాధవాచార్యాదులు స్మృతులలోని యాచారవ్యవహారప్రాయశ్చిత్తకాండముల నన్నింటికిఁ గాని లేక కొన్నింటికిఁ గాని వ్యాఖ్యలను జేసి, వానిలో నప్పటి శిష్టాచారములను గలిపిరి. అంతకు ముందే బహ్వాచారభేదములచే బ్రాహ్మణాదులు గౌదు లనియు ద్రావిడు లనియు విభక్తులైరి. ఆయుభయదేశముల మధ్యను వింధ్యపర్వతము గలదు. దానికి నుత్తరమున నున్నవారి నౌత్తరాహు లనియు దక్షిణమున నున్నవారిని దాక్షిణాత్యు లనియు ననియెదరు. ఈ యాచారములలోఁ బ్రాచీనము లగు కొన్నింటిని 'ఆర్యదేశాచారము' లను శీర్షికక్రింద నీ వ్యాసారంభమున సంగ్రహించినాను. వాని ప్రచారము బోధాయనకాలమునకుఁ బూర్వము నుండి నేఁటివఱకుఁ గలదు. వానిని మాధవాచార్యులు ౬౦౦ ఏండ్ల క్రింద ననువదించి యంగీకరించిరి. అట్లే కర్ణాటకమహారాష్ట్రాంధ్రాది శిష్టు లంగీకరించిన మేనరికము లోనగు వివాహాచారములను ఋగ్వేదగత సర్ప సూక్తము ననుసరించి స్మృతులకు వ్యతిరేకము లయినను మాధవాచార్యులు సమర్థించిరి. కాని యాయుర్వేదజ్ఞులును, 'దేశస్థులలో దేహపాటవ ముండుట యావశ్యక' మనువారును, నౌత్తరాహులును, దాని నొప్పరు. అరవ ద్రావిడులలోఁ గూడ నీ యాచారము ద్రవ్యాశాదులచేఁ బ్రవేశించిన దని వగచుచున్నాను. కనుకనే ప్రాయికముగ ద్రావిడులకంటె గౌడులలో కాయపుష్టిగలవారు నెందు. మఱియు నేపాళములో మహిషమాంసమును బ్రాహ్మణులు భక్షింతురు. కాశ్మీరదేశములో మహమ్మదీయులు హిందువుల సేవకులు. వారు వంటఁజేసినచో బ్రాహ్మణులు వైశ్వదేవమును జేసి భుజించెదరు. పూర్వము శూద్రులు వండినచో విప్రులు వైశ్వదేవముఁ జేయనగు నను నాపస్తంబవాక్యము వలె నీయాచార మిప్పు డున్నది. ఓఢ్రబంగాళమైథిలీబ్రాహ్మణులు మత్స్యములను బంగాళములోని శక్తిపూజను జేయువిప్రులు మేకమాంసమును తినియెదరు. సింధుదేశములో వైశ్యులు బ్రాహ్మణక్షత్రియులకు వంటఁ జేయుదురు. ఉత్తరపశ్చిమదేశములలో భోజనకాలమందు విప్రులకు దృష్టిదోషము లేదు. శ్రీజగన్నాథములో వర్ణవిచక్షణము లేకయు, నెంగిలి లేకయు, స్వామిప్రసాదమును నాలుగువర్ణములవారు స్వీకరింతురు. మాళ్వా లోనగు ప్రదేశములలోఁ తోళ్ళతిత్తులలోని నీరును బ్రాహ్మణాదులు ప్రకృతిపు కొళాయినీరువలె గ్రహింతురు. ఉత్తరదేశములలో బ్రాహ్మణేతరులు తెచ్చిననీరు విప్రులు వాడుదురు. ముట్టయినస్త్రీని మహారాష్ట్రదేశములో దూరముగ నుంచరు. మడిబట్ట కట్టుట దేహశౌచనిమిత్త మేర్పడినను దానివిషయమై యాంధ్రద్రావిడగౌడాదులలో భిన్నాచారములు గలవు. విచారించినచో నన్నింటిలోను లోపములఁ గనిపెట్టనగు. దక్షిణవైష్ణవాద్యాలయములలో నన్నశనియోగము, నన్నవిక్రయము, నెంతటి యనాచారమునకును దుర్వృత్తమునకును దా విచ్చుచున్నవో వివేకు లరయనగు. ఉత్తరదేవాలయములలో నున్న సత్త్వభక్తివిరక్తిహేతువులు దక్షిణదేవతాగృహములందుఁ గానరాక రాజసతామసవికారములు మెండుగఁ బొడఁగట్టును. ఇది శోచనీయము. ప్రపత్తి యనుసాకు బెట్టుకొని శ్రౌతస్మార్తాదికర్మములకుఁ బ్రయోజనము లే దని వానికి సున్న చుట్టి సర్వఫలములు దేవాలయములోని అర్చావిగ్రహపూజవలననే లభ్యము లని ద్రవిడప్రబంధరహస్యార్థము నెఱుగక ప్రవర్తించువారి మోహ మేమని చెప్పవచ్చు? మఱియుఁ, బరమతస్థు లగు రాజులు మన దేశపాలనముఁ జేయుటచేతను, శైవశాక్తవైష్ణవాద్యాగమప్రాబల్యముచేతను, బ్రాహ్మణాదులు నదృష్టమగుఁ బరలోకఫలముకంటె దృష్ట మగు నీలోకఫలమునే యెక్కువ కోరుటచేతను, విప్రులకు ద్రవ్యఖ్యాతిపూజాధికారములం దాస హెచ్చగుట చేతను, వేదశాస్త్రవిద్యలను యాచారములను వదలి క్రొత్తత్రోవలఁ ద్రొక్కిరి. కాననే 'నందాంతం క్షత్రియకులం' అని పురాణములలో నుండుటంబట్టియుఁ, బూర్వక్షత్రియు లిప్పటికి సుమారు ౨౩౦౦ ఏండ్లక్రింద నంతరించిన ట్లగపడును. ౬౦౦ ఏండ్లక్రింద మాధవాచార్యులు శ్రుతిస్మృతిసూత్రాదులలోఁ జెప్పిన ముఖ్యబ్రాహ్మణముఖ్యశూద్రులు లే రనియు, క్షత్రియవైశ్యులస్వరూపమే లే దనియుఁ, బరాశరస్మృతివ్యాఖ్యలో స్పష్టముగ వ్రాసిరి. ఇప్పటికి సుమారు ౨౦౦ ఏండ్లక్రింద నున్న వేంకటాధ్వరుల విశ్వగుణాదర్శములో భారతములోనిదేశముల వివిధాచారములవర్ణనముఁ జూడ నింక

నెక్కువవ్యత్యయము లగపడు. అప్పుడు తురకమునకును, నిప్పు డింగ్లీషునకును వ్యాప్తి. అప్పుడు తురకలు రాజులు. ఇప్పు డింగ్లీషువారు ప్రభువులు. మఱియు, రాజరాజనరేంద్రుని కాలమునుండి యాంధ్రదేశములో సంస్కృతముకంటె తెలుఁగు చదువునకు వ్యాప్తి. ప్రాచీన విద్యాచారములు హిందూదేశమం దంతటను మారుటకు నింక నొక ప్రబలకారణము గలదు. బౌద్ధమతస్థులను మనదేశములోనుండి తఱిమినతర్వాతఁ బురాణాగమాదులవ్యాప్తి యిప్పటికి ౨౦౦౦ ఏండ్లనుండి హెచ్చి వివిధాచారములు ప్రబలి పూర్వాచారములలోఁ గొన్నింటిని గప్పి; గొన్నింటిని మార్చినవి. బౌద్ధకాలము (బి. సి. ౫౦౦-ఏ. డి. ౨౦౦) నుండి దేశభాషలప్రాబల్యము, శూద్రప్రాయు లగు క్షత్త్రియేతరుల రాజ్యపాలనము హెచ్చెను. ౧౫౦౦ ఏండ్లనుండి వైదికు లగు ద్రమిడ, టంక, భర్తృ, ప్రపంచ, కుమారిల, శంకర, రామానుజ, మధ్వ, వల్లభ, నింభార్క, విజ్ఞాన భిక్షు లోనగు మతాచార్యులును, వారిశిష్యప్రశిష్యులును, వేదవేదాంతాదులకు భిన్నభిన్నార్థములను వ్రాసి వానిని వ్యాపింపఁజేయుటచేఁ గర్మవిషయములోఁ గూడ వారియనుయాయులు భిన్నమార్గస్థు లయిరి, దానిచే వర్ణాశ్రమధర్మములు వే ఱయినవి. ౧౦౦౦ ఏండ్లనుండి మనదేశమున భక్తులనుదాసకూటము బయలు వెడలి, భక్తిజ్ఞానవైరాగ్యలోకోపకారములను బుట్టింపని కేవల శ్రౌతస్మార్తకర్మమును నిరసించి దైవభక్తినివృద్ధిపఱిచిరి. ఉత్తర హిందూస్థానమున గురునానక్, తులసీదాసు, కపీరుదాసు, కమల్దాసు, శ్రీకృష్ణచైతన్యులు లోనగువా రుదయించి కొందఱు వేదభిన్నధర్మములను, గొంద ఱేకవర్ణముఁ జెప్పి కర్మముకంటె భక్తిజ్ఞానవైరాగ్యములే మోక్షదాయకము లనియు వర్ణవిభాగ మంతఁగ గమనింపఁ గూడ దనియు, బోధించిరి. అట్లే మహారాష్ట్రములో నివృత్తి, సోపానుఁడు, ముక్తాబాయి, జాని, ఆకోబాయి, వేణుబాయి, నామదేవుఁడు, ఏకనాథుఁడు, రామదాసుస్వామి, తుకారాం, షేక్ మహమ్మదు, దామాజీ, చొక్కమేళ, నరహరి, సానారుఁడు మున్నగు వారు బోధించిరి. ఆంధ్రదేశములో వేమన, రామదాసు, నృసింహదాసు, నిట్టలప్రకాశదాసు, రంగదాసు లోనగువారి చర్యలు గూడ నట్లే పరిణమించినవి. ద్రవిడదేశములో నమ్మాళ్వారు, పెరియాళ్వారు, తొండరప్పొడియాళ్వారు, తిరుమంగయాళ్వారు, లోనగు వైష్ణవాగ్రేసరులు, అప్పర్, అవ్వ, మాణిక్యవాచకర్, సుందరర్, తాయుమానవర్, లోనగు శైవభక్తులు, కన్నడదేశములో, పురందరదాసు, జగన్నాథదాసు, కనకదాసు, బసవేశ్వరుఁడు, లోనగు విష్ణుశివభక్తులుఁ దేశభాషలలో గద్యపద్యయక్షగానములలో బోధించిరి. ఇట్లే ద్వైతాద్వైతవిశిష్టాద్వైతశైవాదిమతములను వ్యాపింపఁజేయు బ్రహ్మక్షత్త్రియాది పీఠస్థులు గూడఁ బూర్వకర్మములను వారిమతముల కనుకూలముగ మార్చిరి. ద్రావిడదేశములో శూద్రు లగు పండారపీఠస్థులు శైవాగమములను, కన్నడ తెలుఁగు దేశములలో నున్న శూద్రు లగు వీరశైవపీఠస్థులు శైవదీక్షను వ్యాపింపఁ జేసి, కర్మములను మార్చిరి. భక్తిప్రపత్తిమార్గములకు వ్యాప్తి యిన్ని కారణములచే నెక్కువ యయ్యె. ఈ భక్తుల మతవ్యాప్తియు దీనికి ముం దున్న బౌద్ధజైనాదిమతవ్యాప్తియు, దానికి ముం దున్న భాగవతభాగవతాదుల వ్యాప్తియు, హింసాపూర్వకము లగు శ్రౌతకర్మములకంటె నహింసారూపము లగు శ్రవణకీర్తన జప స్మరణాదుల హరిహర భక్తిబోధకము లగు నాస్తికమును గలిగించెను. కావుననే శంకరరామానుజమధ్వముకాచార్యులు బ్రహ్మసూత్రములోని 'అశుద్ధ మితిచేన్న శబ్దాత్' అను సూత్రమున కర్థము హింసాపూర్వక మగు శ్రౌతకర్మము వేదప్రమాణము గలది గానఁ జేయ నగు నని వ్రాసినను; మాధ్వులు పిష్టపశువుతో యజ్ఞాదులను చేయుచున్నారు. తెంగలి వైష్ణవవల్లభీయులు వానిని చేయుటలేదు. ద్వైతాద్వైతవిశిష్టమతవ్యాప్తి ప్రబలఁగ నామతస్థులలో దేశాదినిమిత్తములచే భిన్నాచారము లెక్కువై పెక్కు నిబంధన గ్రంథములు ప్రబలినవి. నిర్ణయసింధువు, ధర్మసింధువు, హేమాద్రి, కమలాకరము, వైద్యనాథదీక్షితీయము, అనందాళ్ పిళ్ల, తోళప్పర్‌స్మృతి, లోనగునవి దృష్టాంతములు. ఇవి బయలు వెడలి, యాంధ్రమహారాష్ట్రకర్ణాటద్రవిడదేశములలోని శిష్టు లంగీకరించుటచే నూతనాచారములను ధర్మములుగ నెన్నఁబడినట్లు ప్రకటనముఁ జేసెను. తర్వాత రానురాను నాయాచారములు మారినవి. చాళుక్యతుళు రెడ్ల ప్రభుత్వకాలమునుండి వారివ్యవహారము లాంధ్రదేశములో బ్రాహ్మణాదులు సాగించుటచే లౌకికవృత్తిలోఁ బ్రవేశించిన కొందఱు బ్రాహ్మణు లధ్యాపన యాజన ప్రతిగ్రహము లగు మూఁడు జీవికలను వదలిరి. వారిజీవనము దేశప్రభువుల సేవవలన జరుగుచుండుటచే నాకర్మములను వీడిరి. వారును వారిసంతతివారును, వారి యనుయాయులును, రెడ్లక్రిందను నితరమ్లేచ్ఛాదిరాజులక్రిందను రాజ్యతంత్రములలోను సేనాధిపత్యములలోను, దేశపాండ్య మొదలు గ్రామకరణికమువఱకు నుండు నుద్యోగములలోఁ బ్రవేశించి మనదేశమున కభివృద్ధిని జేసిరి. వారి నే నియోగిబ్రాహ్మణు లందురు. ఇంగ్లీషుప్రభుత్వము వచ్చినపిదప నితరబ్రాహ్మణు లగు వైదికులుగూడ నింగ్లీషును జదివి లౌకికోద్యోగములలోను ప్లీడరు మొదలగు ప్రాడ్వివాకపదవులలోను వర్తకవ్యాపారములలోను బ్రవేశించుటచే నిప్డు లౌకికపనులలో మెలఁగు బ్రాహ్మణులలో వైదికులు నియోగులు నను భేదము నామమాత్రావశిష్ట మయినది. వేదశాస్త్రసంపన్ను లగు వైదికులపిల్ల లింగ్లీషు నభ్యసించి లౌకికపుపనులు సేయుట మనము ప్రతిదినముఁ జూచుచున్నాము గదా! మఱియు, బ్రాహ్మణు లందఱు నొక వర్ణమువా రయినను దేశభాషాచారములు భిన్నము లగుటచేతను, నొకభాషను మాటాడువారిలో వివాహాదిసంబంధమును జేయుచు వచ్చినారు. మఱియు నాంధ్రబ్రాహ్మణులలో నుండు నవాంతరదేశములను బురస్కరించికొని వేగినాఁడు, వెలినాఁడు, తెలుఁగునాఁడు, మురికినాఁడు, కాసలనాఁడు లోనగుభేదములు స్వల్పాచారభేదములచేఁ గలిగి వివాహాదిసంబంధముల నేనాఁడివా రానాఁడియందే చేయుదురు. వానిలోఁగూడ నవాంతరభేదములు గలవు. వీరు నియోగిబ్రాహ్మణులతో సంబంధమును జేయరు. నియోగులలో నారువేలవారు, పాకనాటివారు అని రెండు తెగలు. వారు పరస్పరము సంబంధమును జేయరు. ఆరువేలవారి యాఁడపిల్లలను గోలకొండవ్యాపారు

లగుఁ దెలగాణ్యనియోగులు, శ్రీవైష్ణవులకును, మాధ్వులకును నిత్తురు. కాని ఈ యుభయులపిల్లలను నియోగులపిల్లవాండ్రు కీయరు. శ్రీవైష్ణవబ్రాహ్మణులు తెనుఁగే మాటాడినను, ద్రావిడులు నాంధ్రులు నను రెండు తెగలుగా నుందురు. వారిలో 'వడి' సంఘము అను నవాంతరభేదము లనేకము లుండుటచేఁ బరస్పరము భోజనసంబంధములను జేయరు. మాధ్వులలో గృహస్థులు ఆచార్యులు అనుభేద మున్నను భోజనసంబంధములు గలుగును. "సంగిసంగు" లనువారు మాత్రము స్మార్తగంధము తాకరు. అట్లే శూద్రులలో వెలమ, కమ్మ, కాపు, తెలగఁ బలిజ, సెట్టిబలిజ, లింగబలిజ, జంగము, సాతాని, ముతరాసు, రెడ్డి, రెడ్డిక, కాళంగి, మేదర, గొల్ల, గాజులు, గవండ్ల, ఈడిగ, జాండ్ర, సాలి, పట్టుసాలి, పల్లె, మరకాడు, బోగము, సాని, చాకలి, మంగలి, బోయ, యానాది లోనగు పలుతెగలు నాచారములు గలవు. కంసాలి, కంచర, వడ్రంగి, చిత్రకారు లగు ముచ్చెనాడు, రంగిరేజు, నంబి, తంబళ లోనగువా రవాంతరవర్ణులు. వా రందఱిలోఁ బరస్పరము భోజనసంబంధాదులు లేవు. వీ రందఱు పంచమవర్ణు లగు మాల మాదిగలచే భూమియొక్క వ్యవసాయపుపనులను, పశుపాలనమును జేయించుదురు గాని, వారిని యిండ్లదగ్గఱఁ గాపురము నుంచరు. వారి నంటరు. వారిని వేఱుపాలెములలోఁ గాపుర ముంచెదరు. ద్రావిడ కర్ణాటకమహారాష్ట్రఘూర్జరగౌడాదులలోఁ గూడ ననేకులు భిన్నము లగు తెగలవారు కలరు. అంగ్రక్షత్రియులలోఁ జాలమంది శూద్రాచారము నవలంబించిరి. వారి స్త్రీలలో ఘోసా యుండుటచే శూద్రుల సేవ వారి కావశ్యకము. ఆ యుభయులకు వ్యవసాయము సమాన ధర్మము. కన్యకాపరమేశ్వరిని కులదేవతఁగ స్వీకరించి శ్రౌతస్మార్త కర్మములను వదలి యాంధ్రవైశ్యులు పురాణాచారముల నవలంబించిరి. కాన వారిని "గౌరకోమటు లందురు. కళింగకోమట్లు మాంసాశనులు వారు గంజాముజిల్లాలోని యుత్తరభాగమున నుండి యున్నారు. వారిభాష యోఢ్రము. ఇటీవల నాంధ్రవైశ్యులలోఁ గొందఱు స్మార్తకర్మమును జేయించికొనుచున్నారు. కాని వారికి ఆ కర్మములను గుఱించిన జ్ఞానము శ్రద్ధయు లేదు గాన దానివ్యాప్తి క్షీణించుచున్నది. ప్రకృతబ్రాహ్మణులకే శ్రౌతస్మార్తకర్మములందు శ్రద్ధ నశించుచున్నది యన నితరవర్ణులకుఁ జెప్పవలయునా? ఇప్పటి బ్రాహ్మణాది సర్వవర్ణులలో వారిస్వధర్మములను వదలి ధాన్యసురాదిక్రయవిక్రయులు సభలలో తప్పుడుసాక్ష్య మిచ్చువారు, అగ్రహారాదులు గలవారు, వడ్డీ లోనగు వర్తకమును జేయువారు, లౌకికోద్యోగస్థులు, ఉపాధ్యాయులు, జమీందారులు, పరిచారకులు, భూమిని సాగుచేయువారు, ముష్టి నెత్తుకొనువారు, చౌర్యాది దుర్వృత్తులు గలవా రున్నారు. మొత్తమున సర్వవర్ణులలోఁ జాలమంది వాణిజ్యాదిరూప మగు వైశ్యధర్మమును ద్రవ్యసంగ్రహాయత్నము నిప్పుడు విశేషముగఁ జేయుచున్నారు. సర్వాశ్రములు గృహస్థాశ్రమ ధర్మమును సామాన్యముగ నాచరించుచున్నారు. కృషి గోరక్షణము లఱచుగ శూద్రుల కున్నను బ్రాహ్మణక్షత్రియులలోఁ జాలమంది, వైశ్యులలోఁ గొందఱు మాత్రమే, భూమిని సాగుఁజేయుచుఁ, జేయించుచు, దానివలననే జీవించుచున్నారు. కేవల మధ్యాపన యాజన ప్రతిగ్రహములవలన జీవించు బ్రాహ్మణులు స్వల్పసంఖ్యాకులు ౧౦౦౦౦ మందిలో నొకఁ డైనను నిత్య మగు శ్రౌతకర్మమును జేయుట లేదు. ౧౦౦లో నొకఁ డైనను స్మార్తకర్మము లగు వైశ్వదేవాదికములోఁ గొన్నింటిని జేయుట లేదు. పూర్వాచారపరాయణు లగు బ్రాహ్మణాదులు పల్లెటూళ్లలోను, బస్తీలలోను బుణ్యతీర్థములలోను, క్షీణించుచున్నారు. సర్వులు సామాన్యముగ నర్థకామపరులై సనాతనధర్మవిముఖు లగుచున్నారు కాన మనదేశమున కనేకము లరిష్టములు సంభవించినవి. ఇఁకను రా నున్నవి. మఱియును మన హిందూదేశములో బ్రాహ్మణాదిసర్వవర్ణులలో నవాంతర వర్ణభేదములు ౩౦౦ పై నున్న వని జనాభాలెక్కలవలన దేలినది. దేశభాషలు పెక్కులు గలవు. అందఱు నార్యమతావలంబులై శ్రుత్యాదులను బ్రమాణముగ నొప్పినను, ననేక వేలయేండ్లనుండి భిన్నాచారులై యున్నారు. పూర్వకాలములోనే ౪ వర్ణములు వాని సంకరములు నగు ననులోమప్రతిలోమజాతు లనేకము లున్నట్లు మన్వాదిస్మృతీతిహాసపురాణములు వివరించినవి. భారతయుద్ధకాలములో నుత్తరహిందూస్థానమున ౧౫౬ తెగలవారును, దక్షిణమున ౫౦ను, నుత్తరమున నుండు నితరజాతీయు లగు యవనాదులు ౨౬ గురు నున్నట్లు భీష్మపర్వములో వర్ణింపఁబడిరి. ఇప్పటికి వారికి రెండింతలుగ గలరు. వీరిలో నుండు నార్యులు ప్రాచీనము లగు నాలుగువర్ణులుగ మారినచో వారిలో నైకమత్యత హెచ్చి వారికిని వారి సంతతివారికిని, వారి జన్మభూమి యగు భారతమాతకును సకల విషయంబులలో శ్రేయోదాయక మగు. కాని అది గొంతెమ్మకోరికయా? ఎప్పుడైన సాధ్యమా? అనుసంశయము మాత్రము తోఁచుచున్నది. కాని పరరాజులు మన కేలిక లగుటచే మనకుఁ గావలసిన సౌఖ్యములు లేకపోవుటచేతను, మనదేశపుద్రవ్యాదు లనేకవిధములుగ వారి దేశమునకును నితరదేశమునకును బోవుటచేతను శిల్పవారిశ్రామికపు పనులు మన దేశమంతటను వృద్ధి జేసినంగాని మన కర్థవృద్ధి కా నేరదు గనుకను దానియార్జననిమిత్త మితరదేశములకు నౌకావిమానములమీఁద రాకపోక లగత్యము గానను నిమ్నజాతు లగు పంచములదురవస్థను మాన్పి వారిని బాగుచేయనిది మనకు పురోభివృద్ధి గలుగదు గనుకను దేశమం దంతటను ప్రాథమికవిద్యావ్యాప్తి యత్యంతావశ్యకము గనుకను దేశస్థులలో నున్న యార్యులకును, వారికిని నితరమతస్థులకును, నైకమత్య మిప్పు డత్యావసరము కనుకను స్వరాజ్యపాలనమునకు సంఘైక్య మత్యావశ్యకము కనుకను, మన ప్రాచీన ధర్మము లతిత్వరలో మారవలసిన తరుణము వచ్చినదని తోఁచుచున్నది. ఇట్టి హేతుపుంజములచే వర్ణాశ్రమధర్మములు శ్రుతిస్మృత్యాదులలోఁ జెప్పఁబడిన ట్లిప్పు డాచరణములో లేక మాఱినవి. ఇంకను మాఱుచున్నవి. మాఱ నున్నవి. ఇపుడు సర్వవర్ణులు సామాన్యముగ నాచరించుఁ గర్మములు నాచారములలోఁ గొన్ని యధర్మములు కావనియు, తద్ధర్మాభాసములనియు, స్పష్టముగ నరయ నగు.

* వేదములు

కనుపర్తి మార్కండేయశర్మ గారు

శ్లో. చాతుర్వర్ణ్యం త్రయోలోకా శ్చత్వార శ్చాశ్రమాః పృథక్, భూతం భవ్యం భవిష్యచ్చ సర్వం వేదా త్ప్రసిద్ధ్యతి —మను.

లోకమునందు జనులయొక్క ప్రవృత్తి కావలసినవానిని సంపాదించుకొనుటయు, వ్యతిరేకము లయినవానిని పోఁగొట్టుకొనుటయు అను విషయములకు సంబంధించి యుండును. అట్టి ప్రవృత్తి అల్పజ్ఞుఁ డగు జీవుఁడు ఏర్పఱుచుకొన్నచో, వతని యల్పజ్ఞతవలన అభీష్టము నిరంతరాయముగ సిద్ధింపదు. కావున "ఇష్టప్రాప్త్యనిష్టపరిహారయో రలౌకిక ముపాయం యో వేదయతి స వేదః" అని ఆర్యులు వచించిరి. ఆవేదము భగవత్ప్రోక్తము. వేదములు ఋగ్వేదము యజుర్వేదము సామవేదము అథర్వవేదము అని నాల్గువిధములు. వేదము జ్ఞానస్వరూప మగుటచేతను జ్ఞానము పరమేశ్వరస్వరూప మగుటచేతను భగవత్కృత మనియు చిరకాలసముపార్జితమగు తపశ్శక్తిచేత మహర్షులు వేదమంత్రములఁ గనిపెట్టి లోకహితార్థమై శిష్యుల కుపదేశించి రనియు, వారలు క్రమముగఁ దమతమ శిష్యుల కుపదేశించి రనియు ఈ తీరున లోకమునందు వేదము వ్యాపించిన దనియు ప్రాచీనులగు యాస్క, పాణిని, కాత్యాయన, పతంజల్యాది మునివర్యులును, ఆస్తికులగు దార్శనికులును ఏకగ్రీవముగ నంగీకరించుచున్నారు.

(౧) వేదములు, మూఁడా? లేక నాలుగా?

అనువిషయము మనకు విమర్శనీయము. ఈవిషయము గహనమయినది. తీగెను కదలించిన పొద యంతయుఁ గదలునటుల వేదములన నేమియో ఇప్పుడు గ్రంథరూపములుగ నున్న వేదములస్థితి యేమియో తెలిసికొనినఁ గాని నైవిషయము తెలియఁజాలదు. కావున తద్విషయమును వ్రాయఁబోవుచు వేదములు మూఁడనుటయు నాల్గనుటయు రెండును ఒకవిధముగ యథార్థములే యని మా పాఠకులకు నివేదించుచున్నాను.

(౨) వేదములు మూఁడనుట ఎట్లు?

మొదట నీశ్వరుని నిశ్శ్వాసభూతము లగు వేదమంత్రములను మహర్షులు బ్రహ్మచర్యాది నియమపూర్వక మైన తపశ్శక్తిచేత సమాధిదశయందుఁ గనిపెట్టినవారై లోకమున వ్యాపింపఁ జేసిరి. అసంఖ్యాకు లగు మహర్షు లసంఖ్యాకము లగు మంత్రముల నిటులఁ గనిపెట్టిరి. ఏమంత్రమును ఏమహర్షి కనిపెట్టినదియు ఇప్పటికిని ఆయామంత్రములకడ వ్రాయఁబడియే యున్నది. ఈవిషయము శౌనకాదికృతసర్వానుక్రమణికలందు స్పష్టము.

మహర్షిదృష్టము లగు మంత్రము లన్నియు రచనాభేదము చేత త్రివిధములు. వానిని ఋగ్యజుస్సామములు అనెదరు.

అనఁగా నియతాక్షరసంఖ్య గల పాదబద్ధమైన శ్లోకము ఋక్కు. పాదబద్ధముకానిది యజుస్సు. గానరూపమయినది సామము. మహర్షులచేత తపశ్శక్తిని కనుగొనఁబడిన మంత్రము లన్నియు ఇట్లు ఋగ్యజుస్సామ రూపమగు త్రివిధరచనలలోఁ జేరి యుండుటచేత, "త్రయీ" అని వ్యవహరింపఁబడుచుండెను. త్రయి అనఁగా ఋగ్యజుస్సామరూప త్రివిధ రచనాత్మకమయినది అని యర్థము.

ఋగ్రూపమంత్ర సమూహముగల వేదము ఋగ్వేదము యజూరూపమంత్ర సమూహముగల వేదము యజుర్వేదము గానరూపమంత్ర సమూహముగల వేదము సామవేదము అని రచనాభేదము చేతను వేదములు మూఁడే కావున "త్రయి" అనుట న్యాయ్యము.

(౩) వేదములు నాల్గనుట ఎట్లు?

యజ్ఞార్థము భగవంతుఁడు వేదముల నేర్పఱిచె ననియు యజ్ఞమే ప్రధానముగ నందు బోధింపఁబడిన దనియు ప్రాచీనులై తపఃప్రభావమున నాయా వేదములకు వ్యాఖ్యానరూపములగు బ్రాహ్మణములఁ గనిపెట్టిన మహర్షు లందఱు నభిప్రాయపడిరి. కల్పసూత్రకారులు వారినే అనుసరించిరి. అందఱికంటె నవీనుఁడగు యాస్కాచార్యుఁడు మాత్రము మంత్రార్థవిచారసమయమునందు అధియజ్ఞపరముగ నర్థము జేసి తరువాత అధ్యాత్మాధిదైవపరముగఁ గూడ నర్థమును చేసెను. అథర్వయనుమహర్షి యే ప్రథమమున యజ్ఞప్రక్రియను ప్రకాశింపఁ జేసె నని ఋగ్వేదమునందే చెప్పఁబడి యున్నది.

యజ్ఞైరథర్వా ప్రథమః పథస్తతే, (ఋ. సం. ౧. ౬. ౪. ౫.) అగ్నిర్జాతో అథర్వణా. (ఋ. సం. ౭. ౭. ౪. ౫.) త్వామగ్నే పుష్కరాదధ్యథర్వా నిరమన్థత. (ఋ. సం. ౪. ౫. ౨౩. ౩.) అథర్వాణంపితరం దేవబంధుం మాతు ర్గర్భం పితు రసుంయువానం, యఇమం యజ్ఞంమనసాచికేత ప్రణోవోచ స్తమిహేహ బ్రవః॥ (ఋ.సం. ౭. ౧. ౨.) అని యున్నది. కావున అథర్వమహర్షి యే యజ్ఞకార్యసౌకర్యార్థము హోతృమంత్రముల నొక్క గ్రంథముగను అధ్వర్యుమంత్రముల నొక్క గ్రంథముగను, ఉద్గాతృమంత్రముల నొక్క గ్రంథముగను, బ్రహ్మమంత్రముల నొక్క గ్రంథముగను ఏర్పఱిచె ననియు దానివలన నాల్గువేదము లను ప్రసిద్ధి కలిగిన దనియుఁ దెలియుచున్నది.

* ఈ వ్యాసమును వ్రాయునపుడు శ్రీ సత్యవ్రత సామశ్రమి విరచిత మగు నైతరేయాలోచనాదికమునుండి చాలవిషయముల గ్రహించినాఁడను.—క. మా.

హోతృమంత్రములు పెక్కులు ఋగ్రచనాత్మకము లగుటచేత ఋగ్వేదమనియు హోతృవేద మనియు, అధ్వర్యుమంత్రములందు కొన్ని ఋఙ్మంత్రము లున్నను అనేకములగు మంత్రములు యజూరచనాత్మకము లగుటచేత యజుర్వేదమనియు అధ్వర్యువేద మనియు, ఉద్గాతృమంత్రములందు అధికసంఖ్యగలమంత్రములు సామాత్మకము లగుటచేత సామవేదము అనియు నుద్గాతృవేద మనియు, హోత్రధ్వర్యూద్గాతృమంత్రములకంటె భిన్నము లగుమంత్రముల సంగ్రహమునకు రచనాత్రైవిధ్యము ననుసరించిన నామములు వేదత్రయమునకు చేర్చుటచేత తద్భిన్నమంత్రసమూహమునకు బ్రహ్మవేదమనియు అథర్వమహర్షియే ఈ వ్యవస్థను ఏర్పఱచెను కాన అథర్వవేద మనియుఁ జెప్పఁబడుచున్నవి.

కావున రచనాభేదముచేత వేదములు మూఁడనియు, తత్తన్మంత్రగతహోత్రాదివిషయభేదముచేత వేదములు నాల్గనియు గ్రహించునది. కొందఱు విమర్శకులు మహాభారతాదిగ్రంథములందు వేదములు మూఁడని చెప్పఁబడి యున్న వనియు నవీనము లగు శతపథాదిగ్రంథములందు నాల్గని చెప్పఁబడి యున్న వనియు వచించుచున్నారు. కాని ఆమాట గ్రంథము నంతయుఁ బరిశీలించి పలికినది కాదు. వారు ఏగ్రంథములందు వేదములు త్రివిధము లని చెప్పఁబడె ననిరో ఆగ్రంథములందే నాల్గనియు నాల్గని చెప్పఁబడె ననిన గ్రంథములందు మూఁడనియు గలదు. చూడుడు: "అగ్నే ర్ఋచో వాయో ర్యజూంషి సామా న్యాదిత్యాత్ ; స ఏతాం త్రయీం విద్యా మభ్యతపత్॥ (ఛాం. ౪. ౧౭.) ఋగ్వేదం విజానాతి యజుర్వేదం సామవేద మాథర్వణం చతుర్థం॥ (ఛాం. ౭. ౭.) అరే ఽస్య మహతో భూతస్య నిశ్వసిత మేత ద్య దృగ్వేదో యజుర్వేద స్సామవేదో ఽథర్వాంగిరసః॥ (బృహ. ౨. ౪. ౧౦) త్రయో వేదా అజాయంత॥ (శత. ౧౧. ౫. ౮.)

అగ్ని వాయు రవిభ్యస్తు త్రయం బ్రహ్మ సనాతనం
దుదోహ యజ్ఞసిధ్యర్థ మృగ్యజుస్సామ లక్షణం. (మను.౧.౨౩.)
ఏకత శ్చతురో వేదాన్ భారతం చైక దేశతః
పురా కిల సురై స్సర్వై స్సమేత్య తులయా ధృతమ్. (భా. ఆది.)

ఇట్లు ద్వివిధములుగ చెప్పఁబడియుండుటచేతనే ఇదివఱకు వివరించియున్న రచనాభేదసంహితాభేదములే త్రివిధ, చతుర్విధ విభాగములకు హేతుభూతము లని ఎఱుంగునది.

(౪) వేదశాఖా భేదములు

ఋగ్వేదాదివేదములు యజ్ఞానుష్ఠానార్థము ఏర్పడియున్నవి కావున తత్తన్మహర్షులు తమతమ శిష్యపరంపరకు అధ్యాపన మొనర్చిన క్రమము, అగ్నిహోత్రాదికములందు చేసెడి క్రియలందు గల పౌర్వాపర్యభేదములఁ దెలిపెడి శ్రౌతసూత్రాదికముచేతను శాఖాభేదము లనేకము లేర్పడియున్నవి. పాణినిసూత్రములందు కొన్ని శాఖలపేర్లు చెప్పఁబడినవి. పతంజలిమహాభాష్యమునందు ఋగ్వేదాది శాఖలసంఖ్య ఈ విధముగఁ జెప్పఁబడి యున్నది:

"చత్వారో వేదా స్సాంగా స్సరహస్యాః బహుధాభిన్నా ఏకశత మధ్వర్యుశాఖాః, (యజుర్వే. ౧౦౧.) సహస్రవర్త్మా సామవేదః (సామ ౧౦౦౦.) ఏకవింశతిధా బాహ్వృచ్యం (ఋగ్వే.౨౧) నవధా ఽథర్వణో వేదః (అథర్వ. ౯.)" అచ్చటచ్చట వేర్వేఱుగను లెక్కింపఁబడినవి. ఋగ్వేదాదివేదములకు క్రమముగా ముక్తికోపనిషత్తు ననుసరించి ౨౧, ౧౦౯, ౧౦౦౦, ౫౦ శాఖలును, మహాభాష్యము ననుసరించి ౨౧, ౧౦౧ ౧౦౦౦, ౯ శాఖలును, స్కాందపురాణము ననుసరించి ౨౪, ౧౦౧, ౧౦౦౦, ౧౨, శాఖలును గలవు.

ఒక్కొక్కవేదమునకు ఇట్లు శాఖాభేదములు చెప్పఁబడి యున్నను భాగవతాదిగ్రంథములందు ప్రథమద్వితీయపర్వములందు ప్రతిపాదింపబడిన విషయము ఎటుల వేర్వేఱుగ నున్నదో అట్లే ఋగ్వేదశాఖలందు వేర్వేఱువిషయములు చెప్పఁబడ లేదు. ఋగ్వేదాది వేదచతుష్టయశాఖలలో కొన్నిశాఖలపేరులు మాత్రమే తెలియుచున్నవి. కాని ఆ యాశాఖల సంహితాగ్రంథములు మాత్రమే ప్రచారమునం దున్నవి. మండలాధ్యాయసూక్తసంఖ్యాక్రమముగ ౧౦ మండలములు గల విభాగమును శాకలశాఖావాంతరశాఖవా రగు శైశిరీయశాఖవారును; అష్టకాధ్యాయ వర్గవిభాగభేదములచేత ౮ అష్టకములుగ బాష్కలశాఖవారును అధ్యయనమును చేయుదురు. వీరు పైని చెప్పఁబడిన శైశిరీయశాఖవారు పఠింపని వాలఖిల్యములను ౮౦ మంత్రముల నధికముగఁ బఠింతురు.

దీనివలన శాఖాభేదము, అధ్యయనక్రమభేదమునను, మంత్రసంఖ్యాప్రయోగసూత్రభేదమునను ఏర్పడుచున్నది అనఁదగును.

౨. ఇట్లే యజుర్వేదశాఖలలో కృష్ణయజుర్వేదమునకు ౮౬ శాఖలు శుక్లయజుర్వేదమునకు ౧౫ శాఖలు గలవు. వీనిలో కృష్ణయజుర్వేదశాఖలు ౮౬ టి లోను మైత్రాయణి, తైత్తిరీయము లని ప్రసిద్ధిగల ఔఖ్యాపస్తంబీయ కాఠకము లను ౪ శాఖలు గలవు. శుక్లయజుర్వేదశాఖలు ౧౫ లోను మాధ్యందిని, కాణ్వి యనుశాఖలు రెండును నిల్చియున్నవి. ఇతర వేదశాఖలకంటె ఈ యజుర్వేదమునందు కృష్ణశుక్లసంహితలకు చాలభేద మున్నది.

3. సామవేదము శాఖలు ౧౦౦౦ లో "రాణాయని, కౌథుమి, జైమిని అను మూఁడుశాఖలు మాత్రము గలవు.

౪. అథర్వవేదము ౯ శాఖలలో "శౌనకశాఖ" యొకటిమాత్రము గలదు.

లోపించిన శాఖలకు సంబంధించిన బ్రాహ్మణగ్రంథములు శ్రౌతకల్పసూత్రములు కొన్నికొన్ని గనంబడుచున్నవి. వాని వివరము నిచట గ్రంథవిస్తరభీతిచే వ్రాయలేదు.

వేదములు, నవీనవిమర్శకులు

ఋగ్వేదముప్రాచీనమనియుఁ బిదప కొంతకాలమునకు యజుస్సామములు రచితములనియు బ్రాహ్మణగ్రంథములు పుట్టినపిదప ఋగ్వేదాదిమంత్రములందు యజ్ఞపరమగునర్థము శబ్దములందు గనఁబడకపోయినను పూర్వవేదవ్యాఖ్యాతలు తెచ్చి పెట్టుచున్నా

రనియు కొందఱందురు. అథర్వవేదము అతినవీన మనియు, పాణిని సూత్రము లందెచ్చట నథర్వవేదశబ్దము స్మరింపఁబడి యుండలే దనియు శంకరాచార్యాదులు ఉపనిషత్తులను వేదభాగము లని చెప్పుట గ్రంథగౌరవమున కనియు, పాణినిసూత్రములందు ఉపనిష చ్ఛబ్దము నిర్వచనము చేయఁబడ లేదనియు మఱికొందఱు చెప్పెదరు.

ఈవాదము సప్రమాణము గాదు. ఋగ్వేదమే మొదట పుట్టినచో, యజుస్సామవేదములు లేనియెడలను, ఋగ్వేదమునందు యజుస్సామపదము లుండరాదు గదా! కాని ఋగ్వేదమునందు యజుస్సామ పదములే గాక వామదేవ్యము, రథంతరము, బృహత్తు, మున్నగు సామభేదబోధక పదములుకూడ మిక్కుటముగఁ గనంబడుచున్నవి. యజ్ఞకర్తలగు రాజర్షులు తద్దానములు యజ్ఞియఋత్విక్కులహోత్రాదినామములును పలుతావుల చెప్పఁబడియుండుటచేత నిది స్వకపోలకల్పిత మనఁదగును.

పాణినిసూత్రము లందు అథర్వవేదపదము గనంబడనంత *మాత్రాన అథర్వవేదము తత్కాలమునందు లేదని తలంచుట యుక్తి సహమా? పాణిని తనకాలమునందు లోకమున వ్యాపించియున్న శబ్దముల కన్నింటికి స్వసూత్రములందు నిర్వచనము నేర్పరచెదను అని ప్రతిజ్ఞ చేసి యుండలేదు.

శాకలబాష్కలాదిశాఖలకు ఋగ్వేదాదినామములు సాధారణములైనట్లే శౌనకాదిశాఖలకు అథర్వవేద మని సాధారణనామము గలదు. పాణినిసూత్రములలో ప్రోక్తాధికారమునందు శౌనకాదిభ్యశ్ఛందసి (౪. 3. ౧౦౬) అని సూత్రము కలదు. దీనిచేత శౌనకసంహిత పాణినికి తెలియునని సిద్ధించుచున్నది. "ఛందసి" అనుటచేత ఛందోభిన్నమగు శౌనకీయ గ్రంథాంతరము కూడ పాణినికి తెలియుననియు సిద్ధించును. అయ్యది 'శౌనకీయశిక్షాగ్రంథము' ఇదియు పాణినికి తెలిసియే యున్నది. "కాశ్యపకౌశికాభ్యా మృషిభ్యాం ణినిః" (౪. 3. ౧౦౩) అను సూత్రమువలన కౌశికఋషిప్రోక్తమను అథర్వవేద కల్పసూత్రమగు కౌశికసూత్రమును సైతము పాణిని ఎఱింగియే యున్నాఁ డనదగును. యాస్కాచార్యుఁడు పాణినికంటె పూర్వుఁ డని పలువు రంగీకరించుచున్నారు. తన్నిరుక్తగ్రంథమున మంత్రవ్యాఖ్యానకాలమునందు "ఇత్యపి నిగమో భవతి" అని అథర్వవేదీయ మంత్రములుకూడ గ్రహింపఁబడియే యున్నవి. అథర్వవేదీయ గోపథబ్రాహ్మణమునుండి కూడ నిరుక్తగ్రంథమునందు ప్రమాణార్థము వాక్యములు గైకొనఁబడినవి. కావున అథర్వవేదము పాణినికి తెలియ దనుటయు, తెలిసినను వేదములం దొకటిగ పాణిని కాలమునందు గ్రహింపఁబడుట లే దనియుఁ జెప్పెడిమాటను వేదజ్ఞు లంగీకరింపరు.

జీవికోపనిషదావౌపమ్యే (౧. ౪. ౭౯) అను నీ సూత్రమువలన "ఉపనిషత్కృత్య" అను పదము సిద్ధించును. పాణినికాలమునందు ఉపనిషత్తులప్రచార ముంటయే గాక ఉపనిషద్జ్ఞు లగువారిచేత రచనయందు భావమునందు ఉపనిషత్తులతో సమానము లగు గ్రంథములు రచింపఁబడిన వనియు కూడ పాణిని ఎఱింగియున్నాఁడు పాణినికంటె ప్రాచీనుఁ డగు యాస్కుఁడు 'యత్రా ఒసుపర్ణా అమృతస్య' (ఋ. సం. ౧. ౧౬౪. ౨౧.) అను మంత్రమునకు అధిదైవత వ్యాఖ్యాన మొనర్చుచు "ఇత్యుపనిషద్వర్ణో భవతి (నిరు. 3. ౨. ౬) అని చెప్పెను. యాస్కునికే ఉపనిషత్తులఁ గూర్చి తెలిసినట్లు మనకు కనఁబడుచుండగాఁ నతని తరువాతవాఁ డగు పాణినికి ఉపనిషత్ పదము తెలియదనుట చింత్యము.

శుక్లయజుర్వేదము పాణినికి తెలియదని కొంద ఱందురు. కాని అదియు నసంగతమే.

ఉపసంహారము

వేదములను గుఱించి వ్రాయునప్పుడు ఆయావేదశాఖల నామములను ఆయాశాఖలకు సంబంధించిన గ్రంథాంతరములను గూర్చి వ్రాయుట అత్యావశ్యకము. అయినను గ్రంథవిస్తర భీతిచేత ఇచ్చట నాల్గువేదములను గూర్చి మాత్రమే సంగ్రహముగ వ్రాసినాఁడను. వేదగ్రంథములను గూర్చియు, తత్కాలీనము లగు ఆచారవ్యవహారాదికములను గూర్చియు వ్రాయఁబూనెడి విమర్శకు లంపఱు తదుద్దిష్టము లగు నాయాగ్రంథములను తాము స్వయముగ పరిశీలించి సుతర్కముతో మీమాంసఁజేసి తరువాత వానిని గ్రహించుటనో త్యజించుటనో చేయఁదగు నని ప్రార్థించెదను.

సంస్కృతభాష - తదభ్యాసము

వ్యాకరణాచార్య నోరి సుబ్రహ్మణ్యశాస్త్రులు గారు

ఆర్యులు నివసించెడు దేశములలో సంస్కృతము ప్రధానముగ నున్న దను విషయము ఎల్లరకును విదిత మైనదే. హిందూ దేశమున నున్న భాష లన్నింటిలోను సంస్కృత తత్సమ తద్భవ శబ్ద ప్రయోగములతో కావ్యాదులను రచించుటయే కాక యభిప్రాయములను కల్పనలను గూడ సంస్కృతచ్ఛాయానుసారమే వ్రాయఁబడుచున్నవి. ఇంతియగాక పాశ్చాత్యభాషలలో సైతము విశేషముగ సంస్కృతసంబంధ మున్నట్లు నవీనులు రచించిన భాషాతత్త్వ గ్రంథములచే (Philoeogy) స్పష్ట మగుచున్నది.

భాషకు మూలతత్త్వము లగు వర్ణములు గొన్ని యుచ్చరింపఁబడ కుండుటయు నొక్క వర్ణమే వేరువేరు స్థలములందు పలు విధముల నుచ్చరింపఁబడుటయుఁ గొన్నివర్ణములు మఱికొన్నివర్ణముల యుచ్చారణచే గతార్థము లగుటయుఁ గొన్నిభాషలలో వర్ణములు తక్కువగ నుండుటచే గుర్తులచేతనే ఆయాశబ్దములు గ్రహింపఁబడుటయు, నితరభాషలలో నుచ్చరింపఁబడని కొన్నివర్ణములు తమ భాషలలో గల్పింపఁబడుటయు నీ మున్నగుదోషములు సంస్కరింపఁబడనందున నితరభాష లన్నియు నసంస్కృతము లని నిస్సంశయముగఁ జెప్పవచ్చును. కనుకనే దేవభాషకు సంస్కృత మని పేరు.

కొందఱు భాషాతత్త్వవేత్తలు "సంస్కృతము దేశభాషయా?" యనియు నది గ్రంథములలో వ్రాయఁబడుట మాత్రమే గాని యెప్పుడును దేశభాషవలె సంభాషితము కాలేదనియుఁ గావున నది మృతభాష (Dead Language) యనియు ననిరి. మఱికొందఱు సంస్కృతముసైతము గీర్వాణభాష యని భాషాశబ్దముచే వ్యవహరింపఁబడును గాన 'భాష్యత ఇతిభాషా' యను వ్యుత్పత్తినిబట్టి యేదేశముననో యేకాలముననో ఇదియు వ్యావహారికభాషగా నున్నట్లు తోఁచుచున్న దనియుఁ గాలక్రమమున నశించినందున నది గ్రాంథికభాషగఁ బరిణమించినను రాజావలంబనాదిసాధనము లుండినచో హూణభాషవలె దేశభాష యగుటకు సందియము లే దనియుఁ జెప్పుదురు.


సంస్కృతభాషలో వ్యావహారికవిషయముల నన్నిఁటిని మాట్లాడుట యెట్లని కొంద ఱడుగుదురు. కాని పూర్వగ్రంథములలోని పారిభాషికశబ్దముల నన్నిఁటిని (అనఁగా ఇడియమ్స్, ఫ్రేజెస్, క్లాజెస్, మొదలగు వానిని) ఇంగ్లీషుభాషలోవలె మనము వాడుకలోనికి తెచ్చితి మేని వ్యవహారవిషయములను సంభాషించుటకు శక్యము కాకపోదు. కాని ఇందులకు రాజులయొక్కయు ప్రజలయొక్కయు గాఢప్రయత్నము లావశ్యకములు.

సంస్కృతభాషలో నున్న గ్రంథము లన్నియు సాక్షాత్తుగ గాని పరంపరగ గాని లోకుల కిష్టప్రాప్తిని అనిష్టపరిహారముఁ గ బోధించును అందు వేదములు ప్రభువులవలె మనుష్యుల విధులఁ దెల్పును పురాణములు స్నేహితులవలె హితమును బోధించును కావ్యములు (కాంతాసమ్మితములు గాన) వ్యంగ్యముచే నీతిని బోధించును. ఈ గ్రంథము లన్నియు ధర్మార్థకామమోక్షము లను చతుర్విధ పురుషార్థములను సిద్ధింపఁజేయుటకుఁ బ్రణీతములై యున్నవి. రామాయణకావ్యము రాముఁడు మొదలగువారివలెఁ బ్రవర్తింపవలెననియు రావణాదులవలెఁ బ్రవర్తింపఁ దగ దనియు, న్యాయ్యమార్గమునఁ బ్రవర్తించువానికి తిర్యగ్జంతువులు సైతము తోడ్పడు ననియు నన్యాయ్యమున బ్రవర్తించువారిని సోదరుఁడు సైతము విడనాడు ననియు నీతిని బోధించును. అట్లే మహాభారతమున గృధ్రసృగాలోపాఖ్యానముచే స్వార్థపరతను ప్రధానముగాఁ జేసికొన్నందున పరిహాసపాత్రము లగుదురు. కనుక స్వార్థపరులై ధర్మశాస్త్రమును ఇతరులకు బోధింపఁగూడ దని లోకోత్తరమగు నీతిని బోధించుచున్నది.

తర్క వ్యాకరణాదిదర్శనములు, అశ్వశాస్త్ర గోశాస్త్రాదికములు, శుక్రనీతి మున్నగు నీతిగ్రంథములును, ధర్మశాస్త్రములును, ఇవి యవి యననేల? అన్నివిధములగు గ్రంథములును ఈభాషలో నున్న ట్లందఱు నెఱుంగుదురు. ఆయుర్వేదమూలక మగు వైద్యశాస్త్రమునందును, చరకాదిగ్రంథములు భాషాసౌష్ఠవముతో, ఆ వాజీకరణము సాంగోపాంగముగ నున్నవి. మఱియు, లోకహితమును బోధించుచున్న గ్రంథరత్నము లనేకముల నీభాషలో రచించినట్లు తెలియుచున్నది. ముద్రణయంత్రములమూలమున నవి యన్నియు నిప్పు డందఱకును గన్పట్టుచున్నవి.

పతంజలి యోగశాస్త్రమును చరక మను వైద్యగ్రంథమును వ్యాకరణమహాభాష్యమును రచించెను. వ్యాకరణభాష్యమునకే మహాభాష్య మని పేరు. ప్రత్యేకముగ దీనిని మహాభాష్య మని యేల యన వలయుననిన: ఇతరశాస్త్రములలోవలె సూత్రకారునిచే జెప్పఁబడని విషయమును భాష్యకారుఁడును భాష్యకారునిచే సవరింపఁబడనివిషయమును వార్తికకారుఁడును సవరింపక, ఈ వ్యాకరణశాస్త్రమునందు మాత్రము సూత్రకారుఁడు చర్చింపనివిషయములను వార్తికకారుఁడును నాయుభయులు. విచారింపని విషయములను పతంజలియు విచారించి సిద్ధాంతీకరించుటచే దీనికి మహాభాష్య మని పేరు వచ్చెను. ఈగ్రంథరత్న ముండునంతవఱకును సంస్కృతభాష లోపించినదని గాని, లోకోత్తరములు సులలితములు నగు వాక్యోపవాక్యములు,

Madras Andhra Sabha.



చదరాసు ఆంధ్రసభాసభ్యులు.

Scoutmasters' Training Camp, Vallurpalem.



ఆంధ్రబాలభటనాయకశిక్షణశిబిరము: వల్లూరుపాలెము.

Andhra Scoutmasters' Camp: Vallurpalem.




ఆంధ్రబాలభటశిబిరము: వల్లూరుపాలెము.

Late Dr. B. Rajagopal.



కీర్తిశేషులైన డాక్టరు బి. రాజగోపాలుగారు.

Pandit Gopalakrishna Sastri Garu.



ముక్తినూతలపాటి గోపాలకృష్ణశాస్త్రిగారు.

Mr. B Mangaiah Naidu.



బాపా మంగయ్యనాయుడుగారు.

Rai Saheb Muthia Chetti.



రావుసాహెబు ముత్తయ్య శ్రేష్ఠిగారు.

Mr. K. Krishnaraya Sastri.




కాశీభట్ల కృష్ణరాయశాస్త్రిగారు.

Mr. M. Hanumanthappa Naidu.



మర్తిపి హనుమంతప్పనాయుడుగారు.

Mr. E. Sobhanadri Chowdari.



ఈదర శోభనాద్రి చౌదరిగారు.

Mr. I. Narasimha Chetti.



ఇందుపూడి నరసింహ శ్రేష్ఠిగారు.

వాదప్రతివాదములు, తత్పరిహారములు మొదలగునవి యన్నియు సంస్కృతభాషయందు లేవని గాని, చెప్పుటకు వీలులేదు. ఇంతవఱకును గ్రంథకర్తలందఱును మధుకరన్యాయముగ వాక్యోపవాక్యములు మున్నగువిశేషములను వ్యావహారికభాషాస్వరూపమును ఈ మహాభాష్యమునుండియే గ్రహించిరి.

ఈ పతంజలిచే రచింపఁబడిన యోగసూత్రమునందు చిత్తవృత్తినిరోధమే యోగ మనియును మైత్రీకరుణాదుల భావనవలన చిత్తప్రసాద మగుననియు చిత్తప్రసాదమూలమున యోగము సిద్ధించు ననియును వివరించిరి. ఇహలోకమందు స్త్రీపురుషాదు లెల్లరు నీవిషయములను బాగుగ నభ్యసించిరేని క్లేశములు లేకయే పోవును.

“గురూణాం గురుః ప్రాభాకరః” అని బిరుదొందిన మైమాంసికు లగు ప్రాభాకరులు, తర్కశాస్త్రమునందు అనేకగ్రంథములను రచించిన శిరోమణిభట్టాచార్యులు, నూటికంటె నధికముగా సర్వశాస్త్రములందును గ్రంథములను రచించిన విద్యారణ్యులు, అప్పయదీక్షితులు మున్నగువారి మహిమలును వారి సంభాషణలు నెంతటి యుత్కృష్టతను ఈ భాషకు దెచ్చుచున్నవను విషయ మెల్లరకును తెలిసినదియే. ఈభాష మానుషలోకమున నందునను మన హిందూదేశమునందు మాత్రమే యుండుట మనయదృష్టము గాన దానిని మనము శక్తికొలఁది ప్రచారములోనికి దెచ్చుట మాతృదేశశుశ్రూషలలో ముఖ్యమయినది

సంస్కృతభాషాభ్యాసము.

ఆర్యులు వేదాదుల నభ్యసించుసమయమున మొన్న మొన్నటివఱకును నుపనయనసంస్కార మయినవెంటనే వేదము నారంభించి స్వాధ్యాయ దివసములలో వేదమును అనధ్యయనములయందు శిక్ష మొదలగు వేదాంగములను గాని కావ్యకోశాదులను గాని యభ్యసించుచుండువారలు. రాను రాను ఆసంప్రదాయములన్నియు నుత్సన్నములగుటచేతను, రాజకీయభాషలు వేరుగ నుండుటచేతను వానియందే పరిశ్రమచేయువారు పెక్కండ్రగుటచేతను, ఈ సంస్కృతభాష విశేషప్రచారమును గాంచలేదు. కాన నీసంప్రదాయములు నానాటికి క్రమముగా తగ్గిపోవుచున్నవి. మఱియు నిప్పుడు సంస్కృతమును మాత్రము కొందఱారంభించినను, దానినభ్యసించుటకు సాధనభూతములగు నుపాయములు గమనించుట లేదు. విద్యనభ్యసించుటకు నుపాయములు ‘(1) గురుశుశ్రూష (2) గురునకు ధనము నిచ్చుట (3) తనవిద్యను జెప్పి వారినుండి తాను మఱియొకవిద్యను గ్రహించుట’ అని మూఁడు. గురువులకు ధనమును గాని, విద్యను గాని ఈయ సమర్థుడు గా కున్నను గురుకులవాసమును గాని, శుశ్రూషను గాని చేయుటకు సయితము సాహసించువా రిప్పు డెవ్వరును గాన్పింపరు ఈ సంప్రదాయ ముత్సన్నముగాకుండ గురువులు చెప్పినను చదువువారలు గన్పట్టరు. ఇప్పటివిద్యార్థులు పద్యకావ్యములకంటె గద్యకావ్యములు సులభములు గనుక వానినే చదువుద మనియు, కల్పనాచాతుర్యముగల గ్రంథములు జదువుటచే పెద్దపెద్దకల్పనలే తెలియును గాని వేరుగ నుపయోగము లేదనియుఁ జెప్పుదురు. భాషాసౌలభ్యముగలిగి ప్రకృతిని వర్ణించు గ్రంథములనే పఠింపవలయు ననియు మేఘసందేశము భారవి మొదలగు కఠినకావ్యములఁ జదువగూడదనియు జెప్పుదురు. మఱియు పూర్వమందు గురుకులములందు నివసించుటచేత విద్యార్థులచ్చటి వృక్షచ్ఛాయలందు నివసించి పరిశుద్ధవాయువును సేవించి అరుణోదయమున నదీస్నానము చేయుట మొదలగు సాధనములమూలమున నెంతకఠినమగువిషయము లైనను శీఘ్రముగ గ్రహించుచుండువారు. ఇప్పుడు ప్రతిదినమునను నాహారవిహారములచేతను, మెదడును బాగుచేయు తైలాదులచేతను నెంతప్రయత్నించినను నాతైక్ష్ణ్యము కాన్పింపదు. కాన ప్రాచీనపద్ధతుల ననుసరించి మనము సంస్కృతభాష నభ్యసించిననే కాని మన కేభాషయందును స్వాతంత్ర్యము కలుగుటకు వీలులేదు. వేదములు బహుళశాఖాసమన్వితము లగుటచే నొక్కరే యన్నిశాఖల జదువుట యశక్యమైనందున నాయాకుటుంబముల కాయాశాఖలు పంచిపెట్టఁబడినవి. వారా శాఖలనే చదువవలయునని నియమముఁ జేయబడినది. అటులనే లోకసామాన్యమునందు సంస్కృతభాషాప్రచారముండుటకై వారివారికి దగినట్లు విభజించి కొందఱనైన నియోగించి సంస్కృతభాషా సంప్రదాయముల ప్రచారములలో నుంచనియెడల మనదేశమంతయు ఈక్రింద నుదాహరించు విశ్వగుణాదర్శకారుని సూక్తికి పాత్రమగును.

సీ. పదివేదవర్ణముల్ చదివినమాత్రనే
        దవ్యాసముని యనఁ దనరునాతఁ
    డౌపాసనముచేసినంత మాత్రమున నా
        పస్తంబ ఋషియనఁ బరఁగునాతఁ
    డొక్కపద్యంబేనియును బఠియించి నం
        తనె బృహస్పతి యనఁ దనరు నతఁడు
    పాణినీయమొకింతఁ బఠసినమాత్రాన
        భాష్యకారుఁడనంగఁ బరఁగునతఁడు
గీ. కొన్ని పదముల నటునిటు గూర్చినంతఁ
    గాళిదాసుఁడనంబేరుఁ గాంచునతఁడు
    ఘనుల కిడుమల నిడు కలికాల మహిమ
    సన్నగిల్లుచు నున్నవి చదువులెల్ల.

ఆశాపాశము

ముక్తినూతులపాటి గోపాలకృష్ణశాస్త్రి గారు

ప్రపంచములోని మానవుని మనస్సు ఆశాపాశబద్ధమై యుండుటయు, నాశాప్రేరితమై లౌకిక కార్యముల నొనరించుటయు నెల్లఱకు విదితమైయుండు. ఆశయన ఫలప్రాప్తియందిచ్ఛ. ఫలప్రాప్తి కలుగు ననునాసచేఁ బూనికతోఁ గార్యముల నొనరించువారి మనస్సున కొకవిధ మగు బలము కలిగియుండు. ఆశలేనివాఁడు నిరుత్సాహవంతుఁడుగఁ గన్పడు. ఆశ సామాన్యస్థితియందున్నప్పుడు మానవుని బాధింపదు గాని యభివృద్ధిఁ జెంది, చెడు మార్గములోఁ బోవుకొలఁదిని, దురాశారూపమును పొంది బాధించును. దేశకాలముల ననుసరించి తనగతిస్థితులనుబట్టి న్యాయ్యముగ విషయముల నభిలషించుటచేఁ జేటు కలుగదు గాని, తనస్థితిగతులను మఱచి విషయాభిలాషా తత్పరుఁడును దురాశాప్రేరితుఁడు నైనచోఁ జెడిపోవును. ఈ యాశ; దురాశ, నిరాశ; ఆశ, యని ముత్తెఱంగులు. సత్త్వగుణభూయిష్ఠు లగు జ్ఞానవైరాగ్యసంపన్నుల యెడ నిరాశయు; తమోగుణ భూయిష్ఠు లయి కామక్రోధములు గలదుర్జనులయందు దురాశయు; రజోగుణవంతు లయి, ప్రాపంచిక కార్యప్రవృత్తు లగు సామాన్యులయెడ నాశయు; నుండినట్లుండు. ఆశను ఇచ్ఛకుపర్యాయపదముగ వాడినచో నంతదూష్యముగఁ జూపట్టదు. సద్గ్రంథ శ్రవణపఠనములయందును; సత్సాంగత్యమందును; జ్ఞానప్రాప్తియందును కీర్తియెడలను, యోగసిద్ధులందును ఆశ యుండినచో నుత్తమస్థితికిఁ బ్రాపకముగ నుండును. అటుగాక కాంతాకనకములయందుమాత్రమే యాశకలిగియుండుట దుఃఖజనకమై నరకమునఁ బడఁద్రోయు నిచ్ఛ. అంకురిత పల్లవిత కోరకిత కుసుమిత ఫలితావ్యవస్థలచే కామము ఈహా, స్పృహా, ఆశ, తృష్ణ, గృధ్నుత, అనుస్థితులఁ జెందును. వీనిని పాశ్చాత్యమానసికశాస్త్రజ్ఞులును (Liking Desire Ambrission Avaric Greed) అనుపదములచేఁ దమశాస్త్రములయందు వ్యవహరించిరి. యాచకులు ధనసంపన్నులఁ జూచి, మనోరథముచే నాశను బొడమించుకొని వారలఁ జేరి; వారిచేఁ బరాభూతులై నిరాశఁ జెంది దుఃఖములపాలగుదురు. దుఃఖమునఁగా—దురాశచేఁ గలిగిన దుఃఖమని తెలియవలయు. యాచకుఁడు ధనసంపన్నునిఁ జేరి తన కష్టముల దెలిపి, పిమ్మట తనకు నెంత విధిప్రాప్తమో అంత ఫలము లభించు నని ధైర్యము నవలంబించియుండవలయుఁ గాని; తాను కోరినంత లభించు నని యధికాశ నాధారముఁ జేసికొని యుండఁ గూడదు. అటులఁ దాను కోరినంతలభింపక పోయెనేని కలుగు మనోవ్యథ వర్ణింప నలవికాదు. ప్రాప్తలాభముచే సంతుష్టుఁ డయ్యెనేని కలుగు మోదముఁ జెప్పఁ దరముకాదు. తాను, గొప్పవాని నాశ్రయించి కృషి సలుపవలయు. ఫలితము, కర్మాయత్తమని యీశ్వర పరాయణుఁడై తటస్థుఁడై యుండవలయును

బ్రహ్మదేవునిచే నొసట వ్రాయఁబడినధనము కొలఁదియో గొప్పయో దానిని ఎచ్చటనుండినను బొందుచున్నాఁడు. ఎచట నుండినను విధిప్రాప్త మెంతయో యంతియగాని యెక్కువఁ బొంద నేరడు. మన మొకపాత్రను, తీసికొని బావియొద్దకుఁ బోయినను సముద్రము నొద్దకుఁ బోయినను, సమానముగ జలము లభించునే గాని; బావియొద్ద తక్కువగను, సముద్రమునొద్ద ఎక్కువగను లభింపదు గదా! కావున ధనాఢ్యులయెడ దైన్యవృత్తి నవలంబింపఁ గూడ దని భర్తృహరియోగీంద్రుఁడు తన సుభాషితరత్నావళియందు నుడివెను. కావున వైద్యప్రాంతమునే యాచకులు ఆశకు లోబడక విధిప్రాప్తలాభముచే సంతుష్టిఁ జెందెద రేని సుఖమునుఁ బడయుదురు. మఱియు నీయాశ రెండువిధములు, అందొకటి తాను మనోరథపరంపరలచే నభివృద్ధిఁ జేసికొనుట, రెండవది, ఇతరులు అనఁగా ధనసంపన్నులమాటలచేతను క్రియలచేతనుఁ బ్రోత్సాహితుఁడై ఆశనుఁ జెందుట, మొదటిది స్వగతము. రెండవది పరగతము. స్వగతమునకంటెఁ బరగతము తీవ్రము. ఒక యాచకుని మాటలచేతను క్రియలచేతను నమ్మించి యాశఁ గలిగించి పిమ్మట వ్యర్థమనోరథునిఁ జేసె నేని, ఆయాచకుఁ డనుభవించు మనోవ్యథ వర్ణింప నలవి కాదు. దాతృసుకృతమును యాచకుఁడును; యాచకుని పాపమును దాతయుఁ బొందుదు రని స్మృతులయందుఁ దెలుపఁబడుచున్నది. తనకు సమర్థత గలిగియుండియును యాచకునిమనోరథముఁ బూరింపఁజాలనివానిగేహమే భూమికి భారము కాని; పర్వతములు, వృక్షములు భారము కావని నైషధమందుఁ జెప్పఁబడెను. ఆశచేఁ బీడింపఁబడు యాచకునిమనస్సు; వృష్టిలేక వాడఁ బారుచుండు సస్యమును బోలియుండు. ఆశాపీడితుఁ డగు యాచకుని కష్టమును దాత యెఱుంగు నేని అర్థిని వ్యర్థమనోరథునిఁ గావింపఁజాలఁడు. మితిలేని యాశలను బెట్టుకొని వానినిఁ బూరించుటకై పడరానిపాట్లు బడి దేశములఁ దిరిగి; నిదుర ఆహారము లేక, విసుగు జెంది శరన్మాలక సుఖములఁ బడయుటకన్న; నాశలను విడుచుటవలనఁ గలిగినసుఖము, కడుంగడు శ్రేష్ఠ మని, 'నిరాశా పరమం సుఖ' మ్మను లోకోక్తిచేఁ దేటపడు చున్నది. ఈయాశ; వర్తకులయెడను; రాజులయెడను ధనాఢ్యులయందును విశేషముగఁ జూపట్టుచుండు. ఒకప్పుడు ధనప్రాప్తి కలిగె నేని; అయభిరుచిచే నంతకన్న నెక్కుడు ధనము నార్జింపవలెనను నాశ పొడమును. ధనార్జనమునందుఁ బెక్కుకష్టములు దురాశచే సంప్రాప్తింపగ నికమీఁద ధనాశను విడువఁ దగును. ఉన్న దానితోఁ దనివిఁ జెందవలె నను వైరాగ్య మప్పుడు కలిగి; అధనార్జనకార్యము ముగిసినవెంటనే పూర్వ మనుభవించిన కష్టముల మఱచి యాశాప్రేరితుఁడై మఱల ధనము నార్జింపఁ గడగును. ఆశచే యుక్తాయుక్తవివేచనాశక్తి మేధ ప్రజ్ఞ మందము

లగుదురు. ప్రజ్ఞాహీనులును, మూఢమతులు నగువారు అధికాశలకుఁ బోవ్పుడు ఫలితములు లభింపమిచే నైరాశ్యముఁ జెందుదురు. అనఁగ విరక్తినిఁ బొందుదురు. "అభావే విరక్తి" యనులోకోక్తిచే; ఫలప్రాప్తి కలుగమింజేసి వీరికి విరక్తిపొడమెను గాని నిశ్చల మగు వైరాగ్యము కాఁజాలదు. జ్ఞానవైరాగ్యసంపన్నులగు యోగిపుంగవులకన్ననో; వారియెడుటఁ నానాజనఃములగు కాంతాకనకాదివిషయములున్న మదోష దృష్టిచే; వానిని విషసదృశములుగఁ జూచి; వానియెడ నైరాశ్యముఁ జెందుదురు. ఇదియే నిశ్చలమగు వైరాగ్యము 'నిస్పృహస్యతృణం జగత్'ను లోకోక్తిని బట్టి యాశారహితుఁ డగుటవుహనీయునకీ జగత్తు గడ్డిపోరకతో సమానము.

ఆశ యనుతాడిను నాశ్రయించి జీవితకుసుమము వికసించుచున్న దని కవులు వర్ణింతురు. గొప్ప కార్యముల నొనరించునపుడు దృఢమయిన యాశతో నుండవలయుఁ గాని, అవి ఫలితావస్థఁ జెందని యపుడు నిరాశనుఁ బొందఁగూడ దనియు; నిరాశవలనఁ గార్యసందలి యుత్సాహము తగ్గు ననియు; దృఢమైనయాశాబలముచే నెట్టి కార్యమేని నెఱవేరు ననియుఁ బాశ్చాత్యులయభిప్రాయము. ప్యాలసీ మొదలగువారి జీవితచరిత్రములందు ఇది స్పష్టమగుచున్నది.

తాపజ్వరముచే దప్పికఁ జెందినవాఁ డెంత మంచినీరు త్రాగినను వాని దప్పికి యణఁగనట్టుల ధనతృష్ణగలవాఁ డెంతద్రవ్యముఁ బొందినను తనివిఁ జెందఁడు. ఈధనాశ కంతము లేదు. తృప్తియు లేదు. సామాన్యముగ ధనాఢ్యులకే ధనమందలి యాశ మిక్కుటముగ నుండును.

చిరకాలము సకలవిషయభోగముల ననుభవించినను; కోరికల కంతము లేదని; మహాభాగవతమున, సౌభరి యనుమునిచేఁ జెప్పఁబడెను.

శ్లో. మనోరథానాం న సమాప్తిరస్తి
వర్షాయుతేనా ఽప్యథవా ఽపి లక్షైః
పూర్ణేఽపి పూర్ణే ఽపి మనోరథానా
ముత్పత్తయ స్సంతి పునర్నవానాం.

పదివేలు సంవత్సరము లైనను అనేకలక్షలసంవత్సరము లైనను విషయసుఖముల ననుభవించినను, కోరికల కంతము లేదు. ఎవ్విధంబున నేని కలిగిన కోరికెల నెఱవేర్చుకొనినను; మఱల క్రొత్త కోరికలు పొడముచు నే యుండును. తృష్ణాజలములు గల ఆశాసముద్రమునందు; మనోరథతరంగపరంపరలు ఉత్పత్తి యగుచు, నశించుచు నుండును. సముద్రమునందు; తరంగము లణఁగియుండనిచందంబున; ఆశాసాగరంబున నెల్లప్పుడు మనోరథములు కలుగుచుండును.

శ్లో. న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే
పూర్ణం వర్షసహస్రం మే విషయాన్ సేవతోఽసకృత్
తథాపిచానువసనం తృష్ణా తేషూపజాయతే.

—శ్రీ. భా. ౯ స్కం.

అగ్నిహోత్రమునందు సమిధలు వేయుకొలఁదిని ప్రజ్వలించి, యభివృద్ధి యగు చందంబున, విషయసుఖము లనుభవించుటచే, కోరిక లభివృద్ధి యగుచుండును గాని; శమింపఁ జాలవు. వేయిసంవత్సరములు గ్రామ్యములగు విషయభోగముల ననుభవించినప్పటికిని దనివి లేక, మఱల నను, దింపవలెనని నాకింకను గాని కలుగుచుండు నని శ్రీభాగవతమునందు చెప్పఁబడెను.

ఏమియులేని, హీనుదరిద్రుఁడు తొలుత నూఱురూప్యములు లభించె నేని; చాలునని కోరును. ఎట్లులేని నూఱురూప్యంబులు లభింపఁ దనివిఁ జెందక వేయి గోరుచు. వేయి లభించిన లక్షను లక్షాధిపతియై భూపతిత్వమును భూపతి చక్రవర్తిత్వమును, చక్రవర్తి ఇంద్రత్వమును; ఇంద్రుఁడు బ్రహ్మపదవిని బ్రహ్మ విష్ణుస్థానమును గోరుచుండును. ఆశ కంతమునుఁ గన్గొనినవాఁ డెవఁడు? ప్రాప్తలాభముచే సంతుష్టిఁ జెందినవాఁ డెవఁ డని శ్రీవిద్యానసుశ్రుని శాంతిశతకమునఁ జెప్పఁబడెను.

ఈవిషయమును గూర్చి శ్రీభాగవతమున వామనమూర్తిచే బలిచక్రవర్తికి ఈక్రిందివిధముగఁ జెప్పఁబడెను.

శా. ఆశాపాశము తాఁ గదుఁ నిడుపు, లేదంతంబు రాజేంద్ర! వా
రాశిప్రావృతమేదినీవలయసామ్రాజ్యంబు చేకూడియున్
గాసింబొందిరిగాక వైన్యగయధూకాంతాదులు స్వర్థకా
మాశన్ బాయఁగ నేర్చిరే! ముదు నిజాశాంతంబులం జూచిరే!

కాఁబట్టి యాశ కంతము లేదని పలుచోట్లఁ జెప్పఁబడెను. అట్టియాశను జయించుటకు సంతోషము తప్ప వేఱొకటి లేదని యాధ్యాత్మికశాస్త్రజ్ఞులు స్వానుభవమువలనఁ గనిపెట్టిరి.

దురాశాపిశాచిక, ఎట్లు త్రిప్పిన నావలనికిఁ దిరుగుచు, పడరానిపాట్లు పడుచు, గౌరవమునుఁ గోల్పోయి యడుగరానివారి నడుగుచు; రేయి యనక, పగ లనక; నిద్రాహారములు లేక దుర్గమప్రదేశముల సంచరించుచుఁ దనివి లేని లోభాత్ములు చిత్తశాంతి లేక మిక్కుటము లైన మనోవ్యథలఁ జెందుదురు. ఈ దురాశాగ్రస్తులు కొండొకవేళ మహత్తర మైన లోభముచే, మృతిని గాని, లేక; కారాగృహప్రవేశమును గాని పొందు చున్నారు.

తనివిఁ జెందుటవలనఁ గలిగినలాభమున కొక దృష్టాంతము కలదు. మహాసంగ్రామ సమయంబున నిరువురు వర్తకులు వ్యాపారము సేయుచుండిరి. అం దొకరు, వస్తువుల కధికధర లయినందున, భయపడుచు గొన్ని పదార్థములను వెలకుఁ దీసి తిరిగి విక్రయింపఁగఁ గొన్నిలక్షలు లాభమువచ్చెను. తా నెన్నఁడు తలంపని లాభ మధికముగ వచ్చినందున నిఁక వ్యాపార మొనరించిన నష్టము వచ్చును. ఈ ధరలు నిలఁబడ వని, ప్రాప్తలాభముతో సంతుష్టుఁడై విరమించి యుండెను.మఱియొకఁడును, వానివలెనే, కొంతసరకును అధిక వెలలు పెట్టి కొనుఁగోలు చేసి మఱల విక్రయించి కొన్ని లక్షలలాభముఁ బొందెను. ఈలాభపు రుచిచేఁ దనివిఁ జెందక ఆసచే మిక్కుటమైన సరకును, కొనుగోలు చేసి యుంచెను. మొదటివాఁడు, రెండవవానికిఁ గోటిరూప్యములు లాభము కలుగఁబోవు చున్న దే యని వగచుచుండఁగ, కాలస్థితినిఁబట్టి వెలలు తగ్గెను. విశేషవ్యాపారమును చేసినరెండవవానికిఁ గోటిరూప్యములు లాభము వచ్చుటకు మాఱుగ పూర్వపులాభముతోఁ

గూడ రెండు కోట్లు నష్టము వచ్చునట్లు తటస్థించెను. అప్పుడు మొదటివాఁడు తాను తనివిఁ జెంది విశేషవ్యాపారముఁ జేయక; పొందినలాభముచే, సంతుష్టుఁ డయినందుకు ఫలముఁ గనెను. రెండవ వాఁడు తాను దురాశకుఁ బోయి, మొదటివానికన్న హీనుఁడ నయితి నని దుఃఖించెను. దీనివలనఁ జదువరులు సంతోషమువలనఁ గలుగుఫల మరయుదురు గాత.

శ్లో. ప్రాప్తవ్య మర్థం లభతే మనుష్యో
దేవోఽపి తం లంఘయితుంహి నాలం.

పూర్వజన్మ కర్మానుగుణ్యముగఁ దాను పొందఁదగినఫలితముఁ దా నెచ్చటనుండినను బొందు ననియు; దానినిఁ దప్పించుటకు దేవుని చేతను నలవి కా దనియు, విశేషముగ నాశాపరంపరలచే వ్యథలఁ బొందుట వ్యర్థ మనియు, నిశ్చయించుకొని వివేకియగువాఁడు ప్రాప్త లాభముచే సంతుష్టుఁ డగుచు; స్థిరచిత్తుఁడై యుండును. తనకన్న నధికు లగువారలవలె, ధనకీర్తిభోగైశ్వర్యములఁ గోరఁగూడ దని తాత్పర్యము కాదు. పైయన్నింటికిఁ బ్రయత్నించునపుడు, క్రమ ముగఁ బురుషప్రయత్నమును నిశ్చలమనస్సుతో సలుపుచు; ఫలితా ఫలితములందు హర్ష విషాదముల నొందక సంతతకృషి నొనరింపవలయు. వివేకయుక్తబుద్ధితో నేకార్య మొనరించినను బాధింపఁబడఁడు. పుత్త్ర మిత్త్రకళత్త్ర గృహక్షేత్త్ర ధనకనకాది పదార్థములయం దాసక్తి గల వానిమనస్సు; పచ్చిచింతకాయను బోలి యుండును. చింతకాయ లోని ఈనెలు లోపల వెలుపల పృథముగ నల్లుకొని యున్నందున, బెరడు వేఱుగను, పండు వేఱుగను విభజింప నలవి కాదు. ఏలయన పరిపక్వము కామిచే వేఱుపఱుప నలవి కాదు అట్టులనె విషయాసక్తుని మనస్సును.

జ్ఞానవైరాగ్యములు గలయోగీశ్వరుని మనస్సు పండిన చింత కాయవలె బెరడు వేఱుగను లోపలిపండు వేఱుగను యీనెలచే బంధింపఁబడక చూపట్టినట్టు బహిర్విషయములనుండి యాశాపాశ ములు వీడినందున స్థూలసూక్ష్మశరీరములు వేఱుగఁ బ్రకాశించు చుండు.

శ్లో. ఆశాయా యే దాసాస్తే దాసా స్సర్వస్య లోకస్య
ఆశా యేషాం దాసీ, తేషాం దాసాయతే లోకః.

ఆశాబద్ధులు ప్రకృతిబద్ధు లనియు, నిర్జితాశు లగువారు ప్రకృత్యతీతు లనియుఁ దెలియుచున్నది. ఆశాపాశబద్ధులు కాకుండు నటుల శ్రీజగదీశుఁడు మనల ననుగ్రహించుగాత.

ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు?

హరి వేంకటేశ్వరులుగారు

దివ్యతర మైన కంఠస్వరంబుతోడ
ఎడతెఱపి లేక యాయాస మింత గనక
అర్థగాంభీర్య మెవటికి నందనీక
ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు? 1

అనవరతచిత్తసంక్షోభ మనుభవించి
శాంతభావంబు గనఁగ నీ చెంతఁ జేరు
వార్తల కొసంగు స్వాగత కీర్తనంబొ
ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు? 2

నీవు మ్రింగిన ప్రాయంపు జీవకోట్ల
నలలలోపల నాడించి యాత్మలకును
శాంతిగీతంబు సల్పెదో! సంతతంబు
ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు? 3

నీ కనుల ముందు గ్రాలు నీ లోకమందు
వడివడిగ మార్పు లవి చాల పొడముచుంట
మిగుల నాశ్చర్యభావమే మెళగింతొ?
ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు? 4

జగ మను విశాలనాటకశాలయందు
జనుల కార్యాచరణమున కనుగుణముగ
పాటలను పాడు సుస్థిరపాత్ర వేమొ?
ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు? 5

విపుల మైనట్టి యాకాశవీథియందు
చనెడు రవిచంద్రతారకాసఖుల నెల్ల
హెచ్చరింపఁగ పాడెదో యీ విధమునఁ
ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు? 6

నీ కుమారరత్నము లగు నీరదములు
వలయు స్వేచ్ఛావిహారముల్ సలుపుచుండ
ఆత్మ నుప్పొంగి సంతోష మభినయింతొ?
ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు? 7

గగనమున వేగముగ నేఁగు గ్రహగణంబు
దేవగానంబు సల్పుచుఁ బోవుచుండ
ప్రతివచన మిత్తు వేమొ యీ పగిది నీవు
ఏమి పాడెదు సంద్రమా! యెపుడు నీవు? 8

నిమ్నజాతిసముద్ధరణము

మంగిపూడి వేంకటశర్మ గారు

భారతఖండమున నిమ్నజాతిసముద్ధరణమహాకార్యమునకు దారి దీసినవారును ప్రజలను పురికొల్పినవారును విదేశీయు లగు క్రైస్తవమతవ్యాపకు లని మన మొప్పుకొనక తప్పదు. అయ్యో! "ఆత్మవ త్సర్వభూతాని" "స్వదేశం భువనత్రయమ్" "పరోపకారార్థ మిదం శరీరమ్" "అహింసా పరమో ధర్మః" ఇత్యాది మహోత్కృష్టధర్మములను విశ్వమానవకోటి కుపదేశించి యాచరించి జగద్గురుపీఠ మని ప్రతిష్ఠ వహించిన పుణ్యభూమి యగు నార్యావర్తమునకును "మూడనున్న కీడెంచక తోడి సోదరులను పీడించుట పాడి గా" దని విదేశీయుల మేలుకొలుపులా! హితోపదేశములా!! అవును! విదేశీయపాలనమే యవసర మైనప్పు డిందులకు విచారింప వలసిన దే మున్నది? అహో! ఇది కాలమహిమము! ప్రకృతిపరిణామము! దైవనిర్ణయము!

అగ్రవర్ణములవా రెవ్వరును తమ ధర్మబోధనలకు చెవి యొగ్గక నిరాకరించుటచే క్రైస్తవమతబోధకులు అనాగరికులును విద్యావిహీనులును నగు పంచమాదుల పంచఁ జేరి వారి నాదరించుచు వశము చేసికొని తమ కార్యములు చక్కఁజేసికొనవలసినవా రైరి. వారు వారిని సంరక్షించుటకై చేసిన ప్రయత్నములలో ప్రధాన మైనది విద్యాప్రదానము. విద్యాంజనము వారి కన్నులను విప్పి ప్రపంచమును జూపి ఆత్మగౌరవమును మేల్కొలిపి స్వాతంత్ర్యేచ్ఛను రగులుకొలిపెను.

భారతీయులు నిమ్నజాతులలో ముఖ్యముగా మాలమాదిగలను మిక్కిలి నీచాతినీచముగాఁ జూచుచు నంటరాని చెప్పరానివారినిగాఁ జేసి యవమానపఱచుచుండుటచే రాజావలంబనము గల పరమతావలంబనము మాత్రమున నవమానము పోయి గౌరవము కలుగుచుండుట ప్రత్యక్షముగాఁ జూచుచున్న పంచమాదులు లక్షల కొలఁది పరమతస్థులై హిందువులు తమ్ముఁ బెట్టుచున్న హింసలకు ప్రతిఫలముగా వారియందు ద్వేషభావము వహించి ప్రతిపక్షులుగా మాఱుచు వచ్చిరి. ఇం దేమియు వింత గాని తప్పు గాని లేదు.

క్రమక్రమముగా బంగాళమునందు గోహింసల మూలముగా సంభవించిన హిందూమహమ్మదీయకలహములలో పంచమాదులు హిందువుల పక్షమునఁ జేరి పోరాడకుండుటయే గాక మహమ్మదీయులను చాటుననుండి యుసికొలుపుచుండుటయు, పాంచాలమునందు నీటియెద్దడి కలిగిన కాలమున పరమతస్థు లగు పరదేశీయులతోఁ బాటైనఁ గాకుండ పంచమాదులు నీరు లేక చచ్చినను సరే తమ నూతులయందు నీరు చేదుకోనియ్య మని హిందువులు — అగ్రజాతుల మని విఱ్ఱవీఁగు హిందువులు — న్యాయమును భూతదయను ధర్మమును దైవమును గూడ మఱచి మదాంధులై మూర్ఖులై యహంకారప్రేరితులై యడ్డగించినప్పుడు పంచమాదులు కోర్టుల కెక్కియు గెల్వలేక దీనులై యనదలై యార్తులై చేయునది లేక మహమ్మదీయమతమును స్వీకరించి యా మతస్థుల యండ నుండి వారి సాయమున హిందువులతో కత్తిగట్టి పోరి గెలిచి నీరును ప్రాణములను రక్షించుకొనుటయు సంభవించినవి.

ఇట్టి పరిస్థితుల నెల్ల దూరదృష్టితో పరిశీలించిన దేశీయనాయకులు దేశమునం దైదవ వంతు మనుష్యు లంటరానివారుగా నెంచఁబడుటవల్లను వారు తమ స్వామ్యములను గ్రహించి స్వాతంత్ర్యవిజయమునకై ప్రత్యర్థులై మనతో ప్రతిఘటించుటవల్లను దేశమునకు సంభవించుచున్న సంభవింపనున్న యనర్థములను గ్రహించి తన్నివారణమునకు సాంఘికస్వాతంత్ర్యప్రదానమే పరమసాధన మని నిశ్చయించి వారి నుద్ధరింప యత్నింప సాగిరి.

అది మొదలు దేశమున నెల్లయెడలను నిరుద్ధభారతవిమోచనమునకై యనేకయత్నములు చేయఁబడుచున్నవి. మానవజన్మస్వత్వములకై యాత్మస్వతంత్రతకై మాతృదేశోద్ధరణమునకై ధనప్రాణములను ధారవోయుచున్న భారతవీరులు దీను లగు దేశసోదరుల విముక్తికై శ్రమింపకుండుట సమంజసము గదా!

ఈ పది పండ్రెండు సంవత్సరములనుండియు నిమ్నజాతుల నిమిత్తము చాల పాఠశాలలు స్థాపింపఁబడినవి. పఠనమందిరములు నెలకొలుపఁబడినవి. సభలు సాగింపఁబడినవి. పత్రికలు ప్రకటింపఁబడినవి. గ్రంథములు రచియింపఁబడినవి. అయినను మొత్తముమీఁదఁ జూచినచో నిప్పటికి జరిగిన పని మాత్ర మతిస్వల్ప మని విదిత మగుచున్నది. ఏల? దీనికి మూల మేమి? ఎక్కడ నే పని తలపెట్టినను నెప్పు డే కార్యము ప్రారంభించినను నొక్కరొక్కరే చేయుటయు నితరుల సానుభూతిసాహాయ్యములు లేకుండుటయు తటస్థించుచున్నది. ఒ వైపునను త వైపునను పూర్వాచారము నొక్కమాఱుగా విడువఁజాలని జనసామాన్యము చిరకాలమునుండి యంటరాని చెప్పరానివారినిగా పరిగణించుచున్నవారియెడల నింత త్వరలో నంతగా సానుభూతి చూపుట జరుగ నేరదు. కాని, యీ దేశభక్తులు సంస్కర్తలు దీనదయాపరులు నొక్క సంఘముగా కలసిమెలసి పని చేసినచో నింతకంటె నతిత్వరితగమనంబున కార్యములు కాఁగల వని గట్టిగా చెప్పవచ్చును.

బహుజనసమ్మేళనమువలనఁ గలుగు ఫలితముల నంతగా వివరింపవలసిన యవసరము లేదు. "సంఘే శక్తిః కలౌ యుగే" యను సూక్తి సుప్రసిద్ధమును స్వానుభవసిద్ధాంతమువలన సర్వజన

ససమ్మతియును గదా! "ధనమూల మిదం జగ" త్తనుటచే నే కార్యమున కైనను ధన మావశ్యకము. ఇట్టి శుభకార్యముల పట్ల నది విశేషావశ్యకము. సంఘసంస్థాపితము లగు ప్రతిష్ఠాపనములు సుస్థిరములు కాఁగలవని విశ్వసించి ప్రజలు విశేషముగా ధనాదిసాహాయ్యము చేయుదురు. సంఘబల మున్నచో లోకజ్ఞానశూన్యులును జగత్కల్యాణకంటకులును స్వార్థదురంధరులును నగు కొందఱు మహోహామాత్రులచే కల్పింపఁబడు నంతరాయముల నతిసులభముగా సంతరింపఁజేయ నను వేర్పడును. సాంఘికు లందఱును సంవత్సరమునకొకటి రెండు సారులు సమావేశములు చేయుచు తాము పూనిన పని కొనసాగించుటకు తగు సాధనముల నాలోచించుటకును తమతమ యనుభవములమీఁద తెలిసికొనిన కష్టసుఖము లొండొరులు చెప్పుకొని లోటుపాటులు సవరించుకొనుటకును వీలు కలుగును. సర్కారువల్ల సాధింపఁదగిన కార్యములు సఫలము లగుటకు సాయపడును. సంఘభావ మింకను ననేకలాభములను కలుగఁజేయును. కనుక నీ యుద్యమాభిమాను లగు నాంధ్రు లందఱును 'నుద్ధారకమహాసభ' యను పేర నొక సంఘముగాఁ గూడి పని చేయుట యుక్తము.

ఈ దీనజనోద్ధారకుల నెదుర్కొనుచున్న వానిలో నెల్ల మాలమాదిగలపై మోపఁబడియున్న యంటు సమస్యయే మిగుల కఠినమైనది. ఈ యంటునకు మడ్డితనమును మురికితనమును కారణములనుటకు వలను కనఁబడదు. నిమ్నజాతులలో గణింపఁబడు నుప్పర యెఱుకల యేనాది కోయ చెంచు దొమ్మర సుంకుల లంబాడీ మొదలగు జాతులయొద్దకంటె మాలమాదిగలయొద్ద నేమి యంటు కలదో యూహింపఁజాలకున్నాము. పై జాతు లన్నియు బ్రాహ్మణులకు సైతము తొలఁగ నక్కఱ లేదు సరి గదా, వారి పడమటింటి గుమ్మమువఱకును నిరాక్షేపముగా రావచ్చును. ఒక్క మాలమాదిగలకు మాత్రమే యంటు విధింపఁబడినది. ఈ యంటు యగ్రహారములలో మితి మీఱుచున్నది. దీని నిరంకుశాధికారమున కెక్కడి హద్దుపద్దులు లేవు. అగ్రహారపు నడి వీధిలో సయితము మాలఁడు నడువఁగూడదు. ఇంతే కాదు, అగ్రజాతులలో నగ్రజాతి యగు బ్రాహ్మణుఁడు మడితో మాలనితో మాటలాడ నైన రాదు. అయినను, పని పట్టినప్పు డే చెట్టునకో పుట్టకో చెప్పుచున్నట్టు వాని దిక్కు చూచుచు — మాలని దిక్కు కాదు, చెట్టుచేమల దిక్కు — వానికి మాలవానికి — వినఁబడునట్టు గట్టిగాఁ జెప్పుచు వానివల్ల మరల ప్రత్యుత్తరము గ్రహింపవచ్చును. అంతటి మహావమానమునకుఁ బాల్పడుట కా మాలఁడు — హిందువుఁ డగు మాలఁడు చేసిన మహాపాతక మేమో? ఆహా! ఎంత వివేక మైన యాచారము! అయ్యో! తన విజ్ఞానప్రభావముచే ప్రపంచము నెల్ల నోహో యనిపించిన బ్రాహ్మణుఁడు — సమస్తలోకములకు నాదర్శప్రాయుఁ డైన బ్రాహ్మణుఁ డిప్పు డెంతటి యపహాస్యమునకుఁ బాత్రుఁ డగుచున్నాఁడు! కటకటా! కాలగతి!

ఆ మాలల యపరాధ మే మైనను వారి మైల యెట్టి దైనను నది పురాతనకాలమునాఁడే పుట్టి పెరిఁగి వేళ్లు నాటుకొనియున్న దగుటచే నీ యంటు మహావిషవృక్షము నొక్కమాఱుగా లోకుల హృదయక్షేత్రమునుండి యొకటి వ్రేళ్లతో పెకలించి పాఱవేయుటకు సాధ్యము కాదు కాని, యభ్యాసవశమున నలవికాని కార్యము లేదు. అవసరమునకంటె నభ్యాసమున కనువైన మార్గము లేదు. చూడుఁడు! భూమి పుట్టినప్పటినుండి యగ్రజాతులు సంతలలో మాలలను రాచుకొని తిరుగుచున్నారు. రైళ్లలో కలసి మెలసి ప్రయాణము చేయుచున్నారు. మిషను పాఠశాలలలో నొండొరు లొడులలో కూర్చుండి సమభావముతో మెలంగుచు నన్యోన్యస్నేహబద్ధు లగుచున్నారు. తీర్థయాత్రలలో మాలలు చూచుచుండ చెట్టు క్రింద వండుకొని భుజించుచున్నారు. ఆసుపత్రులలో వారిచేతి తీర్థము లంఖతులసీ తీర్థములవలె సేవించి చరితార్థు లగుచున్నారు. ఇవి యన్నియు బుద్ధిపూర్వకములే గాని ప్రమాదవశమున జరుగుచున్న కార్యములు కావు కదా! మాలల మైల యప్పు డెట్లు మాయమై పోవుచున్నదో మఱుమాయగా నున్నది. ఇట్టి ప్రత్యక్షప్రమాణములే మనకు కొన్ని సాధనములను బోధించుచున్నవి. కాని, యించుమించుగా వీనిలో నన్నియు దొరతనమువారి మూలమున చేయవలసియున్నవి.

(౧) పంచమవిద్యార్థులను చేర్చుకొనని పాఠశాలలకు గవర్నమెంటు గ్రాంటుల నియ్యకుండుట. (౨) తాలూకా జిల్లా బోర్డుల యొక్కయు మునిసిపలువారియొక్కయు నధికారములో నున్న పాఠశాలలలో పంచమ విద్యార్థులకు యథేచ్ఛముగా ప్రవేశము కలుగఁజేయుట. (౩) పోస్టు పోలీసు తాలూకా జవాను పనులను కోర్టు జవాను అమీనా పనులును బాహాటముగా పంచముల కిచ్చుచుండుట. (౪) సంతలలోను మార్కెట్టులలోను పంచమాదుల దుకాణముల కవకాశములను కలుగఁజేయుట. (౫) గ్రామములలోని నూతులలోను చెఱువులలోను తక్కినవారితో పాటు ధారాళముగా నీళ్లు తీసికొను స్వాతంత్ర్యము కలిగించుట. (౬) నాటకములు మొదలగు ప్రదర్శనశాలలకును సమస్తసభలకును క్రైస్తవ మహమ్మదీయులతోఁ బాటు నిరాఘాటముగా రానిచ్చుట. (౭) యంత్రశాలలలో కూలీలుగా చేర్చుకొనుట. (౮) చర్మపరిశ్రమ వడ్రము కమ్మరము కుమ్మరము నేఁత కుట్టు మొదలగు వృత్తులను నేర్పి ప్రజలతో వ్యవహారసంబంధ మెక్కువ చేయుట. ఇత్యాది కార్యములవలన కాలక్రమమున మాలల యస్పృశ్యత యంతరించు ననుటకు సంశయము లేదు.

మఱియు, సర్వలోపములను సంస్కరించుకొనుటకు జ్ఞానాంజనము దక్క శరణము లేదు. కాఁబట్టి నిమ్నజాతుల నున్నతస్థితికి తేవలయు నన్న వారికి విద్యాదానము చేసి దాని మూలమున నాత్మవివేకము కలిగించి గౌరవాపేక్షను, స్వాతంత్ర్యకాంక్షను పురికొల్పితీరవలయును. ఇందుకై దేశమున నల్గడల విశేషకృషి జరుగవలయును. ఊరూరను బాలబాలికలకై పగటి పాఠశాలలను పగటిపూట తీరనివారలకై రాత్రిపాఠశాలలను స్థాపింపవలయును. ఈ మహాకార్యము సామాన్యమా! సాధ్యమా! శ్రీమంతులును మహారాజులును జమీందారులును తలఁచినచో సాధ్య మన నేల, సుసాధ్యమే యగును. కాని, మన శ్రీమంతులకు వారి బిడ్డల విద్య జోలియే యక్కఱ

లేదు. మహారాజుల జమీందారుల గ్రామములే యావిద్యాదేవతా లయములు. ఇట్టిచో వారి దృష్టి — హ్రస్వదృష్టి — పంచమపల్లులవఱకు బోవునా? వారిలో నెక్కడనో నూటికొక్కఁ డిట్టి మహామహుఁ డున్నను సహాఖండముకంటె యీ విశాలదేశమున నీ గొప్ప లోపము వారివల్ల సంపూర్తిగా దక్కఁబడ నేర్చునా? తమ పిల్లలకే ప్రథమశిక్ష యైనఁ జెప్పింపఁజాలని జనసామాన్యము తా మతినీచు లని యెంచుచున్న పంచముల పట్ల నంతటి సౌహార్దము వహించునా? వహించినను నిర్వహించునా?

ఇఁక నీ కార్యభారము భరింపఁగల సమర్థులు పాలకు లొక్కరే. సర్కారు సాయము లేక యీ పని యెన్నఁటికిని నెఱవేఱ నేరదు. అంతవఱకును దీనబాంధవులు — దయాసింధువు లగు నీన బాంధవులు 'కాయశక్తుల' సాయము చేయుచు స్వంత భక్తిని జూపు చుండుట ప్రశంసాపాత్రమే యైనను సామాన్యవిద్యాశాసన మేర్పడువఱకు నేకదీక్షతో కృషి చేసి దానిని సాధించినఁ గాని దేశీయ నాయకులు స్వధర్మనిర్వాహకులు కానేరరు.

సకలజనులకు నుచితముగను నిర్బంధముగను విద్య నేర్పఁగల శుభదినములు చేరువలో నున్న వని యనేకులు విశ్వసించుచున్నారు. అట్టి మహాభాగ్య మీ భరతవర్షమున కబ్బినను నప్పుడే దేశ మెల్ల విద్యామయూఖములచే ప్రకాశింపఁగల దని యాశించుటకు వీలు లేదు. ప్రాథమికవిద్య ప్రతిజాతికి నందుబాటులో నున్నను నిఱుపేద లగువారి బిడ్డలకు విద్యాలాభమును కలుగఁజేయుట కూడ సామాన్యమైన పని కాదు. విద్య యుచితముగా నేర్పుచున్నను, విద్యోపకరణములను ధర్మముగా నిచ్చుచున్నను బీద కుటుంబములలో నెవరి పొట్టకు వారే పాటుపడవలసియుండుటచే చాలేరుతనములు మాన్పించి పిల్లలను పల్లెకూటములకు పంపుటకు తల్లిదండ్రు లిష్టపడరు. అట్టియెడ శాసన మున్నది గదా యని దాని నమలులోఁ బెట్టి బీదల పీడించుట శ్రేయస్కరము కాదు. విద్య నిర్బాధకముగా నబ్బినప్పుడే శోభించును గాని నిర్బంధక మైనచో శోభకు బదులు దురితక్షోభకు కారణ మగును. అందువల్ల విద్యాదానముతోఁ బాటుగా నన్నదానము కూడ చేసినఁ గాని సంస్కర్తల యభీష్టము సిద్ధింపఁ జాలదు. కనుక భోజనవసతి గల పాఠశాలలను ప్రత్యేకము నిర్ధనుల పిల్లలకై నెలకొలుపవలసియున్నది.

ఇంతే కాదు, ఇతరజాతులలో సరిగా చదువుకొనుటకు సాగని పెద్దవారలకు పరిశుభ్రత ఆరోగ్యము మధుపాననిషేధము మొద లగు విషయములును దేశీయవ్యవహారములును ప్రపంచస్థితిగతులును మతవిషయములును పౌరాణిక చారిత్రక కథాంశములును బోధించుచు నాయా విషయముల జ్ఞానము గలిగించినఁ గాని వీరి విద్య పూర్తి కానేరదు.

మాలపల్లెలకు వెళ్లి వారితో నెనరుచనువులతో మెలఁగుచు నభిమానముతో పని చేయఁగల సమర్థు లగు నుపదేశకులను సమకూర్పవలయును. ఈ కార్యముల కన్నిటికిని సర్వవిధముల నక్కఱకు వచ్చు బుద్ధిమంతులు వారియందే కావలసినంతమంది కలరు. వారికి? గుడిచిత్రములు గలిగి నేటివారసంప్రదాయములు నిరోధించెడు జ్ఞానము గలిగి విద్యావివేకములు గలిగి వినయాదిగుణసంపత్తి గలిగి యెక బ్రాహ్మణశక్తి గలిగి శైష్ణవచిహ్నములలో నొప్పుచు సద్భక్తులకై — శూద్రు లనఁ దగిన సర్వాధముల నగ్రజన్ములతో తుల్యులై వెలయు మాలదాసరులు.

ఈ దాసరులు బ్రాహ్మణులవలె పంచాంగములను జెప్పుచు ముహూర్తము లుంచుచు జ్యోతిషసాముద్రికఫలములు దెలుపుచు దేవాలయములలో నర్చకత్వము చేయుచు వైద్యము చేయుచు భాగవతములు నాటకములు నాడుచు హాస్యములు చెప్పుచు కాలక్షేపము చేయుచున్నారు. ఇట్టివారు బోధకులుగా సిద్ధము చేయఁబడినచో తప్పక నిట్టివారు కాఁగలరు. పంచములు పరమతబోధలకు లోఁబడి స్వరూపమును విడనాడి హిందూసంఘమును జేల్చి జాతియొకకు బలహీనత కలుగఁజేయకుండ సంరక్షించుటకుఁ గూడ నిట్టి యుపదేశకు లావశ్యకము. అత్యావశ్యకము. ఇట్టి కార్యముల కన్నిటికిని ప్రజల పట్టుదలయు శాసనసభ్యుల కార్యదీక్షయు సాధారము లై యున్నవి.

నిమ్నుల యభివృద్ధికై నిరంతరప్రయత్నములు చేయుటకును వీరి స్థితిగతులు చక్కఁబఱచుకొనుటకును శాసనసభలలో వీరికి ప్రత్యేక ప్రతినిధు లుండుట యత్యవసరము. ఎవరి కష్టనిష్ఠురములు వారికే గాని యితరులకు బాగుగా తెలిసియుండవు. ఇతరకులములవా రెంత భూతదయావంతు లైనను నెంతటి సానుభూతిస్వాంతు లైనను వారి సంతాపమును వారి హృదయాందోళనమును సరిగా గుర్తించి ప్రకటింపఁజాలరు.

మాలపల్లెలు విశాలము లైనవి గాక యిఱుకైనవి మితికి గల్గివై దుర్గంధభూయిష్ఠములై యనారోగ్యకరములై యంటువ్యాధుల నెలవులై నరలోకనరకములై యున్నవి. వారి కుటీరములు దారిద్ర్యమునకును దైన్యమునకును దుఃఖమునకును దావలములై యున్నవి. వారికి పానోదకములకు మంచి జలాధారములు లేవు. పండుగపబ్బములయం దైనను కడుపు నిండ కుడుపు లేదు సరిగదా కరువుకాలములో దుంపదూములే గాని గంజినీళ్లకయిన గతి లేదు. వైద్యసహాయము బొత్తిగా లేదు. అంటురోగములు చెలరేగినప్పుడు మందుమాకులు లేక చావవలసినదే గాని దిక్కుమొక్కు లేదు. ఎప్పుడును పొట్టకొఱకు తడుముకొనుటయే గాని యొకప్పు డైనను వారికి విశ్రాంతి లేదు. వారి మనస్సునకు హాయి లేదు. వారి ప్రాణమునకు సుఖము లేదు. సంతోషము లేదు. వారికి పరసేవనమే దాస్యమే బానిసతనమే నిత్యకృత్యముగా జీవనోపాధిగా జన్మావధిగా నున్నవి. ఇంకను మనకు తెలియని తెలిసికొన వీలు లేని యూహింపనలవి కాని కష్టనిష్ఠురము లెన్నెన్నో వారు తమ నిత్యజీవనమునందనుభవించుచున్నారు. ఇట్టి దుస్సహదుఃఖభాజన మైన వారి జీవితము దుర్భర మనుట యతిశయోక్తి కాదు!

ఇట్టి కడగండ్లనుండి వారిని తప్పింపవలయు నన్న వారు కాఁపుర ముండుటకు విశాలము లైన నివేశనము లిచ్చియు బంజరు భూములను నడవినేలలను వ్యవసాయమున కిచ్చియు వారి యనా


రోగ్యము నభాగ్యతను దొలఁగింపవలయును. వైద్యసాహాయ్యమును పొందుటకై వారికి ప్రత్యేకసౌకర్యములు కల్పించి ఘోరవ్యాధుల వాతఁ బడి యకాలమృత్యువు పాలు గాకుండ రక్షింపవలయును. వారి పల్లెల సామీప్యమునుండి కల్లు సారాయి యంగళ్లను తొలఁగించి వారికి మితవ్యయము నేర్పవలయును.

ఇంతటి కార్యభారమును శిరసా వహించి యీ దీనుల నీ యనాథుల నీ యార్తుల నీ యభాగ్యుల నర్వాభంగుల నుద్ధరించుటకై దుఃఖసాగరమును తరింపఁజేయుటకు స్వయంతీర్ణులగు స్వకుల ప్రతినిధులకంటె నర్హు లెవరుందురు? అంతటి బాధ్యు లెవరగుదురు? సమర్థత యందురా? అవకాశమును బట్టి కాలక్రమమున దాని యంతట నదియే రాఁగలదు. ఇది లోకమున మనము నిత్యము చూచుచున్న సంగతియే కాని క్రొత్తది కాదు.

పంచములకు ప్రతినిధుల నెన్నుకొను నధికారమే కలిగిన యెడల నాత్మవికాసము కలుగును. ఎన్నిక సమయములలో ప్రాతినిధ్యము కోరువారకల్ల నుద్రేకకర మైన యుద్బోధము కలుగును. ఆత్మవిచారము కలిగి తమకును నితరులకును గల యంతరములను దెలిసికొని తమ స్థితిగతులు బాగుపడుటకు తగిన కృషి చేయ నభిలాష కలుగును. స్వవిషయములలో నుపేక్షాభావమును నీచస్థితి యందే సంతృప్తియు తాము నీచుల మనియు నీచత్వము ననుభవించుటకే జన్మించితి మనియుఁగల మూఢవిశ్వాసములు మొదలంట నశించుటయు కలుగును. అంతటితో వారి యనారోగ్యదశయు నభాగ్యదశయు నశించి వారికి కగ్రజన్ములతో సమత్వము కలుగును. అట్టి సమత్వము సిద్ధించినప్పుడే సౌభ్రాత్రము వర్ధిల్లును. కావున పంచములకు ప్రత్యేకప్రాతినిధ్య మిచ్చితీరవలయును.

భువనభయానక మై యాశ్చర్యజనక మైన ప్రాపంచికస్వాతంత్ర్యమహాయుద్ధము ముగిసి స్వాతంత్ర్యమహాసత్రము తెఱవఁబడుచున్నది. ఆ మహాసత్రములో నఖిలదేశములును నిఖిలజాతులును యథేచ్ఛముగా స్వతంత్రతామృతమును జేరలనిండ జుఱ్ఱుకొని సంతుష్టి చెంగి సుఖింపఁగల వని ప్రపంచమెల్ల నాశాపిపాసాతుర మై యెదురు చూచుచున్నది. భరతవర్షము కూడ నా మహాసంతర్పణమునఁ బాలుగొనఁగలదా? కల దనియే కొంద ఱుబ్బితబ్బిబ్బై లూఁగుచున్నారు. యజమానులును పాకశాసనులును నెవ రైనను వడ్డించువాఁ డొక్కఁ డైన మనవాఁడు లేనప్పుడు మన విస్తరి యంటు సొంటు లేక వేసినది వేసినట్లే యుండు నని కొంద ఱూహించుచున్నారు. భరతఖండము స్వచ్ఛందమహాశిఖరము నధిరోహించుట కింకను నెన్నియో ఘట్టములు దాఁటవలయు ననియు నెన్నియో సోపానము లెక్కవలయు ననియు వారు తలంచుచున్నారు. మన కా మహాభాగ్యముఁ జూరలాడఁగల యోగ్యత యింకను రాలే దనియు కొంద ఱువాకొనుచున్నారు. ఎవ రెట్లనుకొన్నను భరతఖండమునకు శుభదినములు మాత్రము తప్పవు. ఆమె భావిదశ యెంతయు శోభాయమాన మై ప్రకాశించుచున్నది. భారతీయు లంతఃకలహములు లేక యేకగ్రీవముగా స్వయంనియంతృత్వమే మమ్మాటికి తమ మనోరథ మని త్రింశత్కోటికంఠములతో నతిగంభీరస్వనములతో గర్జించిరేని, మన రాయబారము లాపివేయఁబడుఁ గాక మన ప్రతినిధుల కందు ప్రవేశము లేకపోవుఁగాక, సంధిమహాసభ యంతయు విలయవాయుసంక్షుభితమహాగుహవలె ప్రతిధ్వానములతో దద్దరిల్లి భూనభోమండలములు బ్రద్దలై సభ్యులు నిశ్చేష్టులై మన నిర్ఘోషము నాలకింపరా? మన హక్కులను మన కిచ్చివేయ నుంకింపరా? దీనబాంధవుఁడును నార్తత్రాణ పరాయణుఁడును నైన భగవంతుఁ డింక నైనను నార్యావర్తమును దైన్యావర్తమునుండి తప్పించి రక్షింపక యుపేక్షించునా? కనుక భారతసోదరులారా! మీ సోదరుల నుద్ధరించి మీ రుద్ధరింపఁబడుఁడు. నిమ్నవర్గసముద్ధరణమే మహాభారతసముద్ధరణ మని తెలిసికొనుఁడు! ఆఱు కోట్ల తోడి మానవులు స్వదేశమున సోదరులచేతనే హింసింపఁబడుచుండుటచే నార్యావర్తమునకు కలిగిన కళంకమును తొలఁగించి ప్రసన్నమాతృదేవతాశీర్వచనమును బడసి యభ్యుదయపరంపరలు తామరతంపరలై యుల్లసిల్ల సుఖసంతోషముల నోలలాడుచు నిత్యకల్యాణములతోను పచ్చతోరణములతోను వర్ధిల్లుఁడు!


HIS IMPERIAL MAJESTY KING-EMPEROR GEORGE V.




శ్రీ పంచమజార్జి రాజరాజేంద్రుడుం.

Hon'ble Rajah of Polavaram

Late K. Sreenivasa Rao.



H... ...N...



ఆనరబిలు ముప్పిలునాయరుగారు.

Dewan Bahadur P. Ramarayaningar.



దివాన్ బహద్దరు పానగంటి రామారాయనింగారు

K Apparao Naidu garu, B A., B L.



కో... అప్పారావు నాయుడు గారు ... ఎల్.

Mr. Mahamad Osman Sahab.



... ఉస్మాన్ సాహెబుగారు.

క్రైస్తవాంధ్రుల కర్తవ్యము

గొల్లపల్లి సామ్యేల్ గారు

మన పితరులు గాని పితామహులు గాని ప్రపితామహులు గాని క్రైస్తవమతావలంబకులై యుండుటచేతనో మన మాత్రమే యీ మతమును స్వీకరించుటవలననో మనంత మనమే తన్మతంబును గైకొంటం జేసియో ఈ ముత్తెఱంగులలో నేదో యొక విధమున మనము క్రైస్తవుల మైతిమి. మన మాంధ్రదేశమునం దుద్భవించుటం జేసి యాంధ్రక్రైస్తవుల మను పేరం బరఁగుచున్నారము. మనము గాని మన పూర్వులు గాని స్వమత మగు హిందూమతమును త్యజించి మన హిందూసోదరులు కొందఱు తలంచు రీతి ఖండాంతరమునుండి కొని తేబడిన విదేశీయుల క్రీస్తుమతంబు నొప్పుకొనుటలో మనకు హిందూమతమునం దాత్మశాంతి కుదురక పోవుటయే ప్రబలకారణము గాని హిందూసోదరులయెడ నీర్ష్యాభావముచేతఁ గాని హిందూమతమునం దేవగింపుచేఁ గాని కాదు. మీఁదుమిక్కిలి క్రైస్తవమతము సత్యమత మని మనకు నిశ్చితాభిప్రాయము కలుగుటచే దాని నవలంబించితిమి.

మన కిష్టమైన మతమును మన మంగీకరించుటలో దోష మేమియును లేదు. ఎవరి యిష్టమునకు వారు కర్తలు. "లోకో భిన్నరుచిః" అన్నట్టు లెవరి యిష్టానుసారముగ వా రాయా మతముల స్వీకరింపవచ్చును. కాని, మనము పరమతాన్వేషకుల మైనంత మాత్రమున మన హిందూభ్రాతలకును మనకును సంబంధము బొత్తిగ పోయెనా? నిన్న మొన్నటివఱకును హిందూమతస్థులుగ నుండిన కొందఱు క్రైస్తవమతస్థు లగుటతోడనే వారిని గర్భశత్రువులుగ చూచుట మిక్కిలి యాశ్చర్యమును కలిగించుచున్నది. ఒక కుటుంబములో నేడెనమండ్రున్నప్పుడు వారివారి జిహ్వలకు రుచించునట్లు వివిధ శాకపాకములను గాని భక్ష్యాదులఁ గాని భుజింతురు. అట్లొనరించుటచే వా రేకకుటుంబికులు కాకపోదురా? సమయము వచ్చినప్పుడు వా రంద ఱొక్క త్రాటిమీఁద నడువకుందురా? క్రైస్తవులు కాఁగానే వా రట్లు హిందూసోదరులయెడ నుండుటకు సరియైన కారణము కనుపట్టదు. ఒకవేళ వారలు హిందువులుగ నున్నప్పుడు హిందూమిత్రులు పెట్టిన హింసలు జ్ఞప్తికి తెచ్చుకొని యట్లు వర్తించుచున్నా మన్నచో నదియును మన మతాభిప్రాయమునకు వ్యతిరేకమే కదా? ప్రేమచే మన మెట్టివారిని జయింపవలసియుండును. ప్రకృతము మన దృష్టికి గోచరించు విషయములఁ బట్టి క్రైస్తవమతము ఖండాంతరమం దైనను ప్రపంచచరిత్రవేత్తల కది మన ఖండపు మత మని తేటతెల్లముగ తెలియును. మతములకుఁ బుట్టినిల్లనఁదగు నాసియాఖండమున హిందూ మహమ్మదీయ బౌద్ధ ప్రముఖ మతములు మాత్రమే గాక చిన్నాసియాలోని పాలస్తీనాదేశమందే క్రైస్తవమతము కూడ నుత్పన్న మయ్యెను. కారణాంతరములచేతను దైవఘటనవలనను ఖండేతరములనుండి మన ఖండము మతప్రబోధకులను దిగుమతి చేసికొనవలసిన యావశ్యకత వచ్చియుంటచే మన హిందూసోదరులలో కొందఱ కది ఖండేతరమతమై గనపట్టవచ్చును. కాని, యట్లు తలంచువారికి నే విన్నవించున దేమనఁగ, ఖండేతరం బని ఖండింపక స్వఖండాంతర్గతము లైన బౌద్ధ మహమ్మదీయమతముల పట్ల తమ కెట్టి సద్భావము గౌరవము కలదో యట్లే క్రీస్తుమతమందును కలిగియుండవలె ననుటయే. మన మిప్పుడు చర్చించునది మతవిషయము కాదు గాన దాని నట్లు విడిచి ప్రకృతవిషయము నాలోచింతము.

క్రైస్తవులు రాజకీయవిషయములలో పాల్గొనకుండుటకు గల కారణములు:

(a) రాజకీయవిషయికజ్ఞానము శూన్యము. దామాషాను నూర్గురు క్రైస్తవులను నూర్గురు హిందువులను విద్యావిషయమునఁ బోల్చి చూచిన యెడల క్రైస్తవులలోనే చదువుకొన్నవా రధికసంఖ్యాకులుగ నుందురు. కాని, చదువుకొన్నవా రన్నంత మాత్రమున లాభము లేదు. వారలు నేర్చిన చదు వక్షరజ్ఞానమాత్రమై చేవ్రాలు చేయుటకు వినియోగించును. వారికంటె నెక్కువగ చదువు నేర్చుకొంటి మనువారి విద్య గ్రామాదులలో పద్దుపత్రములు చదువుకొనుటకును ఎలిమెంటరీ స్కూళ్లలో నుపాధ్యాయపదవిచేఁ బొట్టఁబోసికొనుటకును బైబిలు గ్రంథమును పఠించి వారు గ్రహించిన రీతిగ నితరులకు మతబోధఁ జేయుటకును మాత్రమే వర్తించుచున్నది గాని వార్తాపత్రికలు చదువుకొనుటకుఁ గాని వానిలోని రాజ్యాంగవిషయముల గ్రహించుటకుఁ గాని యందని జ్ఞానము గలవారై యున్నారు. అంతియే కాక, వారి పైయధికారులు మిషనెరీవారై యుండుటచేత వారి దర్శనమునకుఁ బోయినను మనవిఁ జేసికొనుట కేగినను ఆ మిషనెరీవారు క్రైస్తవుల కేవిధమైన ధనసహాయముఁ జేయక రిక్తహస్తములతో నిండ్లకు త్రోలివేయఁదలంచియు మతసంబంధమైన జ్ఞానోపదేశమున మాత్రము వెలితి లేకుండ కడుపునింపి పంపివైచెదరు. దానంజేసి క్రైస్తవులు కేవలము లౌకికవిషయమున జ్ఞానశూన్యులుగ నుండుటకు హేతు వేర్పడుచున్నది. మొదటఁ జేర్కొనఁబడినవార లటుండ, మాధ్యమికపాఠశాలాపరీ

షులపసందులు మన్మ హేషాతిరాలాపకేషులందును కృతార్థులైన వారు కొందఱు గలరు. వారికి విషయములయందు కొంత యభిరుచి యున్నను వా రదివిని తెలిసికొనుటకు అవకాశము లేదు. అట్టి వారిలో నెక్కుడుమంది మిషనుపనివారే గాన సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమయపర్యంతము మిషనరీవారినే సంతోషపెట్టుటకు కాలము గడపవలసియున్నది. వారికే విధమునైన మతవిషయికపత్రములు పొత్తములు చేతులకు చిక్కునే గాని మఱియొందును రావు. స్వయముగ తా మేదైన వార్తాపత్రికకు చందాదారులై తెప్పించుకొని చదువవలె నన్న, వారికి స్వల్పవేతనములు గాన నట్లు చేయ వీలు లేదు. పుస్తకభాండాగారములు గాని, పఠనమందిరములు గాని యున్న పెద్ద గ్రామములలోనో లేక చిన్న పట్టణములలోనో వార లుండుట తటస్థించెనేని, వానినిం గూర్చి యెఱియవలసినదే గాని వాని ఫలితార్థములం బడయుటకు వారికి వీలు లేకున్నది. ఏల యనంగ, నట్టిచోట్ల నుండు మన హిందూసోదరులలో నెక్కుడుమంది పూర్వాచారపరాయణులై తమ కున్న కార్యదీక్షను పట్టుదలను కులాచారములయందే గనంబఱచుటచే పాప మీ పేద క్రైస్తవులు గుటకలు మ్రింగవలసినదే గాని పత్రికలు చదువుకొని యొకరి భావము లొకరికి వెల్లడించుకొనుట కైనను సాధ్యము గాకున్నయది.

(b) క్రైస్తవులైన వెంటనే యూరోపియనుల మైత్రి మని కొందఱు క్రైస్తవులు తలంతురు. ఇట్లు నేను వ్రాసితి నని మదీయ క్రైస్తవసోదరులు దుందుడుకుతనమున వ్యాఖ్యానమునకు దిగక సావధానముగ నా నుడు లాలకించి శాంతచిత్తులతో నాలోచింప వేఁడెదను. అట్లు తలంచిన వారిని తలంచుచుండిన వారిని నా కన్నులారం గాంచుటంజేసి స్వానుభవమున నీ విషయమును జెప్పుచున్నాఁడ. పాశ్చాత్యుల మత మని మన హైందవ భ్రాతలు వ్యవహరించు మతము ననుకరించుటచేతనో పాశ్చాత్యుల కరస్పర్శనమాహాత్మ్యముచేతనో పాశ్చాత్యుల యాచారములు ప్రశస్తము లగుటవలననో పాశ్చాత్యుల దుస్తుల విధానము మనవారిని భ్రమపెట్టియుంటనో మన దేశభాషయు నాచారప్రభృతులును వారి కంటికి నచ్చకపోవుటచేతనో మనవారు జాతీయభావమును బొత్తిగా దిగనాడుచున్నారు. నిజదేవు నారాధించుటకొఱకై మాత్రమే క్రైస్తవమతము స్వీకరించితి మను భావమును మనవారు మఱచి యూరోపియను లగుటకే పరమతంబు నంగీకరించితిమో యనునట్లు వర్తించుచున్నారు. మన మట్లు యూరోపియనులము కావలె నను తలంపు మనకు వచ్చుటయే కడు హేయమైన సంగతి. కడు ప్రాచీనమైన నాగరికజాతికి చెంది యనేకవిషయములందు ప్రపంచమందలి జాతు లన్నిటిలో నధికత గలవారము మనమై యుండి యట్లు కోరం దగదు. ఒకవేళ యూరోపియనులే నాగరకాగ్రగణ్యులు గాన మనము నట్లుండవలె నని మీలో కొందఱు ఉద్దేశించినను, తెలుపు నలుపుం జేయుట గాని నలుపుం దెలుపుం జేయుట గాని యెవరికి శక్యము? ఈ సందర్భమున "గోదావరికి పోవ కుక్క సింహము గాదు, కాశి కేఁగ పంది గజము కా" దను పద్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. జాతీయభావ మట్టివారికి క్రమముగా సన్నగిలుట మాత్రమే గాక హృదయకాసారములనుండి యిగిరిపోవుచున్నది. దీనికి ప్రబలకారణము వారిని నిత్య మావరించుకొనియున్న యాంగ్లభాషావాతావరణమై యున్నది. ఆంధ్రగ్రంథములంటుటే మహాపాతకముగను ఆంధ్రభాషను మ్లేచ్ఛభాషగను నెంచుచున్న యాంధ్రక్రైస్తవు లెందఱు లేరు. అట్టివార లాంధ్రుల మని చెప్పుకొనుట కేల సిగ్గుపడరో తెలియకున్నది. అట్లు చెప్పకపోయిన వీరికి వేఱు దిక్కేమి? అట్టివారి కుమారికుమారులకు మంగళకార్యములు జరుగవలయుచో కొంతమందివలన వీరు దొరలని పిలిపించుకొన్నంత మాత్రాన యూరోపియనులు గాని ఆంగ్లోయిండియనులు గాని వచ్చి వీరితో సంబంధబాంధవములు జరుపరు గదా? మరణమాంగళ్యకర్మములు సంభవించినను వారు వచ్చి జరుపుదురా? గడియగడియకు విచిత్రముగ రంగు మార్చుకొను నూసరవెల్లులం బోలి కృత్రిమనామములతో పాటు వేషములం గూడ ధరించిన నిట్టి హైందవయూరోపియనుల కాంధ్రపత్రిక లన్న నసహ్యము. జాతీయవిధానముగ దోవతులం దాల్చినవారు వారి యిండ్లకడ కేతెంచుట కడు నీచ మఁట! ఇట్టి మహానీయు లుండుటచేతనే గదా "క్రైస్తవ" తెలంగని మన హిందూసోదరు లాక్షేపింపవలసిన యక్కఱ కలిగినది. దీనిని బాపుటకు మన యాంధ్రక్రైస్తవులింకను ప్రయత్నింపకుండుట కడు శోచనీయము. కాన, పై చెప్పంబడిన ప్రకార మాంగ్లాచారావలంబులు తమకు జాతీయోద్యమముతోం గాని రాజకీయవిషయములతోం గాని నిమిత్తము లే దని తలంచుచున్నారు.

(c) కొందఱు హైందవసోదరులు క్రైస్తవుల నందఱను సదా యనుమానముతో చూతురు. క్రైస్తవు లందఱు దొరల మతస్థు లగుటచే దొరలు వారలు నొకటే యనియు మిషనరీలు దొరతనమువారు నాలాగే యొకటనియు నందువలన క్రైస్తవులు దగ్గఱ నుండఁగ రాజకీయములను గూర్చి మాటాడం గూడ దనియు నట్లు చేసినచో నపాయము వాటిల్లం గల దనియుం దలంచి వారియెడ హిందువులు సదా సందేహముతో వర్తించుటం గాంచుచున్నారము. అందువలననే కొన్నిచోట్ల బహిరంగసభలకు సైతము క్రైస్తవు లాహ్వానింపంబడకున్నారు. రక్షకుని సువార్త నందించినవారు మిషనరీ లగుటచే నుభయులకుం గొంత సంబంధ మేర్పడవచ్చును గాని క్రైస్తవు లందఱు వారివారి మిషనరీల యభిప్రాయము నే కలిగియుందు రని యూహించుట హాస్యాస్పదము. క్రైస్తవునికి మాత్రము స్వాతంత్ర్య మవసరము కాదా? ఉక్కుచిక్కములోం గట్టంబడియుండుట కెవరి కిష్ట మగును? హైందవ సోదరులు వారియెడ నిరసనభావ ముంచక క్రైస్తవులను తమతోం గలుపుకొని సర్వజనసంబంధము లగు వ్యవహారములు పరిష్కరించుకొనుట కెట్టి చిన్న యవకాశము చిక్కిన నట్లు చేతు రని నమ్ముచున్నాను. క్రైస్తవజనసామాన్యము సాంఘికస్థితియందు హిందువులకంటె కొంచెము వెనుకంబడియుండుటచేత నారంతట వారే వచ్చి

హిందూభ్రాతలలోఁ గలసి మెలసి తిరుగుట కంటకి జంజాటము. దీనికి తార్కాణముగ కులాతంకము లేని పట్టణములలో నైనను కొందఱు క్రైస్తవులు క్లబ్బులలోను గ్రంథాలయములందును సభ్యు లయ్యు, తక్కిన హిందూసభ్యులతో నన్యోన్యముగ నుండక వెలిలో నున్నవారివలె వేఱుగా నుండి లేదు కేవల మైనంత సేపు పలుమరు పత్రికల చదువుకొని యెవరితోను మాటయైన నుండకుండ లేచి గృహములకు జాఱిపోవుట పలుమాఱు నే నరసినాఁడను. అట్టి సభ్యులు సంవత్సరముల కొలంది ఆ గ్రంథాలయమునకు సభ్యు లయ్యును, ఇతర సభ్యుల పేర్లయిన నెఱుఁగకుండుట తటస్థించును. హిందూభ్రాతలతో కూడ మాటాడక మాతి చుడుచుకొని సదా యుండవలె నను కోర్కెతో నచటికి రాలేదు. కాని, నలుగురితో సౌహార్దసౌఖ్య మనుభవించుటకును నలుగురకు తన్ను తాను వెల్ల డించుకొనెను తలంపులోను తా నందు చేరెను. లేనియెడల తా నందు చేరవలసిన యవశ్యమే యుండదు. అయినను తానే ముందుగ పలుకరించినచో, హిందూసోదరులు మాటాడుట కియ్యకొందురో లేదో యని భయపడి వారల సమీపింపఁడు. అట్టి స్థితిలో హైందవ సోదరులే మున్ముందు పలుకరించినయెడల, క్రైస్తవసభ్యులు స్నేహితులు కాఁగలరు. మైత్రి సమకూడినచో, సోదర భావము లోకరు తెలిసికొనఁగల్గుదురు. ఇవ్విధమున మతవిషయికసమష్టి చేకూర కున్నను, భిన్నమతము లనేకములు హిందూదేశమున నున్నను, భారతీయులు సహజముగ పరమతసహిష్ణులు గాన నైకమత్యం బవశ్యము కృషిచే నొనగూడఁగలదు.

(d) వ్యక్తిబలమునందు నమ్మకము లేకుండుట. ఈ బల హీనత యాంధ్రక్రైస్తవులను మాత్రమే గాక హిందూమిత్రులను గూడ సమానముగ పీడించుచున్నది. స్వశక్తియెడల తగినంత విశ్వాస ముండుట మిక్కిలి యవశ్యము. ఆత్మవిశ్వాసము లేనివారే పనిఁ గావించినను కార్యసిద్ధిని గాంచ నేరరు. అందఱకును మనోధైర్యము కావలసియున్నది. 'సాహసే లక్ష్మి' యనెడు మన పెద్దల వాక్కు మిగులఁ బాటింపఁదగినది. అందఱు చేరనిదే నే నొక్కఁడను మాత్రమే పనిఁ బూని యేమిలాభ మని యేవ్యక్తియుఁ దలంప రాదు. లేక యందఱు చేయవలసినది చేయుచుండగ నేనొక్కఁడను లేకున్న నేమి యని యంతకంటె ననరాదు. మహాసముద్రములు సైతము అనేకకోట్ల జలబిందువుల సమావేశమువలనఁ గలిగిన వన్న మహా మర్మమును మనవారు మఱచిపోవుచున్నారు. ఒక్కటొక్కటిగా చేరినను లెక్కకు మించినవే యగును. అనేకవ్యక్తులు చేరి సంఘములు గను అనేకసంఘములు గూడి గ్రామములుగను పట్టణములుగను దేశములుగను ఖండములుగను నేర్పడుచున్నవి. మన శరీరాంగములలో నొకటిరెండు మిగుల ప్రధానము లైనను, ఆయా యవయవములకు నిర్దేశింపఁబడిన పనులను గూర్చి వితర్కించునెడల నే యవయవమున కది యే ప్రముఖ మైనది. అలాగుననే మన హిందూదేశరాజ్యాంగమునం దున్న ప్రతివ్యక్తియు నెఱవేర్పవలసిన విధి గలదు. ఏ వ్యక్తి యైనను తన విధిని తాను చేయక విడిచిపెట్టినను చేయక గతించిపోయినను, ఆ లో టు తుట్టతుదకు గన్పట్టుచునే యుండును. నాగరిక రాజ్యాంగకార్య నిర్వహణమునఁ బరిపూర్ణతఁ గాంచఁ నేరదు. ఇది మనుండఁగానే యిల్లు చక్కఁబెట్టుకొని నట్లు ప్రతిమానవుఁడు చింతించియుండఁగనే తాను బ్రతుకుటకు స్వకుటుంబమునకు స్వసంఘమునకు స్వదేశమునకు తన సామర్థ్యశక్తులలోఁ జేయఁగలిగిన సేవ నిష్కపటము జేసితీరవలెను. అన్నిటిని నుంచి భగవంతునియెడ తన కర్తవ్యకర్మముల నొనర్ప వలెను. మానవుఁ డెవరికొఱకు పుట్టెను? పరమేశ్వరుండు మనుజులనే సృజించి యున్నాఁడు. ప్రతివాఁడు నితరులకై జీవింపవలెను. కొందఱు క్రైస్తవులు "ఏదచ్చినా నెవనిమిటి వచ్చిన నా నెవనిమిటియు వచ్చు" నను సామెత రీతిని దలంచుచున్నారు. వారి యుద్దేశమే మనఁగ, గవర్నమెంటువారు తమంత తామే కొన్ని ప్రభుత్వపుహక్కులను ప్రజలకు ప్రసాదించినప్పుడు గాని ఇతరులు పోరాడి వానిని సంపాదించి నప్పుడు గాని వాని ననుభవించుటకే లేక బాధ్యత గాని పడుకు వారితోఁ బని చేయుటకు నిమిత్తము లే దనుకొనుచున్నారు.

మఱికొందఱు 'గతానుగతికో లోకః' అన్నట్లు నలుగురు నడచినట్లు నడువవచ్చును గాని పలుతెగలు గల మన దేశమున కైక మత్యము చేకూరుట యసంభవ పనియు లేదనుసారముగ నెట్టి రాజకీయస్వాతంత్ర్యము నేనాఁటికిని హిందువులు పొందలే రనియు వారి దృఢాభిప్రాయము. కావున నట్టి యుద్యమములలో చేరి విఫలమనోరథులగుటకంటె నూరకుండుట యుత్తమ మని వా రభిప్రాయపడి వెనుదీయుచున్నారు. అట్టివారల కభయహస్త మిచ్చుటకు తగిన హేతు వున్నది. నిదర్శన మొక్కటి గనుఁడు. కడచిన యిరువది ముప్పది యేండ్ల హైందవసభలలో మందునకైనను గనఁబడని యాంధ్రక్రైస్తవులు ఆంధ్రోద్యమ మారంభ మైనది మొదలు మండలసభలందేమి రాష్ట్రీయసభలయం దేమి యాంధ్రమహాజనసభలం దేమి సర్వసభలందును ప్రేక్షకులుగ కానవచ్చుచున్నారు గాన నవసరముగ వెఱవక యట్టి సందేహముల మారమునఁ బాఱఁద్రోలవలెను. మునుపటికంటెఁ జాల నైకమత్య మిపుడున్నది. ఇంకను రానున్నది. ఐకమత్యము లభించినప్పుడు కార్యసాధనమా? చిటికలో కాఁగలదు.

(e) ఇది ముఖ్యాతిముఖ్యమునైనను జనపదములందు వసించు క్రీస్తువులకే చెందును. గ్రామములలోని క్రైస్తవులు సాధారణముగ మనవారు చెప్పునటు లంత్యజాతినుండి వచ్చినవారు. క్రైస్తవజన సామాన్య మెక్కువగ గ్రామములందే యున్నది. అగ్రకులస్థులనఁ బడువారు వీరిని పెట్టు తిప్పలు నిజముగ యమలోక మనునదే యున్న యెడల నక్కడ కూడ నుండ వని నా నిశ్చితాభిప్రాయము. ఒక్క విధమున కాదు. వారు వీరిని పెక్కు విధముల ప్రతివత్సరమును శిక్షి పాకము చేయుటకును వారి యంతమును చూచుటకును నూతన మార్గముల నవలంబించుచునే యుందురు. వీరు పెట్టు హింసలు కేవల మ కారణములు. మృగములకు వేటకాఁడును మత్స్యములకు జాలరివారు నెట్లో, వీరికి వారు నట్లే. మనము నిజ మారయుచో నట్లు తెలిసికొనఁగలము. ఈ గ్రామక్రైస్తవులు, తాము జ్ఞానస్నానము గైకొనుటకు ముందు ఆ గ్రామమునందలి యగ్రకులస్థులకు పాలేరు

తనముఁ జేసియో కూలిఁ జేసియో జీవించుచు మిక్కిలి దైన్యములో నుండి వారి మాట కెదురాడకుందురు. అందుచే, వా రాడినది యాటగను పాడినది పాటగ నుండును. ఐనను వీరు క్రైస్తవు లైన వెంటనే తమ గ్రామములోని యుపాధ్యాయుని ప్రోద్బలమున నేమి, మిషనెరీవారి యాసరాచే నేమి కొంతవఱకు స్వతంత్రబుద్ధిఁ గనఁబఱచి నాగరికులవలె వచ్చి తమ పోషకులవలెనే దుస్తులను ధరింప మొదలిడుదురు. ఒరే తరేఁ యని వారివలన మునుపటివలె పిలిపించుకొనఁ బడుట కిష్టపడరు. ఒకానొకప్పుడు వారి నెదిరించుటకును వారిమీఁద ఫిర్యాదులు చేయుటకుఁ గూడ సమర్థు లగుదురు. ఇట్టి స్థితిలో మన హిందూభ్రాతలు, వా రట్టి యున్నతదశకు వచ్చుచుండుట చూచి సంతోషించుటకు మాఱుగ, మిగుల నసూయపడుదురు. క్రైస్తవులు చదువుకొనుట వారి కిష్ట ముండదు. దానంజేసి వారిమీఁద తమ కున్న యసూయయే వారి నెంతటి దుష్టకార్యముల కైన నడిపించును. వాని నన్నిటి నిట పేర్కొనుట యప్రస్తుతము. ఇఁక బ్రాహ్మణులలోఁ గొందఱ అన్ననో యంట్లు ముట్లు నెక్కువగా కలిగి వారిని వీధుల గుండ నైతము నడవనీయరు. సర్వజనోపయోగార్థమై యుంచఁబడిన తపాలాఫీసునకు నైతము వారిని రహదారి పీఠని పోనీయరు. ఇట్టి కారణములచే క్రైస్తవులకును క్రైస్తవేతరులకును చిరకాలము నుండి పగ లేర్పడి, వంశపారంపర్యముగ వచ్చుచుండును. దానంజేసి యుభయపక్షములవా రొకరి ముఖము లొకరు వీక్షించుకొనుటకే మిక్కిలి యసహ్యత నొందుచుందురు. ఇట్టితఱిని రాజకీయవిషయము లందఱికి కావలసినవే యైనను వెంట రావల దనిన నెత్తుకొను నను వా రుండుట యరుదు గాన క్రైస్తవులు వానిలో పాల్గొనకున్నారు.

దుస్థితిని చక్కఁజేయుటకు మార్గములు

పై నుదాహరింపఁబడినవారు గాక, నగరనివాసులై నవనాగరికులై పట్టపరీక్షలఁ గాని వానికి సమానమగు నితరపరీక్షలందు గాని యాఱితేఱిన క్రైస్తవులు వారికి సాధ్య మైనంతవఱకు రాజకీయములందు హిందూభ్రాతలకు చేదోడువాదోడు లగుచున్నా రనుటకు సంశయము లేదు. క్రైస్తవజనసామాన్యమునకు కూడ నట్టి ప్రోత్సాహము కలుగవలె నన్న వారిలో గాఢ మైన దేశాభిమానమును పురికొల్పవలెను. దేశాభిమానము ముందట నెట్టి పగలును ఈర్ష్యలును కులాతంకములును విదేశాచారప్రీతియు పటాపంచలై పాఱి పోవును. దేశాభిమానము లేమియే యిట్టి యనర్థములకు మూలబీజమై యున్నది. హిందూమిత్రులు తమ మూర్ఖాభిప్రాయముల విడనాడి క్రైస్తవులను గూడ తమవారిఁగనే యెంచి ప్రత్యంశమునందును వారికి హృదయపూర్వక మైన స్వాగత మీయవలెను. ఏ యాటకొ మద్దెల దరువు వేయఁగల యిండియా సైన్సు పత్రికయు మద్రాసు మెయిలు పత్రికయు నీమధ్య మాంటాగ్యు చెమ్సుఫర్డు సంస్కరణవిధాన మంగీకరించుటలో క్రైస్తవులను ఐంకము వేసికొనుట చాల నాశ్చర్యముగ నున్నది. క్రైస్తవు లెల్లరు నిట్టి తీపిమాటల నమ్మి మోసపోకుందురు గాక! హిందువులు గూడ తా మనుకొన్న పనులు నెఱవేఱువఱకే క్రీస్తువులను వెంటఁ బెట్టుకొని తిరుగుదురు గాని తర్వాత వారి నక్కఱచేయ రని కొందఱ అనుచున్నారు. కాని, యట్టివారు మిక్కిలి హ్రస్వదృష్టు లని సూచించుచున్నాఁడ. సహపంక్తిని గూర్చుండి మధురాహారములఁ గొనుట భోజనము చేయుట యిత్యాదివిషయము లటుండనిచ్చి స్వేచ్ఛగా తిరుగుట కొకరినొకరు స్పృశించుటకును గల యంతరాయముల నన్నిటిని వ్రేళ్లతోఁ బెకలించి వేయవలెను. ఈవిషయముల జక్కఁజేయుటకు హిందూసోదరులే మిక్కిలి కష్టపడవలసియున్నారు. క్రైస్తవులు తమతో సమానముగ భుజములు గల్పుట కాటంకములను వారే నెట్టియున్నారు. కాన, వానిని తీసివేయుటకు వారే యుద్యోగింపవలెను. నేను నా వ్యాసమునకు మకుటంబుగ "నాంధ్రక్రైస్తవుల కర్తవ్యం" బని ప్రాతిపదిక మిడినను, ఆన్యాంధ్రభ్రాతలే మిక్కిలి పాటుపడవలసి యున్నారు.

దేవాదాయ ధర్మాదాయములు

వల్లూరి సూర్యనారాయణరావు పంతులుగారు, బి. ఏ., బి. ఎస్., ఎల్. టి.

పూర్వము ప్రజలలో భగవద్భక్తి మెండుగ నున్నపుడు రాజులును వారి మంత్రులును జమీందార్లును వారి యేజెంట్లును ధనికులును దేవాలయములు సత్రములు చెరువులు తోఁటలు మొదలగువాని నేర్పఱచి వానికి ఈనాములను కూడ నిచ్చియున్నారు. బ్రిటిషు పరిపాలన మారంభమైన తరువాత మన రాజధానిలో వీని సంరక్షణనిమిత్తము ఆ 1817 సం. న 7 వ రెగ్యులేషను ప్యాసుచేసి యీ దేవాదాయధర్మాదాయములను తమ క్రిందనే యుంచుకొనిరి. కాని, 1857-వ సంవత్సరములో పెద్ద సిపాయికలహము అణఁపఁబడిన తరువాత దేవాలయములను మాత్రము కొందఱు మేనేజర్లకును కమిటీలకును ఒప్పఁజెప్పిరి. ఒకప్పుడు స్వల్పమగు అయివజు వచ్చు దేవాలయములకు వాని యర్చకులనే మేనేజర్లనుగా ఏర్పఱచిరి. ఈ దేవాదాయములు సరిగ మేనేజి చేయఁబడు చున్నదియును లేనిదియును కోర్టువారు విచారించుటకు 1863 సం॥ నెం 20 వ ఆక్టు చేయబడినది. 1859-60 సంవత్సరములో నీనాము కమిషనరుగారు ఈ దేవాదాయ ధర్మాదాయములను గుఱించి యీనాముపట్టాలు తయారుచేసి తత్కాలపు మేనేజర్ల పేర్లమీఁద జారీచేసిరి.

ఈనాముకమీషనరువారి విచారణలో కొన్ని దేవాలయములకు మేనేజర్లుగా నున్న అర్చకులు ఈనాములకు స్వామివారే హక్కుదారు లనియుఁ గాని నిత్యనైవేద్య దీపారాధనలఁ జేయుచు తామే ఆ అయివజు ననుభవించుచున్నా మనియు స్టేటుమెంట్లు దాఖలు చేసిరి. ఆ ప్రకారముగనే స్వామివారి పేరుమీఁద పట్టాలు వ్రాసి తత్కాలపు మేనేజర్లని అర్చకులకు ఇచ్చివైచిరి. అప్పటి పరిస్థితులలో స్వామివారి యీనాములనుండి వచ్చెడి అయివజు నిత్యనైవేద్యములకును, అర్చకుల భుక్తికిని చాలనందున వారు స్వామివారికి నష్టముఁ గలుగజేయుటకు అవకాశములే లేవు. గ్రామములోని భక్తిపరులు, ధర్మాత్ములు, ఉత్సవములను గుడిమరమ్మతులను చేయించుచుండిరి. అర్చకులు లేనియెడల నిత్యపూజయే చేయువా రుండరు గనుక వారి కుటుంబజీవనము నిత్యపూజావిధానపుకర్చులలో చేరినట్లుగనే ఎంచవలెను. దేవాలయములో సంగీతము వేదాధ్యయనము హరిభజన మేళము, నాట్యము మొదలగు నౌకరీలకు మాన్యములుగ నీయఁబడినపుడు అట్టినౌకరీ చేసినంతకాలము మాన్యము లనుభవించవచ్చునని యీనౌకర్ల కిచ్చిన పట్టాలలో స్పష్టముగ వ్రాయఁబడినది. ఇట్లు అర్చకులకిచ్చిన పట్టాలలో సాధారణముగ నుండదు. ఉండవలసిన పనియు లేదు. నౌకరీనిమిత్తము గాక నిత్యనైవేద్య దీపారాధనలకని గాని, లేక దేవాలయపు సంరక్షణకని గాని, అర్చకుల యీనాముస్టేటుమెంటులలో వ్రాయఁబడి గ్రామోద్యోగస్థులు సాక్షివ్రాలు చేయుటచేతనే ఈనామురిజస్టర్లలో అట్లు వ్రాయఁబడుచు పట్టాలు స్వామివారి పేరనే ఈయఁబడుచుండెను.

ఇటీవల భూములమీఁది అయివజు ప్రతిజిల్లాలోను ముఖ్యముగ డెల్టాప్రాంతములందు వృద్ధి యగుచున్నది. కాని దైవభక్తి తగ్గుచున్నది. అర్చకుల కుటుంబములు తామరతంపరగా పెరుఁగుచున్నవి. కనుక స్వామివారిభూముల ఫలసాయ మంతయు నర్చకుల యుపయోగమునకే కర్చు అగుచున్నది. ఎంత అయివజు వచ్చుచున్నను అర్చకులే అనుభవించుచున్నపుడు గ్రామస్థులు తామేల యుత్సవములకును గుడిమరమ్మతులకును సొమ్మును కర్చుపెట్టవలె నని యూరకొనుచుండుట ఉత్సవములు మొదలగునవి లేక చిన్నలలోను పెద్దలలోను మతమునందు నమ్మకము తగ్గి తుదకు దేవళములుకూడ శిథిలములై మిక్కిలి శోచ్యస్థితిలో నున్నవి. ఇప్పుడు మనము చేయవలసిన దేమి? విగ్రహారాధన మూఢవిశ్వాసముతోఁ గూడుకొన్నదనియుఁ బ్రస్తుతపు మతాచారధర్మములు ఎంతో క్రమముగ నిర్మూలింపఁబడిన నంత మంచిదనియు నెట్టిమతమును మన పాఠశాలలలో బోధింపఁబడకూడ దనియును వాదించువారికి ఈ విషయములతోఁ బనిలేదు. ప్రపంచములో నుండు నన్ని దేశముల నాగరకతకును అక్కడి మతములే ముఖ్యముగాఁ దోడ్పడిన వని నానాదేశచరిత్రలను చదివినవారికి బోధపడక మానదు. క్రైస్తవుల గుళ్లును, బౌద్ధుల విహారములును, హిందువుల కోవెలలును, తురకల మసీదులును, ఆయా మతస్థులు కూడి దైవప్రార్థనఁ జేసికొనుటకు ఏర్పడిన వగుటచేత నీ యిరువదవశతాబ్దములోఁ గూడ, వీనిని మంచిస్థితిలో నుంచుటకు అన్ని జాతులవారును ప్రయత్నించుచున్నారు. ఈ సంస్థాపనలు, తమకు పవిత్రస్థలము లనియు నివి యెల్లపుడు పరిశుభ్రముగ నుండవలె ననియుఁ దమ దైవప్రార్థనకే గాక తమ పూర్వవిజ్ఞానమునకుఁ గూడ నివి ఆటపట్టులుగ నుండవలె ననియు, బహుజనాభిప్రాయము. కాఁబట్టి మన హిందువులు ప్రపంచములో నుండు నితరజాతుల వారికంటె భిన్నాదర్శములు గలిగి ఆధ్యాత్మికవిషయములలో నెక్కువ కృషిఁ జేసి యుండి రనియు, సగుణనిర్గుణోపాసనల రెంటిని సమన్వయముఁ జేయఁగలిగి రనియు, పరమాత్మ విశ్వ మంతయు నిండియున్నది గనుక సగుణోపాసనను నిరసింపఁగూడ దనియు, మనలో ననేకుల యభిప్రాయము.

కాఁబట్టి, మన దేవాలయములను, ధర్మసత్రములు చెరువులు తోటలు మున్నగువానితోఁబాటు పునరుద్ధారణఁ జేయుటయు వాని యాదాయము సరిగ వినియోగపడునట్లు చేయుటయు మనకు విధియై యున్నది. కొన్ని కోవెలలలో అప్పుడప్పుడు అమాంగల్యపుపనులు జరుగుచున్నవి గనుక రూపోపాసన పనికిరా దని వాదించుట న్యాయ్యము కాదు. మానవప్రతిష్ఠాపనలు పరిపూర్ణత వహించుట అసంభవము. కాని, అంతమాత్రముచేత, వానిని నిరసించి, నశింపఁ జేసి, జనసామాన్యములో నీతిమతాభివృద్ధిని భగవద్భక్తినిఁ గలిగించునట్టి వీనిని పోఁద్రోలుట బుద్ధిమంతుల లక్షణము కాదు. మనలో మెట్టవేదాంతులు, నాస్తికులు, చార్వాకులు, పాషండులు మొదలగువారు కొందఱున్నను మొత్తముమీఁద జనసామాన్యము, మతమును త్యజింపక విగ్రహారాధనను వదలక దానిని తమ మోక్షమునకు ఒక ముఖ్యసాధనముగ నుపయోగించుకొనుచున్నారు.

దేవాలయములను, ధర్మములను స్థాపించువారికిని జీర్ణము

శైన దేవాలయములను పునరుద్ధారణ చేసినవారికిని పుణ్యగతులు కలుగు నని పూర్వప్రశాసనములలో నీ క్రింది శ్లోకములు కనఁబడు చున్నవి.

(i) వస్త్వంశజాః మహమహీపతివంశజా వా
యే భూమిపాః సతత ముజ్జ్వలధర్మచిత్తాః
మద్ధర్మ మేవ సతతం పరిపాలయంతు
తత్పాదుకాద్వయ మహం శిరసా వహామి.

(ii) స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనమ్
పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్.

పై కారణములనుపట్టి ప్రతివారును, తమ గ్రామదేవాలయములలో నిత్యకైంకర్యము, ఉత్సవములు, యథావిధిగ జరుగునట్లును, కోవెల యెల్లపుడు నాంగ్లేయుల పేర్చినలానే మంచిస్థితిలో శుచిగా నుండునట్లును ప్రయత్నింపవలెను. శిఖరము, ధ్వజస్తంభము లేని కోవెల గల గ్రామములో మంచితీర్థముఁ కూడ పుచ్చుకొనఁగూడదని మనవారు చెప్పుదురు. కోవెలలేని గ్రామము స్మశానవాటికయే. కాఁబట్టి ప్రతిగ్రామములో నున్న కోవెలకు నెల 1-కి రు. 15 లు జీతము మీఁద ఒక అర్చకుని యేర్పరచి, దాని యీనాముల మీఁద మిగిలిన ఆయివజును ఉత్సవములకును మరమ్మతులకును వినియోగించవలెను. వీనికి కావలసిన కర్చులు పోఁగా ఇంకను మిగల్చగలిగిన అయివజును, మన ప్రచారణ సంబంధమైన విషయములకే కర్చుపడవలెను గాని ఇతర విషయములకు-అవికూడ జనుల కెంతే యుపయోగకరములుగ నున్నను, వినియోగించకూడదు. దేవాలయముల ఈనాముల అయివజును, మామూలుగ నింగ్లీషుపాఠశాలలకు గాని, బీదజనుల యౌషధసేవలకు గాని మఱి యే యితర విషయములకు గాని, వినియోగించుటవలన, నీ దేవాలయస్థానముల నిర్మించిన మనవారి మూలాభిప్రాయములకే మోసము వచ్చును. మన హైందవవిజ్ఞానమునకును, ఆధ్యాత్మిక జ్ఞానమునకును, మన దేవాలయములే యునికిపట్టులై యున్నవి. బ్రాహ్మణులును, బ్రాహ్మణేతరులును, అట్టి జ్ఞానోపార్జనయందు సమానమైన ఆసక్తి కలవారే. ప్రపంచవిజ్ఞానమునకు మన హైందవులు చేర్చగల ధనము ఇదియొక్కటే గనుక, ఈ ధనమును వృద్ధిచేయఁగల సాధనములలో దేని నైనను విడనాడకూడదు. ఉత్సవములును, మరమ్మతులును తగుమాత్రముగ జరిగించిన తరువాత, ప్రతి సంవత్సరము మిగులుచున్న అయివజును, సంస్కృతపాఠశాలలు పండితసత్కారము హరికథలు పురాణకాలక్షేపములు మొదలగు మతవ్యాపన విషయములందు కర్చుపెట్టవచ్చును. సంస్కృతపాఠశాలలలో వేదములు శాస్త్రములు కళలు మొదలగునవి గొప్ప పండితులచేత నేర్పించవచ్చును. జీవనోపాధికి అల్లాడుచున్న మన పండితులకు ఆధారమును కలిగించినవార మగుదుము. మన హైందవ విజ్ఞానమునకు నీ దేవాలయములే శరణ్యములు.

పైన వ్రాసిన విధానమును కొందఱు అర్చకులకు సమ్మతముగ నుండదని నాకు తెలియును గాని, లా ప్రకారము వారికి చెందఁగూడని ఆస్తిని గ్రామస్థు లందఱకును వినియోగపడునట్లు చేయవలసి యుండగా నీ యర్చకుల క్రోధప్రసాదములతో మనకు పనియేమి? వీరిలో ననేకులు, స్వామివారి యీనాములను తమ స్వంత ఆస్తిగా భావించుకొని వానిని తమలో విభజించుకొని ఇతరులకు బోగుబందీకవుస్లు వ్రాసి ముందుగనే పెద్దమొత్తములు తీసికొని, అప్పులు చేసి వానిని తీర్చుటకు స్వామివారి ఈనాములను విక్రయించుచున్నారు. దేవాలయములు శిథిలములై పోవుచుండగా వీరు మిద్దెలు మేడలు కట్టుకొనుచున్నారు. ఇది యంతయు ప్రతిదినము కన్నులారఁ గనుచు, మన ముపేక్షించుట న్యాయ్యమే నా? అర్చకుల నోరుకొట్టుటకు ఎవరును ప్రయత్నింపలేరు. వారిలో ఒక్కొక్క కుటుంబమునకే జీవనము గలిగించగలము గాని, వారికుటుంబములు వృద్ధియగుచు వచ్చినకొలఁదిని, స్వామివారి యీనాముల అయివజు, వారితరతరములవారి జీవనమునకును శుభాశుభ కార్యములకును వినియోగించుచు వచ్చినయెడల నసలు దేవతా కార్యములకే నష్టము వాటిల్లుటయే గాక స్వామివారు తలఁ దాచుకొనుటకు కొంప యైన నుండుట తటస్థించదు. ఒక గ్రామములో దేవాలయపు గర్భగుడి మాత్రమే మిగిలి అదికూడ పోటీలతో నిలపఁబడి యుండుటచేత అర్చకుఁడు లోపలకుఁ బోవుటకు భయపడి బయట వీధిలోనుండియే దేవునికి నైవేద్యమును చేయుచున్నాఁడు. ఇతనికి మంచిలోగిలి యున్నది సంవత్సరమునకు 15 పుట్లు ధాన్యము స్వామివారి యీనాములనుండి నికరాదాయముగా నేర్పడి స్వేచ్ఛగా ననుభవించుచున్నాఁడు. మఱియొక గ్రామములో, స్వామివారి నైవేద్యమును, పొరుగూరునుండి ఒకపసిపిల్లవానిచేత కచ్చి మధ్యాహ్నము పూట ఒక అర్చకుఁడు పంపుచున్నాఁడు. ఆ కాలములో తప్ప, ఆ గుడి తలుపులు తెరువబడవు. ఈ అర్చకుఁడు ఈ రెండు గ్రామములలో స్వామివారికున్న య 20 ల పల్లపుభూముని యథేచ్ఛగ ననుభవించుచున్నాఁడు. ఇట్టి దృష్టాంతములు పెక్కు లున్నవి గాని, గ్రంథ విస్తరభీతిచేత వాని నిచ్చట నుదాహరింపలేను.

గ్రామస్థులు మొగమోటమిని వదలి తమ దేవాలయములకు శి. ప్రొ. కోడ్డు 92-వ సెక్షను ప్రకారము స్కీములను తయారుచేయించుకొన్న గాని, లేనియెడల స్వామివారి యీనాములు క్రమముగ నన్యాక్రాంతములై పోవుటకు నెట్టి సందేహము లేదు. ఈ కాలములో, దేశాభిమాన మను మాట మిక్కిలి చవుకయై అనేకమంది ప్లీడర్లు తెయిశక్కలాడుచుందురే గాని ఇట్టి యుత్కృష్ట విషయములలోఁ దగు శ్రద్ధఁ దీసికొనుచుండుట లేదు. గ్రామస్థులు వీరిని యెంత బ్రతిమాలుకొన్నను, వీరు మొదట నుచితముగ సలహాల నొసఁగి కోర్టులలోఁ బనిచేయరు. ఒక దేవాలయమునకు సరియైన స్కీము నేర్పాటు చేయించినయెడల, ఆ స్వామివారే వీరికి కోర్టువారిచేత కొద్ది ఫీజు నిప్పించవచ్చును. లేదా తమ పుణ్యమునకు ఎట్టి కొఱఁతయు లేదు. గ్రామముయొక్క నీతిమతాభివృద్ధికి సహాకారులగుదురు. ఒక్కొక్క ప్లీడరు, ఒక్కొక్క దేవాలయమునకు ధర్మకర్తగ కొంత కాలము పనిచేయవచ్చును. వీరును వర్తకులు మొదలగువారును, కలసి ధర్మరక్షక సభల నేర్పాటు చేసి కోర్టులకును, గ్రామస్థులకును సహాకారులు కావచ్చును.

బర్మాదేశపు స్త్రీలు

హెచ్. మహబూబ్ మియ్యాన్ గారు

ఆసియాఖండము పురుషులకు భూతలస్వర్గ మనియు, నచటి స్త్రీలు తమ పురుషులకు బానిసలుగ నాటకవస్తువులును నై యున్నారనియు నొకప్రతీతి గలదు. ఈఖండములోని యన్నిదేశముల కీపేరు సార్థక మయినఁ గావచ్చును కాని బర్మాదేశమున కది యెంతమాత్రము నన్వయింపఁజాల దని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును. బర్మాదేశములో నాఁడువారిచేయి పైనను మగవారిచేయి క్రింద నున్నది. ప్రతిస్థలమందును బ్రతిపనియందును స్త్రీలు ముందున్నారు. పురుషులు వారికి లోఁబడి వారిపై నాధారపడియున్నారు. ఇట్లుండుట యాదేశపు విపరీతాచారమే గాని యచటిపురుషులు తమ స్త్రీలకంటె శక్తిసామర్థ్యములందుఁ దక్కువ యని గాదు. అచటి స్త్రీ తనకుటుంబమునకు నిరంకుశాధికారిణి. తనభర్తను, కుటుంబమును నామె పోషించును. ప్రపంచమందలి యేదేశమును స్త్రీస్వాతంత్ర్యాధికతావిషయములో నీదేశమునకు సరిరాదు.

దేవాలయములకుఁ బ్రసిద్ధిఁ జెందిన యీదేశములో స్త్రీల స్వేచ్ఛావిహారవ్యవహారములు కన్నులారఁ జూచినఁ గాని చక్కఁగా బోధపడవు. దుకాణములలోను, గృహములలోను, దేవాలయములలోను, వీథులలోను, సంతలలోను, చిన్నఅవికలను వదులుచేతులు గల బిఱ్ఱుచొక్కాలను ధరించి మిక్కిలి శుభ్రముగా నున్న స్త్రీలు క్రొత్తవారి నాకర్షించుచు ననంతముగఁ గనఁబడుచుందురు. మురికిగాఁ గాని, నవ్వుముఖము లేకగాని, సోమరిగాఁ గాని యున్నస్త్రీ వెదకినను నాదేశమునఁ గనఁబడ దని చెప్ప నగును.

వేలకొలఁది రూప్యముల వెలఁ జేయు రత్నములు, వజ్రములమ్మఁబడు దుకాణములలోనికిఁ బోయి చూచిన నాదుకాణము స్త్రీదే యనియు, నచటి గుమస్తాలును, తదితర నౌకరులును స్త్రీలే యనియుఁ దెలిసికొని యాశ్చర్యపడుదువు. మార్కెట్టులో, ఫలములన్నియు గలసి 15 రూప్యములైనను వెలఁ జేయని యొకచిన్నయంగడికిఁ బోయి చూచినను నాయంగడికూడ స్త్రీదే యని తెలిసికొందువు. నీ వేఫలములు గావలయు నన్నను నామె నీకుఁ జక్కని బేరముఁ జెప్పి మర్యాదపూర్వకముగ ఫలముల నిచ్చును.

దూరమునుండి నదిగట్టును జూచితి వేని యచట వివిధవర్ణముల వస్త్రములను ధరించి వేడుకలు సలుపుచున్న జనసమూహము నీకుఁ గోచర మగును. అది వనభోజనార్థ మేతెంచిన గుంపని నీ వనుకొనియెదవు కాబోలు; కాదు; నీ తలంపు తప్పు; వారు స్త్రీలు; తమ యిండ్లలోని నారను దెచ్చుకొని యాయేటిలో నుతుకుకొనుచు విలాసముగ మాటలాడుకొనుచుఁ బాడుకొనుచు నున్నారు; వారికిఁ బని యన్న విసుగు లేదు.

రైల్వేస్టేషనుకుఁ బోయిన నచట నీకు టిక్కెట్టు నమ్మునది స్త్రీ; పోర్టరుపనిఁ జేయునది స్త్రీ; కూలిపనిఁ జేయునది స్త్రీ; అన్నిపనుల జేయువారు స్త్రీలే. హోటేలుల యధిపతులు, సేవకులు, తదితరు లందఱును స్త్రీలే. ఏసభలో నేవక్త ప్రసంగించుచున్నను వానికి దగ్గఱగా సంక్షిప్తలిపిలో వాని యుపన్యాసమును చటచట వ్రాసికొనుచుండునది స్త్రీయే. ఏఆఫీసులోఁ జూచినను టైపురైటర్ మీఁద చకచక వ్రేళ్ల నాడించుచుండునది స్త్రీయే. ఇదియదియన నేల! అన్నిచోట్ల నన్నిపనులను జేయునది స్త్రీయే!

ఈదేశములో స్వకాయకష్టముచే ధనికురాండ్రయిన స్త్రీలనేకులు గలరు. ఇటీవల రంగూను పట్టణములో దళాలివ్యాపారముఁ జేయుచుండిన యొకస్త్రీ మృతినొందెను. చనిపోవునప్పటి కామెయాస్తి యనేకలక్షలరూప్యము లుండినది. ఆధన మంతయు నామె స్వార్జితమే. ఇఁక చిల్లరవ్యాపార మంతయు స్త్రీలచేతులలోనే యున్న దని వేఱుగఁ జెప్పవలయునా? వాణిజ్యముఁ జేయు స్త్రీ లందఱును, చదువు లెక్కలు నేర్చి తమకార్యము నతినైపుణ్యముతో నిర్వహింతురు. కొండలక్రింద నుండుటకు గ్రామవాసు లగు నాఁడువారు సహితము చదువరులై తమతమ చిన్నయంగళ్లలోఁ గూర్చుండి వ్యాపారముఁ జేయుచు, లెక్కలను వ్రాసికొనుచు నుండుట యొకవింతగా నగుపడును.

నీయొద్ద సేవకురాలుగ నుండి సర్వదా హసితవదనయై యున్న స్త్రీ వివాహితయా? అవివాహితయా? అని తెలిసికొనుట యసాధ్యము. ఆంగ్లస్త్రీలపేర్లకువలె బర్మాదేశపుస్త్రీలపేర్లకు ముందు వివాహిత, అవివాహిత యనువిషయమును సూచించుపదము లుండవు. అట్టిపదములను వారిపేర్లకుఁ జేర్చుట వారి కవమానకర మట. కన్యలుగా నుండినను, ఇల్లాండ్రుగా నుండినను వారిని "మా" అని పిలువవలెను. నీసేవకురాలికి బిడ్డ లున్నా రని గ్రహించినఁ గాని యామెకు వివాహసౌఖ్య మున్న దని నీవెఱుఁగఁ జాలవు.

కుటుంబములో భర్తతక్క తక్కినస్త్రీ లందఱును గష్టించి ద్రవ్యార్జనఁ జేయువారే. భర్త తిని కాలు జేయి కదలింపకుండ సుఖముగాఁ బువ్వువలె నింటిలో నుండును. చలిఁ గాచుకొనుట, పొగత్రాగుట తక్క వాఁడింటిలోఁ జేయుపని యేమియు లేదు. శుభ్రములై, సొగసుగా నున్న వస్త్రములును, జరీనగిషీపని చేసిన పట్టు ఉడుపులను, కన్నులపండువ అగు రంగుపాగా ధరించి గృహమున సుఖపడుచుండును. వానిభార్య, ఆఁడుబిడ్డలు రెక్కలు విఱిచి బజారులలో సంపాదించుచుందురు. ఈదేశపుపురుషులు తమకు భార్యలసంఖ్య ఎంత యెక్కువగా నున్నఁ దమకంత యెక్కువ సిరి, సౌఖ్యము

లబ్బు నని తెలిసి యొక్కొక్కరు సాధారణముగా నిద్దరు ముగ్గురు భార్యలను వివాహ మాడుదురు. ఆభార్యలు దమభర్త ధనికుఁ డగు నొక పెద్దమనుష్యునివలె సుఖపడుటకై తమ శక్తికొలఁది పాటుపడి సంపాదించెదరు. ఇంటివ్యయములకుఁ గాక భర్త కతని స్వంతఖర్చులకుఁ గూడ ధన మిచ్చెదరు. అతఁడు తనయిష్టానుసారముగఁ దాను గోరినభార్యతో సర్వసుఖముల ననుభవించుచుండును.

ఈదేశములో వివాహమన సాధారణమైన యొకచిన్న పని. బంధుమిత్రులకు నొక ప్రూట విందుఁజేయుట తక్క వీరివివాహములలో నే యుత్సవములును లేవు. తలిదండ్రులయనుమతితో జరిగిన వివాహ మొక ప్రూట విందుతో సంతోషకరముగా ముగియును. తలిదండ్రుల యనుమతి లేనిచో వధూవరులు తమవారికిఁ దెలుపకయే యిండ్లు విడిచి పొరుగూరికిఁ బోదురు. అచట గురువు విస్యుక్తముగా వారికి వివాహమును జేయును. పిమ్మట నొకయాచారముగా వారు సమీపమున నుండు నొకయడవికిఁ బోయి, యచట నొకటి, రెండు దివసములుండి వరుని గృహమునకు మఱలివత్తురు అప్పుడు వరుని తలిదండ్రులు, కొడుకునకు కోడలికి విందుఁ జేయుదురు. ఆవిందులో వధూవరు లిద్దఱు నొకే పాత్రలో భుజింతురు. అప్పుడు పెండ్లి ముగియును. అందఱు నానంద భరితు లగుదురు.

ఈ దేశములో వివాహ మెంత సులభమో, దానివిచ్ఛేదనము గూడ నంత సులభమే. భార్యాభర్త లొకరి నొక రొల్లనిచోఁ దక్షణమే వారు వేఱుపడుదురు. ఎవరికి వివాహవిచ్ఛేదన మావశ్యకమో వారు వెంటనే యూరిపెద్దలయొద్దకుఁ బోయి, కారణములను జూపి తమపెండ్లిని రద్దుచేయుఁడని కోరుదురు. ఆపెద్ద లాదంపతులకు రాజీచేయుటకుఁ దమశక్తికొలఁది ప్రయత్నింతురు. కాని, వా రిద్ద ఱొకరిపై నొకరు త్రాగుడు, అభిని, పొగత్రాగుట, దుర్వ్యయము, వ్యభిచారము మున్నగు నేరములలో దేనినైన రుజువుపఱచినయెడలఁ బెద్ద లావివాహమును రద్దుపఱతురు. అక్కడి కావివాహము తెగిపోయినది. పురుషుఁడు తన్నుఁ బోషించుటకు వేఱొకభార్యను వివాహ మాడును; స్త్రీ తనకు బిడ్డ లున్న వారిని బోషించుకొనుచుండును. ఈపని యామెకు మొదటినుండియు నున్నదే గాని క్రొత్తది గాదు. ఆమె తనబిడ్డలను విద్యాబుద్ధులు గఱపుచుఁ బెంచి పెద్దవారిఁ జేయును. ఆమెకు భర్త యున్నను లేకున్నను నొక్కటే. ఈ దేశములో వివాహవిచ్ఛేదన మింత సులభముగా నున్నను దానియాచరణము చాల యరుదు.

ఈ దేశపుస్త్రీలు మిగుల సౌందర్యవతులు; వారినేత్రములు విశాలములై నల్లనై, సొగసుగా నుండును; నొసలెత్తై గుండ్రముగా నుండును; శిరములండాకారము గలిగి యుండును. వారు శిరోమధ్యమున వెండ్రుకలను చుట్టవలె ముడివేయుదురు. వారిశరీరము సొగసైన పసుపువర్ణము గలిగియుండును. నవ్వినప్పుడు వారిముఖమునఁ జిన్న చిన్న ముడుతలు పడి వారి కొక వింత సౌందర్యమును దెచ్చిపెట్టును. శుభ్రముగను, సొగసుగను నుండుటకై వారు తమముఖముల నొకవిధమగు సుగంధమార్జముతోఁ గడుగుకొందురు; సొమ్ముల నెక్కువగా ధరింపరు. సాధారణముగా మెడలలో చక్కని హారముఁను ధరింతురు. ఏస్త్రీగాని నలువదియేండ్లవయస్సునకుఁ బిదప ఏనగలను ధరింపదు. ఏసొగసును నామె చేసికోఁ గూడదు.

ఈ దేశమునఁ గ్రొత్తగాఁ జేరిన యితరదేశస్థు లీదేశపు సుందర యువతులను మోహించి వివాహ మాడుట సహజము. వివాహితులై యున్న యూరోపియనులు గూడ ననేకులు వీరి నుంపుడుకత్తెలుగా నుంచుకొందురు. ఈ దేశపు బాలిక లమాయకురాండ్రు, మోస మెఱుఁగరు, క్రొత్తవారిని సులభముగ నమ్ముదురు.

ఈ దేశములో స్త్రీవిద్య బాగుగ వ్యాపించినది. అనేకసంవత్సరములనుండి రంగూనుకళాశాలాధికారులును, ఇతరపాఠశాలాధికారులును స్త్రీవిద్యాభివృద్ధికై విశేషకృషి సలుపుచున్నారు. బాలికలును దమ కాలమును వ్యర్థపుచ్చక విద్యాభివృద్ధి నొందుచున్నారు; గానము, నాట్యము, మొదలగు కళలను శ్రద్ధతో నభ్యసించుచున్నారు.

ఈదేశపుస్త్రీ లెంతటికష్ట మయినను సహింపఁగలవారు. వారికి ఉత్సాహము మెండు. వారు సదా సంతోషస్వభావలు. బీదలు ధనికు లనుభేదము లేక ప్రతిపనియందును వా రొకరితో నొకరు స్నేహభావముతోఁ గలిసి మెలసి వర్తింతురు. ఆటలు, సంగీతసభలు, మున్నగు నన్ని పనులలోను స్త్రీపురుషులు స్వేచ్ఛను గలిగియుందురు. అయిన నీదేశస్త్రీలు సదాచారసంపన్నలే గాని నీతిబాహ్యలని చెప్పఁజాలము. ఈదేశస్థులు బౌద్ధమతావలంబకులు.

మ. విడువన్ జాలెను తండ్రికై సకలపృథ్వీనాయకత్వంబుఁ, దా
విడువన్ జాలెను పెండ్లి సోదరులకై, వీరాంకశయ్యాస్థలిన్
విడువన్ జాలెను మేను మన్మలకు, నవ్వీరవ్రతుం డద్దిరా!
విడువన్ జాలఁడు భారతీయులమదిన్ భీష్ముండు వేలేండ్లకున్.

—బాలకవి కసిరెడ్డి వేంకటసుబ్బారెడ్డిగారు

Lokamanya B. G. Tilak.



లోకమాన్యబాలగంగాధర తిలకుగారు.

Mr N. C. Kelkar.




నర్సింహ చింతామణి కేల్కారుగారు.

Mr Mahamad Ali Jinnah.



మహామదాలీ జిన్నాగారు.

Mr. S. Satya Moorthy.



ఎస్. సత్యమూర్తిగారు.

Mrs. Annie Besant.




శ్రీమతి అనిబెసంటమ్మగారు.

Hon'ble C. Y. Chintamani.



ఆనరబిలు చిర్రావూరి యజ్ఞదత్త చింతామణిగారు.

Hon'ble V. J. Patel.




ఆనరబిలు వి. జె. పటేలుగారు.

Mr. B. G. Horniman.



బి. జి. హార్నిమానుగారు.

Mr. V. P. Madhava Rao.



శ్రీ. పి. మాధవరావుగారు.

Hon'ble M. Ramachandra Rao.



ఆనరబిలు మోచర్ల రామచంద్రరావు పంతులుగారు.

Lala Lajpat Rai.



లాలా లజపతిరాయిగారు.

Rai Bahadar K. V. Reddi Naidu.



రాయబహదరు కూర్మా వెంకటరెడ్డిన



బి. పి. వాడియా గారు.

Mr. C R. Dass.



చిత్తరంజనదాసుగారు.

Prince Dorai Rajah of Pudukottah.



Dr. T. M. Nair M D.



డాక్టరు టి. మాధవనాయరుగారు.

Hon'ble Yakub Hussain Saheb.



యాకూబు హుస్సేనుగారు.

చిత్తమొక్క చిత్రము

ప్రత్తికాడలనుండి కాగితములు చేయుట

తేకుమళ్ల వెంకాజీ గారు

యుద్ధమువలనఁ జాల నష్టము కలిగిన దని యెల్లరకును దెలిసిన విషయమే. అయినను కష్టములలో సుఖ ముండు నను నార్యోక్తి ననుసరించి యీ ఘోరసంగ్రామమువలన ప్రపంచ మంతయు ముఖ్యముగ హిందూదేశము గొప్ప నీతులు నేర్చుకొనవలసియున్నది. ప్రథమమునుండియు మన దేశమందు పరిశ్రమాభివృద్ధి లేక మన పూర్వులయొక్క కీర్తి నానాఁటికి క్షీణించుచున్నది. ప్రస్తుతము మన దేశమందు మన దేశీయులచే నడుపఁబడుచున్న కర్మాగార మొక్కటియుఁ గానరాకున్నది. మన మనుదినము నుపయోగించు కాగితముల ధర హెచ్చినది. సాధారణులు కొనుట కసాధ్య మయినది. హిందూదేశమందు తయారగుచున్న కాగితములు మన కవసర మగు వానిలోఁ బదింవ వంతయిన సరిపోవుట లేదు. కాగితములు ప్రథమమునఁ దయారుచేయుటకు ప్రాఁతగుడ్డ పేలిక లుపయోగపడుచుండెడివి. తరువాత వెదురులోనుండి తయారు చేయఁబడుచుండెడివి. కాగితములఁ దయారుచేయుటకు వలయు పరికరములను కొన్నియంత్రముల సాహాయ్యమువలన 'గిజురు' (Pulp) గ నుండు నొకపదార్థము తయారు చేయఁబడును. ఈపదార్థమును తయారుచేయు యంత్రములు హిందూదేశమున లేవు. ఈ 'గిజురు'ను తయారుచేయుటకు వలయు వస్తువులను హిందూదేశమునుండి యెగుమతిఁ జేయుచున్నారు. ఈ'గిజురు' తయారుచేయఁబడి హిందూదేశమునకుఁ బంపబడుచున్నది. తన్మూలమునఁ గాగితములను తయారుచేయుచున్నారు. ఈ రాకపోకల కగు వ్యయమువలన కాగితముల ధర హెచ్చినది. యుద్ధమువలన నీ గిజురు ప్రస్తుతము వచ్చుటయే లేదు. అందువలన కాగితముల ధర మఱింత హెచ్చయినది.

ఈకారణములఁ బట్టి కాగితములను ఎవరిదేశములో వారే తయారు చేసికొనవలసిన అగత్యము కాన్పించినది. పైవిధానము ప్రకారము కాగితములను మనము తయారుచేసిన నితరదేశములందుఁ దయారు అగు కాగితముల ధరకంటె మన కాగితముల ధర హెచ్చుగ నుండును. విదేశవస్తువుల పోటీ (Foreign Competition) తో స్వదేశవస్తువులు నిలువఁజాల వని మన మందఱము ననుభవమున నేర్చిన విషయమే. మన దేశమందు తయారగు కాగితములవిలువ ఇతరదేశములనుండి దిగుమతి యగుచున్న కాగితముల విలువతోఁ బోల్చి చూచిన మనదేశమందు కాగితములను తయారుఁజేయుట ఎంత యత్యావశ్యకమో యీ క్రింది పట్టికవలన విశద మగును.

సం॥ము	హిందూదేశమందుఁ దయారు చేయఁబడుచున్న కాగితముల విలువ	దిగుమతి కాఁబడిన కాగితముల విలువ
19 8	75,87.270	9,415,025
1909	7,911,945	10 002,525
1910	8,151,540	11 005,830
1911	8,0 4,480	11,611 920
1912	1,106,040	13 583,400

విదేశమునుండి దిగుమతి చేయఁబడిన అట్టలు, కాగితముల యొక్క విలువ యీ క్రిందిపట్టీవలన తెలియును.

నంబరు	దేశముల పేరులు	1913 మార్చి 31 తో అంతమగు సం॥ము	1916 మార్చి 31 తో అంతమగు సం॥ము
1	అమెరికా	8,399,7[illegible]0	8,826,985
2	జర్మనీ	2,466,405	1,734,440
3	ఆస్ట్రియా	1,047,185	573,210
4	నార్వే	523,395	608,785
5	బెల్జియము	573 420	543,075
6	స్వీడను	47[illegible].340	508,785
7	హాలండు	541,095	619,560
8	ఇతరదేశముల		
	మొత్తము	541,095	619,560

1913-14 సంవత్సరములందు హిందూదేశమునకు విదేశములనుండి 'దిగుమతిచేయఁబడిన' మ్రానుగిజురు (Wood pulp) యొక్క విలువ.

1	అమెరికాయొక్క సంయుక్త రాష్ట్రములు	663,491
2	ఆస్ట్రియా హంగేరి	367,515
3	స్వీడను	309,540
4	జర్మనీ	303,705

ఈ గిజురు (Pulp) నుండి కాగితములను తయారుఁజేయుటకు చాలభాగము రాసాయనికపదార్థములు (Chemicals) సోడియా మిశ్రద్రవ్యములు (Soda Compounds) విరంజనచూర్ణము

(Bleaching Powder) పంగాకిమన్ను (China Clay) మొద లగునవి యెన్నియో కావలసియున్నవి. ఇవి యన్నియు ఇంగ్లాండు నుండి మనదేశమునకు దిగుమతి యగుచున్నవి.

ఈ గిజురులేనిదే కాగితములను చేయలేము. సమస్తపదార్థ ములకు స్థానమైన హిందూదేశము ఈ గిజురును తయారు చేసికొన లేక, ఇతర దేశములపై నిందుల కాధారపడియుండుట యెంత సోచ నీయము! పూర్వకాలమందు కాగితములఁ జేయుట కవసరమగు గిజురుకొఱకు బట్టలపేలికలు జనపనార (Jute hemp) ప్రాంత త్రాళ్లు చిత్తుకాగితములు మొదలగువాని నుపయోగించుచుండెడివారు. కాని ప్రస్తుతము గవర్నమెంటు ఫారెస్టుశాఖవారు వెదుళ్లనుండియు, సవనాగడ్డినుండియు, బైబు లేక సబై (Baib or Sabai) గడ్డి నుండియు, హిమాలయపర్వతములందుండు, దేవదారువృక్షముల నుండియు, ఈ గిజురును (Pulp) తయారుచేయుటకు పెక్కు ప్రయోగములను (Experiments) జేయుచున్నారు. 'సిండలు' (Sindall, F. C. S.) 'రైల్టు' (Railt a cellulose expert) 'పియర్సను' (Pearson, Forest economist) మొదలగు గొప్ప శాస్త్రవేత్తలచే నీ ప్రయోగములు కావింపఁబడినవి. ఈ గిజురును తయారు చేయుటకు మన దేశములో 18 రకముల గడ్డి కల దనియు, అందు మొదటి రకపు గిజురుఁ జేయుటకు, విడిగఁ గాని, కలిపి గాని, 8 రకముల గడ్డి కల దనియు రైల్టుదొర గారు వ్రాయు చున్నారు. ప్రపంచమంతటను చవుకగఁ దయారుఁ జేయుటకు సులువుగ నీ గడ్డి తయారు చేయఁబడును. ఈ గడ్డి అపరిమిత ముగ మన దేశమందు దొరకును. పోతవ్యయ మయిన లేకుండ నది పైని తెప్పించుటకును, అపారముగ నీ గిజురుఁ దయారు చేయఁగలుగు టకును గావలసిన వెదుళ్లు బర్మాలోఁ గలవు. ఇవి యన్నియు లాభ కరము లనియు, వీని ప్రయోగములు జయమును గాంచిన వనియును నిర్ధారణ చేయఁబడుటవలన, వీని వ్యాపారముఁ జేయుటకు సమయ మాసన్న మయినది.

ప్రత్తికాడల యుపయోగము :— మధ్యపరగణాల యధి కారివర్గమువారు గొప్ప ప్రయోగములవలన ఈ పైని వివరింపఁబడిన పదార్థముఁ గనిపెట్టి కీర్తివంతు లయిరి. ఒక సంవత్సరము క్రితము విదేశ పత్రికలలో నీ గొప్ప పరిశోధనఁ గూర్చి చర్చ జరగినది. బెర్లిను రసాయనశాస్త్రజ్ఞుఁ డొకఁడు తయారుచేయఁగలిగె నఁట. ప్రత్తి పంట సమృద్ధిగ నుండు నీ హిందూదేశమువారీ ప్రయోగపు (Experiment) లాభములఁ బొందుటకు మంచి తరుణ మిది. ఈ తరుణమును హిందువులకు ప్రసాదించిన శాస్త్రవేత్తలైన తెల్టుపచ్చి షైమెన్ గార్లు వందనీయులు. వీరి కీ పరిశ్రమాభివృద్ధియం దమిత ప్రేమ. వీరు మధ్యపరగణాలలో పారిశ్రామిక వ్యావసాయిక డైరక్టర్లు వీరికి యెలిచ్చి వాస్తవ్యు లయిన రావుసాహేబు జి. యన్. సహస్ర బుద్ధి గారు కొన్ని ప్రత్తికాడలను మచ్చు పంపిరి. నాగపూరులో నున్న రసశాల (Laboratory)లో నీ కాడలను ప్రయోగముఁ జేసి ఇందువలన చాల లాభము కల దని స్థిరపఱచిరి.

నాగపూరు వ్యవసాయరసాయనశాస్త్రజ్ఞుఁడు వ్రాసిన రిపోర్టు నందలి ముఖ్యాంశము లిందు పొందుపరుపఁబడినవి. దాని పరిశీలనవలన లాభ ముండక పోదు.

కొన్ని సంవత్సరములనుండి ముఖ్యముగా నమెరికాలో ప్రత్తి కాడలనుండి కాగితములను తయారుఁజేయుటకు చర్చ జరిగెను. ప్రత్తి కాడలను పృథక్కరణము (Analysis) చేయఁగా నూటికి 42.4 వంతు సెల్యూలోజ్ (Cettulare) అను పదార్థమును 10.3 వంతు నీరును, 5.8 వంతు ద్రవపదార్థమును గల వని స్థిరపఱచిరి. క్రాస్ యందు బీవన్సు (Cross Bevans) పద్ధతిప్రకారము ఈ సెల్యూలోజును పరీక్ష చేయగా పరిశుభ్రమయిన తెల్లనిపదార్థముగా నుండె నని స్థిరపఱచిరి.

కాగితమును గిజురుఁ జేయు మార్గము:— ప్రత్తికాడలు అంగుళము పొడవుగల ముక్కలుగా కొట్టఁబడును. తరువాత రస శాలలో (Laboratory) దీనికొఱకై నిర్మింపఁబడిన యొకయంత్ర ము (Antoclave) లో వాయుభారము (at a Pressure of atmosphere) వలన 145 డిగ్రీలయొద్ద (at 145 Oc) మధ్య క్షారము (Caustic alkali) తో 5 ఘంటలవఱకు నాన్పఁబడును. బాగుగ కడిగిన తరువాత నీ కాడలు విరంజనచూర్ణముతోఁ గలుప బడును. అప్పుడు సోడియగిజురు (Soda pulp) తయారగును. దీని నుండి కాగితములఁ జేయుటకుఁ గావలసిన గిజురు కొన్ని యంత్రముల వలన తయారుచేయఁబడును. ఒకమాదిరి కాగితములు తయారుచేయఁబడి నవి. పరిశుభ్రపఱచు యంత్రములు లేకపోవుటచే నొక విధమయిన ముదుక కాగితములు తయారైనవి.

హాలండు దొరగారు మధ్యపరగణాలకుఁ బోయినప్పుడు తెల్టు విచ్చిగారు వీరితో నిట్లు నుడివిరి:

"పలువిధము లయిన దుబ్బుగడ్డులతోఁ గాగితపు గిజురును తయారుచేయుటకు యోచనలు జరగుచునున్నవి. ఈ లోపున షైమెన్ దొరగారు పచ్చిప్రత్తికాడల నుండియు జనపకాడలనుండియు నితరము లగు మొలకల నుండియు నీ పరిశ్రమను అభివృద్ధిఁ జేయు టకు కలకత్తా డైరెక్టరుగారితోను తదితరులతోను ఉత్తరప్రత్యుత్త రములను జరుపుచున్నారు. ఫారెస్టుశాఖవారు ఇందుకు వలయు గడ్డి ఎంత దొరకునో కనుగొనుటకు ప్రయత్నములను జేయుచున్నారు

చింద్వారా (Chindwara) రాతిబొగ్గు గనులకుఁ జెందిన రయిలు దగ్గఱగనే, కాగితపు గిజురున కుపయోగపడు గడ్డిపొలములు చాల గలవు. అచ్చట నొక ఫ్యాక్టరీ నిర్మించుటకు చాల సులువుగ నుండును. వలయు పరికరములు సులభముగ దొరకును. వృక్షశాస్త్ర జ్ఞుఁడు ఈ గడ్డిని పరీక్షఁ జేయుచున్నారు."

ఈ పరిశోధనవలన ప్రత్తికాడలనుండి కాగితములను తయారు చేయుటవలన, ధనికులు తమ ధనమును వెచ్చించి వ్యాపారమును జేయుటకు తగిన తరుణము దొరకినది. విద్యావంతులును ధనికులును ఈ కార్యమును బూని ఇతరదేశీయులు ఈ ధనమును బ్రోగుచేసి

తోనకుండ దేశమందు స్వదేశపరిశ్రమల నభివృద్ధిజేసి, మన దేశమును ధనవంతముగఁ జేయవలెను.

ఈ విషయమునందలి యమెరికా యనుభవము:— విదేశములందు ముఖ్యముగా నమెరికాయందు ప్రత్తికాడలనుండి కాగితము గిజురు తయారుచేయఁబడెను.

ఉపయోగపడుచున్న వస్తువు	సాగుబడి చేయబడుచున్న భూమి ఎకరములు	సాలుకు ఎకరము 1కి పండు ప్రత్తికాడలు టన్నులలో	మొత్తము సాలుకు పండు ప్రత్తికాడలు టన్నులలో	ఎండుకాడలలో వచ్చు గిజురు శాతము	సాలుకు ఎకరము 1కి వచ్చు గిజురు టన్నులలో	మొత్తము సాలుకు వచ్చు గిజురు టన్నులలో
	1	2	3	4	5	6
ప్రత్తి కాడలు	10,000,000	0.45	450 000	3 .40	0.15	1,500,000

అమెరికా దేశీయుఁడొకఁడిట్లు వ్రాయుచున్నాఁడు:— గత వత్సరము కాగితపు ఫెక్టరీలయ యూరపు దేశములనుండి 1500,00,000 పౌనుల వ్రాఁత గిజురు నమ్మినారు. ఈ వత్సరము ఈ సదుపాయ ముండు ననిన నమ్మకము లేదు. దినదినము నీ గిజురుఁ దయారుచేయు కఱ్ఱయొక్క విలువ హెచ్చుచున్నది. ఈ ప్రకార మిందిన 20 సంవత్సరములలో ఎంత జాగ్రత్త పడినను గిజురుఁ దయారు చేయుటకు కఱ్ఱ మొక్కఁటైన కాన్పింప దని అమెరికా శాస్త్రవేత్తలు నుడివినారు. ఇతరపరిశ్రమల కుపయోగింపగ మిగిలిన యనవసరపదార్థములు (Waste Products) వేలకొలఁది టన్నులను మనము పాడుచేయుచున్నాము. ఈ పెత్తను కాగితపు యంత్రముల ద్వారా ధనముగ మార్చవచ్చును. వ్యవసాయశాఖవారు ప్రత్తి కాడల నుండయు వరికాడల నుండయు పరిశుభ్రము లైన కాగితములను తయారు చేయుచున్నారు. ఆ కాగితములనే అచ్చునకు కూడ నుపయోగించుచున్నారు.

కావున నో దేశీయులారా! ఈ పరిశ్రమయొక్క లాభములను చక్కఁగ పర్యాలోచనఁ జేసి ధనికులు ధనమును వెచ్చించి విద్యావంతులు ఈ పరిశ్రమను గూర్చి చక్కఁగ నేర్చికొని కాగితములను తయారు చేయు యంత్రములను స్థాపించి ప్రస్తుతము మనల నాపాదించి యున్న కాగితముల క్షామమును పాఱద్రోలెదరు గాక, యుక్తోవంతు లై స్వదేశపరిశ్రమలను నెలకొల్పి దేశమునకు దిగంత విశ్రాంతి మైన కీర్తిని సేకరించి మన దేశమాతను పూర్వౌన్నత్యమునకు తెచ్చి ప్రపంచకమందు నాగరకదేశములలో నొకదానిగ గణింపబడఁ జేసెదరు గాక!

ఆంధ్రు లేల నీ మహాత్కార్యమును పూనఁగావలదు?

మనలో లక్ష్మీపుత్రులు చాలమంది కలరు. కాగితముల పరిశ్రమను విదేశముల కేగి నేర్చికొనినవారు గూడ గలరు. ప్రత్తియా మన దేశమందు మెండుగ నె పండును. కావున కార్యశూరత్వమునను దాతృత్వమును జూపుటకును సమయ మేతెంచినది. "ఆలస్యా దమృతం విషం" అను నార్యోక్తి ననుసరించి కాలయాపనఁ జేయక ఆంధ్రులు కార్యశూరులే యని ఘంటాపథముగ చాటి నాయకులు వెనుదియక ముం దంజ వేయుదురు గాక!

చ. ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాససంత్రస్తులై
ఆరంభించి పరిత్యజింతు రురువిఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్నవిహన్యమాను లగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్.

బ్రహ్మచారిణు లగు వితంతువులు

శ్రీమత్కడాంబి వేంకటవరదాచార్యులు గారు

వితంతువులలో నెట్టి దుర్బుద్ధులును లేక సంతతమును బ్రహ్మచర్యమును బూని దైవభక్తి గలిగి యోగ్యమైన నడవడి గల వారికి బ్రహ్మచారిణీ వితంతువు లని పేరు. వీరు తమ సుగుణసంపత్తి వలన నెల్లరచే గొనియాడ బడుచుండుటం బట్టి స్త్రీసామాన్యములో వీరి నగ్రగణ్యలుగ మనము భావింపుచుందుము. వీరి హృదయము లోకప్పుడును దుష్కృత్యములందు చొరక తీర్థయాత్రలందును దేవతాదర్శనములందును బుణ్యనదీస్నానములందును బుణ్యకథాశ్రవణమునందును ఆసక్తములై యుండును. వీరు నీతిమతు లగుటను వీరి చరిత్రములు పవిత్రములై జగజ్జేగీయమానము లగుచున్నవి. లౌకికుల గుణావగుణముల నెంచుపని యుండదు. స్వప్నమందును నాత్మస్తుతియు బరనిందయును వీరికి కష్టవిషయములు. వీరితో స్నేహముఁ జేయు స్త్రీలును నీతిమతులై యోగ్యమగు ప్రవర్తన గలవారగు చుందురు. తమ తల్లితండ్రు లొనరించిన యతిబాల్యవివాహములవలన పిన్నవయసుననే భర్తలను గోల్పోయి యుక్తవయస్క లయ్యును సంసారదూరలై యిట్టి దురవస్థ తమకు సంప్రాప్త మయినందులకే తమ ప్రారబ్ధ మట్లు చేసె నని లోలోనఁ గుళ్లుచు విరక్తిం బూనిన యీ యనాథయువతులను మనవారు నిర్దయులై వంటలక్కలఁగా జేసి యెల్లప్పుడును జాకిరిఁ జేయించుచుండుటయును మగఁడు చచ్చినంత మాత్రమున జ్ఞాతు లిచ్చు భరణమునకు మాత్రమే యర్హురాండ్రై పొట్ట గడుపుకొన్నను మర్యాదకై యొరులయిండ్ల జాకిరి జేసికొని కాలమును గడపుకొనుచుండుటయు మన మనేకచోటులఁ జూచుచున్నాము. ఇట్టి పవిత్రగుణ లగు నీ బ్రహ్మచారిణీ వితంతువులను సాదరపూర్వకముగ నాదరించుటకు బదులు వీరిని దాసికన్నఁ దక్కువగాఁ జూచుచు వీరిచే నింటి జాకిరి నంతయుఁ జేయించుచు, పనిలో నేలోపము వచ్చినను నలుగురు చీవాట్లు బెట్టి యవమానపరచుటయు కేవలమును న్యాయమైనపని గాదు. వీరిలో బెక్కుమంది విద్యాగంధ మెఱుంగనివారై యున్నారు. ఇట్టినీతివతులు విద్యావతులుఁ గూడ నేర్పడినచో బంగారు పరిమళించినవిధంబున మిగుల నతిశయిల్లును. ఇట్టి వీరికి వీరి తల్లిదండ్రులు లేక సోదరులు శ్రద్ధను బూని తగినంత సామాన్యవిద్యను నేర్పుటయే గాక పిమ్మట జనానాయున్నతపాఠశాలలకు బంపి యున్నతవిద్య నేర్పించుటవలన చాల ప్రయోజనము గలదు. వీరికి ముఖ్యముగ కర్మశాస్త్రము ప్రకృతిశాస్త్రము వైద్యశాస్త్రము నేర్పుటవలన దేశమునకు చాల క్షేమము గలుగును. పవిత్రచరిత్ర లగు నీ బ్రహ్మచారిణీవితంతువులు విద్యాధికలై బాలికాపాఠశాలలలో నుపాధ్యాయులుగ నుండి రేని వారియొద్ద విద్యాభ్యాస మొనరించు మనబాలికలు చిన్ననాటనుండియు వారివలన ననేకనీతిమార్గముల నేర్చుకొని మంచినడత గలవారు కాఁగలరు. మఱియు వీరికి మంత్రసానికృత్యములను సంపూర్ణముగ నేర్పవలయును. మంత్రసాని పని కడు నీచ మని మనవారు అనుకొనవచ్చును. అది కేవలము తప్పైన యభిప్రాయము. స్వోదరపోషణమే ప్రధానముగ నెంచి రాజకీయ వైద్యశాలలయందు బనిసేయు మంత్రసానులు స్వార్థపరలై బీద సాదల కష్టసుఖంబుల నెఱుంగక తమపని కలిగినప్పుడెల్ల విశేష ధనముఁ గోరుచు నది యివ్వజాలనివారియెడ నుపేక్షాభావమును జూపుచు నిట్లు ప్రజాబాధకలై పరోపకారిణులు గాక యున్నారు. ఈవిద్యను నేర్చిన యువతీమణులు పాశ్చాత్యులలోఁ జాల గౌరవింపఁబడుదురు. ఇది పరోపకారమైన మహద్విద్య గాని నీచమైన విద్య గాదు. ఇట్టి విద్యను నేర్చిన పరుల నాశ్రయించి వారి యనుగ్రహమునొంద వారి పంచలఁ బడికాపులు పడియుండుటకంటె మనలోనే కొందఱు స్త్రీలకు నీవిద్యను నేర్పించినచో నట్టి తహతహలు బొంద నక్కఱ యుండదు. సామాన్యముగ స్త్రీలు తమకు గల కుసుమజాడ్యము ముట్టుకట్టునొప్పి మొదలగు రోగములను బురుషవైద్యులతో జెప్పుటకును వారితో సంభాషించుటకును సిగ్గుపడి వానిని దాఁచియుంచెదరు. అట్టిరోగములను నిరీక్షించుటకును కొన్ని సంగతుల నడుగుటకునుఁగూడ బురుషవైద్యులకును వీ లుండదు. అందువలన బైనచెప్పనరోగములు క్రమంబుగా గోరంతలు కొండంతలైన వెనుక వెల్లడించినను వైద్యుల కసాధ్యము లగుచున్నవి. అప్పు డున్నత విదేశస్త్రీవైద్యశాలల కరిగి యట వ్యయప్రయాసల నొందియును కొన్ని రోగములు కుదిరియు గొన్ని కుదురకయుం గొంద ఱావైద్యశాలలోనే మృతినొందియు నిట్లు కష్టములపాలు కావలసి వచ్చుచున్నది. అయినను ధనాధికలగు కొందఱకు మాత్రమే యిట్టున్నతస్త్రీవైద్యశాలల కరుగుట సాధ్యము గాని సామాన్యుల కసాధ్యమే గదా! స్వదేశస్త్రీలకు స్వదేశస్త్రీలే వైద్యముఁ జేయునెడల నట్టికొరంత లెల్లను దీరును. మనస్త్రీ లున్నతవిద్య నభ్యసించి యున్నత వైద్యశాస్త్రజ్ఞలై యుండిరేని మనకును, మనదేశమునకును, విశేషలాభక్షేమములు కలుగు ననుటకు సందియము లేదు. ఇట్లు సేయుటవలన నిరుపేదలును, నిర్మల హృదయులు నగు పెక్కుమంది యనాథస్త్రీలు విదుషీమణులై బహువిధ జీవనోపాధులను గలిగియుండుటయే గాక దేశక్షేమమునకు తోడ్పడువారై యుందురు. కావున ధనాఢ్యులగు హిందూసోదరులారా! మీమీధనములను మీరే యుపయోగించుకొని కేవలము స్వార్థపరులై మెలంగక దేశోపకారకములగు కార్యములందును నుపయోగించుటకై పూనుకొని యీయుద్యమమునందు మంచిపట్టుదల గలిగి పనిచేసి యొక్కొక్కమండలమున కొక్కొక్క యున్నతస్త్రీలపాఠశాల నేర్పరచి యందు స్త్రీల కున్నతవిద్యలను (ననగా ప్రకృతిశాస్త్రములు, వివిధకర్మవిద్యలు ఉన్నతవైద్యవిద్యలను) నేర్పించి నిరుపేద లగువిద్యార్థినులకు భోజనవసతులను గూడ గల్పించి యిట్టిమహోపకారమువలన మనదేశమును నున్నతస్థితికిం దెచ్చి శాశ్వత కీర్తిఁ బడయుదురుగాత.

ఉత్తరగోగ్రహణము

రాయసము వేంకటశివుడు గారు, ఎమ్.ఏ., ఎల్.టి.

ఆధ్యాత్మికవిషయములను లోకవ్యవహారములను ఉపమానముల మూలముగ సమానకౌశల్యముతో విస్పష్టముగ బోధింపఁగల గ్రంథములలో భారతము ముఖ్యము. అందలి యుత్తరగోగ్రహణకథ యందఱికిని దెలిసియె యున్నది.

ఈ యుత్తరగోగ్రహణకథనుండి మనము గ్రహింపఁగల సత్యములును సూత్రములును కొన్ని కలవు. శూరాగ్రేసరుఁ డగు నర్జునుఁ డప్పుడు మిక్కిలి హీనదశయందుండెను. తన బాహుపరాక్రమము శత్రువులకుఁ దెల్లమగునట్లుగ రణరంగమున యుద్ధము చేయవలసినవాఁడు కాలవైపరీత్యమునఁ బట్టి పేడియై యంతఃపురకాంతల కాటపాటలు నేర్పవలసివచ్చెను. మత్స్యపురిని గష్టసమయమున రక్షింపవలయు నని పూనిన యాతనికి సాయము చేయుటకైన నెవరును లేరైరి. మిక్కిలి భీరు వగు నొకనికిఁ దాను సారథి యగుట సంభవించెను. తుదకు యుద్ధరంగమునఁ దాను సహజరూపముతోనైనను బోరుపట్టి భాగ్య మతనికి లేదయ్యెను. అట్లు చేసినచో సమయభంగ మగు నని యతని భయము కాని, నిజ మగు శూరత్వము గలవాఁ డెప్పుడును స్థితిగతుల ననుసరించి మెలఁగవలసినను వానికి దాస్యము మాత్రము చేయనొల్లఁడు. తా నొకరికి సారథ్యము చేయవలసివచ్చినను తన కింకొకరు సారథియైనను అతని కొకటియె. విజయమును జేకూర్పఁగలది పౌరుషమె కాని బాహ్యావేషము నాడంబరమును గావు. గడ్డము మీసములు దుస్తులు పౌరుషమున కమోఘమైన చిహ్నములు గావు. తుదకు కీర్తిగౌరవములును ప్రధానములు గావు. ఎట్టి స్థితిగతులందును విధికార్యనిర్వహణమె యుత్తమునికిఁ గర్తవ్యము.

అజ్ఞాతవాససమయ మర్జునునికి మిక్కిలి నీచ మగు దశయైనను అదియె యతని యుత్కృష్టస్థితికి దాఁపున నుండి దానికిఁ గారణభూత మయ్యెను. అంతకుఁ బూర్వమునఁ గాని పిమ్మటఁ గాని యతఁ డొకఁడే యింతమందితోఁ బోరి యొక్కుమ్మడిగ వారలఁ బరాజితులఁ గావించి సంపూర్ణవిజయము గాంచియుండలేదు. మహాభారతయుద్ధకాలమునందైనను బలపరాక్రమసంపన్ను లగు సోదరులును బంధుమిత్త్రాదులును లెక్కకు మిక్కిలిగ నతనికిఁ జేయూఁతయై నిలిచిరి. ఇక్కడ నన్ననో తన పక్షమున నుండునది భీరు వగు నొక యువకుఁడు. భారతయుద్ధసమయమున నతని చుట్టును నక్షౌహిణుల కొలఁది సైనికులు తనవారు సమసిపోయిరి. ఇక్కడ నన్ననో తన వారిలో నొకఁడును మడియలేదు. అచ్చటఁ బదునెనిమిది దినములు శత్రువులు దన్నెదిరించిరి. ఇచటనో కొలఁది కాలములోనె పగవారు పటాపంచ లయిరి. మహాప్రసిద్ధు లగు కురువీరుల తలపాగలు తన చిన్నారి పొన్నారి పుత్త్రికలకై యుత్తరునిచేఁ గొనిపోయించెను. విరటుని గోగణము నంతటిని పురమునకు మరలించెను. సంపూర్ణవిజయ మన నిట్లుండవలెను గదా. మనుజుని సమర్థతాసమర్థత లిటులె జంటగఁ గానఁబడును.

అర్జునుఁడు తన బాహుబలము నీ గోగ్రహణసమయమునం దత్యధికముగఁ జూపవలసివచ్చెను. సుప్రసిద్ధకిరీటి యుద్ధమునకు వచ్చుచున్నాఁ డని తెలియఁగనే శత్రుకోటి భయవిహ్వలులై వానిని డీకొనుటకు ధైర్యము చాలక యుండుదురు. అందువలన నా శూరునికి జయము గొనుట సులభసాధ్యము. సామాన్యముగ నర్జునుని యుద్ధమునకుఁ బూర్వమె డెల్ల పగవారు వాని పేరు వినియు వాని ముఖవీక్షణము చేసియు పలాయితు లగుచుండిరి. కాని, యుత్తరగోగ్రహణకాలమందు మాత్రము విజయునికి జయ మిట్లు సులభసాధ్యము కాలేదు. అజ్ఞాతవాసనియమము నుల్లంఘింపవలసి వచ్చునను సందియముచేత నతఁ డిపుడు మారువేషముతోనే యుద్ధమునకుఁ దొడంగెను. కౌరవపక్షమున నుండు గురుభీష్మాదివృద్ధవీరులు కొందఱు మాత్రమె యతఁ డర్జునుఁ డని మొదటినుండియు గ్రహింపఁగలిగినను తక్కిన సైనికు లందఱు నతఁడు క్రొత్తవాఁ డని భ్రమించి కొంతసేపటివఱకు వానిని గుర్తెఱుఁగక మిక్కిలి బలముతో వానితోఁ బోరాడిరి. కాని, శత్రువులు తీక్ష్ణముగాఁ బోరు సల్పుచో నిజ మగు వీరుని శౌర్య మధిక మగుచుండును. వాని యుత్సాహము పెంపగుచుండును. కావుననే నాఁడు తన యుద్ధనైపుణ్యమును పరిపూర్ణముగ నతఁడు శత్రువులకుఁ జవి చూప నవకాశము కలిగెను.

శా. సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా
తంగస్ఫూర్జితయూథదర్శనసముద్యత్క్రోధమై వచ్చు నో
జం గాంతారనివాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
చ్చెం గుంతీసుతమధ్యముండు సమరస్థేమాభిరామాకృతిన్.

అని కౌరవసేనానాయకులు వీని నాశ్చర్యముతో వీక్షింపసాగిరి. తన శక్తు లెఱిఁగి వెఱచువారిమీఁదనే గాక యెఱుఁగక నిలువఁబడి పోరాడు పగతురమీఁదఁ గూడ శూరుఁడు తన పౌరుషమును జూపును. నిజ మగు శూరత్వము త్రుప్పుపడిన కత్తివలె నొక చోటఁ బడియుండక నఱికిన కొలఁదిని పదునుపడు నాయుధము వలె సదా తీక్ష్ణత దాల్చియుండును. నిక్క మగు పౌరుషము తన వంశావళిబిరుదావళులను లెక్కింపఁ జూడదు. ప్రాఁతవడిన కీర్తినే నమ్ముకొనియుండదు. క్రొత్త సమయముల నారయుచు క్రొత్త యవకాశములను నూతనపరిస్థితులను కల్పించుకొనుచు ఆచరణము మూలమున తన గౌరవమును బ్రకటీకృతము చేయుచుండును.

ఉత్తరగోగ్రహణసమయమునం దర్జునుఁడు గాంచిన విజయమునకుఁ గారణ మతని బాహుబల మొకటియే గాక అతని నయసంపదయు నని చెప్పవచ్చును. ఇంత కాలమునకుఁ జిరిగి శత్రుదర్శనము లభించినది కదా యని యతఁ డెంత మాత్రము విఱ్ఱవీఁగక శత్రుపక్షములో నున్నను తన గురువగు ద్రోణుని దాను గౌరవించుట విధి యని గుర్తెఱిఁగి యాయన పైపునకు నమస్కారబాణములు వైచి యాయన దీవన వడసెను. నీతిసంపద యతనియం దిట్లు విశద మగుటచేతనే సర్వోధివర్గములలోనివాఁ డగు భీష్ముఁడును అర్జునునిమీఁద వత్సలత గలిగి యతఁ డా సమయమునఁ బ్రయోగించిన సమ్మోహనాస్త్రమునకుఁ బ్రతిబాణ మెఱిఁగియు నెఱుఁగనివాని వలెఁ దానును దల వాల్చియుండెను. ఈ సంగతి యర్జునునకుఁ దెలిసి కౌరవవీరుల తలచుట్లు కోయు ముత్తరునితో భీష్ముని జోలికి మాత్రము పోవల దని చెప్పెను. ఇంత యేల? ఒక విధముగ నర్జునుని సమ్మోహనాస్త్రము భీష్మునిమీఁదవలె నెవరిమీఁదను బని చేయలే దనియె చెప్పవచ్చును. అర్జునుఁడు శత్రు వను సంగతియే మఱపించి మీఁదుమిక్కిలి యతని పక్షమునకే భీష్ము నొరగింపఁజేసినది యర్జునునిచేఁ బ్రయోగింపఁబడిన నయవర్తన మను సమ్మోహనాస్త్రమే!

గోగ్రహణసమయమునం దర్జునునికి జయము చేకూర్పఁగలిగినది. చాలవఱ కతని దైవభక్తి యని చెప్పవచ్చును. కృష్ణార్జునుల స్నేహము వర్ణనాతీతము. కృష్ణుని సైన్యముల నపేక్షింపక నిరాయుధుఁ డగు నతని నొకనినే భారతయుద్ధసమయమునందుఁ దనకు సారథి కమ్మని యర్జునుఁడు కోరుట దీనికి నిదర్శనము. కాని, యర్జునుఁడు కృష్ణుని మిత్రుఁ డనియే కాక దైవ మని కూడ భావించెను. కృష్ణనిర్యాణమును దన యన్నకుఁ జెప్పుచు,

క. మన సారథి మన సచివుఁడు
మన వియ్యము మన సఖుండు మన బాంధవుఁడున్
మన గురుఁడు మనకు దేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా!

అని యర్జునుఁడు కృష్ణునిఁ గూర్చి పలికెను.

అర్జునుఁడు కృష్ణుని సారథిఁ జేసికొని భారతయుద్ధమున నిలువఁబడి యుద్ధమున జయము గాంచుటయందలి యంతరార్థము నరుఁడు నారాయణుని చేయూఁతచే సంసారమునఁ గృతకృత్యుఁ డగుచున్నాఁ డని చెప్పెదరు. ఏది యెటు లున్నను, అర్జునుఁడు కృష్ణుని దైవముగ భావించి యాతని సాహాయ్యముచేతనే మహాభారతయుద్ధమున సంపూర్ణవిజయము నందఁగలిగితి నని తలంచెను. కాని, నారాయణుని యీ సాహాయ్యము భారతయుద్ధమునందువలెఁ దన కన్నులయెదుట కృష్ణునిఁ జూచునప్పుడె గాక తదితరసమయములందును వానికిఁ గానవచ్చుచునే యుండెను. "గోగ్రహణమునాఁడు గురుకులాంభోనిధిఁ గడచితి నెవ్వని కరుణఁ జేసి" యని యర్జునుఁడు నాఁటి తన విజయమునకుఁ గృష్ణుఁడె కారణభూతుఁ డని యొప్పుకొనెను. కను మూసినను విచ్చినను దేవుని యాకారమె దర్శించు భక్తుఁడె భక్తుఁడు. స్వశక్తివలననె దిగ్విజయము గాంచితి నని విఱ్ఱవీఁగక నిజ మగు భక్తుఁ డెప్పుడును తన జయమును తన ప్రజ్ఞకే గాక దేవుని మహిమకే యారోపించుచు తన జీవిత మతని సేవకె వినియోగించుచు కృతకృత్యుఁ డగును.

ఉత్తరగోగ్రహణకథ మనకు బోధింపఁగల సంగతు లిట్లు పెక్కులు గలవు. సంసారయాత్ర యొక్కొక తఱి మన కన్నుల కుత్తరగోగ్రహణమువలె కష్టసాధ్యముగఁ గానఁబడును. చేయవలసిన విధికార్యము మన శక్తికి మీఱినట్లును స్థితిగతులు మనకు విరుద్ధముగ నున్నట్లును కావలసిన సాధనసామగ్రి మన చేతులకుఁ జిక్కకున్నట్లును దోఁచును. అట్టి కార్యము నిర్వహింపఁజూచుట సాహసకృత్యమనియు త్రొక్కు మార్గము గర్హిత మనియు జనులు తలంపవచ్చును. కాని, విధికార్యనిర్వహణ మెప్పటికిని కర్తవ్యమె. గొప్ప కార్యములు చేయు సమయము మనకు ముందు చెప్పి వచ్చునది గాదు. మన కప్పుడు సాహాయ్యము చేయు బంధుమిత్రాదులు గానరా రని వెతనొందుట వ్యర్థము. మన యాత్మపరీక్షకొఱకే దైవ మీ సమయము నాసన్నము చేసె నని మనము గుర్తెఱిఁగి యావచ్ఛక్తిని వినియోగించినచో విఘ్నపరంపరలు మటుమాయ మగును. లోకము నాశ్చర్యమున ముంచఁజాలిన జయము మనకు లభించును. మఱియు, ఎటువంటి ప్రజ్ఞ గాని పూర్వార్జితయశస్సునే యాధారము చేసికొనక నూతన మార్గమునందును స్థితిగతులందును బ్రవేశమై నెంపొందుచుండవలయును. నిశ్చయ మగు జయమును నిశ్చల మగు కీర్తిని జేకూర్పఁగల శక్తి నయశక్తియె. మనుజులను వశీకృతము చేసికొనఁగలది బాహుబలము గాదు. తుదకు ప్రజ్ఞాబలమును గాదు, సుగుణబలమె. కాని, యీ సద్గుణముల కాయువు పట్టు ఈశ్వరవిశ్వాసము. ఎవఁడు భగవంతుని పరమపితవలెనే గాక మిత్రునిగను తోడునీడగను జేకొని ప్రేమించి తాను జేయు నన్ని కార్యములను వాని కర్పించి యన్ని కార్యములందును వానిని దర్శించునో యతఁడే నిజ మగు భక్తుఁడు. అట్టివాఁడే నర నామమును సార్థకముగఁ దాల్చినవాఁ డగును.

సంగీతము — స్వరప్రభావము

చెలికాని లచ్చారావు గారు

సంగీతము సామవేదమూలమున భగవన్ముఖమునుండి వెలువడి నట్లు చెప్పఁబడుచున్నది. దానిని పూర్వు లధిష్ఠానదేవతఁగ భావించి పూజించుచుండిరి. సంగీతము సాధనచేసి తెలిసిన కొలఁది యందంతర్భూతములై యున్న దివ్యశక్తులను బయలుపఱచి జ్ఞానాభివృద్ధికి తోడయి ఇహపరసౌఖ్యసాధనంబై మానవునియున్నత స్థితికి సాయపడగల దని చెప్పనగును. పిపీలికాదిబ్రహ్మపర్యంతము ప్రాణికోటి కెల్ల నానంద మొసఁగునది ఒక్క సంగీతమే! శంకరాదులు సంగీతరసజ్ఞశిరోమణులు కదా! ఇట్టి సంగీతసుధారసము గ్రోలుమానవులు ధన్యులుగదా! స్వకీయముగ రంజింపఁ జేయునది గనుక స్వరము. స్వరము ప్రధానముగఁ గలది సంగీతము. గీతవాద్య నృత్యంబులు చేరి సంగీత మనఁబడుచున్నది. వేదానిమంత్రములవలె నిదియు శాస్త్రసమ్మతముగ నుచ్చార్యము. వేదమంత్రము లపస్వరంబుల ననర్థదము లెట్టు లగునో అటులే సంగీత మపస్వరంబున ననర్థద మగుచున్నది. మంత్రము లనఁగ దివ్యజ్ఞానసంపన్నులగు ఋషిసత్తములచే నియమానుసారముగను శక్తియుతముగను కూర్పఁబడిన అక్షర విశేషములు. (Words of power) ఆయక్షరముల నుచ్చరించుట వలన గలిగినఫలమే మంత్రశక్తి. ఇందు సాత్త్వికతామసములు గలవు. ఉపాసనావిధులచే నుపాసకులు వేరయి ఫలసిద్ధినిఁ బడయుచున్నారు. వశిష్ఠుఁడు సాత్త్వికమంత్రోపాసనచే భగవదాదులను వశము చేసికొన్నట్లును జనమేజయుఁడు తామసమంత్రోపాసనవలన సర్పములను దగ్ధముఁ గావించినట్లును పురాణప్రసిద్ధం బయ్యె. ఈమంత్రములు గల శ్రుతి, స్మృతి, పురాణాదులకు మనవా రాధ్యాత్మిక శాస్త్రము లని పేరిడిరి. ఇందు పరమాత్మ జీవాత్మ పుణ్యపాపాదు లతీంద్రియవిషయములును బోధింపఁబడి యుండును. మహనీయులు వేదముల కాధార మగునదియు పూర్ణానంద మొసఁగునదియు నగు పరబ్రహ్మస్వరూపము ఓంకార మని తలఁచిరి. ఇదియే ప్రణవ స్వరూపము (ఓం = అ + ఉ + మ్) ప్రణవము అక్షర త్రయంబై, మంత్రత్రయంబై, నాదబిందుకళాత్మికంబై, సృష్టి స్థితిలయ కారణభూతంబై యుండు. ఇట్టి గుంభితభావప్రభావంబు లాధ్యాత్మికసిద్ధాంతంబులం దొప్పు. ఇవి ఆత్మానుభవమును బట్టి విజృంభించ నెంతెంత ఘనకార్యంబు లైనను చేయ నగును. ఒక్క (ఓంకార) స్వరమునందే ఇంతటి అక్షరార్థంబు లిమిడియుండి మహాద్భుతశక్తి గలిగించునపుడు ప్రణవప్రతిపాదిత మయి సామవేద సార మనఁబడు సంగీతమున కెట్టి మహాద్భుతశక్తి యుండునో యూహింపుఁడు ఆయానియమాక్షరధ్వన్యాదులను బట్టి ఆధ్యాత్మికశాస్త్రంబునం దుండు మంత్రాదుల కెట్టి శక్తిగలదో సంగీతమున కట్టిశక్తి కల గని నిరూపింపనగు. ఇఁకఁ బ్రకృతిశాస్త్రమున గల భిన్నవస్తుసంయోగ శక్తిని గ్రహింతము. ప్రాణవాయువు ౧ వంతును వత్రజని ౨ వంతులును చేరి నీరగుచున్నది. ప్రాణవాయువునందు దీపముంచిన మందటికంటె నధికతేజమునఁ బ్రకాశించుటయు వత్రజనియందు నార్పుస్వభావమును గలవు. విడివిడిగ నేదైన నొకదానిని పీల్చినఁ బ్రాణహాని యగును. రెండును మంతులప్రకారము కలిపిన సాధారణ వాయువై ప్రాణాధార మగుచున్నది. కావున వస్తువులు కలసినప్పు డొక గుణమును వేఱయినప్పు డొక గుణమును కలుగుచున్నవి. ఇది సాత్త్వికమంత్రము వంటిది. సున్నము పసుపుల కలయిక యుగ్ర మంత్రమువంటిది. కావున నొండొంటికి సంబంధ మున్నప్పటికి వస్తు గుణము లాయాకూడికలను బట్టి మారుచున్నవి గదా. అట్టివే మంత్రాదులకును ఆయానియమితాక్షరముల కూడికలను బట్టి శబ్దోచ్చారణ బట్టియు నాయాశక్తు లుదయించుచున్నవి. ఇందుఁ బ్రత్యక్షము లగువాటికి ప్రకృతిశాస్త్రము లనియు నాత్మానుభవమునుఁబట్టి ఆచరించువాని కాధ్యాత్మికశాస్త్రము లనియు పేరులు. కొందఱు మొదటి దానినిమాత్రమే విశ్వసింతురు. మఱికొందఱు రెండవదానినే నమ్ముదురు. ఏది యెట్లు లైన నుభయంబులప్రభావము సంగీతమున గుంభితమై యున్నట్లు చూపింపగలము. ఆధ్యాత్మికమునం దష్టాక్షరివలె సంగీతమున సప్తాక్షరి. (స-రి-గ-మ-ప-ధ-ని) కలదు. ఈ సప్తస్వరములకు షడ్జము, ఋషభ, గాంధార, మధ్యమ, పంచమ, దైవత, నిషాదము లని వరుసగ పేరులు. శయ్య స్థాయి స్వరము మున్నగునవి పరిభాషలు. శాస్త్రంబునందు చెప్పిన చొప్పున లక్ష్యలక్షణ సమన్వితంబుగ నభ్యసించిన సంగీతము మిగుల ప్రతిభఁ గాంచును. సంగీతమునకు శాస్త్ర మెంతయవసరమో కళయు నంతియే యవసరము. శాస్త్రము శ్రుతిలయజ్ఞానాదులతో నడుగు తప్పకుండ దాని నంటియే యుండును. శాస్త్రము నియమముకొలఁది కళలేనిది రక్తి కట్టదు. రక్తి గట్టనిదే శోభించదు. గుణములును బయలుపడవు. కావున సంగీతమున కపస్వరంబు లనర్థదాయకము లని తెలియుచున్నది. శబ్దము, స్వనము రవము, ధ్వని, మ్రోత, నాదము, అను పర్యాయపదములచే స్వర మొప్పుచున్నది. స్వరము మ్రోతరూపముగ నూఁపుదల యనియు నది కలిగినపు డెల్ల నొక్కొక్క యాకారవిశేష ముదయించు ననియుఁ బ్రకృతిశాస్త్రమువలనఁ దెలియవచ్చుచున్నది. మ్రోతవలన నంతరాళమున నొక్కొక్కరూ పుదయించుటచేత మ్రోతలయం పైనస్వరస ముదయమువల్ల ననేకము లగు నాకారములు భిన్నభిన్నరూపములతో నుదయించుచుండును. మఱియును సంగీతస్వరములను బలుకు యంత్రములనుండి వ్యాపించు నాదప్రసారమువలన సన్నపు టిసుక

నేలమీఁద కేభాగణితోత్తమము లగు వివిధరూపవిశేషములు పొడము చుండుటను ప్రత్యక్షముగఁ జూడఁదగు నని ప్రకృతిశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. మన ముచ్చరించు ప్రతియక్షరమునందును బయలి వాయువు (గాలి) యానియం దొకయల పుట్టుచున్నది. ఈ యక్షరమునకును వాయువ్యాకాశ సూక్ష్మతత్త్వములం దొకచలనము పుట్టి యొక రూప మేర్పడును. ఇట్లు శబ్దసమూహముచే ననేకరూపము లుదయించుచున్నవి. వీనికి కాలనియమాదులుకూడ గలవు. వసంతరాగ మపరరాత్ర మందును, మేఘరంజి మధ్యాహ్నకాల మందును, ప్రాతఃకాలమున భూపాలరాగమును పాడవలె నని చెప్పుదురు. ఒకఁడు మేఘరంజినిని పాడి మబ్బుఁ గ్రమ్మించి వర్షము కురియించినట్లును మఱియొక్కఁడు సారంగరాగమును పాడి లేడిని వశము చేసికొన్నట్లును జనశ్రుతి యయ్యెు. ఏదేని రాగమును సరిగాఁ బాడిన యెడల దాని స్వర సమ్మేళనమువలన సంతరాళమునఁ గలుగు ప్రోతచేత నద్భుతరూపము లుదయించు నని సిద్ధాంతము చేయఁబడినట్లు వార్తాపత్రికలవల్లను గ్రంథములవల్లను తెలియుచున్నవి. వాట్సుహ్యూగ్సు దొరసాని "వాయస్ అఫ్ ఫిగర్సు" అను గ్రంథమువలన నీ సిద్ధాంతము నిజమని రుజువు చేయుచున్నది. ఈమె ఈడోఫో నను యంత్రము వలనఁ దానుఁ పాడిన సంగీతస్వరమువలన నుదయించు వివిధరూపములను లోకమునకు జూపింప నేర్చినది. కొన్ని కొన్ని జాతుల చూర్ణములను నెరపి సంగీతస్వరముల యాకారముల నా చూర్ణరేణువులతోఁ గనఁబడఁజేయును. నక్షత్రములు, ఫలములు, పుష్పములు, సర్పములు మొదలగువాని యాకారవిశేషము లన్నియు కాంతివంతములై సూక్ష్మాకారములతోఁ గనబడును. ఇటు లామె సభ్యులకుఁ గనబరచె నట! దీనిం బట్టి మాఁద స్వరవిశేషము, రూపవిశేషమును పొడమించు ననియు నాయా స్వరసముదయసమ్మేళనమువలన నాయారూపము లుదయించు ననియుఁ దద్భిన్నత్వమున నావిశేషము లుదయించు ననియుఁ దేలుచుండెను. దీనినిఁ బట్టి దృష్టి కగోచరములైన వానికి రూపములను గల్పించి ప్రత్యక్షముగ స్వాధీనముఁ జేసికొను శక్తి మంత్రాదులకువలె సంగీతమునకును గూడ నుండినట్లు తేలుచున్నది. మఱియు భావరాగతాళంబులఁ బ్రకాశించెడి నృత్తగీత వాద్యములచే భక్తులు సంకల్పించుకొను రూపమును ప్రత్యక్షముగాఁ జేసికొనునట్లు చెప్పఁబడుచున్నది. సంకల్పమున రూపములఁ గ్రహింపనగును ఇతరుల సంకల్పములఁ దెలిసికొన నగును. దేహబలమున కన్న బుద్ధిమనోబలములు శతాంశ మెక్కువ. మనోబలము నితరుల మనస్సును స్వాధీనపఱచుకొనఁ గలదు. దీనినే ప్రకృతిశాస్త్రజ్ఞులు విల్‌ఫోర్సు అని యందురు. ప్రత్యక్షముగ నిప్పుడు ఫ్రాన్సుదేశమున మనస్సంకల్పములను ఫోటోగ్రాఫున నెత్తుచున్నారట! దూరమం దుండుస్నేహితుని మనస్సునందు సంకల్పించుకొని కూర్చుండఁ నెదుటివానిరూపము పడక వాని మనస్సునందు తలంచుకొను వాని రూపమే పడుచున్నదట. ఇట్టి దానినే మున్ను మనవారు కనిపెట్టి మనస్సునందు పుట్టుసంకల్పము సూక్ష్మాకాశములోఁ బ్రతిబింబ మేర్పడుచున్న దని చెప్పుచుండిరి. ఈ సంకల్పశక్తి ఘనకార్యముల నయినను చేయ కల దని మనవారి సిద్ధాంతము. సంగీతసాధనమున నట్టి మహాద్భుతశక్తు లందినట్లు భక్తులచరిత్రలవలన దెలియుచున్నవి గదా! మఱియు గానకళావతంసు లగు పర్వతనారదహనుమదాదులసంగీతంబున శిలలుసైతము నీరయినట్లును నీళ్లను రాళ్లను గా నొనర్చినట్లును వినియున్నాము. సంగీతమున కట్టిశక్తి కలదా? ఈ మధ్య నమెరికాయం దొకగాయకుఁడు వంతెనమీఁద కూరుచుండి విలాసార్థము గానము నొనర్చుచుండ నావంతెన గజగజ వణక నారంభించెనట! అతఁడు పాటఁ జాలించినప్పుడు వంతెన కదలకుండె నట. అతఁ డాశ్చర్యము నొంది తిరిగి యాస్వరముననే యదే కాలమున నాపాటనే ఆరంభింప మఱల వంతెన కదల నారంభించె నట! అప్పు డక్కడ నున్నజను లెల్లరు నాశ్చర్యమగ్నులై స్వరమునకును లోహమునకును సంబంధ మేదో కల దని నిశ్చయించి స్వరమహిమమున కద్భుతపడసాగి రని వార్తాపత్రికలవలన వినియుంటిమి. ఒక్కదేవకామిని సంగీతశక్తియే యర్జునుని శాపపాత్రుఁ జేసెను. శంకర శ్రీకృష్ణాదులు నృత్తగానంబులకు లోనై తాండవమాడినట్లు పురాణప్రసిద్ధముగదా! శంకరుని ఢక్కావాద్యధ్వనులే సంస్కృతాక్షరములుగ నయ్యె నని చెప్పెదరు గదా! మనవా రొక జ్యోతిషశాస్త్రమును కనుగొని దాని నభివృద్ధిపఱచునప్పటికి యెన్నోవేలు సంవత్సరములు పట్టినట్లు తెలియుచున్నది. కాన భారతీయసోదరులారా! ఇట్టి సంగీతవిద్యను భక్తితాత్పర్యంబులతో భరతవర్షంబున నభివృద్ధిపఱిచి లెల్లాభంబులఁ బడయుదురు గాత యని కోరుచున్నాను. జగదీశ్వరుఁ డట్టి వరప్రసాదము మన కనుగ్రహించును గాత.

ద్విపదకవిత్వము

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారు, కావ్యవ్యాకరణతీర్థులు.

క్రియాసిద్ధిః సత్త్వే భవతి మహతాం నోపకరణే — అని సంస్కృతమునం దొక న్యాయము కలదు. సమర్థు లగు మహానుభావులకు కార్యసిద్ధి సత్త్వమునం దుండునే కాని ఉపకరణముల (సాధనముల) యం దుండ దని పైవాని కర్థము. ప్రకృతము మనము పరిశీలింపఁబోవు ద్విపదకవిత్వము గూడ పై న్యాయము ననుసరించియే యున్న దని పరిశీలకు లగువారికి తోఁచకమానదు. అయినను, గతానుగతికన్యాయము చొప్పున లోకమునం దీ కాలము వఱకును "పదకవిత ముదిమి వనితయు" అని యొక ప్రవాదము మాత్రము ఆబాలగోపాలము వ్యాప్తి గాంచియున్నది. ప్రవాదము లెప్పుడును అనాలోచితముగ ప్రవర్తిలి యంధపరంపరగా వ్యాప్తి నొందుచుండుట సాజము. మనీషు లగువారి కిట్టి ప్రవాదములఁ దుదిముట్టఁ బరీక్షించి యథార్థమును లోకమునకు రూపించుట స్వధర్మము. నేను మనీషిత్వముతోఁ గాకున్నను, సహజము నలౌకికము నగు పదకవిత్వముపై నొక విధ మగు ననురాగము గలిగియున్నవాఁడ నగుటచేతఁ బ్రస్తుత మీ వ్యాసమునందు ద్విపదకవిత్వమును విమర్శింపఁబూనితిని.

ద్విపద యన నేమి?

కవిత్వము సాధారణముగా గద్యపద్యస్వరూపమున వెలయుచుండును. గద్యకవిత్వము ప్రాయికముగా ఛందోవిన్యాస నిబంధనరహితమై యుండును. పద్యకవిత్వము ఛందోబద్ధమై తనరుచుండును. ఈ రెండు విధములు మాత్రమే గాక గద్యపద్యములఁ రెండును మేళవించి గూడ కూర్పఁబడిన కావ్యములు పెక్కులు గలవు. అట్టి కావ్యములను సంస్కృతమునందు చంపువు లనియు తెలుఁగునఁ బ్రబంధము లనియు వ్యవహరించుచున్నారు. ఇఁక రెండవది యగు పద్యకవిత్వము వృత్తము లనియు జాతు లనియు రెండు భేదములచే నొప్పారుచున్నది. పైఁ జెప్పిన జాతివృత్తములు గూడ జాత్యుపజాతిభేదములఁ బరఁగినవి. షడ్విధకందములు (అనఁగా నాఱు విధము లగు కందపద్యభేదములు) గాక, ఉత్సాహ తరువోజ పంచవిధాక్కఱలు అనునవియు ద్విపద త్రిపద చతుష్పద పంచపాది షట్పద వృత్తములును రగడ మొదలగు నితరవృత్తములును గలసి మొత్తము పైని జాతు లనఁబడునని ఛందోవేత్తల భావము గాఁ గనుపట్టెడిని. ఇట్లే గీతపద్యములోని భేదములను సీసపద్యములు నుపజాతు లని గూడ నెఱుంగనగును. కావున, ద్విపద యనునది జాతివృత్తములోని యొక భేదము అని పర్యవసించినది. ఇందులకుఁ బ్రమాణంబుగా నప్పకవి చెప్పిన యీ క్రింది పద్యమును గ్రహింపఁదగును.

సీ. కందషట్కము లాఱుఁ గాక యుత్సాహయు
తరువోజ మధ్యమాక్కఱలు నైదు
దీపించు మంజరీద్విపదత్రిపదచతు
ష్పదపంచపాదషట్పదవిధములుఁ
దొమ్మిది విధములతో నొప్పు రగడలుఁ
గళికలు నుత్కళికలును గూడ
జాతులు నవవిధగీతంబులును సీస
వృత్తంబును నుపజాతు లయ్యె
ననుచు నన్నయభట్టు భీమనయుఁ బెద్ద
సచివుఁడును మూర్తి తాతయార్యుఁడు ననంత
మంత్రియును దిమ్మరాజు నిమ్మాడ్కిఁ జెప్ప
చందముగ వారు చేసిన ఛందములను.—అప్పకవీయము.

అప్పకవి చెప్పిన యీ పద్యమును సావధానముగాఁ బరికించినచో, పైని బేర్కొనిన వృత్తవిభాగక్రమమును భిన్నవృత్తములును నన్నయభట్టారకాద్యాంధ్రకవిజనసమ్మతములు మాత్రమే గాక, వారు వారు తమతమ గ్రంథములయందు సందర్భానుసారముగ నచ్చటచ్చట నయ్యె ఛందముల నందము గులుకు చందమునఁ బ్రయోగించి రని తోఁచుచున్నది. కాని, ఆంధ్రశబ్దానుశాసనుఁ డనియు (కొందఱి యభిప్రాయము ననుసరించి) ఆంధ్రమున నాదికవి యనియుఁ బేరొందిన నన్నయభట్టారకుని మహాభారతమునందు అచ్చటచ్చటఁ దరువోజ†మధ్యాక్కఱ యుత్సాహము కందము మున్నగు వృత్తములను పరిశీలించి కనుఁగొనవచ్చును గాని ద్విపద మాత్ర మెచ్చోటను మందునకైనను గానిపింపదు. భాషాంతరము నొనర్చుటలోను పదవిన్యాసమునను సోమయాజి మున్నగువారు నన్నయకంటె భిన్నమార్గప్రవృత్తులుగనే యున్నను ఛందోవిన్యాసమునందు మాత్రము ప్రాయికముగా నన్నయ్య త్రోవ నవలంబించిరే గాని స్వతంత్రించి ద్విపదప్రభృతివృత్తములఁ గూర్పరైరి యని కొందఱి యభిప్రాయము.

పై పద్యమునందు "వారు చేసిన ఛందములను" అని యుండుటఁ బట్టియు పద్యములోఁ గీర్తితు లగు కోవిదులలోఁ జాలమంది లక్షణగ్రంథప్రణేత లగుటం బట్టియు, వృత్తవిభాగమును తల్లక్షణములను తమతమ గ్రంథములలోఁ జర్చించి నిర్దేశించిరే కాని వేఱు గా దనియు కావున భారతాదులలో ద్విపదలను కూర్పకపోవుట లోపము గా దనియు మఱికొందఱి సమాధానము. ఈ ప్రశ్నోత్తరములవలన మనము ద్విపదకవిత్వము నన్నయాదులకంటె ప్రాచీన మని యొక వాదమును నవీన మని యొక వాదమును ఆనుపూర్విగా

† తరువోజ యతిప్రాసనియమంబున కొంచెము మార్పు నొందిన ద్విపదయే యని యెఱుంగునది.—సంపాదకుఁడు.

తప్పు మన్న దని జ్ఞప్తియం దుంచుకొనవలయును.

ఏది యెట్లున్నను (అనఁగా పూర్వపక్షోత్తరపక్షములవారి కింకా సమాధానములు ఏతీరున నున్నను) నన్నయభట్టారకుని కాలము నాఁటికే ద్విపద ప్రచారమున నుండె ననియు ఇయ్యదియే ఆంధ్రభాషయందు సంస్కృతమున ననుష్టుప్పు రీతిని— ప్రాథమికవృత్తమై యుండె ననియు నొప్పుకొనక తప్పదు. ఏల యనఁగా— ద్విపద యని యొక వృత్త ముండినఁ గాని అందులకు లాక్షణికులు లక్షణములను చేయు నవసరము సంభవింపదు. తఱచుగా లక్ష్యలక్షణములలో లక్ష్యములే ప్రథమము లనియుఁ బిమ్మటివి లక్షణము లనియు విజ్ఞులకు విదితమే యైయున్నది. మఱియు, ప్రాజ్ఞు లగువారికి లక్షణములందుకంటె లక్ష్యములపైనే ప్రామాణ్య మెక్కుఁ డనుటయు సుప్రసిద్ధము. కావున, ద్విపదకవిత్వము నన్నయభట్టారకుని నాఁటికే ప్రచారమున నున్న దనుట నిర్వివాదముగా నొప్పుకొనఁదగియున్నది.

నన్నయాదుల నాఁడు ద్విపదకవిత్వము ప్రచారమున నున్నచో నిప్పు డా కాలము నాఁటి గ్రంథము లేల కానరావు?— అని కొందఱడుగవచ్చును. కాని, పృచ్ఛకులు నన్నయభట్టు కాలముకంటెను మిక్కిలి పూర్వమున నున్నవై కవిత్వమున నింతకంటెను రసవంతము లైన కావ్యము లెన్నియో కాలవశమున లుప్తములై యుండుటను జ్ఞప్తి నుంచికొన బ్రార్థించెద.

మఱియు, నిచ్చట నింకనొక విషయమును మనము పరిష్కరింపవలసి యున్నారము. అద్దియది యేకవృత్తమునఁ గృతినిర్మాణ మనునదియే. సంస్కృతాంధ్రములలో నింతవఱకు ప్రాయశః కావ్యలక్షణములలో నేమి రచనాసంవిధానములలో నేమి ప్రబంధనిబంధనములలో నేమి మహాకావ్యము లుపకావ్యములు ఖండకావ్యములు నాటకములు మున్నగునవి యేకవృత్తనిర్మాణము పట్ల సాహాయ్యమును పొందియే యున్నను, ఆంధ్రకావ్యములలో మాత్రము భిన్నవృత్తతను పాటించిరి. 'సర్గాంతే భిన్నవృత్తతా' యని కావ్యలక్షణములు సంస్కృతమున నుంటయు కావ్య మంతయు (కొన్నియెడల సర్గ యంతయు) నొక్క వృత్తముతోనే సమాప్తి నొందించుచుండుటయు కనుఁగొనవచ్చును. మన యాంధ్రకావ్యము లట్లు కాక యే ప్రబంధమే కావ్యము పరికించినను చంపువులయందుఁ బోలె వివిధవృత్తములు కనుపట్టుచుండును. ఇపుడు భిన్నవృత్తతతి కావ్యముల సమంజసమా యసమంజసమా యను విషయమును మనము విచారింపవలయును. సమంజస మంద మన్నచో భిన్నవృత్తములు గల సంస్కృతకావ్యములు తెలుఁగు గ్రంథము లన్నియు నగ్రాహ్యములుఁ గావలసివచ్చును. మనకుఁ గల యనుభవము కొలఁది పరికించినచోఁ గాళిదాసుని మేఘసందేశమును ఆర్యాసప్తశతి మొదలగు సంస్కృతకావ్యములును గుణాఢ్యుని ప్రాకృతకావ్యములును ఆంధ్రభాషలోని శతకగ్రంథములును ఏకవృత్తపూర్ణములే కదా! ఆ కావ్యములను పఠించుచో నెవ్వరైనఁ గాని ఏసందర్భమునఁ గాని ఎప్పుడు గాని విముఖత నొందిరా? రసము గ్రహింపఁ జాలకపోయిరా? లేదుగదా! కావున, భిన్నవృత్తత సమంజస మనుటకు వీలు లేదు.

పోనీ, భిన్నవృత్తత యసమంజస మనుకొందము. కాని, వృత్తభేదము గల కావ్యము లెన్ని సప్రపూర్ణములై సకలజనహృదయరంజకములై యలరారుట లేదు. కావున, గ్రంథములలో భిన్నవృత్తములు కూడునా కూడవా యని వివరించుటకంటెను ఇష్టము వచ్చిన వృత్తములతో కావ్యమును రసోదంచితముగను సహృదయహృదయాహ్లాదకరముగను పాఠకజనమనఃప్రమోదకరముగను సంస్కారచ్యుతి పొరయకుండునట్లుగను గమనించి వ్రాయుట శ్రేయము. ఇదియ నిక్కమగు కవిత్వతత్త్వము. దీనిఁ గనిపెట్టినవాఁడె కవి. ఇట్టివాని కవిత్వమే సకలజనశ్లాఘ్యమై యలరారుచుండును.

అయినను, ప్రబంధములయం దేకవృత్తతను పాటించు నాచారము దూరము పరికించినచో మన యాంధ్రభాషయందు లేకపోలేదు. పరికింపుఁడు ద్విపదకావ్యములు శతకములు దండకములు స్తుతిపాఠములు మొదలగువానిలో నేకవృత్తతయే పాటింపఁబడినది.

కవి, సమర్థుఁడై చతురుఁడై లోకజ్ఞుఁడై భువనరంజకుఁడై వశ్యవచనుఁడై వెలయవలయునే కాని 'కవిత్వము ద్విపదతోఁ జెప్పెనా? త్రిపదతోఁ జెప్పెనా? పదములఁ జెప్పెనా? పాటలఁ జెప్పెనా? పద్యములఁ జెప్పెనా? గద్యములఁ జెప్పెనా?' యను విషయము ప్రధానము కాదు. కావున, నే వృత్తములలోఁ జెప్పినను విబుధులు అల్పానల్పముల నపేక్షింపక, రసము ఔచిత్యము లోకజ్ఞత మున్నగు గుణములచేత ప్రకృష్టతరమై యొప్పుచున్నచో నట్టి కవిత్వమును నిష్పక్షపాతులై గుణములు గ్రహించి యాదరింపవలయు ననియు నిరాదరించుట తగ దనియు నా యభిప్రాయము.

ఇఁక, నన్నయాదుల కాలము నాఁటికే ప్రచారమున నున్న ద్విపదకవిత్వము మధ్యకాలమున నెందులకై హీనము కావలసివచ్చె ననుట విచార్యము. ద్విపదకవిత్వము ప్రాచీనమై ఆంధ్రసారస్వత మహావృక్షమున కాదిమూలమై పండితపామరజనుల కెల్లఁ గామధేనువై తుడుము మొదలుకొని దేవార్చనమువఱకుఁ గల వాఙ్మయరాశిలో నేదో యొక రీతిని ప్రవేశించి తన విశ్వవ్యాపకత్వము నిప్పటికిని మన కనులకుఁ గాన్పింపఁజేయుచున్న దే కాని యూరకుండలేదు. చూడుఁడు, మన గృహములలోఁ బూర్వకాలిక లగు స్త్రీలు చేయు పూజాపురస్కారములు మొదలుకొని అద్వైతోపదేశములవఱకును గల వాఙ్మయ మంతయు, అనఁగా అప్పగింతలపాటలు దక్షయజ్ఞము సీతపాట పుత్రకామేష్టి పార్వతీపరిణయము లక్ష్మణమూర్ఛ అంగదరాయబారము ఆత్మబోధ మున్నగు పాటల కథ లన్నియు, అవి యివి యన నేల? జనసామాన్యమునకు నీతిమతములఁ గఱపి లోకతంత్రవిదులఁ జేయ ననువగు విషయము లన్నియు ద్విపదలలోనే కూర్పఁబడియున్నవి.

కేవల మింత మాత్రమే గాక పండితజనాదరణీయములును వేదవేదాంగాదులలోని దగు విజ్ఞానమున కంతకును నిధు లనఁదగు భారతభాగవతరామాయణములు కూడ ద్విపదలందు జనానుగ్రహకాంక్షు లగు కవీశ్వరులు రచించి కృతార్థత నొందిరి. పండితున

కైనను పామరున కైనను విన్నంతనే హృదయము నాహ్లాదింపఁజేయు శక్తి యున్నఁ గదా నిక్కముగా కవిత యనిపించుకొనఁదగును. ఇట్టి కవిత్వముఁ జెప్పి ప్రజల నారాధింపవలయు నని కోరెడి కవికి పరిపూర్ణ మగు స్వాతంత్ర్య ముండవలయును.

స్వాతంత్ర్య మనఁగా, కొందఱు తలంచునట్లు యతిప్రాసాది నియమరహితముగ కవిత్వముఁ జెప్పుట యని గాని పర్యాయపదములు అలంకారములు మున్నగునవి లేకుండ చెప్పుట యని గాని తలంపఁజనదు; విపుల మగు భావము ఉచితజ్ఞత రసస్ఫూర్తి మున్నగు గుణములు వెల్లడించుటకు నిర్బంధమును కలిగించు పరికరములను విసర్జించు నధికార మని మాత్రమే యర్థముఁ జేసికొనవలయును. వృత్తములు పెద్దవిగా లేకపోయినప్పటికిని చిన్నిచిన్ని పదములఁ జెన్నమీఱునట్లు చెప్పుటకు వీలు కలుగఁజేయుట గూడ నొక విధమగు స్వాతంత్ర్యమే యనఁదగును. ఇట్టి స్వాతంత్ర్యమును కవి పూర్ణముగా వహించుటకు ద్విపద యొక్కటి తప్ప మఱి యే యితర మగు ఛందమును అనువుపడియుండదు. కనుకనే ద్విపద జనసామాన్యమున విశేషముగాఁ బ్రచారమునకు వచ్చె నని నిశ్చయింపఁదగును.

ఈ రీతిగా జనసామాన్యమునకు ద్విపదకవిత్వము మిగుల ప్రేమాస్పదమై యలరారుచున్నను చిరకాలమునుండి యుండినను రాను రాను ఏల యియ్యది కుంఠితమై మూలఁబడవలసి వచ్చె నని యెంతటి నైపుణ్యమునఁ బరికించినను తగినంతటి కారణములు కనుపట్టవు. కాని, రాజాశ్రయాభావము నిస్సార మగు కవిత యని కొందఱును ద్విపదకవిత్వము నధికారిభేదము లేక వ్రాసినచోఁ దమ తమ పాండిత్యప్రకర్ష లపకర్షత నొందు నని మఱికొందఱును పామరజనరంజకము లగుటఁ బండితు లాదరింపమి యని యింకఁ గొందఱును ఇందులకుఁ గారణములుగఁ జెప్పెదరు. కాని, యిం దేదియు తగినంతటి యుపపత్తిని జూపి సమర్థింపఁజాలవు.

ఏల యనెదరా? రాజాశ్రయాభావాదులు కారణము లనినచో రంగనాథుఁడు స్వయముగా రాజా? అతని గ్రంథమును లక్షణవేత్తలందఱు నుదాహరింపలేదా? అట్లయినను దాని కేల సార్వజనీనత రాలేదు. నిస్సారత్వము మున్నగునవి కారణము లనియెదరేని పద్యకావ్యములలో మాత్ర మెన్ని లేవు పై మాటలకు గుఱియగునవి? కావున, నాలోచించు కొలఁది ద్విపదకావ్యప్రచారము లుప్త మగుటకు మనవారిలోఁ బొడుకొని వేళ్లు పాఱియున్న యహంపూర్ణ మగు మౌర్ఖ్యమే గాని వేఱు కా దని తోఁచును.

ఈ మాటలను నేను ప్రాచీనులను దూషించు తలంపున ననుట లేదు. సర్వజనశ్లాఘ్య మగు వైదుష్యమున నొప్పారి శ్రుతిస్మృతీతిహాసాదులఁ గరతలామలకములఁ బోలె నొనర్చికొని సమయస్ఫూర్తిగ నుపన్యసించు జాణతనమున నలరారి 'తన కాలమున నున్న పరవాదుల గుండియ లెల్ల జల్లురు మన విజృంభించి తా నుత్తమశ్లోకత నొంది వీరమాహేశ్వరవర్యుఁడై వెలసిన పాల్కురికి సోమనారాధ్యుల నాఁటికి ద్విపదకవిత్వమునైని లోకమున కే విధమగు నభిప్రాయ ముండెడిదో, ఆ మహామహుని గ్రంథమునందలి ద్విపదపంక్తులు కొన్ని సుసాక్ష్యముగా తెలియఁజేయఁగలుగును:

ఒప్పనే ద్విపదకావ్యోక్తి నా వలనఁ
సారోనగద్యపద్యాదిప్రబంధ
పూరితసంస్కృతభూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబు గామి
జాను తెనుఁగు విశేషప్రసన్నతకు
నట్టులు గాక కావ్యప్రౌఢి కెక్కి
నెట్టన రచియింప నేర్చినఁ జాలు
నుపమింప గద్యపద్యోదాత్తకృతులు
ద్విపదయు సమమ.

దీనిని బట్టి యారాధ్యులవారు పండితునిచరిత్రమును ద్విపదకావ్యమునఁ జెప్పఁబూనుకొనినట్లును అప్పటికే యనఁగా సోమనారాధ్యుని కాలమునకె ద్విపదకవిత్వ మున్న నేవగించుకొను పండితు లుండి రనియు తాము చేయు కృతి పండితులకంటెఁ బామరజనమునకే యెక్కు డుపయోగపడవలసియుండుటచేతను గద్యపద్యములతోఁ బ్రౌఢిగా రచియించు నేర్పు తమ కున్నను జనసామాన్యమున కట్టి కృతులు (అనఁగా ప్రౌఢములగు గద్య పద్యకృతులు) సంస్కృతపద బాహుళ్యముచేఁ గొన్నిందుచుండుటవలన సంతుష్టిని కలుగఁజేయఁజాలకయుండుటచేతను తాము ద్విపదకావ్యరచనమునకుఁ బూనుకొనవలసివచ్చె నని కారణములఁ జెప్పియు నంతటితోఁ దృప్తినొందక, అనఁగా నామాత్రపు సమాధానముచేత లోకులకుఁ దృప్తి గలిగింపఁజాలక, ఎట్టకేలకు ద్విపదకును బద్యగద్యకావ్యములకును భేదము లే దని నిరూపింపవలసివచ్చినట్టులు తేలుచున్నది.

మఱియు, గద్యపద్యోదాత్తకృతులకును ద్విపదకృతులకును సాదృశ్యమును సంఘటింప నుపక్రమించి సరళత ప్రసన్నత మొదలగు గుణములచే సమృద్ధమై యుండిన కవిత్వ మేయే వృత్తములం దున్నను కవిత్వ మనిపించుకొను ననియు అట్టి గుణములు పరిపూర్ణముగా సంఘటించుటకు కేవల మొక జాతులు (అనఁగా నుపజాతులు) మాత్రమే తగియున్న వనియు అందును జల్లి శబ్దములను ప్రయోగించుట మొదలైన దోషములు పరిహరింపఁబడినచో సహృదయుల కానందము గలుగు ననియుఁ గంఠోక్తిగాఁ జెప్పి తాను రచింపఁదొరఁకొనిన పండితారాధ్యచరిత్రమును పైని చెప్పిన సల్లక్షణములతో నలరారునట్లు చేసెద నని యీ క్రింది ద్విపదలలో వక్కాణించుచున్నాఁడు. పరికింపుఁడు:

అటుగాన నఖిలవినుతానందితోక్తిఁ
బటుగద్యపద్యప్రబంధసామ్యముగఁ
గావ్యకళాప్రౌఢిఁ గల్పింతుఁ గవిత
కావ్యంబు భావ్యంబు గాఁగ నట్లయ్య
నఖిలవేదవేదాంతేతిహాస
వివిధాగమపురాణవిహితసూక్తముల
నిద మిత్థ మను చోట నివియ ప్రామాణ్య
పదములు గాఁగ ద్విపదలు రచింతు. —పం. ఆ. చరిత్ర

మఱియు, కవి తనకుఁ గల కవిత్వశక్తిచేత వృత్తములకు నితివృత్తములకు పొంతు గింతు నే గాని వృత్తములు నితివృత్తములును కవి కుత్కృష్ట గూర్పఁజాలవు. కావున సత్కవి యగువాఁడు తన ప్రతిభా విశేషమున నే ఛందస్సుపైన సంపదను నొందఁజేయఁగలఁ డని తన సామర్థ్యమును బ్రదర్శింపుకొని, ద్విపదకవిత్వము గూడ నిక్కముఁ బరికించినచో సమగ్రత యున్నదే చెప్పఁజొప్పడు ననియు అందును ముఖ్యముగా వసర్థముఁ బొరయని రీతిని వళ్లను ప్రాసంబులును బొందు పడి యుండవలయు ననియు చెప్పుచు, ద్విపద యైహికాముష్మికము లగు పదద్వయమునకు సాధన మగుటవలన ద్విపద యని పేర్కొనఁ బడియె ననియుఁ జెప్పెను. ఎట్లనఁగా:

... ... ద్విపద
కొలఁది నే పలుకుటకును మది మెచ్చి
వ్రేలి ముద్రిక రత్నకీలన సేయు
చో లేశ మనఁగవచ్చునె? రత్న మెంత
పొల్పైన రత్నంబు చుట్టును బసిడి
గట్టుట యది వివేకం బది యట్లు!
దేసిగా రచియించు ద్విపదకు వళ్లుఁ
బ్రాసంబులును బొందుపడఁగఁ దా కలయు.
ననుచుఁ దదీయ సూక్తాక్షరపంక్తిఁ
జెనకక యింతొప్పఁ జెప్పనే యనుచు
సన్నుతి సేయుచు సత్కవు లలరఁ
దిన్నని సూక్తుల ద్విపద రచింతు
నదియును గా నైహికాముష్మికద్వి
పదహేతు వగుట ద్విపద నాఁగఁ బరఁగు.

ఈ యుదాహరించిన వాక్యసందర్భములఁ బట్టి పైని నేను చెప్పిన విషయములు యథార్థము లని తమకు తోఁపకపోదు. కాన, నిఁక నిప్పుడు ద్విపదతోఁ గవిత్వముఁ జెప్పిన కావ్యములు పద్యప్రబంధముల శైలికి సమముగా నుండునా? లేక న్యూనము లగునా? ఆధిక్యము నొందునా?—యను విషయములు నిర్ణయింపవలసియున్నది. నాకుఁ గల యభిజ్ఞానము కొలఁది పరికించి చూచిన (ద్విపద కావ్యములు పద్యప్రబంధములతో సామ్యతావిషయమునఁ బరీక్షించినచో) కవితయందుఁ గాని భావప్రపూర్ణతఁ గాని శైలివిషయమునఁ గాని ఉక్తివైచిత్ర్యమునఁ గాని ఏ మాత్రమును తీసిపోకుండుట యట్లుండఁగా—పై పెచ్చు ఒక వన్నె యందమును ఆధిక్యమునే ప్రదర్శించు చనుటలో నతిశయోక్తి యిసుమంతయు లేదు. కావున, నిటుపైని ద్విపద కావ్యములకును పద్యప్రబంధములకును పరస్పరసాదృశ్య మవ్యాహతముగఁ గలిగియు సందర్భముల నేర్పఱచి ప్రదర్శించుచున్నాఁడను. ఇదియును, మనకు భారత భాగవత రామాయణములకంటెఁ బావనత్వమున నేమి ప్రమాణవిషయమున నేమి యసాధారణము లగు గ్రంథము లొండు లేకుండుటవలనను రమారమి పై మూఁడు గ్రంథములును గద్యపద్యాదులలోను ద్విపదలలోను పూర్వకవులే పరిణమింపఁ జేయుచుండుటవలనను ముఖ్యముగ భారత భాగవత రామాయణముల లోని ఘట్టములను స్థాలీపులాకన్యాయమున దోసనము నొసర్చి యటుపైని ద్విపదయందుఁ గల వర్ణనాచాతుర్యములను కృతులను సంగ్రహముగాఁ జేర్కొనియెదను. చూడుఁడు—భాగవతము నందు చతుర్థస్కంధములోని దక్షుఁడు శివుని ద్వేషించు కథాభాగము:

ఇందఱు నను గాంచి యెదురేఁగుదెంచి
వందనంబు లొనర్చి వర్తింపఁ గనియుఁ
గంటిరే మునులు! ముక్కంటి తా నిపుడు
నొంటిపైఁ గదలక యున్న చందంబు.
గరువంబులో నన్నుఁ గని లేవకున్నఁ
దెలిఁగనే బొజ్జ? తాఁ బెద్దవాఁ డగునె?
ఏ మానవే? నాకు నీతఁ డల్లుండె?
కులము మాటలకు సాహాటి కాఁపురము.
పలుగూడు వడత రూపము చూడ రోఁత
ఎక్కుడు ముడిగిబ్బ యెముకలు సొమ్ము
కక్కురం బగు తోలు కట్టెడు వలువ
పునుక కంచము కాటిబూదియ పూఁత
ధనమును నహి యుండు తా వది యున్న
పుట్టువు దెలియ జెప్పఁగ నొంటిగొట్టు
పెట్టుపోఁతలు మందు ప్రియము దూరంబు
ఈ పిశాచంబుల యేలిక కకట!
నా పట్టి నిచ్చితి నా కర్మవశత
ప్రతిఁ జతుర్థునకు నేర్పుట గాదె తెలిసి
యితనికి నా బిడ్డ నిచ్చుట దెలియ.

—ద్విపదభాగవతము.

సీ. పరికింప నితఁడు దిక్పాలయశోహాని
కరుఁ డీ క్రియాశూన్యపరుని చేతఁ
గర మొప్ప సజ్జనాచరితమార్గము దూషి
తం బయ్యె నెన్నఁ గతత్రపుండు
మహితసావిత్రీసమానను సాధ్వి న
స్మత్తనూజను మృగశాబనేత్ర
ననలభూసురబంధుజనసమక్షమున మ
ర్కటలోచనుఁడు కరగ్రహణ మర్థిఁ
జేసి తా శిష్యభావంబుఁ జెందు టాత్మఁ
దలఁచి ప్రత్యుద్గతాభివందనము లెలమి
నడపకుండిన మానసీ నన్నుఁ గన్న
నోరి మాటికిఁ దన కేమి గోరవోయె.

సీ. అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మాన
హీనుఁడు మర్యాద లేనివాఁడు
మత్తప్రచారుఁ డున్మత్తప్రియుఁడు దిగం
బరుఁడు భూతప్రేతపరివృతుండు
తామసప్రమథభూతములకు నాథుండు
భూతలిప్తుం డస్థిభూషణుండు

నష్టశౌచుండు నున్మాదనాథుఁ డాను దుష్ట
స్వాంతుఁడు నుగ్రుఁడును బరేతభూమి
కేతనుఁడు వికీర్ణప్రేతకేశుఁ డశుచి
యైన శివ కొల్కి శివనాను మను బ్రవాక
గలిగెఁ గాని యవ్వేఁ దని దాన కెఱఁగి
యొఱఁగి వేదంబు శూద్రున కిచ్చినట్లు. —పద్యభాగవతము.

శ్లో. ఏష మే శిష్యతాం ప్రాప్తః, యన్మే దుహితురగ్రహీత్
పాణిం విప్రాగ్నిముఖతః, సావిత్ర్యా ఇవసాధువత్,
గృహీత్వా మృగశావాక్ష్యాః పాణిం మర్కటలోచనః
ప్రత్యుత్థానాభివాదార్హే వాచాప్యకృతనోచితమ్
లుప్తక్రియాయాశుచయే మానినే భిన్నసేతవే
అనిచ్ఛన్నప్యదాం బాలాం శూద్రాయేవోశతీంగిరమ్,
ప్రేతావాసేషు ఘోరేషు భూతైః ప్రేతగణైర్వృతః
అటత్యున్మత్తవన్నగ్నో వ్యుప్తకేశో హసన్ రుదన్,
చితాభస్మకృతస్నానః ప్రేతస్రఙ్నస్థిభూషణః
శివాపదేశో హ్యశివో మత్తో మత్తజనప్రియః
తస్మా ఉన్మత్తనాథాయ నష్టశౌచాయ దుర్హృదే
దత్తాబత మయా సాధ్వీ చోదితో పరమేష్ఠినా.

సంస్కృతభాగవతము.—

పై నుదాహరించిన సంస్కృతాంధ్రగ్రంథభాగములను పరికించినవారికి పద్యద్విపదలయం దైన భాషాంతరీకరణములలోని భేదములు కనుపట్టకపోవు. ఉదాహరించిన గ్రంథములలోఁ దొలుతది కోనేరునాథకవి రచియించిన (ద్విపద) బాలభాగవతము. రెండవది పోతన గారి పద్యకావ్యము. మూఁడవది వ్యాసస్మృతి యని చెప్పఁబడుచున్న భాగవతము. ఇందు పరికింపవలసిన విషయములలో మూలమునకు సరిగా 'తు చ' తప్పకుండ భాషాంతరీకరణ మున్నదా లేదా యను విషయముకంటె 'ఎవ్వరి భాషాంతరీకరణము ప్రాకృతజనులకు నైక మింపు నింపెడి రచనలతో ముద్దులు మూటగట్టుచు నౌచిత్యమును పరిహరింపక, చదువరుల నాకర్షించు' నను విషయము ముఖ్యమైనది. ఇచ్చట నింత మాత్రము సహృదయులు పరికించినఁ జాలును.

మఱియు, ఈ బాలభాగవతమునందలి కవిత్వపు సొంపుఁ జూపుటకై యందలి యొకటి రెండు ప్రదేశములను దిగ్దర్శనన్యాయముగ ప్రదర్శించెదను.

వనవర్ణనము:—

పరగింపు కప్పుల పండ్ల ప్ర సెలదు
పరాట పైశ్రీత్రయోగ బహు సుపవనము
పల్లవాలిలసపదము గాకయును
బల్లవాలిలసనాస్వాద పవనఁ బాఁగి
విలసితమగుపాయికృతి గాకయును
విలసితమధుపాయితకృతి నాఁ బరఁగి.

గంగానదీవర్ణనము:—

కమలాధివాసతాకమనీయ యగుచుఁ
గమలలోచనుని వక్షస్స్థలిపోలె
నమలకంఠాముక్తహంసక యగుచు
నమరఁ నైసేసిన యతికయ పోలె.

ఈ బాలభాగవతమును రచించిన కోనేరునాథకవి తన గ్రంథమును చంద్రగిరి రాజగు తిరుమలరాజు ప్రోత్సాహము చేత నతని తమ్ముఁ డగు చినతిమ్మరాజున కంకితముగా నొనర్చెను. మఱియు, నీ కవి నన్నయభట్టు తిక్కన భీమకవి మొదలగు నాంధ్రకవులు ప్రబలిన కాలమునందే తన భాగవతమును ద్విపదలతో వ్రాయుటంజేసి అప్పటి సామాన్యలోకమునకు ద్విపదపై నేపాటి గౌరవ ముండినదియు తేటతెల్లమగుచున్నది. ఈ కవి తానింతకు మున్ను పద్యకవిత్వమున భాగవతమును వ్రాసియే యున్నను, బాలురను స్త్రీలును సులభముగాఁ జదివి యానందించునట్లు దీనిని వ్రాయఁ బూనుకొనుటయు తాను 'విలసితసాహిత్యవిశ్రాంతిమంతుఁ'డను 'వినుతాష్టభాషాకవిత్వప్రచండుఁ' డని ప్రఖ్యాతి గన్నవాఁడైనను ద్విపదతో వ్రాయఁబూనుటయు ద్విపదకవిత్వమున కానాఁడు గల ప్రజాదరమును తప్పక సూచించుచున్నవి.

ఇఁక మహాకవి వాల్మీకిమునిపుంగవవిరచిత రామాయణమును మన యాంధ్రవాఙ్మయమున నెరిఁగిన ద్విపదకవిత్వమునఁ గూర్చినదియు విచారింతము. అయోధ్యాకాండమునందు రాముని వనవాసము నర్థించు పట్టపుదేవి యగు కైకేయిని దశరథుఁ డాక్రోశించు పట్టును చూడుఁడు.

* కోమలి ! కేకయకులమునఁ బుట్టి
ఈ మాట లాడ నో రెట్లాడె నీకు ?

---

* ఉ. వేఁడిన వేఁడి మాట నృపవీరుఁడు నైఁపక కర్ణరంధ్రముల్
నూఁడిన భంగిఁ దాఁకుటయు మ్రుక్కి మనంబున నొచ్చి నిన్ను నే
నాఁడు నృపాలపుత్త్రి వని నమ్మి వరించితిఁ గాక యిమ్మెయిన్
నేఁ డొక కాలసర్ప మయి నీ విటు సేయుట నాకుఁ దోఁచెనే?

ఉ. కీడున కోడ కించుకయుఁ గేకయభూపతి యింటఁ బుట్టి చొ
ప్పాడక పాపజాతి వయి తక్కట యిట్లని వేఁడ నెట్లు నో
రాడెఁ ద్రిలోకపూజ్యుఁ డగు నా కొడు కేమిట నీకు నొప్పఁడే
పాడి దలంప కీ పలుకుఁ బల్కితి దోసము నాక నాకడన్.—భాస్కరరామాయణము.

భాస్కరరామాయణము నే నీ వ్యాసమును వ్రాయునాఁటికి లభింపలేదు. కాని, పై నుదాహరించిన పద్యములు ద్విపదలకంటె మిన్నగ నున్న వని విన్నవించెదను.

ఆడవుల నేలు గ మ్మని రాముఁ ద్రోయ
నెడపక తొల్లి నీ కేగ్గేమి చేసె?
కౌసల్యకంటె నిన్ ఘనతగాఁ జూచు
నీ సేవ లొనరించు నీ పనుల్ సేయు
నటువంటి సుగుణాఢ్యుఁ డైన శ్రీరాము
నెటులు పొ మ్మని యంటివే దయ మాలి?
అడవుల కతని నీ వంపు మటన్న
యెడఁ జూచి చూచి నే నెటులు పొ మ్మందు
నృపపుత్రి వని నిన్ను నెమ్మిఁ గైకొంటి
చపలలోఁ గన కాలసర్పంబ వైతి.

రంగనాథరామాయణము.—

పై నుదాహరించిన ద్విపద గ్రంథమునకు మూలభూతము లగు వాల్మీకిరామాయణములోని యీ క్రింది శ్లోకములను చిత్తగింపుఁడు. పిమ్మట మీ మనములకు తమంత తామే రచనాసౌష్ఠవము గోచరింపఁ గలదు.

నృశంసే! దుష్టచారిత్రే! కులస్యాస్య వినాశిని!
కింకృతం తవ రామేణ? పాపే పాపం మయాపివా
సదా తే జననీ తుల్యాం వృత్తిం వహతి రాఘవః
తస్యైవ త్వ మనర్థాయ కింనిమిత్తమిహోద్యతా
త్వం మయాత్మ వినాశార్థం భవనం స్వం ప్రవేశితా
అజ్ఞానాన్నృపసుతా వ్యాళీ తీక్ష్ణవిషా యథా. —వా. అ.

వాల్మీకిరామాయణమును తొలుదొలుత తెలుఁగు సేసిన కవి ఈ రంగనాథుఁడే. ఈయన పంద్రెండవ శతాబ్దివాఁడని కవిచరిత్రకారుల యభిప్రాయము. రంగనాథరామాయణమును గోనబుద్ధారెడ్డి తన తండ్రి యగు విఠలరాజు పేర రచించె నని ఈ గ్రంథమునందు కనుపట్టు నే గాని రంగనాథుఁడు రచించినట్టు లిఖితదృష్టాంతములు గానరావు. అయినను, లోకమునందు రంగనాథరామాయణ మనియే ప్రతీతి కలిగియున్నది. కాని, రంగనాథుని గుఱించిన నైజమగు వార్త యింతటివఱకు నుపలబ్ధి కాకుండుటకై ఆంధ్రులు ఖేదింపఁ దగియున్నది. రంగనాథుని గుఱించి పలువిధములఁ జెప్పికొందురు. నన్నయభట్టు రచించు భారతముఁ జూచి తా నిఁకఁ బద్యరచనయందు ప్రావీణ్యము గాంచు టరిది యని యధైర్యపడి ద్విపదను రామాయణము రచించినట్టు గొందఱు వాక్రుచ్చెదరు. కాని, యిందుల కేవిధ మైన ప్రబలాధారములును గానరాకపోవుట యట్లుండ కావ్య సంపదయు కాగడా పెట్టి వెతకినను నైఁ జెప్పిన చొప్పదంటు కంత కెడ మీయఁగల పద మొక్కటి యైనఁ గానరాదు.

నైగాఁ గావ్య సంపదయు రసోద్బోధకము లగు పదజాలము చేత నెచ్చటఁ జూచిన నచ్చటి నింపు వెలయించుచు నన్నయాదులలో లేని యపూర్వవర్ణనాకౌశలమున వెలయుచున్నది. రంగనాథుని రామాయణము ఇప్పటికి నాంధ్రదేశపు పశ్చిమభాగములలో వీథి బడులలో పాఠ్యముగను పండితులకు పురాణపఠనగ్రంథముగను వెలయుచుఁ బూర్వకాలము ప్రజలకీ గ్రంథముపైని అందును ద్విపద కావ్యములపైని గల యసాధారణ మగు ననురాగమును వేయి నోళ్లఁ జాటి చెప్పుచున్నది.

కావ్యమునకు జీవితప్రాయ మగు నౌచిత్యమును గమనించుట లోను ద్విపద యైనను రస ముట్టిపడునట్టును పాత్రలిప్పుడు చదువరుల కన్నుల యెదుట నున్నట్లును వర్ణించు కౌశలము ఈ కవి కున్నట్టులు మఱి యితరులకు లే దనియే చెప్పవలసివచ్చును. ఈ విషయమును సాంతముగాఁ బరీక్షింపఁ దలంచువారు గ్రంథములోఁ దమ కిచ్చవచ్చిన యే భాగమును జదివినను తప్పక కృతార్థులు లయ్యెద రనుటలో సందియము లేదు.

ఇఁక భారతంబును పరామర్శింతము. 'ధర్మశాస్త్రజ్ఞులు ధర్మశాస్త్రం బని యధ్యాత్మవిదులు వేదాంత మనియు' నుపశ్లోకింపఁ బడ్డ, ఆర్యవిజ్ఞాననిధి యనఁదగిన వీగ్రంథము. వ్యాసమహర్షి లోకానుగ్రహకాంక్షచే వేదసారము నిందు వెలయించెను గదా! మహర్షి యొక్క ఇట్టి పవిత్రమగు మనోరథమును ఆంధ్రకవితల్లజులు గమనించి ఆంధ్రమున సామాన్యజనుల కెల్లరకును ఛందము గానుండునట్లు విరచించినందులకై ప్రతి యాంధ్రుఁడును తప్పక ఋణియై యుండవలసినదే?

సీ. తెల్లంబు గాదె మీ కెల్ల సుయోధను
చేసిన కుటిలవిచేష్టితంబు
లక్కయింటను మీరు నడవుల నిడుమలఁ
బొందితి రొక భంగిఁ బోయెఁ గాల
మిది పదుమూఁడగు నేఁడు మా కజ్ఞాత
వాసంబు సలుపంగవలయు నిందు
ధార్తరాష్ట్రులు మాతతనయసౌబలులును
వెదుకఁగా నేతురు చిన్న సన్న
యెఱిఁగి రేని చాల నెగ్గు వాటిల్లు న
ట్లగుట మమ్ము నింక నతిరహస్య
వృత్తిమై నిరస్తవిఘ్నులరై చరి
యింపుఁ డని యనుగ్రహింపవలయు. తిక్కన విరాటపర్వము.—

ఇత్యాది పాండవులు అరణ్యవాసకాలమును ముగియఁజేసికొని యజ్ఞాతవాసమున కుపక్రమింపఁబోవుచు నంతవఱకును తమతోఁ గలసిమెలసి సమ కష్టసుఖములఁ బారమార్థికచింతతోఁ బొలుపొందిన బ్రాహ్మణబృందమును వీడిపోవలసివచ్చినందులకు కుంటిల్లుచు విడువలేక విడువలేక చివరకుఁ దమ దైన్యమును వెలిఁబుచ్చుచు సెనవిడుగడి సందర్భము. ద్విపదకావ్యపద్యకావ్యములకు కథానకమున భేదము సుంతయైన లేకున్నను, ఈ సందర్భమునందు ద్విపదకావ్యమునఁ గల యీ క్రింది పంక్తులను విలోకించినచో నిందలి పసందు పొందుపడఁగలదు.

ఓ మహాత్ములార! యో పుణ్యులార!
ఓ మహీసురులార! యుగ్రాటవులకు
మామీఁదఁ గృప గల్గి మముఁ గూడి వచ్చి
యలవి సేయఁగరాని యలజళ్లఁ గోర్చి
కలసియుండితి రింత కాలంబు దనుక
నింక గోప్యము లేల నేఁ డాది మాకు
శంకింప కొక చోటి కరుగంగవలయు
రాయిడి పుట్టించి రారాజు మరల
కీ యవస్థలు దెచ్చె టెఱుఁగరే మీరు?
నాఁ డింక నజ్ఞాతవాసంబు వలనఁ
బోఁడిమి మము రోయఁ బుత్తెంచు జనుల,
మీరు మే మొక చోట మెలఁగఁగాఁబనదు
మీ రింక మముఁ బాసి మీ త్రోవఁ జనుఁడు,
ఏ కాలమున మిమ్ము నెడఁబసిపోనిక
చేకూఱఁ బరిచర్య సేయలే దకట.

అర్జునుఁడు విరాటనగరమునందు ఉత్తరగోగ్రహణము జరిగినప్పు డుత్తరుని సారథిగాఁ జేసికొని కౌరవుల వెన్నంటుటకై

యుద్యమించి తొలుత నరిహ్వాదయనిర్భేదన మగు దేవదత్తమును పూరించినప్పటి సందర్భమును పరీక్షింపుఁడు. ఇచ్చోటఁ గైష్ఠలము నందుకంటె విస్పష్టముగా నుఘయుక్తివిలలకు గల లాంఛనవ్యము లెంతటి తాను తెల్లము కాఁగలదు.

మ. కలఁగెన్ తోయధిసప్తకంబు గిరిసంఘం బెల్ల నూటాడె సం
చలతన్ బొందె వసుంధరాకలము మార్తాండచక్రంబు ద్రొ
దల నుండెన్ త్రిదశేంద్రు పటణము పాతాళంబు ఘూర్ణిల్లె నా
కుల మయ్యెన్ గ్రహతారకావలియు సంక్షోభించె నవ్వేళయున్.

తిక్కన విరాటపర్వము.—

ఆ మహారవమున సంక్షోభి గలఁగె
హేమాద్రి శిఖరంబు లిట్టట్టు వడెను
అద్రిజ భీతిల్లి హరుఁ గౌఁగిలించె
నిద్ర మేల్కొని శౌరి నింగికై చూచె
బలభేది వెఱచి గీర్వాణి వంకఁ గాంచె
లలిఁ బద్మభవుఁడు కాలము నెన్నఁజొచ్చె
ఉత్తరుండును మూర్ఛ నొరగెను వారలఁ
నెత్తిన లేవలే కిలమీఁదఁ బడెను.

(ద్విపద విరాటపర్వము.)

మహాభారతమును ద్విపదగా నొనర్చిన కవి తిక్కకవి. ఈ యన వల్లభనూరికి కొమరుఁ డని గ్రంథాద్యంతముల వాక్యములవలన విశద మగుచున్నది. ఈ కవియొక్క కవిత్వము కొన్ని చోటుల మూలానుగామి యైనను జాతీయములతో చెలువొప్పుచుండెను. కొన్ని చోటుల తిక్కన్న ఫక్కికిఁ గూడ వన్నె పెట్టఁజాలియుండును. అట్టి సందర్భములను పైని ప్రదర్శించియే యున్నాఁడను.

ద్విపదకావ్యములను గుఱించిన ప్రస్తావనను ముగించుటకు ముం దింకొక విషయమును గుఱించి ముఖ్యముగా చెప్పవలసియున్నది. లోతుపాతులకు దిగి పూర్వోత్తరముల విచారణ సేయుటకుఁ గడంగెడి కొలఁదిని ఈ కావ్యములు శైవమతవిజృంభణకాలమునందు వృద్ధి నొందెనని యనవలసివచ్చుచున్నది. మఱియుఁ బై కారణమే దృఢ మగునది యైనచో తొలుదొలుత ద్విపదయందే యాంధ్రకవితాలత స్వయంభూరూపమున ఒన్మించి రానురాను గీతములు కందములు సీసములు మున్నగువాని యాధారమున క్రొత్త క్రోవలఁ బట్టి యల్లుకొనియె నని నిశ్చయింపవలసివచ్చును. ఈ మా యూహ కాధారముగ కొందఱు విజ్ఞులు "శివకవులకు నవకవులకు" అను వేమన కందపద్యమునందలి శివకవి శబ్దమునకు శైవకవు లనియు నవకవిశబ్దమునకుఁ బ్రబంధగొంయిత లగు కవిజన మనియు నర్థమును చెప్పుచున్నారు. పరికించినచో కవితాభివృద్ధిని సూక్ష్మగతి నరసినవారి కియ్యది నిక్క మనియే తోఁచును. కావున, ద్విపదకవితోజ్జృంభణకాలమునందలి గ్రంథములను సంగ్రహముగాఁ బేర్కొని విమర్శింపవలసియున్నది. శైవసమయమునందు వెలసిన ద్విపదకావ్యము లన్నిఁటిలో బసవపురాణమును పండితారాధ్యచరిత్రము నను నీ రెండు గ్రంథములును ముఖ్యము లైనవి. ఇందు తొలిదానియందు శైవమతోత్పాదకుఁ డగు బసవేశ్వరుని యవతారచరిత్రములు ద్విపదలతో వర్ణింపఁబడినవి. రెండవదానిలో బసవేశ్వరుని శైవమతమును ప్రచారమునకుఁ దెచ్చి భక్తాళి కనేకము లగు మహిమలఁ గనఁబఱచి లోకము ననుగ్రహించిన పండితారాధ్యులవారి విజయమును మతప్రచారమార్గములను దెలుపు విషయములు వర్ణింపఁబడియున్నవి.

ఈ రెండు గ్రంథములు నెక్కడ చూచిన నక్కడ నవరసములు వారి పొరలిపోవునంతటి రసోదంచితములుగ ద్విపదలలోఁ గూర్పఁబడినవి. హిమనగమ్మునగరగుహాగ్రములనుండి యనర్గళముగా దుమికివచ్చు గంగాప్రవాహముం బోలె నీ మహాసుభావుని కవిత్వము పాఠకుల మనములను గానందపూరమున నోలలాడించుచుండును. భక్తిరసోన్నతి యగు పాల్కురికి సోమనాథుని కవిత్వమునకును కవిసార్వభౌముఁ డగు శ్రీనాథమహాకవి సూక్తికారముల గడుసుతనంపు చిన్నెలకును కర్ణాటరాజ్యరమానాథుఁడు నాంధ్రభోజుఁడు నాంధ్రకవియు నగు కృష్ణదేవరాయమహారాజుల యాముక్తమాల్యద మున్నగు కృతులలోని యద్భుతవర్ణనపటిష్ఠము లగు సందర్భముల కును, దీనికి దాని కని రేల ఇంతవనుక మన యాంధ్రసారస్వతమునఁ గల వ్యావ్యము లగు రసవద్వర్ణనోపేతము లగు కావ్యపు మెఱుఁగుల కన్నిటికిని, ఈ రెండు ద్విపదకావ్యములే మార్గదర్శకములై రాజిల్లినవి యనుటలో నేమియు సందియము లేదు. పాఠకుల వినోదార్థము పై గ్రంథములలోని యొకటి రెండు సందర్భములను క్రిందఁ బొందుపఱచుచున్నాను.

ఈ క్రింద నుదాహరించిన భక్త్యుద్రేకజనితము లగు పండితారాధ్యుఁ గూర్చిన నుతివాక్యములఁ జూడుఁడు.

చిరతపోగుణపరిస్ఫురుండు శివుఁడు
వరసత్వగుణవిశిష్టుండు పండితుఁడు
అసమలోకాధీశుఁ డంబికాధవుఁడు
అసమలోకారాధ్యుఁ డా పండితయ్య
లోకానుసారి త్రిలోచనుం డిల న
లోకానుసారిశీలుఁడు పండితయ్య
ఆసితకంఠుండు దా నసమలోచనుఁడు
భసితకంఠుండు దాఁ బండితస్వామి
మల్లికార్జునస్వామి మల్లికార్జునుఁడు
మల్లికార్జునకీర్తి మల్లికార్జునుఁడు.

వెలనాటిచోడుని యాస్థానమున నున్న పండితబృందము పండితారాధ్యుల పాండిత్యప్రకర్షను సహింపఁజాలక యందఱును గలిసి పండితుని వాదమునకు రప్పింపుఁ డని రాజును గోరి యనంతరము తా మొక పెద్ద సభఁ గూర్చి పండితునితో వాదముఁ జేసి యోడిన సందర్భమునందలి యీ క్రింది ద్విపదలు విష్ణుచిత్తీయమునందు విష్ణుచిత్తుఁ డొనరించిన వాదఫక్కిని మీఱి చదువరుల మనంబులకు ప్రత్యక్ష మయ్యెడిని పరికింపుడు.

గరిడి కెక్కిన యంకకాఁడును బోలె,
పెడ విడివడ్డ మత్తేభంబు పోలె
వడి మృగంబులఁ గన్న వ్యాఘ్రంబు బోలె
పరఁగఁగ పంతంపు బంటును బోలె
పగవంగ పసి గన్న వ్యాఘ్రంబు పోలె
నాసురవృత్తిఁ గోపాటోపవృత్తిఁ
బై సమయుల సమయాధముఁ జూచి
యొక్కఁడి వైదికుం డొక్కఁడి బౌద్ధుఁ
డొక్కఁడి వైష్ణవుం డొక్కఁడి యోగి
యొక్కఁడి చార్వాకుఁ డొక్కఁడి సాంఖ్యుఁ(డు)

* * * * * * *

ఉర్వీశు పరివార ముర్వీశు బంటు,
లుర్వీశు ప్రజలు నీ యున్నవా రెల్ల
ప్రకటింప వేయు నులక త్రాళ్లగూడి

రోతఁ ద్రోకు సరి సఖ్యుఁ డోకఁడైన వలదె
ఇంగుఁ డా సభ యన చెడ్డి వినంగ
నింక సభాసతి యెవ్వండొ చెప్పఁడు ?

ఇంక నీ విషయము నింత జాలించి ద్విపదకావ్యములలో లోని మనోజ్ఞవర్ణనములను ఒకటి రెండింటి నుదాహరించి యటుపైని ద్విపది కావ్యములలో రసవంతము లగు కావ్యముల పేరులను మనవి చేయుదును.

వనవర్ణనము:—

దిగ్గున వికసించి తేలు పొందు వనుల
వలుద గుత్తుల నెత్తు పలపుల మించి
వలికంపు పూపతై నలి నోగ లెక్క
కాయలై పులుసునఁ గరిగట్టఁగ లిగి
పాయక ఫలములై పడియాడు వన్నె
బంగారు చాయ లౌ బండిన పండ్లు
పొంగారు కొమ్మల బెంపున విరిగి
వనమహీరుహముల వరుసఁ బెంపెసఁగె.

ఈ వర్ణనము నవనాథచరిత్రమునందలిది. మత్స్యనాథుఁడు మొదలగు తొమ్మండ్రు సిద్ధుల చరిత్రము లిందు వర్ణింపఁబడినవి. ఈ గ్రంథప్రణేత సుప్రసిద్ధుఁ డగు గౌరనమంత్రి.

వర్షబాధ:—

ఫాలలోచను తీవ్రపావకశిఖలఁ
బొగసెడి దిగధీశపురముల నెల్ల
నెగసి ఘుగుల్లను నెఱిమంట లనఁగ
మెఱపులు తళతళ మెఱయక మున్నె
గుముఱుములు పెళపెళ యొఱమె నదుర్భుటము
లటు మిన్ను లలప్రాయు నంతకు మున్నె
పెటపెట పెటిలి పెన్పిసఁగులు వడియు
బిడుగులు నుఱుములుఁ బేర్చు వేగమున
బడబడ వడగండ్లు వడిగొని నెల్లెడల
వడగండ్లకంటెను వాన మున్నాడ
కడవల జలము లొక్కట వంచినట్లు
బోరన గురిసె నద్భుతమైన వాన.

ఇట్టి మనోహరము లగు వర్ణన లెన్నియేని ద్విపదసారస్వతమునఁ గలవు. చరిత్రాత్మకము లగు గ్రంథములలో (1) నవచోళ రాజుల చరిత్రము (2) పాండ్యరాజుల కథలు (3) పతివ్రతల కథలు (4) భల్లాణరాజు కథ (5) కాటమరాజు కథ (6) కరికాళ చోళకథ (7) ప్రతాపచరిత్రము (8) వెలనాటి విజయము (9) పల్నాటివీరచరిత్ర (10) బొబ్బిలికథ మున్నగు గ్రంథములును, వేదాంత గ్రంథములలో (1) మాయాచిదానందమంజరి (2) ఆత్మైక్యబోధము (3) ప్రభులింగలీలలు (4) రాజయోగామృతసారము (5) తత్వానుసంధానము మున్నగునవియు, పురాణము లగు గ్రంథములలో భారత భాగవతరామాయణములు శివపురాణబసవపురాణములు మున్నగునవియు మిక్కిలి ప్రముఖము లైనవి ద్విపదకవిత్వమునఁ గలవు. ఇందు గొన్నిటిని (అప్రసిద్ధములై యున్నవానిని) సూక్ష్మముగాఁ జేర్కొని యొండు రెండు బంతుల నందం దుదాహరించెదను:

(1) మాయాచిదానందమంజరి: కృతికర్త నాదెండ్ల యుమాపతి.

నవరత్నకనకాదినవలోహమయము
దివిజదానవయక్షతిర్యఙ్మనుష్య
పశుపక్షికీట విబంధురానేక
వివిధరూపవిచిత్రవిస్మితాకరము
సకలవైచిత్ర్య సలక్షణభాసురము
సకలాంకసప్తాబ్ధి యను సరోవరము.

(2) ఆత్మైక్యబోధము: కృతికర్త లింగగురుని శిష్యుఁ డగు యోగానందుఁడఁట.

శ్రీసమ్మహాభాగ్యశృంగార మగుచు
నామరూపుల కెల్ల నాటపట్టగుచు
వేదాంతములయందు వివరింపఁబడుచు
నాదాంతమై లోకనాయకుం డగుచు.

* * * * * * *

సకలవేదార్థంపు సారమై యున్న
యకలంక మాత్మైక్య మది విస్తరించి
ఒప్పైన ద్విపదగా నున్న దున్నట్లు
చెప్పితి విబుధులు చిత్తగింపుండు.

(3) లక్ష్మణమూర్ఛ: (ద్విపదశైలి నించుక భేదము గల ఛందము.)

కాఱుటడవులు దాఁటి కాలనేమంతలో
వకరియున్నా బావి మండటను నిలిచె
మనోవేగము గల మారీచతనయుండు
మాయావనముల మధ్యమయము గాఁడించె.

(4) ఇంద్రజిద్వధము:—

ఇంద్రజిత్తుఁడు పెనుక్రొమ్మునఁ దెలఁగి
రాజసులున్నై నేసె తేజరాముల
హనుమంతునై నేసె నతిఘోరబాణముల
నసుయునిఁ ద్రుంచె నను నలుక పడిఁ బూని.

సజీవము లైన పేర్కొనిన గ్రంథములు మాత్రమే గాక గోపీగోపాలసంవాదము, తారాశశాంకము, రంగనమంత్రి రచించిన శివభక్తిప్రదీపిక, నాదెండ్ల గోపప్రధానులచే రచిత మగు కృష్ణార్జున సంవాద మను భగవద్గీతాశాస్త్రము, కాచనకవినాథుఁడు కూర్చిన మైరావణచరిత్రము, కపోతవాక్యములు, చేమకూర అప్పయకవి ప్రణీత మగు సారంగధరచరిత్రము, రత్నాకరము గోపాలకవి యొక్క సౌగంధికాహరణము, పరమానంద ప్రణీత మగు శివజ్ఞానమంజరి, రుక్మిణీకల్యాణము నలచరిత్ర లను సుప్రసిద్ధ కావ్యములు, యోగానందావధూతవిరచిత మగు గురుశిష్యసంవాదము మున్నగు ననేక గ్రంథములు పూర్వకవులచే లోకానుగ్రహార్థమై ద్విపదలఁ గూర్పఁబడి విరాజిల్లుచున్నవి. ఇవ్వాని ప్రాచీనము లగు పద్యకావ్యములకుఁ గాని ఆధునికము లగు గద్యపద్యోభయకృతులకుఁ గాని ఏ విషయమునను తీసిపోకుండుట మాత్రమే గాక ఆంధ్రులయొక్కయు నాంధ్రభాష యొక్కయు పూర్వపు టున్నతిని వేయి నోళ్లఁ జాటుచున్నవి. కావున, దేశాభిమానులును స్వభాషాభివృద్ధికాంక్షులు నగు నాంధ్ర మహాశయులు జీర్ణము లై పోవుచున్న ద్విపదకృతులను ప్రచారమునకు తెచ్చి యాంధ్రమాతృఋణమును దీర్చి దేశీయుల కృతజ్ఞతాసూచకము లగు వందనముల నభినంద్యు లయ్యెదరుగాక యని ప్రార్థించుచు నింతతో విరమించుచున్నాఁడను.

హిందూ ధర్మశాస్త్రములు

గొబ్బూరు వేంకటరామానందరావు గారు, బి. ఏ.

ఆంగ్ల రాజుల ప్రత్యేక శాసనముల (Chatturs) వలన హిందూ దేశమున వివిధ రాజధానులలో నెలకొల్పఁబడియున్న ఉన్నత న్యాయస్థానముల (High courts) యందును, వానికి లోఁబడి ప్రతిమండలమునందును ఏర్పఱుపఁబడిన మండల న్యాయస్థానములందును అనఁగా డిస్ట్రిక్టుకోర్టులు సబార్డినేటు జడ్జికోర్టులు మునసబుకోర్టులు లోనగువాని యందును విచారింపఁబడు హిందూ ప్రజల తగవులలో, వైవాహిక (Marriage) దత్తక (Adoption) రిక్థ వారసత్వ-(Inher terce) స్త్రీధన, విధవాధన (Widow's estate) సమష్టి కుటుంబక (Joint Family) విభక్తక (Partition) ఋణ (Debts) భరణ (Maintenance) వీలునామాలు (Wills) దానధర్మ (Gift religians and endowments) సంబంధము లయిన వివాదములను పరిష్కరించుటకు అవసరములైన న్యాయశాస్త్రవిషయములు ఎందెందునుండి గైకొనఁబడుచుండునో అను విషయమును గూర్చి సంగ్రహముగ నిట వ్రాయుచున్నాఁడను :

1. శ్రుతులు :—ఋగ్యజుస్సామాథర్వణము లను నాలుగు వేదములు. వీనియందు ప్రస్తుతకాలమున కనుకూలము లయిన న్యాయవిషయములు బహుస్వల్పముగఁ గలవు. దానినిఁ గూర్చి యీ క్రింద వ్రాయుదుము :

2. స్మృతులు :— శ్రౌతసూత్రములు గృహ్యసూత్రములు ధర్మసూత్రములు ధర్మశాస్త్రములు అని నాలుగు విధములుగ నున్నవి. వీనిలో ధర్మసూత్రములు గద్యరూపమున నే వెలసియున్నవి. ఈ సూత్రకర్తలలో ముఖ్యులు పదునొకండ్రు గలరు. వా రెవ రెవ రనఁగా.— 1. గౌతముఁడు, 2. బోధాయనుఁడు, 3. ఆపస్తంబుఁడు, 4. వసిష్ఠుఁడు, 5. విష్ణుఁడు, 6. హారీతుఁడు, 7. హిరణ్యకేశి, 8. ఉశీనసుఁడు, 9. యముఁడు, 10. కశ్యపుఁడు, 11. శంఖుఁడు. ధర్మశాస్త్రములు పద్యాత్మకములు. అందు ముఖ్యము లయినవి నాల్గు గలవు. 1. మనుస్మృతి, 2. యాజ్ఞవల్క్యస్మృతి, 3. నారదస్మృతి, 4. పరాశరస్మృతి.

మనుస్మృతి క్రీస్తుశకము రెండు శతాబ్దములకు పూర్వము వ్రాయఁబడె ననియు యాజ్ఞవల్క్యస్మృతియు నారదస్మృతియు నేఁటికిించుమించుగ 1400 సం॥ల క్రింద వ్రాయఁబడె ననియు పాశ్చాత్యపండితులు కాలనిర్ణయమును చేసియున్నారు. పరాశరస్మృతి కాల మింకను నిశ్చయింపఁబడినట్లు గానరాదు.

బృహస్పతి, కాత్యాయనుఁడు మున్నగు ఋషులచే రచింపఁబడిన ధర్మశాస్త్రములు పై యైదింటియంత ముఖ్యములు కావు. ఇవి క్రీస్తుశక మేడవ శతాబ్దమున రచింపఁబడినట్లు తలంపఁబడుచున్నవి.

పైని వివరింపఁబడిన ధర్మశాస్త్రములే హిందూ లాలోని ధర్మసూక్ష్మములను నిర్ణయించుటకు ముఖ్యముగా నాధారభూతము లయినవి. ఇవిగాక, పరిమాణమునం దేమి, ప్రముఖతయం దేమి, రెండవ పక్షమునకు చేరవలసిన ధర్మశాస్త్రములు మఱికొన్ని అంగిరసాత్రి, దక్ష, దేవల, ప్రజాపతి, యమ, లిఖిత, వ్యాస, శంఖ, వృద్ధశాతాతప్రలను మహర్షులచే రచింపఁబడినవి.

కాలక్రమమున నీ స్మృతులు సుబోధకములు గాక, దురవగాహములుగ నుండుటచేత వీనికి టీకలును వ్యాఖ్యానములును ఆవశ్యకము లయ్యెను. మనుస్మృతికి వ్యాఖ్యాకర్తలు, 1. మేధాతిథి, 2. ధారణీధరుఁడు, 3. గోవిందరాజు, 4. కుల్లూకభట్టు, 5. నరహరి, 6. ధారేశ్వరుఁడు, 7. శ్రీకరుఁడు, అని ఏడుగురు.

1. మేధాతిథి— ఈయన 9-వ శతాబ్దివాఁ డనియు, దక్షిణ హిందూస్థానమునకు సంబంధించినవాఁ డనియుఁ దెలియుచున్నది. ఈతని టీక దక్షిణదేశములలో నెక్కడను లభింపలేదు. ఢిల్లీనగరమున కుత్తరముగ నున్న వారణాసి నగరమున నున్న కాశ్మీరాజ్య మేలిన మదనపాలుని యొద్ద నీ టీక సంగ్రహింపఁబడియుండె, ఇటీవల పరిశోధకులకు లభించెను.

4. కుల్లూకభట్టు : ఈతని వ్యాఖ్యానము సుప్రసిద్ధము. ఈతనినిఁ గూర్చి Sir William Jones గా రిట్లు చెప్పిరి. "It is the shortest but most enmivous, deepest but the most agreeble commentary or any author ancient or modern, European or Asiatic" అనఁగాఁ బ్రాచీనకాలములం దేమి, నవీనకాలములం దేమి, ప్రాక్పశ్చిమదేశములయం దెచ్చటను, ఏ (మూల) గ్రంథమునకును, ఇట్లు లఘువైన నున్ను నింతటి ప్రతిభావంతమై, నింత గంభీరమై ఇంత మనోజ్ఞమై వెలసిన టీకయొక్కటి లేదని పక్కాణించియున్నాఁడు.

మనని మిత్తము హిందూ లాను రచించిన మేనూ దొరగారు సందేహము గలచోట్ల నెల్ల కుల్లూకభట్టుని వ్యాఖ్యానముల నుల్లేఖము గావించుచునే యుండెను.

2. యాజ్ఞవల్క్యస్మృతి: దీనికి 1. విజ్ఞానేశ్వరయోగి, 2. అపరార్కుఁడు, 3. విశ్వరూప, 4. దేవబోధ, 5. లక్ష్మీదేవి బాలంభట్టు, 6. విశ్వేశ్వరభట్టు, 7. జీమూతవాహనుఁడు అని వ్యాఖ్యాకర్త లుండిరి. వీని యన్నింటిలో నతి ముఖ్య మైనది విజ్ఞానేశ్వరమహాయోగిచే రచింపఁబడిన వ్యాఖ్యానము. ఈ వ్యాఖ్యానమునకే మితాక్షర యని పేరు. ఈ మహాయోగి విక్రమార్కమహారాజు కాలములో దక్షిణాపథమున నుండె నని తెలియుచున్నది. ఈయన పదునొకండవ లేక పండ్రెండవ శతాబ్దివాఁడు. పద్మనాభ భట్టరు కుమారుఁడు. ఉత్తమపాద గురువరేణ్యుని శిష్యుఁడు. ఈ మితాక్షరబోధిత మైన ధర్మశాస్త్రము సంపూర్ణమై క్రమనిర్మాణము కలదై పరస్పరవిరుద్ధాంశశూన్యమై ఏకత్వము ననుగుణత్వమును గలిగి ఒప్పుచుండుటచే 'ఉదయాస్తాచల సేతునగపర్యంతము' భరతభూమియందు అప్రతిహత మైన యధికత నొంది పూజనీయ మగుచున్నది. వంగదేశమునందు మాత్రము జీమూతవాహనకృతము లైన దాయభాగసిద్ధాంతము లంగీకృతములై శిష్టాచారములుగ నభ్యాసములో నున్నచోట్ల మితాక్షరదాయభాగములకు భేదము గలచోట్లను మితాక్షరసిద్ధాంతము లమలులో నుండవు. ఈ విజ్ఞానేశ్వరమహాయోగి మితాక్షరమును గూర్చి ప్రివీ

కౌన్సిలువారు బద్ధాడించిరి. మి. లాల్హూసిన్ గను గొప్పవ్యాఖ్యానమునందు (Please see I. L. R. 37 Allahabad 604) ఉడిదున వ్రాసియున్నారు. "విజ్ఞానేశ్వరుఁడను యాజ్ఞవల్క్యుఁడుయిచ్చిన మూలగ్రంథము నిదేదు పక్కఁలు విమర్శించి పృథక్కరించి శాఖలుగ విభజించెను. అందలి సూత్రార్థములఁ జేటపడజేసెను. మూలమునందు లేని వచనముల విశేషాంశముల వివరము చేర్చి యుదాహరించెను. పరస్పరవిరుద్ధములుగా గన్పట్టుతావులందు పూర్వికు లగు ధర్మకర్తల సిద్ధాంతములు నుల్లేఖముఁ గావించి చర్చించి సిద్ధాంతమును చేయుచుండెను. ఈతని తర్కపాండిత్యప్రకర్షయును, కుశాగ్రబుద్ధియు నసాధారణము లైనవి.

మఱియు రామచంద్ర వి. వినాయక (42 Calcutta Series) అను వ్యాజ్యమునందు ప్రీవీ కౌన్సిలువారు మితాక్షరమును గూర్చి యిట్లు చెప్పియున్నారు. "ఈ మితాక్షరము యాజ్ఞవల్క్యస్మృతిపై వ్యాఖ్యానముగ గన్పట్టుచున్నది. మూలగ్రంథము వ్రాయఁబడినతరువాత వేయిసంవత్సరముల కీ వ్యాఖ్యానము వ్రాయఁబడినది. అతని పూర్వికుల ధర్మ (న్యాయ) భావన లాతనికలన విశేషముగఁ బెంపు వడసినవి.

లక్ష్మీదేవి (బాలంభట్టు) రచిత మైన బాలంభట్టి

ఈ ధర్మశాస్త్రము లక్ష్మీదేవి యను వారిణిచే రచింపఁబడినట్లు కానవచ్చుచున్నది. పురుషుఁడే యొకఁడు రచించి ఆమెయందుఁ గల గౌరవముచే నామె పేరుఁబెట్టె నని మఱియొక ప్రతీతి కలదు. మితాక్షర మెచ్చోనైన సులభగ్రాహ్యము కాకపోయినను అస్పష్టముగ నున్న నా బాలంభట్టి ప్రయోజనకారిగ నుండును. ఇది బొంబాయి కాశీప్రాంతములయందు వాడుకలో నున్నది. విష్ణుస్మృతిపై వ్యాఖ్యానమునకు వైజయంతి యని పేరు. నందపండితు లనువారు వ్యాఖ్యానమును వ్రాసియున్నారు.

పరాశరమాధవీయము:—పరాశరస్మృతిపై వ్యాఖ్యానమును వ్రాసి ప్రసిద్ధిచెందినవారు మాధవాచార్యులవారు. ఈతఁడు సకలవిద్యాపారంగతుఁడు. 17-వ శతాబ్దిలో విజయనగరరాజ్య మేలిన శ్రీ బుక్కరాయలయొద్ద ప్రధానమంత్రిగ నుండెను. సకలశాస్త్రములందును కళలందును సమముగఁ బ్రవీణత కలవాఁడగుటచే నీతనికి హిందూదేశపు అరిస్టాటిలు (Aristatll of India) అను ప్రసిద్ధి కలదు. ఇది కేవలము వ్యాఖ్యానముమాత్రమే కాదు. ఒకింతసూచనమాత్రము. మూలమునందుఁ గల ముఖ్యాంశములు పెక్కిందు విపులముగ వ్రాయఁబడి యున్నవి. ధర్మసూక్ష్మము లొక్కసరణి ననుసరించి వ్రాయఁబడి చక్కఁగ పెంపుచేయఁబడియున్నవి. ఈశాస్త్రము చెన్నపురిలో మిగుల ప్రాముఖ్యతఁ గనుచుండును. పైని వివరింపఁబడిన వ్యాఖ్యానములు గాక స్మృతులం బోలిన మఱికొన్ని గ్రంథములను కొందఱు ధర్మశాస్త్రవేత్తలు రచించిరి. ఇవి యన్నియు మితాక్షరము తరువాతనే రచింపఁబడినవి. ప్రాముఖ్యతయందుఁ గూడ నివి రెండవపక్షమునకు చేరినవే యగును. అవి యేవనఁగా:—దేవన్నభట్టవిరచిత మైన స్మృతిచంద్రిక. ఈ స్మృతిచంద్రికకు చెన్నపురిలో మిగుల ప్రాబల్యత యున్నది. మితాక్షర మస్పష్టముగ నున్నచోట్ల స్మృతిచంద్రికయే ముఖ్యాధారముగ నుండును. విశ్వేశ్వరభట్టవిరచిత మైన మదనపారిజాతము. క్షాత్రప్రభు వను మదనపాలున కంకితముచేయఁబడినది. కాశీదేశములో నిది ముఖ్యధర్మశాస్త్రముగ నంగీకరింపఁబడియున్నది. లక్ష్మీధరరచిత మైన కల్పతరువు గూడ కాశీదేశమునందు గౌరవము నందుచున్నది.

చండేశ్వరరచిత మైన వివాదరత్నాకరము మన్నారుమిశ్రకృత వివాదచంద్రికయును వాచస్పతిమిశ్రుఁడు రచించిన వివాదచింతామణియును, మిథిలదేశమునఁ బ్రాబల్యతఁ గనుచున్నవి. వంగదేశమునందు జీమూతవాహనకృత మగు దాయభాగశాస్త్రము ముఖ్యమైన ధర్మశాస్త్రము. దాయభాగ మమలులో నుండుచోట్ల మితాక్షరము ప్రమాణము కానేరదు. రఘునందనకృత మైన దాయతత్త్వము కూడ వంగదేశమునందు ముఖ్య మైన ప్రమాణము. ఉత్కలదేశమునందు ప్రతాపరుద్రదేవులు రచించిన సరస్వతీవిలాసము ముఖ్యప్రమాణము. మిత్రమిశ్రకృత మగు వీరమిత్రోదయము ముఖ్యప్రమాణము.

నీలకంఠభట్టవిరచిత మైన మయూఖము గుజరాతులోని ధర్మశాస్త్రములలో నగ్రస్థాన మలంకరించుచున్నది. మితాక్షరమయూఖములకు భేదముగలచోట్ల ఘూర్జరదేశములో మయూఖమే యుత్తమప్రమాణముగ నంగీకరింపఁబడుచున్నది. మఱియు కమలాకరవిరచితము లగు నిర్ణయసింధువివాదతాండవములు పశ్చిమదేశములలో ప్రమాణములుగ నంగీకరింపఁబడుచున్నవి. వరదరాజులు రచించిన వ్యవహారనిర్ణయము చెన్నపురిలో గౌరవింపఁబడుచున్నది. అనంతదేవుఁడు రచించిన స్మృతికౌస్తుభము మహారాష్ట్రులకుఁ బ్రమాణము. 19-వ శతాబ్ద్యారంభమున శ్రీకృష్ణతర్కాలంకారులు రచించిన దాయక్రమసంగ్రహము వంగదేశమునఁ గొంత ప్రాబల్యత నొందుచున్నది. కుబేరపండిత కృత మగు దత్తకచంద్రికయు నందపండితులు రచించిన దత్తకమీమాంసయు నను రెండు ధర్మశాస్త్రములును దత్తకవిషయములందు భరతఖండమందంతటను ముఖ్యప్రమాణములుగ నున్నవి.

మఱియు హిరన్ హేస్టింగ్సు గవర్నరు జనరలుగ నుండిన కాలములో హిందువుల నిమిత్తము వివాదార్ణవసేతు వను ధర్మశాస్త్రమును వ్రాయించెను గాని అది యెవ్వరికిని ప్రయోజనకారి కాదయ్యె. తరువాత సర్ విలియము జోన్సు గారి ప్రయత్నముల వలన జగన్నాథతర్కపంచాననులు వివాదభంగార్ణవమును రచించిరి. వంగదేశమునందు దాయభాగకు తరువాత ప్రమాణ మీ గ్రంథమే యని న్యాయమూర్తి మిత్తరు గారు నుడివియున్నారు.

ఇప్పుడు వీని యన్నింటికంటె ప్రధానము లైనవి హైకోర్టుల యొక్కయు ప్రీవీకౌన్సిలు యొక్కయు తీర్పులు ముఖ్యము లగు ప్రమాణములుగ నున్నవి. ఒక కేసు విచారణ జరుగుచున్నప్పుడు హిందూ లా విషయములో ప్రీవీకౌన్సిలువా రిట్లు చెప్పిరి. ఫలానా హైకోర్టువా రిట్లు చెప్పిరి అనియు ప్రమాణములు నొక్కి చెప్పఁబడునట్లు "మను విట్లు చెప్పెను. యాజ్ఞవల్క్యుఁ డిట్లు చెప్పెను. ఈ సంగతిని పూర్వకాలపు ఋషులు చెప్పలేదు" అను విషయములు నొక్కి పక్కాణింపఁబడవు. అట్టి తీర్పులే అన్నిటికంటె నేఁడు ముఖ్యములుగ గన్పట్టుచున్నవి.

ప్రస్తుతపు టాంధ్రుల స్థితి

డి. గురురాజారావు గారు

రాజకీయ సాంఘిక మత దేశాభిమాన కారక విద్యాదివిషయములలో ప్రస్తుతపు టాంధ్రుల స్థితి మిక్కిలి శోచనీయ మని చెప్పక తప్పదు. మన ద్రవిడసోదరులు మనలను ప్రత్యేకాంధ్రరాష్ట్రము కావలయు నను మీ జిల్లాలలో నిప్పుడు మీలో నెవరైన నొకరు "ఇండియాకౌన్సిలు" సభ్యుఁడుగఁ గాని రాజప్రతినిధి యొద్ద కార్యనిర్వాహకసభ్యుఁడుగఁ గాని, లేనిచో గవర్నరునొద్ద కార్యనిర్వాహకసభ్యుఁడుగఁ గాని లేక జాతీయమహాసభాధ్యక్షుఁడుగఁ గాని చివఱకు భరతఖండమునందు పేరును బెంపును బొందిన మహనీయుఁడు గాని ఒకఁడైన నున్నాఁడా యని అడిగినచో మనము చిన్న బుండవలసినదే గాని ప్రత్యుత్తరమును చెప్పుటకు వీలులేక యున్నది. ఇట్టి శోచనీయ మగుస్థితికి కారణము లేవి యై యుండ నోపు?

ఆంగ్లేయవిద్యావ్యాప్తివలన సాంఘిక లౌకిక మెంతవఱకు నజ్ఞాన తిమిరమునుండి వెలువడి విజ్ఞానదీప్తిని తమ్ము సార్థకము గావించుకొనుచున్నదో తొలుత మనము విచారింపవలయును. విద్యయే కదా! నాగరకతకు నాధారము. సంఘమున సభ్యు లెంతటి విద్యాధికులై యున్నా నా సంఘ మంత నాగరక మని చెప్పఁబడును. తెలుఁగుదేశమునందు ప్రస్తుతము విద్యార్థుల సంఖ్య యత్యల్ప మనుట సర్వజనవిదితము. ద్రవిడరాష్ట్రమునఁ బల్లె కొందఱు పట్టపరీక్షఁ గృతార్థులైనవా రున్నా రని లెక్క వేయఁబడుచుండ మన సీమలో పట్టణములలో నైన నిందఱు బి. ఏ. లున్నారని చెప్పుటకు వీలులేకున్నది. పట్టపరీక్షోత్తీర్ణులు లేకున్నను ప్రావేశికపాఠశాలాంత్యపరీక్షలలో నైనను గృతార్థులైన వారిసంఖ్య యైనను అల్ప మనియే చెప్పవలయును. తూర్పుజిల్లాల స్థితిగతులు అనుభవమున లేకున్నను దత్తమండలము లందలి ప్రతికార్యశాఖయందును అరవవారే నిండియున్నారు. 'పబ్లిక్ వర్క్సు'లో, తెలుఁగువాఁడు మందుకైనను దొరకఁడు. 'సాల్టు పోస్టల్, రెయిల్వే రివిన్యూ డిపార్టుమెంటులలో కూడ అయ్యరులే యున్నారు. పదునొకండవశతాబ్దమున నింగ్లాండు నార్మనులు జయించి నప్పు డద్దేశమున నింగ్లీషు పోయి ఫ్రెంచిభాషయే కోర్టుభాషగ పరిణమించినట్లు మన జిల్లాలలో ప్రస్తుతపు టుద్యోగస్థులభాష అరవమై యున్నది. తెలుఁగుదేశమున నందునను ముఖ్యముగ దత్తమండలములలో విద్యావ్యాపక మింత యసంతృప్తికరముగ నుండుటకుఁ గారణములను విచారింతము. ప్రథమమున వారికి విద్యయం దభిమానమే తక్కువ యని తెలియుచున్నది. పిత్రార్జితధనము గలవారు చదు వేల యని దలఁచి దుష్టులసహవాసముతోఁ దమ జీవితమును వ్యర్థపఱచుచుఁ బలవంతముగ పాఠశాలల కేగినను నచ్చట విద్యను నేర్వక ఉపాధ్యాయులకుఁ గంటిలోని నలుసులై చరించెదరు. తల్లిదండ్రులు తమ బిడ్డలను మిక్కిలి గారాబమునఁ బెంచి బుజ్జగించుచుండ బాలురకు చదువునం దెటుల నభిలాష పొడమును! ఆలోచింపుఁడు. ఇఁకను ధనహీనులు ఏవిధమున నైన తమ బిడ్డలు చదువరులై తుదకు మెట్రికు పరీక్షయం దైనను గృతార్థులైనఁ జాలు నని యువ్విళ్లూరుచుందురు. ఇట్టివారి మన దేశమున నధిక సంఖ్యాకులు. వీరికిఁ గడుపునిండ భోజనము దొరకుట కైన మార్గము లేదు. కుటుంబమున సంపాదకుఁ డొకఁడు తినువారు [illegible]. శూద్రులలో నందఱును కూలినాలిచేసి యైనఁ బ్రదుకఁగలరు. కాని బ్రాహ్మణులైనచో వారికష్టములకు మేరయే లేదు. వారికి భూసంపద యుద్యోగము లను వీనిలో నేదియును లేనియెడల భిక్షాటనమే గతి. ఇఁక వీరిబాలురు హూణవిద్య నెటులు నేర్చుకొందురు? ఉన్నతవిద్యకొఱకు పాఠశాలలు దత్తమండలములఁ గొన్నియే కలవు. కళాశాల దత్తమండలములకెల్ల 1916-వ సం॥ వఱకు మదనపల్లెలో నొక్కటి మాత్రమే యుండెను. సర్కారువారు పెద్దకళాశాల ననంతపురంబున నుంచిరి గాని గత సంవత్సర మనిబెసంటమ్మపైఁ గల ద్వేషముచే, మదనపల్లెలో నుండిన కళాశాలకు బహిష్కార మొసంగిరి. జీతము లెక్కువగ నీయవలసి యున్నందున విద్యార్థులకు తమ నివాసస్థలములనే చదువు దుస్సాధ్యముగ నుండ వారు వేఱొక గ్రామమున కేగుట ఆకాశహర్మ్యనిర్మాణమే యగు. ఉత్తరసర్కారులందన్నో విద్యాభివృద్ధికి ఉన్నతపాఠశాలలును కళాశాలలును నలయునన్ని యున్నవి. ప్రజలును నిర్ధనులుగారు. కృష్ణా గోదావరీమండలములు సారవంతములును సస్యసమృద్ధములు నై యున్నవి. ఆమండలములఁ బెక్కుమంది రాజులును మహారాజులు నున్నారు. కావున విద్యావ్యాపకమునకు నన్ని అనుకూలముల నొసఁగూర్పవచ్చును. మహమ్మదీయులు దత్తమండలములను స్వాధీనపఱచుకొని నప్పటి నుండియు నిప్పటివారి బుద్ధివికాసమును చాకచక్యమును నదృశ్యము లైనవి. తాళికోట యుద్ధమున నణంగిన ఆంధ్రుల బుద్ధివైభవములు నేటిదనుక మఱల మొలక లెత్తలేదు. చెన్నరాజధానిలో నన్ని జిల్లాలును నాగరకతఁ జెందుచుండ దత్తమండలములు మాత్ర మింకను జాల వెనుకఁ బడుచు నితరులచే మిక్కిలి నికృష్టముగఁ జూడఁబడుచున్నవి. ఇట్టి తఱి సహృదయులు నుదారమనస్కులు నగు నాంధ్రు లయ్యరుల నుండి నేర్చుకొనవలసిన యంశములు పెక్కులు గలవు. వారు జన్మభూమి వియోగమున కోర్చి శీతోష్ణస్థితిభేదము లున్నను సగకుఁగొనక వేషభాషాచారాదులు క్రొత్త వైనను వాని నతిత్వరితముగ నలవఱచుకొని వంగదేశము మున్నగు దూరదేశములకు సహితము నేగి యచ్చటి ప్రజలను పరిచితులఁ గావించుకొందురు. ఇది మిగుల శ్లాఘ్యము. దూరదేశగమనాభిలాష యుండినందుననే పాశ్చాత్యులు సకలఖండములలోను తమ రాజ్యములను స్థాపింపఁ గల్గిరి. ఉత్తర సర్కారులలో కొందఱు వంగరాష్ట్రాదులకు పోయి యచ్చటనే యున్నారని వినుట కెంతయు సంతస మయ్యెడిని. అరవవారి దేశాటనమును బ్రకటింపఁబూనియే షాకిల్టన్ దొరగారు ఉత్తరధ్రువమును గనిపెట్టుటను హాస్యపు కథనుగా, నెవ్వరో కల్పించియుందురు. గాథ యెట్లున్నను దత్తమండలములో విద్యావ్యాప్తి మిక్కిలి హీనదశయం దుండువిషయము నిక్కము. చెన్నపురి క్రైస్తవ కళాశాలాధికారులు సయిత మిచ్చటివిద్యార్థులకుఁ బ్రోత్సాహము కలుగఁ

జేయుటకై కొంతకాలముక్రిందట బళ్లారి అనంతపురము జిల్లాలయందు గిరిజన ముస్లిము బిల్లాలకును కొంత సహకార వేతనముల నొసంగిరి. ఏ కారణముచేతనో 1910-వ సంవత్సరమున వానిని దీసివైచిరి. దొరతనమువారు రీవత్సరమున దత్తమండలపువిద్యార్థులలో పదిమందికి వైద్యకళాశాలలలోఁ జదువుకొనుటకు జీతము నిచ్చెద మని ప్రకటించిరి. ఐనను దేశీయులగు ధనికు లుదారమనస్కులై విద్యాదానమును లోపరహితముగఁ జేయు నేర్పాటులు చేయుదాక విద్య మనదేశమున వ్యాపింపనేరదు. సర్కారువారు రానురాను బాలురకు విద్యార్జనమున కాటంకములను గల్గించుచున్నారే కాని కష్టములఁ దొలఁగింప నుద్యమింపరైరి. కనుక ప్రజలే యీవిషయమున నెక్కువశ్రద్ధను వహింపవలసి యున్నది. ఇట్టిలోపముల నివారించుటకు మనకు దానకర్ణులని ఖ్యాతివహించిన శ్రీ కలవల కణ్ణన్ శ్రేష్ఠి రామానుజం శ్రేష్ఠిగారవంటి మహనీయులు నెక్కుమంది యుండిన గాని కొన్నియేండ్లకైనను మనము కృతకృత్యులము కాఁజాలము.

దత్తమండలములందు ఒక్క హూణవిద్యమాత్రమే గాక సంస్కృతాంధ్రభాషాసంపత్తియును క్రమముగ నదృశ్యత నొందుచున్నది. వైదికవృత్తికి మర్యాద పోయినందున వారును ధనమున్నచో హూణవిద్యకై తమకాలమును గడపుచున్నారు. ఇఁక సంస్కృతవిద్యను అడుగువా రెవ్వరు? భారతీయులు తమబిడ్డలకుగ్గుమొదలుకొని ఇంగ్లీషునే నూరిపోయఁ దలంచెదరే కాని సంస్కృతమును నేర్పదలంపరు, ఇట్టిస్థితిలో నిఁక తెలుఁగెవనికిఁ గావలయు? ప్రవేశపట్టపరీక్షాదులయందు మాతృభాష నిర్బంధపాఠముగ నుండవలసిన యవసరము లేకుండుటను, గోరుచుట్టుపై రోకలిపోటువలె గ్రామ్యభాషావాదమిందుచేఁ బయలుదేరుటను భాషాపాండిత్యము అడుగంటినది. ఆదరణము తోఁచిన చొప్పున గ్రంథములు వ్రాయ మొదలిడరు. ఇట్లగుటచేత మాసమున కొకప్రబంధము పక్షమున కొకనాటకము, వారమున కొక నవల చొప్పున వెలువడుచున్నవి. తక్కిన విషయంబులందువలెనే గ్రంథరచనయందును వార్తాపత్రికప్రకటనలయందును దత్తమండలములు ఉత్తరసర్కారులకు మిక్కిలి తీసిపోయున్నవి. తూర్పుజిల్లాలలో గ్రంథమాల లెన్నియో యుండగ పశ్చిమమండలములలో ననంతపురమునందలి బాలభారతీప్రచురణములు తప్ప నెచ్చోటను పేరుపొందిన గ్రంథమాలలు లేవు. ఇఁక నుత్తరసర్కారులందు ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, ఆంధ్రప్రకాశిక, ఆంధ్రప్రదీపిక, దేశమాత, హితకారిణి, స్వధర్మప్రకాశిని, సావిత్రి మొదలగు దైనికవారపాక్షికమాసికపత్రిక లెన్నియో వెలువడుచుండ, దత్తమండలములలో బళ్లారి నుండి వేదప్రదీపిక యను నొకమాసపత్రిక మాత్రము ప్రకటింపఁబడుచున్నది.

ఆంధ్రులలో సాంఘికదురాచారములు నెక్కుడు కలవు. మనదేశములోఁ బురుషులకే తగినంత విద్య లేదనిన నిఁక స్త్రీవిద్య సంతృప్తికరముగ లేదని వేఱుగఁ జెప్ప ననవసరము. ఇంగ్లాండు బొంబాయి రాజధానిలోనున్న పాఠశాలలలాంటివి మనలో లేకపోవుటయే గాక కన్యకలకైన విద్య నొసఁగుటకైనను ఏర్పాటు చేసి యుండలేదు. బాల్యవివాహము లింకను యథేచ్ఛముగ జరుగుచుండుటచే బాలవితంతువులసంఖ్య హెచ్చుగనే యున్నది. ప్రస్తుతము వీరివిలాపములఁ జెవినిడువా రొక్కరును గన్పట్టరు. వంగదేశమున నీశ్వరచంద్రవిద్యాసాగరుఁడును ఆంధ్రరాజ్యమున వీరేశలింగముపంతులుగారును బాలవితంతువుల ఘోరకష్టములను గొంతవఱకును శమింపఁజేసిరి. కాని వీరి తరువాత నీమహోత్కృష్ట స్వయత్నమునకై తమజీవితములను ధారవోయు నే దేశభక్తుఁడును సాహసింపలేదు. మూఢాచారపిశాచము మనల నింకను బాయకున్నది. నిమ్నజాత్యుద్ధరణ విషయమునను బ్రాహ్మణేతరుల విషయమును ఇప్పుడేమియు మేలుగ లేదు. వైదికబ్రాహ్మణుఁడు మాలవాని నీడ తనపైఁ బడినంతనే స్నానమును జేయుచునే యున్నాఁడు. వైశ్యశూద్రు లెన్నిలక్షల ధనమును సంపాదింపఁగల్గియు నెంతవిద్యాధికులయ్యు, విద్యాగంధములేక సకల దురాచారములకు బానిసలైనట్టి బ్రాహ్మణాధముల సహపంక్తిభోజనమునకైన నర్హులు గాకున్నారు. మఱియు సద్విద్యలేమి దత్తమండలపు మోటుకాఁపులు పాపభీతి నెఱుఁగక తమశత్రువుల నెట్టివారినైనను నిశ్శంకతోఁ బట్టపగలె చంపుచున్నారు. ఇఁక సురాపానవ్యభిచారదేవతలు మనపై నెక్కుమున్నవి.

రాజకీయవిషయములఁ జర్చింప నే నంతగాఁ బూనుకొనను గాని ఆంధ్రలోకమునకు సాంఘికవ్యవస్థ కావలయు నన్న తెలుఁగుజిల్లా లన్నిటిలో నైకమత్యమును తొలుదొల్త స్థాపింపవలయు. ప్రత్యేకాంధ్రరాష్ట్రముకై యుత్తరసర్కారువారు ఆందోళనమును చేయుచుండుటయు దత్తమండలములో గొంద ఱాంధ్రప్రముఖులు మనకు వలదనుచుండుటయు నైయున్నది. ఇట్టిస్థితిలో మనయుద్యమము లేరీతి సఫలము లగును? ఆంధ్రమహాసభకు దత్తమండలముల నుండి సభికులను ఆహ్వానించు నాచారమున్నను, మఱవారికి నిజముగ నందొకటియుఁ గాఁబట్టదు. వీరు (అనఁగా దత్తమండలపుఆంధ్రులు) ఇంతవఱకు తమకాల మంతయు నేయాటలందో యేపాటలందో గడపుచు దేశహితైకచింత యనఁ బ్రేమను దప్పించుకొని కూపస్థమండూకములవలె బయటనేమి జరుగుచుండినను లెక్కగొనక యుత్తరప్రాంతములనుండు భారతీయ సహోదరుల విచారింపక తమజీవయాత్రలను గడపుచున్నారు. అయినను ఇప్పుడిప్పుడు వీరును గాఢనిద్రనుండి మేల్కాంచుచున్నట్లు దోఁచుచున్నది. ఓదత్తమండలపుటాంధ్రులారా! ఇంక మీపైఁ బ్రయోగింపఁబడిన సమ్మోహనాస్త్రమును వీడఁగొట్టుఁడు. అర్థహీని మానహీనులకోర్చుచున్న భారతమాతృదీనవదనము దిలకింపుడు. కన్నుల నీరు గ్రుక్కుకొనెడి మీయనుంగుతల్లి నోదార్పవలయు నని మీయంతరాత్మ మిమ్ములను బోధించుట లేదా? మీపూర్వికులు విజయనగరాధీశులు దక్షిణహిందూదేశము నంతయు నేకచ్ఛత్రాధిపత్యముగ నేలిన కాలమును మీ రిప్పుడే మఱచితిరేల?

పూర్వము ఒకసమయమున మగధరాజ్యమును జయించి ఇంక నొకప్పుడు రోమునగరమునకు రాయబారుల నంపి మఱియొక తూరిక్వలకొలంక మొదలగు ద్వీపాంతరములనుండి కప్పములు గైకొనిన యాంధ్రరాజ్యము నాగార్జునవిద్యారణ్యకృష్ణదేవరాయ తిమ్మరుసామాత్యాది మహామహులకు జన్మభూమియై ప్రసిద్ధికెక్కిన యాంధ్రరాజ్యము నేఁడు సర్వవిషయములందును వెనుకంజ వేయుచుండుట విషాదకరము. కావున నీ కళంకమును దొలఁగింపఁ బ్రయత్నించుట ప్రతియాంధ్రునికిని ముఖ్యము.

విద్యానగరము : రెండవ రాజవంశము

మంచివేసుల వేంకటశాస్త్రి గారు, బి. ఏ.

దక్షిణహిందూస్థానమునఁ గల పురాతనస్థలములలో విద్యానగరము కడు ప్రసిద్ధి నొందినది. ఓరుగంటిరాజ్యమున గొంతకాల ముద్యోగులై యుండి, యారాజ్య మస్తమితమగుటకు లగు మ్లేచ్ఛుల యధీనమైనప్పుడు కాంబోలును, హరిహరరాయలు నతని సోదరుఁడును దక్షిణముగ వచ్చి తుంగభద్రానదియొడ్డున నీనగరమును గట్టింపఁ జేసిరి. మహాత్ములగు విద్యారణ్యుల పనుపున నీపుర నిర్మాణము జరిగె నని యొకవదంతికలదు. కట్టించిననాఁటనుండియు నది దినదినప్రవర్ధమానమై సమస్తవిద్యలకును సంపదలకు నాకరమై యొప్పుచు వచ్చెను. విద్యారణ్యుల ప్రోత్సాహమున నిర్మింపఁబడుటచే నియ్యది విద్యానగర మాయె నని వాడుక కలదు. క్రమముగ నెల్ల విద్యలకు నాకర మగుచు వచ్చుటచే నాపురమున కీనామధేయము సార్థకము. కాఁకలమేదైయైనను, నిరంతరమును కనకవృష్టిని గురియించుచు, నాంధ్రకవిభూజములు చిగురించి పుష్పించునట్లు చేసి, యాంధ్రభోజుఁ డనుపేరుప్రఖ్యాతము నొందిన కృష్ణదేవరాయల కాలమున నది నిశ్చయముగ విద్యానగరమే! నానాఁటఁ జరిత్రలలోను పుక్కిటి పురాణములలోను పడి, విద్యానగరమే విజయనగరముగ మాఱియుండును. విద్యాపుర మని యాకాలమునఁ బిలువబడె ననుటకు, ప్రసిద్ధులైన కవీశ్వరుల ప్రబంధములే చక్కని నిదర్శనములు. నంది తిమ్మనార్యుఁడు "విద్యాపురమ్ముఁ గైకొని నిజప్రౌఢి నెఱపె" నని కృష్ణదేవరాయల పూర్వుఁ డగు నరసరాజును వర్ణించెను. మఱియు నీనగరమును గుఱించిన గాథ లన్నియును జక్కఁగ బరిశీలించి చూడఁగా, విద్యారణ్యుల కీపురముతో నేదో సంబంధము కలదనియును పైని సూచింపఁబడిన విధమున విజయనగర మను పేరు క్రమముగ దానికి వచ్చినట్లును నమ్మఁదగి యున్నది.

అట్టి విద్యానగరమును తమకు రాజధానిగాఁ జేసికొని, మూఁడు రాజవంశములు విజయనగరసామ్రాజ్యమునుఁ బరిపాలించినవి. అందు మొదటివంశమునకు హరిహరరాయలు మూలపురుషుఁడు. అతఁ డారాజ్యమును క్రమముగ దక్షిణహిందూస్థానమం దెల్ల విస్తరించునట్లు చేసి క్రీ॥ శ॥ 1336 సం॥ నుండియు రాజ్యపరిపాలనముఁ జేయుచుండెను. ఈ వంశము రమారమి నూటయేఁబది యేండ్లు ప్రభుత్వము నొంది, చివఱకు మిగిలిన రాజశేఖరుఁ డతిదుర్బలుఁడును, విషయాసక్తుఁడు నగుటచేఁ బదభ్రష్టత్వము నొందెను. ప్రజల హితము నొక్కింతయును గుర్తెఱుఁగక పరిపాలన చేయుచుండుటచే, నతని యుద్యోగులును ప్రజలలోఁ బ్రధానులు నేకీభవించి, రాజశేఖరుని రాజ్యమునుండి తొలఁగించిరి. అతని సేనానాయకుఁ డగు నరసింహరాజును బట్టాభిషిక్తునిఁ గావించిరి. ఇది సరి కాదనియును, నరసింహుఁడే తన యజమానుని యయోగ్యతను బ్రకటించి, క్రమముగా రాజ్యభారముఁ బూనుకొనియె ననియు, నందుకు ప్రజలు విధిలేక సమ్మతించి రనియును మఱికొందఱు చెప్పుదురు. ఏకారణమున నేమి రాజ్యభారము నొందినను నరసరాజు కాలమున విజయనగరము నేలుచుండె ననుట నిర్వివాదాంశము. విజయనగరచరిత్రను వ్రాసిన స్యూయెల్ దొరవారు, వీనిని సాళువ నరసింహరాజనియు, నీవంశస్థుఁ డగు తిమ్మరుసు కృష్ణదేవరాయలకు మంత్రిగా నుండె ననియును వ్రాసిరి. ఈ నరసింహరాజే రెండవవంశమునకు మూలపురుషుఁ డని వ్రాయుదురు. రెండవ వంశక్రమమును దెలుపు నీపట్టిక నొసఁగిరి.


1. నరసింహరాజు. — క్రీ॥ శ॥ 1490—?
2. నరస, లేక, వీరనరసింహరాజు. — ?—1509
3. కృష్ణదేవరాయలు. — 1509—30

దీనినిఁ బట్టి చూడఁగా నీరెండవవంశపురాజులు 1490 నుండియుఁ బరిపాలించుచుండినట్లు తెలియుచున్నది. మొదటివంశమునఁ జివఱకు నిలిచియున్న రాజశేఖరుని నంత మొందించియో, లేక ప్రజల యనుమతితో రాజైన నరసింహుఁడు క్రీ॥ శ॥ 1487న రాజ్యమునకు వచ్చెను. వీ రిరువురు నొక్కరే యనియును అమూఁడు సం॥లును మొదటి వంశస్థుల పేరనే రాజ్యము పరిపాలింపఁబడుచుండె ననియును పట్టికలో వారు సూచించిన కాలము నుండియే రెండవ వంశము పరిపాలింప మొదలిడె ననియును దొరవా రూహించిరి. రాజశేఖరుని వెనుక రాజ్యభారమును బూనిన నరసరాజు సాళువవంశస్థుఁ డనియు, నతఁడే రెండవ వంశమును స్థాపించె ననియును వీరు చెప్పుట సందర్భముగఁ గానరాదు. ఏల యనఁగా కృష్ణదేవరాయల యాస్థానకవి యగు పెద్దన తన యజమానుఁడు తుళువవంశస్థుఁ డని వ్రాసియున్నాఁడు. రెండవ వంశము తుళువవంశ మని పెద్దన వర్ణించుచుండఁగా నివంశమునకు సాళువ నరసరాజు మూలపురుషుఁ డెట్లగును? మఱియును దొరవారి పట్టిక ననుసరించినచో నతని వంశమునఁ గృష్ణదేవరాయలు మూఁడవపురుషుఁడుగాఁ గనఁబడును. 'ఆంధ్రకవితాపితామహుఁ' డని చిరకీర్తి నొంది, రాయల యాస్థానమున గల యష్టదిగ్గజములలోను మేటియైన పెద్దన తన మనుచరిత్రమును రాయల కంకిత మొనరించి, కృతిపతివంశమును వర్ణించుచు నిట్లు వ్రాసెను. రాయలు తుళువవంశస్థుఁ డనియు నా వంశమునకు తిమ్మరాజు మూలపురుషుఁ డనియు తిమ్మరాజున కీశ్వరరాజును ఈశ్వరరాజునకు నరసవిభుఁడును తిమ్మభూపతియు నను కుమారు లిరువురు కలిగి రనియును వ్రాసెను. ఆ నరసింహవిభుని

కుమారు లిరువు రైనట్లు ఈ క్రిందిపద్యమునఁ దెలిపెను.

సీ. ఆ నృసింహాప్రభుండు తిప్పాంబవలన
నాగమాంబికవలన నందనులఁ గాంచె
వీరనరసింహరాయ భూవిభుని, నచ్యు
తాంశసంభవుఁ గృష్ణరాయక్షితీంద్రు.

వారిలో వీరనరసింహరాయఁడు మొదట పరిపాలించె ననియు నతని వెనుక కృష్ణదేవరాయ లధిపతి యాయె ననియును వ్రాసెను. నరస రాజునకు కృష్ణదేవరాయలతల్లి యగు నాగమాంబ ధర్మపత్ని కాదనియు, నా కారణమున రాయలు దాసీపుత్త్రుఁ డనియును జాల కాలమువఱకును గొందఱు ఊహించుచుండిరఁట! ఆకాలమున రాజులకు బహుళముగఁ గళత్రస్వీకార మొనరించు వాడుక యుండుటచే నిది యెంతయు విశ్వసనీయము కాదు. కృష్ణదేవరాయ లధిపతియై రాజ్యభారమును బూనుకొనిననాఁటనుండియు విజయనగరము రామరాజ్యమై యుండె నని పెద్దన వర్ణించెను. పెద్దన వ్రాసినతీరున వంశవృక్షము నీ క్రిందివిధముగ వ్రాయఁదగును.



ఈ వంశవృక్షమునఁ గృష్ణదేవరాయ లైదవపురుషుఁ డైనట్లు కనఁబడుచున్నది. కావున దొరగారిప్రకార మతఁడు మూఁడవపురుషుఁడా? లేక పెద్దనప్రకార మాతఁ డైదవపురుషుఁడా? అని చూడవలసియున్నది. ఇప్పుడు మనము చూడవలసిన సంగతులు రెండు: 1 రెండవ వంశమునకు మూలపురుషుఁడును రాజశేఖరుని వెనుక నే పరిపాలనమును బూనినయతఁడు నొక్కఁడా? అయిన నతఁడు సాళువవంశజుఁడా? కాఁడా? 2. రెండవవంశమున కృష్ణదేవరాయలు, దొరగారు వ్రాసినట్లు మూఁడవపురుషుఁడా? లేక పెద్దన వ్రాసిన లైదవపురుషుఁడా? అను ప్రశ్నములకు సమాధానమును చూడవలయును. రాజశేఖరుని యనంతరము రాజ్యభారముఁ బూనిన నరసరాజు సాళువవంశజుఁ డని దొరగారు వ్రాసిరి. అట్టి నరసరాజునకుఁ గృతి యీయఁబడిన జైమినిభారతమునందు—

... ... జగద్వ్యాపారలీలావతా
రాలంకారవిహారి శౌరి సదయుం డై సాళ్వగుండక్షమా
పాలాగ్రేసర నారసింహుని నదభ్రశ్రీయుతుఁ జేయుతన్.
—అని వ్రాయఁబడి యున్నది.

ఇతఁడే దొరవారిచే నిరూపింపఁబడిన నరసరాజు. ఇతని వంశమున నే మంత్రి తిమ్మరుసు పుట్టెను. సాళువ నరసింహరాజు ఒకఁడు కలఁడు; గాని, యతఁడే రెండవ వంశమునకు మూలపురుషుఁ డైనట్లు కనఁబడదు. పెద్దన తన విభుని వంశము తుళువాన్వయ మనియు, నందు తిమ్మరాజు మొదటివాఁ డనియు వ్రాసినట్లు చూచియుంటిమి. పరిశీలనఁ జేయఁగా నీ తిమ్మరాజును జైమినిభారతమునకుఁ గృతిపతి యగు సాళువనరసింహరాజును సహోదరు లైనట్లు కనఁబడినది. కృతిపతి వంశమును వర్ణించుచు, జైమినిభారతకర్త యగు పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి —

ఉ. ఆయమహీతలానుభావునకు నా సుచరిత్రకు నుద్భవించి రు
ద్దామయశోధనుల్ విజయధాములు విక్రమభీము లాహవ
స్థేములు సార్వభౌములు ప్రసిద్ధులు తిమ్మనరేంద్రచంద్రుఁడున్
శ్రీమదహోబలేశ్వర నృసింహుని యంశమునన్ నృసింహుఁడున్.
—అని వ్రాసెను.

ఈపద్యమున నరసరాజునకు జ్యేష్ఠభ్రాతయగు తిమ్మభూపతిని పేరునకుమాత్ర ముదాహరించెను; కాని యాకవి యతనింగుఱించి యించుకేనియు విశేషముగ వ్రాయలేదు. పెద్దనార్యుఁ డీ తిమ్మభూపతినే రెండవవంశమునకు మూలపురుషుఁ డైనట్లు వ్రాసియుండు నని యూహింపఁదగును. ఇది యొకవిధముగ మన సందేహమునకు సమాధానము కాఁగలదు. సాళువ నరసింహరాజున కితఁ డన్న యగుటచేతను, తిమ్మభూపతి వేరొకవంశమునకు మూలపురుషుఁ డగుటచేతను, వీ రిరువురు (నరసరాజులు) నొక్కరే యని తలఁచుట కవకాశము లేదు.

ఈ సాళువ నరసింహరాజు రెండవవంశమునకు మూలపురుషుఁడు కాఁడని స్పష్టముగఁ గనఁబడును. పెద్దనార్యుఁడు రాయల వంశమునంతను వర్ణించె నే కాని, యం దెవ్వరి కాలమున వీరు విజయనగరరాజ్యమునకు బ్రభువు లైరనియును, నెవరెవ రెంతెంతకాల మచ్చట నేలినదియు నించుకేనియు వ్రాయఁబూనఁడు. రాయలకు పూర్వులగు నలువురును రాజులై విజయనగరము నేలిరా? అని సందియము పొడముచున్నది. ఈవిషయమున నాకాలపు కవులలో మఱి కొందఱియభిప్రాయముఁ గనుఁగొనవలయును. రాయల యాస్థానమున నాకాలమున నే యుండి ప్రకటయశుఁడగు నంది తిమ్మనార్యుఁడు పారిజాతాపహరణ మను ప్రబంధము నొకదానిని రచించి దాని నాయన కంకితమొనరించెను. కావున, తన కృతిపతి వంశానుక్రమణికను దెలుపుచు నతఁ డీవిధముగ వ్రాసెను. పెద్దన తన ప్రభువంశమును తిమ్మరాజుతో మొదలుపెట్టెను. నంది తిమ్మనార్యుఁ డామార్గము నంటియే వెళ్లెను; గాని యతనికుమారుఁ డీశ్వరరాజుతోఁ బ్రారంభము చేసెను. ఈశ్వరరాజు కుమారుఁ డగు నరసరాజును వర్ణించుచు తిమ్మకవి—

సీ. ఎవ్వానివిజయంబు లెఱిఁగించు శాసన
స్తంభంబు లాశాంతశైలవితతు
లెవ్వాని యరిగాపు లేపారు కాళింగ
యవనాదివివిధదేశాధినాథు
లెవ్వాని నిత్యదానైకవిలాసంబు
లారూఢతరతులాపూరుషంబు
లెవ్వాని చిరకీర్తి యింద్రలోకాంగనా

భోగినీగీతికాభోగపదము
వాఁడు పొగడొందు సర్వసర్వంసహాధి
నేతతాముఖదర్పణ విజయనగర
భద్రసింహాసనస్థుఁ డున్నిద్రతేజుఁ
డీశ్వరాధిపు నరసపృథ్వీశ్వరుండు.

అతఁడు విజయనగరసింహాసనస్థుఁ డని వ్రాసెను. తత్పూర్వ్యు మావంశమునఁ జనించిన యీశ్వరనరసింహుఁ డనురాజు, పరాక్రమ వంతుఁ డనియును, ధీనిధాకరుఁ డనియును, కరుణారసభరణుఁ డని యును, రణవీరుఁ డనియును మాత్రము వర్ణించెనే కాని, యాతఁ డే రాజ్యమును గాని పరిపాలించినట్లును, ఎచ్చటనైన శాసనము లున్నట్లును గాని వర్ణింపలేదు. దీనినిఁబట్టి చూడఁగ నీశ్వరరాజకుమారుఁ డగు నరసరాజు విజయనగరమును బరిపాలించుచుండె నని నిశ్చయముగఁ గనఁబడుచున్నది. ఇట్లు నిశ్చయించినచో, స్యూయెల్ దొరవా రొసఁగినపట్టిక ననుసరించుటకు కూడ, మనయూహ సరిపడును. ఏది యె ట్లున్నను, నరసరాజు సాళువవంశస్థుఁడు కాఁడు. సాళువనరసరాజున కీ రెండవవంశపు నరసరాజు సహోదరుని కనుమఁడు. దొరగారీ విష యమున మాత్రము పొరపాటు పడిరి. కావున రెండవవంశస్థులకు నరస రాజుకాలముననే రాజ్యాధిపత్యము లభించియుండును. దీనిని సమ ర్థించునట్లు వెనువెంటనే తిమ్మకవి—

సీ. కుంతలేశ్వరుఁడు సిక్కువడంగ విద్యాపు
రంబుఁ గైకొని నిజప్రౌఢి నెఱపె
పారసీకునకు దుర్భరమానభంగంబుఁ
దొలఁగించె మానవదుర్గసీమఁ
జోళవల్లభునకు సురవధూమధురాధ
రము లిచ్చి మధురాపురంబు గొనియె
శ్రీరంగపట్టణసీమ ఖడ్గనటీవి
నోదంబు యవనేంద్రునకుఁ జూపె

గీ. కటకము [illegible]
[illegible]
[illegible]
డీశ్వరాధిపు నరసపృథ్వీశ్వరుండు.

అని నరసరాజు విద్యాపురమును గైకొనినట్లు రూఢిగ వ్రాసెను. కావున నరసరాజుకాలముననే వారు విజయనగరమునకు ప్రభువు లైరని తెలిసికొనఁగలము. మిగిలినవంశము నంతను పెద్దనవలెనే ఇతఁడును వర్ణించెను. కృష్ణరాయల దిగ్విజయమును గురించి ఇరువురును ప్రాయ మార్గములనే వర్ణించిరి.

పైని జరిగిన చర్చవలన సందియము లన్నియును దీరినవి. కాని రెండవవంశము ననుసరించియే మూఁడు సంవత్సరములవఱకు (1487-90) పరిపాలించిన సాళువనరసరాజునకుఁ గుమారులు లేరా? కలరా? అట్లుండినచో నీరెండవవంశమున కెట్లు రాజ్యము వచ్చి యుండు నని సందేహము తోఁచును. సాళువ నరసరాజు మరణ సమయమునఁ గుమారు లిరువు రుండినను, వారు బాల్యదశయం దుండు టచేఁ, దనయన్నకుమారుఁ డగు నరసరాజునకు వారిని రాజ్యము నొప్పఁజెప్పె ననియును, వారిబాల్యము దీరునంతవఱకు తానే రాజ్యాధి పతియై యుండి, పిదప వారిని బట్టాభిషిక్తులఁ జేయు మనియును గోరె నఁట! అందుకుఁ సమ్మతించి నరసరాజు, వారిలో నొక్కని రాజ్యమున కధిపతినిఁ జేసి పట్టాభిషేకముఁ జేయించె నఁట! కాని యాతఁ డెవ్వనివలననో చంపఁబడఁగా, నరసరాజు రెండవవానిని రాజుఁ జేసె నఁట! తనయన్నను జంపిన ద్రోహి నితఁడు చేరఁదీసినట్లు తెలిసి కొని, తుళువనరసరాజు తనప్రతాపమును జూపి, వానిని బందిఖా నలోఁ వేయించి, రాజ్యాధిపత్యము నొందెనఁట! ఇట్లు రెండవవంశము వారు రాజ్యారూఢు లైరనియును, నరసరాజు స్వామిభక్తిపరాయ ణుఁడై యుండె ననియును నవీనచరిత్రకారులు కొందఱు వ్రాయు చున్నారు.

శమదమాదుల మహిమ

కాశీనాథుని సీతారామలింగము అయ్యవారు

మానవుఁడు తనకుఁ గల అంతర్బహిశ్శక్తుల నుపయోగించుటకు ఇంద్రియములు ముఖ్యములు. శమదమములు ఇంద్రియనిగ్రహసాధనములు. శమదమములు దేహమనస్సంబద్ధములు. దేహము ప్రత్యక్షము. మనస్సు పరోక్షము. మనస్సత్తావలన బహిరింద్రియములకు సమర్థత కలుగుచున్నది. ఈ విషయము ప్రతివ్యక్తికిని సహజము. ప్రతివాని హృదయమునందును లీనమైయున్న శక్తిలో ప్రతిబింబము మనస్సుద్వారా ప్రభవించి విరాడ్విశ్వరూపమునందు సంకలితమై దేశకాలాదులచే పరిణామదశను బొంది వ్యక్తమగుచుండును. అందువలన కించిజ్జ్ఞుఁడైన ప్రతిజీవియును అనుకూలప్రతికూలముల వలన సుఖదుఃఖముల ననుభవించుచుండును. దేహమనఃపాటవములు గల పురుషుని వికాసమున కాద్యంతము లుండవు. ఆ పురుషుని భుజబలమునకు, బుద్ధిబలమునకు, ఆత్మజ్ఞానమునకును ఒరులు తీసిపోదురు. ఇట్టివాఁడే స్థితప్రజ్ఞుఁడు. స్థితప్రజ్ఞుఁడు ఏమాత్రమును లోపములు లేక తాను మార్గములను దెలిసికొని నడచి ఒరుల నడిపింపఁగలఁడు. అందుకు తగినబోధను జేయఁగలఁడు. ఆర్యుల సాంప్రదాయధర్మము లివియె. హిందూ ఆర్యులు నాగరికు లయ్యును, దేహాలంకారాదులకు రత్నకాంచనాంబరాదిసుఖసాధనములను నిరంకుశాధికారమును నిచ్చెడి సామ్రాజ్యములను సైతము శమదమాదుల మహిమచే తుచ్ఛసుఖము లని త్యజించి నారచీరలు మున్నగువానిని విధములుగ ధరించి స్వాత్మానందము నొంది లోకరక్షణార్థ మనేకమార్గములను ప్రదర్శించిరి. ఇట్టివారే మహర్షులు. వీరిహృదయము లతిగంభీరములు. ఊహ లుదారములు. చర్యలు విచిత్రకరములు. ఆ మహాత్ములు వేదశాస్త్రపురాణేతిహాసాదులలోని సాంప్రదాయముల ననుసరించి శిష్యులకు సదాబోధించెడి ఆచారము పూర్వము కలదు.

శ్లో. శమో దమ స్తప శ్శౌచం క్షాన్తి రార్జవ మేవచ
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రాహ్మ్యం కర్మ స్వభావజమ్.

అనునట్లు భారతవర్షపురాజు లనేక లీధర్మము నాశ్రయించి సత్పరిపాలకులై స్వరాష్ట్రమును కాపాడుకొనుచు జనుల నాయాధర్మమార్గముల నడిపించిరి. రాజు సత్పరిపాలకుఁడై కృషివాణిజ్యాదివృత్తుల నేర్పఱచి "చాతుర్వర్ణ్యం మయాసృష్టం" అను న్యాయమున యుగధర్మముల ననుసరించి చతుర్వర్ణములను కాపాడవలయును.

మానవుఁడు బాల్యమునుండియే ఐహికవిద్యతోఁ బాటు శమదమాదుల కనువై నైతికమార్గములను తెలుపగలిగిన అధ్యాత్మికతత్త్వపు ధర్మములను సైతము మన పూర్వులు బోధించుచుండెడివారు.

వేదచోదితము లగు కర్మల గుఱించి వారు త్రొక్కిన మార్గములు నేడు వ్యర్థము లైనవి. (1) అక్షరాభ్యాసము:— అక్షరాభ్యాస మనఁగ "క్షరస్సర్వాణి" అను శ్లోకము ననుసరించి అక్షరుఁ[illegible]ఁడు పరమాత్మస్వరూప మని గుర్తెఱుంగుట యని వారి [illegible] ప్రణవసహిత మైన పంచాక్షరిని ('ఓం నమ[illegible]డి మంత్రమును) బాలురకు విద్యాభ్యాసకాలమందే 'సిద్ధం నమః' అనెడి వాక్యరత్నములతో నుపదేశించుచుండెడివారు. (2) ఉపనయనము:— ఉపనయన మనఁగ జ్ఞాననేత్ర మని వారి తాత్పర్యము. చర్మచక్షుస్సులచే ప్రపంచకము అందఱును తెలియుచునే యుందురు గనుక జ్ఞానచక్షుస్సుచే తద్విలక్షణ మైన స్వరూపమును గుర్తెఱింగించుట కిట్లు ఏర్పఱుపఁబడినది. అధ్యాపకుఁడు బ్రహ్మోపదేశమును చేయుటయును శ్రోత తెలిసికొనుటయును పూర్వపు టాచారములు. ఇప్పు డాకథ లుడిగినను నామమాత్రము లుగ నున్నవి. ఇంద్రియాదులకన్న ఆత్మకు స్వప్రకాశత కలదు. ఆత్మ తాను ప్రకాశించి సమస్తేంద్రియములకు ప్రకాశము నిచ్చుచున్నది. ఆత్మ ఆనందస్వరూపమున నున్నది. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అని శ్రుతి కలదు. జీవనము దానమునకు స్వానుభవము వలన జీవాత్మ కలదని చెప్పవచ్చును. విషయేంద్రియసన్నికర్షమున జ్ఞాన మేర్పడుచున్నది. జీవాత్ముఁడు విషయజ్ఞానమును భావించి కర్మేంద్రియములద్వారా వెలిబుచ్చుచుండును. ఇది అందఱకు తెలిసినదియే! కనుక ఇంద్రియార్థసన్నికర్షలో విషయానందము పొందక బాహ్యవిషయము నకు గోచరించుచున్నను సర్వవిషయానందము నొందవలసియుండెను. 'యద్దృశ్యం' [illegible] ప్రమాణము [illegible] పరార్థము [illegible] సత్పదార్థము [illegible]. ఇట్టి మార్గముల నన్వేషించుటకై ఆర్యులు బాల్యమునుండియే ఇంద్రియములు మనస్సు బుద్ధి ఆత్మానందమును జేరుటకు ప్రాణాయామము పెందలుగా గల విధముల నలవరించుచుండిరి.

ప్రతిమానవుఁడును ప్రాణాయామాదుల నొనర్చుకొనఁదగిన అంతరింద్రియ దృష్టి వికసింపవచ్చును. షణ్మాస [illegible] పూరక కుంభకాదు లలవడును. అందువలన వాయునిరోధన మేర్పడును. మూలాధారాది షట్చక్రములను తద్వర్ణములను అధిదేవతలను హంసప్రచారమును గుర్తెఱింగి ప్రణవమే హంసస్వరూపమని శివస్వరూప మని తెలియవలయును.

హంసమున్నగు పర్యాయనామములతో నొప్పుచుండెడి ఆ పరతత్త్వమును శమదమాదులమహిమచే దెలిసికొని ఈ జీవాత్మ నా పరమాత్మయం దైక్యము నొందింపవలసియుండును. ఇట్టి యోగి మహత్త్వములను ప్రదర్శించుటయును కలదు. మన నవనాగరికులు ఏ ఖండాంతరవాసులో వచ్చి మెస్మరిజములను ప్రదర్శించిన భ్రమించుచున్నవారే కాని మన గ్రంథరాజములందుఁ గల విశేషములను గుర్తించుటకు ప్రయత్నింపరైరి. కావున మన మార్యసంతతివార మైనందులకు శమదమాదుల నలవఱచుకొనుటకు ప్రయత్నపడవలయును. ఇట్టి బాధ్యత భారతీయులందఱకును కలదని సూచించుచున్నాను.

శమదమాదుల మహిమచే నరుఁడు ధీరుఁడును శూరుఁడును కాఁగలఁడు. ధీరుఁడై సేనాని కావచ్చును. జ్ఞానియై ఆచార్యుఁడు కావచ్చును. వివేకసామరస్యములచే భర్తృఁడు కావచ్చును. ప్రజ్ఞావంతుఁడైన నరుఁడు మానియై సిద్ధుఁడై తుదకు శివుఁడు కాఁగలఁడు.

The Sixth Andhra Conference, Cuddapah.

ఆఱవ ఆంధ్రమహాజనసభా ప్రతినిధులు, కడప.

Prof. K. Ananda Rao.



Mr. N. S. Venkaramaiah.




ఎన్. ఎస్. వేంకటరామయ్యగారు.

Rao Saheb Sithapathi Pantulu



రావుసాహేబు సీతాపతి పంతులుగారు.

Hon'ble C. P. Ramaswamy Iyyer.



ఆనరబిలు సి. పి. రామస్వామి అయ్యరుగారు.

T. Vijayaraghavacharlu




• విజయరాఘవాచార్యులు గారు.

Garden Party To Their Excellencies.




గవర్నరు దంపతులకు తోటవిందు.

Arrival of Their Excellencies.



గవర్నరు దంపతుల ఆగమనము.

Rangoon Andhra Mahajana Sabha.



రంగూను ఆంధ్రమహాజనసభ.

ఆంధ్రభాషాభిమానశాఖావిద్యార్థులయవస్థ

పన్నాల సత్యనారాయణ గారు

మన మాతృభూమి యైన యీ యాంధ్రదేశము మన ప్రభువు లగు బ్రిటిషువారికి 1758-వ సంవత్సరమున వచ్చినది. 160 సంవత్సరములనుండి వారిచేఁ బరిపాలింపఁబడుచున్నది. మన యాంధ్రదేశమే బ్రిటిషు పరిపాలనము క్రిందికి వచ్చిన మొట్టమొదటి రాష్ట్రము. మొట్టమొదటనే వచ్చి పూర్తిగా 160 సంవత్సరముల నుండి పరిపాలింపఁబడుచున్న మన దేశపు విద్యార్థుల కష్టములఁ గొన్నిటి నైనఁ బాపుట యుక్తము.

సామాన్యమును ప్రయత్నముచే సులభసాధ్యము నయిన యొక కష్టమును దొలఁగింపఁజేయు మని వేఁడుటయే ప్రకృతమున నీ వ్యాసోద్దేశము. ఆ కష్టమేది యన: అభిమానశాఖల (Optional Groups)లో మూఁడవ గుంపు (Group III)లోని దగు మాతృభాష తోడిదగు నింగ్లండు చరిత్రతో సమ మైన విలువ గలదిగాఁ జూడఁబడక పోవుటయే.

ఉద్యోగాదికముల కుపయోగించు రాజభాష (ఇంగ్లీషు) ముఖ్యము గాన ముఖ్యస్థానము నలంకరించుచున్నది. దానితోడి భాగములోని వగు సామాన్యగణితమును (Elementary Mathematics) దేశభాషావ్యాసరచనయు (Vernacular Composition) రాజభాషకుఁ గ్రింది వగుటచే పైదాని సాయము బడయుట యుక్తము. అంద అన్ని విషయములఁ బ్రవీణు లగుట దుర్లభము. కాన నభిమానశాఖాపద్ధతి సమంజసము.

భాషాచరిత్రల కన్యోన్యసంబంధ మెక్కుడు కావున నవి యొక గుంపు (Group III) లో నుండుటయు దగినదే. రాజభాషావిషయ మంతయు ముఖ్యభాగము (Group A)లో నుండుటచే నీ యభిమానశాఖలో మాతృభాష యుండవలసివచ్చెను. మాతృభాషకును మాతృదేశచరిత్రకును చాల సంబంధ మున్నను, నవీనులచే దేశభక్తిని పురికొల్పునట్లు వ్రాయఁబడని హిందూదేశచరిత్రకంటె రాజభక్తిని కలుగఁజేయునదియు గవర్నమెంటువారి సేవఁ జేయ ననుకూలించునదియు బ్రిటిషుజాత్యభివృద్ధిక్రమమును వారి నాగరకతాగ్రగణ్యతఁ జూపు పార్లమెంటు విషయమును తెలియఁజేయునదియు నగు నింగ్లండుచరిత్ర మభిమానశాఖలో నుండుట శ్రేష్ఠతరము. ఇప్పు డభిమానశాఖలో మాతృభాషయు నింగ్లండు చరిత్రయు నుండుట యర్హము.

ఆ రెంటికిని సమానమైన విలువ యుండవలెనా? అక్కఱ లేదా? ఇప్పు డెట్లున్నది? అను విషయములను చూతము. 1918-వ సంవత్సరము నవంబరు ఫోర్టు సెంటు జార్జి గెజెట్టు (Fort St. George Gazette) ను పట్టి చూడఁగా నింగ్లండు చరిత్రకును మాతృభాషకును సమాన మైన విలువ లేదని ఉండఁగూడ దని ఈయ రని తెలియుచున్నది. కళాశాలలోఁ జదువఁ దగినవానికిగల పద్ధతులు ఇవి. (S. S. L. C. Public Examination).

(1) మొదటి రెండు గుంపులలో నేదో యొక దానిలో 40 గుణములును (Marks) రెండవదానిలో 35 గుణములును వచ్చినవాఁడు కృతార్థుఁడు. మూఁడవ గుంపులో నున్ననో మాతృభాషలో 35 గుణములు వచ్చినను ఇంగ్లండుచరిత్రలో 40 గుణములు వచ్చితీర వలయును.

(2) మొదటి రెండు గుంపులలో నే 'సబ్జక్టు'లో నైన 35 గుణములకుఁ దక్కువ వచ్చిన రెండవ సబ్జక్టులో 40 కి పైని తక్కువకు రెట్టింపు గుణములు వచ్చినవాఁడు కృతార్థుఁడు. మూఁడవ గుంపులో నున్ననో మాతృభాషలో 35 కుఁ దక్కువ వచ్చినచో, ఇంగ్లండు చరిత్రలో 40 గుణములకుఁ బైని ఆ తక్కువ గుణములకు రెట్టింపు వచ్చినవాఁడు కృతార్థుఁడు. ఇంగ్లండు చరిత్రలో 40 కి పొల్లుపోయిన విద్యార్థికి వాని వత్సరత్రయక్లేశము నష్టము; బూడిదలోఁ బోసిన పన్నీరు. భాషలో నెన్ని గుణము లెక్కువ వచ్చినను కప్పిపెట్టికొనవలసినదే.

(3) మొదటి రెండు గుంపులలో దేనిలోనో యొక దానిలో "ప్రెసిడెన్సీ ఏవరేజి"కిఁ బైఁగ 5 గుణములును తక్కినదానిలో ప్రెసిడెన్సీ ఏవరేజియు వచ్చినవాఁడు

కృతార్థుఁడు. మూఁడవ గుంపులో నో మాతృభాషలో ఆ "సివరేజి" వచ్చినను ఇంగ్లండు చరిత్రలో ప్రెసిడెన్సి యావరేజికి పైని 5 గుణములు వచ్చి తీరవలయును. (ఈ) హెచ్చుతగ్గుల విషయము (2) లో వలెనే,

ఇట్లు మాతృభాష ఇంగ్లండు చరిత్రకంటెను తక్కువగాఁ జూడఁబడుటకుఁ గారణ మేమియో? 'ఇంటర్మీడియేటు'లో మూఁడవ గుంపులో చరిత్రభాగ మెక్కువ యగుటచే "స్కూలు ఫైనలు" చరిత్ర విషయము కట్టుదిట్టముగా నుండవలె నని కొంద ఱనవచ్చును. కాని, అందులోని భాషాభాగ (Language Group) విషయమో! చరిత్ర సాయముచే స్కూలు ఫైనలులోఁ గృతార్థుఁ డైన విద్యార్థి భాషాభాగమును దీసికొని యందుఁ బండితుఁడు కాఁగలఁడా? స్కూలు ఫైనలులో నించుక మాతృభాషాసాహాయ్యముతో రాజచరిత్రలోఁ గృతార్థుఁడు చేయఁబడఁదగినవాఁడు, ఇంటర్మీడియేటులో భాషాభాగము నైనఁ దీసికొనఁదగఁడు?

మొదటి రెండు గుంపులలో నొక సబ్జక్టులోని తక్కువ గుణములకు రెట్టింపు గుణములు రెండవ సబ్జక్టులో వచ్చిన సరిపోవుచుండఁగా మూఁడవ గుంపులో చరిత్రలోఁ గొద్ది గుణములు తక్కువ వచ్చిన, తక్కువకు, పది రెట్లు గుణము లైనను గూడ మాతృభాషలో వచ్చిన సరిపోవదా? మాతృభాషాభిమాన శాఖావిద్యార్థి యవస్థ యింతయేనా?

ఇదియే దేశములోని యనేకవిధము లైన యాందోళనములకుఁ గారణము. జాతీయవిద్య కావలయు నని కోరుటకుఁ గారణము. జాతీయవిద్యావాదుల యుక్తులఁ బట్టి మాతృభాష యగ్రస్థానము నలంకరింపవలయు నని తెలియుచున్నది. వారి వాదములఁ జూచిన మాతృభాష రాజభాషతోఁ గాని అథవా ఇంగ్లండు చరిత్రతోఁ గాని సమాన మైన స్థానమున నుండఁదగిన దని ప్రతివానికిని నచ్చకపోదు. దేశీయులకును ముఖ్యముగా విద్యార్థులకును నష్టదాయక మగు మాతృభాష విలువ యొక్క తక్కువను బోఁగొట్టఁ బ్రభువులును సమర్థులును నతివినయమునఁ బ్రార్థితులు.

తరువాత మాతృభాషను రాజభాషతో సమాన మైన స్థితికిఁ దీసికొనిరావలయును. అనఁగా, మాతృభాష నభిమానశాఖనుండి తొలఁగించి ముఖ్యశాఖ (Group A) లో నున్న మాతృభాషను రాజభాషతో సమ మైన విలువ గలదానినిగాఁ జేయుట. రాజభక్తిని బురికొల్పు నింగ్లండుచరిత్రతోఁ బాటు దేశభక్తిని పెంచు దేశచరిత్రయు మూఁడవ గుంపులో నుండవలెను.

క్రిందటేఁటివఱకు దేశచరిత్రలో నేదియో యొక భాగము అనవసరశాఖ (B Group) లో నుండెడిది. క్రిందటేఁడా దేశచరిత్రను భూగోళశాస్త్ర (Geography) చిత్రలేఖనము (Drawing)లతోఁ బాటు లాగివేసినారు. ఇప్పుడు, దేశచరిత్రకు మాఱుగ (B Group) గూడ ఇంగ్లండు చరిత్రయే చెప్పఁబడుచున్నది. దేశభక్తిని పెంచలేని దేశచరిత్రకంటె నభిమానశాఖకు సంబంధించిన ఇంగ్లండు చరిత్ర కుపకరించు రాజచరిత్రే లాభకరము.

జాతీయవిద్యకొఱకు వాదించువారి కిది యొక యాధారము. దేశభక్తిని గల్గించు దేశచరిత్రను చెప్పితీరవలయు నని వారి వాదము. ఇదియే చాలమంది విద్యార్థుల యసంతుష్టికిఁ గారణము. "ఆల్ఫ్రెడు" "హెరాల్డు ది సెకండు" "ఎడ్వర్డు ది ఫస్టు" "హెన్రి ది ఫిఫ్తు" మొదలగువారలఁ గుఱించి చదువునపు డింగ్లీషువారి కెట్టి దేశభక్తి కలుగునో చంద్రగుప్తుఁడు అశోకుఁడు విక్రమార్కుఁడు శ్రీహర్షుఁడు మొదలగువారిని గూర్చి చదువు నపుడు గూడ హిందువుల కట్టి దేశభక్తినిఁ గల్గించు దేశచరిత్రలు వ్రాయించి అట్టి దేశచరిత్రలను పఠనీయ గ్రంథములుగాఁ బెట్టించి ఇంగ్లండు చరిత్రతోఁ బాటు దేశచరిత్రయు సమముగాఁ జూడఁబడినచో ఈ జాతీయ విద్యాందోళనలు ఉపశమించును. ప్రజల మనములకు సంతుష్టియుఁ గలుగును.

మధ్యేమార్గమున మొట్టమొదట ఇంగ్లండు చరిత్ర మాతృభాషల సమత్వమును తరువాత మాతృభాషా రాజభాషల సమత్వమును మాతృదేశచరిత్ర రాజదేశచరిత్రల సమత్వమును స్థాపించి సామ్రాజ్య శాంతిని గలుగఁజేసినట్లు ప్రజలకు మనశ్శాంతినిఁ జేయఁ బ్రభువులను సమర్థులను భక్తితోఁ గోరుచున్నాను.

ఐరోపా సంగ్రామము

1918 వ సంవత్సరము

లోకస్వరూప మేక్షణమునందు మాయనో సత్తెంబుట సాధ్యము కాదు. కాలప్రవాహమునం దెన్నియో యవాంతర సంఘటనము లగోచరములుగ జరిగిపోవుచుండును. మానవాతీతములైన భావాంతరసంఘటనములకు 1918-వ సంవత్సరము ప్రబలనిదర్శనముగ నుండును. సంవత్సరారంభమునందు అంధకారబంధురమై యుండిన లోకవ్యవస్థ సంవత్సరాంతమునందు నూతనతేజముతో ప్రకాశించెను. ఎనిమిదిమాసములవరకు తెరపి లేకుండ బ్రహ్మాండముగ జరిగిన సంగ్రామ కోలాహలమునుండి ధర్మదేవత యావిర్భవించి క్రమముగ ప్రజల దృష్టికి ప్రత్యక్షమయ్యెను. కాలగతి నెవరును సంవత్సరాదియందు నిరూపింపలేక పోయిరి. కాని నూతనయుగానుకూలమైన నిమిత్తములు వేసవికాలమునందు ఏర్పడినప్పుడు రణవ్యవస్థయందు చిహ్నములు విజ్ఞులకు గోచరములయ్యెను. ధర్మదేవత ప్రకాశింపక మానదు. లోకమునందు నాశమునకును స్వాతంత్ర్యవిజయమునకును తార్కాణమై వెలయుచున్న 1918-వ సంవత్సర చారిత్రమునందు ప్రజలకు సంభవించిన సుఖదుఃఖములలో నీశ్వరసంకల్పమే దృశ్యమగుచుండును. రణరంగమునం దావిర్భవించిన ధర్మదేవత భావప్రవంతియందే క్రీడించుచుండ లోకమునందు క్షుద్బాధయు, వ్యాధిపీడయు విచ్చలవిడిగ విహరింపసాగినవి. రణసంజాతమైన నూతనయుగధర్మము సర్వదేశములకు వ్యాపింపక పోయినను విషజ్వర మన్నిదేశములందు ప్రవేశించి కోట్లకొలది ప్రజల నెత్తుకొనిపోయెను. క్షామముచేతను, జ్వరముచేతను బాధపడని దేశమే లేదు. సంవత్సరముపొడుగునను ప్రజలు కష్టములనే పొందుచుండిరి. మానవంతుల ప్రజలు వానినన్నిటి నోర్చుకొనిరి. యుగసంధియందు గోచరించు దుర్భరదశ శాశ్వతము కాదని 1918-వ సంవత్సరము వ్యక్తపరచెను. రణస్థితియందు నూతనశక్తి యారంభమగుట తోడనే యేండ్లును పూండ్లును పట్టునని భావించిన కార్యసంసిద్ధి క్షణములో సంభవమయ్యెను. దుర్భేద్యములైన నిరంకుశవ్యవస్థలు శీఘ్రముగ నశించుట కారంభించెను. రాజ్యములు విచ్ఛిన్నము లయ్యెను; రాజులు పతితులైరి. స్థిరపాలనముల కాకరములైన దేశములందు పరివర్తనమునకు సులువేర్పడెను. రాజులు, రాకొమారులు దేశభ్రష్టులై యన్యదేశములకు శరణాగతులైరి. ఒకమాసములో ఓడలు బండ్లైనవి. బండ్లు ఓడలైనవి. రాజుల భాగ్యభోగము లెంత యస్థిరములో క్షణక్షణము వ్యక్తమగుచుండెను. నవంబరు 11-వ తేదిని క్షాత్రము శాంతించెను. ఆనాటితో రాజులనిరంకుశప్రభ యస్తమించెను. మానవుల భాగ్యదశయం దరుణోదయ మయ్యెను. ధర్మసంస్థాపనమునకు చేసిన త్యాగ మగణితమైనను మిత్రమండలి నాల్గేండ్లనుండి పడిన శ్రమ ఫలించి మిత్రరాజ్యములు సుఖపడుటకు వీలుకలిగెను. ప్రజలకు కలిగిన కష్టబాధలవలెనే 1918-వ సంవత్సరము చారిత్రమునందు సుప్రసిద్ధముగ నుండును. అంతకంటెను మించినది మరి యొకటి కలదు. రష్యాదేశమునందు బయలుదేరిన "బోల్షివిక్" ఉద్యమము లోకకంటకముగ పరిణమించుట గొప్ప విశేషము. అంటువ్యాధివలె నది ఆదేశ మంతటను వ్యాపించెను. ఇతరదేశములకు వ్యాపించునని భీతికూడ కలిగెను. రాజ్యస్థిరత్వమున నుండవలసిన అధికార మెప్పుడా దేశమునందు నశించెనో అప్పుడే రష్యారాజ్య మల్లకల్లోలమై పోయెను. ఆ యల్లకల్లోలము 1918-వ సంవత్సరమునం దతిశయించి ప్రజలు బాధపడిరి. శత్రురాజ్యములందు రాజ్యాధికారము సడలి అరాజకము వ్యాప్తియయ్యెను.

సంగ్రామగతి

పందొమ్మిదివందల పదునెనిమిదవ సంవత్సరారంభమునందు సంగ్రామదశ విషమముగ నుండెను. ఉభయపక్షములును తమ బలాబలములను కనుపరచవలసిన తరుణ మాసన్నమయ్యెను. రష్యారాజ్యము రణరంగమునుండి నిర్గమించుటయు 1917 సంవత్సరాంతమునందు ఇటలీ దేశమునకు కలిగిన పరాభవమును శత్రువునకు తాత్కాలికముగ కొంతబలము కలిగించెను. ఆంగ్లపరాసు సేనలు ఇటలీవారికి పరాజయము కలుగకుండ కాపాడి శత్రువుల యత్నమును భగ్నపరచెను. ఇటలీదేశమును సంహరించి వేసవికాలములో ఆంగ్లపరాసుల తాళము పట్టవలయును అని శత్రువు సంకల్పించెను. సంవత్సరారంభమున శత్రువు తిరిగి ఇటలీరంగమున విజృంభించునను భయముండెను. ఇటలీరంగ మప్పటి కింకను దుర్బలముగనే యుండెను. తురుష్కరంగమునందు జెరూసలెము పట్టణము ఆంగ్లులకు స్వాధీనమగుటవలన రణస్థితి మిత్రమండలి కనుకూలముగనే యుండెను. కాని రష్యా యుద్ధమును మానివేయుటవలన మెసపొటేమియాయందు ఆంగ్లసైనికపార్శ్వము సురక్షితముగ నుండలేదు. అక్కడి స్థితిగతులు నిలుకడగ లేనందున ముందు జరుపవలసిన విజయయాత్రకు ధైర్యము చాలకుండెను.

యుద్ధారంభమునుండియు శత్రువుల దృష్టి యేమి మిత్రమండలి దృష్టి యేమి పశ్చిమ రంగము మీదనే ప్రసరించుచుండెను. ఉభయసేనలలో చాలభాగ మారంగమునందే యుండెను. ప్రచండయుద్ధము లక్కడనే జరుగుచువచ్చెను. రణవీరులు తమ శౌర్యము నక్కడ ప్రకటించుటయే యావశ్యకమని భావించుకొనుచుండిరి. మరియే రంగమునందును జరుగని ప్రబలయత్నములు పశ్చిమరంగము

నందే జరిగినవి. రష్యాముఖమునందలి తన యక్షౌహిణీసేనలను శత్రువు పరాభవించి పడమటిరంగమునందు నిలువజేసెను. శత్రువు తనకు తాత్కాలికముగ గలిగిన సైనికబలాధిక్యముచే విజయయాత్ర కుప క్రమింపగలిగెను. రక్షోపక్రమణతంత్రము శత్రు హస్తగత మయ్యెను. మిత్రమండలి కాలవిలంబముకొఱకు రక్షణతంత్రము నవ లంబింపవలసి వచ్చెను. యుద్ధావసానదశకు వారు నిరీక్షించి తమ బలము నష్టపడ నిరాకరించి శత్రువు నోడించుటకు సకలప్రయత్నములను చేసిరి. 1918 వ సంవత్సరమునందు మిత్రమండలి పడమటి రంగమునందు రక్షణతంత్ర మవలంబించి శత్రుబల ముడిగిన వెనుక అమెరికాసేనల సాహాయ్యముచే 1919 వ సంవత్సరములో అవస్కం దన మారంభింపవచ్చునని రణతంత్రజ్ఞులు భావించిరి. కాని మానవ బుద్ధి కగోచరముగ ఈశ్వరోద్దేశము నడచుచునే యుండెను.

జర్మనుల యవస్కందనము

మిత్రమండలి తలచినట్లే జర్మనులు పడమటి రంగమునందు దారుణసంగ్రామము నారంభించిరి. విజయమును పొందిన, 1918-వ సంవత్సరములో నమెరికా సేనలు రాకపూర్వము పొందవలయు ననియు లేదా, యుద్ధమునకు జలాంజలి వదల్చవలయు ననియు జర్మనులకు తెలియును. వా రందున కెంత ప్రయత్నముచేయుటకు సాధ్యమగునో అంత ప్రయత్నమును చేసిరి. నాల్గువత్సరములనుండి యుద్ధములో వారికి కలిగిన యనుభవమును వారు సార్థకపఱచుకొనిరి. కాంబ్రెయి యుద్ధము నందు కలిగిన ప్రత్యేకానుభవమును వారు మఱచిపోలేదు. సూచీముఖ వ్యూహమునందలి లోపములను నివారించికొని యుద్ధారంభమునందే అపరిమితముగ విజృంభించి భేద్యమైన తన సేనాముఖమును శత్రువు క్రమ్ముకొనుటకు వీలులేకుండ జేయుటయే జర్మనులు తలపెట్టిన నూతన తంత్రమునందలి ప్రధాన విషయము. లూడెన్డార్ఫ్ సేనాని నూతనతంత్రము ననుసరించి సైనికులకు శిక్షణ మిప్పించెను. రష్యా ముఖమునుండి మఱలించిన యోధుల కనుదినమును నూతనతంత్రాను కూలముగ రణనీతిని నేర్పిరి. కేవలము శత్రుసేనాముఖమును భేదించుటకే చాల సైనికులను శిక్షించిరి. భేదితమైన సైనికముఖమునుండి నిర్గమించి యుద్ధము చేయుటకు ప్రత్యేకసైనికుల నియమించిరి. దీని కంతకును లూడెన్డార్ఫ్ సేనాని కారకుడని చెప్పుదురు. ఏది యెట్లుండినను జర్మనులు విజయప్రాప్తికై పడమటిరంగమునందు తమ సర్వస్వము నొడ్డిరని చెప్పక తప్పదు.

సెయింటు క్వెంటిను ముఖమునందు జర్మనులు మార్చి 21-వ తేదిని అవస్కందనమును ప్రారంభించిరి. ఆంగ్ల పరాసు సేనలను వేరు పఱచి సమయానుకూలముగ నొకరి తరువాత నొకరిని సంహరించుట జర్మనుల సంకల్పమని చెప్పుదురు. ఆంగ్ల పరాసు సేనల కూడలిస్థానము సెయింటు క్వెంటిను పట్టణమునకు దక్షిణభాగమునందు కలదు. అక్కడనే యుద్ధము ప్రారంభ మయ్యెను. అక్కడ ఆంగ్లసేనా ముఖము మొదటిరోజున చీలిపోయెను. పరాసుసేనలు వచ్చి చీలి పోయిన ముఖముచు వెనుకనుండి క్రమ్ముకొనెను. 21-వ తేదీ మొదలు మార్చి నెలాఖరువఱకును క్రమక్రమముగ యుద్ధము అమీన్సు పట్ట ణమువఱకును వ్యాపించెను. సేనాముఖముం గ్రమ్ముకొని యుద్ధము సాగు నిమిత్తము ఆంగ్ల, పరాసులు, సెయింటుక్వెంటిను, పెరోను, బొపాము, నాయను, మాంటిడిడెరు పట్టణములను, సోమునదీ ముఖ మును త్యజింపవలసి వచ్చెను. అమీన్సు పట్టణముమీద జర్మనులు శతఘ్నులను ప్రయోగించుచుండిరి. సోమునదీతటమునుండి విశాల మైన లోయ నిర్గమించుచున్నది. దానికి అమీన్సు పట్టణము రక్షణ స్థానముగ నుండెను. దానిని జర్మనులు వశపఱచుకొనినయెడల ఉత్తర దక్షిణ పార్శ్వము లందలి మిత్రమండలి సేనలకు సంయోగము నశించియుండును. రానురాను జర్మనులముట్టడి చప్పపడి సైనిక నష్టము వృద్ధి యగుచుండెను. అమీన్సు పట్టణప్రాప్తికై సర్వసేన నొడ్డుటయా, సేనాముఖమునందలి మఱియొక ప్రదేశమునం దవస్కం దనము ప్రారంభించుటా యను సమస్య జర్మనుసేనానికి గోచరించెను. అమీన్సు పట్టణముకొఱకు యుద్ధముచేసి సైనికనష్టమును పొందుచు జర్మనులు ఆంగ్లముఖమునందు అర్మెంట్రీసు,లాబాసీల మధ్య నూతనావస్కందనము ప్రారంభించిరి. తత్ఫలితముగ న్యూపాపిలుపట్ట ణమునొద్ద సేనాముఖమును వారు భేదింపగలిగిరి. కాలే మున్నగు రేవుపట్టణములను పట్టుకొనుటకు జర్మనులు సంకల్పించియుందురు. 1914-వ సంవత్సరములో వైప్రెసు యుద్ధము లిందుకొఱకే జరిగినవి. ఆంగ్లు లప్పుడు జర్మనులయెత్తు నెంతమాత్రము సాగనియ్యలేదు. జర్మనుల నూతనయవస్కందనమువలన యుద్ధమునందు విషమస్థితి యేర్పడెను. ఆ విషమస్థితియందు ఆంగ్లసేనాధ్యక్షుడు సర్ డగ్లసు హేగు, ఆంగ్లసేనలకు పంపిన సందేశప్రభావము నెవరు వ్యక్తపరుప గలరు? జర్మను సేనలను ఆంగ్లపరాసులు నివారింపగలిగిరి. వైప్రెసు పట్టణమునకు తూర్పుభాగము నందు గతవత్సరములలో ఆంగ్లులు పట్టుకొనిన ప్రదేశమును త్యజింపవలసివచ్చెను. న్యూఇగ్లిసు, పట్టణ మును, కెమ్మెలు కొండను జర్మనులు పట్టుకొనిరి. వైప్రెసుపట్టణము నుండి సేనలను మఱలించుకొని వెనుకకు పోవుటకు ఆంగ్లులు ముందు గనే కట్టుదిట్టములను చేసికొనిరి. అమీన్సుముఖమునందువలెనే వైప్రెసు ముఖమునందును జర్మనులయెత్తు సాగిరాలేదు. గ్విన్షీ పట్టణమును ఆంగ్లు లద్భుతపరాక్రమముతో సంరక్షింపగలిగిరి. ఫ్రాన్మెజిలు, వై ప్రెసు దక్షిణప్రాంతములందు జర్మనులను ముందుకు కదలనియ్య లేదు. అంతలో పరాసులు వచ్చి తోడ్పడిరి.

శత్రువున కింకను విజయము కలుగుచు నేయుండెను. అమీన్సు, ఆర్మెంట్రీసు ముఖములందు ప్రయోజనము లేనప్పుడు శత్రువు షామిన్-డి-డేమ్సు ముఖమును ముట్టడించెను. జర్మను లామార్గమును పట్టుకొని ఎయిను వీజెలునదులను దాటి క్రమక్రమముగఁ బట్టుదలతో యుద్ధము చేయుచు మారనునదిని సమీపించి పశ్చిమైల్లో ముఖమునందు నదినిదాటి షాటోతియారీ, డార్మనుల మధ్యను గల ప్రదేశము నాక్రమించుకొనిరి. రీమ్సుపట్టణమునకు తూర్పుపశ్చిమములలో కూడ జూలై 15-వ తేదీని జర్మనులు ముట్టడించి విఫలమనోరథులైరి. జర్మను లవ లంబించిన అవస్కందనములలో నిదియే కడపటి అవస్కందనము.

తరువాత మిత్రమండలివారు ప్రతిఘటించి జర్మనులతో నెడతెగ కుండ నవంబరువఱకు యుద్ధముచేసి వారి నోడించిరి.

మిత్రమండలి ప్రతిఘట్టన

యుద్ధస్థితియంతయు జూలై 17 వ తేదిని ముహూర్తమాత్రములో తారుమారయ్యెను. అమెరికాసేనలు రణరంగమునకు వచ్చిన ప్రయోజనము వెంటనే కనిపించెను. ఆంగ్ల పరాసు జర్మనుసేనలలసిపోయిన సమయమునందు అమెరికాసేనలు మద్దతువచ్చెను. నిష్కామసేవయు లోకోద్ధరణమును ఆదర్శముగఁ బెట్టుకొనిన అమెరికాసేనలు యుద్ధానుభవము లేకపోయినను చిరకీర్తిని సంపాదింపగలిగినవి. వారవలంబించిన యుత్తమమార్గము సంస్తవనీయము. యుద్ధానుభవములేని లోపము కనిపింపకుండఁ జేయుటకై అమెరికాయోధులను ఆంగ్లపరాసు పటాలములలోఁ జేర్చిరి. అందుకమెరికావా రంగీకరించుట వారి ధర్మప్రియత్వమునకు నిదర్శనముగ నుండగలదు. లోకమునందు సభ్యతకు భంగము కలుగుచుండినప్పుడు మానవు లేయుత్కృష్టభావముతో సంచరించుదురో ఆట్టిభావముతో అమెరికావారు తమ అహంత్వమును పాటింపక సంచరించిరి. మిత్రమండలి విజయదశకు మఱియొక కారణము గలదు. శత్రువునకు గల సంయుక్తసేనాధిపత్యము మిత్రమండలికి లేదు. వివిధరాజ్యముల సేనలు కలిసి యుద్ధము చేయవలసియుండినప్పుడు సర్వసేనాధిపత్యమున కుండిన యవకాశముల కంటె భిన్నభిన్నములగు నేర్పాటుల కెక్కువ వీలుండును. అయితే మిత్రమండలి మూడేండ్ల యుద్ధానుభవమువలన సంయుక్తసేనాధిపత్యము సంయుక్తరణతంత్రములవలన కలుగు లాభాలాభములను గ్రహింపగలిగెను. ఇటలీ సేనలకు కలిగిన పరాభవానంతరము మిత్రమండలి సేనాధ్యక్షులు వెర్సేల్సుపట్టణమునందు గూడి ఆలోపములను నివారించుకొనిరి. అక్కడ జరిగిన యేర్పాటుల ననుసరించి మార్షలుఫాకు సర్వసేనాధిపతి యయ్యెను. జర్మనుల అవస్కందనదశాపరిణామము నతఁడు ప్రారంభమునుండియుఁ గనిపట్టియుండెను. శత్రుబల ముడుగుటయే మిత్రమండలి విజయయాత్రకు ముఖ్యకారణము. శత్రువు దుర్బలుడగుచువచ్చినకొలదిని యుద్ధము జోరై బలము తరుగజొచ్చెను. యుద్ధపుజోరు శత్రువునకు దుర్బలసూచకముగాని బలహేతువు కాదని ఫాకుసేనాని ప్రతిఘట్టనతరుణమునకు వేచియుండెను. శత్రువునకు భంగపాటుకలిగి అతని యెత్తులన్నియు తారుమారై పోగలిగిన యంత శీఘ్రతాడనము విజయమునకు ముఖ్యసాధనము. యుద్ధమునకు ముందు శత్రుపంక్తిమీద నగ్నివర్షము కురియించుటవలన శత్రువు ముట్టడించు నని తెలిసి ముందుగ జాగ్రత్తపడుటకు వీలుండును. మామూలుపద్ధతిని విసర్జించి శత్రువునకు తెలియకుండ నాంగ్లులు మొదటి కెంబ్రెయియుద్ధమునందు "టాంకుల" సాహాయ్యముతో ముట్టడించిరి. దానికి ప్రతిక్రియగ జర్మను లట్లే చేసి సూచీముఖమునందు ఆంగ్లులకు కలిగినవిజయమును నిష్ప్రయోజనము చేసిరి. శత్రుముఖమును భేదించి చాలదూరము సేనలుపోయి అలసిపోవుటవలనను, ఆసేనలకు ఆధునికయుద్ధములలోఁ గావలసిన ఆహారసామగ్రి, సాధనసంపత్తి తరుణమునకు చేరకపోవుటయు విజయమునకు ప్రతిబంధకమని కెంబ్రయియుద్ధమువలన జర్మనులకేమి ఆంగ్లులకేమి పరిపూర్ణముగ వ్యక్తమయ్యెను. ఏకముఖమునందే శత్రుతాడన ముపక్రమించుటవలన తక్కినముఖములను దుర్బలపరచి అవసరమునకు తగినప్రాంతమును బలపఱచుకొనుట తటస్థించుచుండును. కావున సమయానుకూలముగఁ దాడనము రణరంగమునందలి వివిధప్రాంతములకు వ్యాపింపవలయును. రణరంగమునందలి రక్షణానుకూలమైన ముఖములను దుర్బలపఱచి యేకకాలమునం దంతటను అవస్కందనమును ప్రారంభించినయెడల శత్రువు నిర్జితుఁ డగును. ఆధునికయుద్ధవిజయమున కివి సాధనాంతరములు. లూడెనుడ్రాఫ్‌నకును ఫాకు సేనానికిని పూర్వోక్తములైన యంశములు తెలియనివికావు. జర్మనులు అవస్కందనమునందు ప్రదర్శించిన రణకౌశలమును ఫాకుసేనాని జర్మనులమీఁదనే ప్రయోగించి శత్రువును నిర్జింపఁగలిగెను.

జూలై 17-వ తేదీతో జర్మనుల యుద్ధప్రభ యస్తమించెను. 18-వ తేదిని ఫాకుసేనాని అవస్కందనము నారంభించెను. 27 మైలుల ముఖమునందు సిస్సాను పట్టణపు బడమటిభాగము మొదలు పాటోతియరి వాయవ్యభాగమువఱకును శరవేగముతో జర్మనులను మిత్రమండలిసైనికులు ముట్టడించిరి. మిత్రమండలి ముట్టడించునని శత్రువునకు తెలియనే తెలియదు. మారను నదీప్రాంతమును శత్రువులు పదిమైళ్ల దూరము నాక్రమించుకొనియుండి రని పైని తెలియజేసి యుంటిమి. మిత్రమండలి తాడనము ప్రారంభమైనతోడనే శత్రువు పరాఙ్ముఖుడయ్యెను. వారమునాటికి శత్రువు మారను నదిని దాటి వీసెలు నదీముఖముగ పారిపోవుచుండెను. శత్రువు మే జూను నెలలలో రక్తము ధారపోసి గెలుచుకొనిన ప్రదేశములో చాలభాగము నెలాఖరునకు మిత్రమండలి స్వాధీన మయ్యెను. జూలై నెలలో మిత్రమండలికి కలిగిన విజయమువలన శత్రువున కుండిన పారిసు నగరపు దండయాత్ర తుదిముట్టెను. ఆ నగరమునకు శత్రుభయము పోయెను. పరాసులరాజధాని సురక్షిత మయ్యెను. మూఁడువారములలో ఫాకుసేనానికి జర్మనుల దుర్బలత పరిపూర్ణముగ బోధపడెను. దానినిబట్టి యతఁడు మహావ్యూహాన్వితమైన సంగ్రామమున కుపక్రమించెను. ఆరంభమునందు యుద్ధము దీర్ఘకాలము చేసినఁగాని శత్రుబలము తరుగనేరదని యెంచిరి. అనవసరముగ ఫాకుసేనాని యొకరోజైనను యుద్ధమును దీర్ఘము చేయలేదు. శత్రువుల బలాబలము కరతలామలకమగుటకును ఫాకుసేనాని సూచీముఖ ప్రస్థానముతో సరిపెట్టెను గాని విరోధి యథార్థస్థితి తెలిసిన యుత్తరక్షణమందే రణరంగమునం దంతటను సంగ్రామము నారంభించెను. అందువలన యుద్ధము నలుగురును తలచినట్లు గాక శీఘ్రముగ సమాప్తి నొందెను.

మిత్రమండలి మహావస్కందనము

ఆగస్టు మొదటివారములో పశ్చిమరంగమునందు ప్రారంభమైన మహావస్కందనము నవంబరు నెలారంభమువఱకును నిర్విఘ్న

ముగ కానవచ్చెను. పడమటిరంగమునందు రణపంక్తి కొంచెమించుమించుగ ధనురాకారముగ నున్నదని పడమటిరంగ స్వరూపమును తెలుపుచు గత యేడు సంచికయందు వ్రాసితిమి. ఫాకు సేనాని యవలంబించిన వ్యూహమును గ్రహించినగాని మిత్రమండలి మహావస్కందనదశలను పూర్ణముగ దెలిసికొనజాలము. శత్రురక్షణపంక్తియొక్క స్వరూపమునుబట్టి మిత్రమండలి తమ వ్యూహమును పన్నిరి. శత్రుపంక్తికి వెనుకను దుర్గసదృశములై యుండిన కొన్ని పట్టణములు రక్షణస్థానములుగ నుండెను. అవి ఒకదానికొకటి చాల దూరమునందు లేవు. వాని బలిమిని చూచుకొనియే శత్రువు సమయోచితముగ యుద్ధముచేయుచు నవసరమునుబట్టి ముందుకు వెళ్లవలసియుండినప్పుడు ముందుకు పోవుటకును, వెనుకకు మఱలవలసియుండినప్పుడు వెనుకకుపోయి యడుగు నాల్గింటినుండి పరరాజ్యములందు పీఠము వేసికొని యుండుటకును తన దేశమునకు యుద్ధమువలన నిసుమంతయు నుపద్రవము లేకుండుటకును వీలయ్యెను. శత్రుసేనాముఖమును దుర్బలపఱచుటకు అందలి బలీయస్థానములను పట్టుకొనుటకంటె నుత్తమమార్గము వేరొకటి యుండదు. కొంచెమించుమించుగ నా బలిష్ఠపట్టణములను ఏకకాలమునందు వశపఱచుకొని సేనాముఖమును భేదించుటకు యోగ్యమగునట్లు పార్శ్వములందు అవస్కందనము నారంభించి మధ్యఖండమునందలి సేనలు పారిపోవుటకు వీలులేకుండ మార్గావరోధము గల్పించి శత్రువు మూలబలమును సంహరించుటయే ఫాకు సేనాని రణతంత్రమని ఆగస్టు మొదలుకొని నాలుగుమాసములు జరిగిన యుద్ధస్వరూపమును బట్టి యూహింపవచ్చును. అమీన్సు పట్టణముమీద జర్మనులు శతఘ్నులను ప్రయోగించుచుండుటవలన ప్యారిసునగరమునుండి దానికి పోవు రైలుమార్గము మిత్రసేనల కుపయోగమున లేదు. ఆ ప్రతిబంధకమును నివారింపజేయుటకై మొదట ఆంగ్లులు అమీన్సుయుద్ధమును ప్రారంభించిరి. యుద్ధము ఆగస్టులో 8 మొదలు 12-వ తేదీవఱకును జరిగెను. అందువలన మిత్రరాజ్యములు తమ సేనలకు కావలసిన సామగ్రిని పంపుకొనుట కామార్గమును నిర్విఘ్నముగ నుపయోగించుకొనుటకు వీలయ్యెను. ఆ యుద్ధములో 22 వేలమంది బందీలును 400 శతఘ్నులును విజేతలకు దొరకినవి. బాపాము యుద్ధము ఆగస్టు నెల చివఱను 10 దినములు జరిగెను. అందులో 35 వేల మంది బందీలును 270 శతఘ్నులును శత్రువునకు నష్టమయ్యెను. ఆయుద్ధము ముగియకుండనే అర్రాసు యుద్ధము ప్రారంభమయ్యెను. ఆయుద్ధము సమాప్తి యగునప్పటికి హిండెనుబర్గు రక్షకపంక్తికి సింహద్వారముగ నుండిన డ్రోకరు క్వీంటు ముఖము ఆంగ్లులవశమయ్యెను. ఆగస్టు 26 సెప్టెంబరు 3-వ తేదీల మధ్య 19 వేల మంది బందీలును 200 శతఘ్నులును వారికి లభించెను. ఇట్లు యుద్ధము జరుగుచుండగనే అర్రాసున నుత్తరభాగమునందు డబాయిపట్టణముకొఱకు ఆంగ్లులును, లాను పట్టణముకొఱకు పరాసులును యుద్ధమును జరిపిరి. సెప్టెంబరు మొదటివారము దాటువఱకును పూర్వోక్తమైన ముఖములందు యుద్ధము జరిగెను. శత్రుసేనయందేమి యుద్ధము జరుగుచున్న ముఖములందుండెను. వేసవికాలమునందు శత్రువు జరిపిన అవస్కందనములకు ఫలితముగ నతని సేనయందలి నిలువ సైనికులు చాలవఱకు క్షయమైపోయిరి. ఒక ముఖమును బలహీనపఱచియుండి రెండవముఖమును బలపఱుపలేనిస్థితియందుండెను. అట్టి తఱుణమునందు షాంపేను, ఆర్గోనులందును, మ్యూజు ముఖమునందును ఫాకు సేనాని యుద్ధమును సంకల్పించెను. షాంపెనునందు పరాసులు శత్రువులను భంజించుచుండిరి. ఆర్గోనులోనుండి శత్రువును తఱుముటకు అమెరికావారు పూనుకొనిరి. సెప్టెంబరు 12-వ తేదిని అమెరికను యోధులు సెయింటు మిహేలు ప్రస్థమునందు 5 మైలుల ముఖమునందు జర్మనులను ముట్టడించి 12 మైళ్లు దూరము ముందునకు పోయి, 15 వేల మంది ఖయిదీలను వశపఱచుకొనిరి. సెయింటు మిహేలు ముఖము భిన్నమైనప్పుడు శత్రువు మ్యూజునదీముఖమును శరణము చేసికొనవలసియుండెను. అట్లు సావకాశముగ మఱలుటకు వీలు లేకుండ శత్రుసేనను చిందఱ చేయుటయే మిత్రసేనాని యుద్దేశము. నవంబరు నెలవఱకును జరిగిన యుద్ధమువలన జర్మనుల కట్టి యవకాశము దొరకక చివఱకు వారు తమ పరాజయమును నొప్పుకొని యుద్ధమును విరమించుటకు గోరిరి. ఇంతవఱకును విజయసాధకమైన యుద్ధవ్యూహము జరిగెను. ఇక మిత్రసైనికుల కేమాత్రము పురోగమనము కలిగినను శత్రువులకు కావలసిన ఆహారపదార్థములకును, యుద్ధద్రవ్యములకును సైనికుల గమనాగమనములకును నిరోధము కలుగక మానదు. హిండెనుబర్గు పేరుతో నిర్మించి అది యుండగ మాకేమి కొదవయను ప్రగల్భములకాధారభూతమైన సైనికపంక్తికి సింహద్వారము మిత్రమండలిసైనికులకు స్వాధీనమయ్యెను. సెప్టెంబరు అక్టోబరు నెలలందు మిత్రసైనికులు జర్మనుపంక్తికి బలిష్ఠమైన హిండెనుబర్గు పంక్తిని చూర్ణముచేసి బహిఃప్రదేశమునందు యుద్ధము చేసి నిరుత్సాహులై క్షణక్షణమును ఓడిపోవునట్లు జర్మను సైనికుల నోడించిరి. ఆ పరాజయమునకు వెఱచి జర్మనులు యుద్ధమును విరమించుకొనిరి.

మిత్రసేనల విజయయాత్ర

ఇంతవఱకును మిత్రమండలి మహావస్కందనమునందలి ప్రధానాంశములను తెలిపియుంటిమి. అందువలన కలిగిన మహాఫలితములను వివరించి యుద్ధ మెట్లు పశ్చిమరంగమునందు విరమించెనో తెలియజేయుదుము. హిండెనుబర్గు సేనాముఖమునకు రక్షణయోగ్యముగ నుండిన ముఖము నాక్రమించుకొని మిత్రసేనలు హిండెనుబర్గు పంక్తిని ముట్టడించెను. సెప్టెంబరు 18-వ తేదిని ఈప్సి పట్టణమును మిత్రమండలివారు పట్టుకొనిరి. ఆ పట్టణపు స్వాధీనమువలన మిత్రసైనికులు శత్రువుల రక్షణపంక్తి నతిక్రమించి నోర్దు కాలువ నాశ్రయించుకొనిన శత్రుసైన్యమును ముట్టడించుటకు వీలయ్యెను. ఆ కాలువయొద్ద నుండిన సైనికపంక్తి దుర్భేద్యముగ నుండెను. సెప్టెంబరు 27-వ తేదీని అర్రాసు ముఖమునందలి సేనల మద్దతుతో నాంగ్లులు నోర్దు కాలువ ముఖమును దొమ్మిచేసి పట్టుకొనిరి. శత్రుసేన లగ్నివర్షము గురియించుచుండ ఆంగ్లసేనలు ఆ కాలువను దాటగలుగుటయు

శత్రువున కపరిమితనష్టములు కలిగించుటయు నాంగ్లుల పరాక్రమమునకు తార్కాణమని సుందరమని ఆ యుద్ధవృత్తాంతమును వ్రాసిన వారు వ్రాసిరి. ఆ కాలమున నూతనరాజమార్గములు నాటుటకు రైలుకట్టలు వంతెనలను నిర్మించిన ఆంగ్లేయ ఇంజనీరుల నైపుణ్యమును ఫక్ దేశ్యను పేరుగల సేనాని విజయయాత్రను వర్ణించుచు మంచిన యుద్ధనాయకులను నంగీకరించి శ్లాఘించెను. హిండెనుబర్గు సైనికపంక్తి యిట్లు నాశనమగుచుండ, ఆంగ్ల బెల్జియము సేనలు ఫ్లాండర్సు సేనాముఖముననుండి నిర్గమించి వైప్రసు ప్రస్థమునుండి శత్రువును తరిమివేసి రైల్వేమార్గముల నెరవేర్చిరి. అప్పటికప్పుడే కెంబ్రయి పట్టణముకొఱకును సెయింటు క్వెంటిను పట్టణముకొఱకును యుద్ధము జరుగుచుండెను. అక్కడ మిత్రమండలికి మహావిజయము కలిగెను. ఆ మహావిజయముతో హిండెనుబర్గు పంక్తి నాశనమై పోయెను. అక్కడ 22 వేలమంది సైనికులు విజేతలకు బందీలుగ దొరికిరి. అమెరికాయోధులీ యుద్ధములలో తోడ్పడిరి. అక్టోబరు మధ్యకాలములో ఆంగ్ల పరాసులు కెంబ్రయి, సెయింటు క్వెంటిను పట్టణములను స్వాధీనపఱచుకొనిరి. ఆ మహాయుద్ధమునందు శత్రువులకు 50 వేలమంది ఖయిదీలును 800 శతఘ్నులును నష్టమగుటయే గాక చాలమంది మరణించిరి. శత్రుసైనికులకు కలిగిన నిరుత్సాహ మన్నిటికంటెను ముఖ్యవిషయము. ఆ యుద్ధమైనవెంటనే తిరిగి మిత్రమండలి సైనికులు విజయయాత్ర నారంభించిరి. తత్ఫలితముగ జర్మనులు లిల్లీ, డవాయి, లానా పట్టణములుగల విశాలమండలమును త్యజింపవలసివచ్చెను. అంతటితో శత్రుపంక్తిని రక్షించుచుండిన దుర్గసదృశములగు పట్టణములు మిత్రమండలి స్వాధీనమయ్యెను. అప్పటికి శత్రుసేనాముఖము దుర్బలమయ్యెను. మిత్రసైనికుల విజయయాత్ర కెట్టి యాటంకమును కలుగలేదు. నవంబరు 10 దినములలో మాబూజు యుద్ధము జరిగెను. దానితో మిత్రసైనికులు మాన్సుముఖమునకు వచ్చి పడిరి.

అక్కడ యుద్ధము పరిసమాప్తమయ్యెను. జూలై నవంబరు నెలలలో జర్మనుసేనకు కలిగినంతనష్టము యుద్ధములో మఱియే సేనకును కలుగలేదు. జర్మనులకు 4 లక్షలమంది ఖయిదీలు నష్టమైరి. జర్మను సేనలు చిందఱ లయ్యెను. వారి సైనికులకు రక్షణముగనుండిన పట్టణములు విజేతలకు స్వాధీనమయ్యెను. కేవలము బహిఃప్రదేశమునందు యుద్ధము జరుగుచుండెను. జర్మనుసేన యుద్ధము చేయదగిన స్థితిలో లేదు. అనుక్షణమును జర్మనుసేనకు పరాజయమును, సైనికవినాశమును ప్రత్యక్షమగుచుండెను. తమకు కలిగిన పరాజయము వారికి వ్యక్తమయ్యెను. సైనికవినాశనమునుండి తప్పించుకొని బయటపడుటకు వారు కృతనిశ్చయులై యుద్ధవిరామము కోరిరి. జర్మను దూతలు మిత్రపంక్తికి వచ్చి నవంబరు 11 వ తేది ప్రాతఃకాలము 8 గంటలకు యుద్ధవిరామమున కొడంబడిరి. 11 గంటలకన్ని రంగములందును యుద్ధము శాంతించెను.

యుద్ధము శాంతించుట కితరరంగములందు జరిగిన రణప్రస్థానమును తోడ్పడెను. బాల్కను రంగమునందు ప్రారంభమైన యుద్ధము బాల్కను రంగమునందే ముగిసినట్లాయెను. ఒక రంగమునుండి మఱియొక రంగమునకు సేనలను పంపుటకు వీలుపడకుండ చేసి ఏ రంగమునందలి సేనల నా రంగమునందే ఓడించుట మిత్రమండలికి 1918 వ సంవత్సరమునందు వీలయ్యెను. ఇప్పటి టర్కీ, బాల్కను రంగములందు జరిగిన యుద్ధప్రాముఖ్యమును గ్రహించుట కీ విషయమును మఱచిపోరాదు. బల్గేరియా సైనికులు జర్మనుల సాహాయ్యములేక శరణాగతులైరి. టర్కీవారు స్వశక్తిలేక మిత్రమండలికి లొంగిపోయిరి. ఆస్ట్రియావారు ఒత్తిడికి లోబడి మిత్రమండలివారిలో ప్రత్యేకసంధి చేసికొనిరి. జర్మనులు బలవంతులుగ నుండినంతవఱకును వారి నాశ్రయించుకొనిన రాజ్యములు పరాజయము పొందుచున్నను యేదోవిధముగ యుద్ధము చేయుచువచ్చెను. జర్మనులబల మడగెను. వారు తమ మిత్రులకు తోడ్పడలేకపోయిరి. దాని ఫలము క్రింద వివరించు యుద్ధప్రస్థానములందు వ్యక్తము కాగలదు.

ఇటలీరంగము

ఆస్ట్రియావారు జూను 15-వ తేదిని మహాదస్యుందనమును ప్రారంభించిరి. ఆసియాగోనుండి సముద్రమువఱకును యుద్ధము వ్యాపించెను. ఆస్ట్రియాసేనలు జర్మనుల ప్రోద్బలముచే తమ బాహుబలము తగనియొత్తు నెత్తెను. యుద్ధప్రారంభమునందు వారికి కలిగిన స్వల్పలాభము వెంటనే నిష్ప్రయోజనమై రణస్థితియందు ప్రతిక్రియ కలుగుటకు వీలుకలిగెను. ఆస్ట్రియావారు ప్యావునదిని దాటి కొండప్రాంతమునందు యుద్ధము చేయవలసివచ్చెను. దుర్బలముగనుండిన ఇటలీ ముఖమును రక్షించుటకై ఆంగ్లపరాసుయోధులు తోడ్పడిరి. ఆస్ట్రియావారి ప్రారంభోత్సాహము తప్పుపడువఱకును శత్రువులు తరుణము వేచియుండిరి. అంతలో ప్యావునదికి వఱదలు వచ్చెను. ఆస్ట్రియావారు గమనాగమనముల సౌకర్యమునకై నిర్మించుకొనిన వంతెనలు కొట్టుకొనిపోయెను. మిత్రమండలి ప్రచలనము చూపుటకు వీలుకలిగెను. వారు ఎదురుతిరిగి యుద్ధము నారంభించిరి. తరువాతను జరిగిన యుద్ధములలో ఆస్ట్రియాసైనికు లోడుచువచ్చిరి. వారియందు నిరుత్సాహము కలుగుచువచ్చెను. దేశమునందు స్థిరపాలనమునకు యోగ్యమైనబలము నశించెను. సైనికులకు పరాజయమును, దేశమునందల్లకల్లోలమును ప్రారంభమయ్యెను. పాలకునియందు ప్రజలకు విశ్వాసము నశించెను. దానిఫలము పరివర్తనముక్రింద పరిణమించెను. రాజు రాజ్యచ్యుతుడై పారిపోయెను. ఆస్ట్రియావారు యుద్ధమును విరమించి శత్రువులకు శరణుజొచ్చిరి.

టర్కీరంగము

టర్కీయందు ఆంగ్లులు ప్రారంభించిన యుద్ధప్రస్థానముకలన రణస్థితియొక్క స్వరూపము పరిపూర్ణముగ మారిపోయెను. ఒకమూల పడమటిరంగమునందు జర్మనులు వేసవియందు విజృంభించుచుండిరి. రుష్యనుసైనికులు అస్త్రసన్న్యాసము జేసిరి. అట్టి స్థితియందు టర్కీసేనలు కాకసను, పరిష్యాప్రాంతములందు సంచలనముచూపుట కారం

భించెను. జూను 14-వ తేదిని టర్కీవారు టాబ్రిజుపట్టణము నాక్రమించుకొనిరి. అర్మీనియాయందు బాకూపట్టణము పైపునకు జొరబడుచుండిరి. బాకూపట్టణమును ఆంగ్లులు సెప్టెంబరులో త్యజించివేసిరి. స్థితిగతు లిటులుండ ఆంగ్లులు పెలస్టీనురంగమునందు టర్కీవారి నోడించి మహావిజయము పొందిరి. సెప్టెంబరు 19-వ తేదిని ఆ యుద్ధము ప్రారంభమయ్యెను. ఆ యుద్ధమునందు ఆంగ్లులకు పరిపూర్ణవిజయము కలిగెను. సముద్రము! మొదలుకొని సమారియానుండి జార్డను నదివఱకును వ్యాప్తమైయుండిన బలీయస్థానములను టర్కీసైనికు లాక్రమించుకొని యుండిరి. యుద్ధప్రస్థానము సంపూర్ణముగ వికసించువఱకును ఆంగ్లసేనానిసంకల్పము తురుష్కులకు వ్యక్తము కాలేదు. యుద్ధ మేముఖమునందు ప్రారంభమగునో యను వారి సంశయభావమునకు మఱియొకవిషయము తోడ్పడెను. ఇస్-సాల్టు పట్టణమును ఆంగ్లసేనాని జనరలు అలంబీ రెండుపర్యాయములు ముట్టడించెను. రెండు పర్యాయములును లాభము లేకపోయెను. శత్రువునకు తన నిజోద్దేశము తెలియకుండుటకే ఆ సేనాని యట్లు చేసియుండవచ్చును. తరువాత ప్రారంభమైన యుద్ధములో తురుష్కులు మోసపోయిరి. వారు తలవని ప్రాంతమునందు యుద్ధము ప్రారంభ మయ్యెను. షారోను ప్రాంతమునందు ఆంగ్లేయులు ముట్టడించి శత్రుముఖమును భేదించిరి. ఆంగ్ల అశ్వికసైనికులు శరవేగముతో ముందుకు పోయిరి. సముద్రపువార నుండిన మార్గము ఆంగ్లుల స్వాధీన మయ్యెను. జార్డన్సు ఇస్డిర్లను ప్రాంతములకు ఆంగ్లసేన నిర్గమించెను. ఆంగ్లసేనాని పన్నినయెత్తు సఫల మయ్యెను. తురుష్కసేన లొకటి తరువాత నొకటి లొంగిపోయెను. సేనలకు సేనలు నాశన మయ్యెను. వారి కుండిన రక్షణము విచ్ఛిన్న మయ్యెను. నాజరతు, హైఫా, డమాస్కసు, బైరూటు పట్టణములు క్రమక్రమముగ మిత్రమండలి స్వాధీన మయ్యెను. 60 వేల మంది తురుష్కసైనికులు విజేతలకు బందీలుగ దొరకిరి. అక్టోబరు మాసాంతమునకు తురుష్కులు లొంగిపోయిరి. వారు తమసైన్యబలము పోయినవెనుక యుద్ధమును విరమించి 30-వ తేదిని మిత్రమండలికి శరణాగతు లైరి. దీనితో తురుష్కప్రస్థానము సమాప్తి నొందెను.

బాల్కను రంగము

స్థితిగతు లిట్లు ఇతరరంగములందు జరుగుచుండ బాల్కను రంగమునందు యుద్ధము ముగియుచుండెను. మూడుసంవత్సరముల నుండి మిత్రమండలి మాసిడోనియాయందు నిరీక్షించిన తరుణము సెప్టెంబరు నెలయందు వచ్చెను. 1916-వ సంవత్సరము నవంబరు నెలలో మిత్రమండలి సేనలు మొనాస్టిరు పట్టణమును వశపరచుకొనియుండెను. అందువలన నప్పు డంత ప్రయోజనము కలిగి రుమేనియా శత్రువుపాలు గాకుండ రక్షితము కాకపోయినను దాని ప్రయోజనము 1918-వ సంవత్సరములో యుద్ధము ప్రారంభించినప్పుడు గోచరించెను. మూడుముఖముల మిత్రమండలిసేన లుండెను. మొనాస్టిరు ప్రాంతమునందు ఇటలీసేనలు, బల్గేరియాదేశమునకు దక్షిణభాగమున ఆంగ్లసేనలు వారికి మధ్యభాగమునందు ఫరాసు సర్వియా గ్రీసుసేన లుండెను. ఆంగ్లులు కొండప్రాంతమునందు యుద్ధము చేయవలసివచ్చెను. బల్గేరియాను దక్షిణప్రాంతమునుండి కొండలు రక్షించుచున్నవి. ఆ రక్షణమును ఆంగ్లులు భేదించి బల్గేరియాలో ప్రవేశించిరి. వెంటనే తక్కిన ముఖములందును యుద్ధము ప్రారంభ మయ్యెను. ఆ యుద్ధమునందు సర్వియా అశ్వికయోధులు చూపిన పరాక్రమము అతులము. దుర్భేద్య మని యెంచిన ప్రదేశము లొకటి తరువాత నొకటి మిత్రమండలికి స్వాధీన మయ్యెను. వర్దారు లోయకు రక్షణముగ నుండిన ఉస్కుబు పట్టణమును ఫరాసులు పట్టుకొనిరి. ఆంగ్లులు బల్గేరియా ప్రవేశించినప్పటి నుండియు బల్గేరియాసేనలం దుత్సాహము తగ్గిపోయెను. తమ దేశమునకు యుద్ధోపద్రవము లేనంతవరకును బల్గేరియాయోధుడు నిర్విచారముగ యుద్ధము చేసెను. బల్గేరియా సైనికు లందరు వ్యవసాయదారులు. వారు వ్యవసాయమును ప్రాణతుల్యముగ నెంచుదురు. ఎప్పుడు శత్రుసేనలు తమ దేశములో వచ్చిపడినవో ఆనాడే సంధికి బల్గేరియా సైనికుడు తహతహపడెను. సైనికులు యుద్ధమునకు విముఖు లైనప్పుడు రాజేమి చేయగలుగును? యుద్ధము మానుకొందు నని బల్గేరియారాజు మిత్రమండలికి తెలియజేసెను. మిత్రమండలి యుద్ధము నేషరతులమీద విరమించునదియు తెలిపెను. వానికి బల్గేరియావా రంగీకరించిరి. బాల్కను రంగమునందు అక్టోబరు 30-వ తేదిని యుద్ధము శాంతించెను.

ప్రపంచము — మతములు, జాతులు

భూమండల విస్తీర్ణము 19,65,50,000 చదరపుమైళ్లు. అందు 5,55,00,000 మైళ్ల ప్రదేశము భూమయము, 14,10,50,000 మైళ్ల ప్రదేశము జలమయము. భూమండలము, 6,000,000,000, భరింపగలదనియును 2100 సంవత్సరమునకు ప్రజాపోషణము దుర్లభమగుననియును పాశ్చాత్యపండితుల మతము.

	వైశాల్యము	జనసంఖ్య
యూరపు	3,750,000	400,000,000
ఆసియ	17,000,000	910,000,000
ఆఫ్రిక	11,500,000	180,000,000
ఉత్తరఅమెరిక	8,000,000	120,000,000
దక్షిణఅమెరిక	6,800,000	38,000.000
ద్వీపాంతరములు	3,450,000	8,000,000
ధ్రువప్రాంతములు	5,000,000	
	55,500,000	16,46,000,000

మతములు	జనసంఖ్య
క్రైస్తవులు	564,510,000
యూదులు	12,205,000
మహమ్మదీయులు	221,825,000
బౌద్ధులు	13ల,031,000
హిందువులు	210,540,000
కన్ఫ్యూషియనులు	300,830,000
షింటాయలు	25,000,000
శక్తిపూజకులు	158,270,000
ఇతరులు	15,280,000
	1,646,491,000

జాతులు	జనసంఖ్య
మంగోలియజాతులు	65,50,00,000
కాకేషియ	64,50,00,000
నీగ్రో	190,000,000
సెమిటి	81,000,000
మలయ	52,000,000
ఎర్రఇండియను	23,000,000

ప్రపంచమునందలి ముఖ్యరాజ్యములు (విస్తీర్ణము, జనసంఖ్య, వ్యాపారములు)

దేశము	విస్తీర్ణము చదరపుమైళ్లు	జనసంఖ్య: మొత్తము	జనసంఖ్య: చదరపుమైలుకు	జననమరణములు: వెయ్యింటికి జననము	జననమరణములు: వెయ్యింటికి మరణము	రివిన్యూ: మొత్తము సవరనులు	రివిన్యూ: తల ఒకటింటికి సవరనులు			అప్పు: మొత్తము సవరనులు	అప్పు: తల ఒకటింటికి సవరనులు			ప్రత్యేక వ్యాపారము: మొత్తము సవరనులు	ప్రత్యేక వ్యాపారము: తల ఒకటింటికి సవరనులు		
ఆంగ్లసామ్రాజ్యము ...	13,128,712	435,000,000	33	—	—	—	—			—	—			—	—		
ఆంగ్లదేశము ...	121,377	45 407,037	374	21.1	14.6	707,235,000	15	6	10	6,970,000,000	145	0	0	1,660,922,000	36	2	10
హిందూదేశము ...	1,803,030	315,000,000	158	—	30.9	82,000,000	0	5	0	300,000,000	0	19	0	287,000,000	0	18	0
కనాడా ...	3,730,000	7,250,000	2	27.82	15.12	24,000,000	3	6	0	68,000,000	9	8	0	175,000,000	24	3	0
న్యూఫౌండులాండు ...	162,750	250,000	2	28.8	10.6	750,000	3	0	0	5,500,000	22	0	0	5,000,000	20	0	0
ఆస్ట్రేలియా ...	3,063,041	5,000,000	2	27.7	10.5	20,000,000	4	0	0	273,000,000	54	12	0	147,000,000	29	8	0
న్యూజిలాండు ...	105,000	12,00,000	11	26.3	9.5	11,000,000	10	0	0	82,000,000	75	9	0	39,000,000	35	9	0
దక్షిణాఫ్రికా ...	473,100	6,000,000	13	—	—	17,000,000	2	17	0	117,000,000	19	10	0	94,000,000	15	13	0

దేశము	విస్తీర్ణము చదరపు మైళ్లు	జనసంఖ్య మొత్తము	జనసంఖ్య చదరపు మైలుకు	జనన మరణములు: వెయ్యింటికి జననము	జనన మరణములు: వెయ్యింటికి మరణము	రివిన్యూ మొత్తము సవరనులు	రివిన్యూ తల ఒకటింటికి సవరనులు			అప్పు మొత్తము సవరనులు	అప్పు తల ఒకటింటికి సవరనులు			ప్రత్యేక వ్యాపారము మొత్తము సవరనులు	ప్రత్యేక వ్యాపారము తల ఒకటింటికి సవరనులు		
సంయుక్త రాష్ట్రములు ...	3,027,000	92,000,000	31	—	—	207,000,000	2	5	0	212,000,000	2	6	0	788,000,000	8	0	0
,, (ఎక్స్ట్రా) ...	721,100	10,000,000	14	—	—	—		—		—		—		—		—	
అబిసీనియా ...	350,000	7,000,000	20	—	—	—		—		—		—		2,000,000	0	6	0
ఆఫ్గనిస్థానము ...	246,000	5,000,000	21	—	—	1,000,000	0	4	0	—		—		3,000,000	0	12	0
అల్బానియా ...	12,000	2,000,000	166	—	—	—		—		—		—		—		—	
అర్జంటైనా ...	131,841	8,000,000	7	42.1	21.6	28,000,000	3	17	0	105,000,000	14	9	0	140,000,000	19	0	0
ఆస్ట్రియా ...	134,634	29,000,000	222	31.4	21.9	215,000,000	4	6	0	780,000,000	15	12	0	283,000,000	4	18	0
బెల్జియం ...	11,400	7,500,000	658	23.7	15.2	38,000,000	4	8	0	160,000,000	21	7	0	324,000,000	48	4	0
బొలివియా ...	570,000	3,000,000	4	—	—	1,400,000	0	13	0	3,000,000	1	7	0	10,000,000	4	11	0
బ్రేజిలు ...	3,300 000	22,000,000	7	—	—	30,000,000	1	6	0	194,000,000	8	9	0	120,000,000	5	4	0
బల్గేరియా ...	42,000	4,500,000	119	40.3	26.4	17,000,000	1	12	0	25,000,000	5	14	0	15,000,000	3	8	0
చిల్లి ...	295,000	4,000,000	12	37.2	31.1	15,000,000	4	8	0	48,000,000	12	7	0	51,000,000	15	0	0
చీనా ...	4.300,000	400,000,000	99	—	—	40,000,000	0	2	0	150,000,000	0	7	0	115,000,000	0	6	0
కొలంబియా ...	4,62,000	54,75,000	12	—	—	25,000,000	0	9	0	2 500,000	0	9	0	7,000,000	1	5	0
కోస్టారికా ...	23,000	4,41,000	17	43.8	26.1	950,000	2	8	0	2,700,000	5	2	0	4,000,000	10	5	0
క్యూబా ...	44,178	2,150,000	49	34.4	11.2	3,000,000	3	15	0	12,500,00	5	2	0	51,000,000	23	14	0
డెన్మార్కు ...	15,500	2,800,000	180	26.7	13.4	9,500,000	3	8	0	20,000,000	7	3	0	65,000,000	23	4	0
డొమినిక ...	18,750	7,00,000	37	—	—	1,000,000	1	8	9	4,000,000	5	14	0	3,600,000	5	3	0
ఇక్వేడారు ...	116,530	1,300,000	11	—	—	1,500,000	1	3	0	5,000,000	3	17	0	4,000,000	3	2	0
ఈజిప్టు ...	363,181	12,600,000	31	—	—	17,750,000	1	11	0	95,000,000	8	8	0	57,000,000	5	1	0
సుదాను ...	984,520	3,000,000	3	—	—	1,500,000	0	10	0	5,000,000	1	13	0	4,000,000	1	6	0
ఫ్రాన్సు ...	207,100	40,000,000	193	18.7	19.6	130,000,000	4	15	0	1,015,000,000	24	8	0	566,000,000	14	3	0
,, వలసరాజ్యములు...	3,800,000	55,000,000	11	—	—	—		—		—		—		—		—	
అల్జీరియా ...	1,120,000	5,600,000	5	25.1	18.9	6,000,000	1	1	0	—		—		48,000,000	8	11	0
మొరాకో ...	193,000	4,500,000	40	—	—	—		—		—		—		3,000,000	1	6	0
ట్యూనిసు ...	46,300	1,800,000	40	—	—	4,500,000	2	5	0	—		—		10,500,000	5	17	0
జర్మని ...	208,780	65,000,000	311	29.8	16.2	1,54,500,000	2	8	0	1,000,000,000	15	8	0	876,000,000	13	[illegible]	9
,, వలసరాజ్యములు...	1,134,240	15,000,000	13	—	—	—		—		—		—		—		—	
గ్రీసు ...	48,522	5,000,000	114	—	—	5,400,000	2	0	0	40,000,000	14	16	0	12,500,000	4	13	0

గ్వ్యాటామల ...	47,500	2,000,000	42	—	—	8,00,000	0	8	0	6,000,000	3	0	0	3,000,000	1	10	0
హైటి ...	10,200	2,000,000	196	—	—	1,400,000	0	14	0	7,000,000	3	10	0	2,000,000	1	0	0
హాండురాసు ...	44,275	650,000	13	35.3	17.8	400,000	0	11	0	6,200,000	11	0	0	8,000,000	1	9	0
హంగరి ...	125,400	21,000,000	170	34.8	24.9	—		—		—		—		—		—	
ఇటలి ...	110,623	35,000,000	315	31.5	21.4	114,000,000	2	5	0	522,000,000	14	18	0	222,000,000	6	7	0
,, వలసరాజ్యములు...	601,200	16,00,000	3	—	—	—		—		—		—		—		—	
జపాను ...	140,200	75,500,000	356	34.2	21.9	58,000,000	1	3	0	260 000,000	5	4	0	101,000,000	2	0	0
,, స్వాధీనరాజ్యములు...	95,700	18,000,000	187	—	—	—		—		—		—		—		—	
లిబేరియా ...	41,000	2,000,000	50	—	—	1,00,000	0	1	0	100,000	0	1	0	400,000	0	4	0
లక్సెంబర్గు ...	1,000	260,000	260	—	—	7,50,000	2	2	0	1,400 000	5	8	0	—		—	
మెక్సికో ...	769,000	16,000,000	21	—	—	10,500,000	0	13	0	44,000,000	2	15	0	51,000,000	5	4	0
మాంటినీగ్రో ...	5,800	5,00,000	85	—	—	1,25,000	0	11	0	250,000	1	17	0	450,000	1	19	0
నెదరులాండ్సు ...	12,761	6,600,000	407	27.8	14.5	17,000,000	2	17	0	97,000,000	16	3	0	503,000,000	83	17	0
,, వలసరాజ్యములు...	822,500	38,000,000	46	—	—	—		—		—		—		—		—	
నికరాగ్వా ...	51,700	6,00,000	11	—	—	2,50,000	0	8	0	2,600,000	3	7	0	1,600,000	2	10	0
నార్వే ...	1,24,400	2,400,000	19	25.9	13.2	7,200,000	3	0	0	20,500,000	8	11	0	42,000,000	17	10	0
పనామా ...	31,890	4,00,000	13	—	—	6,70,000	1	12	0	—		—		2,700,000	6	6	0
పరాగ్వే ...	97,700	8,00,000	8	—	—	8,00,000	1	0	0	3,000,000	0	8	0	2,000,000	2	10	0
పర్షియా ...	6,30,000	10,000,000	16	—	—	2,700,000	0	5	0	6,700,000	0	13	0	16,000,000	1	12	0
పెరు ...	6,80,026	3,530,000	5	—	—	2,800,000	0	16	0	5,600,000	1	11	0	14,000,000	3	19	0
పోర్చుగలు ...	35,500	6,000,000	155	30.7	19.4	15,200,000	2	15	0	147,000,000	26	15	0	23,000,000	4	3	0
,, వలసరాజ్యములు...	804,000	10,000,000	12	—	—	—		—		—		—		—		—	
రుమేనియా ...	52,700	7,200,000	142	43.0	25.7	22,000,000	5	3	0	63,200,000	9	1	0	11,000,000	5	17	0
రుష్యా ...	8,770,705	180,000,000	19	46.3	29.8	300,000,000	1	16	0	945,000,000	5	15	0	268,000,000	1	13	0
సల్వాదరు ...	7,225	1,300,000	165	—	—	1,000,000	0	17	0	1,700,000	1	8	0	2,500,000	2	17	0
సర్బియా ...	34,000	5,000,000	143	39.0	22.4	5,250,000	1	15	0	26,500,000	8	17	0	9,500,000	3	3	0
సయాము ...	2,20,000	8,150,000	28	—	—	4,750,000	0	15	0	8,000,000	1	6	0	13,500,000	2	3	0
స్పెయిను ...	1,96,700	20,500,000	103	31.8	28.7	42,000,000	2	2	0	390,000,000	19	10	0	80,000,000	4	0	0
స్వీడను ...	1,72,900	5,500,000	32	23.8	13.8	14,000,000	2	11	0	34,000,000	6	4	0	75,000,000	13	13	0
స్విజర్లాండు ...	15,950	3,800,000	236	25.0	15.1	7,000,000	0	17	0	—		—		126,000,000	33	3	1
టిబెటు ...	5,00,000	8,000,000	16	—	—	—		—		—		—		—		—	
తుర్కీ ...	6,95,000	20,000,000	29	—	—	26,275,000	1	11	0	128,000,000	7	11	0	48,000,000	2	16	[illegible]
ఉరుగ్వే ...	72,200	1,400,000	15	31.7	14.5	7,500,000	6	15	0	26,500,000	24	18	0	17,000,000	15	9	0
వెనిజులా ...	3,63,728	3,000,000	6	32.8	22.1	2,800,000	1	4	0	7,700,000	3	6	0	7,600,000	3	0	0

బ్రిటీషు సామ్రాజ్యభాగములయొక్క విస్తీర్ణము జనసంఖ్యా వ్యాపారము

దేశము	విస్తీర్ణము	జనసంఖ్య	దేశము	విస్తీర్ణము	జనసంఖ్య
యూరపు	1,21,512	458,78,500	మధ్యమ అమెరికా	8,600	50,000
ఆసియా	2,187,550	323,158,000	వెస్టుఇండీసు	12,300	1,730,000
ఆఫ్రికా	3,618,245	49,58,150	దక్షిణ అమెరికా	97,800	3,14,000
ఉత్తర అమెరికా	3,893,020	7,458,000	ఆస్ట్రేలేషియా	3,214,685	6,240,000
			మొత్తము	1,31,53,685	43,42,86,670

ఖండములలోనిరాష్ట్రములు	ఎట్లు లభించినది.	వత్సరము	చదరపు మైళ్లు	జనసంఖ్య	ఎగుమతులు	దిగుమతులు
యూరపు					పౌ.	పౌ.
సంయుక్తరాష్ట్రము	మాతృదేశము	—	121,090	45,500,000	1,06,40,00,000	5,270,00,000
మాను ద్వీపము	,, ...	—	230	50,000	—	—
చానలు ద్వీపములు	,, ...	—	70	97,000	—	—
మాల్టా గోజా	సమాధానముమీఁదనిచ్చివేయఁబడి	1814	120	211,000	33,18,412	5,89,552
జిబ్రాల్టరు	,, ,, [నది	1713	2	20,000	—	—
ఆసియా						
హిందూదేశము	జయింపఁబడినది	1757-1897	1,90,000	315,000,000	132,000,000	166,000,000
సింహళము	సమాధానముమీఁదనిచ్చివేయఁబడి	1801	2,550	4,100,000	14,600,000	20,000,000
స్ట్రేయిట్ సెట్టిల్మెంటులు	,, ,, [నది	1785-1909	1,660	700,000	62,000,000	58,000,000
సంయుక్తమలయా రాష్ట్రములు	,, ,, ...	1874-1888	27,700	1,000,000	8,934,000	27,568,000
ఇతరమలయారాష్ట్రములు	,, ,, ...	1909	14,200	800,000	1,575,000	5,229,000
హాంగ్ కాంగు	,, ,, ...	1842-1906	390	440,000	—	—
వీహైవాయి	,, ,, ...	1898	300	160,000	—	—
ఉత్తరబోర్నియొ	ఇచ్చివేయఁబడినది	1877	31,100	204,000	8,87,000	11,70,000
బ్రూనెయి	సమాధానముమీఁదనిచ్చి వేయఁబడి	1888	4,000	30,000	—	—
సరవాక్	రక్షణార్థము చేరినది [నది	1888	50,000	650,000	6,60,000	7,09,000
సైప్రసు	సమాధానముమీఁదనిచ్చివేయఁబడి 1914-లో కలుపుకొనబడినది [నది	1878	3,600	275,000	10,00,000	8,00,000
ఆఫ్రికా						
కేపురాష్ట్రము	సమాధానముమీఁద నిచ్చివేయఁబడి	1814	277,000			
నెటాలు	కలుపుకొనఁబడినది [నది	1843	35,400	5,100,000 (నెటాలు, ట్రాన్సువాలు)		
ట్రాన్సువాలు	,, ,, ...	1900	110,400			
ఆరంజిఫ్రీ స్టేటు	,, ,, ...	1900	50,400		3,20,00,000 (కేపురాష్ట్రము — రొడీసియ)	1,70,00,000
బసుతోలాండు	,, ,, ...	—	10,300	350,000		
బెచ్వలాండు	,, ,, ...	1895	275,000	126,000		
రొడీసియ	,, ,, ...	1889	450,000	1,750,000		
గాంబియ	సమాధానముమీఁదనిచ్చివేయఁబడి	1807	4,000	146,000	8,000,000	6,50,000
గోల్డు కోస్టు	,, ,, [నది	1672	80,000	1,400,000	5,500,000	60,00,000
సీర్రాలియోను	,, ,, ...	1787	34,000	1,100,000	12,60,000	11,00,000
ఉత్తరనైజీరియ	,, ,, ...	1891	255,700	10,000,000	5,1,00,000 (ఉత్తర, దక్షిణ నైజీరియ)	60,00,000
దక్షిణనైజీరియ	,, ,, ...	1891	73,000	7,000,000		
సోమలిలాండు	,, ,, ...	1881	68,000	300,000	3,23,000	2,40,000
తూర్పుఆఫ్రికా	,, ,, ...	1588	182,000	4,000,000	22,00,000	10,00,000
ఉగండ	,, ,, ...	1894	223,500	2,500,000	13,00,000	11,00,000
జాంజిబారు	,, ,, ...	1890	1,020	200,000	9,00,000	6,00,000
న్యాసలాండు	,, ,, ...	1891	300,000	1,000,000	2,00,000	2,10,000

ఖండములలోనిరాష్ట్రములు	ఎట్లు లభించినది	వత్సరము	చదరపు మైళ్లు	జనసంఖ్య	ఎగుమతులు	దిగుమతులు
ఈజప్టు	ఆక్రమించుకొనఁబడినది	1882	400,000	12,000,000	2,10,00,000	3,10,00,000
సుదాను	జయింపఁబడినది	1898	1,000,000	2,000,000	25,00,000	21,00,000
మారిషసు	,, ఇచ్చివేయఁబడినది	1810-1811	720	370,000	33,00,000	37,50,000
సిచిలీసు	సమాధానమునీఁదనిచ్చివేయఁబడి	1814	150	28,000	—	—
ఆసెన్షను	ఆక్రమించుకొనఁబడినది [నది	1815	40	150	—	—
సెయింటుహెలీన	జయింపఁబడినది	1678	47	3,500	35,000	41,000
అమెరికా						
ఒంటారియొ	జయింపఁబడి ఇచ్చివేయఁబడినది	1759-1763	407,250			
క్వీబెకు	,, ,, ...	1759-1763	706,850			
నోవాస్కోషియా	,, ,, ...	1627-1713	21,500			
న్యూబ్రన్సువికు	సమాధానమునీఁద నిచ్చివేయఁబడి	1763	28,000			
ప్రిన్సుఎడ్వర్డు ద్వీపము	జయింపఁబడినది [నది	1745-1763	2,200			
బ్రిటిషుకొలంబియ	అధినివేశింపఁబడినది	1670	355,900			
మెనిటోబా	,, ...	1813	251,900	7,200,000	16,00,00,000	24,00,00,000
ఆల్బర్టా	,, ...	1670	255,300			
సస్కాచెవాను	,, ...	1670	251,700			
పశ్చిమోత్తరరాష్ట్రములు	,, ...	1670	1,250 000			
న్యూఫౌండ్లాండు	సమాధానమునీఁదనిచ్చివేయఁబడి	1583	40,000	240,000	80,00,000	35,00,000
జమెయిక	జయింపఁబడినది [నది	1655	4,200	850,000	32,00,000	29,00,000
బాహామాసు	అధినివేశింపఁబడినది	1629	4,400	56,000	4,75,000	3,33,000
లీవరు ద్వీపములు	,, ...	1623-1659	750	140,000	6 76,000	11,30,000
విండ్వర్డు ద్వీపములు	ఇచ్చివేయఁబడినది	1763-1783	510	200,000	8 00,000	10,00,000
బార్బడాసు	అధినివేశింపఁబడినది	1603	170	196,000	18,50,000	22,07,000
ట్రినిడాడు, టోబాగో	జయింపఁబడినది	1797	1,860	330,000	45,00,000	51,00,000
బ్రిటీషు గ్వయానా	జయింపఁబడి ఇచ్చివేయఁబడినది	1803-1814	90,300	310,000	5,00,000	38,00,000
బ్రిటీషు హాండురాస్	,, ...	1798	8,600	40,500	5,00,000	5,10,000
బర్మ్యూడా	అధినివేశింపఁబడినది	1612	20	19,000	7,35,000	1,40,000
ఫాక్లాండు ద్వీపములు	సమాధానమునీఁద నిచ్చివేయఁబడి	1771	6,500	3,240	6,00,000	17,50,000
దక్షిణజార్జియ	,, [నది	1771	1,000	—	—	
ఆస్ట్రేలేషియా						—
న్యూసౌతువేల్సు	అధినివేశింపఁబడినది	1788	310,400	1,650,000		
విక్టోరియ	,, ...	1832	88,000	1,320 000		
దక్షిణఆస్ట్రేలియ	,, ...	1836	904,000	409,000	7,75,00,000	7,80,00,000
క్వీన్సులాండు	,, ...	1824	670,500	606,000		
టాస్మేనియ	,, ...	1804	26,200	191,000		
పశ్చిమఆస్ట్రేలియ	,, ...	1828	976,000	282,000		
న్యూజిలాండు	,, జయింపఁబడినది	1845	105,000	1,050,000	25,00,000	3,33,00,000
ఫిజి	స్వదేశీయులయొద్దనుండి ప్రతిగ్ర	1874	7,500	130,000	8,80,000	22,00,000
పాపువ	కలుపుకొనఁబడినది [హింపఁబడినది	1884	90,540	360,000	2,60,000	1,50,000
పసిఫికు ద్వీపములు	సమాధానమునీఁద నియ్యఁబడినది	1893-1906	12,500	200,000	2,85,000	3,00,000

సార్వభౌముని మంత్రివర్గము

క్రొత్తపార్లమెంటు 1918 డిసెంబరు 14-వ తేదిని నియుక్తమై 1919 ఫిబ్రవరి మాసమునందు కూడినది. ప్రజాప్రతినిధుల సభయందు 707 సభ్యులుగలరు. అందు సంయుక్తపక్షమువారు 478 తదితర పక్షమువారు 229 మందియును గలరు. ఇతరపక్షమునందు గల వారియందు కర్మకారులు; సంయుక్తవాదులు 48; ఉదారవాదులు 28; సిన్‌ఫీనరులు 73 జాతీయవాదులు 7 స్వతంత్రవాదులు 10 మందికలరు. నియోజకగణముసంఖ్య 1,60,0,0000 మంది గలరు. అందు 60,00,000 మంది స్త్రీలు గలరు. ప్రభువుల సభయందు 692 ప్రభువులు గలరు. ప్రస్తుతము పరిపాలనాధికారమును వహించుచున్న మంత్రివర్గము :

ప్రధానమంత్రి: రైటు ఆనరబిలు లాయడుజార్జి

పార్లమెంటునాయకుడు, ప్రివిశీలుప్రభువు: రైటు ఆనరబిలు బోనరులా

పోర్టుపోలియోలేనిమంత్రులు: బర్నిసు, ఎరిక్ గిడ్డిసు

లాండుచాన్సిలరు: సర్ ఎస్. ఇ. స్మిత్తు

దేశాంగమంత్రి: సర్ హోమరు గ్రీను ఉడ్డు

విదేశాంగమంత్రి: బాల్ఫరు. సహాయమంత్రి: సెసిలు హారమ్సువర్తు

వలసదేశాంగమంత్రి: మిల్నరు ప్రభువు. సహాయమంత్రి: కర్నలు అమెరి

యుద్ధాంగ వైమానికశాఖలమంత్రి: చర్చిహిల్లు. సహాయమంత్రి: పీలుప్రభువు. యుద్ధాంగశాఖ కోశాధికారి: హెచ్. హార్టు న్సరు. సహాయమంత్రి: మేజరు జనరలు సీలీ

హిందూదేశాంగమంత్రి: ఎడ్విను సామ్యుయలు మాంటాగు. సహాయమంత్రి: సిన్హా ప్రభువు

నౌకాశాఖ మొదటిప్రభువు: వాల్టరులాంగు సహాయమంత్రి: డాక్టరు మెక్నామరా.

వాణిజ్యశాఖాధ్యక్షుడు: సర్ ఆల్బర్టు స్టాన్లీ. సహాయమంత్రి: సి. బ్రిడ్జిమాను

విదేశవాణిజ్యశాఖామంత్రి: సర్ స్టీలు మెయిటులాండు

స్థానికప్రభుత్వశాఖాధ్యక్షుడు: డాక్టరు అడిసను. సహాయమంత్రి: స్టీఫెను వాల్సు

వ్యవసాయశాఖాధ్యక్షుడు: ఆర్. ఎస్. ప్రొతరో. సహాయమంత్రి: సర్ గ్రిఫ్ఫిను బాస్కవెను.

విద్యాశాఖాధ్యక్షులు: డబ్ల్యు. ఎ. ఐ. ఫిషరు. సహాయమంత్రి: హెర్బర్టు ల్యూయిస్.

సప్లైలమంత్రి: ఆండ్రూవేర్. సహాయమంత్రులు: కెల్లవే, మేజరు బెయర్డు.

ఆహారపదార్థముల మంత్రి : జి. హెచ్. రాబర్ట్సు

నౌకా నిర్మాణశాఖా మంత్రి : సర్ జోసెఫు మెక్లే. సహాయ మంత్రి : వెస్లీ విల్సను

కార్మికశాఖా మంత్రి: సర్ ఆర్. ఎస్. హోవను, సహాయ మంత్రి : వార్డిలు

ఉపకారవేతనశాఖామంత్రి : సర్ వర్తింగ్టను ఈవాన్సు, సహాయమంత్రి : కర్నలు క్రేగు

జాతీయసేవాపునర్నిర్మాణమంత్రి : సర్ ఆక్లండు గెడ్డిసు. సహాయ మంత్రి : సిసెలు బెక్కు

లంకాస్టరు డచ్చి ఛాన్సిలరు : క్రాఫోర్డు ప్రభువు

పబ్లికువర్క్సు కమీషనరు: సర్ ఆల్ఫర్డు మాండు

అటర్నీ జనరలు: సర్ గార్డను హ్యూవర్టు

సాలిసిటరు జనరలు: సర్ ఎర్నెస్టు పోలకు. టి. డబ్ల్యు. మారిసను

పోస్టుమాస్టరు జనరలు: ఎ. హెచ్. ఇల్లింగ్వర్తు. అసిస్టెంటు పోస్టు మాస్టరు జనరలు: పైక్ పెసు

పే మాస్టరు జనరలు: సర్ కాంప్టను రికెట్టు

కోశాధ్యక్షులు: అస్టిను చేంబర్లేను

పార్లమెంటు సంయుక్తకార్యదర్శులు: ఎడ్మండు ప్రభువు, కెప్టను గెస్టు

కోశాధికార సంయుక్తకార్యదర్శులు: సర్ హడ్మాను లీవరు, స్టాన్లీ బాల్డువిను

లార్డు కమీషనరులు : జె. ఎఫ్. హోప్, జె. డబ్లియు. ప్రాటు, జె. పార్కరు, టవిను జోన్సు

స్కాట్లండు దేశాంగకార్యదర్శి : రాబర్టు మన్రో,

ఐర్లండు లార్డు లెప్టినెంటు : ఫ్రెంచి ప్రభువు

లార్డు చాన్సిలరు : సర్ జె. కాంబెట్

ఐర్లండు దేశాంగముఖ్య మంత్రి : ఇయను మెక్ఫర్సను

లార్డు చేంబర్లేను : సాండుహర్స్టు ప్రభువు

హిందూదేశాంగమంత్రిసభ

కార్యాలయములు: వైటుహాలుభవనము, లండను

కార్యదర్శి: రైటు ఆనరబిలు ఇ. ఎస్. మాంటాగు

సహాయకార్యదర్శి: సిన్హా ప్రభువు

సహాయ సంయుక్తకార్యదర్శులు: సర్ లైనలు అబ్రహాము, సర్ ఆర్థరు హిర్జెలు

ఉపాధ్యక్షులు: లారెన్సు కర్రి

సభ్యులు: సర్ ఎఫ్. డబ్ల్యు. డ్యూకు; సర్ ఆర్నాల్డు వైటు, సర్ ముర్రె హామికు; సర్ సి. ఎస్. బెయిలి; డబ్లియు. డి. షెప్పర్డు; సర్ మార్షలు ఫ్రెడరికు రీడు; సర్ ఈ. బి. బార్లో; జె. బి. బ్రినెటు; సాహిబ్జాదా అప్తాబు అహమదు ఖాను; సర్ ప్రభాశంకర పట్టనీ; భూపేంద్రనాథ బోసు

దేశాంగప్రభుత్వమువారు సంవత్సరమునకు 50 వేల సవరనులు విరాళముగ నిచ్చుచున్నను హిందూదేశ కార్యాలయ వ్యయములకు సొమ్ము భారతదేశ రివిన్యూలనుండియే తెచ్చింపబడుచున్నది. కార్యాలయవ్యయములు, ఉపకారవేతనముల వ్యయముతో సయితము సంవత్సరమునకు 2 కోట్ల 50 వేల సవరను లగుచున్నవి.

భరతఖండము

ప్రపంచభాగములం దొక ముఖ్యభాగమైన భరతఖండము ఆసియాఖండమునకు దక్షిణదిగ్భాగమునందు మధ్యస్థముగ నున్నది. భరతఖండమునకు మూడుదిశలను సముద్రములును నుత్తరదిశయందు హిమవన్నగములును గలవు. ఉన్నతనగరాజము సముద్రములు సస్యసమృద్ధికి సాధనములు. ప్రచండమార్తాండుడు పూర్వ వానలుపడమటిగాలులు దేశమును ఫలవంతము చేయుచున్నవి. మధ్యస్థితి సముద్రతీరములు మహానదులు కాసారములు మహాటవులు నగాగ్రభాగములు మలయమారుతములు చంద్రజ్యోత్స్నలు భరతవర్ష వైభవంబును బ్రకటించుచున్నవి భరతఖండము సకలవిధముల నాసియాఖండమునందు కేంద్రస్థానముగ నుండుటకు దగియున్నది. దేశమునందు వ్యవసాయమునకు పరిశ్రమలకు వాణిజ్యమునకు వలయు సాధనసంపదలు గలవు. దేశవైశాల్యము 17,33,168 చదరపుమైళ్లు. జనసంఖ్య 32 కోట్లు. దేశమునందలి సహజసంపదలు వికసించి ప్రజలకు ప్రత్యభిజ్ఞానము గలిగినపుడు భారతరాజ్యము లోకరాజ్యములం దద్వితీయస్థానము నలంకరించగలదని విజ్ఞులకు విదితమగుచున్నది. భారతీయులు వ్యవసాయాత్ములై భగవదిష్టమైన గమ్యస్థానమును జేరుటకు ప్రయత్నించిన సఫలమనోరథులు గాగలరు. ఆ ప్రయత్నములు ఆధ్యాత్మిక విభూతియందు పరిణమింపవలయును.

భరతఖండవిభాగము

విశాలమైన హిందూదేశమునందు 14 రాజ్యభాగములు 675 సంస్థానములు గలవు. బ్రిటీషు రాజ్యమునందు 10,97,901 చదరపుమైళ్ళ ప్రదేశము; సంస్థానములందు 6,75,267 మైళ్ళ ప్రదేశము గలదు.

బ్రిటీషు రాజ్యభాగములు

రాష్ట్రములు	జిల్లాల మొత్తము	విస్తీర్ణము చదరపుమైళ్లు	జనసంఖ్య (1911)
అజ్మీరు, మార్వారా	2	2711	501,395
అండమాను, నికోబారు ద్వీపములు	—	3143	26,459
అస్సాము	12	52,959	6,713 635
బెలూచిస్థానము	6	45,804	414,412
బంగాళము	28	78,412	45,483,077
బీహారు, ఒరిస్సాలు	21	83,205	34,490,084
బొంబాయి రాజధాని	26	123,064	19,672,642
బొంబాయి	26	75,918	16,113,042
సింధుదేశము	6	47,066	3,513,435
ఏడను	—	80	46,165
బర్మా	41	236 738	12,115,217
మధ్యరాష్ట్రములు, బీరారు	22	100,345	13,916,308
కూరగు	1	1,582	174,976
మద్రాసు	24	141,726	41,405,4[illegible]4
పశ్చిమోత్తర పరగణాలు	5	16,466	2,106,933
పంజాబు	29	97,209	19,974,956
సంయుక్తరాష్ట్రములలో చేరిన అగ్రా, అయోధ్య	48	107,164	47,182,044
అగ్రా	36	83,198	34,624,040
అయోధ్య	12	23,966	12,558,004
బ్రిటిషు ప్రభుత్వమునకు చెందిన మొత్తము	267	1,097,901	244,267,042

సంస్థానములు

సంస్థానములు	జిల్లాల మొత్తము	విస్తీర్ణము చదరపుమైళ్లు	జనసంఖ్య (1911)
బెలూచిస్థాన్ సంస్థానము	—	86,511	399,432
బరోడాసంస్థానము	—	8,099	2,032,798
బంగాళమునకు చేరిన సంస్థానములు	—	32,773	4,538,161
బొంబాయికి చేరిన సంస్థానములు	—	65,761	7,411,567
మధ్యయిండియాఏజన్సీకి చేరినవి	—	78,772	9,356,980
మధ్యరాష్ట్రసంస్థానములు	—	31,188	2,117,002
తూర్పుబంగాళము అస్సాము నకుచేరిన సంస్థానములు	—	—	575,835
హైదరాబాదు సంస్థానము	—	82,698	13,374,676
కాశ్మీరుసంస్థానము	—	80,900	3,158,126
మదరాసునకుచేరిన సంస్థానములు	—	9,969	4,811,841
కొచ్చినుసంస్థానము	—	—	918 110
తిరువాన్కూరుసంస్థానము	—	—	3,428,975
మైసూరుసంస్థానము	—	29,444	5,806,193
పశ్చిమోత్తరపరగణాల ఏజెన్సీకి చెందినవి	—	—	1,622,094
పంజాబునకు చేరినవి	—	36,532	4,212,794
రాజపుటానా ఏజెన్సికిచెందినవి	—	127,541	10,530,432
సిక్కిముసంస్థానము	—	—	87,920
సంయుక్తరాష్ట్రములకు చేరినవి	—	5079	832,036
సంస్థానముల మొత్తము		675,267	70,864,995
రెంటిమొత్తము		1,773,168	315,132,537

భరతఖండ ప్రభుత్వము

సభాయుతుడైన గవర్నరు జనరలు పాలించును.

రాజప్రతినిధి గవర్నరు జనరలు మహామహుడు: రైటు ఆనరబిలు జేరక్ష్ చెమ్సుఫర్డు జి. సి. బి. ఇ గారు

1916-వ సంవత్సరము ఏప్రిలు 5-వ తేదిని కార్యభారమును దాల్చెను

కార్యనిర్వాహకసభ

సర్ జి. ఎస్. బార్నెసు గారు   సర్ విలియము హెన్రి విన్సెంటు గారు   సర్ జేమ్సు మెస్టను గారు

సర్ సి. హెచ్. ఎ. హిల్లు గారు   సర్ సి. శంకరనాయరు గారు

సర్ జి. ఆర్. లంవడెసు గారు   సర్ సి. సి. మన్రో గారు (సేనాధ్యక్షుడు)

సామ్రాజ్యశాసనసభాసభ్యులు

ప్రజానిర్వాచితులు

రావుబహాదూరు ఒయ్యా నరసింహేశ్వరశర్మగారు	చెన్నపురి
వి. శ్రీనివాసశాస్త్రిగారు	,,
కె. వి. రంగస్వామయ్యంగారు	,,
ఖాన్‌బహాదూరు మీర్ అసదలీఖాన్ గారు	,,
వి. జె. పటేలుగారు	బొంబయి
సర్ దిన్షా ఎడుల్జీ వాచాగారు	,,
ఖాన్‌బహాదూరు సయ్యదు అల్లాండు షా గారు	,,
మహమ్మద్ అలీ జిన్నా గారు	,,
మాల్కమ్ ఎన్ హాగ్గుగారు	,,
సురేంద్రనాథ బెనర్జీగారు	బంగాళము
రాయిసీతానాథరాయి బహదూరుగారు	,,
అబ్దుల్ రహీముగారు	,,
ఖాన్‌బహదూరు నవాబు సయ్యదు నవాబు అలీ చౌదరిగారు	,,
కాశింబజారు మహారాజా సర్ మనీంద్రచంద్ర నందిగారు	,,
డబ్ల్యు. ఎ. ఐరన్‌సైడుగారు	,,
డాక్టరు తేజబహాదూరు సప్రూగారు	సం॥ పరగణాలు
పండిత మదనమోహన మాళవియాగారు	,,
రాజా సర్ రాంపాలుసింగుగారు	,,
మహమ్మదాబాదు రాజా సర్ మహమ్మద్ మహమ్మద్‌ఖాన్, ఖాన్‌బహదూరుగారు	,,
సర్దారు బహదూరు సర్దారు సుందరసింగుమజితియాగారు	పంజాబు
మాంగ్‌భాటుగారు	బర్మా
రాయిబహదూరు కృష్ణసాహేగారు	బీహారు, ఒరిస్సా
రాజా రాజేంద్రనారాయణ భంజదేవుగారు	,,
మజురల్ హాక్‌గారు	,,
కామినికుమార చంద్రగారు	అస్సాము
గణేశ శ్రీకృష్ణ కపర్దేగారు	మధ్యరాష్ట్రములు
రాయిబహదూరు బిషన్‌దత్తు సుకుల్	,,

ప్రభుత్వనియోజితులు

ఉద్యోగులు కానివారు

పరిశ్రమలు, వృత్తులు: వ్యవసాయము, గుడ్డలనేత జమఖానాల నేత, లక్క పనులు, తోలుమీద రంగువేయుట, కంబళ్లు, దూదిని శుభ్రపరచు యంత్రశాలలు, ఇనుమును తయారుచేయుట మున్నగునవి గలవు. రాగిని తయారుచేసెదరు. వర్తకము తక్కువ. దూది చెన్నపురికి, బొంబయికి పంపబడుచున్నది.

ఆరోగ్యము: వైద్యశాలలసంఖ్య 19, చికిత్సబొందినవారు 239785, జననములు 1917 లో 24761.

మరణములు 33025, జ్వరములు 22329, కలరా 1672, గ్రహణి 1165, మశూచి 85, ప్లేగు 819.

పోలీసు: సూపరింటెండెంటు 1, అసిస్టాంటు 2, డిప్యూటీ సూపరింటెండెంటు 2, ఇన్స్పెక్టర్లు 2, సబుఇన్స్పెక్టర్లు 52, హెడ్డుకనిస్టేబిల్సు 115, సార్జెంట్లు 3, కనిస్టేబిల్సు 1010, నేరములు 3425 స్టేషనులు 40.

విద్యాప్రవృత్తి: ఎలిమెంటరీస్కూళ్లు 900.

హైస్కూళ్లు: కర్నూలు 2, నంద్యాల 1, మొత్తము 3, పరపతిసంఘములు 4. సభ్యులు 669. వ్యక్తులకు ఋణమిచ్చినది 12130. యూనియనులు 1. సంఘముతో చేర్చబడినవి 16. మొత్తము సభ్యుల సంఖ్య 1285. మొత్తము పెట్టుబడి 56131.

ముఖ్యస్థలములు: కర్నూలు; పుణ్యస్థలములు: మహానంది, శ్రీశైలము, అహోబిలము, మోక్షగుండం. పత్తికొండతాలూకాలో, సర్ థామస్ మన్‌రో గవర్నరుగారు కలరాచే మృతినొందిరి. నదులు: తుంగభద్ర కృష్ణ హంద్రి కుందేరు. వానలుస్వల్పము. ఆరోగ్యమైన ప్రదేశముగాదు. నేల సారవంతమైనది. ముఖ్యపంటలు: జొన్నలు, కొఱ్ఱలు. ప్రత్తి బాగుగపండును.

అనంతపుర మండలము

తాలూకాలు: ఈ మండలమున 9 తాలూకాలు గలవు. అవి ఏవన: అనంతపురము, ధర్మవరము, గుత్తి, హిందుపురము, కదిరి, కల్యాణదుర్గము, మడకశిర, పెనుకొండ, తాడిపత్రి తాలూకాలు.

జనసంఖ్య: అనంతపురముతాలూకా: హిందు—పురు 50831. స్త్రీ 47273. మహ—పు 3900. స్త్రీ 3573. క్రైస్త—పు 211.

స్త్రీ 216. ఇత—పు 66. స్త్రీ 61.

ధర్మవరముతాలూకా: హిందు—పురు 44104. స్త్రీ 40636. మహ—పు 2407. స్త్రీ 2130. క్రైస్త—పురు 289. స్త్రీ 260. ఇత—పు 14. స్త్రీ 8.

గుత్తితాలూకా: హిం—పు 66719. స్త్రీ 64209. మ—పు 8654. స్త్రీ 7898 క్రైస్త—పు 726. స్త్రీ 572. ఇత—పు 187. స్త్రీ 174.

హిందూపురముతాలూకా: హిం—పు 45502. స్త్రీ 43212. మహ—పురు 4317. స్త్రీ 4093. క్రైస్త—పురు 48. స్త్రీలు 58. ఇత—పు 55. స్త్రీ 34.

కదిరితాలూకా: హిం—పు 66972. స్త్రీ 62528. మ—పు 7968. స్త్రీ 7582. క్రైస్త—పు 150. స్త్రీ 137. ఇత—పు 1048. స్త్రీ 1017.

కళ్యాణదుర్గముతాలూకా: హిందు—పు 41129 స్త్రీ 38830. మహ—పు 1638. స్త్రీ 1479 క్రైస్త—పు 9. స్త్రీ 11. ఇత—పు 22. స్త్రీ 22.

మడకశిరతాలూకా: హిందు—పు 39962. స్త్రీ 39212. మహ—పు 1412. స్త్రీ 1269. క్రైస్త—పు 12. స్త్రీ 8. ఇత—పు 126. స్త్రీ 120.

పెనుకొండతాలూకా: హిందు—పు 43811. స్త్రీ 41877. మహ—పు 4021. స్త్రీ 3991. క్రైస్త—పు 68. స్త్రీ 75. ఇత—పు 14. స్త్రీ 3.

తాడిపత్రితాలూకా: హిందు—పు 50530. స్త్రీ 49137. మహ—పు 6820. స్త్రీ 6826. క్రైస్త—పు 422. స్త్రీ 369. ఇత—పు 73. స్త్రీ 24.

ఈమండలమున అక్షరజ్ఞులు 963223 గురును, విద్యావిహీనులు 917597 గురును, ఆంగ్లభాష వచ్చినవారు 2936 గురును కలరు.

మండలాధికారులు: జిల్లాజడ్జి: హెచ్. ఆర్. బార్డుసువెల్లు ఐ. సి. ఎస్. గారు.

జిల్లాకలక్టరు: రావుబహదూరు టి. రాఘవయ్య పంతులుగారు.

జిల్లాసర్జను: మేజరు జె. కర్క్ప్యాట్రిక్ ఐ. ఎమ్. ఎస్. (మిలిటరీ డ్యూటీ.)

కె. బాలసింహరావు బి. ఏ. ఎమ్. బి. సి. ఎమ్. (ఆక్టింగు)

పోలీసు సూపరింటెండెంటు: జె. మూరు.

డిప్యూటీకలక్టరులు 4 గురు, తహశీలుదారులు 9 గురు, జిల్లా మునసబులు ఇద్దరు.

జిల్లాఫారస్టుఆఫీసరు: ఏ. బి. మయ్యర్సు.

జిల్లాబోర్డులు:—అధ్యక్షులు: రావు బహదరు టి. రాఘవయ్య పంతులుగారు.

లోకలుబోర్డులు 4, యూనియనులు, జిల్లాఆదాయము, భూమి ఆదాయము 1737982 రూపాయలును, రిజిస్ట్రేషను 19883 రు, మాదక పదార్థములు 1608514 రు, ఫారస్టు ఆదాయము రు 395006-0-6.

సాగుబడి: 4281825 ఎకరములు, పట్టాదారులు 118855.

పంటలు: ముఖ్యమైన పంట జొన్నలు, కొఱ్ఱలు, రాగులు ప్రత్తి, చెఱకు, నువ్వులు, వేరుశెనగ, ఆముదాలు, ఉలవలు.

వృత్తులు, పరిశ్రమలు: వ్యవసాయము ముఖ్యవృత్తి. గుడ్డలు నేయుట, గుడ్డలకు రంగువేయుట, ప్రత్తిని శుభ్రపరచుట, గోతములు నేయుట, బొచ్చు కంబళ్లు నేయుట, కలబందనుండి నారను తీసి విదేశములకు ఎగుమతిచేయుట, తోళ్లను శుద్ధిజేయుట, గాజులు చేయుట, బంగారుగనులు త్రవ్వుట.

ఆరోగ్యస్థితి: ఈ మండలమున వైద్యశాలలు 13 గలవు. చికిత్స పొందినవారు 13693. జననము 31623. మరణములు 30032. జ్వరములు 3754, కలరా 2616, గ్రహణి 1213, మశూచి 244, ప్లేగు 2522.

అసిస్టెంటు సూపరింటెండెంటు ఒక్కడు, డిప్యూటీ సూపరింటెండెంటు ఒక్కడు, ఇన్‌స్పెక్టరులు 9 గురు, సబ్ ఇనస్పెక్టరులు 51 గురు, సార్జంటులు ఇద్దరు. హెడ్డుకనిస్టేబులు 105 మంది, కనిస్టేబిలు 769 మంది, స్టేషనులు 39, నేరములు 2998.

రాజకీయసంస్థాపనలు: మండలసంఘమును స్వరాజ్యసంఘమును గలవు.

పరపతిసంఘములు:— ఈమండలమున 4 పరపతిసంఘములు కలవు. వీరిలో 164 సభ్యులు గలరు. ఈసంఘములు గతవత్సరమున వ్యక్తులకు 3813 రూపాయలను అప్పు ఇచ్చినది.

ఈసంఘము 1916-17 సంవత్సరము పెట్టుబడి 1064680 రూపాయలు రిజర్వుఫండు 49668 రూపాయలు.

విద్యాప్రవృత్తి: 1 కళాశాలయును 4 మాధ్యమిక పాఠశాలలు 773 ప్రాథమికపాఠశాలలును గలవు. కళాశాలలు లేవు. 10 మాధ్యమిక, ప్రాథమిక పాఠశాలలు 1245.

జిల్లాబోర్డువ్యయము: ఆదాయము 262628 వ్యయము 77808.

బళ్లారి మండలము

బళ్లారిమండలము విజయనగరసార్వభౌము లగు కృష్ణరాయలనుండియు ప్రసిద్ధిగాంచిన యొక ప్రాచీనప్రదేశము. ఈ మండలవైశాల్యము 5,714 చదరపుమైళ్లు. జనసంఖ్య 969,436.

ఈ జిల్లాకు ఉత్తరమున తుంగభద్రా నదియు, తూర్పున కర్నూలు, అనంతపురము జిల్లాలును, దక్షిణమున మైసూరురాజ్యమును, అనంతపురము జిల్లాయును, పశ్చిమమున బొంబాయి రాజధానియు నున్నవి.

ఈ మండలమున 10 పట్టణములును, 921 పల్లెలును, 184058 గృహములును గలవు.

ఇచ్చట 9 తాలూకాలు గలవు. ఆదోని, బళ్లారి, సిరుగుప్ప, హోస్పేట, హువినహడ్గల్లి, హర్పణహళ్లి, రాయదుర్గము, కుడ్లిగి, ఆలూరు తాలూకాలు గలవు.

విశాఖపట్టణమండలము

సంఖ్య	గ్రంథాలయ నామము	గ్రామము	మాసాదాయము	పుస్తకముల సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపనసంవత్సరము మున్నగునవి
25	కృష్ణరాయ పుస్తకభాండాగారము	సాలూరు		230	కాశీభట్ల కృష్ణరాయశాస్త్రిగారు	1918 ఏప్రిలు 22 తేది
26	జ్ఞానావళీ పుస్తకభాండాగారము	చోడవరము		500	కొత్తూరు సుబ్బారావుగారు	పింగళసంవత్సరము
27	శ్రీరామతీర్థగ్రంథనికేతనము	రామతీర్థము	0-12-0	322	కో. కు. వేంకటరామాచార్యులుగారు	1914 సం
28	శ్రీ విజయాంధ్రభాండాగారము	విజయనగరము	12-0-0	1578	చాగంటి వీరభద్రరావు, ఇ. రామకృష్ణారావు గార్లు	1914 సం
29	లక్ష్మీనిలయ ,,	ఎల్లవరం		305	కుక్కుర రామకృష్ణయ్యగారు	1914 మార్చి 1 తేది
30	ఆంధ్రభాషాభివర్ధనీ ,,	పాలకొండ	10-0-0	340	పేకేపు లక్ష్మీనరసింహముగారు	పింగళ మాఖ శు 2 ఆది
31	విక్రమదేవు రీడింగురూము	గుళ్ళాపురము	15-0-0	440	దూర్వాసుల రామసోమయాజులుగారు	1915
32	ఆంధ్రగ్రంథభాండాగారము	రాయవరము		505	నేమాని జగన్నాథముగారు	5-12-1911
33	ఆనందగజపతిగ్రంథాలయము	విశాఖపట్టణము	8-0-	1283	చిలుకూరు పూర్ణయ్యగారు	పింగళ ఆషాఢ బ ౧౦
34	శర్మపుస్తకభాండాగారము	ఎలమంచిలి		1167	అయ్యగారి సూర్యనారాయణమూర్తిగారు	1912 సం
35	ఉచితపుస్తక ,,	గుణపురం				
36	యస్. పి. హెచ్. పఠనమందిరము	పాలకొండ				
37	బాలవిద్యాభివర్ధనీసంఘము	మృత్యుంజయనగరము				
38	హితకారిణీసమాజము	విశాఖపట్టణము				
39	జాలీ బ్రదర్సు క్లబ్బు	,,				
40	విజయాంధ్రభాషాభివర్ధనీసంఘము	,,				
41	ధర్మార్థమోక్షప్రదాయినీగ్రంథాలయము	సిగడాం				
42	కొత్తపేట సర్క్యులేటింగు లైబ్రరీ	కొత్తపేట				
43	శ్రీశారదాలాడ్జి	మాడుగుల				
44	సుజనాకర్షణగ్రంథాలయము	ఎలమంచిలి				
45	గోఖలే మెమోరియల్ లైబ్రరీ	సాలూరు				
46	ఆంధ్రబాలసరస్వతీగ్రంథాలయము	గొలజాము				
47	వీరభద్రవిలాసగ్రంథాలయము	వీరభద్రపుర అగ్రహారము				

గోదావరీమండలము

సంఖ్య	గ్రంథాలయ నామము	గ్రామము	మాసాదాయము	పుస్తకముల సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపనసంవత్సరము మున్నగునవి
48	శ్రీమదుమామహేశ్వర పుస్తకభాండాగారము	చేతమల్లిపూడి, రాజోలుతా	60-0-0	415	పొన్నాడ కృష్ణమూర్తిగారు	1915 నవంబరు 15 తేది
49	రాజ్యలక్ష్మీపుస్తక ,,	కాతేరు		368	వెన్నేటి సత్యనారాయణమూర్తిగారు	1912
50	సర్వజనపుస్తక ,,	రాజమండ్రి	80-0-0	6000	కోరుకొండ లింగమూర్తిగారు	1900
51	బాలసరస్వతీగ్రంథ ,,	,,	5-0-0	300	దాసరి రామమూర్తిగారు	1915
52	రత్నకవిగ్రంథ ,,	ఆర్యాపురము, రాజమండ్రి	9-0-0	2030	చుక్కా అప్పలస్వామిగారు	1910
53	సత్యనారాయణపుస్తక ,,	ధవళేశ్వరము	10-0-0	589	శంకరమంచి సుబ్రహ్మణ్యముగారు	10-6-1917

54	శ్రీవేంకటేశ్వరపుస్తకభాండాగారము	వాకతిప్ప		355	గెడ్డం పరమశివుడుగారు	1-6-1914
55	చంద్రశేఖరపుస్తకభాండాగారము	వేట్లపాలెము	6-8-0	333	కంభంపాటి లక్ష్మీనృసింహసోమయాజులుగారు	1918 ఏప్రిలు
56	శ్రీవసురాయపుస్తకభాండాగారము	రాజమండ్రి	33-0-0	2890	అద్దంకి సత్యనారాయణశర్మగారు	1908
57	సావరం గ్రంథాలయము	బేతమల్లిపూడి	4-1-6	415	కస్తూరి లక్ష్మీనారాయణగారు	1915 నవంబరు
58	ఆంధ్రబాలభారతీ గ్రంథాలయము	ముక్కామల	3-0-0	608	కళా వేంకటరావుగారు	1914
59	జ్ఞానాభివర్ధనీభాండాగారము	కుతుకులూరు		800	మిత్తిపాటి పార్వతీశముగారు	1913
60	హైందవసరస్వతీగ్రంథమందిరము	దంగేరు	7-0-0	625	నిదసనమెట్ల నాగభూషణముగారు	23-11-1916
61	ఆనందగజపతిగ్రంథాలయము	కోటిపల్లి		798	శివకోటి నరసింహముగారు	15-1-1917
62	శ్రీరాజా జోగి జగన్నాథగ్రంథాలయము	గోపాలపురము	4-0-0	316	పోతాప్రగ్గడ సాంబశివరావుగారు	1916
63	హితార్థదాయినీపుస్తకభాండాగారము	కపిలేశ్వరపురము	4-0-0	174	క్రొవ్విడి శేష వేంకటకాశీపతిగారు	1914
64	భద్రాచలగ్రంథాలయము	భద్రాచలము	5-0-0	633	శఠగోపం రామానుజాచార్యులుగారు	14-9-1913
65	శ్రీవాణీనికేతనము	దుమ్ముగూడెము		261	లగడపాటి వేంకటనాగభూషణముగారు	25-9-1909
66	శ్రీసరస్వతీవిలాసపుస్తకభాండాగారము	నరిశిపూడి	3-0-0	1050	మద్దూరి సుబ్బారావుగారు	1912
67	పెదపల్లెగ్రంథభాండాగారము	పెదపల్లె	1-4-0	378	దిగుమర్తి వేంకటరత్నముగారు	5-10-1914
68	వివేకానందపుస్తకభాండాగారము	తుల్యారామేశ్వరము	2-0-0	80	సూర్యనారాయణమూర్తిగారు	1914
69	అప్పనార్యపుస్తకభాండాగారము	రావులపాలెము		500	కొడమగుళ్ల వేంకటాచార్యులుగారు	
70	కాకినాడ స్త్రీప్రార్థనసమాజము	కాకినాడ		100	ఉప్పలూరి నాగరత్నమ్మగారు	1912
71	గోఖలే ధర్మపుస్తకభాండాగారము	„	34-0-0	1880	మాచన వజ్ఝలసోమయాజులుగారు	1915 జనవరి
72	బాలసరస్వతీపుస్తకభాండాగారము	చోడవరము	6-0-0	459	బికాని వేంకటరత్నముగారు	1914
73	విశేకోదయపుస్తకభాండాగారము	ముంగండాగ్రహారము	2-0-0	1311	పుల్య వేంకటకృష్ణయ్యగారు	1909
74	ఈశ్వరపుస్తకభాండాగారము	కాకినాడ	8-0-0	621	కోకా పార్థసారథిగారు	1916
75	శ్రీరామమూర్తి పుస్తకనిలయము	తాళ్లరేవు	6-0-0	260	పోతాబత్తుల శివప్రసాదరావుగారు	18-9-1917
76	సంగమేశ్వరపుస్తకభాండాగారము	ఏడిద, రామచంద్రపురం	3-0-0	900	కోలంపోటి ఆదినారాయణమూర్తిగారు	1912 జనవరి
77	శ్రీవేంకటరమణనివాస పుస్తకభాండాగారము	తిరుపతి	7-0-0	544	బెహారా లింగరాజుగారు	12-12-1914
78	ఆంధ్రభారతీనిలయము	పరివెల	4-0-0	547	ఎఱ్ఱాప్రెగడ రామచంద్రరావుగారు	1914 జనవరి
79	వేణుగోపాలపుస్తకభాండాగారము	మాచవరము	8-0-0	510	వాడ్రేవు సుబ్బరాజుగారు	1915
80	శ్రీవిద్యానందపుస్తకభాండాగారము	పిఠాపురము	67-6-10	5671	గాడేపల్లి సూర్యనారాయణశర్మగారు	1915
81	జ్ఞానసూర్యోదయ పుస్తకభాండాగారము	మేడపాడు	6-0-0	965	సత్యవోలు రామరావుగారు	191
82	శ్రీబాలాత్రిపురసుందరీపుస్తకభాండాగారము	అమలాపురము	5-8-0	639	కూచిమంచి వేంకటేశ్వర్లుగారు	1916
83	శ్రీకృష్ణదేవరాయగ్రంథాలయము	„				
84	శ్రీరాజరాజేశ్వరీగ్రంథాలయము	అయినవల్లి				
85	బ్రహ్మానందగ్రంథాలయము	కొత్తలంక				
86	వెర్నర్సు క్లబ్బు	ఏలూరు				
87	బాలసరస్వతీపుస్తకభాండాగారము	రంగాపురం				
88	శ్రీరామపుస్తకభాండాగారము	కన్నె చింతలపూడి				
89	వేంకటకృష్ణగ్రంథాలయము	అండ్రంగి				
90	భారతీపుస్తకభాండాగారము	ఆర్యవటము				

వరుస సం.	గ్రంథాలయ నామము	గ్రామము	మాసాదాయము	పుస్తక సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపనసంవత్సరము నున్న గునవి
91	ఆర్యధర్మసంవర్ధనీగ్రంథాలయము	జగన్నాథపురం, కాకినాడ				
92	ముక్తికాంత లాడ్జి	సూర్యారావుపేట ,,				
93	ధర్మగ్రంథాలయము	ప్రాంతకాకినాడ				
94	వివేకానందగ్రంథాలయము	జగన్నాథపురము				
95	దేశాభివర్ధనీసమాజము	చిత్రాడ, పిఠాపురంపోను				
96	శ్రీసత్యనారాయణపుస్తకభాండాగారము	పుట్టకొండ				
97	శ్రీవేంకటేశ్వరాంధ్రనిలయము	యండ్రము				
98	రామవిలాసగ్రంథమాల	సామర్లకోట				
99	గోపాలకృష్ణ గోఖలే పుస్తకభాండాగారము	ఇండుగపల్లి, తుని డి॥				
100	శ్రీసీతారామపుస్తక భాండాగారము	కోటనందూరు				
101	రామానుజగ్రంథాలయము	తుని				
102	హిందూమతబాలసమాజము	తుని				
103	శ్రీకామరాజార్యపుస్తకభాండాగారము	భీమవరపుకోట				
104	విశ్వేశ్వరపుస్తకభాండాగారము	ఒంటిమామిడి				
105	శ్రీసూర్యరాయపుస్తకభాండాగారము	పిఠాపురము				
106	ఆంధ్రభారతీనిలయపుస్తకభాండాగారము	,,				
107	ఆంధ్రపరిశోధకమహామండలి	,,				
108	ఆంధ్రకవితావిద్యార్థిమండలి	,,			చెలికాని లచ్చారావుగారు	
109	సత్యదేవమనోల్లాసినీసమాజము	ఆరెంపూడి అన్నవరము				
110	ఆంధ్రగ్రంథభాండాగారము	పులిమేరు				
111	లక్ష్మీవిలాససంఘము	పెద్దాపురము				
112	గోఖలేగ్రంథాలయము	,,				
113	శ్రీశంకరసేవాసంఘము	,,				
114	రవుతులపూడి కరణములక్లబ్బు	రవుతులపూడి				
115	శ్రీమత్పరమార్థప్రదాయినీసంఘము	దుమ్ముగూడెము				
116	శ్రీకన్యకాపరమేశ్వరీగ్రంథాలయము	,,				
117	శ్రీకల్పవల్లిగ్రంథాలయము	భద్రాచలము				
118	వినోదినీగ్రంథాలయము	,,				
119	సత్యనారాయణపుస్తకభాండాగారము	ధవళేశ్వరము				
120	వీరేశలింగాస్తికగ్రంథాలయము	రాజమండ్రి				
121	ఆంధ్రవాల్మీకిగ్రంథభాండాగారము	లక్ష్మీవారపుపేట ,,				
122	శ్రీబాలసరస్వతీపుస్తకభాండాగారము	కృష్ణరాయుడి, పెదపూడి				
123	శ్రీసరస్వతీగ్రంథాలయము	గంటిపెదపూడి				

124	శ్రీసీతారామాంజనేయపుస్తకాగారము	పాళర్లపూడిలంక				
125	సరస్వతీనికేతనము	వానపల్లి				
126	అలమూరుసరస్వతీసమాజము	అలమూరు				
127	శ్రీకామరాజపుస్తకభాండాగారము	చోప్పెల్ల				
128	సరస్వతీనిలయము	కేకి				
129	మారుతిగ్రంథనిలయము	ద్రాక్షారామము				
130	శ్రీలక్ష్మీనరసింహగ్రంథాలయము	పెదపళ్ల				
131	శ్రీవేంకటేశ్వరగ్రంథనిలయము	పెనికేరు				
132	శ్రీసీతారామగ్రంథాలయము	మండపేట				
133	ముక్తేశ్వరపుస్తకభాండాగారము	మూలస్థానము				
134	మనోరంజనీగ్రంథాలయము	వల్లూరు				
135	సద్ధర్మవర్ధనీగ్రంథాలయము	వెలగతోడు, ద్వారపూడి				
136	సనాతనధర్మసభ	వెదురుపాక				
137	సనాతనజ్ఞానాభివర్ధనీగ్రంథాలయము	సావరం, వెదురుపాకశివారు				
138	భద్రాద్రివర్మగ్రంథభాండాగారము	భద్రాద్రి			ఎస్. రామానుజాచార్యులుగారు	14-9-1913

కృష్ణా మండలము

139	శ్రీసరస్వతీపుస్తకభాండాగారము	విజయరాయి	3-12-0	579	ప్ర. రంగాచార్యులుగారు	నలసంవత్సరము
140	శ్రీవాణీపఠనమందిరము, పోతునూరు	ఏలూరు తా॥	41- 0-0	573	కొన్నూరు రెడ్డి అంజనేయులుగారు	1917 నవంబరు
141	శ్రీసుబోధినీపుస్తకభాండాగారము	వసంతవాడ	4- 0-0	350	మేడిచర్ల శ్రీరాములుగారు	1915 సం॥
142	శ్రీరామవిలాసగ్రంథభాండాగారము	శనివారప్పేట	10- 0-0	640	పసుపులేటి రామస్వామిగారు	1917 జూలై
143	వివేకానందపఠనమందిరము	దెందులూరు	8- 5-4	730	మేటపర్తి వెంచయ్యగారు	12-12 1912
144	హిందూయువజనసంఘము	ఏలూరు	65- 0-0	2636	గ్రంథి రామమూర్తిగారు	1904
145	ఆంధ్రభారతీగ్రంథాలయము	కైకరము				
146	శ్రీకృష్ణశ్రేయోభివర్ధనీసంఘము	గుండుగొలను				
147	రామమోహనరాయిపఠనమందిరము	పెదపాడు				
148	శ్రీరామగ్రంథాలయము	కోరుకొల్లు		253	గుడిపాటి సూర్యనారాయణగారు	1917
149	శ్రీభోగేశ్వరపుస్తకాలయము,	కలిదెండి (కైకలూరు తా॥)				
150	శ్రీచంద్రమౌళీశ్వరగ్రంథాలయము	చినతుమ్మిడి (కైకలూరు తా॥)				
151	ఆంధ్రవిద్యాభివర్ధనీసమాజము	దొడ్డిపట్ల (కైకలూరు తా॥)				
152	శ్రీరామగ్రంథాలయము	రాచపట్టణము (కైకలూరు తా॥)				
153	శ్రీకృష్ణాంధ్రగ్రంథాలయము	వెంకటాపురం (కైకలూరు తా॥)				
154	ధర్మపుస్తకభాండాగారము	మండవల్లి (కైకలూరు తా॥)				
155	కనకదుర్గపుస్తకాలయము	మేదూరు		290	గుళ్లపల్లి నాగయ్యచౌదరిగారు	1914 సం॥
156	శ్రీపీరేశలింగగ్రంథాలయము	కపిలేశ్వరపురము	15- 0-0	330	కొల్లిపర సూరయ్యగారు	1915
157	శ్రీసిద్ధేశ్వరపుస్తకభాండాగారము	గుడ్లవల్లేరు	7-15-8	270	చాపరాల జన్నయ్యగారు	13-1-17
158	ఇ. యమ్. ఏ. యల్. భాండాగారము	కవుతవరము		711	చెరుకువాడ వేంకటనరసింహముగారు	

వరుస సంఖ్య	గ్రంథాలయ నామము	గ్రామము	మాసాదాయము	పుస్తకముల సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపనసంవత్సరము మున్నగునవి
229	తిరుపతి వేంకటేశ్వరవిద్యానిలయము	కోటగోడ్డు				
230	రామానాయుడుపేట గ్రంథాలయము	బందరు				
231	జయలక్ష్మీ పుస్తకభాండాగారము	గొడవల్లు	1-8-0	118	నా. లక్ష్మీనరసింహముగారు	1917
232	శ్రీకృష్ణవిలాస విద్యానిలయము	పెనమలూరు	3-8-0	200	ప్రఖ్య వేంకటసుబ్బయ్యగారు	1915
233	శ్రీశారదానికేతనము	ఆరుకొలను	13-8-0	490	సందూరి వీరరాఘవయ్యగారు	1916 మే నెల
234	భారతీవిలాస విద్యానిలయము	ఎనమలకుదురు	3-0-0	247	ముప్పవరపు సీతారామయ్యగారు	1918
235	యువజనసంఘము	గోపువానిపాలెము	6-0-0	218	పుట్టగుంట కోటయ్యగారు	1916 సెప్టంబరు
236	హిందూపుస్తక భాండాగారము	ముదునూరు	4-8-0	272	తుమ్మల కోటయ్యగారు	1914 ఏప్రిలు
237	భారతీ గ్రంథాలయము	ఉయ్యూరు	6-0-0	300	వేమూరి శంకరయ్యగారు	
238	హైందవయువజనసంఘము	ముస్తాబాద	5-0-0	450	శంకర వేంకటేశ్వరరావు గారు	1915 సం
239	యువజనసంఘము	తాడంకి	4-9-2	469	గురుజాడ భాస్కరరావు గారు	1912 సం
240	శ్రీసీతారామమందిరము	నూజివీడు	10-0-0	400	సూరి సీతారామయ్యగారు	4-2-15
241	కోదండరామ గ్రంథాలయము	తేలప్రోలు				
242	మైత్రేయ రీడింగురూము	ముస్తాబాద				
243	హిందూపుస్తక భాండాగారము	ముదునూరు				
244	శ్రీరామచంద్ర గ్రంథాలయము	పోడూరు	3-0-0	602	రుద్రరాజు నరసింహరాజుగారు	3-6-1914
245	రామమోహనక్లబ్బు	పాలకొల్లు	15-0-0	400	అత్యం వెంకట్రామచంద్రరావుగారు	1911
246	సరస్వతీవిలాసగ్రంథాలయము	కవితెము				
247	సుబ్రహ్మణ్యేశ్వరవిలాససభ	నడుపూడి				
248	భారతీగ్రంథాలయము	పూలపల్లి				
249	ధర్మగ్రంథాలయము	పెనుమదము				
250	శ్రీరామపుస్తకభాండాగారము	వల్లూరు				
251	శ్రీరామచంద్రగ్రంథనిలయము	కోణకంచి	1-12-0	351	పల్లికూన నరసింహశర్మగారు	18-7-16
252	కృష్ణదేవరాయవిద్యానిలయము	చింతలపాడు	2-0-0	760	వేంకటగుర్రావుగారు	20-8-1910
253	వేంకటరమణ వివేకవర్ధనీనిలయము	మక్కపేట	8-7-0	225	మల్లెల వేదాద్రిగారు	1917
254	శ్రీకృష్ణగ్రంథనిలయము	జగ్గయ్యపేట	13-0-0	511	ములుగు సుబ్రహ్మణ్యముగారు	29-11-17
255	పఠనమందిరము	కంచెల				
256	పెనుగంచిప్రోలు [illegible]నిలయము	పెనుగంచిప్రోలు			పరచా భీమేశ్వరరావుగారు	
257	శ్రీవిజ్ఞానవర్ధనీగ్రంథాలయము	భట్లపెనుమఱ్ఱు	16-8-0	1010	గో. సూర్యనారాయణగారు	1914
258	జ్ఞానప్రసాదినీపుస్తకభాండాగారము	నాగాయతిప్ప	0-12-0	124	వేములపల్లి వేంకటగోపాలరావుగారు	
259	శ్రీరామధర్మగ్రంథాలయము	మోపిదేవి	1-0-0	480	చిరువోలు కుటుంబరావుగారు	1916
260	వల్లీశ్వరపుస్తకభాండాగారము	"	3-4-0	269	కంఠంనేని వీరరాఘవయ్యగారు	1916
261	రామమోహనగ్రంథాలయము	ఘంటసాల	4-0-0	528	గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు	1914

262	వేణుగోపాలపఠనమందిరము	చిన్నముత్తేవి				
263	ఆంధ్రజాతీయకళాభివర్ధనీసంఘము	నడకుదురు				
264	దుర్గానాగేశ్వరగ్రంథాలయము	వెదకర్తేపల్లి				
265	ఆంజనేయపుస్తకభాండాగారము	వస్త్రాలగామేశ్వరము	2-8-0	345	మారంపూడి కేశవరావుగారు	1918
266	దయానందసరస్వతీపఠనమందిరము	కాకర్లమూడి	1-0 0	270	M. చలపతిరావుగారు	1918
267	వివేకానందపఠనమందిరము	పడమరవిప్పర్రు	1-4-0	210	పసల రామమూర్తిగారు	
268	రామమోహనరీడింగురూము	ఉంగటూరు	5-8-0	628	తల్లాప్రగడ నృసింహశర్మగారు	
269	శ్రీసరస్వతీగ్రంథాలయము	ఉండ్రాజవరము	2-0-0	340	ఆకంట శేషగిరిరావుగారు	1918
270	స్టూడెంట్సు సెల్ఫ ఇంప్రూవింగు సొసైటీ	,,	1-0-0	260	పొట్లచెరువు వీరమల్లయ్యగారు	
271	శ్రీరామకృష్ణపుస్తకభాండాగారము	,,	0-12-0	400	అన్నదేవర నాగభూషణరావుగారు	1912
272	పంచముజార్జిపఠనమందిరము	అరవిల్లి				
273	గ్రంథాలయము	కాగుపాడు				
274	విద్యాభివర్ధనీగ్రంథాలయము	చేబ్రోలు, కైకరం పోస్టు				
275	ఎవర్ జాలీ లైబ్రరీ	తణుకు				
276	గోపాలకృష్ణగోఖలేగ్రంథాలయము	పిట్టలవేమవరము				
277	మిత్రమండలిసంఘము	సెంటపాడు				
278	సరస్వతీనిలయగ్రంథాలయము	పాలగూరు				
279	శ్రీసీతారామగ్రంథాలయము	పద్దూరు				
280	వివేకానందధర్మగ్రంథాలయము	మారుటేరు				
281	శ్రీరామపుస్తకభాండాగారము	వల్లూరు				
282	శ్రీశారదాభివర్ధనీసంఘము	వెలగదుర్రు				
283	చినవేంకట్రాయగ్రంథాలయము	తిరువూరు		110	ఏ. యస్. అవధానిగారు	1916
284	ధర్మసంవర్ధనీపుస్తకభాండాగారము	గోసవీడు	1-0-0	350	పెరుమాళ్లు అయ్యంగారు	1917
285	శ్రీకృష్ణరాయగ్రంథాలయము	గంపలగూడెము	15-0-0	300	ము. వెం. లక్ష్మణాచార్యులుగారు	1917
286	రాజగోపాలగ్రంథాలయము	రెడ్డిగూడెము	7-10-0	265	దేవరాజు కేశవరావుగారు	1917
287	ఎర్రగూడెముగ్రంథాలయము	ఎర్రగూడెము	3-0-0	294	చల్లా నరసింహముగారు	నలసంవత్సరము
288	పఠనాలయము	తాళ్లపూడి ఎర్రగూడెం	3-7-3	537	ఏలూరిపాటి రామభద్రయ్యవులుగారు	1918
289	శ్రీమల్లేశ్వరగ్రంథాలయము	జగన్నాథపురం నిడదవోలు			చ. నరసింహముగారు	1916
290	శివరామకృష్ణపఠనమందిరము	ఆగిరిపల్లి గన్నవరం [పోస్టు		900	దేవులపల్లి శోభనాద్రిగారు	
291	గోపాలకృష్ణగోఖలేగ్రంథాలయము	పిట్టలవేమవరము	2-0-0	410	సడాల సుబ్బారెడ్డిగారు	రాక్షససంవత్సరము
292	శ్రీలక్ష్మీనృసింహపుస్తకభాండాగారము	వల్లూరు			M. వెంకట్రామయ్యగారు	15-5-1916
293	చంద్రమౌళీశ్వరపుస్తకాగారము	చినతుమ్మిడి	5-0-0	250	మోపర్తి వేంకటసుబ్బారావుగారు	1917
294	శ్రీభక్తసమాజము	తెన్నేరు	3-0-0	144	దేవరాజు లక్ష్మీనృసింహారావుగారు	1914
295	పెనగంచిప్రోలుగ్రంథాలయము	పెనగంచిప్రోలు			పరచా భీమేశ్వరరావుగారు	

గుంటూరు మండలము

నెంబరు	గ్రంథాలయ నామము	గ్రామము	మాసాదాయము	పుస్తకముల సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపన సంవత్సరము మున్నగునవి
296	శ్రీరాధాకృష్ణ లైబ్రరీ	కొలకలూరు			మాదిరాజు కోటీశ్వరరావుగారు	11-8-191‥
297	హాయవదనసదస్క్లబ్బు	ఖాజీపాలెము	5-0-0	56		4-10-1916
298	లక్ష్మణరాయ గ్రంథాలయము	చేబ్రోలపాడు			ఆదిమూలం వీరబ్రహ్మముగారు	19:5
299	ఆంధ్రసరస్వతీ గ్రంథనిలయము	చీమకుర్తి	2-0-0	250	కోటు జయరామరెడ్డిగారు	26-10-1915
300	మల్లికార్జున పుస్తకాలయము	తుళ్లూరు	1-1-2	312	పీసపాటి వేంకటసుబ్బారావుగారు	1917
301	విద్యాభివర్ధనీసమాజము	వంగీపురం	1-8-0	187	వంగీపురపు చలపతిశర్మగారు	1-1-16
302	లక్ష్మీనృసింహ గ్రంథాలయము	ఎనికపాడు			బొల్నేని కోటింగముగారు	
303	సరస్వతీ గ్రంథాలయము	ఒంగోలు			ఘడియారం రామయ్యగారు	
304	ధర్మ గ్రంథాలయము	కరవది			పొన్నలూరి రాఘవయ్యగారు	
305	శ్రీలక్ష్మీకాంతపుస్తకాలయము	కొప్పెరపాడు				
306	యస్. యస్. యమ్. రీడింగురూము	తిమ్మసముద్రము				
307	శ్రీనాథ గ్రంథాలయము	దైవాలరావూరు				
308	భాషావిలాసాంధ్ర గ్రంథాలయము	పమిడిపాడు				
309	సర్వోత్తమరాయ గ్రంథాలయము	పెళ్లూరు	1-2-0	700	ఘాలి కోటయ్యగారు	1916
310	భాషాపతినిలయము	మద్దిపాడు				
311	శ్రీరామ గ్రంథాలయము	బ్రాహ్మణనిడుమానూరు			గొల్లపూడి పెద్దసుబ్బరామశాస్త్రులుగారు	
312	సర్వజన గ్రంథాలయము	రుద్రవరము				
313	జ్ఞానప్రసాదినీ గ్రంథాలయము	,,			గొట్టిపాటి రామారావుగారు	
314	శారదానికేతనధర్మపఠన గ్రంథాలయము	లింగంగుంట			వెంజాల విశ్వనాథముగారు	
315	వివేకవర్ధనీసమాజము	అనంతవరప్పాడు అగ్రహార		304	ఆలపాటి పరదేశిగారు	1914
316	వివేకానందసమాజము	,,				
317	జ్ఞానప్రసాదినీ గ్రంథనిలయము	ఏటుకూరు		411	నిశంకరావు నాగయ్యగారు	1912
318	వివేకవర్ధనీ భాండాగారము	కొర్నెపాడు	4-0-0	304	పెమ్మరాజు పిచ్చయ్యగారు	1912
319	శ్రీసరస్వతీపుస్తకభాండాగారము	గుండవరము	1-0-0	216	చల్లాపల్లి పుల్లయ్యగారు	
320	యువజనసాహితీసంఘము	గుంటూరు				
321	ఆనందపఠనమందిరము	అగ్రహారము				
322	తిక్కనవిద్యానిలయము	ప్రాతగుంటూరు	14-8-0	1158	బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు	1911
323	కమ్మవిద్యార్థి సంఘము	,,	6-8-0	479	జంపాలసాంబయ్యగారు	1915
324	వనితా గ్రంథమండలి	,,		570	పాలపర్తి రామమూర్తిగారు	1911
325	ఆర్యవైశ్యయువకులసంఘము	,,	15-0-0	950	యస్. ఆదిశేషుగారు	1915
326	సనాతన ధర్మమండలి	,,				

327	సరస్వతీనికేతనము	ప్రాతగుంటూరు	4-0-0	740	చదలవాడ వేంకటరత్నముగారు	23-6-17
328	సాగరేశ్వరపుస్తకభాండాగారము	మాదల	9-0-0	355	యమ్. కోటీశ్వరరావుగారు	
329	శ్రీ శంకరమనోరంజనీగ్రంథాలయము	తిమ్మసముద్రము	2-0-0	128	టి. వి. రాఘవయ్యగారు	1917
330	ఆర్యబాలసరస్వతీనిలయము	మోర్తోట	16-0-0	417	వడ్లమూడి కామేశ్వరరావుగారు	29-9-17
331	శ్రీ సీతారామగ్రంథాలయము	కావూరు	5-12-0	197	తుమ్మల బసవయ్యగారు	1918
332	శ్రీ సరస్వతీభాండాగారము	గోరిగిపూడి	5-0-0	47	గుంటూరు సుబ్బారావుగారు	
333	చౌదరీగ్రంథాలయము	ఓలేరు		120	నాదెళ్ళ పిచ్చయ్యగారు	1918
334	బాలాత్రిపురసుందరీపుస్తకభాండాగారము	పెదపులివర్రు	4-0-0	310	భయరాజు కృష్ణమూర్తిగారు	1918
335	శ్రీ వాణీనికేతనము	నిజాంపట్నము	21-2-5	576	చావలి మల్లిఖార్జునముగారు	1917
336	భారతీనికేతనము	ధూళిపూడి	6-0-0	341	పల్లపోతు కోటయ్యగారు	1916
337	శ్రీమత్సీతారామాంజనేయ గ్రంథాలయము	వల్లూరిపాలెము	2-0-0	107	ఎన్. నరసింహాచార్యులుగారు	23-9-17
338	చౌదరీగ్రంథాలయము	వెల్లటూరు	6-0-0	369	మోటూరు అంకినీడుగారు	8-11-15
339	ఆర్యబాలవిద్యాభివర్ధనీసంఘము	వెల్లటూరు	10-0-0	175	క్రోవి శివరామకృష్ణశాస్త్రిగారు	16 జూన్
340	ఆంధ్రబాలసరస్వతీనిలయము	నల్లూరు	4-0-0	354	అబ్బినేని రాఘవచౌదరిగారు	రాక్షససంవత్సరము
341	కన్యకాపరమేశ్వరీగ్రంథనిలయము	పొన్నూరు	3-0-0	200	తిరువీథుల బైరాగిగారు	1-1-18
342	శ్రీగోఖ్లేవిద్యానిలయము	పచ్చలతాడిపర్రు	4-0-0	250	శింగంపల్లి వేంకటపున్నయ్యగారు	1-5-15
343	సత్యజ్ఞానానందగ్రంథాలయము	మామిళ్లపల్లి	0-8-0	145	పులుగండం నరసింగంపంతులుగారు	
344	హనుమత్పుస్తకభాండాగారము	నాగులపాడు		300	గూడ ఆదిశేషయ్యగారు	పింగళసంవత్సరము
345	కొండపాటూరు గ్రంథాలయము	బాపట్ల	1-4-0	170	వలివేటి వేంకటనరసింహముగారు	1913
346	జ్ఞానప్రకాశినీ సమాజము	పెదచెఱుకూరు	3-12-0	67	గంధవళ్ల కోటినాగులుగారు	1916
347	భారతీయయువజనపుస్తకభాండాగారము	బాపట్ల	30-0-0	1106	నందూరి శేషాచార్యులుగారు	పింగళ సం॥ ఆశ్వయుజ
348	ఆంధ్రభాషాభివర్ధనీసమాజము	మన్నవ	4-0-0	162	మన్నవ వేంకట్రావుగారు	16 మే 26
349	శ్రీగోఖ్లేపఠనమందిరము	చేబ్రోలు			దేచిరాజు మురహరిరావుగారు	1915
350	గాంధిసరస్వతీనిలయము	చేబ్రోలు	10-0-0	580	పాటిబండ్ల మల్లయ్యగారు	1915
351	బాలవిజ్ఞానానందచంద్రోదయగ్రంథాలయము	పుసులూరు	4-1-6	415	గంథం నాగేశ్వరరావుగారు	1916
352	ఆంధ్రసరస్వతీగ్రంథనిలయము	నిడుబ్రోలు		688	జంపని ఆంజనేయులుగారు	1915
353	చిదానందసరస్వతీగ్రంథనిలయము	పెదచెఱుకూరు	4-5-0	521	కోన వేంకటరాయశర్మగారు	1915
354	ఆంధ్రవాణీపుస్తకభాండాగారము	పెదచెఱుకూరు	6-0-0	425	గుంటూరు పుల్లయ్యగారు	1913
355	రామసుబ్బయ్యాంధ్రగ్రంథనిలయము	పొన్నూరు	10-0-0	500	చావలి ఆదిశేషయ్యగారు	3-10-16
356	ఆంధ్రవాణి	ఇనగల్లు	5-8-0	701	తుమ్మలగుంట కేశవరావుగారు	రాక్షససం॥ చైత్రము
357	శ్రీమహాత్రిపురసుందరీగ్రంథాలయము	కాకుమాను	2-4-5	387	నన్నపనేని నాగయ్యగారు	26-9-17
358	కోదండరామపుస్తకభాండాగారము	నండూరు	4-2-4	231	జొన్నలగడ్డ వేంకటసుబ్బయ్యగారు	12-4-18
359	శ్రీసరస్వతీగ్రంథనిలయము	ఏదుపాడు	4-0-0	200	అంబటిపూడి వేంకటేశ్వర్లుగారు	2-9-17
360	లిక్కనపుస్తకభాండాగారము	భల్లుఖాండుపాలెము	8-4-0	50	మునగపాటి దక్షిణామూర్తిగారు	పింగళసం॥ ఫాల్గుణ 3
361	నన్నయార్య గ్రంథనిలయము	పరుచూరు	6 0-0		అబ్బరాజు వేంకటసుబ్బయ్యగారు	1918
362	లక్ష్మీచెన్నకేశవవిలాసగ్రంథనిలయము	కార్యంపూడి	4-10-6	184	సాగి రామనాథశాస్త్రిగారు	1916
363	కన్యకాపరమేశ్వరీగ్రంథాలయము	నర్సారావుపేట	25-0-0	874	కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు	1917

నెంబరు	గ్రంథాలయనామము	గ్రామము	మాసాదాయము	పుస్తకముల సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపనసంవత్సరము మున్నగునవి
364	శ్రీరామనిలయపుస్తకభాండాగారము	పోలూరు	5-4-0	300	పోలూరు వేంకటసుబ్బయ్యగారు	9-1-1917
365	ఆంధ్రబాలసుజనమనోల్లాసినీసంఘము	రాజాపేట	8-0-0	310	మేళ్లచెరువు శంకరశర్మగారు	1916 జూలై
366	శ్రీరామరాయకవీంద్ర పుస్తకభాండాగారము	ఏర్పూరు	2-0-0	400	గురు విశ్వనాథకవులు గారు	1915
367	శ్రీజ్ఞానదాయినీపుస్తకభాండాగారము	శృంగారపురము	3-0-0	376	నాగేశ్వరము సుందరము గార్లు	1-1-1915
368	ఆంధ్రభాషాభివర్ధనీసంఘము	వరహాపురం	0-12-0	150	వంకమామిడి నరసింహముగారు	
369	ఆంజనేయపుస్తకభాండాగారము	దోనెపూడి	4-0-0	195	బొప్పన సూరయ్యచౌదరి గారు	16-12-1917
370	రామలింగేశ్వరపుస్తకభాండాగారము	అత్తోట	4-0-0	424	మాదిరాజు వేంకటాచలపతిరావు గారు	1918
371	బాలసమాజము	పెదరావూరు	10-0-0	550	భాగవతుల సుబ్రహ్మణ్యముగారు	1906
372	శ్రీసరస్వతీనిలయము	కూచిపూడి	16-0-0	810	అ. రామకోటిశాస్త్రిగారు	15-6-1913
373	జ్ఞానోదయగ్రంథాలయము	పెరుకలపూడి	5-7-1	1521	నూతలపాటి రత్నయ్యగారు	ఆనంద, ఆశ్వయుజము
374	వాణీవిలాసగ్రంథనిలయము	కొల్లెపర	8-0-0		కట్లా గోపాలస్వామి గారు	
375	శ్రీరాధాకృష్ణ లైబ్రరీ	కొలకలూరు	2-0-0	631	మాదిరాజు కోటీశ్వరరావు గారు	11-౨-1913
376	శ్రీరామలింగపుస్తకభాండాగారము	కరేవరం	4-0-0	620	కోటంరాజు వేంకటసుబ్బారావు గారు	10-8-1916
377	శ్రీసరస్వతీనిలయ పుస్తకభాండాగారము	కొండముది	2-12-0	410	కొండముది సుదర్శనరావుగారు	గాతృస సం॥
378	భాషాభిలాషిణీసంఘము	దుగ్గిరాల	17-4-4	1214	జంపాల వెంకయ్యగారు	4-6-1912
379	కన్యకాపరమేశ్వరీపుస్తకభాండాగారము	తెనాలి	13-0-0	750	కొల్లా సుబ్బారావుగారు	1-6-16
380	జార్జిధర్మపఠనమందిరము	,,	5-8-0	500	జొన్నలగడ్డ పున్నయ్యగారు	1911
381	బాలభారతీసమాజము	తరిళయారు	1-2-0	300	పుచ్చా వరదరామకృష్ణయ్యగారు	1912
382	శ్రీసుబ్రహ్మణ్యేశ్వరభాండాగారము	వల్లభాపురము	9-10-0	361	అన్నె రామకృష్ణారెడ్డి గారు	నళ సంవత్సరము
383	శ్రీమదిందిరానిశాంతగ్రంథనిలయము	జూలూరు	6-0-0	430	చెన్నుపల్లి బ్రహ్మముగారు	10-12-16
384	శ్రీసరస్వతీనిలయము	కూచిపూడి	15-0-0	795	అ. రామకోటిశాస్త్రిగారు	1913
385	శ్రీనాథగ్రంథనిలయము	మోపర్రు	1-10-0	859	కోడాలి అంజయ్యగారు	1916 అక్టోబరు
386	శ్రీసర్వజనవిద్యాప్రదాయినీనిలయము	సంగం జాగర్లమూడి	5-0-0	1282	కళ్లగుంట తిరుమలాచార్యులుగారు	1915
387	దాదాభాయినౌరోజీగ్రంథాలయము	చుండూరు	27-8-9	427	గొర్రెపాటి పిచ్చయ్యగారు	1917 జూలై
388	ఉభయభాషాసంజీవినీసంఘము	అమృతలూరు	15-12-0	960	సూరగుడి శేషాచలశర్మ గారు	1912
389	శ్రీసరస్వతీగ్రంథనిలయము	లాలుపురం	7-5-7	476	పెదమల్లు సూర్యనారాయణగారు	1912
390	శ్రీలక్ష్మీనరసింహాధర్మపఠనమందిరము	మంగళగిరి	8-0-0	679	రామడుగు వేంకటనరసింహము గారు	1916
391	శ్రీరామబ్రహ్మకవిభాండాగారము	గోరంట్ల	0-4-0	403	పొత్తూరు సత్యనారాయణరావు గారు	1916
392	రాసుమోహన మిషన్ భాండాగారము	తాడేపల్లి	0-8-0	233	అవనిగడ్డ నారాయణస్వామిగారు	
393	శ్రీరామపుస్తకనిలయము	రేపల్లె		254	మండవ వెంకట్రావుగారు	5-5-1918
394	భోగిభూషణగ్రంథాలయము	చినకొండ్రుపాడు		1027	కొండ భోగిభూషణరావుగారు	
395	శ్రీరామకృష్ణకవిభాండాగారము	బండారుపల్లె	1-8-0	324	దండమూడి గోపయ్యగారు	27-8-16
396	బాలసరస్వతీపుస్తకభాండాగారము	వట్టిచెఱుకూరు	2-0-0	237	మారుటూరు పుండరీకాక్షుడుగారు	1913

397	ఆంధ్రసరస్వతీనిలయము	వేజెండ్ల				
398	బాలసరస్వతీపుస్తకనిలయము	శేకూరు				
399	భారతీవిలాసవిద్యానిలయము	అనంతవరము				
400	శ్రీనివాససమాజము	ఈమని				
401	సనాతనశైవసమాజము	,,				
402	జ్ఞానవర్ధనీసమాజము	ఈపూరు				
403	సుజనవిధేయసమాజము	త్రాప				
404	స్వదేశీయవాణీరత్నాకరము	నందివెలుగు				
405	జార్జి కారొనేషన్ క్లబ్బు	పెరవలి				
406	శ్రీలక్ష్మీనృసింహ పుస్తకభాండాగారము	చిలకలూరిపేట				
407	సీతారామ పుస్తకభాండాగారము	డేగరమూడి				
408	రామమోహనగ్రంథాలయము	గుత్తికొండ				
409	ఆంధ్రగ్రంథాలయము	జానపాడు				
410	ఆంధ్రసంఘము	దాచేపల్లి				
411	హనుమత్ప్రసన్నగ్రంథాలయము	మాచర్ల				
412	పత్రికాపఠనమందిరము	ఈపురుపాలెము				
413	సీతారామపుస్తకాగారము	జమ్ములపాలెము				
414	విద్యాసాగరగ్రంథనిలయము	నర్సాయపాలెము				
415	పరమశివానందగ్రంథాలయము	బ్రాహ్మణకోడూరు				
416	రామకృష్ణగ్రంథనిలయము	మంచాళ				
417	భారతీనిలయము	మునిపల్లె				
418	కారొనేషన్ రీడింగురూము	వేటపాలెము				
419	శ్రీకృష్ణపుస్తకభాండాగారము	మైనేనివారిపాలెము				
420	వేంకటప్పయ్యార్యాంధ్రగ్రంథనిలయము	మాచవరం				
421	కన్యకాపరమేశ్వరీగ్రంథాలయము	వినుకొండ				
422	అభినవభారతీ పుస్తకభాండాగారము	కందిపాడు				
423	గోపాలకృష్ణగోఖలేపుస్తకభాండాగారము	పెదకూరపాడు				
424	విద్యాభిలాషిణీసంఘము	మోరంపూడి				
425	బాలమిత్రమనోల్లాసినీసంఘము	రాజపేట				
426	వాణీనిలయపుస్తకభాండాగారము	గొల్లపూడిఅగ్రహారము				
		నెల్లూరు మండలము				
427	శ్రీ ఎఱ్ఱాప్రెగ్గడ పుస్తకభాండాగారము	గుడ్లూరు	4-0-0	242	స్వయంపాకుల ఆదిశేషయ్యగారు	1916-వ సంవత్సరము
428	ఆంధ్రకల్పవల్లిగ్రంథాలయము	కశేడు	4-9-0	124	అరుమళ్ల వేంకటసుబ్బారాయుడుగారు	1917 డిసెంబరు నెల
429	ఆంధ్రగ్రంథాలయము	ఉలవపాడు	5-0-0	515	నందనవనం వెంకటసుబ్బయ్యగారు	1914 ఫిబ్రవరి నెల
430	శ్రీ గోపాలకృష్ణగోఖలే ఆంధ్రధర్మపఠనాలయం[గారం	కందుకూరు				
431	శ్రీ రాజా రామమోహనరాయల ఉచితపుస్తకభాండా	గండవరము	12-8-0	1132	సర్వాభట్ల గోపాలకృష్ణమ్మగారు	1914 జనవరి నెల

వరుస సంఖ్య	గ్రంథాలయ నామము	గ్రామము	మాసాదాయము	పుస్తకముల సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపనసంవత్సరము మున్నగునవి
432	ఆంధ్ర పుస్తకభాండాగారము	కనిగిరి				
433	వీరేశలింగ పుస్తకభాండాగారము [లైబ్రరీ]	నెల్లూరు	90-0-0	585	గడ్డం సుబ్బరామరెడ్డిగారు	1916 సం॥ స్థాపితము
434	తిక్కన పుస్తకభాండాగారము ఉ రీడింగురూము [కారొనేషన్]	నెల్లూరు	115-7-0	3049	మాడభూషి నరసింహాచార్యులు బి.ఏ., బి.ఎల్.; ముత్తరాజు శివరామయ్య బి.ఏ., ఎల్. టి.	1911 సం॥ మార్చి 31
435	శ్రీరామప్రసాదకోశనిలయము	పొగడదొరువు	2-0-0	650	వారణాసి సుబ్రహ్మణ్యముగారు; చక్కెరాల వెంకటశేషయ్యగారు	ఆనంద॥ చైత్ర శు ౧ లు
436	బాలకృష్ణసభ	నెల్లూరిరంగనాయకులపేట	1-8-0	150	ఎఱగుడిపాటి రామయోగి	18-5-1917
437	శ్రీసరస్వతీసమాజము	నెల్లూరు మూలపేట	171-13-0	396	కాళహస్తి వేంకటేశయ్యగారు	18-1-1912
438	శ్రీవివేకానందధర్మపుస్తకభాండాగారము	పోట్లపూడి	35-0-0	614	నెల్లూరు వెంకట్రామానాయుడుగారు	1913 మార్చి
439	గోపాలకృష్ణగోఖలేధర్మపుస్తకభాండాగారము	కొత్తూరు ఇందుకూరుపోష్టు				
440	అనుమూరు సుబ్బారాయుడుగారి పుస్తకభాండాగారం	ఇందుకూరిపేట				
441	పెద్దన పుస్తకభాండాగారము	తోటపల్లి గూడూరు				
442	జ్ఞానోదయగ్రంథాలయము	నెల్లూరు				
443	గోఖలే యువజనభ్రాతృవర్గము	నెల్లూరు				
444	వాణీగ్రంథాలయము	నవాబుపేట నెల్లూరు				
445	ఆంధ్రభాషాభివర్ధనీగ్రంథాలయము	ముత్తుకూరు				
446	ఎడ్వర్డు మెమోరియల్ ఫ్రీ రీడింగురూము	మైపాడు				
447	గోఖలేసేవాసమాజము	సంగము	12-0-0	461	ఆదూరు వేంకటస్వామిశ్రేష్ఠిగారు	1905
448	పోతనగ్రంథాలయము	ఇందుమూరు	4-0-0	300	ములుమూడి నారాయణరెడ్డిగారు	1-1-1914
449	శ్రీవేమనపుస్తకభాండాగారము	అల్లూరు				
450	పోతన గ్రంథాలయము	ఇందుపూరు				
451	సరస్వతీసమాజము	దువ్వూరు				
452	కారొనేషన్ ఫ్రీ రీడింగురూము	బుచ్చిరెడ్డిపాలెము				
453	శ్రీగోపాలకృష్ణపుస్తకభాండాగారము	బుడమగుంట	3-15-0		గుంటూరు సుబ్రహ్మణ్యముగారు	1915 జూన్ తేది
454	ఎంగుమన్న అస్సోసియేషన్	కావలి				
455	శ్రీలక్ష్మీకాంతసమాజము	జలదంకి				
456	జయలక్ష్మీపుస్తకభాండాగారము	బ్రాహ్మణకాకఅగ్రహారం				
457	శ్రీరాజా రామమోహనరాయలగ్రంథాలయము	గండవరం	4-0-0	1716	న. గోపాలకృష్ణన్	1914

చిత్తూరు మండలము

వరుస సంఖ్య	గ్రంథాలయ నామము	గ్రామము	మాసాదాయము	పుస్తకముల సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపనసంవత్సరము మున్నగునవి
458	లక్ష్మీవేంకటేశ్వరాన్నదానసమాజ భాండాగారము	తిరుపతి	5-0-0	985	కొండా సిద్దయ్యశెట్టిగారు	
459	ఆమ్నాయనిలయము	కార్వేటినగరము	7-0-0	300	వేదము వేంకటకృష్ణశర్మగారు	25-10-1917
460	శ్రీజయలక్ష్మీసమాజము	చివ్వాడ		183	బూదూరు రామానుజులురెడ్డిగారు	30-8-1917

461	హనుమద్గ్రంథాలయము	నారాయణవరము	86-9-0	816	యస్. రంగభాష్యము శెట్టిగారు	9-12-1917
462	తిరుచానూరు లక్ష్మీవిలాససభ	తిరుచానూరు				
463	వేంకటేశ్వరసమాజము	తిరుమల				
464	శ్రీరామచంద్రగ్రంథాలయము	చిత్తూరు				
465	ఆర్యవైశ్యసభ	,,				
466	గోఖలే ధర్మపుస్తకభాండాగారము	సోడము				
		కడపమండలము				
467	శ్రీవాగ్వధూనిలయగ్రంథాలయము	నెమళ్లదిన్నె, జమ్ములమడుగు	4-0-0	226	ఘం. వేంకటశాస్త్రిగారు	1915
468	శ్రీరామకృష్ణసమాజము	కడప	30-0-0	1680	శ్రీకంఠం నరసింహారావుగారు	1910
469	పులివెందులగ్రంథాలయము	పులివెందుల	20-0-0	360	యల్. వేంకట్రమణయ్యగారు	1883
470	వీణాపుస్తకభాండాగారము	మైదుకూరు			శీలం చెన్నయ్యగారు	
471	ఆంధ్రభాషాభివర్ధనీసమాజము	ప్రొద్దుటూరు				
472	రామచంద్రసమాజము	మైదుకూరు			కే. రామయ్యగారు	
473	వీరబ్రహ్మసమాజపుస్తకభాండాగారము	కందిమల్లాయపురము				
474	ఆంధ్రశారదానిలయము	నంద్యాల				
475	ఆంధ్రసమాజము	పాణ్యము				
476	శ్రీసుజ్ఞానవర్ధనీసమాజము	ఎఱ్ఱగుంట్ల				
477	శ్రీకృష్ణగ్రంథాలయము	పౌ॥, కోయిలకుంట్ల తా॥				
		కర్నూలుమండలము				
478	సుజ్ఞానవర్ధనీగ్రంథాలయము	శిరువెళ్ల		94	ఆలూరు రామసుబ్బాశాస్త్రిగారు	నలసంవత్సరము
		బళ్లారిమండలము				
479	మిత్రమండలము	బళ్లారి		600	కే. సింగరాచార్యులుగారు	1905
480	వివేకవర్ధనీభాండాగారము	ఆనెగొంది	5-0-0	1000	చిత్రదుర్గం శ్రీనివాసశర్మగారు	ఆనంద॥ కార్తిక శు 11
481	మారుతీవిలాసాత్మకగ్రంథాలయము	కుడుతని				
482	గోఖలేధర్మగ్రంథాలయము	కమలాపురము				
		అనంతపురమండలము				
483	శ్రీక్రియాశక్తియొడయరు ధర్మగ్రంథాయతనము	ధర్మవరము		474	శిరిపి ఆంజనేయులుగారు	1-12-1915
484	విద్యార్థిసంఘపుస్తకాలయము	అనంతపురము	0-6-0	850	కడప శ్రీనివాసరావు, కానుగు నరసింగరావు [గార్లు	1914
485	గీర్వాణభాషాభివర్ధనీసంఘము	నాగసముద్రము	4-0-0	206	తిరుమల రంగాచార్యులుగారు	28-2-1918
486	విద్యాభివర్ధనీసంఘ ధర్మగ్రంథాలయము	ఇంద్రావతి	8-0-0	480	యం. సన్నప్పనాయుడుగారు	1918
		సేలంమండలము				
487	శ్రీసీతారామపుస్తకభాండాగారము	హొసూరు	11-0-0	64	నారాయణాచార్యులుగారు	పింగళసంవత్సరము
488	ఆర్యధర్మబోధినీగ్రంథాలయము	ఈద్దనపల్లి	5-8-0	121	ఎల్. సుబ్బయ్యగారు	15-8-1918

వరుస సం.	గ్రంథాలయనామము	గ్రామము	మాసాదాయము	పుస్తక సంఖ్య	కార్యదర్శి పేరు	స్థాపనసంవత్సరము మున్నగునవి
489	ఆనందమందిరము	కారుపల్లి				
490	సనాతనధర్మబోధినీసమాజము	కెలమంగలం				
491	భారతీవిలాసపఠనమందిరము	బాగలూరు				
492	యస్. డి. బి. సభ	ముకాతీబారండూరు				
493	శ్రీవైఖానసకలాభివర్ధనీదివ్యజ్ఞానసభ	నాటిగిరి				
	చెన్నపురిమండలము					
494	విక్టోరియా పోస్టలు భాండాగారము	చెన్నపురి			ప్రసాదరావుగారు	1915 సం॥
495	ఆంధ్రసమితి, బండి వేంకటేశనాయకవీథి	,,		294	కే. మాధవరావు గారు	1916 సం॥
496	వాసంత గ్రంథనిలయము	,,	20-0-0	780	నేలనూతుల సుబ్బారావుగారు	1916 సం॥
497	శ్రీవిక్టోరియాపుస్తకభాండాగారము	,,		390	బి. గోపాలకృష్ణరావుగారు	1917 సం॥
498	వెంకన్నశాస్త్రులు ధర్మగ్రంథాలయము	,,		280	పం. దక్షిణామూర్తిశాస్త్రిగారు	1918 సం॥
	బెంగుళూరుమండలము					
499	ఆనందచంద్రికాగ్రంథాలయము	బెంగుళూరు		750	కా. శివరామదాసుగారు	1916
500	రామకృష్ణ బాల ధర్మమందిరము	కంటోన్మెంటు, బెంగుళూరు	5-4-0	447	డి. ఆర్. గోవిందరాజులుగారు	1-4-1912
501	దయానంద ఫ్రీ రీడింగు రూము	నంది, బెంగుళూరుజిల్లా				
502	శ్రీరామకృష్ణసన్మార్గసభ	యల్లిగొండపాలియము				
	ఆంధ్రేతరమండలము					
503	ఆంధ్రమహాజనసంఘము	12 లూయివీథి, రంగూన్		276	ఏ. సాంబమూర్తిగారు	1912 సం॥
504	సుభిక్షసంపదభివర్ధనీసంఘము	48 లూయివీథి, రంగూన్				
505	తెనుఁగుగ్రంథాలయము	సితబుల్డీ, నాగపురము				
506	ఆంధ్రసమితి	మిడ్నాపురం, ఖరగపురం		100	దేవరాజు సీతారామస్వామి పంతులుగారు	
507	హితకారిణీకుటీరము	జట్నీ, పూరీ, ఖరగపురం	5-0-0	96	గుమ్మలూరి లక్ష్మీనృసింహశర్మ గారు	1917 సం॥
508	ఆంధ్రభాషాభివర్ధనీసంఘము	సాలిమరు, సీల్వారుపోస్టు			ఆర్. రఘునాయకులుగారు	
509	ఆంధ్రభాషాసమాజము	కిడరపూరు, కలకత్తా			జే. ఎల్. స్వామిగారు	
510	ఆంధ్ర ఎస్సోసియేషన్	పేరయటాల్, జబ్బలపూరు				
511	చింతామణి ఆంధ్రలైబ్రరి	బెనారసు, నారదఘాటు		300	కే. వి. రమణరావుగారు	1914
512	ఆంధ్రసమాజము, సెంట్రలుహిందూకాలేజి	బనారసు				
	చెంగల్పట్టుమండలము					
513	శ్రీరామకృష్ణగ్రంథాలయము	సంతవేలూరు	4-0-0	154	పి. రామకృష్ణారెడ్డిగారు	పింగళ సం॥
514	జయలక్ష్మీ నారాయణ పుస్తకభాండాగారము	ఈగావారిపాలెము		684	యస్. బి. డి. శేషాచార్యులుగారు	1913

నైజాం రాష్ట్రము

515	మహబూబియా ఆంధ్రభాషానిలయము	ఎఱ్ఱుపాలెము				
516	శ్రీజ్ఞానవిద్యుత్ప్రవాహినీ ఆంధ్రభాషానిలయము	ఖమ్మంమెట్టు	15-0-0	451	మాదిరాజు వేంకటేశ్వరరావుగారు	1910
517	శ్రీవిరాట్ప్రాయాంధ్రభాషానిలయము	నేలకొండపల్లి	1-0-0	325	లంక లక్ష్మీనరసింహారావుగారు	1918 మే నెలలో
518	శ్రీవాణిహరాంజనేయాంధ్రగ్రంథనిలయము	బాణాపురము	2-0-0	60	ఎఱ్ఱా వేంకటనరసయ్యగారు	1918 ఫిబ్రవరి
519	సిద్ధమల్లేశ్వరాంధ్రభాషానిలయము	శేమిడిచెర్ల				
520	శ్రీమనోమ్మహానాంధ్రగ్రంథాలయము	వడ్డేపల్లి		394	భండారు మల్లికార్జునరావుగారు	1911
521	ఆంధ్రభాషాభివర్ధనీగ్రంథాలయము	సికింద్రాబాద				
522	ఆంధ్రకల్పవల్లి గ్రంథాలయము	,,				
523	సంస్కృతకళాసంవర్ధనీగ్రంథాలయము	,,	3-0-0	395	నాగం కృష్ణారావుగారు	1918
524	ఆంధ్రయువజనసంఘము	,,	25-0-0	1069	పేటేలి నరసింహముగారు	1912
525	వైశ్యాభివర్ధనీసంఘము సోమసుందరం వీథి	,,				
526	శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయము	హైదరాబాద	30-0-0	1849	హనుమంతరావుగారు	1901
527	శ్రీలక్ష్మీనరసింహానిలయము	,,				
528	ఆంధ్రవిజ్ఞానప్రకాశినీగ్రంథాలయము	సూర్యాపేట	10-0-0	170	పువ్వాడ వేంకటప్పయ్యశర్మగారు	1918 ఆగష్టు
529	శ్రీబాలభారతీనిలయాంధ్రభాషాభివర్ధనీసంఘము	శంషాబాద				
530	శ్రీరాజరాజాంధ్రభాషానిలయము	హనుమకొండ				

చిత్రపటముల వివరణము

మేజరు జనరలు బ్లిసుగారు:—బ్లిసుగారు అమెరికా దేశీయులు. యుద్ధకార్యములలో నారితేరినవారు. పారిసులో ప్రస్తుతము జరుగుచున్న సంధిసభలో అమెరికాదేశపక్షమున ప్రతినిధులుగా నున్నారు.

ప్రెసిడెంటు విల్సనుగారు:—విల్సనుగారు అమెరికా దేశాధ్యక్షులు. ప్రపంచమున శాంతిని చిరస్థాయినిగ సంస్థాపించుటకు కంకణము కట్టుకొనిన మహనీయులు. వీరి పదునాలుగు సూత్రముల ననుసరించియే ప్రకృతము సంగ్రామము ముగింపబడి ప్రపంచమున శాంతి యేర్పడినది.

వైటు లాన్సింగు, హౌసుగార్లు:—హెచ్. వైటు కర్నలులాన్సింగు హౌసుగార్లు ప్రెసిడెంటు విల్సనుగారి మిత్రులు. విల్సనుగారి ప్రయత్నములన్నిటికిని వీరు సహాయము చేయుచుందురు. వైటుగారు ప్రకృతము అమెరికాదేశపక్షమున పారిసునగరమున రాయబారిగ నున్నారు. కర్నలు హౌసుగారికి మనదేశీయుల యాశయములపట్ల సానుభూతి గలదు. లాన్సింగుగారు విదేశాంగ మంత్రులు.

జనరలు స్మట్సు, బోథాగార్లు:—జనరలు స్మట్సు, జనరలు బోథాగార్లు దక్షిణాఫ్రికాఖండవాసులు. సంగ్రామమున నాంగ్లదేశమునకు చాల సహాయము చేసియుండిరి. జనరలు బోథాగారు ప్రకృతము దక్షిణాఫ్రికా యూనియను ప్రభుత్వమునందు ప్రధానమంత్రులుగా నున్నారు.

సర్ లాయడుగారు:— సర్ లాయడుగారు న్యూఫౌండు దేశమునకు ప్రధానమంత్రి. సంగ్రామమున మిత్రమండలి వారికి చాల సహాయము చేసియుండిరి.

మాకినో, చిండామాటుస్సాయిగార్లు:— మాకినో, చిండా మాటుస్సాయి ప్రభువులు జపానుదేశీయులు. జాతిమతభేదములను పాటింపక సర్వజాతులను నానాదేశసంఘమునం జేర్చుకొనుచుండినగాని ప్రపంచమున శాంతి చిరస్థాయినిగా సంస్థాపింపబడుట కష్టతరమని సంధిమహాసభలో చాటిన మహనీయులు.

ఫ్రెంచి దేశ ప్రతినిధులు:—జూల్సుకాంబను, టార్డ్యూ, క్లెమెంశోగార్లు ఫ్రెంచిదేశీయులు. క్లెమెంశోగారు ప్రస్తుతము ఫ్రెంచిదేశమునకు ప్రధానమంత్రులుగా నున్నారు.

బోనరులా, బార్నిస్, లాయడు జార్జి, బాల్ఫరు గార్లు:—బోనరులా, బార్నిస్, లాయడు జార్జి, బాల్ఫరుగార్లు ఆంగ్లదేశపు రాయబారులు. లోకమున శాంతిని సంస్థాపించుటకు వీరు చాల పాటుపడినవారు.

బ్రెటియానోగారు:—బ్రెటియానోగారు రొమేనియా ప్రతినిధి.

పోలాండు ప్రతినిధులు:—డ్వాంస్కి, పిక్టెగార్లు పోలాండుదేశపు సంధిరాయబారులు.

భారతదేశపు రాయబారులు:— మాంటేగుగారు, బికనీరుమహారాజుగారు, సింహా ప్రభువుగార్లు సంధిసభలో మన దేశపక్షమున రాయబారులుగా నున్నారు.

ఇతర రాయబారులు:—హ్యూజెసుగారు ఆస్ట్రేలియా దేశపు రాయబారులు; సర్ జే. వార్డు, మాసిగార్లు న్యూజిలాండు ప్రతినిధులు; సర్ ఆర్లాండో, సొన్నినో ప్రభువు, సర్ సలాంద్ర గార్లు, ఇటలీదేశపు రాయబారులు; క్రామార్జు పెనెషుగార్లు, బొహీమియాదేశపు రాయబారులు, పాషిచిగారు సర్వియాదేశపు ప్రతినిధి, దోహర్తి సర్ జి. ఫోస్టరు, సర్ ఆర్ బోర్డనుగార్లు కనడా దేశపు ప్రతినిధులు.

కాంగ్రెసు రాయబారులు:— లోకమాన్య బాల గంగాధరతిలకు, నరసింహాచింతామణి కేల్కారు, వి. పి. మాధవరావు, ఎస్. సత్యమూర్తి, వి. జె. పటేలు, బి. జి. హార్నిమానుగార్లు, కాంగ్రెసు రాయబారులుగా నింగ్లాండునకు వెళ్లియున్నారు. భగవాను తిలకుగారు సంవత్సరము క్రిందటి ఇంగ్లండునకు వెళ్లిరి. వారచ్చటి ప్రజలకు మన దేశవిషయములను తెలియుచెప్పుటకు చేయుచున్న సేవ వర్ణింప నశక్యము. నరసింహాచింతామణి కేల్కారుగారు లోకమాన్యుని కుడి భుజమువంటివారు. మరాటా, కేసరిపత్రికలకు సంపాదకులు. పునహా నగరపారిశుద్ధ్యసంఘమున కధ్యక్షులు. వి. పి. మాధవరావుగారు చెన్నరాష్ట్రవాసులు. గొప్ప రాజ్యతంత్రజ్ఞులు. మైసూరు, తిరువాన్కూరు, బరోడా సంస్థానములకు చాలకాలము ప్రధానమంత్రులుగా నుండినట్టివారు. ఎస్. సత్యమూర్తిగారు సయితము చెన్నరాష్ట్రవాసులు, న్యాయవాదులు; దేశాభివృద్ధి విషయములలో చాల పనిచేయుచున్నవారు. వి. జే. పటేలుగారు బొంబయి రాష్ట్రవాసులు; సామ్రాజ్యశాసనసభాసభ్యులు. అఖిలభారత కాంగ్రెసు సంఘ సంయుక్త కార్యదర్శులు.

బి. జి. హార్నిమానుగారు బొంబయి క్రానికలుపత్రికకు సంపాదకులు. ఆంగ్లదేశీయులైనను మన యాశయములపట్ల చాల సానుభూతి గలవారు. కాంగ్రెసు నాయకులలో నొకరు. ఈ మధ్యనే ప్రభుత్వమువారిచే దేశరక్షక శాసనము క్రింద నాంగ్లదేశమునకు ప్రవాసమున కంపబడినారు. ఇంగ్లండునందు సాంఘికవాదులలో ప్రముఖులగు హెచ్. జి. వేల్సుగారిచే నెలకొల్పబడబోవు "రిపబ్లికను" పత్రికకు సంపాదకులుగ నుండబోవుచున్నారు.

స్వరాజ్యసమితుల రాయబారులు:—అనిబిసెంటు, బి. పి. వాడియాగార్లు జాతీయస్వరాజ్యసమితి తరపునను, ఆనరబిలు సి. పి. రామస్వామి అయ్యరు, సరోజినీదేవిగార్లు అఖిలభారత స్వరాజ్యసమితి తరపునను రాయబారులుగా ఆంగ్లభూమికి వెళ్లిరి. లోకమాన్యుని స్వరాజ్యసమితి తరపున నరసింహ చింతామణి కేల్కారుగారు, ఆనరబిలు కపర్దీ గార్లు ప్రతినిధులుగా వెళ్లియున్నారు.

మితవాదిసంఘప్రతినిధులు:—చింతామణి, రామచంద్రరావు పంతులు, కృష్ణగోవిందగుప్తగార్లు మితవాదుల ప్రతినిధులుగా నాంగ్లదేశమున పనిచేయుచున్నారు.

చిర్రావూరి యజ్ఞదత్త చింతామణిగారు ఆంధ్రులు. విశాఖపట్టణమండలవాసులు. అలహాబాదునందలి లీడరు పత్రికకు సంపాదకులు. ప్రస్తుతము సంయుక్తపరగణాల శాసననిర్మాణసభలో ప్రతినిధులుగా నున్నారు. మితవాదుల నాయకులలో నొకరు.

మోచర్ల రామచంద్రరావు పంతులుగారు. మితవాదుల నాయకులలో నొకరు. పంతులుగారు చెన్నపురి శాసన సభలో చాలకాలము ప్రజాప్రతినిధులుగా నుండి ప్రజోపకార్యము లనేకములను చేసియున్నారు.

సర్ కృష్ణగోవింద గుప్తగారు వంగదేశీయులు. హిందూదేశాంగమంత్రిగారిసభలో చాలకాలము సభ్యులుగ నున్నవారు. మితవాదులలో వీరును నొక ప్రముఖులు.

ముసల్మానుసంఘరాయబారులు:—మహమ్మదాలీ జిన్నా, యాకూబు హుస్సేనుగార్లు అఖిలభారత ముసల్మాను సమితి తరపున రాయబారులుగా వెళ్లియున్నారు. జిన్నాగారు చాల కాలము సార్వభౌమిక శాసనసభలో సభ్యులుగా నుండినవారు. రౌలట్టుచట్టము శాసనమైన వెంటనే జిన్నాగారు తమ సభ్యత్వమునకు రాజీనామా నిచ్చినారు. ముసల్మాను సంఘ కాంగ్రెసు నాయకులలో నొకరు.

యాకూబు హుస్సేనుగారు:—చెన్నరాష్ట్రవాసులు. చెన్నపురి శాసనసభాసభ్యులు. కాంగ్రెసు నాయకులలో నొకరు. గొప్పవక్తలు.

బ్రాహ్మణేతర ప్రతినిధులు:—చెన్నరాష్ట్ర బ్రాహ్మణేతర సంఘము తరపున డాక్టరు నాయరు, కూర్మా వెంకటరెడ్డి నాయుడు, దొరై రాజుగార్లు ఆంగ్లభూమికి వెళ్లియున్నారు. డాక్టరు నాయరుగారు ప్రఖ్యాతవైద్యులు. చాలకాలము చెన్నపురి శాసనసభలో సభ్యులుగా నుండిరి. జస్టిసుపత్రికా సంపాదకులు. రాయబహదరు కూర్మా వెంకటరెడ్డినాయుడుగారు ఏలూరు పట్టణవాసులు. బ్రాహ్మణేతర సంఘనాయకులలో నొకరు. ఏలూరు తాలూకా బోర్డునకు అనధికారాధ్యక్షులుగఁ జాలకాలము నుండి యున్నవారు.

భూస్వాముల ప్రతినిధులు:—దక్షిణదేశపు భూస్వాముల ప్రతినిధులుగ ఆనరబిలు కలవల ముప్పిలునాయరు, దివాను బహదరు పానుగంటి రామారాయనిం గార్లు ఇంగ్లండునకు వెళ్లియున్నారు. ముప్పిలునాయరు గారు కేరళ దేశీయులు. చెన్నపురి శాసనసభా సభ్యులు. బ్రాహ్మణేతరోద్యమము పట్ల సానుభూతి గలవారు. రామారాయనిం గారు పానుగల్లు జమీందారులు. చాలకాలము సార్వభౌమ శాసనసభలో భూస్వాముల ప్రతినిధులుగా నుండి పనిచేసినవారు. బ్రాహ్మణేతర నాయకులలో నొకరు.

మహమదు దుస్మానుసాహేబు గారు:—సాహెబుగారు చెన్ననగర వాసులు. కార్పొరేషను సభ్యులు. బ్రాహ్మణేతర నాయకులలో నొకరు.

లాలా లజపతిరాయిగారు:—లాలా లజపతిరాయి గారు పంజాబు రాష్ట్రవాసులు. కాంగ్రెసు నాయకులు. భారతీయుల వాంఛలను అమెరికా దేశీయులకు తెలియజెప్పి, వారి సానుభూతిని బడయుటకు అమెరికాదేశమున గడచిన నాలుగేండ్లనుండి చాలపనిని చేయుచున్నారు. అమెరికాదేశమున లోకమాన్యనిస్వరాజ్యసమితి శాఖాసంఘమునకు లజపతిరాయిగారు అధ్యక్షులు. స్వరాజ్యసమితి తరపున ఎంగిండియాపత్రికను ప్రకటించుచున్నారు. అమెరికాదేశము నందలి పలుప్రాంతములలో సంచారముచేయుచు భారతీయుల యాశయములను గురించి అచ్చటి ప్రజలకు ఉపన్యాసముల నిచ్చుచున్నారు. స్వరాజ్యసమితి శాఖలను నెలకొల్పుచున్నారు.

చిత్తరంజన దాసుగారు:—చిత్తరంజన దాసుగారు వంగరాష్ట్రీయులు. కాంగ్రెసు నాయకులు. వంగసాహిత్యమున నపారపాండిత్యము గలవారు. ఆంధ్రరాష్ట్రోద్యమము పట్ల దాసుగారికి చాల సానుభూతి గలదు. కాంగ్రెసు తరపున రాయబారులుగా నాంగ్లభూమికి వెళ్లుచున్నారు.

విజయనగరము యువరాజుగారు:—విజయనగరము యువరాజుగారు ప్రకృతము రాజకుమారుల కళాశాలలో విద్యాభ్యాసమును చేయుచున్నారు. వీరికి సంస్థానపు ప్రజలపట్ల నమితాదరము గలదు.

ఆనరబిలు రంగాచార్యులుగారు:—ఆనరబిలు రావుబహదరు టి. రంగాచార్యులుగారు చెన్ననగరవాసులు. చాలకాలము నుండి చెన్నపురి శాసనసభలో సభ్యులుగా నుండి ప్రజోపకార కార్యముల ననేకములను చేసియున్నారు.

కంది సుబ్బారావుగారు:—కంది సుబ్బారావు పంతులుగారు ప్రఖ్యాతులగు కంది నరసింగరావు పంతులుగారి వంశములోని వారు. హిందూపత్రికాసంస్థాపకులలో నొకరు. ఉత్తర సర్కారులలో చాలకాలము మేజస్ట్రీటు ఉద్యోగమును చేసి ప్రభుత్వపు మన్ననలను బడసి ప్రకృతము ఉపకారవేతనమును పుచ్చుకొని తిరుపతి క్షేత్రమున నివసించుచున్నారు. "పాకశాస్త్రము" మున్నగు గ్రంథములను ఆంధ్రమున వ్రాసియున్నారు.

ఆంధ్రమహాసభాధ్యక్షులు:— గత సంవత్సరము కడప నగరమున జరిగిన ఆంధ్రసభలకు నెమలి పట్టాభిరామారావు పంతులు, భూపతిరాజు వేంకటపతిరాజుగార్లు అధ్యక్షులు.

పట్టాభిరామారావు పంతులుగారు చిత్తూరు మండలవాసులు. కొచ్చి సంస్థానమునకు చాలకాలము ప్రధానమంత్రులుగా నుండి రాజకార్యములను అతి నిపుణతతో నిర్వహించిన మహనీయులు. ప్రస్తుతము ఉపకారవేతనమును పుచ్చుకొని మదనపల్లిలో కాలము గడపుచున్నారు. కడపలో సమావేశమైన ఆఱవ ఆంధ్రమహాజన సభకు అధ్యక్షత వహించి ఆంధ్రోద్యమతత్త్వమును గురించి గంభీరోపన్యాసము నిచ్చియుండిరి.

భూపతిరాజు వేంకటపతిరాజుగారు చెన్నపురి శాసనసభా సభ్యులు. కాంగ్రెసు నాయకులలో నొకరు. కడపలో సమావేశమైన ప్రథమాంధ్రరాష్ట్రీయసభకు అధ్యక్షత వహించి యుండిరి.

గాంధి మహాత్ముడు:—మహాత్మ మోహనదాసు కరంచందు గాంధిగారు గుజరాతు రాష్ట్రవాసులు. సత్యాగ్రహవ్రతధారకులు. రౌలట్టు చట్టమును కార్యరూపమున బెట్టనీయకుండ చాల ప్రయత్నములను చేయుచున్నారు. ఈ మహాత్మునకు ఆంధ్రోద్యమము పట్ల సత్యాదరము గలదు. ఆంధ్రదేశమున నొకసారి సంచారము చేసి ఆంధ్రదేశీయుల కష్టనిష్ఠురములను కనుగొన నిశ్చయించుకొనినారు.

కస్తూరి రంగయ్యంగారు:—ఎస్. కస్తూరి రంగయ్యంగారు ప్రఖ్యాతపత్రికారాజమగు హిందూపత్రికకు సంపాదకులు. సత్యాగ్రహవ్రతధారకులు. కాంగ్రెసు నాయకులలో నొకరు. సంగ్రామపరిస్థితులను కనుగొని వచ్చుటకు అయ్యంగారు జార్జి చక్రవర్తి గారిచే ఆహ్వానింపబడి, ఫ్రాన్సు, బెల్జియం యుద్ధరంగములను పరీక్షించి వచ్చిరి.

ప్రొఫెసరు ఆనందరావుగారు:— ప్రొఫెసరు కే. ఆనందరావు గారు జిల్లాజడ్జి కృష్ణస్వామి రావుబహదరు గారి పుత్రులు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయమున గణితశాస్త్రమును అభిమానశాస్త్రముగా దీసికొని పట్టపరీక్షలో కృతార్థులై స్మిత్తు దొరగారి బహుమతిని బడసిరి. ప్రస్తుతము ప్రెసిడెంసీ కళాశాలలో గణితశాస్త్రపండితులుగా నున్నారు.

ఎన్. ఎస్. వేంకటరామయ్యగారు:—ఎన్. ఎస్. వేంకటరామయ్యగారు దక్షిణదేశమున నివసించుచున్న ఆంధ్రులు. గుంటూరునందలి టౌను హైస్కూలునందు చాలకాలము ప్రధానోపాధ్యాయులుగా నుండి విద్యార్థుల మన్ననలకు పాత్రులైరి. ప్రస్తుతము దక్షిణదేశమున నొకచోక హైస్కూలునందు ప్రధానోపాధ్యాయులుగా నున్నారు.

సీతాపతిరావుపంతులు గారు:— రావుసాహేబు సీతాపతిరావు పంతులుగారు ప్రస్తుతము జయపురము సంస్థానమునకు ప్రధానమంత్రులుగా నుండి ప్రజోపయోగములగు కార్యముల ననేకములను చేయుచున్నారు. గొప్పదాతలు.

టి. విజయరాఘవాచార్యులు గారు:—రాం.బ. టి. విజయరాఘవాచార్యులు గారు దక్షిణదేశవాసులు. చాలకాలము చెన్నపురి నగరపారిశుద్ధ్యసంఘమునందు రివిన్యూ అధికారులుగానుండి ప్రస్తుతము కొచ్చి సంస్థానమునకు దివానుగా వెళ్లియున్నారు. యుద్ధనిధిసందర్భమున చాల పనిచేసి ప్రభుత్వమువారి మన్ననలను బడసియుండిరి.

విల్లింగ్డను ప్రభువుగారు:—విల్లింగ్డను ప్రభువుగారు ప్రస్తుతము చెన్నరాష్ట్రపాలకులుగా నున్నారు. లిబరలు కక్షకు చెందిన గొప్ప రాజ్యతంత్రజ్ఞులు భారతీయుల యాశయముల పట్ల నమితమగు సానుభూతిగలవారు. చాలకాలము బొంబయి రాష్ట్రపాలకులుగా నుండి బొంబయి రాష్ట్రవాసుల మన్ననలకు పాత్రులై యుండిరి. సంగ్రామమున విజయమగుటకు పనిచేసిన వారిలో విల్లింగ్డను ప్రభువుగా రొకరు. కెయిరామండల రైతుల కష్టములను నివారణచేయుటకు గాంధి మహాత్మునకు తోడ్పడినవారు. రాజ్యాంగసంస్కరణముల పట్ల మాంటాగు మంత్రిగారికి విల్లింగ్డను ప్రభువుగారు చాల సహాయము చేసియుండిరి.

విల్లింగ్డను ప్రభ్వీగారు:— విల్లింగ్డను ప్రభ్వీగారు చెన్నరాష్ట్రపాలకుల సతీతిలకము. భర్త గారి వలె భారతీయులపట్ల ఈమెగారి కమితమగు సానుభూతి గలదు. సంగ్రామమునకు గాను ఈమెగారు బొంబయి నగరమున స్త్రీ సంఘములను నెలకొల్పి వారి తోడ్పాటుచే, సైనికులకు దుస్తులు మున్నగు నుపకరణములను తయారు చేయించి పంపుచుండెడివారు. చెన్నపురిలో నయితము స్త్రీ సంఘముల తోడ్పాటుచే సాంఘిక సేవచేయ పూనుకొనియున్నారు.

దేశమున జాతీయపద్ధతులమీద ఉన్నతవిద్యను వ్యాపింపచేయుటకు ఈవిద్యాసంఘమువారు గతసంవత్సరము క్రిందట జాతీయవిశ్వవిద్యాలయము నెలకొల్పియున్నారు. విశ్వవిద్యాలయమునకు కవిసార్వభౌములగు డాక్టరు రవీంద్రనాథ ఠాకూరు గారు, ఛాన్సలరు. డాక్టరు ఎస్. సుబ్రహ్మణ్యయ్యరుగారు, ప్రో-ఛాన్సలరు. తిరువాన్కూరు సంస్థానమునందలి అడ్వకేటు జనరలు కె. ఆనందరావు గారు, వైసు ఛాన్సలరు. జార్జి అరండేలు గారు రిజిస్ట్రారు.

జాతీయవిశ్వవిద్యాలయము:—విశ్వవిద్యాలయ ప్రధానకార్యాలయము ప్రస్తుతము అడయారుకు సమీపముననున్న దామోదరవనమునందున్నది. లక్షరూప్యములు వ్యయము చేసి విశ్వవిద్యాలయమునకు గిండిలో శాశ్వతభవనములను కట్టుచున్నారు. తేనాంపేట ఉన్నతవిద్యాలయము జాతీయ విశ్వవిద్యాలయమున కనుబంధముగా మైలాపురమునకు సమీపమున నున్న సుద్ధరువనమున స్థాపింపబడినది. ఇచ్చట విద్యార్థులకు సాంకేతిక, పారిశ్రామిక, వ్యవసాయకశాస్త్ర విద్యలయందు శిక్షణ గఱపబడుచున్నది. ఈ విద్యాలయమునకు గద్దమూడి వేంకటసుబ్బారావుపంతులుగారు ప్రధానోపాధ్యాయులు.

సౌతుబరో సంఘము:—మాంటాగు మంత్రిగారి సంస్కరణప్రణాళికను కార్యరూపముగ బెట్టుటకు నియోజకవర్గము లెటుల విశాలవంతములు చేయవలయు ననువిషయమును ప్రభుత్వశాఖలలో వేనిని ప్రజాయత్తము చేయవలయు నను విషయము నా

లోచించుటకు పార్లమెంటువారు సౌతుబరో ప్రభువుగారి అధ్యక్షత క్రింద నొక విచారణ సంఘమును నియమించిరి. ఈ సంఘము నివేదికయందలి సూచనల ననుసరించియే మాంటాగు మంత్రిగారు సంస్కరణచట్టమును తయారుచేసిరి.

నిలుచున్నవారు: (ఎడమవైపునుండి కుడివైపునకు) మొదటి పంక్తి: డబ్లియు హైలీగారు; హెచ్. ఎల్. స్టీవెన్సనుగారు; డాక్టరు తేజబహాదురు సప్రూగారు; సర్ చిమ్మనలాలు సెతల్వాడుగారు; రెండవపంక్తి: కెప్టను ఎం. రీడరుగారు; ఏ. సి. హ్లాసనుగారు; జె. రెయినీగారు; ఎం. ఎన్. హాగ్ గారు; సర్ ప్రభాశంకర పట్టాని గారు; జె. పి. తాంప్సనుగారు; వి. ఎస్. శ్రీనివాసశాస్త్రిగారు.

కుర్చీలమీద కూర్చున్నవారు: మౌల్వీ సర్ రహీంబాక్షు గారు; సాహిబ్జాదా అఫ్తాబు అహమదుఖానుగారు; ఆర్. ఫెతాము గారు; సౌతుబరో ప్రభువుగారు; సర్ ఫ్రాంకుస్లయి గారు; సురేంద్రనాథ బెనర్జిగారు; ఎం. ఇ. కాచిమనుగారు.

నేలమీద కూర్చున్నవారు: జె. డి. వి. హాడ్జిగారు; పి. సి. పేలంట్సుగారు.

సర్ అబ్దురు రహీముగారు:— సర్ అబ్దురు రహీము గారు వంగదేశీయులు. చెన్నపురి యున్నతన్యాయస్థానమున న్యాయమూర్తులుగా నున్నారు. గొప్ప విద్యాంగవేత్తలు. పబ్లికు సర్వీసుకమీషనునందు సభ్యులుగా నుండి పౌరసేవోద్యోగములపట్ల ప్రజాభిప్రాయములను నిర్భయముగా వెల్లడించిన మహనీయులు.

సర్ జాను వాలిసుగారు:— సర్ జాను వాలిసుగారు చెన్నపురి యున్నతన్యాయస్థానమున ముఖ్యన్యాయమూర్తులుగా నున్నారు. ప్రజోద్యమముల పట్ల వీరికి నమితసానుభూతిగలదని ప్రతీతి.

ప్రొఫెసరు జోన్సుగారు:— జోన్సుగారు చెన్నపురి ప్రభుత్వపు వాతావరణశాస్త్రజ్ఞులుగా నుండి కొద్దిమాసముల క్రిందట విశ్రాంతిని బుచ్చుకొని స్వదేశమునకు వెళ్లినారు.

కలకత్తా బిషప్పుగారు:— కలకత్తా బిషప్పుగారు భారతదేశీయుల పట్ల నమితసానుభూతి గలవారు. ఈ మధ్యనే విషజ్వరము వాతబడి కీర్తిశేషులైనారు.

డాక్టరు స్కిన్నరుగారు:— డాక్టరు విలియం స్కిన్నరుగారు చెన్నపురియందున్న క్రైస్తవకళాశాలకు ప్రిన్సిపాలుగా నున్నారు. విద్యార్థులపట్ల వీరికి గల సానుభూతి వర్ణింప నలవి కాదు.

సర్ జాను స్టోనుగారు:— సర్ జాను స్టోనుగారు చెన్నపురి ప్రభుత్వవిద్యాశాఖకు చాలకాలము ప్రధానాధికారులుగ నుండి ఒక సంవత్సరముక్రిందట నుపకారవేతనమును పుచ్చుకొనిరి. చెన్నపురి రాజధానిలో విద్యాభివృద్ధికి వీరెంతయో పాటుబడిరి.

బనగానపల్లి నవాబుగారు:— కర్నూలు మండలమున నున్న బనగానపల్లి సంస్థానమునకు వీరు ప్రభువులు. యుద్ధకాలమున ప్రభుత్వమువారికి చాల సహాయముచేసిరి.

...గారు:— ప్రభుత్వమువారు యుద్ధవార్తల ప్రచారమునకుగాను సంవత్సరము క్రిందట నెలకొల్పిన పబ్లిసిటీబోర్డుకు వీరు కార్యదర్శులుగా నుండి దేశమునందు ప్రజలకు యుద్ధవిషయమున నిజమైన వార్తలను దెలియజేయుటకు నెంతయు పాటుపడినారు.

ఆంధ్ర బాలభట శిబిరము:— బాలభటోద్యమమును ఆంధ్రదేశమున వ్యాపింపచేయుటకై ఆంధ్ర బాలభట సంఘమువారు చాల పనిచేయుచున్నారు. బాలభటనాయకులను తర్ఫీతు చేయుటకై పలుచోట్ల శిక్షణశిబిరములను నెలకొల్పినారు.

డాక్టరు రాజగోపాలుగారు:— డాక్టరు బండ్ల రాజగోపాలునాయుడుగారు ఇంగ్లండునకు వెళ్లి వైద్యశాస్త్రమున గొప్ప పరీక్షలలో నుత్తీర్ణులై చాలకాలము చెన్నపురిలోని నగరపారిశుద్ధ్యసంఘము నందు అసిస్టెంటు హెల్తాఫీసరుగా నుండిరి. కొంతకాలము హైదరాబాదు మైసూరు సంస్థానములలో నయితము ఆరోగ్యాధికారులుగా నుండి ప్రజల కెంతయో సేవజేసిరి. పరోపకారమునందు వీరికి పెట్టినది పేరు. ఈ మధ్యనే విషజ్వరమువలన పరలోకగతులైరి.

గోపాలకృష్ణశాస్త్రి గారు:— ముక్తినూతలపాటి గోపాలకృష్ణశాస్త్రిగారు ఒంగోలులోని ఉన్నతవిద్యాలయమునందలి సంస్కృతాంధ్రపండితులు. ఆంధ్రగీర్వాణభాషలయందు వీరికి నిరాఘాటప్రజ్ఞ గలదు. ఆంధ్రమానసికశాస్త్రమునకు గ్రంథకర్తలు. జ్యోతిషశాస్త్రమున ననేకగ్రంథములను వ్రాసియున్నారు.

జి. మంగయ్యనాయుడు గారు:— కీర్తిశేషులగు బాపా మంగయ్యనాయుడుగారు విజయనగరము సంస్థానమున చాలకాలము వైద్యాధికారిగనుండి సంస్థాన ప్రజల కెంతయు సేవజేసిరి. వైద్యగ్రంథముల ననేకములను వ్రాసిరి.

రావుసాహెబు ముత్తయ్య శ్రేష్ఠిగారు:— రావుసాహెబు ముత్తయ్య శ్రేష్ఠిగారు మదరాసు నగరమునందలి నాటుకోటు వర్తకులలో ప్రముఖులు. నగరమున గల బ్యాంకులలో నొకదాని కధిపతులు. తుయరోగవైద్యాలయ భవననిర్మాణమునకు 50 వేల రూప్యములు సహాయము చేసిరి. శ్రేష్ఠిగారికి ఆర్థికశాస్త్రమున అభిమానము మెండు. 1913 సంగన ఇంగ్లండునకు వెళ్లి తమ అభిమానశాస్త్రమున పట్టపరీక్షలో నారితేరిరి.

కాశీభట్ల కృష్ణరాయశాస్త్రి గారు:— కాశీభట్ల కృష్ణరాయశాస్త్రిగారు సాలూరు నివాసులు. ఆంధ్రభాషయందు పాండిత్యము గలవారు. కృష్ణకవీయము, కవికౌలాసము, పద్మినీలత మున్నగు పుస్తకములను వ్రాసిరి. గ్రంథాలయోద్యమమునందు చాల పనిచేయుచున్నారు.

మద్దిపాటి హనుమంతప్పనాయుడుగారు:— మద్దిపాటి హనుమంతప్ప నాయుడుగారు ధర్మవరం నివాసులు. నిమ్నజాత్యుద్ధరణమునకు చాల పనిచేయుచున్నారు.

ఈదర శోభనాద్రిగారు:—ఈదర శోభనాద్రిగారు కృష్ణామండలవాసులు. సహకారోద్యమము పట్ల నెక్కువ పట్టుదలతో పనిచేయుచున్నారు. ఈ మధ్య గుడివాడలో జరిగిన కృష్ణామండల సహకారసభకు ఆహ్వానసంఘాధ్యక్షులుగా నుండిరి.

మాచర్ల రామన్న శ్రేష్ఠిగారు:—మాచర్ల రామన్న శ్రేష్ఠిగారు నైజామురాష్ట్రవాసులు. గొప్పవర్తకులు. పరోపకారపరాయణులు. ఆంధ్రభాషాభిమానులు.

ఇందుపూడినరసింహ శ్రేష్ఠిగారు:—నరసింహ శ్రేష్ఠిగారు బ్రహ్మపురము నివాసులు. ఆంధ్రవాణి పత్రికాస్థాపనమునకు చాల సహాయము చేసియున్నారు. ఈ క్షామకాలమునందు అనుదినము బీదలకు అన్న వస్త్ర దానములను చేయుచున్నారు.

పేర్ల రామమూర్తి శ్రేష్ఠిగారు:— కీర్తిశేషు లగు పేర్ల రామమూర్తి శ్రేష్ఠిగారు విజయనగరమునందలి వైశ్యప్రముఖులలోనొకరు. గొప్పజమీందారు. వీరు చనిపోవునప్పటికి దాదాపు 60 లక్షల రూపాయల యాస్తి యుండెను. నేషనల్ ఇండస్ట్రియలు స్కూలును స్థాపించుటకై 25 వేల రూపాయలను దానముచేసిరి. జాతిమత వివక్షతలేక అన్నివర్ణముల వారికి అన్నము నొసంగునట్లుగ వీరు సత్రమును స్థాపించిరి. వీరు చేసిన ధర్మకార్యములు అనేకములు కలవు.

పి. హనుమంతయ్య శ్రేష్ఠిగారు:— హనుమంతయ్య శ్రేష్ఠిగారు హైదరాబాదు నివాసులు. గొప్పవర్తకులు. దాతలు.

రాజవైద్య శేషయ్య శర్మగారు:—కీర్తిశేషు లగు రాజవైద్య నాగలింగం శేషయ్య శర్మగారు అమృతలూరు నివాసులు. ఆయుర్వేదమునందు అపారమగు పాండిత్యము గలవారు. అమృతలూరునందలి సంస్కృత కలాశాలా సంస్థాపకులలో వీరు నొకరు.

ఆకారపు భద్రయ్య గారు:— ఆకారపు భద్రయ్యగారు నైజాము రాష్ట్రీయులు. వరంగల్లునందలి శబ్దానుశాసనాంధ్రగ్రంథాలయ సంస్థాపకులు. ఉదారస్వభావులు. దాననిరతులు.

అవుల పెద్దకొండారెడ్డిగారు:—అవుల పెద్దకొండారెడ్డిగారు అనంతపుర మండలవాసులు. అనంతపురము కలాశాలలోని పేదవిద్యార్థులకు సతతము విద్యార్థి వేతనము నిచ్చుచున్నారు. ప్రకృతము అనంతపురము జిల్లాబోర్డుకు సభ్యులుగా నుండి రైతుల కష్టముల నివారణకు చాల పనిచేయుచున్నారు.

ఏలగిరి జమీందారుగారు:—ఏలగిరిజమీందారు లగు ఏకోల్లుముకుంద మాధవ ముని పాపిరెడ్డిగారికి ఆంధ్రోద్యమముపట్ల నభిమానము మెండుగ గలదు. పొట్లపూడి సుజనరంజనీసమాజమునకు చాల ధనసహాయమును చేసియున్నారు. బ్రాహ్మణేతర సంఘస్థాపకులలో నొకరు.

నూకల చెంగయ్యగారు:— కీర్తిశేషు లగు నూకల చెంగయ్యగారు కడపమండలవాసులు. పుల్లంపేటలో బహూత్తమ విద్యాలయమును నెలకొల్పి మండలమునందలి విద్యార్థులకు సాంకేతిక విద్యలను ఉచితముగా గరపుచుండెడివారు. ఈ మధ్యనే విషజ్వరమువలన పరలోకగతులైరి.

మద్దుల చినరాజు శ్రేష్ఠిగారు:— మద్దుల వేంకట చినరాజు శ్రేష్ఠిగారు ఏలూరు నివాసులు. ఆంధ్రవిద్యానిధికి ద్రవ్యసహాయము చాల చేసియున్నారు. మహాదాతలు.

నందిమండలం ముద్దునాగరాజుగారు:— నందిమండలము ముద్దునాగరాజుగారు చెంగల్పట్టు మండలవాసులు. విజయనగరరాజవంశీయులు. మండలమున ననేకచోట్ల దేవాలయములను కట్టించి కీర్తినొందుచున్నారు. ఆంధ్రభాషయందు వీరి కమితమగు నభిమానము. గ్రంథాలయముల కనేకములకు ధనసహాయము చేయుచున్నారు.

దివి శేషాచార్యులుగారు:—బాలకళానిధి శేషాచార్యులుగారు చెంగల్పట్టు జిల్లావారు. వైఖానసపత్రికాసంపాదకులు. పురాతన సంస్కృతగ్రంథముల ననేకములను ప్రకటించుచున్నారు.

రాయిపాటి వేంకటసుబ్బయ్యగారు:—వీరు పోరంకి గ్రామనివాసులు. ప్రకృతము వానప్రస్థాశ్రమమునం దుండి మఠాలయముల ననేకములను నిర్మించి తమయావదాస్తిని భగవత్కైంకర్యములకు వినియోగించుచున్నారు.

నోరి సుబ్రహ్మణ్య శాస్త్రులవారు:—నోరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తెనాలి సంస్కృతకలాశాలలో పండితులుగ నున్నారు. వ్యాకరణశాస్త్రమున గొప్పపండితులు. భగవాను బాలగంగాధరతిలకుగారి గీతారహస్యమును ఆంధ్రీకరించి ఆంధ్రదేశమునకు గొప్పసేవ చేసియున్నారు.

హరిలాలుగారు:— హరిలాలుగారు హైదరాబాదు నివాసులు. గొప్పవర్తకులు. దానధర్మనిరతులు.

ఎస్. రత్నవేలు శ్రేష్ఠిగారు:—ఎస్. రత్నవేలు శ్రేష్ఠిగారు చెన్నపురి నగరమునందలి నాటుకోటువర్తకులలో ప్రముఖులు. దానధర్మపరులు. బిన్నీకంపెనికి దుబాసిగా నున్నారు.

సుజనరంజనీ సమాజము:—సుజనరంజనీ సమాజము పొట్లపూడియందు ఉత్సాహవంతు లగు కొంతమంది యువకులచే నెలకొల్పబడినది. ఆంధ్రోద్యమము, స్వదేశోద్యమములపట్ల సంఘము వారెంతయో సేవచేయుచున్నారు.

ఆంధ్రపరిశోధక మండలి:—రాజా చెలికాని లక్ష్మారావు బహదరుగారు మున్నగువారిచే ఈ మండలి నెలకొల్పబడినది. ఆంధ్రభాషలోని అపూర్వగ్రంథములను ముద్రించి ఆంధ్రదేశ సేవ చేయుచున్నది.

కోరల్ల సుబ్బారాయుడు గారు:— వీరు మిడిల్ స్కూల్ పరీక్షలో కృతార్థులై గుమాస్తాపనిలో ప్రవేశించి స్వసామర్థ్యమువలన మొదటితరగతి డిప్యూటీ కలెక్టరు పదవివరకు నున్నతిం

గాంచిరి. వీరు 2 లక్షల రూప్యముల యాస్తి నార్జించిరి. ఈయనకు సంగీతసాహిత్యవైద్యజ్యోతిషములందు ప్రవేశము కలదు. 50 వేల రూప్యములు దానధర్మములక్రింద వినియోగపఱచునట్లు మరణశాసన మొనర్చెను. దానిని తన జీవితకాలములోనే క్రియారూపమునకు తెచ్చెను.

కొరళ్ల వేంకటలింగము గారు:— ఈయన కొరళ్ల సుబ్బారాయడుగారి కుమారుఁడు. బి. ఏ., బి. ఎల్. పరీక్షలలో కృతార్థులై హైకోర్టు వకీలుగ నుండెను. పిత్రార్జిత మైన యాస్తితో తృప్తిపడి సుఖముగ కాలక్షేపము చేసెను. మిక్కిలి శాంతస్వభావుఁడు, స్నేహపాత్రుఁడు. ఈయన కూడ ఇంచుమించు సంవత్సరమునకు పూర్వము పరమపదించెను.

చెన్నపురాంధ్రసభ:— క్రిందటి సభా సంవత్సరము లలితకళాశాఖా కార్యదర్శి పింజల సుబ్రహ్మణ్యము శ్రేష్ఠి గారు లలితకళాశాఖాసభ్యులకును నటకులకును శాఖాభిమానులకును విందొనర్చిన సందర్భమున ఈ ఛాయాపటము తీయఁబడినది.


సర్ విలియం క్రూక్సు గారు:— సర్ విలియం క్రూక్సుగారు ప్రఖ్యాత రసాయన శాస్త్రజ్ఞులు. క్రొత్త క్రొత్త లోహములను వీరు కనిపెట్టి లోకమునకు మహోపకారమును చేసిరి. మానసిక శాస్త్రమునందు క్రూక్సుగారి కపారపాండిత్యము గలదు. రాయలు సొసైటికి చాలకాలము అధ్యక్షులుగా నుండిరి. మూఁడు నెలల క్రిందట పరలోకగతు లైరి.

కారలు మార్క్సుగారు:— కారలు హెన్రిక్సుమార్క్సుగారు జర్మను దేశీయులు. లోకమునందలి మానవులందఱును ఆస్తిని, సంపదను, సమానముగ ననుభవించి సుఖపడవలయు నను సిద్ధాంత సంస్థాపకులలో మార్క్సుగా రగ్రగణ్యులు. ముప్పది సంవత్సరముల క్రిందట మార్క్సుగారు పరలోకగతు లైరి.


కోరాడ రామచంద్రశాస్త్రులుగారు:— ఈయన సుప్రసిద్ధులగు కోరాడ లక్ష్మణశాస్త్రి పుత్త్రులు. ఈ వంశీయులు శ్రీశైలభ్రమరాంబికానుగ్రహోత్తసర్వతంత్ర స్వతంత్రపాండితీధురీణులు. రామచంద్రశాస్త్రులుగారు అప్రతిమమగు పాండిత్యము గలవారును బ్రహ్మశ్రీ శిష్టు కృష్ణమూర్తి శాస్త్రులుగారికి సమకాలికులును ఛాత్రులునై యున్నారు. ఈయన, మచిలి బందరుచేరి అచ్చటి నోబిలుకాలేజిలో పండితపదవి నధిష్ఠించి నిశ్చింతులై సంస్కృతాంధ్రములయందు తమకు గల యనర్ఘళపాండితిని ప్రకటించుచు, మృదుమధుర రచనలతో నింపగునట్లు సుమారు నలువది గ్రంథములను రచించిరి. వీరి స్వగ్రామము తొలుత గోదావరిజిల్లా అమలాపురం తా॥ కేసనకుఱ్ఱు అయినను, క్రమముగా నీ పండిత వంశము బందరునందు స్థిరవాసము నేర్పఱచుకొనియెను. ఈయన వెనుకటి యువ సంవత్సరమున జన్మించి శార్వరివత్సరమున పరలోకగతు లైరి. ప్రస్తుత మీ మహాకవి గ్రంథములలో ఘనవృత్తాదిగ్రంథములు ముద్రితములై ప్రచారమున నున్నవి.

కోలాచలం శ్రీనివాసరావు గారు:— కోలాచలం శ్రీనివాసరావు గారు బళ్లారి పురవాసులు. ప్రఖ్యాత నాటకకర్తలు. సంఘసంస్కర్తలు. ఈ మధ్యనే పంతులు గారు పరలోకగతు లైరి.

పోలవరం జమీందారు గారు:— కొచ్చర్లకోట వెంకటకృష్ణారావు పంతులు గారు పోలవరం జమీందారులు. శాసన సభలో చాలకాలము జమీందారులు ప్రతినిధులుగా నుండి ప్రజోపకార్యము లనేకములను చేసియున్నారు. ప్రఖ్యాత గ్రంథకర్తలు, సంవత్సరము క్రిందట పంతులు గారు కీర్తిశేషు లైరి.



ప్రధాన విద్యుచ్ఛక్తిసాధనము. (4 a)



యంత్రము, డైనమో, విద్యుద్యంత్రము, స్విచ్ పలక యీసామానులన్నియు పైయంత్రమునం దున్నవి.

కొద్ది ద్రవ్యమును మాత్రము ఖర్చు పెట్టిన యంత్రసహాయము లేకనే దీపము లెప్పుడైనను వెలిగించుకొనవచ్చును. గొప్ప సమర్థతగల యీ యంత్రమునకు ఒక పర్యాయము సాధనములు చేసిన విద్యుచ్ఛక్తి కలిగించి చాలదినములు పనిచేయును. ఇండ్లకుగాని బంగళాలకుగాని మొత్తముమీద దినమునకు కొద్దిడబ్బుమాత్రమే యీ యంత్రమునకు ఖర్చగును. ఇతరపనులకు కూడ యీ యంత్రము నుపయోగపఱచుకొనవచ్చును. తోటలుగలవారికిని మిల్లులుగలవారికిని ఇది చాల యుపయోగకరము. వివరములను కోరువారు యీ క్రిందివిలాసమునకు వ్రాయుడు.

మెస్సర్సు అబ్బాస్ హుస్సేన్ అండు కంపెని,

(పోస్టుబాక్సు 218) 17 అంగప్పనాయకన్ వీధి, మదరాసు.

చూడుడు! గమనించుడు!!

ఎలిసియం సబ్బు. (4 b)

దీనిని ప్రయత్నించి చూడుడు

ఈ సబ్బు గుడ్డలకును ఇంటి పనులకును, స్నానమునకు నుపయోగకరమగుటకు ముఖ్యసాధనము. సొగసైన కాయలలోనుండి తీయబడిన నూనెలచేతను యింకను నిర్మలమైన యితర వస్తువులచేతను తయారుచేయబడినది. చెడుపదార్థములచేత చేయబడినదికాదని పూచీ యివ్వబడును. ఈసబ్బు జనులకు మిగుల తృప్తికరము నిచ్చును.

దీనిని ప్రయత్నించి చూడుడు.

నార్తువెస్టు సోప్ కంపెని, లిమిటెడ్, కలకత్తా.

సోలు ఏజెంట్లు:—అబ్బాస్ హుస్సేను అండు కంపెని,

17 అంగప్పనాయకన్ వీధి, జార్జిటవున్, మద్రాసు.

విశ్వ క్షేమమునకు !! ఇహలోకామృతము !!!

ఆరోగ్యమును కాపాడు దివ్యౌషధము

చారుటారుగారి "అమృతబిందు" జీవామృతము



CHARUTARS
AMRIT-BINDU

అతిసారము, గ్రహణిభేదులు, కలరా మొదలైన రోగములను కుదుర్చుటలో అద్భుతముగా పనిజేయును. దగ్గు, పడిశము, ఉబ్బసము మొదలైనవాటిని కుదుర్చుటలో దివ్యౌషధము. పండ్లనొప్పి, తలనొప్పి, కీళ్ళపోట్లు మొదలైన రోగములను విజయవంతముగ కుదుర్చును.

బుడ్డి 1-కి వెల రు 1-8-0, తపాలా ఖర్చులు లేవు.

అన్ని మందుల షాపులలోను దొరకును.

అమృతబిందు ఆఫీసు, నడియాదు, గుజరాతీ.


సోలు ఏజంట్లు:—బి. సి. షా. అండు కంపెని,

259 చైనాబజారురోడ్డు, మదరాసు.

రక్తశుద్ధి ప్రాపకము డాక్టరు వామన్ గోపాల్

అయోడైస్డ్ సరసపరిల్లా. (25 a)





వేలకొలది జనులవల్ల వాడబడి హిందూస్థానమంతట ప్రసిద్ధి చెందిన ఈ మందు యేబది సంవత్సరములుగా రక్తశుద్ధి చేయుటయందు దీనికి సమానముగా వేరొకటియు లేదని సిద్ధాంతము చేయబడి యున్నది. పార్శ్వవాయువు, సర్పవ్యాధులు, బలహీనము వీటిని కుదుర్చుటయందు విద్యుచ్ఛక్తివలె పని చేయుచున్నది.


క్రయము సీసా 1-కి రు. 1-4-0.

డాక్టరు గోవిందరావు కేశవ అండు సన్స్,

ఠాకుర్ద్వార్ బొంబాయి.

ఏజంట్లు:— షా. భగవాన్ దాస్ చునిలాల్ అండు కంపెని,

259 చైనాబజారురోడ్డు, మదరాసు



మన్యజ్వరములకును జ్వరములకును

రాజౌషధము

ప్రమాణ వాక్యము

స్క్వాబ్సు గారి ఫీవర్ స్పెసిఫిక్కు ఆశ్చర్యకరముగా పని చేయుచున్నది. దాని నుపయోగించిన వారందరును దాని మహిమను ప్రమాణపూర్వకముగా నంగీకరించుచున్నారు.

జీ. జె. షెఫీ, లోకో డిపార్టుమెంటు, ఎం. అండు ఎస్. రైల్వే ఆస్పత్రి.


నిరాశ చేసికొన్నవారికి ఆశాకారణము.

తీవ్రమైన మన్యజ్వరముచే బాధపడుచు వైద్యులచే నిరాశాపూర్వకముగా వదలివేయబడిన యిరువురు రోగుల ప్రాణములు స్క్వాబ్సు గారి స్పెసిఫిక్కు కాపాడెను.—సి. డి. ఎల్. ప్రయిరీ, హైదరాబాదు, దక్కను.

హిందూదేశమందంతటను విక్రయింపబడుచున్నది.

బి. సి. షా. అండు కంపెని, 259 చైనాబజారురోడ్డు, మదరాసు.

స్త్రీలయొక్క దైవము



ఏలాటి స్త్రీలబాధలుయుండినను, ముట్టుకట్టురోగము, అకాలబహిష్ఠ, సైకము, బలహీనము వీట్లను కుదుర్చుటలో మా

ప్రదరవినాశక

దివ్యౌషధము. అనేకయోగ్యతాపత్రికలు పొంది యున్నది. సంతానము లేనివారికి యీ ఔషధము అమృతము. గర్భకోశము శుద్ధపరచి సంతానము వృద్ధిచేయును.

ధర బుడ్డి 1-కి రు 2—8—0.

ప్రదరవినాశక ఆఫీసు, కాంబే, గుజరాత్.

మదరాసు ఏజంట్లు:— బి. సి. షా. అండు కంపెని,

259 చైనాబజారురోడ్డు, మదరాసు.

అమృతాంజనము

గాయములు పుండ్లకు ఘనమయిన మందు.



చక్కని డబ్బీలో సహా సీసా 1-కి రూ. 0-8-0. ప్రతియింట నుండదగినది.

అమృతాంజనము లోకప్రసిద్ధిని బడసియున్నది. అమృతాంజనము అన్ని నొప్పులకు సిద్ధామృతము.

అమృతాంజనము అమృతశబ్ద మాదినిగల మందు గుంపుగాదు.

నకలు మందులవలన మోసము గలుగును.

పంచభాషచీటిని చూచికొనిన మోసము గలుగదు.

అమృతాంజనము అంజనశబ్ద మంతమున గల నకలు మందు గాదు.

అమృతాంజనమునకు సాటియైనమందు అమృతాంజనమే.

అమృతాంజనపు జగత్ప్రఖ్యాతివలన దేశమునందంతటను అమృతములు అంజనములు వెలసినవి.

తామరతైలము.

తామర, తీటు, గజ్జికి మంచితైలము. డబ్బీ 1-కి 0-6-0.

దంతచూర్ణము.

ఒకసారి వాడి పరీక్షించుట యుక్తము. డబ్బీ 1-కి 0-2-0 డజను రూ. 1-2-0.

మోహినితైలము.

స్త్రీపురుషులు వాడుటకు యోగ్యమైనది. 5 తులములుగల సీసా 1-కి రూ. 0-12-0.

అమృతాంజనం డిపో మదరాసు, లేక ఫోర్టు, బొంబాయి.

(10)

ఓమం కర్పూర్

[illegible]

ఒక సీసా ఎన్నటి [illegible] ప్రతిమించినది.

[illegible] 1884-వ సంవత్సరము న [illegible] ఓమం కర్పూర్ [illegible]

మా ఔషధం [illegible] క్రింది విలాసమునకు వ్రాయుడు.

దీనిని యింటిలో నుంచుకొనుము. ప్రతిషాపులోను వర్తకులవద్దను దొరకును.

సీసా ఒకటికి వెల రూ. 0-8-0, 1-0-0, 1-8-0, 2-12-0, 11-0-0.

JWARAHARI
TRADE MARK

FOR
Fevers, Colds, &c.

1 Re., Rs. 1.8, Rs. 2.12, and Rs. 11 per bottle, postage extra.

N.B.—Orders for one doz. sent *Post Free.*

Omum Carpoor

For INDIGESTION, DIARRHEA, CHOLERA, &c.

1 Re., Rs. 1.8, Rs. 2.12, and Rs. 11 per bottle, postage extra.

N.B.—Orders for one doz. sent *Post Free.*

HENRY'S
Great Indian Remedies Co.,
43, King William St., London, E.C.,
AND
2nd Line Beach, MADRAS.

హెన్రీస్ గ్రేట్ ఇండియన్ రెమిడీస్ కంపెని

15, అరమనకారవీధి, మదరాసు

HENRY'S GREAT INDIAN REMEDIES COMPANY
15, ARMENIAN STREET, MADRAS



కుంతలీనమూర్తి “దిల్‌ఖోష్” టెలిఫోన్ నెంబరు 1081.

(౮) అద్భుతమైన (౮)

నాటకములు

శ్రీ రాజా భుజంగరాయకవికృతములు

ఉత్తరరామ చరిత్రము.

భవభూతికృతమున కాంధ్రీకరణము.

ఆంధ్రభాషయందు దీనితో సమతుల్యమగు నాటకము మరియొకటి లేదు. ఇందలి కథ, రచన అత్యాశ్చర్యకరములుగ నుండి యున్నవని మహాజనులనేకులు యీ క్రింది తీరున శ్లాఘించియున్నారు.

New India (న్యూ ఇండియా పత్రిక):—

గ్రంథకర్త తనయాంధ్రీకరణమున భవభూతికవ్యాఖ్య జయప్రదముగ నను:రించెను. ఆంధ్రీకరణమున గూడ నిది సర్వోత్కృష్టముగ నున్నది. మొదటినుండి తుదివరకు మనోహరమైనట్టియు, నిర్దుష్టమైనట్టియు, శైలిగలదై యున్నది. ఈ కవి ఆంధ్రభాషాభిమానులందరికిని వందనీయుడు.

బ్ర॥ వేదము వెంకటరాయ శాస్త్రిగారు:—

నేను పరిశీలించిచూచిన ప్రతిభాగము మాతృకనుండి తీసిపోక మృదుమధుర శైలిగలిగి హృదయరంజకముగ నున్నది. స్థిరమైన భవభూతియొక్క హృదయము ఇంచుకంతయు చెడకుండ నాంధ్రీకరించుటచే నీగ్రంథము స్తోత్రపాత్రముగ నున్నది.

బ్ర॥ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు:—

ఇదివఱ కాంధ్రీకృతములగు పొత్తములలో నిది యగ్రగణ్యమని తలచుచున్నాను. ఈనాటక రాజము నింతకన్న సమర్థాలముగా మార్చుట కష్టసాధ్యము.

జి. సోమన్నగారు, ఎం. ఎ. ఎల్. టి:—

మూలగ్రంథముతో పరిచయము కలిగియుండుట వంజేసి ప్రియంబులగు పద్యములయు ప్రసంగములయు, సమవాదముల నెక్కుడు శ్రద్ధతో బరికించితిని. తమకృతి మూలానుసరణముగను, రసవంతముగను గనుపట్టుచున్నది. తమ పుస్తకము పండిత సన్మానమును బడసి, అచిరకాలములో నాట్యరంగములయందును, పాఠశాలలయందును ప్రఖ్యాతిని గాంచునని నేను విశ్వసించుచున్నాను.

ఇట్టి యభిప్రాయము లనేకములు గలవు.

వెల రు 0-12-0

దేశభక్తుల చరిత్రలు.

దాదాభాయి నౌరోజీ చరిత్రము:— పద్యకావ్యము, దేశభక్తిని పూరించును. వెల రు 0-4-0.

గోపాలకృష్ణ గోఖలే చరిత్రము:— పద్యకావ్యము, దేశభక్తిని పూరించును. వెల రు 0-4-0.

శాకుంతల నాటకము.

కాళిదాసకృతమున కాంధ్రీకరణము

ఈ ప్రపంచమున నింతటి మహాగ్రంథము లేదని ప్రసిద్ధిగాంచిన నీ శాకుంతల నాటకమును చదువనివా రుండకూడదు. ఇందలి పద్యగద్యములు కేవలము రత్నపుంజములు. ఇంగ్లీషు గారంటీ చేయగలము. దుష్యంతుని విరహము, శకుంతల పరితాపము, కణ్వుని పుత్రికా వియోగదుఃఖము చదువరుల హృదయములను కరగించును.

వెల రు 0-12-0.

చారుమతీ నాటకము.

ఇందలి ఆశ్చర్యకరమగు కథ, యింపులు గులుకు పద్యములు, కడుపుబ్బ నవ్వుపుట్టించు హాస్యము, ప్రౌఢాంగనల వలపుమాటలు, అపహాస్యములు, శృంగారచేష్టలు అత్యానందకరముగ కలిగించును. ఇది ఒక ఆంగ్ల నాటకము (Shakespeare's As You Like It) ననుసరించి వ్రాయబడినది. వెల రు 0-12-0.

శశిరేఖా నాటకము.

అతివకూర్పు, అనేక పర్యాయంబులు సభల యానందింప బడుచున్నది. వేనవేలు ప్రతులమ్ముడు పోయినవి. స్వర్గీయ తానకూలములగు ఫారసీ, హిందూస్థానీ మట్టులుగూడ పాటలనేకములు గలవు. అనేక కంపెనీలవారిచే నాడబడుచున్నది. వెల రు 0-6-0.

ఆధునిక కవి జీవితములు.

ఇందు 300 మంది ఘనకవి పండితోత్తముల జీవితములును, వారి రచనా చమత్కారములును గలవు. ఆంధ్రవాణి కిది పుట్టినిల్లు.

వెల రు 0-8-0.


అద్భుతమైన కథలు.

దొంగల మాయోపాయములు, వానినుండి, తప్పించుకొను నుపాయములు యీ క్రింది అద్భుత చమత్కార కథలలో వివరింపబడినవి. మన యాంధ్రభాషలో యిట్టివి లేవు.

అగ్గిరాముని మరణవేదన	0-3-0
మైరావణుడు	0-3-0
కలియుగ రావణుడు	0-4-0

పలయువారు క్రింది విలాసమునకు వ్రాసుకొనవలెను.

భారతీ వేర్ హౌస్, ఏలూరు, కృష్ణా జిల్లా.



MOULVI ABULKALAM AZAAD,
Editor "ALHILAL" Calcutta.

M

రాజ్యాంగ సంస్కరణములు

మాంటు ఫర్డు నివేదిక సూచనలు

మాంటేగ్యుమంత్రి - చెమ్సుఫర్డు ప్రభువు గార్లు ప్రకటించిన భారత రాజ్యాంగసంస్కరణముల ప్రధానవిషయములలో నీక్రిందివి ముఖ్యమైనవి:

ఇండియా కార్యాలయము

1. పార్లమెంటుయొక్కయు, ఇండియాకార్యదర్శియొక్కయు అధికారమును తగ్గింపవలెను.

2. ఇండియాకార్యదర్శి జీతమును ఇంగ్లాండుప్రభుత్వమువారే భరింపవలెను.

3. భారతదేశవిషయములనుగూర్చి యోచించుట కొక ప్రత్యేక సంఘమును నియమింపుడని కామన్సుసభవారిని కోరవలెను.

4. ఇండియాకార్యదర్శి సభానిర్మాణమును, ఇండియా ఆఫీసు సిబ్బందిని పరీక్షించి నివేదికము నంపుట కొక సంఘము నేర్పాటు చేయవలెను.

హిందూదేశ ప్రభుత్వము

5. భారతదేశమున శాంతిని, సుపరిపాలనమును నెలకొల్పుటకు ఇండియాప్రభుత్వమువారికి గల బాధ్యతానిర్వహణమున కవసరమగు విషయములలో ఇండియాప్రభుత్వమువారి అధికారము నెంతమాత్రమును తగ్గింపరాదు.

6. హిందూదేశమున కొక ప్రీవీకౌన్సిలును నిర్మాణము చేయవలెను.

కార్యనిర్వాహకవర్గము

7. రాజప్రతినిధియొక్క కార్యనిర్వాహకసభయం దున్న భారతీయులసంఖ్యను వృద్ధిచేయవలెను.

8. కార్యనిర్వాహకవర్గ సభ్యులకు ప్రస్తుత శాసన నియోజితమైన సంఖ్యగాని, అందు పేర్కొనబడిన యోగ్యతగాని యుండ నవసరము లేదు.

9. గ్రేటుబ్రిటనునందలి పార్లమెంటరీ అండరు సెక్రిటరీలవలెనున్న యొకపదవికి శాసనసభలోని సభ్యుల గొందరిని నియమింపవలెను.

శాసనసభ

10. ప్రస్తుతమున్న గవర్నరుజనరలు శాసనసభకు బదులు స్టేటు కవున్సిలును, శాసనసభయును నుండవలెను.

11. అధ్యక్షుడగు రాజప్రతినిధితో బాటు స్టేటు కవున్సిలునందు 50 మంది సభ్యు లుండవలెను. రాజప్రతినిధి కొక సహాధ్యక్షుని కూడ నియోజించుట కధికార ముండవలెను. ఈసభ్యులలో 21 మంది యెన్నిక సభ్యులుగను, 29 గురు రాజప్రతినిధిచే నియోజితులుగను నుండవలెను. ఈ నియోజితసభ్యులలో 4 గురు అనధికారులును, 25 గుర కంటె నెక్కుడు కాకుండగ (ఇందు కార్యనిర్వాహకసభ్యులు కూడ నుందురు) అధికారులును నుండవలెను.

ఈస్టేటుకౌన్సిలుసభ్యులైదువత్సరములవరకీ పనియం దుందురు.

ఈ స్టేటు కౌన్సిలు సభ్యత్వమున కుండవలసిన లక్షణములను గూర్చి రాజప్రతినిధి నియమముల నేర్పరుపవలెను.

12. శాసనసభలో సుమారు 100 మంది సభ్యు లుండవలెను. అందు 2/3 వంతు ఎన్నిక సభ్యులను, 1/3 వంతు నియోజక సభ్యులును నుందురు. నియోజకసభ్యులలో 1/3 వంతు అనధికారు లుండవలెను.

ఈ సభాధ్యక్షుడు రాజప్రతినిధిచే నియోజింపబడవలెను.

13. స్టేటు కౌన్సిలులోని అధికారసభ్యులు శాసనసభాసభ్యులుగ నియోజితులు కావచ్చును.

14. స్టేటు కౌన్సిలును గాని, శాసనసభనుగాని తొలగించుటకు రాజప్రతినిధి కధికారము గలదు.

15. శాసనసభలో ఈ క్రింది కార్యవిధానమును అవలంబింపవలెను:—

(ఎ) గవర్నమెంటు బిల్లులు:—వీనిని సాధారణముగ శాసనసభలో ప్రవేశపెట్టి, అం దామోదితములైనపిమ్మట స్టేటుకౌన్సిలుకు పంపబడును. శాసనసభవా రనుమతింపని రీతిని, ఈబిల్లును స్టేటు కౌన్సిలువారు సవరించినయెడల, ఈ రెండుసభలును గలసి యీ బిల్లును చర్చింపవలెను. ఈసవరణ దేశముయొక్క సుపరిపాలనమునకును, శాంతికిని అవసరమని రాజప్రతినిధియు, వారి సభవారును నుడివినయెడల, శాసనసభ యీ సవరణలను నిరాకరించుటగాని, దానిని మరల సవరించుటగాని చేయరాదు. కాని యీబిల్లుప్రవేశము తిరస్కృతమైనప్పుడు, ఇది పై నియమానుగుణముగ నున్న దని రాజప్రతినిధి యొప్పుకొనినయెడల, ఈ బిల్లును స్టేటుకౌన్సిలువారి విచారణకు బంపవచ్చును. అత్యవసరకార్యములయందు రాజప్రతినిధి యిట్టి బిల్లును ప్రథమముననే స్టేటుకౌన్సిలులో ప్రవేశపెట్టి, దాని ఆమోదమును బడసి, ఆవిషయమును శాసనసభ కెరుకపరుపవచ్చును.

(బి) ప్రైవేటు బిల్లులు.—ఈ బిల్లు ప్రతిపాదించువా రే సభలో నుండెదరో ఆ సభయందే దీనిని ప్రవేశపెట్టి, ఆ సభవా

రామోదించిన పిమ్మట, రెండవసభకు బంపవచ్చును. ఈ సభల కభి ప్రాయభేద మున్నయెడల, ఈ రెండుసభల సమ్మేళనా సమావేశము గావించి విషయ పరిష్కారము చేయవచ్చును. ఈ బిల్లు సుపరిపాలనమునకు భంగకర మని ప్రభుత్వమువారికి దోచినయెడల రాజప్రతినిధికి ఈ బిల్లు పై విధానానుగుణముగ నున్నదని దెలిపి, దానిని మరల స్టేటు కవున్సిలులో ప్రవేశపెట్టవలెను. ఈ కవున్సిలువా రేర్పరచిన రూపమున ఈ బిల్లు శాసనమగును.

16. తీర్మానములు సలహా రూపకములుగ మాత్రమే యుండును.

17. రాజప్రతినిధియు, రాజును దేనినైన అంగీకరించుటకును, తిరస్కరించుటకును అధికారమును గలిగియుండవలెను.

18. తాత్కాలికశాసననిర్మాణవిషయమున కిప్పుడు రాజప్రతినిధి కున్న అధికార ముండవలెను. శాసనముల చేయుటకు రాజప్రతినిధికిని, వారి సభవారికిని అధికార ముండవలెను.

19. స్టేటు కవున్సిలునందు గాని, శాసనసభయందు గాని యున్న నియోజిత అధికార సభ్యులు, ప్రభుత్వమువారు వారిని ప్రత్యేకముగ కోరిన తప్ప, నితర విషయములలో వాక్స్వాతంత్ర్యమును, తమ యిచ్చవచ్చినట్లు వోటు నిచ్చు నధికారమును గలిగి యుండవచ్చును.

20. స్టేటు కవున్సిలు సభ్యులు గాని, శాసనసభా సభ్యులు గాని సప్లిమెంటరీ ప్రశ్నల నడుగవచ్చును. ప్రజాక్షేమమునకై యొకానొక ప్రశ్నను వేయరాదను కారణమున రాజప్రతినిధి యొక ప్రశ్నను తిరస్కరింపవచ్చును.

21. స్టేటుకౌన్సిలునందును, శాసనసభయందును కార్యక్రమమును జరుపుటకు వలయు నియమములను మొదట రాజప్రతినిధిసభవారిచే నిర్మితములు కావలెను. రాజప్రతినిధి అంగీకరించినయెడల శాసనసభయు, స్టేటుకౌన్సిలును తమ నియమములను సవరించుకొనవచ్చును. ఈ సవరణలకు ఇండియా కార్యదర్శి గాని, పార్లమెంటు సభవారు గాని, అనుమతింప నవసరము లేదు.

22. శాసనసభ యొక్కయు, స్టేటుకౌన్సిలు యొక్కయు సంయుక్తస్థాయిసంఘములు సాధ్య మైనన్ని ప్రభుత్వశాఖలలో పాల్గొనునట్లు చేయవలెను. ఏశాఖలలో వీరు పాల్గొనవలెనో ఆ విషయమును రాజప్రతినిధి నిర్ణయింపవలెను. ఏయేవిషయములు స్థాయిసంఘమునకు దెలుపవలయునో అను విషయమును ఆయా, శాఖాధికారి నిర్ణయింపవలెను. ఈ స్థాయిసంఘమునందలి 2/3 వంతు సభ్యులను శాసనసభ యందలి అనధికారసభ్యు లెన్నుకొనవలెను. 1/3 వంతు సభ్యులను రాజప్రతినిధిసభవారు నియోగింపవలెను.

23. హిందూదేశ ప్రభుత్వమువారిచే రాష్ట్రీయప్రభుత్వములపై నుంచబడిన బాధ్యతలకు సరిపోవునంతమట్టుకు శాసనపరిపాలనా ఆర్థికవిషయములందు రాష్ట్రీయప్రభుత్వములకు సంపూర్ణ స్వాతంత్ర్య మీయబడును.

24. కొన్ని పరిపాలనావిషయములను ప్రజాప్రతినిధులకు సంక్రమితములుగ నొసర్చి క్రమముగ నీ విధానము నభివృద్ధిపఱచి అన్ని శాఖలందును కాలక్రమమున సంపూర్ణమగు బాధ్యత ప్రజాప్రతినిధిపర మగునట్లు చేయబడును. ప్రజాప్రతినిధులపర మొనర్పబడు శాఖలు "ప్రజాయత్త" శాఖ లనియు, ప్రభుత్వాధికారుల వశమున నుండునవి "అధికారాయత్తశాఖ" లనియు పిలువబడును.

రాష్ట్రీయపరిపాలనాకార్యనిర్వాహకవర్గము

25. రాష్ట్రములోని రాష్ట్రీయ ప్రభుత్వకార్యనిర్వాహక సంఘమున (అ) గవర్నరును, (ఆ) అతని సహాయకవర్గమును, (ఇ) ప్రజానియుక్తు లగు శాసనసభ్యులనుండి గవర్నరు గా రెన్నుకొను ఒకరిద్దరు లేక కొందఱు మంత్రులును, (ఈ) శాసనసభలో ఏ శాఖతోను నిమిత్తము లేకుండ నుండు కొందఱు సభ్యులు నుందురు.

26. గవర్నరు సహాయకవర్గమున (ఆ) ఇద్దఱు సభ్యు లుందురు. అం దొకడు భారతీయుడుగ నుండును. ప్రభుత్వాధీనశాఖ లని పైన చెప్పబడిన శాఖలు గవర్నరు యొక్కయు, గవర్నరు సహాయకవర్గముయొక్కయు నధీనమున నుండును.

27. మంత్రులని చెప్పబడువారు (ఇ) శాసనసభానియుక్త కాలమువఱకు పనిజేయుదురు. ప్రజాయత్తశాఖ లని చెప్పబడినవి ఈ మంత్రులచే నిర్వహింపబడుచుండును.

28. అధికసభ్యులు (ఈ) గవర్నరుగారిచే ఉన్నతాధికారవర్గమునుండి ఎన్నుకొనబడి నియమింపబడుదురు. వీరు గవర్నరు గారికి సలహా నిచ్చుటకును, వివిధవిషయములను యోచించుటకును నుపయోగపడుదురు.

29. పై విధముగ నేర్పఱుపబడిన ప్రభుత్వవర్గమువారు కలసి పర్యాలోచనాదులను సలుపుదురు. కాని గవర్నరుగారు తమ ప్రభుత్వవర్గమున నే శాఖనైనను ప్రత్యేకముగా పిలిపించి ,విషయపర్యాలోచనము గావింపవచ్చును. అధికారాశాఖలను గూర్చిన తీర్మానములును, ఆర్థికపత్రమునందు అ శాఖలకు ధనము నేర్పాటుచేయు విషయమును గవర్నరుగారి మీదను, వారి సహాయకవర్గముమీద నుండును. ప్రజాయత్తశాఖలను గూర్చిన తీర్మానములును, వానికి ధనము నేర్పాటుచేయు విషయమును గవర్నరుగారి మీదను, మంత్రులమీద నుండును.

30. శాసనసభ్యులలోని కొందఱు సభ్యులను గవర్నరుగారు ఎన్నుకొని, వారికి ఇంగ్లండునందు పార్లమెంటు ఉపకార్యదర్శులతో సమానస్థానము నొసగుటకు అధికారము పడయబడును.

రాష్ట్రీయశాసనసభలు

31. ప్రతిరాష్ట్రమునందును ప్రజానియుక్తసభ్యుల సంఖ్యయాధికముగా నుండునట్లు శాసనసభ వృద్ధిచేయబడును. శాసనసభయందు (1) సాధ్యమైనంత అధిక మగు ఎన్నిక స్వాతంత్ర్యముతో ప్రజలచే నెన్నుకొనబడిన ప్రజాప్రతినిధులును (2) ప్రభుత్వమువారిచే నియమింపబడిన అధికారానధికారసభ్యులును (౩) అధికార రీత్యా శాసనసభ్యులుగ నుండువారును నుందురు. (ముందు వ్రాయ

బడు) 53-వ ప్యారాయందు తెలుపబడు విచారణసంఘముయొక్క సలహాలపై గవర్నరు జనరలుగారు హిందూదేశకార్యదర్శి యనుమతితో శాసనసభా సంఘట్టనమును, ఎన్నికలయందు ప్రజల కీయబడు అధికారమును నిర్ణయించి పార్లమెంటుకు నివేదించెదరు.

32. గవర్నరుగారు శాసనసభాధ్యక్షుడుగ నుండును. ఉపాధ్యక్షు నేర్పఱచుటకును గవర్నరు కధికార ముండును.

33. శాసనసభను తీసివేయుటకు గవర్నరు కధికారముండును.

34. అర్థికపత్రవిషయమున గాక ఇతరవిషయపు తీర్మానము లన్నియు శిఫార్సులవలెమాత్ర ముండును.

35. ప్రభుత్వనియుక్త అధికారసభ్యులకు వాక్స్వాతంత్ర్య ముండును. ప్రభుత్వమువారు వద్దని ఉత్తరువిచ్చిననే తప్ప వోటుల నిచ్చుటకు వారి కధికార ముండును.

36. శాసనసభలో నే సభ్యుడైనను ఒకేవిషయమునకు సంబంధించిన ఇతరప్రశ్నలను (సప్లిమెంటరీ) అడుగుట కధికార ముండును.

37. శాసనసభల కార్యవిధానము మునుపటివలెనే జరుగుచుండును గాని గవర్నరుగారి అంగీకారముపై శాసనసభానిబంధనలను శాసనసభవారు సంస్కరింపవచ్చును.

38. శాసనసభలయందు ప్రతిశాఖకుగాని కొన్నికొన్ని శాఖలను ఒకటిగా కలిపిగాని స్థాయిసంఘము లేర్పఱుపబడును. ఈ స్థాయిసంఘములందు (1) శాసనసభలచే నెన్నుకొనబడిన సభ్యులును (2) ఆయాశాఖల ముఖ్యాధికారులును (3) ఆశాఖకు సంబంధించిన సభ్యుడుగాని మంత్రిగాని (అధ్యక్షుడు) ఉండును.

39. సాధారణముగా అన్నివిషయములకు సంబంధించిన శాసనములును శాసనసభయందు ఆమోదింపబడును. దీని విపర్యయస్థితు లీక్రింద తెల్పబడినవి.

40. గవర్నరుగారు తమ రాష్ట్రములయొక్కగాని రాష్ట్రభాగములయొక్కగాని శాంతికొఱకుగాని తమబాధ్యత నిర్వహించుకొనుటకుగాని లేక అధికారాశాఖకు సంబంధించినబిల్లు అవసర మని నిర్ధారణముచేయ నధికారము గలిగియుందురు. గవర్నరుగారి నిర్ధారణపత్రముతో ఆబిల్లు గజెట్టునందు ప్రకటింపబడును. తరువాత దానిని శాసనసభలో నుపపాదించి, యథావిధిని చదివి, దానియందలి ముఖ్యలక్షణములనుగూర్చి చర్చజరిగిన యనంతరము ఒక గ్రాండుకమిటీ విచారణమునకు విడిచిపెట్టెదరు. ఆబిల్లును దానిపై చర్చను హిందూదేశ ప్రభుత్వమువారికి పంపునట్లు శాసనసభవారు కోరవచ్చును. బిల్లువిషయము ప్రభుత్వాధీనశాఖకు సంబంధించినదా యను ప్రశ్నములను దానికి సంబంధించిన యితరప్రశ్నములనుగూర్చి హిందూదేశ ప్రభుత్వమువారి తీర్పుకు తిరుగుడు ఉండదు.

ఒకబిల్లుకు సంబంధించిన విషయమును శాసనముగా చేయుటను శాసనసభకు వదలిపెట్టవచ్చునని గవర్నరుగారు తలచుచో బిల్లు విషయమున నిర్ధారణపత్రము వ్రాయ నవసరము లేదు.

41. బిల్లులనుగూర్చి యోచించుటకు శాసనసభలో నూటికి 40 నుండి 50 మందివఱకును గ్రాండు కమిటి ఏర్పఱుపబడును. ఈ సంఘము బిల్లునందలి విషయము ననుసరించి మార్పబడుచుండును. ఈ మహాసంఘమునం దుంచబడు సభ్యులలోకొందఱిని శాసనసభ్యు లెన్నుకొనుదురు. కొందఱిని ప్రభుత్వమువారు నియమించుదురు. ఆ సంఘమున బల మధికముగా నుండునట్లు గవర్నరుగారు (తాముగాక) కొందరిని నియమింపవచ్చును. కాని గవర్నరుగారిచే నియమింపబడు సభ్యులలో 2/3 వంతుకంటె అధికముగాఅధికారు లుండగూడదు.

42. బిల్లు విచారకసంఘమువారిచే విచారింపబడి తీర్మానింపబడినవెనుక శాసనసభకు రిపోర్టు చేయబడును. శాసనసభవారా బిల్లులను ప్రభుత్వమువారిచే నియుక్తమగు కాలములోపల చర్చింతురు. గవర్నరు సహాయకవర్గ సభ్యులలో నెవ్వనిచేతనైన సవరణ ఉపపాదింపబడిననే తప్ప బిల్లుసందర్భమున సవరణ నుపపాదించుటకు గాని, బిల్లును త్రోసివేయుటకు శాసనసభ్యులకు అధికార ముండదు. చర్చ జరిగినవెనుక బిల్లు యథాప్రకారము శాసనసభలో ఆమోదింపబడును. చర్యయందు బిల్లు ముఖ్యవిషయములలో దేనికైన ఆక్షేపణ యున్నచో తీర్మానరూపమున శాసనసభాసభ్యులు వాని నుపపాదింపవచ్చును. అట్టి తీర్మానము బిల్లుతోగూడ గవర్నరు జనరలుకును హిందూదేశకార్యదర్శికిని పంపబడును.

43. బిల్లువిషయము ప్రభుత్వాధీనశాఖాపరిమితి నుల్లంఘించినచో గవర్నరు సహాయకవర్గసభ్యులలో నెవ్వరైనను బిల్లుపపాదింపబడినతక్షణమే దాని నెదుర్పవచ్చును. సవరణ యేదైన నుపపాదింపబడుచో దానినిగూడ నెదుర్చవచ్చును. తరువాత ఆబిల్లు సభలో చర్చింపబడునట్లు చేయుటకుగాని మానివేయబడునట్లు చేయుటకుగాని, బిల్లు, క్లాజు, సవరణలలో దేనిసందర్భమునను నిర్ధారణపత్రము నొసగుటకుగాని గవర్నరుగారికి ఇష్టమువచ్చినట్లుచేయ నధికార ముండును. బిల్లు క్లాజు సవరణములలో దేనికైనను గవర్నరుగారు నిర్ధారణపత్రము నొసగినచో గవర్నరుగారా బిల్లును శాసనసభలో చర్చింప నీయకుండవచ్చును. లేకున్న బిల్లునుగాని సవరించి శాసనసభయెదుట పెట్టవచ్చును. అట్లుకాకున్న, శాసనసభవారు కోరినచో, బిల్లును విచారకమహాసంఘమునకు గవర్నరుగారు విడిచిపెట్టవచ్చును.

44. రాష్ట్రీయవిషయములకు సంబంధించిన శాసనము లన్నియు గవర్నరుగారివలనను, గవర్నరు జనరలుగారివలనను అనుమతింపబడవలెను. సార్వభౌముని యిష్టమైనచో ఆశాసనము త్రోసివేయబడును.

45. గవర్నరుగారు ఒకబిల్లును త్రోసివేసినవెనుక సవరణతో దానిని మరల నుపపాదింపనిచ్చుటకు గవర్నరు కధికార ముండును.

46. రాష్ట్రీయసంబంధశాసనములను నిలిపియుంచుటకు గవర్నరు జనరలుగారి కధికార ముండును.

ఆర్థికములు

47. రాష్ట్రీయాదాయములును, అఖిలభారతాదాయములును వేఱువేఱుగా నుంచబడును.

48. రాష్ట్రీయాదాయమునుండి మొట్టమొదట హిందూదేశప్రభుత్వమువారికి ఈయవలసినమొత్తము నిచ్చివేయుట విధిగా నుండును.

49. రాష్ట్రీయప్రభుత్వములకు పన్నులు విధించుటకును, అప్పులు పుచ్చుకొనుటకును కొన్ని యధికారము లుండవలయును.

50. బడ్జెటును శాసననిర్మాణసభ యెదుట పెట్టవలయును. గవర్నరుగారు తమచేతిలో స్వంతముగా పెట్టుకొనియున్న శాఖల సంబంధమున అగు వ్యయాదాయములకు శాసనసభవారు అంగీకారము నొసంగనియెడల గవర్నరుగారు శాసనసభవారిచే నిరాకరింపబడిన పద్దులను పూర్తిగా గాని, లేక కొంతభాగముగా గాని బడ్జెటులో తిరిగి యుంచుటకు అధికారమును కలిగియున్నారు. కాని అట్టితటి గవర్నరుగా రట్టిపనిని చేసినందునకై గల కారణములను జూపుచు తమ చర్యను ధ్రువపఱుపవలయును. ఆరాష్ట్రముయొక్క గాని, లేక అందొకభాగముయొక్క గాని శాంతికిని, నెమ్మదికిని భంగము కలుగకుండుటకై అట్లుచేసితిమనియో, లేక తమచేతిలో పెట్టుకొనని శాఖలవిషయమై తాము నెఱవేర్పవలసిన బాధ్యతలను నెఱవేర్చుటకు చేసితిమనియో రూఢిపఱుపవలయును. ఈ అధికారమును గవర్నరుగారు చెలాయించినప్పుడుతప్ప శాసననిర్మాణసభలో జేయబడిన తీర్మానముల ననుసరించియే బడ్జెటు మార్పబడుచుండవలయును.

స్థానికస్వపరిపాలనము

51. వీ లయినంతవఱకు స్థానికస్వపరిపాలనము పూర్తిగా ప్రజలవశము చేయవలసినది.

రాష్ట్రీయ శాసనసభలలో మార్పులు

52. ఈ క్రొత్తశాసనసభలు ఎన్నుకొనబడిన అయిదుసంవత్సరములకు ఒక రాష్ట్రప్రభుత్వమువారు గాని, రాష్ట్రశాసనసభవారు గాని గవర్నరుగారు తమ చేతిలో స్వంతముగా నుంచుకొనినట్టియు, లేక ప్రజాప్రతినిధుల వశము చేసినట్టియు శాఖల లీస్టులో మార్పులను చేయవలసిన దని దరఖాస్తులను పెట్టుకొనినయెడల ఆ దరఖాస్తులు ఆలోచింపబడవలయును. అప్పుడు స్టేటుసెక్రటరీ గారి అనుజ్ఞమీద ఇండియా గవర్నమెంటువారు రిజర్వు లీస్టునుండి ప్రజాప్రతినిధుల చేతికి శాఖలను మార్పవచ్చును. ప్రజాప్రతినిధులచేతి కొసంగబడిన శాఖలలో నేదేని బాగుగా నిర్వహింపబడక పాడు చేయబడినయెడల దానిని గవర్నరుగారిచేత నుండు రిజర్వులీస్టులోనికి మార్పవచ్చును. ఈ ప్రజాప్రతినిధిమంత్రుల జీతములను ఇండియా దొరతనమువారు శాసనసభవారి వోటుకు ప్రతిపాలుకు లోబఱచవచ్చును. అప్పుడు గాని మఱియొకప్పుడు గాని ఈ మంత్రుల జీతములు తమ వోటుకు పాత్రము కావలయు నని తీర్మానమును గావించు అధికారమును సభవారు గలిగియుండవలయును.

ప్రారంభకార్యవిధానము

53. ఇంగ్లాండునుండి వచ్చు నొక అగ్రాసనాధిపతిని, ఒక గవర్నమెంటుద్యోగిని, ఒక అనధికారభారతీయుని గలిగిన యొక కమిటీ నేర్పఱుపవలయును. ఈ కమిటీవారు గవర్నమెంటువద్దనుండి యేశాఖలను ప్రజామంత్రులచేతి కొసంగవలయునో నిర్ణయింపవలయును. ఏ రాష్ట్రములో ఈ విచారణ జరుగుచుండునో, ఆ రాష్ట్రమునుండి ఈ విచారణకర్తలకు సహాయముచేయుటకయి ఒక ఉద్యోగిని, ఒక అనధికారభారతీయుని నిర్ణయింపవలయును.

54. ఇంగ్లండునుండి వచ్చు అగ్రాసనాధిపతిని, ఇద్దరు అధికారులను, ఇద్దరు అనధికార భారతీయులను గలిగిన మఱియొక కమిటీ యేర్పాటు గావలయును. ఈ కమిటివారు, నియామకపు ప్రదేశములను, నియామకుల కేయే యర్హత లుండవలయునో, ప్రతి రాష్ట్రములోను శాసననిర్మాణసభ కెంతమంది ప్రతినిధు లుండవలయునో, రాజప్రతినిధిసభ కెంతమంది యుండగలయునో నిర్ణయింపవలయును. ఈ విచారణ జరుగుచున్నప్పుడు ఆయా రాష్ట్రములనుండి ఒక్క ఉద్యోగి, ఒక్క అనుద్యోగు డగు భారతీయుడు వీరితో జతపఱుపబడవలయును.

55. పయిన నుదహరించిన రెండుకమిటీలును కలిసి అభిప్రాయముల నొకరి కొకరు తెలుపకొనవలయును.

విచారణసంఘము

56. ఈ శాసనసభలు ఏర్పడిన 10 సంవత్సరములకు వాటి స్థితి యేలాగున్నదో విచారించుటకు ఒక కమిషను నేర్పాటుచేయవలయును. పార్లమెంటువారి కీ కమిషనరుల పేరులు అంగీకారార్థమయి పంపవలయును. ఇట్టి విచారణసంఘములనే తిరిగి 12 ఏండ్లలోపుగ ఏర్పఱచుచుండవలయును.

స్వదేశసంస్థానములు

57. స్వదేశాధీశుల సభ నేర్పఱుపవలయును.

58. స్వదేశసంస్థానాధిపతులసభ కొక స్థాయిసంఘముండును.

59. ఒక స్వదేశసంస్థానాధిపతికి ఇంకొక స్వదేశసంస్థానాధిపతికి గాని, ఒక సంస్థానమునకును రాష్ట్రీయ ప్రభుత్వమునకును, లేకున్న సంస్థానమునకు హిందూదేశప్రభుత్వమునకు గాని కలహము గలిగినప్పుడు సలహాలనిచ్చుటకు ఒక సంఘ ముండును. ఆ సంఘమునందు ఒక హైకోర్టుజడ్జియును రెండుపక్షములకు చెరియొక్కొక్క ప్రతినిధియు నుండును. ఈ ప్రతినిధులను రాజప్రతినిధిగారు తమకు తోచినరీతిని నియమించుచుందురు.

60. ఒక సంస్థానాధిపతినుండి అతని హక్కులలోను గౌరవములలోను, అధికారములలోను వేనినైన తొలగింపవలసిన యెడలను, ఒక సంస్థానాధిపుని సంతతివారికి వారసత్వము లేకుండ జేయవలసినయెడలను, ఈ విషయమును గూర్చి విచారించి సలహా నిచ్చుటకు ఒక హైకోర్టుజడ్జి, ఇద్దఱు స్వదేశసంస్థానాధిపతులు, ఇద్దఱు ప్రముఖులు గల ఒక సంఘమును రాజప్రతినిధిగారు నియమించుదురు.

61. స్వదేశసంస్థానములయందు అంతర్దేశవ్యవహారములలో సర్వాధికారము గల సంస్థానాధిపతులు హిందూదేశ ప్రభుత్వమువారితోడనే వ్యవహారములను జరుపుచుందురు.

62. స్వదేశసంస్థానములతోడి సంబంధములను రాష్ట్రీయ శాసనసభల విచారణమునకు మార్పబడుట తీసివేయబడును.

63. అందఱికిని అన్యోన్యమైన వ్యవహారములను చర్చించి పరి

ష్కరించుకొనుటకై స్వదేశాధీశుల సభయును, హిందూదేశ సభయును (కౌన్సిల్ అఫ్ స్టేట్) సమావేశ మగుటకు తగిన ప్రయత్నములు చేయవలయును.

గవర్నమెంటు ఉద్యోగములు

64. గవర్నమెంటుద్యోగము లొసంగువిషయమై నిబంధనములలో నిలిచియున్న జాతిభేదము లన్నింటిని తొలగింపవలయును.

65. ఇంగ్లండులో నుద్యోగులను చేర్చుకొనుపద్ధతి మాత్రమే గాక, ఇండియాలోను ఆయుద్యోగములను తగినవారి కిచ్చుటకు పద్ధతు లేర్పడవలయును.

66. అన్నిశాఖలలోను ఇండియాలో ఇచ్చు నుద్యోగములు నూటికి యిన్ని యని యేర్పాటుచేయుచు, క్రమక్రమముగా వానిని వృద్ధిచేయుచుండ వలయును.

67. ఇండియన్ సివిలుసర్వీసులో ప్రస్తుతము సాలుకు 100-కి $1\frac{1}{2}$ వంతు చొప్పున వృద్ధిచేయుచు 100-కి 33 పెద్దయుద్యోగములు భారతీయులకు వచ్చునంతవఱకును నీయవలయును. 10 సంవత్సరముల కొకతూరి కమీషనువారు తిరిగి పునర్విమర్శనమును చేయునంతవఱకును ఇట్లు జరుగుచుండును.

68. జీవనవ్యయములు వృద్ధియగు సందర్భములనుబట్టియు, తగినవారు ఉద్యోగములకు రాగలుగునట్లు చేయుటకును వేతననియమము లేర్పఱుపబడును. సాధారణముగా కాలపరిమితినిబట్టి ఉద్యోగవేతన వృద్ధి యేర్పఱుపబడును. ఆయుద్యోగమున అత్యధికపదవి లభించుటకు వేతనవృద్ధి యొసగబడును. సాధారణపింఛనునం దత్యధికమగు మొత్తము 6000 రూపాయల కెక్కువచేయబడును. మాఱకమున 1 షి 9 పె. లొసంగబడును. ఉన్నతోద్యోగములకొఱకు ప్రత్యేక పింఛనులు నుండును.

ఇండియను సివిలుసర్వీసు ఉద్యోగుల కొసగబడు సంవత్సర భృత్యములు ప్రభుత్వమువారిచే నియుక్తముకాని ధనమునుండి యొసగబడును. సెలవులనుగూర్చిన నిబంధనలు విశాలభావయుతములగునట్లు చేయబడును. అధికముగనుండు సెలవుకాలమును తగ్గించుటకు వీలుండును. పూర్తిజీతము నిచ్చువరతుతో సెలవు పరిమితిని తగ్గించుటకును వీలుండును.

69. హిందూదేశమునందే ఉద్యోగుల నెన్నుకొని నియమించుటకు ఒకవిధ మగు వేతనపురేట్లు ఏర్పఱుపబడును. యూరపునుండి తెప్పింపబడిన ఉద్యోగులకు గాని, అట్టి లక్షణములను గలిగిన యుద్యోగులకుగాని తగినట్లు అధికభృత్య మొసంగబడవలెను. యూరపునందు నియమింపబడు భారతీయులకును ఇట్టిచర్యయే యంగీకరింపబడును.

భారతప్రభుత్వమువారి అభిప్రాయములు

మాంటుఫర్డు సంస్కరణములపట్ల భారతప్రభుత్వమువారు మార్చి 5వ తేదిని ఈ క్రింది అభిప్రాయముల నిచ్చిరి:

1. ప్రప్రథమమున రాజ్యాంగనివేదికపట్ల భారతదేశ మెటుల స్వాగత మొసంగినదియు చూపెట్టుచు, భారతీయులు యూరోపియను అనధికారులు అధికారులు స్థానికప్రభుత్వములు సంస్కరణములపట్ల నిచ్చిన అభిప్రాయములను కొంతవరకు చర్చించిరి. తదనంతరము భారతవర్షమున కెట్టి ప్రభుత్వము అవసరమో అను విషయమును చర్చించి, 1917 సం॥ ఆగస్టు 20వ తేదినాటి ప్రకటనమునకు ప్రత్యామ్నాయముగా ప్రకృతస్థితిగతుల బట్టి ఏకప్రభుత్వము కొనసాగుట కష్టతర మని నుడివిరి. రెండు రాష్ట్రప్రభుత్వములు తప్ప తక్కిన వన్నియు ఏకప్రభుత్వము కావలయు నని చెప్పినవి. 1919 సం॥ జనవరి నెలలో ఢిల్లీలో సమావేశమైన రాష్ట్రపరిపాలకులు తమ అభిప్రాయములను ప్రత్యేకప్రకటన ద్వారా తెలిపియుండిరి. ఈ సూచన లన్నియు చాలవరకు ఆలోచించి, వానిని నిరాకరించుటకు కారణములను తదనంతరము ప్రభుత్వమువారు తెలుపుచున్నారు. కొద్దిమార్పులతో ద్విశాఖాప్రభుత్వమె కావలయునని ప్రభుత్వమువారు పిమ్మట తమ అభిప్రాయములను వెలిపుచ్చుచున్నారు.

కార్యనిర్వాహకసభ

2. రాష్ట్రకార్యనిర్వాహకసభావిషయమున నివేదికయందు సూచింపబడిన సూత్రముల నామోదించుచు, అధికారము వహింపని సభ్యులు కార్యనిర్వాహకవర్గమున నుండగూడ దనియు, భారతదేశస్థితిగతులను గవర్నరుకు బాగుగా తెలియకున్న ఆయనకు సహాయులుగా నుండుటకు ఇద్దరు అధికారసభ్యులను నియమింపవలయు నని సూచించుచున్నారు. రాజధానులకు తప్ప తక్కిన రాష్ట్రములకు పాలకులను కొంతకాలమువరకు సివిలుసర్వీసు వారినుండియే నియమించుచుండవలయును. కార్యనిర్వాహకసభ కొక్క అధికారి, భారతీయు లొక్కరుండవలయు నని శాసింపవలయును. శాసనసభాసభ్యులనుండి మంత్రులు నియమింపబడవలయును. శాసనసభకు వారు లోబడి యుండవలయును. గవర్నరు కాబోవు మంత్రితో సంప్రదించి వాని జీతమును నిర్ణయించి ప్రజాయత్తశాఖాదాయము నుండి మంత్రిజీతము నీయవలయును.

ఉద్యోగములు

3. పౌరసేవోద్యోగముల విషయమున నొకచట్ట ముండవలయు నని చెప్పుచు, ఆ చట్టము ఏ విధముగా చేయవలయునో తదనంతరము సూచించిరి. ఉద్యోగములు ఇండియను, ప్రావిన్షియలు, సబార్డినేటు అని మూడుభాగములుగ నుండవలయును. వీరిలో ప్రథములు, తాబేదారులను నియమించు అధికారము కలిగియుండవలయును. మంత్రుల క్రింద వీరు పనిచేయుటకు నిర్బంధ ముండగూడదు. ఉద్యోగముల

కట్టుదిట్టములు చేయు అధికారము గవర్నరున కుండవలయును. అధికారులు కొద్దిపాటి ఉపకారవేతనములను పుచ్చుకొని, విశ్రాంతిదీసికొనుటకు స్వాతంత్ర్య మీయవలయును. అధికారప్రజాయత్తశాఖలలో సమానముగా పనిచేయవలసిన అధికారులప్రమోషను మున్నగువానిపట్ల గవర్నరుకు అధికార ముండవలయును. ఉద్యోగస్థుల విషయమున విచారణచేయుట కొక కమీషను ఏర్పడవలయును.

ఆర్థికవిషయములు

4. ఆర్థికవిషయములలో ప్రభుత్వమువారి అభిప్రాయములు నివేదికనుండి రెండువిధములుగ భేదించుచున్నవి. సామ్రాజ్య ఆర్థిక సహాయమునకు అధికారప్రజాయత్తశాఖలు బాధ్యత యుండవలయును. సామ్రాజ్యప్రభుత్వమునకు రాష్ట్రప్రభుత్వములు చెల్లింపవలసిన సొత్తువిషయమున నివేదికయందు సూచింపబడినవాని నామోదించుచు, ముందు రాష్ట్రప్రభుత్వములు ఏ విధముగ సొమ్ము చెల్లింపవలసినది ఆలోచించుట కొక ఆర్థికవిచారణసంఘమును నెలకొల్పవలయు నని సూచించుచున్నారు.

5. సంవత్సరమున కొక్కసారి అధికారాయత్త ప్రజాయత్తశాఖలు సమావేశమై, తమ ఆదాయవ్యయముల విషయ మాలోచించుటకు గాను నివేదికలో సూచింపబడిన పద్ధతిని ప్రభుత్వమువారు నిరాకరించుచున్నారు. ఈ పద్ధతివలన నిలువసొమ్ము, పన్ను, అప్పు విషయములలో చాల కష్టము కలుగు ననియు, ఒకశాఖపైన మరొకశాఖకు సంపూర్ణస్వాతంత్ర్య మిచ్చు ననియు, అనవసరసంఘర్షణలకు లోనగు ననియు, ఒకశాఖ తన ఆదాయమును వృద్ధిచేసికొనుటకు సాధన ముండజాల దనియు, ప్రభుత్వమువారివాదము. ఈ పద్ధతిని ప్రత్యామ్నాయముగా అధికారాయత్తప్రజాయత్తశాఖలు తమ ఆదాయవ్యయములను ప్రత్యేకముగా నిర్ణయించుకొనవలయు ననియు, రాష్ట్ర ఆర్థికములనుండి ఆ శాఖలకు సొమ్ము ఈయబడు ననియు, శాఖలకర్చులకు, సొమ్ము చాలకపోయిన ఏదో యొక ఆదాయమునుండి కొంత సొమ్మును విరాళముగా నీయవచ్చు ననియు, ప్రభుత్వమువారు సూచించుచున్నారు. ఒక్కొక్కశాఖ ప్రత్యేకముగా పన్నును వేసికొనుటకును, సొమ్మును బదులు పుచ్చుకొనుటకును అధికార మీయబడును. ఈ విషయములందు సూచనలు రెండుశాఖలు ఏకముగా సమావేశమై ఆలోచింపవలయును. ఆర్థికపట్టిక సయితము ఆర్థికశాఖలో ఏకముగానే తయారుచేయబడి శాసనసభలో చర్చింపబడును. శాసనసభ దీనిపట్ల అభిప్రాయ మీయవలసినదే కాని, వోటు నీయగూడదు. ఆర్థికపట్టిక సూచనలు మంత్రికి వ్యతిరేకముగా నున్నయెడల, శాసనసభ అతనిని నిరాకరించుటకు పూనుకొనవచ్చును. ప్రజాయత్తశాఖను కట్టుదిట్టముల చేయుటకు సంయుక్తకార్యదర్శితో నొక ఆర్థికశాఖ యుండగలదు. సొమ్ము నే విధముగా ఖర్చుపెట్టవలసినది అను విషయమును గురించి యీ శాఖకు సలహా నిచ్చుట కొక యుపసంఘమును శాసనసభ నియమింపవచ్చును.

శాసనసభ

6. నివేదికలో శాసనసభానిర్మాణము విషయమున సూచింపబడిన విధానముల నంగీకరింపవచ్చును. గ్రాండుకమిటి నిర్మాణవిషయమున చర్చ కొంతకాలమువరకు ఆపుదల చేయవలయును. సర్టిఫికేట్లవిషయమున గల గవర్నరుగారి అధికారమునకు అపీలు ఉండగూడదు. గవర్నరుగారికి అంగీకారము నిరాకరణము మున్నగు విషయములలో గల అధికారములు అంగీకరింపబడినవి. కొన్ని శాసనములలో గవర్నరు జనరలుగారికి అధికార ముండుటకు గవర్నరు గారికి స్వాతంత్ర్య ముండవలయును. రెండవ శాసనసభను (అప్పర్ హౌస్) నిర్మించుట అనవసరము. శాసనసభకు గవర్నరు అధ్యక్షులుగ నుండుటకును, ఉపాధ్యక్షుని గవర్నరే నియమించుటకును, శాసనసభాకార్యక్రమమునకు నిబంధనలను చేయవలయు ననియు, మార్పులున్న గవర్నరుగారి ఆమోదమున చేయవలయు ననియు నివేదికలో సూచింపబడిన సూచనల నంగీకరించిరి. అనుబంధకప్రశ్నల నడుగుటకు శాసనసభ్యు లందరికి స్వాతంత్ర్య ముండవలయును. ప్రభుత్వమువారి యుత్తరువుల ననుసరించి అధికారసభ్యులకు చర్చలో పాలుగొనుటకును, వోటు నిచ్చుటకును అధికార ముండవలయును. నివేదికయందు తీర్మానముల విషయమున గల సూచనలు అంగీకరింపబడినవి. కొన్ని నిబంధనలప్రకారము స్థాయిసంఘములు, శాసనసభాసహాయకార్యదర్శు లుండవచ్చును.

ప్రజాయత్తశాఖలు

7. ప్రజాయత్తశాఖలయందు కార్యక్రమమును జరుపుకొనుటకు నిబంధనలు చేయబడవలయును. ప్రజాయత్త శాఖాపాలనమున ఏసందర్భమున గవర్నరు జోక్యము పుచ్చుకొనవలసియుండునో నిబంధనలలో సూచింపవలయును. గవర్నరుగారి అభిప్రాయములకు మంత్రి వ్యతిరేకముగా నుండినయెడల గవర్నరతనిని యుద్యోగమునుండి తీసివేయవచ్చును. ఇంకెవ్వరైనను ఆస్థానము నాక్రమించుటకు సమ్మతింపక పోయిన యెడల మంత్రియధికారమునను్న శాఖలను గవర్నరు తన అధికారములోనికి తీసికొనవచ్చును. ఆరునెలల లోపుగ గవర్నరుకు మంత్రి చిక్కకపోయిన సదరు శాఖలను సభాయుతులగు గవర్నరు స్వాధీనతకు మార్చుటకు హిందూదేశాంగమంత్రి యుత్తరువును కోరవచ్చును.

8. ప్రజాయత్త అధికారశాఖలకు, సంబంధించు విషయములలో నేవైన కలతలువచ్చిన గవర్నరు జోక్యము పుచ్చుకొని ఆశాఖలకు సంబంధించిన మంత్రులు సభ్యులతో సంప్రదించవచ్చును. కాని ఒక శాఖకు సంబంధించిన విషయము ఆశాఖయే పరిష్కరింపవలయును. ఏశాఖ యొక విషయమును పరిష్కరింపవలయునను విషయమున అనుమానము గలిగిన యెడల గవర్నరు దానిని పరిష్కరింపవచ్చును. అధికార ప్రజాయత్త శాఖలు జారీచేయు ఉత్తరువులు విశదముగా నుండవలయును. ఒక శాఖ మరొక శాఖకు వ్యతిరేకముగా నుండకూడదు. అయినను రెండు శాఖలు ఒకదాని కొకటి సహాయము చేయక నుండవచ్చును.

విచారణసంఘములు

9. అయిదేండ్లకొకసారి నియమింపబడు విచారణసంఘ నియమములలో నేమియు నభ్యంతరములేదు. కాని యీ లోపుగ ప్రభుత్వమున నేమియు మార్పులు జరుగకూడదు.

రాజప్రతినిధిసభ

10. రాజప్రతినిధి కార్యనిర్వాహక సభలో భారతీయ సభ్యుల నియమించు విషయము, సభ్యుల సంఖ్యావిషయమున గల నిర్బంధముల తొలగించుటకును అంగీకరించుచు, శాసనరీత్యా ఇద్దరు అధికారులను, ఒక న్యాయవాదిని, ఇద్దరు భారతీయును నియమించుటకు సదుపాయములు చేయవలయును. ఫ్రాంచైసు కమిటీవారి సూచనలు తెలిపినంతవరకును, శాసనసభ అంగనిర్మాణము, అధికారముల విషయముల నేమియు చెప్పజాలము. శాసనసభాధ్యక్షులు వైస్రాయిగారిచే నియుక్తులగు అధికారులుగ నుండవలయు ననియు, శాసనసభయందలి చట్టము నంగీకరించుట నిరాకరించుట మున్నగు విషయముల పట్ల గల అధికారములు యథాప్రకారముగా నుండవలయు ననియు వైస్రాయి చట్టమును పునర్విమర్శనమునకు బంపుటకును శాసనసభను గాని, స్టేటుకవున్సిలును గాని నిలుపుదల చేయుటకును, స్వాతంత్ర్య ముండవలయును. శాసన సభాతీర్మానములు ప్రశ్నోత్తరములు, కార్యక్రమ నిబంధనలు ఇప్పటివలెనే యుండి తీరవలయును. ప్రివికవున్సిలు నిర్మాణ నంగీకరించుచు, సభాసహాకార్యదర్శుల నియోజకము ప్రకృత మనవసరమని ప్రభుత్వమువారి అభిప్రాయము.

ఇతర విషయములు

హిందూదేశాంగ మంత్రి, పార్లమెంటు అధికారములను తగ్గించి, దేశాంగమంత్రిజీతము ఆంగ్లదేశ బడ్జెట్టులో చేర్చుటకును నివేదికయందు సూచింపబడిన సూచన లంగీకరింపబడినవి. భారతదేశ విషయముల చర్చించుటకు పార్లమెంటు సంఘమును నియమించుటకు అంగీకరించుచు ఈ సంఘమున కామన్సు, ప్రభువుల సభాసభ్యులుండుటకు అవకాశములు గలుగజేయవలయునని ప్రభుత్వమువారి అభిప్రాయము. ఇండియా కార్యాలయ విచారణసంఘమువారి నివేదికమును చూచినంతవరకు హిందూదేశాంగ మంత్రి కార్యాలయము యొక్క పునర్నిర్మాణ విషయమున ఏమియు చెప్పజాలమని ప్రభుత్వమువారు చెప్పుచున్నారు.

సర్ శంకరనాయరుగారి ఆక్షేపణము

భారతప్రభుత్వమువారి అభిప్రాయముతో సర్ శంకరనాయరేకీభవింపక వారిభావముల నాక్షేపించుచు ప్రత్యేక నివేదికమును ప్రకటించిరి. అందలి ముఖ్యవిషయములను క్రింద ముద్రించుచున్నాము.

1. బ్రిటిషు సామ్రాజ్యమునందు ప్రధానాంగముగా నుండి క్రమాంతరమును బట్టి బాధ్యతాప్రభుత్వము నందునట్లుగ భారతదేశముండుటయే శ్రీసార్వభౌమప్రభుత్వవిధాన మని ప్రకటింపఁబడినది. పార్లమెంటు సభవారివద్ద నుండి భారతదేశశాసనసభలకు అధికారమును క్రమముగను సంపూర్ణముగను మార్చుటయే ప్రకటనాభిప్రాయ మని కొంద అభిప్రాయపడుచున్నారు. బ్రిటిషు సామ్రాజ్యమున భారతదేశము ప్రధానాంగముగా నుండవలయు ననెడి మాటనుబట్టి అట్టి అర్థము సమంజసము కాదేమో యని నాకు తోఁచుచున్నది. భారతదేశము ఎంతకాలము బ్రిటిషుసామ్రాజ్యమున నుండునో అంతకాలమును పార్లమెంటు సభాసర్వాధికారమును గుర్తింపవలసియే యుండును. ఆచారమును బట్టియు, సాంప్రదాయమును బట్టియును, పార్లమెంటు అధికారముపైని కొన్ని నిర్బంధములను విధింపవచ్చును. పార్లమెంటు సభాధికారమును గుఱించి వివిధవలసదేశములలో వివిధములుగా నర్థములను చేయవచ్చును. కాని ఏ సమయమందైనను భారతదేశ ప్రభుత్వవిషయములలో పార్లమెంటు సభవారికి జోక్యము కలుగఁజేసికొనుటకు న్యాయసమ్మత మగు హక్కు కలదనుట నిర్వివాద మగు నంశము. ప్రజాప్రతినిధులు గల శాసనసభకు కార్యనిర్వాహకవర్గము వారు లోఁబడి యుండుటయే (బాధ్యత) యని నా యభిప్రాయము. ప్రతివిషయములోను శాసనసభాభిప్రాయమును కార్యనిర్వాహక వర్గమువారు చెల్లించుటయే యిందలి ప్రధానాంశము.

నా సహోద్యోగులు చేయు సూచనలు పార్లమెంటుఅధికారమును తగ్గించుటకే ఏర్పడినవి. కాని వీరి యుద్దేశము, అధికారమును పార్లమెంటు సభవారినుండి శాసనసభలవశము చేయుట గాక, దీనినంతను భారతదేశమునందలి కార్యనిర్వాహకప్రభుత్వవశము చేయుటయే యని తోఁచుచున్నది. పార్లమెంటువారు తమ యధికారమును ప్రజాప్రతినిధిసభలవశము చేయవలసిన దనియే భారతీయులు గోరుచున్నారు. కాని దీనినంతను కార్యనిర్వాహకప్రభుత్వములకు ఒసంగవలయు నని భారతీయు లభిలషించుట లేదు. మార్పులు జరుగుకాలమున కార్యనిర్వాహకాధికారుల ప్రోత్సాహమువలన గాని, మఱియితరకారణములవలన గాని, పార్లమెంటు సభవారు శాసనసభాధికారనిర్వహణములో జోక్యము కలుగజేసికొనవచ్చును. భారతదేశ విషయములలో పార్లమెంటు సభవారు న్యాయమగు జోక్యమును కలుగజేసికొనుటకు మితవాద్యభిప్రాయ మెప్పుడును ఆక్షేపింపఁజాలదు. ఇట్టి జోక్యము ఇంకను ఎక్కుడు సంతోషముగా కోరబడుచుండును. భారతప్రభుత్వము వారును కాంగ్రెసు పక్షమువారును గావించు సూచనలలో గల భేదములకు ఇదియే చాలవఱకు కారణభూతము. భారతమంత్రి గల ఇండియా ఆఫీసుయొక్క ప్రస్తుత నిర్మాణమునుబట్టి ఆసభ పార్లమెంటు ప్రాతినిధ్యమును కలిగియుండలేదని చెప్పవచ్చును.

2. ఈ ప్రకటనమునకును తదనుగుణమగు కార్యాచరణమునకును ప్రతికూలముగ నిక నొకవిమర్శనము గలదు. భారతదేశము ఇదివఱకు నిరంకుశైకరాజ్యాధికారమున నుండె ననియు, బాధ్యతాయుతప్రభుత్వము ఆదేశజుల భావములకు విరుద్ధమనియు, నందుచేత దానిని ఈ దేశమునందు ప్రవేశపెట్టుట దుర్లభమనియును కొందఱు వాదించుచున్నారు. ఇట్టి ఆక్షేపణలు చేయువారు భారతదేశము

విద్యమూలమునను పరిస్థితులవలనను సాహచర్యముచేతను, రాజకీయాభివృద్ధిమూలమునను కాలవశమునను చాలవఱకు మార్పుచెందినదను విషయమును మఱుపుచెందుచున్నారు. నిజమును తెలిసికొనినయెడల ఏకరాజేతరపాలనావిధానము భారతీయులకు తెలియనివిషయము గాదు. ఈ విషయమున విదేశచరిత్రకారుల యభిప్రాయముల నిట తెలుపుచున్నాను. "అధికారముతో కూడిన ఏకరాజపాలనముతో పాటు సంపూర్ణముగా గాని కొంతవఱకు గాని స్వాతంత్ర్యము ననుభవించుచుండిన ప్రజాపాలనములుకూడ కలవని బౌద్ధగ్రంథములవలన తెలియుచున్న"దని ప్రొఫెసరు రిస్, డేవిడ్సుగారు వ్రాయుచున్నారు. వీరు ఈ విషయముగూర్చి యింకను ఇట్లు తెలుపుచున్నారు. "ఒక తెగవారి ప్రభుత్వన్యాయశాఖా కార్యనిర్వహణమునకై కపిలవస్తుపురమునందలి సభాభవనమునందు వృద్ధులును యువకులును మొదలగు నెల్లరును సమావేశ మగుచుండిరి. వీరిలో నొకరు అధ్యక్షుడుగా నెన్నుకొనఁబడి ఆ సభనుగాని లేక పాలనవిషయికసభల నన్నిటిని గాని నిర్వహించుచుండును. ఇతఁడు ఎట్లు ఎన్నుకొనఁబడెనో, ఎంతకాలము ఈ పదవియందుండెనో తెలియదు. రోమకరాజ్యములోని కాన్సలువలెగాని గ్రీకురాజ్యములోని అర్కనువలెగాని ఈ యుద్యోగియుండెననియు నితనికి రాజు అను బిరుదము ఒసంగబడెననియు దెలియుచున్నది." మెక్రిండెలుగారు వ్రాసిన 'ప్రాచీనభారతదేశము' అను గ్రంథములో 292-వ పేజీయందు "ప్రజాస్వామ్యప్రభుత్వవిధానము కానవచ్చుచుండె"నని గ్రీకు గ్రంథకారులు తెలుపుచున్నట్లు వ్రాయఁబడి యున్నది. ఈదేశమున నివసించు మఱొకజాతివారిలో ప్రజాస్వామ్యప్రభుత్వము కలదనియు, కాని అది న్యాయసమ్మతముగా లేదనియు తెలుపబడియున్నది. ఇంక నలగ్జాండరు నెదిరించిన ఇతరజాతు లన్నియును ప్రజాస్వామ్యప్రభుత్వమును గలిగియుండె ననియును తెలియుచున్నది. (మెక్రిండెలు పే 154) పాటల యను నగరమున స్పార్టను ప్రభుత్వమువలెనేయున్న యొక రాజ్యాంగయంత్రము కలదనియు రెండువంశములకు చెందిన ఇర్వురరాజులకు పైన్యాధికారము వంశపరంపరాగత మనియును పెద్దలసంఘ మొకటి రాజ్యవిషయములలో సర్వాధికారము గలిగియుండె ననియును డియోడారేను వ్రాయుచున్నారు. ఈవిషయమున హావెలుగారు వ్రాసినగ్రంథమే నాకు తెలిసినంతవఱకు నత్యంతము ఆధునికమైనది. వా రందులో ఇట్లు వ్రాయుచున్నారు. "హిందూదేశము బాధ్యతారహితమగు నేకరాజపాలనమున నుండె నని యిరోపాఖండమునందు వ్యాపించియున్న యభిప్రాయము ముసల్మను పాలనమునకు పూర్వమునన్న ప్రభుత్వవిధానమునెడల ననువర్తింపదు. భారతదేశమునెడల నైరోపియనులకు గల దురభిప్రాయములలో నిది యొక్కటి." "పాశ్చాత్య పార్లమెంటుసభలను పోలినరీతిని సభలు భారతదేశమునందు నున్నవనియు నిందుమూలమున నీ రెండు దేశములవారును క్రీస్తుకు మునుపు ఆఱవశతాబ్దికి పూర్వము ఏకసంతతిలోని ఆర్యులనియు, నార్మను విజయమునాఁటికి ఆసంతతివారు మిగుల నుచ్ఛదశయం దుండి రనుట, కొందఱు పాఠకులకు నాశ్చర్యజనకముగ నుండగలదు."

"తీవ్రములగు నంతఃకలహములవలనను అల్లరులవలనను ఆంగ్లేయులు అధికారులయొద్దనుండి మిగుల ప్రయాసమీద నధికారమును బలవంతముగా లాగికొనిరి. కాని భారతదేశపు టార్యుల రాజ్యాంగనిర్మాణము సీమంతులచే ప్రజల కొసంగబడిన స్వాతంత్ర్యబహుమానము నొసంగిరని తెలియగలదు. ఈ బహుమానము ఒకతరగతివారి లాభమునకు గాక ఎల్లరకును సమానాధ్యాత్మికాధిభౌతికస్వాతంత్ర్యము లభించుటకే నిర్దేశింపబడినది. అది ఆయాజాతుల శక్తిసామర్థ్యములను బట్టియు ప్రజాక్షేమమునుబట్టియు ప్రసాదింపఁబడుచున్నది." దక్షిణ హిందూదేశమునందు రాజులను తొలఁగించుచు వారిపై నధికారమును గలిగియున్న ప్రభుత్వసంఘము లుండెడివని మెగాస్తనీసు వ్రాయుచున్నాడు. ఇట్టి పాలనవిధానములు ఎంతకాల ముండెనో చెప్పుటకు వీలు లేదు. పోర్చుగీసువారు దండయాత్ర వెడలినకాలమునందు హిందూదేశపు పశ్చిమదిశయం దున్న నాయరులలో నిట్టి ప్రభుత్వవిధాన ముండెననుట నిశ్చయము. రాజులపైని అధికారముగల పార్లమెంటుసభ ఇచ్చట నుండెనని పోర్చుగీసు చరిత్రకారుఁడు వ్రాయుచున్నాడు. ఈవిషయము లోగనుయొక్క మలబారుజిల్లా చరిత్రమునందు తెలుపఁబడినది. భారతదేశమునకు వాయవ్యమూల నున్న జిర్గాలు అను జాతివారిలో సంధి సంగ్రామప్రభుత్వవిషయములను పరిష్కరించు ప్రజాప్రతినిధిసభలు ఉండియుండెను. భారతదేశ స్థితిగతులను బట్టి ఈ ప్రజాప్రతినిధి ప్రతిష్ఠాపనలు చిరకాలజీవితము లగుట దుర్లభమైనది. ఈదేశము బ్రిటిషువారి వశమైనప్పుడు ప్రజాస్వామ్య ప్రభుత్వభావములు అంతమొందలేదను విషయము ఎల్లరకు తెలిసియే యున్నది.

8. బ్రిటిషువారు ఈదేశము నాక్రమించినప్పుడు, పల్లెలయందు ప్రజాస్వామ్య ప్రభుత్వవిధానము ఉండె ననుట నిర్వివాదాంశము. "ఇండో ఆర్యనుమతమునకు పునాదిగ సాంఘిక రాజకీయప్రతిష్ఠాపనములను నిర్మించి అవి దుర్వినియోగములు కానట్లు తగిన కట్టుబాట్లను చేసి ఆర్యులు తమ ధీశక్తిని వెల్లడించియుండిరి. అట్టిసంతృప్తికరమగు స్థానిక స్వపరిపాలనవిధానము యూరపుదేశముయొక్క ప్రాచీనాధునికచారిత్రములయం దెచ్చటను గానరాకున్నది." దండయాత్రలును మార్పులును రాజ్యవినాశములును ఎన్ని సంభవించినను ఈవిలేజి ప్రజాస్వామ్యములు నశింపలేదని కామన్సుసభవారి ప్రత్యేక సంఘపు 5-వ నివేదిక తెలుపుచున్నది. ఈ విషయమునుగుఱించి స్లీమెను అను నాతని 'ప్రయాణము' మార్సుమల్లరు వ్రాసిన 'భారతదేశ బోధము'ను చూచినయెడల నిజస్థితి తెలియఁగలదు. ఈ విలేజి సభలు సివిలు క్రిమినలుకేసులను నిర్ణయించుచుండెను. కేంద్రప్రభుత్వము అన్నివిషయములలోను, ఈసంఘములతోనే సంప్రతించుచుండెను గాని పల్లెలయందలి ప్రజలతో నెట్టియేర్పాటులు చేసియుండలేదు. ఆదాయమును, పన్నును, ఈసభలే ప్రజలకు విభజించుచుండెడివి. ప్రభుత్వమువారి భూములు వీనివశముననే యుండెడివి. వీనియందు ఎన్నికసభ్యు లుండెడివారు. ఈ ఎన్నిక స్వాతంత్ర్యమునకు వలయు నియమములలో కొన్నిటిని గల శిలాశాసనములు లభించి

నవి. కాని అట్టిసభలు బ్రిటిషు ప్రభుత్వమువారి రివెన్యూపద్ధతికిని, పాలనవిధానమునకును క్రిమినలు శాసనపరిపాలనమునకును విరుద్ధములుగా నున్నవి. పల్లెలయందున్న ప్రాతయుద్యోగులు ప్రభుత్వసేవకులుగా మన ప్రభుత్వమువారిచే మార్పబడి ప్రజలచే నిరంకుశవర్తనులుగా పరిగణింపబడుచున్నారు. పల్లెల వ్యక్తిత్వమును శాసనములు గుర్తించుటలేదు. కొన్ని విషయములలో నిది నశింపజేయఁబడుచున్నది. ఇదివఱకు గ్రామవరమున నున్న భూములు ఇప్పుడు ప్రభుత్వపుభూము లయినవి. బ్రిటిషుపాలనమువలన గాని శాసనములవలన గాని నిర్మితములైన గ్రామప్రతిష్ఠాపనములను ప్రాచీనసభలతో నేవిధముననను సరిపోల్చుటకు వీలులేదు. ప్రజలలో ప్రజాప్రభుత్వభావము ఇంకను నశింపలేదను విషయము ఈ గ్రామసంఘములను చూచాయగ బరికించినవారికిగూడ తెల్లము కాగలదు.

4. గొప్ప ఆస్తులకు సంబంధించిన తగవులను ఆయావర్ణములకు సంబంధించిన సంఘములచే నిర్ణయింపబడుచుండె నను విషయము ప్రతి భారతీయన్యాయవాదికిని తెలిసియేయున్నది. భారతరాజ్యాంగ నిర్మాణమునకు నిరంకుశమే ప్రధానలక్షణ మను వాదమునకు, ఈ న్యాయపరిపాలనపద్ధతి తగిన ప్రత్యుత్తరము. వారసత్వమునకు సంబంధించిన హిందూధర్మశాస్త్రమును తత్సంబంధము లగు ఇతరశాసనములను మనము పాలించుచున్నాము. అయినను మనకు తెలిసినంతవఱకు అవి ఎట్టి సార్వభౌముని అనుమతిని పొందిన శాసనములును కావు. అవి రాజులవలన గాక ధర్మశాస్త్రజ్ఞులచేత ఏర్పరుపఁబడి వివిధవర్ణముల వారిచేతను, గ్రామసంఘములచేతను తమ యెదుటికి విచారణకు వచ్చిన కేసులతో ననువర్తింపుచుండినవి. కాన నిరంకుశైకరాజపాలనముకంటెను భిన్నమగు నెట్టి ప్రభుత్వ మైనను హిందువుల భావములకు విరుద్ధము లనుట సత్యదూరము.

5. ఇంతేకాక భారతీయులు ప్రాచీననాగరకమునుండి గ్రహించిన భావములను సాంప్రదాయములను అటుండ నిచ్చినను, వారు బ్రిటిషు పాలనమునందు ప్రజాప్రాతినిధ్య ప్రతిష్ఠాపనాభావములను గ్రహించి రనుటకు సందియము లేదు. కడచిన ముప్పదియైదు సంవత్సరముల నుండియును మునిసిపలు జిల్లా లోకలు సంఘములకును, కాంగ్రెసు మున్నగు మహాసభలకును ప్రతినిధుల నెన్నుకొను నలవాటు ప్రజలకు కలిగినది. ప్రజాప్రతినిధులు గల శాసనసభలను నిర్మింపవలయు నని వారు కోరుచున్నారు. ప్రజాక్షేమమునకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుటకు ప్రజాప్రతినిధులు గల ప్రభుత్వముకంటె నింక నెట్టి విధానమును ధీయుతు లగు ఆధునికభారతీయులకు రుచింపదనుట నిశ్చయము. ప్రస్తుతము భారతదేశాభిప్రాయమును, సంతృప్తిపరుప గల సంస్కరణముల ప్రసాదించుటకు పూర్వము ఈ విషయమున భారతప్రజాభిప్రాయ మెంతవఱకు అభివృద్ధి నొందినదో తెలిసికొనుట ముఖ్యము.

ఈ విషయముల నన్నిటిని యోచింపక రాజ్యాంగసంస్కరణ విధానమును ఆగష్టు 20.వ తేది ప్రకటనమునకు విరుద్ధముగా నుండునట్లు నొనరించు వివరణలను నా సహోద్యోగులు సూచించియున్నారు. దీనిని గుఱించి తెలుపుటకు పూర్వము సంస్కరణ నివేదికా సూచనలను గుఱించియును తెలిపి సకలస్వాస్థ్యాగానమును గత ముప్పది సంవత్సరముల నుండియు ప్రస్తుత స్థితిగతులకు తోడ్పడిన అంశము లను ఇంచుక ప్రాసెదను.

విధానము - రాష్ట్రీయ ప్రభుత్వము

6. సంస్కరణ నివేదికయందలి సూచనలను మూడు విశాల విభాగములుగా విభజింపవచ్చును.

1. స్థానికస్వపరిపాలనము మున్నగు ప్రభుత్వశాఖలు, ప్రజాప్రతినిధులు గల రాష్ట్రీయశాసనసభల అధికారమునకు లోఁబడియున్న భారతమంత్రులవశము చేయబడును. ఆయాశాఖలు ఆ రాష్ట్రపు గవర్నరు పరిశీలనము క్రింద మంత్రి పరిపాలించుచుండును.

2. ఇతరశాఖలకు సంబంధించిన విషయములు ప్రభుత్వాంతర్గతములుగా నుండును. ఒక సివిలియను ఉద్యోగియు, గవర్నరు సూచననుబట్టి నియమింపబడిన ఒక భారతీయుడును గల కార్యనిర్వాహకసంఘమువారిచే నా శాఖ పాలిత మగుచుండును.

3. ప్రతి శాఖలోను కార్యనిర్వాహకాధికారులకు నిర్ణయాధికార ముండినను ప్రధానవిషయములలో మంత్రులును కార్యనిర్వాహకసంఘమువారును కలసి కృషి సలుపుచుందురు గావున ప్రభుత్వాయత్తవిషయములలో మంత్రియు శాసనసభయు కొంతవఱకు తమ అభిప్రాయమును కొనసాగించుటకు శక్తి కలిగియున్నా రని చెప్పనగును. ఆర్థికపత్రనిర్ణయమున మంత్రికిని కార్యనిర్వాహకసంఘమునకును అభిప్రాయభేదము జనించునపుడు ఆ విషయమును గవర్నరు పరిష్కరించుట కధికారము గలదు. ఆ విధముగా నిర్ణయింపబడిన ఆర్థికపత్రమును శాసనసభవారు తమ యిచ్ఛవచ్చిన విధమున మార్పవచ్చును. కాని ప్రభుత్వాయత్తవిషయములకు అవసర మని తోచినయెడల ఆర్థికపత్రమునందలి ఎట్టి విషయము నైనను శాసనసభాభిప్రాయమునకు భిన్నముగ మార్చుటకు గవర్నరున కధికారము గలదు. మరియు మంత్రి అనుమతిలేనిదే ఏ విషయము నైనను పన్నులను విధింప వీలు లేదు.

7 దానినిబట్టి చూచినయెడల ప్రభుత్వాయత్తవిషయములలో కూడ మంత్రికిని శాసనసభకును పలుకుబడికలదని తెల్లము కాగలదు ఈ విధముగా కార్యనిర్వాహకసభ అనేక ప్రధానవిషయములలో శాసనసభయొక్క పలుకుబడికి లోబడినట్లు చేయబడియున్నది. ఇప్పుడు భారతప్రభుత్వమువారిచే తెలుపబడిన నిరోధదాయకసూచనలనుగూర్చి యోచించునపుడు ప్రభుత్వాయత్తవిషయములకు సంబంధించిన ఈ పై నియమములను గుర్తింపవలసియున్నది. ప్రభుత్వాయత్తశాఖనుండి పాలనావిషయములను ప్రజాయత్తములుగా చేయుటకై అప్పుడప్పుడు పార్లమెంటరీసంఘము ఏర్పరుపబడుచుండును. ప్రజాయత్తవిషయపాలనములో మంత్రికిని శాసనసభకును కలిగిన విజయమునుబట్టియే ఈ శాఖ మార్పులనుజేయ నవసరము లేదు. మంత్రియు శాసనసభయు ఇచ్చు సలహాలను ననుసరించియు వారికి గల

పలుకుబడినిబట్టియు పాలనావిషయములను ప్రభుత్వాయత్తశాఖ నుండి ప్రజాయత్తశాఖకు మార్చుటకు ఈ సంఘమువారికి ప్రోత్సాహ మొసగుచుండును. కావున ప్రభుత్వ ఐక్యమునకు ఏర్పరుపబడిన ఈ నియమములు ప్రభుత్వాయత్తవిషయములకై మంత్రులకును శాసన సభలకును గల పలుకుబడి సంస్కరణవిధానములో ప్రధానభాగ ముగా నున్నది. భారతీయదృక్పథమునుబట్టి చూచినయెడల వీని ప్రాముఖ్యము ఇంకను హెచ్చుచున్నది. ప్రజాభిప్రాయమునుబట్టి పాలనావిషయమున పురోవృద్ధికరము లగు ఏర్పాటులను చేయవల సిన యనేకప్రధానవిషయములు ప్రభుత్వాయత్తశాఖయందు జేర్ప బడుట నిశ్చయము. ఈ నియమములనుబట్టి అవసరమగు మార్పులను ఈ శాఖావిషయపాలనములో చేయవలసినదని శాసనసభలను మంత్రి యు నొక్కి చెప్పవచ్చును. వారుసూచించిన మార్పులు కార్యరూపము దాల్పకపోయినయెడల కార్యనిర్వాహకసంఘమువారే యిందులకు బాధ్యులుగా పరిగణింపబడుటయు, పరిశోధకసంఘమువారు ప్రభు త్వాయత్తవిషయములను ప్రజాయత్తములుగా చేయుటయు తట స్థించును.

భారతప్రభుత్వమువారు సాధ్యమైనంత తక్కువసంఖ్య గల పాలనావిషయములనే (అనగా దేశముయొక్క శాంతి, సుపరిపాలన విషయములను) తమవశమున నుంచుకొనవలసినదని నివేదిక తెలుపు చున్నది. కావున సాధ్యమైనంతవఱకు ఈ నియమము నుల్లంఘింపక, అధికారమును రాష్ట్రీయప్రభుత్వములకొసఁగ చేయుట అవసరము. ఈవిషయము ప్రస్తుత స్థితిగతులనుబట్టి సంస్కరణములు ఆచరణ లోనికి వచ్చుట దుర్లభ మనెడి అభిప్రాయము ననుసరించియున్నది.

౮. ఈసూత్రములను రాష్ట్రములకు సంబంధించినంతవఱకు సంస్కరణవిధానముల నే నంగీకరించుచున్నాను. నేను కొన్ని సవరణ లను సూచించుచున్నాను. కాని అవి ఈసూత్రములతో ననుగుణము గనేయుండి రాష్ట్రీయప్రభుత్వములకు సంబంధించినంతవఱకు కొంచె ము ముందంజ వేయుచున్నది. నా సహోద్యోగులు ఈవిధానమును చాలవఱకు మార్పు నొందింపవలె నని సూచించుచున్నారు. వారి విధానమునుబట్టి ప్రజాయత్తవిషయములలో బాధ్యత నశించుచున్నది; మంత్రియొక్కయు శాసనసభలయొక్కయు పలుకుబడి సంపూర్ణ ముగా తొలగిపోవుచున్నది. ప్రజాయత్తవిషయములలో అధికార మును పొందువారు ప్రజాక్షేమమునకు భంగకరముగా వర్తించెద రనియు, సంస్కరణాభిలాష అల్పసంఖ్యాకులయందు మాత్రమే కానవచ్చుచున్న దనియు ఇందుమూలమున రాజకీయాభివృద్ధికి పాల నాసౌష్ఠవమును కోల్పోవలసియుండు ననియు, ఇంతవఱకును బ్రిటిషు ఆశయానుగుణ్యముగా నడిపింపబడుచున్న దేశపాలనము భారతీయ ఆశయానుసరణముగా నిర్వహింపబడుననియు నా సహోద్యోగులు వాదించుచు, తదనుగుణ్యముగనే తమ సూచనలను వెల్లడించియుం డిరి. సంస్కరణనివేదికయందు గూడ ఆ నివేదిక కర్తలకు కలిగిన యిట్టి యభిప్రాయములే సంస్కరణసూచనలను చాలవఱకు సంకు చితపఱచినవి.

9. దేశమున సత్పరిపాలనము లేకపోవుటవలన కలిగిన కష్టము లును ప్రస్తుత స్థితిగతులనుబట్టి ఈ కష్టములు తొలగవనెడి నిరాశ యును దేశమున రాజద్రోహము, విప్లవోద్యమములు జనించుటకు కారణములు. ఇటీవల స్వపరిపాలనమును గడింపవలె ననెడి అభిలాష యు, సంగ్రామమువలన గలిగిన భావపరివర్తనమును, సంస్కరణ వాంఛ ద్విగుణీకృత మగుటకు తోడ్పడినవి. నివేదికయందు తెల్పబడి నటులు భారతవిద్యాధికులు దేశపాలనమున పాల్గొనవలె ననెడి అభి లాషయే ఇందులకు కారణ మనెడివాదము సమంజసముగా లేదు. ప్రథమమున ఆంగ్ల ఆశయముల ప్రకారము పరిపాలనమును వృద్ధిచేయ వలె ననెడి ఉద్దేశమే మొదట సంస్కరణతృష్ణను పురికొల్పినది. ఇప్పుడు స్థితిగతులు మాఱినవి. అంగుచే ప్రభుత్వశాఖలయం దన్నిటి యందును భారతీయులను ఎక్కువగా జేర్చుకొనుటయు, స్వపరి పాలనము నొసంగుటయు నేకవిషయముగా పరిగణింపబడు చున్నది. ఇందుమూలమున దేశపుస్థితి తొలగుచను అభిప్రాయము వ్యాపించి యున్నది.

10. ఈ యుద్యమ ప్రతికూలురు, కాంగ్రెసుమహాసభ వంగ దేశీయులచేతను, దక్షిణ ఇండియా బ్రాహ్మణులచేతను స్థాపింపబడిన దనియు, భారతదేశమంతయు వీరితో నేకీభవించుట లే దనియు భావించుచున్నారు. ఈ బంగాళీలతోడను దక్షిణ హిందూస్థానపు ఆందోళనపరులతోడను తమ కెట్టిసంబంధమును లేదని ప్రకటింపవల సినదని మహారాష్ట్రులు కోరబడిరి. ఈ కోరికకు వచ్చిన ప్రత్యుత్తరము మనకు దెలిసియేయున్నది. కొన్ని వరగతులవారు చేయు ఆందోళన మును ప్రభుత్వమువారు సహనభావముతో తిలకింపవచ్చు ననియు, కాని మహమ్మదీయులు చేయు ఆందోళనము మాత్రము ఆవిధముగా తిలకింపబడదనియు మహమ్మదీయులు బెదరింపబడిరి. కాంగ్రెసు మహాసభ వీరికి ప్రతికూలముగ నున్నది. భావములు మహమ్మదీయులు జనింపజేయుటకు ప్రబలప్రయత్నములు చేయబడినవి. ఈ వివాదజని తములగు స్థితిగతులే సంస్కరణములయెడల మహమ్మదీయుల ప్రతి కూలభావమును తెలుపుచున్నది. వారిలో ఉగారభావు లగువారు హిందువులకంటె గూడ ఎక్కుడుసంస్కరణములను కోరుచున్నారు. కాంగ్రెసు ప్రతికూల రాజనీతిజ్ఞులు సిక్కులు, పంజాబీలు మున్నగు జాతులు స్వపరిపాలనమునకు ప్రతికూలముగా నుండె నని తలచు చున్నారు. ఇప్పుడు మాత్రము స్వరాజ్యమునకు పంజాబుకంటె నెక్కుడు ఉత్సాహమును, కార్యదీక్షను చూపువారు వేఱె లేదని తెలియగలదు. ఢిల్లీ కాంగ్రెసుసభయందు సంస్కరణనివేదికముకంటె నెక్కుడుసంస్కరణములు వాంఛితము లగుటకు పంజాబుదేశీయుల భావములే కారణములు. బ్రాహ్మణేతరులును నిమ్నజాతులును తమ దుస్థితిని, అసహాయస్థితిని గ్రహించి, ఒక శతాబ్దమునుండి తమ్మును బాగుచేయని ప్రభుత్వమువారిపై నాధారపడియుండక తమ భావి నిర్ణయమున అధికారము కలిగియుండవలెనని కోరుచున్నారు. కార్య నిర్వాహకసభలయందు (రాజప్రతినిధి కార్యనిర్వాహకసభయందు గూడ) సభ్యులలో సగముమంది భారతీయు లుండవలె ననియు,

గ్రాండుకమిటీలు, స్టేటుకౌంసిలులు మున్నగు ఆటంకములు లేకయే, అధికసంఖ్యాకులగు ప్రజానియుక్తసభ్యులు శాసనసభలయందుండ వలయు ననియు, మన క్షేమమునకై ప్రత్యేకప్రాతినిధ్యము కావలయు ననియు వీరు కోరుచున్నారు. స్వపరిపాలనము మొదలుకొని నిమ్న జాతుల కోరికలవఱకును ఎక్కడు సంస్కరణములు కావలయు ననెడి వాంఛలు ఎల్లెడలను కానవచ్చుచున్నవి.

11. భారత దేశ ప్రత్యభిజ్ఞానమును పెంపొందించుటకు విరోధాఖండము నందలి యిటీవల జరగిన విషయములు కారణభూతము లనియు నిందుమూలమున వారు గొప్ప రాజ్యాంగసంస్కరణలను గోరుచున్నా రనియు సంస్కరణ నివేదికయందు వ్రాయబడియున్నది. కాని ఈ రాజకీయప్రత్యభిజ్ఞానస్వభావమును ఈ నివేదిక సంపూర్ణముగా తెలిపియుండలేదు. దేశమున అసంతృప్తి వ్యాపించుచున్న దనియు, శాసనసభల నిష్ప్రయోజనమువలన అధికారులకును, అనధికారులకును భేదభావములు వృద్ధి యగుచున్న వనియు నివేదిక చెప్పినవాక్యములు సత్యములు. ఇట్టి విభేదములకు అధికారుల స్వభావమే చాలవరకు కారణమను విషయము వీరు సరిగా తెలిపియుండ లేదని నాయభిప్రాయము. పురోవృద్ధికారక మగు ఎట్టి విధానము నైనను ప్రస్తుత భారత ప్రభుత్వ నిర్మాణమును బట్టి దుస్సాధ్య మనెడి వాదమునుగూర్చి నే నిచట చర్చింప నవసరము లేదు.

12. ప్రబలమగు మార్పును జరుపుటకు సంస్కరణ నివేదిక దెలిపిన కారణముల నిట పేర్కొని యుంటిని. కాని రాజకీయనాయకుల యభిప్రాయమును బట్టి సంస్కరణావశ్యత ఇక ననేక కారణములు గూడ కలవు. దేశపు సుపరిపాలనమునకును, శాంతికిని ఆంగ్లాశయానుగుణ్య మగు ప్రభుత్వమునకు—సంస్కరణ మావశ్యకము. ప్రస్తుత పాలనా విధానము సౌష్ఠవవిహీనముగా నున్నది. బొంబయి రాజధానియందు సంభవించిన ప్లేగు అల్లరులు ప్రజాస్వామ్యపాలనమున తటస్థింప నేరవు. తిరునల్వేలి అల్లరులును ఆషీ గారి హత్యయు స్వదేశీ స్టీము నావిగేషను కంపెనీవారియొక్కయు మిల్లు కూలీలయొక్కయు స్థితిని బాగుచేయుటకై చిదంబరం పిళ్ళె చేసినపనులలో జోక్యము కలుగ జేసికొనుటయే కారణము. ఇట్టి స్థితిగతులు సుపరిపాలనము కలుగ జేసికొనుటయే కారణము. ఇట్టి స్థితిగతులు సుపరిపాలనమున సంభవములు కాజాలవు. తూర్పుబంగాళా దేశమున రాజద్రోహకరములును విప్లవదాయకములు నగు ఉద్యమములనుబట్టి సంభవించిన దుస్థితి ప్రజాప్రభుత్వమున దుస్సాధ్యము. శాసనసభవారిచే నిర్మితమైన యొక శాసనమువలన 1907-వ సంవత్సరమునుండి పంజాబు దేశములో నశాంతి ప్రబలజొచ్చినది. వ్యక్తిస్వాతంత్ర్యమును, నాగరికప్రపంచమున గల న్యాయసంరక్షణమును, ప్రస్తుతము శాసనసభయెదుట నున్న బిల్లులు తొలగించు చున్నవి. వార్తాపత్రికాస్వాతంత్ర్యమును, వాక్స్వాతంత్ర్యమును బంధించుటకు కొన్ని శాసనములు నిర్మితమైనవి. ఈ చర్యలన్నిటిని బట్టి చూచినయెడల నీటిస్థితికి కారణభూతమగు ప్రభుత్వవిధానమును సంస్కరించుటకు ఉదారవంతములగు సంస్కరణము లవసరమని తేటతెల్లముకాగలదు.

అనేకవర్ణ విభేదములం బట్టి సంఘవిభజనము జరుగుటచే కలుగు లోపములను తొలగించుటకు గొప్ప రాజ్యాంగ సంస్కరణము లత్యవసరము. ఈ వివిధ సంఘనాయకులకు తమతమ కలహములను తామే పరిష్కరించుకొనుట కధికార మొసంగినయెడల ఈ విభేదము లంతరించునని నిశ్చయముగా చెప్పవచ్చును.

భారత దేశపు ప్రజాసామాజ్యక్షేమమునకు గూడ గొప్ప రాజ్యాంగ సంస్కరణము లత్యవసరములు. ఇంతవరకును వారిస్థితిని వృద్ధి చేయుటకు విద్యాధికులు చేసినప్రయత్నములు నిష్ఫలములైనవి. ఈవిషయమున ప్రభుత్వమువారు తగిన చర్యను తీసికొనక పోవుటయే గాక విద్యాధికుల ప్రయత్నములకు కూడ వీరు చేయూత నొసంగరైరి.

అదివరకే లభింపవలసిన సంస్కరణము లనేకములు ఉన్నవి. జాతివిభేదములు లేకయే భారతీయులకు ప్రభుత్వోద్యోగముల నొసంగెదమను వాగ్దానములు ఇంతవరకును కార్యరూపము దాల్పలేదు. భూమిశిస్తు పరిపాలనమును గూర్చి సంస్కరణము చేసెదమను ప్రభుత్వవాగ్దానము ఇటీవల ఉపసంహరించుకొనబడినది. భారత ప్రభుత్వమువారు వాగ్దానము జేసిన ప్రభుత్వన్యాయశాఖావిభజనము ఇంతవరకును జరుగలేదు. స్థానిక స్వపరిపాలనమును గూర్చి రిప్పను, మార్లీ ప్రభువులు చేసినయుత్తరువులు తృణీకరింపబడినవి. విద్యావిషయమున శ్రీసార్వభౌముని కోరికలు చెల్లింపబడలేదు. పారిశ్రామికాభివృద్ధికి వలయు ప్రయత్నములు జరుగలేదు. మనము కార్యవిరహితము లగు నట్టి వాగ్దానములతో కాలమును బుచ్చు సమయము దాటిపోయినది. మన ప్రకటనమునకు ఎట్టి గౌరవమును లేదు.

ప్రజాయత్తశాఖ.

13. మంత్రులయొక్కయు శాసనసభయొక్కయు నధికారముక్రింద నుండు ప్రజాయత్తవిషయములను గూర్చి ప్రథమమున చర్చింతము. సంస్కరణనివేదికను బట్టి గవర్నరు తన సమ్మతివలన ఎట్టి అపాయమైనను కలుగునెడల అట్టికార్యముల కాతడనుమతింపకుండవచ్చును. ఈవిషయమును నాసహోద్యోగులు అంగీకరించిరాయను సందియము మాకు కలుగుచున్నది (ప్యారా 101). వారు దీని నంగీకరింపనియెడలను గవర్నరు ఇట్టి విషయములలో నింకను ఎక్కుడుజోక్యమును కలుగజేసికొనవలె నని వీరి అభిప్రాయ మగునెడలను, వీరితో నే నంగీకరింపజాలను. వీరు చేసిన నూతనసూచనలు ఇట్టి జోక్యము కలుగజేసికొనవలె ననియే తెలుపుచున్నవి. మంత్రులుగాని సభలుగాని తమ యుత్తరువులను నెరవేర్పజాలినసమర్థులగు ఉద్యోగియులను కలిగియుండెనే గాని పరిపాలనము విజయవంతముగా కొనసాగజాలదు నివేదికయందు సూచింపబడునటుల ప్రథమమున నే మంత్రులు తమ శాఖోద్యోగులను తామే నిర్ణయించుకొనవలసినదను సూచనవలన వారి ప్రయత్నములు విఫలమగుటకు ఎట్టి సందేహమును లేదు. కావుననే ప్రస్తుత ప్రభుత్వోద్యోగ

ములను యథాస్థితియందే యుంచి ఆట్టిశాఖాసంరక్షణార్థము కొన్ని కట్టుబాట్లను చేసి, వానినే మంత్రుల యాజమాన్యమున నుంచవలసి నదని నివేదిక తెలుపుచున్నది. భారతప్రభుత్వమువారు ఈశాఖా సంరక్షణమునకై అనేక వాగ్దానములను చేసియున్నారు. కాని ప్రభుత్వోద్యోగశాఖను మంత్రుల వశమున నుంచుటకు బదులుగా ఉద్యోగుల యిష్టానుసారముగనే మంత్రులు తమ విధానమును నడిపింపవలయునని వీరు సూచించుచున్నారు. ఇందుమూలమున మంత్రులు గాని గవర్నరు గాని తమ యిచ్చవచ్చిన ఉద్యోగులను ఏర్పఱచుటకు అవకాశము లేకున్నది. కావున భారతరాజ్యాంగమంత్రి అనుమతిని బొంది తనశాఖకు సంబంధించిన ఉద్యోగులను నియమించు అధికారము మంత్రికుండవలెనని నా అభిప్రాయము.

14. గవర్నరుతోడి సంబంధము విషయమున ఈ సమస్య యొక్కువ ప్రాముఖ్యము వహించుచున్నది. మంత్రులు ఈ శాఖయందలి పర్మనెంటు ఉద్యోగియులను కార్యదర్శులను, గవర్నరు ప్రత్యేకముగ చూపవలెనని తమకు తోచినవిషయములను గవర్నరునకు తెలియజేయవలెనని నా సహోద్యోగులు సూచించుచున్నారు. ఇందుమూలమున నీ యుద్యోగులు మంత్రుల ఆజ్ఞకు భిన్నముగ వర్తించుట కవకాశ మేర్పడుచున్నది. దీనివలన మంత్రి అధికారము తగ్గుట తటస్థించును. ఇట్టిస్థితి సంస్కరణనివేదికకర్తలకు గూడ తోచినట్లు లేదు. ఇది సరియైనపద్ధతి కాదు. ఈవిషయములలో నెట్టి కార్యదర్శియు ఈవిధముగ వర్తింపరాదని నా అభిప్రాయము.

15. నా సహోద్యోగు లిక నొక ప్రబలసవరణను జేసియుండిరి. ప్రజాయత్తవిషయములకు సంబంధించిన ఎట్టి బిల్లులోనైనను దేశశాంతికి గాని, ప్రభుత్వాయత్తవిషయక్షేమమునకు గాని భంగకరము అను నెట్టినియమము నైన గలిగియుండినపుడు అట్టి విషయములను గ్రాండుకమిటీవారికి తెలియజేయు అధికారమును గవర్నరున కుండవలెనని నా సహోద్యోగులు సూచించుచున్నారు. ఇందుమూలమున ప్రజాయత్తవిషయములపై శాసనసభకుగల అధికారము తొలగిపోగలదు. ఎట్టి ప్రజాయత్తవిషయమునకు సంబంధించిన బిల్లులనైనను శాసనసభలో ప్రవేశపెట్టుటకు గవర్నరున కధికారము కలదు. గవర్నరుయొక్క ఉత్తరువును ఉల్లంఘించుటకు వీలుండరాదని నా సహోద్యోగుల అభిప్రాయము. ఒక ఉదాహరణము: విద్యావిషయమునగాని, పారిశుద్ధ్యవిషయమునగాని ఒకబిల్లును మంత్రి ప్రవేశపెట్టి అశాంతికి కారణమగునను మిషచే గవర్నరు దానిని గ్రాండు కమిటీకి పంపవచ్చును. ఇందుమూలమున ఇంతవఱకు పూర్వమువలెనే ప్రజాయత్తవిషయములయందు కూడ శాసనసభాధికారము వ్యర్థమగును. ఇది సంస్కరణనివేదికకు ప్రతికూలముగా నున్నది. కాన దీనిని నే నంగీకరింపజాలను.

16. ప్రజాయత్తములుగా నున్న విషయములను కార్యనిర్వాహకసంఘమువారి వశము చేయుటకును గవర్నరునకును, భారతరాజ్యాంగమంత్రికిని అధికారముండవలెనని నా సహోద్యోగుల యభిప్రాయము. మంత్రిని పదచ్యుతిని గావించుటకు గాని శాసనసభను తొలగించుటకు గాని గవర్నరున కధికారము గలదను విషయమును మనము గుర్తింపవలసియున్నది. కాని యిట్టి అధికార మున్నప్పుడు కూడ శాసనసభయు, మంత్రియు తనకు ప్రతికూలముగా నున్నయెడల గవర్నరు సరియగుమార్గమునను మంత్రులు మున్నగువారు తప్పుమార్గమునను వర్తించుచున్నారను నభిప్రాయముతో వారిని తొలగించు అధికారమునుకూడ గవర్నరువశము చేయవలెనని నా సహోద్యోగులు తెలుపుచున్నారు. పరిపాలనము స్తంభింపకుండ నిట్టి అధికారము గవర్నరున కుండవలెనని వీరు వాదించుచున్నారు. గవర్నరునకు అనిష్టమగు పనులను చేసినయెడల మంత్రులును శాసనసభలును బాధ్యతావిరహితములుగా వర్తించుచున్న వనెడి అభిప్రాయమే యిట్టిభావములకు కారణము.

17. సంస్కరణప్రణాళికయొక్క ప్రధానసోపానమును చెడగొట్టుటకు గవర్నరునకుగాని, భారతమంత్రికిగాని అధికారమిచ్చుట మంచిదిగాదని నా అభిప్రాయము. ఈ సూచనయే కార్యరూపమున బెట్టబడినయెడల సంస్కరణ నివేదికాదర్శములను రూపుమాపగలదు. నివేదికలో శాసనసభమీద కార్యనిర్వాహకసభవారి కేమియు అధికార మిచ్చియుండలేదు. అవసరమైన పార్లమెంటువారిచే నియమింపబడు నిష్పక్షపాతమగు విచారణ మొకటి యీ విషయమును ఆలోచించి, సదరు అధికారమును కార్యనిర్వాహకసంఘమువారి కిచ్చుటకు సదుపాయములు చేయబడినవి. ప్రణాళికప్రకారము నిర్మింపబడబోవు శాసనసభలు రెండును గవర్నరుగారి అభిప్రాయమునకు వ్యతిరేకముగా నభిప్రాయమిచ్చినయెడల, గవర్నరుగారి అభిప్రాయములు పొరపాటైన వనియు శాసనసభాభిప్రాయములనె మన్నింపవలయుననియు నా నిశ్చితాభిప్రాయము. అథవా అట్టి అధికారమును గవర్నరుకే ఇచ్చినయెడల స్వభావసిద్ధము లగు ప్రభుత్వధర్మములకు వ్యతిరేకముగా ననుసరించుటయే యని చెప్పవచ్చును. అవసర సమయములలో రాజప్రతినిధిగారికి తాత్కాలికచట్టములను (ఆర్డినెన్సులు) చేయుటకు అధికార మీయబడియేయున్నది. అవసరకార్యములలో భారతప్రభుత్వమువారి కీయబడిన అధికారముల సందర్భమున ఇంకను, నీ అధికారము నియిచ్చుటకు నే నామోదింపజాలను.

18. ఈ విషయముల సందర్భమున భారతప్రభుత్వమువారికి ప్రజాయత్తశాఖాపరిపాలనమున జోక్యము పుచ్చుకొనుటకు ఈ క్రింది అధికారము లీయబడినవి. (1) భారతప్రభుత్వశాఖాపరిపాలనమును సురక్షితముగా కొనసాగించుకొనుటకు (2) భారతదేశ లాభాభివృద్ధికొరకై రాష్ట్రములందు సమానములగు శాసనములను చేయుటకు (3) ముందు పరిష్కరింపబడబోవు పబ్లికు సర్వీసులను సంరక్షించుటకును. (4) ఇతరరాష్ట్రమునకు సంబంధించు ప్రశ్నోత్తరవిషయములపట్ల అధికారము.

19. అధికారప్రజాయత్తశాఖలకు ధనమును పంచిపెట్టుటకు సూచింపబడిన అధికారములవలనను మంత్రులు కార్యనిర్వాహకసభకు లోబడి యుండవలసియుండును. రాజధానిలో వసూలగు

ఆదాయములలో ముఖ్యమైనవి భూమిశిస్తు మున్నగునవి. కార్యనిర్వాహకవర్గమువారి చేతులలోను, విద్య స్థానికపరిపాలనము ఆరోగ్యము పబ్లికువర్క్సు మున్నగువాని వ్యయములు మంత్రుల అధికారములో నుండగలవు. ఈ డిపార్టుమెంటులనే పెంపొందింపజేయుట కెక్కువప్రయత్నము చేయవలయును. వీనికి కావలసిన ధనమునంతను కార్యనిర్వాహక వర్గమే ఈయవలసియుండును. దీనివలన సహజముగా కార్యనిర్వాహకవర్గమునకు మంత్రులు లోబడి యుండవలసి యుండునని తేలగలదు. గవర్నరుగారి అంగీకారము లేనిదే మంత్రులు క్రొత్తపన్నులను వేయగూడదు. మంత్రులు తమస్వాధీనములోనున్న శాఖాదాయములను పెంపొందింప జేసికొనుటకు నాతోడిసభ్యులు అవకాశ మిచ్చియున్నారు గాని, ఏ ఆదాయమును అభివృద్ధి చేసికొనుటకు వీలున్నదో అట్టిదానిని కార్యనిర్వాహకవర్గమువారి స్వాధీనములోనె యుంచియున్నారు. ఒక శాఖనుండియే ఆశాఖాభివృద్ధికి కావలసిన ఆదాయమును దానినుండియే అభివృద్ధిచేసికొనవలయునని చెప్పు సూత్రమును నే నంగీకరింపజాలను. అధికారశాఖకు ప్రజాశాఖకు కావలసిన ద్రవ్యము నిచ్చుటకు నిరాకరింపగూడదని నాతోడిసభ్యులు చెప్పుచున్నారు. కాని క్రొత్తపన్ను వేసికొను నధికారము మాత్రము మంత్రులకు గాక గవర్నరుకే యుండవలయునని వారి వాదము. మంత్రి కార్యనిర్వాహకవర్గము వారు నిర్వహింపవలసిన కార్యములను తగిన సహాయము రాకపోయిన యెడల దేశమునందలి ప్రజలను శిక్షింపవలయునని సూచించు ఈవిధానమును నే నెంతమాత్రమును అంగీకరింపజాలను.

20. ఈవిధానమువలన మంత్రులకును శాసనసభకును ప్రజాయత్తశాఖల సందర్భమున స్వాతంత్ర్యము నీయకుండుటయే గాక, వారు కార్యనిర్వాహకవర్గమునకు లోబడవలసివచ్చును. కావున ప్రజలకు బాధ్యతగల స్వాతంత్ర్యము నిత్తుమని ఆగస్టు 20-వ తేదీని ప్రకటింపబడిన ప్రకటనమున కీవిధానము వ్యతిరేకముగానున్నది. కావున దీని నంగీకరింపగూడదు. క్రొత్తవిధానము ప్రకారము మంత్రులు అధికారము వహించినశాఖల సందర్భమున చాల కష్టపడవలసియుండును. సహజముగా వారు కార్యనిర్వాహకవర్గమువారినుండి సయితము సానుభూతిని పొందజాలని ప్రకృతపు స్థితిగతులను గురించి వ్రాసినచోటనే యుదాహరించియుంటిని.

సార్వభౌముని ప్రభుత్వమువారు పాలనాకార్యనిర్వహణమునకుగాను మంత్రులకు తగిన బాధ్యత స్వాతంత్ర్యము లీయవలయునని చెప్పుచుండగా హిందూమంత్రి రాజప్రతినిధులు మంత్రుల బాధ్యలంతయు గవర్నరుగారి విచారణక్రింద నుండవలయునని వాంఛించుచున్నారని పై నావిమర్శనమునందు తెలియగలదు. నాతోడి సభ్యులా అధికారమును సయితము తీసివేసి మంత్రులును శాసనసభలు గవర్నరు, కార్యనిర్వాహకవర్గములకు లోబడియుండవలయునని సూచించుచున్నారు. రాష్ట్రీయప్రభుత్వమును హీనస్థితికి దీసికొని రాగూడదని వాదించుచు నాతోడి సభ్యులు కార్యనిర్వాహకవర్గము ప్రజలకు బాధ్యమయి యుండగూడదని వాదించుచున్నారు.

అధికారశాఖలు

21. సంస్కరణనివేదికమునందలి విషయముల ప్రకారము శాసనసభాప్రతినిధి యగు మంత్రి యనుమతిలేనిదే అధికారాయత్తపరిపాలనమునకును పన్నును వేయగూడదు. దీనివలన ప్రజాప్రభుత్వమును సంపాదించుటకు వీలుకూడ గలదు. అధికారాయత్త ప్రజాయత్తశాఖలు రెండును సమావేశమై ఆదాయవ్యయములను చర్చింపవలయును. దీనివలన మంత్రి ఆదాయవ్యయములలో సలహానిచ్చుటయేగాక, ఎక్కువ బాధ్యతతో ఆయవ్యయవిషయములను పరిష్కరించుటకు వీ లుండగలదు. అధికారాయత్తశాఖల పాలనములో సయితము మంత్రికి ఈ విధానమువలన పలుకుబడి యుండగలదు. అధికార శాఖల బడ్జెట్టులో మంత్రులకును, కార్యనిర్వాహక వర్గము వారికిని నేవైన కలతలు వచ్చినయెడల మంత్రితో సంప్రతించి ప్రజాయత్తశాఖలతో సంబంధమున్న గవర్నరు వీనిని పరిష్కరింపవలసియుండును. కావున అధికారశాఖలతో ఈవిధానమువలన మంత్రులకెంతయు పలుకుబడి యుండగలదు. ప్రజాయత్తశాఖల సందర్భమున సయితము మంత్రులు కార్యనిర్వాహకవర్గమువారి సలహాను గైకొనుటకు అవకాశము లుండగలవు. ఈ విధానము చాల ముఖ్యతరమైనది. గవర్నరుగారు కొన్ని విషయములలో చేయు కట్టుదిట్టములకు తప్ప ఆదాయవ్యయములను శాసనసభవారు చర్చించి అధికారాయత్త ప్రజాయత్తశాఖల పాలనమునకు గాని బంధీకృతములగు సలహాల నిచ్చుటకు అవకాశము లుండగలవు.

నేను సూచించిన సూచనలవలన ఆర్థికవిషయములలోను అధికారశాఖాపాలనమునందును మంత్రులకును శాసనసభకును ఎక్కువ పలుకుబడి యుండగలదు. ఇవి చాల తృప్తికరములుగనున్నవి. మంచి సూత్రములమీద ఆధారములై యున్నవి. నాతోడిసభ్యు లీ విషయమున సూచించిన మార్పులు ఈవిధానము లంతటిని నామావశిష్టము చేయగలవు.

ప్రభుత్వమువారి సవరణలు

22. ఆదాయవ్యయపట్టికల పట్ల శాసనసభలు చేయు తీర్మానములు ప్రభుత్వమువారికి బంధీకృతములు కాగూడదని భారతప్రభుత్వమువారు తమ మార్పులలో సూచించుచున్నారు. తీర్మానము సలహారూపకముగా నుండవలయునని ప్రభుత్వమువారివాదము. ఈ సూత్రము రాజ్యాంగప్రణాళికకు వ్యతిరేకమని నా అభిప్రాయము. సతతము శాసనసభాతీర్మానములను గవర్నరు నిరాకరించుటకు కష్టతరముగానుండుననియు, వాదింపబడుచున్నది. శాసనసభాభిప్రాయమును ప్రభుత్వమువారికి తెలుపుటకే ఈవిధానము ప్రవేశపెట్టబడినది. కావున శాసనసభాభిప్రాయములు అంగీకృతములు కావలయును. అట్లు కాకపోయినయెడల ఈ వాదము సయితము రాజ్యాంగప్రణాళికకు వ్యతిరేకముగా నుండియుండగలదు.

23. పరిపాలనాసౌకర్యమున కొఱకు ఆదాయవ్యయపట్టికను తయారుచేయుట మానివేసి అధికారశాఖల తరఫున నొకటి, ప్రజా

యత్తశాఖలతరఫున మరొకట్టి ఆదాయవ్యయపట్టికలను తయారుచేయ సూచించుచు, ఆర్థికపట్టికసందర్భమున గవర్నరు కార్యనిర్వాహక సభ్యులను, ప్రజాయత్త ఆయవ్యయ పట్టిక సందర్భమున గవర్నరు మంత్రులను సంప్రతించుకొనవలయునని సూచించుచున్నారు. ప్రజాయత్తశాఖల పాలనమునకు మంత్రులును అధికారాయత్తశాఖాధికారములకు కార్యనిర్వాహకసభ్యులును పన్నులను వేసికొనవలయునని సూచింపబడినది. గవర్నరు నిరాకరించినగాని శాసనసభాతీర్మానములు ప్రభుత్వమువారికి బంధీకృతములై యుండునను సూత్రమును నిరాకరించుచు, శాసనసభాతీర్మానములు ప్రభుత్వమువారికి సలహా నిచ్చునవిగనే యుండవలయు నని భారతప్రభుత్వమువారి వాదము.

ఈ వాదములవలన అధికారశాఖల ఆయవ్యయముల పట్టికతో మంత్రుల కేమియు సంబంధ ముండజాలదు. ఇదియు సంస్కరణసూచనలకు వ్యతిరిక్తముగనే యున్నది. ఆదాయవ్యయపట్టికలో ప్రజాభిప్రాయ మిసుమంతయైనను నుండజాలదు. కార్యనిర్వాహకవర్గమునకువలె క్రొత్తపన్ను వేయుటకు సయితము సర్వాధికారము లేదు. శాసనసభ క్రొత్తపన్ను విధించుటకు నిరాకరించినయెడల గవర్నరు గ్రాండుకమిటిని సమావేశపఱచిగాని మఱి యేవిధముగానైనను తన సంకల్పమును నెఱవేర్చుకొనవచ్చును. వ్యయవిషయమున సయితము అధికారశాఖలతో మంత్రులు జోక్యము పుచ్చుకొను స్వాతంత్ర్యము ఈపద్ధతితో నామావశిష్టము కాగలదు. రాజ్యాంగసంస్కరణాదర్శములను రూపుమాపగలదు. కావున ఈమార్పులను నే నంగీకరింపజాలను.

24. ఈ పద్ధతివలన మంత్రులును, కార్యనిర్వాహకసంఘమువారును, తమశాఖలకుగా నెంత ఆదాయమువచ్చునో అనువిషయము కార్యప్రారంభమున నెంత నిలువసొమ్ము తమయొద్ద నున్నది, తమ కార్యనిర్వాహణమున కెంతద్రవ్యము కావలసి, ఎంతవఱకు క్రొత్తపన్నును వేయుటకు పూనుకొనవలయునో అను విషయములు తెలిసికొనుటకు వీలుండగలదు. ప్రతిశాఖాభివృద్ధికిని శక్తివంతముగ పనిచేయుటకు నావకాశ ముండగలదు. వీనిలాభములను అన్ని శాఖ లనుభవించుటకు వీలుండగలదు. ప్రతిశాఖయు తమకు కావలసినసొత్తును బదులు పుచ్చుకొనుటకును అవకాశము లీయబడినవి. అధికార ప్రజాయత్తశాఖల ఆదాయవ్యయములను ప్రత్యేకప్రత్యేకముగా నుంచినయెడల సులభముగా నుండునని తలంచినను అధికారాయత్తశాఖల ఆదాయవ్యయములలో ప్రజల పలుకుబడి యుండుటకు వీలుండజాలదు. మంత్రులు, శాసనసభ చేతులలోనుండి అధికారశాఖలకు విముక్తి కలుగజేయుటకే ఈవిధానము సూచింపబడినదని వారి వాదము. దీని నే నెంతమాత్రము నంగీకరింపజాలను. సంస్కరణనివేదికము ప్రకారము ఈ క్రొత్తపద్ధతివలన అధికారులకు పనికిరాని శాఖలు మంత్రుల కీయబడినవనియు మంత్రులు ప్రత్యేకముగా తమ శాఖాపాలనమునకు పన్నులు వేసికొనుటకు ప్రజాభిప్రాయము వ్యతిరేకముగా నున్నదనియు దేశీయమహాజనసభవా రొక గొప్ప అభ్యంతరమును కల్పించుచున్నారు. నాతోడిసభ్యులు ప్రత్యేక ఆర్థికపట్టికను ప్రవేశపెట్టు విషయమున ఈ అభ్యంతరమును సమర్థించియున్నారు. ప్రజాభిప్రాయమునకు ప్రోత్సాహము కలుగజేయుటకుగా నిట్టివిధానమును కల్పించుట మంచిదిగాదు. ప్రణాళిక ఈవిషయమున చేసిన కట్టుదిట్టములను మఱొకచోట నుదాహరించియున్నారు. మంత్రియొక్క అంగీకారము లేనిది క్రొత్తపన్నును వేయగూడదు. బాధ్యతగల కార్యనిర్వాహకసభ్యు డెవరును అధికారాయత్తశాఖలకెక్కువస్వాతంత్ర్య మీయవలెనని వాంఛింపజాలడు. అయినను ఈ విషయమున గవర్నరుగారికిమాత్రము పూర్తిఅధికారముగలదు. శాసనసభ ఆర్థికపట్టికను ప్రజాయత్తశాఖాపాలనసందర్భమున విమర్శింపవచ్చును. గవర్నరు అధికారాయత్త శాఖాసందర్భమున చేయబడు సూచనలనుమాత్రము నిరాకరింపవచ్చును. ఈపద్ధతివలన ప్రజాయత్తశాఖ స్థితి చాలకష్టతరముగ నుండగలదు. ఈవిధానమును నే నంగీకరింపజాలను. భారతీయనాయకుల నివేదికయందలి వాక్యాడంబరమువలన మోసపోయిరి. అధికారాయత్తశాఖలకు ఆర్థికవ్యయవిషయములలో ప్రధానస్థాన మీయవలయు నని చెప్పుటకన్నను కార్యనిర్వాహకప్రభుత్వము రెండుశాఖలకును ద్రవ్యము సమానముగా బంచిపెట్టిన బాగుగనుండు నని నా అభిప్రాయము. మంత్రులు, కార్యనిర్వాహకవర్గమువా రిందులకు అంగీకరింపక పోయినయెడల గవర్నరు దీనిని పరిష్కరింపవలయును. అధికారశాఖలతో సయితము మంత్రి అంగీకరింపక పోయినయెడల గవర్నరే దీనిని సయితము పరిష్కరించు అధికార ముండవలయును. భేదాభిప్రాయములు కలిగినయెడల పన్ను వేయువిషయమున గవర్నరుగారి ఆమోద మవసరమని నాతోడిసభ్యులు సలహా ఇచ్చుచున్నారు. రివిన్యూలను సమానముగా పంచిపెట్టినతరువాత క్రొత్తపన్ను వేయువిషయ మాలోచింపవలయును. మంత్రుల అంగీకారములేక నే క్రొత్తపన్ను విధింపగూడదు. చట్టమును శాసనసభలో నెవరు ప్రవేశపెట్టవలసినది గవర్నరు పరిష్కరింపవలయును. ఏ శాఖకు ద్రవ్యము కావలయునో ఆ శాఖ మంత్రియే సాధారణముగా చట్టమును ప్రవేశపెట్టిన మంచిది.

ఆర్థికవిషయములు

25. ఈపద్ధతివలన చాలలాభములు గలవని నా అభిప్రాయము సంస్కరణములందలి యీ సూచనలపట్ల భారతదేశమున విమర్శ లేమియు జరుగలేదని నాతోడి సభ్యులు చెప్పుచున్నారు. అటులైనయెడల ఈ విధానమున నేమియు మార్పులు చేయగూడదని నా అభిప్రాయము. ఆర్థికపట్టిక నిరాకరించుటకు మంత్రులకు స్వాతంత్ర్యము లేకపోయినను ఈవాదమును బలపఱచుటకుముందు ప్రజాయత్తశాఖలకును తగినంత ధనము నీయక నే అధికారాయత్తశాఖల ధనమును హెచ్చుచేయుటకు గవర్నరుగారికి అధికారముగలదని గ్రహింపవలయును. గవర్నరుగారే ఈవిషయమున అధికారమును చెలాయింపదలంచినయెడల ఇతరత్ర గూడ ఆయన తన కార్యమును నిర్వహించుటకు వీలున్నదని మనము గ్రహింపవలయును. ఒక్క విషయ

మాలోచింపుడు. అధికారశాఖావ్యయముల విషయమున మంత్రుల దయాపాత్రములకు లోబడియుండవలసి యుండు నని నా తోడి సభ్యుల వాదము. ఈ వాదము నంగీకరించిన యెడల మంత్రులకును కార్యనిర్వాహకవర్గము వారికిని సర్వదా కలతలు గలుగుచుండును. మంత్రులమీద అధికారము గల గవర్నరు—నా తోడిసభ్యులు ఈయన అధికారము లెక్కువచేయ వాంఛించుచున్నారు.—అధికారాయత్తి శాఖలకు అవసర మైనను మంత్రుల స్వాధీనములో నున్న ధనమును తగ్గించిన నేమి గతి? ఈ వాదములవలన పరిపాలన సులువుగ జరుగుట బహుకష్టతరము.

26. అధికారాయత్తశాఖలకు వచ్చు ఆదాయము, ఆశాఖాపరిపాలనమునకు కావలసినధనము పోగా చాల మిగులగలదు. పూర్వము సయితము ఈ శాఖకు ద్రవ్యము బదులు పుచ్చుకొనుట అవసరము లేకుండెను. కావున ముందు సయితము ధనము బదులు పుచ్చుకొనుట అనవసరము. కొంతకాలమువరకు కావలసిన ఆదాయమును ఏదో విధముగ నిర్ణయించుకొని బడ్జెటు చర్చను నాపుదలచేయ నా తోడి సభ్యులు సూచించుచున్నారు. ఈ సూచన న్యాయరీత్యా శాసనసభకు ఆర్థికవిషయములందు గల స్వాతంత్ర్యమును నామావశిష్టము చేయగలదు. ఈ విధానమువలన క్రొత్తపన్నులు వేసికొనుటకును సొత్తును బదులు పుచ్చుకొనుటకును మార్గ మేర్పడి అనవసరచర్చలకు లేని పోని సంఘర్షణలకు వీ లేర్పడగలదు. నా తోడిసభ్యులు ప్రతిచోటను మంత్రులపై తగిన అధికారమును చెలాయించుటకు ఎన్నియో సూచనలను చేయుచున్నారని నేను గట్టిగా చెప్పగలను. మంత్రులు చేయుకార్యములందు గవర్నరు జోక్యము పుచ్చుకొనుటకు వీలు లేనందునను మంత్రులకును కార్యనిర్వాహకవర్గమునకును వివాదము కలిగినపుడు గవర్నరు ఆ వివాదమును పరిష్కరించుటకు ఏర్పాట్లు లేవనియు నా తోడిసభ్యులు భావించి అందువలన చాల చిక్కులు కలుగునని వారు తెలిపియుండిరి. ఈ చిక్కుల కన్నిటిని తగిన సమాధానము సంస్కరణ నివేదికయందలి సూచనలే తెలుపుచున్నవని నా అభిప్రాయము.

27. ప్రథమమున ఆర్థిక ఆదాయ వ్యయ పట్టిక విషయ మాలోచించి, సాధారణ స్థాయి యుత్తరువులవలనను, హిందూ దేశాంగమంత్రివలనను, రాష్ట్రీయప్రభుత్వమునకు గల నిర్బంధము లేవియో కనుగొందము. ఒక నిర్ణీతమగు జీతమునకు ఇంగ్లీషు అధికారిని నియమించుటకును, సాధారణముగా ఇంగ్లీషు అధికారిచే ఆక్రమింపవలసిన క్రొత్త యుద్యోగస్థానమును నిర్మించుటకును, నిర్ణీత మగు మాసవేతనముతో క్రొత్త యుద్యోగస్థానమును నిర్మించుటకు, వెయ్యిరూపాయలకన్న నెక్కువగా గౌరవభృతి యీయవలసి యున్నను, లేక ప్రత్యేక పరిస్థితుల ననుసరించి భూమిని మంజూరు చేయుటకుగాను హిందూదేశాంగమంత్రి యుత్తరువు కావలసియుండును. పౌరసేవాసందర్భమున మోటారు బండిని కొనవలసియుండిన దానికిని హిందూదేశాంగమంత్రి అనుమతి కావలయును. ఉదాహరణ పూర్వకముగా చూపెట్టిన ఈ విషయములే కాక, దేశాంగమంత్రి ఆమోదమును బడయవలసిన కార్యము లెన్నియో గలవు. ఈ నిర్బంధములు రాష్ట్రీయప్రభుత్వములు తమ చేతుల లో నున్న అధికారములను జాగరూకతతో నిర్వహించుకొనుటకే ప్రవేశపెట్టబడినవి. ముందు సయిత మీ నిర్బంధము లుండుట అవసరమనియె చెప్పవచ్చును. ఈ విధానమువలన స్థానికప్రభుత్వములు వెయ్యిరూపాయల జీతమునకు పైన తెచ్చుకొను అధికారులను నియమించుటకు అధికారము నిచ్చుచున్నాము. భారతప్రభుత్వమువారితోను భారతదేశాంగమంత్రితోను సంప్రతింపకనే లక్షలకొలది రూపాయల వ్యయములతో నుండు స్కీములను సయితము నిర్వహించుటకు స్థానికప్రభుత్వములకు అధికారము నిచ్చుచున్నాము. శిస్తును చెల్లించువారి శ్రేయమును భారతప్రభుత్వము, హిందూదేశాంగ మంత్రులు చూడవలయు నని తలంచినయెడల స్థానికప్రభుత్వమువారు చేయు కార్యమును బాగుగా పరీక్షించుచు, ప్రజలకు పరిపాలనమున స్వాతంత్ర్య మిచ్చుటకు ఆ నిర్బంధమును రద్దుచేయవచ్చును. ఉద్యోగుల సంఖ్యను హెచ్చుచేయు విషయమున కర్జను ప్రభువుగారును, ఈ విషయము నాలోచింపవలసి వచ్చిన ఇతర పరిపాలకులును ఈ అభిప్రాయమునే వ్యక్తీకరించియుండిరి. ఆర్థికవిషయముల పట్ల శాసనసభకు గల అధికారమును తీసివేయుట అటులుండ భారతప్రభుత్వమువారియొక్కయు భారతదేశ మంత్రియొక్కయు నిర్బంధములను తొలగించినయెడల సంస్కరణనివేదికయం దుదాహరింపబడిన ప్రకారమునకన్నను శాసనసభకును, మంత్రులకును, ఎక్కువ అధికారము లీయవలసియుండును. భారతీయులకు ఉద్యోగములకు అవకాశము లిచ్చుటకుగాను ఇంగ్లీషు యుద్యోగముల నియామకములపట్ల భారతప్రభుత్వము భారతదేశాంగమంత్రులకు అధికారము లీయబడియున్నవి.

పరిశ్రమలను అభివృద్ధిచేయుట, న్యాయశాఖను కార్యనిర్వాహకవర్గమునుండి విభజించుట, శాసనసభాంగీకారములేనిదే శిస్తును వేయుట అను విషయములను తీసికొనుడు. ఇవన్నియు ఆర్థికవిషయములకు సంబంధించినవి. రాజ్యాంగనివేదికయందలి ప్రణాళికప్రకారము ఈ విషయములలో ప్రభుత్వమువారి అభిప్రాయములను మార్చుటకు శాసనసభలకు అధికార మీయబడియున్నది. భారతప్రభుత్వము వారి సూచనలు ఈ విషయములలో శాసనసభలకును, మంత్రులకును నేమియు పలుకుబడిలేకుండ చేయగలవు. కావున ఈ సూచనలు సయితము నివేదికయందలి ప్రణాళికకు వ్యతిరిక్తములుగా నున్నవి. ఈ విషయములపట్ల ప్రజలకుగల పట్టుదలను నాతోడిసభ్యులు మఱచిపోయిరని తలంచెదను. ఈ విషయములవలన గలిగిన పర్యవసానములను సయితము వారు పూర్తిగా మఱచియుండిరని నా అభిప్రాయము. ఈ విషయములపట్ల దేశీయసభలో నేమియు భేదాభిప్రాయములు లేవు. హిందూ దేశాంగమంత్రికిని, రాజప్రతినిధికిని దేశీయసభవారు సమర్పించిన పత్రములలో ఈవిషయములు ప్రధానములై యున్నవి.

ఈ సంగతిసందర్భములనుబట్టి నిర్బంధములను తొలంగించిన యెడల ప్రజలద్రవ్యము వృథాగా వ్యయము కాగలదనియు దేశమున

అసంతృప్తి యెక్కువగా వ్యాపింపగలదని నా నిశ్చితాభిప్రాయము. కావున నాతోడిసభ్యుల అభిప్రాయమును నిరాకరించి, పన్నులవిషయమునను ఆర్థికపట్టికవిషయమునను నివేదికయందలి ప్రణాళికయందు గల సూచనల నంగీకరించుచు సాధారణరీత్యా కార్యసాధనము కొనసాగించుకొనజాలనప్పుడు గవర్నరు అధికారములను చెలాయింపగూడదనియు, హిందూదేశాంగమంత్రియుత్తరువు లేనిదే అధికారాయత్తశాఖల శ్రేయోభివృద్ధికిగాను గవర్నరు క్రొత్తనిబంధనలను చేసికొనగూడదనియు నేను సూచించుచున్నాను. ఈ సందర్భమున ప్రజాయత్తశాఖల మంత్రిని తొలగించుటకు కార్యనిర్వాహకవర్గమునకు అధికారమున్నదనియు, మంత్రి అట్టి యధికారమునే కార్యనిర్వాహకవర్గముపట్ల చెలాయించుటకు స్వాతంత్ర్యము లేదనియు గ్రహింపవలయును.

28. ఆర్థికవిషయము నటుండనిచ్చి, ప్రజాశాంతివిషయము నాలోచించెదను. రాజద్రోహము బొంబయిలోనె పుట్టినదని చెప్పిన యెడల, కలక్టరొకరుచేసిన చట్టములప్రకారము పరిపాలనము చక్కగా జరుగకపోవుటయే దీనికి పునాదియనియు, ప్రభుత్వమున హైందవుల పలుకుబడికి నావకాశ ముండినయెడల ఇది జరుగకనే యుండియుండుననియు గ్రహింపవలయును. ఆవిధముగానే వంగదేశమున అరాజకము ప్రారంభమగుటకు తూర్పుబంగాళమున క్రమపరిపాలనము జరిగియుండినయెడల ఈకష్టములు కలిగియుండెడివి కావు. మన మిటీవల నంగీకరించిన శాసనము, ఇంకను మఱికొన్ని నిబంధనల ననుసరించి రాష్ట్రములో కార్యనిర్వాహకప్రభుత్వమువారు ఏ మనుజుని యొక్కయు శరీరస్వాతంత్ర్యమును వాక్స్వాతంత్ర్యమును, న్యాయస్థానములతో నిమిత్తములేకుండ తొలగింపవచ్చును. వార్తాపత్రికాస్వాతంత్ర్య మటులనే తొలగింపవచ్చును. రాష్ట్రపుగవర్నరు తన నెదిరించినవారికి శరీరస్వాతంత్ర్యమును తొలగించి న్యాయస్థానముల యెదుట నేరములు రుజువుచేయ నవసరములేకుండ ఆస్తినిగూడ వశపఱచుకొనవచ్చును. ఈశాసనముక్రింద ఏ వార్తాపత్రికయు రాష్ట్ర అధికారికి సరిపడని విమర్శనములను కావించుటకు సాహసింపదు. సివిలుసర్వీసువారికి గాని అధికారవర్గమువారికి గాని వ్యతిరేకముగా జరిగెడి యే యాందోళనమైనను రాష్ట్రాధికారి సివిలుసర్వీసువారైనంతవఱకు జరుగుటకు సాధ్యపడదు. హోమురూలు ఆందోళనముగాని శాసనబద్ధమగు మఱి యే ఆందోళనము గాని కార్యనిర్వాహకప్రభుత్వమువారిచే అణచివేయబడవచ్చును అందువలన రాష్ట్రప్రభుత్వమునందు భారతీయులకు ఎక్కుడధికార మీయవలయునని నే గోరుచున్నాను. లేనిచో శాసనసభలు నిరుపయోగములై అధికారులకును అనధికారులకును విభేదములు అతిశయించి అనర్థము గలుగును.

గ్రాండుకమిటి

29. ప్రజాశాంతిక్షేమములకుగాను గవర్నరుగారు తన బాధ్యతను నిర్వహించుటకు అధికారాయత్త శాఖావిషయములను చర్చించుటకు శాసనసభాసభ్యులతో గ్రాండుకమిటి నొకదానిని నిర్మించుటకు నిర్ణయింపబడినది. అధికసంఖ్యాకు లగు శాసనసభాసభ్యులు అధికారాయత్తవిషయములను శ్రద్ధగా చర్చించుటకు వీలుండదనియె ఈ గ్రాండుకమిటి నిర్మింపబడినది. దేశీయులు రాజకీయ విషయములలో పాలుగొనుచుండుట లేదనియు అందువలన, భూస్వామికిని, వాని తాబేదారునకును సంబంధించు కలతలు పరిష్కరించు అధికారము కార్యనిర్వాహకప్రభుత్వమునకే యుండవలయు నని సూచింపబడినది. ఇట్టి అధికారము బ్రిటిషు వర్తకలాభము, పరిశ్రమలను గురించిన ఇతర ప్రశ్నలను సంరక్షించుటకు అవసర మని చెప్పబడినది. జాతులమధ్య పెరిగెడి సమస్యలను సామాన్యపు శాసనసభలకు విడువగూడదని తెలుపబడినది. ఇట్టి అనాధార శాఖాధికారములు సుపరిపాలనమున కవసరమా యని సందేహింపవచ్చును. మన నియోజకవర్గములు విశాలవంత మగుచున్నవి. పలువిధము లగు అభిప్రాయములకు అందు ప్రాతినిధ్యము కలుగును. ఇట్టి స్థితిలోనే ప్రభుత్వమువారికి అధిక సంఖ్యల సమ్మతులు చేకూరని యెడల వారు పొరపడిరని తలచుట కవకాశము గలదు. శాసనసభపై నిరోధముగ గ్రాండుకమిటి పనిచేయును. అందుచే ఈ ప్రతిష్ఠాపనము వాంఛనీయము గాదు. కార్యనిర్వాహక సభకును శాసనసభకును లేనిపోని పోరాటములను కల్పించును గాన దానిని నెలకొల్పుట భావ్యము కాదు. సామ్రాజ్యశాసనసభకు గల అధికారము గవర్నరు వైస్రాయిగార్లకు ఏ చట్టము లైనను ప్రతిఘటించుటకు గల అధికారములను తగిన సంరక్షణోపాయములను నొసగుచున్నవి. ఇండియా గవర్నమెంటువారు శాసనము చేయుటకు ఆక్షేపణలు సంస్కరణ నివేదికయందు వివరింపబడినవి. అట్టి అధికారము రాష్ట్రీయస్వాతంత్ర్యమునకు భంగము కలిగించు నని మొదటి యాక్షేపణ హార్డింజిగారి డిల్లీ ప్రకటనమునందు సూచింపబడిన రాష్ట్రీయస్వాతంత్ర్యము ప్రజాధికారము నెచ్చించుటకు ఉద్దేశింపబడినది. కాని రాష్ట్రీయస్వాతంత్ర్యము శాసనసభపై కార్యనిర్వాహకప్రభుత్వమువారి యధికారము నెచ్చుచేయుటకు నుద్దేశించినచో మాకు దానితో నిమిత్తము లేదు. ప్రజాధికారము హెచ్చినకొలది సామ్రాజ్యప్రభుత్వమువారి యొక్కయు ప్రభుత్వకార్యదర్శి యొక్కయు అధికారమును రాష్ట్రప్రభుత్వములపై తగ్గింపవచ్చును. అందుచే రాష్ట్రీయశాసనసభ యే శాసనము నైనను కావించినపుడు పై ప్రభుత్వములు దానితో జోక్యము కలుగజేసికొనకుండ నుండుట సమంజసము. కాని శాసననిర్మాణసభ వారు నిరాకరించిన శాసనమును కార్యనిర్వాహకప్రభుత్వమువారు గ్రాండుకమిటీద్వారా దానిని తిరిగి అంగీకరించుట న్యాయసూత్రమునకు విరుద్ధము. ఇందులో నిజమగు రాష్ట్రస్వాతంత్ర్య మేమియు లేదు. కార్యనిర్వాహకప్రభుత్వమువారి యిష్టమును చేకూర్చుటకు గ్రాండుకమిటి యుపయోగింపబడుచుండును. అందుచే శాసనసభ తిరస్కరించిన తీర్మానములను తిరిగి అంగీకరించుటకు గ్రాండుకమిటి కార్యనిర్వాహకవర్గమువారికి ఒక సాధనముగ నుండును. రాష్ట్రప్రభుత్వము శాసనసభకును సామ్రాజ్యప్రభుత్వమునకును కూడ లోబడియుండదు. నేను సూచిం

చిన సూచనప్రకారము సామ్రాజ్యప్రభుత్వమువారి అధికారము నిలిచియే యుండును.

ఇండియా ప్రభుత్వమువారు శాసనబాధ్యతను వహించుటకు ఇష్టపడరను రెండవ ఆక్షేపణ సరియైనది కాదు. స్థానిక కార్యనిర్వాహక ప్రభుత్వము నైనను సామ్రాజ్యశాసనసభయం దైనను, శాసనము గావించుట రాష్ట్రపుకోరికలను తృణీకరించుటకే. అట్టి స్థితిలో సామ్రాజ్యప్రభుత్వమువారు కార్యనిర్వాహకప్రభుత్వమునకును శాసనసభకును మధ్యవర్తులుగ నుందురు. ఈ కార్యము నెవరైన నొకరు చేయవలసినదే. స్థానిక కలవరములకు దూరముగా నున్న సామ్రాజ్యప్రభుత్వమువారు చేయుటయే మంచిది. గ్రాండుకమిటీలో ప్రజానియుక్తసభ్యుల సంఖ్యను తగ్గించుటకు కూడ నే నంగీకరింతును.

30. రాష్ట్రాధికారులు లెఫ్టినెంటు గవర్నర్లకన్న గవర్నర్లుండుటయే మేలని అంగారకు మన మందఱము అంగీకరించినదే. కాని నా తోడిసభ్యులు సివిలుసర్వీసువారిచే ఈ పనులకు నియమింపవలయు నని తెలిపిన సూచనతో నే నేకీభవింపజాలను. కార్యదర్శిగారు ఈ నియామకము చేయుటలో సమర్థత నాలోచింపవలయును. సివిలుసర్వీసువారు సంస్కరణములకు సామాన్యముగా ప్రతికూలురని తెలిసిన విషయమే. భారతీయులు పరిపాలనాధికారము వహించుటకు సమర్థులు కారని వీరు పట్టుదలతో నుడువుచుందురు. వీరిలో చాలమంది భారతీయులతో కలసి పనిచేయుట కంగీకరింపరు. అందుచేత ప్రభుత్వకార్యదర్శి నియామకము చేయునపుడు ఈ ప్రశ్నలను గమనింపవలయు. భారతీయుల అభివృద్ధితో సానుభూతి గలవారే మున్ముందు ఉద్యోగపదవిని నిర్వహింపగలుగుదురు. అందుచేత ఇదివఱకున్న పద్ధతినే కొనసాగింపవలయు ననుట భావ్యము కాదు.

31. కార్యనిర్వాహకసభ్యుని అర్హతలను గూర్చి కూడ ఇట్టి ప్రశ్న యుదయింపక మానదు. సంస్కరణ నివేదికబట్టి ఒకసభ్యుడు భారతీయుడుగను మరియొకరు పండ్రెండు సంవత్సరముల అనుభవము గల యుద్యోగిగను నుండవలసి యుండును. దీనిని శాసనము ద్వారా స్థిరపరుపవలయు నను నుద్దేశము రిపోర్టులో ఉన్నట్లు కనపడదు. ప్రస్తుతము ఉద్యోగము సివిలుసర్వీసువారికి ప్రత్యేకింపబడినది. కాని అవసరములబట్టి ఇతరులను నియమింపవలసి వచ్చును. ప్రభుత్వకార్యదర్శి అట్టివారిని నియమించుటకు ఏల అభ్యంతరముగ నుండవలయునో నాకు తెలియదు.

32. ప్రతిశాసనసభకును తన కార్యక్రమనిబంధనలను చేసికొనుటకు అధికార ముండవలయునా అను విషయము నాలోచించెదను. ప్రతిసభకును అట్టి అధికార ముండి తీరవలయును. దీనికి అధ్యక్షుని యిష్టమెందులకో నాకు తెలియకున్నది.

ఇండియా ప్రభుత్వము

33. తరువాత బాధ్యతాయుతప్రభుత్వవిషయము ముఖ్యమైనది. రాష్ట్రప్రభుత్వములందువలె శాసనసభకు జవాబుదారిగా నుండు భారతమంత్రి ఇండియాప్రభుత్వమున నుండగూడదని నివేదికయందు గలదు. రాష్ట్రప్రభుత్వమున ననేకశాఖలు భారతమంత్రులలో నుంచు ననియు ఈవిధానమున జయాపజయములు పరీక్షించినగాని ఇండియా ప్రభుత్వమునందలి శాఖలు భారతమంత్రుల యధీనమున నుంచుట సాధ్యము కాజాలదని యీసూత్ర మనుసరింపబడినది. దేశశాంతి, సంధి, విదేశసంస్థానములు, సేన నావికావిషయములును ఆంగ్లభూమికి సంబంధించిన విషయములును ఈశాఖల యధీనములో నుండగలవు. మంత్రులకును శాసనసభకును సంబంధించు దేశపరిపాలనావిషయములును నీ శాఖాధికారమున నుండగలవు. ఈవిషయములలో భారత ప్రభుత్వమునకు కొంత బాధ్యత యుండవలయును. అందువలన వారు ప్రజాయత్తశాఖలలో జోక్యము పుచ్చుకొనవచ్చును. కాని భారతప్రభుత్వమున బాధ్యతాయుతపాలనమును ప్రవేశపెట్టుటకు వారెందులకు అభ్యంతరము పెట్టుచున్నారో నాకు తెలియకున్నది. నివేదికలో సూచింపబడిన సూత్రములు జయప్రదములుగా నిర్వహింపబడవలయుననిన బాధ్యతాయుత ప్రభుత్వము అత్యవసరము. దేశమున శాసనవిషయమున సమానత ఉండుటకును రాష్ట్రీయప్రభుత్వమునందలి ప్రజాయత్తశాఖలతో ఇండియాప్రభుత్వమువారు జోక్యము పుచ్చుకొనుటకు నధికారయ తీయబడియేయున్నది. ఇతరరాష్ట్రములకు సంబంధించువిషయములలో సయితము ఇండియాప్రభుత్వమునకు అధికార మీయబడియేయున్నది. ఈవిషయము లన్నియు మంత్రులు శాసనసభలతో సంప్రతించుకొని నిర్వహింపవలసిన కార్యములు. కావున నిండియాప్రభుత్వమువా రిట్టి కొద్దిస్వాతంత్ర్యమును మంత్రులనుండి తీసివేయుట బాగుగ నుండలేదు. భారతప్రభుత్వమువా రీవిషయములలో మంత్రులు శాసనసభలతో సంప్రతించుకొని పనిచేయుటకు స్వాతంత్ర్య మిచ్చినయెడల శ్రేయోదాయకముగ నుండగలదు. అవసరమైనయెడల కార్యనిర్వాహకవర్గపు భారతసభ్యుడు ఈ విషయములలో జోక్యముపుచ్చుకొని పనిచేయుటకు భారతమంత్రిగ నుండవచ్చును. తాత్కాలికకారణములవలన కొన్ని విషయములు ప్రజాయత్తముచేయుటకు వీలులేదని తలంచినయెడల మూడు నాలుగుసంవత్సరములు వీనిని మనము ప్రజాయత్తము చేయవలయు నని కోరుచుండినయెడల, ఈ విషయములలోనైన బాధ్యతాయుత ప్రభుత్వమును ప్రవేశపెట్టుట కెందుల కభ్యంతర మున్నదో నాకు తెలియకున్నది. రాష్ట్రప్రభుత్వములలో ఏశాఖలలో మనము బాధ్యతాయుతప్రభుత్వమును ప్రవేశపెట్టుచున్నామో, అట్టి శాఖలలో భారతప్రభుత్వమున బాధ్యతాయుతప్రభుత్వము నీయకున్న రాష్ట్రబాధ్యతాయుతపాలనము లాభవంతము కాజాలదు.

స్టేటుకౌన్సిలు

34. తరువాత ఆలోచింపదగినది స్టేటుకౌన్సిలు. శాసనసభలో ముందుగ చర్చింపకుండ కార్యనిర్వాహకప్రభుత్వము స్టేటుకౌన్సిలునందు చట్టములుచేయుటకు నే నామోదింపజాలను. గవర్నరు జనరలు అవసరములనుబట్టి చట్టములను చేయుటకు అధికారముగలదు. ఈ చట్ట

ములు ఆరునెలలకాలము అమలులో నుండవచ్చును. ప్రజాభిప్రాయమును కనుగొనుటకు శాసనసభలో చట్టమును గవర్నరు జనరలే ప్రవేశపెట్టవచ్చును. చట్టముపట్ల ప్రజాభిప్రాయము కనుగొనుట అనవసరమని గవర్నరు జనరలు కార్యనిర్వాహకవర్గము తలంచినయెడల వానిని శాసనము (ఆర్డినెన్సు) గా చేయవచ్చును. కావున స్టేటుకౌన్సిలు అనవసరము.

శాసనసభయందు తగిన ప్రాతినిధ్యము లేనివారికి స్టేటుకౌన్సిలు నిర్మించుట అవసరమని తలంచినయెడల నాకేమియు అభ్యంతరము లేదు. ఒకచట్టము శాసనమగుటకు కొంతకాలము వ్యవధియుండుటకుగాను స్టేటుకౌన్సిలు అవసరమని తలంచినయెడలను నాకేమియు అభ్యంతరములేదు కాని ఈ కౌన్సిలు ఈకార్యములకుగాను నెలకొల్పబడి యుండలేదు. కార్యనిర్వాహకవర్గమువారొక చట్టముపట్ల శాసనసభవారు వ్యతిరేకముగా నుందురని తలంచినయెడల దాని నెటులైన శాసనముగా చేసికొనుటకే ఈ క్రొత్తసంస్థను నెలకొల్ప దలంచుకొనినారు. దీనివలన మనకేమియు లాభములేదు. కావున ఈ క్రొత్తసంస్థను నిర్మించుటకన్నను నిరంకుశముగా చట్టములు చేసికొనుటకు కార్యనిర్వాహకవర్గమువారికి అధికారములిచ్చిన మంచిది. ప్రజామోదమును సంపాదించుచున్నామని స్టేటుకౌన్సిలుద్వారా చట్టములు చేయునటులు వారు సతతము చేయజాలరు. స్టేటుకౌన్సిలు శాసనసభాస్వాతంత్ర్యమును నాశముచేయగలదు. చాల సంఘర్షణము కలుగగలదు.

ఇంకొక అభ్యంతరము గలదు. ప్రజాప్రతినిధులు పరిష్కరింపవలసిన విషయములలో కార్యనిర్వాహకసంఘమునకు సంపూర్ణస్వాతంత్ర్య మీయగూడదు. ఇట్టి సంపూర్ణస్వాతంత్ర్యములవలన అనేకానర్థములు కలిగినవి. కార్యనిర్వాహకవర్గమునకు ఈ విషయములలో స్వాతంత్ర్యమిచ్చినయెడల ఆ విషయములలో ప్రజాభిప్రాయమును బొందుట అసంభవము. పరిపాలనావిషయమున శాసనసభలలో చర్చింపవలసిన సంస్కరణములు ఎన్నియో గలవు. అధికారవర్గమువారి వ్యతిరేకతవలననే ఈ సంస్కరణములు కొనసాగినవి కావు. కావున ఈ సంస్కరణము లేవియో ముందొకసారి ఉదాహరించియుంటిని. పూర్వపు సాంప్రదాయములను బట్టి స్టేటుకవున్సిలు ఇట్టి సంస్కరణములను ఆమోదింపజాలదు. కావున ప్రస్తుతపువిధానముల ననుసరించి నెలకొల్పబోవు స్టేటుకవున్సిలువలన లాభములేదు. ఇదియు గాక పై విషయములలో శాసనసభ కేమియు బాధ్యత యుండగూడదని నివేదికయం దుదాహరింపబడియేయున్నది. కావున నన్ని విషయములలోను చట్టము లన్నియు శాసనసభాంగీకారమునకు పంపవలయును. శాసనసభ వాని నంగీకరింపజాలక పోయినయెడల ఆ చట్టములకు సంబంధించిన కాగితము లన్నిటిని కామన్సుసభకు పంపవలయును. కామన్సుసభ యొక యుపసంఘమునకు వానిని బంపి సదరు కాగితముల నన్నిటిని ఆలోచింపగోరును. వారి యుత్తరువులను పొందిన తరువాతనే కార్యనిర్వాహకసభ గాని, స్టేటుకవున్సిలు గాని ఆ విషయములలో పనిచేయగూడదు. ఈ విషయమున విధానములు రెండు సూచింపబడినవి. ప్రత్యేకవిషయములలో సర్టిఫికేటు మంజూరుచేయు అధికారము, శాసనసభలోని కొంతమంది సభ్యులచే నిరాకరింపబడిన చట్టములపట్ల గల సర్టిఫికేట్లను రద్దుచేయుటకును అధికారము గవర్నరు జనరలుగారి కుండవలయును.

స్టేటు కవున్సిలును తీసివేయుటకు వీలులేక పోయినయెడల దాని అధికారమునైనను తొలగించుట అత్యవసరమని నా అభిప్రాయము.

ఆర్థికపత్రము

౩౫. ఈ విషయమున ఇండియా ప్రభుత్వమువారికి అధికారముల నిచ్చుటకు సూచింపబడినది. ఇంతవఱకును, భారతదేశపు పన్ను చెల్లించువాని శ్రేయోదాయకము కొఱకు భారతదేశాంగ మంత్రి ఆమోదము, లేకనే భారతప్రభుత్వమువారు సొమ్మును వ్యయముచేయుటకు అధికారము గలిగియుండగూడ దని కొన్ని నిబంధనలు పూర్వము కలవు. కాని నివేదికయందలి సూచనలప్రకారము బాధ్యతాయుత ప్రభుత్వము ప్రజలకు లేకపోయినను, భారతప్రభుత్వమువారి పట్ల నిర్బంధములు తొలగింపబడును. నేను ముందు సూచించిన ప్రకారము పన్ను చెల్లించువారి శ్రేయోదాయకముకొరకు భారతదేశాంగమంత్రి కొన్ని కట్టుదిట్టములను చేయుట అత్యవసరము. అట్టి బాధ్యత ఇక ముందు శాసనసభకుండి ప్రభుత్వపు ఆర్థికపట్టికవిషయములలో శాసనసభాసభ్యుల సూచనలు అంగీకరింపబడిన గాని లాభదాయకము కాజాలదు.

ఇతరవిషయములు

౩౬. పార్లమెంటు నందువలె సహాయకార్యదర్శులను స్థాయిసంఘములను, నియమించు విషయమున నాతోడిసభ్యులకు గల వ్యతిరేకాభిప్రాయముతో నే నంగీకరింపజాలను. క్రొత్తప్రణాళిక ప్రకారము అనధికారసభ్యులు అధికారమునం దుండిన గాని ప్రభుత్వవిషయములు గ్రహించుట కష్టతరము. పౌరసేవోద్యోగము లందలి హైందవులవలె, ప్రభుత్వమువారి సూచనల విమర్శించుటకు అనధికారసభ్యులకు సామర్థ్యముండుట కష్టతరము. ప్రజాయత్తవిషయములలో మంత్రులకు మాత్రము సంగతిసందర్భములు తెలియగలవు. అవియును రాష్ట్రములందే సహాయకార్యదర్శుల నియామకమువలనను స్థాయిసంఘనిర్మాణమువలనను అనధికారసభ్యులు ప్రభుత్వమునందలి సంగతిసందర్భములను కనుగొనుటకు వీ లుండగలదు. ఈ విధానమువలన ముందు పరిపాలకులను సిద్ధముచేయుటకు వీలుండగలదు. కావున ఈ సూచనలను నిరాకరింపగూడదు. సామ్రాజ్య, రాష్ట్ర శాసనసభాకార్యక్రమములపట్ల నిబంధనలను చేసికొనుటకు శాసనసభలకే స్వాతంత్ర్య మిచ్చితీరవలయును.

37. రాజప్రతినిధి భారతదేశాంగమంత్రులకు సమర్పింపబడిన విజ్ఞప్తిపత్రములలో ప్రతివారును సామ్రాజ్య, రాష్ట్రకార్యనిర్వాహకసభలయందు సగముమంది సభ్యులు భారతీయులుగ నుండ

వలయునని వాంఛించియున్నారు. కాంగ్రెసు, ముస్లిము లీగువారు, సిక్కులు, మదరాసు బ్రాహ్మణేతరులు ఈ సంస్కరణమును కోరి రే యున్నారు. ఈ కోరికలకు కారణము లందఱకు తెలిసియే యున్నవి. కార్యనిర్వాహక సంఘమునందు భారతీయులకు ప్రాతినిధ్యముండిన గాని దేశపరిపాలనమునకు కావలసిన ముఖ్యసంస్కరణములు విజయవంతములు కాజాలవు. ఆర్థికవిషయములకు సంబంధించు విషయములు ఎన్నియో గలవు. భారతప్రభుత్వము, హిందూదేశాంగ మంత్రి కార్యనిర్వాహకసభ్యులతో సంప్రతించుకొని ఈ విషయములను పరిష్కరింప వలసియుండును. భారతప్రభుత్వమున భారతీయులకు తగినంతప్రాతినిధ్య ముండిన గాని, భారతీయాశయములను కొనసాగించుకొనుట కష్టతరము. ప్రజోద్యమము పట్ల భారతప్రభుత్వ కార్యనిర్వాహక వర్గము వ్యతిరేకముగా గాని నిరంకుశాధికారముగా గాని ప్రవర్తించుటకు వీలులేకుండ చేయుటకై పాలనమునందు భారతీయులప్రాబల్యము అవసరము. కావున గవర్నమెంటువారు సూచించిన ఒక రిద్దరు భారతీయసభ్యులు కాక ఒక రిద్దరిని కూడ నియమింపవలయు నని నేను సూచించుచున్నాను. ఇందులకు ప్రభుత్వమువా రంగీకరింపనియెడల రాష్ట్రములందు ప్రజాయత్తము చేసిన శాఖల పరిపాలనావ్యవహారముల విషయమై భారతప్రభుత్వమువారు చెలాయింపవలసిన నియంత్రణాధికారమును చెలాయించుటకు భారతీయుల నొకరిని మంత్రిగా నియమింపవలయు నని కోరుచున్నాను. ఈ వ్యవహారముల విషయమై వారితో సంప్రతింపవచ్చునే గాని, వారితో యోచించి వ్యవహారములను పరిష్కరింప నక్కరలేదు.

డిల్లీ, మార్చి 5. సి. శంకరనాయరు.

చాంపరాను, కెయిరా తగాదాలు

శంకరనాయరుగారు తమ భిన్నాభిప్రాయప్రకటనమునందలి కొన్నిచోట్ల, అధికారులు ప్రజాభిప్రాయము పట్ల చూపుచుండు నిరాదరణమును గురించి వ్రాయుచు, దానికి దృష్టాంతములుగా చాంపరాను, కెయిరాతగాదాల నుదాహరించియుండిరి. అనుబంధమునందు శంకరనాయరుగారు చాంపరాను, కెయిరా తగాదా లెట్టివో యీ విధముగా సూచించుచున్నారు.

చాంపరాను తగాదా

చాంపరాను నీలితోటల యజమానులకును రైతులకును చాల కాలమువఱకు స్నేహభావ మంత తృప్తికరముగా నుండి యుండెడిది గాదు. కొన్ని కలతలు కూడ జరిగినవి. వీని సంగతిసందర్భములను కనుగొనుటకు గాను గోర్లేగారిని ప్రభుత్వమువారు ప్రత్యేకాధికారిగ నియమించిరి. ఆయన వ్రాసిన నివేదిక రైతుల కనుకూలముగా నున్నందున, దానిని ప్రకటించుటకు నిరాకరించిరి. ప్రభుత్వమువారు తోటల యజమానులతో సంప్రతించి, వారికి అధికారములు చెలాయించుటకు స్వాతంత్ర్యమిచ్చియుండిరి. రైతు లంత అసంతృప్తిపడ వలసిన కారణము లేవియు లేవని ప్రభుత్వమువారి యభిప్రాయము. 1913 సం॥ మార్చి నెలలో బిహారపు శాసననిర్మాణసభాసభ్యులొకరు ఈ సంగతిసందర్భముల కనుగొనుట కొక విచారణసంఘమును నెలకొల్ప గోరియుండిరి. ఈ విషయములు స్థానికాధికారులు పరిష్కరించుకొనవలసినదే గాని, తా మేమియు నందు జోక్యము పుచ్చుకొనజాల మని ప్రభుత్వమువా రీసభ్యుని కోరికకు ప్రత్యుత్తర మిచ్చిరి. రెండేండ్లకాలము సంగతిసందర్భములు యథాప్రకారముగానే యుండెను. 1915 సం॥ జనవరినెలలో ఈవిషయమునుగురించి శాసనసభలో ప్రశ్నలువేయబడినవి. ఈవిషయములలో సత్యాసత్యములు కనుగొని నివేదికను బంప స్థానికాధికారులను కోరియుంటి మని ప్రభుత్వమువారు జవాబిచ్చిరి. ఆ సంవత్సరము ఏప్రియలునెలలో విచారణసంఘము నొకదానిని నెలకొల్ప శాసనసభలో మఱల నడుగబడినది. విచారణసంఘముకన్న స్థానికాధికారులే ఈ విషయముల నాలోచించుటకు తగిన సమర్థులని ప్రభుత్వమువారు ప్రత్యుత్తర మిచ్చిరి. ఆ సంవత్సరము, మరుసటి సంవత్సరమునందు సయితము ప్రభుత్వమువా రీ విషయమున నేమియు చర్యను దీసికొనలేదు. తరువాత కాంగ్రెసువా రీ విషయమున జోక్యము పుచ్చుకొనిరి. గాంధిగారు సంగతి సందర్భముల కనుగొనుటకు చాంపరానుకు వెళ్లిరి. గాంధిగారు తమ కార్యసాధనమునకు జిల్లా అధికారుల సాయము నపేక్షించిరి.

గాంధిగారి కోరికకు జవాబుగా బిహారునందలి యూరోపియను సంఘమువా రీ క్రింది తీర్మానములను చేసిరి:—

1. ఎవరు పిలువని పనికి బూనుకొనిన, గాంధిగారి రాకవలన అశాంతి, నేరములు ప్రారంభమైనవి.

2. ఆయన ఈ మండలమునం దుండినయెడల చాంపరానునందలి యూరోపియనుల శ్రేయోదాయకమునకును మండలక్షేమమునకును భంగము కలుగగలదు.

3. చాంపరాను మండలమున శాంతిని కొనసాగింప దలంచిన యెడల గాంధిగారిని ఆయనసహాయులను వెంటనే ఈ ప్రాంతముల నుండి సాగనంపుటకు గల ఆవశ్యకతను కలకత్తాయందలి యూరోపియను సెంట్రలు సంఘమువారు గ్రహింపవలయును. చేరువనున్న ఇతరమండలములలో సయితము నేరములు జరుగు నని భయము కలుగుచున్నది.

గాంధిగారికి సహాయముచేయుటకు బదులుగా, పై తీర్మానముల ప్రకారము, మండలాధికారులు ఆయనను మండలమును వదలి వెళ్లుమని యాజ్ఞాపించిరి. సాధారణముగ చట్టములకు లోబడి ప్రవర్తించు హిందువున కీ శిక్ష సరిపోయియుండెడిదియే. ఆ విషయమున మం దేమియు మనము వినకపోయియుండెడి వారమే. కాని గాంధిగారు ఆజిల్లానువదలి వెళ్లుటకునిరాకరించిరి. అధికారులు ఆయనను ప్రాసిక్యూటుచేసిరి. తాము దోషులమని గాంధిగా రొప్పుకొనిరి. గాంధిగారటులు ధిక్కారముచేయుదు రని యెవరును ననుకొనలేదు. గాంధిగారిని శిక్షింపక, కేసును ఉపసంహరించుకొనిరి. తరువాత కొంత

కాలమునకు దొరతనమువారు గాంధిగారి కార్యసాధనమునకు సహాయముచేసెద మని చెప్పి తోటల యజమానుల ప్రతినిధులు, అధికారులు, గాంధిగారు మఱొక భారతీయ జమీందారునితో నొక విచారణసంఘమును నెలకొల్ప సమ్మతించిరి. గాంధిగారికిటులు తృప్తికరముగ విచారణసంఘమువారు కార్యసాధనమును ముగించిరి. బిహారు ప్రభుత్వమువారు విచారణ సంఘమువారి సూచనల ననుసరించి తోటయజమానులు బద్ధవ్యతిరేకత చూపుచున్నను సరకుగొనక శాసనము నొకదానిని చేసిరి. పర్యవసానముఁ దరకును తోట యజమానులు పోరాడిరి. ఆంగ్లో ఇండియనుపత్రిక యొకటి ఈ విషయమున నిటుల వ్రాసినది.

" ఈ ప్రవర్తనమునందు అధికారవర్గమున కనేకదోషములను ఆరోపించవచ్చును. ప్రతివిషయములోను ఉపేక్షచేయుట వారి యాదర్శము. విషయమును గుప్తముగా దాచియుంచుటకు వారి కెంతయు సంతోషము. విషయము చర్చించ తలంచిన నొప్పుకొనరు. కాని వాదనచేయువారు సమర్థతతో ముందుకు వచ్చిన వారికోరికల కొనసాగింతురు. విమర్శపూర్వక మైన ఈ విషయమున చాల కాలము శ్రద్ధవహించక యుండి వాదనచేయువారి బలాబలములను బట్టి న్యాయముచేయుట మంచిది కాదు. " (పయొనీరు 1918 మార్చి 13.)

అధికారవర్గమునకు వ్యతిరేకముగా నొక తగాదాను వాదించుట కష్టతరము. రైతులు శాంతిభూయిష్ఠముగా చేయు, నాందోళనమును, ప్రభుత్వమువారు తోటయజమానుల మనస్సు నొప్పించుటకు అయిష్టులై పెడచెవిని బెట్టుచుందురు. కాంగ్రెసువారు, గాంధిగారు రైతుల ఆందోళనమునకు కేలూతనిచ్చి, తోటయజమానుల కన్నను ఎక్కువగా రాపిడి కలుగఁజేసిన గాని న్యాయము కలుగుట కష్టతరమయ్యెను. ఆ రాష్ట్రమునందలి ప్రజలు గాంధిగారిని దైవసంభూతులుగఁ బూజించుచున్నారు.

ఇది ఆంగ్లో ఇండియనులకును రైతులకును సంబంధించిన విషయము. నేను ముందు సూచింపబోవు విషయమున సయితము మన మీ గుణపాఠములనే గ్రహించుటయే గాక ప్రభుత్వముక్రింద రైతు లెట్టి కష్టములకు పాల్పడవచ్చునదియును కనుగొనవచ్చును.

కెయిరా తగాదా

బొంబయి రాజధానియందలి కెయిరా జిల్లాయందు బహు సంవత్సరములనుండి ప్రజలు పంటలు చెడిపోవుటవలనను క్షామ రోగములవలనను వ్యవసాయసంబంధములగు కష్టములవలన బాధపడుచున్నారు. మామూలురోజులలో నా మండలమున 16 అణాలుగాక, 12 అణాల పంటయే పండుచుండెడిదని కలెక్టరే చెప్పుచుండెడివారు. 1917 సంవత్సరాంతమున గల అతివృష్టివలన పంటలన్నియు నాశనమైపోయినవి. పంటలు పాడైపోయిన కర్షకుడు శిస్తు చెల్లించియె తీరవలయుననియు, ఆచోట నందఱికిని ఇట్టిబాధలే యున్న యెడల నప్పుడు ఇతరులతోపాటు ప్రభుత్వసహాయమును కర్షకుడు పొందవచ్చునని రివిన్యూచట్టములలో గలదు. 20 వేల మంది ప్రజలు ఆసంవత్సరపు రివిన్యూవసూళ్లను నిలుపుదలచేయఁ బ్రార్థించుచు మహాజరు లనేకములను ప్రభుత్వమువారికి బంపిరి. ఆ సంవత్సరమున నాలు గణాలకు లోపుగనే పంటలు పండినందున, రివిన్యూ చట్టముల ప్రకారము శిస్తులను రద్దుచేయ నామహాజరులం దుదహరించి యుండిరి. శిస్తులకు గాను చెల్లించవలసిన సొమ్ముకైనను పంటలవలన పొందజాలకున్నామని వారు ప్రభుత్వమువారికి మొఱపెట్టుకొనిరి. తగిన అధికారులద్వారా మహాజరులను తమకు బంపలేదని ప్రభుత్వమువారు వానిని వాపసుచేసిరి. తదనంతరము ప్రజలు వానిని కలెక్టరుద్వారా పంపుకొనిరి.

జిల్లాసంఘమువారు సయితము ప్రజల కష్టములను కనుగొని, రివిన్యూ వసూళ్లు నాపుదలచేయ ప్రార్థించుచు ప్రభుత్వమువారి కొక మహాజరు పంపుకొనిరి. మండల సంఘమువా రీ విషయములలో జోక్యము పుచ్చుకొనఁ గూడదని ప్రభుత్వమువారు జవాబు నిచ్చిరి. శాసనసభాసభ్యులగు ఆనరబిలు ఘోరకు పటేలుగార్లు సయితము ప్రజల కష్టనిష్ఠురములను కనుగొని ప్రజల కోరికలో న్యాయమున్నదని కలెక్టరుగారికి మనవి చేసిరి. కలెక్టరు ఈ విషయమున తగిన విధముగ పనిచేయుదు నని జవా బిచ్చెను గాని, రివిన్యూ వసూళ్లను నిలుపుదల చేయలేదు. ఈ మహాజరులు పంపుటవలన, ప్రజలు నిలుపుదల చేయమనిన 23 లక్షల రూపాయల వసూళ్లలో ఒకలక్ష 75 వేల రూపాయలను మాత్రము ప్రభుత్వమువారు రద్దుచేసిరి. పిమ్మట ఆనరబిలు సర్ దిన్షావాచా, ఆనరబిలు ఘోరకు, పటేలుగార్లు గవర్నరుగారిని కలిసికొని సంగతి సందర్భములను నివేదింపగా, గ్రామాధికారులు పంపిన లెక్కలు బాగుగా నున్నవనియు, ఇక నా విషయములలో నేమియు సహాయము చేయజాల ననియు గవర్నరుగారు ప్రత్యుత్తర మిచ్చిరి. హిందూదేశ సేవాసంఘసభ్యులలో ముగ్గురు ప్రజలు కష్టనిష్ఠురముల కనుగొనుటకు ముందంజవేసిరి. అతివృష్టివలన పంటలు నాశన మైన వనియు, 5,6 నెలలనుండి ప్రజలకు తినుటకు కావలసిన ఆహారపదార్థములును లేకయున్న వనియు, అందువలన వారెన్నియో కష్టములకు పాలగుచున్నా రనియు, ఈ సంఘసభ్యులు కనుగొనిరి. రైతుల కోరికలు సరియైన వనియు, వారికి తగిన సహాయము చేయుట అవసర మనియు, అధికారు లందరికి నివేదించిరి. అధికారులు తగిన సహాయము చేసెదమని చెప్పిరి. ఈ విషయమున తగిన విచారణచేయ గాంధిగారు కోరుచు, ఆ విచారణ సందర్భమున తాను సయితము ముండుటకు సదుపాయములు గలుగ చేయవలయు నని కలెక్టరును వేడిరి. దీనికి కలెక్టరు నిరాకరించెను. ప్రజల కష్టనిష్ఠురములను కన్నులార చూచివచ్చుటకు గాంధిగారే బయలుదేరిరి. ప్రజలబాధలు నిజమైన వనియే ఆయన తెలిసికొనెను. కలెక్టరు, గవర్నరులకు యా సంగతులను తెలిపిరి. ఇంతకు ముందే ప్రజలకు తగిన న్యాయము చేయబడిన దనియు, ఇక తా మేమియు నిందు విషయమున జోక్యము పుచ్చుకొనమని గవర్నరు ప్రత్యుత్తర మిచ్చెను. శాసనసభలో ఈ విషయమున కొన్ని ప్రశ్నల నడుగు

టకు కొందఱు సభ్యులు పూనుకొనిరి ప్రభుత్వమువారు వానిని సభలో నడుగుటకు నిరాకరించిరి. మార్చి 23-వ తేదిని వ్యవసాయ శాఖవారు, పంటలు నాశనమైనందున ప్రజల కెంత నష్టమైనది రివిన్యూ అధికారులద్వారా కనుగొనగోరుచు శాసనసభలో నొక తీర్మానము ప్రవేశపెట్టబడినది. ప్రభుత్వమువారి ప్రతిఘటనవలన తీర్మాన మోడిపోయినది. శాసనరీత్యా చేయవలసిన యాందోళనము దీనితో ముగిసిపోయినది.

రైతులు మార్చినెల 28-వ తేదినుండి సాత్త్వికనిరోధము నవలంబించి శిస్తులను చెల్లించుటకు నిరాకరించిరి. శిస్తులు చెల్లించనందున, రైతులసామానులు, ఆవులు మున్నగు యావదాస్తియు వేలము వేయబడినది. వారి భూములను సయితము వేలము వేయుటకు ప్రభుత్వమువారు ఉత్తరువులను జారీచేసిరి. రైతులనుండి శిస్తును రాబట్టుటకు రివిన్యూ అధికారులు చేయవలసిన ప్రయత్నముల నన్నిటిని చేసిరి. కమీషనరు రైతులందఱను నొకచో సమావేశపరచి ప్రభుత్వపుటుత్తరవులకు లోబడవలయు ననియు, అటుల చేయకపోయిన కష్టములకు పాలుగావచ్చు ననియు స్వరాజ్యాందోళనకారుల మాటలు విని మోసపోవు డని రైతులకు గొప్ప యుపన్యాసము నిచ్చిరి. కాని రైతులు తమ పట్టుదలను విడిచినవారు కారు ఈ యుద్యమమునకు సానుభూతి జూపుటకు దేశమునం దెల్లెడలను సభలు జరిగినవి. స్వరాజ్యవాదులకును తమకును పోరాటము జరుగుచున్న దని ప్రభుత్వమువారు తలంచిరి. ప్రజల నొత్తిడిచేయుటకు సర్వప్రయత్నములను చేసిరి. కాని ఈ యొత్తిళ్లవలన ప్రజల నిరోధమునకు సయితము బలము రాసాగినది. గ్రామాధికారులు ప్రభుత్వమునకు వ్యతిరేకముగా తిరిగిరి. ప్రభుత్వమువారి యొత్తిడికి ప్రత్యుత్తరముగా వారీ క్రింది జవాబు నిచ్చిరి.

"ప్రభుత్వమువారి యుత్తరవులు, ప్రజలపట్ల మాకు గల ధర్మములకు వ్యతిరేకముగా నున్నయెడల, వానిని నిరోధించుట మా ధర్మము. ఈ కార్యమునకు పూనుకొనుటకు ముందు ప్రజల కష్టముల నివారణచేయుటకు ప్రభుత్వమువారితో కలిసి యెంతయో పని చేసితిమి. కాని వారు వీనిని సరకుకొనలేదు."

ఏప్రియలు 25-వ తేదిని శిస్తు చెల్లించ శక్తిగలవారు తప్ప తక్కినవారు రా సం॥ని శిస్తు చెల్లించ నక్కఱలేదని ప్రభుత్వమువారు ఉత్తరవులను జారీచేసిరి. ఎవరు శిస్తులుచెల్లించగలరో, ఎవరు చెల్లించజాలరో అను విషయమును రైతులే పరిష్కరించకోరిరి. కాని యీ యుత్తరవు జూన్ నెల 8-వ తేదీ వరకు కార్యాచరణమునందు పెట్టబడినది కాదు. అంతవరకును సొత్తులు వేలములు వేయబడుచునే యుండినవి. రైతులమీద కేసులును జరుగుచునే యుండినవి. ఈ ప్రాసిక్యూషను లందలి ముద్దాయిలు మారు మాటాడలేదు. తమపై విధింపబడిన శిక్షలకు అప్పీల్లు చేయలేదు. వీరిలో నొకరు విడుదల చేయబడిన తదనంతరము, "తాను స్వరాజ్యవాది ననియు తన ఆత్మసాక్షికి వ్యతిరేకముగా నుండు శాసనములను ఎల్లకాలమును నిరోధించుచుండెద ననియు" కలెక్టరు దగ్గరనే చెప్పియుండెను.

రివిన్యూ పద్ధతివలన లాభ మెక్కువగ వచ్చుచుండిన యెడల రైతుల కష్టము భరింప నశక్యము. తరువాత పరిణమించు విషయము సూచించుట సులభము.

ఈ తగాదా విల్లింగ్డను ప్రభువువారి పాలనలో జరిగినది. వీరివలెనే ఉదారవంతులు కాని వారి పాలనములో నిది యెటుల పరిణమించునో చెప్ప నశక్యము.

అధికారవిభజనసంఘము

సౌతుబరో సంఘ నివేదిక సూచనలు

మాంటుఫర్డు రాజ్యాంగ ప్రణాళికలోని అధికార ప్రజాయత్త శాఖల విభజనల విషయమున భారతదేశీయుల అభిప్రాయము కనుగొనుటకు సౌతుబరో ప్రభువుగారి యాజమాన్యమున నొక విచారణ సంఘము నెలకొల్పబడినది. విచారణ సంఘమువారు దేశమునందలి అధికార ప్రజాభిప్రాయమును కనుగొని ఈ క్రింది సూచనలను ప్రకటించిరి:

భారతప్రభుత్వముతోటి సంబంధము

అధికారవిభజననిర్ణయసంఘపు నివేదికము ఆఱుఖండములుగ నున్నది. రాష్ట్రీయాధికారములను, రాష్ట్రములకును భారతప్రభుత్వమునకుం గల సంబంధమును తెలుపు రెండవభాగమును, ప్రజాయత్త శాఖావిషయములను గూర్చియు నీవిషయములలో రాజప్రతినిధికిం గల అధికారమును గుఱించియును చర్చించు మూడవభాగమును, ప్రభుత్వశాఖకు సంబంధించిన సూచనలు గల నాలుగవభాగమును, ఆర్థికవిషయమును గుఱించిన ఏర్పాటులు గల యైదవభాగమును ముఖ్యములు. వానిలో నివేదిక క్లిష్టముగను సాంకేతికపదభూయిష్ఠముగను ఉండుటచేత దీనిని సంగ్రహించుట కష్టము. కావున నందలి ప్రధానసూత్రములు మాత్రమే ఇచ్చట పొందుపఱుపబడినవి:

ప్రభుత్వశాఖానిర్ణయము

2. సంఘమువారు (1) అఖిలభారతీయ విషయముల గుఱించియు, (2) రాష్ట్రీయవిషయముల గూర్చియు, రెండుపట్టికలను తయారుచేసిరి. మొదటిభాగమున నౌకాసైనికవైమానిక విషయములును, విదేశసంబంధములును, స్వదేశసంస్థానములతోటి సంబంధములును (కొన్నివిషయములలో తప్ప) రయిలు మార్గములును, సైన్యమునకు సంబంధించిన విషయములను పోస్టు టెలిగ్రాఫ్ కరెన్సీ

విషయములును, నాణెములను ముద్రించుటయు, సామ్రాజ్యాదాయ విషయములును, ఆస్తి హక్కు మున్నగువానికి సంబంధించు శాసనమును వాణిజ్యమును క్రిమినలు శాసనమును, సెంట్రలు పోలీసు రెయిల్వే, పోలీసు శాఖలును, ఆయుధధారణనిర్ణయమును, వైజ్ఞానిక పారిశ్రామిక పరిశోధనా కేంద్ర ప్రతిష్ఠాపనములును, మతవిషయములను, భారతప్రభుత్వశాఖలుగ చేర్పబడినవి. రెండవభాగమున స్థానిక స్వపరిపాలనమును, వైద్యమును, విద్యయు, పారిశుద్ధ్యమును, (కొన్ని విషయములలో తక్క) విద్యాశాఖయును రాష్ట్రమునందలి భవనములును, (సైనికవిషయములకు సంబంధించినవి గాక) ఇతర ప్రయాణ మార్గములును, కొన్ని విషయములలో రైలుమార్గములును ఇరిగేషన్ కాలువలు, భూమిశిస్తు, వ్యవసాయము, పశువైద్యశాఖలు మున్నగునవియును పరపతిసంఘములు, అటవీశాఖ, మద్యపానశాఖ, న్యాయశాఖయు, పారిశ్రామికపురోవృద్ధియు పోలీసును, ఖైదులును, వార్తాపత్రికా ముద్రణయంత్రాధికారమును అప్పుతీసికొను నధికారమును రాష్ట్రీయప్రభుత్వశాఖలో చేర్పఁబడినవి.

3. రాష్ట్రీయశాఖలు ప్రభుత్వాయత్తము లనియును, ప్రజాయత్తములనియు విభజింపఁబడినవి. ఈవిభాగమునుబట్టియే రాష్ట్రీయ శాఖావిషయములలో భారతప్రభుత్వమునకు గల అధికారము మార్పుపొందవలయు నని సూచింపబడినది. ప్రజాయత్తశాఖావిషయములలో రెండు విషయములలోమాత్రమే ప్రభుత్వమువారు జోక్యము కలుగఁజేసికొనవచ్చును.

అవి యేవన: (1) అఖిలభారతీయశాఖ పరిపాలనాసంరక్షణార్థము. (2) రెండు మూడు రాష్ట్రములకు సంబంధించిన సమస్యా పరిష్కారమునకై ఆయారాష్ట్రములు ఎట్టి తీర్మానమును రానప్పుడు కొన్ని ప్రత్యేకవిషయములలో భారతప్రభుత్వమువారు తమ యధికారమును వీడక వానిని భారతప్రభుత్వశాసనమునకు లోబడిన రాష్ట్రీయవిషయములుగఁ బరిగణించుచుందురు. ప్రభుత్వాయత్త విషయములలో భారతప్రభుత్వమునకు గల సాధారణాధికారము తగ్గింపఁబడలేదు. కాని, ఈ విషయములను రాష్ట్రీయప్రభుత్వమువారు భారతప్రభుత్వమువారి ఏజెంట్లుగనుండి పరిపాలించుచుండిరా లేక అవి రాష్ట్రీయప్రభుత్వమువారి అధికారములోనివేనా? అను విషయమును గుర్తించి భారతప్రభుత్వమువారు తమకు గల అధికారమును చెల్లించుచుండవలయును. మొదటి విషయములో భారతప్రభుత్వమువారికి గల అధికారము తగ్గింపఁబడదు. రెండవవిషయములో నూతన భారతప్రభుత్వశాసనోద్దేశము ననుసరించి ఈ యధికారమును చెల్లించుచుండవలయును.

4. సాధారణముగా రాష్ట్రీయవిషయములలో శాసననిర్మాణమును గావించుటకు రాష్ట్రీయ ప్రభుత్వములకు సర్వాధికారము నొసంగవలయు నని సూచింపఁబడినది. ప్రభుత్వశాఖలు ప్రభుత్వాయత్తము లైనను ప్రజాయత్తము లైనను కావచ్చును. కాని ఇవి భారతప్రభుత్వశాసననిర్మాణమునకు లోబడునట్టివిగ మాత్ర ముండ రాదు. గవర్నరు తనవశమున నున్న ఎట్టి రాష్ట్రీయపుబిల్లుల నైనను ఇతరరాష్ట్రములలో నున్న ఎట్టి అఖిలభారతదేశీయవిషయము నైనను రాజప్రతినిధి అనుమతిని పొందునట్లుగ ప్రత్యేకించునట్లు అధికారమును కలిగియుండవలెను. అందు ముఖ్యముగ మతము మతాచారములు, సాంఘికాచారములు, విశ్వవిద్యాలయశాసనములు, ప్రభుత్వాయత్తప్రజాయత్తశాఖానిర్ధారణశాసనములు, రైలు ట్రాము మార్గములకు సంబంధించిన బిల్లులు — వీనికి గవర్నరు రాజప్రతినిధి యంగీకారమును పడయవలయును.

అధికార విభజనము

5. అధికారమును ప్రజావశంగతము చేయు విషయములో స్థానికప్రభుత్వములు చేసిన సూచనలను కొన్ని షరతులమీద చర్చించియుండిరి. మదరాసు ప్రభుత్వమువారు ద్వంద్వవిధానము గల ఎట్టి సంస్కరణల కైనను సంపూర్ణముగ ప్రతికూలురుగా నుండిరి. బొంబాయి, పంజాబు ప్రభుత్వములవారును అస్సాము చీఫుకమిషనరును అధికారవిభజనము లేని మఱొక సంస్కరణ విధానమును సూచించిరి. మధ్యరాష్ట్రముల చీఫు కమీషనరు సంస్కరణ విధానము నాచరణలోనికి వచ్చుటకు ముందు కొంత శిక్షణము వలయు నని తెల్పిరి. స్థానికస్వపరిపాలనము వైద్యశాఖాపాలనము విద్య, పారిశుద్ధ్యము (కొన్ని విషయములు తక్క) విద్య రాష్ట్రీయభవనములు సైనికసంబంధము గాని ఇతర రాకపోకల విషయములు కొన్ని విషయములలో రైలు ట్రాము మార్గములు వ్యవసాయము పశువైద్యశాఖ చేపలు (అస్సాములో తప్ప) పరపతి సంఘములు, బొంబాయిలో అడవులు, మద్యపానము (అస్సాములో తప్ప) పారిశ్రామికాభివృద్ధి ఇవి ప్రజాయత్త విషయములలో ముఖ్యములుగా పరిగణింపవలె నని సూచింపఁబడినవి. మదరాసులో ఏ విషయమైనను ప్రజాయత్తములుగా నుంచుటకు సూచించుట దుస్సాధ్యమనియు, నియోజకవర్గ నిర్ణయసంఘమువారి సూచనలవలన బ్రాహ్మణులే అధిక సంఖ్యాకులుగ నధికారమును కలిగియుందు రనియు, వారిచేతులలో జనసామాన్యము సురక్షితము గాదనియు, కాచిమను గారు నుడివిరి.

గవర్నరు జోక్యము

6. ఈ క్రింద తెలుపబడు రెండు విషయములందు మాత్రము ప్రజాయత్త విషయములలో గవర్నరు జోక్యమును కలుగజేసికోవలె నని సంఘమువారు సూచించిరి.

(1) ప్రభుత్వాయత్తవిషయ సంరక్షణార్థము.

(2) పై యధికారుల యుత్తరువులను పాలించుటకు వలయు ప్రత్యేకబాధ్యతా నిర్వహణార్థము.

మొదటి విషయములో నాయాశాఖల సమ్మతి నొందుటకు గవర్నరు విఫలమనోరథుఁ డైనచో అతఁడే ఆ సమస్యను పరిష్కరించి ఆ శాఖామంత్రిని తన పదవికి (అవసర మగునెడల) రాజీనామా నొసంగవలె నని చెప్పుటకు నధికారము గలదు. అత్యవసర

మగు విషయములలో సభాయుతులు గవర్నరు స్వతంత్రముగనే చర్యను తగినట్లు తీసికొనవచ్చును. ప్రభుత్వమునందలి రెండుభాగములకుఁ గల యధికారమును నిర్వచించుటకు కొన్ని నియమములు సూచింపఁబడినవి. వీని సారాంశ మేమనఁగా:

(1) ఒక శాఖవారు రెండవశాఖతో అనవసరముగా జోక్యము కలుగజేసికోరాదు.

(2) ఈశాఖ యధికార విషయమున సందేహము గలిగినప్పుడు దానిని గవర్నరు మాత్రమే పరిష్కరింపవలెను.

(3) సభాయుతుఁ డగు రాజప్రతినిధి యుత్తరువు పాలింపఁబడునట్లు గవర్నరు కనిపెట్టవలయును.

(4) ప్రజాయత్త ప్రభుత్వాయత్తశాఖలకు సంబంధించిన విషయములలో గవర్నరు సంయుక్తసమావేశములఁ గావించి ఏకీభావము కుదురనపుడు తానే ఆ విషయమును నిర్ణయింపవలయును.

(5) మంత్రి లేనప్పుడు అత్యవసరసమయములోనే ప్రజాయత్తవిషయ మైన సభాయుతుఁ డగు గౌర్నరే పరిపాలింపవచ్చును.

పై యధికారుల ఉత్తరువులను పాలించు ప్రత్యేకబాధ్యతా నిర్వహణమునకు గవర్నరు ఇట్టి అధికారమునే గలిగియుండవలయును. గవర్నరుయొక్క ప్రత్యేకబాధ్యతలను నిర్వచించు చిత్తునియమములు నివేదికయందు చేర్పఁబడినవి. శాంతిస్థాపనము మత సాంఘిక కలహ నిషేధము వాణిజ్య స్వాతంత్ర్యప్రదానము ప్రజాక్షేమమునకు భిన్నములగు వ్యక్తిస్వాతంత్ర్యప్రదానము ఆంగ్లో ఇండియనుల యొక్కయు, ప్రభుత్వోద్యోగుల యొక్కయు, ఈ దేశమునందు తాత్కాలికముగ నివసించు సంఘముయొక్క సంరక్షణము మహమ్మదీయుల విద్యావిషయసంరక్షణము మతప్రతిష్ఠాపనలు, నిమ్నజాతులు—మున్నగువాని సంరక్షణము మొదలైనవి గవర్నరు ప్రత్యేకబాధ్యతలలో చేర్పఁబడినవి.

పౌరసేవోద్యోగములు

(7) రాష్ట్రీయప్రభుత్వము వారిక్రింద పనిచేయుచున్నవారిని "ఇండియను" "ప్రావిన్షియలు" "సబార్డినేటు" లని మూడు తరగతులుగా విభజింపవలయు నని సంఘమువారు సూచించిరి. ఏ అధికారము ఉద్యోగులను నియమించుచున్నదో, ఆ అధికారమే ఆ యుద్యోగుల కుండవలసిన లక్షణములను నిర్ణయించ గలదు. భారతమంత్రిగారి స్టాట్యూటరీయుత్తరువుల యందు సూచింపబడిన పద్ధతుల ప్రకారము ఇండియను "సర్వీసు ఉద్యోగములకు తగినవారిని నియమింతురు. భారతమంత్రిగారే ఈ సర్వీసు నందలివారికి నుద్యోగముల నిప్పించుట, వారి జీతములను నిర్ణయించుట క్రొత్తయుద్యోగములను సాంక్షను చేయుట భారతదేశప్రభుత్వమువారి క్రొత్తచట్టము నందలి స్టాట్యూటరి యుత్తరువుల ప్రకారము ఉపకారవేతనములను సంపాదించుట మున్నగు కార్యములకు పూనుకొందురు. స్టాట్యూటరీ నిబంధనలలో ఇండియను సర్వీసునకు సంబంధించిన యుద్యోగుల జీతములను, ఉపకారవేతనములను గవర్నరుగారి అనుమతి లేనిదే ప్రజాయత్తశాఖలలో చేర్చకూడదని సంఘమువారు సూచించిరి. వైద్యశాఖను ప్రజాయత్తము చేయుదలచిన యెడల ఇండియను మెడికలు సర్వీసునందలి యుద్యోగుల ప్రైవేటు ప్రాక్టీసునకు భంగము కలుగకుండ భారతదేశరాజ్యాంగమంత్రి తగిన కట్టుదిట్టములను చేయవలసివచ్చునని సంఘమువారు సూచించిరి. పౌరసేవోద్యోగములను కట్టుదిట్టముల చేయుటకును, ప్రభుత్వమువారి అనుమతి లేనిదే ఏ యుద్యోగియొక్క గాని జీతముల యుపకారవేతన విషయములలో యుత్తరువు లేవియు పాలింపకుండునటుల చేయుటకును గవర్నరువారు చూచుచుండవలయును. ఈ యుత్తరువులమీద అపీళ్లను భారతదేశప్రభుత్వమువారికి భారతదేశాంగమంత్రిగారికి చేయవచ్చును. దేశాంగమంత్రిగారి యుత్తరువుమీద తప్ప, ఇండియను సర్వీసునకు సంబంధించినవారి నెవరినైనను ఉద్యోగమునుండి తీసివేయగూడదు. అధికారప్రజాయత్తశాఖలలో నున్న యుద్యోగుల ప్రమోషను, బదలాయింపులు, కట్టుదిట్టముల విషయమున, పైన సభాయుతు లగు గవర్నరుగారికిని, మంత్రులకును గల సంబంధముల విషయమున సూచింపబడినవే అనువర్తింపగలవు.

రాష్ట్రవిభజన

8. ప్రావిన్షియలు డివిజను రాష్ట్రీయ శాఖోద్యోగము లందలి వారి నియోజనము, శిక్షణ, కట్టుదిట్టములు, మున్నగువానిని నిర్ణయించు శాసనమును చేయునంతవఱకును, ప్రజాయత్తశాఖల సంబంధమున మంత్రులు ప్రకృతమున్న నిబంధనములనే అనుసరింపవలసి యుండును. జీతము అలవెన్సులు సెలవులు మున్నగు విషయములందు మాత్రము స్థానికప్రభుత్వములవారికి సంపూర్ణాధికారము లీయబడును. సాధారణపు కట్టుదిట్టములలో మాత్రము ఇండియను సర్వీసు ఉద్యోగులకు సూచింపబడిన పద్ధతులే రాష్ట్రీయశాఖోద్యోగులకును అన్వయింపగలదు. ఇకముందు జీతములు, ఉపకార వేతనములకు సంబంధించినట్టియు, ఈ శాఖయం దున్నవారిని యుద్యోగములనుండి తీసివేయుటకుగాను పాలింపబడు నుత్తరువుల విషయమునను గవర్నరుగారి అనుమతి యుండుట అత్యవసరము. సబార్డినేటు డివిజను అధికారాయత్త ప్రజాయత్త శాఖలలో [illegible]ను సబార్డినేటు యుద్యోగుల స్వాతంత్ర్యములను యథాప్రకారముగా నిలువబెట్టుటకుగాను గవర్నరుగారు ఉత్తరువులనే పాలించుచుండవలయును. ఇకముందు నియమింపబోవు వారి యుద్యోగవిషయములందు మాత్రము సభాయుతు లగు గవర్నరు, గవర్నరు మంత్రులు తగిన నిబంధనలను నేర్పరచవచ్చును.

ఇండియను సర్వీసునందలి నిబంధనలకు లోబడి నడచుకొనువారినే ఆయా యుద్యోగములకు నియమింపవలయు నని సంఘమువారు అభిప్రాయపడిరి. అయినను అవసర మైన నిర్బంధములను ముందుముందు తగ్గింపవచ్చును.

ఆర్థిక విషయములు

9. ఆర్థికవిషయమున నీ క్రింది యేర్పాటులను చేయవలయును :

(1) సభాయుతులగు గవర్నరునకును, మంత్రులకును సంబంధము లేకుండనే సంప్రతీకరణ పద్ధతి (ఆడిటింగు సిస్టము) సంస్థాపింపబడి సంప్రతి నివేదికలను రాష్ట్రీయశాసనసభలకు సమర్పింపవలయును.

(2) రాష్ట్రీయార్థిక శాఖలు అధికారాయత్తములుగ నుండవలయును. ప్రజాయత్తశాఖల సందర్భమున రాష్ట్రీయార్థిక శాఖవారు సలహా నిచ్చుట విమర్శించుటయే నిర్వర్తించవలసిన ధర్మములు. అంత్యతీర్మానములు మంత్రులమీద నాధారపడియుండును. కాని వీనికి గవర్నరుగారు సమ్మతించవలయును.

(3) భారతదేశప్రభుత్వమువారి అనుమతిలేకనే స్థానికప్రభుత్వములు ప్రవేశపెట్టు పన్నుల జాబితాలు నిబంధన ప్రకారము షెడ్యూలునందు సూచింపబడును.

(4) సాధారణముగా రాష్ట్రీయప్రభుత్వములు భారతదేశప్రభుత్వమునుండి అప్పులను పుచ్చుకొనుచుండవలయును. అయినను, కాలపరిమితి, అప్పుపద్ధతుల ననుసరించి ప్రభుత్వమువారి ఆమోదముతో గొన్ని విషయములందు మాత్రము ఇండియను మార్కెట్టు నుండి వైకమును బదులుపుచ్చుకొనుటకు స్వాతంత్ర్య మీయబడినది.

(5) కొన్ని చిన్న నిబంధనలను మాత్ర మనుసరించి రాష్ట్రీయ ప్రభుత్వములు నిలువయున్న ధనమును ఖర్చుపెట్టుటకు స్వాతంత్ర్య మీయబడినది.

(6) సభాయుతులగు గవర్నరు జనరలుగారు మునిసిపలు స్థానికసంఘమువారు విధించుకొనవలసిన పన్నుల విషయమున షెడ్యూలును నిర్ణయించును. షెడ్యూలునందు లేని పన్ను విషయమున ముందుగనే ప్రభుత్వమువారి అనుమతిని బొందవలయును.

సర్ శంకరునాయరుగారి భిన్నాభిప్రాయము

సర్ శంకరనాయరు గారు సౌతుబరో నివేదికయందలి సూచనలపట్ల నీ క్రింది విషయములను వెలిబుచ్చుచున్నారు:—

నియోజక నిర్ణయాధికారవిభజనసంఘముల సూచనలను విమర్శించుచు భారతప్రభుత్వమువారు తమ యభిప్రాయమును ప్రకటించిరి. తోడిసభ్యులతో నేకీభవింపక సర్ శంకర నాయరుగారు వ్రాసిన భిన్నాభిప్రాయపత్రమును క్రింద ముద్రించుచున్నాము:

1. నాభిన్నాభిప్రాయప్రకటనము 13వ పేరాలో మంత్రికి సహాయపడని తాబేదారులవలన ఆయన కెంతకష్టము కలుగునో సూచించియుంటిని. 14-వ పేరాలో తాబేదారులు మంత్రిచేయు తీర్మానములపైని గవర్నరుగారి అభిప్రాయమును కోర తలంచుకొనుటవలన అభ్యంతరములను సూచించియుంటిని. సంఘమువారు ప్రకృతము భారతదేశప్రభుత్వమువారి సూచనకు వ్యతిరేకముగా, నాసహచరులు సూచించిన [illegible]ద్యోగవర్గమున చేర్చకుండనే క్రొత్తయుద్యోగములను నెలకొల్పుటకు సూచించియున్నారు. దీనివలన మంత్రి భారతమంత్రి అనుమతిపైని తనయొద్ద నుండి పనిచేయుటకు గాను క్రొత్తయుద్యోగులను నియమించుటకు అవకాశము లుండగలవు. మంత్రి క్రొత్తయుద్యోగులను నియమించు నను భయమువలననే నా సహచరులు, మంత్రియొద్ద పనిచేయు యుద్యోగులు సయితము తాము సూచించు నుద్యోగములందు చేరియుండువారే యుండవలయు నని సూచించిరి. సంఘమువారు అధికారాయత్త, ప్రజాయత్తశాఖలు సమ్మేళన మగునప్పుడు మాత్రము, గవర్నరుగారి ఆమోదముతో మంత్రి నియోజించిన యుద్యోగిని గాని, సర్వీసునం దున్న యుద్యోగిని గాని నొకనిని నియమించుకొనవచ్చు నని సూచించిరి. అయినను క్రొత్తయుద్యోగ నిర్మాణమునకు గాను భారతమంత్రి అనుమతి అవసరమని నా అభిప్రాయము. దీనివలన 13-వ పేరాలో నేను సూచించిన అభ్యంతరము పోగలదు. కావున నా సహచరుల సూచనలకన్నను, సంఘమువారి సూచనలనే నేను ఆమోదించుచున్నాను.

2 మంత్రికిని, శాసనసభకును గలుగునట్టియు, మంత్రికిని, కార్యనిర్వాహక సభవారికిని గలుగునట్టియు భేదాభిప్రాయముల నెటుల పరిష్కరింపవలయునో నాలోచించుట చాల ముఖ్యతరము. ఈ విషయమున నా సహచరులు ప్రజాయత్తశాఖల సందర్భమున సూచించిన సూచనలపట్ల నా భేదాభిప్రాయ ప్రకటన పత్రికలో అభ్యంతరములను చూపెట్టియే యున్నాను. ఈ విషయ మప్పుడు శాఖావిభజన సంఘమువారి ఆలోచన యం దుండియున్నది. ప్రకృతము ఆ విషయమున గల సూచనలు వారి నివేదికయందలి 60 మొదలు 63-వ పేరాలలో నున్నవి. సంఘమువారు నా సహచరులు సూచించిన సూచనలపట్ల నేను చెప్పిన అభ్యంతరముల ప్రకారమే, భేదాభిప్రాయములను కనుపరచిరి.

గవర్నరుగారి తాత్కాలికాధికారము

3. ప్రజాయత్తము చేసిన శాఖలవిషయమై అభిప్రాయభేదము లుదయించినప్పుడు, ఆ కారణములను తొలగించుటకును ఆశాఖాధికారమును గవర్నరు వహింపవలయు నని నా తోడిసభ్యుల అభిప్రాయము. వారు సూచించిన వివిధములగు సలహాలు సంఘర్షణములకు కారణభూతములై యుండును. శాసనసభలు, మంత్రులు సరియైన బాధ్యతవహింపక పనిచేయుటకు వీలులేకుండనుండుటకై ప్రజాయత్తము చేసిన అధికారములు తిరిగి అధికారాయత్తములు కావలయు నని వారు కోరిరి. చిట్టచివరకు గవర్నరు అభిప్రాయమునకు అతీతముగా శాసనసభల అభిప్రాయములు చెల్లుటకు వారొప్పుకొనుట లేదు. 102-వ పేరాలో నుదాహరించబడిన ప్రకారము ప్రజాయత్తము చేసిన విషయములలో కొన్ని గాని పూర్తిగా గాని, అధికారా

యత్తము చేయుటకు భారతమంత్రికి వారధికారమును కల్పించిరి. ప్రజాయత్తాధికారాయత్తశాఖల మంచిచెడ్డలకు సంబంధించిన విషయములలో కార్యనిర్వాహకవర్గమునకును, మంత్రులకును, భిన్నాభిప్రాయములు కలిగినప్పుడు వానిని పరిష్కరించు అధికారమేశాఖవారికి కలదను విషయమును గవర్నరు నిర్ణయించవలయునని వారు సూచించిరి. నేను ప్రత్యేకముగా ప్రకటించిన అభిప్రాయపత్రమునందు వ్రాసినటుల ఈ సూచనలన్నియు సంస్కరణనివేదికమునకు వ్యతిరేకముగా నున్నవనియు, దానిని అధికారవిభజనసంఘమువారు అంగీకరింపలేదనియు, ఆ సంఘమువారు వీని విషయమై, భారతప్రభుత్వమువారి యభిప్రాయములకు భిన్నముగ నున్నారనియు నా అభిప్రాయము. ప్రజాయత్తపుశాఖలనుండి అధికారాయత్తశాఖలకు నే విషయమునైనను తిరిగి సంక్రమింపచేయు సూచనలను సంఘమువా రంగీకరించలేదు. శాసనసభానియుక్తసభ్యుడును, ప్రజాయత్తము చేసిన శాఖకు బాధ్యుడు నగు మంత్రిని దాని పరిపాలనమునకు గవర్నరు సదా నియమింపవలయును. కాని గవర్నరుగారి సభవారు దాని నెప్పుడును పాలింపవలయునని లేదు. ఒక మంత్రి తొలగింపఁబడి రెండవమంత్రిని నియమింపవలసిన కాలమునందు మాత్రము ఆ మంత్రికి ప్రత్యామ్నాయముగా గవర్నరుగారు ఆ వ్యవహారములను చూడవలయునని కలదు. నాతోడి సభ్యులు సూచించిన ప్రకారము శాసనసభ గవర్నరుగారి అభిప్రాయమును శిరసావహింపకున్నను వారే ఆ శాఖాపరిపాలనమును వహింపవలసియుండుటచే పై దానికి విరుద్ధముగా నున్నది. అభిప్రాయభేదము కలిగినప్పుడు ఎవరు దానిని పరిష్కరింపవలయు ననువిషయములు, కార్యనిర్వాహకవర్గమునకును మంత్రికిని కలుగు తగాదాలను గవర్నరు నిర్ణయింపవలయు నని సంఘమువారి అభిప్రాయము. మంత్రులు చెప్పినటుల విని పనిచేయకపోయినపుడు ఇండియాగవర్నమెంటు శాసనము ౮౦–వ సెక్షను ప్రకారము కార్యనిర్వాహకవర్గపు ఉత్తరువును జారీచేసి వారిని తొలగించి క్రొత్తమంత్రిని గవర్నరు నియమింపవచ్చును. విషమస్థితియందు మంత్రిని తీసివేసి గవర్నరు స్వయముగా అధికారమును వహింపవచ్చును. కాని త్వరలోనే ఆ పదవికి తిరుగ మంత్రిని నియమించవలసియుండును. విషమస్థితియందు ఇట్లు చేసిన బాగుగనుండు నని సంఘమువారు నిర్ణయించిరి. ఇది సహేతుకముగనే యున్నది. కాని సంస్కరణనివేదికమునందు సూచించిన సులభపద్ధతి యగు గవర్నరు నిర్ణయమునే ఉత్తరువుగా పరిగణింపవలయు నని చెప్పిన విషయము మంచిదా యని సంశయము కలుగుచున్నది. సంఘమువారి సూచనల ప్రకారము గవర్నరు తాత్కాలికముగ ప్రజాయత్తశాఖాధికారమును, అదియును అవసరస్థితియందు మాత్రమే, వహించుట అవసరమని సంఘమువారు సూచించిరి. కావున గవర్నరునకును, మంత్రికిని నుండవలసిన సంబంధములో వారికి కార్యనిర్వాహకసంఘముకంటె తక్కువస్థితిని వారు కల్పించలేదు. ప్రజాయత్తశాఖావిషయము చాల ముఖ్యమైనది. కావునను ౫౭–వ పేరాలో నేను కొన్ని అభిప్రాయములను తెలుపవలసియుండెను.

ప్రబలాక్షేపణ

ప్రజాయత్తము చేసిన శాఖాధికారమును తిరిగి గవర్నరు వహించియుండవలయు నని చేసిన సూచన విషయమై నేను ప్రబలముగ నాక్షేపించుచున్నాను. స్థానికప్రభుత్వము భారతవర్ష ప్రభుత్వపు కోరికల ననుసరించి ప్రజాయత్తశాఖను అధికారాయత్తముగ మార్చుటకు భారతమంత్రికి అధికార మిచ్చుటను కూడ నే నాక్షేపించుచున్నాను. నేనిదివఱకు చెప్పినటుల అవి సంస్కరణ తత్వమునకే చాల భంగకరములుగ నున్నవి. ప్రజానియుక్తసభ్యులు సివిలు సర్వీసువారి నియంత్రణమునుండి విడివడి పాలనాధికారమును చేయుటయే సంస్కరణోద్దేశము. యోగ్యమగు పరిపాలనమునకిది అవసరమని భారతీయులందఱు నేకాభిప్రాయులై యున్నారు. పార్లమెంటువారియొక్కయు నాంగ్లప్రజల యొక్కయు నుద్దేశములను నెఱవేర్చుటకు సివిలుసర్వీసు వారికి సాధ్యము కాకపోవుటవలనను ఇది అత్యవసరమైనది. కొంతకాలమువఱకును కొన్ని రాజధానులలో గవర్నరు సివిలియనుగనే యుండును. తక్కిన రాజధానులలో గవర్నరు సివిలియనుల ప్రాబల్యమునకు లోబడియుండును. ఇట్టి స్థితిగతులలో సివిలు సర్వీసువారిట్లు సంచరించుటకు అవకాశము గలుగకుండ శాసనసభ ఆచరించకుండ నుండవలయు నని ప్రజాయత్తశాఖను అధికారాయత్తశాఖగ మార్చు నిబంధన హెచ్చరించగలదు. నాతోడి సభ్యులు దీనిని స్పష్టముగా చెప్పిరి. సంస్కరణము లేవియు పనికిరావని సివిలు సర్వీసువారు బహిరంగముగా తమ వ్యతిరేకతను ప్రకటించియున్నారు. కావున భారత రాజ్యాంగసంస్కరణముల భావిస్థితి నిర్ణయమును సివిలు సర్వీసునకు నొప్పగించుట భావ్యముగ నుండదు. సంస్కరణములు పార్లమెంటువా రిచ్చిన వరములుగాని సివిలు సర్వీసువా రిచ్చినవి కావు. వారి కిష్టమైన యెడల పార్లమెంటువారు వానిని రద్దు చేయవచ్చును. ముందు నిర్మితము కాబోవు శాసనసభలు భారతీయులకును పార్లమెంటునకు బాధ్యత వహించి తమ ధర్మములను నిర్వర్తింపవలసియున్నది. కాని యీ యాయుధమును సివిలు సర్వీసువారి చేతులలో బెట్టినయెడల సంస్కరణములను నిష్ఫలములుగ చేసినట్లే యగును. ఇదివఱకు చేసినట్లు వారు ఆంగ్లప్రజల యుద్దేశములను వ్యర్థము చేసినట్లు వారికి ముందు అవకాశము లీయకూడదు. నాతోడి సభ్యులు తయారుచేసిన ప్రణాళికవలన సంస్కరణ యుద్దేశము వ్యర్థము కావచ్చును. మంత్రియు శాసనసభయు తమ కుండిన బాధ్యతలను నిర్వర్తించిన యెడల, నందువలన పాలనవ్యవహారము సులభసాధ్యముగ జరుగదు. అందువలన బాధ్యతాయుతప్రభుత్వమును తీసివేయుటకు కారణ మేర్పడగలదు. పైని చెప్పిన విషయములలో భారతమంత్రి జోక్యము కలిగించుకొనుటవలన లాభ మేమియు నుండదు. సివిలుసర్వీసు ఉద్యోగుల అభిప్రాయమునకు భారతసచివుడు చెవియొగ్గుటయే గాని తద్భిన్నముగా ప్రవర్తించుట లేదు. అట్టి భయము నా కున్నయెడల నేను ఏ సంస్కరణమును కోరియుండను.

పార్లమెంటువారు భారతవర్షమునకు వర్తింపవలయు నని సూచించిన బాధ్యతాయుత పరిపాలనా ధర్మమును నే నంగీకరించి యుండను. కావున సంఘమువారు ఆ సూచనలను అంగీకరించినందులకు సంతోషించుచున్నాను.

ఆర్థికసూచనలు

నాతోడి సభ్యులు ఆర్థికవిషయమై సూచించిన విషయములు స్వాయత్తప్రజాయత్తశాఖావిభజనసంఘమువారి సిఫార్సులకు వ్యతిరేకములుగ నున్నవి. రాష్ట్రాదాయమును ఇండియా గవర్నమెంటునకు రాష్ట్రప్రభుత్వమునకు పంచిపెట్టు విషయములోను స్వాయత్తప్రజాయత్తశాఖల ఖర్చులవిషయమై సొమ్ము చాలనపుడును ఒకశాఖవారు చేసినపని రెండవశాఖవారికి నష్టదాయకముగ నుండినపుడును, గవర్నరుగారి నిర్ణయమే ముఖ్యముగ నుండవలయు నని సంఘమువారు నిర్ణయించిరి. స్వాయత్తశాఖలకు కావలసిన డబ్బుపోగా మిగిలిన డబ్బు అయినప్పటికిని ప్రజాయత్తశాఖామంత్రి నిర్వహింపవలసిన కార్యములకు అతడే బాధ్యుడుగ నుండవలయు నని నిశ్చయించిరి. పన్నుల విషయమై నాతోడి సభ్యులు చేసిన సిఫార్సులు సంఘమువారి నిర్ణయములకు వ్యతిరిక్తముగ నున్నవి. మేము ఈ ప్రకటనమును వ్రాయునప్పటికి అవి మా యెదుట లేవు.

రాష్ట్రమునకు కావలసిన పన్నుల విషయమై రాష్ట్రప్రభుత్వమువారు దానిని ప్రజాయత్తశాఖగనే పరిగణింపవలయు నని సంఘములవారు నిర్ణయించిరి. మొట్టమొదట భారతప్రభుత్వమునకు రావలసిన సొమ్మును నిర్ణయింపవలయును. తరువాత రాష్ట్రప్రభుత్వమునకు కావలసిన సొమ్మును నిలువయుంచవలయును. అధికారాయత్తశాఖలకు కావలసిన సొమ్మును నిలువయుంచవలయును. మొదటి రెండు విషయములలోను ఖర్చుసొమ్ము నిర్ణీతముగానే యుండును. గత సంవత్సరము ఖర్చుపెట్టినసొమ్మును తీసికొనినప్పుడును లేక కొన్ని సంవత్సములలో ఖర్చుపడిన దామాషా మొత్తమును తీసికొనినపుడును, అధికారాయత్తశాఖల ఖర్చు నిర్ణీతముగనే యుండును. ఈఖర్చులన్నియు పోను మిగతసొమ్ము మంత్రుల అధీనములో నుండు నని సంఘమువారు నిర్ణయించిరి. పన్నులు వేసికొను పద్ధతికూడ ప్రజాయత్తశాఖాపద్ధతివలెనే యుండవలయు నని వారి యుద్దేశ్యము. అభిప్రాయభేదము కలిగినపుడు గవర్నరు దానిని పరిష్కరింపవలయును. ఇండియా గవర్నమెంటువారు పంపిన ప్రకటనమునకు ఇది భిన్నముగ నుండి దానికంటె అనుకూలముగ నున్నది.

6. రాష్ట్రీయాదాయవిభజనవిషయమై రాష్ట్రప్రభుత్వమునందలి ద్విశాఖధర్మముల విషయమై సంఘమువారు చేసిన సూచనలకును, మార్చి ౫-వ తేదిని ఇండియా ప్రభుత్వమువారు ప్రకటించిన ప్రకటనమునందలి తీర్మానములకును చాలభేదములు కలుగు నని నాతోడి సభ్యులు అభిప్రాయపడుచున్నారు. అయినను వారి అభిప్రాయము ననుసరించుట మంచిది కాదని నా అభిప్రాయము. ప్పటి మా ప్రకటనమునందలి విషయములను సంఘమువారి నివేదికమునం దుదాహరింపబడబోవు సూచనల ప్రకారము మార్పు చేసికొనవచ్చు నని అభిప్రాయ మిచ్చియుంటిమి. నాతోడి సభ్యులు మా ప్రకటన సంఘమువారి నివేదికము కన్నను వెనుకనే వ్రాసితిమని చెప్పుచున్నను, సంఘమువారి నివేదికము మార్చి ౫-వ తేదీ నాటికి కార్యనిర్వాహకసభ్యులయొద్దకు ఆలోచనార్థమై వచ్చియుండలేదు. కావున సంఘమువారి సూచనల ప్రకారము మా అభిప్రాయములను మార్చుకొనుట లేక వారి సూచనలను అవసరమైన నిరాకరించుట భావ్యము. కావుననే మా నివేదికమునందలి 4?-వ పేరాలో రాష్ట్రీయ ప్రభుత్వమునందలి అధికారాయత్త ప్రజాయత్త శాఖాధర్మములను సంఘమువారి నివేదికము నందలి సూచనల ననుసరించి ఆలోచించి నిర్ణయించెద మని తెలిపియుంటిమి.

సంఘమువారు నివేదికమునందు 60 మొదలు 63 పేరాలలోను, 76,77 పేరాలలోను శాఖావిభజనసంఘమువారు ఆర్థికవిషయములపట్ల సూచించిన విషయములకు, నాతోడి సభ్యుల సూచనలు వ్యతిరేకముగ నున్నవని చెప్పియే యున్నాను.

సంఘమువారు విషయనిర్ణయములను గురించిన సూచనలను మొత్తముమీద నంగీకరించిన నాతోడి సభ్యుల ప్రణాళికను కార్యరూపమున బెట్టిన యెడల జయప్రదముగ పనిచేయుట కష్టము. కావున నీ విషయముపట్ల ప్రణాళికావిధానమును సంగ్రహముగ వివరించుట అత్యవసరము.

7. అధికారాయత్త ప్రజాయత్తశాఖల వ్యయములకు గాను ప్రత్యేకముగా కొంత ఆదాయమును నిర్ణయించుట అవసరము. ఈ ఆదాయమునకు ప్రతిరాష్ట్రము నందును ప్రత్యేక కార్యములకు గాను కొంత సొమ్మును నిలువయుంచి, మిగిలిన పైకమును చేర్చవలయును. తరువాత నధికారాయత్త ప్రజాయత్తశాఖల ఖర్చులకు కావలసిన పైకమునకు మదింపు వేసికొని, ఈ శాఖల ఖర్చులకు గాను నిలువచేయబడిన ద్రవ్యము సదరు మదింపునకు తక్కువ యైనయెడల, ఇతర శాఖల నిధినుండి కావలసిన ధనమును పుచ్చుకొనవచ్చును. కావున ప్రణాళిక జయప్రదమగుటకు ద్రవ్యము అవసరము. కావున శాఖావిభజనములు ముఖ్యతరము లైనవి. సంఘమువారి నివేదికము ప్రకారము ప్రణాళికను తయారుచేయు సందర్భమున ప్రణాళికపట్ల గల అభ్యంతరము లేవియో వివరించుట మంచిది.

రాజ్యాంగసంస్కరణనివేదికము నందు రాష్ట్రప్రభుత్వములయందలి ద్విశాఖలకు సంబంధించు ఆర్థికవిషయముల పట్ల సూచింపబడిన సూచనల నెవరును విమర్శించి యుండ లేదని చెప్పుట నిజము కాదు. రాజ్యాంగసంస్కరణ ప్రణాళికను ఆమోదించువారు సయితము ఆ సూచనలను తీవ్రముగ విమర్శించియున్నారు.

ఈ యోచనవలన మంత్రులకును శాసనసభకును ఎక్కువ కష్టము కలుగునని మాత్రము విమర్శింపబడుటయే కాదు. శ్రీ గ్నానా వాచాగారు మరి కాంగ్రెసునందలి మితవాదులలో ఎనమండ్రుగురు సంతకములు చేసిన బొంబయి ప్రకటనమునందు తప్ప, ఈ సూచనల వలన ప్రజాయత్తశాఖలను పాలించు మంత్రులకు కష్టములు కలు

గుటయే గాక, గవర్నరుగారికి ఎక్కువ అధికారము లిచ్చుటవలన శాసనసభవారు సయితే మేమియు జేయజాల రని విమర్శింపబడి యున్నది. ప్రజాయత్తశాఖామంత్రులు తమశాఖల పరిపాలనమునకు గాను కావలసినంత ద్రవ్యము లేకపోయిన క్రొత్తగా పన్నులను విధించుకొనవచ్చునని సూచనయం దుదాహరింపబడియున్నది. మంత్రుల నిట్టి పరిస్థితులలో బెట్టినయెడల శాసనసభలలో వారికి తగిన సానుభూతి దొరకుట కష్టమని విమర్శకులవాదము? ఈ విమర్శనల కన్న నిక నేమి కావలయును? నాతోడి సభ్యులసూచన లేవియో కను గొందము.

భారత ప్రభుత్వ సూచనలు

9. లెక్కలను పరీక్షచేయుటకు ప్రవేశపెట్టబోవు శాసనము పట్లను, ఆర్థికవిషయ నిర్ధారణమునకుగాను నెలకొల్పబడబోవు విచారణ సంఘవిషయమునను నేమియు అభ్యంతరము లుండజాలవు. రాష్ట్రీయాదాయములలో నిలువయున్న సొమ్మును వ్యయము చేసికొనుటకుగాను భారతప్రభుత్వమువారికి గల అధికారములను తగ్గించి, రాష్ట్రీయప్రభుత్వములే సదరు సొమ్మును వ్యయము చేసికొనుటకు సుఃభతరము లగు నిబంధనలను చేయవచ్చును. ప్రభుత్వమువారి ద్విశాఖల సమ్మేళమునకుగాను నొక సాధారణార్థికశాఖ యుండుట లాభదాయకము ఈ ఆర్థికశాఖ వ్యయ విషయము గల సూచనలను శ్రాగ్రత్తగా పరిశీలింపవచ్చును గాని, శాఖావిభజన సంఘమువారు సూచించిన ప్రకారము ఆర్థికవిషయముపట్ల నొకశాఖకు గల యాశయములను విమర్శింపకూడదు. కేంద్రప్రభుత్వము ఇతర ఖర్చులకుగాను రాష్ట్రములమీద్న పనులను విధించుటకు అధికారము గలిగియుండవలయు నని సూచించిన సూచన కార్యరూపమున బెట్టిన యెడల రాష్ట్రప్రభుత్వమునందలి ద్విభాగములకును, శాసనసభలకును చాల కష్టదాయకమై యుండగలదు. ఒక మంత్రి ఆదాయ వ్యయ విషయములలో తన అభిప్రాయమునకు వ్యతిరేకముగా శాసనసభలలో చేయబడు తీర్మానములవలన నాయన తన పదవికి రాజీనామా నిచ్చి తీరవలయు నని సూచింపబడిన సూచన చాల యుపద్రవకరమైనదిగా నున్నది. దీని నే అనేకులు విమర్శించియున్నారు.

శాసనసభ ప్రభుత్వాయత్తశాఖలలో ఆర్థిక, శాసన, పరిపాలన విషయములందు సలహా నిచ్చు సంఘముగా నుండి ప్రజాయత్త శాఖలందు కూడ సంస్కరణ నివేదిక విధానము సూచించినటుల దాని ఆర్థికాధికారమును తగ్గింపవలయు నని తెలుపబడినది. సంస్కరణవిధానము నింతదూరము నీ విధముగ మార్చవలసిన యవసరము లేదు. శాసనసభ ఆర్థికాధికారము విషయమై చేసిన ఆక్షేపణలు సహేతుకము లని యంగీకరించినను, సంఘర్షణము లేకుండ కార్యనిర్వాహణము అసాధ్యమని యొప్పుకొనినను, అందులో చేయవలసిన తక్కిన మార్పులతో నిమిత్తము లేకుండ రాష్ట్రపాలన సౌకర్యమునకును, శాసనసభల నియంత్రణమునకు నవసరమైన యేక ఆర్థికశాఖకు లక్షణమైన రెండు ముఖ్యవిషయములను ఉంచుట సాధ్యము కాగలదు. ప్రభుత్వశాఖలకు సమానముగ నొక ఆర్థిక శాఖను, శాసనసభ్యులతో గూడిన నొక ఆర్థిక కమిటీని నియమించి, శాఖల వ్యయ నిర్ణయమును ప్రభుత్వ మంతయు యోచించి చిక్కులు లేకుండ పరిష్కరించుట కధికార మిచ్చినయెడల పూర్వోక్తమైన లక్షణములను ఉంచుటకు కష్ట ముండదు. రాష్ట్రములందలి ద్విశాఖావిధానమువలన కలుగు లోపములను చాలవఱకు నివారింపజేసి, ప్రజలకును తమకు లాభదాయకముగ సానుభూతితో కార్యనిర్వాహక వర్గ సభ్యులును మంత్రులును ఒకరినియమముల నొకరు పరిశీలించుట కవకాశము కలుగునట్లు జేయదలచిన సంస్కరణవిధానము నందలి ఆర్థికపత్రనిర్ణయమున కిది యోగ్యముగ నుండును. రాష్ట్రాధికారియగు గవర్నరు తనధర్మమును నిర్వర్తించుటకు వీలు కలుగును. రెండు శాఖలకును మైత్రికలిగించుటకు వీ లుండును. ప్రజాయత్తశాఖకు బాధ్యుడైన మంత్రికి అధికారాయత్తశాఖకు కావలసిన ఖర్చును నిర్ణయించుటలో ప్రమేయము కలదను భావమువలన శాసనసభలందు ఖర్చుకు కావలసినసొమ్మును నిర్ణయించు టవసరమనియు, ఒకరిఖర్చు నొకరు తగ్గించుటకు వీ లుండదనియు నమ్మకము కలుగును. గవర్నరునకును కార్యనిర్వాహకసభకును; మంత్రికిని, శాసనసభకును సంఘర్షణము కలుగుటకు కారణమైన సర్టిఫికెట్టుతో నంగీకార మియ్యవలసిన యవసరము గవర్నరునకు లేకపోయి పాలన ముత్తమముగ జరుగును. ఆ సంవత్సరములో జరుగవలసిన ప్రత్యేకకార్యవిధానము ననుసరించి ఆయవ్యయమును నిర్ణీతము చేసికోవచ్చును. ఆయవ్యయ యేర్పాటులను సులువుగ చేయుటకు వీలు కలుగును. ఇట్టి సందర్భములలో క్రొత్తపన్నును నిర్మించవలసియున్న పుడు నాతోడి సభ్యులు చేసిన సూచన లందుకంటె త్వరలో శాసనసభ దాని నంగీకరించి ప్రభుత్వమునకు ఎక్కువగ తోడ్పడుటకు వీ లుండును. సంస్కరణవిధానమునకు చేయూత నొసగుచున్న వారి కండ్లయెదుట సయితము సంస్కరణములందు ఏదో కొంత ప్రయోజన ముండి తీరవలసి యుండినచో శాసనసభలకు తప్పక నియంత్రణాధికారము ఉండి తీరవలయును. రెండుశాఖలకును సమానముగ నాయవ్యయముల నిర్ణయించు ఏర్పాటు ప్రస్తుతము ఉండవలయును. నిరంకుశాధికార ప్రజాప్రభుత్వవిధానము నందలి లోపములను మాత్రమే సృజించి ప్రజాప్రభుత్వపు లాభములను వదలివేసిరి. నాతోడి సభ్యులు సూచించిన విధానమువలన మంత్రులస్థితి దుర్భరమై శాసనసభల స్థితి ప్రస్తుతముకంటె నేమాత్రము బాగుపడ నేరదు.

సంస్కరణ సవరణలు

10. నా సహోద్యోగులు సూచించినవిధానమును సవరించి తన్మూలమున నొక ఆర్థికపత్రమును శాసనసభపై నధికారము నుండునట్లు చేయవచ్చునా? అను విషయమును యోచించి వారు ఏకార్థికపత్రము విషయమున తెలిపిన ఆక్షేపణలను విమర్శింతము. నికరము నిలవను, సాధారణపునిలవను విభజించి సూచనను అంగీకరింపవచ్చును. రాష్ట్రములనుండి కేంద్రధనాగారమునకు కొంతసొమ్మును పంపించు

నట్లు ఏర్పాట్లనుకూడ చేయవచ్చును. నాటకపునిధికి రాష్ట్రములలో కొంతసొమ్మును ప్రత్యేకించవచ్చును. శాఖావిభజనసంఘము వారు చెప్పినట్టులు ప్రభుత్వవిషయికోద్యోగములకు కొంతధనమును ఏర్ప రచవచ్చును. సంఘమువారే ఈధనము నెట్లు నిర్ణయింపవలెనో మనకు తెలుపకున్నారు. మనము గతవత్సరపు మొత్తమునుగాని, లేక గడచిన మూడువత్సరముల సగటు మొత్తమునుగాని, తీసికొనవచ్చును. అప్పుడు ప్రభుత్వాదాయమును రెండు సమభాగములుగా భాగించి వానిని ప్రభుత్వాయత్త ప్రజాయత్తశాఖలకు ఇచ్చుటకంటె ఆయాశాఖలకు తగినట్లుగ ధనవిభజనమును చేయుట యుచితము. ఈ ధనవిభజనము ప్రజాయత్తము గావింపఁబడిన విషయ స్వభావమునుబట్టి నిర్ణయింపవలెను. ప్రభుత్వాయత్తశాఖకు ఈయబడుభాగము, తచ్ఛాఖోద్యోగుల వ్యయమునకు సరిపోవునట్లుండవలయును. 1918 సంవత్సరము అగస్టు 13-వ తేదిని జరిగిన సంయుక్తరాష్ట్ర శాసనసభలో ననధికార సభ్యులు ఇందులకు ప్రభుత్వాయత్త శాఖాదాయములో 1/10-వ భాగమును నిర్ణయింపవలెనని సూచించిరి. ఇంతకంటె నెక్కుడు మొత్తమును శాసనసభవారు అవసరమగునెడల శాంక్షను చేయుచుండవచ్చును.

సంయుక్తసంఘము

11. ప్రభుత్వాయత్త ప్రజాయత్త శాఖావిషయములనుగూర్చి తెలుపుటకు అధికారానధికార ప్రతినిధులుగా నొక సంయుక్తసంఘమును ఏర్పరుపవలసినదని సంస్కరణనివేదికయం దొక సూచన కలదు. ఈశాఖలు ఈమధ్య శాసనసభానుమతిని లభించిన ఏకీభావము మూలమున మార్పు నొందుచుండవచ్చునని యూహింపబడినది. కాని గవర్నరు తీర్మానమే ఇట్టి విషయములలో భారతీయుల సమ్మతిని పడయుటను కారణముచేత నీ నివేదికకర్తలు ఈసూచనను తిరస్కరించిరి. సాధారణముగా నిష్పక్షపాతబుద్ధిగల ఇట్టి సంఘపుతీర్మానము మిక్కిలి సంతృప్తికరముగ నుండుననుటకు సందేహము లేదు. శాసనసభాతీర్మానములు, మంత్రివశమున నున్న ధనమునకు అతని బాధ్యునిగా చేయవలయుననియు, ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గపు ధనభాగమునకు సంబంధించినంతవఱకు వారిని బాధ్యులుగా చేయవలయుననియు నవసరమగునెడల ప్రభుత్వాయత్త శాఖాపాలనమునకు వలయు నెట్టి నియమమునైనను, ఆచరణలోనికి దెచ్చుటకు గవర్నరున కధికార ముండవలయు ననియు సంస్కరణనివేదికయందు చేయఁబడి శాఖావిభజన సంఘమువారిచే నామోదింపఁబడిన సూచన యుండవలసినదే. ప్రభుత్వాయత్తశాఖపైఁ గల ఇట్టి యధికారమును ఆశాఖకొసంగబడు ధనమునకు తగియున్నయెడల నందుమూలమున నెట్టి హానియును సంభవింపదు.

12. ఇక శాఖావిభజనసంఘమువారు గావించిన సూచనలకు సంబంధించిన వివిధవిధానములను యోచింతము. ఆవిధానము నా సహోద్యోగులు విషయవిభజనమునుబట్టి ధనవిభజనమును చేయవలయునను సూచనకంటె నెక్కుడు సందర్భముగా నున్నది. పరిపాలనయంత్రము సులభముగా నడచుననియు, కార్యనిర్వాహకసభ్యులకు మంత్రులకును అనవసరవిభేదము లుండరాదనియు నాకు తోఁచుచున్నది. సంస్కరణనివేదిక అంగీకరించిన యధికారము శాసనసభకుండనే యుండును. నా సహోద్యోగులు తెలిపిన విధానములో నున్నట్టుల పన్నుల విధించుసూచనలు గ్రాండుకమిటీకి తెలియజేయనక్కరలేదు. శాసనసభాధికారమునుండి పన్నుల విధించు నధికారమును తొలగించుట మిగుల నాక్షేపణీయమని నా యభిప్రాయము. శాఖానిర్ణయవిషయమునఁ గూడ నా సహోద్యోగులు సూచించిన విధానము ఎక్కుడు సందర్భముగా నుండునని తెలియగలదు.

13. రాష్ట్రములలోని ప్రభుత్వాయత్త ప్రజాయత్తశాఖా విభజనపట్టిక క్రింద తెలుపఁబడినది. అవసరవిషయములు వదలివేయబడినవి.

రాష్ట్రీయ విషయములు

1. ఇరిగేషను కాలువలు డ్రెయినేజి కాలువగట్లు జలాశయములు. 2. క్రిందతెలుపఁబడిన భూమిశిస్తుపాలనము (అ) భూమిశిస్తునిర్ణయము వసూలు. (ఆ) ల్యాండురికార్డులు సర్వే; హక్కులు రికార్డులు. (క) లాండెన్యూరులకు సంబంధించిన శాసనములు, భూస్వాములకు రైతులకు గల సంబంధములు శిస్తువసూలు. (ఖ) కోర్టుఫ్ వార్డ్సు (గ) భూమినివృద్ధిజేయుట వ్యవసాయపు బదుళ్లు. (ఘ) వలసపోవుట, ప్రభుత్వపు భూములను పరిష్కరించుట, భూమ్యాదాయములను తరగతివారీగా విడచియుట. 3. నాటకపు సహాయము 4. భూములనుగడించుట. 5. న్యాయపరిపాలనము. 6. అడ్మినిస్ట్రేటివ్ జనరల్, ఆఫిషియల్ ట్రస్టీ. 7. కోర్టుస్టాంపులు. 8. గనులను వృద్ధిచేయుట. 9. క్రింద తెలుపఁబడు పారిశ్రామికవిషయములు. (అ) ఫ్యాక్టరీలు, (ఆ) కూలీల తగాదాలను తీర్చుట, (ఇ) విద్యుచ్ఛక్తి (ఈ) బాయిలర్లు, (ఉ) గ్యాస్, (ఊ) పొగవలన కలిగిన అనారోగ్యాదులు, (క) ప్రావిడెంటు ఫండ్లు మున్నగు విషయములలో కూలీలక్షేమము నరయుట. 10. రయిల్వేకు సంబంధించని పోలీసు 11. ఇతరవిషయములు. (అ) జూదము పందెములు, (ఆ) జంతుహింసా నివారణ (ఇ) ఘాతుకమృగములు అడవిపక్షులు, (ఈ) విషము (ఉ) మోటారుబండ్లపై యధికారము, (ఊ) నాటకప్రదర్శనములు, సినీమాలు మున్నగువానిపై నధికారము 12. వార్తాపత్రికా ముద్రణయంత్రములపై నధికారము. 13. కారోనర్లు. 14. నేరములజాతులవార్లు 15. దేశద్రిమ్మరులగు ఐరోపియన్లు 16. ఖైదీలు, శిక్షాలయములు. 17. బందెలదొడ్లు. 18. నిక్షేపములు. 19. ప్రభుత్వముద్రణయంత్రాలయములు 20. భారతీయరాష్ట్రీయ శాసనసభ ఎన్నికలు నియోజకస్వాతంత్ర్యములు. 21. వైద్యమున్నగు వృత్తులకు వలయు నియమనిర్ణయము. 22. భారతదేశీయసేవా సభ్యులును, రాష్ట్రములలోని ఇతరసేవాసభ్యులును. 23. క్రొత్త రాష్ట్రీయ ఋణమ్ము. 24. రాష్ట్రపు పరపతిమీద నప్పుగైకొనుట. 25. రాష్ట్రీయ విషయములకు సంబంధించిన రాష్ట్రశాసనమును అమలులో పెట్టుటకు

వలయు జరిమానా నిర్బంధావాసము మున్నగు శిక్షలు 26. భారతీయ ప్రభుత్వవిషయములకు చెందినను రాజప్రతినిధి అనుమతిని రాష్ట్రీయ ప్రభుత్వమువశము గావింపఁబడినవిషయము 27. రాష్ట్రీయ న్యాయస్థాననివేదికము.

ప్రజాయత్త విషయములు

1. స్థానికస్వపరిపాలనములు, అనఁగా మునిసిపలు సంఘముల సభ్యులు అధికారములు మున్నగు విషయములును ట్రస్టులు జిల్లాబోర్డులు, ఆరోగ్యసంఘములు, ఇంకను స్థానికస్వపరిపాలనముతో సంబంధముగల ఇతరవిషయములు. 2. వైద్యశాఖాపాలనము: వీనియందు వైద్యశాలలు వైద్యవిద్యమున్నగునవి చేర్పఁబడినవి. 3 ప్రజారోగ్యము, పారిశుద్ధ్యము, జననమరణములసంఖ్య. 4. విద్య. 5. ఈక్రింద తెలుపఁబడు పబ్లికువర్కులు (అ) రాష్ట్రములోని భవనములు. (ఆ.) రోడ్లు వంతెనలు పడవలు, ఇంకను సైనికులకు ఆవశ్యకములని రాజప్రతినిధిచేప్రకటింపఁబడని యితరవిషయములు. (ఇ) మునిసిపలు ఆవరణలోనున్న ట్రామ్వేలు (ఈ) చిన్న రైలుమార్గములు మునిసిపలు ఆవరణములో లేని ఇతర ట్రాముమార్గములు. 6. వ్యవసాయము. దీనియందు పరిశోధనప్రతిష్ఠాపనములు. వ్యవసాయ విద్యకు వలయు నేర్పాటులు వృక్షముల తెగుళ్లను నివారింపజేయు మార్గములు. 7. పశువైద్యశాఖ:— దీనియందు పశువైద్యోద్యోగమునకు వలయు శిక్షణమున కేర్పాటులు. పశురోగములను నివారించుట కేర్పాటులు. 8 పరపతి సంఘములు. 9. ఎక్సైజు. 10. రిజిస్ట్రేషను. 11. జననములు మరణములు, వివాహములు మున్నగువాని రిజిస్ట్రేషను. 12. మతధర్మాగారములు. 13 పారిశ్రామికాభివృద్ధి. దీనియందు పారిశ్రామిక పరిశోధనమును సాంకేతికవిద్యయు నిమిడియున్నవి. 14. ఆహారపదార్థాదులలోని కల్తి 15 తూనికలు, పడికట్లు 16 (ఇండియన్ మ్యూజియము కలకత్తాలోని విక్టోరియా మెమోరియలు తప్ప) ఇతర చిత్రవస్తు ప్రదర్శనశాలలు, జంతుప్రదర్శనశాలలు. 17. చేపలు. 18. బొంబయిలోని అడవులు. 19 రేవుపట్టణములు. 20. దేశములోని నీటిమార్గములు.

ఒక ప్రధానాక్షేపణ

14. శాఖావిభజనమును బట్టి ధనవిభజనమును చేయవలయునని భారతప్రభుత్వమువారు చేయు సూచన కొక ప్రధానాక్షేపణగలదు. శాఖావిభజనము కొన్ని కారణములవలన చేయబడుచున్నది. కారణములకును ఈశాఖలనుండి వచ్చు నాదాయమునకును ఎట్టిసంబంధమును లేదు. శాఖావిభజనసంఘమువారు కొన్నినియమముల ననుసరించి నీశాఖావిభజనమును గావింపవలసినదని సంస్కరణనివేదిక తెలిపియుండెను. వీనికిని ప్రజాయత్తప్రభుత్వాయత్తశాఖలకును సమానముగ విభజింపవలసినధనమునకును ఎట్టిసంబంధమును లేదు. ఈశాఖాసంఘమువారి నివేదికను పరికించినను ఇట్టిసంబంధముండవలయునని వారికి అభిప్రాయమున్నట్లు తోఁచదు. కావున ధనవిభజనమును శాఖావిభజనమును బట్టియే చేయవలయు నని నాసహోద్యోగులు తెలిపిన సూచన సందర్భముగా లేదు. ఈశాఖావిభజన సంఘమువారు ఆయాశాఖలకు సంబంధించిన విషయములనుండి ఆదాయమును కైకొనుటకు వలయుపన్నులను విధించుటకుఁ దప్పక అధికారముండుట యవసరములేదను నుద్దేశముతోడనే పన్నుల విధించు విషయమును ప్రజాయత్తముఁ గావించిరి. ఆసంఘమువారు శాఖావిభజనమును గూర్చి గావించిన సూచనలను మనము అంగీకరించినయెడల ప్రజాయత్తవిషయములు వానినుండి లభించుధనముతోడనే పాలితములు కాజాలవు. అనికూడ వారు గుర్తించినట్లు మనము అంగీకరింపవలసియున్నది. కావున నివేదికయందలి 75వ పేరాలో తెలుపబడిన విషయములతోఁ గూడ పన్నులను విధించు నధికారము ఆశాఖామంత్రుల యధీనములో నుండవలయును గాని ప్రభుత్వాయత్త విషయముగా నుండరాదని గ్రహింపవలసియున్నది.

15. ఈ పట్టికను బట్టి చూచినయెడల ధనాగమన విషయములలో ప్రధానములు ప్రభుత్వాయత్తవిషయముల క్రిందకు వచ్చినవి. కార్యనిర్వాహక సంఘమువారు ఇందువలన మామూలుగ లభించు ఆదాయము మాత్రమేగాక, శాసనసభకు తెలియజేయకయే తమ భూమ్యాదాయమును వృద్ధిజేసికొనుటకును అధికారముకలిగియుందురు. దేశాభివృద్ధికి అత్యావసరములై ప్రజాయత్తవిషయములలో అధికారముగల కార్యనిర్వాహక సంఘమువారు, తమ శాఖావ్యయమునకు వలయు ద్రవ్యములో కొంతసాయము చేయవలసినదని ప్రజాయత్త విషయములలో అధికారముగల మంత్రిని కోరుటకు అవసరము లేదని నిశ్చయముగ చెప్పవచ్చును. క్రమక్రమముగ నభివృద్ధినొందు తన శాఖలకు వలయు ధనము మంత్రియొద్ద మంత్రి కెపుడు లభింపదు. ఈ శాఖలనుండి వచ్చు ఆదాయమును వృద్ధిచేయుటకు కూడ నవకాశము లేదు. భారతీయుల హస్తగతమైన ఎక్సైజుశాఖ ఎన్నడును ధనాదాయమును వృద్ధినొందింపగూడదు; కాని ఇతఁడు ప్రభుత్వాయత్తశాఖనుండి ఏమైన ధనసహాయమును పొందగలఁడా? కార్యనిర్వాహక సంఘమువారికి లభించు ధనాదాయము వారి వ్యయపరిణామమును నిర్ణయించుట నిశ్చయము. ప్రభుత్వోద్యోగములు వారి వశమునం దున్నవి. ఈ యుద్యోగుల కోరికలకు ఎచ్చటను అంతులేనట్లును, ఇంకను ఆంగ్లేయోద్యోగులకు నూతనపదవులను నిర్మింపవలయు ననెడి వీరి కోరికలయెడల చూపఁబడు సానుభూతి విస్తారముగా నున్నట్లును వీరి జీతములకు ఉపకారవేతనములను వృద్ధిచేయవలయు ననెడి కోరికలయెడల చూపఁబడు సానుక్రోశ మెక్కుడుగా నున్నట్లును మనము అనుభవపూర్వకముగ గుర్తించుచునేయున్నాము. ప్రజాయత్తశాఖాధికారము గల మంత్రికి ఇతరాధికారము లేనియెడల నతఁడు కార్యనిర్వాహక సంఘమువారికి లోఁబడియుండుట తటస్థించును. ఈ దృక్పథముతోడనే మన మీ విషయమును విమర్శింపవలయును.

కొన్ని ప్రత్యుత్తరములు

16. రాష్ట్రములో నిలువయుండు సొత్తుల నుండియు పన్నుల నుండియు అప్పుపుచ్చుకొను నధికారమువలన నెక్కుడుగా

ధనము వ్యయపరుపబడు నని మొదటియాక్షేపణ చేయబడినది. నా విధానము ప్రకారము, ఈ రెండు శాఖలలోను, ప్రత్యేకింపఁబడు ధనమును ఏర్పరచుటవలన ఈ చిక్కు తొలగిపోవును. అధికారమును మీఱి పన్నులను విధించుట గాని అప్పును తీసికొనుట గాని జరుగ కూడదు. భారతప్రభుత్వసూచనను బట్టి అపారధనముగల ప్రభుత్వాయత్తశాఖలనుండి ధనమును గైకొనుటకు బాధ్యతగల ఎట్టి గవర్నరును అంగీకరింపఁజాలడు. కావున గవర్నరు గాని ఇతరులగు నధికారులు గాని ఒకశాఖనుండి రెండవశాఖకు ధనసహాయమును చేయరాదని విధించుటచేత, సంఘర్షణ మేర్పడి పాలనము స్తంభించును. కొన్ని విషయములలో నిర్ణయాధికారము గవర్నరున కొసంగఁబడుటచేత సంస్కరణనివేదికావిధానమున గాని శాఖావిభజనసంఘనివేదికావిధానమునఁ గాని నావిధానమున గాని ఆదాయవిషయమున నీరెంటికిని వ్యత్యాసమును రూపుమాపు నియమములు గానరావు. ఇట్టి యధికారము గవర్నరున కొసంగఁబడినయెడల మనము సంస్కరణనివేదికావిధానము తెలుపునటులే వర్తించుచుంటి మనవచ్చును. రాష్ట్రమున నిలువయుండు ధనవిషయములో ఈ విభజనము చేయుటకు ఎవ్వరికి అధికారము గలదు? అను విషయమును నాసహోద్యోగులును నిర్ణయింపలేదు. బహుశః అట్టి అధికారి గవర్నరై యుండవచ్చును. దీనిని బట్టి మనము ముందటికంటె మంచిస్థితిలో నున్నామని చెప్పుటకు వీలులేదు. నీ రెండుశాఖలును సామ్రాజ్యప్రభుత్వనియమములను బట్టి వర్తింప నవసరము లేకపోవుటచేత తమ తమ వశమునందున్న ధనమును వారు వ్యయపరచెదరు. లేక అందులకై ప్రత్యేకించెదరు. కావున రాష్ట్రములయందు భావికాలవ్యయమునకు ధనము నిలువయుండు నని చెప్పుటకు వీలులేదు. వారి నిలువను అప్పుచెల్లించుటకు గూడ వినియోగించవచ్చును.

17. ప్రభుత్వమందలి యొక శాఖవారు, రెండవశాఖవారికి, ధనసహాయమును చేయఁ దిరస్కరించుటకు అధికార ముండరాదని రెండవయాక్షేపణ చేయఁబడెను. వివాదవిషయములలో నిర్ణయాధికారము గవర్నరునకే కలదనియు, నీ యాక్షేపణ సంస్కరణనివేదికావిధానమున జనింపదనియు నా సహోద్యోగులు మఱచిరని నాభిన్నాభిప్రాయ ప్రకటనమునందు తెలిపియుంటిని. ప్రస్తుతము గవర్నరునకు గల యధికారముల మాట నటుండనిచ్చి నా సహోద్యోగులు సూచించిన నూతనవిధానమువలన ఈ శాఖావిభజన మున్నంతకాలము మంత్రియు నతని శాఖయు దీనత్వముతో ప్రార్థించినఁ దప్ప ఇతర విషయములలో జోక్యము కలుగఁజేసికొనుట కధికారము లేనట్లు స్పష్టమగుచున్నది. ధనాదాయమునందు సగముకంటె నెక్కుడు భాగము కలిగియుండిన కార్యనిర్వాహకసంఘమువారి పనులలో ఇతరు లెవ్వరును సంబంధమును కలుగఁజేసికొనఁజాలరు. కావున వీరి విధానము ఇతర రెండు విధానములవలె ప్రధానకష్టమును తొలగింపఁజాలదు. పన్నులను విధించు నధికారము కార్యనిర్వాహకసంఘము వారికేగాని ఇతరుల కుండరాదని నా సహోద్యోగుల యభిప్రాయము. కాని, క్రమక్రమముగా వృద్ధియగుచున్న భూమ్యాదాయమును ఏవిధముగనైన తమ లాభమున కుపయోగించు నధికారము వీరి కుండరాదని నామతము. ప్రజాయత్తశాఖలలో ప్రధానములగు విషయములకు వలయు ధనమునకు భూమియే మూలాదాయము కావలసియున్నది.

18. ప్రతిసంవత్సరమును ధనవిభజనమును గావించుటకై మంత్రులు కార్యనిర్వాహకసంఘమును కోరవలసియుండుటచేత నీ సమయమునందు తప్పక సంఘర్షణము ఏర్పడు నని మూఁడవయాక్షేపణ చేయఁబడినది. ఇది మంత్రికే నష్టదాయకము. ఈ విధానమును బట్టి మంత్రి కార్యనిర్వాహకసంఘమువారికి లోఁబడి యుండవలయును. సంస్కరణనివేదికను బట్టియు, శాఖావిభజనసంఘనివేదికను బట్టియు నిట్టి విషయములను గవర్నరే నిర్ణయింపవలయు నని తెలియుచున్నది. ఇది సందర్భమే. ఇంక మూఁడవ విధానమునుబట్టి ఈ విషయమునందు గవర్నరునకు కూడ నీ యధికార మీయఁబడక ఎవ్వరికి వారే స్వతంత్రులుగా చేయఁబడిరి.

19. ప్రతిశాఖయొక్క అభివృద్ధికిని దాని యాదాయము నెక్కువచేయుటకును ప్రోత్సాహ ముండవలయు ననునది నాల్గవ యాక్షేపణ. దీనిభావ మేమి? రాష్ట్రములో ఆదాయమునకు మూలమనఁదగు భూమిని గురించి యోచింతము. కార్యనిర్వాహకసంఘమువారు ఈ విధానమును బట్టి సాధారణముగా భూమివలన లభించు నాదాయమువలన మాత్రమేగాక శాసనసభాసమ్మతి లేకయే దీనిని క్రమక్రమముగా నభివృద్ధిచేయుటకు అవకాశము గలిగియుండును. సాధారణములగు స్థితిగతులలో కూడ మంత్రితో సరిపోల్చి చూచినయెడల వీరి ధనాదాయము అత్యధికముగనే యుండును. కాని ఇంగ్లీషు ఉద్యోగులు, తమజీతములను వృద్ధిచేయవలయు నని కోరుదురనుటకు సందియములేదు. వీరి కోరికను కార్యనిర్వాహక సంఘము వారు చెల్లించెదరనుటకును సందియము లేదు. కావున నిప్పటికే దారిద్ర్యస్థితియందున్న రైతుస్థితి ఇంకను దుర్భరము గావింపఁబడును. భారతీయపురోభివృద్ధికి అత్యవసరములగు ప్రజాయత్తశాఖలు వెనుకంజవేయును. ఇట్టి ఫలితములే ఇతర ధనాదాయ విషయమున గూడ తటస్థించును. ఈసూచనలమూలమున మంత్రియును కార్యనిర్వాహకసంఘమువారును తమ శక్తికొలది ధనము లభించుమార్గముల నుపయోగింపవచ్చును. ఇంతకంటె దేశమునకు అనర్థదాయకమగు విషయము వేఱొక్కటిలేదు. ఇట్టి స్థితిగతులలో నాసహోద్యోగులు తెలిపిన విధానము దేశక్షేమమునకు భంగకరము. ధనాదాయమువలన కలుగు లాభములను దేశమంతయు ననుభవించ కుండుట అన్యాయ్యము. సంస్కరణనివేదికావిధానమున గాని మూఁడు విధానమునఁ గాని ఇట్టిలోపము గానరాకున్నది. నాసహోద్యోగులు, ఎంతవఱకు వ్యయమునకవకాశముగలదో ప్రతిశాఖయు చెప్పవలసినదని తెలిపియుండిరి. ఈ యుద్దేశమునకు వారివిధానము భిన్నముగా గాన్పించుచున్నది. మంత్రి చేయు వ్యయము ఆతనికిగాని అతనిశాఖకుగాని లభించు నాదాయమును బట్టి నిర్ణయించుటకు వీలులేదు. ఇతర శాఖలనుండియు, క్రొత్తపన్నుల నుండియు నెంతవఱకు తాను న్యాయ్యముగా ధనమును

పొందగోరునో దానినిబట్టియే విషయమును నిర్ణయింపవలసియుండును. ఈ కారణములన్నియు మూడవ విధానమువలన కార్యరూపముఁ దాల్పఁగలవు.

భూమ్యాదాయము

20. ఇదివఱకు అవలంబింపబడిన రెవిన్యూ, పారిశ్రామిక విధానములవలన భారతదేశమున దారిద్ర్యము సంభవించినదని తెలియుచున్నది. భూమిమీఁద విధించు పన్నులు మున్నగువానిని రాష్ట్రీయ విషయములుగ నీ సంఘమువారు పరిగణించుట సంతృప్తికరము. దీనినిఁ బట్టియే పన్నులను విధించునధికారము ప్రజాయత్తము కావింపఁబడినది. ముందుగ తమ సమ్మతి లేకయే, ఇట్టి విషయములలో పన్నులను విధించు నధికారమును రాష్ట్రీయప్రభుత్వములు చెల్లించుటకు భారతప్రభుత్వమువారు గూడ నంగీకరించిరి. అయినను భూమిశిస్తు నిర్ణయము ప్రభుత్వమువారికే వదలివేయఁబడుటచేతను దీనిని కార్యనిర్వాహకసంఘపు అధికారమునకు లోబడిన ప్రభుత్వాయత్త విషయముగాఁ బరిగణింపఁబడవలయు నని ఈ సంఘమువారు 79-వ పేరాలో సూచించుచున్నారు. ఈ రెండు విషయములును పరస్పర విరుద్ధములుగా నున్నట్లు తోచుచున్నవి. కార్యనిర్వాహకసంఘము వారు గాని, శాసనసభవారు గాని, వారిలో నొకరు విధించిన భూమి పన్నున గ్రహింపకయే రెండవవారు నుఱల విధించుటకు వీలులేదు. ఈ రెండు ప్రభుత్వశాఖలును ఈ విషయమున ఒక దానిపై నొకటి యాధారపడవలసియున్నది. సంఘమువారి యభిప్రాయము ప్రకారము ఈ విషయమునందు ఇరువురకు నధికార మున్నదనియు నభిప్రాయ భేదములు వచ్చినప్పుడు గవర్నరునకు నిర్ణయాధికారము ఉండవలెననియుఁ దోఁచుచున్నది. కాని కేవలము కార్యనిర్వాహకసంఘము వారి చర్యవలన ధనాదాయమును వృద్ధిచేయరాదని నా యభిప్రాయము. భూమిశిస్తును విధించుటకు శాసనసభకు మాత్రమే యధికారముండవలయును. పర్మినెంటు సెటిల్మెంటు చేయఁబడిన జమీందారీలలో తప్ప తక్కిన విషయములలో భూమి రాజుయొక్క ఆస్తియనియును కార్యనిర్వాహకప్రభుత్వమువారి యిష్టము చొప్పున విధింపఁబడిన పన్నును భూస్వామి తప్పక యొసంగవలయు ననియు మున్నగు భావములు ప్రస్తుతపు ప్రభుత్వమువారికి గలవు. ప్రపంచమునందలి యన్ని దేశములలో భారతదేశమునందు మాత్రమే శాసనముబట్టిగాని ఆచారమునఁబట్టిగాని పోటీనిబట్టిగాని భూమిశిస్తు నిర్ణయింపఁబడుటలేదు. ఇదియే దేశమునందు వృద్ధియగుచున్న దారిద్ర్యమునకు ప్రధాన కారణము. ఇందుమూలముననే కూలిచేయువారును ధనికులును భూమి సేద్యమునుండి వీగిపోవుట తటస్థించుచున్నది. కావున భూమిశిస్తును శాసనమువలనగాని వాయిదాలనుబట్టిగాని విధింపఁబడునట్టి ప్రజాయత్తవిషయముగా నుండవలయును. లేనియెడల, పది సంవత్సరములకు పూర్వము అధికారవిభజనసంఘమువారు సూచించినట్టుల రాష్ట్రములలో భూమిశిస్తు నిర్ణయమును శాసనరూపమున గావించి మఱల దానిని మార్పు నొందించునెడల ప్రతిజిల్లా విషయమును గూర్చియు నొకబిల్లును రాష్ట్రీయశాసనసభలో ప్రవేశపెట్టుట అవసర మని నేను నొక్కిచక్కాణించుచున్నాను.

పరిశ్రమలు

21. సంఘమువారు సూచించిన రీతిని పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయములను ప్రజాయత్తములు కావించుట ముఖ్యము. నా సహోద్యోగులు దీని నంగీకరించనందున ప్రస్తుత స్థితిగతులను గురించి యించుక తెలుపవలసియున్నది. భారతదేశము పూర్వము వస్తువులను ఎగుమతి చేయు ప్రదేశములలో మిగుల పేర్వడసి యున్నదనియు నిచ్చటనుండిన ధనమువలన తూర్పిండియా సంఘమువారిచ్చటకు వచ్చిరనియును మనకు తెలిసియేయున్నది. సిపాయి తిరుగుబాటునకు పూర్వము ఈ దేశమునందు నిరుత్సాహముచేతను ఆంగ్లదేశమున నపరిమితము లగు సుంకములను విధించుటచేతను భారతదేశపు పరిశ్రమలు బుద్ధిపూర్వకముగ వినాశనము నొందింపఁబడినవి. అందుమూలమున వ్యవసాయమునకును పరిశ్రమలకును నిలయమైన భారతదేశము కేవలము వ్యవసాయపుదేశముగ మాఱిపోయినది. ఆంగ్లవాణిజ్య క్షేమమునకై భారత వాణిజ్యక్షేమము నేటివఱకును లోఁబరుపఁబడియుండినది. ఈ దేశపు ప్రకృతిసాధన సంపత్తిని విదేశలాభమున కుపకరించునట్లు చేయుటయు నింగ్లీషువారి ధనము వీనియం దుపయోగింపఁబడుటయు నాంగ్ల దేశపు వస్తువులు ఈ దేశమునందు ప్రవేశపెట్టఁబడుటయును తటస్థించుచున్నది. కావున నిదివఱకే జనసామాన్యమున జీవనోపాధిని కలిగింపలేకున్న వ్యవసాయవృత్తిని భారత పరిశ్రమలు కొంతవఱకు భారమును తగ్గించుటకు బదులు వేలకొలది పనిలేనివారు ఇదివఱకు భూమిపై పనిచేయుచున్న కూలీలతో పోటీకివచ్చుట తటస్థించుచున్నది. ప్రభుత్వమువారికిఁ గల యీ భావమే, దేశమునందలి యసంతృప్తికి చాలవఱకు గారణము. ఈ దేశమున వాణిజ్యమునకు అందునను ముఖ్యము నాంగ్ల వాణిజ్యమునకు గల సహజ సంపత్తిని అవకాశములను తెలిసికొనుటకు కమీషనరు నేర్పరచిన విషయము మనకు తెలిసియేయున్నది.

వీరు చేయు సలహాలను బట్టి ఈ దేశపు సహజవస్తు సంపత్తిని ఏవిధముగా ఆంగ్లదేశవాణిజ్యమునకు లాభదాయకముగ నుపకరించునో, అనువిషయముఁ గూర్చి ఏర్పాటులు చేయఁబడును. ఈ సమాచారము భారతీయులకుఁ గూడ ఎఱుక చేయబడును గాని దానివలని లాభములను పొందువారు ఆంగ్లేయవాణిజ్య ప్రతిష్ఠాపనలవారు మాత్రమే యనవచ్చును. ఈ దేశము తన క్షేమమునకు భంగము కలుగకుండునట్లుగ నపక్వపదార్థములను ఎగుమతి చేయుట కభ్యంతర ముండదు. కాని పక్వపదార్థములను తయారుచేయుటకును తన దేశీయులనే అందు కూలీలుగా నేమించుటకును, వలయు నవకాశములు ఈ దేశమున లేకుండునట్లు చేయరాదు. భారతదేశపు పరిశ్రమలు ప్రజాయత్తములైననే గాని ఈ యుద్దేశము నెఱవేరజాలదు. లేనియెడల నాహార పదార్థము లనేకములు ఈ దేశజులు అన్నములేక మాడుచుండగా

విదేశములకు పంపబడు చుండుటయును, ఈదేశపు పరిశ్రమలు అభివృద్ధి నొందక పోవుటయును తటస్థించును.

ఇట్టి వాదముతే ఆంగ్లదేశపు ధనమును ఈ దేశపు పరిశ్రమలకు వినియోగించు విషయమునగూడ ననువర్తించును. ఆంగ్లదేశపు ధనము మనకు ఉండుట యవసర మని మనకు తెలియును. కాని దానిని వలసరాజ్యములకును ఇతర దేశములకును అప్పునిచ్చు పద్ధతుల మీదనే మనకును అప్పునీయవలయును. ఇందులకు వలయు నియమములు ఆంగ్లేయ శ్రీమంతులును, భారతీయ క్షేమసంరక్షకులగు భారతీయవర్తకులును గల యొక సంఘముచే నిర్ణయింపబడవలయును. భారతదేశమునం దున్న ఆంగ్లేయోద్యోగులును, ఆంగ్లదేశమునం దున్న ఇండియా ఆఫీసువారును ఇదివఱకు భారతదేశమును సంరక్షింపలేదు. వారు ఆంగ్లదేశపు ధనవంతులయొక్క కోరికలకు లొంగియుండిరి. ఇకముందు గూడ నట్లే యుందురు. ఆంగ్లేయు లీ దేశమునం బరిశ్రమలను నెలకొల్పవలయు ననియే మన యభిలాష. కాని అట్టి పరిశ్రమలు స్వదేశపరిశ్రమలకు భంగకరములుగ నుండరాదు. భారతీయ పరిశ్రమలు భారతీయుని సంరక్షణలోనున్న గాని, ఆంగ్లేయులు విస్తారము ధనవ్యయముచేసి ఈ దేశమునందు గొప్పపరిశ్రమలను స్థాపించెద రనియును వీనియందు భారతీయులకు ఎట్టి స్థానమును లభింపదనియు నందు మూలమున భారతీయ పరిశ్రమలకు భంగము కలుగు ననియును వేఱె చెప్ప నవసరము లేదు.

లాంకషైరు మున్నగు ప్రదేశములలో నున్న ధనవంతుల లాభమునకు భారతదేశపరిశ్రమలకు అన్యాయ్యముగ నాటంకములు కల్పింపబడు చున్నవి. అన్యాయ్యమగు పోటీపద్ధతిని సంపూర్ణముగా వర్జింపవలయును. ఈ కారణములవలన భారతదేశపరిశ్రమలు భారతీయుల హస్తగతములైనం దప్ప, ఇదివఱకు అవలంబింపబడిన విధానమే ఇప్పుడును కొనసాగింపబడు ననియు నిందుమూలమున నికముందు భారతీయులకును ఆంగ్లేయులకును ఎక్కుడు మనస్పర్థ లుదయించు ననియు నా దృఢవిశ్వాసము. ఈ విషయమున నెట్టి జోక్యమైనను కలుగంజేసికొనుటకు భారతప్రభుత్వమున కధికారమున్నయెడల నట్టి యధికారము శాసనసభకు బాధ్యుడగు భారతీయమంత్రి వశము చేయబడుట అత్యవసరము. ఎట్టి పరిశ్రమలనైనను భారతప్రభుత్వమువారు స్థాపించుటకు నెట్టి యభ్యంతరము నుండదు. స్థానికప్రభుత్వములకు సలహానిచ్చు విషయమున వీరు గావించు సూచనలు సంస్కరణనివేదిక యందలి 117-119 పేరాలలో తెలుపబడిన లోపము లన్నియు మాయ సంభవించును. ప్రజలకు బాధ్యతను తగ్గించి ప్రాంతపద్ధతినే మంత్రుల నవలంబించుట యావసర మని నా సహోద్యోగులు కావించిన సూచనలు సంస్కరణనివేదిక యందుగల ఈ విషయమై తెలిపిన సూచనలకు ప్రత్యక్షవిరుద్ధములుగా నున్నవి. భూతకాలమునందు రాష్ట్రీయప్రభుత్వములు ఈ విషయమునందు చేసిన ప్రయత్నము లత్యల్పముగ నుండినవి. వానికి ఎల్లప్పుడును భారతప్రభుత్వము యొక్కయు భారతరాజ్యాంగమంత్రి యొక్కయు సమ్మతిని పొందవలసి వచ్చుచుండుటచేత నవియైనను ఎక్కుడు లాభదాయకములు కాంజాలక పోయినవి. ఈ విషయమున రాష్ట్రీయప్రభుత్వములకు ఎక్కుడు స్వాతంత్ర్య ముండినయెడల నింకను నెక్కుడభివృద్ధి చేకూఱి యుండెడిది.

భారతదేశపు పారిశ్రామికాభివృద్ధి ఈ శాఖ మంత్రులవశము కావింపబడునప్పుడే సాధ్యమగు ననుటకు గల కొన్ని యాక్షేపణలను విమర్శింతము. ప్రజాక్షేమమునకు సంరక్షింపబడవలసిన వస్తువులను కేంద్రపరిశోధన ప్రతిష్ఠాపనమును మఱు ప్రదర్శనశాఖ మున్నగు విషయములును అఖిలభారత దేశీయవిషయములుగం బరిగణింపం బడవలయు నని శాఖావిభజన సంఘమువారు తెలిపియున్నారు. ప్రత్యేకవ్యక్తులు స్థాపింపంజాలని కొన్ని పరిశ్రమలను భారతప్రభుత్వమువారు స్థాపించి పోషించు బాధ్యతను వహింపవలయు నని భారతీయులు కోరుచున్నారు. కాబట్టి ఈ పరిశ్రమలను సైనిక క్షేమమునకు గాని, రాజకీయ క్షేమమునకుం గాని, కేంద్రప్రభుత్వమువారు పోషింపవలయు ననియును, అవి ప్రజాయత్తములు కాకూడదనియును చెప్పెడి వాదము సమంజసముగా లేదు. అట్టి పరిశ్రమలు దీనివలన లాభమును పొందు భారతీయుల రక్షణమున నుపకరించుట నిశ్చయము. ఇట్లు గాక ఈ పరిశ్రమలు విదేశవర్తకుల చేతులలో నుంచబడి, వారికి అప్పుతీసికొనుటకు గాని సమార్థములను కొనుటకు గాని సౌకర్యముల నేర్పఱచినయెడల నవి భారతీయపరిశ్రమలకు, భంగకరములుగ నుండును గాని వారి కెంతమాత్రమును సహాయకారులుగ నుండజాలవు. అట్టి పద్ధతి ప్రస్తుతము ప్రపంచమునందంతటను వ్యాపించుచున్న "పరిశ్రమలు స్వదేశీయములు గా నుండవలెను." అను సూత్రమునకు విరుద్ధముగా నున్నది. ఇటువంటి కాలమున మనుష్యులకు ధనస్వాములకును కూలీలకును నడుమ నేర్పడు సంఘర్షణలు తటస్థించును. మంత్రులకు తగిన పారిశ్రామిక జ్ఞానము నుండదని తెలుపు వాదము మంత్రులను నియమించు నధికారమును గవర్నరులకే యుండవలయు నని నా సహోద్యోగులు తెలుపు సూచనను ఖండించుచున్నది. ఇదివఱకు భారతీయులు కోరు విధానమే, ముఖ్యముగా ఆంగ్లేయులచేతను పరిశ్రామికసంఘమును వారిచేతను అంగీకరింపబడినది. ఈ పనిని నిర్వహించుటకు సమర్థులగు భారతీయులు లభింతురనుట కెట్టి సందియమును లేదు. కాబట్టి సమస్త కాలమున మంత్రిపై నెక్కుడు నిర్బంధ ముండరాదనియు నందుకొరకు నాతఁడు ఆంగ్లేయుల ప్రయత్నములకు లాభకరములగు పనులను సమర్థింపక భారతీయులకే లాభమును చేయుచుండు ననియు వాదించుచున్నారు. కాని భారతదేశ విషయమునందు ఈ వాదము అన్వయింపజాలదు. భారతీయులు నాకెన్నడుగాని భారతీయుల పరిశ్రామికసంరక్షణమునకు నెంతవఱకు భంగకరములో అంతవఱకే ఆంగ్లదేశపు పరిశ్రమలను ధనమునకు, ఇప్పటి వినియోగింపరాదని భారతీయులు కోరుచున్నారు. ఇట్టి భయమును తొలగించుటకు నా సహోద్యోగులు ఇతరుల విషయములలో తెలిపినట్లుగా కొన్ని సంరక్షక పద్ధతులను అవలంబించుట కష్టము కాదు. కాని ప్రభుత్వమువారు భారతీయ పరిశ్రమలకు భంగకరముగ విదేశ